C

# ఆంధ్రనాటక రంగ చరిత్ర



మిక్కినేని రాధాకృష్ణమూర్తి

2466

PRJSA101B155

26-1-79



# ఆంధ్రకవుల ఒక దశాబ్దం

మిక్కినేని రాధాకృష్ణమూర్తి

11

# రేణుకా గ్రంథమాల

ప్రథమ ముద్రణ, 1969 సెప్టెంబరు 20



1954-55 ల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు భాషాసమితి ద్వారా
నిర్వహించిన నాటక కళా సమీక్షకు సంబంధించిన గ్రంథాల పోటీలో
ప్రథమ బహుమతి పొందిన గ్రంథము.

792-095484
రా.గ్రం.క్ష-ఆంధ్ర

పద్మశ్రీ అక్కినేని నాగేశ్వరరావు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ
సమాదరమున ప్రకాశితము

వెల
సాదా ప్రతి 20 రూ॥ లు
మేలు ప్రతి 25 రూ॥ లు

Communist Party of India (Marxist) A P Committee
LIBRARY
2466

ప్రతులకు
మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
రేణుక
22, నాగార్జున నగర్
మద్రాసు-24.

ముద్రణ
శ్రీ వెంకటేశ్వరా ప్రింటర్స్
కత్తివాక్కం హైరోడ్
మద్రాసు-21.



రచయిత

మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి

# రచయిత



జననం 1916 జూలై 7 వ తేదీ కృష్ణాష్టమినాడు. తలితండ్రులు సౌభాగ్యమ్మ. వెంకయ్యగారు. పుట్టింది గుంటూరుజిల్లా లింగాయపాలెం. పెరిగింది కృష్ణాజిల్లా కోలవెన్ను.

ప్రాథమిక విద్యాభ్యాసం కోలవెన్నులోనూ, హైస్కూలు విద్య పునాది పాడులోనూ సాగింది. 1937 లో వెటర్నరీ డిప్లొమా పొందారు.

స్కూలు నాటకాలనుండి నాటక రంగంతో పరిచయం. అనేక నాటక సమాజాల్లో పౌరాణిక సాంఘిక నాటకాల్లో స్త్రీ పురుష పాత్రలు ధరించారు.

కాంగ్రెసు ఉద్యమంలోనూ, వివిధ జాతీయ ఉద్యమాలలోనూ పనిచేసి, లాఠీ దెబ్బలకు జరిమానాలకు గురై, 5 సార్లు జైలుశిక్ష అనుభవించారు. యువ జనోద్యమంలోనూ, వైజ్ఞానికోద్యమంలోనూ, గ్రంథాలయోద్యమంలోనూ, వయోజన విద్యా ప్రచారోద్యమంలోనూ, అభ్యుదయ రచయితల సంఘంలోనూ చురుకుగా పనిచేశారు. ప్రజానాట్యమండలి నిర్మాతల్లో ఒకరుగా ఉండి అనేక వైజ్ఞానిక శిక్షణ శిబిరాలను నడిపి ప్రాచీన కళారూపాలైన బుర్రకథ, వీధినాటకం, జముకుల కథ, పిచ్చుకుంటులకథ, సుద్దులు, కోలాటం, డప్పులు, హరికథ, బృందనృత్యం మొదలైన అనేక పూర్వకళారూపాల ప్రదర్శనల్లో పాల్గొని అనేక ప్రజా నాట్య మండలి దళాలను తయారుచేసి అభ్యుదయ కళాప్రదర్శనాలతో ఆంధ్రదేశపు నాలుగు చెరగులా ప్రదర్శనాలిచ్చారు.

ప్రజానాట్యమండలిద్వారా చరిత్రాత్మకమైన మాభూమి, ముందడుగు, పరివర్తన, ఈనాడు, పోతుగడ్డ, గాలిమేడలు మొదలైన ప్రసిద్ధ నాటకాలలో పాల్గొని రాష్ట్రంలోనూ, రాష్ట్రేతర ప్రాంతాల్లోనూ మన్ననలు పొందారు.

నాటక ప్రదర్శనాల్లో పాల్గొంటూనే నాటక ప్రయోగానికి కావలసిన శిక్షణను నేర్చుకున్నారు. కొన్నివందల బుర్రకథల జముకుల కథల ప్రదర్శనాల నిచ్చారు. వందలకొద్దీ నాటకాల్లో నటించారు. ఢిల్లీ మద్రాసు విజయవాడ కేంద్రాల్లో జానపద కళారూపాల కార్యక్రమాల్లోనూ, నాటకాల్లోనూ పాల్గొన్నారు.

అఖిల భారత ప్రజా నాట్యమండలిలోనూ, ఆంధ్ర ప్రజానాట్యమండలి రాష్ట్ర దళంలోనూ ప్రముఖ బాధ్యతలు వహించారు. ఆంధ్ర నాటక కళాపరిషత్తు కార్యవర్గ సభ్యులుగాను, సలహా సంఘ సభ్యులుగాను అనేక సంవత్సరాలు పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమి సభ్యులుగాను, అకాడమీ రిసర్చి, ట్రైనింగ్ పబ్లికేషన్ విభాగానికి సంబంధించిన స్టాండింగ్ కమిటి సభ్యులుగాను, మద్రాసు సెంట్రల్ లెదర్ రిసెర్చి ఇన్‌స్టిట్యూట్ తోలుబొమ్మల విభాగంలో అడ్వైజరి కమిటీ సభ్యులుగాను పనిచేశారు. ఆంధ్రదేశంలో అనేక నాటక సంస్థలకు గౌరవాధ్యక్షులుగాను, సలహా సంఘ సభ్యులుగాను వున్నారు.

ప్రసిద్ధ తెలుగు పత్రికల్లో నాటక కళమీద రెండువందల వ్యాసాలవరకూ ప్రచురించారు. నాటక కళమీద దాదాపు వెయ్యిపేజీల ఈ గ్రంథాన్ని రచించి తెలుగు భాషాసమితి అవార్డును అందుకున్నారు. ఆంధ్రదేశంలో అనేక నాటక కళా పరిషత్తుల సభల్లోనూ, విశ్వవిద్యాలయాల్లోనూ, కళాశాలల్లోనూ వక్తగా కళలమీద ఉపన్యాసాలిచ్చారు. అనేక సంస్థల సన్మానా లందుకున్నారు.

1951 లో మద్రాసు సినిమారంగంలో ప్రవేశించి ఈనాటివరకూ 125 చిత్రాల్లో భిన్నభిన్న పాత్రల్ని సమర్థంగా నటించి చలన చిత్రరంగంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు.

భారతదేశంపై చైనా దండయాత్ర సమయంలోనూ, పాకీస్తాన్ దాడి సందర్భంలోనూ, ఆంధ్ర తుపాన్ బాధితుల సహాయ కార్యక్రమంలోనూ, తదితర దేశహిత కార్యక్రమాల్లోనూ ప్రముఖ చలనచిత్ర నటీనటులతోపాటు, పద్మశ్రీ ఎన్. టి. అర్. ఆర్గనైజేషన్‌లో కొన్ని లక్షల రూపాయలను సేకరించడంలో తోడ్పడ్డారు.

# అంకితం



పద్మశ్రీ

అక్కినేని నాగేశ్వరరావుగారికి



రైతుబిడ్డగా పుట్టి, రైతుబిడ్డగా పెరిగి, ఆంధ్ర వాటక రంగస్థలంమీద చిన్న నాడే ఆడపిల్ల పాత్రలను అపురూపంగా అభినయించి, ఆంధ్ర ప్రజల మన్ననలందుకుని, చలనచిత్ర పరిశ్రమలో ప్రవేశించి, స్వయంకృషితో పైకి వచ్చి, భిన్న భిన్న నాయకపాత్రల్లో ఉన్నతంగా జీవించి నటనలో రాణకెక్కి అశేష ఆంధ్ర ప్రేక్షకుల అపార ఆదరాభిమానాలను చూరగొని, నటసామ్రాట్టని బిరుదుపొంది, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలచే పరిగణింపబడి, పద్మశ్రీ బిరుదు నందుకుని అటు ఆంధ్ర నాటక రంగానికి, ఇటు చలనచిత్ర రంగానికి విశేష కీర్తి నార్జించిపెట్టిన విశాల హృదయులూ, అభ్యుదయ కళోపాసకులూ, మిత్రులూ అయిన నటసామ్రాట్ పద్మశ్రీ అక్కినేని నాగేశ్వరరావుగారికి వారి చలనచిత్ర జీవిత రజతోత్సవపు కానుకగా ఈ ఆంధ్ర నాటకరంగ చరిత్రను హృదయపూర్వకంగా అంకితమిస్తున్నాను.

—మిక్కిలినేని



# స్వీకరణ



—అక్కినేని.

మిత్రులు శ్రీ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తిగారు నాకు చాలాకాలంగా తెలుసు. వారికి పూర్తిగా నాటక రంగానుభవం వుందనికూడా తెలుసు. పది సంవత్సరాల క్రిందటిమాట. ఒకనాటి ఉదయం వారు నా వద్దకు వచ్చారు. వస్తూ ఎన్నో వందల పేజీలతో వున్న ఒక పెద్ద వ్రాతప్రతిని వెంట తీసుకువచ్చారు. చదవ మన్నారు. నిజంగా నాకు భయంవేసింది. నాకు ఎక్కువగా చదివే అలవాటులేదు. ఏమిటీ వ్రాతప్రతి అని అడిగాను. ఆంధ్ర నాటక రంగం గురించి నేను వ్రాస్తున్న గ్రంథం అన్నారాయన.

నాటక రంగాన్ని గూర్చి, అందులో ఆంధ్ర నాటక రంగాన్ని గూర్చి, నా సహచర నటుడు వ్రాస్తున్నాడంటే నాకు అమితానందం కలిగింది.

ఎందుకు నాకీ ఆనందం? నేనీరోజున సినిమా నటుణ్ణే అయినా ఆడపిల్లగా ఆంధ్ర నాటక రంగస్థలంమీద చిన్ననాడే నటుడిగా 'అ ఆ'లు దిద్దుకున్నాను. ఎంతో కొంత అనుభవం సంపాదించాను.

ఆ అనుభవాలే ఈనాటికీ ఇంకా నాలో నిలిచివున్నాయి. అందుకే ఈ ఆనందం. ఆ కారణంగానే వారిపట్ల, వారి రచనపట్ల ఆసక్తి, ఆదరణా కలిగింది.

తీరిక దొరికినపుడల్లా కొద్దికొద్దిగా చదువుతూ వచ్చాను. చదువుతున్నకొద్దీ ఇంకా చదవాలనే కుతూహలం కలిగింది.

పవిత్రమైన ఆంధ్ర నాటక రంగస్థలిమీద మహానటు లెందరో అవత రించారు. భావితరాలకు పూలబాటలు వేశారు. నాటక రంగానికి ఎంతో గౌరవాన్ని, ప్రతిష్ఠనూ చేకూర్చిపెట్టారు. మరెంతోమంది నటులు అభివృద్ధిలోకి వచ్చారు. నవ చైతన్యంతో ఔత్సాహిక నాటక రంగం నిత్యనూతనంగా వెలుగొందింది. ఈ రోజున మన కళారంగం కళకళలాడుతూ వుంది.

అయితే వీరిలో ఎంతమంది నాటక రంగాన్ని గురించి ఆలోచిస్తున్నారు? దాని అభివృద్ధికి ఎంతమంది పాటుపడుతున్నారని ప్రశ్న వేసుకుంటే చాల తక్కువ మందే కనిపిస్తారు.

నాకు నాటక రంగంపట్ల కృతజ్ఞతాభావం వుంది. నేను సినిమా నటుణ్ణి అయినప్పటినుండీ వ్యవధిలేని కారణం కానివ్వండి, మరేమైనా కానివ్వండి- నాటక రంగంనుంచి నేను తీసుకున్నంత తిరిగి ఇవ్వలేకపోయాననే బాధ నాలో నిలిచిపోయింది. అందుచేతనే ఆంధ్ర దేశంలో అనేక నాటక సంస్థలతో దగ్గర సంబంధం పెట్టుకున్నాను. నా శక్తి ననుసరించి సహాయ సహకారా లందిస్తూ వచ్చాను. ఈ స్థితిలోనే ఈ మహత్తర గ్రంథం చదివే అదృష్టం నాకు కలిగింది.

ఇది ఆంధ్ర నాటకరంగం గురించి వ్రాయబడిన అపూర్వ గ్రంథం. ఎంతో కృషిచేసి వ్రాసిన పరిశోధనా గ్రంథమిది. ఇది నాటక రంగానికీ, నటీ నటులకూ ఒక వేదంలాంటిది. ఈమాత్రం కృషి ఇంతవరకు ఎవరూ చేయలేదని చెప్పడంలో అతిశయోక్తి ఏమీలేదు.

ముందుతరాలవారికి నడచిన తరాలలో జరిగిందేదో తెలియాలి. దాని పరిణామదశ తెలియాలి. దానిలోవున్న శక్తి తెలియాలి. ఆ రంగంలో కృషి చేసిన మహామహులూ, వారి గొప్పతనమూ తెలియాలి.

ఈ గ్రంథం మన నాటక రంగాన్ని- స్థూలంగా కొన్నివందల సంవత్సరాల పరిణామదశను మనకు చూపుతుంది. ఒక నూరు సంవత్సరాల నాటక రంగ విలు వల్ని మనముం దుంచుతుంది.

సృష్ట్యాదినుండి మానవుడు ప్రకృతిని అనుకరించీ ఆరాధించీ కళాశీలి కావడంతో ఈ గ్రంథం ప్రారంభమౌతుంది. జీవన సంగ్రామంలో ఆనందో పాసన ఎలా పొందిందీ వివరిస్తుంది. అయా కాలాల కళాచరిత్రనూ, సామాజిక

అభివృద్ధినీ చిత్రిస్తుంది. మన ప్రాచీన సంప్రదాయాలనూ, వన్నెతరగని శాస్త్రీయ విషయాలనూ విపులీకరిస్తుంది.

ఆంధ్రదేశంతో ఇరుగు పొరుగు దేశాలతో రాష్ట్రాలతో ముడివడ్డ కళా జీవితాన్ని వర్ణిస్తుంది. సాతవాహన కాలంలో ప్రారంభమైన ఆంధ్రుల కళా జీవితంలోని వెలుగునీడల్ని స్పృశిస్తుంది.

ఆదిమ యుగంనుండి 19 వ శతాబ్దంవరకు నిమ్నోన్నతాల్లో పయనించిన కళాచరిత్ర అభివర్ణితమౌతుంది.

గడచిన నూరు సంవత్సరాలలో మన నాటక రంగం, లలితకళలు ఎలా పునర్వికాసం చెందిందీ, ఏయే ఘట్టాల్లో ఎక్కడెక్కడ ప్రోజ్వలితమైందీ వివరంగా వుంది. భారత స్వాతంత్ర్యోద్యమానికీ ఆంధ్ర జాతీయోద్యమానికీ సాంఘికోద్యమానికీ మన కళారంగం ఎలా తోడ్పడిందీ విపులీకరించబడింది.

ఇందులో ఒక భాగంగా పలువురు కళాశీలురు, రచయితల, నటీనటుల జీవితచరిత్రలూ, ఛాయాచిత్రాలూ చేర్చబడ్డాయి. అలాగే అనేక జానపద కళా రూపాలకు సంబంధించిన పెక్కుచిత్రాలు సంతరించబడ్డాయి. అలభ్యమైనవీ, అపూర్వమైనవీ కొన్నింటిని సేకరించడం ఎన్నదగినది. ఇది సామాన్య విషయం కాదు.

ఇంతటి మహత్తర కృషి చేయడానికీ, అమూల్యమైన ఈ గ్రంథం పూర్తి చేయడానికీ, ఒక వ్యక్తికి ఎంతటి కళాదృష్టి, తృష్ణా వుండివుండాలి? ఎంతటి పరిశోధనా పటిమ, ఎంత శక్తి, ఓర్పూ, దీక్షా, పట్టుదలా కావాలో ఒకసారి ఆలోచిస్తే మనకే బోధపడుతుంది. అదే మిత్రులు రాధాకృష్ణమూర్తిగారు అపూర్వంగా చేశారు. ఇది నేటి మన కళాకారులందరికీ గర్వకారణం.

నాటకరంగంతో కాస్త పరిచయమున్న వాణ్ణిగా వారిపట్లా, వారి కృషిపట్లా, గ్రంథంపట్లా సహచర నటుడుగా నాకు అపారమైన ప్రేమా, ఆదరణా, శ్రద్ధా పెరిగింది. దీనిని ప్రచురించండి. మీ ప్రయత్నంలో నేనూ కొంత సహాయకారిగా వుంటానని నా సంతోషాన్ని వెల్లడించాను, ఆంధ్ర నాటక రంగంమీద కృతజ్ఞతా భావమున్నవాణ్ణిగా.

ఈ గ్రంథం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖద్వారా తెలుగు భాషాసమితి నిర్వహించిన గ్రంథాల పోటీలో ఉత్తమగ్రంథంగా ఉన్నతస్థాయిలో నిలబడి

అవార్డును సంపాదించింది. ఆ తరువాత ఆంధ్రదేశం ఆయన కృషిని గుర్తించి సన్మానించింది.

ఈ రోజు నా చలనచిత్ర జీవిత రజతోత్సవ సందర్భంలో వారు ఈ గ్రంథాన్ని నాకు అంకిత మిస్తామన్నారు. ఈ రంగానికి బిడ్డను నేను. తల్లిని నావద్ద వుంచమంటే కాదని ఏ పుత్రుడైనా అనగలడా? అందుకే పూజ్యభావంతోనే భోజ్యమూ తా అనుకుంటూ మహత్తరమైన ఈ ఆంధ్ర నాటకరంగ చరిత్రను స్వీకరిస్తూ శ్రీ మిక్కిలినేని వారికి అక్కినేనిగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

—అక్కినేని.



డాక్టర్ పి. వి. రాజమన్నార్

# తొలిపలుకు

ఈ గ్రంథం కేవలం ఆంధ్ర నాటక వాఙ్మయ చరిత్రకాదు. ఇది ఆంధ్ర నాటక రంగచరిత్ర. ఇదే దీని ప్రశంసనీయమైన విశిష్టత. నాటకం అన్నపదాన్ని సంకుచితంగా అర్థంచేసుకోవచ్చు. సాహిత్యరూపంగా కాని ప్రదర్శనాత్మకమైన కళారూపాలన్నింటికీ నాటక ప్రపంచంలో స్థానంవున్నదనే విశాలదృష్టితో పరికిస్తే అనేక కళారూపాలు నాటక రంగ సమీక్షలో చేర్చడం సమంజసంగా వుంటుంది. యక్షగానాలు, కూచిపూడివారి భామాకలాపం, వీథినాటకాలు, తోలుబొమ్మలాటలు, ఛాయానాటికలు, జంగం కథలు, బుర్రకథలు, చోడిగాని కలాపం, ఎఱుకలకథ, చెంచునాటకం మొదలైనవి ఇటువంటి కళారూపాలు.

వీటినిగురించి గ్రంథకర్త పరిశ్రమతో అనేక విషయాలు సేకరించి విపులంగా వర్ణించారు.

ప్రత్యేకంగా పేర్కొనతగిన అపూర్వమైన విషయం ఇంకొక్కటి కలదీ

గ్రంథంలో. ఆంధ్రప్రదేశంలో నాటక రంగాన్ని నభలు, సమాజాలు, సంస్థలూ ఏవిధంగా పోషించినవో జిల్లావారిగ వివరింపబడ్డది. ముఖ్యంగా ప్రజా నాట్య మండలి ఒనర్చిన సేవ విదితంచేశారు మిక్కిలినేని వారు. ఇంతేగాక రాష్ట్రేతర ఆంధ్ర నాటక రంగ పరిణామంతోపాటు వివిధ రాష్ట్రాల నాటక రంగాన్నికూడ చేర్చారు.

గత శతాబ్దంలోని ఆంధ్ర నాటక రచన గురించి విమర్శాత్మకమైన సమీక్ష, ఆంధ్ర నటీనటుల ప్రతిభాప్రకటన ఈ గ్రంథానికి సంపూర్ణత నిచ్చాయి. లెక్కలేనన్ని ఫొటోలు, ఎన్నో రేఖాచిత్రాలు ఈ గ్రంథంయొక్క విలువను అధికం చేశాయి.

ఇందులో ఒక ప్రకరణంలో తెలుగు నాటక రంగంపై రష్యా నాటకాల ప్రభావం స్పష్టం చేశారు గ్రంథకర్త.

ప్రదర్శనానికి సంబంధించిన బాధ్యతలు, ఆదర్శాలు వివరించారు. నాతి దీర్ఘంగా వీటిని గమనించడం అత్యావశ్యం నాటక రంగ వికాసానికి.

సరళమైన భాష, ఆకర్షణీయమైన శైలి, పక్షపాతరహితమైన విమర్శ, అసాధారణమైన పరిశోధన ఈ గ్రంథానికి వన్నె తెచ్చినాయి. ఇటువంటి ప్రశస్తమైన గ్రంథాన్ని ఆంధ్ర భారతికి సమర్పించిన శ్రీ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తిగారు వందనీయులు.

మద్రాసు.
28-8-1969

—పి. వి. రాజమన్నారు.



డాక్టర్ సి. నారాయణరెడ్డి

# రంగదీపిక

మిత్రులు మిక్కిలినేనిగారు వస్తుతః నటులు. కృష్ణవేణీ పరిసరాలలో నటనకు తొలిపాఠాలు నేర్చుకుని, ప్రజా నాట్యమండలి వేదికపై పదును దిద్దుకుని, మొక్కవోని అభ్యుదయ భావావేశంతో ముక్కకలుతీరి, క్రమంగా చెన్నపురి చలన చిత్రరంగంలో పదిలంగా స్థిరపడిపోయింది ఆయన బహుముఖ ప్రజ్ఞ.

మిక్కిలినేనిగారి నటజీవితం దాదాపు పాతికేళ్ళది. ఈ పాతికేళ్ళలో ఆయన ప్రతిభ స్ఫటంగా ప్రస్ఫుటించింది....నటుడుగా, బుర్రకథాగాయకుడుగా, జముకుల కథా గాయక నాయకుడుగా.

ఇన్నేళ్ళూ అంతర్వాహినిలా మరో తపన ప్రవహించింది. అంత స్యూతంగా మరో తృష్ణ ఆవరించింది. ఆ తపన, ఆ తృష్ణ, ఆక్కృతిదాల్చిన అక్షర పాత్ర ఈ ఆంధ్ర నాటక రంగ చరిత్ర.

అలనాటి భరతుడు మొదలుకొని ఈనాటి డా॥ అప్పారావు వరకు వెలు వడిన గ్రంథాలను పరిశీలించి, వివిధ నాటక రంగ ప్రయోక్తలు, ప్రవక్తలు అందిం

చిన అనుభవసారాన్ని ఆస్వాదించి, సమస్తాంధ్రదేశంలోని నాటక రంగ రీతులను, జానపద కళారూపాలను స్వయంగా సమాలోకించి ఎన్నెన్నో విషయాలను దారి బత్తెంగా స్వీకరించి, చివరికి గమ్యంచేరుకున్న అక్షాంత యాత్ర ఈ నాటక రంగ చరిత్ర.

ఈ గ్రంథంలో నాటక రంగానికి సంబంధించిన అచుంబితాంశం లేదు. అన్ని ప్రకరణాలలో తలమానికం వివిధ జానపద కళారూపాల వివరణాత్మక వ్యాసం. మరి సమస్తాంధ్ర దేశం నలుచెరగులా స్థాపింపబడిన నాటక సంస్థల గూర్చి, ప్రదర్శింపబడిన నాటకాలను గూర్చి, నటులను గూర్చి పూసగ్రుచ్చినట్లు చెప్పడం బహుప్రయాసతో కూడుకున్నపని. ప్రవాసాంధ్ర నాటక రంగానికి సంబంధించిన వృత్తాంతం సేకరించడం ప్రశంసాత్మకమైన కృషి.

కాలగర్భంలో కలిసిపోయిన ఎందరెందరో మహానటుల ఛాయాచిత్రాలు సేకరించి ప్రచురించడం సమకాలీనులే కాక భావితరాల వారు కూడా కైమోడ్పు లందించే ఉత్తమ సంకల్పం.

ఆంధ్ర నాటక రంగం క్రమ పరిణామ పరిమళాలను ఆఘ్రాణించే జిజ్ఞాసువులకు అమ్లాన సుమ కదంబం ఈ గ్రంథం.

ఒకవైపు ఉత్తమనటుడుగా చలన చిత్రరంగంలో వాసికెక్కుతూ, ఇంకొకవైపు తనలో అంతర్నిహితమైన కళాజిజ్ఞాసకు, రచనా పిపాసకు రూపుకట్టించి, తెలుగునాట తులలేని పంట పండించిన మిక్కిలినేనిగారి కృషీవలత్వాన్ని మనసారా అభినందిస్తున్నాను.

మిక్కిలినేనిగారి ఈ నాటక సమీక్షీకృతి నటసమ్రాట్ అక్కినేని నాగేశ్వర రావుగారికి అంకితం కావడం—

"కలిగె పదియారు వన్నె బంగారమునకు
పద్మరాగమ్ముతోడి సంపర్కలబ్ధి."

హైదరాబాదు
15-8-1969

—సి. నారాయణరెడ్డి.

# తల్లితండ్రులకు అంజలి



నా చదువుకూ సంస్కారానికీ దోహదం చేసిన పితృ పాదులు కీ॥ శే॥ శ్రీ వెంకయ్యగారికీ, మాతృమూర్తి సౌభాగ్యమ్మగారికీ భక్తి పురస్సరంగా అంజలి ఘటిస్తున్నాను.

# బహుమతి ప్రదానం



**28-7-1957** వ తేదీన హైదరాబాదు ప్రతాపగిర్జీ కోఠిలో
తెలుగు భాషాసమితి బహుమతీ ప్రదానోత్సవం

1. రచయిత మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
2. శ్రీ కల్లూరు సుబ్బారావు
3. బహుమతి ప్రదానం చేస్తున్న శ్రీ బచ్చు జగన్నాధదాసు
4. సభాధ్యక్షులు శ్రీ బెజవాడ గోపాలరెడ్డి
5. భాషా సమితి కార్యదర్శి పద్మశ్రీ మోటూరు సత్యనారాయణ.



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారు



నేటి విద్యామంత్రి

శ్రీ పి. వి. నరసింహారావుగారు



నాటి విద్యామంత్రి

శ్రీ టి. వి. రాఘవులుగారు

# నా మాట



చిన్ననాడు మా ఊళ్ళో నేను చూసిన జానపద కళారూపాలై న వీధినాటకాలూ, తెలుగు నాటక రంగంలో ప్రముఖ నటులు ప్రదర్శించిన నాటకాలూ నన్నెంతో ఉ తేజపరిచాయి.

తొలి రోజుల్లో ఎలిమెంటరీ స్కూలు నాటకాల్లోనూ, హైస్కూలు నాటకాల్లోనూ, గ్రామ నాటక దళంలోనూ, తదితర నాటక సమాజాలలోనూ స్త్రీ పురుష పాత్రలు ధరించాను. తరువాత ప్రజానాట్యమండలిలో ప్రవేశించి వివిధ జానపద కళారూపాలలోనూ, నాటకాల్లోనూ శిక్షణ పొంది, అనుభవం గడించాను. ఆ తరువాత సినిమారంగంలో ప్రవేశించాను.

ఆ నాటికే శిధిలమైపోతున్న జానపద కళారూపాలూ, కంట్రాక్టు నాటకాలతో కలుషితమైపోతున్న నాటక రంగమూ నన్ను కలవరపరిచాయి. చిన్ననాటి అనుభవాలూ, అనుభూతులూ నన్నెందుకో రచనావ్యాసంగానికి పురికొల్పాయి. క్రమక్రమంగా కళలకు సంబంధించిన అనేక విషయాలు వ్యాసరూపంగా రచించి ప్రముఖ పత్రికల్లో వెలువరించాను. సినిమారంగంలో ప్రవేశించిన తరువాత నాకున్న విరామ సమయాన్ని ఈ విధంగా ఉపయోగిస్తున్న తరుణంలో తెలుగు భాషాసమితివారి గ్రంథాల పోటీ ప్రకటనలో నాటక కళకు సంబంధించిన గ్రంథాన్ని కూడా చేర్చారు. ఆ ప్రకటనే నన్నీ రచనకు ఉత్సాహపరిచింది; అవార్డును సంపాదించి పెట్టింది; నేటి కీరూపంలో ఆంధ్ర నాటకరంగ చరిత్రగా వెలువడింది.

ఈ గ్రంథ రచన చేసేనాటికి నాటక కళమీద లభ్యమైన గ్రంథాలు వ్రేళ్ళమీద లెక్కపెట్టతగినవే. అతికష్టంమీద పరిశోధన సాగించవలసి వచ్చింది. ఈ పరిశోధనలో ఎన్నో గ్రంథాలు, ఎన్నో పత్రికలు, ఎంతోమంది మిత్రులు నాకు అన్ని విధాలా సంపూర్ణ సహకారమిచ్చారు.

నేను కోరినంతనే అనేకమంది రచయితలు నటీనటులు కళాకారులు వారివారి ఛాయాచిత్రాలనూ, జీవిత చరిత్రలనూ ఎంతో అభిమానంతో అందించారు. వారందరికీ కృతజ్ఞుణ్ణి. కాని అందరి ఫోటోలూ, జీవిత చరిత్రలూ, గ్రంథ విస్తరణ వల్లనూ, బ్లాకులరేటు విపరీతంగా పెరిగినందువల్లనూ ప్రచురించలేకపోయినందుకు విచారిస్తున్నాను. అమూల్యమైన ప్రతి జీవితచరిత్రనూ ప్రతిఫోటోనూ ప్రచురించాలనే నా కాంక్ష మరో ముద్రణలో పూరించగలనని సవినయంగా మనవి చేసుకుంటున్నాను.

నటీనటుల, రచయితల, కళాకారుల ఫోటోలు ప్రచురించడంలో అనివార్యమైన పొరపాటువల్ల వరుసక్రమం తప్పినందుకు విచారిస్తున్నాను.

ఈ గ్రంథంలో తప్పొప్పుల పట్టికను ప్రచురించలేదు; అలా ప్రచురించడం మామూలేగనక. అయితే కొన్ని అచ్చుతప్పులు ఈ గ్రంథంలోనూ లేకపోలేదు. మలి ముద్రణలో సరిచేసుకోగలను.మచ్చుకు ఒకచిన్న లోపాన్ని మనవి చేస్తున్నాను—

ఆంధ్రప్రదేశ్‌నుండి బళ్ళారిజిల్లా విడిపోవడంవల్ల ఆ జిల్లా నాటక రంగ చరిత్రను, రాయలసీమ నాటక రంగంతోపాటు చేర్చి, ప్రముఖ రచయితలుగా, నటులుగా వెలుగొందినవారి జీవిత చరిత్రలను ఆ శీర్షికలోనే చేర్చడం జరిగింది.

ఫోటోలు ప్రచురించడంలోనూ, జీవిత చరిత్రలను ప్రచురించడంలోనూ ఉద్దేశపూర్వకంగా ఏ కళాకారుణ్ణీ విస్మరించలేదు. సహృదయులు ఇది గమనించగలరని ఆశిస్తున్నాను.

—రచయిత.

# కృతజ్ఞతలు



ఎం తోకాలంగా నా వ్యాసాలనూ, నా కృషినీ అభినందిస్తూ, ఎప్పటికప్పుడు నా వీపు తట్టి, నా కృషిలో ముందుకుపోవడానికి నా కత్యంత ఉత్తేజాన్ని ఉత్సాహాన్నీ కలిగించిన ప్రియమిత్రులు నటరత్న పద్మశ్రీ యన్. టి. రామారావుగారికీ—

నా గ్రంథానికి 1954-55 ల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు భాషాసమితి ద్వారా నిర్వహించిన నాటక కళా సమీక్షకు సంబంధించిన గ్రంథాలపోటీలో ప్రథమ బహుమతినిచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖవారికీ, ఆ బహుమతిని నిర్వహించి ఫలితాన్ని ప్రకటించిన తెలుగు భాషాసమితి కార్యదర్శి పద్మశ్రీ మోటూరు సత్యనారాయణగారికీ—

ఉత్తమ గ్రంథాలపోటీలో న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన శ్రీ కూర్మా వేణుగోపాలస్వామి, కీ॥శే॥ శ్రీ తూములూరు శివరామయ్య, కీ॥శే॥ శ్రీ వెలికిచర్ల వెంకటరత్నంగార్లకూ—

తుదినిర్ణయం చేసిన న్యాయమూర్తులు అప్పటి చీఫ్ జస్టిస్ డాక్టర్॥ పి. వి. రాజమన్నారు, గౌరవనీయులు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి, శ్రీ ఆర్. బి. రామకృష్ణం రాజుగార్లకూ—

1957 జూలై లో హైదరాబాదు ప్రతాపగిర్జీ కోఠీలో తెలుగు భాషాసమితి వార్షికోత్సవాలలో శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారి అధ్యక్షతన బహుమతి నందచేసిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి శ్రీ బచ్చు జగన్నాధ దాసుగారికీ—

భాషాసమితి బహుమతి నందుకున్నతరువాత ఆంధ్రదేశంలో నన్నెంతో గౌరవించి సన్మానించిన అనేక నాటక సంస్థల, కళాపరిషత్తుల కార్యకర్తలకూ—

నా ప్రాతప్రతి గ్రంథాన్ని ఎంతో ఓపికగా చదివి నా గ్రంథంపట్లా, నా కృషిపట్లా అత్యంత ఆదరాభిమానం కనబరిచి, గ్రంథ ముద్రణకు ద్రవ్యసహాయం చేసిన మిత్రులు నటసామ్రాట్ పద్మశ్రీ అక్కినేని నాగేశ్వరరావుగారికీ—

గ్రంథముద్రణకు మరికొంత ఆర్థికసహాయం చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారికీ—

నాటి విద్యాశాఖామాత్యులు శ్రీ టి. వి. రాఘవులుగారికీ, విద్యాశాఖ డైరెక్టరు శ్రీ యల్. బుల్లెయ్యగారికీ—

సాంస్కృతిక వ్యవహారశాఖలో స్పెషల్ ఆఫీసరుగా పనిచేసిన డాక్టరు పోణంగి శ్రీరామ అప్పారావుగారికీ—

ప్రస్తుత విద్యాశాఖామాత్యులు శ్రీ పి. వి. నరసింహారావుగారికీ, విద్యాశాఖ డైరెక్టరు శ్రీ ప్రతాపరెడ్డిగారికీ—

గ్రంథ రచనాకాలంలో నాకు అన్ని విధాలా సహకరించిన డాక్టర్ సి. నారాయణరెడ్డి, శ్రీ పి. యస్. ఆర్. అప్పారావు, శ్రీ శ్రీనివాస చక్రవర్తి, శ్రీ చల్లా లక్ష్మీనారాయణశాస్త్రి, డాక్టర్ చల్లా రాధాకృష్ణశర్మ, శ్రీ నటరాజ రామకృష్ణ, శ్రీ మద్దుకూరు చంద్రశేఖరరావు, శ్రీ ఏటుకూరి బలరామమూర్తి, శ్రీ యన్. వేణు మాధవ్, శ్రీ తిరుమల రామచంద్ర, శ్రీ బి. సి. కామరాజు, విద్వాన్ విశ్వం, శ్రీ సముద్రాల గోపాలమూర్తిగార్లకూ—

గ్రంథముద్రణా వ్యవహారాలలో ఎప్పటికప్పుడు తగు సలహాల నిచ్చిన తెలుగు భాషాసమితి కార్యకర్తలైన శ్రీ ఇ. రాయన్న, శ్రీ బుడ్డిగ సుబ్బరాయన్, కీ. శే. శ్రీ టి. వి. రంగాచార్యులు, శ్రీ యం. యన్. రావు, శ్రీ ధనికొండ హనుమంతరావుగార్లకూ—

నా రచనపట్ల ఆసక్తినీ, అభిమానాన్నీ, ఆదరాన్నీ చూపించిన శ్రీ యస్.

బి. పి. పట్టాభి రామారావు, శ్రీ నార్ల వెంకటేశ్వరరావు. శ్రీ కొంగర జగ్గయ్య, శ్రీ పసల సూర్యచంద్రరావు, శ్రీ యం. ఆర్. అప్పారావుగార్లకూ—

ప్రూఫులు దిద్దిన శ్రీ కె. పి. బాబు, కీ. శే. శ్రీ టి. వి. రంగాచార్యులు గార్లకూ—

అడిగినంతనే ఎంతో ఆదరాభిమానాలతో తొలిపలుకును వ్రాసియిచ్చిన డాక్టరు పి. వి. రాజమన్నారుగారికీ, గ్రంథాన్ని ఆమూలాగ్రం పరిశీలించి తమ అమూల్యాభిప్రాయాన్ని వ్రాసి యిచ్చిన డాక్టరు సి. నారాయణరెడ్డిగారికీ—

ఈ నా గ్రంథాన్ని ఎన్నో వ్యయప్రయాసల కోర్చి, సరసంగా, అత్యంత సుందరంగా ముద్రించి యిచ్చిన ఆప్తమిత్రులూ, శ్రీ వెంకటేశ్వర ప్రింటర్సు యజమానులూ అయిన శ్రీ వి. వి. సుబ్బారావుగారికీ, ప్రెస్ పనివారలకూ—

బ్లాకులను ముద్రించిన హిందీ ప్రచార ప్రెస్ మేనేజరు శ్రీ శర్మగారికీ—

ముఖపత్రం సుందరంగా ముద్రించిన స్క్రిప్టు ఆర్టిస్టు శ్రీ శాస్త్రిగారికీ—

గ్రంథంలో జానపద కళారూపాలకు సంబంధించిన అనేక రైన్ డ్రాయింగ్సూ, హైర్రిలర్ జాకెట్ డ్రాయింగునూ చిత్రించి, ముద్రణా వ్యవహారాలలో హృదయపూర్వక సహకార మిచ్చిన మిత్రులు, ప్రసిద్ధ ఫిలిం పబ్లిసిటీ ఆర్టిస్టు శ్రీ గంగాధర్‌గారికీ—

అనేక పూర్వ మహానటుల వేషధారణకు సంబంధించిన ఛాయాచిత్రాలకు రేఖాచిత్రాలను వ్రాసియిచ్చి, నా గ్రంథానికి మూరనాలంకారాన్నీ, శోభనూ చేకూర్చి, నాతో సహకరించిన మిత్రులు, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక చిత్రకారులు శ్రీ ఆనంద్‌గారికీ—

కొన్ని రేఖాచిత్రాలను వ్రాసియిచ్చిన శ్రీ హెచ్. వి. రామగోపాల్, శ్రీ శీలావి, శ్రీ బి. కాటకృష్ణగార్లకూ, ఆయా పంగాలకు అందచందాలను కూర్చే అలంకారాలను చిత్రీకరించి ఇచ్చిన శాంతినికేతన్ చిత్రకారునికీ—

ఈ గ్రంథంలో ప్రచురించిన కొన్ని బ్లాకులు, ఫొటోలు విషయంలో సహాయంచేసిన మిత్రులు, సంగీత నాటక అకాడమీ అధ్యక్షులు శ్రీ పసల సూర్యచంద్రరావు, అకాడమీ మేనేజరు శ్రీ దేశపతిరావు, శ్రీ మందపాటి రామలింగేశ్వరరావు, శ్రీ శ్రీనివాస చక్రవర్తి, శ్రీ ఇంటూరి వెంకటేశ్వరరావు, శ్రీ విశ్వ

ప్రసాద్, తెలుగు భాషాసమితి కార్యదర్శి పద్మశ్రీ మోటూరి సత్యనారాయణ, శ్రీ ఎ. బి. కె. ప్రసాద్, శ్రీమతి పూర్ణిమగార్లకూ—

కొన్ని బ్లాకులను అందంగా చేయించి యిచ్చిన జ్యోతి పబ్లిసిటీస్ కార్యకర్త శ్రీ గంగాధర్‌గారికీ—

కళలమీద, నాటక రంగంమీద నేను పరంపరగా వ్రాసిన వ్యాసాలకు దోహదమిచ్చి, వాటికి అధిక ప్రాధాన్యమిచ్చి ప్రచురించడం ద్వారా ఈ గ్రంథ రచనకు తోడ్పడిన అనేక పత్రికాధిపతులకూ, సంపాదకులకూ, గ్రంథ రచయితలకూ, విమర్శకులకూ, నటీనటులకూ, కళాకారులకూ—

—నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను.

నాటకప్రయోగంలో ఒక క్రమపద్ధతిని ప్రవేశపెట్టి, ప్రజా నాట్యమండలి నాటకాలకు మెరుగులుదిద్ది, మాకు తొలిపాఠాలను నేర్పిన శ్రీ కోడూరు అచ్చయ్య చౌదరిగారికీ—

కన్నుమూసేవరకు ఈ గ్రంథాన్ని ప్రచురించమని పదేపదే ప్రబోధించిన ఆప్తమిత్రుడూ సమకాలికుడూ ఆదర్శవైద్యుడూ దర్శకుడూ అయిన డాక్టరు రాజారావుగారికీ—ఈ సమయంలో హృదయపూర్వక కళాభివందనాలు అందచేసుకుంటున్నాను.

ఈ గ్రంథం ప్రారంభించిన నాటినుండి ఈనాటివరకూ నా కృషికి అనేకవిధాలా సహకారమిచ్చిన నా అర్ధాంగి శ్రీమతి సీతారత్నం, నా చిరంజీవులు మాలతి, డాక్టర్ విజయకుమార్, రేణుకలను అభినందిస్తున్నాను.

—మిక్కిలినేని.

# విషయసూచిక


| | | | పేజీ |
|---|---|---|---|
| 1. | నాట్యకళారంభం | .... | 1 |
| | కళ-దాని ప్రయోజనం | .... | 5 |
| | కళల ఉపయోగం | .... | 9 |
| | నాట్యకళారంభం | .... | 13 |
| | పురాణ పురుషులు-నాట్యకళ | .... | 21 |
| | నాట్యకళ ఎలా ఉద్భవించింది? | .... | 23 |
| | నటరాజస్వామి | .... | 27 |
| | చెన్నుమీరిన చిదంబర క్షేత్రం | .... | 30 |
| 2. | ఆంధ్రుల కళాచరిత్ర | .... | 31 |
| | ఆంధ్రనామ సంగ్రహం-శాతవాహనులు | .... | 33 |
| | బౌద్ధమత వ్యాప్తి-బౌద్ధయుగపు నాట్యకళ | .... | 35 |
| | ఇక్ష్వాకులు | .... | 38 |
| | పల్లవులు | .... | 39 |
| | విష్ణుకుండినులు | .... | 39 |
| | చాళుక్య చోళులనాటి సొంపు పెంపులు | .... | 40 |
| | చాళుక్య చోళులు | .... | 42 |
| | పల్నాటి వీరచరిత్ర | .... | 44 |
| | శైవమతం, కళాపోషణ | .... | 46 |
| | వైష్ణవమతం, కళాపోషణ | .... | 48 |
| | కాకతీయుల కళాపోషణ | .... | 52 |
| | జాయప సేనాని | .... | 55 |
| | విప్లవకవి పాల్కురికి సోమనాథుడు | .... | 57 |

| | | |
|---|---|---|
| శ్రీనాథుని సిరి సిరి మువ్వ క్రీడాభిరామం | .... | 61 |
| రెడ్డి రాజులు-నాట్యకళ | .... | 65 |
| విజయనగర రాజుల కళావిన్నాణం | .... | 75 |
| సంగీత పోషణలోను విజయనగర రాజుల విశిష్టత | .... | 83 |
| క్షేత్రానికే కాదు-కళలకూ క్షేత్రమైన తంజావూరు | .... | 97 |
| ఘనత వహించిన గోల్కొండ నవాబులు | .... | 112 |
| **3. జానపద కళారూపాలు** | | |
| నాటులోనే గోటు చూపించిన కొరవంజి కళారూపం | .... | 117 |
| అక్షయంగా వెలుగొందిన యక్షగానం | .... | 122 |
| **4. కూచిపూడి కళాక్షేత్రం** | .... | 133 |
| కోటకొండ భాగవతులు | .... | 166 |
| వినుతికెక్కిన తమ్మారపు వెంకటస్వామి వీధి నాటకాలు | .... | 169 |
| జేజేలు అందుకున్న జేగంట భాగవతులు | .... | 173 |
| గంటి భాగవతులు | .... | 174 |
| గొల్ల భాగవతులు | .... | 175 |
| యానాది భాగవతులు | .... | 176 |
| మాల భాగవతులు | .... | 176 |
| వెన్నెల నాటకాలు | .... | 177 |
| **5. తోలు బొమ్మలాటలు** | .... | 181 |
| ఛాయానాటికలు | .... | 198 |
| మూకాభినయం | .... | 199 |
| బుట్టబొమ్మలు | .... | 200 |
| యం. వి. రమణమూర్తి | .... | 201 |
| **6. జంగం కథలు** | .... | 203 |
| **7. పగటి వేషాలు** | .... | 221 |
| సున్నపు వీరయ్య పగటి వేషాలు | .... | 233 |
| **8. దేవదాసీలు** | .... | 238 |
| నట్టువ మేళలు | .... | 243 |
| కచ్చేరీ నృత్యకళ | .... | 244 |

మారంపల్లి గొల్లకలాపం .... 244
చాటపర్తి సుందరి శకం .... 250
స్వశక్తితో రక్తికెక్కిన మహావ్యక్తులు .... 252
ఆటకత్తెగా, పాటకత్తెగా ప్రశస్తిగాంచిన కళావర్ రింగ్ .... 252
అన్నాబత్తుల బులివెంకటరత్నం .... 253
భామాకలాపాలూ, వాటిలో వాసికెక్కిన కొందరు జాణలు .... 255
పందిరి వెంకటరత్నం .... 255
దుగ్గిరాల మాణిక్యాంబ .... 256
చూడల శంకరయ్య .... 256
దొంతలకోటి జగన్నాథం .... 257
బొబ్బిలి బెబ్బులి జీవరత్నమ్మ .... 257

**9. అవీ-ఇవీ-అన్నీ** .... 259

బోడిగాని కలాపం .... 261
వీరభద్ర విన్యాసం .... 265
జముకుల కథలు .... 269
గారడీ విద్యలు .... 272
గొల్ల సుద్దులు .... 274
వసంతోత్సవాలు .... 275
వీరముష్టివారు .... 277
ఫకీరు వేషాలు .... 278
తుమ్మెద పాటలు .... 279
దప్పుల కోలాట నృత్యం .... 279
బగ్గుగొల్లలు .... 280
గోండుజాతి నృత్యాలు .... 281
గరగ నృత్యం .... 281
ఐంజలు .... 282
పాండవుల వారు .... 282
మాల జంగాలు .... 283
చిన్న మాదిగలు .... 283
కడ్డీ వాయిద్యం .... 284

| | | |
|---|---|---|
| విప్రవినోదులు | .... | 284 |
| పులి నృత్యం | .... | 285 |
| కామని పౌర్ణమి వినోదాలు | .... | 286 |
| బతుకమ్మ బొడ్డెమ్మ పండగలు | .... | 288 |
| తెలంగాణా యక్షగానాలు | .... | 291 |
| తెలంగాణా జానపద కళారూపాలు | .... | 293 |
| సాధనా శూరులు | .... | 294 |
| గంపె భాగవతులు | .... | 295 |
| కాటిపాపల వాళ్ళు | .... | 296 |
| బైండ్లవారు | .... | 296 |
| కోలాట నృత్యం | .... | 296 |
| దొమ్మరాటలు | .... | 301 |
| జంతరు పెట్టె | .... | 303 |
| వీధి పురాణం | .... | 303 |
| అశ్వ నృత్యం | .... | 304 |
| చక్ర భజన | ... | 306 |
| చిత్రకథావిధానం | .... | 306 |
| హరి భజనలు | .... | 307 |
| పండరి భజనలు | .... | 307 |
| చెంచులు | .... | 307 |
| హరికథ | .... | 308 |
| పిచ్చుకుంటుల కథలు | .... | 314 |
| హరి హర పదాలు | .... | 317 |
| ఘట నృత్యం | .... | 319 |
| జయదేవుని అష్టపదులు | .... | 321 |
| కాశీ కావళ్ళు | .... | 321 |
| ఆంధ్రుల కళారూపాలు | .... | 323 |
| **10. తెలుగు నాటక సాహిత్య సమీక్ష** | .... | 325 |
| తెలుగు నాటకాల పరిణామం | .... | 327 |
| నాటికలు | .... | 356 |

| | | | |
|---|---|---|---|
| | శ్రవ్య నాటికలు | .... | 362 |
| | బాలల నాటికలు | .... | 363 |
| **11.** | **ఆంధ్రప్రదేశ్ నాటక రంగం** | .... | 367 |
| | నెల్లూరుజిల్లా నాటకరంగం | .... | 369 |
| | గుంటూరుజిల్లా నాటకరంగం | .... | 379 |
| | కృష్ణాజిల్లా నాటకరంగం | .... | 397 |
| | పశ్చిమ గోదావరిజిల్లా నాటకరంగం | .... | 417 |
| | తూర్పు గోదావరిజిల్లా నాటకరంగం | .... | 425 |
| | విశాఖపట్టణంజిల్లా నాటకరంగం | .... | 439 |
| | శ్రీకాకుళంజిల్లా నాటకరంగం | .... | 451 |
| | రాయలసీమ నాటకరంగం | .... | 459 |
| | బళ్ళారి నాటకరంగం | .... | 464 |
| | నాటక ధర్మాలను నిర్వచించిన ధర్మవరం వారు | .... | 465 |
| | ధర్మవరం గోపాలాచార్యులు | .... | 465 |
| | కోలాచలం వారి గొప్పతనం | .... | 466 |
| | కె. సుబ్రహ్మణ్యశాస్త్రి | .... | 466 |
| | నాట్యకళాప్రపూర్ణ తాడిపత్రి రాఘవాచార్యులు | .... | 467 |
| | కర్నూలుజిల్లా నాటకరంగం | .... | 471 |
| | కడపజిల్లా నాటకరంగం | .... | 473 |
| | సురభి నాటకరంగం | .... | 475 |
| | వాసిగాంచిన వనారస గోవిందరావు | .... | 481 |
| | చిత్తూరుజిల్లా నాటకరంగం | .... | 486 |
| | అనంతపురంజిల్లా నాటకరంగం | .... | 488 |
| | తెలంగాణా నాటకరంగం | .... | 490 |
| | హైదరాబాదుజిల్లా నాటకరంగం | .... | 494 |
| | ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమి | .... | 496 |
| | ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘం | .... | 496 |
| | రవీంద్ర భారతి | .... | 497 |
| | సికింద్రాబాదు నాటకరంగం | .... | 499 |
| | వరంగల్లుజిల్లా నాటకరంగం | .... | 503 |

ఖమ్మంజిల్లా నాటకరంగం .... 504
మహబూబునగర్ జిల్లా నాటకరంగం .... 505
కరీంనగర్‌జిల్లా నాటకరంగం .... 506
అదిలాబాద్‌జిల్లా నాటకరంగం .... 509
నల్లగొండజిల్లా నాటకరంగం .... 514

**12.** ప్రజా నాట్యమండలి .... 515
ప్రజానాట్యమండలి ఉజ్వల చరిత్ర .... 517
గుంటూరు యువకుల గొప్ప బుర్రకథ .... 519
కోగంటి కోయవేషపు ప్రతిభ .... 520
యువకులు నిర్మించిన వైజ్ఞానికోద్యమం .... 521
పునరుద్ధరించిన కళారూపాలు .... 525
ముందడుగు నాటకం .... 530
బుర్రకథ ప్రశంస .... 532
చరిత్రాత్మకమైన మా భూమి నాటకం .... 532
ప్రజానాట్యమండలి చేపట్టిన కళారూపాలు .... 539

**13.** ఆంధ్ర నాటక కళాపరిషత్తు .... 543
విశాఖ నాటక కళాపరిషత్తు .... 545
అఖిలాంధ్ర నాటక కళాపరిషత్తుకు అంకురార్పణ .... 546
నాట్యకళ పత్రిక .... 547
ఆంధ్రదేశంలో అనేక నాటక కళాపరిషత్తులు .... 550
నాట్యకళాభివృద్ధికి నాట్య విద్యాలయాలు .... 550
స్త్రీల నాటక సమాజాలు .... 553

**14.** రాష్ట్రేతర ఆంధ్ర నాటక రంగం .... 556
ది ఓరియంటల్ డ్రమాటిక్ కంపెనీ-మద్రాసు .... 557
సుగుణ విలాస సభ .... 558
చెన్నపురి ఆంధ్ర మహాసభ .... 559
మద్రాసు ప్రజా నాట్యమండలి .... 561
బెంగుళూరు అమెచ్యూర్ సభ .... 563
ఢిల్లీ ఆంధ్ర నాటకరంగం .... 564

బొంబాయి తెలుగు నాటకరంగం .... 567
షోలాపూర్ ప్రజా నాట్యమండలి .... 568
కలకత్తా ఆంధ్ర నాటకరంగం .... 571
జంషెడ్‌పూర్ ఆంధ్ర నాటకరంగం .... 574

**15. హిందీ నాటకరంగం** .... 576

ఆంధ్రులు ప్రదర్శించిన హిందీ నాటకాలు .... 579
రేడియో నాటకాలు .... 583

**16. ప్రసిద్ధ నాటక రచయితలు**

కోరాడ రామచంద్రశాస్త్రి ... 587
వావిలాల వాసుదేవశాస్త్రి .... 587
కొండుభొట్ల సుబ్రహ్మణ్య కవి .... 588
కొక్కొండ వేంకటరత్నం .... 588
మారేపల్లి రామచంద్రశాస్త్రి .... 589
వేదం వేంకటరాయశాస్త్రి .... 589
తిరుపతి వేంకటేశ్వర కవులు .... 590
శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి .... 590
వడ్డాది సుబ్బరాయకవి .... 591
కందుకూరి వీరేశలింగం .... 592
పానుగంటి లక్ష్మీనరసింహారావు .... 592
బలిజేపల్లి లక్ష్మీకాంత కవి .... 593
చిలకమర్తి లక్ష్మీనరసింహం .... 593
ముత్తరాజు సుబ్బారావు .... 594
కొప్పరపు సుబ్బారావు .... 594
పద్మశ్రీ వి. వి. యల్. నరసింహారావు .... 595
సోమరాజు రామానుజరావు .... 596
పింగళి నాగేంద్రరావు .... 596
కాళ్ళకూరి నారాయణరావు .... 597
మల్లాది విశ్వనాథ కవిరాజు .... 597
మల్లాది అచ్యుతరామశాస్త్రి .... 598

| | | |
|---|---|---|
| శ్రీరాముల సచ్చిదానందశాస్త్రి | .... | 598 |
| సోమంచి యజ్ఞన్నశాస్త్రి | .... | 598 |
| పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రి | .... | 599 |
| గుండిమెడ వెంకటసుబ్బారావు | .... | 599 |
| మల్లాది అవధాని | .... | 600 |
| వేదాంత కవి | .... | 601 |
| మల్లాది వేంకటకృష్ణశర్మ | .... | 601 |
| భమిడిపాటి కామేశ్వరరావు | .... | 691 |
| గురజాడ అప్పారావు | .... | 602 |
| పాకాల వెంకట రాజమన్నారు | .... | 603 |
| నార్ల వెంకటేశ్వరరావు | .... | 603 |
| దామరాజు పుండరీకాక్షుడు | .... | 604 |
| కొండముది గోపాలరాయశర్మ | .... | 605 |
| ఆచార్య ఆత్రేయ | .... | 605 |
| వాసిరెడ్డి భాస్కరరావు | .... | 606 |
| సుంకర సత్యనారాయణ | .... | 606 |
| పినిసెట్టి శ్రీరామమూర్తి | .... | 607 |
| అనిసెట్టి సుబ్బారావు | .... | 607 |
| కొట్టపాటి గంగాధరరావు | .... | 608 |
| శ్రీనివాస చక్రవర్తి | .... | 608 |
| డి. వి. నరసరాజు | .... | 609 |
| బెల్లంకొండ రామదాసు | .... | 609 |
| ఆమంచర్ల గోపాలరావు | .... | 610 |
| ముద్దుకృష్ణ | .... | 610 |
| బోయి భీమన్న | .... | 610 |
| బుచ్చిబాబు | .... | 611 |
| రెంటాల గోపాలకృష్ణ | .... | 611 |
| సీతంరాజు వెంకటేశ్వరరావు | .... | 611 |
| కొడాలి గోపాలరావు | .... | 612 |

## 17. కళాకారులు జీవితాలు


పద్మశ్రీ స్థానం నరసింహారావు .... 615
బండా కనకలింగేశ్వరరావు .... 616
సి. యస్. నటేశం .... 616
యడవల్లి సూర్యనారాయణ .... 617
పులిపాటి వెంకటేశ్వర్లు .... 618
దైతా గోపాలం .... 618
ఆద్దంకి శ్రీరామమూర్తి .... 619
పంచాంగం రామానుజాచార్యులు .... 620
డి. వి. సుబ్బారావు .... 620
ఉప్పులూరు సంజీవరావు .... 621
కపిలవాయి రామనాధశాస్త్రి ... 621
గరికిపాటి రాజారావు .... 622
గోవిందరాజుల వెంకటసుబ్బారావు .... 623
గుజ్జ నాయుడు ... 624
మాధవపెద్ది వెంకటరామయ్య .... 624
వేమూరు గగ్గయ్య .... 625
వెంపటి వెంకటేశ్వర్లు .... 626
ఘంటసాల రాధాకృష్ణయ్య .... 627
వెదురుమూడి శేషగిరిరావు ... 627
నేలనూతుల రామకృష్ణయ్య .... 627
అంకరాజు రామారావు .... 628
పర్వతరెడ్డి రామచంద్రారెడ్డి .... 928
ఈవెన లక్ష్మణస్వామి .... 629
హరిప్రసాదరావు .... 629
ముప్పిడి జగ్గరాజు .... 630
ముంజులూరు కృష్ణారావు ... 630
కందాడై శ్రీనివాసన్ .... 631
నెల్లూరు నగరాజారావు .... 632
జమ్మలమడక మాధవరామశర్మ .... 633

యస్వీ జోగారావు .... 633
పసల సూర్యచంద్రరావు .... 634
కూర్మా వేణుగోపాలస్వామి .... 634
బెజవాడ గోపాలరెడ్డి .... 635
ఆర్. బి. రామకృష్ణంరాజు .... 636
పోణంగి శ్రీరామ అప్పారావు .... 636
ఆచంట వెంకటసాంఖ్యాయనశర్మ .... 636
కృత్తివెంటి నాగేశ్వరరావు .... 637
యన్. వేణుమాధవ్ .... 638
వైద్యుల చంద్రశేఖరం .... 640

**18.** కళాసాహిత్యం .... 641

**19.** తెలుగు సినిమారంగ పరిణామం .... 649

**20.** చతుర్విధ అభినయాలు .... 661

అభినయం .... 663
సాత్వికాభినయం .... 664
వాచికాభినయం .... 670
ఆంగికాభినయం .... 679
సినిమా నాటకాలలో నటన .... 683
ఆహార్యం-వేషధారణ .... 687
మేకప్ .... 691

**21.** నటుడు .... 701

నటీనటులు .... 703
నటుని భావోద్రేకనటన .... 706
నటుని ఏకాగ్రత .... 709
నటుని తన్మయత్వం .... 711
నటుని జ్ఞాపకశక్తి .... 715

**22.** దర్శకుడు .... 716

దర్శకుడు .... 719

**23. నాటకసమాజం-ప్రదర్శనం బాధ్యతలు** .... 734

స్టేజిడైరెక్టరు .... 737
తెరలు సెట్టింగు .... 740
రంగప్రదీపనం .... 744
ప్రాంప్టర్ .... 748
రంగస్థలంమీద కదలికలు .... 750
ప్రవేశ నిష్క్రమణాలు .... 754
ప్రేక్షకులు-ప్రదర్శనం .... 756
వన్స్‌మోర్ దుష్ఫలితాలు .... 759
నాటకసమాజం సమష్టికృషి .... 761
సమాజ కార్యదర్శి .... 763

**24. ప్రదర్శనం-నాటక మందిరాలు** .... 769

నాటకప్రదర్శనం-పరిమాణం .... 774
ప్రదర్శన సమయాలు .... 776
నాటకమందిరాల్లో న్యాయపద్ధతులు .... 777
ప్రదర్శనం గేటులబాధ్యత .... 781
ప్రదర్శన అల్లరివ్యాపారం .... 784
బహిరంగ ప్రదర్శనశాల .... 786

**25. అనుబంధం** .... 789

తెలుగు నాటకరంగంపై రష్యా నాటకాలప్రభావం .... 791

**26. భారతీయ నాటకరంగ క్రమపరిణామం** .... 809

భారతీయ నాటక రంగ క్రమపరిణామం .... 811
హిందీ నాటక రంగం .... 820
తమిళ నాటక రంగం .... 827
కన్నడ నాటక రంగం .... 831
కేరళ నాటక రంగం .... 837
బెంగాలీ నాటక రంగం .... 840

| | | |
|---|---|---|
| మహారాష్ట్ర నాటక రంగం | .... | 845 |
| గుజరాతీ నాటక రంగం | .... | 848 |
| పంజాబు నాటక రంగం | .... | 849 |
| అస్సాం నాటక రంగం | .... | 850 |
| ఒరిస్సా నాటక రంగం | .... | 851 |
| 27. నా రచనకు తోడ్పడిన గ్రంథాలు | .... | 854 |





ఆంధ్రనాట్యరంగచరిత్ర

# 1

# నాట్యకథారంభం



కళ: దాని ప్రయోజనం - కళల ఉపయోగం - నాట్యకళారంభం - పురాణ పురుషులు: నాట్య కళ - నాట్యకళ ఎలా ఉద్భవించింది ?-నట రాజస్వామి-చెమ్నమోరిన చిదంబరక్షేత్రం



# కళ: దాని ప్రయోజనం

సంగీతమూ, సాహిత్యమూ, శిల్పమూ, నాట్యమూ కూడ అనాదినుండి ఆధునిక యుగంవరకూ ఆ యా కాలాల్లోని పరిణామాల ననుసరించీ, ఆ యా నాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ, వైజ్ఞానిక పరిస్థితుల ననుసరించీ వివిధరకాల మార్పులు పొందుతూ వస్తున్నాయి.



అసలు, నకలు :

కళ అనేది సృష్టితో కూడుకున్నది, కళాకారుడు ప్రకృతి మొదలు అన్ని పరికరాలనూ ఉపయోగిస్తాడు ఒక చిత్ర కారుడు ఒక పుష్పాన్ని చిత్రిస్తాడు. కాని అది నిజమైన పుష్పం కాదు. అది గుడ్డమీద వివిధ రంగులతో చిత్రించబడిన పువ్వు. అలాగే ప్రదర్శనంలో జరిగే నాటకం కూడ నిజమైన జీవితం కాదు. అసలు నిజమైన జీవితాన్ని నాటకరూపంలో ప్రదర్శించడంకూడ సరియైన కళ కాదు. అయితే ఏదో ఒక ఆశయంకొరకు మానవుడు తయారుచేసేది నిజమైన నాటం.

కళ, శిల్పం :

ఒక ప్రదర్శనంయొక్క లక్షణం కళ అయినప్పుడే ఒక ప్రదర్శన విధానం శిల్పమౌతుంది. ప్రదర్శనం యొక్క లక్షణం, శిల్పం రెండూ జోడించి నప్పుడే కళయొక్క విశిష్టత బయట పడుతుంది. కళను నిర్వచించడమంటే —ఒక ప్రదర్శనంద్వారా ఒక ప్రయోజనం సాధించడానికి అతి సులువైన మార్గం ఏదైతే వుందో అది శిల్పమనీ, ఆ శిల్పంవల్ల ఆ ప్రదర్శనానికి కల్గే లక్షణం కళ అనీ చెప్పుకోవచ్చు. పైన చెప్పుకున్నట్లు సంగీతం, సాహిత్యం, కళ ఈ మూడూ నాగరికత ప్రారంభమయిన నాటినుంచీ వాడుకలో వున్న శబ్దాలు. మానవుడు తన బుద్ధిని వుపయోగించి ప్రతి అభిప్రాయాన్నీ, ప్రతి వస్తువునూ పరీక్షించడానికి పై మూటిలో ఏదో వొకటి గీటురాయిగా వుంటి తీరుతుంది.

ఉదాహరణకు—భూమిలో రత్నాలు, సముద్రంలో ముత్యాలు, ప్రకృతిలో వృక్షాలు, ఖనిజాలు, పూలు, పక్షులు, భవనాలు, నక్షత్రాలు, చంద్రుడు, మేఘాలు ఇత్యాది ప్రకృతిసిద్ధమైన సంపత్తిని వుపయోగించటంలో పొందే ఆనందమే కళ. మానవ జీవితానికీ, జీవిత పురోభివృద్ధికీ, సంఘ పురోభివృద్ధికీ లలితకళలు గుండె కాయల్లాంటివి.

### మానవ జీవితం - లలితకళలు :

లలితకళలు లేకపోయినా జీవిత విధానాన్ని సాగించవచ్చు. అయితే తిన డానికీ, వుండడానికీ, కట్టడానికీ ఇంత వుండవచ్చు. కాని అది సరియైన జీవితం కాదు. అది కేవలం ఆనందం లేని జీవితమే అవుతుంది. పువ్వులు చెట్టుకు ఎంత అందా న్నిస్తాయో లలితకళలూ మానవజీవితాలకు అంత ఆనందా న్నిస్తాయి.

ఒక వస్తువు గొప్పతనాన్నీ దాని వుపయోగాన్నీ ప్రచారం చేయాలంటే కళ మంచి సాధనం. అలాగే జీవితాన్ని అభ్యుదయపథాన నడిపేందుకు కళ వజ్రాయుధం లాంటిది; సంఘంలో వున్న మాలిన్యాన్ని పోగొట్టటానికి మణిపూస లాంటిది.

### అవసరమూ, అభావమూ :

కళయొక్క ప్రయోజనాన్ని గూర్చి ఎంతైనా చర్చించవచ్చు. కాని కళను ప్రచారంలోకి తెచ్చే ప్రయోజకులైన కళావేత్తలకు నాగరికత, నీతి నియమాలు, విశిష్టత, యోగ్యతా వుండాలి. అయితే అలాంటి ఆదర్శానికి అనేకమంది కళాకారులు దూరమౌతున్నారు.

ఎప్పటికప్పుడు సంఘంలో వున్న పాత క్రొత్త పరిణామాన్ని పురస్కరించుకొని ముందుకు వెళితేనే కళయొక్క పవిత్రత బయటపడుతుంది.

### కళల నేటి స్థితి :

కళను ఈనాడు పేరు ప్రఖ్యాతులకూ, ధన సంపాదనకూ వుపయోగించ డమేగాని సంఘ పురోభివృద్ధికీ, ప్రజా సేవకూ ఏమాత్రం వుపయోగపరచడం లేదు.

సందేశంలేని కృత్రిమకళను చూచి ఆనందించేవాళ్ళూ, కళను స్వార్థంకొరకు వినియోగించుకునే పెద్ద మనుషులూ, కళద్వారా ప్రజలను మోసపుచ్చి డబ్బును

దోపిడీచేసే దగాకోరులూ. కళ అనే ముసుగుచాటున 'కళ కళకోసమే' అనే విచిత్రమైన ప్రచారం చేసేవారూ ప్రత్యక్షంగా కనబడుతూనే వున్నారు. కళాకారుడు ఎంత గొప్పవాడైనా దీక్ష అనేది వుండాలి. దీక్ష లేక ప్రజాహృదయాలను చూరగొనలేక పోయినట్లయితే ఆ వ్యక్తి ఎంత గొప్పవాడైనా ప్రయోజనమేముంది?

నేటి కళాకారుల్లో అనేకమందికి విశాలభావాలు సున్న. ఇలాంటి స్థితిలో ఏ కళలైనా ఎలా రాణిస్తాయి? కళాకారులలో ఈర్ష్యాభావాలు ఏనాడు దూరమౌతాయో ఆనాడే కళకు ఉన్నతస్థానం ప్రాప్తిస్తుంది.

### ఏటికెదురీత:

కళాకారులు కొంతమంది వుత్తససానాన్ని సంపాదించినా దానిని సంఘ సౌభాగ్యానికి వ్యతిరేకంగా ప్రయోగిస్తున్నారు. కళాకారుడనేవాడు తన కళావిష్టతను ప్రజల మధ్య పెట్టకపోయాడో వాడు మూగవాడితో సమానమే!

### 'పదండి ముందుకు':

మానవుడు ఎప్పుడూ అభివృద్ధిని కోరుతున్నాడు. ఆ అభివృద్ధే మార్పు.

ఎప్పుడూ పాతను పగలగొట్టి, కొత్తకోసం పురోగమించాలి. సంఘానికి వ్యతిరేకంగా నడిచే శక్తుల్ని చీల్చుకుని పురోభివృద్ధికి పాటుపడాలి.

పైన చర్చించిన లలితకళలన్నిటినీ 'విలాసంకొరకే కళ' అనిగాని, 'కళ కొరకే కళ' అనిగాని అనుకుంటే అవి ప్రజాసామాన్యానికి దూరమై రాజదర్బారుల్లోనే వుంటాయి.

### గుడ్డిద్వేషం కూడదు:

కళావిహీనమైయున్న సంఘంలో ఎవరైనా ఏవైనా కళలను కళాకారుల యొక్క, కళ యొక్క స్వభావాన్ని చూచి, మంచిని చూడకుండా, గుడ్డిద్వేషంతో చెడుగా చూడటంవల్ల తర్క-వితర్కాలతో కళ మలినపడుతుంది.

### కళ అంటే?:

కళ అంటే కేవలం మానవునిలో వున్న సౌందర్య తృష్ణను తృప్తిపరచడమే అని పాశ్చాత్యులలో కొంతమంది మేధావుల నిర్వచనం. కాని సౌందర్యం

అంచే దానికి ఏవైనా హద్దు లున్నాయా? కాలక్రమేణా మార్పులు సంభవిస్తున్నాయి గదా! మానవుల అభిరుచులూ, నాగరికతలూ మారుతున్నాయి గదా!

మరి కొంతమంది కళ కళకోసం కాదనీ, కళ మానవుల విజ్ఞానాన్ని పెంపొందజేసేదనీ, కళ ప్రజాజీవితాలను తీర్చి దిద్దుతుందనీ, ఈనాటి విజ్ఞాన నాగరికతాభివృద్ధికి కళలే ప్రాతిపదికలనీ ప్రకటించారు.

## కళ ఇత్యర్థం:

ఏది ఏమైనా ప్రపంచంలోని అభ్యుదయకాములైన రచయితలు. కథకులు, గాయకులు, శిల్పులు, చిత్రకారులు, నటకులు—అనేకమంది మేధావులు కళా నిర్వచనం చేశారు. కళ కళకోసం కాదనీ, అది మానవజీవితాలను తీర్చిదిద్ది, వారి సౌఖ్యాలకొరకు, నైతిక విలువలకు ప్రాతినిధ్యం వహిస్తుందనీ ఏకగ్రీవంగా నిర్వచించారు. ప్రతి నిమిషమూ, ప్రతివ్యక్తి జీవితాన్నీ కళ అంటిపెట్టుకునే నడుస్తూంది.

కళ అనేది ప్రజలకు చెందిన ఆస్తి. అది గనిలోనుండి తీసిన బంగారం. అది ప్రజల హృదయకుహరాల్లో నాటుకుపోయి వారి అభ్యుదయానికి మార్గదర్శకం కావాలని ఎంతో మంది మహామహులు నిర్వచించారు, ప్రతి మానవునికీ సిద్ధాంతరీత్యా కళా ప్రయోజనమేమిటో తెలియకపోయినా ప్రతివ్యక్తీ కళా ప్రయోజనాన్ని పొందుతూనే వున్నాడు. కళ కళకోసమేనని గాని, కళ లెవరికోసమని గాని, కళ లవసరం లేదని గాని మొదలైన వాగ్వివాదాలకు తావే లేదు.

## ఏది కళ?:

ఒక పనిని నిపుణత్వంతోటీ, కౌశల్యంతోటీ చేయడమే కళ. ప్రకృతిలో వున్న ముడి పదార్థాలన్నింటినీ శోభావంతంగానూ, ప్రతిభావంతంగానూ తయారు చేయడమే కళ.

దీపాన్ని ముంగిట పెట్టుకొని చీకట్లో వున్నామనుకోవడం ఎంత వెఱ్ఱితనమో కళకు, మానవులకు సంబంధం లేదనుకోవడం అటువంటిదే. మానవుడు ప్రతిక్షణమూ అద్భుత పరిణామాలను సృష్టిస్తున్నాడు. కొత్త కొత్త విషయాలను కనిపెడుతున్నాడు. ఈనాడు మనం వుత్తమ జీవితాలను వుత్తమ కళాఖండాలైన శిల్పాలను, సంగీతాన్ని, నాట్యాన్ని, సాహిత్యాన్ని, చిత్రాలను చూస్తున్నాం. ఇవి అన్నీ జీవితరమణీయాలు. సంగీతం మనిషిని ఆకర్షిస్తుంది; ఉల్లాసాన్ని, ఆనందాన్ని ఇస్తుంది.

కళారూపాలు :

ఇలాంటి కళలు మానవుణ్ణి అభివృద్ధి పరుస్తాయి. ఇవి మానవుని మేధాశక్తిని పెంచుతాయి కాని ఆలోచనాశక్తిని నాశనం చేయవు. ఈనాడు మనం చూస్తున్న ఆనాటి ప్రాచీన జానపద కళారూపాలైన బుట్టకథలు, తోలుబొమ్మలాటలు, పిఠి భాగవతాలు, జక్కుల కథలు, కోతలపాటలు, తుమ్మెద పాటలు, జానపద నృత్యాలు మొదలైన కళారూపాలన్నీ అన్ని కాలాల్లోనూ, అందరి జీవితాల్లోనూ మూర్తీభవించి వృద్ధిపొందాయి. ఇటువంటి కళను కొందరు బూటకంతో స్వార్థాల కుపయోగించుకుంటున్నారు.

ఉమ్మడి సొత్తు :

కళ ఒకప్పుడు ఆస్తికుల ప్రచారానికి వుపయోగపడి వుండవచ్చు. కాని అది ప్రజలందరి సొత్తు అయినప్పుడు, కళారూపాలు సంఘదృష్టితో తయారు చేయనప్పుడు, వాటికి నాగరికతా ప్రబోధం కలిగించే శక్తి వున్నప్పుడు ఆ కళలు అనుసరణీయాలే. అవి అందరి సొత్తూ అయినప్పుడు వాటి అనుభవాలూ, అనుభూతులూ అన్నీ మనవే.

---

# కళల ఉపయోగం

మానవుడు బొమ్మలు గీస్తున్నాడు, పాటలు కడుతున్నాడు, నాటకాలు తయారు చేస్తున్నాడు; ప్రయోగపూర్వకంగా ఆడిస్తూనూ ఉన్నాడు. ఇదంతా కేవలం ఆనందం కొరకేగాక, అందువల్ల ప్రతిఫలాన్నీ కూడా పొందుతూ వున్నాడు.



ప్రారంభదశలో లలిత కళలన్నీ ప్రధానంగా మానవుని వుపయోగంకోసమే తయారు చేసుకొనేవాళ్ళు. ఆదిమదశలో చెక్కడంకాని, బొమ్మలు గీయడంకాని వర్ణం కురిసేందుకూ, పంటలు బాగా పండేందుకూ ఉపయోగించుకున్నారు. ఇంతేకాకుండా, పురాతనకళ సందేశాలను తెలియజేసేటందుకూ ఉపయోగపడింది. ఇళ్ళకు తిరిగివచ్చే వేటగాళ్ళు వాళ్ళు ఏ యే జంతువులను ఎంతెంత ధైర్యంతో

జయించారో. ఆ వైనాన్ని, ఆ సందర్భంలో ఆయా జంతువుల భయంకర విన్యాసాలనూ పాటలూ ఆటలలో ఇతర ప్రజలకు తెలియజేసేవారు.

ఈనాడు నవలలూ, నాటకాలూ, సినిమాలద్వారా జీవితంలోని ఎన్నో విషయాలను గూర్చి తెలుసుకుంటున్నాం. సర్వసాధారణంగా ప్రజాబాహుళ్యానికి విజ్ఞానప్రబోధ మిచ్చేది వుత్తమ నాటకంగా పరిగణింపబడుతుంది.

అక్కరతోపాటు ఆనందం :

కళ అనేది కేవలం ఉపయోగకరమే కాదు. అందులో ఆనందంకూడా ఇమిడి వుంది. ఒక విషయాన్ని తెలుసుకోవడం, తెలుసుకున్నదాన్ని అర్థంచేసుకోవడం కూడా ఆనందమే. అలా తెలుసుకున్న విజ్ఞానాన్ని - తాను అర్థం చేసుకున్నదాన్ని కళాకారుడు ఇతరులకు తెలియజేయడానికి ఒక నాటకాన్ని తయారుచేస్తాడు. అలా నాటకాన్ని తయారుచేయడమే ఒక ఆనందం. అతని ప్రేక్షకులు కూడా ఆ నాటకం ద్వారా ఆనందాన్నే కాక విజ్ఞానాన్ని కూడ పొందుతారు.

కళ, సందేశం :

నాటకాలలోగాని, చిత్రాలలోగాని ప్రజోపయోగకరమైనవి చాలా తక్కువ వున్నాయి. నాటక ప్రదర్శనంలో భాషా ప్రయోగంవల్ల ఆ నాటకం ఇచ్చే సందేశాన్ని మనం తెలుసుకోగలుగుతాం. అదే అత్యంత ప్రమాదమైన విషయం, నాటక ప్రదర్శనం. నాటక సందేశాన్ని తెలియజేయకపోతే అది అభినందించ గలిగిన నాటకం కాదు.

కళ, సంక్షిప్తం :

తక్కువ శ్రమతో, తక్కువ వస్తువులతో తయారుచేయబడేదే నిజమైన కళ. అది కవి అనుకున్న ఉద్దేశాన్ని ప్రజల కందించేందుకు అవసరమైన దానికంటే అదనంగా ఏ ప్రయోజనాన్ని పొందదు. నటుడు తెరమరుగున ఎంత కష్టపడి రిహార్సల్సు చేసిందీ కనిపించనీక ప్రదర్శనంలో చాలా సులువుగా చేసినట్లు కన బడతాడు. అంటే నటుడు ఆ నటనకు (రిహార్సల్సు ద్వారా) ఎంత కష్టపడిందీ.

ప్రేక్షకులకు ఏమీ తెలియదు. ఇలా తేలిక పద్ధతులలో ఒక గొప్ప విషయాన్ని తెలియజేయడమే అత్యుత్తమ కళ.

ఒక్క పద్యంకాని, ఒక్క వాక్యంకాని, ఒక్క కదలికగాని వృథాగా వుపయోగింపబడవు.

కళ, శిక్షణ :

జీవితంలో ప్రధానంగా క్రమశిక్షణను కనిపెట్టేవాడే కళాకారుడు. జీవితంలో వుండేటటువంటి శిక్షణను తెలియజేసే నటనకు తన కళలో ఒక క్రమశిక్షణను కళాకారుడు సృష్టించాలి. అన్ని అంశాల కలయిక ఎప్పుడైతే చక్కగా సమకూరుతుందో అప్పుడే అది ఎంతో ఆనందాన్ని, తృప్తిని కలిగిస్తుంది.

కళ, గమనం :

మానవుడు చాలాకాలం క్రితం తనలో తనూ, తన ప్రపంచం చుట్టూనూ కొన్ని అవినాభావసూత్రాలను తెలుసుకోగలిగాడు. వీటినే తన కళలో తగిన కలయిక ద్వారా పొందగలిగాడు. అన్నిటికంటే ముఖ్యమైనది గమనం. ఉదాహరణకు నాడీ, శ్వాస, రాత్రి, పగలు, ఋతువుల మార్పు, పుట్టుక, చావు మొదలైనవన్నీ మనకు బహిరంగంగా కనబడే సత్యాలు.

ఇక తనలో వుండేవి రెండు కళ్ళు, రెండు చెవులూ. అలాగే వృక్షాల్లో, మొక్కల్లో, ఇసుక రేణువుల్లోనూ గమనం వుంది. జీవితంలో అవినాభావ సూత్రాలకు గమనం ఎంత ముఖ్యమో కళలో కూడా అది అంత ముఖ్యమే. పద్యాల్లో, పాటల్లో గమనం వుండడం సత్యం. అయితే వచనానికికూడ గమనం వుంది. ఇది నాటక ప్రదర్శనంలో చాలాముఖ్యం. ముఖ్యంగా కదలికలో, నటుని మాటల్లో, వెలిగే లైట్లలో, రంగుల్లో, సెట్టుల్లోనూ గమనం వుంది.

కళ, పరిమాణం :

ఒక మనిషి నిలబడగలుగుతున్నాడు. ఎందువల్లనంటే, తాను నిలబడాలనే నిర్ణయం నరాలద్వారా కండరాలకు తెలియజేయబడి మనిషిని పడిపోనివ్వకుండా నిలబెడుతుంది. ఇదే పరిమాణం. ఆ పరిమాణాన్ని పోగొట్టుకున్న మనిషి నేలమీద

పడిపోతాడు. కళలో పరిమాణం అనే విషయాన్ని దృశ్య రూపంలో అమలు జరుపుతాం. ఒక చిత్రంలో కొన్ని వస్తువులు ఒకప్రక్క నున్నపుడు, అదేమాదిరి రెండవ ప్రక్కను మరికొన్ని వస్తువులు తగు పరిమాణంలో వున్నట్లయితే దీనినే కలయిక (సిమ్మె టీ) అంటారు. ఈ సిమ్మెట్రీకి చలనంలేదు కాబట్టి అది మనలను విసిగించేందుకు అవకాశముంది.

ఒక పొట్టి మనిషికి పెద్ద తలకాయ వుంటే ఇది సరియైన ప్రొపోర్షన్‌లో లేదంటాం. అలాగే ఒక బల్ల ఎక్కువ పొడవు వుండి వెడల్పు కొద్ది వుంటే దానినీ అలాగే అంటాం. ఈ విధంగా కనిపించే వస్తువులు కొన్ని మన కంటికి ఇంపుగా వుండవు. అలాగే నాటక నిర్మాణంలో కనబడే వస్తువుల్ని సమైక్యంచేసే సూత్రం చాలా ముఖ్యమైంది.

అలాగే రంగస్థలంలో ఒక నటునికీ, మరో నటునికీ వుండవలసిన ప్రొపోర్షను, నటునికి ఆ రంగస్థలం మీదనున్న పరికరాలకు వుండవలసిన సమన్వయం, అలాగే రంగస్థలంలో వున్న పరికరాలకూ, నిర్మించిన సెట్టుకూ వుండవలసిన అవినాభావ సంబంధమూ, ఇవి అన్నీ సరిగా వున్నప్పుడే రంగస్థలం చక్కని కలయికతో కనులపండువుగా కనిపిస్తుంది.

### కళ, సమానత :

కళలో ఎప్పుడూ సమానత వుండాలి. ఒక గొంతుకూ మరో గొంతుకూ, ఒక రంగుకూ మరో రంగుకూ వుంటేటటువంటి సమన్వయమే సమానత. ఉచ్చారణకు రెండు గొంతులు ఒక శ్రుతిలో చేరనప్పుడు, ఆ శబ్దం చెవికి చాలా కటువుగా వుంటుంది. అలాగే రంగుల్లోకూడా ఒక రంగుకూ మరో రంగుకూ అవినాభావ సంబంధం వుండాలి. అలాగే సెట్టింగుల్లోనూ, లైటుల్లోనూ సమానత, సమన్వయం వున్నప్పుడే నాటక ప్రదర్శనం విజయవంత మౌతుంది.

### కళ, ధ్రువీకరణ :

ఒక వస్తుసమూహాన్ని చూడాలనుకున్నప్పుడు ఆ వస్తువులలోకెల్లా ఆకర్షణ కలిగినదేదో దానిని తెలుసుకోవాలి.

గోడమీద నున్న పది బొమ్మల పోస్టర్లలో మన కంటిని ఏదోవొక బొమ్మ మాత్రమే ఆకర్షిస్తుంది. దానినే మనం చూస్తాం. మిగతా పోస్టర్లన్నీ అముఖ్యమై

పోతాయి. అలాంటి ఆకర్షణ కొరకే మనం ప్రయత్నించాలి. ఒక శబ్దాన్ని ఒక లయలో ఒకే విధంగా ఒక నగారామీద కొట్టినట్లయితే, ఆ శబ్దం ఎక్కువకాలం మనని ఆకర్షించదు.

అదే మరో విధంగా నెమ్మదిగా క్రమేపీ ఎక్కువ చేస్తూన్న శబ్దాన్ని నెమ్మదిగా తగ్గించి మరలా తగ్గించి పూర్తిగా ఆగిపోయేట్లయితే, మొదటి శబ్దంకంటే ఇది ఎంతో ఆకర్షిస్తుంది. కనుక మనం చెప్పదలచుకున్న మాటగాని, పాటగాని, చిత్రంగాని, నాటకంగాని ధ్రువపరిచేదిగా వుండాలి.

---

# నాట్య కళారంభం

అనగనగా ఒకప్పుడు :

కొన్నివేల సంవత్సరాలనాడు భూమి అంతా సూర్యునివేడికి కాలిపోయి ఆకాశమంతా ప్రచండ స్వరూపంతో నిండిపోయింది. ఎక్కడ చూచినా వర్షం లేదు. పశువులూ, పక్షులూ మలమల మాడిపోతున్నాయి. అడవులన్నీ దగ్ధమైపోతున్నాయి. అడవి మనుష్యుల గుంపులన్నీ తల్లడిల్లిపోతున్నాయి, అడవులు వదలి బయటికి వచ్చారు.



సూర్య భగవానుడు :

సూర్యునివేడి వాళ్ళసుకూడా వెంటాడింది. తాళలేకపోయారు.

సూర్యునివల్ల భయంతో కూడిన భక్తిభావం ఏర్పడింది. చేతులు జోడించి నమస్కారాలు చేశారు. సూర్యుణ్ణి ఒక దైవంగానూ, దేవతగానూ భావించి ఆరాధించారు.

వరుణ భగవానుడు :

ఏ విధంగా ఇలా కొందరు సూర్యునివేడికి తట్టుకోలేకపోయారో అలాగే మరో గుంపు ఆకలికి తట్టుకోలేక పోయింది. ఈ ఆకలి దప్పులను ఎలా తీర్చుకోవాలిః ఏమీ పాలుపోలేదు. ఆకాశమంతటా చల్లని గాలులతో మేఘాలు వర్షించాయి. ప్రకృతి మాత చల్లబడుతోంది. ఒక ప్రక్కనుండి మెరుపులు, రెండవ ప్రక్కనుంచి

ఉరుములూ, పిడుగులతో వర్షం కురవ నారంభించింది. ఎండతో మండిపోయే గుంపుకు కొంచెం శాంతి లభించింది. భూమి అంతా తడిసిపోయింది. అందరి దాహం తీరింది. పక్షులూ, జంతువులూ, క్రిమి కీటకాదులూ శబ్దాలు మొదలెట్టాయి. విత్తనాలన్నీ స్వాతివానకు ముత్యపు చిప్పల్లాగా తెరుచుకున్నాయి. దశదిశలా ఆనందం తొణికిసలాడింది. ఇది గుంపులోని వారికి ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. అంతవరకూ సూర్యునివేడిలో క్రుగ్గిన వారందరూ ఈ వర్షంవల్ల 'ఓ జల దేవతా, నీవు మాకు మహోపకారం చేశా'వని వరుణదేవునికి సాగిలపడి క్రొక్కారు.

సూర్యునివేడితో క్రుగ్గినవారు జలదేవతతో ధన్యులయ్యారు.

ప్రకృతి దేవత:

కాని ఆకలి తీరలేదు. వర్షం కురిసింది. ఏ ప్రక్కచూచినా కొండవాగులూ, నదీప్రవాహాలూ మొత్తంగా ప్రవహించి భూమిమీద అక్కడక్కడ సరస్సులు ఏర్పడ్డాయి. పచ్చబడిన భూమి పైరుల్ని పెంచుతోంది. పగిలివిచ్చిన విత్తనాలద్వారా పండి ఒరిగిన చెట్లభారాన్ని భూమి భరిస్తోంది. ఎటుచూచినా పండ్లవాసనలు, పక్షుల కిలకిలారవాలు: ఆకలిదప్పులతో అలమటిస్తున్న అడవి గుంపులకు ఆహారం దొరికింది. ఆకలి తీరింది. 'అమ్మయ్య' అన్నారు. వీనికంతకూ కారణం ప్రకృతి అనుకున్నారు. ప్రకృతినే దైవంగా పూజించారు.

పూజలూ, పురస్కారాలూ:

ఒక గుంపువారు సూర్యుడే భగవంతుడన్నారు. మరో గుంపు వర్షాన్ని జల దేవతగా చిత్రించారు. ఇంకో గుంపు ప్రకృతిమాతనే పూజించారు. ఇలా సంతోషాన్ని పట్టలేక ఎవరినోటికి వచ్చిన పదాలను వారు సమకూర్చారు. గొంతెత్తి పాడారు. అవయవాలన్నీ చలించాయి. స్త్రీలూ, పురుషులూ సమిష్టిగా పాటలు పాడి ఆడ నారంభించారు. స్త్రీలు పుష్పాలను తీసుకున్నారు. పురుషులు కంద మూలాల్ని తీసుకున్నారు. వారి వారి దేవతలకు నైవేద్యాలను చెల్లించారు. వారి సంతోషాన్ని, తృప్తినీ, విజయాన్ని పాటలతో, నృత్యంతో వెల్లడిచేసి ఆనాడే అడవిజాతి నాట్య బీజాలను నాటారు.

కడుపు కూటికై కాట్లాటలు:

ఆనాడు అటవికులకు ప్రతినిత్యం ఆహార సమస్య ఘోరంగా వుండేది. వారికి పంటలు లేవు. ఎలా పండించాలో తెలియదు. నాగలికొయ్య ఆనాటి కింకా

పుట్టలేదు. వారు అడవిలో ప్రమ్గిన పండ్లనూ, దుంపలనూ, జంతువుల పచ్చి మాంసాన్ని తినేవారు. ఇలా వారు ఆహారంకొరకు గుంపులు గుంపులుగా బయలు దేరి సమిష్టిగా ఆహారాన్ని సాధించేవారు.

కాల్లాటల్లోనే ఆట్లాటలు :

ఈ ఆహార సాధనలో గుంపుల మధ్య కలహాలు వచ్చి ఒకరినొకరు జయించు కునేవారు. ఈ దండయాత్రల్లో భీకరమైన కేకలూ, గంతులూ, వీర నృత్యాలూ చేసేవారు. జయించిన తరువాత విజయము ఆ ఆనందంతో గంతులు వేసేవారు.

అంతేకాక వారు వివాహాది శుభకార్యాల్లోనూ తమ సంతోష చిహ్నంగా గంతులు వేసేవారు. నోటికి వచ్చిన కవితతో ఇష్టం వచ్చినట్లు పాటలు పాడేవారు.

ఈ విధంగా ప్రాచీన మానవజాతులు నృత్యం, గీతం, అభినయాలతో కాలం వెళ్ళబుచ్చేవారు. ఇందులో కొంతమంది తన్మయీభావంతో నిపుణత్వాన్ని ప్రదర్శించే వారు. నిపుణులు ప్రత్యేకంగా వరుసలుతీరి, వరుసక్రమంలో ఒక నాయకుని చెప్పు చేతలలో రకరకాల నాట్య వరుసల్నీ, ఫణతుల్నీ, అభినయాన్నీ నిర్ణయించేవారు.

క్రమానుగతంగా కాలం మారినకొద్దీ మానవుడు విజ్ఞానం పొందుతూ వచ్చాడు. వేషభాషల్లో మార్పు రాసాగింది. వారు ఇదివరకు అనుకునే దేవతాది అతీత శక్తులు క్రూర స్వభావాలు కలవి కావనీ, అవి మానవుల, లక్షలకొలదీ జీవ రాసుల రక్షణకొరకే వచ్చిన శక్తులనీ భావించసాగారు. ఎంతో భక్తితో 'ఎల్ల కాలం మమ్ము కాపాడా'లని ఆరాధిస్తూ, భక్తిమయమైన గీతాలు, నృత్యాలు, భజనలు, అభినయాలతో స్త్రీ, పురుషులు కలిసి తమ సంతోషాన్ని దేవతలకు తెలియజేసేవారు. తమతమ బిడ్డలు, పశువులు, పంటలు బాగుండాలనీ, వాటిని కాపాడే శక్తులు మీరేనని దేవతలను స్తుతించేవారు.

జీవికకై నృత్యగానాలు :

చల్లటి గాలుల్లో విహరించేటప్పుడు ఒడలు పొంగి ప్రకృతిమాత ఒడిలో నిద్ర పోతూ మైమరచి పాటలు పాడేవారు. పండు వెన్నెలలో సుందరమైన రాత్రి శ్యను చూచి, స్త్రీలూ, పురుషులూ పాటలుపాడి నృత్యాలు చేసేవారు. వర్షం రాక

పోయినట యితే అనేక రకాల వాద్యాలతో భూ నభోంతరాళాలు దద్దరిల్లి పోయే టట్లు పాటలు, ఆటలు, కేకలతో వుత్సవాలు చేసేవారు. క్రూర మృగాల బారి నుండి రక్షించుకోడానికి ఆ మృగాల వేషధారణతో, వాటి అరుపులతో, వాటి అభినయంతో, కదలికలతో వెళ్ళి వాటిని సంహరించి, వాటి మాంసాన్ని తెచ్చుకునేవారు. ఈ విధంగా అప్పటివారు జీవికం కొరకు నృత్య గానాలను నేర్చుకునేవారు.

## నాటకాలకు పునాదులు :

దేవతలను పొగుడుతూ వారి గుణగణాలను కథలుగాను, పాటలుగాను వ్రాసి, పాత్రలను సృష్టించి, ఒకడు ప్రధానుడై, సూత్రధారుడై మిగిలిన వారిని నడిపిస్తూ కార్యక్రమం నడుపుట వాడుకయింది. ఈ పద్ధతి ఎప్పుడైతే వచ్చిందో ప్రతి ఒక్కడూ తాను అభినయించబోయే పాత్రను బాగా పోషించటానికి అనేక రకాల కృషిచేసి ఒక రూపానికి తీసుకువచ్చి వారి వారి గుంపులలో ప్రదర్శనలు ఇస్తూ వుండేవాళ్ళు.

ఈ సందర్భాలలో పై విధమైన కార్యక్రమాలు జరిగేటప్పుడు ప్రేక్షకులు పరాకుగా వుండకుండా మధ్య మధ్య హాస్యాన్ని పురికొల్పుతూ ఆనందంకొరకు గానాన్నీ, మనుషుల నుత్తేజపరచటానికి వీరనృత్యాలనూ, హృదయాలను కరగించ డానికి శోకరసాన్నీ, యువతీ యువకుల ఆనందంకొరకు శృంగార రసాన్నీ ఎన్ను కుని నాట్యకళకు ఆదిమవాసులు ఆనాడే పునాదులు వేశారు. దేవతారాధనలోను, వుత్సవాలలోను చాలావరకు ప్రాచీన నాటకా లాడబడుతుండేవి. నాటకాలన్నీ పురా ణాలకు సంబంధించినవే. ఆదేవు విధంగా ణ్ణిగూర్చి, దేవతలనుగూర్చి ఆనాడు ప్రజలలో ప్రచారం జరిపేవాళ్ళు.

ఆనాటి ఆటవికులు శత్రువులమీద దాడి జరపాలనుకున్నప్పుడు, శత్రువు లను రాక్షసులుగా చిత్రించేవాళ్ళు. వాళ్ళు చేసే హింసాకాండను కళ్ళకు కట్టినట్లు చూపేవాళ్ళు. వాళ్ళకు పది తలలున్నాయనీ, ఇరవై చేతులున్నాయనీ, జంతువుల కున్నట్లు కోరలు, కోడిగ్రుడ్లంత కండ్లు మొదలైన వికృతాకారాలను నాటక రూపాల్లో చూపించి ప్రజలను సమీకరించేవాళ్ళు.

## తొలి మానవసంఘం:

ప్రథమంలో మానవుడు అడవుల్లో చెట్లపై కోతివలె నివాసమేర్పరుచుకుని, స్త్రీ పురుషులు ఎవరి నిలయాలలో వారు నివసిస్తూండేవారు. ఈ విధంగా విడివడి కలుసుకున్న కుటుంబాలే మానవకుటుంబం. ఇదే తొలి మానవసంఘం. పశువులను సాధుపరచి భూములు సాగుచేసి అడవులు భేదించి కుటీరాలను నిర్మించి నదీకాసార ప్రాంతాల గ్రామాలు నిర్మించి, గ్రామం మధ్యలో ఒక పెద్ద దిబ్బవేర్చి ఒక చెట్టును నాటిగాని, ఒక దేవుని మూర్తి స్థాపించిగాని గ్రామ ప్రజలందరూ ఆరాధనలు, పాటలు, భజనలు, నృత్యాలు, నాటకాలు జరుపుతూ వచ్చారు.

ప్రకృతిలో ప్రతి మనిషికీ, ప్రతి జంతువుకీ గెంతడం, త్రుళ్ళడం, పాడడం, సంతోషించడం, శృంగారించుకోవడం, బాధపడడం మొదలైన సహజ గుణాలున్నాయి. మాట లేకపోయినప్పటికీ అవికూడ దెబ్బ తగిలితే బాధపడుతాయి. ఏడుస్తాయి. మంచి ఆహారం దొరికితే సంతోష పడుతాయి. వర్షం వచ్చేముందు చల్లగాలికి ఎగిరి గంతులేస్తాయి. ఇదే విధంగా ప్రతి మనిషి ఈ లక్షణాలను కలిగి యున్నాడు. మనిషికి సంతోషం కలిగినప్పుడు ఎంతో మందహాసం కనబడుతుంది. అందులోనే కళ ఇమిడివుంది. కళ అనేది ఒక ప్రత్యేక పదార్థం కాదు. ఇది కళ అనికూడ మానవునికి తెలియదు. ఇట్లే కోపం కలిగినప్పుడు ప్రతిఒక్క అవయవమూ, కండ్లూ, ముఖమూ కంపించిపోతాయి. చిహ్నాలు ఎంతో గంభీరంగా వుంటాయి. ఆ ఆకారాన్ని ఇతరులు చూచినప్పుడు ఎంతో భీతి కలుగుతుంది. అతనికి తెలియకుండానే అందులో కళ ఇమిడివుంది. కాని కావాలనుకున్నప్పుడు ఆ కోపం తెప్పించలేదు. నటించలేక పోవచ్చు. సహజంగా అతనిలో వుద్రేకం కలిగినప్పుడే ఆ చిత్రాన్ని మనం చూడగలుగుతాం. సంతోషం, బాధ, క్రోధం, శత్రుత్వం మానవునికి సహజ గుణాలని పైనే తెలుసుకోగలిగాం. ఈ గుణాలను కళా రూపంలో అభివృద్ధి పొందించాలంటే పైవాటి నన్నిటిని అవగాహన చేసుకుని జీర్ణం చేసుకున్నప్పుడే అది సాధ్యమవుతుంది.

## భావయుతమైన నటన:

ఆదిమ సమాజపు మనుష్యులు జంతు సమానులుగా వుండేవారని తెలుసుకున్నాం అడవులలోనే వాళ్ళ నివాసం అవడంవల్ల వారు జంతువులలాగానే నటించే

వారు. అరుపులు, నడకలు, కూతలు, పోట్లాటలు, గర్జనలు, జంతు విన్యాసాలు జరిగేవి. ఇది చూచే మానవుడు భావయుతమైన నటన మొదలు పెట్టాడు.

### నాగ నృత్యం:

భావాన్నిబట్టి నటన సృష్టిలోనే వుంది. పాము వచ్చింది, పరుగెత్తింది, పడగ విప్పింది, మెలికలు తిరిగింది, కాటు వేసింది. ఈ నటనను చూపించాలంటే పాము ఆడటం చూడాలి. దాని అభినయం చెయ్యాలి. మనిషి మెలికలు తిరిగి పోవాలి, కాటుతిన్న మనిషిమాదిరి కండ్లలోను, ముఖంలోను అభినయాన్ని చూపించాలి. దీనినే నాగనృత్యంగా పేర్కొన్నారు.

### మయూర నృత్యం:

వేమకటి రోజుల్లోనేకాక ఈ నాటికీ, మనం అడవులకు వెళ్ళి చూచినట్లయితే, జంతు నాట్యాలు ఎన్నో చూడగలుగుతాం. వాటిలో కూతకు రాజు కోవెల అని ఈనాటికీ చెప్పుకుంటున్నాం. అలాగే నృత్యంలో నెమలి నృత్యం చూడదగింది. పించం విప్పి అది త్రొక్కే నృత్యం మనల నెంతో ఉత్తేజపరుస్తుంది, ఆనందపరుస్తుంది. దాని కూతకూడ వినదగిందే. మేఘాలు పట్టినపుడూ, చల్లని గాలులు వీచేటప్పుడూ ఒడలు పొంగి అది పించాన్ని విప్పి మందహాసంతో నాట్యం చేస్తుంది.

అదే విధంగా మనిషి చేతులతో, నడుముతో, ముఖ భావాలతోనే ఆ వృత్యాన్ని చేస్తున్నాడు. ఇది ప్రత్యేకంగా నెమలిని చూచి నేర్చుకున్నదే. ఇదే జంతువుల అనుకరణ. దీనికే భరతనాట్య ప్రముఖులు మయూర నృత్యం అని నామకరణం చేశారు.

ఈ నృత్యాలు చేయాలంటే ఎంతో శరీరసాధన వుండాలి. అవయవాల స్వాధీనత వుండాలి. ఎంతో ముఖ వికాసం వుండాలి. ఇలా ఒకదానికొకటికి అవినాభావ సంబంధమున్నప్పుడే నృత్యంలో రమ్యత కనబడుతుంది. ఇటువంటి వృత్యాలు శాస్త్రయుక్తంగాను, భావయుక్తంగాను భరతనాట్య శాస్త్రం తెలిసివారే చక్కగా చేయగలుగుతారు. వారే గరుడనృత్యం, సింహనృత్యం,

మయూర నృత్యం, నాగ నృత్యం, ఇలాంటివి ఎంతో అద్భుతంగా నటిస్తారు. దీనినే భావయుత నటన అంటారు.

భూత నటన:

ఈ నటన దేవతల్ని సంతోష పెట్టడానికి ఏర్పడింది. దుష్ట భూతాలను తృప్తిపరచడానికీ, అంటు జాడ్యాల నిర్మూలన కోసం, వర్షం కోసం, పంటలకోసం, పశువులకోసం ఆనాటినుంచి ఈనాటివరకు ఈ భూత నటన సాగుతూనే వుంది. గ్రామాలలో అమ్మవారి జాతర్లప్పుడు, దేవుళ్ళ వుత్సవాలలో, భజనలయందూ స్త్రీలు, పురుషులు, పిల్లలు అందరూ కలిసి ఎంతో చిత్రవిచిత్రంగా ఆటల్లో, పాటల్లో పాల్గొంటారు. ఎంతో తన్మయత్వంతో, ఒక నిండు నమ్మకంతో, వుత్సాహోద్రేకాలతో పాత్రలో లీనమై నటిస్తారు. ఇది ఎంతో స్వభావసిద్ధంగావుంటుంది. కారణం: వాళ్ళు ఒక ఫలితాన్ని ఆసిస్తున్నారుగనుక, వారు దానికి అంకితమై పోతారు. వర్షం కురవాలని నాట్యాలు, వుత్సవాలు జరుపుతారు. ఆ నృత్యంలో ఒక ఆవేశం వుంటుంది. అందువలననే దీనిని భూత నటన అన్నారు పెద్దలు. ఈ భూత నటన మానవుని అజ్ఞాన దశను సూచిస్తుంది. ఇది ఈ నాటికీ పాటక జనంలో ప్రచారంలో వుంది.

నేర్చుకున్న నటనలు:

భావయుత నటన, భూత నటన ఇవన్నీ అనాగరిక జాతులనుండి, అడవి జాతుల నుండి వాళ్ళను అనుకరించి మనం నేర్చుకున్నాం. ఈ నాటికీ కొండలలో నివసిస్తూ వున్న చెంచులు, కోయలు, ఖాండులు, సవరలు, పండాలు మొదలైన కొండ జాతులవారి నృత్యాలు మనల్ని ఆశ్చర్య చకితుల్ని చేస్తూ వుంటాయి. వీరి కీ కళ ఎలా అబ్బిందా అనిపిస్తుంది. ఈ నాటికీ, ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న కొండ జాతుల వారందరూ వారి వారి నృత్యాలను పోషించుకుంటున్నారు.

ఆనాడు నాట్యకళకు సంబంధించిన వాచికము, పద్యము, గీతము మొదలైన వన్నీ వివిధ దేశాలలో దేవతారాధన సమయాలందు వుపయోగించుకునేవారు. ఆయా దేశాల నాగరికతనుబట్టీ, మతాలనుబట్టీ గేయాలూ, వాచికమూ మారిపోయాయి. వారివారి పరిస్థితులకు అనుగుణంగా కళను వుపయోగించుకున్నారు. దేవతారాధన

యందు, ఉత్సవాలయందు ఈ నాటికీ ప్రాచీన నాటకాలను చూస్తూనేవున్నాం. అవి అన్నీ పౌరాణిక గాథలకు సంబంధించే వున్నాయి.

ఈ విధంగా ఆనాడు దేవుణ్ణిగూర్చి, దేవతలనుగూర్చి ప్రజలలో ప్రచారం జరిపేవారు. రానురాను లౌకిక విహారార్థం, శ్రీమంతుల ఇండ్లలోను, రాజ మందిరాలలోను వారి తృప్తికొరకు మాత్రమే నాటకాలు వ్రాయటం, చిత్రాలు గీయటం, నృత్యాలు చేయటం, కవిత్వం వ్రాయటంతో నాటకాది లలిత కళలన్నీ ప్రజలనుండి దూరమయ్యాయి. ఎప్పుడైతే జమీందారీ శ్రీమంతుల యుగం వచ్చిందో అప్పుడు ప్రజలను దోచుకోవడం మొదలుపెట్టారు. ప్రజలు అనేక బాధలకు గురి కావడంవల్ల కళలకు దూరమయ్యారు. కళలన్నీ రాజులకొరకూ, వారి భోగభాగ్యాలకొరకూ అంకితమైపోయాయి.

భాగ్యవంతుల పోషణ:

ఆనాడు దేవకార్యాలన్నీ శ్రీమంతులే చేయిస్తూ వుండేవారు. అందువల్ల ఈ నాట్యా చార్యులూ, గాయకులూ, కవులూ, చిత్రకారులూ, అందరూ రాజమండిరాలకే ఆహ్వానింపబడ్డారు. అందువల్ల సామాన్య ప్రజలలో నానాటికీ కళ దూరమైపోయింది. ప్రజల జీవితం దుర్భరమైపోయింది. ఆనందోత్సవాలు దూరమైనాయి. ఇందువల్ల సామాన్య ప్రజలు రాజమందిరాలకు పోయే అవకాశం లేనందున పూర్తిగా ఆ ఉత్స వాలకు, ఆ ప్రదర్శనాలకు దూరమయ్యారు. రానురాను ఆ కార్యక్రమాల్లో శ్రీమంతు లకూ, మధ్యతరగతి ప్రజలకూ, విద్యావంతులకూ పండితులకూ మాత్రమే స్థానం వుండేది. పేద ప్రజలకు అంటు దోషాలు అంటగట్టి, దేవస్థానాల్లో ప్రవేశం లేకుండా స్వార్థపరులు కళలను దోచుకున్నారు.

ఒకనాడు కళలు జీవితానందం కొరకు వృద్ధిపొందాయి. ఒకనాడు జీవితంలో ఆనందం లేక, కేవలం కష్టాలను మరచిపోవడానికి తప్పత్రాగి ఆ మత్తులో ఆట లాడారు. చిందులు త్రొక్కారు. పాటలు పాడారు. మొత్తంమీద నాట్యకళ దేవ కార్యాలనుండి, మోటు చిందులనుండి. పురాణ కథలనుండి, భజన మేళాలనుండి వృద్ధి పొందిందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

### బూటకపు కళ:

ప్రజల దారిద్ర్యం హెచ్చినకొద్దీ అజ్ఞానం ఎక్కువ అవడంవల్ల శ్రీమంతులేగాక కొద్దిమంది తెలివిగలవాళ్ళు, వైద్యులు, భూతవైద్యులు, తాంత్రికులూ, భూత స్వరూపాలను ధరించి, మృగ, పక్షి, వికృత వేషాలను భీకరంగా ప్రవర్శించి ప్రజలను భయపెట్టి మంత్ర చికిత్సలు చేసి అతీతులుగా పరిగణింపబడేవారు. ఇందువల్ల అజ్ఞానంగా వున్న ప్రజలు వీళ్ళు వరపుత్రులని, దేవుని బిడ్డలని నమ్మి మోసపోయేవారు. వీళ్ళు ఆ ప్రజలను దోచుకునేవారు. వీరే ఆనాటి పురోహితులు, మంత్రవేత్తలు, ప్రభువులు.

---

# పురాణ పురుషులు,
# నాట్యకళ

మన నాట్యకళను శాస్త్రీయ నృత్యంగా రూపొందించిన శివపార్వతులు, హిమాలయపర్వతాలలో నివసించేవారు. నాట్యకళను ఆరాధించిన ఆదిదంపతులు వీరే. శివుడు గంభీరమైన ప్రళయతాండవ నృత్యం చేసి నటరాజుగా ప్రసిద్ధి పొందాడు. పార్వతి లాస్యనృత్యంలో సమర్థురాలుగా రూపొందింది.

### సంధ్యా నృత్యం:

శివుడు ప్రతిదినమూ సూర్యాస్తమయ సమయంలో సంధ్యా నృత్యాన్ని చేసేవాడు. ఈ సమయంలో బ్రహ్మదేవుడు తాళాన్ని, విష్ణువు మృదంగాన్ని, ఇంద్రుడు మురళిని, సరస్వతి వీణనూ వాయించేవారు. లక్ష్మీదేవి ప్రధాన గాయకురాలుగా పాటపాడితే నారద తుంబురులు వంతగానాన్ని అందించేవారు. పార్వతితో పాటు దేవతలూ, గంధర్వులూ, యక్షులూ, కిన్నరకింపురుషాదులూ ప్రేక్షకులుగా వుండి ఆ ప్రదర్శనాన్ని ఆనందంతో తిలకించేవారు. ఈ విధంగా మన పురాణ పురుషులు నాట్యాన్ని ఆరాధించారు.

మోహినీ నృత్యం :

అలాగే దేవదానవులు, అమృతంకోసరం పాల సముద్రాన్ని మథించారు. ఈ మథనంలో మందర పర్వతాన్ని కవ్వముగాను, సర్పాన్ని తాడుగాను వుపయోగించి సముద్రాన్ని చిలకగా పుట్టిన అమృతంకోసం దేవతలకు, రాక్షసులకు కలహం చెలరేగింది. ఈ కలహాన్ని తీర్చి, ఆ అమృతాన్ని పంచిపెట్టాలి. ఈ కార్యాన్ని సాధించడానికి విష్ణుదేవుడు మోహినీ అవతారమెత్తి నృత్యంచేస్తూ ఆ దేవ, దానవులకు అమృతాన్ని పంచి తద్వారా దేవదానవులను శాంతింపజేశాడు. మోహిని రూపంలో నాట్యంచేస్తూ ఇరుపక్షాలనూ సమ్మోహితుల్ని చేశాడు.

ఆలాగే కృష్ణుడు వ్రేపల్లెలో కాళీయ మడుగులో ప్రజలను నానావిధాలుగా హింసిస్తూ వచ్చిన క్రూర సర్పరాజు పొగరణచి అతని తలపై ఎక్కి నృత్యాన్ని చేసినట్లు పురాణగాథ తెలియజేస్తూంది.

రాసలీల :

కృష్ణుడు మురళి ఊదితే కృష్ణుని చెలికాండ్రూ, గోపికలూ ఇట్టే హాజరై సమిష్టిగా ఆనంద నృత్యం చేసేవారు. ఈ నాట్యాన్నే ఈనాడు రాసలీల అని పిలుస్తున్నారు.

అర్జునుని ఆటుపాటులు :

జూదంలో ఓడిపోయిన పాండవులు పన్నెండేళ్ళ వనవాసమూ, ఒక ఏడు అజ్ఞాతవాసమూ చేశారు. ఈ అజ్ఞాతవాసంలో ఎవరూ గుర్తుపట్టకుండా మారు వేషాలలో విరాటరాజు కొలువులో అజ్ఞాతంగా గడిపే సమయంలో విరాటరాజు కూతురైన ఉత్తరకు బృహన్నల వేషంలో వున్న అర్జునుడు నాట్యం నేర్పాడు. అర్జునుడు ఒక్క విలువిద్యలోనేగాక నృత్య, సంగీత కళలలో కూడ ఆరితేరిన విద్వాంసుడు.

పార్వతిశిష్యురాలు ఉష :

అలాగే బాణాసుర చక్రవర్తి కుమార్తె ఉషాదేవి. శివభక్తుడైన బాణాసురుడు తపస్సుచేసి శివుని మెప్పించి, పరమశివుడు ఎప్పుడూ తనవద్దనే ఉండేటట్లు వరాన్నిపొంది, శివ, పార్వతులను తన మందిరంలోనే వుంచుకున్నాడు.

నిత్యమూ శివ పార్వతుల సేవలో మెలగిన ఉష వారి మెప్పులను పొంది, పార్వతి ద్వారా లాస్యన్యత్యాన్ని నేర్చుకుంది.

పార్వతిదగ్గర నాట్యం నేర్చుకున్న ఉష అనతికాలంలోనే నృత్యంలో అపారమైన జ్ఞానాన్ని సంపాదించి గొప్ప నర్తకిగా పేరుపొందది కృష్ణుని మనమడైన అనిరుద్ధుని వివాహమాడి, ద్వారకలో తన అత్తవారింటియందున్న రాజకన్యల కందరకూ నాట్యం నేర్పింది. నాట్యకళమీద 'ఉషాభరత'మనే శాస్త్రీయ గ్రంథాన్ని కూడ రచించింది ఉషా దేవి.

ఇక దేవతలకు రాజైన ఇంద్రుడు సంగీత నృత్యాలను ఎంతగానో పోషించాడు. దేవలోకంలో ప్రతినిత్యం ఇంద్రదర్బారులో సంగీత నృత్య ప్రదర్శనాలు జరుగుతూ వుండేవి. దేవతలందరూ ఆసీనులైవుండగా వారి సమక్షంలో రంభ, ఊర్వశి, మేనక మొదలైన అపురూప సుందరీమణులు మనోహరంగా నృత్య ప్రదర్శనాల నిచ్చేవారు.

ఇంద్రుని దర్బారులో జరిగే నృత్యాలను, భరతనాట్యశాస్త్రాన్ని సులభశైలిలో అందరికీ అర్థమయ్యేటట్లు వ్రాయుమని నందికేశ్వరునికోరి అభినయదర్పణం వ్రాయించాడు. అదే నేడు మనకండ్లముందున్న అభినయదర్పణ గ్రంథం. నాట్యంచేసే ప్రతివారూ దీనిని ఆధార గ్రంథంగా పరిస్తున్నారు.

---

# నాట్యకళ ఎలా ఉద్భవించింది?

ఇంతమంది పురాణ పురుషులు ఆరాధించిన ఈ నాట్యకళ అసలు ఎలా వచ్చిందో తెలుసుకోవడం ఎంతైనా అవసరం.

త్రేతాయుగంలో ఇంద్రాది దేవతలు బ్రహ్మవద్దకు వెళ్ళి, కుల, మత, జాతి వివక్షత లేకుండా, సర్వ ప్రజానీకానికీ అందుబాటులో వుండి అందరూ చూడదగినదీ, ఆనందించ దగినదీ ప్రసాదించుమని అడిగారనీ, అందుకు బ్రహ్మ వారి ప్రార్థనను అంగీకరించి, ఋగ్వేదంనుండి సంభాషణలనూ, వాయిద్యాలు వాయించే

విధానాన్ని, సామవేదంనుండి మృదు మధురమైన గాన పద్ధతిని, యజుర్వేదంనుండి అభినయాన్ని, అథర్వణ వేదంనుండి రసాన్ని—ఇలా చతుర్వేదాలనుంచి సమీకరించి మొట్టమొదటగా భరతమునికి వుపదేశించాడనీ, ఆ తరువాత భరతముని తన మారుమంది పుత్రులకూ వుపదేశించాడనీ, ఈ విధంగా అది దేశమంతటా వ్యాపించిందనీ ప్రతీతి.

### దేవతలూ దానవుల మధ్య కల్లోలం :

భరతనాట్య శాస్త్రంలో కైశికీ వృత్తి అనే పేరుగల ఒక నాట్యం వుండేది. దీనిని స్త్రీలే నిర్వహించేవారు. ఈ నిర్వహణకు బ్రహ్మ కొంతమంది అప్సరసలను సృష్టించాడు. భరతముని వారినందరినీ సమీకరించి, మరి కొంతమందినికూడ వారితో జతపరచి తానే దర్శకుడై ఇంద్రధ్వజ మహోత్సవంలో, దేవతలూ, దానవులూ నిండివున్న సభలో మొట్టమొదటి సారిగా ఈ నృత్యాన్ని ప్రవేశపెట్టాడు. దానితో దేవతలూ, దానవుల మధ్య కల్లోలం రేగింది.

ఈ మహోత్సవంలో తమ ఆధిక్య ప్రకటనతో, దేవతల విజయం, తద్వారా దానవుల పరాజయం చూచిన దానవులందరూ భగ్నుల మండిపోయి, ప్రదర్శనాన్ని భగ్నం చెయ్యడానికి పూనుకున్నారు.

### బ్రహ్మ సందేశం :

శిల్పంగాని, కళగాని, శిక్షణగాని, శాస్త్రంగాని, యోగంగాని విశ్వంలో ఎక్కడా లేదనీ బ్రహ్మ సమాధానం చెప్పాడు. ఆనాటినుంచీ మనకు దశవిధ రూపకాలూ, వాటి ప్రయోగ పద్ధతులూ ప్రచారం లోకొచ్చాయి.

### భరతముని :

బ్రహ్మ సందేశమందుకున్న భరతముని ఈ నాట్యప్రచారానికి భూలోకంలో తన భరతనాట్య శాస్త్రంద్వారా అమూల్య కృషి చేశాడు. భరతముని శిష్యులలో నాట్యవేదానికి ప్రథమ నాయకుడైన శివునియొద్ద నాట్యాన్ని, నందివద్ద

రసాన్ని అభ్యసించి నాట్యశాస్త్రాన్ని ముప్పయియారు అధ్యాయాలలో వ్రాసి ప్రచారం నిమిత్తం ఈ లోకానికి తీసుకువచ్చి, స్వయంగా అమృతహరణం, అమృత మథనం మొదలైన నాటకాలు వ్రాసి స్వయంగా శిక్షణ యిచ్చి, ప్రదర్శించాడు.

నాట్యశాస్త్ర ప్రాభవం, ప్రభావం :

ఈనాడు ఉత్తర భారతదేశంలోనూ, దక్షిణ భారత దేశంలోనూ అనేక నాట్యకళా సాంప్రదాయాలు ప్రచారంలో వున్నాయి. ఈ నాట్యకళ రూపాలు ఎన్ని విధాలుగా మారినా వీటన్నిటికీ మూల గ్రంథం భరత నాట్యశాస్త్రమే.

ఈ నాట్యశాస్త్రం అనేక శతాబ్దాలనుంచీ భారతీయులందరికీ ఒక నాటక శాసనంగా ఉంది. కాళిదాసు వ్రాసిన శాకుంతలంనుండి మణిపురి, కథక్, కథకళి, భరతనాట్యం, కూచిపూడి నృత్యం మొదలైన విభిన్న నాట్య నాటక స్వరూపా లన్నిటిమీదా భరతనాట్యశాస్త్ర ప్రభావం వుంది. మన ప్రాచీన తెలుగు నాటకరంగం మీదా, తంజావూరు యక్షగానాలమీదా, కూచిపూడి భాగవతులమీదా కూడ ఈ నాట్యశాస్త్ర ప్రభావం పూర్తిగా వుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ నాటికీ మనకు ఆధార నాట్యశాస్త్రంగా వర్ధిల్లేది భరతనాట్యశాస్త్రం ఒక్కటే.

ఈ నాట్యశాస్త్రపు పుట్టుపూర్వోత్తరాలనూ కాలనిర్ణయాన్ని గూర్చి అనేక భేదాభిప్రాయాలున్నై. కాళిదాసు రచనలకంటే ముందే ఈ భరత నాట్య శాస్త్రముందట. అందుకు నిదర్శనంగా కాళిదాసు రచించిన విక్రమోర్వశీయం నాటకంలో

> మునినా భరతేన యః ప్రయోగో-భవతీష్వప్సరసాశ్రయో నియుక్తః,
> లలితాభినయం త మద్య భర్తా-మరుతాం ద్రష్టుమనాః స లోకపాలః.

ఈ విధంగా భరతమునిని గురించి కాళిదాసు ప్రస్తావించాడు. అసలు కాళి దాసే క్రీస్తుకు పూర్వం మొదటి శతాబ్దంలోని వాడని చరిత్రపరిశోధకుల అభి ప్రాయం. అంటే అంతకుముందు ఇంకా రెండు మూడువందల సంవత్సరాలక్రితమే ఈ భరత నాట్యశాస్త్రం రచించి వుండవచ్చును.

## అభినవగుప్తుడు :

ఈ భరతనాట్యశాస్త్రానికి అభినవగుప్తుడనే మహనీయుడు అభినవ భారతీ వ్యాఖ్యను రచించాడు. భరత నాట్యశాస్త్రంలో మనకు అర్థంకాని అనేక విషయాలను ఆయన తెనిగించి అమూల్యమైన వ్యాఖ్యానాలను వివరంగానూ, సుబోధకంగానూ రచించాడు. నిజంగా అభినవగుప్తుని వ్యాఖ్యానమే భరత శాస్త్రానికి లేనట్టయితే ఈనాడు మనకు కనిపించే భరత నాట్యశాస్త్రం ఇలా రూపురేఖలు దిద్దబడివుండేదే కాదు. అనేక అధ్యాయాలను ఆయన సరళమైన మార్గంలో పెట్టాడు. భరతముని నాటినుంచీ వెలువడ్డ అనేక నాట్యశాస్త్ర గ్రంథాల వ్యాఖ్యానాలను ఆయన భారతీ వ్యాఖ్యలలో పొందుపరిచాడు. ఆనాటికీ ఈనాటికీ అభినవగుప్తుని నాట్యశాస్త్ర వ్యాఖ్యానమే ప్రమాణమై వుంది.

భరతముని అనంతరం కాళిదాసు, భాసుడు, భవభూతి మొదలైన వారంతా నాటకాలు వ్రాశారు. భరతముని నాట్యశాస్త్రానికి అనుగుణంగా వాటిని ప్రదర్శించారు. ఆనాడు వ్రాసినటువంటి ప్రతి అలంకారశాస్త్ర గ్రంథంలోనూ నాటకం యొక్క నిరూపణం, రసప్రకరణం చేర్చబడుతూనే వచ్చాయి.

ఈనాడు మనకు ప్రచారంలో వున్న భరతనాట్యశాస్త్రం అభినవగుప్తుని వ్యాఖ్య నాటికి 36 అధ్యాయాలు మాత్రమే వుండేదనీ, తరువాత 37-వ అధ్యాయం కలిసిందనీ తెలుస్తూంది.

ఆనాటి రాజమందిరాల్లో నాట్యకారులు, గాయకులు, విటులు లేని రాజసభలే జరిగేవికాదు. ఆనాటినుండీ లలితకళలన్నీ స్వతంత్ర రాజుల సమక్షంలో అభివృద్ధి పొందాయి. ప్రతి శుభకార్యానికీ నాట్యాభినయం మంగళ ప్రదంగా ఎంచారు. రామాయణం నాటినుంచీ, కర్ణాట ఆంధ్ర ద్రావిడ రాజ్యాన్ని పరిపాలించిన ఆంధ్ర రాజుల ఆధ్వర్యంలోనూ భరతముని నాట్యశాస్త్ర ప్రకారం నాట్యం, అభినయం, ప్రచారంలోకి వచ్చాయి.

# నటరాజస్వామి

మనం ప్రపంచంలో మరి ఏ దేశంలోనూ, ఏ మతంలోనూ, ఏ దేవాలయం లోనూ చూడని నటరాజస్వామిని గూర్చి తెలుసుకోవడం ఎంతైనా అవసరం. విదేశాలనుంచి భారతదేశానికి యాత్రికులుగా వచ్చే అనేకమంది ఈ నటరాజ విగ్రహాన్ని చూచి ముగ్ధులై పోతూవుంటారు.

పంతులేకాదు భగవంతుడు :

నటరాజును నాట్యాచార్యునిగానేగాక దైవంగానూ పూజిస్తున్నారు. నటరాజు కాంస్య విగ్రహాలు దక్షిణ దేశంలో ఏ యింట్లో చూచినా ప్రత్యక్షమౌతుంటాయి. హిందూ శిల్పకారులు ఎక్కడ మంచి రాళ్ళు దొరికితే అక్కడల్లా నటరాజమూర్తిని తొలిచారు. శివుని విశ్వ నర్తనమే నటరాజు.

నటరాజు విగ్రహంలోనే పంచక్రియల్ని మలిచారు. సంధ్యానృత్యంలోకాక శివతాండవంలో నటరాజు భంగిమాన్ని చూచినప్పుడు ఎంతో వుద్రేకమూ, వుత్సాహమూ, కళాతృష్ణా మనలోనుంచి వెలువడతాయి. ఆ భంగిమ అలాంటిది.

పంచ క్రియలు :

పంచ క్రియలనగా సృష్టి, స్థితి, సంహార, తిరోభవ, అనుగ్రహాలు. చివరిది మోక్ష మనికూడ వ్యవహరింపబడుతుంది. వీటినే వేరుగా బ్రహ్మ, విష్ణు, రుద్ర, మహేశ్వర, సదాశివ భావాలుగా హిందూ మతంలో చూస్తున్నాము. వీటి సమాగమమే నటరాజుయొక్క విశ్వాంతర నయనం.

అంతేకాక ఎత్తిన కాలుకు, వంచిన హస్తానికి, చేతిలో డమరుకానికి, హస్తంలో జ్వాలకూ-వీటన్నింటికీ కూడ సరియైన అర్థాలున్నాయి. వీటిని మనం తెలుసుకోవడం ఎంతైనా అవసరం.

డమరుకం : ఇది సృష్టి స్వరూపానికి చిహ్నము.

అభయహస్తం : స్థితిని తెలుపుతుంది.

జ్వాల : ఇది సంహార చిహ్నంగా వెలుగొందుతూ వుంది.

ఎత్తినకాలు : ఇది మోక్ష చిహ్నం.

ఇవే నటరాజులోని ముఖ్యమైన అంశాలు. పైన ఉదాహరించిన అన్ని చిహ్నాలకు వేరువేరు కథనాలున్నాయి. దీనిని గురించి హిందువులు పురాణకథగా కూడ చెపుతారు.

నటరాజును గురించిన కథలు, గాథలు :

త్తరంగమనే అరణ్యంలో కొందరు ఋషులు నివసిస్తూ వుండేవారట. వీరు మతోన్మాదంలో మునిగివుండగా వీరి గర్వాన్ని అణచడానికి శంకరుడు బయలు దేరాడు. ఈవునివెంట విష్ణుమూర్తి స్త్రీ రూపంలో సుందరాంగనగా తోడు వున్నాడు. ఆదిశేషుడూ వెంట వచ్చాడు.

ఈ సమయంలో గర్వాంధకారంలో వున్న ఋషులు వీరిపైకి ఒక మాయా వ్యాఘ్రాన్ని పంపించారు. శివుడు ఆ వ్యాఘ్రంతో హోరాహోరి పోరాటం జరిపి విశ్వనర్తనంతో వ్యాఘ్రాన్ని చీల్చి చెండాడాడు. దాని చర్మాన్ని కటిపై ధరించాడు.

గర్వభంగాన్ని పొందిన ఋషులకు కంపరమెత్తింది. వెంటనే ఒక భయంకర సర్పాన్ని మంత్రశక్తితో పంపించారు. దానిని మన శివమూర్తి పూల హారంవలె మెడలో ధరించాడు. ఋషులకు గర్వభంగం జరిగింది.

ఆ సంతోషంలో శివుడు తాండవంతో ఆనందమయుడై నర్తించాడు. ఆనంద సముద్రంలో మునిగి తేలుతున్న ఆ సమయంలో ఋషులు వూరుకున్నారా ? లేదు. వెంటనే ఒక మరుగుజ్జు వానిని సృష్టించి పోరాటానికి పంపించారు.

మూయాలకుడు :

పైనపేర్కొన్న మరుగుజ్జువాడే మూయాలకుడు. శివుడు తాండవ నృత్యంచేస్తూ వానిని వేటాడాడు. భయంకరరూపం దాల్చాడు. ఆ నర్తనంలో నటరాజు కుడి కాలితో ఆ మరుగుజ్జువాని వెన్నులో ఒక్క తన్ను తన్నాడు. దానితో వెన్నెముక విరిగి మూయాలకుడు నేలకొరిగాడు. వాడిని కాలిక్రిందవేసి త్రొక్కి నాట్యానికి పూనుకున్నాడు నటరాజు. ఈనాటికీ మనం నటరాజు పాదాలక్రింద మూయాల

కుని శవాన్ని చూడగలం. మూయాలకుని మరణంతో ఋషుల గర్వం అణగి పోయింది. శివుడు లాస్యన్నృత్యానికి లంకించుకొన్నాడు. అందులో చిన్మయుడై పోయాడు. దేవతా గణమంతా ఆనందసముద్రంలో మునిగి శివుని దర్శించారు. భూత భోంతరాళాలన్నీ వూగిపోయాయి. దివ్యులూ, భవ్యులూ భక్తితో పూజించారు.

ఈ విధంగా నటరాజును గూర్చి హిందూ పురాణాల్లో కథలు, గాథలు కావలసినన్ని కనబడతాయి.

## సంధ్యా నృత్యం :

నటరాజు విగ్రహ చరిత్ర కొంతవరకు తెలిసింది. ఇలాంటి నటరాజు విగ్రహమే ఎల్లోరా గుహలలో చిత్రించబడింది. దాని కథా వివరణ ఈ విధంగా వుంది.

మూడులోకాలకూ ఆదిశక్తియైన జననీమాతను స్వపీఠంపై అలంకరించి శూల పాణియైన శంకరుడు దేవతల గానంకొరకు కైలాసగిరిపై నృత్యం చేస్తాడు. ఈ నృత్యంలో ఒకప్రక్క సరస్వతి వీణ వాయిస్తూ వుంటుంది. లక్ష్మి పాట పాడుతూ వుంటుంది. విష్ణువు మృదంగం వాయిస్తూ వుంటాడు. ఇంద్రుడు వేణుగానం చేస్తాడు. బ్రహ్మ తాళం వేస్తూ వుంటాడు. గంధర్వులు, యక్షులు, పతగులు, ఉరగ, సిద్ధ, సాధ్య, విద్యాధర, అమర అప్సరసలూ, సుల్లోకాల్లో నున్న పిపీలికాది జీవరాసులు ఈ కైలాసగిరి నాట్య ప్రదర్శనాన్ని దర్శించటానికి వస్తారు. వీరి ఆనందంకొరకు త్రిశూలపాణి సంధ్యా నృత్యాన్ని చేస్తాడు.

ఇదే పరస్పరాకర్షణ సంగీతం.
ఇదే దివ్యగీతం.
ఇదే విశ్వానుభూతి.
అదే మన నటరాజు నాట్య సర్వస్వం.

———

# చెన్నువీరిన చిదంబరక్షేత్రం

చిదంబరం దక్షిణ భారతదేశంలో ఒక ముఖ్యమైన పుణ్యక్షేత్రం. ఇది దక్షిణ ఆర్కాటు జిల్లాలో వుంది.

ఈ చిదంబర క్షేత్రంలో మిక్కిలి శిల్ప చాతుర్యంతో నాలుగు మండపాలున్నాయి. అందులో ఒక వెయ్యిస్తంభాల మండపంకూడా వుంది. నృత్య సభ అనే పేరుతో ఒక మండపముంది. కనకసభ అని మరో మండపం. ఈ మండపం పైభాగమంతా బంగారంతో కప్పబడివుంది. శివుడు నటరా జను పేరుతో ఈ మండపంలో నాట్యంచేసేవాడని ప్రతీతి. శివతాండవంలో మనం చూచే నటరాజు భంగిమమే చిదంబరంలో వున్న నటరాజ విగ్రహం.

చిదంబర దేవాలయంలో వుత్తర ప్రాకారంలో వున్న గోపురం శ్రీకృష్ణ దేవరాయలు నిర్మించాడు. ఈ గాలిగోపురంలో భరతనాట్య శాస్త్రంలో చెప్పబడిన 108 విధాలైన నాట్యభంగిమాలు శిల్పాల రూపంలో చెక్కబడి వున్నాయి. గ్రంథ రూపంలోవున్న నాట్యశాస్త్రం శిథిలమైనా, నాట్యకారులు చనిపోయినా, మనకు శాశ్వత ముద్రగా చిదంబర నటరాజ దేవాలయంలో చెరగని సత్యంగా నాట్యశాస్త్రమంతా చిరస్థాయిగా వుంటుంది.

శివుడు నాట్యశాస్త్రానికి అధిష్ఠానదేవత. ఆయన సంధ్యాకాలంలో ప్రతినిత్యం నాట్యం చేసేవాడని, ఆ నృత్యం చూచేందుకు ముక్కోటి దేవతలూ కొలువు తీరేవారని ప్రతీతి. అందువల్లనే సాయంసమయంలో శివుని దర్శనంచేస్తే ప్రతిఫలం పొందగలరని పెద్దలు చెపుతూ వుంటారు. ఈ సంప్రదాయాన్ననుసరించే దక్షిణ దేశపు అన్ని దేవాలయాలకూ—ముఖ్యంగా చిదంబరం నటరాజస్వామి దేవాలయానికి—సాయంకాలంపూట భక్తులు తండోపతండాలుగా వెళ్ళి నటరాజస్వామిని దర్శిస్తారు.

చిదంబరం యాత్రాస్థలమే కాదు. కళాక్షేత్రం కూడ.

———

# 2

# ఆంధ్రుల కథా చరిత్ర



ఆంధ్రనామ నంగ్రహం—బౌద్ధయుగపు నాట్యకళ—చోళచాళుక్యులనాటి సాంపు పెంపులు—కాకతీయుల కళాపోషణ—తంజావూరు నాయకరాజుల నాటి నయ నాణ్యాలు—గోల్కొండ నవాబుల చోపుదారీ—రెడ్డి రాజుల దొడ్డదోహదం — విజయనగరరాజుల నాటి విన్నాణ విశేషాలు

# ఆంధ్రనామసంగ్రహం - శాతవాహనులు



ఆంధ్రశబ్దం :

ఈనాటి వరకూ జరిగిన పరిశోధనల ఫలి

తంగా ఆంధ్రుల చరిత్ర ఒక వరుస క్రమంలో తెలుస్తూవుంది. అనేక భూగర్భ పరిశోధనలద్వారా ఎన్నో కొత్త విషయాలు విశదమౌతున్నాయి. క్రీ. పూ. 550 నుండి బౌద్ధులు ఆంధ్రదేశంమీదుగా సింహళానికి ప్రయాణాలు చేసినట్లూ, అందుకు సంబంధించిన గాథలు బౌద్ధగ్రంథాలలో వున్నట్లూ తెలుస్తూ వుంది. ఆంధ్ర అనే పదం అనేక ప్రాచీన గ్రంథాలలో ఉదాహరింపబడి వుంది.

భరతుడు నాట్యశాస్త్రంలో ముఖ్యమైన పదకొండు జాతిరాగాలలో ఆంధ్రి (నేటి రాగం) కూడా ఒక జాతిరాగమని పేర్కొన్నాడు. ప్రాచీన గ్రంథమైన ఐతరేయ బ్రాహ్మణంలో ప్రప్రథమంగా ఆంధ్రశబ్దం ఉపయోగపరచబడడమేగాక క్రీ. పూ. వెయ్యి సంవత్సరాల ముందుగానే రచించబడిన భారత, రామాయణ గ్రంథాలలో కూడ ఆంధ్రుల ప్రశంస వుంది. ఈనాటికి సుమారు 4 వేల సంవత్సరాలనుండీ ఆంధ్రజాతి ఒక ప్రత్యేకతెగగా నివసిస్తున్నారని చెప్పవచ్చు.

శాతవాహనులు :

ఆంధ్రదేశాన్ని పరిపాలించిన రాజులలో శాతవాహన తెలుగు చక్రవర్తులు మొదటి వారు. వీరినే శాతవాహనులని, శాతకర్ణి రాజులని కూడ వర్ణించారు. క్రీ. పూ. 220 నుండి క్రీ. శ. 218 వరకూ, అంటే దాదాపు 4 వందల సంవత్సరాలవరకూ 30 మంది శాతవాహనరాజులు ప్రతిష్ఠానపురాన్ని రాజధానిగా చేసుకుని హైదరా

దాని సంస్థానంతో సహా కృష్ణాగోదావరి మండలం వరకూ వ్యాపించి వున్న ప్రాంతాన్ని పాలించారు. ఆంధ్ర శాతవాహనరాజులలో 14 వ రాజైన హాలుడు ప్రతిష్ఠానపురం రాజధానిగా చేసుకుని దక్షిణాపథంతోపాటు సింహళాన్ని జయించి సప్తగోదావరి వద్దనున్న ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి వచ్చి, అక్కడ సింహళ రాజపుత్రిక లీలావతిని వివాహం చేసుకున్నట్లు లీలావతి కావ్యంద్వారా తెలుస్తూంది. హాలుడు తన ఆస్థానంలో కవి, పండిత, గాయక, శిల్పులను ఆదరించినట్లు తెలుస్తూ వుంది.

ఆనాటి సంఘం, సంస్కృతి :

క్రీస్తుకు పూర్వమే ఆంధ్రదేశంలో సంగీతం, నృత్యం, నాటకంతోపాటు అనేక వాద్య విశేషాలు ప్రచారంలో వున్నట్లు హాలశాతవాహనుడు రచించిన గాథా సప్తశతి తెలియజేస్తూ వుంది. హాలుడు గాథాసప్తశతిని మహారాష్ట్రీ ప్రాకృత భాషలో రచించినా తెలుగుదేశానికి సంబంధించిన అనేక కళారూపాలను ఉదాహరించాడు. ప్రాకృత భాషలో 700 గాథల్ని రసవత్తరంగా రూపొందించాడు. ఆంధ్రదేశపు ఆనాటి సాంఘిక జీవితాన్ని తెలుసుకోవడానికి ఇదే ముఖ్యమైన గ్రంథం. క్రీస్తుశకం ప్రథమశతాబ్దంలో నాటి లలితకళలకు సంబంధించిన ఈ క్రింది వివరాలు గాథాసప్తశతి తెలియజేస్తూ వుంది.

1. జనపదేను హరితాల (అంటే అరదళము) మండిత ముఖంతో మెరసే నటివలె అందముగా ఉన్నదట.

2. గోపికల నర్తనాన్ని శ్లాఘించే నెపాన ఒక గోపిక వారి చెక్కిళ్ళ మీద ప్రతిబింబిస్తున్న కృష్ణుని ముద్దు పెట్టుకున్నదట. (2-14)

3. నర్తించి నర్తించి, అలసటగొన్న వాలుగంటి మొగలైనవారితో కలయిక ఆహ్లాదకరమట. (3-59)

4. ముఖమున అన్నం వున్నంతవరకే ముద్దెల మధురంగా పలికి అది లేనిచో విరసముగా మొఱుగునట. (3-53)

పై వుదాహరణలతోపాటు గాథాసప్తశతిలో నాటకాలు, సంగీతం, మృదంగం, మురజ, వీణ మొదలైన వాద్య విశేషాలు ప్రచారంలో వున్నట్లుకూడ తెలుపబడింది.

(పి. యస్. ఆర్. అప్పారావ్)

---

# బౌద్ధమతవ్యాప్తి - బౌద్ధయుగపు నాట్యకళ



కొత్త మోజు :

శాతవాహనరాజులు గాఢమైన

హిందూమతాభిమానులైనప్పటికీ దేశంలో బౌద్ధమతం విరివిగా వ్యాపించింది. వ్యాపారులు, రైతులు, వివిధ వృత్తుల పనివారు చాలావరకు బౌద్ధ మతాన్ని అభిమానించారు. బ్రాహ్మణులు మాత్రం హిందూమతాన్ని, హిందూ దేవతలను ఎక్కువ ఆరాధించారు. శాతవాహనరాజులు మాత్రం వివిధ మతాలవారిని సమానదృష్టితో చూశారు. ఆనాడు రాజులకు రైతులకు వృత్తి పనివారల మధ్య వర్గకలహం తీవ్రంగా వుండేది. గ్రామ జీవితంలో పీడించేవారు, పీడింపబడేవారు వుండేవారు. కుల భేదాలను, వర్గభేదాలను నిరసించి సర్వసమానత్వాన్ని బోధించడంవల్ల పీడిత ప్రజానీకానికి బౌద్ధమతం ఒక ఆశాజ్యోతిగా నిలబడింది. అందువల్ల ఆనాటి కార్మికులు, రైతులు ఇతర పీడిత ప్రజానీకమంతా బౌద్ధమతాన్ని గాఢంగా అభిమానించారు. ముఖ్యంగా శిల్పులు బుద్ధునిపై గలతమ భక్తిభావాన్ని ప్రదర్శించడానికి బౌద్ధ విగ్రహాలను చెక్కి పూజించడం మొదలుపెట్టారు. కాని బుద్ధుని విగ్రహరూపంలో పూజించవచ్చునా, కూడదా అన్న మీమాంసలో బౌద్ధులలో హీనయాన, మహాయాన అనే రెండు విభాగాలు ఏర్పడ్డాయి. మహాయాన శాఖవారు పూజించవచ్చునన్నారు; హీనయానవారు వ్యతిరేకించారు. కాని క్రమేపీ మహాయానశాఖ అభివృద్ధిచెంది ప్రపంచమంతటా బౌద్ధమతం వ్యాపించింది.

కాని ఆర్థికవ్యవస్థలో అణగిపోతున్న పీడిత ప్రజాసామాన్యానికి బౌద్ధమతం సాంఘిక, ఆర్థిక సమానత్వం కలిగిస్తుందని మొదట్లో ఆశించారు. కాని అలా జరుగలేదు. బౌద్ధమతంలోని సమానత్వ సిద్ధాంతాలన్నిటినీ అహింసా సూత్రాలతో బంధించడంవల్ల రాజరికవ్యవస్థకు భంగం కలుగదని భావించిన రాజులందరూ బౌద్ధమతాన్ని స్వీకరించారు. అంతేకాక ప్రారంభంలో వర్ణవ్యవస్థను వ్యతిరేకించిన బౌద్ధమతం క్రమేపీ వర్ణవ్యవస్థతోకూడా రాజీపడింది. ఈ విధానంవల్ల వివిధ

జాతులకూ చెందినవారు వారి కులాచారాలను అనుసరిస్తూ బుద్ధుని దేవునిగా ఆరాధించారు. శిల్పులు శిల్పాలను చెక్కారు. చిత్రాలను చిత్రించారు. సంగీత, నృత్యాలతో వారి ఆనందాన్ని వెల్లడించారు. ఇలా బుద్ధుని ఆరాధించేవారందరికీ నాగార్జునకొండ కేంద్రమై అక్కడ భూద్రతీర్థం అనేది ఏర్పడింది. బౌద్ధమతంలో వచ్చిన ఈ పరిణామాలను ఆచార్యనాగార్జునుడు మరికొంత ముందుకు తీసుకువెళ్ళాడు.

## నాగార్జునుడు :

ఆచార్యనాగార్జునుడు క్రీస్తుశకం రెండు మూడు శతాబ్దులమధ్య ధాన్యకటకం (నేటి ధరణికోట)ను రాజధానిగా పరిపాలించిన యజ్ఞశ్రీశాతకర్ణి ఆస్థానంలో వుండి దేశదేశాలూ సంచారంచేసి చివరిరోజుల్లో నాగార్జునికొండమీద ఆశ్రయం నిర్మించుకొని అక్కడే మరణించిన ఆంధ్రుడు.

నాగార్జునుడు శూన్యవాదం-లేక, మాధ్యమికవాదం అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించి బౌద్ధమతంలో ఒక పెద్ద మార్పును తీసుకువచ్చాడు. ఆంధ్రులలో విశేషంగా వ్యాపించిన బౌద్ధమతం ఆంధ్రసంస్కృతిపరిణామంలో ఎంతో ప్రాముఖ్యం వహించింది. పండితుడైన నాగార్జునుడు దాదాపు 30 దర్శనగ్రంథాలను రచించాడు. ఆయన గొప్ప పండితుడు. ఆనాటి నాగార్జునుని కొండ బౌద్ధ ఆరామంలో విద్యాబోధన, ఉచిత వైద్యచికిత్సలతోపాటు శిల్పం, చిత్రలేఖనం, సంగీతం, నాట్యమూ నేర్పబడేవి. లలితకళలకు నిలయమైన అనేక బౌద్ధ ఆరామాలు ఆనాడు ఆంధ్రదేశంలో—నాగార్జునికొండ, అమరావతి, ధరణికోట, జగ్గయ్యపేట, భట్టిప్రోలు, నందిగామ, ఘంటసాల, గుడివాడ, గోలి, రామతీర్థం, శంకరం మొదలైన ప్రాంతాలలోనేగాక, తెలంగాణాలోని, కొండాపురం, గుమ్మడిదుర్రు, ఫణిగిరి, గాజులబండ, అల్లూరు మొదలైనచోట్ల కూడ—ప్రసిద్ధంగా ఉండేవి.

అంతేగాక ఆంధ్రదేశంలోని ప్రసిద్ధ వైష్ణవదేవాలయాలన్నీ ఒకప్పుడు బౌద్ధ ఆరామాలున్నచోట కట్టబడినవే. ఈ వైష్ణవదేవాలయాలమీద సంగీత, నృత్య, వాద్యాలకు సంబంధించిన శిల్పాలు చెక్కబడినాయి. బౌద్ధ ఆరామాలన్నిటిలోనూ వివిధ లలితకళలూ పోషింపబడినాయి. ఇందుకు ఉదాహరణలు ఇటీవలి నాగారు

నునికొండ త్రవ్వకాలలో అనేకం బయటపడి, భద్రపరచబడ్డాయి. ఆకోవకు చెంది నదే శిథిలమైన నాగార్జునునికొండ ఆరుబయలు రంగస్థలం.

### నాగార్జునకొండ ఆరుబయలు రంగస్థలం:

ఈ మధ్య నాగార్జునకొండ త్రవ్వకాలలో ఈ ఆరుబయలు రంగస్థలం బయట పడింది. ఇది దీర్ఘచతురస్రప్రాంగణం గల స్టేడియం. దీనికి నాలుగువైపులా ప్రేక్షకులు కూర్చోవడానికి వీలుగా ఇటుకలతో మెట్లుమెట్లుగా రాతిపలకలు పరచిన ఆసనాల వరుసలు ఏర్పాటు చేసి వున్నాయి. ఇది 56.3 పొడుగు, 47.3 వెడల్పు వుంది. ఇది విద్యార్థులు సమావేశమయ్యే సభారంగం కావచ్చు. ఈ రంగ స్థలంలో నైరుతిమూలగా ఎత్తైన శిలాపీఠం వుంది. ఇది ప్రధానవక్తనిమిత్తమూ. సభారామాన్ని దర్శించటానికి వచ్చిన వారి నిమిత్తమూ ఏర్పాటు చేయబడింది. ఇదీ ఆరుబయలు రంగస్థలం. దీనిలో పడిసిన వర్షపునీరంతా బయటికి పోవడానికి ఒక పెద్ద తూము వుంది. రంగస్థలం మధ్య భాగంలో ఒక గుండ్రని స్తంభం లాంటి వేదిక వుంది. వక్తలు దీనిమీద నిలబడి సభికుల నుద్దేశించి ఉపన్యసించే వారు. ఈ రంగస్థలంలో ఒక విచిత్రం: దీని మధ్య నిలబడి వుపన్యసిస్తే ఆ కంఠధ్వని స్పష్టంగా రెండువందల అడుగుల దూరం వరకూ వినబడుతుంది. అంతేకాక ఆసనపంక్తి అంతకంతకూ ఎత్తవుతూ వచ్చిన కొలదీ ఆ ధ్వని మరింత స్పష్టంగా వినబడుతుంది. దీనినిబట్టి అడివరకే ఆ పరిసరప్రాంతాలనుండి వచ్చే ప్రతి శబ్దధ్వనుల ననుసరించి ఈ ఆరుబయలు రంగస్థలం నిర్మింపబడియుండవచ్చు నని పి. యస్. ఆర్. అప్పారావుగారు వారి నాట్యశాస్త్రంలో ఉదాహరించారు.

### అమరావతి నాట్యశిల్పాలు:

ఆంధ్రుల నృత్యకళ సుమారు రెండువేల సంవత్సరాలక్రితమే శాతవాహనుల నాటికే అభివృద్ధిచెందిం దనడానికి ఈనాడు అనేక ఆధారా లున్నాయి. అమరావతి, నాగార్జునకొండల్లో ఈనాడు కనుపించే అనేక పాలరాతిశిల్పాల్లో, అనేక నాట్యభంగిమలతోపాటు మన నాట్య సంప్రదాయాలన్నీ మలచబడి ఉన్నాయి.

ముఖ్యంగా అమరావతిలో దొరికిన శిల్పంలో ఒక బృంద నాట్య ముంది. బృందంలో ఉన్న ప్రతినర్తకీ ఏదో ఒక భావాన్ని సూచిస్తూ వుంది. ఒక నర్తకి

ప్రవేశికనృత్యం చేస్తూవుంది. మరో నర్తకి ఆలీఢ స్థానంలో ఉండి వ్యంసిత కరణాన్ని చూపుతూ వుంది. వేరొక నర్తకి అర్ధమత్తిల్లి స్థానంలో ఉండి స్థలితాపశ్యత కరణాన్ని చూపుతూ వుంది.



మరొక శిల్పంలో ఆరుగురు నర్తకీమణులు ఒక రాజుముందు నృత్యం చేస్తున్నట్లు చూపబడింది.

బోధిసత్వుడు తెల్ల ఏనుగురూపంలో భూమికి వచ్చే ఘట్టాన్ని చూపే శిల్పంలో ఆయనను అనుసరించివచ్చే దేవతల బృందం వివిధ నాట్యభంగిమలలో కనిపిస్తున్నారని దిగవల్లి శివరావుగారు తమ 'కథలు-గాథల'లో తెలియజేశారు.

బుద్ధుడు, నాట్యకళ:

బౌద్ధయుగంలో అనేకమైన రూపకాలు వెలిశాయి. బుద్ధుడు మొట్టమొదటి నాట్యశాస్త్రవేత్త అని బుద్ధుని తొలిజీవితచరిత్ర 'లలిత విస్తరం'లో ఉదాహరణలు కనిపిస్తున్నాయి. బుద్ధుడు తన రాజగృహంలో విశ్రమించినప్పుడు ఆయన శిష్యులైన మౌద్గల్యాయనుడూ, ఉపతిష్యుడూ తమ నటనాకౌశల్యాన్ని చూపించారట. బింబిసారుని ఆస్థానానికి నాగరాజులు వచ్చినప్పుడు వారి గౌరవార్థం నాటకాలు ప్రదర్శించారట. రాజగృహంలో బుద్ధుని సమక్షంలో దక్షిణదేశానికి సంబంధించిన కువలయ అనే ప్రసిద్ధ నర్తకురాలు బుద్ధుని జీవితాన్నే అభినయించిందట. బౌద్ధజాతక కథలలో నటులను గురించి కావలసినంత సమాచారం తెలుస్తూంది. పై వివరాలనుబట్టి బౌద్ధయుగంలో నాటకకళ ఎలా అభివృద్ధిలయిందో సూక్ష్మంగా తెలుసుకోవచ్చును.



శాతవాహన రాజ్యవైభవం క్రీ. శ. 200 తో అంతరించింది. 400 సంవత్సరాల ఆ పరిపాలనలో సంగీతం. నాట్యం, శిల్పం, చిత్రలేఖనం ఎంతగానో అభివృద్ధి పొందాయి.

ఇక్ష్వాకులు :

శాతవాహన రాజ్యం చిన్నాభిన్నమైన తరువాత ఇక్ష్వాకురాజులు. పరిపాలించారు. ఈ వంశంలో ముగ్గురు రాజులు 52

సంవత్సరాలు మాత్రమే రాజ్యపరిపాలన చేశారు. వాసిష్ఠీపుత్రశాంతమూలుడు ఈ వంశకర్త. ఈయన కుమారుడు మాఠరీపుత్ర వీరపురుషదత్తుని కాలంలోనే నాగార్జునునికొండ శిల్పాలస్నీ చెక్కబడినాయి. ఇక్ష్వాకు రాజులు లలితకళలను పోషించిన ఆధారాలు మనకు ఎక్కువ లేవు. కాని శాతవాహనుల కళాసంస్కృతులను చాలవరకూ కాపాడింది వీరే. పల్లవరాజులు ఆంధ్రదేశంమీద దండెత్తడంతో ఇక్ష్వాకురాజ్యం పతనమైంది. నాగార్జునకొండ, విజయపురినగరాలను నాశనం చేయడంతో ఆ నగరాల శోభ అంతరించింది. బౌద్ధ భిక్షువులందరూ తరిమివేయబడ్డారు. బౌద్ధచైత్యాలస్నీ ధ్వంసంచేయబడ్డాయి.

పల్లవులు :

శాతవాహన చక్రవర్తులక్రింద సామంతరాజులుగా వుండి వీరు తరువాత స్వతంత్రులై పల్లవనాడును (నేటి పలనాడు) కేంద్రంగా చేసుకుని దక్షిణాన కంచివరకు ఆక్రమించుకుని కంచిలో రాజ్యం స్థాపించారు. పల్లవుల రాజ్యపరిపాలనాకాలంలో మొత్తం 21 మంది పల్లవరాజులు పరిపాలించారు.

వీరిలో మొదటి మహేంద్రవర్మ క్రీ. శ. 600 నుండి 630 వరకు పరిపాలించాడు. సింహవిష్ణుని మరణానంతరం అతని పుత్రుడు మొదటి మహేంద్రవర్మ కాంచీపుర పల్లవరాజ్యానికి అధిపతి అయ్యాడు. ఈతడు పల్లవవంశపాలకులలో సుప్రసిద్ధుడు. ఇతడు కళాప్రియుడు. శిల్పకళా విద్యావిశారదుడు. సంగీత విద్యలో దిట్ట. అనేక బిరుదులు సంపాదించినవాడు. రుద్రాచార్య డనే విఖ్యాత సంగీత విద్వాంసునికి శిష్యుడు. ఈయన ఒక సంగీత గ్రంథాన్ని రచించి కుడిమియామలై అనే చోట శిలాక్షరాలను చెక్కించాడు. ఈయన సంగీతంలో ఎంత ప్రావీణ్యం కలవాడో సాహిత్యంలోనూ అంత గొప్పవాడు.

పల్లవుల తరువాత సాలంకాయనులు పశ్చిమగోదావరిలోని వేంగిని రాజధానిగా చేసుకుని 300 నుండి 420 వరకు పరిపాలించారు. ఈ కాలంలో వర్ధిల్లిన లలితకళావికాసం ఎటువంటిదో మనకు తెలియదు.

విష్ణుకుండినులు :

తరువాత విష్ణుకుండినులు 420 నుండి 620 వరకు, అమరావతి రాజధానిగా పరిపాలించారు. గుంటూరుజిల్లాలోని వినుకొండ వీరి స్వగ్రామం. వినుకొండకే

విష్ణుకుండిన అనే పేరు వచ్చింది. ఈ వంశంలో మొత్తం 9 మంది రాజులు పరిపాలించారు.

విష్ణుకుండిన రాజులు కేవలం సాహిత్యపోషకులేకాక కళాపోషకులు కూడాను. వీరు హిందూ గుహాలయాలను నిర్మించి వాస్తుశాస్త్రానికి ప్రాముఖ్య మిచ్చారు. విజయవాడవద్ద మొగల్ రాజపురంలోని గుహాలయాలు, ఉండవల్లి గుహాలయాలు వీరు నిర్మించినవే. మొగల్ రాజపురంలో బహుబాహువులు గలిగిన నటరాజమూర్తి శిథిలావస్థయం దున్నప్పటికీ కళా దృష్టిలో మాత్రం నిరుపమానమైంది.

వీరి తరువాత ఆంధ్రదేశాన్ని పరిపాలించినవారు కళింగరాజులు. వీరి పాలనలో లలితకళావికాసం ఎటువంటిదో మనకు తెలియరావడంలేదు.

---

# చాళుక్యచోళుల నాటి సాంఘిక పరిస్థితులు



చాళుక్యరాజులు (32 మంది) క్రీ. శ. 624 నుండి 1118 వరకు 500 సంవత్సరాలు ఆంధ్రదేశాన్ని నిరాఘాటంగా పరిపాలించారు. పూర్వ చాళుక్యుల్లో మొదటి చాళుక్యభీముడు క్రీ. శ. 910 ప్రాంతంలో విజయవాడ ఇంద్రకీలాద్రి పర్వతం మీద శివాలయాన్ని కట్టించి అందులో పార్థివేశ్వరస్వామిని ప్రతిష్ఠించాడు.

ఈ చాళుక్యభీమునికి లలితకళల్లో అభిమానం ఎక్కువ. గాంధర్వ నాట్య విద్యల్లో అభిరుచి ఎక్కువ. సమస్తగాంధర్వ విద్యావిశారదయగు చల్లవ అనే వారవిలాసిని ఆయన ఆస్థానంలో వర్ధిల్లింది. చల్లవ తండ్రి మల్లప్ప సంగీత శాస్త్రంలో ఆరితేరిన విద్వాంసుడు. ఆనాటి గాయక శిఖామణుల్లో మల్లప్ప తుంబురుడవి ప్రఖ్యాతివహించాడు.

చాళుక్యభీముని కాలంలో సంగీతంతోపాటు సాహిత్యంకూడ పెంపొందింది. భట్టవామను డనే కవి ఈయన ఆస్థానకవిగా వుండి కావ్యాలంకార సూత్ర మనే అలంకారశాస్త్ర గ్రంథాన్ని రచించాడని కొందరు చరిత్రకారుల అభిప్రాయం.

కళ్యాణి చాళుక్యులు :

క్రీస్తుశకం 1126 నుండి 1139 వరకు మూడవ సోమేశ్వరుడు (విక్రమాదిత్యుని కుమారుడు) భూలోకమల్ల బిరుదుతో 13 సంవత్సరాలు రాజ్యపరిపాలన చేశాడు. ఈతడు సర్వజ్ఞచక్రవర్తి అని బిరుదు పొందాడు. అభిలషితార్థచింతామణి అనే సకల భారత విజ్ఞానఖనియైన గ్రంథాన్ని రచించాడు. ఈయన అనేకమంది కవులను పోషించాడు. జాయపసేనాని నృత్తరత్నావళిలో చాళుక్య సోమేశ్వరుడు ముందెప్పుడో కళ్యాణకటకంలో భూతమాతృ మహోత్సవంలో 'భిల్లి' వేషం ధరించి, నృత్యగానాలు చేసే ఒక స్త్రీని చూచి మెచ్చుకున్నాడని, ఆ నృత్యమే గొండలి, లేక గొండగి అయి, తరువాత అదే గొండ్లి ఐందనీ వివరించాడు. మూడవ సోమేశ్వరుడు స్వయంగా నాట్యాచార్యుడు. నట్టువు, గొండ్లి అనే నృత్యంలోని దోషాలను ఎవరో అడుగగా, దోషాలను సరిదిద్ది ఆడి చూపించాడు. నాటి రాణులూ సంగీత, నృత్త, వాద్యాదివిద్యల్లో ఆరితేరినవారు.

దేశికవిత-ఆంధ్రుల ప్రథమ ప్రబంధం :

చాళుక్యరాజులు దేశికవితను ఆంధ్రదేశంలో నిలిపారనీ, కవిత్వంలోనూ దేశీ, మార్గ రీతు లున్నట్లూ నన్నెచోడుడు కుమారసంభవంలో తెలియజేశాడు. కుమారసంభవమే ఆంధ్రుల మొట్టమొదటి ప్రబంధంగా పేర్కొనవచ్చు. చాళుక్యరాజుల కాలంలో ప్రజలు ఊయలపాటల్ని, గొడుగీతాలను పాడుతూవుండేవారని అభిలషితార్థచింతామణిలో ఉదాహరింపబడింది.

నన్నెచోడుడు, వినోదాలవర్ణన :

ఆ రోజుల్లో బాలబాలికలు చిలకబొమ్మల్ని, దంతపుబొమ్మల్ని, తోలుబొమ్మల్ని తయారుచేసి ఆడుతూ వుండేవారట. నన్నెచోడుడు తన కుమారసంభవంలో ప్రప్రథమంగా రంభ నాట్యవర్ణనను గురించి ప్రస్తావించాడు. ఆనాటి వినోదాల్లో

అనేకం నేటివరకూ నిలిచి వున్నాయి. ఆనాడు అంకమల్లవినోదం, కోళ్ళపందాలు, లావకపిట్టల కొట్లాటలు, మేషమహిషయుద్ధాలు, పావురాల పోట్లాటలు, గీతవాద్య నృత్యాలు, కథలు, ప్రహేళికలు, చదరంగం, పాములాటలు, మోడీలు, గొడి, మాధ్వి మొదలైన వెన్నో వున్నట్లు అభిలషితార్థచింతామణినుండి ప్రతాపరెడ్డిగారు ఆంధ్రుల సాంఘికచరిత్రలో ఉదాహరించారు.

చాళుక్యచోళులు :

చాళుక్యచోళయుగంలో రాజులు యుద్ధంలో విజయం పొందినప్పుడు వారి విజయ పరంపరల ఆనందంలో శివ, విష్ణు విగ్రహాలను ప్రతిష్ఠచేసి ఆలయాలను నిర్మించడంతోపాటు, స్వామివారి ధూప, దీప, నైవేద్యాది అంగ, రంగ, వైభోగాల నిమిత్తం సాని, మాని, నిబంధనకారులను దాసరినాయకము లేర్పాటుచేసి వృత్తు లిచ్చి క్షేత్రవైభవాన్ని పెంచారు.

ఈరీతిగా ఈ కాలంలో దేవాలయాలలో సంగీతం, నాట్యం, శిల్పం, చిత్ర లేఖనం, సాహిత్యాది లలితకళలను అఖండంగా పోషించాడు. ఆయన తన ఆస్థానం ఒక ప్రదర్శనశాలగాను, విద్యాస్థానంగాను అలంకరించాడు. ఆయన ఏర్పాటుచేసిన దేవాలయాలలో మూడువందల మంది సానులు, మూడువందల మంది మానులు కలిసి దేవాలయ కార్యాలను నిర్వహించేవారట.

దేవాలయాలు :

సామర్లకోట భీమేశ్వరాలయంలోని నందిమండప స్తంభాలమీద చెక్కబడిన గాయకీ, నర్తకీ, శిల్పప్రతిమలు ఆ కాలపు తూర్పు చాళుక్య శిల్పకళకు ముఖ్య లక్షణాలు. ఇక్కడ హల్లీసక మనే దేశిలాస్యం (కోలాటం) చూపబడింది. ఇందు లోని ఆటకత్తెలు జతలు జతలుగా చీలి ఆటయొక్క లయ కనుగుణంగా కోలాటపు కోలలతో తాళం వేస్తున్నట్లుంది.

ద్రాక్షారామంలోనూ, సామర్లకోట భీమవరంలోనూ గల భీమేశ్వరాలయా లలో కోలాటం వేసే నర్తకీమణుల ప్రతిమల వరుసలను స్తంభాలమీద చూడ వచ్చు. సంగీతం, నృత్యం మొదలైన లలితకళలమీద ఆకాలంలో ప్రజల కుండిన

ఆదరణను వ్యక్తంచేసే ఇటువంటి శిల్పకల్పన తరువాతి శతాబ్దాలలో ఇంతకంచే అధిక ప్రజాదరణకు పాత్రమై వుండటం విజయనగర చరిత్రవల్ల తెలుస్తూ వుంది. ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని 10 వ శతాబ్దంలో చాళుక్యభీమరాజు నిర్మించా డని ప్రతీతి.

మహాభారత అవతరణ:

ఒక విశిష్టమైన జాతిగా చాళుక్యరాజుల కాలంలో ఆంధ్రులు స్థిరపడ్డారు. తూర్పు చాళుక్యరాజైన రాజరాజనరేంద్రుడు రాజమహేంద్రవరం రాజధానిగా వేంగీదేశాన్ని క్రీ॥ శ॥ 1022 నుండి 1063 వరకూ పాలించాడు. అన్నదమ్ముల కలహంతో వేసారిపోయిన రాజరాజనరేంద్రుడు అన్నదమ్ముల కలహగాథైన మహాభారతగాథను ఆస్థానకవియైన నన్నయ భట్టారకునిచే వ్రాయించడానికి 1050 ప్రాంతంలో పూనుకున్నాడు. కాని ఆంధ్ర మహాభారతం అసలు నన్నయ ప్రారంభించినా ఏ కారణాలవల్లనో ఆ తరువాత రెండువందల సంవత్సరాలకు-1260 లో కాకతీయ గణపతి చక్రవర్తి ఆస్థానంలో ఉన్న తిక్కన ఆ మహాభారతాన్ని పూర్తిచేశాడు. ఈ విధంగా మహాభారతం తెలుగు గడ్డమీద అవతరించింది.

నన్నయకాలానికే భాసుడు, కాళిదాసు, శూద్రకకవి, శ్రీహర్షుడు, భవభూతి మొదలైన ప్రసిద్ధ నాటకకర్తల నాటకాలు వ్యాప్తిలో వున్నాయి. కాళిదాసుని శాకుంతలంతోనూ, భవభూతి ఉత్తర రామచరిత్రంతోనూ తనకు సంబంధ మున్నట్లు నన్నయ రచనల్లో కనబడుతూ వుంది.

నన్నయకాలంలో నాటక ప్రదర్శనాలు జరుగుతూ వుండే వనడానికి ఉదాహరణగా, రాజరాజనరేంద్రుడు తనతో చెప్పినట్లు నన్నయ మహాభారతం అవతారికలో,

చ॥ విమలమతిన్ బురాణములు వింటి ననేకము, లర్థధర్మశా
స్త్రముల తెఱం గెఱింగితి, నుదాత్తరసాన్విత కావ్యనాటక
క్రమములు పెక్కు సూచితి, జగత్పరి పూజ్యములైన ఈశ్వరా
గమములయందు నిల్పితి ప్రకాశముగా హృదయంబు భక్తితోన్.

అని ఉదాహరించాడు. ఆ కాలంలో పురాణపఠన శ్రవణం. శాస్త్రాలను గురించి తెలుసు కోవడం, నాటకాలను చూడడం మొదలైనవున్నట్లేకాక, కన్నులారా నాటకాలను

చూచినట్లు రాజరాజనరేంద్రుడు చెప్పడమే ఆ కాలంలో నాటకా లున్నాయనడానికి బలమైన నిదర్శనం.

తిక్కన సోమయాజి భారతం విరాటపర్వంలో ఉత్తర నేర్చుకున్న విద్యల్ని వర్ణిస్తూ దండలాసకం, కుండలి, ప్రెక్కణం, పేరణం మొదలైన నాట్యభేదాల్ని పేర్కొన్నాడు. విరాట ఉద్యోగపర్వాలలో నాట్యనాటకాల ప్రస్తక్తి కొల్లలుగా వుంది. ఆనాడు తోలుబొమ్మలు ఆడినట్లూ భారతం విరాటపర్వంలో (పే.164) వివరించబడింది.

పల్నాటి వీరచరిత్ర :

వేంగీ చాళుక్యరాజుల పరిపాలన క్రీ. శ. 1100 తో అంతమైన తరువాత, చోళ, చాళుక్య మైత్రి ఫలితంగా రాజరాజనరేంద్రుని సంతతివారు కాంచీ నగరంలో పరిపాలన ప్రారంభించారు.

ఈ తరుణంలో ఆంధ్రదేశంలో వెలనాటిచోడుల ఆధిపత్యాన అనేకమంది సామంతరాజులు పరిపాలించారు. నిజానికి వీరంతా సర్వస్వతంత్రులు. ఈ చిన్న రాజ్యాల మధ్య అనేకతగాదాలు, వైషమ్యాలు పెరిగిపోయి, 1172, 1882 మధ్య కాలంలో గుంటూరుజిల్లా పల్నాడు తాలూకా కార్యంపూడిలో పల్నాటియుద్ధంగా పరిణమించింది.

పల్నాటి వీరచరిత్రను గురించి ఆంధ్రదేశంలో తెలియనివారెవరూ లేరు. ఈ వీరకథను పలనాటిలో పర్యటించిన శ్రీనాథమహాకవి ద్విపదకావ్యంగా రచించాడు. దీనిని ఆంధ్రదేశంలో జానపద గాయకులైన పిచ్చుగుంటలవారు విపరీతంగా ప్రచారంలోకి తీసుకువచ్చారు.

పలనాడులో గురజాల రాజధానిగా పరిపాలించిన నలగామరాజు దర్బారులో జరిగే ఆనాటి సంగీత నృత్యవాద్య విశేషాలను శ్రీనాథుడు ఈవిధంగా వర్ణించాడు:

చింతగా గాయనుల్ వీణలుబూని-తంత్రులు బిగియించి తగ సుతిబెట్ట
సరిగమేళములైన స్వరసప్తకంబు-ఆరోహణావరోహణ భేదములను
బహుచాగసంప్రాప్తి పట్టుగా జేర్చి-సంచారి సంస్థాయి సరసభావముల
మృదుతరశబ్దార్థ మిళితమైవట్టి-ఘనతరాలంకార గతిపరంపరలు

పూర్ణనల్ మొదలైన ముఖ్య ధర్మములు-జంత్రగాత్రంబులు జంటగావించి
చెలగి యెండిన చెట్లు చిగిరించునట్లు-పాడిరి తమతమ ప్రావీణ్య మెసగ
ప్రాకశాసను కొల్వువగిది నున్నట్టి-వేళ నేతెంచిరి విద్యాధికతను
నాట్యమేళమువారు నవవిలాసముల-వచ్చి నమ్రత మ్రొక్కి ప్రక్కగా నిల్వ
ఘనవైభవంబున కామభూవిభుడు-నవ్వుచు సెలవిచ్చె నాట్యంబుచేయ
వరమృదంగము లెప్పువాయించు మేటి-కుడిభాగమున యందు కుదురుగా నిలిచె
తాళమానజ్ఞులు దాపటి దిశను-నిలిచి రుత్సాహంబు వేరుపు మీర
ముఖవీణ వాయించు ముఖ్యు డొక్కండు-రాగ మాలాపించు రమణు లిద్దరును
నిండువేడుకతోడ నిలిచిరి వెనుక-కంజలోచన యను ఘనమైన పాత్ర
మదను వట్టిపుదంతి మంజులవాణి-భరతశాస్త్రోచిత బహురాగములను
గరిమతో వేర్చిన కంతు బాణంబు-వచ్చి సభాసదుల్ వర్ణించిచూడ
నిలిచి నాట్యమునకు నేర్పరియైన-వేత్రపాణికి దగ వినయంబు జూపి
అత డొసంగిన గజ్జె లతిభక్తితోడ-పాదములం గట్టి పంచవర్ణముల
కాశ గట్టిగ గట్టి కడు జవం బడర-మద్దెల తాళాల మధ్య నిల్చుండి
ఓరచూపున రాజునొయ్యనజూచి-నమపాదయుతమైన స్థానకస్థితిని
తాత్పర్యమున దేవతలకునుమ్రొక్కి-పుష్పాంజలి యొసంగి పూని నాట్యంబు
సమకట్టి నాదంబు సభయెల్లగ్రమ్మ-కైకోలువిడుదలల్ ఘనకళాకేళి
క్రమ్ముడికట్నముల్ కనుపింపజేసి-వెలయంగ తొమ్మిదివిధములయినట్టి
భూచారి నాట్యంబు పొందుగాసలిపి-పదునారు విధములై వరగినయట్టి
ఆకాశచారియు నమరంగనాడి-అంగహారాఖ్య గలట్టి నాట్యంబు
విదితమౌ తొమ్మిది విధముల నాడి-గతిచారి భేదముల్ గనుపడునట్లు
భ్రమణసంయుత దీప్తవటిమమీరంగ-పాణిభేదములను బాటించిచూపి
స్థానకసంచయ సంయుక్తి యమర-ప్రేరణదేశిని ప్రేంఖణబద్ధ
డండికాకుండలి తగుబాహుచారి-సప్తతాంతవములు నల్పె ఒత్తిమిగ
సభవార లాశ్చర్య సంయుక్తు లైరి-తరువాత నిరుమేల దగు చెలు లమర
సంయుతా సంయుతా చలనసంకుచిత-నానార్థకరములు నాట్యహస్తములు
శిరమును చూపులు చెక్కిళ్ళు భ్రూములు-దంతోష్ఠకంఠముల్ తగు చుబుకంబు
ముఖరాగవక్షముల్ మొదలుగా వెన్న-అంగంబు లారు ఉపాంగంబు లారు
ప్రత్యంగసముదయం బారునుం గూడి-యొనిమిది వది యగు నెనసు నంగంబు
లమరంగ నభినయం బాశ్చర్యముగను-మాచెర్ల చెన్నుని మహిమంబు తెలుపు
ఆంధ్రసంస్కృత వాఙ్మయాది గీతముల-భావంబు లెస్సగా వ్యక్తంబు చేయ

చూచి రంభాదులు చోద్యంబు నొంది-శిరసులు వంచియు సిగ్గును జెంది
రప్పుడు భూమీశ డాదరం బొవ్ప-వస్త్రభూషణములు వారల కిచ్చి.

భట్టునురష్మని పంపించెవంత—

ఈ నృత్యంలో ముఖవీణలు వాయించేవారిని, మృదంగ విద్వాంసుల్ని, లయప్రకారం తాళంవేయగల తాళమానజ్ఞుల్ని, బహుంకాగాలను అన్ని స్థాయిలలోనూ పాడగల ప్రజ్ఞావంతుల్ని, జంటగాత్రాలు కలిపి రాగం ఆలాపించే రమణులగూర్చి కూడా వివరించాడు శ్రీనాథుడు.

పానకంలో పుడక :

ఇంతటి లలితకళావికాసంతో వర్ధిల్లిన పలనాటిసీమలో అన్నదమ్ముల కలహకార ణంగా పల్నాటియుద్ధం ప్రారంభమైంది. పల్నాటియుద్ధానికి కేవలం రాజకీయ కారణాలేకాక సాంఘికమైన ప్రాధాన్యంకూడా ఎంతో వుంది. రామానుజుని వైష్ణవ మతం 11వ శతాబ్దంలో తమిళదేశంలో ప్రారంభమై ఆంధ్రదేశంలో ప్రవేశిస్తే, బసవయ్య వీరశైవమతం 12 వ శతాబ్దంలో కన్నడదేశంలో ప్రారంభమై ఆంధ్ర దేశంలో ప్రవేశించింది. ఈ రెండు మతాల ప్రాబల్యమూ పలనాటి యుద్ధంమీద చాలా వుంది.

వైష్ణవమతం ఆంధ్రదేశంలో ప్రవేశించకముందునుంచీ శైవమతం చాలా కాలంగా ఆంధ్రదేశంలో ప్రచారంలో వుంది. చాళుక్యరాజులు ఎక్కువమంది శైవ మతాన్ని ప్రోత్సహిస్తే తెలుగుచోడులు శైవ, వైష్ణవమతాలు రెంటినీ సమన్వయ దృష్టితో ఆదరించారు.

ఈ మతాల విజృంభణ ఆనాటి సాంఘిక ఆచారవ్యవహారాలలో, సంగీ తంలో, నృత్యంలో, సాహిత్యంలో, దేవాలయవాస్తు నిర్మాణంలో, శిల్పంలోనూ ఎంతో మార్పు తీసుకువచ్చింది.

శైవమతము, కళాపోషణ :

విష్ణుకుండిన వంశం తరువాత ఆంధ్రదేశాన్ని పరిపాలించిన పూర్వ చాళుక్యులు వైదికమార్గ నిరతులైనప్పటికీ ఈ వంశం వారిలో చాలామంది శైవమతాన్ని

అవలంబించిన పరమమహేశ్వరు లున్నారు. వీరి కాలంలో ఇతర ప్రాంతాలనుండి పాశుపతి శివాచార్యులు తెలుగు దేశానికి వచ్చి, పాశుపత శైవసాంప్రదాయాన్ని వ్యాపింపజేసి శివాలయాల్లో స్థానాపతులుగా వున్నారు. అట్టి వారిలో మొట్టమొదటి సారిగా తెలుగు శాసనాలలో తెలిసినవారు వామశివ, పురుషశివ అనే పేర్లు గల శివాచార్యులు. వీరు చాళుక్యకులజుడైన మంగి యువరాజు పుత్రుడైన విష్ణువర్ధనుని శాసనాలలో పేర్కొనబడ్డారు. ఆయన ఏలూరు దగ్గర ఉన్న వసంతవాడ గ్రామంలోని శివాలయత్రయానికి, వాద్య, వాదక, గాయక, నటకాచార్య విలాపినీ జనభృతి నిమిత్తం 'వసన్ధూ'రను ప్రాచీననామం గల వసంతవాడలో కొంతభూమిని దానం చేసి దానశాసనం వ్రాయించి ఆ శివాచార్యులపరంగా ఇచ్చియున్నాడు.

శైవమతం భక్తిసాంప్రదాయంగా వ్యాపించడంతో శివలీలలు పాడటం, అభినయించటం, శివకథలు ఆడటం వాడుకలోకి వచ్చి నాట్య సంగీత కళలు వృద్ధి పొందాయి. శివాలయాల్లో అంతకుపూర్వం పెద్ద పెద్ద మండపా లుండేవి కావు. ఇప్పుడు వాటిలో నాట్య, సంగీత, మండపాలు ఏర్పడినాయి.

ఆ దేవాలయాలలో స్వామి అర్చనావసరాన శివలీలలు పాడి అభినయించ డానికి పాత్రధారులు నియమితులై ఉండేవారు. స్వామివారి అంగ, రంగ, వైభో గాల నిమిత్తం శ్రీమంతులు, మహారాజులు, సామంతులు, మాండలికులూ మాన్యాలను దానంచేయడం ఆచారమైంది ఆనాడు. దేవాలయాలు సంగీత, నాట్య కళలకూ, విద్యలకూ ఆధారభూతమైనాయి.

శైవుల దేశికవిత :

శైవ, వైష్ణవమతాల ప్రాబల్యం వచ్చిన తరువాత సాహిత్యంలోనూ, నాటకరచన లోనూ, గేయవాఙ్మయంలోకూడ పెద్ద మార్పు రాసాగింది. గేయరచనకూ, సంగీ తానికీ తెలుగుభాష అనుకూలంగా వుండడంవల్ల జనసామాన్యానికి అర్థమయ్యే రీతుల్లో శైవకవులు, శైవమత ప్రచారంకోసం, వచన నాటకాల్ని వదలి, పద్య రచనతో కూడుకున్న వాఙ్మయాన్ని సృష్టించారు.

అంతేగాక ఆనాడు దేశీయనాటక రచనకు దారి చూపించిన వారుకూడ శివ కవులే. జనసామాన్యాన్ని తేలిక పద్ధతుల్లో ఆకర్షించటానికి వారు సంస్కృత నాట కాల పద్ధతిని మాని, దేశిపద్ధతిని ప్రారంభించారు.

దేశినాటకాలు మాత్రం ప్రజాసామాన్యంలో ప్రదర్శింపబడేవి. ఈ నాటకాలను శైవమత ప్రచారకులు ఎక్కువ వ్యాప్తిలోకి తెచ్చారు. దేశినాటకాలు పురాతనకాలంనుంచీ ప్రజాసామాన్యం యొక్క అభిమానాన్ని చూరగొన్నవి. దేశినాటక సాంప్రదాయాలు చాలావరకు శివకవుల ఆధ్వర్యంలోనే వర్ధిల్లాయి. అవి బహుజనరంజకంగానూ, తేలిక పద్ధతిలోనూ సామాన్యప్రజలకు అర్థమయ్యే శైలిలోనూ వ్రాయబడ్డాయి. ఆనాడు ఆర్యసాంప్రదాయం ప్రకారం నాటకాలాడే నటకులను పంక్తిబాహ్యులుగా నిర్ణయించారు. అటువంటివారికి సంఘంలో గౌరవమర్యాదలు శూన్యం.

కాని శైవమతాన్ని అవలంబించినవారికిగాని, ఏవిధమైన జాతివిచక్షణా లేని జంగాలకుగాని ఇటువంటి నిర్ణయాలను, విధినిషేధాజ్ఞలను వారు పాటించలేదు. అంతేగాక శైవమతాన్ని అవలంబించిన బ్రాహ్మణాది అగ్రవర్ణాలవారికి కూడ ఏవిధమైన పట్టింపూ లేకపోవడంవల్ల అగ్రజాతులవారందరూ దేశినాటకాలనే ప్రదర్శించారు.

ఇక్కడ గమనించవలసిన విషయ మేమంటే శైవభక్తులైన జంగాలు మొదలైనవారు శివ సంబంధమైన కథా ఇతివృత్తాలనే తీసుకుని రచనలు సాగించారు. వేరు కథా వస్తువుల్ని వారు స్వీకరించలేదు. నాటకాలాడడంలో జంగము వారు ముఖ్యులని కృష్ణదేవరాయల కాలంలో వున్న బైచరాజు వేంకటనాథ కవి "కడివోని తెలనాటకపు టూరిజంగాలు" అని పేర్కొన్నాడు.

పై విషయాన్నిబట్టి శైవ సంబంధమైన ఇతి వృత్తాలుగల నాటకాలే ప్రథమంగా వ్రాయబడ్డాయని చెప్పవచ్చు.

వైష్ణవమతం, కళాపోషణ :

పదకొండవ శతాబ్దంలో దేవాలయ నిర్మాణంలో పెంపు కలిగింది. అంతవరకూ ఒక గర్భగృహమూ, అంతరాళికమూ, ముఖమండపాలతో వున్న దేవాలయాలలో ప్రధానదైవాలకేకాక, పరివారాలకు కూడ గృహాలేర్పడ్డాయి. పన్నిద్దరాళ్వారులను విష్ణుభక్తులు పన్నెండవ శతాబ్దంలో విష్ణ్వాలయాలలో విగ్రహరూపంగా ప్రవేశించారు. దేవాలయ విన్యాసాలలో కళ్యాణమండపం, సభామండపం, నాట్య



మండపం మొదలైన అనేక మండపాలు అంతర్భాగాలైనాయి. నాట్య, సంగీత, చిత్రకళానిలయమై దేవాలయం ఒక కళా పోషకసంస్థ ఐంది.

శైవం, వీరశైవం, వైష్ణవం విజృంభించిన కాలంలో, దేశంలో అనేకమైన శైవ, వైష్ణవదేవాలయాలు ఏర్పడ్డాయి. ఈ ఆలయా లన్నీ సంగీత నాట్యాలను ఎక్కువగా ఆదరిం చాయి. ప్రతి ఆలయంలోనూ దేవపూజాసమయంలో నాట్యం జరిగేది. ఉత్సవసమయాల్లో ప్రత్యేకమైన ప్రదర్శనాలు జరి గేవి. ప్రతి దేవాలయంలోనూ నాట్యమండపాలుండేవి. అనేక మంది గాయకులూ, వాద్యకులూ, నర్తకీ, నర్తకులూ దేవాలయ సిబ్బందిలో ఒక భాగంగా వుండేవారు. అనేకమంది శిల్పులు దేవాలయాలమీదా, స్తంభాలమీదా, గోడలమిదా, ద్వారబంధాలమీదా అనేకమైన భరతనాట్య కళారీతుల్ని చెక్కి నాట్య కళాసేవ చేశారు.

పల్నాటియుద్ధంవల్ల అపారజననష్టం కలిగింది. ఇరుపక్షాలకూ తోడ్పడిన అనేకమంది చిన్న చిన్న సామంతరాజులందరూ ఈ యుద్ధంలో నాశనమయ్యారు. ప్రజలు అనేక కష్టనష్టాలకు గురైనారు. సుస్థిరమైన ప్రభుత్వంకోసం ఎదురుచూడ సాగారు. ఈ పరిస్థితిని గమనించిన కాకతీయులు దిగ్విజయయాత్రలను ప్రారం భించి, సామంతరాజులందరినీ ఓడించి ఆంధ్రదేశా న్నంతా తమ ఏలుబడిక్రింద ఐక్యంచేసి సుమారు 200 సంవత్సరాలు రాజ్యపరిపాలన చేశారు.

పల్నాటియుద్ధం నాటికే ఆంధ్రదేశమంతటా బహుళ వ్యాప్తి పొందిన వీరశైవమతం కాకతీయుల కాలంలో - 1200 1300 సంవత్సరాల మధ్య ఎంత వుధృతంగా వ్యాపిం చిందో ముందు చూడగలం.



దేవాలయాలు, నాట్యకళ:

ఏ రాజులు ఏ కళాసాంప్రదాయాన్ని పోషించారో, ఏ శిల్పులు ఏ శిల్పాన్ని మలిచారో, ఏ కళాకారులు ఏ నృత్యాలను ప్రదర్శించారో మనకు సరియైన సాక్ష్యాధారాలు లేకపోయినా, నేటి ఆంధ్రదేశంలో ఉన్న పురాతన దేవాలయాలన్నిటిమీదా

నాట్య శిల్పాలు చెక్కబడి మనకు దర్శనమిస్తున్నాయి. ఒకనాడు వృద్ధుతంగా ఆంధ్రదేశంలో అభివృద్ధిపొందిన నాట్యకళకు సాక్ష్యధారాలు ఈ శిల్పాలే. నాటి దేవాలయాలు హిందూ సంస్కృతినీ, లలితకళాసంప్రదాయాలనూ చిత్రిస్తున్నాయి.

ఆనాడు దేవస్థాన నాటకరంగస్థలంలో దేవదాసీలు ఏయే భంగిమలతో నృత్యాలను ప్రదర్శించేవారో ఆ రూపాలన్నిటినీ శిల్పులు సుందరంగా మలిచారు. ముఖ్యంగా దేవాలయాల్లో దేవదాసీల ఆరాధన నృత్యాలు జరిగేవి. శైవ సన్నిధిలో శైవాన్ని స్తోత్రంచేస్తూ నృత్యగానాలు జరిపేవారు. శైవదేవాలయాల్లో శైవ సాంప్రదాయాన్ని, వైష్ణవదేవాలయాల్లో వైష్ణవసాంప్రదాయాన్ని ప్రదర్శించేవారు



దేవాలయ శిల్పంలో నృత్యకళ కిచ్చిన ప్రాముఖ్యాన్నిబట్టి లలితాకళాపోషణ ఆనాడు ఎంతగా జరిగిందో మనం అర్థంచేసుకోవచ్చు.

శ్రీశైల దేవస్థానంలో పూర్వం శృంగనాట్యం, సప్తలాస్యం ప్రదర్శించినట్లు ఆలయ శిల్పాన్నిబట్టి పూర్వం శైవసాంప్రదాయ నృత్యాలు జరిగినట్లు తెలుస్తూవుంది. భామాకలాప, గొల్లకలాప ఇతి వృత్తాలు శ్రీశైల భ్రమరాంబస్తవంతో ప్రదర్శింపబడేవట.

ఇలాగే ఆంధ్రదేశంలో ఈ క్రింద వుదాహరించిన ఆయా ప్రాంతాల్లో దేవాలయ నృత్యకళ అభివృద్ధి చెందింది.

పిఠాపురం కుంతిమాధవుని దేవాలయంలో వైష్ణవసాంప్రదాయ నృత్యాలైన భామాకలాపం, గొల్లకలాపం ప్రదర్శింపబడేవి.

తిరుపతి వెంకటేశ్వర దేవస్థానం వైష్ణవసాంప్రదాయానికి చెందినప్పటికీ, ఇక్కడ నృత్య విద్యావికాసం అంతగా కనిపించడం లేదు. కాని గాన పద్ధతికి సంబంధించిన రచనలు మాత్రం కొల్లలుగా వున్నాయి. తాళ్ళపాక అన్నమాచార్యులు వెంకటేశ్వరుని పైన రచించిన సంకీర్తనలు ఆకోవకు చెందినవే.

శ్రీకాకుళం ఆంధ్రమహావిష్ణు దేవాలయంలో వైష్ణవసాంప్రదాయంతో ఆరాధన నృత్యకళ అభివృద్ధి చెందింది.

బాపట్ల భావనారాయణస్వామి దేవస్థానంలో సిద్ధాబత్తునివారు వైష్ణవ సంప్రదాయానుసారం శాస్త్రీయ నృత్యకళను రూపొందించారు.

శ్రీకాకుళంజిల్లాలో వున్న మరో పెద్ద క్షేత్రం శ్రీకూర్మం. ఇది వైష్ణవ సాంప్రదాయానికి సంబంధించిన క్షేత్రమైనప్పటికీ, నృత్యానికి సంబంధించిన భక్తి సంప్రదాయం ఇక్కడ ప్రచారంలో కొచ్చింది.

మాచెర్ల శైవ, వైష్ణవసాంప్రదాయాలకు పుట్టినిల్లు. రెండు మతాలవారూ చెన్న కేశ్వర దేవాలయంలోనూ, వీరభద్రేశ్వరాలయంలోనూ, వారి వారి సాంప్రదాయాల ననుసరించి నృత్యకళను కేళికపద్ధతిలో ఆరాధించారు.

చెయ్యూరు సుందరేశ్వరస్వామి దేవాలయం శైవ సంప్రదాయానికి సంబంధించింది.

ఈ ఆలయంలో వాద్యవిశేషాలతో ఆరాధన నృత్యాలు జరిగేవి. యక్షగాన పద్ధతి ప్రదర్శనలుకూడా జరిగేవి. ఈ స్వామిపైన అనేక భక్తి రచనలున్నాయి.

జొన్నవాడ అంబదేవస్థానంలో శైవసాంప్రదాయాల ననుసరించి అంబను స్తుతిస్తూ నృత్య ప్రదర్శనాలు జరిగేవి.

కాళహస్తి దేవాలయంలో శైవసాంప్రదాయ నృత్యాలు జరిగేవి.

మార్కాపురం వైష్ణవదేవాలయంలో కేళికపద్ధతిలో ఆరాధన నృత్యాలు జరిగేవి.

ఈ విధంగా ఆంధ్రదేశపు నాలుగు చెరగులా అనేక దేవాలయాలున్నాయి. అన్ని ఆలయాలలోనూ, శైవవైష్ణవ సాంప్రదాయాల ననుసరించి నాట్యశాస్త్రాలున్నాయి. వీటిని పరిశోధించటం ఎంతైనా అవసరం. ఇప్పటికే ఈ పరిశోధనలో పండితులైన నటరాజ రామకృష్ణగారు ఎంతైనా అభివందనీయులు.

---

# కాకతీయుల కళా పోషణ



ఆంధ్రుల చరిత్రలో అత్యంత ప్రసిద్ధిగాంచిన ఓరుగంట్ కాకతీయ చక్రవర్తులు క్రీ. శ. 1050 మొదలు 1350 వరకు దాదాపు 300 సంవత్సరాలు రాజ్యపరిపాలన చేశారు. ఆంధ్రదేశచరిత్రలో కాకతీయులు వర్ధిల్లిన కాలం మహోజ్వలమైంది. కాకతీయ చక్రవర్తులు అనేక మహమ్మదీయ దండయాత్రలకు ఎదురు నిల్చి పోరాడి విశాల సామ్రాజ్యాన్ని నిర్మించారు. ఆంధ్రజాతికి ఒక కర్తవ్యాన్నీ, విశిష్టతనూ చేకూర్చారు. వీరి పరిపాలనా కాలాన్ని మూడు దశలుగా విభజించవచ్చు.

1000-1158 వరకూ కొంతకాలం తూర్పుచాళుక్యరాజులకూ, మరి కొంతకాలం పశ్చిమ చాళుక్యరాజులకూ సామంతులుగా వుండి చిన్న చిన్న రాజ్యాలను ఓడించి చివరకు చాళుక్యరాజుల్ని కూడా ఓడించి స్వతంత్ర ప్రభువులుగా రూపొందిరి. 150 సంవత్సరాల కాలంలో 4 గురు రాజులు పరిపాలించారు. వీరిలో చివరివాడైన రెండవ ప్రోలరాజు అతిప్రసిద్ధుడు.

ముగ్గురు మొనగాళ్ళు :

తరువాతిదశలో 1159-1261 వరకు తెలంగాణాను పునాదిగా చేసుకుని ఆంధ్రదేశాన్నంతా జయించారు. ఈ దశలో మొత్తం ముగ్గురు రాజులు పరిపాలించారు. వీరిలో ప్రసిద్ధుడైన కాకతీయ గణపతిదేవుడు దీర్ఘకాలం (1198-1262 వరకు) పరిపాలించి కాకతీయ రాజ్యాన్ని విస్తరింపజేశాడు.

ఆ తరువాతి దశలో 1262 నుండి 1323 వరకూ పరాయిరాజుల దండయాత్రలనుండి కాకతీయ సామ్రాజ్యాన్ని కాపాడినవారు రుద్రమదేవి, ప్రతాపరుద్రుడు. రుద్రమదేవి అనేకమంది సామంతరాజుల తిరుగుబాట్లు నోడించి, సమర్థవంతంగా రాజ్యపరిపాలన చేసింది. రెండవరాజైన ప్రతాపరుద్రుడు అల్లావుద్దీన్ దండయాత్రల్ని అనేకసార్లు త్రిప్పికొట్టి చివరకు ఓడిపోయి బందీగా చిక్కి భరించరాని కారాగార జీవితంతో ఆత్మహత్య చేసుకున్నాడు.

కాకతీయ చక్రవర్తులు లలితకళల్నీ, సారస్వతాన్నీ పోషించి వాటికి నూతన వికాసాన్ని కలిగించారు. వీరి కాలంలో నాట్యకళ బహు ముఖాల విజృంభించినట్లు

అనేక శాసనాలవల్లనూ, ఆనాటి శిల్పకళవల్లనూ, సాహిత్యంవల్లనూ విదిత మౌతోంది.

కళాకారులకు ఇళ్ళూ వాకిళ్ళు :

దేవాలయకైంకర్యం చేసే నర్తకీమణులకు, మృదంగ విద్వాంసులకు, గాయకులకూ, గృహదానాలుచేసినట్లు పిల్లలమర్రిశాసనంలో వుదాహరింపబడింది.

పానుగల్లుశాసనంలో మైలాంబ గాయకులకు, నర్తకీమణులకు పై విధమైన గృహదానాలు చేసినట్లుంది.

ధర్మసాగరశాసనంలో 'జలజకరండ' మనే అపూర్వమైన వాద్యప్రశంస వుంది. ఈ కరండవాద్యకారులకూ పదిమంది, నాట్యకత్తెలకూ కొన్ని నివర్తనాల భూమిని ఇచ్చినట్లు వ్రాయబడివుంది.

చేబ్రోలుశాసనంలో కాకతిగణపతిదేవుడు నృత్తరత్నావళి రచయిత జాయప సేనాని పదహారుమంది ఆటకత్తెలకు గృహదానాలు చేసినట్లుంది.

మాన్యాలు, సమ్మానాలు :

గుంటూరుజిల్లా, గుంటూరుతాలూకా, మందారమనే (నేటి మందడం)మల్కాపురంశాసనంలో 1183 లో కాకతీయ మహారాణి రుద్రమదేవి విశ్వేశ్వర శివాచార్యుడు స్థాపించిన కోళకీమఠ విద్యాస్థానానికి దేవాలయంలో పదిమంది నర్తకులకూ, ఎనిమిదిమంది మార్దంగికులకూ, కాశ్మీరుగాయనీకీ, పద్మాలుగురు గాయనీమణులకూ, కరదావాద్యంలో ఆరితేరిన కళాకారులు ఆరుగురికీ, వృత్తిమాన్యాలిచ్చి నాట్య సంగీతాలకు పోషణ కల్పించినట్లుంది.

శాసనాలతోపాటు కాకతీయ చక్రవర్తులు కట్టించిన అనేక దేవాలయాలమీద నాట్య సాంప్రదాయాలను ప్రతిబింబించే అనేకమైన నాట్యశిల్పాలున్నాయి. అనేక దేవాలయాలు, శిల్పాలు తురుష్కుల దండయాత్రల్లో చిన్నాభిన్నమైనాయి.

రాణికెక్కిన రామప్పగుడి :

శిల్పకళా నిబిడంగా నిర్మితమైన రామప్పగుడి వరంగల్ జిల్లా ములుగుతాలూకాలో వుంది. ఇది వరంగల్లుకు 40 మైళ్ళదూరంలో వుంది. ఈ గుడిని 1162 లో రుద్ర

సేనాని అనే రెడ్డి సామంతుడు కట్టించాడు. రామప్పగుడి ఆలయ నిర్మాణంలోని చిత్ర కౌశలం, శిల్పనైపుణ్యం వర్ణించనలవికావివి. ఈ కాకతీయ శిల్పచాతుర్యమంతా, ఇన్నేళ్ళు గడిచినా, ఈనాటికీ చూపరులకు అమితానందాన్ని కలిగిస్తూంది. భరత నాట్యాభ్యాసమంతా మూర్తీభవించి, స్తంభాలమీదా, కప్పులమీదా కనబడుతూంది.



రామప్పగుడిలోని విగ్రహాలు, స్తంభాలపై ఉన్న శిల్పాలు ముఖ్యంగా దేవాలయమంటపంపై కోణాల్లో నాలుగు వ్రక్కలా నిలిపిన పెద్ద శిల్ప రాతి నాట్యక త్తెల విగ్రహాలు అతిసుందరమైనవి. ఆ విగ్రహాల సొమ్ముల అలంకరణాలు, వాటి త్రిభంగీ నాట్యభంగిమాలూ శిల్పకారుల్నే సమ్మోహితుల్ని చేస్తున్నాయి. దేవాలయంలోని స్తంభాలపై నాట్యభంగిమలు, మృదంగాది వాద్యముల వారి రేఖలు చిత్రింపబడి వున్నాయి. జాయప సేనాని రచించిన నృత్తరత్నావళిలో ఉదాహరించిన నాట్యశిల్పమంతా రామప్పగుడిలో తొణికిసలాడుతూ వుంది.

పాలంపేటలోని రామప్ప చెరువుకట్ట తూర్పుచివరనున్న దేవాలయం లోపలి భాగంలో స్త్రీలు మద్దెల వాయిస్తూ వుండగా, వివిధ భంగిమలలో నృత్యం చేస్తున్న అనేకమంది ఆటక త్తెల శిల్పాలున్నాయి. అదే దేవాలయం పడమటివైపు ద్వార బంధాలమీద మార్దంగికుల శిల్పాలున్నాయి.

వరంగల్లు రుద్రమదేవి కోట ద్వారబంధంపై రాతిపలకమీద మార్దంగికుల శిల్పాలు చెక్కబడి వున్నాయి.

ఆ కోటలోనే స్వయంభూదేవాలయంలో ఒక చిన్న శివతాండవ నృత్య శిల్పముంది.

విజయ నగరరాజులవారి అంత్య వాద్యాలు



హనుమకొండ వెయ్యి స్తంభాల గర్భగుడి ద్వారబంధాలమీద వివిధ వాద్యాల నృత్య భంగిమలలో స్త్రీల శిల్పా లున్నాయి.

కాకతీయయుగంలో నాట్యకళ బహుళ ప్రచారంలో వున్నట్లు ఆనాటి సంస్కృత గ్రంథాలలో ఉదాహరింపబడివుంది. జాయపసేనాని రచించిన అపూర్వ నృత్యశాస్త్ర గ్రంథం ('నృత్తరత్నావళి'-సంస్కృత గ్రంథం) ఆనాటిదే.

కతివీడడేకాదు కళావీరుడు
జాయపసేనాని :

కాకతి గణపతి దేవచక్రవర్తి కటాక్షానికి పాత్రుడైన జాయప తన స్వయంశక్తి వల్ల సేనాని కాగలిగాడు. ఈయన వీరుడేగాక, కళాకారుడు కూడాను.

నృత్యా లంటే జాయపకు అత్యంత అభిమానం. స్వయంగా నృత్తరత్నావళిని రచించాడు. ఈ నృత్తరత్నావళి భారతీయ నృత్య సంపదకు ఆభరణమని నృత్య విద్యావేత్తల అభిప్రాయం. సంస్కృతభాషలో ఆంధ్రులు రచించిన మొట్టమొదటి నృత్యశాస్త్ర గ్రంథం ఇదేనని మల్లంపల్లి సోమశేఖరశర్మగారు తెలియజేశారు.

దీనిని రచించిన జాయపసేనాని అసలుపేరు జాయన. ఈయన అయ్యకుల సంజాతుడు, పిన్నచోడనపుత్రుడు. తాతముత్తాతలది వెలనాడులోని క్రొయ్యూరు. చందవోలును రాజధానిగా ఆంధ్రదేశాన్ని పరిపాలించిన వెలనాటి మహీపతులవద్ద ఈతని తండ్రీ, తాతా సేవలు చేశారు.

జాయన జాయచమూపతి, జాయసేనాధినాథుడు, గజసాహిణి జాయప, గజసైన్యాధినాథుడు అనే పేర్లతో పిలువబడుతూ వుండేవాడు. గణపతిదేవ చక్రవర్తి జాయపయందు అత్యంత అభిమానంతో అతనికి సకల విద్యలనూ, కళలనూ నేర్పించాడు. ఆ తరువాతనే జాయప అత్యుత్తమమైన నృత్తరత్నావళి రచనకు పూనుకుని క్రీ॥ శ॥ 1253-54 ప్రాంతంలో పూర్తిచేశాడు.

## శాతవాహనుల నాటి జంత్రవాద్యాలు



## నాటి మేటి నాట్యగ్రంథం

### నృత్తరత్నావళి :

నృత్తరత్నావళిలో మార్గ, దేశి నృత్యాలు రెండూ కలిసి కట్టుగా నడిచాయి. ఇందులో ఎనిమిది అధ్యాయా లున్నాయి. మొదటి అధ్యాయం నర్తన వివేకం. రెండవ అధ్యాయం అంగనిరూపణ, మూడవ అధ్యాయం మండల లక్షణం, నాలుగవ అధ్యాయం కరణాంగహార వివేచనానికి సంబంధించింది. ఐదవ అధ్యాయం దేశీ, స్థానక, కరణ, భ్రమరీ లక్షణాలను తెలుపుతూ వుంది. ఆరవ అధ్యాయం దేశీ పాట, చారీలాస్యాంగగతి లక్షణ మనే పేరు గలది. 6-7-8 అధ్యాయాలు అనాటి ఆంధ్రదేశంలో వాడుకలో ఉన్న దేశి, నృత్త పద్ధతులన్నీ వివరించేవిగా వుండి గ్రంథప్రాముఖ్యాన్ని ఎంతగానో చాటుతున్నాయి.

జాయప నృత్తరత్నావళిలో తన కాలంలో ప్రచారంలో ఉన్న దేశి నృత్యా లన్నిటినీ ఆమూలంగా చిత్రించాడు. ఎనిమిది అధ్యాయాలు గల ఈ గ్రంథంలో కడపటి మూడు ఆధ్యాయాలూ దేశి నృత్య సాంప్రదాయాలైన పేరణి, ప్రేంఖణం, రాసకం, చర్చరి, నాట్యరాసకం, డిండరాసకం, శివప్రియం, చిందు, కందుకం, భాండికం, ఘంటసరి, చరణము, బహూరూపం, కోలాటం మొదలైన ప్రాంతీయ ములైన అనేక జానపద నృత్యాలను వివరించాడు.

జాయప నృత్తరత్నావళిని పరికించి చూస్తే భరతముని ప్రసాదించిన భరత నాట్యశాస్త్ర గ్రంథంతోనూ, భరతనాట్యంపై అభినవగుప్తాచార్యుల వ్యాఖ్యానంతోనూ జాయపకు పరిపూర్ణ పరిచయం వున్నట్లు తోస్తూ వుందని కీ॥ శే॥ మల్లంపల్లివారు వ్రాశారు.

జాయప నృత్తరత్నావళిలో నృత్యానికి అనుగుణమైన సంగీత రత్నావళిని గూడ అనుబంధంగా రచించాడట. కాని దురదృష్టవశాత్తూ అది లభ్యంకాకుండా పోయింది.

జాయప 1213 వ సంవత్సరంనాటికే సకల నాట్య వైదికమణి అనీ, కవి సభాశిఖామణి అనీ పేరుపొందాడు. జాయప నృత్తరత్నావళిని 1253-54 నాటికి

రచించడంవలన దాదాపు 60 సంవత్సరాల వయసులో వ్రాసి వుండవచ్చు. ఏమైనా ఈనాడు ఆంధ్రులు గర్వించదగిన పురాతన నృత్యశాస్త్ర గ్రంథాలలో నృత్తరత్నావళి మణిభూషణం.

---

# విప్లవకవి
# పాల్కురికి సోమనాథుడు

ప్రొదటి ప్రతాపరుద్రుని కాలంలో జీవించిన పాల్కురికి సోమనాథుడు, కాకతీయయుగంలో గొప్ప విప్లవ కవిగా వర్ధిల్లాడు. బసవపురాణంలోనూ, పండితారాధ్య చరిత్రలోనూ ఆయన ఆనాటి విశేషాలను ఎన్నో తెలియజేశాడు.



కళారూపాలద్వారా వీరశైవమతాన్ని ఎలా ప్రచారంచేసిందీ వివరించాడు. ఆనాడు ఆచరణలో ఉన్న అనేక శాస్త్రీయ నాట్య కళారూపాలనుగూర్చి, దేశి కళారూపాలను గూర్చి వివరించాడు.

పదాలు, పాటలు :

సోమనాథుని కాలానికి ముందే తుమ్మెదపదాలు, పర్వత పదాలు, శంకరపదాలు, నివాళిపదాలు, వాలేశుపదాలు, వెన్నెల పదాలు మొదలైన వెన్నో ఆచరణలో వుండేవి. కాని, ఈ పదా లన్నీ క్రమంగా నశించటంవల్ల జనసామాన్యంలో విద్యా ప్రచారానికి అవకాశాలు చాలావరకు తగ్గిపోయాయి. ప్రజల్లో ఎక్కువమంది పాటలకే ప్రాముఖ్యమిచ్చినట్లు బసవపురాణంలో ఈ క్రింది విధంగా ఉదాహరించబడింది.

మేటియై చను భక్తకూటువలందు-పాటలుగా గట్టి పాడెడువారు,
వ్రస్తుతోక్తుల గద్యపద్యకావ్యముల-విస్తారముగ జేసి వినుతించువారు,
అటుగాక సాంగభాషాంగ క్రియాంగ వటునాటకంబుల నటియించువారు,
మునుమాడి వారు వీ రన నేల కూడి-కనుగొన రోళ్ళ రోకళ్ళ బాడెదరు.

భక్తకూటువు లనే భజనమండలి సమాజాలు పాటలు కట్టి పాడుకోవడం- రోకటి పాటలు కట్టి పాడుకోవడం (రోకటి పాటలంటే, దంపుళ్ళ పాటలు) ఆనాటికే ఏర్పడ్డాయి. ఈనాటికీ ఆ పాటలు ప్రజాసామాన్యంలో దంపుళ్ళ పాటలుగాను, భజనసమాజాల్లో భక్తిగీతాలుగాను ఏర్పడి ఉన్నాయి. రోకటి పాటలను శివభక్తుల ఇండ్లలో వేవాల్లాగా వల్లించేవారట. శిరియాళచరిత్రను గురించి బసవ పురాణంలో-

కరమర్థి నూరూర శిరియాలు చరిత-పాటలుగా గట్టి పాడెడువారు
అటుగాక పాంగభాషాంగక్రియాంగ-వటునాటకంబుల వటియించువారు

శిరియాలు చరితము పాటలుగా గట్టి పాడటమేగాక, ఆకాలంలో నాటక ప్రదర్శనాలు కూడా జరిగినట్లు పై ఉదాహరణవల్ల తెలుస్తూ వుంది.

నభూరాధ్యమూ అయిన
పండితారాధ్యచరిత్ర :

ఆనాటి తెలుగు రచనల్లో కేవలం సూచనలేగాక, నృత్యకళకు సంబంధించిన అనేక వర్ణనలు మనకు లభిస్తాయి. సోమనాథుడు రచించిన పండితారాధ్యచరిత్ర పర్వతప్రకరణంలో నృత్యకళకు సంబంధించిన అనేక శాస్త్రీయ విషయాలనేగాక జాయప నృత్తరత్నావళిలో వర్ణించినట్లు జానపద నృత్యాలనుకూడా వర్ణించాడు.

ఈ గ్రంథంలో సోమనాథుడు శ్రీశైలంలో శివరాత్రి మహోత్సవాలలో ప్రదర్శించే కళారూపాల నన్నిటిని ఉదాహరించాడు. నృత్యకళకు, శైవమతానికి పరస్పరసంబంధ మున్నట్లు కనబడుతూ వుంది. ప్రజానురంజకాలుగా వున్న ఆనాటి దేశినృత్యాలను ఆయన అద్భుతంగా వర్ణించాడు. యక్షగానకళారూపాలను గూర్చి, దేశినాటక సంప్రదాయాలను గూర్చి పండితారాధ్యచరిత్రలో ఈ విధంగా వర్ణించాడు.

బహు నాటకములు :

ప్రమథపురాతన వటుచరిత్రములు-
గ్రమమొంద బహునాటకము లాడువారు



లలితాంగ రసకళాలంకారరేఖ-లలవడ బహురూప మాడెడువారు
గరణముల్ మెరవణుల్ గతులు జ్ఞతములు-నరుదుగ వెడ్డంగ మాడెడువారు.

ఆ ట లు :

అమరాంగనలు దివినాడెడు మాడ్క-నమరంగ గడలపై నాడెడువారు
వావియద్గతి బక్షులాడెడునట్టి-భావవమ్రోకులపై వాడువారు.

తోలుబొమ్మలు :

భారతాదికథల జీరమఱుగుల-వారంగబొమ్మ లాడించువారు
గడువద్భుతంబుగ గంబసూత్రంబు-లడరంగబొమ్మల నాడించువారు.

యక్షగానాలు :

నాదట గంధర్వయక్షవిద్యాద-రాదులై పాడెడు నాడెడువారు
విధమున బ్రచ్ఛన్నవేషముల్దాల్చి యధికోత్సవము దులుకాడునట్లాడు.

దేశన్నృత్యాలు :

పాలుపారుదండనంబులు నొప్పహంస-గతియును. మాతంగ గతియును, వృషభ
గతియును, మర్కటగతియుమ మేష-గతియును. మయూరగతియునుభోగి
గతియును, వా బెక్కుగతులు, నొప్పారు.

రంభయాదిగ నప్సరస్సమూహంబు-గుంభీనీకతులతో గూడియాడంగ
జప్పట్లు వెట్టంగ జక్కన లేచి-యప్పాట వెడయాట లాడెడువారు
వేడుకతో జిందు నాడంగ వచ్చి-కోడంగియాటల గునిసెడువారు
భ్రమరముల్ సాళెముల్ బయుకముల్ మెరసి-రమణ బంచాసి పేరణి యాడువారు.

ఈ విధంగా పండితారాధ్యచరిత్రలో సోమనాధుడు దేశికళారూపాలను గురించి వర్ణించాడు. వెడయాట (వికటనర్తనం), చిందుకోడంగియాటలు. కోణంగియాట (ఇది హాస్యన్నృత్యం). పేరణి, బహునాటకములు, బహురూపులు, వెడ్డంగము, అమరగంధర్వాంగనల నృత్యానుకరణలు, పక్షుల ఆటలు, గడాటలు, దొమ్మరాటలు, భారతాదికథల ఛాయాచిత్రాలు, బొమ్మలాటలు, పగటివేషాలు మొదలైనవాటి నన్నిటినీ వర్ణించాడు. అంతేగాక నర్తకుల వేషభాషలనుగురించిఈ క్రింది విధంగా వివరించాడు.





బొమ్మలాట

### నట్టువకత్తెల కట్టుబట్టల ఖిత్తులు :

నట్టువకత్తెలు ఆకాలంలో అర్ధోరుకములు (చల్లడాలు) ధరించేవారట. ఆనాటి ప్రదర్శనాలలో, నర్తకుల రంగప్రవేశంతో నర్తనగానం ప్రదర్శింపబడేదట. దీనినే పూర్వరంగమని పేర్కొన్నారు.

అనంతరం నర్తకులు తెరవెడలిన తరువాత కన్నులూ, కనుబొమలూ మొదలైన ఆంగ, ప్రత్యంగ, ఉపాంగచలనాదులద్వారా అభినయాన్ని ప్రదర్శించే వారు. తరువాత జంత్రసంగీతగమకాలతోనూ, వివిధవాద్యాల దేశినామాలలోనూ వర్ణించేవారు.

ఆనాటి నర్తకుల నర్తనతీరును ఉత్తేజంగా కావ్యధోరణిలో వివరించాడు. ఈ వర్ణనలో రకరకాల నృత్యరీతులు వర్ణించాడు. ఒంటికాలి నడక, మోకాటి నడక, మరగాళ్ళపై నడక, కూర్చుండే ముందుకు నడచుట, రొమ్ముతో ప్రాకుట, గిరగిర తిరుగుతూ పోవుట ఇత్యాదులను సోమనాధుడు సేర్కొన్నాడు. గిరగిర తిరిగే నృత్యానికి భ్రమరినృత్య మని పేరు. ఈ నృత్యాన్ని ఈనాడూ అరుదుగా చేస్తూనే వున్నారు.

అంతేగాక అనేకవిధాలైన ఇతర నృత్యభేదాలను గూర్చి, వివిధకథలను వివరించే నాటకప్రదర్శనాలను కూడా వర్ణించాడు. ఆనాటి వాడుకలో నున్న నాట్యకళాచరిత్రనుగురించి సోమనాధుడు ఎన్నో అమూల్యమైన విషయాలను మనకు అందించాడు.

దేశిలాస్యాంగాలను వర్ణించిన సోమనాధుడు వివిధాంగాల పట్టిక నిచ్చాడు. హంస, నెమలి, పాము, ఏనుగు, ఎద్దు, కోతి, మేక మొదలైన పక్షులు, మృగాలు వాటి గతుల ననుసరించిచేసే నృత్యాల పట్టిక నిచ్చారు.

### బసవపురాణంలోని బండారం :

సోమనాధుడు బసవపురాణంలో కూడా కళలనుగురించి వర్ణించాడు. బసవని వివాహఘట్టంలో కోలాటము, గొండ్లి, పేరణి మొదలైన దేశిరూపకాలను పేర్కొన్నాడు.

జాతిగీతాలైన ఆనందగీతాలు, శంకరగీతాలు వర్ణించాడు. బసవని కళ్యాణ పురప్రవేశసమయంలో పేరణిప్రస్తావన వుంది. ఇది సౌరాష్ట్రనర్తనాచార్యుల సంప్రదాయానుసారంగా నర్తించిన ట్లుంది.

ఇంకా పూర్వసంగీతం, తెరతీయడం, దేశిలాస్యంగాలు, ముఖరసం, సౌష్ఠవం, లలి, భావం, ధూకళి, ఝంకళి, విభ్రమం, రేఖ మొదలైనవాటి ప్రస్తావన కూడా వుంది. ఈవిధంగా సోమనాధుడు ఆనాటి విషయాలను ఎన్నిటినో పొందు పరిచాడని వి. రాఘవన్‌గారు 'తెలుగుసంస్కృతి'లో వుదాహరించారు.

---

# శ్రీనాథుని సిరిసిరిమువ్వ క్రీడాభిరామం

కాకతీయుల కాలంలో వేశ్యాకులానికీ విశేషప్రాధాన్యముండేది. వేశ్యల్ను పోషించటం ఆనాటి అధికారవర్గాలు గౌరవంగా భావించేవారు. ప్రతాపరుద్రుని వుంపుడుగత్తె మాచల్దేవిభవనం ఓరుగల్లులో నాటి అత్యంతసుందరభవనాలలో ఒకటి.

మాచల్దేవి:

మాచల్దేవి గౌరవార్థం వినుకొండ వల్లభరాయుడు క్రీడాభిరామ మనే వీధి నాటకాన్ని రచించగా అది ఓరుగల్లులో ప్రదర్శింపబడింది. రావిపాటి త్రిపురాంతకుడు సంస్కృతంలో వ్రాసిన 'ప్రేమాభిరామం'నాటకాన్ని అనుసరించి తెలుగులో వ్రాయబడి దీ క్రీడాభిరామం. ఈ వీధి నాటకాన్ని శ్రీనాథుడే వ్రాశాడని కొందరు, వల్లభరాయుడే వ్రాశాడని మరికొందరు వివాదముంది. ఎవరు వ్రాసినా 14 వ శతాబ్దంలో మొట్టమొదటగా తెలుగులో వెలువడిన వీధినాటకం ఇది. ఆ నాటి నట,



మాచల్దేవి

విట, కవులనుగురించి క్రీడాభిరామం నాందీప్రస్తావనలో ఈ విధంగా వర్ణించ బడింది.

నటులది దోరసముద్రము-ఎటులది యొరగల్లు; కవిది వినుకొండమహా
వుటభేదనమనుత్రితయము-నిటు గూర్చెను బ్రహ్మ రవికులెల్లరు మెచ్చన్.

అని ఈ వీధినాటకాన్ని మోహూరిభైరవుని తిరుణాళ్ళలో ప్రదర్శించినట్లు తెలుస్తూ వుంది.

ఆనాటు ఓరుగల్లువుత్సవాలలో ప్రదర్శింపబడిన అనేకవినోదప్రదర్శనాలను గురించి క్రీడాభిరామంలో వివరించబడింది.

ఏకశిలానగరంలోని
అనేక వినోదాలు:

ఏకశిలానగర మని పిలువబడే ఓరుగల్లులో ఆనాడు 5500 శివాలయాలు, 1300 విష్ణు దేవాలయాలు, మైలారదేవుడు, దుర్గ, గణపతి, వీరభద్రఆలయాలు ఆదిగా వేలకొలది ఉన్నట్లు స్థానికప్రతాపరుద్ర చరిత్రవల్ల తెలుస్తోంది. ఓరుగల్లులో మైలారదేవుని వుత్సవంనాడు మైలార వీరభటులు చేసే సాహస వీరకృత్యాలు, అతిభయంకరంగా వుండేవి. వీరశైవమతోద్రేకులు మండుతూవుండే నిప్పుగుండాలలో సాహసంగా దూకేవారు, నారసాలను గ్రుచ్చుకునేవారు. భైరవుని గుడి, చమదేశ్వరి, మహాశక్తి నగరు, వీరభద్రేశ్వరాగారం, బుద్ధదేవుని విహారభూమి, ముసానమ్మగుడి, కొమరు సామయ్యనగరు. పాండవుల గుడి మొదలైన ప్రదేశాలు కాకతీయ ప్రతాపరుద్రుని కాలంలో గొప్ప మహత్తుకలిగిన ప్రదేశాలని ప్రసిద్ధిపొందాయి.

దిసమొలదేవత
ఏకవీరాదేవి:

ఏకవీరాదేవి శైవదేవత. ఏక వీర పరశురాముని తల్లియైన రేణుకాదేవి యని ప్రతీతి. ఈమెను మూహూకం అనే గ్రామంలో వెలసివుండడం వల్ల మూహూరమ్మ అని పిలిచేవారు. ఈమె నగ్న దేవత. ఈమెను ఆనాడు రాయలసీమలోనూ, తెలంగాణాలోనూ ఎల్లమ్మదేవత అని కూడా పిలుస్తూవుండే వారు.



ఆరాధన:

అమరావతి శిల్పం

ఓరుగంటిలో ఓరుగంటి ఎల్లమ్మ అనే ప్రసిద్ధదేవత వుండేది. ఈ ఎల్లమ్మనే రేణుక అని కూడా పిలిచేవారు. కాకతీయుల కాలంలో బవనీలు, మాదిగస్త్రీలు ఎల్లమ్మకథను వీరావేశంతో చెపుతూ వుండేవారనీ, వారు మ్రోగించే జవనిక జుక జుంజుం జుక జుం జుమ్మంటూ సాగేవనీ, క్రీడాభిరామంలో ఉదాహరించబడింది:

వాద్యవైఖరి కడు వెరవాది యనగ ఏకవీరాదేవి యెదుట విల్చి,
పరశురాముని కథ లెల్ల ప్రొఢిపాడె చారుతరకీర్తి బవనీల చక్రవర్తి.

నగ్ననృత్యాలు:

రేణుకాదేవి జమదగ్నిమహాముని భార్య: పరశురాముని తల్లి, తండ్రిఆజ్ఞ ననుసరించి పరశురాముడు తన తల్లితలను ఖండించగా, ఆ తలకాయ మాదిగవాడలో పడిందట. శిరస్సు లేకుండా వున్న విగ్రహంముందు నగ్ననృత్యంలో పూజిస్తూ వుండేవారట. నగ్నంగా వున్న ఈ విగ్రహాలముందు స్త్రీలు కూడా నగ్నంగా పూజిస్తూ నాట్యం చేస్తూవుండేవారట.

ఈ రేణుకాదేవే, తరువాత ఎల్లమ్మగాను, ఏకవీరగాను ప్రసిద్ధిచెందింది. ఏకవీరాదేవి ఆలయాలు మండపాక, పొలవాస, మాహూరు మొదలైన గ్రామాలలో వెలసివున్నట్లు క్రీడాభిరామంలో ఉదాహరింపబడివుంది.

కాకతీయరుద్రమదేవి మొగిలిచర్లలోవున్న ఏకవీరాదేవిని ఆరాధించడానికి వెళుతూ వుండేదట. ఓరుగల్లుపట్టణంలో ఏకవీరాదేవి మహోత్సవాలను కూడా తిలకించేదట.

గొండ్లి అనేది కుండలాకారనృత్యం. గొండ్లి విధానంద్వారా బతకమ్మ, బొడ్డెమ్మల వుత్సవసమయాల్లో పిల్లనగ్రోవులూదుతూ, ఆటలు ఆడుతూ, కుండలాకార నృత్యం చేసేవారు.

ఓరుగల్లు మైలారదేవుని పూజల సమయంలో, మైలారదేవుని కొలిచే గొరగపడుచు పాటలు పాడుతూ, ఒక నీటిపాత్రలో ఒక వస్తువును వేసి, మొగ్గవాలి వెనుకకు వంగి నాలుకతో ఆ వస్తువందుకుని ఆ విధంగా తమ ప్రజ్ఞలను భక్తిపురస్సరంగా తెలియజేసేవారట. ఈ విధానాన్ని గూర్చి క్రీడాభిరామంలో.

చ. వెనుకకు మొగ్గవాలి కడు విన్ననువొప్పగ దొట్టెసిళ్ళలో
మునిగి తదంతరస్థమగు ముంగర ముక్కున గ్రుచ్చికొంచు తే
చెను రసనాప్రవాళమున శీఘ్రము గ్రుచ్చెను నల్లపూస పే
రనుపమలీల నిప్పడుచుపాయము లిట్టివి యెట్లు నేర్చెనో.

ఇక పురుషులు వీరభద్రస్వామిని నెత్తిమీద పెట్టుకుని ప్రభలు గట్టి ఆడుగుల మడుగులతో, నగారా దోళ్ళువాయిస్తూ నారసాలు పొడుచుకుని నృత్యంచేసేవారట. వీరిని గురించి-

వీరు మైలారదేవభటులు. గొండ్లి యాడించుచున్నారు. గొరగపడుచు నాడుచున్నది చూడు మూర్ధాభినయము. తాను నెట్టిక సీలంతగానిలేదు. (క్రీడాభిరామం)

వీరిది శైవసాంప్రదాయం. మైలారలింగస్వామిభక్తులు, వీరు కురుబజాతికి చెందినవారు. వీరి ఇలవేల్పు వీరభద్రస్వామి. ఇంకా కాకతీయులకాలంలో కోలాటం, గొండ్లి (గర్భనృత్యం) పేరణి నృత్యం (అంటే కుంభంపై ఎక్కి నృత్యం చేయడం) వుప్పెనపట్టెలాటలు (అంటే చెఱ్ఱుపట్టీ) గిల్లిదండల ఆట, చిట్టిగోనె, చిల్లగోడె అనే ఆటలుకూడా ప్రచారంలో వుండేవి. శైవసాంప్రదాయంలో నంది కోల ఆట అనేది వుంది. అది తెలంగాణాలో ఈనాటికీ కార్తికమాసంలో జరుగుతూ వుంది. ఈ నందికోల ఆటనుగురించి సోమనాథుడు—

కోలాటమును బాత్ర గొండ్లిపేరణియు - గేళిక జోకయు లీల నటింప.

(బసవపురాణం)

జాజిరపాటలు :

కాకతీయుల కాలంలో ప్రచారంలో వున్న జాజరపాటలను గురించి నాచన సోమయాజి తన వసంత విలాసంలో.

వీణాగానము వెన్నెలతేట - రాణ మీరగా రమణుల పాట
ప్రాణమైన పినబ్రహ్మణవీట-జాణలు మెత్తురు జాజరపాట.

బ్రాహ్మణవీట జాజరపాట రాణించె ననడాన్నిబట్టి అది ఆనాటి బ్రాహ్మణులలో ఎక్కువ ప్రచారంలో వుందని చెప్పవచ్చు.

ఆకాలంలో తప్పెట్లు, కాహళాలు, కొమ్ములు, డమాయిలు, బూరలు, శంఖాలు, నన్నాయిలు, దోళ్ళు, చేగంటలు మొదలైన వాద్యాలు ప్రచారంలో వుండేవి.

కాకతీయుల కాలంలో నిర్మాణశిల్పం. విద్య, చిత్రలేఖనం, చేతిపనులు కళలుగా పరిగణింపబడ్డాయి. ప్రతి చెంబుమీదా చిత్రాలు చెక్కేవారు. బట్టలపైన అద్దకంతో బొమ్మలను అద్దేవారు. ఇండ్లగోడలపై చిత్రాలను చిత్రించేవారు. పదుచులు ఇండ్లముంగిట ముగ్గులతో రకరకాల చిత్రాలను చిత్రిస్తూ వుండేవారు. ప్రజలు వారి వారి అభిరుచులను బట్టి, చిత్రపటాలు వ్రాయించుకునేవారు. వీరపూజ అభిలాషగలవారు. వీరుల చిత్రాలను వ్రాయించుకునేవారు.

---

# రెడ్డిరాజులు - నాట్యకళ



కాకతీయ సామ్రాజ్య పతనానంతరం దానిని ఆశ్రయించుకున్న సామంతరాజులూ, సేనానాయకులూ, స్వతంత్ర రాజ్యాలను స్థాపించారు. అటువంటి వాటిలో రెడ్డిరాజ్యాలు, వెలమప్రభువుల రాజ్యాలు ముఖ్యమైనవి. ఈ కాలంలోనే అటు విజయనగర సామ్రాజ్యంకూడా ఏర్పడింది. వీటిలో రెడ్డిరాజ్యమే ప్రాముఖ్యం వహించింది. రెడ్డిరాజులు ముఖ్యంగా అద్దంకి, కొండవీడు, రాజమహేంద్రవరం, కందుకూరు ప్రాంతాలలో, క్రీ. శ. 1324 నుండి దాదాపు 1425 వరకు రాజ్యం చేశారు. వారి రాజ్యం కర్నూలు జిల్లా నుండి విశాఖపట్టణంవరకూ, దక్షిణాన నెల్లూరువరకూ విస్తరించింది.

కొండవీడు గుంటూరుజిల్లాలో ప్రసిద్ధికెక్కినదుర్గం. దీని చుట్టుకొలత సుమారు ముప్పయిమైళ్ళుంటుంది. పర్వతాగ్రమే రెండున్నరమైళ్ళ వరకూ

వుంటుంది. పర్వతాగ్రంలో మొత్తం 50 చుర్రాలవరకూ వున్నాయి. క్రింది భాగంలో వుంది. కొండవీడుపట్టణం ఆనాటి ఆ పట్టణం ఈనాడు గ్రామంగా వుంది. శత్రుదుర్భేద్యమై చూచేవారికి ఆత్యాశ్చర్యం కలిగించే ఈ దుర్గం కాకతీయాంధ్ర చక్రవర్తుల కాలంనుంచి ముఖ్యరాజధానిగా విరాజిల్లడంవల్ల బహు ప్రాచీన మైనదని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

### రెడ్డిప్రభువుల దొడ్డరికం :

కాకతీయ సామ్రాజ్యంలో చివరివాడైన ప్రతాపరుద్రుని దగ్గర కోమటి ప్రోలయ రెడ్డి సేనానిగా వుండి మొట్టమొదటగా రెడ్డిసామ్రాజ్యాన్ని స్థాపించి, అద్దంకిని రాజధానిగా చేసుకుని 1324 లో రాజ్యాన్ని పరిపాలించాడు.

ఆయన తరువాత రాజ్యానికి వచ్చినవాడు ప్రోలయవేమారెడ్డి. ఈయన చాలా పరాక్రమం కలవాడు. పండితుల్నీ, కవుల్నీ సన్మానించేవాడు. ఒంగోలు తాలూకాలోని చెదలవాడ వాస్తవ్యుడైన ఎఱ్ఱాప్రెగడ మహాకవిని తన ఆస్థానంలో వుంచుకుని ఆదరించాడు. ఈ విధంగా ఆయన క్రీ. శ. 1350 వరకూ అజేయంగా పరిపాలించాడు.

ఆయన తరువాత క్రీ.శ. 1366 లో అనపోతారెడ్డి రాజ్యానికి వచ్చి, పదహారు సంవత్సరాలు పరిపాలించాడు. ఈయన చాలా శాసనాలు వ్రాయించాడు. బ్రాహ్మణులకు అనేకదానాలు చేశాడు. ఈయన తరువాత రాజ్యానికి వచ్చినవాడు ఆయన కుమారుడు కుమారగిరిరెడ్డి. క్లుప్తంగా ఇదీ రెడ్డిరాజులచరిత్ర.

రెడ్డిరాజులకాలంలో సామాన్యజనులు దొమ్మరిసానుల ప్రదర్శనాలను, వీధి భాగవతాలను చూచి ఆనందించారు. సాతానులు ఏకతారలను చేత ధరించి శ్రావ్యంగా పాటలు పాడుతూ గ్రామాల్లో ప్రతినిత్యమూ యాచిస్తూ వుండేవారు.

### నాటి నాటక కళాప్రభావం :

ఆంధ్రరెడ్డిరాజుల యుగంలో అనేక వినోదాలు అభివృద్ధి పొందాయి. వాటిలో ప్రముఖస్థానాన్ని ఆక్రమించేవి ఆటలు, పాటలు, నాటకాలు.

ప్రజలు నాటకాలంటే ఎంతో అభిమానంతో వుండేవారు. ఎన్నో నాటకాలు ప్రదర్శించేవారు. కాని ఒక్కనాటకంకూడా సంస్కృత మర్యాదలతో తెలుగులో వ్రాయబడలేదు. ఆనాడు వుద్దండులైన పెద్దపెద్ద కవులుకూడా ఎక్కువగా యక్ష గానాలనే రచించారు. ఆనాటికి ఉత్తర హిందూస్థానమంతటా సంస్కృత నాటకాల ప్రభావం ఎక్కువగా వుండేది. ఈ పరిస్థితుల్లో దక్షిణహిందూదేశమంతటా యక్షగానాల ప్రభావం బహుముఖాల విజృంభించింది. నన్నయకంటె పూర్వమే దేశికవితాయుక్తమైన పాటల నాటకాలుగా యక్షగానాలు అభివృద్ధిపొందాయి. యక్షగానాల పుట్టుపూర్వోత్తరాలను గురించి మరోచోట ప్రస్తావించినా ఇక్కడ ఈ యుగంలోనూ వాటినిగురించి ఉదాహరించడం అవసరమే.

జక్కుల పురంధ్రీకులు:



తెలుగు దేశంలో కామేశ్వర్యాది శక్తిదేవతలను గొలుచు జక్కులవారనే జాతివారుండేవారు. వీరినే అనేకమంది మన ప్రాచీన కవులు తమ గ్రంథాలలో జక్కుల పురంధ్రీకులు అని వర్ణిస్తూ వచ్చారు. ఈ జక్కుల వారినే యక్షులుగా వర్ణించారు. కాలక్రమేణా స్త్రీలు పాత్రలు ధరించి అఖండమైన పేరు ప్రతిష్ఠలు తీసుకువచ్చారు. ఆనాటి యక్షగానాలలో నాగి అనే స్త్రీ స్త్రీపాత్రలు ధరించి అఖండమైన పేరుప్రతిష్ఠలు సంపాదించింది.

పెండెలనాగి:

అగ్రవర్ణపుస్త్రీ గాక తక్కువజాతిస్త్రీ కావడంవల్ల నాగి అనే పేరు వచ్చింది. పెండెలనాగి ప్రదర్శించిన పాత్రలలో ముఖ్యమైంది క్రీడాభిరామంలోని స్త్రీ పాత్ర. క్రీడాభిరామం ఆనాటి వీధినాటకాల్లో ముఖ్యమైంది.

ఆ రోజుల్లో పిచ్చుకుంటులవారు శ్రీనాథుడు రచించిన పల్నాటివీరచరిత్రను, కాటమరాజు కథను గొల్లవారు, యల్లమ్మ కథను బవనిస్వాండ్రు చెపుతూఉండేవాళ్ళు.

ఇలా ఆయాకులాలకు చెందినవాడు వారి వారికి ప్రియమైన కథల్ని చెప్పుకుంటూ వుండేవారు.

పైన వుదాహరించిన యల్లమ్మ కథనే బవనివాడు రేణుక కథగా చెప్పేవారు. దీనిని విపులంగా, ఒకే కథను రెండు రాత్రుల్లపాటు జవనిక (ఈనాటి జముకు) వాయిస్తూ చెపుతూవుండేవారు. సీరే పెద్దదేవరకథను రాయలసీమ జిల్లాలలో చెపుతూవుండేవారు.

కామేశ్వరికథ:

ఆ రోజులలో అగ్రవర్ణులైన బ్రాహ్మణులఇండ్లలో కామేశ్వరికథను ఎంతో ప్రసిద్ధంగా చెప్పుకుంటూ వుండేవాళ్ళు. కథను ఉదయం ప్రారంభించి, సాయంత్రం వరకూ చెపుతూవుండేవారట. ఇరుగు, పొరుగు అమ్మలక్కలందరూ, ఇండ్లలో పనిపాటలు ముగించుకుని సాయంత్రంవరకూ ఈ కామేశ్వరీకథను కర్ణానందంగా వినేవారు. అందుకే 'అక్కలు లేచేవరకు నక్కలు కూసె' అనేసామెత వచ్చింది. ఈ కామేశ్వరికథ ప్రథమంలో బ్రాహ్మణ స్త్రీలద్వారానే ప్రచారంలోకి వచ్చినా క్రమానుగతంగా ఇతరజాతి స్త్రీలలోకి కూడ వ్యాపించి ఇంకా ఎక్కువప్రచారంలోకి వచ్చింది. ఈ కథ ఆంధ్రదేశంలో గుంటూరు, కృష్ణాజిల్లాలలో బాగా వ్యాపించింది. ఈ కామేశ్వరికథను జక్కులవాడు కూడ బహుళప్రచారంలోకి తెచ్చారని క్రీడాభిరామంలో వుదాహరించారు.

కామవల్లికథ:

పైన ఉహరించిన కామేశ్వరికథే క్రమానుగతంగా కామవల్లికథగా పరిణామం చెందింది. దీనిని మోటతోలేవారు, కలుపుతీసేవారు, కోతలుకోసేవారు, వడ్లు దంచేవారు, తిరుగళ్ళమీద పిండి విసిరేవారూ ఎక్కువగా పాడుకునేవారు. ఆ విధంగా వారు కాలాన్ని వెళ్ళబుచ్చుతూ, కష్టాన్నీ, అయాసాన్నీ మరచిపోయి ఆనందంగానూ, ఆహ్లాదంగానూ ఆయాపనులు పూర్తిచేసుకునేవారు.

స్త్రీలగొండ్లియాటలు :

పూర్వంనుంచీ కవిత్వంలోనూ, సంగీతంలోనూ దేశివిధానం, మార్గవిధానం అనే రెండు భిన్నరీతులు ఏర్పడివున్నట్లు తెలుసుకున్నాం. అందులో దేశీనృత్యాలే ప్రజలకు అతిసన్నిహితంగా వ్యాప్తిలోకి వచ్చాయి. పురుషులు కోలాటంవేస్తూ, చిరతలుమ్రోగిస్తూ, చిందులుత్రొక్కుతూ నోటితో పాటలు పాడేవారు. అలాగే స్త్రీలు వలయాకారంగా చప్పట్లు చరుస్తూ బతకమ్మపాటలు పాడేవారు. ఈ బతకమ్మ పాటలు ఆనాడు తెలంగాణాలో కూడా విశేషప్రచారంలో వున్నాయి.

అదేవిధంగా రాయలసీమలో బొడ్డెమ్మకథ ప్రచారంలో వుండేది. గొండ్లి అనే కుండలాకారనృత్తంద్వారా బతకమ్మ, బొడ్డెమ్మ పాటల్ని తెలంగాణాలో వున్న మైలారదేవుని పూజలసమయంలో పాడుతూ ప్రజలను తెలియజేసేవాళ్ళు.

రసిక ప్రభుత్వ

కుమారగిరిరెడ్డి :

రెడ్డిరాజులలో చివరిరాజు కుమారగిరిరెడ్డి. ఈయన క్రీ.శ. 1386 నుండి 1402 వరకూ-కొండవీడు రాజధానిగా-ఆంధ్రదేశాన్ని పరిపాలించిన రసికప్రభువు. ఈయనను ధర్మవేముడని పిలిచేవారు. ఈయన కవులకవిత్వాన్ని మెచ్చి అనేక పారితోషికాలు బహూకరించేవారు. కుమారగిరికి వసంతరాయలని, కర్పూర వసంతరాయలని రెండు బిరుదు లుండేవి. కుమారగిరి స్వయంగా పండితుడు; సంగీత నాట్యశాస్త్రాల్లో ప్రవీణుడు. వసంతరాజీయం అనే నాట్యశాస్త్ర గ్రంథం వ్రాసినట్లు కూడ కాటయవేమారెడ్డి రచించిన శాకుంతలవ్యాఖ్యవల్ల తెలుస్తూంది.

ముసీనాం భరతాదీనాం భోజాదీనాంచ భూభుజాం
శాస్త్రాణి సమ్య గాలోచ్య నాట్య వేదార్థవేదినా
ప్రోక్తం వసంతరాజేన కుమారగిరి భూభుజా
నామ్నా వసంతరాజీయం నాట్యశాస్త్రం యదుత్తమం.

ఈ వసంతరాజీయం మనకు ఇంతవరకూ లభించలేదు. ఈయన ప్రతి సంవత్సరం వసంతోత్సవాలు వాసిగా జరిపిస్తూ వుండేవాడు.

వాసిగాంచిన వసంతోత్సవాలు :

విజయనగర సామ్రాజ్యంలో, కృష్ణదేవరాయల కాలంలో, రాజధానిలో మహర్ని వమిరోజున వసంతమండపంలో వసంతోత్సవాలు ఎంతటిమహావైభవంతో జరిగేవో అలాగే వేమారెడ్డి ఆస్థానంలోకూడ జరిగేవి. ఈ సమయంలో రాజ్యం నాలుగు ప్రక్కలనుంచీ, కవుల్నీ, గాయకుల్నీ, వాద్యకారుల్నీ ఆహ్వానించి, మహా వైభవంగా వసంతోత్సవం ముగించేవారు. అందుకే ఆయనకు వసంతరాయ, కర్పూరవసంతరాయ బిరుదులీయబడ్డాయి.

కళాకారులకు ఘన బహుమతులు :

సంగీత సాహిత్యాలతో వినోదించే వేమారెడ్డి ప్రతిభావంతులైన కళాకారు లందర్నీ తగు విధంగా సన్మానించాడు. సంగీతసాహిత్యాల్లోనూ, భరతనాట్య శాస్త్రంలోనూ ప్రావీణ్యం కలిగిన కంచి, పొన్ని, పేరి మొదలైనవారిని సన్మా నించిండేకాక పేరి అనే నర్తకికి గుంటూరుజిల్లాలో వున్న పేరుకలపూడి అనే గ్రామం గ్రామాన్నే దానంగా ఇచ్చాడు.

అలాగే కంచి అనే దేవదాసికి-నాట్యగత్తెకు-"కంచికచర్ల" అనే గ్రామాన్ని బహూకరించాడు.

పొన్ని అనే కళాకారిణికి బొన్నవరం అనే గ్రామాన్నిచ్చి, జీవితపర్యంత మే కాక వంశపారంపర్యంగా అనుభవించడానికి హక్కు కలిగించాడు.

ఆయనచేసిన దానధర్మాలను గురించీ, ఆయన విద్యాభిలాషను గూర్చీ, కళా పోషణగూర్చి స్థానికంగా వున్న కొండవీటి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించి

వుందని కోన వెంకటరాయశర్మగారు 'భారతి'లో వుదాహరించారు. అంతేగాక శాలివాహన శకం 1300 నాటి వానపల్లిశాసనంలో కూడా ఆయన సంస్థానంలో నిరంతరం జరిగే కార్యక్రమ ప్రణాళికలన్నీ లిఖింపబడివున్నాయి.

ఈ విధంగా ఆయన కొండవీటి రాజ్యాన్ని బహు పరాక్రమంతోనూ, సకల కళావిశిష్టతలతోనూ పరిపాలించాడు. ఆయన అనంతరం ప్రోలయ దేవుని తమ్ముని కొడుకు పెదకోమటి వేమారెడ్డి రాజ్యానికి వచ్చాడు. ఈయన సంస్కృతాంధ్ర భాషల్ని రెండింటినీ కలిసికట్టుగా పోషించాడు. ఈయన విద్వత్తుకు మెచ్చి ఈయనకు సర్వజ్ఞ చక్రవర్తి అనే బిరుదుకూడ ప్రసాదింపబడింది.

కోమటి వేమారెడ్డి రచనలు :

ఈయన శృంగారదీపిక-అమరుకశతక వ్యాఖ్య వ్రాసి దక్షిణ హిందూదేశమంతటా ప్రఖ్యాతిపొందాడు. కుమారస్వామి, సాహిత్యచింతామణి అనే అలంకార శాస్త్రాన్ని రచించి ప్రఖ్యాతి వహించారు. అంతేగాక 'సంగీత చింతామణి', 'వీర నారాయణచరిత్ర','శృంగారభూషణం','రఘునాథాభ్యుదయం','వేమభూపాలచరిత్ర', 'శబ్దరత్నాకరం' మొదలైన అనేక గ్రంథాలను కూడ రచించారు.

ఈ విధంగా కోమటివేమన క్రీ.శ. 1420 వరకూ పరిపాలించాడు. రాజ్యంలో శాంతిభద్రతల్ని నెలకొల్పిన కాటయవేముని బావమరదియైన కుమారగిరిరెడ్డి పరిపాలనాబాధ్యతలన్నీ కాటయవేమనకు వప్పజెప్పి తాను మాత్రం వసంతోత్సవాలతోనూ, కవులతోనూ, కళాకారులతోనూ, నిత్యకళ్యాణంగా పచ్చతోరణంగా కొండవీటి సామ్రాజ్యాన్ని పరిపాలించాడు. కుమారగిరి రత్నసింహాసనాధ్యక్ష, జగదేగోపాలరాయ, వేశ్యాభుజంగ, పల్లవాదిత్య, త్రిలింగాధీశ్వర జంబూద్వీపేశ్వరబిరుదాంకుడు. ఈయన కాపట్ల భావనారాయణస్వామి దేవదాసియైన వల్లెమకు బుట్టిన లకుమాదేవి ప్రియుడు. ఆయనవద్ద సేనానిగా వున్న దొరపరెడ్డిసేనాని లకుమాదేవిని కుమారగిరికి కానుకగా అర్పించాడు.

### లాస్యరాణి లకుమాదేవి :

లకుమాదేవి కుమారగిరి ప్రేయసి. అందాలరాణి. చక్కదనాలచుక్క. అపరనాట్య సరస్వతి. కుమారగిరి ఆస్థానంలోని కవి, గాయక, శిల్పి, సామంతాది మహాజనుల సమక్షంలో తన అభినయచాతుర్యంతో, అందచందాలతో అందర్నీ ముగ్ధుల్ని చేస్తూ, ఆస్థానానికి ఒక నూతనశోభను చేకూరుస్తూ వుండేది. అనేకమంది పేద సాదలకు ధనాన్నీ, వస్త్రాలనూ దానంచేస్తూ వుండేది. అందుకే కాటయవేమన తన శాకుంతల వ్యాఖ్యానంలో ఈ విధంగా వుదాహరించాడు.

జయతి మహిమా లోకాతీతః కుమారగిరిప్రభో
స్పదసి లకుమాదేవీ యస్య ప్రియాసదృ శీప్రియా
నవ మభినయం నాట్యార్థానాం తనోతి సహస్రధా
వితరతి బహూనర్థా నర్థివ్రజాయ సహస్రశః.

అని వ్యాఖ్యానించాడు. లకుమాదేవి రాజనర్తకియేకాక, కొమరగిరి ప్రియా సదృశప్రియయట. లకుమనుగూర్చి ఇంతకు మించిన ఆధారాలు చరిత్రలో లేవని కీ॥శే॥ శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు బహు పరిశోధన చేసి ఇంగ్లీషులో 'హిస్టరీ ఆఫ్ రెడ్డి కింగ్‌డమ్స్' అనే రెడ్డిరాజుల యుగాన్ని చిత్రించిన మహా గ్రంథంలో వ్రాశారు.

ఆనాడు ద్రాక్షారామ భీమేశ్వరునికి అఖండదీపాన్ని వెలిగించడం ఎంతో పుణ్యకార్యంగా ఎంచబడేది. ఆ కారణంచేతనే లకుమాదేవి క్రీ. శ. 1402 లో తన తల్లిదండ్రులకు పుణ్యావాప్తికోసం అఖండదీపదానంచేసి విఖ్యాతిపొందింది.

### కుమారగిరి లకుమల

### విలాస విహారాలు :

కుమారగిరీ, లకుమాదేవీ వసంతోత్సవంలో అతి మనోహరంగా విహరిస్తూ వుండే వారట. లకుమ తన నృత్య ప్రదర్శనాలతో, అంగసౌష్ఠవంతో, వయ్యారపు నడకలతో, వివిధ నాట్య భంగిమలతో అజంతా సుందరిలా కుమారగిరిని, ప్రేక్షకు

లను ముగ్ధుల్ని చేసేదట. కుమారగిరి తన భార్యలతోపాటు లకుమాదేవితోనూ, తదితర అంతఃపుర స్త్రీలతోనూ జలక్రీడలు ఆడుతూ వుండేవాడు. ఈ క్రీడలన్నీ గృహరాజ సౌధంలో జరిగేవి. కుమారగిరి లకుమల ఆనందభవనంకూడా ఇదే. కొండవీటిలో ఒకదిబ్బ గృహరాజదిబ్బ అనే పేరుతో కుమారగిరి లకుమల చిహ్నంగా వెలుగొందుతూ వుంది. ఆనందకేళీ విలాసాలతో ఆ ప్రేయసీ ప్రియులు ఇరువురూ ఏకకాలంలో అనంతకాలగర్భంలో కలిసిపోయారు.

ఈ విధంగా కొండవీటి సామ్రాజ్యంలో నాట్యకళాసరస్వతి దేదీప్యమానంగా వెలుగొందింది.

ఇంచుమించు రెడ్డిరాజన్యులందరూ కూడ గొప్ప విద్వాంసులు. సకల కళాభిజ్ఞులు, కవి, పండితపోషకులు. వారిలో కొందరు సంగీతసాహిత్యాలలో అపారమైన ప్రజ్ఞకలవారు.

రాజమహేంద్రవరాన్ని ఏలిన అల్లయవీరభద్రారెడి సంగీత, సాహిత్య విద్యలలో సర్వజ్ఞతను సంపాదించినవాడు.

శివలింగారెడ్డి నాట్యశాస్త్రపారంగతుడు. మల్లారెడ్డి పౌత్రుడైన శ్రీగిరిరెడ్డి గొప్ప కళావిమర్శకుడేకాక సంగీత సాహిత్యాలలో ప్రవీణుడు.

శ్రీనాథమహాకవి :

రెడ్డిరాజుల యుగంలో వర్ధిల్లిన శ్రీనాథమహాకవి పరరాజుల్ని దర్శించినప్పుడు కొండవీటి మహావైభవాన్ని గురించి ఈ విధంగా వర్ణించాడు.

పరరాజ్య పరదుర్గ పరవైభవశ్రీల గొనకొని విడనాడు కొండవీడు
పరిపంథి రాజన్యబలముల బంధించు గురుతైన యురిత్రాడు కొండవీడు
మగురును రాజులకు మోహంబు బుట్టించు కొమరుమించిన వీడు కొండవీడు
చటుల విక్రమకళాసాహసం బొనరించు కటిలారులకు గాడు కొండవీడు
జవనఘోటక సామంతసరసవీర భట, నటానేక, హాటకప్రకటగంధ
సింధురార్భటీ మోహన శీల దరవ కూర్మి నమరావతికి జోడు కొండవీడు.

శ్రీనాథుడు 1385-1475 మధ్య జీవించిన మహాకవి. ఆయన జీవితంలో చాలాభాగం కొండవీడు, రాజమహేంద్రవర రెడ్డిరాజులవద్దనే గడిచిపోయింది. ఈయన ఆస్థానకవిగా వుండి కాశీఖండం, భీమఖండం, శృంగారనైషధం, హర విలాసం మొదలైన శృంగారకావ్యాలను రచించిన మహాకవి. విజయనగరప్రౌఢ దేవరాయల ఆస్థానంలో వున్న గౌడడిండిమభట్టు నోడించి, కంచుఢక్కను పగుల కొట్టించిన వుద్దండుడు. నానారాజసందర్శనం చేసి ఆనాటిసమాజంలో వున్న సాంఘికాచారాలను, ప్రజల జీవితవిధానాలను, లలితకళావికాసాన్ని కళ్ళకు కట్టినట్లు తన గ్రంథాలద్వారా తెలియజేశాడు. నలగామరాజు దర్బారులో జరిగిన సంగీత నృత్యవాద్యాది విశేషాలను పల్నాటిచరిత్రలో పేర్కొన్నాడు. 14 వ శతాబ్దపు చివరనుంచీ, 15 వ శతాబ్దపు ప్రారంభంలోనూ యక్షగానాలను గురించి వర్ణిస్తూ భీమఖండంలో "కీర్తింతు రెద్దాని కీర్తి గంధర్వులు గాంధర్వమున యక్షగాన సరణి" అని యక్షగానాలనుగురించి పొగిడాడు. అంతేగాక, ఒక వేశ్యవేషం ధరించి ద్రాక్షారామవీధుల్లో భిక్షాటన చేసినట్లు భీమేశ్వరపురాణంలో-

సాని ఈశానియై మహోత్సవమువందు-గేల నవచంద్రకాంతంపు గిన్నె పూని
పీఠి భిక్షాటనమొనర్చువేళ జేయు మరులు నృత్యంబు జగముల మరులగొలుపు.

అని వివరించాడు. శ్రీనాథుని కాలంలో భోగమువారు కనకవీణలను మీటుతూ, భీమనాథుని గూర్చి 'జాదర జాదర' అనే పల్లవితో మృదువుగా పాడేవా వర్ణించాడు. ఇది వెన్నెలరాత్రుల్లో మరీ ఆహ్లాదకరంగా వున్నట్లు భీమఖండంలో వివరించాడు.

జాదరజాదరంచు మృదుచర్చరిగీతలు వారుణీ రసా
స్వాదమదాతిరేకముల చంద్రికికాయగ దక్షవాటికా
వేదుల మీదటన్ కనకవీణలుమీటుచు పాడి రచ్చరల్
మోద మెలర్పగా భువనమోహనవిగ్రహు భీమనాథునిన్.

శ్రీనాథుడే కాశీఖండంలో, అనేకవాద్యాదివిశేషాలతో ఆనాడు ప్రదర్శనాలు ప్రదర్శించినట్లు వర్ణించాడు.

వల్లకి జక్కి కాహళము వంశము ధక్కి హుడుక్కి ఝుర్ఝురుల్
ఝుల్లరి యాదిగా గలుగు శబ్దపరంపర తాళశబ్దమై
యుల్లసిలం బ్రబంధముల కొప్పుగ నాడుదు రగ్రవేదిపై
బల్లవపాణి ఈశ్వరుని బంటమహేళులు పూజ సేయగన్.

నాట్యంలో దేశి, మార్గనృత్యాలనుగురించి శ్రీనాథుడు కాశీఖండంలో ఉదాహరించాడు. జక్కిణించిందు అనీ, అది దేశీయనృత్యమనీ దశావతార చరిత్రలో ఈ విధంగా వర్ణించాడు.

దురుపదంబులు సొక్కు మైసిరుల నొసగ-సరిగ నిరుగేల కుంచియల్ సవదరించి
పెక్కువగ జక్కి జోకోపుద్రొక్కి నొక్కి-జక్కని మిఠారి నరపతుల్ సొక్కిచూడ.

---

# విజయనగరరాజుల కళా విన్నాణం



కాకతీయ రాజ్యపతనానంతరం ఆంధ్రదేశమంతా మహమ్మదీయ దండయాత్రలకు లొంగిపోయే ప్రమాదం ఏర్పడింది. ఈ మహమ్మదీయ దండయాత్రల్ని జయప్రదంగా ప్రతిఘటించి, ఆంధ్రదేశాన్ని మాత్రమేకాక, దక్షిణ హిందూదేశాన్నంతా ఒకేత్రాటిమీద నడిపిన ఘనత హంపీ విజయనగరరాజులకు దక్కింది.

హంపీ విజయనగరరాజ్యాన్ని స్థాపించిన హరిహరరాయలు, బుక్కరాయలు దక్షిణ హిందూదేశంలోని ఆంధ్ర కర్నాటక తమిళప్రాంతాలన్నిటినీ ఒకే సామ్రాజ్యం క్రింద వ్యవస్థీకరించినప్పుడే మహమ్మదీయుల దండయాత్రల్ని జయప్రదంగా ప్రతిఘటించగల మని గ్రహించారు. ఈ ముస్లిందండయాత్రలవల్ల నానాహింసలూ అనుభవిస్తున్న ప్రజలుకూడా ఈ ప్రయత్నాన్ని బలపరిచారు.

విజయనగరసామ్రాజ్య సంస్థాపకులైన హరిహరరాయలు, బుక్కరాయలు అన్నదమ్ములు. ప్రతాపరుద్రుని బంధువులు. ప్రతాపరుద్రుని ఆస్థానంలో వున్న ప్రధానోద్యోగులు. కాకతీయరాజ్య పతనానంతరం వీరిద్దరూ ఆనెగొంది వెళ్ళారు. ఆంధ్ర కన్నడ సరిహద్దులలో, తుంగభద్రాతీరంలో సహజరక్షణ కుపయోగపడే అనేక కొండలవరుసల మధ్యభాగంలో విద్యానగరపట్టణాన్ని హరిహరరాయలు స్థాపించాడు. ఈ సామ్రాజ్యస్థాపనకు మాధవవిద్యారణ్యస్వామి కూడా సహాయపడ్డాడు. హిందూ సంస్కృతీ, మతమూ రక్షింపబడాలనే ఆశయంతో విజయనగర సామ్రాజ్యసంస్థాపన 1336 లో జరిగింది. ఈ సామ్రాజ్యం వర్ధిల్లిన కాలాన్ని మూడుదశలుగా విభజించవచ్చు.

(1) 1336 నుండి 1480 వరకు ప్రథమదశ. ఈ దశలో విజయనగర రాజ్యం కన్నడ, తమిళ ప్రాంతాలనూ, రాయలసీమనూ ఆక్రమించుకున్నది.

(2) 1480 నుండి 1550 వరకూ ద్వితీయదశ. ఈ దశలో తెలంగాణా మినహా, ఆంధ్రదేశమంతా కృష్ణదేవరాయల పరిపాలన క్రింద వుంది.

(3) 1550 నుండి 1650 వరకూ మూడవదశ. ఇది పతనావస్థకు సంబంధించిన కాలం.

కృష్ణదేవరాయల మరణానంతరం 1565 వరకూ విజయనగరసామ్రాజ్యం మహోజ్జ్వలంగా సాగి చివరకు తళ్ళికోటయుద్ధంలో పెద్దితింది. దక్కనుసుల్తాను లందరూ ఏకమయ్యారు. రామరాజును జంపి అతని సైన్యాన్నంతా చెల్లాచెదరు చేసివేశారు. అయినా విజయనగర సేనల బలాధిక్యత ఏమాత్రం క్షీణించక తిరుమల దేవరాయల నాయకత్వాన పెనుగొండను రాజధానిగా జేసుకొని రాజ్యపరిపాలన సాగించారు. అతని అనంతరం శ్రీరంగరాయలు దుర్బలుడవడంవల్ల రాజధానిని తిరుపతి దగ్గర ఉన్న చంద్రగిరికి మార్చుకున్నాడు. ఈ విధంగా క్రీ. శ. 1630

తరువాత విజయనగరసామ్రాజ్యం అంతరించింది. విజయనగరసామ్రాజ్యాన్ని పరిపాలించిన రాజులలో అనేకమంది లలితకళలను ఎంతగానో పోషించారు.

రాయల రాచరికం-

విదేశయాత్రికుల వివరణ:

హంపివిజయనగరం ఒక కళాకేంద్రంగా వికసించింది. 15, 16 శతాబ్దాలలో, విజయనగర సామ్రాజ్య పరిపాలనాకాలంలో ఇతర దేశాలనుంచి వచ్చిన అనేకమంది రాయబారులూ, వ్యాపారులూ, యాత్రికులూ ఈ విజయనగరాన్ని దర్శించారు. విజయనగరం కళావైభవాలనుగూర్చి, శిల్పకళావైదగ్ధ్యాన్నిగూర్చి వారివారి దినచర్య పుస్తకాలంలో ఉదాహరించుకున్నారు. పేట్రోడెల్లా అనే పోర్చుగీసు దేశస్థుడు విజయనగరాన్ని దర్శించాడు. ఈ వివరాలను కలకత్తావాస్తవ్యుడు బి. జి. పాల్ 1934 లో 'సోషల్ అండ్ పొలిటికల్ లైఫ్ ఇన్ విజయనగర' అనే గ్రంథంలో ఈ క్రింది విధంగా వివరించాడు.

వసంతోత్సవాల

వైభవప్రాభవాలు:

పేట్రోడెల్లా వసంతోత్సవాలను సందర్శించాడు. వసంతోత్సవాలు మహార్నవమి రోజున తుంగభద్రాతీరంలో జరిగేవి. ఆ వుత్సవాలలో ఆయన ఒక కోలాటనృత్యాన్ని చూశాడట. అది విజయనగరం రాజవీధిలో వూరేగింపులో అది మేళతాళాల కోలాహలంతో నిండివుంటట. జనసమ్మర్దంతో వీధి అంతటా క్రొక్కిన లాటగా వుందట. వూరేగింపు సాగిపోతూవుండగా, ఒక వినోద కార్యక్రమం తరువాత మరో వినోదానికి సంబంధించిన సమూహాలు వస్తూండేవట. ఇంతలో ఒక కోలాట బృందం వచ్చేదట, అందరిచేతుల్లోనూ, వివిధ రంగులతో చిత్రింప బడిన కోలాటకట్ట లున్నాయట. తలగుడ్డలతో సకల వర్ణశోభితంగా రంగుల రంగుల ఈకెలు ధరించి వారు చూడసొంపుగా వున్నారట. బృందానికి హంగుగా జంత్రవాద్యాలు మ్రోగుతూవుండగా లయప్రకారం బృందమంతా పాట పాడుతూ,

మధ్యమధ్య 'కోలే, కోలే,' అనే కేకలతో అడుగువేశారట. కోలే కోలే, అంటే ఆయనకు ఏమీ అర్థంకాలేదట. కాని, అది ఒక అందమైన మాట్ట వుండవచ్చని సూచించాడు.

దసరా మహోత్సవాలు –
కళాకేళి :

ఇమ్మడి ప్రౌఢదేవరాయలు క్రీ. శ. 1423, క్రీ. శ. 1446 వరకూ రాజ్యపరిపాలన చేశాడు. విజయనగరాన్ని పరిపాలించిన సంగమవంశరాజులలో ప్రౌఢదేవ రాయలు అగ్రగణ్యుడు. ఈయన కాలంలోనే విజయనగరరాజ్యం మహోన్నత స్థితికి వచ్చింది. ఈయన ఆ స్థానంలోనే శ్రీనాథమహాకవికి కనకాభిషేకం జరిగింది. ఈయన కాలంలో 1443 లో అబ్దుల్ రజాక్ విజయనగరాన్ని చూడవచ్చి ఆ పట్టణ వైభవాన్ని, ప్రౌఢదేవరాయల మహోన్నతస్థితిని వర్ణించాడు. ఆయన విజయనగర కళావిశిష్టతలనుగురించి కొన్ని విషయాలను గ్రంథస్థంచేశాడు. ఈయన పారసీకదేశంనుండి వచ్చాడు.

విజయనగర రాజభవనంలో దసరా మహోత్సవాలు అత్యంతవైభవంగా జరిగినట్లు అబ్దుల్ రజాక్ వర్ణించాడు. అంతేగాక ఆ మహోత్సవ సమయంలో అద్భుత నాట్యప్రదర్శనాలు జరిగినట్లు పేర్కొన్నాడు. ఆ మహోత్సవాలు జరిగే స్థలానికి, మంటపాలకు నడుమ చక్కగా తీర్చిన ఖాళీస్థలం కలదట. అందు గాయకులు గానంచేశారట. కథకులు కథలు చెప్పారట. గాయకురాండ్రలో చాలా మంది యవ్వనంలో వున్న కన్యకలేనట. వారి బుగ్గలు చంద్రునివలెవుండి, వారి ముఖారవిందాలు వసంతాన్ని అతిశయించిన శోభతో వెలుగొందుతున్నాయట. వారు ధరించిన దుస్తులు సొగసుగా వున్నాయట. వారి రూపాలు, క్రొత్తగా విచ్చిన గులాబిపువ్వుల్లాగ, మనసుకు అమితానందాన్ని కలిగించాయట.

వారు రాయల కభిముఖంగా వున్న తెరమరుగున కూర్చుండి వున్నారట. మండపం రంగు రంగుల దీపాలతో చిత్ర విచిత్రంగా నగిషి చెక్కబడిన చలువ రాతిస్తంభాలతో వుందట. దానికి ముందు మిలమిల మెరుస్తూన్న ఒక తెర

వుందట. మండపానికి ఎదుట వున్న తొమ్మిదంతస్తుల మేడలోని ఏడవ అంతస్తులో మహారాజు కూర్చుని చూస్తున్నాడట. తెర కదిలి రెండు భాగాలుగా విడిపోయిందట. వెంటనే ఆ సుందరాంగులు ఆత్మలు అనందపరవశమయ్యేటట్లు, లలిత విన్యాసాలతో నృత్యంచేయడం ప్రారంభించారని, ఆ నటుల గానమాధుర్యం, నటనాసౌందర్యం ఆస్వాదించి చూసి విస్తుపోయానని, ఒడలు మైమఱచినట్లయిందని వివరించారు.

రాయలనాటి నాటక కళ.

నయనాణ్యాలు :

మొదటి దేవరాయలు (క్రీ. శ. 1406-1422) విజయనగరసామ్రాజ్యాన్ని పరిపాలించిన రోజులలో పెరిస్తా అనే మహమ్మదీయ చరిత్రకారుడు విజయనగర రాజుల నాటకకళా ప్రాముఖ్యాన్నీ, రాజకీయమైన ఒక అపూర్వసంఘటననూగురించి గ్రంథస్థం చేశాడు. వివరాలను ఈ క్రింది విధంగా వివరించాడు.

ముదగల్లు రాయచూర్లపై ఆధిపత్యాన్ని గురించి అనాదినుంచీ విజయనగర రాజులకు, మహమ్మదీయులకు తీవ్రయుద్ధాలు జరుగుతూ వుండేవి. విజయనగర రాజులకు కళలపట్ల గల కాంక్షను ఆసరాగా తీసుకుని మహమ్మదీయులు ఒకనాడు చక్కని ఉపాయం ఆలోచించారు.

విజయనగరంవారి నాటకాలలో నటించే వేశ్యల్ని లోబరచుకుని, ఆ వేషాలు తామే ధరించుకుని కోటలో ప్రవేశించారు. నాటక ప్రదర్శనంలో ఒక సన్నివేశంలో కత్తియుద్ధంకూడా వుందట. తరుణం వచ్చిన వెంటనే ఈ వేషధారులు బూటకపు నటనకు స్వస్తిచెప్పి ప్రత్యక్షహత్యాకాండకు వుపక్రమించి ప్రేక్షకులుగా కూర్చున్న రాజకుటుంబాన్ని వధించి కోటను వశపరుచుకున్నారట.

శ్రీకృష్ణదేవరాయలు 1513 లో జైత్రయాత్రలను ముగించుకుని వచ్చిన తరువాత మహానవమిదిబ్బను నిర్మించాడు. ఇది ఒక బ్రహ్మాండమైన కట్టడం. ఈ సింహాసనవేదిక మీద రాయలు ఆసీనుడై దసరావేడుకలను తిలకించేవాడు. ఈ వుత్సవం సెప్టెంబరునెలలో (ఆశ్వయుజమాసంలో) తొమ్మిదిరోజుల పాటు జరుగుతుండేది. ప్రభువులు, సామంతరాజులు, దండనాయకులు, రాణీవాసస్త్రీలు, దేశం నాలుగు చెరగులనుంచీ వేలాది ప్రజలు ఈ వేడుకలను చూడడానికి

వస్తూవుండేవారని విదేశయాత్రికుడైన న్యూనిజ్ చెబయజేస్తున్నాడు.

### రాయలనాటి నాటక శాలలు :

విజయనగర వైభవాన్ని దర్శించవచ్చిన విదేశయాత్రికులలో ఒకడైన పేయస్ తాను రచించిన వృత్తాంతంలో నాటి నాట్యశాలను గురించి మిక్కిలి ప్రశంసించాడు. నర్తనశాల సుదీర్ఘమైంది. కాని అంత వెడల్పైనది కాదు. దాని ఇరుప్రక్కలా శిల్పరమణీయమైన శిలాస్తంభా లున్నాయట. ఆ స్తంభ ఫలకాలమీద నాట్యాంతంలో వుండవలసిన సరియైనతీరులతో నాట్యకత్తెల రూపాలు చెక్కబడి వున్నాయట. నృత్యం అభ్యసించేవారు నృత్యాంతంలో తాముండవలసిన వైఖరిని మఱచిపోయిన యెడల ఈ శిల్పచిత్రాలను చూచి దానిని జ్ఞప్తికి తెచ్చుకునేవారట.

ఇంకా నర్తనశాల చివరిభాగంలో వివిధ చిత్రాలతో కూడిన ఒక ఏకాంత స్థల ముందట. అక్కడ నృత్యానంతరం అలసట తీర్చుకొనడానికి నాట్యకత్తెలు తమ శరీరాలను, కాళ్ళను చక్కజూపి సవరించుకోవడానికై వ్రేలాడేవారట. శరీరం అన్నివంపులూ అవలీలగా తిరగటానికి అనువుగా ఇక్కడ అభ్యాసం చేసేవారట.

వేరొక ప్రక్కన ప్రదర్శనాన్ని దర్శించడానికి వచ్చిన రాజు కూర్చునే ప్రదేశమీదా, నేలమీదా, గోడలమీదా, బంగారురేకులు తాపబడి ఉన్నాయట. గోడనడిమిభాగంలో, పన్నెండేళ్ళబాలిక ప్రమాణం కలిగిన ఒక సువర్ణవిగ్రహం వుందట. ఆ విగ్రహంచేతులు నాట్యకత్తెకు నాట్యాంతంలో వుండవలసిన తీరులో వున్నాయట.

### వైభోగం ఒలికే భోగం మేళాలు :

పేయస్ ఇంకా ఇలా వ్రాశాడు. భోగంస్త్రీలకు రాజభవనాలలో నిరాఘాటంగా ప్రవేశముండేదట. హజారరామాలయంలో వివిధ భూషణాలతో మురుస్తూవున్న సానులను స్తంభాలపై తీర్చి దిద్దారట. వాటిని చూడగా కొంతమంది బిట్టు లాగులా తొడిగి వాటిపై లంగాలను కట్టారట. దేవీ నవరాత్రులలో ప్రతి ఉదయం, భువనవిజయంలో, రథోత్సవాలు అన్నిటిలోనూ, దేవాలయాలలో ప్రతి శనివారమూ వారు నృత్యం చేయవలసినవారై యున్నారట. నృత్యం నేర్పే గురువులకు రాయలవారు కొన్ని ఈనాములు ఇచ్చియున్నారట.

వసంతోత్సవ వేడుకలు,
కవితా గోష్ఠులు :

నేటి హోలీ పండుగను రాయలకాలంలో వసంతోత్సవ మని పిలిచేవారని మొదటి దేవరాయలకాలంలో విజయనగరం వచ్చిన నికోలోకాంటి ఉదాహరించాడు. ఆయన దానినిగురించి ఈ విధంగా వర్ణించాడు. వసంతోత్సవదినాలలో వీథుల్లో ఎరుపురంగు నీరు ఉంచేవారట. వీథులలో వచ్చిపోయే వారందరిపైనా ఎవరు బడితే వారు రంగునీరు చల్లుతుండేవారట. చివరకు రాజు కాని, రాణి కాని, ఆ దారిన వెళ్ళితేచాలుఅందరిపైనా ఈ వసంతం వర్షించిందన్నమాటే! ఈ వసంతోత్సవ కాలంలో అన్ని ప్రాంతాలనుండీ కవులను రప్పించి వారికవితలు విని ఆనందించి వారికి బహుమానాలు ఇస్తూవుండేవారని ఆ పట్టణ వైభవాన్ని పరిపరి విధాల వర్ణించాడు.

భూపరిపాయంనుంచే
అడపాపలకు అటుపాటుల్లో తర్ఫీదు :

క్రీ. శ. 1514 లో విజయనగరాన్ని సందర్శించిన బర్బోసా ఇలా వ్రాశాడు: రాయలవారికి ప్రతిదినం స్త్రీలే కడవలతో నీరుతెచ్చి స్నానంచేయించి,పాటలు



పాడేవారట.చక్రవర్తి దర్బారులోనూ కమ్మకమ్మగా గానం చేసేవారట. ఆనాటి శిలా శిల్పాలలో నృత్యాలు, వాద్యవాదనలు, కోలాటం మొదలైనవి కోలాహలంగా జరిగిన చిహ్నాలు కనిపిస్తాయి. ఆనాడు భోగంసానులు సంగీత విద్యలో ప్రత్యేకకృషి చేసే వారట. అంతేకాక తమ పిల్లలకు పది సంవత్సరాల ముందునుంచే నృత్యవిద్యను నేర్పేవారట.

నిత్యనిత్యమూ
నాట్యపాఠాల సాధకాలు :

మాయల్ అనే ఆయన విజయనగరంలోని ఒక నాట్యశాలను గురించీ, నర్తకులు తమ అంగసౌష్ఠవాన్ని పెంపొందించుకోవడానికి ప్రతిరోజూ చేసే అభ్యాస పరిశ్రమల్ని గురించీ 'ది ఫర్గాటన్ ఎంపైర్' అనే గ్రంథంలో ఉదాహరించాడు.

## ప్రయోగం పసగడితేనే రంగంపై రాణింపు :

నాటక'ప్రయోగం విషయంలో ఆనాటి వారు ఎంతటి శ్రద్ధాసక్తుల్ని కనబరిచారో గంగాధరకవి రచించిన 'గంగాదాస ప్రతాపవిలాసం' అనే నాటకంలో వివరించబడింది.

బొంబాయి రాష్ట్రంలోని పాంచమహల్ మండలంలోనున్న 'పావగడ' రాజ్యానికి ప్రభువైన గంగదాసు దిగ్విజయం దీని ఇతివృత్తం.

గంగాదాసు గంగాధరకవిని కోరి వ్రాయించుకున్న నాటకం ఇది. దానిని రంగప్రయోగం చేయించుకోవాలని అతనికి అమితమైన ఉబలాటం. అందుకు సమర్థుడైన ప్రయోక్తకోసం గంగాదాసు వెతికిస్తున్నాడట. ఆ వార్తను విజయ నగరం సంస్థానంలోవున్న ఒక నటుడు విని, నేను ఆ నాటకాన్ని ప్రయోగం చేస్తానని తనప్రభువైన మల్లికార్జునుడికి విన్నవించగా ఆ ప్రభువు అతణ్ణి బహు మాన పురస్సరంగా పావగడకు పంపించాడట.

రంగప్రయోగం ఒక విశిష్ట శిల్పమనీ, ఉత్తమ నాటకరచనలు వున్నప్పటికీ ప్రయోగశిల్పం తెలిసిన సమర్థులేగనక లేకపోతే అవి రంగస్థలంమీద రాణించడం కష్టసాధ్యమనీ ఆ కాలంవారు పూర్తిగా గుర్తించారనడానికి ఇది చక్కనినిదర్శనం.



# సంగీతపోషణలోను విజయనగర రాజుల విశిష్టత

విజయనగర చక్రవర్తుల కాలంలో నాట్యకళతోపాటు, సంగీత విద్యకూడ ఎంతో అభివృద్ధి పొందింది. హరిహర బుక్క-రాయలకు గురువైన విద్యారణ్యస్వామి



'సంగీతసార'మనే ఒక సంగీత ఉద్గ్రంథాన్ని రచించాడు. ఆ గ్రంథంలో 267 రాగాలను గురించి విపులంగా వ్రాయ బడిందట.

అలాగే ప్రౌఢదేవరాయల కొలువులోవున్న కల్లినాథుడు శార్జ్గదేవుని 'సంగీత రత్నాకర'మనే గ్రంథానికి వ్యాఖ్య వ్రాశాడు.

రెండవ రాయలకాలంలో, ముల్లా గల్ మండలేశ్వ రుడైన సాళువగోప తిప్ప సంగీత, నాట్య, తాళ, అలం కార శాస్త్రగ్రంథాలు వ్రాసినట్లు తెలుస్తూ వుంది. వామనుని కావ్యాలంకార గ్రంథానికి 'కామధేను' అనే వ్యాఖ్యానాన్ని రచించాడు. 'తాళదీపిక' అనే గ్రంథాన్ని సంతరించాడు.

కవిరాజ్ఞి కాదు,
సంగీత సామ్రాజ్ఞికూడ :

శ్రీ కృష్ణదేవరాయలు సంగీతవిద్యలో కూడా ప్రజ్ఞావంతుడు. రామరాయలవలెనే కృష్ణదేవరాయలుకూడా శ్రావ్యంగా పాడగల్గిన నేర్పరి. కృష్ణదేవరాయలు గాన కళలో ప్రజ్ఞాధురీణుడని కృష్ణాపుర శాసనంలో ఉదాహరింపబడింది.

కృష్ణదేవరాయలు బాల్యంలోనే, కృష్ణుడనే ఒక సంగీత శాస్త్రకారునివద్ద సంగీతాన్ని సాంప్రదాయకంగా అభ్యసించినట్లూ, ఆయనకు మడులు, మాన్యాలు, వజ్రహారాలు బహూకరించినట్లూ కన్నడ గ్రంథమైన రాఘవేంద్రవిజయం తెలుపుతూవుంది.

## కట్టుదిట్టమైన కర్నాటక సంగీతం:

విజయనగర చక్రవర్తులకాలంలో సంగీతం శాస్త్రయుక్తంగా అభివృద్ధి పొందింది. ఈ విధంగా కర్నాటక ప్రాంతంలో కట్టుదిట్టంగా సంగీతం అభివృద్ధిపొందడం వల్లనే ఈ సంగీతానికి కర్నాటక సంగీతం, కర్నాటక సాంప్రదాయం అన్న పేరు నాటి నుంచి నేటివరకూ దక్షిణ హిందూదేశంలో అధిక ప్రచారంలో వుంది. విజయనగర రాజుల హయాములో దేవాలయాలలో దేవదాసీలు నృత్యాన్ని, తద్వారా గానాన్ని ప్రదర్శించేవారు. ఆయా ఋతువుల ననుసరించి ఋతువర్ణనలతో ఒక్కొక్క ఋతువునకు ఒక్కొక్కరాగం పాడుతూ వుండేవారు.

రాయలు గానకళను ఎంతగానో పోషించాడు. సంగీత విద్వాంసుల్ని పోషించి వారికి అవ్వారిగా ధర్మాలను చేశాడు. అన్యరాష్ట్రాలనుంచి వచ్చిన అనేక మంది సంగీత విద్వాంసుల్ని ఆదరించి, గౌరవించి, సమ్మానించాడు. ఇలా వచ్చిన వారిలో ఒరిస్సారాష్ట్రంనుండి వచ్చిన లక్ష్మీనారాయణ పండితు డొకడు. ఈయన 'సంగీత సూర్యోదయ' మనే గ్రంథాన్ని వ్రాశాడు. ఈయన కొంతకాలం రాజాంతఃపురంలో సంగీతశాస్త్ర అధ్యాపకుడుగానూ పనిచేశాడు.

## రాయల ఆడుగుజాడల్లో అళియ రామరాజు:

అళియ రామరాజు రామయామాత్యుడనే సంగీత విద్వాంసుని తన కుమార్తెలకు సంగీతం నేర్పటానికి నియోగించాడు. రామయామాత్యుడు 'స్వరమేళకళానిధి' అనే ఒక ప్రమాణ గ్రంథాన్ని సంస్కృతంలో వ్రాశాడు. ఈ గ్రంథాన్ని అనుసరించే కర్ణాటక సంగీత సాంప్రదాయాలన్నీ ఏర్పడినవట.

పుండలీకవిఠలు డనే ఆయన ఉత్తర హిందూస్థానం వెళ్ళి అక్కడ 'నర్తక నిర్ణయం' అనే నాట్యశాస్త్రాన్ని రచించి అక్బరు చక్రవర్తి ఆస్థానంలో గౌరవ సత్కారాల్ని పొందాడు.

కృష్ణదేవరాయల సిబ్బందిలో ఒకడైన నాదెండ్ల గోపన్నమంత్రి 'ప్రబోధ

చంద్రోదయ'మనే ఆధ్యాత్మిక రూపకానికి వ్యాఖ్య రచించాడు. అతడు నాట్య శాస్త్ర గ్రంథకర్తలలో శృంగనాచార్యుని నామం రెండు మూడు మారులు ఉదాహరించాడు.

హరిహరరాయల కుమారుడైన విరూపాక్షరాయలు విద్యారణ్య యతీంద్రుల శిష్యుడు. ఇతడు సంస్కృతభాషలో నారాయణ విలాసం, ఉన్మత్తరాఘవం అనే రెండు నాటకాలు రచించాడు.

సాళువాటిలో మేటిగ్రంథం:

ఇమ్మడి ప్రౌఢదేవరాయలనబడే మల్లికార్జున దేవరాయల కాలంలో క్రీ. శ. (1446-1465) చతుర కల్లినాథుడు రచించిన కళానిధి నామం గల సంగీత రత్నాకర వ్యాఖ్యానం విజయనగరరాజుల కాలంలో వెలువడిన గ్రంథాలలో వుత్తమమైంది.

రెండవ దేవరాయల కాలంలో దుర్గపాలకుడైన గోపేంద్ర తిప్పరాజు 'తాళదీపిక' అనే ప్రత్యేక తాళలక్షణగ్రంథాన్ని రచించాడు.

కళింగాధిపతియైన వీరరుద్ర గజపతి, కృష్ణదేవరాయల పోషణలోవున్న లొల్ల లక్ష్మీధరుడు తన పూర్వులలో అయిదవతరంవాడైన విరించి మిశ్రుడు 'భరతార్ణవ పోత'మనే నాట్యగ్రంథాన్ని రచించినట్లు తనసౌందర్య లహరీ వ్యాఖ్యానంలో ఉదాహరించాడు.

దేవాలయానికి దివ్యదానం
ఇచ్చిన దేవదాసి:

క్రీ. శ. 1433-34 సం॥ రంలో మడమను గ్రామంలో అగ్నీశ్వర దేవాలయానికి

దేవదాసి 'అరంవళత్త నాచ్చియార్' అనే తమిళదేశపు దేవదాసి. ఆమె రెండవ దేవరాయల్ని దర్శించి, అతని వలన ఒక దేవాలయం కొరకు దానం పొందింది. రాయలకాలంలో దేవదాసీలు నాట్యకళలో అద్భుతమైన ప్రావీణ్యాన్ని కలిగి వుండే వారు. రాజాదరణకు పాత్రమైన దేవదాసీలు గృహాలేకాక గృహారామాలను కూడ స్వంతంగా కలిగి వుండేవారు.





యక్షుల సంగీత, నాట్యప్రదర్శన

విజయనగర రాజధాని హంపిలోవున్న శిల్పసంపదలో గాయక, నర్తక, నర్తకీ బృందాలు సంప్రదాయశుద్ధమైన భరతనాట్య భంగిమలతో బహుసంఖ్యలా విరాజిల్లుతున్నాయి. కోలాటపు కోపుల శిల్పాలు అనేకం గోడలమీద చెక్కబడి వున్నాయి.

బయలాటలకు

ప్రభుత్వులుకూడ హాజరు :

రాయలకాలంలో దేవాలయాలముందు జరిగే బహిరంగ నాట్య ప్రదర్శనాలకు రాజులుకూడా హాజరవుతూ వుండేవారు. విఠలస్వామి దేవాలయంలో నాట్యప్రదర్శనాలు వీక్షించడానికి వచ్చే రాజులకు ఎత్తైన వేదికపై ఒక సింహాసనం అమర్చబడి అలంకరింపబడి వుండేది. నృత్యంచేసే నర్తకీమణులు, వివిధ వాద్యకారుల భంగిమలు వున్న యీ వేదికపై ఉన్న సింహాసనంలో రాయలు ఆసీను లయ్యేవారు.

రాయల కాలంలోని ప్రాచీన శిల్పాలలో నాట్యకత్తెలు మహమ్మదీయ స్త్రీలు ధరించే పైజామాలను ధరించి, శరీరంపై చాలా ఆభరణాలు ధరించినట్లు కొన్ని చెక్కబడి వున్నాయి.

గాయకులకు

సంఘంలో ఘన గౌరవం :

ఆ రోజులలో గాయకులకు సంఘంలో ఎక్కువ గౌరవం వుండేదట. ఆనాటి వాద్యపరికరాలలో వీణకు ఎక్కువ ప్రాముఖ్యమున్నట్లు అనేక ప్రబంధా

లలో ఉదాహరింపబడి వుంది. అనేకమంది గాయకులూ, సంగీత విద్వాంసులూ ఉత్తర హిందూదేశంలో పర్యటించి, అనేక రాజాస్థానాలలో తమ విద్యను ప్రదర్శించి పోటీలలో నెగ్గి విజయనగరానికి పేరు ప్రఖ్యాతుల్ని తీసుకువచ్చారు. సంగీత శాస్త్రాకరం వ్రాసిన వితలుని తండ్రి 22 రాగాలలో విశేష ప్రవీణతను సంపాదించి గుజరాత్ మాండ్వీ సుల్తానును మెప్పించి వేయితులాల బంగారాన్ని పారితోషికంగా పొందాడట. ఈ విధంగా విజయనగర చక్రవర్తులు కవి, పండిత, గాయక, నటీనటులను, శిల్పులను పోషించారు.

## ఆటపాటల్లో స్వయంగానూ రాయలసాధన :

శ్రీకృష్ణదేవరాయల నగరులోని నాట్యశాలలో కృష్ణదేవరాయలు స్వయంగా సంగీత నాట్యాలను అభ్యసించినట్లు చరిత్రాధారాలవల్ల తెలుస్తూవుంది. రాయలు కొలువు తీర్చివుండగా రంజకం శ్రీరంగరాజు, రంగరాజు కుమార్తె రంజకం కుప్పాయి, నట్టువ నాగయ్య మొదలైనవారు నృత్య, నాటకాలను ప్రదర్శించే వారట.

దసరా వేడుకల్లో జెట్టీలు కుస్తీలను ప్రదర్శించేవారట. రాత్రిపూట బాణా సంచాలను కాలుస్తూ వుండేవారట. నానా విగ్రహాల ఆకారంలోవున్న బాణా సంచాలు పటపట మంటూ ఆకాశానికెగిరి పగులుతూ వుండేవట.

రాయలకాలంలో ఒక్కొక్క ఋతువులో ఒక్కొక్క రాగానికి ప్రాముఖ్యముండేదట. వసంతకాలంలో హిందోళరాగం పాడినట్లు ఆముక్త మాల్యదలో వుదాహరింపబడి వుంది.

అచ్యుతరాయల పరిపాలనలో నృత్యకళ అభివృద్ధిపొందింది. ఆయన ఆస్థానంలో అనేకమంది నర్తకీమణులు పోషింపబడ్డారు. ఆనాడు అనేకమంది నర్తకీమణులు తిరుపతి దేవస్థానానికి పంపబడినట్లు దేవస్థానంవారు ప్రకటించిన ఒక శాసనాన్నిబట్టి తెలుస్తూవుంది.

ఆ రోజుల్లో పురుషులే స్త్రీ వేషాలు ధరించేవారనీ, నాట్యపు పోటీలు జరిగేవనీ, విషుణులు ఉత్తమ మధ్యమాది నృత్యనిర్ణయాలను చేసినట్లూ, మృదంగం, దండెతాళం, బురుమకిన్నెర, సన్నగాశె వీణ, ముఖవీణ, వాగ్గోలుదోలు, మౌరి, భేరి, గౌరు, గుమ్మెట, తమ్మెటం, డుక్కి, డక్కి, చక్కి, చయ్యంకి మొదలైన వాయిద్యాలుండేవనీ ఆముక్త మాల్యదలో వుదాహరింపబడింది.

పెద్దన మనుచరిత్ర నాలుగవ ఆశ్వాసంలో స్వారోచిషుక ప్రవేశసందర్భాన-"చిలకలకొల్కి కల్కి యొక చేడియ నాటకశాల మేడపై నిలువున నాడు చుండి"రని ఒకపద్యంలో నాటకశాలను పేర్కొన్నాడు.

భోగాలకు పెట్టిపుట్టిన
భోగంవారు :

ఆనాడు ఆటపాటలకు భోగంవారే ప్రధానంగా వుపయోగపడేవారు. భోగంవారి సమ్మేళనాన్ని మేళమనే పిలుస్తూ వుండేవారు. ఈనాటికీ అనుశ్రుతంగా భోగంవాళ్ళని భోగం మేళమని పిలుస్తూ వున్నారు. ప్రతి మేళానికీ ఆటలోనూ, పాటలోనూ, అభినయంలోనూ, అనుభవంలోనూ ఆరితేరిన ఒక వృద్ధవేశ్య మాత పెద్దగా వుంటూ మేళాన్ని సక్రమపద్ధతుల్లో నిర్వహించి, నాయకత్వం వహించి మిగతా వేశ్యలైన నాట్య సుందరీమణులను కలిసికట్టుగా నడిపేది. ఇందులో వెనుకపాట పాడేవారుకొందరు ఆ పాటకు అభినయంచేస్తూ ప్రేక్షకుల ముందుకు వెళ్ళి నాట్యం చేసేవారు.

కృష్ణదేవరాయల కాలంలో దేవదాసీలు ప్రముఖస్థానాన్ని అలంకరించారు. నాట్యకళయందు ప్రజ్ఞానిధులుగా వెలుగొందారు. రాయలదర్బారులోను, రాణివాసపు మందిరాలలోను, దేవస్థానాలలోను, వీధిమంటపాలలోను, ఎటుచూచినా దేవదాసీ సుందరాంగనలు నాట్య, నాటక, గాన మాధుర్యాలను వెదజల్లారు.

భోగంవారని పిలువబడే ఈ దేవదాసీలు రాయల సామ్రాజ్యంలో మహోన్నతమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. దేవదాసీలకు అన్నిసమయాల్లోనూ,

రాయల అంతఃపుర సౌధాలలోనికి ప్రవేశముండేది. కొంతమంది వేశ్యలు రాణుల వద్ద దాసీలుగానూ వుండేవారు. వసంతోత్సవాలలో. ఎటుచూచినా దేవదాసీలు వసంతాలను వెదజల్లేవారట.

ఆనాడు రాయల ఆస్థానశిల్పులు దేవాలయాలమీదా, వారి మహాసౌధాల మీదా, కుడ్యాలమీదా, స్తంభాలమీదా ఆ దేవదాసీల నాట్యభంగిమాలను, వివిధ అభినయాలనూ వేషభూషణ అలంకారాలతో సహా చిత్రించారు. కొన్ని చిత్రాలు నగ్నంగాకూడా చెక్కబడివున్నాయి. హంపీ హజారరాయాలయం ముఖద్వారం వద్దనూ, ఆలయంలోనూ, స్తంభాలపైనా నాట్యకత్తెలయొక్క ఇటువంటి చిత్రాలు మనకు కనబడుతూన్నాయి. ఈ విధంగా దేవదాసీ నాట్యశాలను రాయలు ఎంతగానో ఆదరించాడు.

ఓ ప్రథమంగా
దేవతాసన్నిధిలో ప్రదర్శనం :

ఆనాటి భోగంవడుచులు తొలిసారి దేవతాసన్నిధిలో నాట్యంచేసి ఆ తరువాత నాట్యాన్ని వృత్తిగా స్వీకరించేవారు. రాజులు భోగంవారి సంగీతన్యత్యాలను మెచ్చుకుని, ఆ సందర్భంలో కవులకు, కళాకారులకు 1116 ర్లు ఇచ్చేవారట. ఇందుకు ఉదాహరణగా.



అప డాచోళవసుంధరాధివతి వావానర్ష్య భూషంబరా
ది వదార్థ ప్రకరంబు త్యాగమహిగా దీవారము ల్వేయునూ
ట వదహార్లం గృవజేసి.

అని వైజయంతిలో వివరించారు.

గారడీలలో గడిదెరిన
విప్రవినోదులు :

ఈనాటి ఆంధ్రదేశంలో ఎక్కడో చెదురుమదురుగా తప్ప, ఈ విప్రవినోదం ప్రచారంలో వుందని చెప్పలేం. కాని, 1600-1700 సంవత్సరాలలో ఈ వినో

దాలు బహుళవ్యాప్తిలో వున్నాయి. అంచే అది విజయనగర సామ్రాజ్యకాలం.విప్ర లనగా బ్రాహ్మణులు. వారు వినోదం చేయడంవలన విప్రవినోదమని పేరు వచ్చింది. బ్రాహ్మణులలో ఒక జాతిబ్రాహ్మణులు, దేవతోపాసన వలనవో, మంత్ర తంత్రాల వలననో చిత్రవిచిత్రమైన గారడీలు చేస్తూవుంటారు. గుంటుపల్లి ముత్తరాజనే విప్రవినోది గోలకొండ సుల్తానుల తుదికాలంలో వున్నట్లు, ఆయననుగురించి ఒక చాటువు వున్నట్లు ప్రతాపరెడ్డిగారు తమ సాంఘిక చరిత్రలో తెలియజేశారు.

సంతతమారగించువెడ సజ్జనకోటుల పూజసేయుచో
మంతుడు గుంటుపల్లి కులమంత్రిశిఖామణి ముత్తమంత్రిదా
బంటియె బంటిగాక, కడు పంద గులాముల బంతులెల్ల మాల్
బంతులు, దుక్కిటెర్లయిడ బంతులు, విప్రవినోదిగారడీ
బంతులు దొంగవాండ్ర ములుబంతులు సుమ్ము ధరాతలంబునన్.

## ప్రజలపాలిటికి పండగైన జాతీయ జాతర్లు :

ఆ రోజుల్లో మూఢనమ్మకాలు ఎక్కువగావుండి జాతర్లు జరుగుతూ వుండేవి. ఇవి ఎంతో ఆడంబరంగానూ జరిగేవి. వీటిని ప్రజలు ఎంతో పర్వంగా ఎంచేవారు. ఈ సమయంలో యక్షగంధర్వ వేషాలను ధరించి, నృత్యంచేస్తూ వుండేవారు. ఇందువల్ల కురవంజిరూపాన్ని యక్షగానంగా పిలిచేవారు. వీటిని ఆనాడు వేశ్యలు కూడా ప్రదర్శించేవారు. కళావంతుల్లో ఒక తెగను జక్కుల జాతివారు అని కూడ పిలుస్తూ వుండేవారట.



## దాసరులు :

విజయనగర సామ్రాజ్యకాలంలో ఈ పేరుతో కొందరు శంఖుచక్రాలు కలిగి, ఇత్తడితో చేయబడిన కుండలాలు ధరించి, జింకకొమ్ములు, అలుగులు, మొగిలియాకులగొడుగు, గుట్టపు వెంట్రుకలతో తయారు చేయబడిన విసనకట్ట, తోలుతిత్తి, చిట్టితాళాలు, చంకనబుట్ట, మెడలో తులసిపేర్లు, ముఖాన తెల్లని పంగనామాలు మొదలైన వేషధారణ కలవారై, చాండాలిక అనే కిన్నెరను వాయిస్తూ పదాలనుపాడుతూ,

దానరి వేషభూషలు

మాలమాదిగ గురువులుగానూ పౌరోహితులుగానూ వుంటూ యాచిస్తూ వుండే వారని ఆముక్తమాల్యద లో వివరించ బడింది.

ఎరుకలతో ఎన్నికకెక్కిన
ఎరుకలసాని :

ఎరుకలసాని పూర్వకాలంలో ఎరుక చెప్పడంద్వారా సంఘంలో మంచి పలుకు బడినీ, ప్రాబల్యాన్నీ కలిగివుండేది. రాజాధిరాజులూ,రాణులూ, పండితులూ మొద లైనవారంతా ఎరుకలసాని సోదెకు చెవులు తెగకోసుకుని, ఆమెను ఆహ్వానించి, ఎరుక చెప్పించుకుని అనేక పారితోషికాలను ఇచ్చేవారు. ఎరుకలసాని ఏ సంస్థానంలో ప్రవేశించాలన్నా, ఏ అభ్యంతరమూ లేక దర్శనానికి అనుమతి ఇచ్చేవారు.

ఈ ఎరుకలసాని సమాజంలో ఎంత పలుకుబడిని సంపాదించిందో, అంతటి స్థానాన్ని ఆనాటి సాహిత్యంలోనూ, కళారూపాల్లో కూడా పొంది, ప్రత్యేకం ఒక పాత్రగానూ వర్ధిల్లింది. ఆనాటి ప్రతికురవంజిలోనూ, యక్షగానాల్లోనూ ఎరుకసాని ఒక పాత్రగా ప్రవేశించి నాయకికో, నాయకులకో ఎరుకచెప్పి నిష్క్రమించేది.

విజయనగర సామ్రాజ్యకాలంలో ఎరుకత ముఖ్యపాత్ర వహించింది. ఎరుకలయొక్క వేషధారణను గురించి ఆముక్తమాల్యదలో వివరించబడింది. ఎరుకత వన్నెల రవికను తొడిగి, ముంజేతులకూ, ముఖంపైనా పచ్చబొట్లులతో, కురుమాపు పైటలో చిన్నబుడుతణ్ణి మూపున కట్టుకుని, తరతరాలనాటి పైడిబుట్ట నెత్తిన పెట్టుకుని, కనుబొమల సంచున నామంపెట్టి,నొసట విభూతిపెట్టి, కన్నులకు కాటుకపెట్టేది. దారికట్టు, మొనకట్టు, కనికట్టు, స్త్రీ వశ్యం కలిగించే తాయిత్తుల్నీ, ఏరుల్నీ అమ్ముకునేది. దీనిని కురవంజి అనికూడ సంబోధించేవారు. ఆనాడు కురవంజి ఆటలు కూడా విరివిగా జరుగుతూవుండేవి. వుదాహరణకు యాదవ దాసు వ్రాసిన గరుడాచల యక్షగానంలో లక్ష్మీదేవి తెర వెడలిన తరువాత, ఎరుకల నాంచారిని ద్వారపాలకుడు ఈ విధంగా పరిచయంచేశాడు.

కం. తరుణిరొ తెరకును వెళ్ళుము
కరుణకొ మీ కథలు మాకు కమలదళాక్షి

సరగున జెవ్వము మ్రొక్కుము
ఎరుకల నాంచారుబొమ్మ వెలదిరొ రమ్మా॥

అని ఎరుకల నాంచారును ప్రవేశపెడుతాడు.

ఎరుక ఎరుకోయమ్మ-అవ్వోళ్ళయ్యా ॥ఎ॥
ఎరుకచే జగమంత-వెలుగుచు నుండును.
మరుక తిరిగేది మగువమ వినవమ్మ ॥ఎ॥
ఏడు కొండలమీద యొక్కింది ఎరుక.
జోడు గుండ్లమీద కూడిందె ఎరుక ॥ఎ॥

అంటూ ఇనాంచారు ఒక కీర్తన పాడుతుంది.

ఎరుకజెప్పితి చినవమ్మా-ఓ ముద్దులగుమ్మా
కరుణతో కలదే కనకపుబొమ్మా॥
యెరుకా, యెరుకా, యేడు జగములు
మురియుచు నీరీతి దనముచ్చట జెప్పెద.

అంటూవుండగా లక్ష్మీదేవి 'ఆంకా యెటువలెనో చెప్పవమ్మా' అంటుంది.

ఈ విధంగా ఆనాటి కురవంజిలోనూ, యక్షగానంలోనూ ఈ ఎరుకలసాని ప్రాముఖ్యం ఎంతగానో వుండేది.

జే జేలుపొందిన
జిక్కులవారు:

విజయనగర చక్రవర్తుల కాలంలో ఇతర కళా రూపాలతోపాటు వర్ధిల్లిన కళా రూపం యక్షగానం. మన ప్రాచీన కళారూపాల్లో అతిప్రాచీనమైనది యక్షగానం. ఇది ఆంధ్ర, కర్ణాటక, తమిళ రాజ్యాలలో అతివిస్తారంగా వ్యాప్తిలోకి వచ్చింది. ఒకనాడు యక్షగాన వాఙ్మయం దక్షిణ భారతదేశమంతటా దేదీప్యమానంగా వెలుగొందింది.

16 వ శతాబ్దంలో యక్షగాన చరిత్రలో ఒక నూతనశకం ప్రారంభమైంది. సుప్రసిద్ధులైన కవిగాయకులనేకులు యక్షగానాల్ని రచించారు. రాజులు వారికి



జక్కుడుచాన

వుత్సాహాన్నిచ్చి వారిని పోషించారు. 1506 మొదలు 1509 వరకు విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయల అన్నగారు వీర నరసింహరాయలు యక్షగాన రచయితలను, ప్రేక్షకులను చాలా గౌరవించేవాడట. క్రీ. శ.1514 లో కర్నూలుజిల్లా చెరువు బెళగల్లు గ్రామంలోతాయి కొండ నాటక ప్రదర్శనాన్నిచ్చిన చేగయ్య కుమారుడు నట్టువ నాగయ్యకును, పాత్రిగ నటించిన పోతవరగ్రామ వాస్తవ్యుడు నట్టువ తిమ్మయ్య కుమార్తెకును ఆవూరికరణం తిరువత్తూరు సోమరసు కుమారుడు బసవరసు కొంత భూమిని దానమిచ్చినట్లు తెలుస్తూంది. తాయికొండ నాటక ప్రదర్శనాన్నిచ్చిన వారు ఆనాటి కర్నూలు జిల్లావారే నని భారతిలో నేలటూరి వెంకటరమణయ్యగారు వుదాహరించారు.

## సాధుమీరిన సంబెటిగురవరాజుకు 'కూచిపూడి' సమ్మేటిపోట్లు :

కూచిపూడి భాగవతులను గురించి, వారి పూర్వచరిత్రను గురించి మాచుపల్లి కైఫీయత్‌లో 1502 నాటికే సవిస్తరంగా వ్రాయబడివుంది. ఆ రోజుల్లో సంబెటిగురవరాజనే సామంతరాజు విజయనగర చక్రవర్తులపాలనలో రాజ్యంచేస్తూ వుండేవారు. ఆయన ప్రజలను నానాచిత్రహింసలకు గురిచేస్తూ దుర్భరంగా పరిపాలిస్తున్నాడు. సకాలానికి ఎవరైతే శిస్తులు చెల్లించరో వారి స్త్రీలను బలవంతంగా కోటకు తీసుకువచ్చి ఆస్త్రీల స్తనాలకు చిరుతలు పట్టించి వారివద్ద శిస్తుల్ని వసూలుచేసేవాడట. కూచిపూడి కళాకారులు దేశాటనంచేస్తూ గురవరాజు రాజ్యంనుంచే ప్రయాణంచేస్తూ ఆయనయొక్క హింసాకాండను కళ్ళారాచూచి, ఆదృశ్యాన్నంతనీ కథారూపంలో పెట్టి ప్రదర్శనాలిచ్చుకుంటూ విజయనగరం వీరనరసింహరాయల ఆస్థానానికి చేరుకున్నారు.

## కేళికలతోనే కావరందించిన కూచిపూడి కళాకారులు :

కూచిపూడి కళాకారులు రాయలవారిని కేళిక అడిగారు. ఆనాటికే కూచిపూడి విద్వాంసులయొక్క కళా విశిష్టతల్ని విన్న రాయలవారు ప్రదర్శనానికి

సెలవిచ్చారు. ప్రదర్శనం ప్రారంభమైంది. ప్రదర్శనంలో మన కళాకారులు గురవరాజు ప్రభుత్వపాలనా విధానాన్నే ప్రదర్శించడం మొదలు పెట్టారు.

ప్రథమంగా గురవరాజు వేషధారణతో ఒక నటుడు ప్రవేశమై, రాయల సమక్షంలో స్త్రీల స్తనాలకు చిరుతలు పట్టించి తహశీలుసొమ్ము ఇవ్వవలసించని హింసపెట్టాడు.

రాయలవారు గురవరాజు పరిపాలనా విశేషాలను తెలుసుకున్నారు. ఆ రాత్రి ప్రదర్శన పూర్తి అయీ అవగానే దర్బారు ఏర్పాటుచేసి వాస్తవాన్ని తరలించి గురవరాజు పరిపాలనను అంతమొందించి, ఈ విషయాన్ని ప్రదర్శనరూపంలో చిత్రించి కనువిప్పు కలిగించిన కళాకారులను వేనోళ్ళ పొగిడి కానుకలిచ్చి, అగ్రహారాలిచ్చి పంపారు. వారి సంస్థానంలో కళాకారులను పోషించారు.



లేపాక్షిలోని శివతాండవం

శిల్పకళతోపాటు చేయి చేయిగా చిత్రకళ.

లేపాక్షి విరూపణ్ణ :

ఆ కాలంలో శిల్పకళతోపాటు చిత్రకళకూడా అభివృద్ధి చెందింది. విజయనగర చక్రవర్తియైన అచ్యుతరాయలకాలంలో హిందూపురానికి 9 మైళ్ల దూరంలో లేపాక్షి అనేచోట పెనుగొండ విరూపణ్ణ అనే రాయలవారి ఉద్యోగి, అతని సోదరుడైన వీరణ్ణనాయకుడూ లేపాక్షి నగర నిర్మాణానికి కారకులని తెలుస్తూ వుంది.

విరూపణ్ణ లేపాక్షిలో కట్టించిన వీరభద్రేశ్వరాలయంలో ఒక నాట్య మంటపం వుంది. అందులో శివుని నటరాజమూర్తిని, గాయక బృందంతోపాటు అప్సరసలను ప్రదర్శించే శిల్పఫలకాలున్నాయి. ఈ దేవాలయంలో అపూర్వమైన నాట్య విజ్ఞానం వెల్లివిరుస్తూ వుంది:నృత్యం చేస్తున్న నాట్యకత్తెలతోను, మార్దంగిక వాద్యకారులతోను దేవగాయకబృందాలతోనూ శిల్పకళామయమైన స్తంభాలు నిలబడి ఈ నాటికీ మనకు దర్శనమిస్తున్నాయి.

సృష్టికర్తయైన బ్రహ్మదేవుడు మృదంగవాయిద్యం వాయిస్తున్నట్లూ, నందికేశ్వరుడు హుడుక్క వాయిద్యాన్ని ప్రయోగిస్తున్నట్లూ, తుంబురుడు వీణా తంత్రుల్ని మీటుతున్నట్లూ, దేవనర్తకియైన రంభ నృత్యంచేస్తున్నట్లూ మనం చూడగలం.

నాటి జానపద

కళారూపాల తీరుతీయాలు :

చంద్రశేఖర శతకాన్ని వ్రాసిన చంద్రశేఖరుడు తాను వ్రాసిన శతకంలో తాను చూచిన ఆనాటి జానపద కళారూపాలను ఎన్నిటినో వర్ణించాడు. ఈతడు వాడిన భాషనుబట్టి ఇతడు నెల్లూరు ప్రాంతంవాడు కావచ్చని ప్రతాపరెడ్డిగారు తమసాంఘిక చరిత్రలో వ్యాహరించారు. చంద్రశేఖరుడు 17 వ శతాబ్దం వాడని వ్యూహించవచ్చు. అంటే అది విజయనగర సామ్రాజ్యం దాదాపు అంతరించిన కాలం. ఆనాటి ఆచార వ్యవహారాలను వెక్కిరించి తన రచనద్వారా హేళనచేశాడు. ఈయన తండాన కథలను గూర్చి, జంగం కథలనుగూర్చి, భాగవతులను గూర్చి, పండితులవారిని గూర్చి, భోగంవారిని గూర్చి, పీఠిపురాణం ప్రాముఖ్యాన్ని గూర్చి

చమత్కారమైన భాషలో వుదాహరించాడు. భోగం ఆటలను గూర్చి ఈ విధంగా వర్ణించాడు.

భోగం మేళం :

పేరువ వాడవల్లి నరసిమ్మడి తీరతమోయి బోగమ
మ్మోరులయాట సూస్తి దనిముంగల దేముడెంత, ఇద్దెలో
తీరు, వయాన గంటి, వొకతిత్తి గుకిన్కిక కూడెవాని కా
లూరికె మొక్కబుద్దెగు వహొయను మూర్ఖుడు చంద్రశేఖరా.

వీధిపురాణం :

వండిన చేమనాది వడమోసుకుపో వెలనాడు నీవు
వుర్రాండము సెప్పివావుగద రమ్మెముగా బగుమావమిన్న
మాముండ ఇనాలటంట, వడి మొత్తుక వచ్చెను నీవుమల్లిరా
మాండము సెప్పలంచు వను మండుడు మూర్ఖుడు చంద్రశేఖరా.

తందాన కథలు :

ఇంటిని తిమ్మరాజుకత ఇంటిని ఈర్ల కథాప్రసంగముల్
ఇంటిని పాడులాలి, ఇబమింటిని వాయకురాలిశౌరెమె
వ్వంటికి నందివాక్కముల పొందు చెర్రితల నాదు భాగ్యమె
న్నంటికి గల్గనోయను నవజ్ఞుడు మూర్ఖుడు చంద్రశేఖరా.

భాగోతులు :

రాతిరి సూస్తి యేనములు రమ్మెముగా గురులాన మొన్నబా
గోతుల సత్తెబామ యన గూడని కావములెల్లసేసె మా
పాతకురాలు రాద వల వచ్చము రుక్మిణి సుద్దికిష్టమం
టి తిరుగనంచు వచియించుమ మూర్ఖుడు చంద్రశేఖరా.

పంబలనాయు, జాతర్లు :

ఇరిదిగసూస్తితీరతము లెవ్వెవొ యావనగొండ గంగజా
తర వరిరావు వంబలును తప్పెటలున్ కొముగాండ్ల సిండ్లనం
బర మదిదెల్పు మింకొక వబావము రంకులరాటమెక్కివే
తిరిగిన సాటిరాదని మతించును మూర్ఖుడు చంద్రశేఖరా.

ఈ విధంగా 1336 లో ప్రారంభమైన విజయనగర సామ్రాజ్యం మూడు వంవల సంవత్సరాలపాటు నిలబడి, నశించింది. దక్షిణ హిందూదేశమంతా 200 సంవత్సరాలు వీరు పరిపాలించారు. ముఖ్యంగా ఆంధ్రదేశంలో విజయనగర రాజ్యకాలం ఒక విధంగా స్వర్ణయుగం.

# క్షేత్రానికేకాదు
# కళలకూ క్షేత్రమైన తంజావూరు

1565 తళ్ళికోట యుద్ధానంతరం విజయనగర రాజ్యం ఛిన్నాభిన్నమై పోయింది. రాయల సంతతివారు కొంతమంది పెనుగొండకూ, మరి కొంతమంది చంద్రగిరికీవెళ్ళారు.మిగిలినవారు తంజావూరుకూ, మధురకూ చేరుకున్నారు. ఈ రెండూ కూడా విజయనగర రాజులక్రింద సామంతరాజ్యాలుగా వుండేవి. వీటిని పరిపాలించిన నాయకరాజులు చివరివరకూ ఆంధ్రభాషను పోషిస్తూనే వచ్చారు.



తంజావూరురాజ్యాన్ని 1535 నుండి 1673 వరకు సుమారు 140 సంవత్సరాలు నాయకరాజులు పరిపాలించారు. ఈ వంశం వారు ఆఖరువరకూ విజయనగరరాజులపట్ల విశ్వాసపాత్రులుగా ఉంటూ వచ్చారు.

## నాయకరాజుల్లో నాయంకరులు :

అచ్యుతరాయలు, రఘునాథరాయలు, విజయరాఘవరాయలు వరుసగా పరిపాలించారు. విజయరాఘవ నాయకునికి మరోపేరు మన్నారుదాసు. మధురనాయకుడైన చొక్కనాథునికీ, ఇతనికీ జరిగిన యుద్ధంలో (1674) విజయరాఘవుడు మరణించాడు. అనంతరం రెండు సంవత్సరాల తరువాత శివాజీ తమ్ముడైన ఎక్కోజీ తంజావూరును ఆక్రమించాడు. ఒక శతాబ్దంపాటు మహారాష్ట్రులు దాన్ని పరిపాలించారు. ఎవరు పరిపాలించినా ఆనాటికీ, ఈనాటికీ వారి సంస్కృతి అంతా అచ్చం అలా నిలిచేవుంది.

## సువర్ణయుగంగా శోభిల్లిన నాయకరాజ్య రంగుహంగులు :

దక్షిణదేశ చరిత్రలో ఆంధ్రనాయకరాజుల పరిపాలన ఒక సువర్ణ యుగమని చెప్పవచ్చు. విజయనగర చక్రవర్తుల కాలంలో లలితకళలు అభివృద్ధిపొందినట్లే. తంజావూరునాయకరాజుల కాలంలోకూడ లలితకళలన్నీ వికాసం పొందాయి. తెలుగు సాహిత్యం, సంగీతం, నాట్యం, శిల్పం, యక్షగానవాఙ్మయం ఒక మహోన్నత స్థానాన్ని అలంకరించాయి. ఆనాటికీ, ఈనాటికీ ఆ మహా వైభోగానికి సాక్ష్యాధారాలుగా అవి తంజావూరులో మనకు దర్శనమిస్తున్నాయి.

## కవి, పండిత పోషణలో రఘునాథుడు :

రఘునాథనాయకుడు క్రీ॥శ॥ 1600 నుండి 1634 వరకూ రాజ్యాన్ని పరిపాలించాడు. ఈయనకు దానకర్ణుడనే పేరుకూడా ఉంది. గోవింద దీక్షితుడు ఈయనకు మంత్రి. ఈయన కర్ణాటక సంగీత శాస్త్రంలో బహుముఖ ప్రజ్ఞాశాలి. అనేకరాగాలను, తాళాలను ఈయన స్వయంగా కల్పనచేశాడు. రఘునాథ నాయకుని ఆస్థానంలో కవులు,పండితులు బహుబాగా పోషింపబడ్డారు. ఈయన ఆస్థానంలో ముద్దు చంద్రరేఖ అనే రాజనర్తకి వుండేదట. గోవింద దీక్షితుని ఇరువురు పుత్రులైన భాస్కరదీక్షితుడు, రాజాచూడామణి దీక్షితుడూ లక్ష్మీ కుమారతాతాచార్యులూ నృత్య, గాన విద్యల్లో ఆరితేరిన దిట్టలు. రామభద్రాంబ మొదలైన వారందరూ రఘునాథుని ఆస్థానం అలంకరించినవారే. ఆయన ఆధ్వర్యంలో తెలుగు సాహిత్యం ఎంతో అభివృద్ధి చెందింది. ఎన్నో యక్షగానాలు నాటకరూపంలో ప్రదర్శింపబడ్డాయి.

## సంగీత, సాహిత్యదోహదంలో విజయరాఘుని వంతు :

రఘునాథనాయకుని అనంతరం విజయరాఘవనాయకుడు రాజ్యానికివచ్చి 1663 నుండి 1673 వరకూ పరిపాలించాడు. రఘునాథ నాయకునివలెనే ఈయనకూడ సంగీత, సాహిత్య, నాట్యకళలను పోషించాడు. మువ్వ గోపాల పద కర్తయైన క్షేత్రయ్య విజయరాఘవనాయకుని ఆస్థానంలో చాలా సన్మానా లందుకున్నాడు. ఈ క్షేత్రయ్య పదాలు ఈనాటకీ దక్షిణాపథమంతటా బాగా ప్రచారంలో వున్నాయి.

ఇంకా కళాకారులైన పురుషోత్తమ దీక్షితుడు, పసుపులేటి రంగాజమ్మ. కోనేటి దీక్షితుడు, కావరసు వెంకటపతి సోమయాజి, మన్నారుదేవుడు మొదలైన వారెందరో యక్షగాన రచయితలుగాను, ప్రదర్శకులుగాను ప్రసిద్ధి పొందారు.

నాయకరాజుల కాలంలో 54 మంది కవిపండితులు సంస్కృతాంధ్రభాషల వ్యాప్తికి తోడ్పడ్డారు.

కళాకారులకు
ఘనమైన మన్ననలు :

నాయకరాజులు ఎంతోమంది కళాకారులకు మడులు, మాన్యాలు, అగ్రహారాలు ఇచ్చి సన్మానించారు. దేవాలయాలకూ, మఠాలకూ, సత్రాలకూ, దేవదాసీలకూ మాన్యా లిచ్చారు.

యక్షగాన వాఙ్మయానికి
అక్షయమైన భిక్ష :

ఈయన హయాములో యక్షగాన వాఙ్మయం బహుముఖాల విజృంభించింది. ఈయన రాజదర్బారులో ఒక నాట్యమందిరాన్ని భవ్యంగా నిర్మించి, ఆ రంగ స్థలంపై ప్రత్యక్షంగా యక్షగాన ప్రదర్శనాలను ప్రదర్శింపజేశాడు. అనేక ప్రయోగాలను చేయించాడు. రఘునాథాభ్యుదయం అనే విజయ రాఘవనాయకుని నాటకంలో రాజ ప్రాసాదంలోని మనోహర చిత్ర



దృశ్యాలూ, అనేక చారిత్రిక ఘట్టాలూ వర్ణింపబడ్డాయి.

ఆంధ్ర తమిళభాషలను రెంటినీ, కన్నబిడ్డలవలె సమంగా ఆదరించిపోషించారు.

ఈ విధంగా దక్షిణదేశంలో ఆంధ్ర నాయకరాజులు ఒక ఉజ్వలోజ్వల చరిత్రను స్థాపించారు.

తెలుగు కన్నడాలను
తలదన్నిన పేరుపెంపులు :

యక్షగానాలు ఆంధ్ర, కర్ణాటకరాష్ట్రాలలోను ఎక్కువ ఖ్యాతిలో వున్నప్పటికీ ఎక్కువ ప్రతిభావికాసంతో విరాజిల్లినవి తంజావూరు యక్షగానాలుమాత్రమే.

రఘునాధరాయల కాలంలో యక్షగానాలు ఆట్టే అంతగా రాణించకపోయినా, విజయ రాఘవరాయల కాలంలో చాలా ఔన్నత్యాన్ని సంపాదించాయి. రఘునాధరాయల కుమారుడైన విజయరాఘవుడు తండ్రివలెనే కవులను, గాయకులను, నృత్యశాస్త్ర కారులను అపారంగా పోషించాడు. ఈయన స్వయంకవి; నాట్యశాస్త్రవేత్త; స్వయంగా అనేక రచనలు చేశాడు. వాటిలో ముఖ్యమైనవి యక్షగానాలే. ఈయన కృతులలో ముఖ్యమైనవి.

| | |
|---|---|
| ప్రహ్లాద చరిత్ర | రాజగోపాల విలాసం |
| వృషావరిణయం | రఘునాధాభ్యుదయం |
| మోహినీ విలాసం | పూతనావహరణం |
| మంజరీ నాటకం | సముద్రమథన నాటకం |
| కృష్ణవిలాసం | జానకీకళ్యాణం |
| | పుణ్యకవ్రతనాటకం. |

ఈయన అనేకమంది కవిగాయక నటులకు ఆశ్రయమిచ్చాడు. అనేక అన్న దానాలు చేశాడు. అన్నదానాన్ని కథా వస్తువుగా తీసుకుని పురుషోత్తమదీక్షితుడు విడిగా ఒక అన్నదాన నాటకాన్నే రచించాడు.ఈయన తన తండ్రి రఘునాధరాయల చరిత్రను రఘునాధాభ్యుదయమనే యక్షగానంగా వ్రాసి ప్రచారం చేయించారు.

పాతనుంచి కొత్తకు :

ఆనాటి యక్షగానాలు పురాణ కథావృత్తాలతో కూడివుండేవి. కాని విజయరాఘవుడు మహావీరుని చరిత్రను యక్షగానంగా రచించాడు.

ఏవంవిధంగా విజయరాఘవుని ఆధ్వర్యంలో యక్షగానాలు అజరామరంగా వెలుగొందాయి.

నాయకరాజుల కళాకాంతులను విరజిమ్మే తంజావూరు సరస్వతీమహల్‌లో దాదాపు 30 యక్షగాన నాటకాలున్నాయి. వీటిలో ఎన్ని రఘునాధరాయల కాలంలో వ్రాయబడ్డాయో తెలియదు. ఈ 30 నాటకాలలోనూ ఒక్క శాహిరాజుపేరనే 18 నాటకాలు వున్నాయి.

తంజావూరును 1684 నుంచి 1710 వరకు పరిపాలించిన శాహిరాజే ఈయన అనే ప్రతీతి వుంది. యక్షగానాల్లో చాలా భాగం క్షత్రియులు వ్రాసినట్లుగా వుంది.

### సామాన్యప్రజలపై చల్లచూపు :

ప్రథమంలో ప్రాసిన అనేక యక్షగానాల్లో చాలా యక్షగానాలు తేలిక భాషలోనూ, ప్రజలందరికీ అర్థమయ్యే గ్రామ్యభాషలోనూ ప్రాయబడ్డాయి.

### బహిరంగ ప్రదర్శనశాల:

దీనిని 'తిరంవెళి అరంగం' అని పిలుస్తారు. ఇది నాయకరాజుల ప్రాసాదంలో సరస్వతీ గ్రంథాలయానికి పడమటి దిక్కుగా, దానిని ఆనుకుని వుంది. దీని పూర్వరూపం ఎటువంటిదో తెలియదు. పైన కప్పు లేదు. నాలుగు దిక్కుల్లోనూ తక్కిన ప్రాసాదానికి సంబంధించిన ఎత్తైన గోడలున్నాయి. చతురాకారంగా వున్న ఈ ప్రదేశంలో నేలమీద 2000 వేలమందివరకూ కూర్చునే అవకాశముంది. ఈశాన్యదిశలో ఎత్తైన దిమ్మ ఒక టుండేదట. దీనిమీద నిలబడి మాట్లాడినట్లయితే శబ్ద గ్రహణయంత్రాల సహాయం లేకుండానే రెండువేలమందికీ స్పష్టంగా వినిపించేదట.

1952లో పళనియప్పన్ అనే జిల్లాకలెక్టరు దీనిని పునరుద్ధరించి, రమణీయమైన రంగస్థలాన్ని నిర్మింపజేశాడు. ఈనాడది బహిరంగ నాటకమండపంలాగా వుంది. ఒకమూలగా ఉన్న ఈ రంగస్థలంమీద నిలబడి చూచినట్లయితే ప్రేక్షకస్థానం వర్తులాకారంగా వున్నట్లు కనబడుతుందని నాట్యశాస్త్రంలో పి. యస్. ఆర్. అప్పారావుగారు తెలియజేశారు.



### నాయకరాజుల వరవడినే వెళ్ళిన మహారాష్ట్రరాజులు :

తంజావూరు ఆంధ్రనాయకరాజుల అనంతరం పరిపాలించిన మహారాష్ట్ర రాజులుకూడ తెలుగులో కవులై, కవిపండిత గాయకుల్ని పోషించారు (క్రీ. శ. 1798-1832). శరభోజీ ఆస్థానగాయక, నర్తకులైన చిన్నయ్య, పొన్నయ్య, వడివేలు, శివానందం అనే నలుగురూ సుబ్బరాయ నట్టువవారు పుత్రులు.

వీరు నృత్యాన్ని ఏకపాత్రీభనయంగా రూపొందించారు.

తెలుగుతేజు దీపించే
తంజావూరు నాట్యం :

తంజావూరు రాజాస్థానంలో నృత్యం ఏకపాత్రాభినయ కళారూపంగా అభివృద్ధి చెందింది.

అదే నేటి తంజావూరు భరతనాట్యంగా ప్రసిద్ధిపొందింది. ఈ ప్రదర్శనకాలం మూడుగంటలు. ఆ మూడుగంటలూ ఒకే ఒక నర్తకి నృత్యంచేస్తుంది. ప్రక్క-నున్న నట్టువనారు పాడే పాటకు అనుగుణంగా అభినయం చేస్తుంది. ఇది కేవలం తెలుగువారు సృష్టించిన నాట్యం.

ఈ ఏకపాత్రాభినయ భరతనాట్యం దాదాపు 150 సంవత్సరాల క్రిందటనే రూపొందింది. తంజావూరు భరటనాట్యం కేవలం తెలుగువారి సృష్టి. ఇందుకు వుదాహరణ నాయకరాజులూ, మహారాష్ట్రరాజులకాలంలో ఎంచి ఏర్చినట్లు తెలుగు వాగ్గేయకారులూ, తెలుగు నర్తకీమణులే ఆ ఆస్థానాల్లో ఉండడమే. త్యాగరాజు కీర్త నలు, సారంగపాణి పదాలు, క్షేత్రయ్య మువ్వ గోపాలపదాలు, నారాయణతీర్థులవారి తరంగాలు మొదలైనవన్నీ మనకు తదితర సాక్ష్యాధారాలు.

దేవదాసీల
దయాధర్మభిక్ష :

తెలుగుదేశపు ఈ భరతనాట్యాన్ని తీర్చిదిద్దింది దేవదాసీలూ, రాజనర్తకీమణులేనని పి. యస్. ఆర్. అప్పారావుగారు నాట్యశాస్త్రంలో వుద్ఘాటించారు.

విజయనగర సామ్రాజ్యవైభవం వెలుగొందినన్ని రోజులూ మనభాగవతులు రాయలవారి ఆస్థానంలోనూ. బహుధా విస్తరించిన ఆయన సామ్రాజ్యంలోనూ ప్రదర్శనలిస్తూ ప్రజాప్రబోధాన్ని గావించారు. కాని విజయనగర రాజ్య పతనా నంతరం కవిగాయకులతోపాటు మన కళాకారులుకూడా విధిలేక వలస వెళ్ళి పోవలసివచ్చింది.

ఆ రోజుల్లో (1561 నుంచి 1614) వరకూ రాజ్యాన్ని పరిపాలించిన ఆంధ్ర రాజు లైన అచ్యుతప్ప నాయకులవారి ఆస్థానంలో వారి ఆదరాభిమానాన్ని పొంది నాట్య

కళా సాంప్రదాయాలను అభివృద్ధిపరిచారు. తంజావూరు సరస్వతీమహల్ కవుల తోనూ, గాయకులతోనూ, కళాకారులతోనూ అద్వితీయంగా వెలుగొందింది. అచ్యుతప్ప నాయకులవారు వారి పంచన చేరిన కూచిపూడి బ్రాహ్మణకుటుంబాల వారందరికీ అగ్రహారాలను దానంగా ఇచ్చారు. అలా దానంచేసినవాటిలో కూచిపూడి భాగవతులకు దానంచేసిందే అచ్యుతాపుర అగ్రహారం. అచ్యుతప్పనాయకుని దానంగనుకనే దానికి అచ్యుతాపురమనే పేరువచ్చింది. దీనినేతరువాత మేలటూరని, మెలట్టూరని, మేలటూరని వ్యవహరించారు. కాని ఈనాటికీ తంజావూరు చుట్టుప్రక్కలవారు మేరటూరనే పిలుస్తున్నారు.

మేలటూరు భాగవతులు
మీదుకొన్న మేలిమి :

ఆంధ్రదేశంలో కూచిపూడి భాగవతు లెలాగో దక్షిణాదిన తంజావూరుజిల్లాలో మేలటూరు, వూర్తుకూడి, శూలమంగళం గ్రామాలలోకూడ భాగవత మేళములవారున్నారు. కూచిపూడి భాగవతులకు, ఆ భాగవతులకు అత్యంత సన్నిహిత సంబంధముంది. ఆంధ్రరాజులు తంజావూరును పరిపాలించేకాలంలో కూచిపూడి భాగవతులు నానా రాజసందర్శనం చేస్తూ తంజావూరు ఆంధ్రరాజులను కూడా ఆశ్రయించారు. విజయనగర సామ్రాజ్యంలో కవులు, పండితులు, కళాకారులు అనేకమంది పోషింపబడ్డారు కాని తళ్ళికోట యుద్ధానంతరం, రాయల సామ్రాజ్యం అంతరించడంతో ఈ కళాకారులందరూ కుటుంబాలు కుటుంబాలుగా చెల్లాచెదరై అనేకమంది అనేక ప్రాంతాలకు వలసపోయారు. అలా వలస పోయిన వారిలో చాలామంది తంజావూరు చుట్టుప్రక్కల స్థిరనివాసం ఏర్పాటుచేసుకుని ఆనాటి తంజావూరు ఆంధ్రనాయకరాజు అచ్యుతప్ప నాయకుణ్ణి ఆశ్రయించారు. విజయనగర రాజు లెలా కళలను, కళాకారులను కవులను పోషించారో, అలాగే తంజావూరు రాజులుకూడా వీరిని ఆదరించి, మాన్యాలూ, అగ్రహారాలూ వ్రాసియిచ్చారు. అలా సంపాదించిందే ఈనాటి మేలటూరు.

అపరసిద్ధేంద్రయోగి
వెంకటరామశాస్త్రి :

మహామహుడు సిద్ధేంద్రయోగి కూచిపూడి భాగవతులకు ఎలాంటివాడో, అలాగే

మేలటూరు వీధిభాగవతులకు వెంకటరామశాస్త్రి అలాటివారు. ఈయన శుద్ధ తెలుగు బ్రాహ్మణుడు. సంగీత సాహిత్యనాట్యాది విషయాల్లో ఆరితేరినదిట్ట.

ఈయన 17 వ శతాబ్దంలో ఆంధ్రదేశంలో గోదావరీ ప్రాంతంనుంచి దక్షిణ దేశానికి వెళ్ళినట్లుచారిత్రికాధారాలున్నాయి. ఈయన కీర్తి ప్రతిష్ఠలు దక్షిణదేశం దాటి మనవరకూ రాలేదు. అందువల్లనే వెంకటరామశాస్త్రిని గురించి ఏ విధమైన భోగట్టా ఆంధ్రులకు తెలియదు. శ్రీ శాస్త్రిగారు రచియించిన రచనలు చూస్తే ఈయన కృషి, ప్రతిభ ఎలాంటివో మనకు బోధపడుతుంది. ఈయన రచించిన వీధి నాటకాలు ఉషాపరిణయం, హరిశ్చంద్ర, ప్రహ్లాద, రుక్మాంగద చరిత్ర, సీతాకళ్యాణం, సత్సంగరాజు జగల్లీలా నాటకం, రుక్మిణీ కళ్యాణం, కంసవధ మొదలైనవి. వీటిలో ముఖ్యంగా ఎక్కువ ప్రచారంలోకి వచ్చినవి ఉషాకళ్యాణం, మార్కండేయచరిత్ర, ప్రహ్లాద, రుక్మాంగద మొదలైనవి. ఈ నాటకాలన్నీ తెలుగులో రచింపబడినా వీటి ప్రతులు మాత్రం మనకు లభ్యం కావడంలేదు. కొన్ని మాత్రం ఆర్. కళ్యాణరామయ్యరువద్దా, డాక్టరు వి. రాఘవన్‌గారి వద్దా వున్నాయి. మరి కొన్ని తంజావూరు పరిసరగ్రామాలైన శూలమంగళం, మేలటూరు, వూత్తుక్కాడు మొదలైన గ్రామాల్లో వ్రాత ప్రతుల్లో వున్నాయని వినికిడి.

## మేలటూరు మేలుబతింగా
## శూలమంగళం :

మేలటూరు భాగవతుల తరువాత నాటకాలను ప్రతిభావంతంగా ప్రదర్శించగలిగిన వారు ఈ శూలమంగళం కళాకారులే. లోగడ శూలమంగళం గ్రామం కాలియ మంగళం అని పిలువబడుతూ వుండేది. వారు వెంకటరామశాస్త్రిగారి నాటకాలనే గాక, అనాది కళారూపమైన కొరవంజి కళారూపాన్ని కూడా ప్రజారంజకంగా ప్రదర్శించారు. వీరు ప్రత్యేకంగా కొన్ని హాస్య పాత్రలను కూడా ప్రవేశపెడతారు. ఈ పాత్రలు కథావిధానంతో ఏ విధమైన సంబంధమూ లేకుండానే ప్రవేశిస్తాయి. ప్రేక్షకుల్ని కడుపుబ్బ నవ్విస్తాయి. ఈ హాస్యపాత్రల్లో ముఖ్యమైనవి ఎరుకలిసింగి, సింగడు, ఘటన్నృత్యం చేసేవారు, తురకవేషాలు ధరించే ఫకీరువేష

గాళ్ళు మొదలైనవారు. వీరి నాటకం తెలుగులో ప్రదర్శింపబడుతున్నా, హాస్య చమత్కారాలు మాత్రం తమిళభాషలోనే సాగుతాయి.

కూచిపూడి

వ్రూత్తుకూడి :

ధీనిని వూర్తుకూడి అనికూడ సంబోధించేవారు. ఇక్కడ కూడా భాగవతనాటకాలు ప్రదర్శించే వారున్నారు. ఈ వూరివారు ముఖ్యంగా మేలటూరివారి నాటకాలనే అనుసరించి ప్రదర్శించినా, వెంకటరామశాస్త్రిగారి నాటకాలకు ముందు ప్రదర్శించిన నాటకాలు కూడా వున్నాయి. అవి భామాకలాపం, గొల్లకలాపం, పార్వతీ పరిణయం. రాధాకృష్ణవిలాసం మొదలైనవి. అంతేగాక వారు యక్షగానాలైన ప్రహ్లాద, గొల్లకలాపం, పారిజాతాపహరణం, వుషాపరిణయం, కూచిపూడి సాంప్రదాయాలనే ప్రదర్శించారు. కూచిపూడి సాంప్రదాయమే దక్షిణదేశంలో వూర్తుకూడి సాంప్రదాయంగా వెలుగొందింది.

వివిధరాజుల ఆదరణ :

తంజావూరురాజుల్లో అచ్యుతప్పనాయకుని మరణానంతరం రాజ్యపరిపాలనకు వచ్చిన రఘునాధరాయలు, విజయరాఘవరాయలు కాలంలో కూడ ఈ భాగవతాలు ఆదరించబడ్డాయి. తరువాత తంజావూరు రాజ్యాన్ని పరిపాలించిన మహారాష్ట్ర ప్రభువుల కాలంలో కూడ ఈ వీధిభాగవతాలు విశేష ప్రశస్తి పొందాయి.

అంతేకాక ఆనాడు దక్షిణదేశంలో మైసూరు, పుదుక్కోట మొదలుగా గల సంస్థానాలలో కూడ ఈ భాగవతాల ప్రభావం పడింది. ప్రతి గ్రామంలోనూ యక్షగానాలు విరివిగా ప్రదర్శింపబడేవి. ప్రతి గ్రామంలోని పండితులు, కళాకారులు వీరి ప్రదర్శనాలను చూచి ఆనందించడమేకాక వారు కూడ నేర్చుకోవడం జరిగింది. ఆనాటి నుంచి బ్రాహ్మణ పండితులు ఈ భాగవతమేళాలను సంప్రదాయ పిద్ధంగా తయారు చేయాలనుకుని వుత్సాహంతో నడుంకట్టి శాస్త్రయుక్తంగా భాగవతాలను నేర్చుకున్నారు. అలాంటి శాస్త్రయుక్త భాగవతమేళాలను కలిగిందే మేలటూరు.



ఈ మేలటూరు తంజావూరుకు సుమారు 10 మైళ్ళదూరంలో వుంది. ఈ నాటికీ ప్రతి సంవత్సరం నరసింహ జయంతి వుత్సవాల సందర్భంలో ప్రదర్శనాలను సాంప్రదాయ సిద్ధంగా ప్రదర్శిస్తున్నారు.

### వరదరాజు పెరుమాళ్ళ

### వసంతోత్సవాలు :

వీరి భాగవతాలు ఎక్కువగా వైశాఖమాసంలో. వసంతోత్సవ సమయంలో ఒక వారం రోజులపాటు జరుగుతాయి.ఈప్రదర్శనాలు ప్రారంభం నృసింహ జయంతి నాడు ప్రహ్లాదనాటకంతో ప్రారంభంచేస్తారు. ఆలయానికి బయట విశాలమైన పందిరివేసి, దానిని సకలకళా శోభాన్వితంగా అలంకరించి, రంగస్థలాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ ప్రదర్శనాలను సందర్శించటానికి పరిసర గ్రామాల ప్రజలు ఆబాల గోపాలం కదిలి తిరునాళ్ళకులా బయలుదేరి ఈ ప్రదర్శనాలు చూస్తారు. పాత్రధారులు వారు ధరించే ప్రతిపాత్ర వేషధారణలోనూ తంజావూరు రాజాస్థాన సాంప్రదాయాల ననుసరించి, రాజుపాత్రలకు తంజావూరు రాజమస్తులమాదిరివే ధరిస్తారు. బ్రహ్మ, విష్ణు, నృసింహమూర్తి, ఇంద్రుడు, బ్రహ్మ, యముడు మొదలైన పాత్రలకు ముసుగులను ఉపయోగిస్తారు. ప్రదర్శనంరోజున దుష్టపాత్రల్ని ధరించే నటులు ఆ రోజంతా వుపవాసం చేస్తారు.

### ప్రదర్శనప్రారంభ తతంగం :

రాత్రి పది గంటలకు, భాగవతుల నాటకం ప్రారంభమౌతుంది. వీరికి హంగుగా తిత్తి, ముఖవీణ, మృదంగం, తాళపుచిప్పలూ వుంటాయి. వంతపాట పాడే వారు నలుగురుంటారు. వీరు నలుగురిలోనూ, ఒకరు శ్లోకంగాని, పద్యంగాని ఎత్తుకుంటే మిగిలినవారందరూ అదేశ్లోకాన్ని వంతపాడుతారు. వీరందరూ ప్రారంభ ప్రార్థనా శ్లోకాలను, పుండరీక ధ్యానశ్లోకాలను ఆనుధారగా వల్లించిన అనంతరం సభాంగణానికి ఒక విచిత్రమైన పాత్ర ప్రవేశిస్తుంది. ఆ పాత్రధారిపేరు కొంటె కోణంగి.

కొంపె కోణంగి:

మన భాగవతాల్లోని మాధవి, సైరంధ్రి, ధర్మి, విదూషకుడు, అల్లాటప్పా, కేతిగాడు, సుంకర కొండడు, బంగారక్క, రత్నాల పోలిగాడు మాదిరే ఈ కోణంగి పాత్రధారికూడా.

కొంపె కోణంగి పాత్రధారి ప్రవేశానికి ఒక హద్దూ పద్దూ ఏమీలేదు. ప్రదర్శనంలో సమయానుకూలంగా ఎప్పుడుబడితే అప్పుడు ప్రత్యక్షమై ప్రేక్షకుల్ని ఆనందపరుస్తాడు. పాత్రఅమధ్య కలహాలు పెంచుతాడు. వాటిని చమత్కారంగా పరిష్కరిస్తాడు. ఒకోసారి ప్రేక్షకులలో ప్రేక్షకుడై నటిస్తాడు.

హంగుదారులు కోణంగిని, "ఎవరోయి నీవు?" అని ప్రశ్నిస్తారు. "నేనా? నేను కొంపె కోణంగిని. ఈనాడు జరుగబోవు వరదరాజు పెరుమాళ్ళ వసంతోత్సవాలు జయప్రదంగా జరిపించటానికి, భాగవత ప్రదర్శన కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిపించటానికీ వచ్చా"నని, కార్యక్రమలు జయప్రదంగా జరుపవలెననీ, "చుట్టుప్రక్కలనుంచి ప్రదర్శనార్థం వచ్చిన అశేష ప్రజానీకానికీ ఉచిత మర్యాదలు జరిపించారా? సభాస్థలికి రావలసిన పెద్దలందరూ విచ్చేశారా?" అని హంగుదార్లను ప్రశ్నించి, సమాధానాలు అందుకుని నిష్క్రమిస్తాడు.

చోపుదారు:

వెంటనే విఘ్నేశ్వర ప్రార్థన ప్రారంభమౌతుంది. వినాయక పాత్రధారి ప్రవేశించి నృత్యంచేస్తూ నిష్క్రమిస్తాడు. ఆవెంటనే సభారంగానికి వచ్చే రాజుగారి రాకనుగూర్చి కటికమువాడు ప్రవేశించి వెల్లడిచేస్తాడు. సభవారందర్నీ ఉద్దేశించి, "రాజుగారు వస్తున్నారు గనుక ఎక్కడివారక్కడ గప్‌చిప్" అంటూ వెళ్ళిపోతాడు. ఇతనిని కటికమువాడని, చోపుదారని పిలువడం వాడుక. ఈ చోపుదారు

చోపుదారు వచ్చేవే, రాజసభకు,
చోపుదారు వచ్చేవే,

అంటూ ప్రవేశిస్తాడు. ఈ విధంగా ప్రదర్శనాన్ని ప్రజాభిరుచుల ననుసరించి అందరినీ సంతృప్తిపరుస్తూ, కథా విధానం అందరికీ అవగాహన అయ్యే పద్ధతుల్లో

సంగీతం, సాహిత్యం, నృత్యం, శృంగారం, హాస్యం మొదలై నవాటి నన్నిటినీ సమపాళ్ళలో నడుపుతారు.

కొంచె కోణంగి చోపుదార్ల నిష్క్రమణానంతరం, సాంప్రదాయం ప్రకారం, నృత్యంచేస్తూ ఫలానావారు ప్రవేశిస్తున్నారు—అంటే 'రాజువెడలె' అంటూ రాజపాత్రలూ, స్త్రీ పాత్రలై తే, 'దేవినే, చిత్రాంగదదేవినే, భామనే, సత్యభామనే,' అంటూ పాత్రలప్రవేశం జరుగుతుంది. ఆయా పాత్రధారులు తమ నటనా నిపుణత్వాన్ని, నాట్యచమత్కారాన్ని చూపిస్తారు. పాత్రధారులందరూ పురుషులే. స్త్రీ పాత్రలుకూడా పురుషులే ధరిస్తారు.

నాటకం ముగింపు:

నాటకం సాంతమయ్యేసరికి పూర్తిగా తెల్లవారుతుంది. భూపాల రాగాన్ని ఎత్తుకుని స్వామికి మేలుకొలుపులు పాడుతూ, గర్భగుడిలోకిపోయి స్వామివారికి అఖండ దీపారాధనలు, ప్రదక్షిణలు జరిపి వారివారి వేషాలతోనే వీధిలోకొచ్చి, గ్రామవీధులన్నీ తిరుగుతూ, ఇంటింటికీపోయి, వారువారిచే వుచిత మర్యాదల నందుకుని తరువాత వేషధారణను తీసివేస్తారు. ఈ విధంగా ప్రదర్శనాలు జరిగినన్ని నాళ్ళూ ఇదేవిధానాన్ని అనుసరిస్తారు.

మేలటూరు భాగవతులు వసంతోత్సవ సమయాల్లో స్వామివారి సమక్షంలో తప్ప ఆ ప్రదర్శనాలను ఎక్కడా ప్రదర్శించరు.

తెలుగు తనం:

మేలటూరు, భూలమంగళం, వూత్తుక్కాడు మొదలైన గ్రామాల్లో ప్రదర్శించే ప్రదర్శనాలన్నీ తెలుగులో వ్రాయబడినవే. ఈనాటికీ మేలటూరు వరదరాజ పెరుమాళ్ళ వసంతోత్సవాలలో ప్రదర్శించే యక్షగానాలన్నీ తెలుగే. రాను రాను చరిత్రగతి మారి ఆ గ్రామాల్లో ఆనాటి మన తెలుగు నాటకాలను తమిళ భాషలోనికి అనువదించుకుని నేటికీ ప్రసిద్ధంగా వారు ఈ నాటకాలను ప్రదర్శిస్తూనే ఉన్నారు.

తమిళదేశంలో ఈనాటికీ దేవాలయాల్లో నృత్యంచేసే దేవదాసీలందరూ తెలుగుపదాలనే పాడుతూ నాట్యం చేస్తున్నారు. వారి నృత్యం, అభినయముద్రలు,

తాళగతులు, ముక్తాయింపులు, గమకాలు మొదలైన రీతులన్నీ తెలుగుతనం మూర్తీభవించిన ట్లున్నాయి.

క్షేత్రయ్యపదాలకు కొమ్మమోసిండి
కూచిపూడివారే :

తంజావూరును పాలించిన విజయరాఘవనాయకుని కాలంలోనిక్షేత్రయ్యఆస్థానగౌరవా

లన్నిటినీ అక్షయ్యంగా పొందాడు. పదాభినయానికి,సాత్వికాభినయానికి క్షేత్రయ్య పదాలకు విశిష్టంగా ప్రాధాన్యం యిచ్చేవారు. అందువల్ల ప్రదర్శనాలు ఎంతగానో విజయవంతమయ్యేవి. క్షేత్రయ్యపదాలు తమిళదేశంలోకూడా విస్తారంగా ప్రచారం లోకి వచ్చాయి. ఈనాటికీ తమిళదేశంలో వాటిని పాడుతున్నారు. ఆ పదాలలో మధ్య మధ్య తెలుగునుడికారాలు అచ్చుగుద్దినట్లు అగుపిస్తూ వున్నాయి. ఈ విధమైన క్షేత్రయ్యపదాలను బహుళ ప్రచారంలోకి తీసుకువచ్చినవారు కూచిపూడి భాగవతులే.

తంజావూరు ఆంధ్రరాజుల సమక్షాన ప్రదర్శనాలిచ్చిన నాటినుండీ కృష్ణా జిల్లా కూచిపూడికీ, అచ్యుతాపురానికీ, వూత్తుక్కాడుకూ బంధమూ, బంధుత్వాలూ పెరిగాయి.అక్కడున్న తమిళులపై తెలుగుభాష ప్రభావం పడి వారుకూడా తెలుగు వారుగా మారి, వారి పిల్లల్ని వీరికివ్వడం, వీరి పిల్లల్ని వారు చేసుకోవడం ద్వారా బంధుత్వాలు పెరిగిపోయి, ఆంధ్రదేశంలో కూచిపూడి కళాక్షేత్రమెలాగో, అలాగే దక్షిణదేశంలో వూత్తుక్కాడు, మేలటూరుగ్రామాలు కళాక్షేత్రాలుగా వెలుగొందు తున్నాయి.

ఆంధ్ర, తమిళ
సమరస సాంప్రదాయం :

కూచిపూడి కళాకారులు ప్రదర్శించే సంగీత నాటకాలకూ, దక్షిణాది సంగీత నాట కాలకూ చాలా దగ్గరి సాంప్రదాయా లున్నాయి. వారూ వీరూ భరతనాట్య సాంప్రదాయాలనే అనుసరిస్తూ వచ్చారు. అంతేకాకుండా తమిళంలో ఆడబడే నాటకాలూ, పాడబడే పాటలూ అన్నీ తెలుగువే. దీనినిబట్టి ఆంధ్ర తమిళ సాంప్ర

దాయాలకు మూలం ఒక్కటేనని మనకు బోధపడుతూ వుంది. తమిళులు ఏయే శ్లోకాలను వల్లిస్తున్నారో అదేవిధంగా ఆంధ్రులుకూడా వల్లించారు. వారూ వీరూ కూడ కృష్ణకర్ణామృతంలోని శ్లోకాలనే వుపయోగించారు.

కూచిపూడి భాగవతులు క్షేత్రయ్యపదాలను పాడి అభినయించినట్లే, దక్షిణాది కళాకారులుకూడ ఆ సాంప్రదాయాన్నే అనుసరించారు. ముఖ్యంగా క్షేత్రయ్య పదాలు దక్షిణదేశంలో బహుళ వ్యాప్తిలోకి రావడానికి కారణం కూచిపూడి భాగవతులేనని మనం చెప్పుకోవచ్చు.

అంతేకాకుండా తంజావూరును పరిపాలించిన అచ్యుతప్పనాయకుడు ఆంధ్ర దేశంనుంచి వలస వెళ్ళిన కళావేత్తలను ఆహ్వానించి ఆదరించినదానినిబట్టి చూచినా క్షేత్రయ్యపదాల ప్రభావం దక్షిణదేశంలో పడడంకూడ నిజమైనట్లుగా మనం గ్రహించవచ్చు. అందువల్ల తమిళ భాగవతకర్తలుకూడ ఆనాటినుంచి ఈనాటివరకూ వంశపారంపర్యంగా ఆ సాంప్రదాయాలనే అనుసరిస్తూ ముందుకు తీసుకుపోతున్నారు.

తమిళదేశంలో భాగవత మేళనాటకాల్లో ప్రసిద్ధివహించిన పందనల్లూరు మీనాక్షిసుందరంపిళ్ళై ఇటీవలవరకూ నివసించి ఆ ప్రాంతాల్లో కూచిపూడి భరత నాట్య సాంప్రదాయాలనూ, పదాభినయాన్ని విద్యార్థులకు నేర్పారు.

దీనినిబట్టి ఆంధ్ర తమిళదేశాల్లోని నాట్య సాంప్రదాయాలు ఒక్కటే అని వారి వారి పాటలూ, ఆటలూ నిరూపిస్తున్నాయి. అంతేకాక నాయిక ప్రవేశంలో తనకు తనే చరిత్ర చెప్పుకోవడంలోనూ, విదూషకపాత్రల ప్రవేశపెట్టడంలోనూ కూడ ఆంధ్ర సాంప్రదాయాలనే అనుసరిస్తున్నారు.

దక్షిణాదిన విజయనగర చక్రవర్తులకాలంలో కళలు ఎలా అభివృద్ధి పొందాయో అలాగే తంజావూరు, మధుర నాయకరాజులకాలంలో కూడ సంగీత, సాహిత్య, నాట్య, నాటకవిధానాలకు, కవి, పండితులకూ, ఆదరణా, పోషణా లభించాయ.

తంజావూరు నాయకరాజులకు మంత్రిగా వున్న గోవిందదీక్షితుడు. 'సంగీత సుధ' అనే ఒక శాస్త్రగ్రంథాన్ని రచించాడు. ఈ గ్రంథాన్ని రఘునాథరాయలు రచించినట్లు కూడ చెప్పుకుంటారు. రఘునాథరాయలు నృత్యంలోనూ, గానం లోనూ ఆరితేరిన కళాకారుడు. ఈయన 'రఘునాథమేళ' అనే క్రొత్త ఒక వీణనే సృష్టించాడని ప్రతీతి.

కళలమధురిమను కాపాడిన
మధుర నాయకరాజులు:

అలాగే మధుర ఆంధ్రనాయకులు కూడ లలిత కళాసంపదలలో విజయనగరం, తంజావూరులతో సరిసమానంగా తులతూగుతూ వుండేవారు. వీరి రాజ్యంలో, సంగీతనృత్యాలు దేవదాసీలు చేస్తూ వుండేవారు. దేవాలయాలలోనూ, పండిత సభలలోనూ, ఆస్థానాలలోనూ, వీరి గానకచేరీలు జరుగుతూ వుండేవి. పండిత సన్మానాలతోపాటు దేవదాసీలకుకూడ ఇతోధిక పారితోషికాలూ, సన్మానాలూ జరుగుతూ వుడేవి.

విజయరంగ చొక్కనాథుని కాలంలో తిరువేంగడాచార్యుడనే గొప్ప గాయకుడుండేవాడట. క్షేత్రయ్య, త్యాగరాజూ ఈకాలంలోనే వర్ధిల్లి మధురమైన పదవాజ్మయాన్నీ, గేయవాజ్మయాన్నీ రచించారు.

# విద్యావినోదాల్లో ఓలాడి
# ఘనతవహించిన గోల్కొండ నవాబులు

క్రీస్తు శకం 1347 వ సంవత్సరమున ప్రారంభమైన బహుమనీరాజ్యం 1512 లో అయిదురాజ్యాలుగా విడిపోయింది. వీటిలో ఒకటైన గోల్కొండ



నవాబులు తెలంగాణా ప్రాంతాన్ని పరిపాలించారు. ఈ నవాబులు 1512 నుండి 1687 వరకు 158 సంవత్సరాలకు పైగా తెలంగాణాను, కోస్తాజిల్లాలలో కొంత భాగాన్ని పరిపాలించారు.

గోల్కొండ నవాబులు మొత్తం అయిదుగురు. వీరి పేర్లు కులీ - జంషీద్ - ఇబ్రహీం - మహమద్ అబ్దుల్లా అబుల్ హసన్. ఈ నవాబులకు దక్షిణాత్యులతో కలిగిన సాహచర్యంవల్ల ఈ అభిమానమేర్పడింది.

గోలకొండను పరిపాలించిన నవాబు అబ్దుల్ హసన్ తానీషా కూచిపూడి కళాకారులకు 1687 లో కూచిపూడి అగ్రామాన్ని గ్రహారంగా దానమిచ్చినట్లు మాచుపల్లి కైఫీయత్‌లో వుదహరించబడివుంది.

ఇబ్రహీం కుతుబ్ షా :

గోలకొండ పాదుషాలలో ఇబ్రహీం కుతుబ్‌షా విద్యాప్రియుడు. ఈతని ఆస్థాన కవులూ, పండితుల్లో హిందువులూ, మహమ్మదీయులూకూడ వుండేవారు. విద్యాగోష్ఠి ఎల్లప్పుడూ జరుగుతూ వుండేది. పాదుషావారు పండితుల్ని తగురీతిని సన్మానించేవారు. తపతీసంవరణోపాఖ్యాన కావ్యం రచించి పాదుషాకు అంకితమిచ్చిన అద్దంకి గంగాధరకవిని పాదుషా సత్కరించారు. ఆసూరిమరింగంటి సింగరాచార్య మహాకవికి గొప్ప బిరుదులిచ్చి సత్కరించారు. పాదుషాలు లలిత కళల్ని, వాజ్మయాన్ని అభివృద్ధి చేయడానికి ఇతోధికంగా ప్రయత్నించారు.

గోలకొండ వేశ్యలు:

గోలకొండ పట్టణంలో వేశ్యకాంత లుండేవారు. ఈ భోగపుసానులు తమ వృత్తిని సాగించుకోవడానికి 'దారోగా' రిజిస్టరులో తమ తమ పేర్లను నమోదు చేయించుకొని లైసెన్సులు పొందేవారు. నాయకురాలితో ప్రతి శుక్రవారం రోజున రాజదర్శనానికి రావాలి. రాజుగారు దర్శనం ఇచ్చిన తరువాత వారు ఆట పాటలతో వినోదింపజేసేవారు.

ఇస్లాంమతం,
వేడుకలు:

మొహర్రం పండుగ జరిగే ఎనిమిదిరోజుల్లోనూ షియా అనే తెగవారు వీధుల్లో పీర్లను వూరేగిస్తూ రొమ్ములు గ్రుద్దుకుంటూ అలీ, షా, హుసేన్ అని కేకలు వేస్తూ పోతారు.

క్రీస్తు వెనుక 1622-1727 ప్రాంతంలో గోలకొండను పరిపాలించిన నవాబు అబ్దుల్లా కుతుబ్‌షా దర్బారులో తెలుగు పదకర్తయైన క్షేత్రయ్య మువ్వ గోపాలునిపైన పదాలు చెప్పి సన్మానం పొందినట్లు తెలుస్తూంది.

దౌలతాబాద్ నగరసుల్తాను ఆ పట్టణంలోని పణ్యాంగనలు చేసే నృత్య ప్రదర్శనాలను చూడాలనే కుతూహలం కలిగి వారి నాట్యప్రదర్శనాన్ని తిలకించడానికి ప్రత్యేకంగా నిర్మించబడిన గుడారానికి వెళ్ళి వారి సత్కారాలనందుకుని, వారి అభినయ ప్రదర్శనాలను చూచి తగిన బహుమానాల నిచ్చినట్లు ఇబిన్ బూటా రచనలవల్ల తెలుస్తూంది.

అక్కన్న, మాదన్నల
భాగవతమేళం:

గోల్కొండ తానీషామంత్రులైన అక్కన్న, మాదన్నల యాజమాన్యంలోనూ ఒక భాగవత మేళం వుండేదని, మధురమంగా పుంశ్చలీ విలాసంలో ఉదాహరింపబడిందని యస్వీ జోగారావుగారు తమ 'యక్షగాన వాఙ్మయం'లో వివరించారు.

అక్కన్న, మాదన్నల భాగవతమేళం కూచిపూడి భాగవతుల రీతిలో వుండి దేశసంచారంచేసి ప్రదర్శనాలను ప్రదర్శించింది.

ఈ భాగవతదళం విజయనగరం, ఆనెగొంది రాచనగర్లలో నాటకం ప్రదర్శించినప్పుడు ఆమేళగాండ్రలో అందగాడైన ఒక స్త్రీపాత్రధారిని ఆనాటి రాజుగారి సోదరి వలచి వలపించి అతనితో సాంగత్యమూ జరిపినట్లు ఒక ఐతిహ్యముంది. దీనినిబట్టి ఆ భాగవతదళ మెంతటి వుత్తమమైనదో తెలుసుకోవచ్చు.

## అలరిప్పు, జతిస్వరం:

అసలు నృత్యాన్ని, నృత్తాన్ని, అభినయాలనూ శాస్త్రోక్తంగా, సమానంగా నడపడమే భరతనాట్య విశిష్టత. అలరిప్పు - జతిస్వరం-శబ్దం - జావళి-తిల్లానా మొదలైన పద్ధతులన్నీ తంజావూరు భరతనాట్యంలో రూపొందించబడ్డాయి. కూచిపూడి భరతనాట్యానికీ, తంజావూరు భరత నాట్యానికీ వ్యత్యాసం వుంది. ఈ విధంగా కూచిపూడి భాగవతులు ఆనాడే వారి భుక్తికోసమే కళ కాదని, దేశహితాన్నికోరి దేశాభిమానంతో, ప్రజాభిమానంతో దానిని ప్రజోపయోగంగా చేశారు.

ఈ వృత్తాంతమంతా మచ్చుపల్లికైఫీయత్‌లో వ్రాసినట్లు తంజావూరు సరస్వతీమహల్ శాస్త్ర పరిశోధకులుగా వున్న నేలటూరు వెంకటరమణయ్యగారి పరిశోధనద్వారా తెలుస్తూ వుంది.





# 3

# జానపద కళారూపాలు



జానపద కళారూపాల్లో మొట్టమొదటిదిగా
ఖ్యాతికెక్కినకొరవంజి—అడవుల్లోపుట్టుక;
ఆలయాల్లో పెంపుపోషణలు—రక్తిమార్గం
లోనే భక్తిమార్గం చూపిన యుక్తి—యక్ష
గాన వాఙ్మయం — యక్షగాన కళా
రూపాలు—జక్కుల నంగీత సాహిత్య
సౌరభం—

# నాటులోనే గోటు చూపించిన
# కొరవంజి కళారూపం

తెలుగువారి మొట్టమొదటి కళారూపం కొరవంజి. ఇది ఒక్క తెలుగు దేశం లోనేకాక దక్షిణదేశపు ద్రావిడ సీమలన్నింటిలోనూ ప్రాముఖ్యం వహించింది.



ఇది ఒక జానపద దృశ్యకావ్యం. కొరవంజి అంటే, ఎరుకల సాని. పూర్వం ఈ ఎరుకలసాని సంఘంలో ఎక్కువ పలుకుబడి సంపాదించుకుంది. ఆనాడు విజయనగరరాజుల కాలంలోనూ ఎరుకలసాని ఎంతో ప్రాముఖ్యం వహించింది. ఈ ఎరుకలసాని వినోదకాలక్షేపానికై యాదాలాపంగా ఆటపాటలు జోడించి ఆరంభించిన కళారూపం కొరవంజి.

ముచ్చటగా
ముప్పిరులా వ్యాప్తి:

కొరవంజి కళారూపానికి ముందు మరో కళారూప ముండ నేందుకు చారిత్రకాధారాలుకూడ మనకు లేవు. ఆంధ్ర, కర్ణాటక, ద్రావిడ ప్రాంతాల్లో బహుముఖాల వ్యాప్తిలోకి వచ్చింది ఈ కళారూపమే.

అసలు అరం, అరా:

అసలు కొరవంజి అనగా ఒక నృత్యవిశేషంతో కూడిన అడుగు. అడవులలో నివసించే కురవ లనేవారి అడుగు కాబట్టి దానిని కురవంజి, లేక కొరవంజి అని కూడ పిలుస్తూ వచ్చాడు. గంతులు, చిందులు, గొండ్లి, అంజె, అంగ అనేవి నృత్య విశేషానికి సంబంధించిన పర్యాయపదాలు.

## అడవుల్లో పుట్టుక,
## ఆలయాల్లో పెంపు సొంపులు :

అసలు కురవంజి కళారూపం ఆటవికులది. మానవులు అడవుల్లో నివసించేకాలంలో ప్రచారంలో కొచ్చిం దీ కళారూపం. ఆనాటికీ, ఈనాటికీ మనకు పుణ్యక్షేత్రాలుగా వున్న సింహాచలం అప్పన్నకొండ దేవాలయంలోనూ, మంగళగిరి నృసింహ దేవాలయంలోనూ, విజయవాడ ఇంద్రకీలాద్రి దేవాలయంవద్దనూ, శ్రీశైలమల్లి కార్జున దేవాలయంవద్దనూ, తిరుపతి వెంకటేశ్వరుల కొండమీదనూ యాత్రా వుత్స వాలు మూడువందలా అరువది రోజులూ జరుగుతూ వుండేవి. ఈ వుత్సవాలకు దేశం నలుప్రక్క-లనుంచీ అనేకమంది ప్రజలు స్వామిదర్శనార్థం వచ్చిపోతూ వుండేవారు.

ఇలా వుత్సవాలకు వచ్చిన యాత్రికుల వినోదార్థం ఆటవికులైన కురవలు, వినోదప్రదర్శనాలు ఇస్తూవుండేవారు. ఈ వినోదాన్ని యాత్రికులు ఎంతగానో మెచ్చుకుని వారికి మంచిమంచి బహూమతులను దానంచేసేవారు.

ఏమాత్రం నిర్మాణపటుత్వమూ లేని అడుగులనే ప్రారంభదశలో ప్రారం భించినా క్రమేపీ వారి అడుగులకు ప్రేక్షకులు అమిత వుత్సాహా న్నిచ్చినతరువాత కురవంజి అడుగు ఒక కళారూపంగా అభివృద్ధి చెందింది.

కురవంజులు వేషధారణలో అడవిజంతువుల రకరకాల చర్మాలూ, వెములి ఈకలూ, పందిముళ్ళు, కోరలూ, పులి గోళ్ళు, ఎలుగుబంటిబొచ్చు మొద లైనవాటిని ధరించి నృత్యాలు చేస్తూ వుండేవారు. ప్రారంభదశలో కాలికి వచ్చిన చిందులు తొక్కి-,నోటికి వచ్చిన పాటలు పాడి ఆడినా, క్రమేపీ ఒక విశిష్టరూపాన్ని పొందింది 'కొఅవంజి.'



కురవంజిని కూర్చితీర్చిన ఎరుకలసాని

ఏయే క్షేత్రాల్లో వారు యాత్రికుల వినోదార్థం ప్రదర్శనాలు ఇస్తూ వుండే వారో ఆయా పుణ్యక్షేత్రాల మహత్యా

లను గురించి కథ లల్లి, వాటిని ఒక కథారూపంలో చెప్పి, యాత్రికుల్ని ముగ్ధు లను చేసేవారు. ఇలా ఈ వినోదకాలక్షేపంలోనే రక్తికి రక్తి, భక్తికి భక్తిగా శివలీలలూ, విష్ణుకథలూ చెపుతూ వీనులకూ, కనులకూ విందు చేసేవారు. ఈ విధంగా కురవంజులు చక్కని ఇతివృత్తాలను కథలుగా తీసుకుని వాటిని గేయాలుగా వ్రాయించి, వాటికి క్రమమైన అడుగుల నమర్చి కురవంజి అడుగును క్రమశః ఒక కళారూపంగా అభివృద్ధిలోకి తెచ్చారు.

ఇలా యాత్రాస్థలాల్లో పుట్టి పెరిగిన ఈ కొరవంజి కళారూపమే క్రమేపీ దేశం నాలుగు మూలలకూ వ్యాపించింది.

ఈ కొరవంజి కళారూపం ఒరవడినే జక్కులవారనే (యక్షులు) కళా వంతులు మొదలైనవారు కూడ ప్రదర్శనాలను ప్రారంభించారు.

విశ్వరూపాలతో

విజృంభణ :

ఇలా ఇది అడవులనుండి పుణ్యక్షేత్రాలకూ, క్షేత్రాలనుండి ప్రజాసామాన్యం లోకీ ప్రచారం పొంది క్రమేపీ దేవోత్సవాలలోనూ ప్రవేశం సంపాదించి, గ్రామ జాతర్లలోనూ ఘనతగడించి, రాజసభల్లోనూ ప్రాపకంపొంది ప్రదర్శింపబడింది.

ఈ కళారూపాన్ని అడవిజాతులవారి తరువాత అభివృద్ధిలోకి తెచ్చినవారు జక్కులవారు. వీరు నృత్యంకంటే గేయానికీ, గానానికీ, వచనానికీ, ప్రాముఖ్య మివ్వడంవల్ల అవి యక్షగానరూపంలో అభివృద్ధి పొందాయి.

కొత్తరూపం,

కొత్త కళాకాంతులు :

ప్రాథమిక దశలో కురవంజి ఒక క్రమం లేకుండా ప్రదర్శింపబడేదని వినికిడి. కథలో వచ్చే అన్ని పాత్రలకూ ఒక్కడే నిర్వచనం ఇచ్చినా రానురాను



చెంచుదొర

నాటకాల్లోని నాందీ ప్రస్తావన, సూత్రధారుడు, నటి, నర్తకి, విటుడు, విదూషకుడు, చేటకుడు మాదిరి సింగీ సింగడూ వచ్చి పురుషపాత్రలకు సింగడు, స్త్రీ పాత్రలకు సింగీ ప్రాతినిధ్యం వహించేవారు. ఈ పాత్రలమధ్య ప్రేక్షకులను నవ్వించేందుకు తోలుబొమ్మలాటలో జుట్టుపోలిగాడిమాదిరి కొంచెకోణంగి ఒకడు ప్రవేశించి సింగీ సింగనిమధ్య చెణుకులు వేస్తూ ఇద్దరి మధ్యా కయ్యాలు పెంచి పరిష్కరించేవాడు.

ఇలా కొరవంజి కళారూపం క్రమానుగతంగా పరిణామం పొందింది. కురవలు ఈ కళారూపాన్ని ఏదో వినోదం కొరకు ప్రారంభించినా, క్రమానుగతంగా ఇది వారి జీవనోపాధికి తోడ్పడింది.

ఏ క్షేత్రంలో వారి కార్యక్రమం వుంటుందో ఆయాత్రాస్థలంయొక్క పవిత్ర కథల్నీ, గాథల్నీ, ఆశువుగా చెప్పి వారు యాత్రికుల్ని ముగ్ధుల్ని చేసేవారు.

ఇలా పరిణామం పొందిన కొరవంజి కళారూపం ఈనాడు మన ఆంధ్ర దేశపు ప్రదర్శనాలలో మచ్చుకుగూడా కనుపించడంలేదు. కాని దక్షిణదేశంలో ఈనాటికీ 'కుట్రాల కురవంజి' అనేది ప్రదర్శింపబడుతూనే వుంది. ఈ కొఱవంజి ఆయా ప్రాంతీయభాషాభేదాలను బట్టి రకరకాలుగా పిలువబడింది. తమిళదేశంలో 'కొఱవంజి'-'కుఱత్తిపాట్టు' (కుఱవతపాట) మళయాళంలో 'కొఱత్తియాట్టమ్', కన్నడదేశంలో 'కొఱవంజి'. తెలుగుదేశంలో కొఱవంజి ఎఱుకలసాని అని ప్రచారం పొందింది. ఆంధ్రదేశంలో జీవకొఱవంజి. జ్ఞానకొఱవంజి, సత్యభామ కొఱవంజి, ఎఱుకల కొఱవంజి, రాజమోహన కొఱవంజి, జానకీసుఖోల్లాస కొఱవంజి అనే నాటకాలు ప్రచారంలో వున్నాయి.

శుకసప్తతికథలు వ్రాసిన కదిరీపతి ఒక రాజుగారిని దర్శింపవచ్చిన కొఱవంజిని జూచి,

ఱఱుకువలి గుబ్బచన్నుల-యెఱుకుంజవరా లొకొర్త 'యెఱుకోయవ్వా,
యెఱుకో'యని తన చందం-బెఱుకవడంగా హజార పెలమిం గదిపెన్.

అప్పు డప్పుడంతుక తెఱం గమ్మహేంద్రుండు పరిచారికా జనంబులవలన వినవధరించి సమ్ముఖమ్మునకు రావించిన.

నవరని మని వన్నెఅవిక పిక్కటిలంగ గులుకు పాలుబ్బు గుబ్బలు చెలంగ
ముంజేతులను ముఖాంబుజమున నొకవింత పొలుపు దెల్పెడు వచ్చబొట్టు లెసగ
గుఱుమాపు వయ్యెంట చెఱగులో నిడుకొన్న ముద్దుబల్కుల చిన్ని బుడత డమర
దరతరంబులనుండి తమఇంట వెలయు పుత్తడిపైడిబుట్ట మస్తమున వెలుగ
బొమలసందున నామంబు, భూతిపూత-నెన్నొనట, బుక్కిట విడెంబు, కన్నుగొనల
గాటుక రహింప వచ్చి యా క్ష్మాతలేంద్రు-చరణముల కోరగా మొక్కి చక్కి నిల్చి.

అని ఈ విధంగా ఆనాటి ఎఱుకలసాని వేషధారణను వర్ణించాడు.

1. ఇది దారికట్టు మొనక-ట్టిది కాంతావశ్యకర మిది సీమది కిం
పొదవించు నో నరేశ్వర-వదిలంబని తెల్పి కొన్ని బదనిక లొనగెన్.

2, తలపున నిది గారడమని-తలవకుమా, సింగడల్ల తఱిగొండదరిన్
దలమోచి తెచ్చినవి ఇవి తలనుంచుము వసిడితాయెతల నుంచి నృపా.

అని ఈ విధంగా ఎఱుకలసాని విద్యలను వర్ణించాడు. ఇంకా యెఱుకల వారి పుట్టుపూర్వోత్తరాలను గురించి వెంకటరాయకవి వ్రాసిన లేపాక్షిజలక్రీడల్లో ఈ విధంగా వర్ణించాడు.

.....అఖిలభూతముల-తెర గెల్లభంగులు తెల్లంబుగామ
ఎఱుక గల్గినవార మౌటకు మమ్ము-యెరుకలవా రని యందురే చెలియ.

అంటూ తనకు వచ్చిన విద్యలన్నిటినీ వివరిస్తుంది.

"స్తంభన, వశీకరణ, ఆకర్షణ, ఉచ్చాటన, విద్వేషణ, వ్యోమగమన, పరకాయ ప్రవేశాది విద్యలెరుంగుదునే యవ్వా, పరమంత్ర, పరతంత్ర, పరయంత్ర, భేదంబు లెరుంగుదునే యవ్వా, అశ్వలక్షణ, గజలక్షణ, రత్నలక్షణ, స్త్రీలక్షణ, పురుషలక్షణ సాముద్రికలక్షణంబు లెఱుంగుదునే యవ్వా

అంటుంది.

ఈ విధంగా కొఱవంజి నాటకాలలో ఎఱుకలవారిని గురించి ఎన్ని వుదాహరణలనైనా ఇవ్వవచ్చును.

ఈనాడు ఆంధ్రదేశంలో ఏ ఒక్క కొఅవంజి నాటకమూ ప్రదర్శింపబడడం లేదు. కాని ఎఱుకలపాట మాత్రం ఏకపాత్రగా 'సోదెమ్మ .సోదో' అంటూ ఈ నాటికీ తన సహజ వేషధారణతో (స్థలాంతరంలో ప్రకటించిన చిత్రం చూడండి) గ్రామాల్లో కనుపిస్తూ స్త్రీలకు సోది చెపుతూ వుంది. ఎఱుకలసానులు సోదెచెప్పే విధానం అద్భుతంగా వుంటుంది. సోదెను విన్న ప్రతివారికీ ఈ విషయం విదితమే.

---

# అక్షయంగా వెలుగొందిన యక్షగానం

ఒకనాడు మన యక్షగానవాఙ్మయం దక్షిణ భారతదేశం అంతటా దేదీప్యమానంగా వెలుగొందిం దనటానికి కారకులు మన జక్కులవారే. యక్షగానా లన్నా, జక్కుల జాతివారన్నా ఈనాటి వారిలో కొంత హీనదృష్టి వుంది. కాని ఆంధ్రదేశంలో శతాబ్దాలతరబడి యక్షగానవాఙ్మయం, యక్షగానకళారూపాలు విచ్చలవిడిగా ప్రచారంలో వున్నాయి. జక్కులవారు విద్యావివేకాల్లో ఘటికులు. ప్రాచీనజాతుల్లో జక్కులు, బవనివాండ్లు మొదలైనవారు మేధావివర్గంగా ఎంచబడేవారు. సంగీత సాహిత్యాలలోనూ, చిత్రశిల్పకళా ప్రతిభల్లోనూ అద్వితీయస్థానాన్ని సంపాదించారు. ప్రతిభావంతులుగా పేరుపొందారు.



ఈనాడు మన కూచిపూడి భాగవతుల కళావైదుష్యాన్ని మనం ఎలా స్తుతిస్తున్నామో, అలాగే నాటి జక్కులవారిని, బవనివాండ్లనూ స్తుతించేవారు. కాని వంశపారంపర్యంగా వీరి కళాకౌశలం క్షీణిస్తూ వచ్చింది. ఉన్నతాదర్శాలూ నశించాయి. ఆనాటి యక్షగానవాఙ్మయానికి ప్రతీకగా ఈనాడు—అచ్చు గ్రంథాలైతేనేం, వ్రాతప్రతులైన తాళపత్ర, సాధారణపత్ర గ్రంథాలైతేనేమి - నాలుగువందలవరకూ యక్షగానరచనలున్నాయని వినికిడి.

కొండవీటిరెడ్డిరాజుల కాలంలోనూ, విజయనగరరాజుల కాలంలోనూ, తంజావూరు ఆంధ్రనాయకరాజుల కాలంలోనూ యక్షగానాలూ, యక్షగానవాఙ్మయం దేదీప్యమానంగా వెలుగొందిన విషయం సర్వసామాన్యంగా అందరికీ తెలిసిందే.

ప్రాచీనంలో ప్రాచీనం -
ప్రతికలపై ప్రతికలనుగన్న చల్లనికడుపు:

మన ప్రాచీన కళారూపాల్లో అతిప్రాచీనమ్తైంది యక్షగానం. ఆంధ్ర, తమిళ, కర్ణాటకదేశాలలో అతివిస్తారంగా వ్యాప్తిలోకి వచ్చింది. ఈనాడు మనం చూస్తున్న వీధిభాగవతాల మాతృకలు ఈ యక్షగానాలే.



శ్రీనాథుని జక్కులపురంధ్రి

యక్షగానాల తరువాత ప్రచారంలోకి వచ్చింది వీధిభాగవతాలు. యక్షగానం అంటే యక్షులచే పాడబడే సంగీతవిశేషం అనీ, యక్షగానాలు ఎక్కువగానూ మక్కువగానూ జక్కుజాతివారు ప్రదర్శిస్తారుగనుక యక్షశబ్దం జక్కుశబ్దంగా మారిందనీ, ఇది యక్షులచే పాడబడే సంగీతవిశేషమనీ ఇంకెన్నో రీతుల వ్యాఖ్యానించారు. ఏది ఏమైనా జక్కుజాతివారే ఈ ప్రదర్శనాలను ఎక్కువగా ప్రదర్శిస్తూవుండేవారు.

సలక్షణ యక్షగానంలోని

విలక్షణత:

యక్షగాన ప్రదర్శనంలోవున్న విశేషం ఏమంటే మన వీధి భాగవతాలలో వచ్చే పాత్రధారులు ఎవరిపాత్రను వారు ప్రదర్శిస్తారు. యక్షగానంలో ఈమాదిరికాక ప్రదర్శనంలో వచ్చే ప్రతిపాత్రా తన్నుగూర్చి తాను చెప్పుకోవడంతో పాటు కథను కమ్మగా, గుమ్మగా నడుపుతూ వుంటుంది. ఇదే యక్షగానరూపం. ఉదాహరణకు "రాజువెడలే యమధర్మరాజు సభకు" అని తన్ను గూర్చి తాను చెప్పుకుంటారు. యక్షగానమందే ఒకవిధమైన పాట అని, అచ్చంగా అలాంటి దొకటి బ్రౌణ్యనిఘంటువులో వుదాహరింపబడింది.

అప్పకవిచే మెప్పులుగొన్న
గొప్పతనం:

అప్పకవీయంలో "అర్ధచంద్రికలు, త్రిపుట, జంపె, అటతాళము, వీన యక్షగాన ప్రబంధంబు లతుకవచ్చు"నని అప్పకవి వ్రాశాడు.

శ్రీనాథుడు భీమఖండంలో దక్షవాటిపురాన్ని వర్ణిస్తూ "కీర్తింతు రెద్దాని కీర్తి గంధర్వులు, గాంధర్వమున యక్షగానసరణి" వుదాహరించాడు.

అయ్యగారి వీరకవి రచించిన 'చిత్రాంగదవిలాపం' యక్షగానంలో "చిత్రాంగదవిలాపమను యక్షగాన మొనరింతు వేషము ల్గట్టి. జనులు పాడి విని పింప...." అని వివరించడాన్ని బట్టి యక్షగానరూపంలో వేషధారణతో పాటలూ పాడి వినిపించేవా రని తెలుస్తూంది. దీనినిబట్టి యక్షగానరూపం క్రమేపీ వీధినాట కంగా రూపొందిందని గ్రహించవచ్చు.

జిక్కులపురంధ్రి చక్కదనం,
పెక్కువతనం:

క్రీడాభిరామాన్ని రచించిన వినుకొండ వల్లభరాయుడు యక్షగానాన్ని పాడిన జక్కులపురంధ్రినిగురించి ఈవిధంగా వర్ణించాడు.

కోణాగ్రసంఘర్ష ఘుమ ఘుమ ధ్వని కార కంఠస్వరంబుతో గారవింప
మసిబొట్టుబోవ నసలుకొల్పిన కన్నుకొడుపుచే దాటించు వెడవడవ
భ్రుతికి నుత్కర్షంబు జూపంగవలయుచో దెవిక్రాడు బిగియించు జీవగట్ట
గిల్కుగిల్కున మ్రోయు కింకిణీగుచ్ఛంబు కాళమావంబుతో మేళవింప
రాగమున నుండి లంఘించు రాగమునకు-నురుమ యూరుద్వయంబుపై నొత్తిగిల్లి
కామవల్లీ మహాలక్ష్మికైటభారి-వలపు బాడుచు వచ్చె జక్కుల పురంధ్రి

యక్షగానకళా ప్రదర్శనాలూ, యక్షగానవాఙ్మయమూ దక్షిణ భారతదేశంలో అతిప్రాచీనకాలంనుండీ బహుముఖాల విజృంభించింది. క్రీ. శ. 8 వ శతాబ్దానికి ముందుగానో, ఆ తరువాతనో తమిళంలో వ్రాయబడిన 'శిలప్పదికార'మనే కావ్యంలో నాటకాలనుగూర్చి, నాట్యశాస్త్రానికి సంబంధించిన అనేక శాస్త్రీయ

విషయాలూ వుదాహరింపబడివున్నాయనీ శ్రీ నేలటూరు వెంకటరమణయ్య గారు తెలియజేశారు.

దీనిభావమేమి
తిరుమలేశ:

ఇక పోతే 13 వ శతాబ్దంలో వుద్భవించిన పాల్కురికి సోమనాధుడు దేశినాటక సాంప్రదాయాలనుగూర్చి, శ్రీ శైలం శివరాత్రి మహోత్సవాలలో జరిగే నాటక రూపాలనుగూర్చి పండితారాధ్యచరిత్ర పర్వత ప్రకరణంలో, "నాదట గంధర్వ యక్ష విద్యాధరాదులై పాడెడు నాడెడు వా"రని వివరించాడు. యక్షగానం ఎంతో ప్రాచీన కళారూపమైనప్పటికీ, పండితారాధ్య చరిత్రలో వివిధ కళారూపాలను చర్చించినంత విపులంగా యక్షగానాన్నిగూర్చి వివరించక పోవడాన్నిబట్టి, 1280 కి పూర్వం యక్షగానకళారూపం అంతగా ప్రచారంలో లేదని తెలుస్తూంది.

తెలుగులో తొట్టతొలి
యక్షగానం:

చరిత్రను బట్టిచూస్తే 15 వ శతాబ్దం ప్రథమపాదంనుంచే మనకు యక్షగానాల ప్రస క్తి కనబడుతూవుంది. 15 వ శతాబ్దంనాటి ప్రోలుగంటి చెన్నశౌరి 'సౌభరి చరిత్ర' గాథను జక్కలవారు ఆనాడు కథాగానంగా పాడివుండవచ్చు. 1550 నాటి చిత్రకవి పెద్దన 'లక్షణసార సంగ్రహం'లో చెన్నశౌరి రచించిన సౌభరి చరి తాన్ని వుదాహరించడాన్నిబట్టి తెలుగులో ప్రథమంగా వెలువడిన యక్షగానం అదే నని చెప్పవచ్చు.

16 వ శతాబ్దంలో రచింపబడిన 'చిత్రభారతం' యక్షగానంలో యక్ష వనితల పాట, యక్షకామినుల నాట్యం పేర్కొనబడ్డాయి. 16 వ శతాబ్దంలో యక్షగానాల ప్రభావం ఎక్కువగా వున్నట్లు తెలుస్తూంది. కందుకూరి రుద్రయ్య సుగ్రీవవిజయాన్ని యక్షగానంగా వ్రాసి ఆవూరి జనార్దనదేవునికి అంకిత మిచ్చాడు. 'సుగ్రీవవిజయ' యక్షగానం అతిప్రాచీనమైందిగాను, ప్రాముఖ్యమైనదిగాను గుర్తింపబడింది. రుద్రయ్య సుగ్రీవవిజయాన్ని యక్షగానమనే పేర్కొన్నాడు. ఇందులో విశిష్టమైన రగడ భేదాలేగాక, ద్విపదలు, అర్ధచంద్రికలు, ధవళాలు,

శోభనాలు, పద్యాలు, చిన్నచిన్న వచనాలేగాక, సంవాదాలతోనూ, దరువులతోనూ, సంభాషణలతోనూ ప్రదర్శనయోగ్యంగా, వీధినాటకంగా ఆడబడి వుండవచ్చని నేలటూరివారు వివరించారు.

క్రీ. శ. 16 వ శతాబ్దపు ప్రాంతంవాడైన చిత్రపురి రాఘవాచార్యుని విప్ర నారాయణచరిత్ర, బాలపాపాంబ, అక్క-మహాదేవి చరిత్ర రచనావిధానంకూడా సుగ్రీవవిజయంకోవకే చెందివున్నాయి.

కర్నూలు జిల్లావాసియైన పింగళి సూరన ప్రభావతీప్రద్యుమ్నంలోనూ, గంగావతరణ నాటకంలోనూ ఆనాటి ప్రదర్శనాపద్ధతిని గూర్చి వివరించాడు. అహోబలప్రాంతంలో గుళదుర్తి అగ్రహారవాస్తవ్యుడు కాజవేంకటాద్రి 'వాసంతికా పరిణయం' అనే యక్షగాన ప్రబంధాన్ని వ్రాశాడు.

ఆ రోజుల్లోనే నెల్లూరుప్రాంతంలో, కంకంటి పాపరాజు 'విష్ణుమాయా విలాస' మనే యక్షగానంలో అనేక విశేషాలను వివరించాడు.

సేలంపురం చేరువలో వున్న వుద్దండమల్లసముద్రనివాసియైన ఎల్లకవి శేషము వెంకటపతి శశాంక విజయాన్ని అనుసరించి, చంద్రతారా విలాస మనే యక్షగానాన్ని రచించాడు.

ఈ ముద్దుల యక్షగానానికి
మూలస్థానం:

ఇప్పటికి సుమారు 250 సంవత్సరాలక్రితం సేలంజిల్లా హోసూరుతాలూకా తోగీరయ అనే అగ్రహార నివాసిని అన్నదానం వేంకటాంబ రామాయణం బాల కాండను యక్షగానంగా రచించింది. రాయలసీమలో జక్కులవారి కులదేవతైన అక్క-దేవతలకొండ వుండడాన్నిబట్టి యక్షగానానికిది మూలమని చెప్పవచ్చు. ఈ నాటికీ గుంటూరు గోదావరిజిల్లాలలో వున్న జక్కులవారు కళావంతుల కోవకు జెంది అభినయకళలో ప్రావీణ్యం సంపాదించినవారై ఉన్నారు.

పలురూపాలూ, పలుపేర్లూతో
పదింబదిగావచ్చిన పదాలు:

యక్షగాన వాఙ్మయాన్ని దేశిసాంప్రదాయంగా పండితులు పరిగణిస్తున్నారు. సంస్కృత మార్గపద్ధతికి భిన్నమైన దీ దేశిపద్ధతి. యక్షగానాలలోని ప్రధానమైన గేయ రచనల్ని రగడలలో కొంత మార్పు జరిపి-త్రిపుట-జంపె, ఏక, ఆట అనే తాళాల కనుగుణంగా కల్పించబడ్డాయి. యక్షగానాలలో ఇంకా అనేకరకాలైన దేశిరచనలు ఇమిడి వున్నాయి. ఏల పాటలు—జోల పాటలు — ఆరతులు — ధవళాలు—చందమామ పాటలు—వెన్నెల పదాలు మొదలైనవి వున్నాయి.

విరాళిపదాలు—తుమ్మెదపదాలు—కోవెలపదాలు—చిలుకపదాలు —అల్లో నేరేళ్ళు—సీసకందార్థాలు—త్రిభంగులు—ద్విపదలు—చౌపదులు - షట్పదులు—మంజరులు—జక్కులరేకులు—ఈ మొదలైనవన్నీ అనేక యక్షగానాల్లో ఉదాహరింపబడినాయని వేటూరి ప్రభాకరశాస్త్రిల వారివంటి చరిత్రకారులూ, భాషాకారులూ చెపుతూవచ్చారు.

యక్షగానాల్లో ఇంకా అనేకరకాలైన ఉత్పలమాలలు—సీసాలు—కందార్థాలు—తేటగీతలూ మొదలైనవి అనేకం వున్నాయి.

ప్రదర్శనంలో
ప్రత్యేకత:

యక్షగాన ప్రదర్శనంలో వున్న విశేష మేమిటంటే ప్రదర్శనంలో వచ్చే ప్రతి పాత్రా తన్నుగురించి తాను చెప్పుకోవడంతో పాటు కథ నడుస్తుంది. ఇదే యక్షగాన ప్రదర్శన స్వరూపం. ఈ మాదిరి వీధి భాగవతాలలో సూత్రధారుని ప్రవేశంలోనూ, ప్రధానపాత్రల ప్రవేశసమయాల్లోనూ యక్షగానంపోలికలు కనబడుతున్నాయి. ఉదాహరణకు మన్నె కొండవిలాసం యక్షగానంలో చిత్రాంగదపాత్ర తన ప్రవేశాన్నిగూర్చి.

దేవివే చిత్రాంగద ॥దేవినే॥
దేవివే పాండ్యదేశాధిపునకు
కేవలసుతనై కీర్తి వహించిన ॥దేవివే॥

భామవే, రాజితగుణధామవే
కామిని, వలలిత సోముని వమమగు
మోహము గలిగిన సామజయానమ ॥దేవివే॥ ॥చిత్రాంగద॥

పాత్రలతో పాటు
ఉపపాత్రలు:

ఈగానంలో కథకు సంబంధించిన పాత్రలతోపాటు. ఎరుకసాని పాత్రకూడా విశేషంగా ప్రవేశింపబడేది. ఎరుకసాని ప్రవేశంతో,

ఎరుకజెప్పితి వినవమ్మా - ఓ ముద్దులగుమ్మా
కరుణతో కలవే కనకపుబొమ్మా,
ఎరుకా, ఎరుకా యేడు జగములు
మురియుచు నీరీతి దన ముచ్చట జెప్పెద.

అంటూ వుండగా కథానాయకి "ఇంకా ఎటువలెనే చెప్పవమ్మా" అనగా ఎరుకసాని—

ఓ తరుణిమణి - వోవువ్వుబోణి
ప్రీతితోవినవమ్మా - నిత్యకళ్యాణి
కర్ణాట కొంకణ కాంభోజద్రవిడ
కర్నాట సింధుకు సామ్రాట్యమూన
అంగ - వంగ - కళింగ - వంగదేశముల
బంగాళ వేపాళ బర్బరశౌరి
అంధ్ర పుళింధ్రము అంతటదిరిగి
చంద్ర సూర్యులయందు చరియించిమించి
గరుడ గంధర్వుల గగనమార్గమున
వారద తుంబురు నాట్యంబు జూచి
అన్ని లోకంబులు అంతయుదిరిగి
వున్నాను జగమంత ఒవ్వుగా దిరిగి.

—అంటూ కథానాయకియొక్క చేయి జూచి సోదెచెప్పడం ప్రారంభిస్తుంది.

ప్రభువులూ, ప్రజలూ గూడ
'సై'యన్న సొబగులు :

యక్షగానాల్లో హాస్యం అతివిస్తారంగా కనిపిస్తుంది. యక్షగానంలోని కటికము వాడు, సింగి, సింగడు, సుంకరకొండడు మొదలైన సాంప్రదాయక పాత్రలు ఈనాటికీ ప్రజాహృదయాల్లో నిలిచిపోయాయి. కొన్ని యక్షగానాల్లో ఎఱుకలు, గొల్లలు మొదలైనవారి జాతి చరిత్ర, వారి సాంఘికాచారాలు, వారి వాలకాలు, మాటల తీరు, వృత్తిధర్మాలు, కట్టు బొట్టులతో సహా తరగతులవారీగా ప్రజాజీవిత వివరాలన్నీ తెలుస్తాయి. శృంగారహాస్యరసాలు అందరికీ బోధపడే భాషలో వున్నాయి. రాజులకూ, ప్రజలకూ ఆదరపాత్రమైనాయి ఆనాటి యక్షగానాలు.

ఈ యక్షగానాలు ముఖ్యంగా సర్కారు జిల్లాల్లోనూ, తెలంగాణా దత్త మండలాల్లోను, ఒరిస్సా సరిహద్దుల్లోనూ, దక్షిణదేశంలో తంజావూరు, మధుర, పుదుక్కోట మొదలైన ప్రదేశాల్లో తెలుగు మాట్లాడే ప్రతిచోటా ప్రదర్శించబడ్డాయి. ఆయా ప్రాంతాల మాండలిక శబ్దజాలం ఎంతో యక్షగానాల్లో వుంది.

యక్షగాన ఇతివృత్తాలు కేవలం పురాణకథలకే కట్టుబడక తాత్కాలిక విషయాలకు కూడా ప్రాముఖ్యమిచ్చాయి.

రకరకాల వస్తువులతో ఆనాటి రాజుల ఆచారవ్యవహారాలు, ఆహార విహారాలు, కొలువూ-సింగారం, వివిధరాజులూ ఉద్యోగుల వేషభాషలు, వివాహాది సందర్భాలలో పౌరోహితుల సంభావన తగువులు, ముత్తయిదుల ముచ్చట్లు మొదలైన ఎన్నో విశేషాలు తెలుస్తాయి.

ఆంధ్రదేశంలో యక్షగాన ప్రదర్శనాలు బహుముఖాలుగా ప్రదర్శించబడ్డాయి. ఆనాటి ప్రదర్శకులైన శ్రీనాథుని జక్కలపురంధ్రి, ప్రతాపరుద్రుని వుంపుడుగత్తె, మాచభైరి, భాగోతుల బుచ్చిగాడు, పెండెలనాగి, దోరసముద్రపు నటులు, తాయికొండ నాటకసమాజ ప్రదర్శకులు ఆదర్శప్రాయులు.

అవి అవే,
ఇవి ఇవే :

ఆనాడు కూచిపూడి భాగవతులు ఊరూరూ తిరుగుతూ దేశసంచారం చేయడం వలన ఉత్సాహంపొందిన కళాప్రియులైన అనేకమంది—ఏనాదులు, గొల్లలు,

మాలలు మొదలైనవారూ యక్షగానాలను ప్రదర్శిస్తూవచ్చారు. కట్టుదిట్టమైన కూచిపూడివారి యక్షగానాలకు, ఇతరుల యక్షగానాలకు సారూప్యంలేదు. కూచిపూడి సంప్రదాయంకంటే వారి ప్రదర్శనాల స్థాయి తక్కువ.

ఆనాడు ఆంధ్రదేశంలో యక్షగాన ప్రదర్శనలకు పేరెన్నికగన్న మేళాలు సిద్ధేంద్రయోగి మేళం, భాగవతుల దశరథ రామయ్యగారి మేళం, 18 వ శతాబ్దంలోని భాగోతుల బుచ్చిగానిమేళం, 19 వ శతాబ్దంలో రాయలసీమలో లేపాక్షి, వేములపల్లి, తాడిపత్రి మేళాలు. 19, 20 శతాబ్దాల్లో నెల్లూరు మండలంలో పడకండ్ల రామస్వామి రాయికవి, త్వరకవి రామకృష్ణయ్యగార్ల మేళాలు, విశాఖమండలంలో నరపింగపల్లి, కశ్మీపల్లి, కందాళ చిదంబరకవి మేళాలు మొదలైనవి మహా ప్రసిద్ధికెక్కాయి.

## ఆనాటి ప్రాముఖ్యమూ,
## అందుకు దాఖలాలు:

యక్షగాన కళారూపం ఆనాడు ఎంతటి ప్రాముఖ్యం వహించిందో ఈ క్రింది వివరాలు మనకు తెలియజేస్తాయి.

ఆంధ్రప్రాంతంలో యక్షగానాలను రచించిన కవులు 174 మంది.

దక్షిణదేశపు యక్షగాన కవులు 36 మంది.

తెలంగాణ యక్షగానకవులు 47 మంది.

పరిశిష్టాలు రచించిన కవులు 65 మంది.

అనుబంధాలు రచించినవారు 140 మంది.

అందరూ కలిసి 465 మంది కవులు యక్షగాన వాఙ్మయానికి కృషిచేశారు.

ఈనాడు లభ్యమయ్యే యక్షగానాలు 542. అలభ్య యక్షగానాలు 260. మొత్తం 802 యక్షగానాలు వెలువడ్డాయి. ఈ విధంగా యక్షగాన వాఙ్మయం దక్షిణదేశంలో ధారావాహికంగా వెలుగొందింది. వీటిలో 19 పారిజాతాలు, 28 భామాకలాపాలు, 14 గొల్లకలాపాలు, 21 కొరవంజులు వెలువడ్డాయని యస్వీ జోగారావుగారు తమ 'యక్షగానవాఙ్మయ చరిత్ర' ప్రరోచనలో వివరించారు.

యక్షగాన వాఙ్మయ చరిత్రద్వారా జోగారావుగారు అమూల్యమైన సమాచారాన్ని ఆంధ్రదేశానికి అందజేశారు.

ప్రసిద్ధ
ప్రరోచకులు :

యక్షగాన వాఙ్మయ పరిశోధనలో శ్రీయుతులు పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి.

వేటూరి ప్రభాకరశాస్త్రి, డాక్టరు గిడుగు సీతాపతి, కళాప్రపూర్ణ జయంతిరామయ్య పంతులు, మల్లంపల్లి సోమశేఖరశర్మ, అక్కిరాజు ఉమాకాన్త విద్యాశేఖరులు, ఆచార్య కోరాడ రామకృష్ణయ్య, ఆచార్య పింగళి లక్ష్మీకాంతం, చింతాదీక్షితులు, డాక్టరు నేలటూరి వెంకటరమణయ్య, ఆచార్య గంటి సోమయాజి, ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం, డాక్టరు కె. వి. ఆర్. నరసింహం, ఆచార్య రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, ఆచార్య విస్సా అప్పారావు, సురవరం ప్రతాపరెడ్డి, డా. శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, కొమ్మనమంచి జోగయ్యశర్మ, ముట్నూరి సంగమేశం, తూమాటి దొణప్ప, ఆదిలక్ష్మి, ఎల్లోరా, శ్రీనివాసచక్రవర్తి మొదలైన ప్రముఖు లెందరో యక్షగాన ప్రాముఖ్యాన్ని లోకానికి తెలియజేశారు.

ఈనాడు పూర్వపు యక్షగానాలు కాని, వాటిని ప్రదర్శించే దళాలు కాని మచ్చుకు కూడా కానరావు. కాని, ఈ నాటికీ నాటకరంగానికీ, సినిమారంగానికీ మార్గదర్శకులు వారే.





# 4

# కూచిపూడి కళాక్షేత్రం



కూచిపూడి భాగవతులు, వారి భాగవతం, దాని నిర్మాణ విశేషాలు—భామాకలాపాలు, గొల్లకలాపాలు — క్షేత్రయ్యమువ్వగోపాలపదాలు — వీథినాటకాలు, వాటి తీరుతెన్నులు — కోటకొండ భాగవతులు-జేగంట భాగవతులు — గొల్ల భాగవతులు—దాదినమ్మ భాగవతులు—వెన్నెల నాటకాలు

# కూచిపూడి కళాక్షేత్రం

కూచిపూడి భాగవతుల పేరు విననివా రుండరు. ఆంధ్రదేశంలో ప్రతి మారు మూల గ్రామాలలోనూ వారి ప్రవర్శనాలు ప్రదర్శించబడ్డాయి. పెద్ద పెద్ద రాజాస్థానాలలోనూ. దేవుళ్ళ కళ్యాణ ఉత్సవసమయాల్లోనూ. తిరుణాళ్ళసమయంలోనూ కూచిపూడి భాగవతుల ప్రదర్శనాలు తప్పనిసరిగా ఉండేవి. ఆ విధంగా వారు కొన్ని శతాబ్దాలబట్టి ఏకచ్ఛత్రాధిపత్యంగా విశాలాంధ్రలో విశేషంగా ప్రవర్శనా లిచ్చి వేనోళ్ళ వినుతులుగొన్నారు.



వీరు ఆట ప్రారంభించారంటే భరతముని ప్రసాదిం చిన భరతనాట్యాన్నీ, నందికేశ్వరుని అభినయదర్పణాన్నీ శాస్త్రయుక్తంగా తెల్లవార్లూ ప్రదర్శిస్తూ వుండేవారు. వేలాది ప్రజలు వీరి ప్రదర్శనాలు చూచి ఉప్పొంగిపోయేవారు. ప్రద ర్శనమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నిండి ఉన్నప్పటికీ ప్రజల చిత్తప్రవృత్తులు కూడ ఆధ్యాత్మికచింతనతో కూడి ఉండడంవల్ల ప్రదర్శనంలో వచ్చే ప్రతి విష యమూ అర్థమైనట్లుగానే వారు ఆహ్లాదంలో మునిగి ఆనందించేవారు. ఎంతో మంది పండితులు సైతం వీరి విద్యను పరీక్షించటానికి పోటీలు పడి మరీ కూర్చునేవారు. వీరు పండిత పామరులందరి మన్ననలనూ పొంది అనేక బహుమానాలను గడిం చారు. ఆ ఊపులో నైజాం నవాబువద్ద సంపాదించిందే వారి అగ్రహారం కూచిపూడి.

కుచ్చులు తెచ్చుకొన్న
కుచేలపురం :

కూచిపూడిగ్రామం కృష్ణాజిల్లాలో, తూర్పుకోస్తాలో, జిల్లా ముఖ్యపట్టణమైన మచిలీపట్టణానికి 15 మైళ్ళ దూరంలో శాతవాహనచక్రవర్తుల ముఖ్యపట్టణమైన శ్రీకాకుళానికి (కృష్ణాజిల్లా) చేరువలో వుంది. మువ్వగోపాల పదాలతో దక్షిణ

దేశాన్నంతా ఉద్భూతలూగించిన క్షేత్రయ్య స్వగ్రామమని చెప్పబడే మువ్వగ్రామానికి అతి సమీపంలోనే వుంది ఈ కూచిపూడి. ఈ కళాక్షేత్రం ఒక బ్రాహ్మణ అగ్రహారం. దీనిని కుచేలపురమనికూడ కొంతకాలం క్రితంవరకూ పిలుస్తూ వుండేవా రని ప్రతీతి. దాదాపు 6 వందల సంవత్సరాలకు పూర్వమే ఇక్కడ నాట్యకళకు అంకురార్పణ చేశారని చరిత్రకారులవల్ల తెలుస్తూంది.

మూలపురుషుడు
సిద్ధేంద్రయోగి సుద్దులు :

అసలు, కూచిపూడికి ఈ సంప్రదాయం ఎలా వచ్చిందో కొంచెం తెలుసుకుని ముందుకు నడిస్తే మనకు చరిత్ర బోధపడుతుంది. ఈనాటికీ కూచిపూడి వారిని "మీ కీ నాట్య సంప్రదాయంగాని, భాగవత సంప్రదాయంగాని ఎక్కడనుంచి వచ్చిందీ" అని అడిగితే వారు ఈ క్రింది గాథను తెలియజేస్తారు. కూచిపూడి భాగవతుల ప్రదర్శనాలకు మూలపురుషుడు సిద్ధేంద్రయోగి అని చెపుతారు. ఈయన కూచిపూడి గ్రామస్థుడే అని కొందరూ, యాత్రలు చేస్తూ కూచిపూడిచేరిన వరదేశి అని కొందరూ ఆయన కాపురస్థలాన్నీ, కాలాన్నీ నిర్ణయించలేకుండా వున్నారు.

గురువును మించిన
శిష్యుడు :

కొన్ని శతాబ్దాల క్రిందట కూచిపూడి గ్రామంలో సిద్ధయ్య అనే ఒకాయన వుండేవారట. ఆ సిద్ధయ్యగారు చాలా అమాయకుడు. నిరక్షరాస్యుడు. సోమరితనంగా తిరుగుతూ వుండేవాడు. ఆవూరి తక్కిన బాలురచే పరిహసింపబడుతూ, ఏమాత్రం విద్యాసక్తి లేక అయోమయంగా వుండేవాడట.

కొంతకాలానికి యుక్తవయస్సు వచ్చింది. సంప్రదాయసిద్ధంగా ఆ గ్రామంలోనే అన్నివిధాలా తగిన కన్య నిచ్చి వివాహం చేశారు. వివాహం అయిన కొద్ది దినాలకెల్లా సిద్ధయ్యగారిలో ఒక కొత్త మార్పు రాసాగింది. విద్యాసక్తి కలిగింది. తల్లిదండ్రులవద్ద శెలవు తీసుకుని ప్రయాణమయ్యాడు. ఆ గ్రామానికి పశ్చిమంగా వున్న కృష్ణానదిని దాటి ఒక పల్లెటూరికి విద్యాభ్యాసంకొరకు వెళ్ళిపోయాడు.

సిద్ధయ్యలో కలిగిన ఈ వింతమార్పు ఆ గ్రామవాసులందరిని ఆశ్చర్య

చకితులను గావించింది. కొంతకాలం ఇలా గడిచిపోయింది. సిద్దయ్యను గురించి చెప్పుకున్నవారు లేరు.

అన్ని విద్యలలోనూ
అవల్ దర్జాగా ప్యాసు :

కాని, ఇంతలోనే సిద్దయ్యగారు సకలవిద్యాపారంగతుడై అన్ని విద్యలలోనూ మరి ఇంతటివాడు లేడన్న పేరు తెచ్చుకొని తిరిగివచ్చారు.

వచ్చేముందు సిద్దయ్యగారి గురువు, "నాయనా! నీవు నాదగ్గర అభ్యసించ వలసిన దేమీ యికలేదు. పోయి గృహస్థాశ్రమధర్మం అనుసరించి సుఖంగా జీవించు" అని ఆశీర్వదించి పంపించాడు. గురువుదగ్గర సెలవు తీసుకుని ఇంటికి ప్రయాణమయ్యాడు సిద్దయ్య.

అది సంధ్యాసమయం. సూర్యుడు అరుణకాంతులు విరజిమ్ముతున్నాడు. సరిగ్గా ఆవేళకు కృష్ణాతీరం చేరుకున్నాడు. సంజచీకట్లు కమ్ముకుంటున్నాయి. సిద్దయ్యగారు స్నానం చేసి సాయంసంధ్యావందనం చేస్తున్నారు. ఇంతలో ఉన్న దున్నట్టు కృష్ణానది పొంగి సీటి ప్రవాహం ఒక్కపెట్టున ఆయన కంఠవరకూ ముంచు కొచ్చింది. సిద్దయ్య ప్రమాదస్థితిలో పడ్డాడు. తన ప్రమాదస్థితి గమనించి ఆత్మసన్యాసం చేశాడట.

ఆత్మసన్యాసం—
అటు తర్వాత :

ఇంతలో ఒక తరంగం హఠాత్తుగా వచ్చి సిద్దప్పను చిత్రంగా ఒడ్డుకు చేర్చిందట.

అంతట ఆయన సంసారాన్ని త్యజించి తన శృంగారభావాలను శ్రీకృష్ణభక్తితో మిళితంచేసి భామాకలాపమనే పారిజాతాపహరణ యక్షగానాన్ని రచించి కూచిపూడి భాగవతులకు బోధించి ధన్యుడైనా డని ఒక కథ.

మరో కథ :

సిద్ధేంద్రయోగి మొదట శృంగేరీమఠంలో ఒక చదువురాని మొద్దబ్బాయిగా వుండి ఊసుపోకకు కృష్ణకీర్తనలు పాడుతూవుండగా—యాదాలాపంగా నయితేనేమి—

అందులో అబ్బాయి తన్మయతను గమనించిన శృంగేరీ పీఠాధిపతి కృష్ణభక్తిని ప్రచారంచేయడానికి అతనిని దేశసంచారం పంపినట్లూ, యాత్రలు చేసుకుంటూ చేసుకుంటూ అతడు కూచిపూడిగ్రామం వచ్చినట్లూ, వూరివెలుపల దేవాలయంవద్ద మకాం వేసినట్లూ, ఇంతలో ఆవూరి బ్రాహ్మణ స్త్రీలు ఊరి వెలుపలనున్న ఊర బావికి నీళ్ళకు వచ్చి, ఈ సిద్ధేంద్రుని దర్శించినట్లూ చెప్పుతారు.

ఆనాటి ఆచారం ఏమంటే గ్రామంలోకి ఎవరైనా అతిథులు వస్తే ప్రథమంగా వారిని సత్కరించాలి. అలాగే వీరిని సత్కరించటానికై కూచిపూడిబ్రాహ్మణులు వారిని దర్శించి, ఆతిథ్యాన్ని అందుకోమన్నారు. అందుకు ఆయన సమ్మతించి అన్నందగ్గర కూర్చుని ఒక కోరిక కోరినట్లూ, దానిని వీరు శిరసావహించినట్లూ చెబుతారు. ఏమి టాకోరిక? తాను ఒక భాగవతం వ్రాశాడట. దానిని వారు ప్రదర్శించాలట. అదే ఆయన కోరికట. ఆ కోరికను తిన్నగా తీరుస్తానంటేనే భోజనం చేస్తానని తీర్మానంగా చెప్పాడట. అందుకు వారు మారుమాట మాట్లాడక సరే నన్నారట. ఇందుపై సిద్ధేంద్రుడు నాట్యశాస్త్రాన్ని వారికి బోధించడానికి ఇష్టపడి, వారు ఈ శాస్త్రాన్ని వంశపారంపర్యంగా ప్రతిగృహంలోనూ కులవృత్తిగా గ్రహించి, ప్రతి బ్రాహ్మణ యువకుడూ ముక్కు కుట్టించుకుని, కాలికి గజ్జె కట్టి, ఆవూరి నటరాజు ఆలయంలో ఒక్కసారైనా నాట్యప్రదర్శనం చేసేటట్లు వాగ్దానం చేయించుకుని, పారిజాతాపహరణ మనే భామాకలాపాన్ని వారికి ఉపదేశించాడట. ఆయన ఆదేశానుసారం ఆనాటినుండి ఈనాటి వరకూ వారు నాట్యవిద్యలో దినదినాభివృద్ధిపొంది వివిధ దేశాలనూ సందర్శించి నానారాజ సందర్శనంచేసి శతాబ్దాల తరబడి పేరు ప్రఖ్యాతులు సంపాదించారు.

### అక్షరాభ్యాసానికి ఆరంభం

ఆనాటినుంచే నాట్యంలో అక్షరాభ్యాసం చేయబడింది. వెంటనే సిద్ధేంద్రుడు బాలుర నందర్నీ సమకూర్చి, వారికి నాట్యాభినయాన్నీ, సంగీతాన్నీ నేర్పాడు. ఆనాటినుంచి వారి భాగవతాల ప్రదర్శనలకు అంకురార్పణ జరిగింది. ఈరీతిగా సిద్ధేంద్రయోగి నాట్య గీతాభినయాలను కూచిపూడి కళాకారులకు అంకితం చేశాడు.

ఆనాటినుంచీ ఈనాటివరకూ కూచిపూడి నాట్యప్రదర్శనలూ, వారి భాగవతాలూ, వారి పగటివేషాలూ విశాలాంధ్ర దేశంలో వంశపారంపర్యంగా ప్రచారం పొందాయి.



'భిక్షాందేహి' అంటూ పగటి వేషంలో బయలుదేరిన పండు బావనయ్య (సున్నపు వీరయ్య)

## వంశపారంపర్యంగా వారసత్వం :

ఇలా ఆ కళను వంశపారంపర్యవిద్యగా చేసి, దానిని నశింపనీయక కాపాడేందుకు కూచిపూడి గడ్డమీద పుట్టిన ప్రతి బ్రాహ్మణ మగబిడ్డకూ ముక్కులూ చెవులూ కుట్టిస్తారు. కారణం ముక్కులకూ చెవులకూ రంధ్రాలుంటే ఆభరణాలు ధరించడానికి అనువుగా వుంటుంది. అది స్త్రీపాత్రగాని, పురుషపాత్రగాని రంధ్రాలువుంచడం అవసరం. అంచువల్ల, వయస్సు ముదిరితే రంధ్రాలు వేయడం కష్టం కనుక, ఆపనిని బాల్యంలోనే ముగిస్తారు. పసిపిల్లలకు విద్యాభ్యాస మెటువంటిదో వారి కీకర్ణవేధ అటువంటిది. ముక్కులగా చెవులూ కుట్టించినతరువాత మరి కాలికి గజ్జె కట్టించి నటరాజుముందు నాట్యాభ్యాసాన్ని ప్రారంభిస్తారు.

## పదిహేనవ శతాబ్దికే ప్రబలంగా ప్రఖ్యాతి :

కూచిపూడి భాగవతులు 15 వ శతాబ్దంనాటికే వారి కళా ప్రదర్శనలను ప్రదర్శించటంలో ప్రఖ్యాతి వహించారు. ఇందుకు ఆధారం 1502 నాటి మచ్చుపల్లి కైఫీయతే. 16 వ శతాబ్దం చివరిభాగంనుండి ఈ నాటివరకూ పారిజాతాపహరణాన్ని ప్రదర్శిస్తూ వారు ప్రశంసల్ని అందుకుంటున్నారు.

## భామాకలాపం-
## సిద్ధేంద్రుని డిగా భీమా :

భామాకలాపంలో శ్రీకృష్ణుడు నాయకుడు. సత్యభామ నాయిక. శ్రీకృష్ణుడు

రుక్మిణీయం దుంచిన అనురాగం తనపట్ల చూపలేదని, సత్యభామ శ్రీకృష్ణునితో కయ్యమాడి విడిగా వుండిపోయి ఆ వియోగాన్ని మరి భరించలేక దూతికతో రాయబారం పంపడం, దూతిక సత్యభామ విరహవేదనను ఉపశమింపజేయడం అందులో కథ. శ్రీకృష్ణుని దక్షిణ నాయక లక్షణాలను, సత్యభామ అష్టవిధ నాయిక లక్షణాలను, అవస్థా భేదాలను అద్భుతంగా చిత్రిస్తారు. భామాకలాపంలో సత్యభామ ఒక్కతే పాత్రధారి. సూత్రధారుడు కథకుడుగాను, చెలికత్తె మాధవిగాను సమయానుకూలంగా ద్వివిధ పాత్రలనూ ధరించి చక్కని హాస్యాన్ని ప్రదర్శిస్తారు. భామాకలాపం సిద్ధేంద్రుడే వ్రాసినట్లు ఈ క్రింది నాందీ పద్యంద్వారా వెల్లడౌతుంది.

జనులార, వినుడి హరికథ
వినవేడుక గలిగెవేని వీనులకొలదిన్
కొనుడీ కర్ణామృతముగ
ఘనుడగు సిద్ధేంద్రయోగి కవికారచవన్.

అనే పద్యంతో ప్రారంభించిన తరువాత సత్యభామ ఈ విధంగా పాడుతూ తెర వెశలుతుంది:

భామవే, సత్యభామవే
భామవే, వదహారువేల
కోమలు లందరిలోమా
భాకురో, గోపాలమూర్తికి
ప్రేమదాసినగు సత్య ॥భామ॥

అట్టహాసము చేసి సురల
నట్టె గెలుచుక పారిజాతపు
చెట్టు దెబ్బ నాదు పెరటా
గట్టిగా నాటించుకొన్నా ॥భామ॥

—అంటూ గర్వాతిశయంతో నృత్యంతొక్కుతూ అభినయంచేస్తుంది.

భామాకలాపంలో -

భామవాచిక విధానం:

భామాకలాపంలో కథయొక్క సందర్భాన్నిబట్టి వచనం నడుస్తూ వుంటుంది. సత్యభామ ఒక్కతే—ఏకపాత్రధారి. ప్రక్కనున్న విదూషకుడు తానొక్కడే, అవ

సరాన్ని బట్టి పురుష హాస్యగానివలెను. మాధవి అనే స్త్రీ పాత్రధారిగాను రెండం దాలా నిర్వహిస్తాడు. ఉదాహరణకు భామాకలాపంలో సత్యభామ వాచికం చూడండి:

"ఓ యమ్మా, వకావకనాడు వ డక మందిరంలో హంసతూలికా తల్పమంది కేళికా గృహములయందు వజ్ర వైడూర్య గోమేధిక పుష్యరాగ మరకత మాణిక్యములు స్థాపించినటు వంటి నగరియందు వవళించియుండగా, స్వామివారు వచ్చి శయ్యమీద కూర్చున్నారమ్మా, లేచి వరిమళ ద్రవ్యములు మొదలైన చందనగోష్టి చేసినావే, అంతట స్వామివారు వరున్నారే, వేను కూర్చున్నావే, పాదసేవ చేసినావే. అప్పుడు స్వామివారు నన్ను తొడపై కూర్చుండ బెట్టుకుని అమూల్యమైనటువంటి ఆభరణములు అలంకరించి నిలువుటద్దం తెచ్చి ఎదుటనుంచి నీడలు చూచి, సత్యభామా! నీవే చక్కనిదానవా, వేవే చక్కనివాడనా? అని అడిగేనే, వోశమ్మా అడిగేటివంటివరకు ఆడబుద్ధి అవరబుద్ధి గనుక, తెలియక, వేనే చక్కనిదాని నంటినే వోశమ్మా, అంతట స్వామివారు నామీద కోవంచేసి దిగ్గున లేచి చక్కాపోయినే వోశమ్మా! మన స్వామివారు ఎందుబోయినో, యెక్కడబోయినో వెదుకుతారటే వోశమ్మా!"

అంటూ మాధవితో ఎంతో అద్భుతంగా వాచికాభినయం నడుస్తుంది. ఇది వినడానికి ఆహ్లాదకరమైన వాచికవిధానం.

భామాకలాపాన్ని కూచిపూడివారు ఒక మహాకావ్యంగా తీర్చిదిద్దారు. ఏండ్ల తరబడి ప్రదర్శించి ప్రజాహృదయాలను చూరగొన్నారు. దీనితరువాత వారి ప్రద ర్శనాల్లో ముఖ్యమైంది గొల్లకలాపం.

గొల్లకలాపం
తీర్చిన గొప్పసందేహం:

గొల్లకలాపంలో నాయిక గోపకన్య. ఆమె "బ్రాహ్మణ, గోప జన్మల్లో ఏది ఉత్తమ మైంది? బాపడు గొప్పవాడా? గోపుడు గొప్పవాడా?" అని బ్రాహ్మణునితో వాదోపవాదాలు జరుపుతుంది. ఈ గొల్లకలాపాన్ని భాగవతుల రామలింగ శాస్త్రి గారు రచించారని ప్రతీతి. గొల్లకలాపంలో గొల్లభామవేషం ధరించి వీధిలో చల్ల

అమ్మినట్లు అభినయిస్తూ వుండగా శిష్టాచారం గలిగిన బ్రాహ్మణుడు చల్ల కొనాలని గొల్లభామను పిలుస్తాడు. ఇరువురూ ఏ కులం గొప్పదో అని వాదోపవాదాలు జరుపుతారు. మానవ సమాజమంతా సమానంగానే సృష్టించబడిందని, బ్రాహ్మణులు అధికం కారని వాదిస్తుంది. ఇందుకని ప్రదర్శనంలో ఇద్దరు గొల్లపడతులు చల్ల అమ్మేటట్లు వేషాలు ధరించి, భాగవతంలో వర్ణించిన పిండోత్పత్తిని గురించీ, నవ మాసాల పిండచలనాన్నీ, పిండం బయటపడిన తరువాత, ప్రపంచసృష్టి ఏ విధంగా వుండేదీ అభినయంతో వర్ణించేవారు. ఇందులో వేదాంతచర్చ జరుగుతుంది.

గొల్లకలాపాల్లో
ఘనపాఠి :

ఈ భామా, గొల్ల కలాపాలలో పేరుప్రఖ్యాతులు గడించి అనేకమన్ననలు పొందిన సిద్ధహస్తులు వెంపటి వెంకటనారాయణగారు. ఆయన తరువాత కొంతమంది ఆ పాత్రను ధరించినప్పటికీ ఆయనతో సరితూగరనే చెప్పవచ్చు. ఎంతోకాలం ఏళ్ళతరబడి ఈ గొల్లకలాపాన్ని ప్రదర్శించారు. ఇదంతా యక్షగానరూపంలోనే జరిగింది.

కూచిపూడి వీధి భాగవతులు భారత-భాగవత - రామాయణాల నుండీ కథలను తీసుకుని యక్షగాన నాటకరూపంలో భరత నాట్యశాస్త్ర సాంప్రదాయాలను అనుసరించి ప్రదర్శనాలను ఇస్తూ వుంటారు. వీరు ప్రదర్శించిన యక్షగానాల్లో గిరిజా కళ్యాణము - కీచకవధ - హరిశ్చంద్ర - కిరాతార్జునీయం - కాళీయమర్దనం శశిరేఖాపరిణయం - రామనాటకం - రుక్మాంగద - లవకుశ - ఉషాపరిణయం మొదలైనవి ముఖ్యమైనవి. ఈ కోవకు చెందిన పురాణసంబంధమైన గాథలనే యక్షగానరూపంలో ప్రదర్శించేవారు. రానురాను వారు ఈ యక్షగాన రూపాలను కొంతవరకు మార్చి వీధినాటకాలుగా ప్రదర్శించారు.

తెరమీద జడ
పండితుల ప్రతాపప్రదర్శనం :

కూచిపూడిభాగవతుల ప్రదర్శనల్లో ముఖ్యంగా భామాకలాప ప్రదర్శనంలో తెర మీద ఒక జడ వేసి తద్వారా తమ పాండితీప్రకర్షను వెల్లడించేవారు. ఈజడ

వర్ణనను పరిశీలించి తప్పులు పట్టడానికి పండిత ప్రకాండు లందరూ ముందు వరుసలో వుండేవారు.

జడను 27 నక్షత్రాలతో ఒక నక్షత్రమాలగా అలంకరించి తెరవెలుపలి భాగంలో ప్రేక్షకులకు కనబడేటట్లు ప్రేలాడదీసేవారు. ఒక్కొబిళ్ళకు ఒక శ్లోకం చదివేవారు. జడగంటల్ని నవగ్రహా లనేవారు. ఆజడను మయు డనే శిల్పి స్వయంగా సృష్టించాడని ప్రతీతి. తలకు సూర్యుడూ, చంద్రుడూ అలంకరింపబడేవి. ఇదీ ఆ జడ స్వరూపం. ప్రదర్శన ప్రారంభంలో ఈ జడవర్ణనను ప్రదర్శిస్తూ వుండగా, ప్రేక్షకులుగా కూర్చున్న పండితుల్లో యెవరైనా లేచి జడనుగురించి ప్రశ్నిస్తే తగిన సమాధానం చెప్పి వారిని ఆశ్చర్యచకితుల్ని చేసేవారు. అలా సమాధానం చెప్ప లేనట్లయితే పైపండితో త్తములు ఆ జడను కత్తిరించి కళాకారులను అవమానపరిచే వారు. అలాంటి సందర్భాలను రానీయకుండా వేదాంతం లక్ష్మీనారాయణలాంటి వుద్దండులు యెంతో ప్రావీణ్యంతో ఒక మహాపర్వతంలా నిలబడి జడవర్ణనను పూర్తిచేసి ప్రేక్షకులను ఆశ్చర్యచకితులను చేసి పంపితుల్ని. పామరుల్ని రంజింప జేసేవారు.

వ్యాయామంద్వారా
నాట్యశిక్షణ :

కూచిపూడికళాకారుల నాట్యాభ్యాసం వ్యాయామంతో ప్రారంభమవుతుంది. వారు బస్కీలు వేస్తారు; దండెములను తీస్తారు. ఇలా చేయడంవల్ల అవయవసౌష్ఠవం చక్కగా అమరుతుంది. ఆతరువాత అభినయాన్ని నేర్పుతారు. నాట్యంలో పాద గతులు-ఆళి, ప్రత్యాళి మొదలైనవన్నీ నేర్పుతారు. హస్తముద్రల్ని, అంగవిన్యాసాల్ని మూడు కాలాలలో అడుగులూ నేర్చుకుంటారు. ఇక నాలుగవ దశలో నవరసాలను అనుభవించడం, ముక్తాయింపు, పాటల్లోని భావాన్ని అనుసరించి భావవిన్యాసాన్ని అభ్యసిస్తారు. ఈవిధంగా నాలుగు దశలుగా విభజించుకుని నాట్యంలో పుత్తీస్తులుగా తయారవుతారు. ఇందువల్ల విద్యాభ్యాసమేగాక వ్యాయామ శిక్షణద్వారా అంగసౌష్ఠవం, కుదిరికలూ, ఆరోగ్యం ఎంతో బాగుండి ఎక్కువ

కాలం జీవించడానికీ, ఆయాసం లేకుండా ఎక్కువకాలం నృత్యం చేయడానికీ వీలవుతుంది.

కూచిపూడి
భరతనాట్యం :

భావ, రాగ, తాళ యుక్తంగా నటించే నాట్యాన్నే భరతనాట్య మంటారు.

నాట్యం నృత్య మనీ, నృత్తమనీ రెండు భాగాలు. భావాన్ని స్పష్టపరచేది నృత్యం, భాషతో భావాలను వ్యక్తంచేసేది నృత్తం. కూచిపూడి నాట్యాచార్యులు వీటన్నిటినీ మేళవించి నృత్యం చేస్తారు. పాటలో వున్న ప్రతిపదం యొక్క భావాన్నీ అభినయంద్వారా చూపిస్తారు. ఈ విధంగా సంగీతం, సంగీతంద్వారా పదం, పదంద్వారా అభినయం, అభినయంద్వారా భావవిశిష్టత వెల్లడిస్తూ, నృత్తమూ, నృత్యమూ కూచిపూడి సాంప్రదాయంలో ప్రాముఖ్యం వహించాయి.

ముద్దులొలికే క్షేత్రయ్య
మువ్వగోపాల పదాలు :

మువ్వగోపాల పదాలను కూచిపూడి భాగవతులు వారి వీధి భాగవతాల్లో పాడడం.

భరతనాట్య సంప్రదాయం ప్రకారం అభినయించడం చేశారు. క్షేత్రయ్య పదాలను ఎక్కువ ప్రచారంలోకి తీసుకువచ్చినవారు కూచిపూడి భాగవతులే. ప్రాచీన కాలంనుంచీ మన కళారూపాలు ఎలా ఎలా పరిణామం చెందాయో, అలాగే మన గేయవాఙ్మయం కూడా అభివృద్ధి పొందింది. క్షేత్రయ్య నివాసస్థానం కృష్ణాజిల్లా దివితాలూకా మువ్వగ్రామం. ఆ గ్రామంలోని గోపాలస్వామిమీదే క్షేత్రయ్య గోపాల పదాలను రచించి దక్షిణదేశమంతా సంచారం చేశాడు. అనేక యాత్రాస్థలాలకు పోయి కంచివరదునిపైనా, తిల్ల గోవిందునిపైనా, యమగిరిస్వామి, శ్రీ వెంకటరమణుడు, ఇనపురిధాముడు, పాలగిరి చెన్నుడు, మధురాపురాధీశుడు మొదలైన దేవుళ్ళపైనా క్షేత్రయ్య అక్షియంగా పాటలను రచించాడు. క్షేత్రయ్య తన పదాలను భక్తిభావంతోనే గాక సంగీత సమ్మేళనాలతో, అభినయ ప్రదర్శనానికి కూడా ఎన్నో గీతాలను రచించాడు. దక్షిణదేశంలో త్యాగరాజు, ఉత్తరదేశంలో జయదేవుని మాదిరి క్షేత్రయ్య కూడా అమేయ ప్రాముఖ్యత వహించిన గేయ

వాఙ్మయ కారుడు. ఆంధ్రుల నాట్యకళా సాంప్రదాయాలలో క్షేత్రయ్య మువ్వ గోపాలపదాలు ఒక మెట్టులాంటిది.

హంగులూ, రంగులూ లేని
వీధినాటక రంగస్థలం:

కూచిపూడి వీధి నాటకాలు ఆనాటినుంచి ఈనాటివరకూ వీధుల్లోనే ప్రదర్శింపబడుతూ వున్నాయి. నాలుగు వీధుల కూడలిలోగాని, ఊరిమధ్య పెద్ద బజారులోగాని, ఊరి వెలుపల బయలు ప్రదేశంలోగాని ఈ ప్రదర్శనాలు జరిగేవి. ఈనాటి మాదిరి ఆనాడు రంగస్థలాలు లేవు. ఎత్తైన ప్రదేశమే రంగస్థలంగా ఎంచుకొనేవారు. లేనట్టయితే మట్టిని దిబ్బగా పోసేవారు. ఇంకా జనసమ్మర్దం ఎక్కువగా వుంటే ఎత్తుగా బల్లలతో ఒక బల్లకట్టు నిర్మించేవారు. ప్రదర్శనం నాలుగు ప్రక్కలకూ స్పష్టంగా కనిపించేటట్లు పందిరి నిర్మించేవారు. పైన తాటి ఆకులుగాని, ఈతచాపలు గాని కప్పేవారు. ఈనాటి తెరలు ఆనాడు లేవు. మామూలు కలంకారీ అద్దకం బొమ్మల దుప్పటిలాంటిది ఇరువురు వ్యక్తులు చెరోప్రక్క పట్టుకుని నిలబడేవారు. ఈనాటి లైట్లు ఆనాడు లేవు. కేవలం నూనె కాగడాలమీదా. విలాయి కర్రలమీదా ఆధారపడేవారు. ఇరు ప్రక్కలా వెలుగునిచ్చే రెండు కంచు నూనె కాగడాలు వేసే వారు. పాత్రల ప్రవేశంలో రాజు, రాణి, యముడు, కంసుడు మొ॥ముఖ్య పాత్రల ప్రవేశంలో ఇంత గుగ్గిలాన్ని ఆ కాగడాలపై గుప్పేవారు. అది ఆ సమయంలో గొప్ప కాంతితో గుప్పు మని మెరిసేది. ఈ మెరుపులో పాత్రలు ప్రవేశమయ్యేవి.



వీధినాటకంలో యమధర్మరాజు-
తమ్మారపు వెంకటస్వామి

ఈ విధంగా వారి రంగస్థలాన్ని నిర్మించి సిద్ధపరుచుకునేవారు. ఇందుకు గ్రామస్థు లందరూ సహాయపడేవారు. ప్రదర్శనానికి కాకితో కబురంపితే చాలు చుట్టుప్రక్కల గ్రామాల నుండి జనం గుంపులు గుంపులుగా వచ్చేవారు.

ఊరి పెద్దలందరికీ పిలుపు-

ప్రదర్శన ప్రారంభం:

రాత్రి సుమారు 10 గంటలకు ప్రదర్శనం ప్రారంభమయ్యేది. ఈలోగా భాగవతు లందరూ గ్రామంలో వున్న బ్రాహ్మణుల ఇండ్లలో భోజనం చేయడంగాని, స్వయంపాకంగాని చేసుకునేవారు. రంగస్థలానికి కొంచెం దూరంలోనే వున్న ఒక ఇంటిలో ముఖాలంకరణ చేసుకునేవారు. ప్రేక్షకులందరూ వచ్చేవరకూ సూత్ర ధారులు వాద్య విశేషాలతో వివిధ రకాలైన పాటలు పాడుతూ గణపతి ప్రార్థన, సరస్వతీస్తుతి, లక్ష్మీస్తోత్రం వల్లించేవారు. ఒకప్రక్క వేషాలు తయారవుతూ వుండేవి. మరోప్రక్క ప్రేక్షకులందరూ ఆసీనులై వుండేవారు. గ్రామంలోవున్న పండితులు, గ్రామపెద్ద, మున్సిఫ్, కరణం మొదలైన పెద్ద లందరూ వచ్చి ముందు వరుసలో కూర్చునేవారు. పెద్దలందరూ వస్తేనేగాని ప్రదర్శన ప్రారంభమయ్యేది కాదు. వచ్చినవారందర్నీ, వారికి సహాయాలు చేసేవారినీ ఈ విధంగా సంబోధించే వారు.

ఈ సభారంగమునకు అందరూ వచ్చియున్నా రటరా?

చిత్తం!

కరణంగారు?

చిత్తం!

మున్సిఫ్‌గారు?

చిత్తం!

ఈ విధంగా ప్రేక్షకులందర్నీ ఆకర్షించి ప్రదర్శనం ప్రారంభించేవారు. ప్రతిజట్టులోనూ సమర్థులైన ఇద్దరు ముగ్గురు హాస్యనటు లుండేవారు. వారు యే పాత్ర బడితే ఆ పాత్రను అచ్చుగుద్దినట్లు చెప్పేవారు. వేషధారణలో ఈనాటి కలరు కేకులుగాని, పౌడర్లుగాని, బ్రష్‌లుగాని లేవు. ముఖాలంకరణకు అరదళం, మణిశిల, బొగుపొడి, సింధూరం వుపయోగించేవారు. క్రీప్ హెయిర్ బదులు నారపీచు వుప యోగించేవారు.

ప్రదర్శనంలో ప్రతిపాత్రా రంగస్థలంలో మూడు ప్రక్కలకూ తిరిగి అభిన యించేవాఱు. దూరంగా వున్నవారికి వినబడేటందుకు సూత్రధారులు హెచ్చు

స్థాయిలో, ప్రతిచరణాన్ని ఒకసారికి రెండుసార్లు రెట్టించి పాడేవారు. ఇలా రెట్టించటంవల్ల అందరికీ ఇట్టే అర్థమయ్యేది.

ఈ ప్రదర్శనంలో సాత్వికభావాలు ముందు కూర్చున్నవారికి తప్ప దూరాన వున్నవారికి కనిపించేవి కావు. అందువల్ల కాళ్ళతో నృత్యంచేసేవారు. నోటితో పాట పాడేవారు. చేతులతో భావానికి తగ్గట్టు అంగచలనం చేసేవారు. మధ్యమధ్య శ్లోకాలను చదివేవారు. ఈ శ్లోకాలు చాలామందికి అర్థంకావని హాస్యగాని ద్వారా వివర మడిగించి, శ్లోకార్థాన్ని విశదపరిచేవారు. ప్రదర్శనంలో ఏమాత్రం విసుగు జనించకుండా హాస్యపాత్రధారులైన మాధవి, చోపుదారు, ద్వారపాలకుల ద్వారా చిత్రవిచిత్రమైన లోకధర్మాలను, సాంఘికాచారాలను ప్రవేశపెట్టి మధ్య మధ్య కడుపుబ్బ నవ్వుపుట్టించేవారు. ప్రదర్శనం 10 గంటలకు ప్రారంభిస్తే తెల్ల వారి 6 గంటలవరకూ బ్రేకులేకుండా సాగించేవారు. ప్రేక్షకులు తెల్లవార్లూ రెప్ప వాల్చకుండా ఈ ప్రదర్శనలను చూచి ఆనందించేవారు.

అక్కరగా, మక్కువగా
ప్రదర్శించే నాటకాలు:

కూచిపూడి భాగవతులు నాటకాల్లో రామాయణ, భారత, భాగవతగాథలకు సంబం ధించిన గాథలను యక్షగాన వీధినాటకాల రూపంలో సాంప్రదాయ సిద్ధంగా ఈ క్రింద వుదాహరించిన వాటి నన్నిటినీ ప్రదర్శించేవారు.

త్యాగరాయ కృతులు—జయదేవుని అష్టపదులు — మువ్వగోపాలపదాలు —భద్రాచల రామదాసు కీర్తనలు—నారాయణతీర్థుల తరంగాలు—సారంగపాణి కీర్తనలు—తుంగతుర్తి కృష్ణదాసు కృష్ణలీలలు—తాళ్ళపాక అన్నమాచార్యులు గారి ప్రహ్లాద—హరిశ్చంద్ర—రామనాటకం—ఉషాపరిణయం—గొల్లకలాపం - భామాకలాపం — దాసినమ్మవేషం — దశావతారాలు—మంచూకశబ్దం ప్రహ్లాద పట్టాభిషేకం—బాలగోపాల తరంగం మొదలైన వెన్నో ప్రదర్శించేవారు.

ప్రతిభావంతులైన
కళాకారులు:

కూచిపూడికళాకారులు ఒక్క నాట్యసంగీతాల్లోనేగాక అలంకారశాస్త్రంలోనూ, మంత్రశాస్త్రంలోనూ, భాషాశాస్త్రంలోనూ, వాద్యశాస్త్రంలోనూకూడ నిరుపమాన

మైన ప్రజ్ఞానైపుణ్యం గలవారు. కూచిపూడివారిలో వేదాంతంవారనీ, చింతావారనీ, పసుమర్తివారనీ, భాగవతులవారనీ, వెంపటివారనీ, ఇంగువవారనీ, బుక్కా-వారనీ ప్రపిద్ధకుటుంబాలవారున్నారు. కొన్ని శతాబ్దాలపాటు దీర్ఘప్రశస్తిని పొందారు. 19వ శతాబ్దం ప్రారంభంనుండి నేటివరకు అఖండమైన కీర్తినార్జించుకుని కూచిపూడి సాంప్రదాయాన్ని వుద్ధరించిన ఈ క్రిందికళాకారులు కీర్తిశేషులైనారు.

1. చింతా వెంకటరామయ్య
2. చింతా రత్తయ్య
3. చింతా నారాయణమూర్తి
4. చింతా అదినారాయణ
5. చింతా రామమూర్తి
6. వెంపటి వెంకటనారాయణ
7. వెంపటి పరదేశి
8. వెంపటి సుబ్బారావు
9. వేదాంతం లక్ష్మినారాయణశాస్త్రి
10. వేదాంతం వెంకటరత్నం
11. వేదాంతం వెంకటాచలపతి
12. వేదాంతం పెదరామయ్య
13. వేదాంతం చినరామయ్య
14. వేదాంతం లక్ష్మినారాయణ
15. మహాకాళి గంగయ్య
16. మహాకాళి సీతారామయ్య
17. మహాకాళి సూరయ్య
18. మహాకాళి చలపతి
19. మహాకాళి శ్రీరాములు
20. బొక్కా రామబ్రహ్మం
21. బొక్కా వెంకటాచలపతి
22. బొక్కా సీతారామయ్య
23. భాగవతుల రామయ్య
24. భాగవతుల అనంతరామయ్య

25. భాగవతుల రామదాసు
26. భాగవతుల రామలింగం
27. భాగవతుల విస్సయ్య
28. భాగవతుల కుటుంబశాస్త్రి
29. పసుమర్తి భగవంతం
30. పసుమర్తి కొండలరాయుడు
31. యేలేశ్వరపు రామకృష్ణయ్య
32. యేలేశ్వరపు వెంకటేశ్వర్లు
33. తాడేపల్లి పేరయ్య
34. జోస్యుల నారాయణమూర్తి
35. హరివలపతి

వయసులోనే కాదు, విద్వత్తులోనూ పండుముసలి :

పై వారిలో శ్రీ చింతా వెంకటరామయ్యగారు సుప్రసిద్ధులు. ఈనాటి వెంకటరామానాట్యమండలిని 70 సంవత్సరాలక్రితం స్థాపించి, అవిచ్ఛిన్నంగా నిర్వహించి, ఆ సంస్థద్వారా అనేకమంది వుత్తమనటశేఖరులను సృష్టించి, ఈ నాట కూచిపూడి నాట్యకళకు దివ్య యశస్సును ఘటిల్ల జేసిన ప్రముఖ నాట్యాచార్యుడు.



చింతా వెంకటరామయ్య

శ్రీ వెంపటి వెంకటనారాయణగారు భామాకలాప, గొల్లకలాప ప్రదర్శనాల ద్వారా విశేషఖ్యాతి నార్జించుకున్న నట శేఖరుడు. అనేక సంస్థానాలలోనూ, విద్వత్సభలలోనూ విద్వత్తును ప్రద ర్శించి అనేక సువర్ణఘంటాకంకణాది అమూల్య సత్కారాలను పొందిన లయ బ్రహ్మ. పాత్రధారణలోనూ, నాట్యశిక్షణలోనూ అరితేరి, మిగిలినవారు కూడ- ఈ క్రిందివారితోపాటు సేవజేస్తున్నారు.

ఈనాటి నటవర్గంలో
సాటిలేని మేటివారు:

వేదాంతం రామకృష్ణయ్య
వేదాంతం ప్రహ్లాదశర్మ
వేదాంతం సత్యనారాయణశర్మ
వేదాంతం వీరరాఘవయ్య
వేదాంతం ఆంజనేయులు
చింతా రాధాకృష్ణమూర్తి
చింతా కృష్ణమూర్తి
మహంకాళి సత్యనారాయణ
మహంకాళి సుబ్బారావు
మహంకాళి వెంకటాచలపతి
మహంకాళి శ్రీరాములు
మహంకాళి శ్రీమన్నారాయణ
పసుమర్తి ఆంజనేయులు
పసుమర్తి ఆదినారాయణ
పసుమర్తి రత్తయ్య
భాగవతుల రాజేశ్వరరావు
భాగవతుల లక్ష్మీనరసింహం
హరి పున్నయ్య
దర్భా వెంకటేశ్వర్లు

పైన వుదాహరించిన వారిలో చింతా కృష్ణమూర్తి కీ॥ శే॥ చింతా వెంకట రామయ్యగారి పుత్రులు. ఈనాటి వెంకటరామా నాట్యమండలికి మేనేజరు. ఢిల్లీ, బొంబాయి, హైదరాబాదు మొదలైన ప్రముఖనగరాలలో అమూల్యమైన సన్మానాల నందుకున్నారు. తండ్రిగారివలె వీరుకూడ ప్రధానపాత్రల్లోనూ, సూత్ర

ధారుడుగాను ప్రఖ్యాతి వహించారు. ఆమధ్య హైదరాబాదులో జరిగిన సంగీత నాటక అకాడమీవారి నాట్యసదస్సులో సన్మానించబడ్డారు. నేటి నటశేఖరుడైన వేదాంతం సత్యనారాయణశర్మకు గురువులు.



అచ్చంగా ఆడదే అనుకొనేరు ఆవేషంలో వేదాంతం సత్యనారాయణశర్మ బడ్డారు. నేటినటుల్లో ప్రముఖుడు.

ఆడవేషాల్లో అందెవేసిన మగధీరుడు

వేదాంత సత్యనారాయణశర్మ: ఈనాటి యువనటుల్లో పేర్కొనదగినవారు. వేదాంతం సత్యనారాయణశర్మగారు. వీరు గొప్ప నటశేఖరులు. సత్యభామ, వుష, మోహిని మొదలైన స్త్రీ భూమికల్ని ధరించి అనేక విద్వత్సభలలో అనేక పారితోషికాలను పొందడమేకాక కేంద్ర ప్రభుత్వం వారిచే అవార్డును అందుకుని సన్మానించ

నేటి నాట్యాచారులు:

వేదాంతం పార్వతీశం
వేదాంతం మల్లికార్జునశర్మ
భాగవతుల రామతారకం
భాగవతుల రామకోటయ్య
భాగవతుల యజ్ఞనారాయణశర్మ
వసుమర్తి సీతారామయ్య
వసుమర్తి వేణుగోపాలశర్మ
వసుమర్తి సీతారామశాస్త్రి
జోస్యుల సీతారామశాస్త్రి
హేమాద్రి చిదంబరదీక్షితులు
చింతా సీతారామాంజనేయులు
యేలేశ్వరపు నాగేంద్రశర్మ

కూచిపూడి ఆచార్యులపై సినిమాల ప్రభావం:

కూచిపూడి నాట్యాచార్యులపై సినిమా ప్రభావంకూడ జోరుగా పడింది. సినిమాలలో నృత్యాలు ప్రవేశపెట్టబడడంతో కూచిపూడి నాట్యాచార్యులు సినిమాల

మీదికి దృష్టిని మళ్ళించారు. అలా సినిమాల్లో ప్రవేశించి కీర్తి ప్రతిష్ఠలు గడించిన వారు వేదాంతం రాఘవయ్య. వెంపటి సత్యనారాయణ, పసుమర్తి కృష్ణమూర్తి, వెంపటి చినసత్యం, వేదాంతం జగన్నాధశర్మ మొదలైనవారు సినిమాలలో నృత్య దర్శకులుగా వెలుగొందుతున్నారు. వీరిలో వేదాంతం రాఘవయ్యగారు కొంతకాలం నృత్యదర్శకులుగా వుండి ఆతరువాత కొన్ని చిత్రాలకు దర్శకత్వమూ వహించి ప్రపిద్ధ దర్శకులలో ఒకరుగా వెలుగొందుతున్నారు.

కూచిపూడి దాదినమ్మ
భాగవత ప్రదర్శనం:

లీలావతి విజయగాథ వీధిభాగవతంగా రచించబడి అల్లంపాటీశ్వరునకు అంకితం చెయ్యబడింది. దీని ప్రాతప్రతి మద్రాసుప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలో ఉంది. ఈ గాథను దాదినమ్మభాగవత ప్రదర్శనంగా కూచిపూడి వీధిభాగవతులు నాలుగు దశాబ్దాల క్రితంవరకూ ఆంధ్రదేశం అంతటా జేగీయమానంగా ప్రదర్శించారు. ఆగాథ ఇది:

ఉజ్జయినిరాజైన భోజరాజుకు శివుని వరాన జన్మించిన గారాల బిడ్డ లీలావతి. లేకలేక కలిగిన ఆ బిడ్డకు ఏడుకోటల నడుమ ఒంటిస్తంభపు మేడ నిర్మించి అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు.

దినదినప్రవర్ధమాన అవుతున్న ఆ సౌందర్యరాశి లీలావతి అందచందాలను గురించి పురోహితుని ద్వారా విన్న మగధదేశపు రాజు ముగ్ధుడై, లీలావతిని వివాహం చేసుకోవాలని నిశ్చయించి ఉజ్జయినిరాజుకు వార్తాహరుని ద్వారా వర్తమానం పంపిస్తాడు. ఇందుకు ఉజ్జయినిరాజు సమ్మతించడు. ఆ వార్త విని ఉగ్రుడైన మగధరాజు రాజ్యంలోని గజదొంగలను పిలిపించి ఎవరైతే లీలావతిని తెచ్చి తనకిస్తారో వారికి తన దేశంలో సగం భాగాన్ని దానంగా ఇస్తానని ప్రకటిస్తాడు. కర్ణకరు డనే దొంగ అందుకు అంగీకరించి ఉజ్జయిని నగరానికి బయలుదేరుతాడు.

అక్కడ ఉజ్జయిని నగరంలో లీలావతి చెలికత్తెలతో ఆటపాటలతో అలిసిపోయి, దోమ తెరమంచంలో హాయిగా నిద్రిస్తూ వున్న సమయంలో దొంగ



దోమతెరమంచంలో దాదినమ్మ

అయిన కర్ణకరుడు దొం గచాటుగా ఆ ఒంటి స్తంభపుమేడకు కన్నం వేసి లీలావతిపై మత్తు మందు చల్లి ఆమెను మంచంతో సహా కోట దాటించి అరణ్యంలోకి తీసుకొనిపోతూ వుండగా మధ్యలో మేల్కాంచిన లీలావతి దిగ్గున లేచి దిగ్భ్రిమచెంది దుఃఖి స్తుంది. చెలికత్తెలందరిని వరసవరసన పేర్కొని విలపిస్తుంది. ఆ దొంగను అనేకవిధాల శపిస్తుంది. రాజ దండన తప్పదని వాణ్ణి పలువిధాల బెదరిస్తుంది. ఏమీ పాలుపోక చివరికి భగ వంతుణ్ణి వేయివిధాల ప్రార్థిస్తుంది. పుణ్యాత్ము లెవరైనా వచ్చి తనను రక్షించ వలసిందిగా అరణ్యమంతా దద్దరిల్లిపోయేటట్లు రోదిస్తుంది.

ఇంతలో ఆ అడవికి వేటకు వచ్చి విశ్రాంతి తీసుకుంటున్న మాళవరాజుకు లీలావతిరోదన వినిపిస్తుంది. అతడు దిగ్గునలేచి రోదన వినిపించే దిక్కుకు వెడలి మంచంలో ఉన్న సుకుమారిని ఉజ్జయిని రాకుమార్తె లీలావతిగా తెలుసుకుని తగిన దండప్రయోగంతో దొంగలబారినుండి తప్పించి ఉజ్జయినికి తీసుకుపోయి భోజ రాజుకు అప్పగిస్తాడు. మాళవరాజు ఉపకారాన్ని మెచ్చుకున్న భోజరాజు లీలావతిని అతని కిచ్చి వైభవోపేతంగా వివాహం చేస్తాడు. ఇదీ ఆ కథ.

ఈ రచనలో డరువులు, ద్విపదలు, పద్యాలు, వచనాలు రకరకాలుగా ఉన్నాయి. ఉదాహరణకు : కర్ణకరుడు మత్తుమందు చల్లి తీసుకుపోయే సమయంలో మంచంలో పరున్న లీలావతి ఈ విధంగా తన వృత్తాంతాన్ని ప్రారంభిస్తుంది.

దాదివమ్మా వే దాదినమ్మా
దాదిలో చిన్నదానవే యమ్మా.
బాలవమ్మా వే బాలనమ్మా.

బాల నవకీర్తి పాలైతినమ్మా.
పుట్టకోటా, భూమికోటా
కంచుకోటా, కల్వకోటా
ఇనుపకోటా, ఇత్తడికోటా
వెండికోటా వెలసివాదీ
ఏడుకోటల నట్టనడుమా
ఒంటిస్తంభం మేశమీదా
వవ్వళించి వే నుండగా
మాయదారి కర్ణకఠూ
మత్తుచల్లీ నన్ను తెచ్చే.

అంటూ దరువుతో లీలావతి పాత్రధారిపై కథ అంతా వివరిస్తుంది.

తంత్రమూ, తంతూ,
తాత్పర్యమూ :

దాదినమ్మ ఉంటూ వచ్చిన పందిరిపట్టి మంచం ఒక వ్యక్తి పరుండడానికి సరిపోయేటంత పొడవూ, వెడల్పూ కలిగివుంటుంది. ఆ మంచానికి ఒక చిన్న పందిరి. ఆ పందిరికి చాందినీ దోమతెర, లోపల పందిరికి వ్రేలాడుతూ రకరకాల పన్నీటిబుడ్లు. మంచం వెదురుకర్రలతో చెయ్యబడి చాలా తేలికగా వుంటుంది. లీలావతిపాత్రధారి మంచాన్ని రొమ్ముకు దిగువ కదలకుండా గట్టిగా కట్టివేసుకుంటాడు. నడుము కింది భాగమంతా పాదాలవరకూ కాళ్ళు కనబడకుండా మంచంకోళ్ళచుట్టూ మంచానికి జాలరు దించిఉంటుంది. చూచేవారికి మంచం అలంకారం ఎంతో శోభాయమానంగా కనిపిస్తుంది. కాళ్ళవద్ద మంచంమీద రెండు లక్క-కాళ్ళు బయటికి కనబడేటట్లు అమరుస్తారు. ఇలా కాళ్ళు అమర్చడంవల్ల మంచంలో దిగబడిన లీలావతి పాత్రధారి మంచంలో పరుండినట్లే ప్రేక్షకులకు భ్రాంతి కలిగించేది. భూమిమీద ఆనకుండా మంచం దానంతట అదే మధ్య - అంతరంలో నిలబడినటు కనబడేది. కాళ్ళకు గజ్జెలు కట్టి లీలావతి పాత్రధారి పాట ప్రారంభించి నృత్యం చేస్తూవుంటే పరుండిన వ్యక్తి పరుండినట్లుగానే ఉన్నప్పుడు మంచం ఎలా నృత్యం చెయ్యగలుగుతున్నాదా అని ప్రేక్షకులకు ఆశ్చర్యాన్ని కలిగించేది.

ఈ ప్రదర్శనం మూడు గంటల కాలం జరిగేది. మంచం బరువుతో మూడు గంటల కాలం ఒకే పాత్రధారి విసుగు జనించకుండా పాడుతూ, అభినయిస్తూ, నృత్యం చేస్తూ ప్రేక్షకులను ఆనందింపజేసేవాడు. ఈ ప్రదర్శన ఇవ్వడంలో కూచిపూడి భాగవతులు సిద్ధహస్తులు. వీరిలోనైనా అందరూ దీనిని ప్రదర్శించగలిగేవారు కారు. దాదినమ్మ వేషం వెయ్యడంలో పూర్వం నాట్యకళానిధి వేదాంతం లక్ష్మీనారాయణశాస్త్రి, వెంపటి వెంకటనారాయణగార్లు సుప్రసిద్ధులు. వీరి తరువాత చెప్పుకోదగినవారు చింతా రామమూర్తి, భాగవతుల రాజయ్య, వేదాంతం జగన్నాధ శర్మ మొదలైనవారు.

వీధి భాగవతానికి వలెనే గ్రామంలోని నాలుగు వీధుల నడుమ రచ్చబండ వద్ద వేసిన పందిరిలో ప్రదర్శనం. తెర, కాగడాలూ, వంతపాట గాండ్రూ. హాస్య గాడూ మొదలైన హంగులతో. ఇరువైపులా జోడించి పట్టిన కాగడాలమీద చల్లిన గుగ్గిలం భగ్గుమనడంతో తెర తొలగిపోయేది. తరువాత వెంటనే దాదినమ్మ పాత్ర ప్రవేశమై భాగవతం ఆరంభమయ్యేది. ఈనాడు ఈ ప్రదర్శనం మచ్చుకుకూడా కనబడకుండా పోయింది. ప్రదర్శించే సమర్థులూ ఎవరూ లేరు. ఇది ఏకపాత్రాభినయంలాంటిది.

కూచిపూడివారి

సొమ్ములు, సొబగులు :

కూచిపూడి భాగవతులు వారు ప్రదర్శించే ప్రదర్శనాలలో ప్రతిపాత్రకు ఒక ప్రత్యేకమైన వేషధారణను, ప్రాచీన సంప్రదాయాలతో కూడుకున్న ఆభరణాలను ప్రవేశపెట్టారు. నాయిక, నాయకుడు, విదూషకుడు, చెలికత్తె, వుపనాయకులు మొదలైన అనేక పాత్రలు వారివారి తారతమ్యంతో కూడుకున్న శరీరాలంకరణాలను, కంఠాభరణాల్ని, శిరోభూషణాలను ధరించేవారు.

పురుషపాత్రల్లో ముఖ్యంగా రాజు కిరీటాన్ని, శంఖచక్రగదాదండాల్ని, భుజ కీర్తుల్ని గండభేరుండపతకాలు, కర్ణపత్రాలు, కాశికోక, కండువాలు, నల్లకోటు, మొదలైన వాటిని ప్రధానభూషణాలుగా ధరించేవారు.

ఇంకా పురుషపాత్రల్లో తారతమ్యాలనుబట్టి తదితరకోట్లు, ఘర్వాలు, చొక్కాలు, అంగరఖాలు వుపయోగించేవారు.

నరసింహస్వామి, శక్తి, రావణుడు, హిరణ్యకశిపుడు, హనుమంతుడు మొదలైన భీకరపాత్రలకు కరాళములను, ముఖాలకు ముసుగులను వాడుతారు.

అసలుకన్నా అదనంగా
ఆభరణాల అలంకరింపు :

నిత్యజీవితంలోనే పురుషులకంటే స్త్రీలకు ఆభరణాలు ఎక్కువ. అలాగే ప్రదర్శనాలలో కూడ ఎక్కువగానే ధరించేవారు. నిజంగా కూచిపూడి కళాకారులు వారి భాగవతాలలో స్త్రీ పాత్రలకు ఒక ప్రత్యేకమైన ఆభరణాలను ధరింపజేసేవారు. ఆకాలంలో ఆచరణలో వున్న స్త్రీల ఆభరణాల నన్నింటినీ వుపయోగించేవారు. కొన్ని లోహాలకు సంబంధించినవి. మరికొన్ని పేడతో తయారుచేసినవి. మరి కొన్ని కాగితాలతో మోల్డింగ్సుగా తయారుచేసినవి ధరించేవారు.

భామవేషం -
నిలువెల్లా సొమ్ములు :

భామవేషానికి ఎన్నో ప్రాచీన ఆభరణాలను వుపయోగించేవారు. వారానికి కొన్ని నగలు చొప్పున, ఏడువారాలకు ఏడురకాలైన వివిధ ఆభరణాలను ధరించేవారు: పెద్దజడ—చిన్నజడ—శిఖ—రాగిరేకులు—మొగలిరేకులు—రాగిడి—చంద్ర వంక—కమ్మలు—జూకాలు—తాయెత్తులు—చేర్లు—పాపిటతురాయి—పాపిడి పింజరాలు—కడియాలు—దండకడియాలు—పోచీలు—దట్టెడ—అడ్డబాస—బిళ్ళలమొలత్రాడు—కట్టడపు బులాకి—ముక్కుపుల్ల మొ॥ఇవి గాక కాసులపేరు—సూర్యుడు—ముత్యాలు—తాయెత్తులు—కితకివడ్డాణము—జడకుప్పెలు మొదలైనవి కూడా ధరిస్తారు. వారి జడబిళ్ళలు నవరత్నాలు చెక్కిన ట్లుండేవి. ఆ బిళ్ళల్లో సూర్యుడు—చంద్రుడు—నక్షత్రాలు మొదలైన ఖగోళశాస్త్రానికి సంబంధించిన విశేషా లుండేవి.

అసలు తానీషా
భూరివిరాళం :

సిద్ధేంద్రయోగి పెట్టిన భిక్షతో అనేక సంవత్సరాలు కూచిపూడివారు యక్షగానాల ద్వారాను, వీధిభాగవతాలద్వారాను నానాదేశసందర్శనం చేసి విరాళాలను పొందారు. ఆ విధంగానే గోల్కొండను పరిపాలించిన నవాబ్ అబ్దుల్‌హసమ్ తానీషా

కూడా కూచిపూడి కళాకారులకు 1687 లో కూచిపూడి గ్రామాన్ని అగ్రహారంగా దాన మిచ్చారు. ఆ కాలంలో సిద్దేంద్రయోగి జీవించేవున్నాడనీ, నవాబుతో రేగిరేకుమీద అగ్రహారపు దానపట్టాను వ్రాయించింది కూడా సిద్ధేంద్రుడేననీ కొంద రంటు న్నారు. ఏది ఏమైనా నాట్యకళాసాంప్రదాయాలకు తమ జీవితాన్ని అంకితం చేసిన బ్రాహ్మణకుటుంబాల కళాకారులందరూ ఈ అగ్రహారపు దానాన్ని పొందేటట్లు పట్టాలో వ్రాయబడిందట. ఆనాటినుండి ఈనాటివరకూ తరతరాలుగా ఆ కుటుంబా లన్నీ దీనిని అనుభవిస్తూనే వున్నాయి.

'సాహెబా సల్లామురా'తో
సన్మానం:

కూచిపూడి భాగవతులు ఆనాటి ఆంధ్రదేశమేకాక హైదరాబాదు, విజయనగరం, తంజావూరు మొదలైన సంస్థానా లన్నిటిని సందర్శించారు. అనేకమంది రాజుల్నీ సామంతుల్నీ ఆశ్రయించారు. అలా సంచారంచేసే రోజుల్లో బినగాని పల్లెనవాబు వారిని ఆహ్వానించి వారి ప్రదర్శనలన్నిటినీ చూచి వారి కౌశల్యాన్ని వేనోళ్ళ పొగిడి వారికి తగిన పారితోషికాన్నిచ్చారు.

కూచిపూడివారు ఇలా మహమ్మదీయనవాబుల సన్నిధికి వెళ్ళినప్పుడల్లా వారిని స్తోత్రంచేస్తూ వుండేవారు. వారి పాటల్లో ఎక్కడో ఒకచోట వారిని స్తుతిస్తూ వుండేవారు. వారిజతులు రాముని మీదో, విష్ణువుమీదో, కృష్ణునిమీదో రచింప బడి, కీర్తనాంతంలో తుదిపాదంలో 'సాహేబా సల్లాముర' అని స్తుతించేవారు. అంటే అటు హిందువులకు ఆగ్రహం లేకుండా హిందూమత సాంప్రదాయప్రకారం విష్ణునీ కృష్ణునీ కీర్తించి, ఇటు 'సాహెబా సల్లాముర' అని నవాబుల మెప్పును పొందేవారు. ఇలా లౌకికవృత్తితో కళాప్రచారాన్ని అన్నిమార్గాలా, అన్నిమతాల ప్రజల్లోకీ చొప్పించారు. వుదాహరణకు వారు కీర్తించిన ఒక జతిలో,

తాకు ధికుకు ధికు రేకిణ
సారెసారెకు వరభరాముని
వన్నతించె వీరజాక్షవినయా
రతిరతిందరి
తాకిణాంత ధికిణాంత

రవికులాంబుధి సోమ దశరథ
రామచంద్ర నిండుపున్నమ
వెన్నెలాయెర మవ్వెధీర
భళిర మేల్ సెబాసు నల్లాముర!

అని దీవించేవారు. వారు ఈ విధంగా తురుష్క-ప్రభువుల్ని మెప్పించి అనేక జాగీర్లను పొందారు. అలాంటివే పైన వివరించిన బినగానిపల్లె నవాబు వ్రాసి ఇచ్చిన గ్రామాలు కోటకొండ - కపట్రాల.

రాచగద్దెఎక్క రాణకెక్కిన
వేదాంతం సాంబయ్య:

వేదాంతం సాంబయ్యగా రనే కూచిపూడి భరతనాట్యాచార్యుడు 18-వ శతాబ్దంలో అనంతశయనం మహారాజుగారి ఆస్థానంలో ప్రవేశించి తన పాండిత్య ప్రావీణ్యాన్ని, నటనాకౌశల్యాన్ని ప్రదర్శించాడు. అనంతశయనం మహారాజు అబ్బురపడ్డాడు. ఆయనను తన సింహాసనంమీద ఒక గంటకాలం తృప్తిదీరా కూర్చుండబెట్టి సువర్ణహస్తకంకణాలను ధరింపజేసి సాంబయ్యగారివి సన్మానించాడు.

అశక్తదుర్జనత్వం,
మంత్రతంత్రాల ప్రయోగం:

కూచిపూడివారు వుధృతంగా ప్రదర్శనాలిస్తున్న రోజుల్లో చాతబడులు, మంత్ర తంత్రాలతో మచ్చుజల్లడం మొదలైనవి ఎక్కువగా వుండేవి. కళాకారుల్లో విపరీతమైన పోటీభావం వుండడంవల్ల ఒకరికంటె ఒకరు ఎత్తుకు పైఎత్తులు వేస్తుండేవారు. శాస్త్రపరీక్షతోపాటు ఈ మంత్రపరీక్షలుకూడా వుండేవి. ముఖ్యంగా ఒకర్ని మరొకరు జయించలే మనుకున్నప్పుడు ఈర్ష్యాభావంతోనూ, రాజాధిరాజులూ, మహారాజుల మెప్పుపొందడానికి పడేపోటీలవల్ల కుళ్ళుబుద్ధితోనూ ఒకరి మీద ఒకరు మంత్రప్రయోగాలు చేసుకునేవారు. అలా ప్రయోగించిన ప్రయోగాలలో మచ్చుకు ఒక ఉదాహరణ.

కుక్కకాటుకు
చెప్పుదెబ్బ :

ఒకసారి మనభాగవతులు మలయాళదేశానికి సంచారం వెళ్ళగా ఒక గ్రామంలో వీరి ప్రదర్శనానికి అనుమతి ఇవ్వలేదు. కారణం ఆ గ్రామంలో ఒక మంత్రవేత్త వున్నాడట. అతని అనుమతి లేక ఎవరూ ప్రదర్శన ఇవ్వకూడదట. అయినా మన కూచిపూడివారు ఆ మంత్రవేత్తని లెక్కచేయకుండా ప్రదర్శనాన్ని యివ్వడానికి నిర్ణయించుకున్నారు.

ఆనాడు వుదయం మన భాగవతశిఖామణి భాగవతుల దశరథరామయ్యగారు ఆ మలయాళమాంత్రికుని ఇంటికి వెళ్ళాడు. మాంత్రికుడు ఇంటివద్ద లేడు. ఈయన ఆ మాంత్రికుని భార్యను చుట్టకాల్చుకోడానికి నిప్పుఅర్థించగా ఆమె నిప్పుఇవ్వడం. ఈయన చుట్టకాల్చుకోవడం. తదనంతరం ఆ అగ్నిని ఈయన గుడ్డలో మూట గట్టుకుని వెళ్ళిపోవడం జరిగిందట. ఎక్కడికో వెళ్ళివచ్చిన మలయాళమాంత్రికునికి భార్య ఈ వృత్తాంతం చెప్పగా అతగాడు మండిపోయి ఆనాటి ప్రదర్శనంలో ప్రతి క్రియగా భామవేషకారునికి కడుపుబ్బునట్లు జలోదరప్రయోగం చేశాడట. ఇంకే ముంది? దశరథరామయ్యగారు చూచి కించిత్తూ చలించకుండా. 'చూడు నాతడాభా' అని ప్రతీకారంగా ఒక గంటాన్ని తీసుకుని ఒక స్తంభాన్ని పొడవగా ఆ రంధ్రం నుంచి సీరుకారడం ప్రారంభించి, భామవేషధారికి కడుపునొప్పి చట్టున తగ్గిందట.

దెబ్బపై దెబ్బ :

దశరథరామయ్యగారు అంతతో ఊరుకోలేదు.మలయాళమాంత్రికునికి ప్రాయశ్చిత్తం చేయాలనుకున్నాడు. వెంటనే ప్రేక్షకుల మధ్యలో కూర్చున్న మలయాళమాంత్రికుణ్ణి కదలలేకుండా కూర్చున్నవాణ్ణి కూర్చున్నట్లే బంధించివేశాడు. ప్రదర్శనం తెల్లవారులూ జరిగింది. కాని మాంత్రికుడు కదలలేదు. ప్రదర్శనం ఆ సాంతమై అందరూ వెళ్ళిపోయారు. కాని మాంత్రికుడు మాత్రం శిలలాగా అలాగే కూలబడి వున్నాడు. ఈ స్థితిని చూచిన మాంత్రికుని భార్య దశరథరామయ్యగారిని వేడుకోగా ఆయన జాలిదలచి మంత్ర బంధనాన్ని సడలించాడు. తరువాత మాంత్రికుడు ఇల్లు చేరాడట. ఈ విధంగా వాళ్ళు యెప్పటికప్పుడు వచ్చే ఇటువంటి ప్రమాదాల నన్నిటినీ తప్పించుకుంటూ వుండేవారని అనేక కథ లున్నాయి.

గొల్లకుగొల్ల,
భామకు భామ!

భాగవతుల దశరథరామయ్యగారు గొల్లకలాపపు ప్రదర్శనాలనిర్వహణలో అఖండ ప్రఖ్యాతి పొందినవారు. బాల్యంలో గొల్లవేషం; కౌమారదశనుండి యవ్వన దశవరకూ భామవేషం, ఆ తరువాత భామాకలాపంలో సూత్రధారిగా వుండి గొప్ప ప్రతిష్ఠ పొందారు.

దశరథరామయ్యగారు ఈ విధంగా కొంతకాలం భామాకలాప ప్రదర్శనలో వుండి, తరువాత భూతవైద్యవిద్యకూడా అభ్యసించారు. ఒక సమాజానికి దర్శకత్వం వహించి ఆ బృందాన్ని నడుపుతూ దేశపర్యటన చేస్తూవుండేవారట. ఈయన సకలశాస్త్ర పారంగతుడైన భాగవతుల లక్ష్మీనారాయణగారికి, భాగవతుల రామనాథశాస్త్రిగారికి సమకాలికులు. వీరు తమ జట్టులతో దేశసంచారం చేస్తూ గొప్ప గొప్ప సంస్థానాలకేగి పండితసభల్లో ప్రదర్శనాలు ఇచ్చి అఖండమైన ఖ్యాతి ఆర్జించారు. ఈ విధంగా వీరు విజయయాత్ర చేస్తూవుండేవారు. వీరి విద్యాప్రభావానికి ఆబాలగోపాలం ఆనందపడుతూ వుండేవారు.

పండితుల సవాళ్ళు-
ఖరాఖండి సమాధానాలతో గెలుపు:

ఆ రోజుల్లో కేవలం ప్రదర్శనమిచ్చే మామూలు నటులుగానే గాక, సభాముఖంలో అప్పటికప్పుడు పరీక్షలతో ప్రశ్నించే పండితులకు సమర్థతతో సమాధానం చెప్పి ఎటువంటి పరీక్షలకైనా తట్టుకోకలిగిన పండితులూ సమాజాల్లో—స్త్రీలలోనూ, పురుషులలోనూ-వుండేవారట.

ఇటువంటి కుటుంబాలు కృష్ణాజిల్లా నంగిగెడ్డ గ్రామంలో అనేకం వుండేవి. గుంటూరు జిల్లాలోని బోడాయిపాలెంలో చిన్న రాణి అనే ఒక నర్తకి ప్రదర్శనాన్ని ప్రసిద్ధ పండితులందరూ మెచ్చుకునేవారట. అలాగే రేపల్లెతాలూకా, ధూళిపూడి గ్రామస్థులు మహంకాళి సీతయ్యగారు, ఒంగోలు తాలూకాలోని తమ్మవరం కాపు రస్తుడు తమ్మవరం వెంకటస్వామి మొదలైనవారు ప్రసిద్ధులు.

గజ్జెకట్టిన అందరికీ
గురువు :

చింతా వెంకటరామయ్యగారు 1860 వ సంవత్సరంలో జన్మించారు. తండ్రి శివ రామయ్య; తల్లి అరుంధతమ్మ. పది సంవత్సరాల ప్రాయంలోనే పాటలో, ఆటలో, హాస్యంలో అనుభవం సంపాదించి, భామవేషపు దరువుల్ని పాడుతూ వుండేవారు. వెంకటరామయ్యగారి ప్రతిభా విశేషాలను గమనించి ఏలేశ్వరపు నారాయణప్పగారు వారి మేళంలో చేర్చుకున్నారు. 12 వ సంవత్సరంలోనే అన్న గారైన వెంకటరత్నంగారివద్ద నాట్యశిక్షణను ప్రారంభించి 16 సంవత్సరాలకే విశేష నాట్యశాస్త్రానుభవాన్ని సంపాదించారు.

వీరు భాగవతమేళాన్ని 1875 నుండి దాదాపు 1936 వరకూ నిర్వహించారు. ఈనాడు నిర్వహింపబడుతున్న వెంకటరామా నాట్యమండలి 1875 లో వెంకట రామయ్యగారితో ప్రారంభింపబడిందే.

కొంతకాలం భాగవత మనే పేరుమీద, భామాకలాపాన్ని ప్రదర్శించారు. ప్రజాభిరుచుల్ని అనుసరించి యక్షగానాలను ప్రవేశపెట్టి, ప్రహ్లాద, ఉషాపరిణయం, గయనాటకము, రుక్మాంగద, రామనాటకం, హరిశ్చంద్ర, శశిరేఖా పరిణయం మొదలైన నాటకాలను ప్రదర్శించి ప్రజామన్ననల్ని పొందారు.

ప్రయాణసౌకర్యాలు లేని ఆనాడు ఆంధ్రదేశపు నాలుగుచెరగులా ఎద్దు బండ్లలో ప్రయాణంచేసి ప్రదర్శనా లిచ్చి, ఉన్నతాధికారులవద్దా, సంస్థానాధీశ్వరుల వద్దా పారితోషికాలు పొందారు.

ఆనాటినుండి చనిపోయేవరకూ కూచిపూడిలో గజ్జెకట్టిన ప్రతికళాకారుడూ ఆయనవద్ద శిష్యరికం చేసినవారే. ప్రాచీనులైన చింతా నారాయణమూర్తి, వెంపటి పరదేశి, వేదాంతం చలపతి, చింతా ఆదినారాయణ మొదలైన ప్రముఖులు ఆయన శిష్యులే.

ఆధునికులలో వేదాంతం రాఘవయ్య, వెంపటి పెసత్యం, పసుమర్తి కృష్ణమూర్తిగార్లు ముఖ్యులు.

వేదాంతం రాఘవయ్యగారిని పాత్ర నిర్వహణలో సర్వసమర్థునిగా తయారు చేసి 1934 లో మద్రాసులో గూడవల్లి రామబ్రహ్మంగారి అధ్యక్షతను జరిగిన ఆంధ్ర నాటకకళాపరిషత్తులో, తాము సూత్రధారులుగా, ప్రదర్శన మిప్పించి,

'సెహభాష్' అనిపించి, ఈనాటి రాఘవయ్యగారి ఉన్నతస్థానానికి పునాదులు వేశారు.

వెంకటరామయ్యగారి శిష్యులలో పసుమర్తి వేణుగోపాలకృష్ణశర్మ కడ పటివారు.

వెంకటరామయ్యగారి శిక్షణ విచిత్రమైంది. వారికి ఏ సమయంలో, ఏ అడుగు, ఏ భావం, ఏ రీతి, ఏభంగిమ స్ఫురణకు వస్తే అదల్లా అప్పుడే అక్కడే శిష్యులకు బోధించేవారు. ఇంతటి ప్రతిభావంతుడైన వెంకట్రామయ్యగారు 90 సంవత్సరాలు ధృవతారగా వెలుగొంది 6-1-1949 వ సంవత్సరంలో కీర్తిశేషులైనారు.

## బహువేషధారి
## భాగవతుల విస్సయ్య :

భాగవతుల విస్సయ్యగారు వృషభనామ సంవత్సర ఫాల్గుణమాసంలో కూచిపూడిలో జన్మించారు. వీరి తండ్రిగారు భాగవతుల రామయ్యగారు. విస్సయ్యగారు 7 సంవత్సరాల ప్రాయంలోనే సిద్ధేంద్ర యోగేంద్రుల భామాకలాపాన్ని రాగ, తాళ, హావ, భావాలతో అభ్యసించారు. తండ్రిగారి వద్దా, భాగవతుల యజ్ఞనారాయణగారివద్దా భరతశాస్త్రాన్నంతా అభ్యసించారు. 10 సంవత్సరాల ప్రాయంలోనే బాలింత వేషంవేసి ప్రఖ్యాతి వహించారు. బహుమతుల్ని అందుకున్నారు. యుక్తవయస్సు రాగానే బాలింత వేషం, దాదినమ్మవేషం, ప్రహ్లాదలో లీలావతి, ఉషాపరిణయంలో చిత్రలేఖ, ఉషాకన్యల పాత్రల్ని ధరించి, ప్రఖ్యాతివహించారు. సువర్ణ ఘంటాకంకణాలతో సన్మానాలుపొందారు. తరువాత నాటకాలలో పాత్రలు ధరించటం విరమించి నంగెగడ్డలో కళావంతులకు వారికి నచ్చిన విద్యనంతా నేర్పి, ఆ గ్రామంలో ఏడెనిమిది మేళాల్ని తయారుచేశారు.



భాగవతుల విస్సయ్య

ముందుబడితిలో
మొదటివారు :

కూచిపూడి నాట్యకళాకారులలో అగ్రశ్రేణికి చెందినవారిలో ముఖ్యులు బ్రహ్మశ్రీ నాట్యకళానిధి వేదాంతం లక్ష్మీనారాయణశాస్త్రిగారు.



వేదాంతం లక్ష్మీనారాయణశాస్త్రి

యక్షగానాలూ, వీధి భాగవతాల్లో పారంపర్యంగా వచ్చే సాధారణ నృత్యాల బాణీకి భిన్నంగా శాస్త్రిగారు కొత్త పద్ధతి అనుసరించారు. భరత నాట్యశాస్త్ర సంప్రదాయాల ఆచారంతో శ్రీనారాయణ తీర్థుల కృష్ణలీలాతరంగిణి తరంగాలకు, జయదేవ కవి అష్టపదులకు, క్షేత్రయ్య మువ్వగోపాల పదాలకు, కృష్ణకర్ణామృతం, పుష్ప బాణవిలాసం శ్లోకాలకు నృత్యాలు సరికొత్తగా కల్పించి, ప్రధానపాత్రల లక్షణాలు, మనస్తత్వాలు నిరూపించి, శాస్త్రోక్తంగా ఒక నూతన నాట్యశాస్త్రమే కల్పనచేసి, శిష్య ప్రశిష్యుల్ని తయారుచేసి ఆంధ్రదేశానికి ప్రసాదించిన మహనీయులు వీరు. భామా కలాపంలో సత్యభామ నాయిక. సత్యభామపాత్ర నిర్వహణలో అపూర్వంగా అఖండ ప్రజ్ఞ ప్రదర్శించిన వ్యక్తి ఈయన. ఈయన ఒక్క భామాకలాపం, గొల్లకలాపాలే కాకుండా, దాదినమ్మవేషం, లీలావతి విజయంలో బాలింతవేషం, శ్రీ కృష్ణజననం మొదలైన యక్షగానాల పాత్రలనూ అత్యద్భుతంగా నిర్వహించేవారు.

శాస్త్రిగారి విద్యను దర్శించిన ఉత్తరాది ఉజ్వలనటుడు ఉదయశంకర్ ఉండబట్టలేక ఈయనకు అమాంతంగా సాష్టాంగమే పడ్డాడు.

శాస్త్రిగారి జీవితం అంతా రాజుల ఆస్థానాల్లోనే గడిచింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రప్రభుత్వం భావనగర్ మహారాజా గవర్నరుగిరీకింద శ్రీ పి. వి. రాజ మన్నారు సమక్షంలో ప్రముఖ కళాకారుడుగా శాస్త్రిగారిని గుర్తించి సువర్ణఘంటా కంకణాలతో సత్కరించింది.

తామరతంపరగా శిష్యులూ ప్రశిష్యులను
తయారుచేసిన గురునాథుడు :

శాస్త్రిగారి దగ్గిర భామాకలాపం, గొల్లకలాపం నేర్చుకున్న శిష్యులు అసంఖ్యాకం.

ఈనాడు తెలుగుచలనచిత్ర పరిశ్రమలో ప్రముఖులుగా కీర్తి సంపాదించిన వేదాంతం రాఘవయ్య, వెంపటి సత్యం, వెంపటి చినసత్యం మొదలైనవారు శాస్త్రిగారి శిష్యులే. మద్రాసులోని సుప్రసిద్ధ నాట్యాచార్యుడు శ్రీ రామయ్యపిళ్ళై స్వయంగా కొన్ని నాట్యరీతులు శాస్త్రిగారివద్ద అభ్యసించారు.

రామాయణం, మండూకశబ్దం, ప్రహ్లాద పట్టాభిషేకం, తాటకి సంహారం, దశావతారాలు మొదలైనవాటిని శబ్దరూపంలో శ్రీ శాస్త్రిగారు నృత్యం చేసేవారు. ఆంధ్రదేశం అంతటా జరిగిన ఆయన నృత్యప్రదర్శనాలు విశేషంగా ప్రశంసలు అందుకున్నాయి. ఆయన 82 సంవత్సరాలు జీవించి 1957 జులై 13 వ తేదీన హైదరాబాదులో కీర్తిశేషులైనారు.

అసలు 'రుద్రుడు' కాదు,
అటుకు అన్నలు రుద్రుడు :



హరిపున్నయ్య

కూచిపూడి నృత్యనాటక సంప్రదాయంలో, భయానక, బీభత్స, రౌద్ర, వీరరసాలను పోషించే పాత్రలను ధరించి ప్రేక్షకుల హృదయాలను రంజింపచేసి సుప్రసిద్ధ కళాకారులుగా వెలుగొందారు హరిపున్నయ్యగారు. వీరిది కూచిపూడిగ్రామం. చిరకాలంగా కళాలక్ష్మిని ఆరాధించిన కళాజీవి.

సాత్వికవేషాల్లో 'సై' అనిపించుకొన్న సవ్యసాచి :

కూచిపూడి వీధినాటకాలలో సాత్వికపాత్రల్ని రసవంతంగా అభినయించడంలో ఆరితేరినవారు వేదాంతుల సత్యం కృష్ణయ్యగారు. యక్షగాన విద్యలోనూ, కలాపవిద్యలోనూ అపారమైన జ్ఞానాన్ని

ఆర్జించిన ప్రముఖ కళాకారులు. వృద్ధాప్యంలో వుండిస్నీ సంగీత నాటక అకాడమీ వారి పాఠోషికాలు పైపైన పొందుతున్నారు.



వేదాంతం రామకృష్ణయ్య

ప్రాణాతో ముందడుగులేక
క్షీణదశ:

ప్రాచీన నాట్యకళ ప్రచారమవడానికి కూచిపూడివారు ఎంతో కృషి చేశారు. కాని ఎంత చేసినా, పాత పరిధిని మించి కొత్త పరిధిని చేపట్టలేకపోయారు. పౌరాణిక గాథలు తప్పితే చారిత్రిక,సాంఘిక ప్రదర్శనాలను తయారు చేయలేక పోయారు. కాగా రానురాను రాజుల ఆదరణ తగ్గింది. పరిణామ స్థితిగతుల ననుసరించి వారి భాగవతాలు ముందుకురాలేదు. వారు కాలంతోపాటు కాళ్ళు వేయలేకపోయారు. అవి ప్రేక్షకులకుకూడ కొంతవరకు విసుగు పుట్టించాయనే చెప్పాలి.

శుక్లపక్షంనుంచి
కృష్ణపక్షం:

కూచిపూడివారి నాట్యకళా సాంప్రదాయాలు ఆంధ్రదేశమంతటా, వెలగినంతమట్టుకు, క్రీ॥ శ॥ 1880 వరకూ వేవెలుగులతో వెలుగొందాయి. ఆ రోజుల్లోనే ధార్వాడ నాటకసమాజాలు ఆంధ్రదేశానికి వచ్చి ప్రదర్శనలిచ్చి, వేనోళ్ళ పొగడబడుతూ వచ్చాయి. కాలదేశాలెరిగి రంగస్థలంలో వారు అనేకమార్పులు తీసుకువచ్చారు. చెమ్కీ దుస్తులతో రమణీయంగా ప్రదర్శనాలిచ్చారు. తహతహతో, మార్పు కావాలనుకుంటున్న ప్రజలకు ఒక నూతన ఆనందాన్ని కలుగజేశాయి, ఈ ప్రదర్శనలు. ఈ రోజుల్లోనే కూచిపూడివారి ప్రదర్శనల ప్రభావం మగ్గుపట్టి తగ్గుతూ తగ్గుతూ వచ్చింది. అంతేకాక ధార్వాడవారు వచ్చి వెళ్ళిన తరువాత వారి ప్రబల ప్రచారంతో ఆంధ్రదేశ ప్రముఖ పట్టణాలలో ఎన్నో విద్యావంతుల నాటక సంఘాలు బయలుదేరి, అచ్చంగా ధార్వాడవారి అడుగుజాడల్లో ప్రదర్శనాలిచ్చాయి. ఈ పరిస్థితుల్లో కూచిపూడివారి ప్రదర్శనాలమీద మోజు బాగా తగ్గిపోయింది.

1930 నాటికి నాటకాల ఉధృతంకూడ కొంతవరకు తగ్గి సినిమాల ప్రభావం

బహు ఎక్కువైంది. ఆ సినిమా ప్రభావంతో రంగస్థల నాటకాలూ, కూచిపూడి వారి నాటకాలుకూడా బాగా దెబ్బతిని పోయాయి.

మేలుకోలు-

కొత్త మెరుగులు:

1880 నుంచి 1930 మధ్యకాలంలో కూచిపూడివారు ఏటికెదురీదలేక తమ ప్రదర్శనాలలో కూడ కొన్ని మార్పులు తీసుకువచ్చారు. రంగస్థల నాటకాలు ప్రేక్షకులను ఏ విధంగా, ఎందుకు ఆకర్షిస్తున్నాయో ఆ కీలకాలన్నిటినీ తెలుసుకొని భాగవత సంప్రదాయాలతో కొంత సంస్కరం తీసుకువచ్చి, తెరలు, హార్మోనియం, పద్యాలు, పాటలు, చెమ్కీ దుస్తులు ప్రవేశపెట్టి భరతనాట్య సంప్రదాయాల ననుసరించి ప్రదర్శనాలను ఇచ్చారు.

---

# కోటికొండ భాగవతులు

ఆ మాటకు వస్తే...

ఆ మాటకువస్తే భరతనాట్య సంప్రదాయ ప్రవర్తకులలో కూచిపూడికన్న ప్రథములు పొతకమూరి భాగవతులు. వీరు అహోబిల నృసింహస్వామి సన్నిధిని నాట్యాచార్యులై నిత్యనాట్యసేవ చేసేవారు...."శ్రీ వెలయ పాలవారిధి పవ్వళించి జో, జో," అన్న జోలపాట ఈ భాగవతులు రచించిందే. వీరిని తాళ్ళపాక అన్నమాచార్యులే పేర్కొన్నారన్న. గీతనాట్యాలలో వీరికి గల ప్రతిభ వ్యక్తం కాగలదనీ, వీరు 1280 ప్రాంతపువారనీ శ్రీ నిడుదవోలు వెంకటరావుగారు....ఎల్లోరా ....వ్రాసిన "కళలు—పుట్టు పూర్వోత్తరాలు"కు వ్రాసిన ఉపోద్ఘాతంలో వివరించారు. దీనిని బట్టి భాగవతకళ రాయలసీమలో తరతరాలుగా ప్రచారంలో వున్నట్లు తెలుస్తూ వుంది.

భాగవతకళపై
నవాబుల బులపాటం:

భాగవత కళను రాయలసీమలో విరివిగా ప్రచారం చేయించవలెనన్న తలంపుతో, క్రీ. శ. 1700-1750 ప్రాంతంలో బనగానిపల్లె నవాబుగారు కూచిపూడి

నుండి కొందరు కళావేత్తల కుటుంబాలను ఆహ్వానించి, కోటకొండ, కపట్రాల వద్ద వారికి భూములూ పట్ట లిచ్చి, వారిచేత కర్నూలుజిల్లాలో భాగవత కళా ప్రచారాన్ని ప్రోత్సహించారు. అప్పటిలో కూచిపూడినుండి తరలివెళ్ళిన కుటుంబాలలో చల్లావా రొకరు. వీరు వెలనాటి బ్రాహ్మణుల కుటుంబానికి చెందినవారు. వీరిలో ప్రథముడు చల్లా భాగవతందాసంభొట్లు. భాగవతమనేది వీరికి పౌరుషవాచకమట. సిద్ధేంద్రయోగి నేర్పించిన పారిజాతాపహరణాన్ని పారంపర్యంగా ప్రదర్శించిన వారిలో ఈ చల్లావా రొకరు.

సిద్ధేంద్రయోగి పేరు నిలబెట్టిన
చల్లావారు:

ఈ మధ్య కీర్తిశేషులైన భరతశాస్త్రం లక్ష్మీనారాయణశాస్త్రి వారిలో తొమ్మిదవ తరానికి చెందినవారు. శాస్త్రిగారు ఆ కళాకారుల కుటుంబానికి చెందిన సుప్రసిద్ధ నాట్యకళా విశారదులు. భామా కలాపాన్ని, గొల్ల కలాపాన్ని, క్షేత్రయ్య పదాలనూ, తరంగాలనూ అభినయించడంలోదిట్ట. సంగీత, నృత్య విద్యల్లోనే గాక సంస్కృతాంధ్ర భాషలలోనూ చక్కని పాండితీప్రతిభ గడించినవారు. నృత్యరీతిలో పీరి బాణీకి, కూచిపూడి వారి బాణీకి అడుగుల క్రమంలోనూ, జాతివిన్యాసాల్లోనూ తేడా వున్నట్లు ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ వారిచేత జరుపబడిన కూచిపూడి నాట్య



చల్లా భరతశాస్త్రం లక్ష్మీనారాయణశాస్త్రి

సదస్సులో వివరించారు. వీరి కలాపంలో కొన్ని భాగాలను ఆనాడు అఖిల భారత సంగీత నాటక అకాడమీవారు టేప్‌రికార్డు చేశారు. వారి సంప్రదాయం ఎటువంటిదో తెలుసుకునే అవకాశం మనకు లేకుండాపోయింది.

కోటకొండలో ఈనాటికీ ఉన్న లక్ష్మీనారాయణ శాస్త్రిగారి అన్న కుమారులైన రంగయ్యగారికి భరత నాట్యశాస్త్రంలో అభినివేశం అట్లాగే ఉన్నదట. మరికొంద

రున్నా జీవనోపాధి కష్టమై ఇతర వృత్తులలోనూ, వ్యవసాయంలోనూ ఆసక్తి కల్పించుకొని పెంచుకున్నారు.

వారికి గోలకొండ నవాబైతే
వీరికి కర్నూలు నవాబు:

కూచిపూడి భాగవతులకు గోలుకొండనవాబు తానీషా ఎలా అగ్రహారాన్ని దానం చేశాడో అదేవిధంగా కోటకొండ భాగవతులకు కర్నూలు నవాబు 200 ఎకరాల భూమి శ్రోత్రియంగా—కుడివారం, మేలువారం హక్కులతో—ఇచ్చారట. ఆ హక్కు ఈనాటికీ వారి అనుభవంలో వున్నది.

వంశమంతా
భరత శాస్త్రానికే అంకితం:

వీరి వంశంలో ఒకరో ఇద్దరో తప్ప తర్కంలోనూ, వ్యాకరణంలోనూ ఎక్కువ మంది ప్రతిభావంతులు లేరట. వీరి యింట పారంపర్యంగా భరతశాస్త్రమే ప్రసిద్ధంగా ఉన్నదని లక్ష్మీనారాయణశాస్త్రిగారు వివరించారు.

ఇంటింటా
ఒకని కాళ్ళకు గజ్జెలు:

వీరి ఇలవేల్పు కొలుట్ల చెన్నకేశవుడు. వీరి కుటుంబంలోని ప్రతి మగపిల్లవానికి ఐదవ ఏట ఆ దేవాలయంలో ముక్కు కుట్టిస్తారట. ఉపనయనానంతరం ఆ దేవుని ఎదుట గజ్జెకట్టించి ప్రథమపాఠాలు ప్రారంభిస్తారట. విద్య పూర్తికాగానే చెన్నకేశవుని సన్నిధానంలో ప్రప్రథమం ప్రదర్శనమిచ్చిన అనంతరం గాని రాజులవద్ద ప్రదర్శించేవారు కారట. వీరికి ఎక్కువ మక్కువతో అభ్యాసమైన విద్యలు తరంగాలు, అష్టపదులు, క్షేత్రయ్యపదాలు.

డిటోగా పాటుపడ
కపట్రాల కళాకారులు:

రెండువందల సంవత్సరాలకు పూర్వం, బనగానిపల్లెనవాబు కర్నూలు సమీపంలో తుంగభద్రానదికి ఆవలిప్రక్కన అలంపురానికి దగ్గిరగానున్న చారిత్రిక సుందర

నగరం కపట్రాలను వీరికి ఈనాంగా ఇచ్చారు. ఆనాడే కూచిపూడినుండి కొంత మంది చల్లావారు, చింతావారు కుటుంబాలతో అక్కడికి వలసవెళ్ళారు. కూచిపూడి సంప్రదాయాన్నే వారు నైజాం సంస్థానంలో ప్రచారం చేశారు. కాని రానురాను వారి కళాసంప్రదాయం నిర్జీవమైపోయింది. వీరుకూడ ఆ గ్రామంలో వున్న కాళత్తయ్య దేవాలయంలో బిడ్డలందరికీ చిన్నతనంలోనే ముక్కులూ, చెవులూ కుట్టించి గజ్జెకట్టించి నాట్యాభ్యాసానికి ప్రారంభోత్సవం చేసేవారట. అక్కడ వున్న కళాకారులు చల్లా మోహనకృష్ణ, చల్లా కాళత్తయ్య, చల్లా ముద్దుకృష్ణ మొదలైనవారు భాగవత సంప్రదాయాలను కాపాడుతూ వచ్చారు. ఈ సంప్రదాయాన్ని మహారాష్ట్ర దేశంలోకూడా ప్రచారం చేసి వచ్చారని ప్రతీతి.

### వినుతికెక్కిన తమ్మారపు వీధినాటకాలు:

కూచిపూడి భాగవతులు వీధినాటక ప్రదర్శనాలతో ఆంధ్రదేశం అంతటా విజయయాత్ర సాగిస్తున్న రోజుల్లో అంత వుత్తమంగానూ వీధినాటకాలు ప్రదర్శించి సెహభాష్ అనిపించుకున్న వ్యక్తి శ్రీ తమ్మారపు వెంకటస్వామి. ఆయన స్వగ్రామం ఒంగోలుతాలూకాలోని తమ్మవరం. ఆయన దేవదాసి కులానికి చెందిన వ్యక్తి. బాల్యంలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తిచేసిన వెంటనే ఆ గ్రామంలోవి కుందుర్తి వారివద్ద సంస్కృతం చక్కగా అభ్యసించారు.



ఏ వేషం వెయ్యమన్నా వెయ్యగలరు - తమ్మారపు వెంకటస్వామి

### ప్రభవం, ప్రభావం:

కూచిపూడి బృందం పగటివేషాలు తిలకించిన శ్రీ వెంకటస్వామి కళాజీవితం పగటివేషాలతోనే ఆరంభమైంది.

ఆచిన్నతనంలోనే ఆయన తల్లివద్ద తమాషాగా తమాషా అయిన ఆశీర్వాదం పొందాడట. ఒకరోజున ఆయన తల్లికి తెలియకుండా బుడబుక్కలవేషం ధరించాడు. స్వగృహంముండే ఆ వేషంతో నిలబడి ఇంట్లో వున్న వస్తువులు అన్నిటినీ పేరుపేరునా వరుసగా వల్లిస్తూవుంటే ఆ బుడబుక్కలవాని మాహాత్మ్యానికి తల్లి ఆశ్చర్యపోతూవుండగా "అమ్మా, ఆ చిన్నతనంలోనే తమాషాగా తల్లి ఆశీర్వచనం పొందాడు. ఈ బుడబుక్కలవాడు నీ కొడుకేనమ్మా." అంటూ మాతృమూర్తి ఆశీర్వచనాలు పొందారు.

### జట్టులో కట్టుబాటులు :

వెంకటస్వామి జట్టులో చేరిన వారందరూ కళావంతుల కులానికి చెందిన వ్యక్తులే.

ఆయన జట్టులో పురుషపాత్రలు పురుషులు, స్త్రీ పాత్రలు స్త్రీలు ధరిస్తూ వుండేవారు. అందరిదీ అమ్మనబోలుగ్రామమే. అందులో శ్రీ పెద్ద హనుమయ్య నాయక పాత్రలను, శ్రీ చెల్లయ్య, శ్రీ చిన్నహనుమయ్య, శ్రీ మాణిక్యం ఇతర పాత్రలు ధరించేవారు. అలివేలమ్మ నాయిక పాత్రలు నిర్వహిస్తూండేది. మంగతాయమ్మ మాత్రం పురుషపాత్రలు ధరించేది.

ఈ జట్టు శ్రీ ధేనువుకొండ వెంకయ్య రచించిన ఉత్తరగోగ్రహణం నాటకాన్ని, అమ్మనబ్రోలు వాస్తవ్యులు శ్రీ నాగినేని వెంకటప్పయ్య వ్రాసిన హరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శిస్తూండేది. అది గాక శశిరేఖాపరిణయం, ఉషాపరిణయం, నలచరిత్ర, భామాకలాపం, గొల్లకలాపం మొదలైన ప్రదర్శనాలు కూడా కొనసాగిస్తూండేవారు.

### హాస్యరసపోషణలో అందెవేసిన అద్భుతప్రతిభ :

శ్రీ వెంకటస్వామి హాస్యరస పోషణలో స్వయంగా ఒకముద్ర ప్రతిష్ఠాపించుకొన్న ప్రజ్ఞావంతుడు. ఆయనే ఈ జట్టును నిర్వహించేవారు. ఒకసారి మద్దిలాల పాడులో హరిశ్చంద్రనాటకం ప్రదర్శిస్తూండగా ఒక సంఘటన జరిగింది. నక్షత్రకుడి పాత్ర నిర్వహిస్తున్న ఆయన పైకం చెల్లించవలసిందిగా హరిశ్చంద్రుణ్ణి

నిలదీసి నిలబెట్టి వీపువంచి దానిపై బండలు బరువుపెట్టి హింసిస్తూవుంటే ఆ దృశ్యం చూడలేక శ్రీ తూమాటి రామమూర్తి అనే ఓ ధనికుడు ప్రేక్షకుల్లోంచి లేచి "ఎహేయ్ బేంబడా, ఆ బండ తీసెయ్. ఆయన్నెందుకు బాధిస్తావ్? ఆ డబ్బు నేను పారేస్తా రావయ్యా" అన్నారట. దీనినిబట్టి ఆనాటి ఆ జట్టు వీధినాటకాలు ఎంత రసవత్తరంగా రక్తికట్టేవో అర్థంచేసుకోవచ్చు.

జట్టుజట్టంతకూ
చక్కని విందు:

శ్రీ వెంకటస్వామిజట్టు ఒక ఊరిలో ప్రదర్శనాలు ప్రారంభిస్తే ఇక రోజులతరబడీ ఆ గ్రామంలోనే వివిధ నాటకాలు ప్రదరిస్తూనే ఉండేవారు. ప్రతి ప్రదర్శనావికీ నాలుగు ఠాపాయ లిచ్చేటట్లూ, ఇంటికి ఒకరుచొప్పున జట్టులోనివాళ్ళకు భోజనాలు పెట్టేటట్లూ ఏర్పాట్లు జరగగానే ప్రదర్శనం జరుగుతూ వుండేది. ఆజట్టులో సత్యభామ పాత్రధారిణి అలివేలు చాలా అందగత్తె కావటంవల్ల ప్రతివాళ్ళూ ఆమెనే భోజనానికి ఆహ్వానిస్తూండేవాళ్ళట. ఆమె అందుకు అంగీకరిస్తే విందు షడ్రసోపేతంగా జరిగేదట. ఈ సంగతి గ్రహించిన వెంకటస్వామి ప్రతియింటివాళ్ళకూ సత్యభామే భోజనానికి వస్తుందని చెప్పివచ్చేవాడట. ఆ విధంగా ఆ జట్టులోని వాళ్ళందరికీ చక్కని విందు అందేదట.

నాటకప్రారంభం,
ఆ డాబు-ఆ గోటు:

నాటకప్రదర్శనంనాడు రంగస్థలానికి ముందువరుసలో కరణం. మునసబు ఆదిగా అన్నివర్గాలవాళ్ళూ కూర్చునేవాళ్ళట. సాధారణంగా ఈ జట్టు ప్రదర్శనలు భాగవతంతో ఆరంభమయేవి. అందులో ముఖ్యపాత్రలు శ్రీ కృష్ణుడు, సత్యభామ, గొల్లభామ, సుంకరికొండడు.

ఈ పాత్రలు తెరవెడలేముందు రంగస్థలానికి రెండుప్రక్కలా రెండు దివిటీల్ని పాత్రధారుల ముఖాలకు దగ్గరగా వుంచి వాటిపై ఒకసారి గుప్పెడు గుగ్గిలం చల్లేవారు. ఆ వెలుగులో తీవిగా విర్రవీగుతూ పాత్రలు రంగస్థలంలో ప్రవేశించేవి.

ఆనాటి రంగస్థలానికి యవనిక అడ్డంగా పట్టే వెదల్పయిన గుడ్డమాత్రమే. వేషధారణలో ఉపయోగించే ఆభరణాలన్నీ తేలికకొయ్యతో, కాకిబంగారం అంటింపులతో తయారయ్యేవి.

పండితులకు
పాత్రధారుల సవాలు:

ఆ కాలంలో వీధినాటకాల్లో సత్యభామ తన జడను తెరవెలుపల వేయటం, సభలో కూర్చున్న పండితులు భాగవతం విషయమై ప్రశ్నిస్తే జవాబు చెప్పగలనని సత్యభామ పాత్రధారిణి సూచించటం ఒక సంప్రదాయంగా ఉండేది. ఈ సూచనకు పండితులు ఆగ్రహించి భాగవతం పద్యాలకూ, కృష్ణకర్ణామృతం శ్లోకాలకూ భావార్థాలు చెప్పమని అడిగేవారు. అలివేలమ్మ వాటిని క్షుణ్ణంగా వల్లించేది. పండితులు అంతటితో తృప్తిచెందక ఆమెకు భరతశాస్త్రం, అలంకారశాస్త్రం గురించి ప్రశ్నలు అందించేవారు. వాటికీ ఆమె సంతృప్తికరంగా జవాబులు చెప్పగానే కొందరు పండితులు ఆమెను ప్రశంసించేవారు. మరికొందరు తృప్తిపడకుండా ఆమె పై మంత్రాలు, తంత్రాలు ప్రయోగించే వారు. అందుచేత ప్రతి వీధినాటకం జట్టులోనూ ఒక మంత్రశాస్త్రవేత్త ఉండి ఇటువంటి మంత్రప్రయోగాల్ని విఫలీకృతం చేసేవాడు.

పండితులతో సయ్యాటం,
కన్నెపడుచుల కైవాడం:

ఆనాటి కళావంతుల కులంలో పెరిగిన కన్యలందరూ సామాన్యంగా విద్వత్తు కలిగినవారుగానే ఉండేవారు. నాటక ప్రదర్శనం పూర్తికాకముందే సత్యభామ పాత్రధారిణి ముందు కూర్చున్న పండితులూ, పెద్దమనుష్యుల దగ్గరకు వెళ్ళి తన జడను వాళ్ళ మెడలకు చుట్టి రెండు బుగ్గలూ ఒత్తుతూ జావళీలు పాడుతూవుంటే ఆ పెద్దలు తబ్బిబ్బయి ఆమెచేతికి ఒకటికి బదులు రెండు రూపాయలు అర్పించే

వారు. ఆ సమయంలో బహుమతి యిచ్చిన పెద్దల పేర్లు చెప్పి శ్రీ వెంకటస్వామి వారిపై పొగడ్తలు కురిపిస్తూ పద్యాలు పాడేవాడు. ఈ పద్యాలు అందరి పేర్లకూ సరిపడేటట్లుగా వుండేవి.

ఈ విధంగా సత్యభామ పాత్రధారిణి బహుమతులుగా 20 రూపాయలవరకూ ఆర్జించేది. ఈ హంగులతో నాటక ప్రదర్శనం ముగిసేసరికి అచ్చంగా తెల్లవార గట్ల అయిదుగంట లయేది.

ఆట ఆయినాక
ఊరిమీదికి దాడి!

నాటక ప్రదర్శనానంతరం జట్టులోనివాళ్ళు అందరూ ఆ వేషాలతోనే గ్రామంలోని ప్రతిగడపకూ వెళ్ళి చీరలూ, ధోవతులూ దండుకునేవారు. ప్రదర్శనం చూసి ముగ్ధులైన గ్రామస్థులు ఎంతో ఆదరంతో వాళ్ళకు ఈ బహుమతులు ఇచ్చేవారు. ఈ విధంగా శ్రీ వెంకటస్వామి జట్టు ప్రదర్శించే వీధి నాటకాలు జేగీయమానంగా సాగుతూ వుండేవి.

మచ్చలేని
మహా మంచి మనిషి :

శ్రీ వెంకటస్వామి దైవభక్తుడు. పెద్దలంటే వినయ విధేయతలు కలిగిన వ్యక్తి.

ఆయనకు ఎటువంటి దురభ్యాసాలూ లేవు. ఆయన 80 సంవత్సరాలు జీవించి, అందులో 60 సంవత్సరాలు కళాసేవజేసి అవసానదశలో తమ్మవరంలో మరణించారు.

జే జేలు అందుకొన్న
జేగంటు భాగవతులు :

"ఎందుకయ్యా వుంచినావు బందిఖానలో రామయ్య తండ్రీ, ఎందుకయ్యా వుంచినావు" అని రామదాసు బందిఖానా విశేషాన్ని పాటరూపంలో వల్లిస్తూ

గంటి భాగవతులు ఆంధ్రదేశపు పల్లెల్లో సంచారంచేస్తూ వుంటారు. వీరు,ఒక చేతిలో ఒక పెద్ద జేగంట, రెండవ చేతిలో సీతారామలక్ష్మణ విగ్రహాలతో కూడిన ఒకదీపపు స్తంభాన్ని పట్టుకుని, చంకలో నెమలి ఈకలపించం, కాళ్ళకు గజ్జెలు కట్టి నృత్యంచేస్తూ, నోటితో పాట పాడుతూ, ఒక చేతితో జేగంట వాయిస్తూ యింటింటి ముందూ స్తంభాన్నుంచి స్తంభంచుట్టూ కలయదిరుగుతూ, నృత్యంతో, పాటతో, వాయిద్యంతో చుట్టూ మూగిన ప్రేక్షకుల్ని ముగ్ధుల్ని చేస్తూ ఇంటింటికీ తిరిగి యాచిస్తూ వుంటారు. ఈ నృత్యం ఇంచక్కా భక్తిభావంతో నడుస్తుంది.



జేగంట భాగవతుడు

గంటిభాగవతులు :

ఆంధ్రదేశంలో కొంతకాలం క్రితం గంటి భాగవతులు అని ఒక తెగ భాగవతులుండేవారు. వీరు దీపస్తంభాల వెలుతురులో బొమ్మలు ఆడిస్తూ వుండేవారు. అంటే బొమ్మతోపాటు మనిషి కూడా ఆడుతూ వుండేవాడు. ఇలా బొమ్మలు ఆడించేవారిని 'గంటి భాగవతులు' అనేవారు. వీరు ఎక్కువగా భాగవత గాథల్నే ప్రచారంచేయడంవల్ల వీరికి 'భాగవతులు' అనే పేరు వచ్చింది.

ఈ భాగవతులు నలుగురు, లేక ఐదుగురు కలిసి ఒక దీపపు స్తంభాన్ని పట్టుకుని పాటలతో, పద్యాలతో బయలుదేరి ఈ బొమ్మలాటలను ప్రదర్శించేవారు.

తోలుబొమ్మలకు పూర్వరూపం
కొయ్యబొమ్మలు :

ఈ బొమ్మలకు 'పాంచాలిక'లనీ, 'పుత్తళిక'లనీ పేరుకూడ వుంది. ఇవి కొయ్యబొమ్మలు. భాస నాటకాలన్నిటినీ ఈ పాంచాలిక లనే కొయ్యబొమ్మలాటలుగానే ప్రదర్శించా రనే ప్రతీతికూడా వుంది. తోలబొమ్మలకు ముందరి కథా రూపం ఈ కొయ్యబొమ్మలే. భాసుని నాటకాలు కొయ్యబొమ్మలలో ప్రదర్శిస్తే

భవభూతి నాటకాలన్నీ తోలుబొమ్మలలో ప్రదర్శించబడ్డాయి. సుభటుని 'దూతాంగద', రాజశేఖరుని 'బాలరామాయణం' మొదలైనవి తోలుబొమ్మల నాటకాలుగానే ప్రదర్శింపబడ్డాయని ప్రతీతి. ఈనాటికీ ఈ బొమ్మలాటలను చూడాలంటే తమిళనాడులో చూడొచ్చు. 'బొమ్మలాట్టం' అని ఈ కళారూపాన్ని అక్కడ ఆత్యద్భుతంగా ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రదర్శనాలు కొంతకాలం ఆంధ్రదేశంలోనూ ప్రదర్శింపబడినా, ఇటీవలికాలంలో ఎక్కడా ప్రదర్శించినట్లు లేదు. అందుకు కారణం తోలుబొమ్మలై యుండవచ్చు. తమిళనాడులో తోలుబొమ్మలకంటే ఈ కొయ్య బొమ్మల ప్రదర్శనాలే ఎక్కువ.

గంట భాగవతుల రంగస్థలం వీధిభాగవతుల మాదిరికూడా కాదు. ప్రతి ఇంటి ముందు ప్రదేశమూ వీరికి రంగస్థలమే. పట్టుపక్కల నాలుగు ఇండ్ల ప్రజలే వీరి ప్రేక్షకులు. వీరి ప్రదర్శనకాలంకూడా స్వల్పమే. ఈ బొమ్మలాటల్ని యాచనకే ఎక్కువ వుపయోగించారు. వీరికి ప్రజలిచ్చే పారితోషికం ఎమిటో తెలుసా? బొమ్మలాడించుకునేందుకు వారి దీపస్తంభపు ప్రమిదలో ఒక గంటెడు నూనె పోస్తే చాలు. దాని పోషణకు ఆ ప్రమిదలో ఎవరికి తోచిన కానుకలను వారు వదిలేవారు. గంటెడు చమురుతో తృప్తిపడి ప్రదర్శనలను సాగించేవారు కాబట్టి వీరిని 'గంటిభాగవతు' లనేవారు.

గొల్లభాగవతులు:

కృష్ణుడు గొల్లవాడనే విశ్వాసంకొద్దీ కృష్ణలీలలను, కృష్ణ భాగవతాలను గొల్ల భాగవతులే ప్రదర్శించేవారు. వీరే యాదవులు, యాదవకులానికి గర్వకారకుడైన శ్రీకృష్ణభగవానుడు తమ జాతివాడనే అభిమానంకొద్దీ వీరు వీధి భాగవతాలను ప్రదర్శించేవారు. ప్రథమంలో భక్తికొద్దీ ఈ కళద్వారా పౌరాణిక ప్రచారం జరిగినా కొంతకాలానికి అన్నికళలతో బాటు వీరి భాగవతాలూ యాచనకే ఉపయోగించేవారు. పెళ్ళిళ్ళకూ, ఉత్సవాలకూ, తిరుణాళ్ళకూ, పండుగలకూ, వ్యవసాయ తరుణం అయిన తరువాత తీరుబడిగానూ వీటిని ప్రదర్శించేవారు ఈ భాగవతాలు ఒకే గ్రామంలో వీధి వీధినకూడా ప్రదర్శించేవారు. ఇంటింటా చందాలు వసూలు చేసేవారు. ప్రజలు చందాలతోబాటు దుస్తులు, కిరీటాలుకూడ బహూకరించేవారు. పదిహేను సంవత్సరాల క్రితంవరకూ ఎంతో ప్రచారంలో వున్న వీరి ఈ భాగవతాలు ఈనాడు మన దురదృష్టంకొద్దీ మచ్చుకుకూడ కనబడడంలేదు.

యానాది భాగవతులు :

కూచిపూడి భాగవతుల ప్రభావం అనేక జాతులమీదా, కులాలమీదా పడింది. ఒక నాటక సమాజాన్ని చూచి అనేక సమాజాలు ఉద్భవించినట్లు కులాలవారీగా కూడా భాగవతులు తయారయ్యారు. యానాదులు ఎక్కువగా నెల్లూరు, గుంటూరు జిల్లాలలో వున్నారు. వీరి అసలువృత్తి రాత్రిళ్ళు గ్రామాలను కాపలాకాయడం. వీరిలో కొంతమంది యువకులు ఉత్సాహంతో భాగవతుల జట్టులుగా తయారయ్యారు. యానాది భాగవతుల్లో స్త్రీ పాత్రలు స్త్రీలు, పిల్లలపాత్రలు పిల్లలు. పురుషపాత్రలు భర్తలు ధరిస్తూవుంటారు. దాదాపు జట్టులోని వారందరూ ఏదోఒక వాయిద్యమో, తాళమో, లేక వంతపాట పాడటమో చేస్తూవుంటారు. వీరిలో బెందాళం గవరయ్య, ముతరాజు నర్సయ్య అనే పురుషులూ, చింతపువ్వు మాణిక్యమనీ, పెదమాణిక్యమనీ ఇద్దరు స్త్రీలూ ఆంధ్రదేశంలో ఎంతో పేరు ప్రతిష్ఠలు గడించారు.

ఒకపూట భోజనంపెట్టి
పదిరూపాయలిస్తే చాలు :

ఒకరాత్రి అందరికీ భోజనాలు పెట్టి పదిరూపాయలు ఇస్తే ప్రదర్శనం జరిగిపోతుంది. వీరి ప్రదర్శనాలు అంతకట్టుదిట్టంగా లేకపోయినా ప్రేక్షకుల్నిమాత్రం తృప్తిపరచాయి. వీరు ప్రదర్శించే భాగవతాలు ఉషాపరిణయం, కృష్ణలీలలు, సావిత్రి, శశిరేఖాపరిణయం మొదలైనవి. వీరి వాయిద్యాలు మద్దెల, తాళాలు, శ్రుతి పక్వమైన హార్మోనియం. ఇక వీరి ముఖాలంకరణకు వాడే రంగులు అరదళం, గంగసింధూరం, కాటుక, దుస్తులు, పూసల కోట్లు వగైరా. ప్రదర్శనకాలం ప్రారంభించిందిమొదలు తెల్లవార్లూ. ఈ మధ్య వీరి ప్రదర్శనాల ప్రభావం చాలా తగ్గింది.

మాల భాగవతులు :

మాలభాగవతులని కొందరు ఆంధ్రదేశంలో అక్కడక్కడా వున్నారు. వీరు హరిజనుల ఇండ్లలో నివాహాలకు భోగఆటలు ఆడేవారు. ,వీరిలో కొంతమంది భాగవతుల జట్లుగా తయారయ్యారు. వీరు ప్రదర్శించే నాటకాలు, ముఖ్యంగా శశి

రేభాపరిణయం, రెండవది చెంచులక్ష్మి. చుక్కలూరి రామనాటకం. మర్రిగుంట రామాయణం మొదలైనవి. వీరి ప్రదర్శనల్లో చెంచులక్ష్మి భాగవతాన్ని ప్రతిభావంతంగా ప్రదర్శించేవారు. మచ్చకు వీరు పాడే పాట

"చెట్టు లెక్కగలవా నరహరి
పుట్ట లెక్కగలవా.
చెట్లనుండీ సన్నబియ్యము
ఏరితెచ్చీ పెట్టగలవా ?"

వీరి భాగవత సాహిత్యం ఈ విధంగా వుండేది. ముఖ్యంగా వీరి భాగవతాలు పల్లెల్లో వ్యవసాయతరుణం ఐపోయిన తరువాత రాత్రి సమయాల్లోనూ. దసరా వుత్సవాల్లోనూ ప్రదర్శిస్తారు.

వెన్నెల నాటకాలు:

పూర్వం ప్రతివైశాఖ పౌర్ణమికీ, ఆరు బయట, నిండు వెన్నెలలో రెండు మూడు రోజులు ఈ వెన్నెలనాటకాలు ఆడుతూ వుండేవారు. వీటిని 'రాసనాటకా' లనేవారు. 1916-17 సంవత్సరాల ప్రాంతంలో బందరులో కానుకొల్లు నరసింహంగారు బృందావనపురం ప్రాంతంలో ఈ రాసలీలలు ప్రదర్శించటంవల్లనే ఆ ప్రదేశానికి బృందావనపుర మని పేరు వచ్చినది. భజనగీతాలమాదిరి భాగవతంలోని భ్రమరగీతాలను పాడేవారు.

ఈ ప్రదర్శనాలకు-వెన్నెలలో, ఇసుక దిబ్బలమీద తులసికొమ్మలు పాతి, ఆ తులసికొమ్మల చాటున, గోపికాలీలలు ప్రదర్శించేవారు. తులసి అంటే బృంద. అందుకే వాటిని బృందావనగీతా లనేవారు. ఇందులోని నటీ, నటులు ఆయా కుటుంబాలకు సంబంధించిన బాలబాలికలు. బాలులందరూ కృష్ణులూ, బాలికలందరూ గోపికలూ. అందరూ ఒకేరకమైన రంగుల బట్టలు ధరించేవారు.

జిడకోలాటాలు,
వాటి కోలాహలం:

ఆ రోజుల్లో బందరులో పెద్దపెద్ద పందిళ్ళలో జిడకోలాటాలు వేసేవారు. ఆ కోలాటాలు వేసేవారందరూ రాసనాటకాలకు ప్రేక్షకులుగాను, వారి పిల్లలు నటీనటులుగాను వుండేవారు.

ప్రదర్శనం ఒక ఎత్తుదిబ్బమీద జరుగుతూ వుంటే చుట్టూ ఎత్తుగా గ్యాలరీమాదిరి ఇసుకతిన్నెలను ఏర్పాటుచేసేవారు.

పాటలకు పాటలు,
భజనలకు భజనలు:

ఒక ప్రక్క తంబురా, హార్మోనియం, మద్దెల మొదలైన వాటి శ్రుతితో భజనలకు సంబంధించిన భజనపరులు గోపికాగీతాలను పాడుతూవుంటే బాలనటులందరూ రాధాకృష్ణులుగానూ, కృష్ణులూ గోపికలుగాను అభినయిస్తూ వుండేవారు. పాట వచ్చిన పిల్లలు పాటకూడా పాడుతూవుండేవారు. ఈ ప్రదర్శనం చూడడానికి కొంతమంది ప్రేక్షకులు ప్రక్కనున్న చెట్లెక్కి కూర్చునేవారు. ఈ ప్రదర్శనాలకు దాదాపు వెయ్యిమంది వరకూ ప్రేక్షకులు హాజరయ్యేవారు. పీటిని చిలకలపూడి ప్రాంతంలోకూడా ప్రదర్శించేవారు.

వీధినాటక సూత్రధారుని
విశేషత, విలక్షణత:

పూర్వం మన గ్రామాల్లో వీధిభాగవత ప్రదర్శనాల్లోనూ, తోలుబొమ్మల్లోనూ, మరి కొన్ని పౌరాణికనాటకాలలోనూ నాటకానికి ముందు సూత్రధారుడు ప్రవేశించేవాడు. ఈనాటికీ జానపద కళారూపాల్లో సూత్రధారుడు ప్రత్యక్షమౌతూనేవున్నాడు.

ఆరోజుల్లో ప్రదర్శనాలు వీధుల్లో ప్రదర్శింపబడేవి. ప్రేక్షకులు వీడు గంటలకే తెరముందు కూర్చునేవారు. ప్రదర్శనం ప్రారంభించమని వత్తిడి చేసేవారు. ఈ వత్తిడినుంచి తప్పుకోవడానికే, ఈ సూత్రధారుని నాందీప్రస్తావన తెచ్చేవారు. అతడు ప్రదర్శించబోయే ప్రదర్శనాన్నిగూర్చి ప్రజలకు టూకీగా కథ చెప్పేవాడు. తన హాస్యచతురతతో ప్రేక్షకుల్ని అదుపులో తెచ్చేవాడు.

సూత్రధారుని
లక్షణం:

నాటక రచయిత గుణగణాలను, కథావస్తువు విశిష్టతను గురించి విస్పష్టంగా వివరించ గలిగినవాడూ, అంతేగాక రంగస్థలంలోని పాత్రధారులందర్నీ, సిద్ధంచేయ

గలిగినవాడూ. లయ, తాళం, సంగీతవిద్యల్లో ప్రజ్ఞ కలిగినవాడూ, పాత్రల నిర్ణయంలో సహకారీ, అన్నిదేశాల నృత్తభేదాలను ఎరిగినవాడూ సూత్రధారుడని కాళిదాసుని (ఆంధ్ర) శాకుంతలంలో వుదాహరింపబడింది.

నాటకాల్లోనూ, జానపద కళారూపాల్లోనూ విటుడూ, విదూషకుడూ, చేటకుడూ, పీఠమర్దుడూ అనే ఇంకా కొందరు పాత్రధారు లుండేవారు. కాని అందరూ ఒకే నాటకంలో వుండేవారనిమాత్రం చెప్పలేం. ఆయా కథావిధానాలనుబట్టి ఈ పాత్రలు వస్తూవుండేవి.

నాయకునికి నమ్మినసేస్తం
విటుడు :

విటుడు ముఖ్యంగా శృంగారనాయకునికి సహాయంగా వుండేవాడు. నాయకుడు నాయికకోసం అన్వేషించడంలో తగిన సలహాలనిస్తూ, అటు నాయికచర్యలూ, ఇటు నాయకుని చర్యలూ గమనిస్తూ వారిద్దరినీ ఒకేచోట కలిపేటందుకూ, కలిపిన తరువాత వారిమధ్య శృంగారం తొణికిసలాడేటట్లు చమత్కారంగా మాట్లాడడం. వారిద్దరిమధ్య ప్రణయకోపాలను తెప్పించడం. ఇరువురిమధ్యా చేరి చమత్కార సంభాషణలతో ప్రేక్షకుల్ని కడుపుబ్బ నవ్విస్తూ, ధర్మాలనూ, సీతులనూ బోధించడం చేస్తూ వుండేవాడు. ఇలాంటి విటులవల్లనే ఆనాటి ప్రదర్శనసారాంశం ప్రేక్షకులకు చక్కగా అర్థమయ్యేది.

విరహంలో ఉన్నవారిని
దారికితెచ్చే విదూషకుడు :

ఈతని పాత్రకూడ హాస్యంతో కూడుకున్నదే. విరహంతో కూడుకున్న నాయికానాయకులమధ్య వుండి వారిని నవ్విస్తూ, వారిని పరిపైన త్రోవలోకి తీసుకురావడమే విదూషకుని కర్తవ్యం. అంతేకాక ఆనాటి ప్రజలకు అక్షరజ్ఞానం తక్కువ. ప్రదర్శనకారుల భాష, ప్రదర్శనఇతివృత్తం కఠినమైన భాషలో వుండడంవల్ల వాటిని ప్రజలకు అర్థమయ్యే భాషలో తెలిగిస్తూ. ఆయా పాత్రలమధ్య చేరి హాస్యాన్ని గుప్పిస్తూ వుంటాడు ఈ విదూషకుడు.

కలహాలుతీర్చి, కూరిమికూర్చి
చేర్చే చేటుకుడు :

సూత్రధారుడూ, విటుడూ, విదూషకుడూ కాక ఈయన నాలుగవవాడు. ప్రదర్శనాల్లో ఈతని పాత్ర నాయికా నాయకులమధ్య వచ్చే కలహాలను తీర్చడం, నాయిక చెప్పిన విషయాలను నాయకునితో చెప్పడం, నాయకుడు చెప్పిన విషయాలను నాయికకు చెప్పడం! వీరిద్దరిమధ్యా రంగస్థలంపైనే వార్తలు మోస్తూ ఏదోవిధంగా వారిని సమాధానపరిచి, నేర్పుతో ఆ కార్యాన్ని నిర్వహించేవాడు. ఇలా నిర్వహించిన తరువాత నాయికా నాయకులద్వారా పారితోషికం పొందేవాడు. ఈ దృశ్యమంతా ప్రేక్షకులకు కళ్ళకు కట్టినట్లు ప్రదర్శించడంవల్ల ప్రేక్షకులు ఎంతో ఆనందించేవారు. నిత్యజీవితంలో దంపతులమధ్యా, ప్రేమికులమధ్యా జరిగే సంఘటనలే గనుక ఇవి ప్రేక్షకుల నెంతో ఆనందపరిచేవి.

# 5

# కొండలు కొమ్ములు రాతలులు



ఒకే కళలో అనేక కళలు జోడించిన తుల
లేని తోలుబొమ్మలాట - సాహిత్యంతో
సాహిత్యాని కెక్కిన ప్రశస్తి ప్రకాస్తులు-
శాసనాల సుద్దులు-ఆటలాడించే పాటవం-
ఆటగాండ్ల ఊర్లూ పేర్లూ

# తోలు బొమ్మలాటలు

ఆంధ్రదేశంలో ఆబాలగోపాలాన్నీ ఆనందింపజేసి, అన్ని కళారూపాలతో పాటు దీర్ఘకాలం దివ్యంగా వర్ధిల్లిన కళారూపం తోలుబొమ్మలాట.

ఒకే కళలో
అనేక కళల మిలాఖిత్తు:



మన లలితకళలపై ఈ కళ ప్రభావంగంగా వున్నా. లలితకళలు అన్నిటికీఅన్నీ ఈ ప్రదర్శనంలో మూర్తీభవించి వున్నాయి. కావలసినంత కవిత్వం వుంది. సాహిత్యం వుంది. సంగీతంవుంది. శిల్పం, చిత్రకళలు తొణికిసలాడుతూ వుంటాయి. కడుపుబ్బ నవ్వించే హాస్యరసఘట్టాలున్నాయి. లలిత కళలన్నిటిలోనూ ఈ ప్రదర్శనం ఎంతో కిన్నులపండుగా వుంటుంది.

బొమ్మలతో చక్కగా నాట్యం త్రొక్కిస్తారు. ఆ పైన వెనుకనుంచి సూత్రధారుడు ఎంతో చాకచక్యంగా పాత్రాభినయం చేయిస్తూ వుంటాడు. నాటక ప్రదర్శనానికి ఎన్ని హంగు లుండాలో దాదాపు అన్ని హంగులూ బొమ్మలాటలోనూ వుండాలి. ఇన్ని హంగుల్నీ వారు ఎక్కడనుంచి సమకూర్చుకొంటారు? కిరాయి ఇటీ సినుల్ని ఎక్కడనుంచీ దించరు. జట్టు పెద్దలు పురుషపాత్రలు, వారిస్త్రీలు స్త్రీపాత్రలు వహిస్తారు. భర్త శ్రీరాముడుగా వాచికం చెప్పి పాట పాడితే, భార్య సీతగా వాచికంచెప్పి వంత పాడుతుంది. ఇక వారి బిడ్డలు బాలబాలికల పాత్రలకు అభినయాన్నిస్తారు.

ఈ విధంగా ఆయా పాత్రల బొమ్మలు పుచ్చుకుని కార్యక్రమాన్ని దిగ్విజయంగా నడుపుతారు. తెరమీది బొమ్మలు ఎంత పుష్కలంగా నాట్యం త్రొక్కుతూ వుంటాయో, లోపలి భాగంలోవున్న వ్యక్తులుకూడా దాదాపు అంతటి అభినయాన్నీ వ్యక్తంచేస్తూ వుంటారు.

ఈ బొమ్మలాటలు - ఈ తమాషా కళారూపం ఒక్క ఆంధ్రదేశంలోనే కాకుండా పరిసర ప్రాంతాలైన మహారాష్ట్రం, మళయాళం, తమిళం, బెంగాల్ మొదలైన ప్రాంతాల్లోనూ వ్యాపించి వుంది. ఉత్తర దేశంలో 'కట్ పుత్లీ' అవే కొయ్యబొమ్మలాటలూ, దక్షిణ దేశంలో కీలుగుట్టపు బొమ్మలాటలూ, బొమ్మలాట్టం అనబడే కొయ్యబొమ్మలాటలూ ప్రచారంలో వున్నాయి. ఈనాడు మనం చూచే బొమ్మల వస్త్రధారణా, భూషణాలంకార పరిశోధనా చూస్తే - ఈమాదిరి అలంకారం గల నాగరికత తంజావూరు ఆంధ్రరాజుల కాలంలోనిదిగాను, మహారాష్ట్ర రాజులకాలంలోనిదిగాను నిదర్శనాలు కనుపిస్తున్నాయి.



కీలుగుర్రం

తోలుబొమ్మలాటలు ప్రదర్శించేవారు చాలవరకు మరాఠీవారు. వీరిని కన్నడంలో 'కిషేల్లెక్యాత' జాతివారని, తమిళదేశంలో 'కిల్లెక్యాతవా'రని, తెలుగు దేశంలో బొమ్మలాటవారని, చర్మనాటకులని వ్యవహరిస్తున్నారు.

ఆంధ్రదేశంలో ప్రదర్శించే తోలబొమ్మలాటలు మహారాష్ట్రంనుంచి సంక్రమించా యనే చరిత్రాధారా లున్నప్పటికీ, చాళుక్యరాజుల కాలంనాటికే తోలబొమ్మలాట లాడినట్లు భారతం విరాటపర్వంలో వివరించబడింది.

బొమ్మలాటలవారు బెల్గాం, కొల్హాపూర్, సతారా, పూనా, బిజాపూర్ ప్రాంతాలనుండి, పరిపాలకుల జైత్రయాత్రల్లోనూ, ఆయాదేశాలలో వచ్చిన విప్లవోద్యమాల మూలంగానూ వలస వచ్చారు.

శ్రీశైలం శివరాత్రి మహోత్సవాలలో తోలబొమ్మలాటలు ప్రదర్శించినట్లు పండితారాధ్యచరిత్ర పర్వత ప్రకరణంలో పాల్కురికి సోమనాథుడు ఈ విధంగా వివరించాడు.

భారతాదికథల జీరమఱుగుల–నారంగ బొమ్మల నాడించువారు.
గడు నద్భుతంబుగ గంబసూత్రంబు-లడరంగ బొమ్మల నాడించువారు.

అనడాన్నిబట్టి శ్రీశైలం వెళ్ళే ద్రావిడ యాత్రికులతోపాటు పై వలసలు వెళ్ళిన బొమ్మలాటలువారు కూడా వుండి వుండవచ్చు. దీనినిబట్టి ఆంధ్రదేశంలో కొన్ని వందల సంవత్సరాల ముందునుంచే ఈ బొమ్మలాటలు ఆదరింపబడి ప్రజాభిమానం పొందుతూవున్నాయని స్పష్టపడుతూంది.

## 5. తోలుబొమ్మలాటలు

మన వాఙ్మయంలో పాల్కురికి సోమనాధుని కాలంనుండీ తంజావూరు రఘునాధరాయల కాలంవరకూ అనేకమంది కవులు బొమ్మలాటలను పేర్కొన్నారు. "ప్రతిమలాడగ బట్టినయట్లు" అని పల్నాటిచరిత్రలో శ్రీనాథ మహాకవి పేర్కొన్నాడు.

బొమ్మలాటలను గురించి నాచనసోమన వుత్తర హరివంశంలో-

"యంత్రకు డాడించి యవని ద్రోచిన వ్రాలు
బొమ్మల గతి రథపూగములుమ"

అని వివరించాడు. బొమ్మలాటల వారు గోన బుద్ధారెడ్డి రామాయణంలోని ద్విపదలను పాడేవా రని సురవరం ప్రతాపరెడ్డిగారు 'సాంఘిక చరిత్ర'లో వివరించారు. భాస్కర శతకాన్ని వ్రాసిందెప్పుడో తెలియదుగాని, అతని కాలంలో తోలుబొమ్మలాటలు వ్యాప్తిలో వున్నట్లు భాస్కరశతకంలో ఈ క్రింది పద్యం ద్వారా తెలియవస్తూంది.

"ఇంచుక వేర్పు చాలక విహీనత జెందిన వాకవిత్వముం
మించు వహించె నీకతన మిక్కిలి; యెట్లన తోలుబొమ్మలన్
మంచివివేకి వాని తెరమాటునమండి ప్రవర్తరీతి నా
డించివ నాడవే? జనుల డెందము నింవవె ప్రీతి భాస్కరా!"

### శాసనాలు, తోలుబొమ్మలు :

తోలుబొమ్మలాటలను గురించి అనేక శాసనాల్లో వుదాహరింపబడి వుంది. బొమ్మలాట వారిని గురించి చాగంటి శేషయ్యగారు ఒక శాసనాన్ని బయట పెట్టారు. కడపజిల్లా కమలాపురం తాలూకా చిడిపిరాల అన్న గ్రామాన్ని చంద్రయ్యా, బొమ్మలాట అమృతకవీ అనే వారిద్దరూ తెరనాటకా లాడడానికి పెదచిట్టెయ్య అనే ఆయనకు దానం ఇచ్చినట్లు శాసనంలో వుంది.

### ముక్కామల భూదానశాసనం :

అలాగే క్రీ॥ శ॥ 1208 లో దుర్జయాన్వయులైన విప్పరుల కొండప, గుండప నాయకుల ముక్కామల భూదాన శాసనంలో, సూత్రధారి బోమలయ అనే

ఆయన ప్రతిగృహీతగా పేర్కొనబడ్డారు. అతను బొమ్మలాటవాడే కావచ్చని యస్వీ జోగారావుగారు వ్రాస్తున్నారు.

గూడూరుశాసనం :

ఇంకా కాకతీయులకు సంబంధించిన తెలంగాణాశాసనాలలో వరంగల్ జిల్లా గూడూరుశాసనం ఒకటి. ఈ బొమ్మలాట సమాచారాన్ని తెలియజేస్తూంది. శాసనం చివరిభాగంలో సూత్రధారి కొమ్మోజనహా బరహా అనివుంది. అంటే సూత్రధారి కొమ్మోజు వ్రాసినదన్న మాట. ఇది తెలుగుశాసనం.

అలాగే పానుగల్లు శాసనంలో సూత్రధారి బ్రహ్మోజు బెసిన సూత్ర ధారుల కాస్యపల్లిని బానుగంటి దళవ్యత్తి పుడపండ్లు 20. భీమసముద్రమువెనుక పుడమఱుతరు అని వుంది.

కొమ్మోజు,
బ్రమ్మోజు :

పై సూత్రధారులు-కొమ్మోజు, బ్రమ్మోజు అనే పేర్లనుబట్టి బొమ్మలాటవారని తెలుసుకోవచ్చు. అంతేగాక పై పేరులనుబట్టి వీరు తప్పక మహారాష్ట్రులే ఐవుండవచ్చు.

అంతేగాక వా రుపయోగించిన మాటలు బరహా, బెరసిన అన్నవి కన్నడభాషకు చెందినవి. దీనినిబట్టి మనకు విశదమయ్యే దేమంటే మరాటీ బొమ్మ లాటవారు దేశదేశాలూ తిరిగారు. అలాగే వీరు కన్నడదేశంకూడా సంచారం చేశారు. అంతేగాక మహారాష్ట్రిపు సరిహద్దు నున్నదేశం కన్నడదేశం. అందువల్ల వీరికి ఆబరహా, బెరసిన అనే కన్నడమాటలుకూడ వచ్చివుండవచ్చు. దేశదిమ్మరు లైనవారికి ఆయా భాషలు వంటబట్టడం సహజమే.

అరెకాపులు,
గంధోళీలు :

ఈ బొమ్మలాటలాడేవారిని అరెకాపు లంటారు. ఈ అరెకాపులు ఈనాటికీ మహా రాష్ట్రి దేశంలో వున్నారు. అక్కడ వారి పేరు గంధోళీ లంటారు. ఈనాడు



తెలుగుదేశపు బొమ్మలాటల వారం దరూ ఒకనాడు మహారాష్ట్రులే. ఈ నాటికీ బొమ్మలాటలవారు బయట ఎంత తెలుగు మాట్లాడినా ఇంట్లో మాత్రం మరాఠీభాషనే మాట్లాడుతూవుంటారు. అంతేగాక మరాఠీ బొమ్మలాటలో వుండే హాస్య పాత్రధారి గంధోలి గాడికీ, మన జుట్టుపోలిగాడికీ చాలా దగ్గరపోలిక వుంది. ఒకేరకమైన హాస్యమూ వేషధారణలో పోలికలూ వున్నాయి.

రకరకాల

జాతులు, పేర్లు:

కాని దక్షిణదేశంలోని బొమ్మలాట ప్రదర్శకులందరూ మహారాష్ట్రజాతికి సంబంధించినవారని చెప్పలేము. మైసూరు ప్రాంతంలో వూరు జంగాలు, బొంబయి, మైసూరు సరిహద్దుప్రాంతాల్లో పంతులువారు, మధుర తంజావూరు ప్రాంతాలలో కుత్తాడీ లనే గవర జాతివారు, బళ్ళారి జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో బలిజలు, విశాఖ జిల్లాలో తొలి బొందిలి తెగలవారు, గోదావరి మండలంలో తెలుగు గొల్లలూ, గుంపు తెగలవారు, జంగాలు మొదలైన వారు కూడ వున్నారు.



బొమ్మలాటలవారి

ఇండ్లు, కేంద్రాలు:

ఈ బొమ్మలాటల కుటుంబాలవారి నివాసాలు ఆంధ్రదేశంలో విశాఖపట్టణంజిల్లాలో సర్వసిద్ధి, శృంగవరపుకోట, కశింకోట ఆగ్రహారం, గోదావరిజిల్లాలో మండపేట, అంగర, ఎలమంచిలి, తణుకు, నెల్లూరుజిల్లాలో పింగరాయకొండ, కర్నూలుజిల్లాలో రాయదుర్గం, బెళగల్లు, అనంతపురంజిల్లాలో కదమలకుంట, ఆవులన్న, జరుట్ల రామపురం, బళ్ళారిజిల్లా సొండూరు, తోరణగల్లు, బొమ్మలాటపల్లి

మొదలైనవి. ఆ ప్రాంతాలలో బొమ్మలాటలవారు ఎక్కువగా వున్నారు. కాకినాడ వద్ద మాధవపట్నంలో మాత్రం ఈ కుటుంబాలవారు చాలామంది వున్నారు.

### ఫక్తు బొమ్మలాటల పల్లి

### బొమ్మలాటపల్లి :

బొమ్మలాట లాడేవారు ఎక్కువమంది వుండడంవల్లనే ఈ గ్రామానికి బొమ్మలాట పల్లి అనే పేరు వచ్చింది. బొమ్మలాటపల్లి బళ్ళారిజిల్లాకు చెందిన గ్రామం.

### కులగోత్రాలు-

### కొరికొరి ఆడే

### కథలు, గాథలు :

ఇక్కడున్న బొమ్మలాటవారిలో మహారాష్ట్రీవాసనలు చాలా వున్నాయి. వీరిని బొందిలి క్షత్రియు లంటారు. గంధోలి అనే శబ్దవికృతే బొందిలీ అని కూడా వాడుకవుంది. ఈనాటికీ వీరు బొమ్మలాటల్ని ప్రదర్శిస్తున్నారు.

ముఖ్యంగా వీరు ప్రదర్శించే కథా ఇతివృత్తాలు భారత రామాయణ గాథలకు సంబంధించినవి. లంకాదహనం, మైరావణ చరిత్ర, ఇంద్రజిత్తువధ, యయాతికథ, కీచకవధ, దుశ్శాసనకథ, ప్రహ్లాదచరిత్ర, రంగనాథరామాయణం మొదలైనవే కాక, దేశీయ కథలైన దేశింగురాజుకథ, పల్నాటి వీర చరిత్ర, కరెభంటనకథ, కుమార రాముని కథలనుకూడ ప్రదర్శిస్తూ వుంటారు.



### బొమ్మలాటల సాహిత్యం, రామనాటకం :

తోలుబొమ్మల ఆటలు ఆడేవారి సాహిత్యమంటూ మనకు ఈనాడు ఏదీ లభ్యంకాదు. కాని వారు యక్షగానాలనే బొమ్మలాట సాహిత్యంగా కూడా ఉపయోగించుకున్నారు. క్రీస్తుశకం 1850 ప్రాం

తాల్లో గుంజాంజిల్లా గుజ్జువాడనివాసి మరింగంటి భట్టరు రామానుజాచార్యుల శ్రీరామ నాటకం బొమ్మలాటగా ప్రసిద్ధిజెందింది. ఇందులో కథ ముఖ్యంగా లక్ష్మణ మూర్ఛ. ఇందులోని పాటలూ, పద్యాలూ, దరువులూ మొదలైనవి మాధవ పట్నం బొమ్మలాటవారి లక్ష్మణమూర్ఛలో కనబడుతాయి. భట్టరు రామానుజా చార్యులు వ్రాపిన తాళపత్రప్రతి చెన్నపురి ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో వుంది.

బాణాసుర నాటకం:

1893 లో కోట వెంకటప్పయ్య శాస్త్రిగారనే ఆయన బాణాసుర నాటకాన్ని రచించాడు వీరి నివాసస్థలం పర్లాకిమిడికి దగ్గరలో వున్న పాత పట్నం గ్రామం. ఆయన ఆ నాటకానికి పీఠిక వ్రాస్తూ "ఈ గేయ ప్రబంధము చర్మ విగ్రహములచేత ఆడించుటకును, వేషములు ధరించి నాటకమాడుటకును అనుకూలముగ నుండునట్లు రచింపుడని నామిత్రులు కొందరు ప్రోత్సాహపఱచినందున నే నిందుల కియ్యకొంటి"నని వ్రాశారు. దీనిని 1891 లో ఇండియన్ లా ప్రెస్‌లో ముద్రించారు. వీరు బాణాసుర నాటకంలో తోలుబొమ్మల జుట్టుపోలిగాడి మాటరి 'లొట్టకిత్తడు', 'రత్నాల పోలిగాడు' అనే రెండు హాస్యపాత్రల్ని సృష్టించారు.

సంత వేలూరు

కుశలవుల నాటకం:

అటుగే పీఠె సుబ్బరాజు, గాజులపెండ్లూరి శేషగిరిరాజు అనే ఇరువురు కవులు కలిసి సంత వేలూరు కుశలవుల నాటకాన్ని, ఆరు రాత్రిళ్ళు ప్రదర్శించడానికి అనువుగా, వ్రాశారు. దీనిని బొమ్మలాటగాను, వీధి నాటకంగాను, యక్షగానంగా కూడ ప్రదర్శించేవారట. 'బొమ్మలాట హాస్య నాటక'మనే కేతిగానిపెళ్ళి ఇతి వృత్తంగా గల తాళపత్ర నాటకం మద్రాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో వుంది.

తోలుబొమ్మల బమ్మలు.

వాని ఎమ్మెలూ, పనితనం:

తోలుబొమ్మల్ని ఎక్కడో మార్కెట్లల్లో కొనుక్కురాడు. ఈ బొమ్మలను తయారు చేసే చిత్రకారులు వారి వారి దగ్గరలోనే వుంటారు. ఎప్పుడు బొమ్మ లివుచ మనుకుంటే అప్పుడు అప్పటికప్పుడు తయారు చేసుకుంటారు. ఈ బొమ్మలు మేకచర్మంతోనూ, జింక చర్మంతోనూ, దుప్పి చర్మంతోనూ తయారుచేస్తారు.

పాత్రలకుతగ్గ
సరకుసరం జామాలు :

బొమ్మలాట కథా విధానంలో వచ్చే ఉదాత్తమైన పాత్రలన్నింటికీ రాముడు, కృష్ణుడు, విష్ణువు, ఇంద్రుడు, దేవతలు, సీత, సావిత్రి, ద్రౌపది మొదలైన పాత్రలన్నింటికీ జింక చర్మాన్ని ఉపయోగిస్తారు. జింక చర్మాన్ని పూజా సమయాలలో ఎంత పవిత్రంగా వుపయోగిస్తామో, అలాగే వారుకూడా ఆ చర్మాన్ని ఎంతో పవిత్రంగా ఎంచుకుంటారు. రాక్షస పాత్రలకు, దుష్ట పాత్రలకు ఇంకా మిగిలిన చిల్లర పాత్రలకు మేకచర్మాన్ని వుపయోగిస్తారు. ఈ విధంగా పాత్రల పవిత్రతనుబట్టి చర్మాలను వుపయోగిస్తారు.

బొమ్మలతయారీ-
బహుభంగులు :

పైన వుదాహరించిన చర్మాలను పేకరించి చక్కగా శుద్ధిచేసి, చర్మంలో వున్న దుర్వాసననంతటినీ పోగొట్టి, వారికి కావలసిన బొమ్మల సైజుకు చక్కగా గీచిగీసి దానిని సొంపుగా కత్తిరించి చిత్ర విచిత్రమైన రంగులను అద్దుతారు. రంగులు వేసిన తరువాత ఆ బొమ్మలో జీవం వుట్టిపడుతూ వుంటుంది. ఈ రంగుల్ని అద్దడంలో కూడా పాత్ర ఔచిత్యాన్నిబట్టే రంగుల్ని చిత్రిస్తారు. ప్రథమ, మధ్యమ, వుత్తమ పురుషలక్షణాలతోనూ, పద్మిని, చిత్తిని, శంకిని మొదలైన నాయికీ, నాయకులకుండే భేదాను రంగుల్లో చిత్రిస్తారు.

ముఖ్యపాత్రలు అంటే ప్రదర్శనంలో చివరంటా వచ్చే పాత్రలు. ఆయా రంగాలలో ఘట్టాలననుసరించి ఒకే పాత్ర నాలుగు రకాలుగా తయారు చేసుకుంటారు. వుదాహరణకు-బాల్యంలో రాముడు, అరణ్యంలో రాముడు, యుద్ధంలో రాముడు, పట్టాభిరాముడు. ఈ విధంగా ఆయా దశల ననుసరించి చిత్రాలను తయారుచేసుకుంటారు.

హంగులు, సజ్జు, సరంజామా,
పరికరాలు :

ఇక ప్రదర్శనానికి కావలసిన పరికరాలను, మిగిలిన హంగు లన్నిటినీ కూడ తయారు చేసుకుంటారు.రథాలు, గుఱ్ఱాలు, అంబులు, బాణాలు, గదలు, ఈటెలు,

సైన్యం మొదలైన వాటినన్నిటినీ కూడ తయారు చేసుకుని ప్రదర్శనం రోజున వివరంగా విడదీసి ప్రదర్శన గమనాన్నిబట్టి ఈ బొమ్మలన్నిటినీ సక్రమంగా, సిద్ధంగా అమర్చిపెట్టుకుని, ఒక బొమ్మ తరువాత మరొక బొమ్మను తెరమీదికి ఎక్కించి కథను ముందుకు నడుపుతారు. ఈ బొమ్మల్నిగాని, పరికరాలను గాని విడిగా చూస్తే ఏదో తోళ్ళముక్కల్లాగ కనిపిస్తాయి. వీటి నిజమైన అందం ఆముదపు దీపాల వెలుగులో తెరమీదే చూడాలి. ఎంతో రమణీయంగా వుంటాయి. కష్టమో, నష్టమో పడి ఒక్కసారి ఈ బొమ్మల్ని తయారుచేసుకుంటే ఇంక అవి 20 సంవత్సరాల వరకూ చెక్కుచెదరకుండా వుంటాయి. ఒకవేళ మధ్య మధ్య కొన్ని బొమ్మలు శిథిలమైతేగియితే వాటిని అప్పటికప్పుడు పూర్తి చేసుకుంటారు. ఈ బొమ్మల్ని అన్నిటికన్నా పెద్ద సైజు బొమ్మకు తగినంత వెడల్పూ, పొడవూ గల మేదర పెట్టెల్లో అమరుస్తారు. ఒకో ప్రదర్శనానికి ఒక్కొక్క పెట్టెను వుంచుకుంటారు.

### ఆటలకు అనువుగా
### అప్పటప్పటి యేర్పాట్లు :

ఈ బొమ్మలాట ప్రదర్శకులు ఒక గ్రామంనుంచి మరో గ్రామానికి బండ్లమీద ప్రయాణం చేస్తారు. ఒక్కొక్క దళానికి ఒంటిగాని, రెండుగాని బండ్లు వుంటాయి. ఒక బండిమీద సామాన్లు, రెండవ బండిమీద మనుషులు ప్రయాణం చేస్తారు.

గ్రామంలో ప్రవేశించి పెద్దన్న, పిన్నల్ని కలుసుకుని పరిచయం చేసుకుంటారు. అందరూ కూర్చోవడానికి అనువుగా వున్న బహిరంగస్థలంలో పందిరి ప్రారంభించి, మూడు ప్రక్కలా మూయబడి ఒక ప్రక్కన తెరకట్టడానికి వీలుగా పందిరి వేస్తారు. ఈ పందిరి కొంచెం ముందుకు వాలివుండేటట్లు కడతారు. ఇలా కట్టడంవల్ల వారు ఆడించే బొమ్మలు జారిపోకుండా వుంటాయి. పందిరి లోపలి భాగంలో వారి మొత్తం సామగ్రీ, పిల్లలూ, భార్యలూ - సంసారమంతా అందులోనే వున్నదా అనిపిస్తుంది. వెనుక ప్రక్కకూడా మూతతో అందరూ లోపలే వుంటారు. లోపలి ప్రక్క తెరను ఆనుకుని ఒక పెద్ద బల్లను వేస్తారు.

వరుసగా ఆముదపుదీపాలను అమరుస్తారు. ఈనాడు కొందరు పెట్రో మాక్సులైట్లను వాడుతున్నారు. కాంతి తగ్గకుండా ఎప్పుడూ ఒకరు ఆముదపు దీపాల ఒత్తులు ఎగదోస్తూ, కొరతబడ్డ ఆమువాన్ని పూర్తిచేస్తూ వుంటాడు. దీపాల కాంతి తగ్గితే బొమ్మల అందచందాలు తగ్గుతాయి.

## ప్రదర్శన ప్రారంభం.

### తెరమీద బొమ్మలు :

ప్రదర్శనం ప్రారంభించే రోజున 'ఈ రాత్రికి బొమ్మలాటవుందహో' అని చాటింపు ద్వారాగాని. ఇంటింటికీ వెళ్ళి ఖుద్దున చెప్పడంద్వారాగాని అందరికీ ఈ వర్తమానం తెలియజేయబడుతుంది.

బొమ్మలాటకు తెర సిద్ధంచేసిన తరువాత ప్రప్రథమంగా విఘ్నేశ్వరుని బొమ్మను తెరకు మధ్యగా ఎక్కించి వుంచుతారు. ఒక ప్రక్క-మాత్రం దిష్టి బొమ్మ నొడానిని. రెండవ ప్రక్క జుట్టుపోలిగాణ్ణి ఎక్కించి వుంచుతారు.



తోలుబొమ్మల్ని తెరమీద ఆడించడానికి వీలుగా ఒక వెదురుబద్దను బొమ్మకు మధ్య భాగంలో కడతారు. బొమ్మను ఆడించాలంటే ఈ బద్దే ఆధార. బొమ్మను ఆడించే సమయంలో చేతిని తెరమీదకు ఏమాత్రం రానీయరు. ఒకవేళ వస్తే మనిషి బొమ్మ కనబడుతుంది. అందువల్ల దూరంగా వుండి ఒక చేతిలో బొమ్మను బట్టి రెండవ చేతిలో మరో చిన్న కొంకిగల బద్దను పట్టుకుని బొమ్మయొక్క చేతులకు తగిలించి, సంభాషణల ప్రకారం బొమ్మల్ని కదిలిస్తూ వుంటారు. కాళ్ళు మాత్రం ఎటుబడితే అటు కదిలేలాగా మన దసరా వుత్సవాల్లో పిల్లలు పుచ్చుకునే కోతి బొమ్మమాదిరి కీలు కీలువద్దా రంధ్రాలుపొడిచి ఎటుపడితే అటు తిరగడానికి వీలుగా అమరుస్తారు. ఒకవేళ తెరమీద బొమ్మ కొంచెంసేపు చలనంలేకుండా వుంచాలంటే ఒక తుమ్మముల్లుతో నాటువేసి బొమ్మను తెరమీద నిలబెడతారు. ఒక్కొక్కసారి ఒకే వ్యక్తి రెండేసి బొమ్మల్నికూడా ఆడిస్తూ వుంటాడు.

విఘ్న వినాశకంగా
విఘ్నేశ్వరపూజ :

ప్రదర్శన ప్రారంభంలో తోడితాగంతో కూడిన మంగళహారతి పాడుతారు. ఏ విఘ్నాలూ కలుగకుండా విఘ్నేశ్వరుని ప్రార్థిస్తారు. తరువాత సభావర్ణనచేస్తూ పాట పాడుతారు. "అందరూ వచ్చారా? కరణంగారొచ్చారా? మున్సిఫ్‌గారొచ్చారా? పండితులంతా వచ్చారా? పెద్ద రెడ్డి వచ్చాడా?" అంటూ హెచ్చరించి ప్రేక్షకుల్ని అదుపులో పెట్టుకుంటారు.

సర్వసిద్ధంగా
హంగుదారులు :

పాటపాడేవారు, హార్మోనియం వాయించేవారూ, తాళంవేసేవారూ, మద్దెలకొట్టే వారూ, అదనపు మ్రోతల్నిచ్చేవారూ, వంతపాటలు పాడేవారూ అందరూ లోపలే కూర్చుంటారు. పిల్లల పడకలూ వుయ్యాలలూ, లన్నీ నేపథ్యంలోనే అమర్చుకుంటారు.

ఆటకుతగ్గ పాటలు,
పాటకుతగ్గ మోతలు :

వీరికి హార్మోనియం కృతిగా వుంటుంది. తాళాలుంటాయి. హార్మోనియం, తాళాలు, మద్దెలవాయించే వ్యక్తులుకూడా వెనుక వంతపాట పాడుతూ వుంటారు. ఇంతే కాదు. వాళ్ళ కాళ్ళక్రింద బిల్లచెక్కలుంటాయి. ఆయా ఘట్టాలననుసరించి ఈ చెక్కలను త్రొక్కుతూ వుంటారు. ముఖ్యంగా రథాలు, గుఱ్ఱాలు, పరుగు లెత్తేటప్పుడూ, యుద్ధఘట్టాలలోనూ ఈ చెక్కలు టకటకా త్రొక్కుతూ వుంటే బలే రసవత్తరంగా వుంటుంది.

అంతేగాక నగారామ్రోతలకు ఖాళీ డబ్బాలు వుపయోగిస్తారు. పిడుగులు పడ్డట్టూ, వురుములు వురిమినట్లు డబ్బాలను మ్రోగిస్తారు. ఈ విధంగా వారు ప్రదర్శనాన్ని జయప్రదంగా రక్తికట్టిస్తారు. ఆట ఆడినంతసేపూ పరస్పర సహకారం వారిలో వినబడుతుంది. అందువల్లనే వారి ప్రదర్శనాలు అంత బాగా రక్తి కడతాయి

### అట్టగాండ్లా
### అష్టావధానం :

ముఖ్యంగా ఏ వ్యక్తి బొమ్మల్ని ఆడిస్తాడో ఆ వ్యక్తి నోటితో పాట పాడుతూ పాటకు తగినవిధంగా బొమ్మను ఆడిస్తాడు. సంభాషణలకు కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తాడు. ఇక రెండు బొమ్మల్ని ఆడించే సమయంలో బొమ్మలమధ్య వచ్చే పోరాటంలో. రెండు బొమ్మల్ని రెండు చేతులతో కొటిస్తాడు. అలా కొట్టడంలో సమయానికి క్రింద బల్ల చెక్కకు టకామని త్రొక్కుతాడు. నిజంగా పాత్రలు కొట్టుకున్నట్లే వుంటుంది. ఈ సమయంలో ఇతర వంతదారులు కావలసిన అల్లరి, హంగామా చేస్తారు. ఒక యుద్ధఘట్టం వచ్చిందంటే, డోళ్ళా, డబ్బాలూ, ఈలలూ, కేకలతో వానకురిసి వెలిసినట్లు చేస్తారు. ఈ విధంగా వారు ప్రదర్శనను సమిష్టి కృషితో జయప్రదంగా నిర్వహించి ప్రేక్షకుల్ని మెప్పిస్తారు.

### బొమ్మలాటకు
### బ్రహ్మ :

నాటకానికి దర్శకుడు ఎంత అవసరమో అలాగే ఈ బొమ్మలాటలకు బ్రహ్మలాంటి వాడు సూత్రధారుడు. తెరలోపలనుండీ ప్రదర్శనాన్ని వరుసక్రమంలో నడిపే బాధ్యతలన్నీ ఈతనిమీదే వుంటాయి. మిగతావారందరూ ఈతనిని అనుసరిస్తూ వుంటారు. ఈ సూత్రధారుడు సంస్కృత రూపకాలలోనూ, తెలుగు భాగవతాలలోనూ, యక్షగానాలలోనూ, నాటకాలలోనూ కూడా ప్రాముఖ్యం వహిస్తూ వచ్చాడు.

బొమ్మలాట సూత్రధారుడు కథను చాలా వివరంగానూ, చాతుర్యంగానూ చెబుతాడు. ప్రథమంలో కొన్ని శ్లోకాలు చదివి. ఆ శ్లోకాల అర్థాన్ని మరలా తెలుగులో అందరికీ అర్థమయ్యే స్థాయిలో ఒప్పజెబుతాడు. కొన్ని పద్యాలనూ, గేయాలనూ అతిమృదుమధురంగా ఇతను పాడితే మిగిలినవారు, పై శ్రుతిలో ఆలాపిస్తారు. వచనాన్నికూడా రాగయుక్తంగా చదువుతారు ఆయా పాత్రల బాణీ త్యానికి భంగం లేకుండా గొంతులు మారుస్తూ వుంటారు. సూత్రధారుడు అడుగడుగునా ప్రేక్షకులయొక్క ఆదరణను గమనించి, కథను సాగించి విజయం పొందుతాడు.

ప్రదర్శనంలో
ప్రేక్షకుల హడావిడి,
ఉత్సాహము, ఉబలాటము :

తోలుబొమ్మలాట ప్రదర్శిస్తున్నారని తెలిస్తే చాలు, గ్రామం చుట్టుప్రక్కల ఉన్న ప్రజలు-పిల్లలూ, స్త్రీలూ అందరూ హెచ్చు తగ్గుల భేదాలు లేకుండా ఒకరికంటే ఒకరు ముందువచ్చి కూర్చుంటారు. కథా ప్రారంభంనుండి ఆసాంతం వరకూ రెప్ప వాల్చకుండా చూస్తూ కూర్చుంటారు. ప్రతి ఘట్టంలోనూ వారు కదలిపోతారు. హాస్యఘట్టాలలో ఎంతగా పగలబడి నవ్వుతారో అలాగే కష్టాలతో కూడుకున్న ఘట్టాల్లో కళ్ళవెంట నీరు కారుస్తారు. ఇక దౌర్జన్య ఘట్టాలలోనూ, దుర్మార్గపు సన్నివేశాలలోనూ, ఆయా పాత్రలమీద పళ్ళు పటపటా కొరుకుతారు. ఈ విధంగా పండితుల మొదలు పామరులవరకు ఆబాలగోపాలం ఆనందంలో మునిగిపోతారు.

జుట్టుపోలిగాడు,
బంగారక్క :

ఈ బొమ్మలాట ప్రదర్శనాన్ని ఇంత ఆపేక్షగా ప్రజలు చూడడానికి కారణం లేకపోలేదు. తెలుగు నాట బొమ్మల ప్రదర్శనాలలో విచిత్రమైన హాస్య పాత్రలను చూపుతారు. ఈ పాత్రలు కథా ప్రారంభం నుండి కథాంతంవరకూ అడుగడుగునా కథా గమనంతో ఒక ఘట్టం అయిన తరువాత రెండవఘట్టం ప్రారంభమయ్యే వ్యవధిలో ప్రత్యక్షమౌతూ వుంటాయి. ఆ పాత్రలే జుట్టుపోలిగాడు, బంగారక్కలు రెండు పాత్రలూ. హాస్యంద్వారా. దీర్ఘకాలం ప్రదర్శించే ప్రదర్శనంలో మధ్య, మధ్య వారిని కడుపుబ్బ నవ్వించి నిద్రమత్తు వదలగొడుతూ వుంటాయి. ఈ పాత్రల హాస్యం బహుమోజుగా వుంటుంది. నవ్వుతో కడుపు చెక్కలయ్యే పనులు ఈ బొమ్మలతో చేయిస్తారు. సమాజంలో వున్న లోపాలను, ఈ బొమ్మలను పురికగా పెట్టుకుని దుయ్యగిస్తుంటారు. మధ్యమధ్య వినుస్లు వినురుతూ వుంటారు.

అల్లాటప్పగాడు :

తోలుబొమ్మలాటల్లో హాస్యం ఎంతవరకెళ్ళిందో అల్లాటప్పగాడిని గురించి తెలుసుకుంటే బోధపడుతుంది. జుట్టుపోలిగాడు, బంగారక్కకాక వీడు మూడవవాడు.

వీడి పాత్ర ఎటువంటిదంటే 'తాడెక్కేవాడుంటే వాడి తలతన్నేవాడుంటా'డనే సామెత ప్రకారంపై రెండు పాత్రలనూ తలతన్నేవాడు ఈ అల్లాటప్పగాడు. ప్రదర్శనంలో బంగారక్కను గడసరి పెండ్లాంగా సృష్టిస్తారు. ఈమెకు, పోలిగాడికి నిరంతరం కయ్యం నడుస్తూ వుంటుంది. కాసేపు రెండు పాత్రలూ అతి విచిత్రంగా అసభ్యశృంగారాన్ని అభినయిస్తాయి. కొంచెంసేపు పోట్లాట, మరల రాజీ, ఇంతలో పోలిగాడి అంతర్ధానం. ఈ సమయంలో అల్లాటప్పగాడు బంగారక్క దగ్గర ప్రత్యక్షమౌతాడు. బంగారక్కకు, అల్లాటప్పకు సంబంధాన్ని కుదురుస్తాడు. రెండు పాత్రలూ మంచి శృంగారపపుట్టులో వుండగా మరో పాత్ర ప్రవేశిస్తుంది. అది కేతిగాని పాత్ర.

కేతిగాడు :

కేతిగాడి పాత్ర అతి విచిత్రమైంది. అన్ని బొమ్మలకన్నా కేతిగాని బొమ్మ చిన్నది. ఎక్కడ బడితే అక్కడ, ఎప్పుడు బడితే అప్పుడు పానకంలో పుల్ల లాగా ఒక అడుగుచోటు తెరమీద వుంటే చాలు హఠాత్తుగా ప్రవేశిస్తాడు. శృంగార ఘట్టంలో వున్న అల్లాటప్పాగాణ్ణి టకీమని ఒక్కదెబ్బ కొడతాడు కేతిగాడు. వెంటనే అంతర్ధానమౌతాడు అల్లాటప్పా. ఇంకేముంది కేతిగాడు బంగారక్కను ఏడిపిస్తాడు. ఇలాంటి ఘట్టాలు ప్రదర్శనంలో వచ్చే వ్యవధిని కమ్మివేస్తూ వుంటాయి. చాలా మంది ప్రేక్షకులు కథకంటే హాస్య పాత్రల ప్రవేశంకొరకే ఎదురుచూస్తూ వుంటారు. అందు వల్లనే ప్రదర్శనం తెల్లవార్లూ ప్రదర్శించినా విసుగుజెందరు.



కేతిగాడు–బంగారక్క

వానలు రాకపోతే

వాటుమైన కిటుకు :

గ్రామాలో ముఖ్యంగా వ్యవసాయతరుణం అయిన తరువాత ఈ బొమ్మ లాటల ప్రదర్శనాలు జరుగుతూ వుంటాయి. బొమ్మలాటల్ని ప్రదర్శించడంలో జానపదులకు కొన్ని నమ్మకాలు కూడా వున్నాయి. వుత్తరగోగ్రహణం కథ చెప్పితే వర్షాలు కురుస్తాయని వర్షాలేని ప్రాంతంలో ఈ ఆటలను ఆడిస్తూ వుంటారు. ఈ నాటికీ కాకినాడ ప్రాంతంలో వర్షాలు పడనప్పుడల్లా దగ్గరలో

వున్న మాధవపట్నం బొమ్మలాట వారిని ఆహ్వానించి శ్రీధేనువు కొండవెంకయ్య గారు రచించిన ఉత్తర గోగ్రహణాన్ని, విరాటపర్వాన్ని ప్రదర్శిస్తారు.

పెండ్లాంబిడ్డలతో
దేశదిమ్మర్లు :

బొమ్మలాటలాడేవారు వూరు తరువాత వూరు చాంద్రాయణం చేసుకుంటూ ప్రదర్శనలిచ్చుకుంటూ దేశ దిమ్మరుల్లాగా తిరుగుతూ వుంటారు. చావులూ, పుట్టుకలూ, వివాహాలూ, వేడుకలూ-అన్నీ దారిలోనే జరిగిపోతూ వుంటాయి.

వీరిలో ఒక్కొక్కరికి ఇద్దరు ముగ్గురు భార్యలు కూడా వుంటారు. ఇలా వుండడం వారికేమీ తప్పుకాదు. కారణం ఈ స్త్రీలందరూ ప్రదర్శనంలో పాటలు పాడటానికీ, బొమ్మల నాడించడానికీ వుపయోగపడతారు. అందువల్ల బయటనుంచి కిరాయినటుల్ని తెచ్చుకోవాల్సిన అవసరం వుండదు అంతేగాక ప్రదర్శనం రోజున ఒకరికి జబ్బుచేసినా గొంతుపోయినా, ప్రదర్శనం ఆగదు. ఈ బాధ్యతలు అదనంగా వున్న స్త్రీలు పంచుకుంటారు. బొమ్మలాట వారిలో పురుషులకంటే స్త్రీలే ఎక్కువమంది వుంటారు. ఎంతమంది వున్నా వారి కంఠాలన్నీ కోకిలకంఠాలే. పుట్టుకతోనే వారికి ఆ లక్షణాలు అబ్బుతాయా అన్నట్లుంటుంది.

తోలుబొమ్మలు ఒకనాడు తెలుగు విజ్ఞాన వికాసానికి పట్టుగొమ్మలు. తోలు బొమ్మల్ని ఆనాడు ప్రజలు ఎంతగానో పోషించారు. రానురాను నాటకాలు అభివృద్ధిలోకి రావడంవల్లా, సినిమాకళ అభివృద్ధి చెందడంవల్లా ఈ కళ కొంతవరకు దెబ్బతినిపోయిందని చెప్పవచ్చు.

ఆనాటి తోలుబొమ్మల జట్టు వారిలో ఎంతో సంగీతం, సాహిత్యం, శిల్పం మొదలైనవాటిలో విద్వాంసులుండేవారు. ఈనాడు అటువంటివారు చాలావరకు తగ్గిపోయారు. వున్న కొద్దిమందీ పొట్టకోసం నాసిరకం ప్రదర్శనాలిస్తున్నారు. శిథిలమైపోయిన మన ఈ ప్రాచీనకళనూ, సాంప్రదాయాన్ని పునరుద్ధరించాలి.

# ఛాయా నాటికలు - తోలుబొమ్మ

## లాటలకు సైదోడులు

తోలుబొమ్మల ఆటల అనంతరంవచ్చిన పరిణామమే ఈ ఛాయా నాటికలు. వీటినే 'షాడోప్లేస్' అంటారు. ముఖ్యంగా ఈ ఛాయా నాటికలు దేశం మొత్తంలో చాలా తక్కువమందే ప్రదర్శిస్తున్నారు. మన వుత్తమ కళారూపాల్లో ఛాయా నాటికను కూడ ఒక వుత్తమ కళాఖండంగా ఎంచవచ్చు. ఈ ఛాయా నాటికలు ఇతర దేశాల్లో-ముఖ్యంగా అమెరికా, ఇంగ్లండు దేశాల్లో సాంకేతికంగా బాగా అభివృద్ధి పొందాయని ప్రతీతి.



ఛాయా నాటికలు మనదేశంలో సుప్రసిద్ధ నర్తకుడు ఉదయశంకర్ తన నృత్య ప్రదర్శనాలతోపాటు ఈ ఛాయా నాటికను కూడ వ్యాప్తిలోకి తీసుకు వచ్చాడు. ఈయన ఛాయా నాటికద్వారా బుద్ధుని జీవితాన్ని ఎంతో నిపుణంగా ప్రదర్శించాడు. ప్రేక్షకులలో ఎంతో అనుభూతిని కలిగించాడు.

అలాగే ఆంధ్రదేశంలో బాపట్ల ప్రజానాట్యమండలి కార్యకర్తలైన మురళీధరరావు, జొన్నలగడ్డ జోషి మొదలైనవారు, ఇతర కళారూపాలతో పాటు, ఈ ఛాయా నాటికలను-దేశానికీ, ప్రజలకూ వుపయోగపడే కథా వృత్తాలను తీసుకుని-ఎంతో ముచ్చటగా ప్రదర్శించారు.

ఛాయా నాటికలకు మాతృకలు తోలుబొమ్మలే. తోలుబొమ్మలాటల్లో కేవలం తోలుతో తయారుచేయబడిన బొమ్మలను మనుషుల సహాయంతో ఆడిస్తారు. ఒక్కొక్కరు ఒక బొమ్మ. మరికొందరు రెండు బొమ్మలను రెండు చేతులతోనూ ఆడిస్తూ వుంటారు. కాని ఛాయా నాటికల్లో, కేవలం ఆయా పాత్రలకు సంబంధించిన వ్యక్తులు తెరవెనుక నుండి నటిస్తూవుంటే, వారి నీడలు, వారి అభినయం తెల్లని తెరమీద ఎంతో స్పుటంగా కనబడుతాయి. తోలుబొమ్మలకు అలంకరించిన రంగులన్నీ మనకు తెరమీద కనబడతాయి కాని, ఛాయా నాటికల్లో పాత్రలు ధరిం

చిన దుస్తులయొక్క రంగులుగాని, ముఖానికి పట్టించిన రంగులుగాని కనపడవు. అలా కనపడవు కనుకనే ఏ విధమైన రంగులూ, రంగుల దుస్తులూ వుండవు. ఇందుకు కారణ మేమంటే తోలుబొమ్మ తెరకు అంటి పెట్టుకుని వుండడంవల్లా, ఆ బొమ్మ వెనుకనే బలమైన దీపపుకాంతి వుండడంవల్లా, బొమ్మలు పలుచని చర్మంతో తయారుచేయడంవల్లా, బొమ్మలో చిత్రించిన అన్ని రంగులూ మనకు స్ఫుటంగా గోచరిస్తాయి. కాని ఛాయా నాటికలో నటులు తెరకు సాధ్యమైనంత దూరంగా వుంటారు వారికి కొంచెం దూరంగా ప్రొజెక్టుచేసే కాంతి వంతమైన లైటు వుంటుంది. నటీ, నటులు ముందుకు వచ్చిన కొలదీ నీడలు పెద్దవిగాను, వెనుకకు పోయినకొద్దీ నీడలు చిన్నవిగానూ కనబడతాయి. ఇందులో కూడ ఆయా రంగులు చూపించవచ్చు. ఈ రంగులు లైటుకు దగ్గరగా చూపించినట్లయితే రంగులు కూడ వివరంగా కనబడతాయి. ఇందులో కూడా ఆయా రంగులు చూపించవచ్చు. ఈ రంగులు లైటుకు దగ్గరగా చూపించినట్లయితే రంగులు వివరంగా కనబడతాయి. వుదాహరణకు ఒక ఇల్లు దహనం ఐపోయినట్లూ, ఆ మంటలు సహజంగా వున్నట్లూ చూపించవచ్చు. ఎఱ్ఱకాగితాలను సన్నగా జూల్సుగా కత్తిరించి లైటుముందు విసనకట్టలాగా విసరినట్లయితే ఆ రంగునీడలు మంటలుగా కనిపిస్తాయి. ఇలా మనకు కావలసిన ఇతర రంగులను, ప్రకృతి దృశ్యాలను ప్రదర్శించవచ్చు.

ముఖ్యంగా ఛాయా నాటికలు ఆయా నన్నివేశాల ననుసరించి నేపథ్య సంగీతాన్ని వినిపించడంతో ఎంతో రమణీయంగా వుంటాయి.

---

# మూకాభినయం

ఆంధ్ర నాటకరంగంలో మూకాభినయ నాటికలు చాలా ఎక్కువ. అక్కడక్కడ కాలేజీలలో వార్షికోత్సవ సందర్భాలలో మినహా విస్తృతంగా ఈ మూకాభినయాలు ప్రదర్శించబడినట్లు మనకు ఆధారాలు ఏమీలేవు. కాని ఇటీవల అనిసెట్టి వ్రాసిన రెండు మూకాభినయ నాటికలు వెలువడ్డాయి. అవి 1. శాంతి మూకాభినయం, 2. ఓపెవరికి అనేవి. ఈ రెండు నాటికలూ ఆంధ్రదేశమంతటా ప్రదర్శించబడ్డాయి. మూకాభినయ నాటికల్ని మొట్టమొదటగా రచించి ప్రజామన్ననలందిన రచయిత అనిసెట్టి ఒకరే అని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తిలేదు.

---

# బుట బొమ్మలు

తెలుగు ప్రజల్లో బుట్టబొమ్మలు తెలియనివారెవరూ వుండరనుకోవచ్చు. పేడతో చేయబడ్డ ఈ బుట్టబొమ్మలు పెండి వూరేగింపుల్లోనూ. దేవుళ్ళ వుత్సవాల్లోనూ ప్రదర్శిస్తూ వుంటారు.



పాములవాడు

ఈ బొమ్మల్ని పురుషులు ఆడిస్తారు. పై భాగమంతా బొమ్మ ఆకారంగా వుండి లోపలిభాగం దొల్లగా వుండి బొమ్మయొక్క కాళ్ళ భాగంలోనూ, నోటి దగ్గరా రంధ్రాలుంటాయి. ఆట కాడు ఈ లోపలిభాగంలో దూరితలను దూర్చి నృత్యంచేస్తే కేవలం బొమ్మే అభినయించినట్లుంటుంది. ఈ బొమ్మల్లో ఒకటి స్త్రీ బొమ్మగానూ, రెండవది మగ బొమ్మగానూ వుంటాయి. కొన్ని బొమ్మలు సింగీ సింగడుగానూ వుంటాయి. బొమ్మల నృత్యానికి తగినట్లు వాయిద్యాన్నిచ్చేవి డప్పులు. రెండు బొమ్మలకూ ఏదో ప్రణయకలహాన్ని సృష్టిస్తాయి. ఆ సాంతానికి రెండు బొమ్మలూ రాజీపడి అతి సన్నిహితంగా దగ్గిరకొచ్చి కౌగలించుకున్నట్లు నటించడంద్వారా ప్రేక్షకులు గొల్లున నవ్వుతారు. నోటిమాట లేకుండా, వాయిద్యంద్వారా, నృత్యం ద్వారా ఈ బుట్టబొమ్మల కళారూపాన్ని ప్రదర్శిస్తూ వుంటారు. తెలుగు ప్రజల నానండపరిచే కళారూపాల్లో ఇది ఒకటి.

కొయ్యబొమ్మలాటలు :

దేశంలోనైనా నాటకానికి పూర్వరంగం వీధి నాటకాలూ, చెక్క బొమ్మలూ, కొయ్యబొమ్మలూ, పేడబొమ్మలూ అని మనం తెలుసుకోవచ్చు. కాళిదాసు-భవభూతి, భాసుడు మొదలైన వారంతా వ్రాసిన సంస్కృత మహా నాటకాలకు నాంది ఈ కొయ్యబొమ్మలూ, భాగవత లనే ప్రతీతికూడా వుంది.

ఈనాడు మనకున్నది నాటకమందిరం. ఆనాడు వారి నాటకరంగ స్థలం వీధులే విగ్రహాలమీద నమ్మకం వచ్చిన తరువాత దేవతలక్రింద, దేవుళ్ళ క్రింద

బొమ్మల పూజలు వచ్చిన అనంతరం వారికి ప్రియమైన, భక్తియుతమైన బొమ్మలకు చక్కగా రంగులుదిద్ది దీపస్తంభాల వెలుతురులో ఈ కొయ్య బొమ్మలను ఆడిస్తూ వుండేవారు. ఈ బొమ్మల నిర్మాణం తేలికగా వుండే కొయ్యలతోనూ, పేడతోనూ, ఆడించడానికి యోగ్యంగా వుండేటంత తేలిక వస్తువులతో తయారు చేసుకునేవారు. దసరాకు పిల్లలు ఆడించుకునే హనుమంతుడి బొమ్మల్నీ, సంక్రాంతికి పెట్టే బొమ్మల కొలువులూ, పెళ్ళిళ్ళకు ఆడించే బుట్టబొమ్మలూ, దేవుళ్ళ వాహనాలుగా వుపయోగించే గరుత్మంతుడు, నెమలి, హంస మొదలైన కొయ్య బొమ్మలను గుర్తుకు తెచ్చుకోవచ్చు. ఆంధ్రదేశంలో ప్రచారంలో లేవుగాని ఈనాటికీ తమిళనాడులో 'బొమ్మలాట్టం' ప్రదర్శిస్తూ వున్నారు.

ఆచార్య

యం. వి. రమణమూర్తి:



శిథిలమైన తోలుబొమ్మలాటలను ఆధునిక రీతిలో పునరుద్ధరించటానికి కాకినాడ వాస్తవ్యులు యం. వి. రమణమూర్తిగారు ఎంతో కాలంగా కృషి చేస్తున్నారు. వీరికి భారత ప్రభుత్వం రెండు సంవత్సరాలు స్కాలర్‌షిప్ ఇచ్చి తోలుబొమ్మల పరిశోధనకు అవకాశం కల్పించారు. రమణమూర్తిగారు దాదాపు 15 సంవత్సరాలుగా ఈ కృషిలో వుండి, అనేక మహాసభల్లోనూ, ప్రముఖ నాయకుల సమక్షంలోనూ, విదేశీ రాయబారుల సమక్షంలోనూ ప్రదర్శించి, ఆనాటి తోలుబొమ్మలాటల విశిష్టతను చాటారు. బొమ్మల ప్రదర్శనంలో పూర్వం వుపయోగించే ఆముదపు దీపాలను తొలగించి, ట్యూబు లైటుల ద్వారా ప్రదర్శిస్తున్నారు. తెరను కూడా ఇనుపగొట్టాల ఫ్రేమును తయారుచేసి, ప్రదర్శనాన్ని అవలీలగా ప్రదర్శించే ఏర్పాటు చేశారు. తోలుబొమ్మలతో పాటు గ్లోవ్ పప్పెటును కూడ ప్రదర్శిస్తున్నారు. ఎక్కువమంది హంగుచారులు అవసరం

లేకుండా, కథా వృత్తాన్నంతా టేపురికార్డు చేసి బొమ్మలను ఆడించటానికి మాత్రం ఇద్దరు ముగ్గురు మనుషులతో ప్రదర్శనాలు సాగిస్తున్నారు. కథల్లో, లంకాదహనం మొదలైన పౌరాణిక గాథలతోపాటు, పంచతంత్ర కథలు, కుటుంబ నియంత్రణం మొదలైన ఇతివృత్తాలకు సరిపడే బొమ్మలను తయారుచేసి ప్రదర్శనాల నిస్తున్నారు.

ఈనాడు వారు మద్రాసు.అడయారులో సెంట్రల్ లెదర్ రిసెర్చి ఇన్స్టిట్యూట్‌లో, బొమ్మల పరిశోధనలో ఆచార్యులుగా పని చేస్తున్నారు. ఎంతో మందికి బొమ్మలను తయారు చేయడంలో తర్ఫీదు ఇస్తున్నారు. బొమ్మలను తయారు చేయడంలో ఆధునికమైన పరికరాలను వుపయోగిస్తున్నారు. ఎన్నో బొమ్మలను ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. వీరికి సహాయంగా వీరి మరదలు సీతా, వీరి కుటుంబం ఎంతో సహాయ పడుతున్నారు.



# 6

# జంగంకథలు



జంగంకథలు - బుర్రకథలు - శారద వాండ్రు. బుడిగెజంగాలు - ఈతముక్కు జంగాలు. సిరికిజంగాలు. అనలు, వుద్దేశ్యం, గినలు ఉద్దేశం. జంగంకథల తేజతీండ్రము జానుతెనుగుదనం.

# జంగం కథలు, బుర్రకథలు-
# శారదవాండ్లు

పాత్రోత,

కొత్తవింత :

ఆంధ్రదేశంలో ఆనాటినుండి ఈనాటివరకు బహుళ ప్రచారం పొందిన జంగం కథలు ఈనాడు బుర్రకథలుగా పిలువబడుతూ వున్నాయి. ఒకనాడు మత



ప్రబోధానికి, దేశభక్తికి ప్రతిబింబంగా నిలబడిన జంగం కథా కథారూపం రానురాను యాచనకూ, వుదరపోషణకూ వుపయోగ పడి తిరిగి ఈనాడు దేశభక్తిని ప్రబోధిస్తూ ప్రజాసమస్యలను చిత్రిస్తున్నది.

జంగం కథలను ఎక్కువగా జంగాలే చెప్పడంవల్ల వీటికి జంగం కథలనే పేరు వచ్చింది. ఈ కథలను పిరికి జంగాలూ, బుర్రగె జంగాలూ, సెట్టి బలిజెలు, సెట్టి ఫణిజలూ, ఈతముక్కు-జంగాలూ వంశ పారంపర్యంగా ప్రచారంలోకి తీసుకు వచ్చారు. జంగాలందరూ శైవభక్తులు కావడంవల్ల శైవ వైష్ణవమతాల మధ్య వచ్చిన సంఘర్షణకాలంలో శైవమత ప్రచారానికి ఈ కథలను వుపయోగించారు. వీర శైవమతం బాగా వ్యాప్తిలోకి వచ్చేనాటికి, అంటే, క్రీ॥ శ॥ 1150 నాటికే ఈ కథలను జంగాలు పాడుతూ వుండేవారు. వీరు ఈ కథలతోపాటు పగటివేషాలను కూడ ప్రదర్శించేవారు. బైచరాజు వేంకటనాధ కవి పంచతంత్రంలో, 'కడివోని తెరనాటకపుటూరి జంగాలు' అని వుదాహరించడాన్నిబట్టి జంగాలు నాటకాలను కూడ ప్రదర్శించే వారని తెలుస్తూంది.

బుడిగె జంగాలు :

దాసరులందరూ వైష్ణవభక్తులైనట్లే, జంగాలందరూ శైవభక్తులు. వీరు చెప్పే కథలకు జంగం కథలనిపేరు. వీరికే బుడిగెజంగాలనే పేరు కూడ వాడుకలో వుంది. అందుకు కారణం, వారు కథలో వుపయోగించే వాయిద్యానికి బుడిగె అనే

పేరు. ఆ పేరునుబట్టి వీరికి బుడిగెజంగాలనే పేరు సార్థకనామమైంది. ఈ బుడిగెనే డక్కీ అనీ, డిక్కీ అనీ, గుమ్మెటనీ, అనేక రీతులలో ఆయాప్రాంతాలలో ఉదాహరిస్తున్నారు. బుడిగెలు మామూలు గుమ్మెట్లకంటే చిన్నవి. ఇవి ఇత్తడితోనూ కంచుతోనూ చేయబడి వుంటాయి.

జంగాలు ప్రారంభంలో శైవకథలనే ప్రచారం చేసేవారు. తరువాత శైవేతర కథలైన దేశింగురాజు, విరాటపర్వం, భల్లాణ, పిరియాళ, దేవయాని, వామన విజయం, అంబరీషోపాఖ్యానం మొదలైన కథలను కూడ ప్రచారంలోకి తెచ్చారు. జంగాలు వీరశైవ ప్రచారకులవడంవల్ల వారి కథలన్నీ వీరావేశంతో చెప్పబడుతూ వుండేవి. ధేనువుకొండ వెంకయ్యగారి విరాటపర్వం జంగం కథలో జంగాలయొక్క వేషధారణ, వాయిద్యాల వర్ణన వుంది. అడిదం సూరకవి 'జంగాలపాలు దేవాంగుల విత్తంబు అని వర్ణించడంవల్ల దేవాంగులైన సాలెవారిని యాచిస్తారని తెలుస్తూంది.

శారదకాండ్రు :

ఆంధ్రదేశంలో శారదకాండ్రు అనే ఒక జాతివారు ఒక్క తెలంగాణాలో తప్ప మరెక్కడా అంతగా కనిపించరవీ జానపదగాయకులుగా భిక్షుకులుగా వుండే వారిలో కూడ వీ రెక్కువనీ, మున్నూరు, ముత్తరాసి మొదలైన కులముల నుండి ఉద్భవించిన జాతుల్లో శారదకాండ్ర జాతి ఒకటనీ 'జానపద వాఙ్మయం'లో బి. రామరాజుగారు వుదాహరించారు. ఓ భారతీ, కరుణామతీభళి, శారదా కరుణానిధి అనే వంతపాట పాడడంవలన కూడా వీరికి శారదకాండ్రు అనే పేరువచ్చి వుండవచ్చు. అంతేకాక వీ రుపయోగించే వాద్యంలో భుజముమీన ధరించే తంబురాకు శారద అని పేరు. బుర్రకథలో వుపయోగించే తంబురాకూ దీనికీ ఏమీ తేడా లేదు. శారదను ఒక భుజంమీన ధరించి వాయిస్తారు. శారద అంటే సరస్వతి. విద్యలతల్లి సరస్వతి. విద్యల తల్లి సరస్వతి పేరును వా రుపయోగించే లంబురా వాయిద్యానికి మారుపేరుగా శారద అని నామకరణం చేశారు. వీరి కథ శారదాదేవి స్తోత్రంతో ప్రారంభమవుతుంది. ముఖ్యంగా వీరి జట్టులో పురుషుడు కథ చెపితే అతని ఇద్దరు భార్యలూ వంత పాడుతారు. ఒక భార్యను కలిగివున్న కథకుడు కథ చెపితే, అతని భార్య డక్కీ కొడుతుంది. దీనిని వీరు డిమ్కీ అని కూడా పిలుస్తారు. వీరు పాడేపాటల్లో శారద వరుసలనేకాక చరిత్రాత్మకమైన వీరగేయాలను,

వీరావేశంతో పాడుతారు. తెలంగాణాలో ప్రచారంలోవున్న ప్రసిద్ధ వీరకథలైన సదాశివరెడ్డి కథ, సర్వాయిపాపడు కథలనూ, పర్కారు ఆంధ్రదేశంలో ప్రఖ్యాతి వహించిన బొబ్బిలియుద్ధం, పల్నాటి వీరచరిత్ర, బాలనాగమ్మ మొదలైన కథలనూ కారదకాండ్రు చెపుతూవుంటారు. పైన వుదాహరించిన ఒక్కొక్క కథనూ మూడు నాలుగు రాత్రులు చెపుతారు. ఈ కథలు చెప్పేవారు ఎక్కువమంది వరంగల్లు తాలూకా వెంకటాపురంపల్లి మొదలైన చుట్టుపట్ల గ్రామాలలో వున్నారు. కారదకాండ్రు అందరూ శైవమతస్థులు మాంసాహారులైన జంగమ జాతివలస కలిగిన జాతి ఈ కారదకాండ్రు అని కొందరి అభిప్రాయం. వీరు ఎల్లమ్మ, పోచమ్మ మొదలైన ముఖ్య దేవతల్ని పూజిస్తారు. వీరు ఎంతమంది భార్యలనైనా చేసుకొనవచ్చు. వీరందరూ శైవమతస్థులైనప్పటికీ లింగధారణలో కొంతమందికి పట్టింపులేదు.

ఉత్తమ
కళారూపం :

ఈ జంగం కథలను ప్రజా ప్రబోధానికి ఆయుధంగా వుపయోగించారంటే అందులో ఒక విశేషం లేకపోలేదు. ఈ కథ ఇతివృత్తాలు చాల వుత్తేజకరమైనవీ, వుద్రేకమైనవీ, అన్ని రసాలూ తేలికగా ప్రజా హృదయాల్లో జొప్పించగల శక్తి ఈ జంగం కథలకుంది. వీరరసం ద్వారా ప్రజలను వుద్రేకపరచవచ్చును. కరుణరసం ద్వారా ఏడ్పించవచ్చును. హాస్య రసంద్వారా కడుపుబ్బ నవ్వించవచ్చు. శృంగార బీభత్సరసాలకు ప్రాముఖ్యం తక్కువైనా నవరసాలూ ఈ జంగం కథా విధానంలో మిళితమై యున్నాయి. సంగీతం, సాహిత్యం, నృత్యం, వాద్యం, శిల్పం, తాళం, లయ, అభినయం, ఆహార్యం మొదలైన హంగులన్నీ ఈ కథల్లో తొణికిసలాడుతూ వుంటాయి. ఈ కథల్లో వుపయోగించే గుమ్మెటలు వీరణపు మ్రోతలను గుర్తుకు తెస్తాయి. జంగం కథా కళారూపంలో ప్రజలను మేల్కొల్పే మహత్తరశక్తి వుంది ఈనాటికీ ఈ కళారూపం విద్యాధికుల నుండి అతి సామాన్యులవరకూ ఆనందింపజేయగల వుత్తమ జానపద సంగీత కళా రూపంగా తయారైంది.

జంగం కథను లెలుగు జాతియొక్క సంగీత జానపద కళారూపంగా చెప్పుకోవచ్చు. ఈ జంగం కథల్లో విప్వత్తును ప్రదర్శించే శ్లోకాలూ, దేశీయ ఛందస్సు అయిన మంజరీ ద్విపదలూ, దరువులూ, కీర్తనలూ, కందార్థాలూ మొదలైనవన్నీ

ప్రవేశ పెట్టబడ్డాయి. ఉదాహరణకు శ్రీనాథుడు వ్రాసిన వల్నాటి వీరచరిత్ర మంజరీ ద్విపదలో రచించిందే.

పూర్వ కథలు :

ఆంధ్రదేశపు పల్లెల్లో రైతు కూలీలకు పనిలేని తీరిక సమయాలలోనూ, దేవుని వుత్సవాలలోనూ ఈ కథలను చెప్పిస్తుండేవారు. ఈ కథలను చెప్పే జంగాలు వగటిపూట శంఖు, గంటలతో ఇంటింటా వ్యాచకం చేస్తూ, ఈ రాత్రికి నడి బజారులో ఫలానా కథ జంగం కథగా చెప్పుతున్నామని, ఫలానావారు చెప్పిస్తున్నారని ఇంటింటా ప్రచారంచేస్తూ, పది లాంతర్లను ప్రోగుచేసి తెల్లవారేవరకూ ఈ కథలను చెప్పి వేలాది ప్రజలను ఆనందింపజేసేవారు. అనాడు జంగం కథలకు మంచి ఆదరణవుండేది. ఈ కథకులు ఏ మారుమూల గ్రామంలో కథ చెప్పుకున్నా హాయిగా రెండు మూడు బస్తాల ధాన్యం, డబ్బు సంపాదించుకోగలిగేవారు. రాను రాను కుటుంబంలోని సభ్యులందరూ ఈ కథల్లో పాల్గొనేవారు. పురుషుడు కథ చెప్పితే ఆయన భార్య వంతపాడేది. కొంతమంది ఇద్దరు భార్యలను చేసుకుని జీవన భృతిని తేలికగా సంపాదించుకునేవారు. వృత్తి రీత్యా ఇరువురు భార్యలను చేసుకోవడం తప్పుగా ఎంచేవారు కారు. ఇలాంటి వీరికి ఏ విధమైన ఆశయమూ వున్నదని చెప్పలేము. ఒకనాడు ప్రబోధం కొరకు ఏర్పాటైన జంగం కథా కళారూపం పారంపర్యంగా జీవనోపాధికి అంకితమైంది. ఈ కథలను ముగ్గురు స్త్రీలు కలిసి చెప్పడం కూడ పరిపాటైంది. మూడు స్త్రీ కంఠాలు కలిసి ఏ బాల నాగమ్మ కథనో చెపుతూ వుంటే పల్లెల్లో కథలు వినే అమ్మలక్కలు కథలో వచ్చే హృదయ విదారక దృశ్యాలకు కండ్లవెంట నీరు కార్చేవారు. స్త్రీ గొంతులతో చెప్పబడే ఈ కథలు అతి శ్రావ్యంగా వుండేవి.

ప్రదర్శనం,
పరికరాలు :

వీరి ప్రదర్శనాలకు రంగస్థలమంటూ ఏమీలేదు. విశాలమైన ఒక వీధిలో పందిరి వేసి చుట్టూ కిరసనాయిలు లాంతర్లు వ్రేలాడ కట్టేవారు. ఈ లాంతర్లు లేని రోజుల్లో ఆముదపు దీపాలనూ, నూనె కాగడాలనూ లేదా ఇలాయికట్టలనూ వెలిగించేవారు. ఈనాడు పెట్రోమాక్సు లైట్లను వాడుతున్నారు. ముగ్గురు వ్యక్తులుండి, రెండు పెట్రోమాక్సు లైట్లుంటే అతి తేలికగా జంగం కథా కార్యక్రమం జరిగి

పోతుంది. కథకునికి ఒక తంబురా, మూడు అందెలు, రెండు కాళ్ళకు గజ్జెలు. వంతకు రెండు గుమ్మెట్లు, ముగ్గురికీ మూడు గొన్లూ మూడు తలగుడ్డలూ వుంటే సరి. కథ జరిగిపోతుంది. ఒక్కసారి ఈ సామగ్రిని ఏర్పాటు చేసుకోగలిగితే రోజు వారీగా కావలసిన సామగ్రి ఏమీ వుండదు. ముగ్గురు వ్యక్తులూ వేలాది ప్రజలకు తెల్లవార్లూ కథ వినిపించి కూర్చోబెట్టగలరు. వీరి బృందం ఒక గ్రామం నుంచి మరో గ్రామం వెళ్ళాలంటే ఎవరి సామాను వారు భుజాలకు తగిలించుకుని సునాయాసంగా ప్రయాణం చేస్తారు.

కథా విధానం,

కథల కట్టు, పట్టు :

జంగం కథల్లో కథకుడు తంబురాను ధరించి శ్రుతిని మీటుకుంటూ చేతి అందెలతో తాళంవేస్తూ కాళ్ళతో నృత్యంచేస్తూ కథను ప్రారంభిస్తాడు. ప్రక్కనున్న వంతదారులు రెండు గుమ్మెటలను భుజాలకు తగిలించుకుని 'దద్దో తిమి, తధిమి తత్త ధిమి, తకిట తతధిమి, విందాతద్దిందా, తక తక్కి, తకతక్కా' అనే దరువువేస్తూ 'తధిగిణతోం' అంటూ మధ్య మధ్య గమకాలనిస్తూ కథా సన్నివేశాల ననుసరించి మధ్య మధ్య అరరె, అరరె, భళి, భళీ అంటూ కథకుడికి హుషారునిస్తూ, వుభయతంగా నృత్యంచేస్తూ ప్రజల కందుబాటులో అన్ని ప్రక్కలకూ తిరుగుతూ వుంటారు. కథకుని లయప్రకారం, వంతలు గమకంగా వాయిస్తారు. కథకుడు చక్కగా చరణం పాడితే దానిని వంతదార్లు తిరిగి వంతపాడుతారు. కథకుడు కథను వివరిస్తే మరో వంతదారు (ఇతడు హాస్యగాడు) ప్రేక్షకులకు వచ్చే అనుమానాలను హాస్య ధోరణిలో కథకుని ప్రశ్నించి, సున్నిత హాస్యంతో ప్రజలను ముగ్ధుల్ని చేసి కథను ముందుకు నడిపేవారు. ఈ హాస్యంవల్ల పరాకుగా వున్న ప్రేక్షకులందర్నీ ఒక హద్దులో వుంచి కథను వినేటట్లు అభిలాషను కలిగించేవారు. కథకునికీ, వంతలకూ మధ్య నున్న అవినాభావ సంబంధం ఇంతా అంతా అని చెప్పలేం. కథా గమనంలో ఆ యా ఘట్టాలలో ఎక్కడా వీసమంత వెనితి రానీయరు. కావాలనుకున్నప్పుడు ప్రేక్షకులను నవ్వించగలరు, ఏడ్పించగలరు. వుద్రేకపరచగలరు. కథను విన్న ఆ కొంచెంసేపూ ప్రేక్షకులను ఒడలు మరచేటట్లు చేయగలరు. వంతలు కథను ఆలాపిస్తుంటే కథకుడు చేతిలో వున్న అందెలతోబాటు ఒక అంద

మైన చేతి గుడ్డను వూపుకుంటూ రెండవ చేతితో తంబురాను మీటుతూ, కాళ్ళ గజ్జెలు ఘల్లుమనేటట్లు నృత్యంచేస్తూ అటూ ఇటూ చేతులు వూపుకుంటూ సాత్విక, ఆంగిక చలనాదులతో రంగస్థలం అంతా కలియదిరుగుతూ యుద్ధఘట్టాలలోనూ, రౌద్ర ఘట్టాలలోనూ పిడుగులు బిడ్డట్లు ఎగిరి ఎగిరి గంతులువేస్తూ, గిట్టి గిట్టిన గిరికీలు కొడుతూ, పళ్ళు పట పట కొరకుతూ అరరే, అరరే అంటూ వంతలను కేకలతో అదలిస్తూ హంగామాచేసి ప్రేక్షకులను నివ్వెరపోయేటట్లు చేసేవారు. పైన వివరించిన ప్రదర్శన విధానాన్నిబట్టి, జంగం కథా కళారూపం ఎంత పదునైనదో మనకు బోధపడుతుంది. ముగ్గురు వ్యక్తులతో కూడిన ఈ కళారూపం యొక్క ప్రాముఖ్యం అనిర్వచనీయమైనది. ఇది ఇంతటి వుత్తమ కళాయుధం గనుకనే చరిత్రాత్మకంగా ఆంధ్ర ప్రజా హృదయాలలో హత్తుకుపోయింది.

బహురూపాలు,

బహుపేర్లు :

ప్రజా హృదయాలను ఇంతగా చూరగొన్న ఈ జంగం కథలయొక్క పూర్వ చరిత్ర మనకు సరిగా తెలియడంలేదు. జంగం కథగా వరిలి ఈ కళారూపం నేడు బుర్రకథ అనీ, తంబురా కథ అనీ, తందాన కథ అనీ, గుమ్మెట్ల కథ అనీ, అనేక ప్రాంతీయమైన భేదాలతో పిలువబడుతూ వుంది. కృష్ణా, గుంటూరు జిల్లాలలో ఈనాడు జంగం కథలంటే చాలమందికి తెలియదు. బుర్రకథ అనే పేరు ఆబాల గోపాలానికీ తెలుసు. అలాగే రాయలసీమ జిల్లాలలో బుర్రకథ అంటే ఎవరికీ తెలియదు. అక్కడ 'తందాన కథ'లనే వ్యవహరిస్తున్నారు. ఈ విధంగా జంగం కథ ప్రాంతీయమైన భేదాలతో వివిధ నామాలతో పిలువబడుతూ వుంది. ఈ కథకు ఇన్ని పేరులు రావడానికి కారణం కూడా లేకపోలేదు.

ఈ కథల్లో ప్రధాన కథకుడు తంబురాను వుపయోగిస్తున్నాడు. ఆ తంబురాకు ఉపయోగించే బుర్రనుబట్టి దీనికి తంబురా కథ అనీ, బుర్రకథ అనీ పేరు వచ్చి వుండవచ్చు. ఈ కథలో ఉపయోగించే గుమ్మెట్లను డక్కీలనీ, బుర్రలనీ వ్యవహరించడంవల్ల ఈ కథలకు డక్కీ కథలు, బుర్రకథలు అనే పేర్లు సార్థకమై యుండవచ్చునని కొందరి అభిప్రాయం.

ఈ నాటివి కావు,
అక్షరాలా ఆనాటివే :

అలాగే ఈ కథలకు తందాన కథలనీ తందాన పాటలనీ కూడ ప్రచారముంది.

ముఖ్యంగా బుర్రకథలో గుమ్మెట్లు వాయిస్తూ వంతలు పాడేవారు తందానా, తానితందానా అనే వంతపాట పాడటంవల్ల కూడా ఈ కథలకు తందాన కథలని పేరు వచ్చి వుండవచ్చు. తందానకథలు ప్రాచీన కాలంనుండీ వున్న వనడానికి వుదాహరణగా క్రీడాభిరామంలో

అకలంక స్థితిగోరి కొల్చెదరు బ్రహ్మానంద సంభావనన్
సకలానందమయైక మాతలగుచున్ సంతోష చిత్తంబునన్
తకదుమ్మల్ యకతాళముల్ జవనికల్ తందాన లమ్మయ్యకున్
ఎకవీరమ్మకు మాహురమ్మకు నధోహ్రీంకారమధ్యాత్మకున్.

అని పేర్కొన్న డాన్నిబట్టి కాకతీయ యుగంనాటికే ఈ జంగం కథలు బహుళ ప్రచారంలో వున్నాయని తెలుస్తూంది. 'యకతాళముల్ జవనికల్ తందాన లమ్మయ్యకున్' అనడంవల్ల ఆనాటి జంగంకథల్లో జవనిక వాద్యంకూడ వుపయోగించినట్లు వూహించవచ్చు. 'తందాన' అనే వంతపదం ఆనాడు పాడబడే ప్రతి కథలోనూ వంతగా పాడి వుండవచ్చు.

ఆంధ్రప్రజా జీవితంలో ఇంత విశిష్టస్థానాన్ని సంపాదించుకున్న ఈ బుర్ర కథను గూర్చి పాల్కురికి సోమనాథుడు బసవపురాణంలోగాని, పండితారాధ్య చరిత్రలోగాని, తొలి వీధినాటకం క్రీడాభిరామంలో కాని ఎవ్వరూ దీనిని పేరుపెట్టి స్పష్టంగా పేర్కొనకపోవడం చూడగా ద్విపద భూయిష్ఠమైన ఈ రచనకు ప్రక్క వాద్యాల ప్రాబల్యాన్నిబట్టి క్రమేపీ ఈ పేరు రూఢమై యుండవచ్చు. ప్రాచీన కళారూపాలైన యక్షగాన, వీధినాటకాల పూర్వరూపం బుర్రకథ కావచ్చుననీ శ్రీనాథుని కాలానికి ముందునుంచే ద్విపద ప్రబంధం బుర్రకథ వంటిది గానరూపంలో వుందనడానికి క్రీడాభిరామంలోని ఈ క్రింది పద్యమే తార్కాణమనీ తిరుమలరామచంద్రగారు'జయంతి' పత్రికలో'తెలుగువారి తొలిసంగీత కళారూప'మనే వ్యాసంలో వుదాహరించారు.

ద్రుత కాళంబున వీరగుంభితక ధుంధుం ధుంకి టాక్కారసం
గతి వాయింపుచు వాంతరాళిక యతిగ్రామాభిరామంబుగా
యతిగూడం ద్వివద ప్రబంధమున వీరానీకముంబాడె నా
క్కతె ప్రత్యక్షరముం గుమారకులు ఫీట్కారంబునం దూలగన్.

అని 14 వ శతాబ్దంలో రచింపబడిన క్రీడాభిరామ కాలానికే బుర్రకథ కళారూపం ప్రచారంలో వుందనడానికి ఈ పద్యంలో వుదాహరించిన ఇతి వృత్తమే నిదర్శనం. దీని ఇతివృత్తం వీరచరిత్రకు సంబంధించింది. పాడింది ద్విపదకావ్యం. వీరగుంభితను వాయించింది ఒక స్త్రీ. పైన వివరించిన వీరగుంభిత నేటి గుమెటని పండితుల అభిప్రాయం. గుమ్మెట్లవాద్యం గంభీరంగానూ, గుంభనగానూ వుండే ధ్వని విశేషం అవడంవల్ల దీనికి గుంభిత అనే పేరు వచ్చి వుండవచ్చు. ఈ గుంభితను అనాడు స్త్రీలు వాయించినట్లే ఈనాటి కథల్లో స్త్రీలూ, పురుషులూ కూడ వాయిస్తున్నారు. ఈ డక్కీలు పూర్వంనుంచీ వున్నవనడానికి కాశీఖండంలో శ్రీనాథుడు

వల్లకి చక్కి కాహళము వంశము డక్కి హుడుక్కి ఝుర్ఝురుల్
ఝుల్లి యాదిగా గలుగు శబ్దవరంవర కాళశబ్దమై.

అని వుదాహరించడాన్నిబట్టి, డక్కిహుడుక్కి అనే దానినిబట్టి కాహళము మొదలైన వివిధ వాద్యాలతోపాటు డక్కి అనే నేటి డక్కినీ బుడబుక్కిలవారుపయోగించే హుడుక్కిను కూడ వుపయోగించి వుండవచ్చు. అలాగే పండితారాధ్య చరిత్రలో

అలరుచు బడిహారులట్ల యందడను
లలినుచ్చి చాంగు భళాయమవారు

అనే దానినిబట్టి నేటివంతలు పాడే 'భళానోయిభాయి తమ్ముడూ, మేల్ భళానోయి దాచానా' అనే దానికి దగ్గరగా వుండడాన్నిబట్టి 'తందానా తాని తందనా, భళా, భళి' మొదలైన వంత విశేషాలు ఆనాటినుంచీ ప్రచారంలో వున్నట్లు మనం తెలుసుకోవచ్చు.

బుర్ర కథ గానవిశేషంగా రూపొందిందనడానికి పై ఉదాహరణలేగాక, క్రీడాభిరామంలో

## 6. జంగంకథలు

రాగములనుండి లంఘించ రాగమునకు మరుదు మారుదయ్యంబుపై నొత్తిగిల్ల
కామవల్లీ మహాలక్ష్మి కైటభారి వలపు బాడుచు వచ్చె జక్కులపురంధ్రి.

జక్కులపురంధ్రి వలపు బాడుచువచ్చె అనే దానినిబట్టి గానవిశేషంగా రుజు వౌతోంది.

అలాగే బసవపురాణంలో సోమనాధుడు శ్రీయాళచరితను గురించి

కరమర్థి మారూర శిరియాలుచరిత–పాటలుగా గట్టి పాడెడువారు.

అనడాన్నిబట్టి,

శ్రీనాధుడు కాశీఖండంలో దక్షవాటి పురమును వర్ణిస్తూ

కీర్తింతు రెద్దాని కీర్తి గంధర్వులు గాంధర్వమున యక్షగానసరజి.

అనడాన్నిబట్టి గంధర్వగానాన్ని యక్షగాన సరణిలో పాడి వినిపించేవారని అర్థమౌతోంది. పై వుదాహరణలనుబట్టి ఒకే నటి వివిధవాద్య విశేషాలతో వివిధ పాత్రల్ని అభినయించేదని తెలుస్తూంది.

ఈ జాతికి చెందిన కథలను స్త్రీలే కాక పురుషులు కూడ పాడి వినిపించినట్లు క్రీడాభిరామంలో

వాద్యవైఖరి కడునెరవాది యనగ-ఏకవీరా మహాదేవి ఎదుటనిల్చి,
పరశురాముని కథలెల్ల ప్రౌఢిపాడె–చారుతరకీర్తి బవనీల చక్రవర్తి.

వివిధవాద్యాలలో పరశురాముని కథలు బవనివారు పాడి వినిపించినట్లుగా వుంది. జవనికలు, డక్కీలు మొదలైన వాద్యవైఖరు లన్నీ చేరి వుండవచ్చును. ఇందుకు మరో వుదాహరణగా పండితారాధ్య చరిత్రలో-

వాదట గంధర్వ యక్షవిద్యాధి–రాదులై పాడెడు వాడెడువారు.

పై వర్ణనలనుబట్టి నటి నాట్యానికి అనుకూలమైన దుస్తులు ధరించి యక్షిణి లాగా తంబురాలాంటి జంత్రవాయిద్యాన్ని వాయిస్తూ, పాడుతూ, ఆడుతూ, కథ వినిపించేదని తెలుస్తూవుంది.

ఈమాదిరి కథ వినిపించింది జక్కులపురంధ్రి అని విదితమౌతోంది, దీనినిబట్టి మూల యక్షిగానం సంగీత నృత్యసహాయంతో కథ వినిపించే కళా రూపమని స్పష్టమౌతోంది.

ధర్మాంగద చరిత్ర, చిత్రాంగద విలాసం మొదలైన యక్షగానాలు 'వేష ముల్‌గట్టి జనులుపాడి వినిపింప' అనడాన్నిబట్టి 'వలపుబాడుచువచ్చె జిక్కు-ల పురంధ్రి' అనే దానినిబట్టి, గోవింద దీక్షితుడు సంగీతసుధ అనే లక్షణ గ్రంథంలో యక్షగానం యక్షులచేత పాడబడే ఒక సంగీత విశేషమని వుదాహరించడాన్నిబట్టి పాడి వినిపించడానికీ వుపయోగపడ్డాయని అర్థమౌతూంది. అతి ప్రాచీన యక్షగాన మైన ఓబయమంత్రి గరుడాచల **యక్షగానమూ,** కందుకూరి రుద్రయ్య రచించిన సుగ్రీవవిజయమూ పాడి వినిపించినవేగాని యక్షగానాలుగా ప్రదర్శింపబడినవి కావు. కేవలం ఒకేనటి వివిధ పాత్రల్ని అభినయంచేదని ఉదాహరణలనుబట్టి తెలుస్తూంది. అయ్యగారి వీరకవి రచించిన చిత్రాంగద విలాసమనే యక్షగానంలో

చిత్రాంగద విలాసమనగ యక్షగాన మొనరింతు.
వేషముల్‌గట్టి జనులుపాడి వినిపింప.

అని పేర్కొనడాన్నిబట్టి యక్షగాన రూపంలోవున్న వీధినాటకమని బోధ పడుతూంది. పై వుదాహరణలనుబట్టి యక్షగానాలు, వీధి నాటకాలు, బుర్రకథలు మొదలైనవన్నీ దేశీ సారస్వతానికి చెందిన సంగీత రూపకాలుగా పరిణామం చెందుతూ, దేనికి దానికే ఒక ప్రత్యేకమైన రూపాన్ని సంతరించుకుని, వివిధ కళారూపాలుగా వృద్ధిచెంది వుండవచ్చు. ఇలా గాన రూపంగా అభివృద్ధి పొం దుతూ వచ్చిన యక్షగానంలో సూత్రధారుడు ప్రవేశించి, నటియొక్క పాటకు వంత పాడుతూ, కథాగమనంలో వచ్చే చిల్లరపాత్రలకు వాచికం చెపుతూ వుండే వాడు. నటి వివిధ పాత్రల్ని అభినయిస్తూ కథ వినిపించేది. ఈ విధానమే భామా కలాపం, గొల్ల కలాపంగా రూపొంది వుండవచ్చు. సూత్రధారుడు విదూషకుడుగా మారి వుండవచ్చు.

తరువాత యక్షగానంలో వచ్చిన మార్పులననుసరించి మరో దశనందు కుంది. ఒకే నటుడు వివిధ రకాల పాత్రల్ని అభినయించడమే కాకుండా విడి విడిగా ఒక్కొక్కరూ ఒక్కొక్క పాత్రను అభినయించే సాంప్రదాయం ఏర్పడింది. తంజా వూరు యక్షగానాల్లోనూ, యాదవదాసు గరుడాచల యక్షగానంలోనూ, పాత్రల ప్రవేశం ప్రవేశ పెట్టబడి వుంది. అంచే ప్రవేశించే ప్రతి పాత్రా తన వూరు, పేరు తెలుపుతూ, 'వెడలె సత్యభామ' అని స్త్రీ పాత్రలూ, 'వెడలె యమధర్మరాజు' అని

పురుష పాత్రలూ ప్రవేశించేవన్నమాట. ఈ దశలో పరిణామం చెందిన యక్షగానాలను యక్షగాన నాటకాలని, వీధి నాటకాలని పిలిచారు.

ఈ విధంగా యక్షగానాలు రచనలో, ప్రదర్శనలో అభివృద్ధి చెందుతున్నా మూల యక్షగానమైన సంగీతరూపం బుర్ర కథగాను, హరి కథగానూ రూపొందింది. ఇందుకు వుదాహరణ-హరికథా పితామహుడైన అజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు గారు తమ కథలన్నిటినీ యక్షగానాలనే వ్యవహరించారు.

యక్షగానంలో సూత్రధారుడూ, విదూషకుడూ వున్నట్లే బుర్ర కథలో వంతదారులు ప్రవేశించారు.

యక్షగానంలో విదూషకుడు హాస్యం చెపితే బుర్రకథలో వంతదారు హాస్యం చెపుతాడు.

ఆనాటి నుండి ఈనాటి వరకూ కొన్ని బుర్ర కథలను స్త్రీలు కూడ చెప్పడం వల్ల ప్రేక్షకులను ఎక్కువగా ఆకర్షించగలిగేవారు.

ఈ విధంగా పరిశీలన చేసేటట్లయితే మూలయక్షగానం రూపాంతరంపొంది బుర్రకథగా పరిణామం చెందిందని శ్రీనివాస చక్రవర్తిగారు నాజరు సన్మాన సంచికలో వుదాహరించారు.

### మహారాష్ట్ర కళారూపము :

ఈ బుర్రకథ కళారూపం మహారాష్ట్రం నుండి మనకు దిగుమతి అయిందనే వాదం కూడా వుంది. చాళుక్యరాజులు తూర్పుకోస్తాను పరిపాలించిన రోజుల్లో పశ్చిమ దేశాన్నుంచి తూర్పుకు వచ్చిన చాళుక్యరాజులతోపాటు ఈ బుర్ర కథలు, తోలుబొమ్మలాటలు మొదలైన జానపద కళారూపాలు దిగుమతి అయినాయని కొంతమంది చరిత్రకారుల అభిప్రాయం. కాని చరిత్రగతిని బట్టి కొంచెం వెనుకకు వెళ్ళి పరిశీలిస్తే ఒకనాడు దక్షిణ భారత దేశమంతా అనేక పర్యాయాలు, అనేక చక్రవర్తుల ఏలుబడిలో ఏకఖండంగా వుంది. కృష్ణదేవరాయ పాలనలో కన్నడ, తెలుగు, తమిళ రాష్ట్రాలు కలిసే వుండేవి. ఆనాడు ఆంధ్ర కళారూపాలు విజయనగరం తంజావూరు సరస్వతీ మహల్ యక్షగానాలూ, తెలుగు నాటకాలను ప్రద



ర్శించే మేలటూరు భాగవతమేళాలు ఉదాహరణలుగా నిలిచి వున్నాయి. ఈ విధంగా ఆ యా కాలాల్లో కళలయొక్క, సారస్వతంయొక్క ప్రభావం ఆ యా జాతులమీద పడి వుండవచ్చు. అందువల్ల ఏ కళారూపం ఎక్కడి నుండి దిగుమతి అయిందనే మీమాంసకు తావులేదు. కాని ఇందుకు ఉదాహరణగా తిరుమల రామచంద్రగారు 'జయంతి' పత్రికలో బుర్రకథ తెలుగు వారి సంగీత కళారూపమేననీ అది ఎక్కడ నుండోదిగుమతి కాలేదనీ, కన్నడ మహారాష్ట్ర కళారూపాలైన పవాడా, లావణీలకూ మన బుర్రకథకూ వున్న వ్యత్యాసాలను గురించి చర్చిస్తూ ఈ క్రింది విధంగా ఉదాహరించారు.

తెలుగు బుర్ర కథకు, మహారాష్ట్రుల పవాడాకు, కన్నడుల లావణీకి 'జాన పద కళారూపా'లనడం తప్ప మరేమీ పోలికలేదు.

పవాడాను కూర్చునీ, నిలబడీ పాడుతారు. ఇది మన భజనగోష్ఠిలాంటిది. ఈ కథలో వీరరసం ప్రాధాన్యం వహిస్తుంది. వెనుక వంతదార్లు-పురుషు-దీదీ దీదీ అంటూ వంతరాగాలు పాడుతారు.

బుర్రకథలో మాదిరి అభినయంగాని, నిలబడి నృత్యం చేయడంగాని పవాడాలో లేదు.

ఇక కన్నడ లావణీ ప్రాచీనమైనది. 16 వ శతాబ్దం నుంచీ లావణీ ప్రచారంలో వుంది.

17 వ శతాబ్దంలో నందివర్మ దీనిని తన ఛందోగ్రంథంలో ఉదాహరించి లక్షణం చెప్పాడు.

లావణీ అనేది జనపదగాథలను తెలిపే ఛందో విశేషం. ఇవి గ్రామీణ జీవిత గాథలను వివిధ రసాలతో ప్రకృతి సౌందర్యాన్ని వివిధ రీతులలోను వర్ణిస్తుంది. ఇద్దరుగాని ఒక్కరుగాని నిలబడి పాడుతారు. దీనికి వంతపాట వుండదు. దీనికీ మన బుర్రకథకూ నిలబడి పాడడమనే పోలిక తప్ప మరే పోలికా లేదు.

పోతే మరాఠీలో కూడా లావణి వుంది. దానిలో స్త్రీలు పాడడం, చేతులు తిప్పడంవంటి ఆంగికాభినయం వుంది. కాని కథా విధానం వుండదు. గుమ్మెట్ల వంటి వాద్యాల ప్రస క్తిలేదు. అది కేవలం పేరంటపు పాటలవంటిది కావచ్చు. పై



కృష్ణాజిల్లా ప్రజా నాట్యమండలి మహిళా బుర్రకథదళం.
[తాపి రాజమ్మ, కొండేపూడి రాధ, వీరమాచనేని సరోజని]

వుదాహరణల ననుసరించి బుర్రకథ కన్నడ మహారాష్ట్రాలనుంచిగాని, మరే రాష్ట్రం నుంచిగాని దిగుమతి కాలేదని స్పష్టమౌతోంది.

బుర్రకథ :

జానపద వాఙ్మయంలో జంగం కథల సాహిత్యం ఒక ప్రత్యేక స్థానాన్ని వహిస్తూ వుంది. ఈ సాహిత్యంలో చాలా రకాలు కనిపిస్తున్నాయి. చాలవరకు పూర్వయక్ష గానాల్లో ఇతివృత్తమంతా పురాణ గాథలకు సంబంధించింది. యక్షగానాలు బుర్ర కథలుగా అభివృద్ధి చెందిన తరువాత, బొబ్బిలియుద్ధం వల్నాటి వీరచరిత్రం మొదలైన చారిత్రక యుద్ధగాథలూ, బాలనాగమ్మ, కామమ్మ, చిన్నమ్మ, లక్ష్మమ్మ, తిరుపతమ్మ, జానకివాసం మొదలైన కరుణరసప్రధానమైన పాతివ్రత్యగాథలూ, ఉత్తరగోగ్రహణం, వామన విజయం, దేవయానిచరిత్ర, అంబరీషోపాఖ్యానం మొదలైన భారతరామాయణగాథలకు సంబంధించిన అనేక కథలూ వచ్చాయి.

ఆనాటినుండి ఈనాటివరకు జంగం కథలు ప్రచారంలో వున్నాయి. ఈనాడు జంగం కథల పద్ధతిని రాజకీయ, సాంఘిక పరిస్థితులకు అన్వయించి ప్రచారం చేస్తున్నారు. వెనుకటి వీరరసగాథల్నీ, దేశభక్తిని పురికొల్పే దేశనాయకుల జీవిత మైన గాంధీ జీవితం, అల్లూరి సీతారామరాజు, సుభాస్ చంద్రబోస్ మొదలైన దేశ భక్తుల జీవితగాథలూ, రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి మొదలైన వీరవనితల గాథలూ, కష్టజీవి, శ్రమవిజయం మొదలైన కష్టజీవుల గాథలూ చెప్పి ప్రజా ప్రబోధం చేస్తున్నారు.

జంగం కథల
రచయితలు :

ధేనువుకొండ వెంకయ్య, కీలారి బ్రహ్మయోగి, గ్రంథి వెంకటసుబ్బయ్య, ఉప్పల పాటి వెంకటరామయ్య, గంజి నాగదాసు మొదలైనవారు ఎన్నోపౌరాణిక జాన పద గాథలను జంగం కథలుగా వ్రాశారు.

బుర్రకథల
రచయితలు :

నుంకర సత్యనారాయణ, కాకుమాను సుబ్బారావు, నాజర్, లక్ష్మీకాంతమోహన్ మొదలైనవారు రాజకీయ కథలనూ, దేశభక్తుల జీవితగాథలనూ రచించారు.

జంగంకథ కథకులు,
బుర్రకథ కథకులు :

దొడ్డారపు వెంకటస్వామి, అంజే కోటాదాసు, జంగా సుబ్బాదాసు, యాదవదాసు, రెంటపాళ్ళ గుడ్డి జంగం, సమ్మెట రామలింగం, జంగం సుబ్బయ్యదేవర, మంతెన జంగాలు, దావులూరు యల్లమంద మొదలైనవారు జంగంకథలలో ప్రసిద్ధులు.

రివిశెట్టి సుబ్బారావు, పట్టంశెట్టి వుమామహేశ్వరరావు, షేక్‌నాజరు, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, వల్లం నరసింహారావు, యస్. యల్. పెరుమాళ్ళు, మాచినేని వెంకటేశ్వరరావు, వడ్లపూడి నాగేశ్వరరావు, ఉప్పుగుండూరు కృష్ణమూర్తి, కాకుమాను సుబ్బారావు, భీమవరం బాలికలు, ఏపూరు రామకోటి, పురుషోత్తం, కోసూరు పున్నయ్య, కోగంటి గోపాలకృష్ణయ్య, చుండ్రు చిన్నబ్బాయి, హుసేన్ బాబా, నిట్టల బ్రదర్సు, సలారు భాస్కరరావు, కర్నాటి లక్ష్మీనర్సయ్య, జూనియర్ నాజర్‌దళం, ప్రసాద్ బుర్రకథ దళం, మోటూరు వుదయం, చింతల కోటీశ్వరమ్మ, మహంకాళిలక్ష్మి, కొండేపూడి రాధ, వీరమాచనేని సరోజని, తాపీ రాజమ్మ, తుమ్మల కేశవరావు, చదలవాడ కుటుంబరావు, సుంకర సత్యనారాయణ, గుడివాడ రాఘవులు, నందిగం బ్రదర్సు, కాజ బుర్రకథ దళం, రాఘవరెడ్డి దళం మొదలైనవారు రాజకీయ కథకులుగా ప్రఖ్యాతి వహించారు.



# 7

# పుగడ్తలపై పద్యాలు



జానపదకళలలో జత-కొతదెనా పాతదే-పాత పేరు - కొత్తపేరు వచ్చినవైనం - సాహిత్యంలో చాలినంతసాహ్యం - పగటివేషాల తీరులు, తెన్నులు-పగటివేషాల ఆటపట్టులు-పగటివేషాలకు పేరుపొందిన పెద్దలు-పేరుపొందిన పగటి వేషాలు-దేవరశక్తులు దేవరపెట్టె



# పగటివేషాలు

జానపదకళతో
జితకట్టుజాలిన
మరో జాతీయకళ:



నాటకం, సినిమా, రేడియోలు అభివృద్ధిపొందిన ఈనాటి దశనుంచి కొంచెంవెనక్కు వెళ్ళి ఆలోచిస్తే, మనకు జానపద కళారూపాలతోపాటు కనబడేవి పగటివేషాలే.

వీటివైనం, వాటం:

ఒకనాడు భారతదేశంలో స్వతంత్ర సామంతరాజుల పరిపాలనలోనూ చిత్ర విచిత్ర వేషాలు వ్యాప్తిలోకి వచ్చాయని ప్రతీతి. గూఢచారులుగా మారువేషాలు ధరించి వర్తమానాలు చేరవేసే చారులుగాను, రత్నాలు, పచ్చలు, కెంపులు అమ్మే వ్యాపారులుగాను, రాణులుధరించే ఖరీదైన చీరల వర్తకులుగానూ, చిత్ర విచిత్రమైన మారువేషాలతో కోటల్లో జొరబడి, ఒకరాజు మరొక రాజును వంచించడం, కోటలోని గుట్టు మట్టులూ.: బలహీనతలూ తెలుసుకుని యుద్ధం ప్రకటించడం జరుగుతూవుండేది. ఈ విధంగా బయలుదేరినవే పగటివేషాలు.

పేరువచ్చిన
కారణమూ, తీరూ:

ప్రజావినోదానికి ఏర్పడిన అనేక కళారూపాలు బహుళంగా రాత్రివేళలయందే ప్రయోగిస్తూవుండేవారు. అలాకాక పగటిపూట ప్రదర్శించే ప్రవర్శనం అవడం వల్ల ఈ ప్రదర్శనకు పగటివేష ప్రదర్శన మని పేరు వచ్చినది.

సిసలుగా
గమనించవలసిన
అసలు విషయం :

పగటివేషాల్లో ముఖ్యంగా గమనించాల్సిన విషయ మేమంటే, వారు కేవలం తమ వేషధారణతోనే కాక, వారి పాత్రలద్వారాను సంఘంలో వుండే మూఢ నమ్మకాలనూ, దురాచారాలనూ, ప్రజాపీడననూ హాస్యధోరణిలో పెట్టి ప్రజలను [illegible]ద్వారా విజ్ఞానపరుస్తూ వుండేవారు. ఈనాటికంటే ఆనాడు ముఖ్యంగా గ్రామాల్లో పెత్తందారులూ, కరణాలూ, మునసబులూ, వర్తకులూ, లంచగొండి ఉద్యోగులూ మొదలై నవారంతా ఎలా మోసంచేస్తూ వుండేవారో వీరు వేషధారణ ద్వారా, తగిన సాహిత్యంతో, ఎవ్వరికీ నొప్పి తగలకుండా హాస్యధోరణిలో వ్యంగ్యంగా గుట్టును బట్ట బయలుచేసేవారు.

ప్రాచీనంనుండీ
ప్రచారంలో ఉన్నవే :

ఎన్నో సంవత్సరాలనుండీ జానపదకళారూపాలు ఎలా ప్రచారంలో వున్నాయో అలాగే ఈ పగటివేషాలుకూడా ప్రచారంలో వున్నాయి.

పాతపేరుపోయి
కొత్తపేరు :

ఈనాటి పగటివేషాలను పూర్వం 'బహురూపా'లని పిలిచేవారు. బహురూపాను గూర్చి భరతకోశంలో ఈ క్రిందివిధంగా ఉదాహరింపబడి వుంది :

దేశినృత్యమ్—

"నానావేషధరం యత్తత్ బహురూప మితీరితమ్."

క్రీస్తుశకం 1242-వ సంవత్సరంలో యథావాక్కుల అన్నమయ్య తనచే రచింపబడిన సర్వేశ్వరశతకంలో నాటకప్రదర్శనాలను గురించి వ్రాస్తూ, ఈ క్రింది పద్యంద్వారా నాటకాలు బహురూపాలని వివరించాడు.

అమరంగస్ఫుటభక్తి నాటకము భాషాంగక్రియాంగాభిర
మ్యముగా జూపిన మెచ్చి మీరలు పురేయన్నంతకున్ యోనిగే

హములన్ రూపులు వన్నుకొంచును వటుండైవచ్చి నంసార రం
గములోనన్ బహురూపమాడు వెలయంగా జీవి నర్వేశ్వరా.

నాటకాలు బహురూపాలని పాల్కురికి సోమనాథుడు కూడా (బసవపురా ణంలో) వివరించాడు.

అటుగాక సాంగభాషాంగక్రియాంగ
పటునాటకంబుల నటియించువారు.

బహురూపాలంటే ఒకేవ్యక్తి వివిధపాత్రల్ని ధరించటం. అవి పగటి వేషాలు కావచ్చు. పండితారాధ్యచరిత్ర పర్వతప్రకరణంలో సోమనాథుడు.

ప్రమథ పురాతనపటు చరిత్రములు–గ్రమమొంద బహునాటకము లాడువారు
లలితాంగరప కళాలంకారరేఖ–లలవడ బహురూప మూడెడివారు.

శ్రీశైలంలో శివరాత్రి వుత్సవాలలో ఈ నాటకాలను ప్రదర్శించేవారు. ఆనాడు ఈ రూపకాలు ఎక్కువ ప్రచారమున్నట్లు సోమనాథుని పండితారాధ్య చరిత్రవల్ల తెలుస్తూవుంది.

పెరిస్తా అనే మహమ్మదీయ చరిత్రకారుడు విజయనగరరాజులకు సంబం ధించిన, రాజకీయమైన ఒక అపూర్వ సంఘటనను గురించి వేరొక్కన్న విషయం విదితమే.

జానపదగాథలతో
రాజకీయాలను
సాధించిన జాణ:

శివాజీకి సింహగడ విజయాన్ని చేకూర్చినవాడు 'తానాజీ మాల్సురే'. తానాజీ, మరి కొందరు మరాఠీసైనికులూ పవాడాగాయకుల వేషాలతో కోటలో ప్రవేశించి దానిని జయించారు. జానపదగాథల పద్ధతిని రాజకీయాలకు ఉపయోగించినవారిలో ప్రథముడు తానాజీ.

అంతేగాక కళింగ గంగరాజు పగటివేషాలవారి సహాయంతో శత్రువుల్ని జయించాడనే కథ కూడా వుంది.

ఢిల్లీసుల్తానుకే
డిమికీకొట్టిన
పగటివేషాల తేవ:

కాకతీయయుగంలో యుగంధర మహామంత్రి పిచ్చి యుగంధరుడుగా నటించి 'ఢిల్లీసుల్తాన్ పట్టుకపోతాన్' అంటూ ఢిల్లీసుల్తానులను జయించింది పగటి వేషంతోనే.

పల్లా వఙ్ఞులవారి
ప్రబోధ, పాఠ, ప్రచారాలు:

ఇలా ఎన్ని వుదాహరణలనైనా మన చరిత్రలనుంచి తీసి చూడవచ్చు. కాని పగటివేషాల చరిత్రమాత్రం మనకు సరిగా లభించడంలేదు. కాని రెండు మూడు వందల సంవత్సరాలక్రితం మైసూరు ప్రాంతంనుంచి పల్లావయుల వెంకటరామయ్య అనే ఆయన పచ్చి రేపల్లెలో వుండిపోయి, కొంతమందికి పగటివేషాలు నేర్పి, ప్రదర్శించి, ఆంధ్రప్రజల మన్ననలు పొందారట. క్రమానుగతంగా ఆ పగటి వేషధారులకు, తరువాత, గడ్డిపాడు నివాసస్థానమైందని శ్రీనివాస చక్రవర్తిగారు తమ వాట్యకళగ్రంథంలో వివరించారు.

పగటి వేషధారులకు
గట్టిపీఠమైన గడ్డిపాడు:

వీధి భాగవతాలకు కూచిపూడి ఎలా కేంద్రమైందో అలాగే పగటి వేషధారులకు గడ్డిపాడు కేంద్రమైంది.

కృష్ణాజిల్లాలో వీరంకిలాకుకు మైలుదూరంలో వున్న గడ్డిపాడు (హనుమంతరాయపురాగ్రహారం) ఈ భాగవతులకు కేంద్రం. గడ్డిపాడు భాగవతులుగా ప్రసిద్ధి నందినవారు పల్లా వఙ్ఞులవారు — శ్రీకారంవారు — కూచివారు — కనుపూరివారు — బెల్లంకొండవారు — బాపట్లవారు — కవులవారు మొదలైనవారంతా గడ్డిపాడు భాగవతులే. వీరందరికీ గురువు మైసూరు తెలుగు బ్రాహ్మణుడు. పల్లా వఙ్ఞుల వెంకటరామయ్య. ఈ ప్రతిభ గనుగొంచిచూస్తే తెలుగు దేశంలోకంటే

## 7. వగటివేషాలు

మైసూరులో పగటివేషాలు ఎక్కువ వ్యాప్తిలోనున్నట్లు తెలుస్తూందని శ్రీనివాస చక్రవర్తిగారు వివరిస్తున్నారు. రెండు శతాబ్దాలకు పూర్వం వచ్చిన వెంకట రామయ్యగారు ఆంధ్రదేశంలో పగటివేషాలతో సంచారంచేసి, చివరకు రేపల్లెలో స్థిరపడి గడ్డిపాడు వారికి ఈ విద్యను నేర్పి ఆద్యులైనారు.

### అర్ధనారీశ్వరి :

అర్ధనారీశ్వరి పగటివేషాన్ని ధరించటంలో కూచిపూడివారు బహు ప్రసిద్ధులు. దశావతార చరిత్రలో స్త్రీలు అర్ధనారీశ్వరి వేషం ధరించినట్లు ఈ క్రింది పద్య వర్ణనమబట్టి తెలుసుకోవచ్చు.

ఇంతియొక్కతె అర్ధనారీశ వేష
మూని సాక్షాత్కరించిన మౌనిజనులు
ప్రమథ సద్భక్తి జయ జయపార్వతీశ
యనుచు మ్రొక్కిరి పృథులసన్నుతులుచేసి.

[దశావతార చరిత్ర]

కూచిపూడివారిలో పురుషులే అర్ధనారీశ్వరి పగటివేషాన్ని ధరించేవారు. ఈ పగటివేషం జూపరులను ఎంతగానో ఆకర్షించి ఆనందింపజేసింది. ఈ అర్ధనారీశ్వరి పగటివేషాన్ని ఈనాడు సుప్రసిద్ధ నటీమణి శ్రీమతి రాజసులోచన తన కూచిపూడి నృత్యాలతోపాటు అద్భుతంగా ప్రదర్శిస్తూ వుంది.



రాజసులోచన అర్ధనారీశ్వరివేషం

ఆంధ్రదేశంలో పగటివేషాలకు భిక్షపెట్టినవారు గడ్డిపాడు పగటి వేషధారులే. ఆ గ్రామంలో అందరూ పగటివేషాలు వేయగల సమర్థులుగా వుండేవారు. వారు దాదాపు అరవై రకాల, చిత్రవిచిత్రమైన పగటివేషాలను ధరించేవారు. ఆ పగటివేషాలలో నిత్యజీవితానికి సంబంధించినవి కొన్ని. మరికొన్ని పౌరాణికవేషాలూ, కల్పనావేషాలూ. కొన్ని కేవలం హాస్యరసంతో కూడుకున్నవి. మొత్తంమీద సంఘంలో వుండే అన్ని జాతీయపాత్రలూ వీధివేషాల్లో మూర్తీభవించి వుండేవి.

### వేషగాండ్లా
### విశేషం, విలక్షణత:

వేషం వూరికే ధరించడం కాక తద్రూపంగానే నమ్మించేవారు. గొట్టెలు కాచే గొల్లల పాత్రలు ధరించి, సుద్దులు చెపితే అక్షరాలా గొట్టెల కాపరులను గుర్తుకు తెచ్చే వారు. వేషం వెయ్యవచ్చును గాని దానిని నమ్మించడం ఎలా? అదే గడ్డిపాటు పగటి వేషధారుల్లో వున్న ప్రత్యేకత. తెలుగుదేశంలో ఎన్ని వర్గాలూ, కులాలూ, జాతులూ వున్నాయో. ఆయా జాతులకు సంబంధించిన అన్ని భాషలనూ ఆకళింపు చేసుకుని వారు ధరించే ప్రతిపాత్రకూ సాహిత్యాన్ని కల్పించి స్వంతం చేసుకునే వారు. అన్ని మనస్తత్వాలనూ ఆటనూ, పాటనూ, మాటనూ, వుచ్చారణనూ వేషధారణనూ, ఒంపులూ, వయ్యారాలనూ, విధిగా, ఒకవిద్యలా అభ్యసించేవారు. అందువల్లనే వారు పగటివేషాల్లో ప్రఖ్యాతి వహించారు. పగటివేషధారులు అంటే గడ్డిపాటివారే ననీ, ఆ ప్రతిభకు వారే అర్హులనీ తేలిపోతుంది.

### కృత్రిమ అలంకారాలు లేకనే
### అకృత్రిమ కళాకాంతులు:

ప్రయోగాత్మకమైన కళారూపాలలో నాటకం వుత్తమమైంది. అలాగే జానపద కళారూపాలలో పగటివేషధారణ కూడ వుత్తమమైంది. ఈ పగటివేష ప్రయోగంలో చతుర్విధ అభినయాలూ ప్రాముఖ్యం వహిస్తున్నాయి రంగస్థలపరికరాలూ, రంగ ప్రదీపనం మొదలైన కృత్రిమ అలంకారా లేవీ లేకుండా ప్రజలను రంజింప జేసే పగటి కళారూపమిది.

పగటివేషధారులు ఆంధ్రదేశం నాలుగు చెఱగులా పర్యటించి ఆయా ప్రాంతాలలో వున్న మాండలిక వ్యవహారికయాసలూ, మాండలికపదాలూ గట్టిగా పట్టించుకొన్నారు. ఆ వేషధారులు ఆంధ్రదేశంలో అన్ని పాత్రల మాండలిక వ్యవహారిక యాసలనూ ఆకువుగా బట్టీ పట్టినట్లు బయట పెట్టగలరు.

### పగటివేషధారణకు
### కూచిపూడివారి ఎగబాటు:

కూచిపూడి కథాకారులు వీథిభాగవతాలలో ఎంతటి ప్రసిద్ధులో, పగటి వేషాలలో కూడా అంతటి ప్రసిద్ధులే. ఈ పగటివేషాలను కూచిపూడివారు ప్రారంభం

నుండీ ధరించలేదు. వారి వీధిభాగవతాలకూ, యక్షగానాలకూ కొంత ప్రచారం తగ్గిన తరువాత భాగవతులలో చీలికలు వచ్చి ఎవరికి వారై ఏదోరకంగా వుదర పోషణార్థం ఈ విచిత్రవేషాలను ప్రారంభించారు.

ఆనాడు కొన్ని యక్షగాన ప్రదర్శనాల్లోనూ, వీధి భాగవతాల ప్రదర్శనాల్లోనూ, మధ్యమధ్య వచ్చే కొద్దికొద్ది విరామసమయాల్లో ప్రేక్షకుల వినోదంకొరకు పంతులవేషం, పఠానువేషం, రెడ్డివేషం, త్రాగుబోతువేషం మొదలైనవాటిని ప్రదర్శించేవారు. పగటిపూట, అంటే తెల్లవార్లూ ప్రదర్శనం ముగిసిన తరువాత, ఆటపట్టించి అదే వేషాలతో యింటింటికీ యాచనకు బయలుదేరేవారు. పెట్టనే బయలుదేరడానికి కూడా కారణం లేకపోలేదు. తెల్లవార్లూ ప్రదర్శనం చూచిన ప్రేక్షకులు ముగ్ధులై ఇంకా ఆ ఆనందంలో వారుండగానే వారినుంచి ఎక్కువ ప్రతిఫలాన్ని రాబట్టేవారు. అలా ప్రారంభింపబడిన పగటివేషాలే అలా అలా అల్లుకుపోయి విశాఖాండలుగా ప్రచారం పొందాయి.

పాత్రలను త్రయూపంగా
ప్రదర్శించే పాత్రవం:

వీరుకూడా అనేకవేషాలు ధరించేవారు. కోమటిశెట్టి పాత్ర ధరిస్తే వైశ్యుల భాష, యాస, మాటతీరు, బొంగురుగొంతు, యుక్తిమాటలు, సునిశితహాస్యం, వ్యాపార చమత్కారం, ఇతరులను నొప్పి గలుగని అతిలౌకికమైన నటనా అచ్చు గుద్ది నట్లు చూపెట్టి ఒప్పించేవారు.

గారడీవేషంలో ఇంద్రజాల మహేంద్రజాలాన్ని అద్భుతంగా ప్రదర్శించే వారు. బట్టల నేత, బట్టల అమ్మకం, కోడిపోరులో పందెగాళ్ళ జోరు, వారి వికటాట్ట హాసాలు, పైరాగివేషాలతో ప్రజలను మోసపుచ్చే దొంగసన్యాసుల వైఖరులు, వారి దొంగచూపులు, చమత్కారమైన సంభాషణలూ అచ్చం అలాగే తెలుపుతారు. సోమిదేవమ్మ పాత్రలో వైదిక సంఘంలో వుండే మంచి చెడులనూ, లోపాలనూ వెల్లడిస్తారు. తర్కశాస్త్రాన్నీ వ్యాకరణశాస్త్రాన్నీ, వేదస్వరూపాన్నీ హాస్యరసపూరితాలైన సంస్కృత శ్లోకాలను కలిపి కట్టుదిట్టంగా చర్చించేవారు.

చిట్టి పంతులు వేషంలో చిట్టి పంతులు వేశ్యాలోలుడై, వ్యాపారులనూ,

రైతులనూ,కూలీలనూ బాధించి ఏ విధంగా ధనమార్జిస్తాడో, ఆర్జించినధనమంతా వేశ్యల కెలా ధారపోస్తాడో కళ్ళకు కట్టినట్లు చూపిస్తారు.

యాచనలో ప్రతివారినీ పొగడుతూ, భట్రాజులు ప్రజలను ఎలా పీడిస్తారో చూపించేవారు.

ఖురాన్ చదువుతూ, "పాడిపంటల్ సర్గుండాని అల్లాకె నాం" అంటూ ఫకీర్ల వేషంలోనూ "అంబ పల్కా జగదాంబ పల్కా, మా యమ్మా పల్కా కంచి కామాక్షి పల్కా" అంటూ బుడబుడక్కలవేషంలోనూ ఆయా పాత్రలకూ, ఆయా వేషాలకూ కావలసిన అన్నిరకాల సాహిత్యాన్నీ ఆకళింపు చేసుకుని, ఆయా వేషాలను సజీవంగా ప్రదర్శించేవారు.

కూచిపూడి పగటి వేషధారుల్లో బహు ప్రసిద్ధు లుండేవారు. చింతా చలమయ్య, వేదాంతం లక్ష్మీనారాయణ, తాడేపల్లి వేంకయ్యశాస్త్రి, హేమాద్రి వెంకటేశ్వర్లు, వేదాంతం నరసింహం, ఏలేశ్వరపు పున్నయ్యశాస్త్రి—వీరంతా బహు ప్రసిద్ధు లైనవారు.

కూచిపూడి వారిలో కొంతమంది-ఈ క్రింద వుదాహరించినవారు-ఆయా పాత్రల్లో అగ్రశ్రేణికి చెందినవారు.

పసుమర్తి శేషయ్యగారు బైరాగివేషం, ఫకీరువేషం, సోమయాజులు, సోమి దేవమ్మ వేషాలను కడురమ్యంగా ప్రదర్శించేవారు.

చింతా ప్రకాశశర్మ, చింతా బాలకృష్ణగార్లు వైష్ణవులు, సాతానులు, చెంచుల వేషాలను ప్రతిభావంతంగా ధరించేవారు.

మహంకాళి సత్యనారాయణగారు జంగం వేషంలో సమర్థులు. వేదాంతం మల్లికార్జున శర్మగారు కారద అర్ధనారీశ్వరుడి వేషంలో ప్రసిద్ధులు. ఇంకా వేదాంతం ఘంటయ్య, వేదాంతం సత్యనారాయణ మొదలైనవారు కూడ పైకోవకు చెందినవారే.

కీర్తిశేషులైన కూచిపూడి
పగటివేషధారులు:

1. పెద్దిభొట్ల దశరథరామయ్య
2. పెద్దిభొట్ల జానకిరామయ్య
3. పసుమర్తి శేషయ్య
4. పసుమర్తి చలపతి
5. పసుమర్తి గోపాలం
6. హరిలక్ష్మీనారాయణ
7. చింతా శివరామయ్య
8. భాగవతుల కుమారస్వామి
9. భాగవతుల పిచ్చయ్య
10. వేదాంతం వెంకటేశ్వర్లు
11. వేదాంతం లక్ష్మీనరసింహం
12. మహాకాళి లక్ష్మయ్య

ఈనాటికీ కూచిపూడిలో పగటివేషాలను ప్రదర్శించే కళాకారులు అనేకమంది వున్నారు. వారిలో కొందరు—

1. మహంకాళి నత్యనారాయణ,
2. వేదాంతం ఘంటయ్య,
3. వేదాంతం పార్థసారథి,
4. హేమాద్రి శివరామకృష్ణయ్య,
5. చింతా సూర్యప్రకాశరావు,
6. పసుమర్తి అంజయ్య,
7. పసుమర్తి సూర్యనారాయణ,
8. పసుమర్తి సుందరరామయ్య,

9. పసుమర్తి వెంకటేశ్వర్లు.
10. పసుమర్తి విశ్వనాధం.
11. పసుమర్తి శ్రీరామమూర్తి.
12. భాగవతుల కుటుంబశాస్త్రి.
13. భాగవతుల నాగలింగయ్య.
14. భాగవతుల వెంకటాచలపతి.
15. యేలేశ్వరపు వీరరాఘవయ్య.
16. యేలేశ్వరపు ప్రకాశరావు.
17. యేలేశ్వరపు ఆంజనేయులు.
18. యేలేశ్వరపు శివరామశాస్త్రి.
19 జోస్యుల దుర్గయ్య.

ఆటల ఆఖరురోజున

కానుకల యాచన :

పగటి వేషధారులు ప్రదర్శనాలన్నీ అయిన తరువాత చివరి రోజున శారద రామాయణం కథగా చెప్పి, పారితోషికాలకొరకు ఇంటింటికీ తిరుగుతూ, కూచిపూడి ప్రశస్తిని ఈ విధంగా పొగిడేవారు :

హారం, త్రిపురాసుర సంహారం,
ఈనర్తకు లాడే బేరం,
చూపుకైతే బహుచూరం,
మేమున్నది కృష్ణాతీరం,
మాది కూచిపూడి అగ్రహారం,
మేము కులమున బ్రాహ్మణవారం
తమ మెడలో చంద్రహారం,
ఆ హార మిసే మీభారం,
వాశరధీపయో కరుణానిధీ.

అంటూ అతి లౌకికంగా ఇంటి యజమానిని వూదరబెట్టి కానుకలు లాగేవారు.



బహురూప చక్రవర్తి సున్నపు వీరయ్య

ప్రచారంపొందిన
పగటి వేషాలు:

పైరాగులవేషాలు, ఫకీరువేషం, బుడబుక్కలవేషం, సోమయాజులు, సోమిదేవమ్మ, శారదవేషం, అర్ధనారీశ్వరుడు, జంగమదేవర, వైష్ణవవేషాలు, సాతానివేషం, పంతులవేషం, పఠానువేషం, సోడె, కోమటివేషం, వితంతువు, మాదిగవేషం, తహశీల్దారు, శక్తివేషం, పేతాళుడు, దేవరరెడ్డి, భోగంవేషం, పాములవాడు, ఎరుకలవేషం, దొమ్మరవేషం, కోయవేషం, కాశీప్రయాణం, కాశీకావళ్లు, వానాలమ్మ, పడుచుపెండ్లాం - ముసలి మగడు, గయ్యాళిపెళ్ళాం, పిట్టలదొర, రివిన్యూ ఇన్స్పెక్టర్, అత్తాకోడళ్ళ సంవాదం, రాధాకృష్ణ సంవాదం, బ్రహ్మంగారి తత్వాలు, లంబాడిపడుచు, గొల్లభామ, దాసరివేషం, మందులవేషం, రెడ్డివేషం, దాసినమ్మవేషం, గంటిభాగవతులు, జేగంట భాగవతులు, జంతరుపెట్టె, హరిదాసులు, చిట్టిపంతులు, భట్రాజువేషం, దివానువేషం, లింగబలిజవేషం, సింగిపింగడు, సోడిగాడు, అవధాని, బట్టల అమ్మకం, మొండిబండవాళ్ళు.

సున్నపు వీరయ్య
పగటివేషాలు:

పగటి వేషధారుల్లో బహుముఖ ప్రజ్ఞావంతుడు కీర్తిశేషులు సున్నపు వీరయ్యగారు. పశ్చిమ గోదావరిజిల్లా అప్పారావుపాలెం వీరి జన్మస్థానం. ఇంటి పేరు సున్నం వారు. విశ్వబ్రాహ్మణకులానికి చెందినవారు. అజానుబాహుడు. నిండైన విగ్రహం. కొంచెం స్థూలకాయుడు. పెద్ద జరీఅంచు తెల్లని తలపాగా ధరించేవారు. బొద్దు మీసం, నల్లని లాంకోటు, తెల్లని పంచెకట్టు, చేతికి సువర్ణ కంకణాలు, కాలికి



పాములవాడుగా సున్నం వీరయ్య

పెద్ద అండె ధరించి కిట్టు చెప్పులతో, చేతికట్టతో బయలు దేరితే చూచే వారికి అమిత గంభీరంగా కని పించేవారు. అలాంటి నిండైన విగ్రహం, ఆంధ్రదేశంలో పగటి వేషధారుల్లో మరెవరికీ లేవనటం అతిశయోక్తి కాదు.

వీరయ్యగారు పగటివేషాలు ధరించి ఆంధ్రదేశమంతటా పర్యటించి, పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. వీరయ్యగారి ప్రజ్ఞాప్రాభవాలు ఆనాటికి ఆంధ్రదేశానికి పరిచితమే.

సున్నపు వీరయ్యగారు వారి బృందం ద్వారా, తెలుగుదేశపు నాలుగు మూలలా ప్రదర్శనా లిచ్చి ఎంతోమంది జమీందార్లనూ, శ్రీమంతులనూ, వారి పగటివేషాలద్వారా మెప్పించి అనేక బహుమానాలనూ సువర్ణ ఘంటా కంకణాలనూ పొంది వేనోళ్ళ పొగడబడ్డారు.

వారి బృందం పగటివేషాలంటే చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలందరూ గుంపులు గుంపులుగా వచ్చేవారు. కూచిపూడి పగటివేషధారులు సాత్వికప్రధానమైన వేషాలు ధరిస్తే వీరయ్యగారు సత్వగుణప్రధానమైనవీ, తామసగుణప్రధానమైనవీ రెంటినీ ప్రదర్శించేవారు. తామసగుణానికి చెందినవే వారి శక్తివేషమూ, బేతాళుని వేషమూ,

శక్తివేషంతో
సున్నపువారి మిన్నదనం:

వీరయ్యగారు ప్రదర్శించే ఇతర వేషాలన్నిటికీ ప్రేక్షకులు మూగేవారు కాని, ఈ శక్తి వేషప్రదర్శనంనాడు గ్రామంలో వున్న అనేకమంది పొలాలకు వెళ్ళిపోయే



మాదిగవేషం

వాడు. ఈ గ్రామంలో కొద్దిమంది తలపులు బిగించుకుని ఈళ్ళలో వ్రేలాడేవాడు. వీరయ్యగారి శక్తి వేషం సరిగా మధ్యాహ్నం పదిహేను గంటలకు మొదలవుతుంది. చప్పట్ల వాయిద్యంతో బయలు దేరేది. వేషధారిణి అతి భయంకరంగా వుండేది. కన్నులకు కోడి గుడ్లు, ముఖానికి నల్లరంగు, పెద్ద పెద్ద కోరలు, నల్లని దుస్తులు, విరబోసిన జుట్టు, చేతిలో శూలం, నోటినుంచి కారే రక్తంతో మహా భీభత్సంగా వుండేది ఆయన శక్తి వేషం.

అట్టహాసంగా
ఊరేగింపు!

ఆయనను బండిమీద ఎక్కించేవారు. తప్పెట్ల న్యత్యంతో వూరేగింపు సాగేది. ఈ

లోగా గ్రామంలోని వీధులన్నీ నిర్మానుష్యం. పిల్లల్ని ఎవర్నీ ఈ వృశ్యం చూడనిచ్చేవారుకారు, పెద్దలు మాత్రం తలుపుసందుల్లోనుంచీ, దూరంగావుండీ దర్శించేవాళ్ళు. ఈ విధంగా అంతమయ్యేది ఆయన శక్తివేష ప్రదర్శనం. ప్రదర్శనలన్నీ వరుసగా ఒక నెలరోజులు-రోజు కొక వేషంచొప్పున-ప్రదర్శించిన తరువాత వీరయ్య గారు ఈ శక్తివేష ప్రదర్శనాన్ని, బేతాళుడి వేషాన్ని, దేవరపెట్టె వేషాన్ని ధరించే వారు.

బేతాళుని పాత్రధారణ-
శివమెత్తిన సింహంలా
వీరవిహారం :

వీరయ్యగారి బేతాళుని పాత్రధారణలో రెండు చేతులకూ, రెండు బలమైన కాళ్ళు

గట్టి వెనుక కొంతమంది లాగి పట్టుకునేవారు, పీరయ్యగారు బుగ్గకు కత్తిని పొడుచుకొనేవారు. నోటినుంచి రక్తం రొమ్ముమీదికి కారుతూవుండేది. ఒక్క లంగోటి మినహా మరేమున్నట్లూ వుండేవి కావు. తప్పెట వాయిద్యాల గమనంతో ఒక వీర సింహంలా వీధిలో నటించేవారు



గట్టి బాపనయ్యల్లా పొట్టి బాపనయ్యగా
తీరి కూర్చున్న సున్నపు వీరయ్య

దేవరపెట్టె:

దేవరపెట్టె ప్రదర్శనానికి ప్రజలు ప్రత్యేకంగా హాజరయ్యేవారు. ఈ ప్రదర్శనంలో మంత్రతంత్రాలనూ, మ్యాజిక్‌లనూ మహా జోరుగా చేసేవారు. ప్రదర్శనాన్ని ఈ విధంగా ప్రారంభించేవారు.

(పాట)

అమ్మ సత్తెం చూడండి, మళ్లేలా మళ్లేలా
దేవినత్తెం చూడండి
సందుగొందులు తిరిగే తల్లి
సన్నపు కోకలు కట్టిందోయ్
మాయమ్మా మాయమ్మా
ఎన్నిమాయలు గల తల్లోయ్ మళ్లేలా
మళ్లేలా.

అంటూ నెత్తిన వున్న దేవరపెట్టెను క్రిందికి దింపి కుడిచేతికో వీరనద్ర తాడును పట్టి ఫళా, ఫళా అంటూ నాదంచేస్తూ.

చూడండి బాబయ్యా, మా అమ్మోరు సత్తెం. అమ్మోరును ఎక్కడనుండి తీసుకువచ్చామనుకున్నారు?

సీమకొండ, బెల్లంకొండ, నగరాజకొండ, గోల్కొండ, కోరుకొండ, తిరుపతికొండ, తిరుచునాపల్లికొండ, తిరువళ్ళూరుకొండ, ఆ కొండ, ఈ కొండ-అనేక కొండలు తిరిగి తీసుకువచ్చిన తల్లి బాబయ్యా. అమ్మోరు నామకరణాలు అనేకం వున్నై బాబయ్యా-కంచిలో మాకిమ్మ, గంటాలమ్మ, గంగానమ్మ, పెద్దింటమ్మ, పోలేరమ్మ, వలజారమ్మ, నాంచారమ్మ, కలకత్తా మహాకాళి తల్లండి.



అమ్మోరుసత్తెం మీలో వుంటది. నాలో వుంటది. చెట్లవుంటది. పుట్లో వుంటది: చేమల్లో వుంటది. దోమల్లో వుంటది. కొండల్లో వుంటది. కోనల్లో వుంటది. బ్రహ్మాండంలో ఆపరించి వుంది బాబయ్యా.

గుడార్ద-గోడార్ద. టక్కాట
మాయాలు గలతల్లె
దిగుమతితల్లె, దిగుమతుల్లె,
ఇదిగో చూడండి

బాబయ్యా ఇదిగోండి, ఇది కుంకుమపండి, ఈ కుంకుమ్మ అమ్మోరి సత్తెంవల్ల ఎట్టగా చేత్తాను బాబయ్యా అంటూ కొండలు మొదలు కొని, దేవతల పేర్లూ, చెట్లూ పుట్టల పేర్లూ, అస్త్రగుర్రా త్రిప్పు కోరుండా వల్లించి ఆ చేతిలోవున్న కుంకాన్ని రెండు చేతులకు పట్టించి

వీరయ్యదేవరచెట్ట వేషం

అమ్మోరు సత్తెంవల్ల రత్తం అయింది చూడండి బాబయ్యా,

ఇది అమ్మోరు సత్తెమండీ, ఇది పసుపండి
పసుపును పచ్చగ చేస్తాను బాబయ్యా
ఇది అమ్మోరు సత్తెమండి

ఇది మజ్జిగండి, మజ్జిగను చల్లచేస్తది బాబయ్యా. ఇదిగోండి, ఇది పిడక కచ్చికండి, ఈ కచ్చికను బూడిద చేస్తంది బాబయ్యా, అమ్మోరుసత్తెం చూడండి. మల్లేలా, మల్లేలా.

అంటూ వీరభద్రకొరడాతో గిర్రున తిరుగుతూ భీకరాకారంగా నృత్యం చేస్తూ పెళపెళామని కొరడానాడములు భయంకరంగా మ్రోగిస్తూ. గిర్రుగిర్రున త్రిప్పి. మోదుకుంటూ పాతగాయాలను పగులగొట్టి రక్తాన్ని చిందించేవారు. ఆ దృశ్యాన్ని చూచిన ప్రేక్షకులు భయపడి ఇది అచ్చం అమ్మవారి సత్యమను కొని తోచిన ధర్మం చేసేవారు.

ఔరారా అనిపించే
గారడీ గరిడీ
విద్యలు:

ఇంకా వేసాకులు దూసి తేళ్ళనూ, మండ్రకప్పలనూ ప్రవేశ పెట్టేవారు. పొడి ఇసుకను సీళ్ళలోవేసి మరలా పొడిఇసుకను తీసేవారు. తడిబట్టను ఆరబెట్టి అందులో జొన్నగింజలు జల్లితే పేలాలవలె వేగేవి. కొబ్బరికాయను నేలమీద పెడితే కొంతదూరం దానంతటది నడిచి వెళ్ళేది. ఒక రూపాయను పంచరూపాయలుగా ప్రత్యక్షంచేసి చూపించేవారు.

ఈ విధంగా కనికట్టూ హస్తలాఘవంద్వారా ఆయన దేవరవేషం పూర్తయ్యేది. ఈ వేషం గ్రామంలో సంచారం చేసేది కాదు. గ్రామ మధ్యన పెద్ద బజారులో రచ్చబండవద్ద జరిగేది. ఈ విధంగా వీరయ్యగారి బృంద ప్రదర్శనాలు భారీఎత్తున జరిగేవి. వారి ప్రదర్శనాల్లో ఇంతా చెప్పుకోదగింది భోగం మేళం.

ఈ పగటివేషాల ఒకను గోదావరి మండలంలో పాలంకి నారప్ప. రావూరు సూరయ్య. వేషుల బాపయ్య. భాగవతుల కోనయ్య. కాలనాధ భట్ల వెంకయ్య. అనకాపల్లి గంగాధరం, కృష్ణపాడు జంగాలు. నెల్లూరు మూలపేట జంగాలు. కాకినాడరెడ్లు, నరసరావుపేట ఎర్రగొల్లలు మొదలైనవారు ఆరాధించారు. ఈనాటికీ పగటివేషాల సాహిత్యం కూచిపూడిలోనూ, దగ్గరగా నున్న మొవ్వగ్రామంలోనూ వుంది.

ఇటీవల ఆంధ్రదేశంలో ఆంధ్రప్రజా నాట్యమండలికి సంబంధించిన అనేక దళాలు పగటివేషాలను ధరించి, తద్వారా రాజకీయ ప్రబోధాన్ని కలిగించారు. సంఘవిద్రోహుల్ని చీల్చి చెండాడే సాహిత్యంద్వారా ప్రజా ప్రబోధాన్ని కలిగించారు. ఇలా పగటివేషాలను ధరించిన వారిలో కోగంటి, కోసూరు పున్నయ్య, మాచినేని, మిక్కిలినేని, డాక్టరు రాజారావు, నాయరు, రాపకోటి మొదలైనవారు ముఖ్యులు.



# 8

# దేవదాసీలు



దేవదాసీలు-నట్టువమేళ, నాట్యమేళలు-కచేరీ
నృత్యం-గొల్లకలాపం- భామాకలాపం - భాగ
వతం, భాగవతకళ - వనవిహారం - భోగం
మేళాలు-వానికెక్కిన కొందరు నట్టువకాండ్రు,
నట్టువకత్తెలు

# దేవదాసీలు

ఆంధ్ర దేశంలో దేవదాసీలూ, భాగవతులూ నృత్యకళను పోషించి అభివృద్ధి లోకి తీసుకువచ్చారు. దేవదాసీల నృత్యకళ, భాగవతుల నృత్యకళ అని అది వేరు వేరుగా అభివృద్ధి పొందింది.



నాట్యకళ పెంపుపోషణల్లో
దేవదాసీలవంతు,
భాగవతుల పాలు :

భాగవతులు యక్షగానాలూ, వీధి భాగవతాలూ, భామాకలాపాల ద్వారా నృత్యకళను ప్రచారం చేశారు.

దేవదాసీలు దేవాలయాల నృత్యమండపాలలో, దేవుని సన్నిధానంలో శైవ, వైష్ణవ సాంప్రదాయాల ననుసరించి ఆరాధననృత్యాలూ, అష్టదిక్పాలక నృత్యాలూ, కేళికా ప్రదర్శనాలూ, కలాపాలూ మొదలైన నృత్యాలను ప్రదర్శించేవారు.

రెండు పోకడలు,
రెండు పోబడులు :

పై వివరాల్నిబట్టి ఆంధ్రదేశంలో శాస్త్రీయమైన కళ రెండు విధాలుగా అభివృద్ధి జెందింది. ఒకటి నట్టువ మేళ సాంప్రదాయం; రెండవది నాట్యమేళ, భాగవత మేళ సంప్రదాయం. ఈ రెండూ శాస్త్రీయమైన పద్ధతికి సంబంధించిన వైనప్పటికీ ప్రయోగ ప్రదర్శన విధానాలలో భేదం వుంది.

ఆలయాల్లో దేవతా సన్నిధిని దేవదాసీలు చేసే నృత్యం, ఆలయ ప్రవేశ ణలో కళ్యాణ మండపం వద్దనూ, స్వామి కొలువులోనూ వినోద ప్రదర్శనంగా ప్రదర్శింపబడే కేళికా, రాజదర్బారుల్లోనూ, ఇతర సభల్లోనూ కళావంతులు ప్రదర్శించే కలాపాలు మొదలైనవీ నట్టువమేళానికి సంబంధించినవి. ఈ నట్టువ మేళాల్లో పురుషుల హంగుతో స్త్రీలు మాత్రమే నాట్యం చేస్తారు.

పురాణాలకు సంబంధించిన ఇతివృత్తాలను నృత్య నాటకాలుగా ప్రదర్శించే సంప్రదాయం నాట్యమేళ, లేక భాగవతమేళ సంప్రదాయంగా వర్ధిల్లింది. ఈ సంప్రదాయంలో స్త్రీలు పాల్గొనరు: స్త్రీ పాత్రల్ని కూడా పురుషులే ధరిస్తారు.

ఎందుకు వచ్చినట్లు
ఈ పేరు?

భగవంతునికి సంబంధించిన గాథలను ప్రచారం చేయడం వలన వీరిని భాగవతు లన్నారు. ఆలయాలలో దీపారాధన తరువాతనూ, ప్రత్యేక వుత్సవ సమయాల్లోనూ నృత్యాలు జరుగుతూ వుంటాయి. ఆలయాల్లో ప్రదర్శించే ఆరాధన నృత్యాలు దాదాపు 40 వరకూ వున్నవట.

అక్షరాలా
అతికిన పేరు:

స్వామి సన్నిధిలో బలిపీఠంపైన నృత్యం చేయడానికి అధికారముద్రల్ని పొందిన వారే ఈ అర్హతను కలిగి వున్నారు. అటువంటివారే నిజమైన దేవదాసీలు. తమ జీవిత సర్వస్వాన్ని దేవుని సేవకే అంకితంచేసి ఆ ఐక్యమునకై తహతహ లాడేవారే దేవదాసీలు.

పెంచిపోషించిన
పెద్దలు:

ఆంధ్రదేశానికి సంబంధించినంతవరకూ భాగవత మేళాలద్వారా నృత్య కళను పోషించినవారు పొతకమూరి భాగవతులూ, కూచిపూడి, కోటకొండ, మేలటూరు భాగవతులూ.

పూర్వం దేవాలయ నర్తకీమణుల్లో ఒకరిని మించినవారు మరొకరుండే వారు. వారు నృత్యకళను పట్టుదలగా అరాధించేవారు. పోటీపడి ఆ విద్య నభ్యసించేవారు.

రాజాస్థానాల్లో మాత్రం అనేకమంది బృందనాట్యాల్లో పాల్గొనే నాట్య కత్తెలు ఉన్నప్పటికీ, రాజనర్తకిగా మాత్రం ఒక్కరే నిర్వహించేది. ఆ విధంగా రాయల ఆస్థానంలో రంజకం కుప్పాయి. రఘునాధ రాయల ఆస్థానంలో ముద్దు

చంద్రరేఖ—రూపవతి—శశిరేఖ — లోకనాయిక. ప్రతాపరుద్రుని ఆస్థానంలో మాచల్దేవి. కుమారగిరిరెడ్డి ఆస్థానంలో లకుమాదేవి మొదలైనవారు రాజనర్తకి సంప్రదాయానికి చెందినవారు.

# నట్టువ మేళలు

కచ్చేరీ నృత్యకళనుంచి వుద్భవించినవే నట్టువమేళలు. కచ్చేరీ నృత్యకళ కేవలం రాజాశ్రయమైనది. ఈ నట్టువమేళాలు అఖిలాంధ్ర ప్రజానీకానికీ పరిచయమైనవి.



ఇది వీధికళా రూపమని చెప్పవచ్చు. వివాహాది వూరేగింపుల్లోనూ, మేజువాణీలలోనూ, గొప్ప గొప్ప తిరుణాళ్ళలోనూ, దేవునికల్యాణ వుత్సవాలలోనూ ఇవి ప్రదర్శింపబడేవి. పండితులనేకాక పామరుల్ని కూడా రంజింపజేయగల కళారూపమిది. మొరటు హాస్యపుపాటలతో కూడ ప్రేక్షకుల్ని రంజింపజేయడం కద్దు. కచ్చేరీ నృత్యకళకూ, నట్టువ మేళాలకూ అవినాభావ సంబంధముంది. ఈ రెండు కళలనూ ఆరాధించినవారు ఎక్కువమంది దేవదాసీలే.

కచ్చేరీ ఆట దేవాలయాల్లో జరిగే టప్పుడు వీరు మేళప్రాప్తితో ప్రారంభించి, పుష్పాంజలి, పేరణి, గీతం, శబ్దం, సలాం, జతి, వర్ణం, పదం, జావళి, తిల్లాన లేకదరువుతో ముగిస్తారు—శబ్దం, సలాం, జతుల్లో ఆంగిక ప్రధానమైన ముద్రలు విశేషంగా ప్రదర్శించే నృత్యాన్ని ప్రదర్శిస్తారు. ఆ తరువాత వర్ణంలో నృత్తనృత్యాలు సమంగా పోషించి సాత్వికాభినయ ప్రాముఖ్యంతో, జావళీలలో ప్రదర్శించి తిల్లాన నృత్యంతో ప్రదర్శనం ముగిస్తారని నటరాజ రామకృష్ణగారు వివరించారు.

కళాకారులకు

శిక్షణ :

నట్టువమేళాలతో నాట్యశాస్త్ర ప్రావీణ్యం తగ్గిపోతూం దనుకున్న కళాకారులందరూ కట్టుదిట్టమైన శిక్షణ పొందాల్సి వచ్చింది. భాగవతమేళాల్లో వుండే కళాకారు లందరికీ సంస్కృతం, తెలుగు వచ్చివుండాలి. నాట్యశాస్త్రం, నందికేశ్వరుని అభినయ

దర్పణం, భరతరసప్రకరణం, ఆలంకార శాస్త్రం క్షుణ్ణంగా అభ్యసించి, నృత్త, నాట్య, అభినయాలలో పూర్తి కళావికాసాన్ని పొందేవారు. ఇలాంటి శిక్షణతో నటులందరూ తయారయ్యేవారు. ఎవరిని కదిలించినా, అందరూ పండితులమాదిరే వల్లించేవారు. అందువల్లనే ఆనాటి వారి ప్రదర్శనాలు అంత కట్టుదిట్టంగానూ, కళా ప్రాశస్త్యంతోనూ ప్రదర్శించ బడ్డాయి.

## కచ్చేరీ నృత్యకళ

ఒకే నర్తకి ఏకధాటిగా నృత్యం చేయడం కచ్చేరీ నృత్యకళయొక్క ప్రత్యేకత. రాజాస్థానాలలో అభివృద్ధిచెందిన ఈ కళ దేవదాసీలచే ఆరాధింపబడి ఆంధ్ర దేశంలో కచ్చేరీ:కళగా రూపొందింది. ఆంధ్రదేశంలో అభివృద్ధిపొందిన కూచిపూడి నాట్యానికీ, దీనికీ ఏ విధమైన సంబంధమూ లేదు. ఈ కళను బొబ్బిలి, విజయనగరం, కార్వేటినగరం, వెంకటగిరి, కాళహస్తి మొదలైన సంస్థానాధిపతులు పోషించారు.

ఆనాటి నాట్యశాస్త్రకారులు నృత్యాన్ని, నృత్తాన్ని, అభినయాలనూ మేళవించి ఒక నృత్యక్రమాన్ని ఏర్పాటుచేసి ఒక నృత్యకళగా కచ్చేరీ నృత్యకళను ప్రచారంలోకి తీసుకు వచ్చారు. దేవదాసీలు క్షేత్రయ్య పదసాహిత్యానికి నృత్యాభినయాలను రూపకల్పనచేసి ఈ కచ్చేరీ నృత్యకళను ప్రదర్శించేవారు. ఆస్థానాల పోషణ తగ్గిన అనంతరం, దేవదాసీలు కేవలం వుదరపోషణార్థం దీనిని వుపయోగించారు. సాత్విక ప్రధానమైన ఈ నృత్యకళ ఈనాడు ఆంధ్రదేశంలో అక్కడక్కడ వృద్ధ దేవదాసీల సొత్తుగా వుందని నటరాజ రామకృష్ణగారు తెలియజేస్తున్నారు.

## మారంపల్లి గొల్లకలాపం

శతమానం భవతి-

'చిత్తజిల్లు' చేవాసి:

గొల్లకలాప ప్రదర్శనం ఆంధ్రదేశంలో నూరు సంవత్సరాలక్రితమే ప్రదర్శింపబడింది. ప్రథమంలో కూచిపూడి భాగవతులు గొల్లకలాపాన్నే ప్రదర్శించారు.



వీరు ప్రదర్శించిన తరువాతే మారంపల్లి చిత్తజల్లువారు కాని, ఆంధ్రదేశంలోని ఇతర కళాకారులుగాని ప్రదర్శించారు. గొల్లకలాపం తరువాత భామాకలాపం ప్రచారంలోకి వచ్చింది. భామాకలాపాన్ని కూచిపూడివారు ఆనాటినుంచీ ఈనాటివరకూ ప్రదర్శిస్తూనే వున్నారు.

గొల్లకలాపం మాత్రం పశ్చిమగోదావరి జిల్లాలో మూడు తరాలుగా సజీవంగా నిలిచి వుంది. గొల్లకలాపాన్ని పెంచి పెద్దచేసి పోషించినవారు నిడుదవోలుకు సమీపానగల మారంపల్లి వాస్తవ్యులు. కళావంతుల కులానికి చెందిన కీ. శే. చిత్తజల్లు లక్ష్మీకాంతం, రావూరి కామయ్య, కామయ్యగారి సోదరులు సూరయ్య, వెంకయ్య, సత్యం మొదలైనవారంతా మారంపల్లిలోనే వుండి గొల్లకలాప ప్రదర్శనాన్ని గోదావరి మండలంలోనూ, సర్కారుజిల్లాలలోనూ ప్రదర్శించి పేరు ప్రతిష్ఠలు సంపాదించారు. ఆంధ్రదేశంలో కర్ణాటక కిచ్చేరీ నాట్యాన్ని, భాగవత కళను రెంటినీ ఆరాధించిన దేవదాసీ కుటుంబాల్లో చిత్తజల్లువారు బహు ప్రసిద్ధులు.

చిత్తాలను జిల్లుమనిపించిన
చిత్తజిల్లు
లక్ష్మీకాంతం :

లక్ష్మీకాంతం మృదుమధురంగా సంగీతం పాడగలిగేది; చక్కగా నృత్యం చేయగలిగేది. సంస్కృతభాషాజ్ఞానాన్ని సంపాదించిన కళాకారిణి. లక్ష్మీకాంతం ప్రథమంలో కూచిపూడి భామాకలాపాలనే ప్రదర్శిస్తూ వుండేది. తరువాత కామయ్యగారి సహాయంతోనూ, వారి తమ్ముల అండతోనూ గొల్లకలాపం నేర్చుకుని బహుళ ప్రచారం గావించి, ఆంధ్రదేశంలో గొల్లకలాపాన్ని వ్యాప్తిలోకి తీసుకు వచ్చి కొంతకాలానికి స్వర్గస్థురాలైంది. ఆమె అనంతరం గొల్లకలాప ప్రదర్శనాన్ని చేయివిడవకుండా ఆమె కుమార్తెలు కృష్ణహరి, చినవెంకటరత్నం కొనసాగించారు.

వరుస తప్పని
వారసత్వం :

లక్ష్మీకాంతం చెల్లెలు వైదేహి. ఈమె పెదవెంకటరత్నం అనే కుమార్తెను కని చిన్నతనంలోనే మరణించింది. లక్ష్మీకాంతం కుమార్తె అయిన కృష్ణహరి వైదేహి, ఇందువదన అనే ఇరువురు కుమార్తెలను కని. ఆమె కూడ దివంగతురాలైంది.



అందువల్ల లక్ష్మీకాంతం తన కుమార్తె చిన వెంకటరత్నానికీ, చెల్లెలి కుమార్తె పెద వెంకటరత్నానికీ కామయ్యగారి సోదర బృందం ద్వారా విద్యాబుద్ధులు చెప్పించి గొల్లకలాప ప్రదర్శనానికి సరియైన తీరికలు తీర్చిదిద్దారు.

సంగీత సాహిత్యనిధి
రావూరి కామయ్య :

సంగీత,సాహిత్య, నాట్యకళానిధి రావూరి కామయ్య చిత్తజల్లు పెదవెంకటరత్నం గారు.వీరి స్వగ్రామం వెలదుర్టు. వీరు బ్రాహ్మణ కుటుంబానికి చెందినవారు. వీరు మారంపల్లి వారి గొల్లకలాప బృంద నిర్మాణానికి మూలపూరుషులు. వీరి మరణానంతరం శ్రీ వెంకయ్య, సూరయ్య, సత్యంగార్లు మారంపల్లెలో స్థిరపడిపోయి చిత్తజల్లు కళాకారిణులతో చాలాకాలం గొల్లకలాప ప్రదర్శనాలను ఇచ్చారు.

కామయ్యగారు హాస్యం చెప్పడంలో నిధి. ఎటువంటి అర్థంకాని విషయాన్నైనా తన హాస్య కళానిపుణత్వంతో తేటతెల్లం చేసేవారు. భామాకలాపం, గొల్ల కలాపం రెంటిలోనూ హాస్యానికి పెట్టింది పేరు. ఈయన అటు విశాఖజిల్లానుండి ఇటు గుంటూరువరకూ పేరు ప్రతిష్ఠలను సంపాదించారు.

వీరి సోదరులు వెంకయ్యగారు సంగీతంలో ఆరితేరిన మేధావి. సత్యంగారు సంస్కృతాంధ్రభాషల్లో మంచి పండితుడు. వీ రిరువురూ తమకు కావలసిన అనేక కీర్తనలకు స్వరాలనూ, మట్లనూ, గమకాలనూ తామే తయారుచేసుకునేవారు. ఇక సూరయ్యగారు తమ సంచారంలో తటస్థించిన అనుభవాలనన్నిటినీ క్రోడీకరించి

సమయానుకూలంగా ప్రేక్షకుల ననుసరించి, సమయాసమయాలు ఆలోచించి, గొల్ల కలాప ప్రదర్శనంలో చేర్చి ప్రజారంజకంగా ప్రదర్శించేవారు.

ఏవంరీతిగా గొల్లకలాపాలను ఎక్కువకాలం (దాదాపు 40 సంవత్సరాలు) వెంకటరత్నం సోదరీమణులు ఆంధ్రదేశమంతటా ప్రదర్శించి కళాసేవ చేశారు.

### కర్త, కారయిత్రి
### వైదేహి, ఇందువదన :

వైదేహి ఇందువదన లిరువురూ మరణించేవరకూ గొల్లకలాప ప్రదర్శనాన్ని చెదురు మదురుగా ప్రదర్శిస్తూ వచ్చారు. వైదేహి గొల్ల కలాప ప్రదర్శనంలో సిద్ధహస్తురాలు. ఆమె సోదరి ఇందువదన ప్రయోక్తగా వుండి అక్కగారి చేత నాట్యమాడించేది. ఈ విధంగా వీరిద్దరూ అయిదు దశాబ్దాలు నాట్యకళారాధన చేశారు. వైదేహి పంచ కావ్యాలూ, అమరమూ, వేమూ పురాణ పండ వెంకటశాస్త్రిగారివద్ద పకడ్బందీగా చదువుకుంది. అభినయం, సంగీతం, వేదం, స్మృతులు, పురా ణాలు, భరతశాస్త్రం, అలంకారశాస్త్రం, రస శాస్త్రమూ పండితులవద్ద ప్రత్యేకంగా అభ్యసించింది. ఇందువదన చదలవాడ కుమారస్వామిగారి వద్ద సంగీతాన్ని, లయజ్ఞానాన్ని నేర్చుకుంది. వీరి నాట్యశిక్షణ తెల్లవారుఝామున ప్రారం భిస్తే రాత్రి పదిగంటలవరకూ కొద్ది విరామాలతో అలా అలా నడుస్తూనే వుండేదట. ఈ విధంగా ఈ శిక్షణ పది సంవత్సరాలు జరిగిన తరువాతనే వీరు రంగస్థలంపై కాలికి గజ్జెగట్టి బహిరంగంగా ప్రదర్శనాలు ఇవ్వగలిగారట. వీరు భామాకలాపం గొల్లకలాపాలనేగాక, భోగం మేళాలుగా వివాహ సమయాల్లోనూ, దేవాలయ కల్యాణమహోత్సవాలలోనూ తమ కార్యక్రమాలు ప్రదర్శించేవారు. ఇందువదన హరికథా కాలక్షేపంకూడా చేసేదట.



చిత్రజల్లు వైదేహి

### గొల్లకలాపాల
### ప్రదర్శనపద్ధతి :

గొల్లకలాప ఇతి వృత్తాన్ని గురించి 'కూచిపూడి భాగవతాలు' అన్న శీర్షికలో చర్చిం చాం. గొల్లకలాప ఇతి వృత్తంలో అనేకరకాలైన కీర్తనలు, మట్లు, గమ

కాలూ వుంటాయి. మంచి సాహిత్యం, సాహిత్యానికి తగిన సంగీతం, సంగీతానికి తగిన ఫణతులు, వీటన్నిటికీ తగిన నాట్యంతో గొల్లకలాప ప్రదర్శనం ఒక కమ్మని కళా ఖండంగా ప్రదర్శింపబడుతుంది.

గొల్లకలాప ప్రదర్శనంలో ఆనాడు ఏ విధమైన తెరలూ వుపయోగించ లేదు. ప్రదర్శనం ప్రారంభించి, సాంతమయ్యేవరకూ నటీ నట బృందమంతా రంగస్థలంమీదే వుంటారు. ప్రధాన నాయికకు సహాయంగా మరో సహాయ నాయిక వుంటుంది. వీరిద్దరూ కాక కథా గమనాన్ని అత్యంత చమత్కారాలతో ప్రేక్షకులకు వినిపించి కళ్ళకు కట్టినట్లు, ప్రతిభావంతంగా చిత్రించే విదూషక పాత్రధారి వేరే ఒకడు వుంటాడు. ఇతనిని హాస్యగాడు అని పిలిచేవారు. వీరు ముగ్గురే గొల్ల కలాప ప్రదర్శనానికి నటీ నట వర్గమని చెప్పవచ్చు. వీరు గాక వీరికి హంగు దార్లుగా ప్రక్క వాయిద్యాలు, మృదంగం, ఫిడీలు, హార్మోనియం, తాళగాండ్రు వుంటారు. హాస్య పాత్రధారి, సహాయ కథా నాయిక కూడ తాళంవేస్తూ వుంటారు. ఇతర కళారూపాల్లో వలెనే ఇష్టదేవతా ప్రార్థన, విఘ్నేశ్వర స్తుతి, సరస్వతీపూజ మొదలైన సంప్రదాయాలను కూడా అక్షరాలా పాటించేవారు.

సంశయాలూ సందేహాలూ తీర్చే
భాష్యకారుడు హాస్యగాడు :

కథా గమనంలో, అందరికీ అర్థమయ్యే శైలిలో, మధ్య మధ్య అనేక పిట్టకథల ద్వారా, ప్రేక్షకులకు వచ్చే సందేహాలను తానే కథా నాయికని ప్రశ్నించి ఇతగాడు కథలో వచ్చే చిక్కులన్నీ సుబోధకం అయ్యేలా చేస్తాడు.

గంభీరమైన అనేక విషయాలను కరబదరీ సమానంగా వివరించి, ప్రేక్షకులకు విసుగు జనించకుండా తన అద్భుత చమత్కృతితో పండితులనుండి పామరుల వరకూ అందర్నీ రంజింపజేసే వైజ్ఞానిక పాత్రధారి మన హాస్యగాడు.

ఈ ప్రదర్శనానికంతా ప్రధాన కథానాయిక ఎంత అవుసరమో, హాస్య పాత్రధారి కూడ అంత ముఖ్యం. గొల్ల కలాపంలో మన నాటకంలో మాదిరి, భాగవతంలోమాదిరి వచ్చీ పోయే పాత్ర లేమీ వుండవు. ఒకసారి రంగస్థలం పైకి ప్రత్యక్షమైతే ఆ ముగ్గురూ ఆసాంతం వుంటూనే వుంటారు.

హాస్యకాండ
బరువు బాధ్యతలు :

గొల్లకలాపంలో చెప్పబడే అనేకమైన వుదాత్త విషయాలను పై మూడు పాత్రలే వుదాహరించాలి. ఇలా వివరించడంలోనూ ప్రేక్షకులకు ఏ విధమైన విసుగూ లేకుండా ప్రదర్శించాలి. ఇది చాలా కష్టమైన విషయం. కాని మన హాస్యకాడు వినోదంతోనూ,పిట్ట కథలతోనూ, ప్రజాజీవితంలో నిత్యం వాడబడే అనేకచాటువుల తోనూ ప్రేక్షకుల నందరినీ సమాళించి చమత్కారంగా తన వశంలో వుంచు కుంటాడు.

మూడురోజులనుంచి ఒకేరోజుకు
ప్రదర్శనకాలం కుదింపు :

గొల్ల కలాపాన్ని ప్రదర్శించాలంటే ప్రతి రాత్రీ ఏడుగంటల చొప్పున ప్రదర్శిస్తే కనీసం మూడు రోజులకుగాని పూర్తి కాదు. చిత్తజల్లువారూ ప్రథమంలో ఈ కార్యక్రమాన్నంతా వరుసగా మూడు రోజులూ ప్రదర్శించేవారు. కాని, రానురాను ప్రజలలో చూచే వుత్సాహం, వినే ఓపికా తగ్గటం, చాలనందుకు పండితులూ, రసికులైన ప్రేక్షకులూ కూడ తగ్గటంవల్ల ప్రదర్శనకాల పరిమాణం విధిగా తగ్గిపోయి, ప్రజలకు ఖచ్చితంగా కావలసిన ఖరారు ఘట్టాలనే ప్రదర్శిస్తూ కిందా మీదా బడి ఎలాగో ఓలాగు కుదించి ఒకే రోజున ప్రదర్శనాన్ని ముగిస్తూ వచ్చారు:

గంధర్వకన్యల
వనవిహారం :

గొల్లకలాప ప్రదర్శనాన్నేకాక వీరు 'వనవిహార'మనే మరో ప్రవర్శనాన్ని కూడ ప్రదర్శించేవారు. ఈ ప్రదర్శనం గురించి ప్రత్యేకించి చెప్పదగ్గవి కథా విధానం, ఇద్దరు గంధర్వ కన్యలమధ్య జరిగే సంభాషణా విధానం.

ఈ సంభాషణంతా చాలావరకు సంస్కృతభాషలోనే నడుస్తూ వచ్చినా అక్కడక్కడ తెలుగుకీర్తనలుపాడుతూనూ దీనిని ప్రదర్శిస్తారు. ఇరువురు గంధర్వకన్యలు వనవిహారానికొచ్చి పూలతోటలో పూలబంతులాటలు ప్రారంభించి ఋతువుల్ని గురించీ, పూవులనుగురించీ, చెట్లనుగురించీ రకరకాల వర్ణనలు సాగించడం

రూపంగా ఇది నడుస్తుంది. ఈ ప్రదర్శనం ప్రేక్షకులకు గుమ్మెక్కించేటట్లు ప్రదర్శించాలంటే ఆ కన్య లిద్దరూ మిసమిసలాడే యౌవనవతులై వుండాలి. అప్పుడే ఆయొక్క ప్రదర్శనానికినిండు దనంవచ్చేదీ: ప్రదర్శనం రక్తి కట్టేదీనిః

తప్పనిసరి హంగులూ,
పొరంగులు :

గొల్లకలాపంకాని. వనవిహారం కాని, ప్రదర్శించాలంటే ముఖ్యంగా సంస్కృ

తాంధ్ర భాషలు క్షుణ్ణంగా వచ్చి తీరాలి. సరియైన విద్యా, విద్యకు తగిన విజ్ఞానమూ, దానికి తగిన సంస్కారమూ, కట్టుతప్పని పట్టుదలా కావాలి, భ్రుతితప్పని సంగీతమూ, తొట్రుపడని, మట్టుమీరని సరియైన ఉచ్చారణా కావాలి.

మారంపల్లివారిని మనవారు
మరువరు, మరువలేరు :

ఈ విద్యను చెక్కుచెదరకుండా మూడు తరాలుగా చిత్తజల్లువారి కుటుంబం కాపాడుకుంటూ వచ్చింది. ఈనాడు ఏబైఏళ్ళ పండు వృద్ధురాలు చిత్తజల్లు పెద వెంకటరత్నమ్మ తప్ప ఆ కుటుంబంలోని వారందరూ మరణించారు. గొల్లకలాప కళాఖండం వారితోపాటే అంతరించింది. ఏమైనా నూరు సంవత్సరాలనుంచీ గొల్ల కలాప ప్రదర్శనాన్ని పెంచి పోషించి, ఆంధ్రదేశమంతటా ప్రదర్శించి ప్రఖ్యాతి వహించిన మారంపల్లి వాస్తవ్యులు చిత్తజల్లు సోదరీమణులూ, రావూరి కామయ్య సోదరులూ స్మరణీయులు. వర్తమానంతోపాటు భవిష్యత్ సహా ఆంధ్రదేశం వారిని, వారి కళాసేవను మరువజాలదు.

చాటుపర్తి సుందరి
శకం :

పశ్చిమ గోదావరిజిల్లా ఏలూరు వాస్తవ్యురాలైన చాటుపర్తి సుందరిది ఒకశకం. ఆమె దేవదాసి. ఒక మేళానికి నాయకురాలుగా వ్యవహరిస్తూ వుండేది. ఆమె కచేరీ నాట్యంలోనూ, దేవదాసీ నృత్యంలోనూకూడా ఘటికురాలు. విద్యలో ఆమెను మించినవారు లేరనేటంతటి గర్విత. ఒక సారి నర్సాపురంలో ఒక వైశ్యులఇంట ఒక వివాహ సందర్భంలో ఈ సుందరి తన బృందంతో గజ్జె కట్టింది. మెడనిండా మెడల్స్ధరించి తీవిగా రంగస్థలంలో ప్రవేశించింది.

ఈ వివాహానికి శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారూ, వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రిగారూ(ఈ సందర్భాన్ని పురస్కరించుకుని-ముఖ్యంగా ఆమె విద్యలుపరీక్షించడానికి) వచ్చారు. సుందరి పుష్పబాణవిలాసంలోని ఈ సంస్కృత శ్లోకాన్ని అభినయంతో ప్రారంభించింది:

కాంతో యాస్యతి దూరదేశమితి మే చింతా పరం జాయతే,
లోకానందకరోపి చంద్రవదనే, వైరాయతే చంద్రమాః.

అంటూ శ్లోకాన్ని పదవిభాగంచేసి అభినయానికి ఉపక్రమించింది. ఆ సందర్భంలో పంచబాణాలను అభినయరూపంలో ప్రదర్శించే పద్ధతి చూపెట్టడానికి శ్లోకాన్ని ఇలా ప్రారంభించింది.

అరవింద మశోకంచ చూతంచ నవమల్లికా,
నీలోత్పలంచ పంచైతే పంచబాణస్యసాయకాః.

అరవిందము—అశోకము—చూతము—నవమల్లిక—నీలోత్పలమూ మొదలైనవి మన్మథుని పంచబాణాలు. ఈ అభినయంలో సుందరి పంచబాణాలనూ ప్రయోగించింది. అసలు రంగంమీద చతుర్బాణాలే అభినయరూపంలో ప్రదర్శించాలి. పంచమబాణం ఉపయోగించినట్లయితే నాయిక మృతి పొందుతుంది. ఆ తరువాత అభినయించేందుకు నాయికవుండదు. కాని ఈ సుందరి ఆనాటి అభినయంలో పంచబాణాలనూ ఉపయోగించింది.

వెంటనే పండితు లిద్దరూ ఈ సభకు మైల వచ్చిందని కేకలువేయడం ప్రారంభించారు. సభంతా గందరగోళమైంది. నాయిక బిత్తరపడిపోయింది. ఆ సభలో పండితు లిద్దరువచ్చి కూర్చున్నారన్న సంగతి అంతవరకూ ఈ సుందరికి తెలియదు.

ఈ విషయం తెలుసుకున్న సుందరి వెంటనే విరునవెళ్ళి పండితుల పాదాలమీద వాలింది. అప్పుడు శాస్త్రిగారు అభినయంలో కలిగిన లోపాలను చూపించారు. "చతుర్బాణాలనే అభినయంలో ఉపయోగించాలి కాని, నీవు పంచబాణాలూ ఉపయోగించావు. అందువల్ల స్థలం మైలవడింది. అందుచేత కళామతల్లికి కలిగిన

ఈ కళంకాన్ని భరించలేక ఈ రూపంలో నీకు తెలియజేయవలసి వచ్చింది." అని అనడంతో సాష్టాంగ దండప్రణామాలు ఆచరించి, తన బసకు తీసుకుపోయి, పండితు లిద్దరినీ సత్కరించి, కానుకలిచ్చి గౌరవించి శాస్త్రిగారి శిష్యరాలుగా చేరి పోయింది.

# స్వశక్తితో రక్తికెక్కిన మహావ్యక్తులు

## పాటకత్తెగానూ, ఆటకత్తెగానూ ప్రశస్తిగాంచిన 'కళావర్‌రింగ్':

కచేరీ నృత్యానికీ కర్ణాటక నృత్యానికీ కొత్త మెరుగులుదిద్ది విజయనగరం రాజ నర్తకిగా, నాటకరంగ నటిగా, అమరగాయనిగా, చలనచిత్ర నటీమణిగా రసిక హృదయాల్ని రంజింపజేసిన కళాకారిణి కళావర్‌రింగ్ అనే పేరుతో చెలామణి అయిన శ్రీమతి సందె లక్ష్మినర్సయ్యమ్మ. ఈవిడ విజయనగరానికి 8 మైళ్ళ దూరంలోవున్న కోరుకొండ గ్రామంలో 1908 లో జన్మించింది. 8 వ ఏటనే నర్తకిగా పేరు తెచ్చుకుంది. 5 వ తరగతి వరకూ ప్రాథమిక విద్యాభ్యాసం చేసి శ్రీ మద్ది లచ్చన్నగారివద్ద సరిగమలు ప్రారంభించి, శ్రీ ద్వారం వెంకటస్వామి నాయుడు శిష్యులైన శ్రీ మద్దిల సత్య మూర్తి, శ్రీ చాగంటి రంగబాబు, శ్రీ కోటిపల్లి గున్నయ్య మొదలైన వారివద్ద సమగ్ర సంగీత జ్ఞానం సంపాదించింది. నృత్యవిద్యలో శ్రీమతి మద్దిల అప్పడు, శ్రీమతి మద్దిలరాముడువద్ద శిక్షణ పొందింది. మద్దిల హేమావతి, నరహరమ్మల వద్ద హిందుస్తానీ జావళీలు, క్షేత్రయ్య పదాభినయం నేర్చుకుంది. 12 సంవత్స రాల వయస్సులోనే బోగంషేళం నాయకురాలుగా వ్యవహరించింది. ఆమె నృత్యా నికి అచ్చెరువందిన ప్రేక్షకులు ఆమెను 'కళావర్ రింగ్' అని పిలిచేవారు.



శ్రీమతి సందెలక్ష్మినర్సయ్యమ్మ

ఆంధ్రదేశంలోనూ, రాష్ట్రేతర ప్రాంతాల్లోనూ నానారాజ సందర్శనంచేసి సంగీత నృత్యవిద్యలో మహా పండితుల్ని మెప్పించి, నాట్యతరంగిణి, నవవసంత కోకిల, గానకళాకోవిద అనే బిరుదులతో సువర్ణ హస్తకంకణాల బహుమానాలతో

సన్మానాలు అందుకున్నది. జయపూర్, ధారాకోట, కళ్ళికోట, చీకటికోట, కలహండి, కరియల్, మధుపూర్, టికిరియా సంస్థానాల్లో ఆమెను ఘనంగా సన్మానించారు.

ఆమె తెలుగు చలనచిత్రరంగంలోనూ ప్రవేశించి 'రాణీ ప్రమీల' చిత్రంలో ప్రధానపాత్ర ధరించి చక్కగా పాడి నటించింది. 1947 లో మద్రాసు రేడియో ప్రసారంచేసిన సీతారామకల్యాణం, సుందరకాండ, సకుబాయి, శ్రీరామజననం, భక్త రామదాసు నాటకాల్లో పాల్గొని అత్యుత్తమంగా నటించింది.

1934లో ఆమె అనేక గ్రామఫోన్ రికార్డుల నిచ్చింది. కోకిల 'కోయి' అని కూయగా, వ్యాకులమానసమాయెగా, చిటపట చినుకులు దుప్పటి తడిసెను, పచ్చబొట్టు ప్రాణనాథా....సైపగజాల, రాత్రి నాటకం, ఏరా నాప్రియ మొదలైన పాటల రికార్డులు వెలువడ్డాయి. చింతామణీ గ్రామఫోను రికార్డుల నాటకంలో చింతామణిపాత్ర ధరించింది.

1964 మార్చి 17 వ తేదీన ఆమెను ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ హైదరాబాదు రవీంద్ర భారతిలో సన్మానించింది.

నృత్యప్రదర్శనంద్వారా కళావర్షింగ్ అపారంగా ధనం ఆర్జించింది. అనేకమంది బీదవిద్యార్థులకు ఆర్థికసహాయం చేసింది. అంతే కాదు. అవసరాల్లో వున్నవాళ్ళను ఆదుకుని అనాధులకు ఆశ్రయం ఇవ్వటం ఆమె సుగుణాలు. ఆమె, అంతిమదశలో, అకాడమీ వారి వేతనంతో, హరికథా గానంతో జీవితం గడిపి 1964 లో స్వర్గస్థురాలైంది.

కోనసీమకెల్లా మిన్నగా ఎన్నికైన
అన్నాబత్తుల బుల్లి వెంకటరత్నం :

ఈమెను అన్నాబత్తుల చిట్టి అనే చాలామంది పిలుస్తూ వుంటారు. ఈమె తరతరాలుగా అభినయవిద్యను ప్రదర్శించే విద్వత్కుటుంబంలో జన్మించింది. బుల్లి వెంకటరత్నం ఆరు సంవత్సరాల పూపప్రాయంలోనే అమ్మమ్మవద్ద అరుదుగా భరత నాట్యాన్ని నేర్చుకుంది. కుటుంబంలో ఎడసారి బిడ్డ అవడంవలన కుటుంబంలోని వా రందరూ ఆమెను ప్రేమతోపెంచి పెద్ద చేశారు. ఆమె అభినయం, సంగీతం, ఆధ్యాత్మ అష్టపదులు, తరంగాలు, ఆభినయమూ, నరస భూపాలీయము, నాయికా నాయక ప్రకరణము సాంప్రదాయికంగా నేర్చుకుంది.



అన్నాబత్తుల బుల్లి వెంకటరత్నం

ఆమె అభినయవిద్యను కోటిపల్లి వాస్తవ్యులు కిడియాల రామమూర్తి గారివద్దనూ, సంగీతాన్ని మహోద్రాద పద్మనాభంగారివద్దనూ, గొల్లకలాపాన్ని, భామాకలాపాన్ని ఆత్కూరి సుబ్బారాయుడుగారివద్దనూ, కలాపంలో పేదాత విద్యను జయంతిస్వామి నాయనగారివద్దనూ నేర్చుకుంది.

కోనసీమలో గొప్పపేరు :

ఆమె భామాకలాపం, గొల్లకలాపం, కిచేరీనాట్యం మొదలైన విద్యలలో కోనసీమలో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించినట్టువరాచ. రాజమండ్రి భారత సంస్కృతి సభ, కాకినాడ సాహిత్య పరిషత్తు, మద్రాసు సంగీత నాటక అకాడమి మొదలైన అనేక సంస్థలు ఆమెను సన్మానించాయి.

ఉభయ విద్యాప్రవీణ శ్రీమతి మద్దిలరాముడు :

విజయనగరం వాస్తవ్యురాలు మద్దిల రాముడు సంప్రదాయ కచేరీ నృత్యవిద్యలోనూ, కర్ణాటక విద్యలోనూ ఆరితేరిన విద్వాంసురాలు. ఆమె తన విద్యతో ఒక్క విశాఖపట్టణమే కాక ఆంధ్రదేశంలో పలుతావుల్లో ప్రదర్శనలిచ్చి మెప్పుపొందింది. ఈమె నాయకురాలుగా ఎన్నో సంవత్సరాలు ఆ బాధ్యతను నిర్వహించింది. ఎంతోమందికి విద్యాదానంచేసి అనేకమంది కళాకారుల్ని తయారుచేసింది. సంగీతనాటక అకాడమీ వారి ఉపకారవేతనంతో ఈనాడు జీవితం వెళ్ళబుచ్చుతూ వుంది.



శ్రీమతి మద్దిలరాముడు

# భామాకలాపాలూ, వాటిలో వాసికెక్కిన కొందరు జాణలు

పందిరి వెంకటరత్నం :

పందిరి వెంకటరత్నం జన్మస్థలం తూర్పుగోదావరిజిల్లా మండపేట. భాగవత సంప్రదాయాన్ని భాగవతుల రూపేణ ప్రచారం చేయడంలో కృష్ణాజిల్లాలో కూచిపూడి ఎంతటి ప్రఖ్యాతి వహించిందో గోదావరి మండలంలో మండపేట కచేరీ నాట్యంలోనూ, కర్ణాటక, భామా గొల్ల కలాపంలోనూ అంతటి సరస్వతీ పీఠంగానూ వర్ధిల్లింది. శ్రీమతి పందిరి వెంకటరత్నం, వానపల్లి వీర్రాజు మొదలైనవారు భామాకలాప, గొల్లకలాప విద్యలను అనేక సంవత్సరాలుగా ఆంధ్ర దేశంలో ప్రదర్శిస్తూ వచ్చారు. 1949 సంవత్సరంలో విజయవాడలో జరిగిన చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారి సన్మాన సందర్భంలో వెంకటరత్నం సమయానుకూలంగా సన్మానించబడింది. ఈవిడ రేడియోద్వారా ఎన్నో భామాకలాప ప్రదర్శనాలను ప్రసారం చేశారు. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాదమీ ఈమెను ఘనంగా సన్మానించింది.



శ్రీమతి పందిరి వెంకటరత్నం



వానపల్లి వీర్రాజు

## దుగ్గిరాల మాణిక్యం :

**మండపేట మాణిక్యం** అని కూడ పిలువబడే దుగ్గిరాల మాణిక్యం జన్మస్థలం మండపేట. సంస్కృతాంధ్ర భాషలనూ, సంగీత నాట్యాలనూ అమోఘంగా ఆకళింపు చేసుకున్న విదుషీమణి ఈమె. భాగవత సంప్రదాయాలను ప్రచారం చేయడంలోనూ, కచేరీ నృత్యంలోనూ ఆంధ్రదేశానికి పేరుతెచ్చిన కళాకారిణి. ఈమె నిజంగా నాట్య సరస్వతి.

భారత భాగవత విద్యల్లో భావమెరిగి అభినయించే నాట్యవిశారద శ్రీమతి పందిరి వేంకటరత్నం ఈమె శిష్యురాలు. వెంకటరత్నం స్వర్గీయ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిలగారిచే సన్మానింపబడిన విద్వాంసురాలు.

## భామాకలాపానికి ధీమాతెచ్చిన దూడల శంకరయ్య :

భామా కలాపం ప్రత్యేకమైన ఆంధ్రులకళ. దానికి సిరితెచ్చింది శ్రీకాకుళంజిల్లా.

అనాదినుండి ఆ జిల్లాలో సుమారు 40 కుటుంబాలవారు ఈ కళనే వృత్తిగా చేసుకుని జీవించేవారు. ఈనాడు అన్ని కుటుంబాలులేవు. చెప్పుకోతగిన పండితులు కూడ అంత మంది లేరు. కాని సిగడాం వాస్తవ్యులైన దూడల శంకరయ్యగారు ఈ భామాకలాప విద్యలో సిద్ధహస్తులు. వీరు భామాకలాపం పాలిటికి ధీమాతెచ్చిన భీమా. వీరి తరువాత ఈ భామా కలాపకళ అంతరించిపోయే అవకాశముంది. దీనిని సంస్కరించి ప్రదర్శిస్తే ఆంధ్రనృత్యకళలో ఒక మహోత్కృష్టకళగా రూపొందగలదు.

భామాకలాపవిద్యలో సిద్ధహస్తులైన దూడల శంకరయ్యగారు లయబ్రహ్మ. వారిది లయబద్ధమైన అద్భుతకళ. అది ఆంధ్రుల పురాతన కళా ఖండం. శంకరయ్యగారి భామా కలాపంలోని బాణీలు, పదాలు, పాటలు ఆయన కుమారుడు వాయించే మృదంగదరువులు అద్భుతమైనవి. ఆంధ్రదేశంలో కూచిపూడివారూ, దేవదాసీలూ ప్రదర్శించే భామాకలాపానికీ, శంకరయ్యగారి భామాకలాపానికీ ఎంతో వ్యత్యాసముంది. అందువల్ల ఈ కళను ప్రత్యేకంగా పోషించవలసిన అవసరముంది.

### బొంతలకోటి జగన్నాధం :

శ్రీ కాకుళం జిల్లాకుచెందిన బొంతలకోటి జగన్నాధంగారు కూడా భామా కలాపం ప్రదర్శించడంలో సిద్ధహస్తులు. వీరి సాంప్రదాయమూ, దూదల శంకరయ్య గారి సంప్రదాయమూ ఒకటే. ఇది కూచిపూడి భామాకలాపానికి భిన్నమైనది. ప్రాచీన యక్షగానదరువుల శైలీ, అభినయవిన్యాసమూ వీరి బాణీలో తొణికిసలాడుతూ వుంటాయి. సంగీత ప్రధానమైన భాగవత సంప్రదాయం వీరిది. భామా కలాపవిద్యలో బొంతలకోటి జగన్నాధంగారు. శ్రీకాకుళం జిల్లాలో చాలా ప్రసిద్ధులు.

పైన వివరించినవారే గాక పెండ్యాల సత్యభామ, చింతా భద్రం, ఎండ మూరిచిట్టి, పేరూరుపుష్పావతి, దుగ్గిరాల శ్రీ విరాజితం, దుగ్గిరాల జగదాంబ, అంబుల వెంకటరత్నం మొదలైన దేవదాసీలు, భామాకలాపంలోనూ, గొల్ల కలాపంలోనూ, దేవదాసీ విద్యలోనూ బహు ప్రసిద్ధులు.

### బొబ్బిలి బెబ్బులి జీవరత్నమ్మ

కీ॥శే॥శ్రీమతి జీవరత్నమ్మ బొబ్బిలి సంప్రదాయ భరతనాట్య కళావిదురాలు. తరతరాలుగా జీవరత్నమ్మ కుటుంబంవారు ఈ కళను పోషిస్తూ బొబ్బిలి సంస్థాన కళాకారులుగా వర్ధిల్లారు.

జీవరత్నమ్మ ఒక్క భరతనాట్య సంప్రదాయంలోనే కాక, కర్ణాటక సంగీతంలోనూ, వీణావాద్యంలోనూ విశేష పాండిత్యంగల విదుషీమణి. పదవర్ణాలకు, స్వరజతులకు, శబ్దాలకు, క్షేత్రయ్యపదాలకు, జావళీలకు నృత్తనృత్యాలు కల్పించి అభినయించేది. ఆమె నర్తనరీతి మంచి పాండితీ ప్రతిభగలిగినట్టిది. అంతేకాక సంస్కృత శ్లోకాలకు, ఒరియాలో పదావళికి, ఉర్దూ,హిందీ భాషల్లోని ట్రుమ్రీ-గజల్ గీతాలకు కూడ అభినయాన్ని కల్పించి ప్రదర్శించేది. 60 సంవత్సరాల వృద్ధాప్యంలో కూడా నృత్యాభ్యాసం చేసేది.

ఆమె సంపాదించిన ధనమంతా దానధర్మాలకు ఖర్చు చేసింది. అంతిమ దశలో సంగీత నాటక అకాడమీవారి వృద్ధాప్య పింఛనుతో జీవించింది. 8 సంవత్సరాల క్రితం హైదరాబాదులో నటరాజ రామకృష్ణగారి నృత్యనికేతనంలో బాలికలకు

నృత్య శిక్షణనిచ్చింది. 'నే నీ కళారాధనకు అంకితమయ్యాను. నా జీవితం కళారాధనలోనే గడిపి తరిస్తా'నని నృత్యనికేతనం చేరినట్లు నటరాజ రామకృష్ణగారు 68 అక్టోబరు 'నాట్యకళ' సంచికలో వివరించారు. శ్రీమతి జీవరత్నమ్మ 68 ఆగస్టు 22 తారీఖున కీర్తిశేషురాలైంది.

భామవేషంలో
ధీమాచూపిన
మరికొందరు :

పశ్చిమ గోదావరిజిల్లా కొవ్వూరు తాలూకా చిమూరదేవ గ్రామంలో మంచిరాజు వెంకట్రామరాజుగారనే నియోగిబ్రాహ్మణుడు భామవేషం ధరించడంలో బహు ప్రసిద్ధుడు. వారి శిష్యులైన వల్లంపట్ల రామయ్యగారు పశ్చిమ గోదావరిజిల్లా, కొవ్వూరు తాలూకా బందపురంలోని పిచ్చుకుంట్ల వారికి భామాకలాపాన్ని, గొల్ల కలాపాన్ని నేర్పారు. బయ్యా పెదగంగాధరుడు, బండి చిట్టిసింగము, దేశిలక్ష్మీనారాయణ మొదలైనవారు భామ వేషధారణలో సిద్ధహస్తులు. 16 సంవత్సరాల వయస్సులోనే లక్ష్మీనారాయణ భామవేషం చక్కగా వుండేవట. బందపురంలో పిచ్చుకుంట్లవారికి ఈ విద్యను నేర్పించటంలో విశేష కృషిసల్పినవారు పి. యస్. ఆర్. అప్పారావుగారి పితృపాదులైన పోణంగి రామమూర్తిగారు.



# 9

# అవి-ఇవి-అన్ని



చోడిగానికలానం - వీరభద్ర విన్యానం - జముకుల కథలు- గారడి విద్యలు - గొల్ల సుద్దులు-వసంతోత్సవాలు.డప్పులకోలాటం - గరగ నృత్యం - పులివేషాలు-కామునిపున్నమ వినోదాలు - తెలంగాణా యక్ష గానాలు-జానవద కళలు

# చోడిగాని కలాపం

వచ్చెర బాబు సోలిగాడు
ముక్కుమీద చుక్కబొట్టు
నిక్కినిక్కి చూచుకుంటు
వచ్చెరబాబు సోలిగాడు.

అంటూ ఈనాటి ఆంధ్రదేశపు పల్లెలలో దసరా ఉత్సవాల్లో గొంతాలమ్మ పండుగలో ప్రదర్శించే విచిత్ర వేషాలలో ఈ సోలి(డి)గాడివేషం అతిముఖ్యమైనది.



సోలిగాడు

సోలిగాడు వంకర దుడ్డుకట్టతో ప్రవేశించి పిల్లలందర్నీ హడలగొట్టేవాడు. వేష ధారణ అంతా హాస్యంగా వుండేది. ముఖంనిండా సున్నపుబొట్టులూ, బొట్టుల మధ్య నల్లచుక్కలు. నల్లగుడ్డ అంట గట్టినతలకు ఒక ప్రక్కగా కాకిఈకల కుచ్చుబెట్టి, మొలకు గోచిపెట్టి, ఒక చేతిలో వంకర దుడ్డుకట్ట, మరొకచేతిలో చింకిజోలె వేసుకుని, గొంతాలమ్మ నృత్యాలలో వున్నట్లుండి ఏదో ఒక మూలనుండి హఠాత్తుగాలేచి, పిల్లలందర్నీ హడలగొట్టి ప్రేక్షకుల నందర్నీ ఒక అదుపులో వుంచేవాడు. ఇదే ఈనాడు మనకు కనిపించే సోలిగానివేషం, ఈ సోలిగానిని చోడిగాడనీ. సోడిగాడనీ, పింగడనీ వేరువేరు ప్రాంతాల్లో వేరువేరు పేర్లతో పిలుస్తుంటారు. ఈ సోలిగాడి పేరు ప్రాచీనంనుండీ, ప్రస్తుతంవరకూ ఆంధ్రప్రజా జీవితంలో జీవించి వుంది. తోలుబొమ్మల ఆటలో జుట్టుపోలిగాడు, బంగారక్క, అల్లాటప్పగాడు ఎటువంటి ప్రాముఖ్యం వహిస్తున్నారో, ఈ చోడిగాడుకూడ చోడిగాని కలాపంలో అంతటి

ప్రాముఖ్యం వహిస్తున్నాడు. కాని బొమ్మలాటలోని పాత్రలు కేవలం హాస్యపాత్రలు మాత్రమే. చోడిగానిపాత్ర అలా గాక కథానాయకుడుగానూ, హాస్యపాత్రగానూ జీవిస్తున్నాడు. సోలిగానిపేరు ప్రజా జీవితంలో ఎలా హత్తుకుపోయిందో వుదాహరణలు చూస్తే మనకు బోధపడుతుంది. పెండ్లిపందిళ్ళలో ఫలానావాడు సోలిగాడులా వున్నాడనీ, గాలిగా తిరిగేవాళ్ళను సోలిగాడిలా తిరుగుతున్నాడనీ, కొంచెం వికృతంగా వున్నవాళ్లను సోలిగాడులా వున్నాడనీ, భార్యతోడు లేకుండా వచ్చిన వాడిని సోలిగాడులా వచ్చాడనీ, మరికొంతమంది తోడివాడిని 'ఏరా సోలిగా' అనీ రకరకాలుగా పిలుస్తూ వుంటారు.

కరకు తెడదలను కూడా
కదిలించే కథా వస్తువ్రు :

మనకు కూచిపూడివారు ప్రదర్శించే భామాకలాపం, గొల్లకలాపం మాదిరి ఈ చోడిగానిది కూడ ఒక కలాపమే. కురవంజి కథారూపంలో సింగీ సింగని ప్రణయకలహమే ఈ చోడిగాని కలాపానికి కథా వస్తువు. సింగణ్ణి మరిపించి పారిపోయిన సింగిని వెదుక్కొంటూ, వియోగాన్ని అభినయిస్తూ, తుదకు సింగిని కలుసుకుని తనను వదలి ఎక్కడికి వెళ్ళిందో, ఎందుకు వెళ్ళిందో, మొదలైన ప్రశ్నల ద్వారా వాగ్వివాదం జరిపి చివరికి సింగిని తీసుకుని, ఇరువురూ ఇంటికిచేరడంతో చోడిగాని కలాపం కథ సమాప్త మౌతుంది. తొలిఘట్టంలో చోడిగాడు తెరవెదలి.

వచ్చెరబాబు చోడిగాడు
చంకలోనూ పంకికట్టా
చేతిలోనూ చింకిజోలెతో॥ వచ్చె॥
ముక్కుమీదా చుక్కబొట్టు,
నిక్కినిక్కి చూచుకుంటు॥ వచ్చెర॥

అని పాడుకుంటూ తన పరిస్థితినంతా ఈ విధంగా వివరంగా చెప్పడం ప్రారంభిస్తాడు. "అయ్యలారా అమ్మలారా, నాపేరు సింగడు. నా భార్యపేరు సింగి. మేమిద్దరం పడకగదిలో పడుకునివుండగా అర్ధరాత్రి నాసింగి పక్కలోనుంచి మాయమైపోయింది." అని ఆవృత్తాంతమంతా చెపుతూ, "హా! నా సుందరీ! ఎందుబోయితివే" అని వెదుకుట ప్రారంభించడంతో కథలో తొలిఘట్టం ఆరంభం అవుతుంది.

ఈ కలాపంలో హాస్యగాడు వుండడు. సింగనిపాత్రే హాస్యరసాన్ని అందిస్తుంది. సింగడే నాయకుడు. సింగీ సింగని పాటలకు వంతపాడే ఇరువురు తాళగాళ్ళలో ఒకడు ఈ నాయకీ నాయకులకు మధ్యవర్తిగా తోడ్పడుతూ, అనేక ప్రశ్నలు వేసి సమాధానాలు చెప్పిస్తూ కథా సంధుల్ని విష్ణులంగా సభవారికి ఎరుకపరుస్తూ వుంటాడు.

కథాగమనంలో సింగిని వెతుక్కుంటూ సింగడు అడవిలో కనబడిన మృగాలను వేటాడి అవి లభించినప్పుడు ఆయా దేవతల్ని సింగిని చూపమని ప్రార్థిస్తూపోతాడు. ఈ ఘట్టంలో ఆహేటనృత్యం ప్రదర్శింపబడేది. ఆతరువాత దశావతారాలను అభినయించి నారాయణమూర్తిని ప్రార్థించేవారు. తరువాత రామాయణగాథను సంస్మరించి శ్రీరాముని వేడుకుని, రామాయణగాథ నంతనూ పదాభినయంద్వారా అభినయిస్తూ, సింగి కనపడలేదనే ఆవేదనతో స్మృతితప్పి తూలిపడిపోతూ నిష్క్రమిస్తాడు.

ఇంతలో సింగి 'ఎరుకో, ఎరుక' అంటూ ప్రవేశిస్తుంది. సూత్రధారుడు సింగిమీద ప్రశ్నలవర్షం కురిపిస్తాడు. అంతట సింగి అతనికి సమాధానంగా తన యొక్క కులగోత్రాలనుగూర్చి, వృత్తి విద్యావిలాసాలను గురించి, తన వన్నె చిన్నెలు, అందచందాలను వివరిస్తూ సింగని వర్ణిస్తుంది. ఈ సమయానికి సింగడు ప్రవేశించి సింగి దొరికిందన్న సంతోషంతో వుబ్బితబ్బిబ్బైపోతూ తన సంతోషాన్ని మాత్రం పైకి కనబడనీయక వాగ్వివాదానికి దిగుతాడు. ఈ సింగీ సింగని వాగ్వివాదంలో మొరటుహాస్యం ఎక్కువ దొర్లటంవలన కొంచెం పిరసంగా వుంటుంది. సవతులకయ్యంమాదిరి చోడిగాడు, సింగి ఈ విధంగా ప్రారంభిస్తారు :

సింగి సింగన్నల

**వాద వివాదాలు:**

చోడిగాడు:—మనసులాకపోతే మునుపెరుంగవె సింగి
అనుమలంటి నోరు అగలించి
కళ్ళెమంటి బిగ్గకఱచియుబట్టితే
కొరడ దెబ్బలనుచు ఎఱుగవటవె?

సింగి:— కొరడ దెబ్బలనుచు మరిమరి బలికేవు
తరముగాదు వాదుదరికి రాకు
మురువు పరువులేని పురుషత్వమేల నీ
సరసమెల్ల నాకు చాలుపోర.

చోడిగాడు:—సింగీ నను జూచితె నే
నంగజుడను రూపురేఖలందును నా
సంగతి నీవిటులైన తిరు
గంగను న్యాయంబు గాదు గట్టిగ సింగీ.

సింగి:— చేకువలెనుండు మీసాలు, చీపికళ్ళు
చింకితలగుడ్డ, గొంగళీచంకబెట్టి
కప్పుపాక్కిడి పొగసిద్ద వొప్పుజూచి
నయమె నిన్నంగజుడవన్న నవ్వరటర?

ఈ విధమైన వాగ్వివాదంతో సంవాదం ముగిసి. ఇరువురికీ సఖ్యతకుదిరి. ఇంటికిపోవడంతో కథ సుఖాంతమె మంగళాంతం అవుతుంది.

పైన వివరించిన ఈ చోడిగాని కలాపం రాత్రి తెల్లవార్లూ ప్రదర్శిస్తారు. కథా వస్తువు దంపతుల కయ్యానికి సంబంధించింది. దీనిలో శృంగారం రసాభాసమైనది. కురవంజిలో సింగీ సింగని వాగ్వివాద లక్షణాలు, నృత్యాలే ఈ చోడిగాని కలాపంలోనూ కనుపిస్తున్నాయి. ఈ కలాపంలో జిక్కిణీ చిందు మొదలైనవి విశేష నాట్యాలు. ఇది భార్యాభర్తల సంవాదం అవడంవలన ప్రేక్షకులను ఎక్కువ ఆనందపరిచేది.

భామాకలాపం. గొల్లకలాపం మాదిరే ఈ చోడిగాని కలాపంకూడ నృత్య రూపకం. సూత్రధారుడే విదూషకస్థానాన్ని అలంకరిస్తాడు.

చోడిగాని కలాపంలో వుపయోగించే ఒంకి కట్టి ఒక ముఖ్యమైన విశేష మనీ. భరత శాస్త్రంలో 'బ్రహ్మకుటిలకంచద్యా'త్తని ఒక వాక్యంవుందనీ ఆ కుటిలకం విదూషకోపయోగిగా అభినవగుప్తులు వ్యాఖ్యానించారనీ. ఆనాడు బ్రహ్మ దేవుడిచ్చిన వంక కర్ర ఈనాటికీ తెలుగువారివద్ద ఉండటమే చోడిగాని కలాపంలోని ఒక శాస్త్రీయమైన విశేషమనీ. శ్రీ ముట్నూరి సంగమేశం. సాళ్వ కృష్ణమూర్తి గార్లు భారతిలో వుదాహరించారు.

అసలు ఆధారం
ఇల్లిదిగో ఇదీ:

చెంచునాటకం, ఎఱుకల కథ, ఎట్టగొల్లల భాగవతం మొదలైన వాటన్నిటికీ మూల

మైన చెంచులక్ష్మీ నృసింహుల ప్రణయగాథే ఈ చోడిగాని కలాపానికి ఆధారం. అనేక కురవంజి రచనలకు మూలాధారం ఈ ప్రణయ కలహమే.

ఈ కథావస్తువైన చెంచులక్ష్మీ న్యసింహుల వివాహగాథను కీ॥ శ॥ 1600 ప్రాంతంలో గరుడాచల మాహత్మ్య మను పేర ఓబయమంత్రి యక్షగానంగా వ్రాశాడు. ఆనాటికీ, ఈనాటికీ దక్షిణ దేశభాషల్లో కొరవంజులలో దీనినే ప్రాచీన కృతిగా చెప్పుకోవచ్చు.

ఈ చోడిగాడి కలాపానికి ఎఱుకల కథ అని కూడ పేరు. తంజావూరు సరస్వతీ మహల్ లైబ్రరీలో 'ఎఱుకత కథ' అనే పేరుతో ఒక రచన వుంది. ముఖ్యంగా ఈ కలాపాలు వ్రాసినవారిలో చెంగల్వరాయ కవి—తిరవెల్లి వేంకటార్యుడు—వంకాయల బలరామభుక్త—గొడవర్తి జగన్నాధం మొదలైన వారి రచనలు ముఖ్యమైనవి.

---

# వీరభద్రవిన్యాస నృత్యం

ఆంధ్రదేశంలో వీరశైవ సంప్రదాయంవారు ఎక్కువమంది ఈ వీరభద్ర విన్యాస నృత్యాలు చేస్తూవుంటారు. ఈ విధానాన్ని 'వీరభద్రపళ్ళెం పట్టడ'మంటూ వుంటారు. అంతే కాక శైవమత సంప్రదాయంగల పద్మశాలీల దేవుడైన భావనా ఋషి వుత్సవాలలోనూ, విశ్వబ్రాహ్మణుల వీరభద్రస్వామి వుత్సవాలలోనూ ఈ నృత్యం జరుగుతూ వుంటుంది.

ఖడ్గనృత్యం:

పైన వివరించిన వుత్సవాలలోనే గాక పెద్దపెద్ద జాతర్ల సందర్భాలలో కూడ ఈ వీరభద్రనృత్యం జరుగుతూ వుంటుంది. ఈ నృత్యాన్ని 'ఖడ్గనృత్య'మని కూడా

పిలుస్తారు. ఈ నృత్యం ప్రత్యేకంగా కొన్నిజాతులవారు మాత్రమే చేస్తారు. ఏకులం వారైనా వీరశైవమతాన్ని అవలంబించిన ప్రతివారూ ఈ నృత్యాన్ని తప్పక చేస్తారు.

తంతు, తతంగం :

ఈ నృత్యసమయంలో పెద్ద పెద్ద ప్రభలుగట్టి ఆ ప్రభలను అనేక అలంకారాలతో ముంచివేస్తారు. ప్రభకు ముందూ వెనుకా స్త్రీ పురుషులు నడుస్తూ వుంటారు. ప్రభముందు సన్నాయి వాద్యకాండ్రు రెండు మూడు దళాలవారు వుంటారు. ముఖ్యంగా ఈ నృత్యంలో వీరు వాయించే వాద్యం వీరంగం. ఇది ఒక ప్రత్యేక మైన వాయిద్యం. కణకణమని అతి దురితంగా దోళ్ళు మ్రోగుతాయి. సన్నాయి బూరలు తారస్థాయిలో, గుక్కపట్టి, నృత్యకారుని చెవుల్లో వూదుతారు. సాంబ్రాణి ధూపం ముఖానికి వుక్కిరి బిక్కిరి అయ్యేలాగా పట్టిస్తారు. దీనితో ఖడ్గధారి వీరావేశంతో ఒక్కగెంతుగెంతి 'దశ్శరభ, అశ్శరభ' అంటూ దోలు వాయిద్యగాళ్ళ ప్రక్కచేరి....అదదదదదవ, అబబబబబబ, అగగగగగగ అని దోలు వాయిద్యగానిని కవ్వించి ముక్తాయింపులు ఇప్పించి, దశ్శరభ, అశ్శరభ అని దక్షుని దండకం ఈ విధంగా ప్రారంభిస్తాడు

దక్షయజ్ఞం దండకం :

దక్షుండు యజ్ఞంబు శరభ
తలపెట్టినందులో దశ్శరభ.
బ్రహ్మదేవుని గుండె శరభ.
భగ్గుమనియె శర.
వింటిరా సురులార శర.
విన్నపంబొక్కటి శర.
కలగంటి ఈ రాత్రి శర.
కల్లగాసు కల్లగాను. అదదదద, అగగగగ, శరభ, అశ్శరభ.
మహిమీద పార్వతీ రశ
మాయమైపోయెనని
పరమేశ్వరుని హెూమము శర
బగ్గుమనియె శర

చెమట బట్టగతీసి శర
చట్రాతిపైవేసి శర
వీరేశ్వరుడు బుట్టె విశ్వమునకు శర
పటపటా బ్రహ్మాండపలములన్నియు శర
కొట్టగద దక్షుని శర
తోలగదరిపుల శర
దండించవైరుడు శర
నీమిండడనగ శర
మొక్కజొచ్చితిమిగదా మోసపోయితిమని శర
వెన్నగల అన్నకు శర
ఏనుగుతలబుట్టినని
గుడిమోద తాతకు శర
గొట్టెతల ఇంపాయె శర
వరుల గుణవిహార శర
కోమూరి వీరభద్ర శర
అదదద, అగగగ, అదదద, అగగగ.
శరభ, దశ్శరభ, అశ్శరభ, శరభ, శరభ.

అంటూ ఆర్భాటం చేస్తారు. వీరంగభూమి మిన్నుముట్టుతాయి.

ఇలా ఖడ్గంపట్టి, దండకం చదువుతూ, వాయిద్యాల గమకాల ననుసరించి వీరావేశంతో ఆ ప్రక్కకూ, ఈ ప్రక్కకూ అడుగువేస్తూ, కంకణంకట్టిన కత్తిని వేగంగా తిప్పుతూ ఆసాంతంలో ఏ గ్రామదేవతనుగాని, ఏ దేవుణ్ణి పూజిస్తారో, ఆ గ్రామం పేరు తలచి జైమంగళగిరి వీరభద్ర అని ముగించి, మరల వాయిద్య గాంద్రను ఆదరించి శరభ, శరభ అంటూ నానాహంగామాజేసి ఆ కత్తిని, ఎవరైతే ఆ వుత్సవాన్ని నిర్వహిస్తున్నారో, ఆతని పళ్ళెంలో వుంచుతాడు.

మజిలీ మజిలీవద్దా
మరిమరీ ఇదే అట :

ఇలా వూరంతా ఊరేగుతూ ఒక్కొక్క మజిలీవద్ద, అంటే నాలుగువీధులూ కలసిన చోట్లనల్లా ఒక్కొక్క వ్యక్తి పైవిధంగా ఖడ్గ నృత్యం చేస్తాడు. ఇలా వుత్సవం ముందుకు సాగేకొద్దీ జనసమూహం ఎక్కువై ఎంతో ఉద్రేకాన్ని కలిగిస్తుంది.

నృత్యధారి ధరించే ఖడ్గం చాలా భారీగా వుంటుంది. ఖడ్గం మిలమిలా మెరుస్తూ వుంటుంది. ఖడ్గం మధ్య భాగంలో తమలపాకుతోగాని, మామిడాకుతో గాని కంకణం కడతారు.

ఖడ్గధారికి కావలసినవి,
ఆయన కర్తవ్యాలు :

ఖడ్గం ధరించే వ్యక్తి విభూతిరేఖలు పట్టించి, పెద్ద కుంకుమబొట్టు పెట్టుకొని పంచ ఎగగట్టి, గోచి బిగగట్టి, విచిత్ర వేషధారణలో వుంటాడు. ఖడ్గంధరించే వ్యక్తి ఆ రోజున ఉపవాసముంటాడు. ప్రతివారూ ఈ నృత్యంచేయడం కష్టం. నృత్యం చేసే ప్రతివ్యక్తీ దక్షుని దండకాన్ని తప్పనిసరిగా నేర్చుకోవాలి. లేనట్లయితే అడుగు పడదు. ఖడ్గ నృత్యధారి ప్రళయతాండవంగా నృత్యంచేసిన తరువాత శివమెక్కి ఆవేశంతో నారసాలు పొడుచుకుంటాడు.

నాలుకపై
నారసాల నాట్లు :

ఖడ్గ నృత్యంలో ఈ నారసాల నృత్యం మహా వుత్తేజంగానూ, భయంకరంగానూ వుంటుంది. ఖడ్గ నృత్యం అయిన వెంటనే ఆ వ్యక్తి నారసాలు పొడుచుకుంటాడు. నారసాలంటే రెండు మూడు రకాలుగా వుంటాయి. ఏకనారసం, కంటినారసం, గొంతునారసం, సిరసునారసం. శూలనారసం మొదలైన పేర్లు వుంటాయి. ఇవి శూలంమాదిరిగా వుండి, త్రిశూలం చివరి భాగంలో నూనె గుడ్డలుచుట్టి వాటిని వెలిగించి సన్నని మొన భాగాన్ని నాలికపై గ్రుచ్చుతారు. ఇలాగ్రుచ్చే సమయంలోజోరుగా జోరు జోరుగా వాయిద్య సమ్మేళనం జరుగుతుంది. రణగొణధ్వనులు చేస్తారు. ఘూంవేసి ఆ వుద్రేకంలో నెమ్మదిగా గ్రుచ్చి నృత్యకారునికి కర్పూరం వెలిగించిన పళ్ళెం చేతికిస్తారు. నృత్యకారుడు ఒ



నారసాన్ని నాలుకమీద పాడుచుకున్న ఆవేశపరుడు

చేతితో నారసాన్ని పట్టుకుని వాద్యానికి తగినట్లు గుండ్రంగా వీరాధి వీరుడులా నృత్యం చేస్తాడు. చేసేకొద్దీ వాయిద్యాల జోరు ఎక్కువ అవుతుంది. ఈ జోరులో వెలిగించిన వత్తుల్ని ఒక్కొక్కటిగా ఆరిపోవడంతో ఈ నృత్యం పూర్తి అవుతుంది.

వెంటనే మరల వాద్యకాండ్రందరూ చుట్టూచేరి వుక్కిరి బిక్కిరిగా రోచన చేస్తూ సాంబ్రాణి ధూపంవేసి, ఆ నారసాన్ని నెమ్మదిగా తీస్తారు. ముఖ్యంగా ఇద్దరు ముగ్గురు ఇలా నారసాలు ధరించి మూకుమ్మడి నృత్యం చేస్తారు. ఈ నృత్యం ప్రేక్షకులను ఆశ్చర్యచకితులను చేస్తుంది.

అద్యాపి జీరుగుతూనే
ఉన్న చోద్యమే :

ఈ విధంగా ఈ వీరభద్రవిన్యాస నృత్యాలు నైవుడు, వీరనైవులు ఈనాటికీ చేస్తూనే వున్నారు.

ఇలాంటి ఖడ్గనృత్యాలు దక్షిణ దేశంలో తిరువాన్కూరులో వున్నాయి. ఈ నృత్యాన్ని 'పాతాయం' అని పిలుస్తారు.

# జముకుల కథలు

జముకుల కథలను జక్కుల కథలని కూడా పిలవడం కద్దు.

ఆటుపట్టులు,
ఆకారపకారాలు :

ఈ కథలు పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, విశాఖపట్టణం మొదలైన జిల్లాలలోనూ, తెలంగాణాలోనూ విశేష ప్రచారంలో వున్నాయి. ఈ కథలు శృంగార



ఆంధ్ర ప్రజానాట్యమండలి రాష్ట్రదళం జముకుల కథ-మాచినేని, మిక్కిలినేని, వుమామహేశ్వరరావు

లాలిత్యాలతోనూ. కరుణరసాన్ని ప్రతిబింబించేవిగానూ వుంటాయి. ఈ కథల్లో అనేక రకాలైన సంగీతపుమట్టు లున్నాయి. ఈ ప్రదర్శనం మూడు గంటల కాలం వుంటుంది.

రంగస్థలం, రంగులు;
వేషాలు, విశేషాలు:

వీరి ప్రదర్శనానికి ఏ విధమైన రంగస్థలమూ అవసరంలేదు. గ్రామం మధ్యలో చిన్న పందిరి వేసి రెండు లైట్లు కడితే సరి, సరిపోతుంది. ప్రదర్శనకారులు ముగ్గురు. అందులో మధ్య వ్యక్తి కథకుడు. వంతదారుల్లో ఒకరు హాస్యం, రెండవవారు వ్యాఖ్యానం. వేషధారణలో కథకుడు నల్లకోటు, తెల్లచుట్టుపంచ. తల గుడ్డ చుట్టి చక్కగా నృత్యంచేస్తూ కలియదిరుగుతాడు. స్త్రీ పాత్రలు కథా విధానంలో వచ్చినపుడు అక్షరాలా స్త్రీ అభినయాన్నే కథకుడు చేస్తూ వుంటాడు. వంతదారులు రెండు జముకులను శ్రావ్యంగా వాయిస్తూ వుంటారు.

జముకుల

చిన్నెలు, వన్నెలు:

జముకులంటే చాలామందికి తెలియకపోవచ్చు. దీనినే జమిడిక, జమిటిక అని కూడ పిలుస్తారు. ఈ వాయిద్యం, కుంచం ఆకారంలో వుంటుంది. దానిని ఒక ప్రక్క భాగం బక్కచర్మంతో మూస్తారు. మధ్యభాగంలో చిన్న రంధ్రంచేసి నరాన్నికట్టి లోపలిభాగంనుంచి రెండవప్రక్క ఒక కట్టెముక్కకు కట్టుచేతితో దానిని లాగిపట్టి లోపలిభాగంలో ఆ నరాన్ని మ్రోగించినట్లయితే శ్రావ్యమైన మ్రోతలు వస్తాయి.

ఈ జముకుల కథలు ఒకనాడు కాకతీయ సామ్రాజ్యంలో విశిష్టంగా, విరివిగా వర్ధిల్లాయి.

ఈనాటికీ ప్రజానాట్యమండలిదళాలు, రేడియోద్వారా బహిరంగ ప్రదర్శనాలద్వారా ఈ విధానంలో 'కన్యక కథను' ప్రచారం చేస్తున్నారు.

———

# గారడీ విద్యలు

ఈ గారడీ విద్యను సంస్కృతంలో ఇంద్రజాలమనీ, గారడీవాళ్ళను ఐంద్ర జాలికులనీ వ్యవహరిస్తారు. ఈ గారడీవిద్య పూర్వకాలంనుండీ ప్రస్తుతం వరకూ ప్రచారంలో వుండనే వుంది. పూర్వం రాజాస్థానాలలో విరివిగా ఈ విద్యను ప్రదర్శించి అఖండమైన సన్మానాలను, లాంఛనాలను పొందే వారు. ఈ నాటికీ గ్రామాలలో ఈ విద్య ప్రదర్శిస్తున్నారు.



మన్నికలో ఉన్న కొన్ని
మాయదారి విద్యలు :

వేపాకులుదూసి తేళ్ళను తెప్పించడం, అరచేతిలో రూపాయలు సృష్టించడం. అప్పటికప్పుడు మామిడిపండును పాతి మొక్కను మొలిపించడం, మనిషిని బుట్టలోపెట్టి మాయంచేయడం, గొంతునుకోసి రక్తం చూపించడం, మనవద్దనున్న వస్తువును మాయంజేసి మరొకరి జేబులోనుండి తెప్పించడం మొదలైన అనేక విచిత్రాలను చూస్తూనే వున్నాం. ఈ గారడీవిద్య పూర్వంనుంచీ ప్రచారంలో వుందనడానికి మనకు ప్రాచీన గ్రంథాలనుండి అనేక వుదాహరణలు కనిపిస్తున్నాయి. గారడీ విద్యల్నిగూర్చి పండితారాధ్య చరిత్రలో

> నావియద్గతి బక్షులాడెడునట్టి
> భావన మ్రోకులపై నాడెడువారు.

అని వుంది.

దొమ్మరసాములు గడలపై ఆడినట్లే, గారడీవారు మ్రోకులపై ఆడినట్లు పై రెండు పదాలనుబట్టి అర్థం చేసుకోవచ్చు.

ఆంతరిక్షంలో
వింతవింత జాలవిద్యలు :

పొడవైన మ్రోకును ఆకాశంలోకి విసరగానే, అది వెదురుగడలాగా నిలుస్తుందని. తరువాత గారడీ త్రాడుమీద నిచ్చెన ఎక్కినట్లు జరజరా ఆకాశంలోకి పోయి

నట్లు పోయి మాయమై తిరిగి కనిపించి, అక్కడే చిత్ర విచిత్రమైన విద్యల్ని ప్రదర్శించేవాడట.

సవాళ్లు,
ప్రతిసవాళ్లు :

ఈ విద్యను ఇంగ్లీషువారు 'రోప్‌ట్రిక్' అనే వారట. ఈ విద్యను గురించి 150 సంవత్సరాలక్రితం ఒక ఆంగ్లేయుడు భారతదేశంలో ఒక ఇంద్రజాల ప్రదర్శనంచూచి మెచ్చుకుని ఆనాడే పత్రికలలో వ్రాశాడట. ఆ ఇంద్రజాలంలో ఒకడు త్రాడు నొకదానిని పైకి నిలువుగా విసిరి గాలిలో నిలబెట్టి, దానిపైకి ఎగబ్రాకి మాయమైనాడట. తరువాత అతని అంగాలన్నీ ఖండాలుగా క్రిందపడిపోయాయనీ, మరికొంతసేపటికి యథాప్రకారంగా వాడు త్రాటిమీదనుండి గబగబా దిగి వచ్చాడనీ వ్రాశాడు. ఇది శుద్ధ అబద్ధమనీ, అటువంటి విద్యను ప్రదర్శించగలవానికి ఇంగ్లండుకు రానుపోను ఖర్చులు భరించడమేగాక కొన్నివేల రూపాయలు బహుమాన మిస్తామనీ కొందరు ఆంగ్లేయులు ప్రకటించారట.

ఇలాంటి కథనే కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశికలో వివరించాడు.

'సింహాసన ద్వాత్రింశిక'లో
మరోదాఖలా :

ఒక ఇంద్రజాలికుడు తన భార్యను వెంటబెట్టుకొని రాజసన్నిధిలో ఆమెను రక్షణార్థం విడిచి, తాను దేవసహాయార్థమై యుద్ధం చేయడానికి వెళుతున్నానని చెప్పి ఒక త్రాటిని పైకి నిలువుగా విసరి దానిని నిలబెట్టి దాని పైకి ఎగబ్రాకి మాయమయ్యాడట. తరువాత కొంతసేపటికి వాని కాళ్ళు, చేతులూ, తల, మొండెం తుంపులై కిందబడ్డాయట. రాజుపద్ద రక్షణగావుంచిన అతని భార్య రాజును వేడుకుని, వెలవుపొంది భర్తతో సహగమనం చేసిందట. వెంటనే తాడుపాకి పైకిపోయిన ఇంద్రజాలికుడు పైనుండి దిగివచ్చి తన భార్యను పంపమన్నాడట. అంతట రాజు విచారగ్రస్తుడై ఆమె సహగమనం చేసిందని చెప్పాడట. అంతట ఆతడు—

ఆవీరుం డప్పుడె విజ
భావము ప్రకటముగ వాత్మభామినికోరన్

దా వైకాళికుడగుచున్
గైవారము చేసె జనులు కడువెరగందన్.

వరనాథ ! నిన్ననపుడవ
సరమడిగినవాడ నైంద్రజాలికురీతిన్
వరుల వణకించి నీచే
సిరివొందం జోద్యమిట్లు చేసితిననియెన్.

ఇది ఆనాటి ఇంద్రజాలవిద్య అని, అదే సందర్భంలో చతుష్షష్టి కళలైన ఈ క్రింది వాటిని కూడ వివరించాడు. అవి వేదాలు—శాస్త్రాలు—పురాణాలు—వాస్తు—ఆయుర్వేదం—ధనుర్వేదం—మాంత్రికత్వం—సంగీతం—జలస్తంభన (మహేంద్రజాలం)—జూదం—అష్టావధానం—వాద్యనృత్య కౌశలం—బహురూప పటుత్వం (అనగా పగటివేషాలు)—పరిహాసం మొదలైనవి. [సింహాసన ద్వాత్రింశిక 111-112 పుటలలో వుదాహరించబడిందని సాంఘిక చరిత్ర 185 పుటలో వుదాహరించారు]

ఈ ఇంద్రజాలవిద్యల్లో జైనులు ప్రసిద్ధులని పైన వుదాహరించిన ఇంద్రజాలికుని కథ యథాతథంగా జైనుల త్రిషష్టిశాపురుష చరిత్రలో [2 వ భా. 6 వ ఆశ్వాసం, 200-209 పుటలు] వుదాహరింప బడింది.

ఈ క్రింది జాలవిద్యను గురించి యథావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకం 12 వ పద్యంలో ఈ విధంగా వివరించాడు:

సురల న్మర్త్యసమంబుగా, మనుజులన్ శోభిల్లు బృందారకో
త్కరముంగా, ఘనునల్పు నల్పుని ఘనుంగా బుణ్యపాపాలిచే
దిరుగవ్వైచుచు నీమహామహిమ ప్రీతిం బద్మజాండంబులం
దరయన్ జీవుల నింద్రజాలమునుగా నాడించు సర్వేశ్వరా.

ఇదే ఇంద్రజాలానికి సంబంధించిన మరియొక కళారూపం కూడ ప్రాచీన కాలంనుంచీ ప్రచారంలో వుంది. అదే విప్రవినోదం.

## గొల్ల సుద్దులు

గొల్లసుద్దులను చెప్పేవారు గొల్లలను మాత్రమే యాచిస్తారు. యాదవ చరిత్రకు సంబంధించిన కృష్ణలీలలు, కాటమరాజు కథ మొదలైనవాటిని సుద్దులవారు

ప్రచారంచేస్తూ వుంటారు. ఈ ప్రచారకులు ఆంధ్రదేశమంతటా వున్నారు. అయ్యల రాజు నారాయణామాత్యుడు 'హంసవింశతి'లో గొల్లసుద్దులను ఈ విధంగా వర్ణించాడు:

కొమ్ములు వీరణాలు జిగిగుల్కెడు వ్రాతల కృష్ణలీలలం
గ్రమ్ముగుడార్లు వీరుడగు కాటమరాజు కథానులాపముల్
బమ్మినపుస్తకాలు ముఖపట్టిడికట్టు రుమాలలు వెల్లా
సొమ్ములు నావముల్ వెలయు సుద్దుల గొల్లలు వచ్చిరెంతయున్.

గొల్లసుద్దులవారి కథా విషయాన్ని పెద్దపెద్ద వస్త్రాలపై చిత్రించి బొమ్మల సహాయంతో కథలను చెపుతారు. వీరి మాదిరే తెలంగాణాలో పాండవులనే తెగవారు భారత కథల్ని చీరలపై చిత్రించి పెద్దపెద్ద బొమ్మల సహాయంతో ప్రజానీకానికి పాడి వినిపిస్తారని బి. రామరాజుగారి జానపదగేయ సాహిత్యంలో తెలియజేశారు.

పై పద్యంలో వివరించిన మాదిరి కొమ్ములూ, వీరణాలనూ వాయిస్తారు. వీరణం పెద్ద డోలువంటిది. కొందరు శంఖాలను కూడా పూరిస్తారు. గొల్లలలో అనేక తెగలవారు వున్నప్పటికీ అధిక సంఖ్యలో వున్నవారు ఎట్టిగొల్లలే. వీరి ప్రధానమైన వృత్తి ఆవులమందలనూ, గొట్టెలమందలనూ పెంచడం. యాదవులకు ప్రధాన దేవతయైన గంగమ్మకు జాతర్లు మొదలైన వుత్సవాలుచేస్తూ వుంటారు. ఇలాంటి వుత్సవాలు దొనకొండ, అలవలపాడు మొదలైనచోట్ల జరుగుతున్నాయి. ఛర్చిన్ పండితుడు ఈ గంగపూజల్ని వీరులపూజలుగా పేర్కొన్నాడు.

# వసంతోత్సవాలు

వసంతోత్సవం ఋతు సంబంధమైన పండుగలలో ఒకటి. వసంతకాలంలో మన్మథుడుగురించి ఈ వుత్సవం జరుపబడుతుంది. ఈ వసంతోత్సవం గురించి వాత్స్యాయనుని కామసూత్రాల్లోనూ, శ్రీహర్షుని రత్నావళి నాటకంలోనూ, కాళిదాసుని మాళవికాగ్నిమిత్ర నాటకంలోనూ ప్రస్తావించ బడింది. ముఖ్యంగా రత్నావళి నాటకం ఈ వసంతోత్సవంతోనే ప్రారంభమౌతుంది.

ఆంధ్రదేశంలో ఈ మదన మహోత్సవానికి వసంత మహోత్సవమనీ, కాముని పండుగనీ, ఫాల్గుణ శుద్ధ పూర్ణిమకు కాముని పూర్ణిమ అనీ పేరు. 14 వ శతాబ్దానికి పూర్వం ఈ వసంతోత్సవాలు ఏ విధంగా జరిగేవో తగిన ఆధారాలులేవు. కాని, కొంచవీటి రెడ్డిరాజులకాలంలోనూ ఆ తరువాతి కాలంలోనూ ఈ వసంతోత్సవాలు ఎలా జరుపబడుతూ వుండేవో తెలుసుకోవడానికి శ్రీనాథుని భీమేశ్వర పురాణంలోనూ, కొండవి గోపరాజు సింహాసన ద్వాత్రింశికలోనూ వసంతోత్సవాలను గురించి విపులంగా వర్ణించ బడింది.

ఆ కాలంలో వసంతోత్సవాలకు రాజనగరునూ, నగరుకు వెలుపలనున్న వుద్యానవనాన్నీ మనోహరంగా అలంకరించి, వుద్యానవనంలో ఒక పూజా మండపాన్ని, వివిధ దేవతలకు పూజావేదికలను నిర్మించి, తోరణాలతోనూ, పుష్పాలతోనూ, సుగంధద్రవ్యాలతోనూ వైభవంగా పూజామండపాన్ని అలంకరించి రతీమన్మథులను, లక్ష్మీ విష్ణువులను, శివపార్వతులను, దేవేంద్రుడు, శచీదేవి, వసంతుడు విఘ్నేశ్వరుడు మొదలైన విగ్రహాలను వేదికలమీద వుంచి, మహారాజు అశ్వారూఢుడై, మంత్రులు సామంతులు దండనాయకులు పురోహితులు విదూషకులు పురజనులు, వెంటరాగా బ్రహ్మాండమైన మంగళ వాద్యాలతో వుద్యానవనానికి బయలుదేరేవాడు.

ఈ విధంగా ప్రారంభమైన వసంతోత్సవంలో వారి వారి విద్యల్ని ప్రదర్శించి పారితోషికాలు పొందడానికి నటీనటులు, శిల్పులు, సంగీత విద్వాంసులు మొదలైన అనేకమంది కళాకారులు హాజరయ్యేవారు. రాజ్యం నలు మూలలనుంచీ ఈ వసంతోత్సవాలను తిలకించటానికి ఆబాలగోపాలం కదలి వచ్చేది. అనాటి వసంతోత్సవాలు రాజుకు, ప్రజలకు పండుగగా మారింది.

వుత్సవం ఈ విధంగా సాగుతూ వుండగా రాజుకు సామంతరాజులూ, మండలేశ్వరులూ మొదలైనవారు కానుకలనూ, కప్పములనూ ఈ సందర్భంలో చెల్లించేవారు. విదూషకులు వినోదగోష్ఠిని జరిపేవారు. రాజువెంటవచ్చిన సుందరీమణులు వనంలో వుయ్యాలలూగుతూ, ఏలపాటలతోనూ, జాజరపాటలతోనూ కాలక్షేపం చేసేవారు. రాజు రాణులతో కలిసి, మన్మథుని, తదితర దేవతలనూ పూజించి బ్రాహ్మణ దంపతులకు కర్పూర తాంబూలాలను సమర్పించేవారు.

తరువాత రాజు చందనాది సుగంధ ద్రవ్యాలనూ. కర్పూర నీరాజనాలనూ, వినోద ప్రారంభానికి చిహ్నంగా జనసమూహంపై చల్లేవాడు. ఆ తరువాత జన సమూహంపై ఒకరిపై ఒకరు పరిమళద్రవ్యాలను, రంగుతో కలిపిన వసంతాన్ని చల్లుకొని వావిసరుసలు లేకుండా తటాకంలోదిగి జలక్రీడలతో వినోదించేవారు.

ఆ తరువాత మహారాజు, నిండుకొలువులో గాయకులకు, శిల్పులకు, నట్టువ రాండ్రకు, నటీ నటులకు బహూకరణాలను సమర్పించి, పండితులను సన్మానించి, అనాటి రాత్రంతా జాగరం చేసేవాడు. నాటకప్రదర్శనాలతోనూ, సంగీత నృత్యాల తోనూ తెల్లవారేది.

రెడ్డి రాజుల్లో అనవేమారెడ్డి ప్రథమంగా ఈ వసంతోత్సవాలను ప్రవేశ పెట్టాడు. ఆనాటినుంచి రెడ్డి సామ్రాజ్యంలో వసంతోత్సవాలు వైభవోపేతంగా జరుగుతూ వుండేవి. ఆ మహోత్సవ సమయాలలో కర్పూరాది పరిమళద్రవ్యాలను వెదజల్లడంవలన అనవేమారెడ్డి, కుమారగిరిరెడ్డి రాజులకు వసంతరాయ, కర్పూర వసంతరాయ బిరుదులు కలిగాయి. రెడ్డిరాజులకాలంలో వసంతోత్సవాలు జాతీయ వుత్సవాలుగా జరిగేవి. విజయనగర రాజులకాలంలో కూడా ఈ వసంతోత్సవాలు ముమ్మరంగా జరుగుతూ వుండేవి. భారతదేశం ఇంగ్లీషువారి అధీనం అవడంతో వసంతోత్సవాలు అంతరించాయి.

# వీరముష్టివారు

ఈ వీరముష్టివారిని వీరశైవ భిక్షుకులని, వీరయోధులని చెప్పుకోవచ్చు. వీరు వీరశైవ వాఙ్మయానికి సంబంధించిన గేయాలను, భక్తులగాథలను, కన్యకా పరమేశ్వరీ కథలనూ చెపుతూవుంటారు. వీరు ఎక్కువగా జంగాలను యాచిస్తారు. కన్యక కథను చెప్పడంవల్ల వైశ్యులుకూడ వీరిని అభిమానిస్తారు. వీరముష్టులు పాడే పాటల్లో ఎక్కువభాగం కన్యకా సంబంధమైనవి. అందువల్ల వీరిని కోమట్లు ఎక్కువగా ఆదరిస్తారు. అయ్యలరాజు నారాయణామాత్యుడు వీరముష్టులను వుదాహరించినట్లు బి. రామరాజుగారు 'జానపద గేయసాహిత్యం'లో తెలియజేస్తున్నారు. వీరభద్రుడు దక్షుని ధ్వంసం చేయునపుడు అతని చెమటనుండి వీరముష్టులు జన్మించా

రని ఒక కథ వుంది. వీరు వీరభద్ర ఖడ్గములను కూడ చెపుతారు. వీరు వీరశైవుల వలె నారసాలు గ్రుచ్చుకుని నాట్యం చేస్తారు.

# ఫకీరు వేషాలు

ఫకీర్లు ముస్లిం మతంలో ఒకతెగ. వీరు ముస్లిములనే యాచిస్తారు. అల్లాను సంస్మరిస్తూ 'అల్లాకే నాం'జపిస్తూ ఇంటింటికీ తిరుగుతూ ముస్లిములను ఆశీర్వదిస్తారు. కళారూపాలన్నీ ప్రథమంలో ఒకందుకు ఏర్పడినా తరువాత అవి వివిధ రీతులుగా ఎలా పరిణామం చెందాయో ఈ ఫకీరు వేషాలు కూడా అంతే.



వీరు ఒక పెద్ద కంజీరాను చేతిలో ధరించి. తలకు పెద్ద తలపాగా చుట్టి, మెడలో ఫకీరు పూసలను ధరించి, మొలకు లుంగీని ధరిస్తారు. ప్రతి జట్టుకూ ఇద్దరు ముగ్గురు వుంటారు. మధ్యలో పాటకుడు పాట పాడుతూ వుంటే మిగిలిన ఇద్దరూ 'అల్లాకేనాం' అని వంతపలుకుతారు. ఉదాహరణకు—

పాడిపంటల్ సల్గుండాలి ॥అల్లాకే నాం॥
తల్లిపిల్లల్ సల్గుండాలి
తండ్రి కొడుకుల్ సల్గుండాలి
హిందూ ముస్లింలంతా
వారుహేకం కావాలండి.

అంటూ పాడుతూ, మధ్యమధ్య, రక్తికొరకు కర్రతో చేయబడ్డ ఒక విధమైన, కిర్రు శబ్దంవచ్చే చానిని చేతిలో ధరిస్తారు. కాలేజీ, హైస్కూలు విద్యార్థులు వారి స్కూలు వుత్సవాల్లో ఈ కళారూపాన్ని ప్రదర్శిస్తూ వుంటారు. ఈ కళారూపాన్ని ఆంధ్ర ప్రజా నాట్యమండలి హిందూముతసామరస్యంకొరకు వుపయోగించి ఆంధ్ర ప్రజలలో విశేషంగా ప్రచారం చేశారు.

# తుమ్మెదపాటలు

దసరాపండుగ వచ్చిందీ అంటే ఆంధ్రదేశపు పల్లెల్లో కూలీ స్త్రీలు చక్కగా రంగు రంగుల చీరలు ధరించి, కొప్పుల్లో బంతిపువ్వులుపెట్టి, వయ్యారంగా సీతాకోక చిలుకల్లా మృదుమధురమైన కంఠాలతో,

రావెరావె నల్లతుమ్మెదా ॥మంచి॥
పాటలెన్నో పాడు తుమ్మెదా
పాండవులు పాండవులు
పంచపాండవులారె ॥తుమ్మెదా॥

అంటూ ఇంటింటికీ తిరిగి,

కొత్త పంటొచ్చింది తుమ్మెదా
మనకు కడవేమిలేదింక తుమ్మెదా.

అంటూ తుమ్మెదజట్టుల్లాగా స్త్రీ కూలీలు ఈ కళారూపాన్ని ప్రచారంలోకి తీసుకువచ్చారు. ఈ పాటలనే ప్రజా నాట్యమండలి కరువు పరిస్థితుల ననుసరించి అధికపంటలు పండించవలసిందిగా రైతుల నుద్బోధించడానికి పాటలు రాసి ప్రచారం చేశారు.

# డప్పులకోలాట నృత్యం

ఈ డప్పుల వాయిద్యాన్నే తప్పెట్ల వాయిద్యమంటారు. వీటినే రాయలసీమ ప్రాంతాల్లో కనక తప్పెట్లంటారు. ఈ వాయిద్యాన్ని మాదిగ కులస్థులు ఎక్కువగా వాయిస్తూ వుంటారు.

ఈనాటికీ ప్రతి పల్లెలోనూ ఒక కార్యక్రమాన్నిగాన్ని, ఒక విశేషాన్నిగాని ప్రజలందరికీ తెలియ జెప్పాలంటే, ఒక్కడప్పుతో వూరంతా ఎటువంటి విషయాన్నైనా చాటిస్తారు. వివాహాలకూ, అమ్మవారి జాతర్లకూ, వీరుళ్ళ పూజలకూ ఈ వాయిద్యాన్ని ఎక్కువగా వుపయోగిస్తూ వుంటారు. వాయిద్యం చాలా వుద్రేక పూరితంగా వుంటుంది. ఈ డప్పులను మేపచెక్కలతోనూ, చంద్రపు చెక్కలతోనూ చక్రంగా తయారుచేసి గేదెదూడ చర్మాన్ని ఒక ప్రక్క మూసి నిప్పుళగమీద కాచి వాయిస్తే



కణకణమని శబ్దం వస్తుంది. ఈ దప్పులతో వలయాకారంగా నిలబడి.

నీలాలారా, నిమ్మారాలా
నీళ్ళకుపోయే కన్యారాలా
రేపేపైనామాని చెప్పండోయ్
మేలన్నాలారా. ॥నీలాలారా॥
కోటాదుమికే–పేటాదుమికే
కోటలోగజ–నిమ్మాదుమికే
నిమ్మాముల్లూ రొమ్మూనాటేనూ. మేలన్నాలారా
శెలవాలిత్తే గడియాకొత్తూనూ
నద్దీతిన్నా జలదీకాడా సాబానాలబావికాడా
జోడుంగరాలు- మరచీపోతివే–మామయ్యగారు
శెలవాలిత్తే-గడియాకొత్తూనూ.

అంటూ దప్పులను వాయిస్తూ, కోలాటం వేస్తారు. మామూలు కోలాటంలో అందరూ చిరుతలు వుపయోగిస్తే ఈ కోలాటంలో అందరూ దప్పులను చంకల్లో ధరిస్తారు. దప్పులు మ్రోగించే పుల్లలతో మధ్య ఒకరికొకరు కోలాటంవేస్తూ, ఎగిరి ఎగిరి, గజ్జెల కాళ్ళతో నృత్యంచేస్తూ అద్భుతంగా కోలాటం వేస్తారు. ఈ కనక తప్పెట్ల వాయిద్యం చాలా వుత్తేజాన్ని కలుగజేస్తుంది. ఈ వాయిద్యంలో కృష్ణాజిల్లా కనుమూరువాస్తవ్యుడు అమృతయ్య, వుంగుటూరు వాస్తవ్యుడు ఏసుదాసు-వీరిద్దరూ దప్పులమీద మృదంగ వరుసలన్నిటినీ అద్భుతంగా వాయించి ప్రదర్శిస్తారు. వీరివురూ ఆంధ్ర ప్రజానాట్యమండలి రాష్ట్రీదళంతో బొంబాయి, అహమ్మదాబాదు, పూనా, షోలాపూర్, మద్రాసు, ఢిల్లీ మొదలైన ప్రాంతాలకు వెళ్ళి దేశభక్తి ప్రబోధాన్ని చేశారు. సామాన్య వరుసలతో ప్రారంభమైన జానపదుల ఈ దప్పుల వాయిద్యం ఈనాడు ఒక శాస్త్రీయ వాయిద్యంగా రూపొందింది.

## బగ్గు గొల్లలు

నర్సారు ప్రాంతంలోవున్న గొల్లలు చాలా మంది సుద్దులు చెపుతూ వుంటారు. నరసారావుపేట ప్రాంతంలోని కొంత మంది ఎట్టిగొల్లలు పగటివేషాలను ధరించ

డం కూడా కద్దు. గొల్లజాతిలో అనేక తెగలున్నాయి. వాటిలో ఈ బిగ్గు గొల్లల తెగ ఒకటి. వీరు తెలంగాణాలో దాదాపు చాలా జిల్లాలలో వున్నారు. వీరి ప్రదర్శనాలు రాత్రిపూటా పగటిపూటా కూడా జరుగుతూ వుంటాయి. వీరి దళంలో నలుగురు సభ్యులకు మించిగాని, తక్కువగాని వుండరు. ఒకడు ప్రధానుడై కథ చెపితే మిగతా ముగ్గురూ వంతపాటను అందుకుంటారు. వీరి ప్రదర్శనం యక్షగాన పద్ధతిలో నడుస్తుంది. నోటితో పాట, ముఖంతో అభినయం, ఆంగిక చలనాదులూ వుంటాయి. కథకుని వేషధారణ పంచకట్టి, నడుముకు కట్టు కట్టి, తలపాగా చుట్టి, కాళ్ళకు గజ్జెలు కడతాడు. వీరి వాయిద్యాలలో ముఖ్యమైనది ఒక పెద్ద రండోలు. దీని శబ్దం గంభీరంగా వుంటుంది. వీరి కృతిపాత్రం ప్రక్కవంతలే. వీరి ప్రదర్శనాలు పంటలకాలంలో ఎక్కువగా జరుగుతాయి.

## గోండుజాతి నృత్యాలు

ఈ నాటి తెలంగాణాలో కేసలాపురం భీమదేవు దేవాలయం గోండుజాతికి సంబంధించినది. ఇక్కడ గోండు జాతివారు గొప్ప జాతర జరుపుతారు జాతర పుష్యమాసం తరువాత ప్రారంభమౌతుంది. పదిహేను రోజులపాటు జరుగుతుంది. వేలాది గోండుజాతి ప్రజలు గుమికూడతారు. ఈ వుత్సవంలో పాల్గొనడానికి గోండుకవులూ, వాయిద్యకారులూ, పాటకులూ, అందరూ హాజరై ప్రధాన వాయిద్యాలను వాయిస్తూవుంటే పాటగాండ్రు భక్తిగీతాలు పాడుతారు. ఈ వుత్సవాలలో వివాహమైన పెండ్లికూతుళ్ళు ప్రధాన పాత్రలు వహిస్తారు. విగ్రహం ముందు నిలబడి రాత్రి తెల్లవార్లూ తన్మయీభావంతో వివిధ రకాలైన నృత్యప్రదర్శనాలు జరుపుతారు. ఈ ప్రదర్శనలకు గోండు ప్రజలే కాక, ఇతర కులాలకు చెందిన వారు కూడ హాజరై ఆనందిస్తారు.

## గరగ నృత్యం

ఒకప్పుడు పెంపుగలిగిన గరగజాతి ఈనాడు చాలావరకు క్షీణదశలో ఉన్నదని చెప్పవచ్చు. వీరు ముఖ్యంగా దేవతలను ఆరాధిస్తారు. వీరు జాతర్ల సమ



యంలో ఐదు శిరస్సుల నాగును సర్వాంగ సుంద రంగా అలంకరించి శిరస్సుపై ధరించి కనక తప్పె టల వాయిద్యంతో భక్తి ప్రధానంగా నృత్యం చేస్తారు. వీరు దేవీ నవరాత్రులలో కూడా నృత్యం చేస్తారు. గరగజాతివారు ఆంధ్రదేశమంతటా వున్నారని చెప్పడానికి ఆధారాలు లేవు. అక్కడక్కడా ఒక తెగగా మాత్రమే వున్నారు.

## బుంజలు

ఆంధ్ర దేశంలో అన్ని ప్రాంతాల్లోనూ విశ్వ బ్రాహ్మణులను ఆశ్రయిస్తూ, వారి నారాధిస్తూ వారిపై ఆధారపడిన తెగ బొంజలవారు. వీరినే బుంజలని పిలవడం కూడా కద్దు. వీరి ముఖ్య వాయిద్యం బుంజవాయిద్యం అవడంవల్ల వీరిని బుంజల వారని పిలవడం వాడుక లోకి వచ్చింది ఈ వాద్యకులు ఆ వూరినుండి ఈ వూరికి, ఈ వూరినుండి ఆ వూరికి సంచారంచేస్తూ వుంటారు. ఈ తెగవారిని విశ్వబ్రాహ్మణులు ఎంతో ఆప్యాయతతో చూచుకుంటారు. వీరు విశ్వకర్మ పురాణాన్ని గానంచేసి పారితోషి కాలు పొందుతూ వుంటారు. బుంజవాయిద్యం చాలా వుత్తేజాన్ని కలిగిస్తుంది. ఒక్కొక్క జట్టులో దాదాపు పదిమందివరకూ వుంటారు. అందరూ బుంజ వాయి ద్యాన్ని అద్భుతంగా వాయిస్తారు.

## పాండవులవారు

మహా భారతగాథను అద్భుతంగా గానంచేస్తూ జీవించే ఒక తెగ హైదరాబాదు ప్రాంతంలో వుంది. ఈ తెగలోని పురుషులందరూ పాండవులగాథను అత్య ద్భుతంగా గానం చేస్తారు. పాండవులగాథను గానం చేయడంవల్ల వీరిని పాండ వులవారని పిలుస్తూ వుంటారు. మహా భారత గాథలను మినహా మరే గాథలనూ వీరు గానం చేయరు. పురుషులు కథాగానంచేస్తే, వీరి స్త్రీలు పురుషులకు స్త్రీలకు,

పిల్లలకు పచ్చబొట్లు పొడిచి డబ్బును సంపాదిస్తారు. వీరు ఒక్క తెలంగాణాలో తప్ప ఇతర ఆంధ్రప్రాంతాల్లో ఎక్కడా కనుపించరు.

## మాలజంగాలు

మాలజంగా లనే పంచాలవారు మన బుర్రకథలనే ప్రత్యేక ఫక్కీలో చెపుతారు.

వీరి తంబురా నెమలి ఈకలతో అలంకరింపబడి వుంటుంది. వీరు చేతివుంగరాలతో తంబురా బుర్రను తాళంప్రకారం కొడుతూ, కథ చెపుతూ వుంటారు. ముఖ్యంగా వీరి కథలు కరుణరస ప్రధానమైనవి. వీరి ప్రదర్శనాలు సాయంత్రం ప్రారంభమై, తెల్లవార్లూ జరుగుతుంటాయి. వీరు చెప్పే కథా సాహిత్యం ఎటువంటిదో మనకు తగిన ఆధారం గ్రంథరూపంగా లభించదు. వీరి వాయిద్యాలలో దోలు ప్రసిద్ధిచెందిన వాయిద్యం. ఇంకా వీరుపయోగించే వాయిద్య విశేషాలలో ముఖ్యమైనది 'జమిలిక'. దీనినే జవనిక, జముకు అని పిలువడం కూడా కద్దు. వీరి మరొక వాయిద్యం 'తుడుంకొమ్ము'. వీరిని కొన్ని ప్రాంతాలలో రోజవాకని కూడా పిలుస్తూ వుంటారు.

## చిన్నమాదిగలు

కేవలం మాల మాదిగలను మాత్రమే యాచించే వీరిని చిన్న మాదిగలంటారు.

సర్కారు ప్రాంతంలో కూడా ఇలా యాచించేవారు వున్నారు. చిన్న మాదిగలు వూరూరా సంచారంచేస్తూ ప్రదర్శనలిస్తారు. వీరిది పగటి ప్రదర్శనం, వీరి ప్రదర్శనం వీధి భాగవతానికి దగ్గరగా వుంటుంది. వేషధారణ కూడా అంతే. వీరి కథా ఇతివృత్తం చరిత్రాత్మకమైనది. వీరు ఏ గ్రామంలో ఎన్ని ప్రదర్శనాలు ఇచ్చినా ఒక వారం రోజులకన్నా ఎక్కువ ఆ గ్రామంలో వుండరు. ప్రదర్శనలన్నీ ముగిసిన తరువాత చివరిరోజున ఒకతంతు నడుపుతారు. సీత దేవతలను తృప్తిపరచడానికని జంతుబలిచేసి విభిన్నంగా వేషం అలంకరించుకున్న ఒక యువకుడు శూద్ర దేవతలముందు తాండవం చేస్తాడట. గ్రామ ప్రదక్షిణంచేసి సమీపంలో వున్న చెరువులో స్నానంచేసి తిరిగి ఆ గ్రామానికి రాకుండా వెళ్ళిపోతాడట. ఈ విధంగా ప్రదక్షిణం చేయడంవల్ల పాడిపంటలకు, జనులకు శుభం కలుగుతుందని జానపదుల నమ్మిక.

## కడ్డీ వాయిద్యం

మిత్తుల అయ్యవార్లనీ, దాసరులనీ పిలువబడే వీరు ఈ కడ్డీ వాయిద్యంలో ప్రవీణులు. ఈ వాయిద్యం వీణమాదిరిగా వుంటుందట. వీణమాదిరే దీనిని కూడా చేతివ్రేళ్ళతోనే వాయిస్తారు. వీరు ముఖ్యంగా ఈ వాయిద్యంమీద భగవన్నామ సంకీర్తనలను వాయిస్తూ వుంటారు.

ఈ వాయిద్యాన్ని ముందు నిలబెట్టుకుని రెండు సన్నని పుల్లలతో జల తరంగ్ వాయిద్యాన్ని వాయించినట్లు వాయిస్తారు. ఈ స్వరమాధుర్యం ఎంతో మధురంగా వుంటుంది. వీరి వృత్తికి ప్రాణప్రదమైంది ఈ వాయిద్యమే. అయితే ఈ వాయిద్యాన్ని అందరూ వాయించలేరు. దీనిని ప్రత్యేకమైన శిక్షణతోనూ, సాధనతోనూ సాధించవలసిందే. అందువల్లనే ఈ వాద్యకాండ్రలో ప్రవీణులు చాలా తక్కువ. తెలంగాణాలో ఈ వాయిద్యంలో ప్రసిద్ధులైనవారు కరీంనగర్ జిల్లా మెట్టుపల్లి తాలూకాలో వున్నారు. ఈ కళారూపాన్ని శిథిలం కాకముందే దీనిని రక్షించుకోవడం అవసరం.

## విప్రనోదులు.

విప్రనోదులు విజయనగర సామ్రాజ్యకాలంలో వున్నట్లు పైనే తెలుసుకోగలిగాం.

విప్రవినోదంచేసేవారు ఆంధ్రదేశం అంతటా వున్నట్లు మనకు ఆధారాలు వున్నాయి. తెలంగాణాలో ఈ విప్రవినోదులు కరీంనగర్ జిల్లా మాణిక్యాలపురంలో వున్నట్లు తెలుస్తూ వుంది. వీరి వృత్తి విప్రులను యాచించడమే. వీరి ప్రదర్శనం కూడ ఇంద్రజాలమే వీరిదళ సభ్యులు నలుగురుంటారు. వీరి ప్రదర్శనలు విప్రుల ఇండ్లలోనూ, విశాల బహిరంగ స్థలాల్లోనూ కూడా ప్రదర్శిస్తారు. వీరి ప్రదర్శనసామగ్రి 5, 6 కాయలు. ఒక కొయ్య అలమారా, ఒక తాళపత్రగ్రంథం, రెండు జతల తాళాలు. వీరి ప్రదర్శనం విశాల ప్రదేశంలో ఒక చిన్న పందిరిలో జరుగుతుంది. పందిరిచుట్టూ కాలువలు కడతారు. ఆ తెరలమధ్య ఖాళీ అలమారా వుంచుతారు. ఇరువురు వ్యక్తులు చెరోపక్కన చేరి తాళాలు వాయిస్తారు. ఇంతలో ప్రేక్షకులు గుమికూడతారు. తెరలన్నీ ఎత్తి ఖాళీ అలమారా చూపిస్తారు. తరువాత దళముఖ్యుడు ప్రాచీన తాటాకు గ్రంథంతో తెరలమధ్యకు

వెళతాడు. ఒక పావుగంటవరకూ ఆయన బియటకు రాడు. ఈలోగా భజన జరుగుతూనే వుంటుంది. తరువాత తెరను తొలగిస్తారు. అదివరకు ఖాళీగా వున్న అలమారాలో దేవతల విగ్రహాలూ, దీపారాధనకుందులూ, పుష్పాలూ, ఫలాలూ, పిండివంటలూ, గంట, శంఖు, వివిధ పూజాపాత్రలు, అనేకరకాల పిండివంటలు ప్రత్యక్షమౌతాయి. ఈ ప్రదర్శనం ప్రేక్షకుల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది. ప్రదర్శనానికి ముందే అలమారాను పరీక్షించవచ్చు. అంతేకాక వీరు ఇంటింటికీ తిరుగుతున్నప్పుడు విగ్రహాలను, కప్పలను, చిలకలను, విభూతిని అరచేతిలో సృష్టించి ఇంద్రజాల మహేంద్రజాల విద్యను ప్రదర్శిస్తారు.

# పులినృత్యం

ఆంధ్రదేశంలో ప్రతి పల్లెలోనూ ఈ పులి నృత్యాన్ని చూచి వుంటారు. ముఖ్యంగా దసరా పుట్టువాలలోనూ, పీర్లపండుగల సందర్భంలోనూ, సంక్రాంతి విచిత్ర వేషాల్లోనూ ఈ పులి వేషాన్ని ధరిస్తారు. పులివేషం జంతు నృత్యాలకు అనుకరణ. నెమలినృత్యం. గుమిడ నృత్యం, సింహ నృత్యంమాదిరే ఈ పులినృత్యం కూడా.ఈ ప్రకారాన్ని ఎక్కువగా ప్రచారంలోకి తెచ్చినవారు పల్లె ప్రజలు.



చిత్రణవేళంలో ఈ పులివేషాన్ని పులివాలకోయి అనడం కద్దు. ఆంధ్రదేశంలో పులివేషమని, పెద్దపులివేషమని, దసరా పులివేషమనీ పిలుస్తూ వుంటారు. ఈ పులివేషంవాళ్లు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి యాచిస్తూ వుంటారు. పిల్లలు భయపడేటంత సహజంగా ఈ పులివేషాన్ని చిత్రిస్తారు. పులివేషం వచ్చిందంటే పల్లెల్లో పిల్లలకీ, పెద్దలకీ ఒక పండుగ.

పులివేషధారణ-

తీరు, తెన్ను :

పులివేషధారణ చాలా కష్టమైంది. మామూలు వేషాల్లాగ ఏదో ముఖానికి ఇంత

రంగు పూసి తుడిచివేయడంలాంటిది కాదు. శరీరంలో అన్ని భాగాలనూ వార్నిషు రంగులతో ముంచివేస్తారు. శరీరమంతటా అక్కడక్కడ నల్లటిచారలను చిత్రించడంతో పెద్ద పులి ఆకారం వస్తుంది. నెత్తికిమాత్రం తోలుతో కుట్టబడిన టోపీని తగిలిస్తారు. కళ్ళకు మాత్రం నల్లద్దాల కళ్ళజోడు ధరిస్తాడు వేషధారి. వేషం పూర్తి అయినతరువాత ఈ పులివేషం బజారులో కొస్తుంది. నిజంగా పెద్ద పులి వచ్చినట్లే వుంటుంది. హుందా యైన నడకలతోనూ, గంభీరపు చూపులతోనూ అడుగులువేస్తూ రోడ్డంతా కలయ దొక్కుతాడు. ఈ అడుగులకు తగినట్లు రెండు మూడు కనక తప్పెట్లు కణకణమంటూ వాయిస్తూవుంటే ప్రతి ప్రేక్షకునికీ చిందులూ, కేకలూ వేయాలన్నంత వుత్సహం కలుగుతుంది. పులినృత్యాన్ని. ఆ బాగోపాలం హాజరై ఆనందిస్తారు.

పులివేషధారి అప్పుడప్పుడు చుట్టూ మూగిన పిల్లల్ని భయపెడుతూ వుంటాడు. ముందు మామూలుగా అడుగులువేస్తాడు. అడుగులకు తగినట్లు వాయిద్యం వుధృతంగా వుంటుంది. ఇలా అడుగులమధ్య ఎగిరెగిరి మొగ్గలువేస్తూ వుంటాడు. పల్టీలు కొడుతూవుంటాడు. తొడచరిచి పౌరుషాన్ని నటిస్తాడు. ఇలా పల్టీలు కొట్టేటప్పుడు నృత్యం వుత్తేజంగా వుంటుంది.

ఈ నృత్యంలోనే పెద్ద పులి, వేటగాడు-రెండు పాత్రలు నటిస్తాయి. వేటగాడు పులిని చంపాలని ప్రయత్నించడంలో నృత్యం ఎంతో ఆకర్షణీయంగా సాగుతుంది.

మధ్య మధ్య డప్పు వాయిద్యగాళ్ళు పులివేషాన్ని కవ్విస్తూ వివిధ గతుల్లో అడుగులు వేయిస్తూ, వారు కూడా అడుగులువేస్తూ, గుండ్రంగా తిరుగుతూ, ప్రేక్షకుల నుత్తేజపరుస్తారు. పులివేషగాడు రెండు చేతుల్తోనూ రెండు నిమ్మకాయలుపట్టి, అప్పుడప్పుడు అతనికివచ్చే ఆయాసాన్ని అపుకోడానికి నిమ్మకాయల్నికొరికి రసం తాగుతూ జంతుతత్వాన్ని నటిస్తాడు. ఈ విధంగా ప్రజల నాకర్షించి పర్వదినాల్లో డబ్బు సంపాదించుకుంటూ వుంటారు.

పులివేషం ఆంధ్రదేశపు జానపద నృత్యాల్లో ముఖ్యమైంది.

## కామని పౌర్ణమి వినోదాలు

తెలంగాణా గ్రామీణ ప్రజలకు కామని పౌర్ణమి ఆనందదాయకమైన పండుగ. వెన్నెల రాత్రులలో గుంపులు గుంపులుగా, పౌర్ణమి ఇంకా మూడు రోజు లుం.

దనగానే, ఈ వినోద కార్యక్రమాలు ప్రారంభమౌతాయి. కామునిపున్నమ ఒక్క తెలంగాణాలోనేకాక భారత దేశమంతటా, ముఖ్యంగా ఉత్తర హిందూస్తానంలో హోళీపండుగ రూపంలో జరుగుతుంది. వరుసా వావీ లేకుండా ఒకరిమీద మరి ఒకరు వసంతాలను జిమ్ముకుంటూ ఒడలు మరచి తన్మయత్వంలో ఈ వినోదాలను జరపుకుంటారు. కులభేదాలూ, మతభేదాలూ, వైషమ్యాలూ, ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువా అనే భేదభావం లేకుండా ఈ వినోదాలు ఎంతో అన్యోన్యంగా సాగుతాయి. ఆంధ్రదేశంలో ఈ వసంతాలు ముఖ్యంగా వివాహానంతరం కంచరాలు విప్పేరోజున ఎంతో వుల్లాసంగా జరుగుతాయి.

అలాగే సీతాకళ్యాణం సమయంలో బండ్లమీద వసంతాలతో నింపిన భాండాలు పెట్టుకొని గ్రామవీధుల్లో కనబడిన వారందరిమీదా ఈ వసంతాలను విరజిమ్మి గులాములను చల్లుతారు. పిడతలు, కప్పలు, నత్తలు, మామిడిపెంకల దండలూ మెడలోవేసి ఒకరి కొకరు వినోదాలతో తృప్తిని తీర్చుకుంటారు.

కామునిపౌర్ణమి సందర్భంలో వసంతాలు అంతటా అంతరా వుపయోగిం చకపోయినా ముఖ్యంగా హైదరాబాదు, సికిందరాబాదు, వరంగల్లు మొదలైన నగ రాలలో వసంతోత్సవాలు జరుగుతూ వు టాయి. పల్లెప్రాంతాల్లో రకరకాల వినో దాలతోనూ, ఆటపాటలతోనూ ఈ వుత్సవాలు జరుగుతూ వుంటాయి.

కామునిపున్నమ సందర్భంలో వెన్నెలపాటలు, అల్లో నేరేళ్ళు, కోలాటపు పాటలూ స్త్రీలు పాడుకుంటే పురుషులు జానరపాటల్ని, కోలాటపు పాటల్నీ పాడుతూ వుంటారు. మొత్తంమీద ఈ కోలాటరచారూపంలో స్త్రీ పురుషు లిరువురూ పాల్గొంటారు. స్త్రీలకంటే పురుషులయొక్క కోలాటనృత్యం వుత్సాహంగా వుం టుంది; స్త్రీలకోలాటం లాలిత్యంగా వుంటుంది.

కోలాటపు చిరతల్ని కోలలంటారు. ఒక్కొక్కరూ రెండేసి చిరతల్ని రెండు చేతులా ధరించి ఒకరి కొకరు లయప్రకారం అడుగుల ననుసరించి ఆయా పాటల గమకాలమేరకు ఒకడు ప్రధానుడై పాటపాడితే మిగతా బృందం వారందరూ ఆతనిని అనుసరిస్తారు. కోలాట నృత్యాలను గురించి మరోచోట వివరంగా వివ రించాను.

ఆంధ్రదేశంలో కోలాటాలు ఎంత ప్రచారంలో వున్నాయో తెలంగాణాలో కూడా అంత ప్రచారంలోనూ వున్నాయి. బి. రామరాజుగారి వ్యాసరచననుబట్టి స్త్రీ పురుష లిరువురిలోనూ కోలాట నృత్యప్రభావం చాలా ఎక్కువగా వున్నట్లు విశదమవుతూ వుంది.

కోలాటపు పాటలు ఎక్కువగా సంవాదరూపంలోనూ, శృంగార రసప్రధానంగాను వుంటాయి. మరి కొన్ని పచ్చి శృంగారంతో నిండివుంటాయి. స్త్రీల కోలాటపు పాటల్లో గోపికలు చిలిపి కృష్ణుని దుందుడుకు చేష్టలకు విసిగి కృష్ణుని తల్లి యశోదతో మొరపెట్టుకుంటారు.

# బత్తుకమ్మ, బొడ్డెమ్మ పండగలు

ఆంధ్రదేశంలో ఎక్కడా ప్రచారంలో లేనిండా ఒక్క తెలంగాణాలో మాత్రం విశేష ప్రచారాన్ని పొందింది బతుకమ్మ పండుగ. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి మహార్నవమివరకు తొమ్మిది రోజులు ఈ పండుగ జరుగుతుంది.

బతుకమ్మ పండుగకు పూర్వమే తొమ్మిదవరోజు బొడ్డెమ్మ పండుగ జరుగుతుంది. ఇది మహాలయ అమావాస్యతో పూర్తి అవుతుంది. బొడ్డెమ్మ కన్యకల కారాధ్యదైవము. ఈ వుత్సవాల్లో పెద్దలు అంతగా పాల్గొనరు.

పుట్టమన్నుతో ఒక బొమ్మనుచేసి బహుళ పంచమినాడు ప్రతిష్ఠించి దానిపైన ఒక కలశాన్నివుంచి, కలశంపై పసుపు ముద్దతో గౌరమ్మను నిలిపి పూలతోను, పసుపుతోను అలంకరిస్తారు. ఈ విధంగా ప్రతి యింటిలోను చేయకపోయినా గ్రామానికి ఒక గృహంలో చేసినా సరిపోతుందని వారి అభిప్రాయం.

బొడ్డెమ్మను నిలిపిన తరువాత ఆ వాడలో ఉన్న ఆడపిల్లలందరూ అక్కడ గుమికూడతారు. ఈ వినోదాన్ని చూడడానికి పెద్దలందరూ వస్తారు. ఎవరో ఒకరు పాట ప్రారంభిస్తే మిగతా కన్యలందరూ చేతులు తట్టుతూ బొడ్డెమ్మచుట్టూ తిరుగుతూ, ఈ విధంగా పాడుతారు:

మాలుమర్తి మేడమీద చందమామా ....వెండియ్యవేనగరలు ॥చం॥
వెండియ్యవే నగరలకు ....ఇత్తడియ్య బేరీలు
ఇత్తడియ్య బేరీలకు ....రాగియ్య కడుపలు
రాగియ్య కడుపలకు ....ముత్యాల ముగ్గులు
ముత్యాలముగ్గులకు ....వజ్రాల వాకిండ్లు
వజ్రాలవాకిండ్లకు ....పవడాల పందిళ్ళు
పవడాల పందిళ్ళకు ....మంచినీళ్ళ బావిపుట్టె
మంచినీళ్ళ బావిప్రక్క ....మంచి మల్లెచెట్టువుట్టె
కోసేవారెవరు లేక ....కొండెత్తు పెరిగిపోయె
కోయించు చందప్ప ....పంచిపెట్టు గొరమ్మ.

ఈ విధంగా ఎన్నోపాటలు పాడుతారు. తొమ్మిదవనాడు బొడ్డెమ్మ నర్చించి కలశంలో వాడపిల్లలు ప్రతి దినం తెచ్చిపోసే బియ్యం పరమాన్నం వండి పంచి పెట్టి ఒక బావిదరిచేరి,

బొడ్డెమ్మ బొడ్డెమ్మ....బిడ్డలెందారే,
బావిలవడ్డవారికి....బారిద్దరమ్మా,
చెర్లబడ్డవారికి....చేరిద్దరమ్మా,
కుంట్లబడ్డవారికి....కోరిద్దరమ్మా,
నిద్రబో బొడ్డెమ్మ....నిద్రబోవమ్మా,
నిద్రకూ నూరేండ్లు....నీకు వెయ్యేండ్లు,
వినుగన్న తల్లికి....నిండ నూరేండ్లు.

అంటూ బొడ్డెమ్మను నీటిలో వదలుతారు. బొడ్డెమ్మ పండుగలో పాడబడే పాటలు ఇంకొ కొన్నివందలున్నట్లు రామరాజుగారు తెలియజేస్తున్నారు.

బతుకమ్మ :

బొడ్డెమ్మ పండుగ తరువాత వచ్చేపండుగ బతుకమ్మ పండుగ. దీనినే బతకమ్మ పండగని కూడా ఈనాడు పిలుస్తున్నారు. గ్రామసీమల్లో వుండే రకరకాల

పువ్వులతో బతుకమ్మను పేర్చి దాని పైన పసుపుతో తయారుచేసిన గౌరమ్మను నిలుపుతారు. ముత్తైదువులందరూ అడుగులకు మడుగు లొత్తుతారు. పసుపు కుంకుమలతో నిండారనింపి పగటిపూటనే బతుకమ్మలను పీటలపై ప్రతిష్ఠించి సాయంకాలం నాలుగు గంటలకు పిన్నలు పెద్దలు వారికున్న వస్త్రాలనూ, భూషణాదులనూ ధరించి, అందరూ బతుకమ్మ బొమ్మలను తీసుకుని ఊరిబయట వుండే కాలువకో, చెరువుకో, బావికోవెళ్ళి బ్రతుకమ్మలను మధ్యనిడి, అందరూ చుట్టూ గుమికూడి వలయాకారంగా తిరుగుతూ చప్పట్లు చరుస్తూ పాటలు పాడుతూ వంగి లేస్తూ గంతులువేస్తూ పాటలు పాడుతారు. ఈ వుత్సవాన్ని తిలకించడానికి గ్రామంలో వున్న ఆబాలగోపాలం పిన్న పెద్దలందరూ వస్తారు. మొగపిల్ల లందరూ వసంతాలను గొట్టాలలోచేర్చి ఆటపాటల్లో నిమగ్నమైన వా రందరిపైనా ప్రయోగిస్తారు.

ఇలా వలయాకారంగా తిరిగే పెద్దపెద్ద వరుసలు దీరిన జట్టులు, విశాల రంగమంతటా వుంటాయి. అందరూ ఇలా బతుకమ్మ పాటలను పాడుతూవుంటే కనులపండువుగా వుంటుంది. ఈ పాటల్లో లక్ష్మీ, పార్వతుల స్తోత్రములేగాక పౌరాణిక గాథలు కూడా అనేకం వున్నాయి. బతుకమ్మ పాటలు కొన్ని ముద్రించారు. అముద్రితాలు ఎన్నో వున్నాయి. వీటిలో ఓరుగల్లు సమీపానికి జెందిన మొగిలిచర్ల గ్రామస్థుడు ఈ క్రింది పాటను రెండువందల సంవత్సరాలక్రితం రచించాడు.

శ్రీలక్ష్మీదేవియు చందమామ....సృష్టి బతుకమ్మయ్యె ॥చం॥
పుట్టినా రీతిజెప్పె....భట్టు నరసింహకవి
ధరచోళదేశమున....ధర్మాంగుడనురాజు
అరాజు భార్యయు....అతి సత్యవతియండ్రు
నూరునోములు నోమి....నూరుమందినిగాంచె
వారు శూరులయ్యు....వైరులచె హతమైరి
తలిదండ్రులపుడు....తరుగనీ శోకమున
ధనరాజ్యముల బాసి....దాయాదులను బాసి
వనితతో అరాజు....వనమందు నివసించె
కలికి లక్ష్మినిగూర్చి....ఘనతవం బొనరించె
ప్రత్యక్షమై లక్ష్మి....వలికె వరమడుగుమని

వినుతించివేడుచు....వెలది తనగర్భమున
వుట్టుమని వేడగా....పూబోణి మదిమెచ్చి
సత్యవతి గర్భమున....జన్మించె శ్రీలక్ష్మి
బ్రతుకగనె ఈతల్లి....బ్రతుకమ్మయనిరంత
పిలుతురదివరనుండి—ప్రియముగా తలిదండ్రి
బ్రతుకమ్మయనిపేరు....ప్రజలంత అందరూ
కాను ధన్యాడంచు....తనభిక్షతోరాజు
నిజపట్టణముకేగి....నేలపాలించంగ
శ్రీ మహావిష్ణుండు....చెక్రాంకుడనుపేర
రాజువేషంబున....రాజు ఇంటికి వచ్చి
ఇల్లంటపని వుండి....ఇంతి బ్రతుకమ్మను
పెండ్లాడి కొడుకులా....పెక్కుమందినిగాంచె
ఆరువేలామంది....అతిసుందరాంగులు
ధర్మాంగుడనురాజు....తన భార్య సత్యవతి
సరిలేని సిరులతో....సంతోషమొందిరీ
జగతిపై బ్రతుకమ్మ....శాశ్వతంబుగ వెలసె.

ఈ విధంగా తెలుగు స్త్రీలు గొంతులు కలిపి ఈ పాటను పాడెడువేళ గ్రామాలన్నీ పులకరించిపోయేవి. ఎందరో గతించగా బ్రతికిన సంతానం గనుక బ్రతుకమ్మ అని పేరు పెట్టినట్లు పై పాటద్వారా తెలుస్తూవుంది. ఇటువంటి సంతానానికి ఈనాటికీ తెలంగాణాలో బ్రతుకమ్మ, బ్రతుకయ్య అని పేర్లు పెట్టుకుంటూ వుంటారు.

ఈనాడు బ్రతుకమ్మలపండుగలు, ఆటలూ, పాటలూ అంతగా జరగటం లేదు. అందుకు కారణం నవనాగరికతయే. ఈ పాటలస్థానంలో రాజకీయమైన కథలను మేళవించి ఈనాటి ప్రచారానికి వినియోగిస్తున్నారు. ప్రసిద్ధ రచయిత బి. రామరాజుగారు ఈ విషయాలను సేకరించడంలో విశేషకృషి చేశారు.

## తెలంగాణా యక్షగానాలు

తెలంగాణాలో యక్షగానాలు దాదాపు నూటకుపైగా వున్నాయని యస్వీ జోగారావుగారు తెలియజేస్తున్నారు.



తెలంగాణాలో యక్షగాన రచన 18-వ శతాబ్దంలో విరివిగా పాగింది. యక్షగానాలకు ప్రదర్శనరూపంలో గాక పురాణ పఠనం మాదిరి పారాయణం ద్వారా ప్రారంభదశలో ప్రచారం జరిగింది.

1780 లో రచింపబడిన శేషాచల కవి ధర్మపురిరామాయణం, 1834 నాటి ముద్దకవి మంథెనరామాయణం ఈ కోవకు చెందినవే.

ఆనాడు ధర్మపురి రామాయణం ఒక్క తెలంగాణాలోనేగాక సర్కారు ఆంధ్రదేశమంతటా వ్యాప్తిలో వుంది. ఆంధ్రదేశపు ప్రదర్శకులు అందులోని దరువుల్ని చక్కగా వినియోగించుకున్నారు.

ఎటుతిరిగీ 19-వ శతాబ్దపు ఉత్తరార్ధంలోనే యక్షగాన ప్రదర్శనాలు రంగస్థలమెక్కాయి. ఈ కాలంలో శేషభట్టరు కృష్ణమాచార్యులు, గోవర్ధనం నరసింహాచార్యులు, దట్టెము పాపకవి మొదలైనవారు యక్షగానాలను వ్రాశారు.

### మహారాజపోషణ :

ఆనాడు యక్షగానకవుల్ని మహారాజు పోషించారు. ఆత్మకూరు సంస్థానాధీశుడైన

ముక్కర సీతారామ భూపాలుడు రామదాసనే కవిచేత 'తారాశశాంకము', 'భీమసేన విలాసం' అనే యక్షగానాలను వ్రాయించారు.

ఈ సమయంలోనే గోవర్ధనంవారి గొల్లకలాపం, రూప్ఖాన్‌పేట రత్నమ్మగారి కురవంజి వెలువడ్డాయి.

### యక్షగాన రచనలో అందెవేసిన చేయి :

20-వ శతాబ్దం నాటికి తెలంగాణాలో యక్షగానాలు రచనలోనూ, ప్రదర్శనలోనూ గణుతికెక్కాయి. పల్లెగ్రామాలలో ప్రజలు పదాలుకట్టి పాడుకుంటూ వుండేవారు. కాంభోజరాజు, బాలనాగమ్మ, పెదబొబ్బిలిరాజు కథ, ఆరెమరాఠీల కథ మొదలైన యక్షగానాలు బహుళ ప్రచారాన్ని పొందాయి. చెర్వీరాల భాగయ్యగారు

ప్రదర్శనయోగ్యమైన యక్షగానాల రచనలో అందెవేసిన చేయిగా పేరుపొందారు. ఈయన రచించిన యక్షగానాలు 32. ఇన్ని యక్షగానాలను వ్రాసిన కవి మరొకరు ఆంధ్రదేశంలో లేరంటే అతిశయోక్తి కాదు. ఈయన అనేకమంది యక్షగాన కవులకు గురుతుల్యుడుగా ఎంచబడ్డాడు.

ఈనాడు తెలంగాణా యక్షగాన కవులలో ప్రసిద్ధులైనవారు బూరుగపల్లి సోదరులు. వీరి కృతులను నాటకా లనే వ్యవహరించారు.

పట్లోరి వీరప్పగారి 'చైతువిజయం' సామ్యవాద సిద్ధాంతానికి అనుగుణంగా రచించబడింది.

తెలంగాణాలో యక్షగాన వాఙ్మయమూ, యక్షగాన ప్రదర్శనాలూ, అలస్యంగా ప్రారంభమైనప్పటికీ ఆంధ్రదేశపు యక్షగాన చరిత్రలో ఒకస్థానాన్ని సంపాదించుకున్నాయి.

## తెలంగాణా జానపదకళారూపాలు

అనేక సంవత్సరాలుగా నైజాం ప్రభువు దానిసత్వంలో మ్రగ్గిపోయిన తెలంగాణా ప్రజల వినోద కళా రూపాలు సర్కారు, రాయలసీమ ఆంధ్రప్రజలకు ఆంతగా తెలియవు. ఆంధ్ర ప్రాంతంలో జానపద కళా రూపాలూ, నాటకరంగమూ అభివృద్ధి అయినంతగా తెలంగాణా ప్రాంతంలో కాలేదు. అక్కడక్కడ శిథిలమై జీర్ణావస్థలోవున్న జానపద కళారూపాల వివరాలు కూడ మనకు సరిగా తెలియవు. ఈ విషయంలో శ్రీ బి. రామరాజుగారు అద్భుతమైన కృషిచేశారు. కొన్ని కళా రూపాలనుగురించి సముద్రాల గోపాలమూర్తిగారు 'నాట్యకళ'లో వుదాహరించారు.

హద్దులు,
అవధులు :

ఆనాటి సంఘపెద్దలు ఈ జానపద కళారూపాలకు కొన్ని హద్దుల్ని నిర్ణయించారు. నృత్యనాటకాలు కేవలం వినోదానే నని, అవి కూడ సానివారల సొత్తులే నని, ఇతరులు వాటిని ఆదరిస్తే, సంఘ బహిష్కారం కులబహిష్కారంగావిస్తా మని బెదరించేవారట. అంతే గాక ప్రభుత్వ అనుమతిలేకుండా ఏ ప్రదర్శనా ప్రద

శ్నించడానికి వీలులేదు. ఇందువల్ల ఆ ప్రాంతంలో కళారూపాలు ఒక స్థాయికిమించి అభివృద్ధి పొందలేకపోయాయి.

ప్రతి ప్రాంతంలోనూ జానపద కళారూపాలను, ఆయా జాతులు, కులాల వారు ఏ విధంగా పోషిస్తూ వచ్చారో అదే విధంగా తెలంగాణాలో ఒక్కొక్కతెగ ఒక్కొక్క కళారూపాన్ని చేతపట్టాయి. ఒక తెగవారు మరో తెగవారిని వినోదపరుస్తూ వుంటారు. అలాగే ఒక తెగవారు మరొక తెగవారికి ఆచార్యులుగానూ, గురువులుగానూ వ్యవహరిస్తూ వుంటారు. జానపద కళారూపాలలోవున్న విశేషమేమిటంటే కళద్వారా అనేకమైన మహత్తర విషయాలను తేలికభాషలో, సూటిగా, ప్రజలకు అర్థమయ్యేటట్లు సునిశితమైన రీతిలో, సుబోధకంగా వివరింప జేయడమే జానపద కళ విశిష్టత. ఈ జానపద కళా రూపాలలో పండితులకు సునిశిత హాస్యాన్నీ, పామరులకు మొరటుహాస్యాన్నీ ప్రవేశపెట్టి రంజింప జేశారు. ఈనాడు తెలంగాణంలో బంజారా అనే తెగలవారు ఈ జానపద కళను ఆచరిస్తున్నట్లు గోపాల మూర్తిగారు వ్రాస్తున్నారు.

వారిలో రాజగోండ్—ప్రధాన్—లంబాడి—మధురా—కొలామ్—మొదలైన శాఖలు. ఇలాగే సామాన్య తెగలకు చెందినవారు విప్రవినోదులు—సాధనా శూరులు—బైండ్లవారు—చిన్న మాదిగలు—గం పెభాగవతులు—కాటిపాపలు—కట్టెబొమ్మలు—బిగ్గుగొల్లలు—పంచాల—మిత్తులయ్యవారు—ముస్లిం సాంప్రదాయాలకు సంబంధించినవారు, ఖవ్వాలీ, నౌబత్‌ఖానా—తాషామర్సా మొదలైనవి.

## సాధనా శూరులు

పద్మశాలీలను మాత్రమే అర్థించే వీరిని సాధనాశూరులని పిలుస్తూ వుంటారు. వీరి ప్రదర్శనాలను అందరికీ ప్రదర్శిస్తారు. ఒక గ్రామంనుంచి మరోగ్రామానికి సంచారంచేస్తూ ప్రతి గ్రామంలోని పద్మశాలీల అనుమతితో వీరు ప్రదర్శనలు ప్రారంభిస్తారు. వీరి ప్రదర్శన ఇంద్రజాలానికి సంబంధించింది. వీరి ప్రదర్శనం పగటివేళ జరుగుతుంది. దీనిని పగటివేషంగా భావించవచ్చు. వీరి ప్రదర్శనకాలం 3 గంటల వరకూ వుంటుంది. వీరి రంగస్థలం గ్రామకూడలిలోనున్న విశాలస్థలంలో జరుగుతుంది. వీరి కళా రూపాలసాధనకు నిష్ణ అవుసరమంటారు. వీరి పనులు కనికట్టు గారడీలా వుంటాయి. ఉదాహరణకు వీరి ప్రదర్శనలో ఇరువురు వ్యక్తులు రెండు రేకు పళ్ళెములు తీసుకుని చేతులకు ఏదో ఆకుపసరు పూసుకుని

దూరంగా నిలబడతారు. వారు చేతులకు పూసుకున్న పసరు ప్రభావంవల్ల వారి హస్తాల్లోవున్న పళ్ళెములు ఒక్కసారి పైకెగిరి రెండు పళ్ళెములూ కొట్టుకుని మరల యథాస్థానాన్ని చేరుకుంటాయి.

అలాగే మరోవ్యక్తి రొమ్ముమీన ఒక ప్రత్యేకమైన ఆకును అతికించి ఆ ఆకును గురిచూచి కొట్టవలసిందిగా ఒక తుపాకిని ప్రేక్షకులలో ఎవరు ముందుకు వస్తే వారికిచ్చి రొమ్ముమీద ఆకుకు గురిపెట్టి కొట్టమంటారు. అలా గురిచూచి ఎవరైనా కొట్టినట్లయితే ఆ గుండు రొమ్ములోపలి భాగానికి పోక ఆ ఆకును కొట్టుకుని అక్కడే పడిపోతుంది. ఆ ప్రదేశంలో ఏవిధమైన గాయమూ మనకు కనబడదు. ఇది కనికట్టో, ఆకుపసరు ప్రభావమో, లేక ఇంద్రజాలమో మనకు తెలియదుగాని వారు ఇలాంటి ప్రదర్శనలో నిజంగా సాధనాశూరులే. ఈ సాధనాశూరులు ప్రస్తుతం కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్ తాలూకా వల్ల భాపురంలో వున్నారు. ఈ ప్రదర్శన ద్వారా వీరు జానపదులను దిగ్భ్రాంతులను చేస్తారు.

## గంటె భాగవతులు

ఆంధ్ర ప్రాంతంలో వున్న గంటె భాగవతులకు, తెలంగాణా గంటె భాగవతులకు వ్యత్యాసముంది. ఈ గంటె భాగవతులు కరీంనగర్ జిల్లా 'కొదురుపాక'లో వున్నారు. వీరి ప్రదర్శనం రాత్రిపూటే జరుగుతుంది. వీరి ప్రదర్శన సాహిత్యమేమో మనకు తెలియదుగాని, వీరి ప్రదర్శనం మాత్రం ప్రాముఖ్యంగా ప్రదర్శించటానికి ఈ గంటెల నుపయోగిస్తారు. వీరి ప్రదర్శనంలో వచ్చే ప్రతి పాత్రధారి చేతిలోనూ ఒక గరిటె వుంటుంది. అందులో చమురుపోసి, ఒత్తివేసి వెలిగిస్తారు. ప్రతిపాత్రయొక్క హావభావాలూ, అంగికచలనాలూ ఈ గరిటె వెలుతురువల్ల ప్రేక్షకులకు విశదంగా వెల్లడౌతాయి. మధ్య మధ్య నటనను సాగిస్తూ గంటెలలోని వత్తి ఎగదోస్తూ వుంటారు. ఈ వత్తుల వెలుతురువల్ల ముఖంలో ప్రతిబింబించే సాత్వికాభినయానికి ఎక్కువ ప్రాముఖ్యాన్నిస్తారు. ప్రాచీనులు ఈ పద్ధతిని



జేగంట భాగవతుడు

అనుసరించేవారు. అంటే ఆనాటికి ముఖానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చినట్లు మనం తెలుసుకోవచ్చు. ప్రతివారి చేతిలోనూ గరిటె వుంటుంది. కాబట్టి, ఆ గరిటె ప్రాముఖ్యంతోనే భాగవతాలను ప్రదర్శిస్తారు. కాబట్టే, వారికి గరిటె భాగవతులనీ, గంటె భాగవతులనీ పేరు వచ్చింది.

## కాటిపాపలవాళ్ళు

కాటిపాపలవారు ఆంధ్ర ప్రాంతంలో కూడ వున్నట్లు వినికిడి. కాటిపాపలవాళ్ళు మచ్చుజల్లి పిల్లల్ని ఎత్తుకుపోతారని భయపెట్టేవారు. ఈ కాటిపాపలవారు మెదక్ జిల్లా జహీరాబాద్ తాలూకాలో వున్నారు. వీరిదికూడ ఇంద్రజాల ప్రదర్శనమే, ప్రజలను భయకంపితులనుగా చేసే కళారూపమిది. వీరి వేషధారణ అతి గంభీరమైనది. ఈ ప్రదర్శకుడు రంగు రంగుల దుస్తులు ధరిస్తాడు. రెండు మూడు పెద్ద పెద్ద గంటలను వ్రేలాడదీస్తాడు. నడుస్తూంటే ఈ గంటల చప్పుడు ఏదో ఒక ఏనుగువస్తున్నట్లుగా భీతిపుడుతుంది. నొసటన పెద్దబొట్లు, వడితిరిగిన బుర్రమీసాలు, ఈకలహూదరిగా చిత్రించిన రేకుల, కిరీటం చంకిజోలె, చేతిలో ఎముకలు పుచ్చుకుని భూతవైద్యుడులా ప్రవేశిస్తాడు. కూర్చున్నచోట్లా, నోటిలో నుంచి నాలుగైదుపాముల బరువుగల పెద్ద పెద్ద గుండ్లను, విగ్రహాలను, ఇతర సామానులను నోట్లోనుంచి పుట్టిస్తాడు. కీళ్ళలోనుంచి మేకులను తీస్తాడు. ఈ ఈ ప్రదర్శనం కూడ ప్రజలను ఆశ్చర్యచకితులను చేస్తుంది.

## బైండ్లవారు

వీరశైవ మతస్థులకు వినోదాన్ని కల్పించేవీరి బైండ్లవారని అంటారు. కులాలూ మతాలవారీగా, ఆచార్యులూ, కళాకారులూ వున్నట్లు వీరు కేవలం శైవమత స్థులకే వినోద ప్రదర్శనలిస్తారు. వీరు శైవమతస్థుల ఇండ్లలో, పెండ్లి మొదలైన శుభకార్యాలలోనూ, చావు మొదలైన దుర్దినాలలోనూ కథలను చెపుతారు. పెండ్లికి, చావుకి వేరువేరుగా వాయిద్యాలను వాయిస్తారు.

## కోలాట నృత్యం

పాల్కురికి సోమనాధుడు కోలాటాన్ని కోలాటగొడియ అని వర్ణించాడు. ఇతర అనేక నృత్య విశేషాలను వర్ణించినంతగా కోలాట గొడియను గూర్చి అంతగా

వివరించనందువల్ల సోమనాధుని కాలానికి కోలాటాలు అంతగా అభివృద్ధి పొంద లేదని వూహించవచ్చు. కాని విజయనగర సామ్రాజ్యకాలంలో ఈ కోలాటాలు ప్రసిద్ధంగా ప్రదర్శించినట్లు విదేశ యాత్రికుడు అబ్దుల్‌రజాక్ వర్ణించిన విషయం



తెలిసిందే, ఈనాటికీ విజయనగర శిధిలశిల్పాలలోనూ, శ్రీశైలం దేవాలయ ప్రాకారపు గోడలపైనా కోలాటంచేసే నర్తకురాండ్ర శిల్పాలున్నాయి.

తెలుగుదేశపు జానపద నృత్యాలలో కోలాట నృత్యాన్ని పిన్నలు మొదలు పెద్దలవరకూ చేస్తూవుంటారు. ప్రతి బాలికా పాఠశాలలోనూ ఆటవిడుపు కార్యక్రమంలో నృత్యాన్ని ప్రదర్శిస్తూ వుంటారు. నోటితో నృత్యం, చేతి చిరతలతో తాళం ఏకకాలంలో జరుగుతూ వుంటాయి. ఇందులో జడకోపు కోలాటం చాల ప్రజ్ఞతో ప్రదర్శిస్తారు.

జడకోపు :

సమసంఖ్యలో అందరూ అన్నిత్రాళ్ళూ పట్టుకుని గుండ్రంగా నిలుస్తారు. వీరు రెండు పక్షాలుగా చీలుతారు. రెండు పక్షాలకూ ఇద్దరు నాయకులుంటారు. వారు లయప్రకారం రెండు భాగాలుగా విడివడివారు నిలబడిన కేంద్రంనుంచి మరోకేంద్రానికి ఒకరి తరువాత మరొకరు వరుసక్రమంలో తిరగడంతో ఈ త్రాళ్ళన్నీ అల్లబడిన జడలాగా ఎంతో సుందరంగా కనబడుతుంది. ఇలా జడను అల్లడం ప్రారంభించి జడ పూర్తి అయ్యేవరకూ పాటపాడుతూ అల్లుతూనే వుంటారు. ఈ అల్లికలో ఏ ఒక్కరు తప్పుగా నడిచినా జడ చిక్కైపోతుంది. అందువల్ల ప్రతి ఒకరూ వరుస తప్పకుండా నిపుణతతో జడను అల్లుతారు. ప్రారంభంలో ఈ అల్లడం నిదానంగా సాగుతుంది. తరువాత అతివేగంగా అల్లబడుతుంది. ఈ వేగంలో కోలాటనృత్యం ప్రేక్షకులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇలా జడకోపు పూర్తి అయిన తరువాత

అందరూ ఒక పుష్పాకారంలో దగ్గరకు చేరుకుంటారు. ఆ తరువాత జడను ఎలా అల్లుకొచ్చారో అలాగే మరల ఎదురు తిరిగి జడను విడదీస్తారు. జడను అల్లినంత కష్టం వూడదీయడంలో వుండదు. విడదీయడం అతి వేగంగా జరుగుతుంది. ఈ విధానం ఎంతో కనులపండువుగా వుంటుంది. ముఖ్యంగా బాలికల్ని ఒకే ఎత్తు కలిగినవారిని కోలాటానికి ఎంచుకుంటారు. అందరూ వాలుజడలువేసి రంగురంగుల పూలు ధరిస్తారు. ఒకే రంగుగల లంగాలు, చొక్కాలు, తొడుగుతారు. రంగు రంగుల కోలాటపు బిరతలు ధరించి వలయాకారంగా తిరుగుతూవుండే ఇంద్ర లోకంలో దేవతలు నృత్యం చేస్తున్నారా అనిపిస్తుంది.

గొంతులు కలిసిన ఇద్దరు బాలికలు పాట ప్రారంభిస్తే. దళంలోని వారం దరూ ఒక్కసారి గుమ్మగా అందుకుంటారు. ఇలా పాడే బృందగానం చెవుల కెంతో ఇంపుగా వుంటుంది. వీరి జడకోపు ప్రదర్శనం శాస్త్రయుక్తమైన భరత నాట్యంలో ఒక భాగంగా కవిపిస్తుంది.

ఈ కోలాటానికి ఎప్పుడూ సమసంఖ్యలో వుజ్జీలు వుండాలి. 8 మంది గాని, 12 మంది గాని, 16 మంది గాని, 24 గురుగాని వుండవచ్చు. సంఖ్య ఎంత పెరిగితే ఈ నృత్యం అంత రంజుగా వుంటుంది. ఈ నృత్యాన్ని ఒక వ్యాయామ క్రీడగా ప్రతి సాయంత్రమూ డ్రిల్లు క్లాసులో వేయిస్తూ వుండేవారు వీరి కోలాట ప్రారంభంలో ఎక్కువగా ఈ పాట పాడుతూ వుంటారు.

అటవిస్థళముల కరుగుదుమా,
వటపత్రంబులు కోయుదుమా,
చందన గంధము తీయుదుమా,
సఖియజాక్షి మెడ పూయుదుమా,
కోలాటంబులు వేయుదుమా,
కోరికదీరంగా మనము.

ఈ విధంగా కోలాటంలో పాటలు పాడుతూ నృత్యంచేస్తూ ప్రేక్షకులందర్నీ ముగ్ధుల్ని చేస్తారు.

చుట్టుకోపు,
కోలాటం కీర్తన:

గోపిక, కృష్ణుల, సంవాదం.

గోపిక: గొల్లవారి వాడలాకు కృష్ణమూర్తీ,
నీవేమిపనుల కొచ్చినావు కృష్ణమూర్తీ॥ గొల్ల॥

కృష్ణుడు: పాలుకొన వచ్చినానె గొల్లభామా,
మంచి పాలుపోసి పంపించు గొల్లభామా॥ గొల్ల॥
గోపిక: కొత్తకోడలనయ్య నేను కృష్ణమూర్తీ
మా యత్తగారి నడుగుమయ్య కృష్ణమూర్తీ॥ గొల్ల॥
కృష్ణుడు: కొత్తకోడలైతేనేమి గొల్లభామ
నా రొక్కమిచ్చి పుచ్చుకోండే గొల్లభామా॥ గొల్ల॥
గోపిక: నీ రొక్కము మా కొద్దయ్య కృష్ణమూర్తీ
నీవు రంపుచేయక మళ్ళుమయ్య కృష్ణమూర్తీ॥ గొల్ల॥

చక్రకం కోవ్ర:

ముంగపేరు దున్నువాడ
ముద్దుల మేనత్తకొడుక
డాపపెద్దుకు దప్పికాయెను
ఓ రందకాడ నరసయ్య బావ
సీలదిప్పి నీలబెట్టబ్బి॥ ఓరందకాడ॥
దూరాబాతము దున్నబోకు, దిబ్బలెక్కి చూడలేను
వూరుముంగట వులవచల్లబ్బ
ఓ రందకాడ నరసయ్యబావ
వులవకోతకు పిలువనంపబ్బ
నూగునూగు మీసమోడ
నువ్వుచేకాచేనువోడ
నాకుచేరెడు నువ్వులంపబ్బ
ఓ రందకాడ నరసయ్యబావ
చిమ్మిడి వుండలు చేయగలనబ్బ॥ ఓరంద॥
ఏటి అవతల చిన్నవాడ
వెనకలేరు దున్నువాడ
తెప్పగట్టి తేలిపోదాము
ఓ రందకాడ నరసయ్యబావ
ముప్పతిప్పలు మూల్గలేలబ్బి.

పెద్దల కోలాటాలు :

పైన చర్చించిన కోలాటం చిన్న పిల్లలలోనే గాక, పెద్దలలో కూడ వ్యాప్తిలో వుంది. భక్తిభావంతో ఈ నృత్యాన్ని ఎక్కువగా చేస్తూవుంటారు. పొడుగైన కోలాటపు చిరతలతో ఎగిరి ఎగిరి పల్టీలుకొడుతూ, కూర్చుని లేస్తూ, వెనుకకు గిట్టున తిరుగుతూ, వేగంగా గిరికీలు కొడ్తూవుంటారు. కోలాట ప్రారంభంలో 'ఇడతయ్యకు తాధిమితా' అని చిరతలతో తాళం తెగగొట్టి ప్రారంభిస్తారు వీరు కూడ నోటితో పాటనూ కాళ్ళతో నృత్యాన్నీ చేస్తూవుంటారు. అందరూ ఒకే రంగు పంచెలు ధరించి గోచీలుమడిచి సైకిల్ కట్టులో అందంగా కడతారు. ఒకే రంగు కలిగిన బనియన్లు తొడుగుతారు. అందరూ తలకు చక్కని రంగు తల గుడ్డలుగాని, రంగు టోపీలుగాని ధరిస్తారు. లేదా చక్కని గిరజాలజుట్లు పెంచుతారు. జిట్టునాయకుడు పాటపాడుతూ వుంటే మిగతా సభ్యులందరూ వంత పాడుతారు. తాళం దురితంగా నడిచే సమయంలోగాని, కూర్చుని లేచేటప్పుడుగాని, ఎగిరి గెంతి గిట్టున తిరిగే సమయంలోకాని, జిట్టునాయకుడు ఈలతోగాని, మకో కేకతోగానీ సంజ్ఞ చేస్తాడు. ఆ సొంజ్ఞను అందరూ వెంటనే ఆచరణలో పెడతారు.

ఈ కోలాట నృత్యాలు పల్లెల్లో పనిలేని రోజుల్లో రాత్రిళ్ళు ప్రొద్దుపోయే వరకూ చేస్తూవుంటారు. భక్తిభావంతో దేవుని స్తంభాన్ని పట్టుకుని ఇంటింటికీ తిరిగి ప్రతి ఇంటిముందూ కోలాటం ప్రదర్శిస్తారు. ఈ కోలాట నృత్యాలను పెద్ద పెద్ద తిరుణాళ్ళ సమయాల్లోనూ, దసరా వుత్సవాలలోనూ బహిరంగంగా వీధుల్లో ప్రదర్శిస్తారు.

రెండవ ప్రపంచ యుద్ధప్రారంభపు రోజుల్లో హిట్లరు మాస్కోను పట్టుకోవటానికి చేసిన ప్రయత్నాలను గురించి అంధ్రప్రజా నాట్యమండలి దళాలు ఈ కళారూపంద్వారా ఆంధ్రప్రదేశ మంతటా ఈ విధంగా ప్రచారం చేశారు.

మాస్కో పొలిమేరలోనా-మారణ యంత్రాలునిలిపి
మాడ్చివేసెరా-రెడార్మీ కూల్చివేసెరా॥

అంటూ హిట్లరు ఫాసిస్టు చర్యలన్నిటినీ, ఈ కోలాటంపాట ద్వారా ప్రచారం చేశారు. ఇదే కోలాటంలో.

ఖండ ఖండాంతరాల భరతమాత, నీవు
ఖ్యాతిగన్న తల్లివమ్మ భరతమాత,

అంటూ దేశభక్తిని ప్రబోధించారు. కోలాటం ఒక సమిష్టి నృత్యం. అది ఒక సమిష్టి బృందగానం, అది ఒక వ్యాయామ క్రీడ. ఈ కోలాట నృత్యాలను సంగీతనాటక అకాడమీలాంటి సంస్థలు పూనుకుని పునరుద్ధరించాలి,

# దొమ్మరాటలు

ఆనాటికీ, ఈనాటికీ గ్రామాల్లో ఇతర వినోద కార్యక్రమాలతోపాటు దొమ్మరాట సర్కసు కూడ ప్రాచీనకాలంనుంచీ తెలుగు దేశంలో వర్ధిల్లుతూ వచ్చింది.



దొమ్మరవారు గ్రామాల్లో నాలుగు వీధులూకలిసినచోట, ఒక పొడవైన వెదురుగడను మధ్య పాతి డోలు వాయిద్యాన్ని ప్రారంభించి గ్రామప్రజలను ఆకర్షించే వారు. చిత్ర విచిత్రమైన వినోదాలతో సర్కసు పనులనుచేస్తూ తమ తమ నైపుణ్యంతో ప్రజలను ఆశ్చర్య చకితులనుజేసి, వారి వద్దనుండి డబ్బును, ధాన్యాన్ని, వస్త్రాలను వసూలు చేసుకునేవారు. ఈ దొమ్మరాటలు పూర్వకాలంనుంచీ వున్నట్లు 13 వ శతాబ్దానికి చెందిన పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్ర పర్వత ప్రకరణంలో

అమరాంగనలు దివినాడెడుమాడ్కి
నమరంగ గడలపై నాడెడువారు.

అని వర్ణించాడు. (పర్వత ప్రకరణం, 434)

పై రెండు పాదముల వర్ణనప్రకారం దొమ్మరసానులు వెదురుగడలపైన ఆకాశంలో అప్సరసలు ఆడుతున్నారంత భ్రమను కలిగించే వారట. అంటే వారుపయోగించే వెదురుగడలు అంత పొడవైన వన్నమాట.

దొమ్మరసానులు పురుషులతోబాటు భూమిమీద వివిధ రకాల పిల్లిమొగ్గలు మొదలైన చిత్ర విచిత్ర ప్రదర్శనాలతో ప్రేక్షకుల్ని దిగ్భ్రమలో ముంచేవారు. చూచేవారికి వారి ఆటలు భయాన్ని కలిగించేవి. వారి ఆటలు పాతినగడమీదనేకాక,

గడను పురుషులు ఎదురురొమ్ముమీద, నొసటిమీద నిలబెట్టి, ఆ గడలపై దొమ్మర సానులతో తమతమ విద్యల్ని ప్రదర్శింప జేసేవారు.

దొమ్మరిసానుల ఆటను శ్రీహర్షుడు సంస్కృత నైషధంలో ఆలంకారికంగా వర్ణించినట్లు శ్రీనాథుడు శృంగార నైషధంలో ఈ విధంగా వివరించాడు:

ఈ సకలావనీ తలము వెక్కటిదాన పరిభ్రమించి, యీ
భ్యాస పరంపరాపరత నభ్రమునన్ విహరింపగోరి యో
లాసిక కీర్తి విభ్రమకలాగరిమ న్నటియించుచుండు నీ
రాసుతు వంశరత్నము దిరంబుగ జెంది యమందలీలలన్.

(శృంగార నైషధం. 5 ఆశ్వా 118 పేజీ

అలాగే,

నంతవెన్నడో జవ్వనమమ్మ
కొన్న గడసాని నను గవయంచలంచీతే.

అని. ఊర్వశి పేర్కొన్న గడసాని ఇటువంటిదే అని నాచనసోముని ఉత్తర హరివంశం 1 - 74 పద్యంలో ఉదాహరింప బడిందని (పి. యస్. ఆర్. అప్పారావుగారు 'సూత్రధారి' పత్రికలో వుదహరించారు.

విజయనగరరాజుల కాలంలో మహర్నవమీ వుత్సవాలలో, దొమ్మరాటలు మొదలైన చిత్ర విచిత్రాలను ప్రదర్శించడంతోపాటు ఏనుగులు-పులులు-సింహాలు మొదలైన క్రూరమృగాలతో సర్కసుపనులు చేయించేవారిని విదేశీ యాత్రికుడైన అబ్దుల్ రజాక్ వర్ణించినట్లు భావరాజు కృష్ణారావుగారు 'విదేశయాత్రికులు— ప్రాచీనాంధ్రదేశం 191-192 పేజీలలో వుదహరించారు.

అంతేగాక బాపల విద్యలేవీ కూడ దొమ్మరివిద్యలతో సరిపోలవని చంద్ర శేఖరుడు చంద్రశేఖర శతకంలో ఈ విధంగా వివరించాడు:

మెడ్డుగ దొమ్మరెక్క, గవ
మించిన యిద్దమరేడలేదు, వా
తెడ్డాక బావవిద్దెలని
తిట్టను మూర్ఖుడు చంద్రశేఖరా. (చంద్రశేఖర శతకం)

ఈ విధంగా దొమ్మరాటలు చరిత్రలో స్థానాన్ని ఏర్పరుచుకున్నాయి. ఈనాడు పెద్దపెద్ద సర్క–సులని చెప్పుకోబడే వాటికి ఆధారం అనాటి దొమ్మరాటలే.

## జంతరుపెట్టె

కాశీపట్నం చూడరబాబు
విశ్వనాధుడే చూడరబాబు
చూచిమోక్షం పొందరబాబు
చిలిబిలి చిలిబిలి చిలిబిరిజం.



అంటూ జంతరుపెట్టె ద్వారా వివిధ రకాలైన బొమ్మల్ని చూపిస్తూ పిల్లల్ని ఆకర్షిస్తూ వుంటారు. ఇది ఒక పెట్టె. జంతరువాడు ఆ పెట్టెలో చేయి పెట్టి బొమ్మలన్నీ ఒక దాని తరువాత ఒకటి, ఒకరి తరువాత మరొకరు చూచి ఆనందిస్తూ వుంటారు.

ఒకరు తాళంకొడుతూ 'కాశీపట్నంచూడర బాబు' అంటే బొమ్మలో కాశీ దేవాలయం, గంగానది కనిపిస్తాయి. ఇలా పాటనుబట్టి బొమ్మ తరువాత బొమ్మను చూపిస్తూ వుంటారు. ఇదే విధానంద్వారా సంఘంలోవున్న కుళ్ళునూ, స్వార్థ పరుల్నీ, తిండి దొంగల్నీ, లంచగొండుల్నీ బయటపెడుతూ దేశభక్తి కార్య క్రమానికి వుపయోగిస్తున్నారు. ప్రజా నాట్యమండలివారు ఈ జంత్లు పెద్దపెద్ద తిరుణాళ్ళలోనూ, సంతల్లోనూ ప్రదర్శిస్తూ వుంటారు.

## వీధిపురాణం

పూర్వం పల్లెల్లో మహా భారతం, భాగవతం, రామాయణం, గరుడపురాణం, బసవ పురాణం, దేవీ భాగవతం మొదలైన పురాణ గాథలను చదవడం, తేట తెలుగులో ప్రేక్షకులకు అర్థమయ్యే శైలిలో అర్థం చెప్పడం ఆనాడు ఆచారంగా వుండేది. ఆనాటి ముఖ్యమైన వినోదాలలో వీధిపురాణం చెప్పడం కూడా ఒకటి. గ్రామంలోని ధనికులు, గ్రామపెద్దలు, పండితులు, బ్రాహ్మణులు, మొదలైనవారు వీటిని నిర్వహించేవారు.



పురాణ పఠనం నడివీధిలోని మంటపంలోగాని, గ్రామచావడిలోగాని చెప్పే వారు. పురాణ పఠనానికి ఏ విధమైన ఖర్చూలేదు. భుక్తి ముక్తి రెండూ కలుగుతా యనే విశ్వాసంతో ఎంతోమంది ఈ పురాణ పఠనానికి హాజరయ్యేవారు. ప్రేక్ష కులు వచ్చేవారు వస్తూవుంటే, వెళ్ళిపోయేవారు వెళ్ళిపోతూ వుండేవారు. ఏ మాత్రం కొంచెం తీరికవున్నా కాస్త పురాణ కాలక్షేపం వినిపోయేవారు. అంతే గాక ఈ పఠనం సాయంత్రంపూట తీరుబడివేళ జరిగేది. ఒకరు పురాణం చదివితే మరొకరు చక్కగా విడమర్చి, అర్థం చెప్పేవారు. గ్రామంలోవుండే పురుషులు ఏ మాత్రం అవకాశమున్నా వీధుల్లోనే వుండేవారు. ఆనాడు వినోద కార్యక్రమాలు అ న్నీవీధిలోనే జరిగేవి.

వీధిపురాణ

ప్రాముఖ్యం :

ఆనాడు వీధికి అంతటి ప్రాముఖ్య ముండేది. వీధుల్లోనే వీధిబడులుపెట్టి చదువు చెప్పేవారు. దొమ్మర్లు, దాసర్లు, బొమ్మలాటరవారు, భాగవతులు మొదలైనవారు ఎవరు వచ్చినా నడివీధిలో కార్యక్రమం జరిగేది. వివాహమైన తరువాత వీధిలోనే వూరేగింపులు జరిగేవి. వీధిలోనే మేజువాణీలు జరిగేవి. దేవదాసీ నృత్యాలూ వీధుల్లోనే జరిగేవి. దేవుళ్ళ కళ్యాణం నడివీధిమంటపంలో జరిగేది. జాతర్లూ, వుత్స వాలూ అన్నీ వీధిలోనే. బాల బాలికల ఆటపాటలు వీధుల్లోనే జరిగేవి. ఎవ రైనా తప్పుచేస్తే నడివీధిలోకిలాగి విచారణ జరిపి తీర్పుచేసేవాళ్ళు. ఈ విధంగా ఆనాడు వీధికి అంతటి ప్రాముఖ్యముండేది. తప్పెటతో చాటింపుచేస్తేసరి అందరూ బొలబొలమని వీధిలోకి వచ్చేవారు. వీధుల్లో నాటకాలాడేవారు గనుక వీధి నాటకా లని, వీధిభాగవతులని పేర్లు వచ్చాయి. వీటన్నిటిలోనూ ఎక్కువరోజులు ఏకబిగిని సాగేది వీధిపురాణం మాత్రమే.

# అశ్వనృత్యం

ఈ అశ్వనృత్యాలు ఎక్కువగా కృష్ణా, గుంటూరుజిల్లాలలో ఎక్కువ ప్రచారంలో వున్నాయి. అశ్వనృత్యాలను ముఖ్యంగా హరిజనులు దసరా నవరాత్రి సమ



కీలుగుఱ్ఱం

యాలలో గొంతాలమ్మను పంటచేలో ప్రతిష్ఠించి 9 రోజులు వుత్సవం జరిపి తరువాత గొంతాలమ్మను తృప్తిపరచి వుత్సవంతో సాగనంపుతారు. ఈ సంద ర్భంలో వివిధ చిత్రవిచిత్ర వేషాు ధరించి చుట్టుప్రక్కల గ్రామాలన్నీ సంచారంచేసి డబ్బు, ధాన్యం, వస్త్రాలు సంపాదిస్తారు.

వీరి ప్రదర్శనల్లో ప్రాముఖ్యం వహిం చేది అశ్వన్మత్యం. మెడవరకుగల ఒక గుఱ్ఱపు తలను పేడతో చేయించి వివిధ రంగులతో అలంకరించి ఇతర శరీరభాగాన్నంతా తేలిక వెదురు బద్దలతో గుఱ్ఱపు ఆకారాన్ని తయారుచేసి చుట్టూ ఒక ఎట్టిపీరనుకట్టి ఆ గుఱ్ఱాన్ని చంకలకు తగిలించు కుని వెనుకకూ ముందుకూ ఎగురుతూ అద్భుతంగా నృత్యం చేస్తారు. వీరి నృత్యా నికి ఉత్తేజం కలిగించే వాయిద్యం డప్పులవాయిద్యం. ఈ వాయిద్యపు వరుసల ననుసరించి నృత్యగతిని మారుస్తూ ఉధృతంగా నృత్యంచేస్తారు.

ఈ నృత్యంలో డప్పువాయిద్యాన్ని నిలిపి అందరూ సమిష్టిగా చేతుల్లో శిరుతలు ధరించి, ఈ విధంగా పాటపాడుతూ నృత్యం చేస్తారు.

(1) కంచెల చెరిగే చేడికురులపై
లలనకురులపై
తుమ్మెదలాడిన ఓలాలా
ఘనతుమ్మెదలాడిన ఓలాలా. ॥క॥

(2) చెమటకు తడిసి చెదరినగంధం
ఘుమఘుమ లాడిం దోలాలా
అది ఘుమఘుమ లాడిం దోలాలా. ॥క॥

(3) చెరిగేటప్పుడు చేతులగాజులు
గలగలలాడిన వోలాలా
అవి గలలాడిన వోలాలా. ॥క॥

(4) గొప్పదిరోకలి గుప్పునదంచగ
జబ్బలుకదిలిన వోలాలా
ఘనజబ్బలు కదిలిన వోలాలా. ॥క॥

ఈ విధంగా ఒకప్రక్క నృత్యం జరుగుతూ వుంటే మరో ప్రక్కనుంచి సోడిగాడు వంకర దుడ్డుకట్టను చేతబట్టి పిల్లలందర్నీ భయపెట్టి నవ్విస్తూ వుంటాడు.

గుంటూరుజిల్లాలో ఈ ఆశ్వనృత్యాలను నిజమైన గుఱ్ఱాలతోనే చేయిస్తారు. గుఱ్ఱాన్ని వివిధ సామగ్రితో శోభాయమానంగా అలంకరించి ముందుకాళ్ళకు గజ్జె కట్టి తప్పెటవాయిద్యపు దరువుకు తగినట్లు లయప్రకారం గుర్రంతో నృత్యం చేయిస్తారు. ఈ నృత్యం ఎంతో కనులపండువుగా వుంటుంది. ప్రత్యేకంగా ఈ నృత్యంకొరకు గుఱ్ఱాలను తయారుచేస్తారు. తిరుణాళ్ళ సమయంలోనూ, వివాహపు వూరేగింపుల్లోనూ ఈ నృత్యాలు కనులపండువుగా జరుగుతూ వుంటాయి.

## చెక్కభజన

పల్లెల్లో పనిపాటలులేని తీరిక సమయాల్లో ఈ భజనలు చేస్తూ వుంటారు. దేవుని స్తంభాలనుబట్టి ఇంటింటికీ తిరుగుతూ భజనలు చేస్తారు. సమాజ సభ్యులు 20 మంది వుంటారు. ఈ భజనలో నోటితో పాట, చేతితో చెక్కలద్వారా తాళం, గజ్జెలు కట్టిన కాళ్ళతో నృత్యం చూడడానికి ఎంతో ఇంపుగాఉండి వుత్తేజాన్ని కలిగిస్తుంది.



చెక్క భజన

చెక్కభజన చాల శ్రమతో కూడుకున్న కళారూపం. ఒక్కొక్కపాటకూ ఒక్కొక్క రకమైన నృత్యం వుంటుంది. ఆంధ్రుల భక్తిరస ప్రధానమైన కళారూపాల్లో ఈ చెక్క భజన చాలా ప్రాముఖ్యమైనది.

## చిత్రకథా విధానం

చిత్రకథా విధానమనగా చిత్రపటాలద్వారా ఒక బొమ్మ తరువాత మరొకబొమ్మ చరిత్రను తెలుపుతూ తోలుబొమ్మలాటలోని బొమ్మల ప్రవేశమూ, భాగవతాలలోని

పాత్రల ప్రవేశమూ మాదిరి వివిధ చిత్రాల చరిత్రద్వారా ఒక విధానాన్ని నడిపి ఒక రమణీయమైన కథను పూర్తిచేయడం. ఈ విధానం చిత్రపటాలద్వారా కథలు చెప్పే విధానం అవడంవల్ల చిత్రకథా విధానమని ప్రచారంలోకి వచ్చింది. ఈ విధానం పూర్వంనుండి ప్రస్తుతంవరకూ ఆచరణలోనే వుంది. ఇటీవల 15 సంవత్సరాలనుండి మాత్రం ఈ విధానం ఆంధ్రదేశంలో ఆచరణలోనే వుంది. అది కేవలం యాచకుల చేతిలో వుంది.

# హరిభజనలు

భక్తిభావంతో హరిని స్మరిస్తూ ఈ భజనలు చేస్తారు. ఈ భజనలో నృత్యానికి స్థానంలేదు. ముఖ్యంగా సంక్రాంతి దినాలలో ఈ భజనలు ప్రారంభించి తెల్ల వారకమునుసే పరిశుభ్రమైన బట్టలు ధరించి తెల్లని నామాలతో, చేతితాళాలతో, హార్మోనియం మద్దెల సహాయంతో ఊరు నాలుగుమూలలా భక్తితో ప్రచారం చేస్తారు. ఇది భక్తిరసమైన కళారూపం!

# పండరి భజనలు

ఈ కళారూపం మహారాష్ట్రానిది. కీరపండరీక్షేత్రం నుంచి పండరి భక్తులద్వారా దేశమంతా వ్యాపించింది. ఇది నృత్య ప్రధానమైన భజన. చేతిలో చిరతలు, నోటితోపాట, పాటకుతగిన అభినయంతోపాటు ప్రాముఖ్యం వహించే వాయిద్యాలు డోలక్, మద్దెల, కంజీరా, తంబురా, తాళాలూ, హార్మోనియం. ఈ కళారూపం భక్తితో కూడుకున్నా వినడానికి ఇంపుగానూ, సొంపుగానూ వుంటుంది.

# చెంచులు

ఏవూరు ఓబామ. ।తందానా।
ఎవ్వారిదానవే. ।ఓభామా।
చేతడే ముద్దమ్మ. ।తందానా।
చేయెత్తి దానాలు. ।వోభామా।
వడ్డిచ్చె తల్లో వడ్డిచ్చెతల్లో.

అంటూ భద్రాచలం ప్రాంతాలనుంచి ఆంధ్రదేశానికి అప్పుడప్పుడు వచ్చి యాచించి వెళ్ళిపోతూ వుంటారు. వీరు పాడేపాట చెంచీత పాట అంటారు. వీరు ముగ్గురు నలుగురు కలిసి జట్లుజట్లుగా వస్తారు. ఒకరు చరణం పాడితే మిగిలిన వారు చరణాంతంలో చెంచీతా అని, తంథానా, నందానా అని శృతికలుపుతారు. అందరూ చిన్న జేగంటలు, మంచి పుల్లలు పట్టుకుని పాడేపాటకు తాళంగా వుపయోగిస్తారు. వీరి వేషధారణ, కాళ్ళకు చాలీచాలని లాగులు, యాచనలో సంపాదించిన చొక్కాలూ, పూలదండలూ, తలపాగాలూ,పాగలపై నెమలి ఈకలూ, పులిగోరులూ, పందికోరలూ మొదలైన వాటిని ధరిస్తారు. ఈ చెంచు పాటద్వారా ఆంధ్ర ప్రజా నాట్యమండలి అల్లూరు సీతారామరాజు కథను ఉత్తేజంగా పాడి ప్రజల నుత్తేజ పరిచి, ప్రజా ప్రబోధం చేశారు. ఈనాడు అనేక ప్రజా నాట్యమండలి దళాలు దేశ భక్తి ప్రయోజనానికి ఈ కళారూపాన్ని ఉపయోగిస్తున్నారు.

# హరికథ

ఆంధ్రదేశంలో అన్ని జానపద రూపాలతోపాటు వర్ధిల్లి ప్రజాభిమానాన్ని చూరగొన్న కళారూపాల్లో ముఖ్యమైంది హరికథా గానం. ఆంధ్రుల హరికథా చరిత్రలో హరికథ ఒక ప్రత్యేకతనూ, గౌరవాన్నీ సంపాదించింది. దానిని ఒక విశిష్ట కళారూపంగా తీర్చి దిద్దినవారు అజ్జాడ ఆదిభట్ల నారాయణ దాసుగారు.

హరికథల ప్రత్యేకతా,
ప్రాశస్త్యమూ:

హరికథా కళారూపంలో ఒకే ఒక పాత్రధారి మూడు గంటలకాలం కథా గానం చేస్తాడు. ఒకే వ్యక్తి అన్ని పాత్రల్లోనూ జీవించి, రసవత్తరంగా నటిస్తాడు. నోటితో వాచికం చెబుతూ, మృదు మధురమైన గానం పాడుతూ, ముఖంలో సాత్వికమూ, కాలితో నృత్యమూ, చేతులతో ఆంగికమూ గుప్పిస్తూ ఆకర్షణీయమైన ఆహార్యంతో ఏకకాలంలో అభినయిస్తాడు. ప్రజలను ఆకర్షించి రంజింపజేస్తాడు.

హరికథలోవున్న ప్రత్యేకత ఇదే. మూడు గంటల కాలం కూర్చున్నా ప్రేక్షకులకు విసుగుజనించకుండా పిట్ట కథలతో, మధ్య మధ్య హాస్యరసాన్ని పోషిస్తూ సమాజంలోవున్న కుళ్ళును ఎత్తి చూపిస్తూ, వేదాంత బోధ చేస్తూ జనరంజకంగా హరికథను గానం చేస్తాడు.

వేషలు, భూషలు :

కథకుడు కేవలం అతని ప్రతిభవల్లనే ప్రేక్షకులను హరికథతో రంజింప జేయగలడు. హరికథకుని వేషధారణ కూడ సామాన్యమే. చేతిలో చిరతలు. కాలికి గజ్జెలు. పట్టుదోవతి పంచకట్టు. పట్టుకండువా నడుముకుకట్టి, మెడలో ఒక పూలహారం ధరించి చక్కగా తిలకం దిద్దుతాడు.

కట్టుకథలు కావ్య,
అచ్చంగా హరికథలే :

హరికథకులు రామాయణం, భారతం, భాగవతం మొదలైన అధ్యాత్మిక సంబంధమైన కథలను విరివిగా చెపుతూ వుంటారు. సంపూర్ణ రామాయణం, సంపూర్ణ భారతం, భాగవతం మొదలైన కథలు వరుసగా పదిహేను రోజులూ, నెల రోజులవరకూ గూడ సాగుతాయి. పట్టణాలలోనూ, గ్రామాల్లోనూ పనులతరుణం అయిపోయిన తరువాతా, పర్వదినాలలోనూ ఆంధ్రదేశపు హరిదాసులు ఈ కథలు చెపుతూ వుంటారు.

హరికథల
ప్రాచీనత :

హరికథల స్వరూపం వేదకాలంనాటిదనీ, సర్వజ్ఞులయిన మహర్షులు ఈ హరికథా శిల్పాన్ని ప్రప్రథమంగా సృష్టించారనీ పండితులు నిర్ణయించారు. బ్రహ్మమానస పుత్రుడైన నారదుడు భక్తిసూత్రాలను ఉపదేశిస్తూ హరికథాగానం చేస్తూవుంటాడని ప్రతీతి. వేదవిభజనచేసినా, అష్టాదశ పురాణాలను లిఖించినా మనశ్శాంతి పొందనేరని శ్రీ వ్యాసునకు శ్రీమద్భాగవతం రచించి హరికథామృతాన్ని పంచిపెడుతూ

మానవోద్ధరణ గావింపుమని నారదుడు ఆదేశించాడు. తరువాత శుకదేవుడు, కౌన కాది మహర్షులు, సూతుడూ హరికథా రూపకమైన భాగవతాన్ని భారతదేశం అంతటా ప్రచారం చేశారని పాతూరి ప్రసన్నంగారు 1965 ఫిబ్రవరి 'నాట్యకళ' సంచికలో వివరించారు.

రంగస్థలము,
రంగైన ప్రదర్శనం :

హరికథా ప్రదర్శనాలు రాత్రిపూటే జరుగుతూ వుంటాయి. ఇవి ముఖ్యంగా, గణపతి నవరాత్రులు, దసరా, కృష్ణజయంతి, ముక్కోటి ఏకాదశి, సంక్రాంతి పర్వ దినాలలో విరివిగా జరుగుతూ వుంటాయి. ఈ ప్రదర్శనానికి ఖర్చు చాలా తక్కువ. ఒకేనాటి ప్రదర్శనమైతే, గ్రామంమధ్య పెద్ద బజారులోగాని, విశాలమైన మైదానంలోగాని ఒక చిన్న పందిరివేసి, పందిరిలో ఎత్తైన చిబ్బనుగాని చెక్కలతో చిన్న స్టేజిని నిర్మించిగాని రెండు ప్రక్కలా కాంతి వంతమైన పెట్రోమాక్సు లైట్లను అమరుస్తారు. ఆరుబైట ప్రేక్షకులు కూర్చుంటారు. అదే కథ ఒక నెల రోజులు చెప్పవలసివస్తే ఒక పెద్ద పందిరివేసి దానిని చక్కగా అలంకరిస్తారు.

సన్మానాలూ,
సత్కారాలూ :

ఒకే రోజు కథకైతే, ఏదో ఒక పారితోషికాన్ని హరిదాసుకు ముట్టజెపుతారు. అదే నెలరోజుల కథైతే నెలరోజులూ కథలు జరిగిన తరువాత హరిదాసు ఇంటింటికీ వెళ్ళి ప్రతివారినీ కలుసుకుంటాడు. నెలరోజులపాటు మనులకు నెమ్మదిగా హరి కథను విని ముగ్ధులైన ప్రజలు భక్తిప్రపత్తులతో దాసుగారిని గౌరవించి ఎవరికి తోచింది వారు సమర్పిస్తారు. ఇలా హరిదాసు మొత్తంమీద అందరివద్దాచేరి ఎక్కువ మొత్తాన్ని వసూలు చేసుకుని సంతృప్తిగా వెళ్ళిపోతాడు. ఈ విధంగా గ్రామ గ్రామాలూ తిరిగి హరిదాసులు కార్యక్రమాలిస్తూవుంటారు. మరికొందరు ప్రతి సంవత్సరమూ వార్షికంగా ఆయా ప్రదేశాల్లో ఈ కథలు చెపుతూ వుంటారు.

సినిమా, నాటకం అభివృద్ధికాక పూర్వం గ్రామాల్లో ఇతర జానపద కళా రూపాలతోపాటు ఎక్కువ ప్రజాదరణను పొందిన కళారూపాల్లో హరికథ చాలా

ముఖ్యమైంది. ఏది ఏమైనా ఆనాటినుంచి ఈనాటివరకూ శిథిలంకాకుండా నానాటికీ కొత్తరూపును సంతరించుకున్న కళారూపం హరికథ.

ఈ హరికథను అత్యంత ఉత్తమ కళారూపంగా తీర్చి దిద్ది దానికొక గౌరవాన్నీ, విశిష్టతనూ చేకూర్చినవారు ఆదిభట్ల నారాయణదాసుగారు. ఆయన ఎన్నో హరి కథలు రచించారు. ఎంతోమంది ఉద్దండులైన శిష్య ప్రశిష్యుల్ని తయారుచేశారు.

ఇంటా బయటా ఇంచక్కని పేరుపొందిన
ఆదిభట్ల నారాయణదాసు :

ఆదిభట్ల నారాయణదాసుగారు 1864 వ సం. రం శ్రీ కాకుళం జిల్లా బొబ్బిలి తాలూకాలో సువర్ణముఖీతీరంలో ఉన్న అజ్జాడ గ్రామంలో జన్మించారు. వీరు ద్రావిడ బ్రాహ్మణులు. తల్లి నరసమాంబ. తండ్రి వేంకటచయనులు. చిన్ననాడే తల్లిద్వారా భాగవతాన్నిపిని ఆధ్యాత్మికతత్వాన్ని జీర్ణించుకున్నారు. తండ్రిద్వారా పాండిత్యాన్నీ, కవిత్వాన్నీ నేర్చుకున్నారు. నారాయణదాసుగారు స్వయంకృషి వలన సకల విద్యల్నీ అపారజ్ఞానాన్నీ సంపాదించారు.



ఆటపాటలమేటి
ఆదిభట్ల నారాయణదాసు

దాసుగారు బొబ్బిలి వాస్తవ్యుడైన వాసా సాంబయ్యవద్ద కొంతకాలం వీణ నేర్చుకున్నారు. తరువాత విజయనగరం మహారాజావారి కాలేజీలో యఫ్. ఏ. వరకూ చదివి తరువాత ఆంగ్లవిద్యకు స్వస్తి చెప్పారు.

దాసుగారు ప్రప్రథమంగా యక్షగానాలను, తరువాత హరికథా ప్రబంధాలను రచించారు. షేక్స్ పియర్, కాళిదాసు గ్రంథాలను అనువాదం చేశారు. వీణా వాదనలోనూ, నృత్య సంగీతాల్లోనూ అసమానమైన ప్రజ్ఞను సంపాదించారు. లయలో ఈయన సామర్థ్యం సాటిలేనిది. చల్లపల్లి జమీందారుగారిచే గజయాన, గండపెండేర సత్కారాన్ని పొందారు.

దర్బారుల్లో
దర్జాగా సన్మానాలు :

పిఠాపురం, ఏలూరు, విజయవాడ, బళ్ళారి, మద్రాసు నగరాల్లో హరికథా ప్రదర్శనాలనిస్తూ అనేక సంస్థానాల్లో సత్కారాల నందుకున్నారు. బెంగుళూరులో తన హరికథా కథన ప్రజ్ఞను ప్రదర్శించి మైసూరు మహారాజా దర్బారున కాహ్వానింప బడి గొప్ప సన్మానాన్ని పొందారు.

ఈ విధంగా అన్యప్రాంతాల్లో సన్మానాల నందుకున్న దాసుగారి కీర్తిని గుర్తించి ఆనంద గజపతి మహారాజు దాసుగారిని ఆహ్వానించి దర్బారు పండితుణ్ణిగా చేశారు. ఆనంద గజపతి మరణానంతరం దాసు మరల ఆంధ్రదేశ మంతటా హరికథ ప్రదర్శనా లిచ్చారు.

1919 వ సంవత్సరంలో ఆనాటి విజయనగర సంస్థానాధీశ్వరుడు శ్రీ విజయరామ గజపతి సంగీత పాఠశాల నొక దానిని స్థాపించి దానికి ఈయనను అధ్యక్షులుగా నియమించారు. ఈ పదవిలో ఆయన 17 సంవత్సరాలు పనిచేశారు. 1936 లో ఉద్యోగాన్ని వదలివేశారు. వృద్ధాప్యం వచ్చే కొద్దీ కథలను తగ్గించి అనేకమంది శిష్యుల్ని తయారుచేసి ఆంధ్రదేశ హరికథా పితామహు డనిపించుకున్నారు. 1945 సంవత్సరం జనవరి 2 వ తేదీన మరణించారు.

శిష్యులూ, ప్రశిష్యులూ :

80 సంవత్సరాలు జీవించారు. వీరి శిష్యులైనవారు నారాయణదాసు సాంప్రదాయాన్ని అపారంగా ప్రచారం చేశారు. వీరేగాక, పాణ్యం సీతారామ భాగవతార్, పట్రాయని సీతారామశాస్త్రి, ప్రయాగసంగయ్య, బాలాజీదాసు, కోసూరి భోగలింగదాసు, తంపిళ్ళ సత్యనారాయణ, ఎరుకయ్య మొదలైన మహా మహు లెందరో ఆంధ్రదేశంలో హరికథా గానాన్ని ప్రచారం చేశారు.

ప్రసిద్ధ హరిదాసులు :

పైడేరే గాక, వడ్లమాని నరసింహదాసు, ఉమాకాంతదాసు, బాలబ్రహ్మానంద దాసు, బులుసుపాటి వెంకటప్పయ్య, బెజవాడ లింగమూర్తి, భమిడిపాటి వెంకటరమణ, చిట్టిమళ్ళ రంగయ్యదాసు, శనగవరపు లింగమూర్తిశర్మ,

పెద్దింటి సూర్యనారాయణ దీక్షితదాసు, పాతూరి మధుసూదనరావు, చొప్పల్లి సూర్యనారాయణ భాగవతార్, మహావాది వెంకటప్పయ్య, కోసూరి పున్నయ్య, కొండపల్లి కల్యాణదాసు, మైనంపాటి నరసింగరావు, కడలి వీరదాసు, శ్రీమతి ఆర్. దుర్గాంబ, మహేంద్రవాడ కామేశ్వరరావు, పిల్లలమఱ్ఱి రామదాసు, ములుకుట్ల సదాశివశాస్త్రి, రాజశేఖరుని లక్ష్మీపతిరావు, పొడుగు పాండురంగదాసు, తాతిన సీతారామయ్య, ములుకుట్ల పున్నయ్యశాస్త్రి, శ్రీమతి యన్. రాజకుమారి చౌదరి, నవుడూరి విశ్వనాధశాస్త్రి, పొట్లూరి వెంకటరామయ్య, ముట్నూరి సూర్యనారాయణశాస్త్రి, బంకుపల్లి సింహాచల భాగవతార్, చిట్యాల ఆంజనేయ భాగవతార్, శ్రీమతిబేబిరాణి, బిసవలింగం, అమ్ముల విశ్వనాధం, కోట సచ్చిదానందశాస్త్రి మొదలైన ప్రసిద్ధ హరికథకులు నారాయణదాసులాంటి పెద్దల బాటల్లో నడిచి హరికథ కళను ప్రచారం చేశారు.

మరపురాని మరికొందరు
హరిదాసులు:

ఈనాడు ఆంధ్రదేశంలో హరికథగానకళ విస్తృతంగా వ్యాపించి ప్రజల నెంత గానో ఆకర్షిస్తూంది. రాష్ట్రి వ్యాపితంగా ఈ కళను ఈ క్రింద ఉదాహరించిన ఎంతో మంది కళారాధకులు ప్రచారం చేస్తున్నారు. మిక్కిలినేని పరంధామయ్య (కోలవెన్ను), ఘట్టి శేషాద్రి (రేలంగి), చదలవాడ వెంకట్రాయుడు(భీమవరం), పీర్ల రామచంద్రయ్య (తణుకు), చిట్యాల పార్థసారథి (తాడేపల్లిగూడెం),అన్నమనీడి బాలకృష్ణ (రామచంద్రపురం), మట్టా వజ్రశేఖర్ (వుప్పాడపాడు), గూనపల్లి తాతారావు (రామచంద్రపురం), సుంకర నరసింహారావు (కొమరగిరిపట్నం), కొనకళ్ళ చిన వెంకన్న (రావులపర్రు), బద్దిరెడ్డి సుబ్బారావు (సుందరపల్లి), అయినం అప్పలదాసు (తాడేపల్లిగూడెం), తాడేపల్లి వరలక్ష్మి(తెనాలి), ముట్నూరి కుటుంబరావు (పెదకళ్ళేపల్లి), వాజపేయాజుల రామనాధశాస్త్రి (వుంగుటూరు), యాళ్ళబండి శారద (తాడేపల్లిగూడెం), ఆత్మకూరు గుప్తబ్రహ్మగుప్త (పిడుగురాళ్ళ), వంగవోలు సుబ్బారావు (చెన్నయ్యపాలెం), తిరునగరి సత్యవాణి (తెనాలి), కోట సుబ్బారావు (కొండయ్యపాలెం), శీలం నారాయణదాసు (నర్సాపురం), గిడుతూరి మాణిక్యాంబ (పత్తేపురం), బృందావనం రంగాచార్యులు (తాడేపల్లి),రాయిపూడి సాంబశివరావు (చావలి), నడింపల్లి నారాయణరాజు (ఉండి), వేపూరి పోతరాజు (కోనేటి

పురం). గూడవల్లి సూర్యనారాయణ (రామచంద్రపురం). శీలం గంగరాజు (వెను గొండ). తిరువాయిపాటి రామారావు (తెనాలి). పర్ణూ అప్పయ్య చౌదరి (గోల మూడి). మద్దుల కోటేశ్వరగుప్త(పాలకొల్లు). పిగిడి సూర్యారావు (ఉండి). వీరగం ధం వెంకట సుబ్బారావు (తెనాలి). జి. వి. శివయ్యదాసు (వెడన). మెట్ట బలరాము మూర్తి (ఉండి). అవుతు సోమిరెడ్డి (చినపరిమి). అక్కిపెద్ది శ్రీరామశర్మ (విజయ వాడ). వంకా వెంకట్రామయ్య (తణుకు). నజ్జల చిన ఓబులరెడ్డి (కొప్పోలు). తమ్మిరిసి హనుమంతరావు (త్యాజంపూడి). కంచర్ల బాలకృష్ణదాసు (తా॥ గూడెం). తాడాల వెంకటరత్నం (పొలమూరు). కాపవరపు పాపారావు (పెదమెరం). మెట్టా వెంకటేశ్వరరావు (కైకరం). కన్నెపల్లి నీలకంఠశాస్త్రి (ఉండి). నంద్యాలరాయుడు (తా॥గూడెం). నడింపల్లి విశ్వనాథశాస్త్రి (గరికీపర్రు). దాసంశెట్టి మల్లయ్య(మాము డూరు). బి. సింహాచలం (పెరమరం). ముసుకుట్ల సీతారామశాస్త్రి (తా॥గూడెం) తాడాల నరసింహస్వామి. పొలమూరు జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి (తణుకు). కాజన విశ్వరూపాచారి (శిరిపురం). ఆకురాతి నాగేంద్రం (వెడన). పృథివి బసవ శంకరయ్య (వెడన). జోశ్యుల సత్యనారాయణ (శీనలి). ఖండవల్లి తారకరామం (ఎదురులంక, యానాం). ముదపాక మల్లేశ్వరరావు (భీమవరం). కల్లే బాలకృష్ణదాసు (విజయవాడ). అంబటిపూడి శివరామ కృష్ణమూర్తి (విజయవాడ). శంభానరామా రావు (వేలపర్ల). డి. జ్యోతిర్మయాంబ (ఏలూరు). గోవర్ధనం వెంకటాచార్యులు (కేశవరం). పంచాగ్నుల విశ్వనాధశర్మ (సికిందరాబాదు). షణ్ముఖి లోకనాధరాజు (భీమవరం). పట్నాల వీరభద్రాచార్యులు (చాగల్లు). కోట లక్ష్మీకాంతం (వంగోలు). మల్లాది శ్రీరామమూర్తి (ఏలూరు). వడ్డి సత్యనారాయణ (కోరు కొల్లు). ఎ. పూర్ణిమ (ఏలూరు). నిడుమోలు శేషగిరిరావు (ఏలూరు). ఎ. సత్య నారాయణ (మండపేట). వరకూటి జయమ్మ మొదలైన అనేకమంది హరికథ కులు ఈనాడు హరికథా గానాన్ని ప్రచారం చేస్తున్నారు.

# పిచ్చుకుంటుల కథలు

ఆంధ్రదేశంలో చిరకాలంనుంచీ వున్న కళారూపాల్లో పిచ్చుకుంటుల కథ ఒకటి. ఈ కళా రూపాన్ని పిచ్చుకుంటులవాళ్ళనే జాతివారు ఆకట్టుకొని కాపీరైటు



చేసుకొని చెపుతూ వుంటారు. ఈనాటికీ వారు మన వంశాలూ గోత్రాలను పల్లిస్తూవుంటారు. ఈ కథా బృందం అంతా చేరి ముగ్గురంటే ముగ్గురు వ్యక్తులు. వీరు చెప్పే కథల్లో ప్రాముఖ్యమైనదీ, చరిత్రాత్మకమైనదీ, వీరోచితమైనదీ శ్రీనాథ మహాకవి రచించిన పల్నాటి వీరచరిత్ర. ఈ కథను ప్రారంభిస్తే మరి ఒక్కొకదలక దాదాపు 15 రాత్రిళ్ళు చెపుతారు. పిచ్చుగుంటుల కథలో శృంగార, వీర, దుఃఖరసాలకు ఎక్కువ అవకాశముంది. ఒకప్పుడు వీరు కేవలం ప్రజలను యాచించేవారని సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో పర్వతప్రకరణంలో ఈ విధంగా వర్ణించాడు:

పీవంగ చేతులలేవయ్య-నడచి
పోవంగ కాళ్ళనులేవయ్య–అంధ
కులమయ్య పిచ్చుకుంటులమయ్య
దానమొసగరే ధర్మాత్ములార!

అని వివరించాడు. పిచ్చుకుంటల వారిని గురించి చంద్రశేఖరుడు చంద్ర శేఖర శతకంలో ఈ విధంగా వర్ణించాడు.

గుడగుడరోజు నడకుండకు బాపడుపిచ్చుగుంట్ల యో
కడు శెప్పినన్ని గోతరలు, గట్టిగ జెవ్వినొమ్మినమంగుగా
వడిగొని సంపసాచి దలవట్టుక సిందుపదాలుపాడు
గుడగుడ వట్టిలొట్టయని కూయును మూర్ఖుడు చంద్రశేఖరా.

ముఖ్యంగా వీరి వేషధారణ కథకునికి హుందాయైన తలపాగా. ఒక చేతిలో కత్తి, మరొకచేతిలో డాలూ, కాళ్ళకు గజ్జెలూ వుంటాయి ఈయన చరణాల్ని పాడుతూవుంటే మిగతా వారిద్దరూ'ఆ—'అంటూ దీర్ఘంతీస్తూ కథకుని గొంతులో గొంతు కలిపేస్తారు.

ఇక మూడవవ్యక్తి ఒక తోలుతిత్తిని తగిలించుకుని గ్రుక్కవిడువనిశృతి పోస్తూవుంటాడు. ఈ శృతి చెవులకు ఎంతో యింపుగా వుంటుంది. ఈ శృతిని ఆధారం చేసుకుని పిచ్చు కుంటుల కథా విధానాన్ని నడుపుతూ వుంటారు.

కథలో వచ్చే ఆయా పాత్రల మనస్తత్వాల ననుసరించి కథకుడూ, వంత దారుడూ ఆ పాత్రల్లోకి మారిపోతారు. పిచ్చుకుంటుల కథా విధానం ఎలా వుంటుందో పల్నాటి యుద్ధంలో బాలచంద్రుడు యుద్ధంలో దూకిన ఘట్టాన్నివింటే బోధపడుతుంది:

కుప్పించి ఎగసిన—కుండలంబులకాంతి
గగన భాగంబెల్ల—గప్పికొనంగ
కంపించి జగమంత—కదలివణకంగ
మొగమందు చిరునవ్వు—మోసుతెత్తంగ
కొండలంతా రాళ్ళు—పిండిపిండిగను
వత్రమంతారాళ్ళు—పొడిపొడిగాను
శవగలంతా రాళ్ళు—చిచ్చవ్వగాను
ఒక్క దూకు దూకాడయ్యా శీలంవారి బాలుడు.

శ్రీమల మలదేవ చెన్నుడో, ఓ. ఓ. ఓ. అంటూ దీర్ఘంతీస్తూ పాడతారు. ఈ విధంగా పిచ్చుకుంటులవారు ఎంతో వుత్తేజంగా ఖడ్గతిక్కన, కాటమరాజు, పల్నాటి వీరచరిత్ర మొదలైన కథలను చెప్పేవారు.

పాతకథలతో పాటు
కొత్త కథలూ :

ఇదే పిచ్చుకుంటుల కథా విధానాన్ని 1943 లో వచ్చిన కంట్రోలు రేషనింగు విధానాలద్వారా, కరువుతో ప్రజలుపడిన బాధను వివరిస్తూ, వారి సమస్యలు తీసుకుని కోసూరి పున్నయ్యగారు 'ఆకలి మంటలు' అనే పిచ్చుకుంటుల కథనువ్రాసి ప్రజా నాట్యమండలిద్వారా ప్రచారం చేశారు. వీరి కథలో మచ్చుకు కొద్ది చరణాలు.

కంపించి జగమంత—కదలివణకంగ
బాంబులా యుద్ధాలు—బయలుదేరాయి
జాతీయనాయకుల్—స్వాతంత్ర్యకాంక్షులు
గాంధి జహ్వారులజాడ్—ఘనులనెందరినో
జైళ్ళగోడల మధ్య—చేర్చె పైప్రభుత
అంబా జగదంబా—శ్రీ భారతాంబో. ఓ ఓ ఓ.

అంటూ రాగం ఆలాపిస్తారు. ఈ విధంగా పిచ్చుకుంటల కళారూపం రూపొందింది.

# హరిహరీ పదాలు

హరిహరీనారాయణ—ఆదినారాయణ
కరుణించిమమ్మేలు—కమలలోచనుడ. ॥కరు॥

హరిహరీ పదాలన్నీ ఈ పల్లవితోనే నడుస్తాయి. ఒకో ప్రాంతంలో ఒకోపాటా, ఒకో ఆటా, ఒకో కథా బహుళ ప్రచారంలో వున్నప్పటికీ ఈ హరిహరీ పదాలు కూడా విశాఖపట్టణం జిల్లాకో విశేష ప్రభావాన్ని కలిగివున్నాయి. ఈ పేరుతో అనేక కథలను సుద్దులరూపంలో చెపుతూ వుంటారు.

వీటినే 'జంపె'లని కూడ వాడుతారు. హరిహరీ పదాల్లాంటి పాటలే మన యక్షగానాల్లో కూడా చాలవరకు వ్రాయబడి వున్నాయి. పదాల నడక ప్రారంభం నుంచీ చివరివరకూ ఒకే వరుసలో నడుస్తుంది. మధ్యమధ్య, కథాగమనాన్ను సరించి, వచనంలో తేటతెల్లంగా కథయొక్క అర్థాన్ని చెపుతారు. సన్నివేశాలను బట్టి ఇంకా కీర్తనలు కూడా పాడుతూ వుంటారు. కథకుడు పదం పాడితే మధ్య ప్రక్కనున్న వంతదారులు 'ఆ—'అంటూ శ్రుతిలో సాగదీసి శ్రుతిపక్వంగా ఒక గమకాన్ని జత కలుపుతుంటారు.

పదాలంటే పదాలుకాదు,
పాటికెక్కిన పదాలు:

హరిహరీ పదాలు కేవలం ఏవో జానపద గేయాల్లాగా కాకుండా మన కళారూపాల్లో

అవీ ఒక కళారూపంగా వెలుగొందుతూ వున్నాయి. వీటి కథల్లో చాల వరకు రామాయణ, భారతాది కథలే ఎక్కువగా వున్నాయి. భారతంనుంచి నలచరిత్ర, శశిరేఖాపరిణయం, విరాటపర్వం, ఉత్తర గోగ్రహణం మొదలైనవే కాక పాతాళ హోమం, శతకంఠరామాయణం, కుశలాయకం మొదలైనవీ, శివగాథలూ, గంగా వివాహం, సారంగధర చరిత్రా రాణిస్తుంటాయి.

ప్రాంతీయంగానే
పరిమిత ప్రచారం:

హరిహరీ పదాలు ఎక్కువగా విశాఖ జిల్లాలోనే ప్రచారం పొందాయి. ఇతర జిల్లా లకు ఏ మాత్రం వ్యాపించలేదు. అందుకు కారణం కూడ లేకపోలేదు. విశాఖ

మండల ప్రాంతీయభాష మనకు చాలా భిన్నంగా వుంటుంది. వారి మాటతీరు ప్రత్యేకంగా అదోలా వుంటుంది. అందువల్ల ఆ పదాలు ఇతరులు వ్రాయడం కూడా కష్టమే. అందువల్ల ఆ మండలంవారే వారి ప్రజలకు అర్థమయ్యే భాషలో, అర్థమయ్యే శైలిలో వ్రాస్తారు. ఇప్పటికి వ్రాయబడిన పదాలన్నీ కూడా అటు వంటివే. చీపురుపల్లి, రాజాం, పాలకొండ, వీరఘట్టాం, ఆముదాలవలస, శ్రీ కూర్మం, చికాకోల్, విజయనగరం ప్రాంతాల్లో ఈ కథలను రకరకాలుగా చెపు తారు. అన్ని కథారూపాలకన్న ఈ హరిహరీ పదాలు, జముకుల కథలు ఎక్కువ ప్రచారంలో వున్నాయి.

ఈ హరిహరీ పదాల విషయంలో జేసుమళ్ళ కామేశ్వరరావుగారు ఎక్కువ కృషిచేస్తున్నారు. వారి అనుభవాలనుంచీ, వారి సేకరణలనుంచీ కొన్ని వుదాహరిస్తాను.

గంగా వివాహం :

గంగా వివాహం 1901 లో ఆరుద్రాచలం చెట్టిగారు ప్రచురించారు. దీన్ని రచించినవారు పసగాడ సన్యాసిరాజు. రచనాకాలం 1856. ఈ పుస్తకంలో గంగా, గౌరి సంవాదం ఎంతో చమత్కారంగా వ్రాయబడింది:

గౌరి: ఉన్నచోటను నన్ను ఉండమన్నందుకు
తప్పకను నీజిహ్వ తరిగింతుగంగ.

గంగ: నీవు తరిగినకూర నేను తరిగినకూర
వండి వడ్డింతుమే వనితగౌరమ్మ.

గౌరి: చెంవకాయలుగొట్టి చెవులూడదీతునా
జగడపోతులమారి జాలారిగంగ.

గంగ: నీవు గొట్టినకాయ నేను గొట్టినకాయ
గంవనింపింతుమే కాంతగౌరమ్మ.

పై మాదిరే పూరి రామచంద్రరాజు కుశలాయక పదాన్ని వ్రాశాడు. ఈయన క్రీ॥ శ॥ 1862 ప్రాంతపువాడు. ఈ పుస్తకాన్ని 1951 లో మద్రాసులో సి. వి. కృష్ణా డిపోవారు ప్రచురించారు. రామచంద్రరాజు తన గ్రంథంలో ఆయనుండే నివాస స్థలాన్ని హరిహరీ పదంలో ఈ క్రింది విధంగా వ్రాసుకున్నాడు:

పూర్వులుండేస్థలము భువిలోనకొల్లాము
తర్వాత పడివాడ తనజన్మభూమి
వర్తమానమునందు వచ్చి ఈ పెద్దమ్మ
పాళెమ్ములో నేను పరగనున్నాడ.

నలచరిత్రను హరిహరీ పదంగా తోలేటి సీతారామకవి 1900 సంవత్సరంలో రచించాడు. ఈయన దమయంతి కష్టాలను గురించి ఈ విధంగా రచించాడు:

చెలికత్తెలందరును సేవలుచేయంగ
హంసతూలికాతల్పమునందు బవళించి
సుఖముగా నిద్రించు సుందరాంగికి నేడు
ఈనేల పాన్పయ్యె ఎట్టిఖర్మంబొ.

ఈ విధంగా హరిహరీ పదాలు విశాఖ మండలంలో విపరీత ప్రచారాన్ని పొందాయి. ఈ కథలు పగటివేళ, సాయంత్రం సమయంలోనూ, భోజనానంతరం రాత్రివేళ చెప్పబడతాయి.

# ఘట నృత్యం



జాతర్లలోనేకాని
సర్వదా జరగదు :

ఆంధ్రదేశపు జానపద నృత్యాలలో ఈ ఘట నృత్యం ఒకటి. ఇతర నృత్యాలవలె ఎప్పుడు బడితే అప్పుడు ప్రదర్శించే నృత్యం కాదిది. పర్వదినాల్లో కూడా ఈ నృత్య ప్రదర్శనాలు జరుగవు. ఒక్క జాతర్ల సందర్భాల్లో మినహా మరెప్పుడూ ఈ ఘటనృత్యాలు జరుగవు.

ఆంధ్రదేశంలో అనాదినుంచీ ప్రదర్శింప బడుతున్న దీ ఘట నృత్యం. దీనిని జాతర్ల సందర్భంలో ప్రదర్శిస్తారు. పల్లెల్లో పశుజాడ్యాలు వచ్చినప్పుడు దేవతలకు ముడుపులుగట్టి మ్రొక్కుతారు. ఇలా మ్రొక్కిన కొన్నిదినాలకు గ్రామంలో ఇంటింటికీ చందాలు వసూలుచేసి గ్రామమధ్యలో దేవతల విగ్రహాలను కొయ్యలతోనూ, మట్టితోనూ నిర్మించి తాటిఆకులపాకల్లో దేవతలను

ప్రతిష్ఠించి ఒక నెలరోజులు పంబలకథలతో రాత్రిళ్ళు ప్రదర్శనలిస్తూ సన్నాయి వాద్యగాళ్ళ వీరంగ వాయిద్యంతోనూ, కినకతప్పెట్లతోనూ మహోధృతంగా జాతర చేస్తారు. ఇలా జరిగే జాతర్లకుముందు నెలరోజులు పైన వివరించిన ఘటం (కుండ)తో వూరంతా ఇంటింటికీ తిరిగి అన్నం, మజ్జిగలను సేకరిస్తారు. ఇలా ప్రతి ఇంటివద్దనూ సేకరించిన అన్నం, మజ్జిగను వాయిద్యకారులందరూ పంచుకుంటారు.

ఇలా ఘటాన్ని నెత్తిన బెట్టుకుని వూరేగేవారు చాకళ్లు (రజకులు). ఘటం ఇంటింటికీ తిరిగే సమయంలో తప్పెట్ల వాయిద్యపు గమకాలతో, ఘటం ఎత్తుకున్న వ్యక్తి ఎంతో వుద్రేకంగా నృత్యం చేస్తాడు. ఇలా చేసే నృత్యానికి ఏ విధమైన శాస్త్రమూ వుందని చెప్పలేం కాని ఘటనృత్యం చూచేటందుకు చాలా వుత్తేజంగా వుంటుంది. ఈ ఘటం ఇంటింటికీ తిరిగి అన్నం, మజ్జిగ సేకరించడంలో వుద్దేశం కేవలం దేవతల సంతృప్తికోసం. అందువల్ల ప్రతి ఇంటివారూ ప్రసాదాన్ని వేస్తారు.

ఘటాన్ని (కుండను) పసుపుతోనూ, కుంకుమతోనూ అలంకరిస్తారు. ఘటంయొక్క అంచుకు చుట్టూ వేపాకులతోరణం కడతారు. ఘటాన్ని చూస్తేనే అది ఒక దేవతామూర్తిలాగా కనబడుతుంది. ఇక ఘటం ఎత్తుకున్న వ్యక్తి పూజ్యభావంతో, ఎవరితోనూ మాట్లాడక తప్పెట్ల వాయిద్యానికి అనుగుణంగా వీర నృత్యం చేస్తాడు. అలా చేసేనృత్యం ఎంతో భక్తిభావంతోనూ, నిండు నమ్మకంతోనూ జరుగుతుంది.

ఇలా జరిగే ఘటనృత్యానికి ఏ విధమైన సాహిత్యంగాని వుండదు. కేవలం మూగతాండవం. ఎంతో ఆవేశపూరితంగా జరుగుతుంది. ఇలా ఆవేశంగా జరిగే నృత్యసమయాల్లో కొంతమందికి గణం పూనుతుంది. ఇలా గణం పూనిన వ్యక్తులు చిందులు శివాలు త్రొక్కుతారు. ఇలా త్రొక్కుడం ప్రళయతాండవ నృత్యంలా వుంటుంది. ఈ ఘటనృత్యాలు జాతర్ల సందర్భంలోనూ, వీరుళ్ళ వుత్సవాలలోనూ చేస్తూ వుంటారు.

ఈ నృత్యం ఆంధ్రదేశపు అన్ని పల్లెల్లోనూ వుంది. ఏ గ్రామంలో జాతర జరిగితే, ఆ గ్రామంలో మాత్రమే ఈ ఘట నృత్యాలు జరుగుతూ వుంటాయి.

కాని ఈనాడు జాతర్ల ప్రభావం తగ్గుతున్నకొద్దీ ఈ నృత్య ప్రభావంకూడ తగ్గుతూ వుంది.

ఒకొక్క ప్రాంతంలో
ఒకొక్క పేరు :

ఇలాంటి ఘటనృత్యాలు మూఢనమ్మకాలు, దైవభీతి వున్న ప్రతి ప్రాంతంలోనూ ప్రచారంలో వున్నాయి. ఈ నాట్యాన్ని దక్షిణదేశంలో 'కుడకూతు' అని పిలుస్తారు. దక్షిణదేశంలో వారి గ్రామదేవతయైన అయ్యప్పన్ వుత్సవాల్లో ఈ నృత్యాన్ని చేస్తారు. ఈ నృత్యాన్నే వుత్తర హిందూస్థానంలో గర్భనృత్యం అని పిలుస్తారు. ఈ విధంగా ఘటనృత్యం ఆయా ప్రాంతాల్లో ప్రచారంలో వుంది.

# జయదేవుని అష్టపదులు

కొన్ని శతాబ్దాలక్రితం వంగదేశంలో సుమిత్రా-మహదేవులకు పుత్రుడుగా జన్మించాడు జయదేవుడు. ఈయన గీతగోవిందమనే కావ్యాన్ని వ్రాసి శతాబ్దాల తరబడి భారతీయ చరిత్రలోనూ, భారతీయుల హృదయాల్లోనూ శాశ్వత కళాకారుడుగా నిలిచివున్నాడు.

నామకరణానికు
అసలు కారణం :

ఎనిమిది చరణాలతోకూడిన పాటలవడంవల్ల వీటికి 'అష్టపదు'లని పేరు వచ్చింది. ఈయన ఇలాంటివి 24 గీతాలను రచించాడు. ప్రతిగీతం గుఱ్ఱపునడకలా సాగిపోతుంది. సంగీత సాహిత్యాల కెంత ప్రాముఖ్యముందో, నృత్యానికికూడా అంతే స్థానముంది. నోటితోపాట, అంగాలతో అభినయం, కాలితో నృత్యం చేస్తూ వుంటే నూటికి నూరుపాళ్ళు నవరసాలశోభ వెల్లివిరుస్తుంది. భక్తజయదేవుడు ఎంతో అద్భుతంగా ఈ అష్టపది గీతాలను రచించాడు. ఆంధ్రదేశంలో ఈ గీతాలు ఎంతో ప్రచారంలోకి వచ్చాయి.

# కాశీకావళ్ళు

పైన వివరించిన విధానానికి సంబంధించిందే ఈ కాశీకావడి, కాషాయవస్త్రాలు ధరించి ఒక కావడిని భుజాన వేసుకుని ఇరుప్రక్కలా కాశీ విశ్వనాథుని విగ్ర

హాలను వుంచి పసుపుకుంకుమలతోనూ, పుష్పాలతోనూ అలంకరించి షుమారు మూడుగజాల చిత్రపటాన్ని కావడికొమ్ముకు తగిలించి, కాశీ విశ్వనాధుని సందర్శనాన్నిగురించి వరుస క్రమంలో కథను నడుపుతారు. ఆ కథా సంవిధానంలో అన్ని రసాలూ వచ్చేటట్లు చెపుతారు. నడక ద్విపదమాదిరి నడుస్తుంది. పూర్వకాలంలో కాశీయాత్ర చేయాలంటే ఎంత కష్టమో ఈ కథ ద్వారా వివరిస్తారు. యాత్రికులు బయలుదేరిన దగ్గరనుంచి కాశీకి పోయేదారిలో అడవుల్ని గురించి వర్ణనలూ, క్రూరమృగాల ఆర్భాటాలూ, తరువాత నదీప్రవాహాలూ, సత్రాలూ, దొంగ దోపిళ్ళూ, మజిలీలూ, ఇతర యాత్రాస్థలాలూ, పర్వతాలలో ప్రయాణం, తుదకు కాశీవిశ్వనాధుని సందర్శనం. ఈ మధ్యలో వచ్చే ఇబ్బందుల్ని గురించీ, బాధలను గురించీ, క్రూరమృగాలబారినుండి తప్పుకోవడంగురించీ, యమలోకాన్ని జయించినట్లు వ్యతిరేకశక్తు లన్నిటినీ యమదూతలుగా చిత్రించి కష్టాలు గట్టెక్కి గంగా నదినిదాటి తుదకు స్వర్గతుల్యమైన ఆ కాశీ విశ్వేశ్వరాలయానికి చేరి, ముక్తిపొందడం, దీనిని జీవితానికి అన్వయించి, మనం స్వర్గానికి చేరుకోవడం ఎంత కష్టమో ఈ కష్టాలను ఉదాహరణగా చెపుతారు. కథకుడు బహు లబ్ధుగా ఈ కథను నడుపుతాడు.

భక్తు పగటివినోదం:

ముఖ్యంగా ఈ ప్రదర్శనం పగటి పూటనే జరుగుతుంది. ఎక్కువగా ఉదయపు సమయాల్లోనే. కథా కాలం కనీసం అరగంట వుంటుంది. 'కాశీకావడి, కాశీ కావడి' అంటూ గంటలు మ్రోగించుకుంటూ నడిబజారులో కావడిదించి కథకుడు కథ ప్రారంభిస్తాడు. ఈ సమయానికి దాపులోనున్న ఇండ్లలోని స్త్రీలూ, పురుషులూ, పిల్లలూ అందరూ కావడిచుట్టూ మూగుతారు. కథాంతానికి అందరూ రస సిద్ధి పొందుతారు. సంతృప్తితోనూ, ఆధ్యాత్మికచింతనతోనూ ఎవరికితోచిన పారితోషికాలను వారు ముట్టచెబుతారు. ఈ విధంగా కథకుడు ఒడి నిండి, మరో వీధికి బయలుదేరుతాడు. వీరి బొమ్మలన్నీ చీరలమీద వరుసగా చిత్రించబడి బహు సొంపుగా వుంటాయి. బొమ్మలద్వారా కథ చెప్పడంవల్ల చదువురాని వయోజను లందరికి కూడ ఈ విధానం సుబోధకంగా వుంటుంది. వీరు కేవలం కాశీమహత్తులనేకాక, ఆయా జాతులవారి దేవతలను గురించీ, దేవుళ్ళనుగురించీ కూడ చీరల మీద బొమ్మలను అద్దకం ద్వారా అద్దించుతారు.

తెరచీరలవారు :

ఆంధ్రదేశంలో తెరచీరలవారని ఒక జాతివా రున్నారు. వారి గోత్రాలనూ, వారి పూర్వవృత్తాంతాలనూ, గాథలనూ చెపుతూ వుంటారు. వీరే సుద్దులను కూడా చెపుతారు.

క్రీడాభిరామంలో
ప్రస్తుతించిన దాఖలాలు :

పై విధానపు తెరబొమ్మలనుగురించి క్రీడాభిరామంలో ఒక పడతి పల్నాటి వీర చరిత్రను గూర్చి పాడుతూ వున్నదనీ అక్కడవాఁ చరిత్ర ఒక చిత్రఫలకం మీద వ్రాయబడెననీ దానిని గూర్చి ఈ క్రింది విధంగా వర్ణింపబడింది:

కోలదానవు ద్రిక్కటి గూడియున్న
గచ్చువేసిన చిత్రంపు గద్దెపలక
వ్రాసినారదె చూడరా వైశ్యరాజ
శీలబ్రహ్మాది వీరనాసీర చరిత॥ (క్రీడాభిరామం, 125)

# ఆంధ్రుల కళారూపాలు

ఆంధ్రుల ప్రజా జీవితంలో అనేక కళారూపాలు పుట్టిపెరిగాయి; ఆంధ్రుల కళా సంస్కృతులకు పట్టుకొమ్మలై మెరిశాయి. ఇవేకాక ఈ క్రింద పుదాహరించిన కళారూపాలన్నీ ఆయాకాలాల్లో వృద్ధిపొందాయి.

కావమూళ్ళ భజనలు—బృందగానాలు—సమిష్టి జానపదుల నృత్యాలు—మరాటీ కథలు—కేళికలు—పంబల కథలు—కోడంగియాటలు—చిరుతల రామాయణం—కురుబనాట్యాలు—మేదరాటలు — ఎరుకల కథలు—గొల్ల కథలు—చెంచుల నాటకాలు—దాసరులచిందులు — కొమ్మాయిదాసుళ్ళ పదాలు — పిరికి జంగాల కథలు—ఈతముక్కు జంగాలకథలు—జంగాల బిత్రో నిత్రోపదాలు—బుడబుడక్కలవారు—జాతర్ల చిందులు — శివకథలు — వడ్డె వుప్పరపదాలు —గంగిరెద్దాటలు— విష్ణు కథలు — చీరన్నలవారు — చిందుమాదిగలు — జోగులవారు— బాలసంతువారు— హట్కారులు — కొమ్మువాళ్ళు — డక్కలి

వారు—ఈమొదలైనవారు. అఖిలాంధ్ర దేశాన్ని తిరుగుతూ, రకరకాల సాటలను. రకరకాల కళారూపాలను ప్రదర్శిస్తూ జానపద వాఙ్మయాన్నీ కళారూపాలనూ కాపాడుతూ వచ్చారు. వీరు ఒక్క వర్షాకాలం మినహా మిగిలిన ఎనిమిదిమాసాలూ దేశ సంచారంచేసి సంపాదించుకుంటారు. వీరిలో కొంతమంది కొన్ని గ్రామాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. కొంతమందికి ఆస్తిపాస్తులున్నాయి. వీరి సంచారంలో స్త్రీలూ, పిల్లలూ కూడ పాల్గొంటారు. వీరు తమ సామగ్రి అంతా సంచారానికి అనువుగా, కూడినంత కుదిరికగా ఏర్పాటు చేసుకుంటారు.



# 10

# తెలుగు నాటక సాహిత్య సమీక్ష



తెలుగు నాటకాల పరిణామం-దానికి దారితీసిన పరిస్థితులు, ప్రభావాలు-సంస్కృత నాటకాలు - అనువాద నాటకాలు- శ్రవ్యనాటకాలు - దృశ్య నాటకాలు-నాటికలు

# తెలుగు నాటకాల పరిణామం

క్రీస్తుకు పూర్వం 3-వ శతాబ్దంలో మొట్టమొదటగా శాతవాహనరాజులు ఆంధ్ర సామ్రాజ్యాన్ని స్థాపించినట్లు చరిత్రాధారాలు తెలుపుతున్నాయి. హాలుడనే రాజు గాథాసప్తశతిని రచించాడు. ఈయన శాలివాహనరాజుగా పేర్కొనబడ్డాడు. గాథాసప్తశతిలో ఆకాలపు పల్లె ప్రజలకు సంబంధించిన పండుగలు, వేడుకలు, వినోద కార్యకలాపాల సందర్భాలలో పాల్గొను ఆటలు, పాటలు, జానపద నృత్యాలు పేర్కొనబడ్డాయి. ఇవి ప్రజల జీవిత విశేషాలను వెల్లడిచేస్తున్నాయి.

అభినయదర్పణం ఆంధించే

ఆరాలు, తీరుతెన్నులు :

దాక్షిణాత్యులు నృత్త, గీత, వాద్యాది లలితకళల్లో ఆరితేరినవా రని భరతుడు నాట్యశాస్త్రంలో వుదాహరించాడు. నందికేశ్వరుని అభినయదర్పణం రచయిత ఆంధ్రుడే నసీ, అది క్రీ. శ. 3, లేదా 4 వ శతాబ్దపు ప్రాంతంలో రచింపబడిందనీ, అభినయదర్పణకాలంనుంచీ క్రీ.శ. 11 వ శతాబ్దంవరకూ జరిగిన మధ్యకాలంలో ఆంధ్రదేశంలో వున్న సంగీత నృత్యనాటక చరిత్ర మనకు తెలియదనీ, అది ఒక అజ్ఞాతయుగం లాంటిదనీ,కాగా అమరావతి నాగార్జునకొండ మొదలైన ప్రదేశాల్లో బయటపడిన శిల్పకళాసంపద ననుసరించి ఆంధ్రదేశంలో లలితకళలు అపారంగా అభివృద్ధి పొందివుండవచ్చుననీ పి. యస్. ఆర్. అప్పారావు కూచిపూడి సదస్సు సంచికలో వివరించారు.

నన్నయ భారతం వ్రాసేనాటికే కాళిదాసు, భాసుడు, శ్రీహర్షుడు, శూద్రక కవి, భవభూతి మొదలైనవారి సంస్కృత నాటకాలన్నీ అమల్లో వున్నాయి. నన్నయ్య రచనల్లో కాళిదాసుని శాకుంతలాన్ని గూర్చి, భవభూతి వుత్తరరామ చరిత్రతోనూ పరిచయ మున్నట్లు ఉదాహరణలు కనబడుతున్నాయి.

నన్నయకాలంనాటి
నాటకాలు, వాటి
నయనాణ్యాలు :

నన్నయకాలంలో నాటకాలు విరివిగా జరుగుతుండేవి. నాటకం నాందీ శ్లోకా
లతోనూ, ప్రదర్శనం ఎవరు జరిపిస్తున్నారో వారి గుణగణాల వర్ణనలతోనూ,
సూత్రధారునిచే నాటకం, నాటకకర్త, ప్రస్తావనలతోనూ, నాటకకథా విధానాన్ని వివ
రిస్తూనూ ప్రదర్శనలు జరిగేవి. ఆనాటికి వుత్తరభారతదేశంలో దృశ్య నాటకాలకు,
దక్షిణభారతదేశంలో శ్రవ్యకావ్యాలకు ప్రాధాన్య మిస్తూ వుండేవారు.

ఆకాలంలో మతాన్నిగూర్చి, సాహిత్యాన్నిగూర్చి, ధర్మాలనుగూర్చి అనేక
విధాల ప్రచార ముండేది. పురాణాలు చదవడం, శాస్త్రాలు పరిశోధించడం, నాట
కాలు చూడటం ఎక్కువ ఆచారంలో వుండేది. కొంతకాలం సంస్కృత నాటకాల
అనువాదాలు చేశారు. తరువాత స్వంత రచనకు పూనుకున్నారు.

నాటి కళారూపాల ఖిత్తు,
పండితారాధ్యచరిత్ర వక్కణ :

పాల్కురికి సోమనాథుడు కళారూపాలకు సంబంధించిన అనేక విషయాలను
పండితారాధ్య చరిత్రలో పై విషయాలను సమర్థించే విధంగా దీక్షాప్రకరణంలో
సామవేదికథలో ఇలా వుదాహరించాడు:

వ్యక్తంబుగా నితరాకృతినున్న
భక్తు డెఱుంగు దద్భావ మెట్లనిన
బహురూపమాడు బాటివెండేడు
సహజంబు జూవకే జాడవచ్చినను
నరయనేరంగ మధ్యంబున నున్న
తరుణి ఎరుంగదే తన మగడగుట.

నటుడు తా నెట్టి మారువేషంతో వచ్చినను రంగమున నున్న నటుని
భార్య, అతనిని తన మగడని ఎట్లు గుర్తింపగలదో, అట్లే ఈశ్వరుడు వేరువేరు
రూపములుగా సంచరించినను భక్తుడగువాడు అతనిని గుర్తింపగలడని పై పంక్తుల

తాత్పర్యం. దీనినిబట్టి నాటక ప్రదర్శనాలు ఆ కాలంలో ప్రధానస్థానం అలంకరించి నట్లు తెలుస్తూంది.

సోమనాథుడే పండితారాధ్య చరిత్ర పర్వత ప్రకరణంలో,

శతకంబు శివతత్వసారంబు
దీపకళిక మహానాటకమును.

అని వివరించాడు. ఆ మహా నాటకం ఎటువంటిదో మన కింతవరకూ లభ్యం కాలేదు. సోమనాథుడు రచించిన బసవ పురాణంలోనూ, పండితారాధ్య చరిత్రలోనూ 12 వ శతాబ్దం నాటి సంగీత, నృత్య నాటకాలకు సంబంధించిన అనేక జానపద కళారూపాలు మనకు లభ్యమౌతున్నాయి. మార్గ, దేశి అనే రెండు రకాలైన సంగీతాన్ని గూర్చి ఆయన అభివర్ణించాడు.

ఆంధ్రుల సంగీత
కళాపోషణకు
క్రీ.శ. 602 నాటి దాఖలాలు :

ఆంధ్రులు సంగీత కళాపోషణ చేసినట్లు పుదుక్కోట సంస్థానంలో కుడిమియామలై వద్ద పల్లవరాజైన మహేంద్రవర్మ క్రీ. శ. 602 లో చెక్కించిన శిలా శాసనంవల్ల తెలుసుకోవచ్చు.

భరతుడు నాట్యశాస్త్రంలో 11 జాతుల రాగాలలో ఆంధ్రి ఒక జాతి రాగ మని పేర్కొనడాన్నిబట్టి లలితకళల విషయంలో క్రీ॥ శ॥ మొదటి శతాబ్దం నాటికే ఆంధ్రులు ముందున్నారని చెప్పవచ్చు.

తెలుగు కావ్యాల్లోని
తెలివిడి :

పింగళి సూరన్న రచించిన ప్రభావతీ ప్రద్యుమ్న నాటకంలో రంగస్థల మర్యా దలను గురించి, రంగస్థల సూత్రాలను గురించి ఈ క్రింది విధంగా వుదాహ రింపబడివుంది. ఈనాటిమాదిరి రంగస్థలంమీద ఒక తెరవుండేది. ఆ తెరనుండి పాత్రధారులు ప్రవేశించేవారు. వారు రకరకాల పాత్రలను ప్రదర్శించేవారు. రంగ స్థలంమీద గంగానది, కైలాసపర్వతం, వుద్యానవనాలు, అడవులు, వన్య మృగాలు, పశుపక్ష్యాదులూ కన్నులకు కట్టినట్లు ప్రదర్శించేవారట.

స్త్రీ పురుష పాత్రధారులు తమ తమ వేషధారణకు వుచితమైన దుస్తులను, అభరణాలను ధరించేవారు. నవరత్న ఖచితములైన బంగారునగలలా కనబడే టట్లు లక్క-తోను, రంగుతోను, వరకు రేకుతోనూ ముచ్చపనిచేసిన దుస్తులను తయారుచేసి వాటిని ధరించేవారు.

వీణ మొదలైన వాద్యాలతో కొందరు స్త్రీలు గానంచేయడంతో నాటకం ప్రారంభమయ్యేది. తరువాత సూత్రధారుడు రంగస్థలంమీదికి వచ్చి నాందీ పద్యాలను చదివి నాటకం పేరూ, రచయిత పేరూ చెప్పి తెరవెనుకకు వెళ్ళగా పాత్రధారులు తెర వెడలేవారు. ప్రదర్శనానంతరం నటీ, నటులను సభాసదులు సన్మానించేవారు.

ప్రభావతీ ప్రద్యుమ్నంలోనే గాక ఇంకా ఆ కాలంనాటి అనేక ప్రబంధాలలో కూడా నాటక ప్రదర్శనాలను గురించి వివరాలున్నవి.

కందుకూరి రుద్రయ్య రచించిన నిరంకుశోపాఖ్యానంలో తరుణ యౌవన లక్ష్మీ నర్తనము సూపే నధిక తరమైన తెరతీసి నంతలోనె, చిత్తరము జూపు పాతరక త్తెదోలె అనే పద్యభాగంలో రంగస్థలంమీది తెర వర్ణింప బడింది. మను చరిత్రలోనూ వసుచరిత్రలోనూ కూడా నాటకశాలలు పేర్కొన బడినట్లు (దిగవల్లి శివరావు 'కథలు - గాథలు' గ్రంథంలో వుదాహరించారు. క్రీస్తుశకం 1480-90 ప్రాంతంలో ప్రోలుగంటి చెన్నశౌరి లక్ష్మీకళ్యాణమనే యక్షగానాన్ని వ్రాశాడు. 1270-80 సంవత్సరాల మధ్యకాలంలో మంచెనకవి రాజశేఖరుని విద్ధసాలభంజిక నాటికను చంపువుగా రచించాడు.

17 వ శతాబ్దంలో ఎలకూచి బాలసరస్వతి తన రాఘవ పాండవీయ కావ్యంలో, కవి సమీహితరంగకౌముదీనామనాటక విధాన ప్రతిష్ఠాఘనుండ అని ఉదాహరించాడు.

18 వ శతాబ్దంలో కుందుర్తి వేంకటాచలకవి తన కార్తీక మాహాత్మ్యంలో "చాటుకృతులును, బహువిధ నాటకములు, బంధురతరార్థపూర్ణ ప్రబంధములును" రచన గావించి దేవతార్పణముచేసి పాండ్యవిభుచే బ్రభూత సంపదలు గనితినని వ్రాసుకున్నాడు. కాని వీరి నాటకకృతి ఒక్కటికూడ లభ్యంకాలేదు.

తెలుగు అభినయదర్పణం :

క్రీస్తుశకం 18 వ శతాబ్దంలో తిరుచునాపల్లిజిల్లా వాస్తవ్యుడైన లింగం గుంట మాతృభూతయ్య నందికేశ్వరుడు సంస్కృతంలో రచించిన నాట్యశాస్త్రాన్ని అభినయదర్పణంగా మూడు అశ్వాసాలలో తెలుగు భాషలో రచించాడు. మాతృభూతయ్య తెలుగులో రచించిన ఈ అభినయదర్పణం ఆంధ్రదేశంలో ఆనాటినుండి ఈనాటివరకు వుపయోగపడుతూ వుంది. మాతృభూతయ్య భరతశాస్త్రంలోనూ, సంగీతశాస్త్రంలోనూ అపారమైన జ్ఞానంకలవాడు. ఆయన తిరుచునాపల్లికి దగ్గరగా నున్న శ్రీరంగంలోని శ్రీరంగధామునికి దానిని అంకితం చేశాడు. దీనినిబట్టి ఆయన 19 వ శతాబ్దారంభంవరకు శ్రీరంగంలోనే నివసించి వుండవచ్చు.

నన్నెచోడుడు కుమారసంభవంలో సూత్రధారుడై నాట్యాభినయము లెసగ నాడె నారదుండు అనీ, పింగళిసూరన ముఖాదులగు సంధులు సాంగత బెంపుమీర గంగావతారాది నాటకము లాడెనసీ వ్రాయడాన్నిబట్టి సంస్కృత నాటక మర్యాదల ననుసరించి తెలుగులో నాటకా లాడివుండవచ్చు.

సంస్కృతభాషలో నున్న విద్ధసాలభంజిక, అభిజ్ఞాన శాకుంతలం, ప్రబోధ చంద్రోదయం మొదలైన నాటకాలను అనువదించిన మంచన, పిల్లలమర్రి పినవీరన, నందిమల్లయ్య ఘంటసింగయ కవులు మొదలైనవారు రచించిన కేయూరబాహు చరిత్రం, శృంగార శాకుంతలం ప్రబోధ చంద్రోదయ కృతులను ప్రబంధాలుగా రచించారేగాని వాటిని నాటకాలుగా అనువదించడంగాని, నాటకాలుగా వ్రాయడంగాని జరుగలేదు.

గంగాధరకవి, పఱుపతి, భాస్కరుడు, నాగనాథుడు, సింగభూపాలుడు, ధర్మసూరి, వెంకటాధ్వరి, భట్టబాణుడు, నరసింహకవి మొదలైనవారంతా ఆంధ్రులైయుండి సంస్కృతనాటకాలనే రచించారు. కాటయవేముడు, శ్రీనివాసాచార్యులు తెలుగువారైయుండి సంస్కృత నాటకాలకు వ్యాఖ్యానాలు వ్రాశారేగాని నాటకాలు వ్రాయలేదు.

రాజుల ఆనందానికే

ఆనాటి నాటకాలు :

సంస్కృత నాటకాలు వ్రాసిన కవులందరికీ ఆనాడు రాజాదరణ బాగా లభించి

వుండవచ్చు. కేవలం వారి ఆనందానికే వారు ఆ నాటకాలను ప్రాపి వుండవచ్చు. ఇంతకు మినహా తెలుగులో విరివిగా నాటకాలు ఆడినట్లు మనకు తగిన ఆధారాలు అంతగా లభించడంలేదు. కాని ఆనాటి ఆంధ్రదేశంలో ప్రజల విజ్ఞాన వినోదాలకు జానపద కళారూపాలైన కురవంజి, యక్షగానాలు, పగటివేషాలు, జంగంకథలు మొదలైన కళారూపాలు కొన్ని శతాబ్దాలుగా ప్రదర్శిస్తూ వుండేవారని చరిత్రాధారాలవల్ల తెలుస్తూ వుంది.

### తొలి తెలుగు వీధి నాటకం

### క్రీడాభిరామం :

ప్రప్రథమంగా 14 వ శతాబ్దంలో తెలుగు దేశంలో క్రీడాభిరామం అనే తెలుగు వీధి నాటకం అవతరించింది. అయితే ఇది స్వంత రచన మాత్రం కాదు. సంస్కృత ప్రేమాభిరామం నాటకాన్ని అనువదించి ప్రాయబడింది. దీనిని వినుకొండ వల్లభరాయుడు రచించాడనీ, మరికొందరు శ్రీనాథుడు రచించాడనీ పరస్పర విరుద్ధమైన అభిప్రాయా లున్నాయి. ఈ వీధినాటకాన్ని మోహూరి భైరవుని తిరునాళ్ళలో ప్రదర్శించే వారట. దీని ఇతివృత్తమంతా పిచ్చళ్ళంగా రంతో నిండివుంది. ఇది కేవలం వీధినాటకమై బహిరంగంగా ప్రదర్శించడంవల్ల ఆనాటి ఆంధ్రదేశంలో వివిధవర్గాల ప్రజలను ఆకర్షించింది.

18 శతాబ్దిలో ఆంధ్రదేశపు ప్రజల నానందింపజేసిన కళా రూపాలన్నీ జాన పద కళా రూపాలే ననడానికి మనకు అనేక ఆధారా లున్నాయి. అనేక దేవాల యాలమీద సృష్టించబడిన నృత్యవిశేషాలు, అమరావతి, నాగార్జునకొండ శిల్పాలు, లేపాక్షి, అజంతా వర్ణచిత్రాలు, అనేక రాతి, తామ్ర శాసనాలు, చాళుక్య, కాకతీయ, రెడ్డి, విజయనగర తంజావూరు రాజుల చరిత్రలూ మనకు వైజ్ఞానిక గాధల్ని చెపుతున్నాయి. ఇందుకు వుదాహరణ తంజావూరు౬' వందలసంఖ్యలో వున్న ప్రాచ్యలిఖిత యక్షగానాలే సాక్ష్యం.

### ప్రథమ తెలుగు నాటకం :

1860 నాటికి గాని తెలుగులో నాటకం ప్రాయబడలేదు. బందరు నోబుల్ కళాశాల ప్రధా నాంధ్రోపాధ్యాయుడైన కోరాడ రామచంద్ర శాస్త్రిగారు మంజరీ మధుకరీయం అనే నాటకాన్ని ప్రప్రథమంగా రచించారు. ఈ నాటకం 1908 లో

గాని అచ్చు కాలేదు. ఈ నాటకం ఎక్కువ సంస్కృత మర్యాదల ననుసరించి వుండడంవల్లనో ఏమో ప్రదర్శనానికి నోచుకోలేకపోయింది. ప్రథమంలో సంస్కృత నాటకాన్ని అనువదించింది కూడా వీరే.

వీరి తరువాత కొక్కొండ వెంకటరత్నం పంతులుగారు 1872 లో నరకాసుర విజయ వ్యాయోగం, 1894 లో ధనంజయ విజయ వ్యాయోగం, 1872 లో ప్రసన్నరాఘవం నాటకాలను రచించారు. వీరిది కఠినమైన గ్రాంథిక శైలి. శ్లోకాలను పద్యాలుగాను, సంస్కృత వచనాన్ని వచనంగాను రచించారు. కాని వీరి నాటకాలు ప్రదర్శన యోగ్యమే కాలేదు.

1872 లో శాకుంతలాన్ని అనువదించిన పరవస్తు వెంకట రంగాచార్యులు గారు గ్రాంథికభాషను వాడినా ప్రాకృత భాషాస్థానంలో తెలుగును ప్రవేశపెట్టారు.

ప్రథమ ఆంధ్ర నాటకాలు :

ప్రథమంగా 1875 లో వావిలాల వాసుదేవ శాస్త్రిగారు జూలియస్ సీజరు, షేక్స్పియర్ ఇంగ్లీషు నాటకాలను తెలుగులో అనువదించారు. సంస్కృతంనుండి మృచ్ఛకటిక, ఉత్తర రామచరితం తెనిగించారు. వారు స్వతంత్రంగా తెలుగులో పద్యాల రూపంలో నందకరాజ్యమనే ప్రథమ సాంఘిక నాటకాన్ని వ్రాశారు.

ధార్వాడ నాటక సమాజాల విజయయాత్ర :

ఈకాలానికి తెలుగునాడులో ఎక్కడా స్వతంత్రంగా నాటకాలాడినట్లు మనకు ఆధారాలేవీలేవు. కాని ఈ సమయంలో 1880 సంవత్సరంలో ధార్వాడ నాటక సమాజాలవారు ఆంధ్రదేశమంతటా వారి హిందీ నాటకాలతో విజయయాత్రచేసి ఆంధ్ర ప్రజలలో నాటకోత్సాహాన్ని కలిగించారు.

ఆనాటికే వీరి నాటకాలలో బాహాటంగా తెరలను, మంచి మంచి చెమ్కీ దుస్తులను వాడారు. వీరి నాటకాలను ప్రజలు తండోపతండాలుగా చూశారు. ధార్వాడ వారిచ్చిన వుత్సాహంతో అదేమాదిరి నాటకాలు ప్రదర్శించడానికి పూనుకుని రాజమండ్రిలో వీరేశలింగంగారు చమత్కార రత్నావళి అనే నాటకాన్ని ఆడిం

చారు. ప్రథమంగా తాటియాకుల హాలులో ప్రదర్శింపబడ్డ తొలి నాటకం ఇదే. రత్నావళి నాటకం కామెడీ ఆఫ్ ఎరర్స్ అనే షేక్స్పియర్ నాటకానికి అనువాదం.

ఈ కాలంలో ఆంధ్రదేశంలో దాదాపు అన్ని ముఖ్యనగరాల్లోనూ నాటక సమాజాలు ఏర్పడినాయి. కాని ప్రదర్శించడానికి నాటకాలు మాత్రం లేవు.

వచన నాటకాలకు
ప్రారంభం :

ధార్వాడవారు తీసుకున్న జానపద పురాణగాథల ననుసరించి తెలుగులో వచన నాటకాలు వ్రాయడం ప్రారంభించారు.

అలా వచన నాటకాలు వ్రాసిన వారిలో ముఖ్యులు కొండుబొట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి, నాదెళ్ళపురుషోత్తం, కందుకూరు వీరేశలింగం, చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు. వీరిలో కొండుబొట్ల సుబ్రహ్మణ్యంగారు 1881 నుండి 35 వరకూ హరిశ్చంద్ర, వస్త్రాపహరణం, యుగంధర విజయం, గయోపాఖ్యానం మొదలైన 30 వచన నాటకాల్ని రచించారు. ఆనాడు వచన నాటకాలు అత్యంత మనోహరంగా వున్నట్లు చిలకమర్తివారు తమ స్వీయచరిత్రలో వ్రాసుకున్నారు. బందరులో హిందీ నాటకాలాడుతున్న నాదెళ్ళ పురుషోత్తమకవి "రామదాసు" "హరిశ్చంద్ర" తెలుగు నాటకాలను రచించారు.

తోలేటి సుబ్బారావుగారు రచించిన హరిశ్చంద్ర వచన నాటకాన్ని రాజమండ్రి హిందూ నాటక సమాజంవారు ఇమ్మానేని హనుమంతరావుగారి ఆధ్వర్యంలో చాలాసార్లు ప్రదర్శించారు.

1889 లో చిలకమర్తివారు రచించిన "కీచకవధ", "శ్రీరామజననం" "గయోపాఖ్యానం" "ద్రౌపదీపరిణయం" వచన నాటకాలే. గయోపాఖ్యాన నాటకం ప్రథమంలో వచనంలో రచింపబడిన తరువాతనే పద్యాలను చేర్చారు.

ఒకడుగు ముందుకెళ్లిన
ధర్మవరంవారు :

నవ్యాంధ్రదేశంలో ఇలా వచన నాటకాలు ప్రదర్శిస్తున్నప్పుడు, రాయలసీమలో గద్యపద్యాత్మక నాటకా లాడాలనే వుత్సాహంతో ధర్మవరం కృష్ణమా

చార్యులవారు సరసవినోదిని సభను స్థాపించి నాటకాలు ఆడించారు. వీరు దాదాపు 28 నాటకాలు వ్రాశారు. అన్నీ పౌరాణిక నాటకాలే. వీరు నాటకాలలో గేయాలు, రాగమాలికలు, డ్యూయెట్లు ప్రవేశపెట్టారు. వచనంలో నున్న భావాన్నే పద్యం లోనూ, కీర్తనలలోనూ చెప్పించేవారు.

ఈ విధానాన్ని ఎందుకు ప్రవేశపెట్టవలసి వచ్చిందో, చిత్రనళీయం పీఠికలో వుటంకించారు వచనం చెప్పగలవారు వచనాన్ని, పద్యం బాగా పాడగల వారు పద్యాన్ని, పాటలు పాడగలవారు పాటలను వుపయోగించుకోవడానికి వీలుగా రచించానని వారు వుటంకించారు.

వీరు 1886 లో రచించిన చిత్రనళీయం, 1889 లో రచించిన విషాద సారంగధర, 1914 లో ప్రహ్లాద, ప్రమీలార్జునీయం, 1915 లో ముక్తావళి, 1916 లో చంద్రహాస, అజామీళ, 1919 లోని చిరకారి, 1920 లోని రుక్మాంగద మొదలైన పౌరాణిక నాటకాలు ఎక్కువ ప్రజాదరణను పొందాయి.

కృష్ణమాచార్యులుగారి రచనా కౌశల్యానికి మెచ్చుకుని 1910 లో గద్వాల సంస్థానాధీశులు ఆంధ్రనాటక పితామహ అనే బిరుదునిచ్చి సత్కరించారు.

### కోలాచలంవారి ట్రూప్ :

ఈ కాలంలోనే బళ్ళారిలో కృష్ణమాచారిగారికి పోటీగా సుమనోరమ సభను స్థాపించిన కోలాచలం శ్రీనివాసరావుగారు 30 వరకూ గద్య పద్యాత్మక నాటకాలు రచించి, సేరు పొందారు. వీరి నాటకాలలో రామరాజు, ప్రహ్లాద, ద్రౌపదికీచక వధ,రుక్మాంగద,చాందుబీబీ మొదలైన నాటకాలు ఎక్కువ ప్రజాదరణను పొందాయి.

వీరికి బిరుదు సంపాదించిపెట్టిన నాటకం రామరాజు. బళ్ళారి రాఘవ ఈ నాటకాన్ని ఆంధ్రదేశంలోనేగాక మైసూరు బెంగుళూరు మద్రాసు నగరాలలో ప్రదర్శించి ప్రఖ్యాతి వహించారు.

గద్య, పద్య, గేయాత్మక నాటకాలు ఎక్కువ ప్రజాదరణ పొందడంవల్ల ఆనాటి రచయితలంతా ఈ విధానాన్నే అనుసరించారు. ప్రతి నాటకంలోనూ పద్యాలనూ పాటలనూ డ్యూయెట్లనూ విరివిగా ప్రవేశ పెట్టారు. ఇందుకు వుదాహరణ సంగీత హరిశ్చంద్ర, సంగీత సావిత్రి అనే పేర్లతో నాటకాలు వెలువడడమే.

పద్యాలు, పాటలు లేని నాటకం నాటకమే కాదనే స్థితికి ప్రేక్షకులు కూడా దిగ జారారు.

చిలకమర్తి పలుకుబడి:
ప్రభావం :

ఆ ప్రభావంతోనే 1890 లో చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి గయోపాఖ్యాన నాటకం అవతరించింది. ఆనాటినుండి ఈనాటివరకూ అర్ధ శతాబ్దంపైగా ఆంధ్రప్రజల నుబ్బూత లూగించి ఈనాటికీ గణనీయమైన నాటకంగా నిలబడి, లక్ష కాపీలకుపైగా అమ్ముడుపోయింది.

ఆంధ్ర నాటకరంగంలో
నవ్యయుగం :

పౌరాణిక, చారిత్రిక నాటకాలు వుధృతంగా ప్రదర్శింపబడి ప్రజాభిమానాన్ని చూర గొంటున్న రోజులలో 1892 లో ఆంధ్రనాటక రంగంలోనూ, ఆంధ్రనాటక సాహిత్యంలోనూ ఒక నవ్యయుగం ప్రారంభమైంది. ప్రజాకవి గురజాడ అప్పారావుగారి సాంఘిక మహా నాటకం కన్యాశుల్కం వెలువడింది. ఈ నాటకంలో వాస్తవిక జీవితాన్ని, వ్యవహారిక భాషనూ వుపయోగించి ఒక నూతన విప్లవాన్ని తీసుకు వచ్చారు. ఆనాటి సమాజంలోవున్న ఛాందసులైన బ్రాహ్మణ పండితుల్ని, కుహనా సంఘ సంస్కర్తల్ని, త్రాగుబోతుల్ని, వ్యభిచారుల్ని, దొంగ సన్యాసుల్ని, కోర్టు పక్షుల్ని, పోలీసుల్ని, న్యాయవాదుల్ని, రౌడీల్ని మొదలైన సంఘంలోవున్న దుష్టశక్తుల గుట్టును బట్టబయలుచేసి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేశారు. గంభీరమైన మానవత్వం కన్యాశుల్కంద్వారా వెల్లడించారు. ఈ నాటకాన్ని 1892 ఆగష్టులో విజయనగరం జగన్నాధ విలాసినీ నాటకసమాజంవారు మొదటిసారిగా ప్రదర్శించారు. కన్యాశుల్కం ఆనాటి కవిపండితులలోనూ, నాటక సమాజాల వారిలోనూ సంచలనం కలిగించింది. అనేక విమర్శలకు కూడా గురైంది. కన్యా శుల్కాన్ని రష్యనులు ఈ మధ్యనే రష్యన్ భాషలోకి అనువదించడం ద్వారా అది ప్రపంచ సాహిత్యంలో చేరిపోయింది.

# ప్రసిద్ధ నాటక రచయితలు



శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావు



శ్రీ డి. వి. నరసరాజు



శ్రీ భమిడిపాటి కామేశ్వరరావు



శ్రీ పాలగుమ్మి పద్మరాజు

# ప్రసిద్ధ నాటక రచయితలు



శ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి



శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు



శ్రీ కొఱ్ఱపాటి గంగాధరరావు



శ్రీ ఆచార్య ఆత్రేయ

# ప్రసిద్ధ నాటక రచయితలు



శ్రీ యస్. ఆర్. నంది



శ్రీ కారెపు అప్పలస్వామి



శ్రీ కొప్పరపు సుబ్బారావు



శ్రీ యస్వీ జోగారావు
(యక్షగాన వాఙ్మయ రచయిత)

# ప్రసిద్ధ నాటక రచయితలు



శ్రీ కొండముది గోపాలరాయశర్మ



శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహం



శ్రీ కాటూరు వెంకటేశ్వరరావు



శ్రీ రావూరు సత్యనారాయణ

# ప్రసిద్ధ నాటక రచయితలు



శ్రీ పినిశెట్టి శ్రీరామమూర్తి



శ్రీ ముత్తరాజు సుబ్బారావు



శ్రీ భమిడిపాటి రాధాకృష్ణ



శ్రీ నార్ల వెంకటేశ్వరరావు

# ప్రసిద్ధ నాటక రచయితలు



శ్రీ ధర్మవరం కృష్ణమాచార్యులు



శ్రీ ప్రఖ్య శ్రీరామమూర్తి



శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి

# ప్రసిద్ధ నాటక రచయితలు



శ్రీ కణ్వశ్రీ



శ్రీ గొల్లపూడి మారుతిరావు

*



శ్రీ బి. రామరాజు
(జానపద వాఙ్మయ రచయిత)



శ్రీ బిందాన నారాయణరావు
(జంషెడ్‌పూర్)

# ప్రసిద్ధ నాటక రచయితలు



శ్రీ గురజాడ అప్పారావు



శ్రీ పింగళి నాగేంద్రరావు



శ్రీ వడ్డాది సుబ్బరాయకవి



శ్రీ కోలాచలం శ్రీనివాసరావు

పాత్రోచితభాషకు
ప్రవేశపెట్టిన వేదం వారు :

అప్పారావుగారి కన్యాశుల్కం అచ్చుపడి వెలువడిన సంవత్సరమే 1897లో వేదం వెంకటరాయశాస్త్రిలవారి "ప్రతాపరుద్రీయం" వెలువడింది. ఇంతకు ముందే శాస్త్రిగారు 1891 లో శ్రీహర్షుని నాగానంద నాటకాన్ని, 1896 లో కాళిదాసుని అభిజ్ఞానశాకుంతల నాటకాన్ని అనువదించారు. కాని ప్రతాపరుద్రీయ నాటకంతోనే శాస్త్రిగారి పేరు దశదిశల మారుమ్రోగింది. ఇది తెలుగులో వ్రాయబడిన మొదటి చారిత్రిక నాటకం. ఈ నాటకంలో వ్యావహారిక, గ్రామ్యభాషలను వాడడంతోపాటు ముస్లిం పాత్రలకు తెలుగు తురకాన్ని వాడి పాత్రోచితభాషకు మూలకారకులైనారు.

ఆనాటి అన్ని నాటకాలలోని పాత్రలకు గ్రాంధికభాషను వాడుతున్న సమయంలో శాస్త్రిగారి ఈ విధానం ప్రతిపక్షులైన అనేకమంది పండితులకు కంటకమైంది. ప్రతాపరుద్రీయ నాటకం రచనలో, పాత్రచిత్రణలో, పాత్రోచితభాషలో వున్నతస్థాయినందుకుని, అనేకమంది రచయితలకు ఆదర్శప్రాయమై, ప్రథమాంధ్ర చారిత్రిక నాటకంగా నిలబడింది. ఈ నాటకాన్ని నెల్లూరు ఆంధ్రసభవారు, తెనాలి రామవిలాససభవారూ ప్రదర్శించి వేనోళ్ళ పొగడబడ్డారు.

మరొకప్రసిద్ధుడు
పానుగంటి :

సర్కారాంధ్రదేశంలో మరో ప్రసిద్ధ నాటకరచయిత పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు 20 వ శతాబ్దంలో వెలుగులోకివచ్చి దాదాపు 32 నాటకాలను రచించారు. వీరి నాటకాలలో ముఖ్యమైనవి విప్రనారాయణ, కంఠాభరణం, రాధాకృష్ణ, ప్రచండచాణక్యం, పాచిక మొదలైనవి. వీరు పౌరాణిక, చారిత్రక, సాంఘికాది నాటక విధానాలనన్నింటినీ సమర్థతతో నిర్వహించారు. వీరు హాస్యరచనలో సిద్ధహస్తులు. వీరి నాటకాలలో హాస్యం హెచ్చుగా వుంటుంది. వీరి సంభాషణలలో వుపమానాలు హెచ్చు. వీరి రచనా విధానం గ్రాంథికమూ, వ్యవహారికమూ కాక, మధ్యే మార్గంలో నడుస్తుంది. వీరి సంభాషణలు దీర్ఘసమాసాలతో నిండి

వుండడంవల్ల నటులకు కొంత ఇబ్బంది కలిగేది. వీరి నాటకాలలో పద్యాలుకూడా ఎక్కువే. కాని పానుగంటివారు చివరిదశలో వ్రాసిన "పద్మిని" "విచిత్రవివాహం" మొదలైన నాటకాలను వచన నాటకాలుగానే రచించారు. వీరి నాటకాలలో ఏయే పాత్రను ఎలా మాట్లాడించాలో, వారి మనోహర వైఖరులను ఎలా ప్రకటించాలో వీరికి తెలిసినట్లు మన నాటకకవులలో మరి ఎవరికీ తెలియదని నండూరు బంగారయ్యగారు వీరి నాటకాలన్నిటినీ సమీక్షిస్తూ వుటంకించారు.

తిరుపతి వెంకటకవ్రల
విజయ పతాక:

శతాధిక గ్రంథకర్తలూ, శతావధానులూ, ఉద్దండపండితులూ అయిన తిరుపతి వెంకటకవులు మహాభారత గాథలను తీసుకొని 1908 లో పాండవవిజయం, 1909 లో పాండవజననం, 1913 లో పాండవాశ్వమేధం, 1921 లో పాండవ రాజసూయం మొదలైన 6 నాటకాలను రచించి పౌరాణిక నాటక ప్రపంచంలో విజయపతాకను ఎగురవేశారు. ముఖ్యంగా వీరి పాండవోద్యోగవిజయాలు ఆనాటినుండి నేటివరకూ కొన్నివేలసార్లు ప్రదర్శింపబడి,ప్రతి ప్రేక్షకుని హృదయంలోనూ వారి పద్యాలు నిలిచిపోయి శాశ్వతస్థానాన్ని ఏర్పరుచుకున్నాయి. తిరుపతి కవుల ప్రతిష్ఠ ప్రజాసామాన్యంలా పెరగటానికి ఈ నాటకాలే కారణమయ్యాయి.

అయితే వీరి నాటకాలలో గద్యంకంటే వరుస పద్యాలు ఎక్కువ అవడం వల్ల నటుల ప్రతి నటుల అభినయానికి కొంత ప్రతి బంధకం ఏర్పడుతూంది. అందువల్ల వరుస పద్యాలలో కొన్నిటిని తగ్గించి పాడడం కూడా కద్దు. ఈ విధానంవల్ల ప్రేక్షకుల విసుగుదల కొంత తగ్గుతూ వుంది. వీరి నాటకాలలో స్త్రీ పాత్రలు లేకపోవడంవల్ల కూడ ప్రదర్శనానికి యోగ్యంగా వుండి ఈనాటివరకూ నిలిచివున్నాయి.

తిరుపతికవులు పై నాటకాలే కాక అనర్ఘనారదం, ప్రభావతీ ప్రద్యుమ్నం, పండితరాజం, సుకన్య అనే స్వతంత్ర నాటకాలనూ రచించారు గాని పాండవ నాటకాలు సంపాదించుకున్న స్థానాన్ని సంపాదించుకోలేక పోయాయి.

వేడంవారి బాణీని
ఆంబిప్రచ్ఛకున్న శ్రీపాద:

ప్రతాపరుద్రీయం వచ్చిన తరువాత ఆ వుత్సాహంలోనే వెలువడిన శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి బొబ్బిలియుద్ధ నాటకం ముఖ్యమైనది. ఈ కాలంలోనే కోలాచలం శ్రీనివాసరావుగారి విజయనగరపతనం నాటకం వెలువడ్డది. బొబ్బిలి యుద్ధనాటకం ఆంధ్రనాటకరంగస్థలంలో ప్రవర్శింపబడి ప్రజాదరణ నంపాదించింది. ఈ నాటకంలోని పద్యాలు కూడ ప్రజల నుత్తేజపరిచాయి.

పౌరాణిక నాటకాలు ఉధృతంగా ప్రదర్శిస్తున్న ఈ సమయంలో 1918 లో బలిజేపల్లి లక్ష్మీకాంతంగారి సత్యహరిశ్చంద్ర నాటకం ఆనాటికున్న అన్ని హరిశ్చంద్ర నాటకాలను ఆవలకునెట్టి అగ్రస్థానంలో కూర్చుంది. ఆనాటికీ, ఈ నాటికీ ఆంధ్రుల హృదయాలలో హత్తుకుపోయి చిరస్థాయిగా నిలబడింది. హరిప్రసాదరావు, డి. వి. సుబ్బారావు, యన్. వి. యల్. నరసింహం మొదలైన వారు ఏండ్లతరబడి ఈ ఒక్క నాటకాన్ని ప్రదర్శించే అఖండమైన ప్రతిష్ఠను సంపాదించుకున్నారు.

ఈ దశలో శ్రీరాముల సచ్చిదానంద శాస్త్రిగారి సావిత్రి, చిలకమర్తివారి ప్రసన్న యాదవం, పారిజాతాపహరణం, మారేపల్లివారి బిల్హణీయం, కె. సుబ్రహ్మణ్య శాస్త్రిగారి లవకుశ, కృష్ణలీల, కాశీనాధుని వీరమల్లయ్యగారి నాటకాలు ప్రసిద్ధికెక్కాయి.

దేశభక్తికి
బాటలుసిన దురంతాలు:

మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత స్వరాజ్యం వస్తుం దనుకున్న భార తీయులకు ఆశాభంగమై, బెంగాలు విభజనోద్యమం, పంజాబు జలియన్‌వాలా బాగ్‌దురంతాలు ప్రజలలో నూతనోత్తేజాన్ని, దేశభక్తినీ కలిగించాయి. కవులు పూర్వ చరిత్రలకు సంబంధించిన కథలను తీసుకుని సంభాషణరూపంలో బ్రిటిష్ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. ఈ కోవకుచెందిన నాటకాలు రసపుత్ర విజయం, దుర్గాదాసు, రాణా ప్రతాప్, రాజసింహుడు, శివాజీ, తానాజీ, రోషనార, జేబున్నీసా,

మొదలైనవి. వీటిలో జేబున్నీసా, రోషనార, రసపుత్రవిజయం నాటకాలు, హిందూ మహమ్మదీయ కలహాలను రెచ్చగొడుతాయని బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. ఈ కాలంలో కొప్పరపువారు అద్భుతంగా చిత్రించిన రోషనారపాత్రను స్థానం నరసింహారావుగారు అద్భుతంగా పోషించారు.

1919-20 సంవత్సరాలలో జాతీయ ఉద్యమాన్ని పురస్కరించుకుని దేశభక్తిని పురికొల్పే నాటకాలు వెలువడ్డాయి. వీటిలో దామరాజు పుండరీకాక్షుడుగారు వ్రాసిన గాంధీ విజయం, పాంచాల పరాభవం ముఖ్యమైనవి.

జాతీయోద్యమ ప్రభావంతో ఇతర భాషలైన హిందీ, బెంగాలీ, మరాటీ భాషల నాటకాలను అనువాదంచేసి కూడ నాటకాలను ప్రదర్శించారు. ఈ కోవకు చెందిన నాటకాలు జొన్నలగడ్డ సత్యనారాయణ మూర్తిగారి చంద్రగుప్త, షాజహాన్, మేవాడపతనం, శ్రీపాద కామేశ్వరరావుగారి చంద్రగుప్త, రాణా ప్రతాప్‌సింహ, నండూరి శివరావుగారి చంద్రగుప్త మాచిరాజు దుర్గాశంకర అమాత్యుని శివలీల, పింగళి నాగేంద్రరావుగారి మేవాడపతనం మొదలైనవి.

సాంఘికోద్యమానికి
సాయంచేసిన చింతామణి:

1921 ప్రాంతంలో సాంఘికోద్యమం విజృంభిస్తున్న రోజులలో కాళ్ళకూరి నారాయణ రావుగారు 1921 లో చింతామణి నాటకాన్ని, 1926 లో వర విక్రయం, మధుసేవ నాటకాల్ని రచించారు. ఈ మూడు నాటకాలూ అద్భుతంగా ప్రదర్శింపబడి ఒక విశిష్ట స్థానాన్ని ఏర్పరచుకున్నాయి. చింతామణి నాటకం ఈ నాటికీ ప్రదర్శింపబడుతూవుంది. ఈ కాలంలో వీరేశలింగంగారు బ్రాహ్మ వివాహం విచిత్ర నాటకం మునిసిపల్ నాటకం మొదలైన వాటిని హాస్యధోరణిలో ప్రజలకు అందుబాటులో వుండేటట్లు రచించారు.

1920-30 సంవత్సరాల మధ్యకాలంలో సోమరాజు రామానుజ రావుగారు దాదాపు 30 నాటకాలను వ్రాశారు. కాని వెలుగులో కొచ్చి ప్రదర్శింపబడిన నాటకాలు 1929 లోని రంగూన్ రౌడి, 1931 లోని ధరణికోట, 1934 లోని కాలకేతనము మొదలైనవి మాత్రమే. వీటిలో విశేషంగా ప్రదర్శింపబడి ప్రజాభిమానాన్ని చూరగొన్న నాటకం ఒక్క- రంగూన్ రౌడి మాత్రమే.

ఈ కాలంలో వచ్చిన నాటకాలలో ప్రఖ్యాతి వహించిన మరికొన్ని నాటకాలున్నాయి. అవి 1922 లో వచ్చిన ముత్తరాజు సుబ్బారావుగారి శ్రీ కృష్ణతులాభారం, 1926 లో చండాలకేశవదాసుగారి కనకతార, ముత్తనేని వెంకట చెన్నకేశవులుగారి చండిక, 1936 లో వున్నవలక్ష్మినారాయణగారి నాయకురాలు, 1926 లో ఆవటపల్లి హనుమంతరావుగారి కాళిదాసు, 1927 పింగళి నాగేంద్రరావు గారి నారాజు, 1923 బలిజేపల్లి లక్ష్మీకాంతంగారి ఉత్తర రాఘవం మొదలైనవి ముఖ్యమైనవి.

గ్రంథి సుబ్బరాయ గుప్తగారి ఆంధ్రమాత(1921)ద్రోణంరాజు సీతారామా రావుగారి ఆంధ్రపతాకం(1921)ఆంధ్రరాష్ట్రోద్యమానికి సంబంధించిన నాటకాలు.

ఈ కాలంలోనే భావకవులైన విశ్వనాధ సత్యనారాయణగారి నర్తనశాల 1924 లో వెలువడింది. వీరివే ఆనార్కలీ, సౌప్తిక ప్రళయం కూడ వెలువడ్డాయి. వీరి నర్తనశాల వుత్తమ నాటకంగా పరిగణింపబడింది.

1925 లో చింతాదీక్షితులుగారి శబరి నాటకం కూడా అపూర్వంగా రచించ బడింది. ఇందులోని సంభాషణలు అద్భుతంగా వ్రాయబడ్డాయి.

1924 లో దువ్వూరి రామిరెడ్డిగారి విషాద నాటకం కుంభరాణా ప్రదర్శింప బడి పలువురి ప్రశంసలందుకుంది.

త్రిపురనేని
రామస్వామి :

సనాతనాచారాలమీదా, సనాతన ఛాందసులమీదా, భారత, రామాయణాది పురాణ, మత, తాత్విక గ్రంథాలమీదా తిరుగుబాటును లేవదీసిన త్రిపురనేని రామస్వామి చౌదరిగారు 1912 లో కురుక్షేత్ర సంగ్రామం, 1920 లో శంబుకవధ, 1935 లో ఖూనీ మొదలైన నాటకాలను రచించారు.

గుడిపాటి వెంకటచలం, ముద్దుకృష్ణగార్లు కూడ పౌరాణిక, చారిత్రిక నాటకాల్ని నూతన దృష్టిలో వ్యాఖ్యానించారు. ఈ విధానా న్ననుసరించి చలం గారు చిత్రాంగి, పద్మరాణి 1921లో సావిత్రి 1923లో కావలిని 1926లో మంగమ్మ 1920 మొదలైన నాటకాలను, సత్యం, శివం, సుందరం, అనే నాటికను, 1923 లో రచించారు.

ముద్దుకృష్ణగారి అశోకం 1930 లో వెలువడింది. దీని ఇతివృత్తం సీతారాముల మనస్తత్వాలకు నూతన వ్యాఖ్యానం.

ఈ దశలోనే 1920-30 సంవత్సరాల మధ్య వచ్చిన నాటకాలలో పింగళి నాగేంద్రరావుగారి "వింధ్యరాణి" మంచి నాటకంగా గణుతికెక్కింది.

1928 లో చిలకమర్తి షష్టిపూర్తి వుత్సవ సందర్భంలో వారు అనువదించిన భాసనాటకాలను సంపుటంగా ప్రకటించారు.

### నాటకరంగంలోనూ పేరుగడించిన సంగీత పండితుడు :

ఈనాటికి పాపట్ల కాంతయ్యగారనే గొప్ప సంగీత పండితుడు ఆంధ్రనాటక రంగంలో దేదీప్యమానంగా వెలుగొందుతున్న వ్యక్తి. ఈయన నాటకాలకు కీర్తనలు వ్రాయడంలో దిట్ట. వీరు మైలవరం బాలభారతీ సమాజానికి, రాజమండ్రి గున్నేశ్వరరావుగారి కంపెనీకి రకరకాల కీర్తనలు వ్రాసి, వాటికి బాణీలు ఏర్పాటు చేశారు. ఆనాటి తెలుగు నాటకాల పాటలన్నీ ఈయన ప్రతిభావిశేషాలకు సంబంధించినవే. వీరి పాటలు ప్రజలను బాగా ఆకర్షించాయి. కాని, నాటకాభినయానికి మాత్రం ఈ పాటలు కొంత ప్రతిబంధకం కలిగించాయి. 1920 సంవర ప్రాంతాల్లో నాటకాలన్నీ, సంగీతంతోనూ, పాటలతోనూ నిండిపోయి నాటక ప్రయోగానికి సంబంధించిన విలువలన్నీ పడిపోవడంతో బి. టి. రాఘవాచార్యులు సంగీత నాటకాలలోని అవకతవకలను ఎత్తిచూపుతూ "సంగీత ఇంద్రసభ" అనే నాటకాన్ని వెలువరించడమేకాక నటుల వుపయోగార్థం 1924 లో "నాటకదీపిక" అనే నాటక లక్షణ గ్రంథాన్ని రచించారు.

### సంగీత నాటకాల అవకతవకలపై దెబ్బలు :

1908 లో కోలాచలం శ్రీనివాసరావుగారు ప్రపంచ నాటకచరిత్రను ఇంగ్లీషులో ప్రచురించడమేకాక "ఆంధ్ర నాటకములు - కొన్ని నియమములు" అనే వ్యాసాన్ని ప్రకటించారు. ఈకాలంలో కృష్ణా పత్రికలో పురాణం సూరికాత్రి, ముత్త

రాజు సుబ్బారావుగార్లు నిర్మాణాత్మకమైన వ్యాసాలను ప్రకటించారు. భమిడిపాటి కామేశ్వరరావుగారు సంగీతంతో పద్యాలను సాగలాగకుండా తప్పని వ్యాసాలద్వారాను. ఉపన్యాసాలద్వారాను వెల్లడించారు.

ఈ తరుణంలో పురాణం సూరిశాస్త్రిగారు నాట్యాంబుజం 1923, నాట్య అశోకం. 1924 విమర్శక పారిజాతం. 1925 పాశ్చాత్య నాటక రచనారీతుల్ని విశదీకరించే నాట్యోత్పలం మొదలైన నాటక విజ్ఞానానికి పనికివచ్చే గ్రంథాలను రచించారు. "ఆంధ్ర నాటకరంగం" అనే గ్రంథాన్ని గొల్లపూడి శ్రీరామశాస్త్రిగారు 1924 లో ప్రచురించారు. పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రిగారు "ఆంధ్రనట ప్రకాశిక" అనే వుత్తమ చారిత్రిక గ్రంథాన్ని రచించారు.

1923 లో "నాటకకళ" అనే పత్రికను బుర్రా శేషగిరిరావుగారు స్థాపించి యోగ్యమైన అనేక వ్యాసాలను వ్రాశారు.

పాశ్చాత్యుల ప్రభావం :

1920-30 సంవత్సరాల మధ్యకాలంలో నాటకరంగంమీద అనేక విమర్శలూ, చర్చలూ జరిగాయి. 1930 నాటికి అంతర్జాతీయ నాటక సాహిత్యం మనకు అందుబాటులోకి రావడంతో బెర్నార్డుషా, చెకోవ్, ఇబ్సెన్, టాలుస్టాయి మొదలైన సుప్రసిద్ధ నాటకకర్తల నాటకాల ప్రభావం విద్యావంతులమీదా, మేధావులమీదా పడింది. ఆ ప్రభావంలో వెలువన పి. వి. రాజమన్నారుగారి తప్పెవరిది నాటకం సాంఘిక నాటకాల్లో నూతన విప్లవాన్ని తీసుకువచ్చింది. ఈ ప్రభావంలో వెలువడిందే రంగారాంగారి దంపతులు.

తప్పెవరిది, దంపతులు నాటకాల తరువాత చెప్పుకోదగిన నాటకం మల్లాది అవధానిగారి "గాలివాన".

గాంధీజీ ప్రభావం :

1930 సంవత్సరంలో ఉప్పు సత్యాగ్రహం ప్రారంభమైన తరువాత, గాంధీజీ తన దృష్టినంతా హరిజన సమస్యల మీద కేంద్రీకరించారు. ఈ ప్రభావం నాటక రచయితలమీదకూడా పడింది. ధర్మవరం గోపాలాచార్యులుగారి 'అస్పృశ్య

విజయం', పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రిగారి 'నందనార్', తాండ్ర సుబ్రహ్మణ్యం గారి 'పతితపావన', మునిమాణిక్యంవారి 'తిరుగుబాటు' మొదలైనవి ముఖ్యమైనవి.

1935 లో ఒకే ఇతి వృత్తాన్ని తీసుకుని విశ్వనాథ సత్యనారాయణగారు వేనరాజు అనే కథను, త్రిపురనేని రామస్వామిగారు ఖూనీ అనే కథను, బుచ్చి వెంకటకృష్ణయ్య చౌదరిగారు విప్లవం, లేక వేనరాజు అని విభిన్న దృక్పథాలను వెల్లడించారు. వీరు ముగ్గురూ సమర్థులైన రచయితలు కావడంవల్ల మూడు నాటకాలూ వుత్తమంగానే వున్నాయి.

నాటక రచనలో మార్పు :

ఈ దశలోనే నాటకరచనలో మార్పు వచ్చింది. శివశంకరస్వామి పద్య, గేయ నాటికలను రచించారు. పద్మావతీ చరణ చారణ చక్రవర్తి, దీక్షిత దుహిత, కవిప్రియ మొదలైన గేయ నాటికలు వెలువడ్డాయి.

1920 లో వచ్చిన జాతీయోద్యమప్రభావంతో ప్రజా సమస్యలు తీసుకుని నాటకాలు వ్రాయడం మొదలు పెట్టారు. ప్రథమంగా రైతు జీవితాన్ని, కష్ట సుఖాలను చిత్రించే నాటకంగా సబ్నవీసు రామారావుగారు రచించిన రైతుబిడ్డ వెలువడింది.

ఆ తరువాత నాటక ప్రయోగంలో నూతన విధానాన్ని ప్రవేశపెట్టిన వేలూరి చంద్రశేఖరంగారి కాంచనమాల నాటకం 1939 లో వెలువడింది. బందరులో ప్రదర్శింపబడి కళాకారుల ప్రశంస లందుకుంది.

1930-40 సంవత్సరాలమధ్య ఈ దశాబ్దంలో వచ్చిన విషాద నాటకాలలో ప్రతాపరెడ్డిగారి ఉచ్చల ప్రాముఖ్యం వహించింది. అనువాద నాటకాలలో పురిపండా అప్పలస్వామిగారి ఉత్కలపతనం, 1931 శ్రీపాద కామేశ్వరరావుగారి కళాపహాడ్ ముఖ్యమైన నాటకాలు.

స్వతంత్ర నాటకాలలో చిలుకూరి నారాయణరావుగారి పౌరాణిక వచన నాటకం అంబ, కె. సుబ్రహ్మణ్యశాస్త్రిగారి భక్తకుచేల, చందాల కేశవదాసుగారి బలిబంధనం, ముత్తనేనివారి తులసీదేవి, ధర్మవరం గోపాలాచార్యులుగారి

సుభద్రార్జునీయం, ముత్తరాజుగారి మార్కండేయ, ఊటుకూరివారి పాషాణి బాల సరస్వతి భక్తతుకారాం మొదలైనవి ప్రసిద్ధిపొందిన పౌరాణిక నాటకాలు.

సాంఘిక నాటకాలలో గాలి బాలసుందరరావుగారి 'అపోహ', కాళ్ళకూరి హనుమంతరావుగారి 'కాలేజిగరల్', 'లేడి డాక్టర్' మొదలైనవి ప్రదర్శింపబడి ప్రముఖుల ప్రశంస లందుకున్నాయి.

చారిత్రక నాటకాల్లో గుండిమెడ వెంకట సుబ్బారావు. 'ఖిల్జీ రాజ్యపతనం' అనేకసార్లు ప్రదర్శింపబడి విమర్శకు గురైంది. వీరి 'మేవాడ పతనం' కూడా ఈ కాలంలోనే రచింపబడింది.

## నాటకరంగ చరిత్రలో నవ చైతన్యం :

ఆంధ్రనాటకరంగ చరిత్రలో 1943 నుండి ఒక నవచైతన్యం కలిగింది. ప్రపంచ మంతా ఫాసిస్టుల ప్రళయార్భాటాలతో మారుమ్రోగిపోతోంది. శాంతికి అశాంతికి, ధనికవర్గానికి పేదవర్గానికి సంఘర్షణ ప్రారంభమైంది. ఈ స్థితిలో సోషలిస్టు భావాలు గల యువకులందరూ యువజన సంఘాలద్వారా, వైజ్ఞానిక ప్రదర్శనలద్వారా ప్రజలను ప్రబోధించారు. ఈ ప్రబోధంతో వేలాది యువకులు కదిలారు. అభ్యుదయాన్ని కాంక్షించే రచయితలందరూ పాటలు, వీధినాటకాలు, బుర్రకథలు, జముకుల కథలు, నాటకాలు, నాటికలు వ్రాశారు.

దీనితో ఆంధ్రనాటక సాహిత్యం అభ్యుదయదశను అందుకుంది. ఈ దశలో జమీందారీ విధాన దుష్పలితాలను చిత్రిస్తూ సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావుగార్లు 'ముందడుగు' నాటకాన్ని 1946 లోనూ, మా భూమి నాటకాన్ని 1947 లోనూ రచించారు. మా భూమి నాటకం ఆనాటి నిజాంప్రభువు, అతని తాబేదార్ల యొక్క నిరంకుశత్వాన్నీ, దోపిడీ విధానాన్నీ చిత్రిస్తూ వెలువడింది. పై రెండు నాటకాలనూ ఆంధ్రదేశంలో అనేక ప్రజా నాట్యమండలి దళాలు ప్రదర్శించాయి. ఒక్క మా భూమినాటకం ఒక్క సంవత్సరంలో అఖిలాంధ్ర దేశంలో 125 ప్రజా నాట్యమండలి దళాలు వెయ్యి ప్రదర్శనాలను ప్రదర్శించాయి. 20 లక్షల మంది ప్రజలు నాటకాన్ని చూచి ఆనందించారు. రాజకీయనాయకులు, పండి-

తులు, మంత్రులు, గాయకులు, కవులు ఎంతగానో ప్రశంసించారు. చివరికి ఈ నాటకం రాజకీయ కారణాలవల్ల 1948 లో నిషేధింపబడింది. ఈ రచయితలదే 'అపనింద' సాంఘిక నాటకం కూడా ఆదరణ పొందింది.

తీరుతీరుల

తెలుగు నాటకాలు :

ఇదేసమయంలో కొండముదిగోపాలరాయశర్మగారి 'ఎదురీత' 1946 లో వెలువడి నాటక కళాపరిషత్తులో ప్రథమ బహుమతినందడమేగాక, ఆంధ్రదేశపు ముఖ్య కేంద్రాలలో ప్రదర్శింపబడింది. 1946 లో వేదాంతకవిగారి 'ఆకలిమంటలు', బోయి భీమన్నగారి 'పాలేరు' పలుచోట్ల ప్రదర్శింపబడి ప్రజామన్ననలు అందుకున్నాయి.

భారతదేశానికి 1947 లో స్వాతంత్ర్యం సిద్ధించాక, దేశంలో హిందూ, ముస్లిం కలహాలురావడంతో ఐక్యతను ప్రతిబింబిస్తూ వచ్చిన నాటకాలు ఆత్రేయ గారి ఈనాడు, గోపాలరాయశర్మగారి 'ఏకదేశం' 1947 ముఖ్యమైనవి.

ఈకాలంలో వృత్తి నాటక సంఘాలద్వారా విరివిగా ప్రదర్శింపబడి పేరు తెచ్చుకున్న నాటకాలు తాండ్ర సుబ్రహ్మణ్యంగారి 'రామాంజనేయ యుద్ధం', కొప్పరపు సుబ్బారావుగారి 'తారాశశాంకం' ముఖ్యమైనవి.

పాత ఇతివృత్తాలను తీసుకుని, పాత్ర చిత్రణలో నూతన విధానాన్ని ప్రవేశపెట్టిన ఊటుకూరి సత్యనారాయణగారి 'ద్రౌపది' 'శివాజి' 'అనార్కలి' 'వీరాభిమన్యు' వెలువడి ప్రదర్శింపబడి పలువురి ప్రశంసలందుకున్నాయి. ఇదేవిధానంలో నండూరి కృష్ణమాచార్యులుగారు 'ధర్మచక్రం' 'శేషుబాబు' 'తిష్యరక్షిత' రమణీయంగా రచించారు. ఈకాలంలో ఎన్నదగిన పౌరాణిక నాటకం పైడిపాటివారి 'ఉషాసుందరి'.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మన పూర్వుల శౌర్యపరాక్రమాలను వివరిస్తూ 1948 లో కణ్వశ్రీగారు 'ఆనాడు' అనే నాటకాన్ని వ్రాసి స్వయంగా ప్రదర్శింపజేసి ప్రశంసలందుకున్నారు.

ఈకాలంలో వెలువడ్డ డి.వి. కృష్ణమూర్తిగారి 'విషాద తిమ్మరుసు', శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి 'రాజరాజు' వుత్తమశ్రేణికి చెందిన విషాద నాటకాలు.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కాని, ఆంధ్రుల చిరకాలవాంఛ ఆంధ్రరాష్ట్రం మాత్రం అవతరించలేదు. తెలుగు వారికి తెలుగు రాష్ట్రం రావాలనే ఆవేశంలో, వేదాంతకవిగారి 'తెలుగు తల్లి',వావిలాల సోమయాజులుగారి 'నాయకురాలు', గుళ్ళపల్లి నారాయణమూర్తిగారి'ఆంధ్రజ్యోతి', రాయప్రోలు సుబ్రహ్మణ్యంగారి 'కొండవీడు' మొదలైన నాటకాలను అనేక సమాజాలు ప్రదర్శించి, ఆంధ్రుల నుత్తేజపర్చాయి.

ఈకాలంలో అమెచూరు నాటక దళాలు ముద్దుకృష్ణగారి 'టీకప్పులో తుఫాను' 'అడయిక్కపిళ్ళై', భమిడిపాటివారి 'పెళ్ళి బ్రైనింగు' 'పెళ్ళికంట్రోలు' 'పూర్వరంగం' 'మాయలోకం' మొదలైన నాటకాలు ప్రదర్శింపబడి ప్రజలకు వినోదం కలిగించాయి.

ఆంధ్రనాటక కళాపరిషత్తు స్థాపించబడి, సాంఘిక నాటక నాటికల, పోటీ ప్రదర్శనాలను పరిషత్తు నడిపింది. పరిషత్తు ఇచ్చిన ఈ వుత్సాహంతో అనేక మంది రచయితలు సాంఘిక నాటకాలను ఎంతో కట్టుదిట్టంగా వ్రాయడానికి పూనుకున్నారు. ఈ విధంగా ప్రతి సంవత్సరం అనేక నాటకాలు వెలువడ్డాయి.

పరిషత్తు నాటకాల్లో 1947 లో కొండముదిగోపాలరాయశర్మగారి 'ఎదురీత' నాటకం గొప్ప పేరు తెచ్చుకుంది. ఈ సమయంలో గోపాలరాయశర్మగారు నాటక కళమీద వ్యాసాలు వ్రాసి, ఆంధ్రప్రభలో పరంపరగా ప్రకటించారు. 'గౌతమ బుద్ధుని' జీవితాన్ని చిత్రిస్తూ ఆచార్య ఆత్రేయ, కొండముదిగోపాలరాయశర్మ 'గౌతమబుద్ధ' నాటకాలను ప్రశంసనీయంగా రచించారు. కొండముదివారి 'న్యాయం' కూడా ఈకాలంలో వెలువడిందే.

ఈ దశాబ్దంలో ప్రపంచ ఖ్యాతిగాంచిన ఇంగ్లీషు నాటకాలు తెలుగు అనుకరణతో అనేకం వచ్చాయి. వాటిలో ముఖ్యమైనవి కొప్పరపు సుబ్బారావుగారి 'ఇనుపతెరలు' శ్రీ శ్రీ వరదల సంపెంగతోట అవసరాల వెంకటనర్సు 'జ్యోతిర్మయి' ముప్పన చినఅంకయ్యకుళ్ళుసరుకు, సోమంచి యజ్ఞన్నశాస్త్రిగారి 'కళ్యాణి' విద్వాన్ విశ్వంగారి 'ప్రజావిరోధి' గౌతమ 'మేడిపళ్ళు' ముఖ్యమైనవి. వీటిలో

కొప్పరపు సుబ్బారావుగారి 'ఇనుపతెరలు' నిర్మాణాత్మకంగా ఎక్కువ ప్రశంస లందుకుంది.

పతనమైన స్త్రీల ఇతివృత్తంతో పిఠాపురం యువరాజాగారు తీరనికోరికలు అనే నాటకం వ్రాశారు. ఈ దశలోనే మల్లాది అచ్యుతరామశాస్త్రిగారి సతీసక్కుబాయి, గుండిమెడవారి 'పృథ్వీపుత్ర' కోటగిరి వెంకటకృష్ణారావుగారి 'అభినవ పాండవం' బెబ్బులి, కాజరాధాకృష్ణశాస్త్రి 'అమరజ్యోతి', జంపనవారి 'వెంకటేశ్వర మాహత్మ్యం' నాటకాలు ప్రసిద్ధిపొందాయి. వీటిలో సక్కుబాయి, వెంకటేశ్వర మాహాత్మ్యం విరివిగా ప్రదర్శింపబడ్డాయి.

1940 నుండి 50 వరకూ వచ్చిన నాటకాలలో ఆత్రేయగారి యన్. జి. ఓ. 'అశోకసామ్రాట్' 'విశ్వశాంతి' 'ప్రగతి' 'భయం' 'కప్పలు' మొదలైన నాటకాలు ఆంధ్రప్రజలలో ఎక్కువ సంచలనాన్ని కలిగించాయి.

1953 లో తెలంగాణా దేశముఖుల హింసాకాండను చిత్రిస్తూ వాసిరెడ్డి భాస్కరరావు వ్రాసిన పోతుగడ్డ నాటకం కూడ మంచి ప్రచారం పొందింది. ఈ కాలంలోనే బెల్లంకొండ రామదాసుగారి 'అతిథి' నాటకం వెలువడింది.

ఈ తరుణంలో బంజరుభూముల పోరాటాన్ని చిత్రిస్తూ సుంకర 'భూమి కోసం', కె. వి. రమణారెడ్డి. పి. వేణుగాళ్ల 'అన్నపూర్ణ' నాటకాలు వెలువడ్డాయి. ఈ కాలంలో పినిసెట్టి శ్రీరామమూర్తిగారి 'పల్లెపడుచు' 'అన్నా చెల్లెలు', మల్లాది సత్యనారాయణగారి 'పేదపిల్ల' నాటకాలు ఆంధ్రదేశమంతటా ప్రదర్శింపబడి అధిక ప్రశంస లందుకున్నాయి. ఈ కోవకుచెందినవే కొడాలి గోపాలరావుగారి 'తిరుగు బాటు' బిల్లా ఈశ్వరుడుగారి 'నేటి న్యాయం' పడాలి రామారావుగారి 'భూదేవి' కోడూరు అచ్చయ్యగారి 'పెత్తందారు' కణ్వశ్రీ 'ఇదా ప్రపంచం' భూషణ్ బాబు 'స్వతంత్రభేరి' సోమసుందర్ మందీ-మనిషి, లక్ష్మీకాంత మోహన్ సమ్మోపిలుపు. నవకుమార్ 'ప్రజా విజయం' మొదలైన ప్రజా సమస్యలను చిత్రించే సామాజిక నాటకాలు వెలువడ్డాయి.

అనిసెట్టి సుబ్బారావుగారు గ్రామాలలోని ముఠాతత్వాలనూ, అన్యాయాలనూ చిత్రిస్తూ ఆ అన్యాయాల వత్తిడిలో నలిగిపోయిన బడిపంతులు జీవితాన్ని ప్రతిబింబింపజేస్తూ 1954 లో మా వూరు నాటకాన్ని రచించారు.

గ్రామపంచాయితీ, మున్సిపాలిటీ రాజకీయాల్లోని వివిధ తరహాల మనస్తత్వాలకు చెందిన కౌన్సిలర్లనూ, ప్రెసిడెంట్లనూ చిత్రిస్తూ, స్వార్థం కొద్దీ వారు చేసే దురన్యాయాలను చిత్రిస్తూ కొడాలి గోపాలరావు 'ఛైర్‌మన్' నాటకం, కొండేటి సుబ్రహ్మణ్యంగారి 'ప్రెసిడెంటు పట్టయ్య' నాటకం వెలువడ్డాయి.

ఈ కాలంలో ధనికవర్గాన్ని, భూస్వామ్యవర్గాన్ని చిత్రించే నాటకాలేకాక, పెట్టుబడిదారీ వర్గంచే పీడింపబడే కార్మికుల జీవితాలను చిత్రిస్తూ, బోయి భీమన్న గారు 'కూలిరాజు' నాటకాన్ని కొడాలి గోపాలరావుగారు 'కూలినాటకాన్ని' పడాల రామారావు 'నేతబడ్డ నాటకాన్ని రచించారు. ఈ తరహా నాటకాలు దేశంలో విరివిగా ప్రదర్శింపబడి ప్రజల మన్ననలుపొందాయి.

స్వాతంత్ర్యానంతరం దేశ రాజకీయ సాంఘిక పరిస్థితుల వాస్తవాన్ని చిత్రిస్తూ ఆశాభంగం చెందిన ప్రజలకు కనువిప్పుగా ఆచార్య ఆత్రేయ 1952 లో వాస్తవం, నాటకాన్ని పడాల రామారావు 1953 లో ఇదా స్వతంత్రం అనే నాటకాన్ని వెలువరించారు. ప్రణాళికా యుగంలో, గ్రామపంచాయితీల పరిపాలనతో ఉద్ధరింపబడిన గ్రామోద్ధరణను చిత్రిస్తూ ప్రచారయోగ్యమైన నాటకాలు వెలువడ్డాయి. వాటిలో ముఖ్యమైనవి 1950 లో కె. యల్. నరసింహారావు రచించిన 'కొత్తగుడి' 'అడుగుజాడలు' 1956 లో వెలువడిన పసుమర్తి యజ్ఞనారాయణ శాస్త్రిగారి 'గ్రామసేవ' పైడిపాటి సుబ్బరాయశాస్త్రిగారి 'అంకితం' నండూరి సుబ్బారావుగారి 'గ్రామసేవక్' కొట్టపాటి గంగాధరరావుగారి 'అందరి ఆనందం' కావ్యశ్రీ 'కలెక్టరు' ముఖ్యమైనవి.

పాశ్చాత్య నాటకాన్ని ఆధారం చేసుకుని 1951 లో డి. వి. నరసరాజు గారు 'నాటకం' అనే నాటకాన్ని వుత్తమంగా రచించారు. ఈ నాటకం ఔత్సాహిక నాటక సమాజాలకు ఎంతో వుత్సాహాన్నిచ్చింది.

నాటకంలో జీవించి, జీవితంలో నటించే ఒకానొక మానవుని అయోమయ అవస్థను చిత్రిస్తూ ప్రఖ్యా శ్రీరామమూర్తిగారు 'మనిషిలో మనిషి' నాటకాన్ని 1962 లో రచించారు.

మానవునికి మానవునికి మధ్యవుండే అగాధాలను చిత్రిస్తూను, ఆ నీలితెరల

తొలగించుకుంటే శాంతి లభిస్తుందనే ఇతివృత్తాన్ని తీసుకుని అంగర సూర్యారావు గారు 'నీలితెరలు' నాటకాన్ని రచించారు.

ధనపిశాచం ఆవహించిన మానవులు దానవులుగా తయారవుతారనే సత్యాన్ని 'లంకెబిందెలు' 'దొంగవీరడు' నాటకాలలో కొడాలి గోపాలరావుగారు చిత్రించారు.

స్త్రీ పాత్రలు లేని నాటికలు, హాస్య నాటికలు, నాటకాలు, గంభీరమైన ఇతివృత్తాలతో వివిధరకాల సాంఘిక నాటకాలను కొడాలి గోపాలరావు, కొర్రపాటి గంగాధరరావుగార్లు రచించారు. వీరి నాటకాలు జనరంజకాలు. ఆంధ్రదేశంలో అనేక సమాజాలు వీరి నాటకాలను ఉత్సాహంతో ప్రదర్శిస్తున్నారు.

స్వప్నజగత్తులో మానవునికి కలిగే తీరనికోరికలను చిత్రిస్తూ కొత్త పద్ధతిలో అనిసెట్టి సుబ్బారావుగారు 'గాలిమేడలు' నాటకాన్ని, శ్రీవాత్సవ తీరనికోరికలు అనే నాటకాన్ని రచించారు.

విధివశాన ఒక పిల్ల చెడిపోతే ఆమెకు భవిష్యత్తులేదా? బాగుపడడానికి అవకాశాలేలేవా? అలా కృంగి కృశించిపోవలసిందేనా? అనే ప్రశ్నకు సంబంధించిన వివిధ మనస్తత్వాలు గల యువతీ యువకుల నాధారంగా తీసుకుని 1956 లో 'పునర్జన్మ' నాటకాన్ని బెల్లంకొండ రామదాసుగారు, 'పంజరం' నాటకాన్ని అవసరాల సూర్యారావుగారు, 1959 లో పి. వి. రాజమన్నారుగారు 'మనోరమ' నాటకాన్ని రచించారు. ఈ మూడు నాటకాల్లో 'పునర్జన్మ' 'పంజరం' అనే నాటకాలు పరిషత్తు పోటీలలో ప్రదర్శింపబడి బహుమతుల నందుకున్నాయి.

కణ్వశ్రీ, బి. యన్. సూరి, మందపాటి సీతంరాజు మొదలైనవారు అధిక సంఖ్యలో నాటకాలను రచించారు.

ముఖ్యంగా సీతంరాజువారి నాటకాలు పల్లెల్లో విరివిగా ప్రదర్శిస్తున్నారు. వీరి నాటకాలలో ముఖ్యమైనవి 'పేదపడుచు' 'పేదపిల్ల' 'దోపిడి' 'ప్రతిఫలం' మొదలైనవి.

స్వాతంత్ర్య సమరంలో ఆంధ్రదేశంలో వీరులుగా కీర్తించబడ్డ వారి జీవితాలను ప్రతిబింబిస్తూ బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడ లాడించిన అల్లూరి సీతారామరాజు వీరగాథను 'పితూరి' పేరుతో పడాల రామారావుగారు, 'మన్యవిప్లవజ్వాల' పేరుతో భూమిపాళ సూర్యనారాయణమూర్తి, అల్లూరి సీతారామరాజు పేరుతో గబ్బిట వెంకటరావు, ఆకుల సుబ్రహ్మణ్యం మొదలైనవారు నాటకాలను రచించారు.

పూర్వాంధ్రుల శౌర్య పరాక్రమాలను చిత్రిస్తూ పెమ్మరాజు గోపాలకృష్ణమూర్తిగారు'నాగమనాయకుడు''వీరకాపయ''వీరపాండ్య కట్టబ్రహ్మన' నాటకాలను, నండూరి బంగారయ్యగారు 'ఆంధ్రతేజాన్ని', కన్నసామి మహా రుద్రీయ నాటకాన్ని రచించారు.

కవి బ్రతికుండగా ఆయనను గౌరవించలేని వ్యక్తులు, ఆయన బ్రతకడని తెలిసి ఆయన మరణం ద్వారా కీర్తిని ఆర్జించాలనే వ్యక్తుల మనస్తత్వాన్ని చిత్రిస్తూ భమిడిపాటి రాధాకృష్ణ 'కీర్తిశేషులు' నాటకంలో నేటి కవుల దుర్భరజీవితాలను చిత్రించారు.

ఇంకా కుందుర్తి ఆంజనేయులుగారు ఆశనాటకాన్ని, కట్టుపాటి గంగాధర రావుగారు గుడ్డిలోకాన్ని, రవీంద్రుని శతజయంతి వుత్సవాలను పురస్కరించుకుని బెజవాడ గోపాలరెడ్డి, అబ్బూరు రామకృష్ణరావు, శ్రీనివాస చక్రవర్తిగార్లు రవీంద్ర నాటకాలను అనువాదం చేశారు. చలన చిత్ర దర్శకుడు జగన్నాధ్‌గారు అనేక మహారాష్ట్ర నాటకాలను అనువదించారు.

వ్యాపారంలో భాగస్వామిని మోసంచేసి అతని ఆకలిచావుకు కారణమైన మార్వాడీ సేటును అతని ధనాశను ఆధారం చేసుకుని మరణించిన భాగస్వామి కుమారుడు మాస్టర్జీవంచించి, ఆతని ధనమంతా అపహరించి హత్యచేసిన గాథను 'మాస్టర్జీ' నాటకంగా బెల్లంకొండ రామదాసుగారు రచించారు. ఈ నాటకం అనేక చోట్ల ప్రదర్శింపబడి అనేకమంది ప్రశంస లందుకుంది.

అపరాధ పరిశోధక నవలలవ్యాప్తి కారణంగా అపరాధ పరిశోధక నాటకాలు కూడా వెలువడ్డాయి. ఈ కోవకుచెందినవి ప్రఖ్యా శ్రీరామమూర్తిగారి కాళరాత్రి,

ఫణి మొదలైనవి. ఇవి పాశ్చాత్య నాటకాలకు అనువాదాలు. ఈ నాటకాలు కూడ ప్రేక్షకుల ప్రశంస లందుకున్నాయి.

ఇతరదేశ రచయితల నాటకాలకు అనువాదంగా భమిడిపాటి కామేశ్వర రావుగారు మోలేర్, షేరిదాన్ నాటకాలను, సోమంచి యజ్ఞన్న శాస్త్రిగారు, విశ్వం పెళ్ళి, న్యాయం నాటకాలను, శివంగారి 'నేరమూ-శిక్ష' 'వారసురాలు' డి. వి. నరసరాజు, రెంటాల, బెల్లంకొండ, గిడుతూరి, సోమంచి మొదలైనవారు 'ఇన్ స్పెక్టర్ జనరల్ నాటకాన్ని, ముద్దుకృష్ణ 'ఆడవాళ్ళ తెలివి', మారుతీరావు 'రాగ రాగిణి 'కొట్టపాటి విషకుంభాలు' ఏ. యస్. అవధాని 'ఆదర్శాలు' శ్రీనివాస చక్రవర్తి 'నీటికాకి' 'పతితజీవులు' 'త్రైత్రయాత్ర' కోడూరు అచ్చయ్య 'తప్పునాదే' విద్వాన్ విశ్వం మహాశిల్పి దండమూడి మహీధర్ 'చంద్రయ్యలో చైతన్యం' జోగిరాజుగారి 'అనామకులు' వి. యన్. శర్మగారి ఫౌస్ట్, వావిలాల, అమరేంద్ర, దుర్భా రామమూర్తి, లక్ష్మీకాంత మోహన్‌గార్లు షేక్స్పియర్ అనువాద నాటకాలు ఉపాధ్యాయుల సూర్యనారాయణమూర్తిగారి 'పంకజాక్షి' పి. వి. ఆచార్, ఆపద్బాంధవులు మొదలైనవి ముఖ్యమైన అనువాద నాటకాలు.

పైన వుదాహరించిన అనువాద నాటకాలే కాక, సమాజంలోవున్న వివిధ సాంఘిక సమస్యలను చిత్రిస్తూ బుచ్చి బాబుగారి 'ఆత్మవంచన', చలంగారి జయదేవ, పురూరవ, బోయి భీమన్నగారి రాగవాశిష్ఠం, నాగభూషణ్ 'విషాదాంతం' ముప్పన చినఅంకయ్య 'శిథిలాలయం' మాడభూషి వెంకటాచారి 'ప్రభ' గన్నిసెట్టి 'శారద' మొదలైన నాటకాలు ప్రేమతత్వాన్ని చిత్రించే నాటకాలుగా వెలువడ్డాయి.

వివాహ సమస్యను ప్రత్యేకంగా తీసుకుని చిత్రించే నాటకాల్లో పినిసెట్టి 'కులంలేనిపిల్ల' 'కన్నికొడుకు' భమిడిపాటి రాధాకృష్ణ 'ఇదేమిటి?' రాం షా 'లక్ష్మి పతిగారి అమ్మాయిలు', గన్నిసెట్టి భలేపెళ్ళి, మునిమాణిక్యం గృహప్రవేశం యజ్ఞన్నశాస్త్రిగారి కట్నంలేని కళ్యాణం మొదలైన నాటకాలు వెలువడ్డాయి. వీటిలో ఎక్కువగా ప్రదర్శించబడిన నాటకాలు'కులంలేనిపిల్ల' 'ఇదేమిటి' 'భలేపెళ్ళి' మొదలైనవి.

ఆంధ్రనాటక రంగంలో, ముఖ్యంగా సాంఘిక నాటకాల్లో రక్తకన్నీరు నాటకం ఒక విశిష్టస్థానాన్ని సంపాదించుకుంది. తమిళ నాటకానికి అనువాదంగా

# ప్రసిద్ధ నాటక రచయితలు



శ్రీ వాసిరెడ్డి భాస్కరరావు



శ్రీ సుంకర సత్యనారాయణ



శ్రీ అనిసెట్టి సుబ్బారావు



352 A

# ప్రసిద్ధ నాటక రచయితలు



శ్రీ కొడాలి గోపాలరావు



శ్రీ అబ్బూరు రామకృష్ణరావు



శ్రీ రోహిణి

3528

# ప్రసిద్ధ నాటక రచయితలు



శ్రీ శ్రీనివాసచక్రవర్తి



శ్రీ విడియాల చంద్రశేఖరరావు



శ్రీ పులుగుండ్ల రామకృష్ణయ్య

K5218

# ప్రసిద్ధ నాటక రచయితలు

★



శ్రీ ఆరుద్ర



శ్రీ వేదం వేంకటరాయశాస్త్రి



శ్రీ గుండిమెడ వెంకటసుబ్బారావు

★

3820

# ప్రసిద్ధ కళా పోషకులు



శ్రీ వి. టి. రామానుజులు
(హార్మోనిస్టు)



శ్రీ కోట రామబ్రహ్మం



శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి



శ్రీ తాపీ ధర్మారావునాయుడు

3521

# ప్రసిద్ధ కళా పోషకులు



శ్రీ కొత్తపల్లి లక్ష్మయ్య



శ్రీ త్రిపురనేని శివప్రసాదరావు



శ్రీ వేమూరి ఆంజనేయశర్మ



శ్రీ బొబ్బిలిరాజా

352 F

# ప్రసిద్ధ కళా పోషకులు



శ్రీ తూములూరు శివరామయ్య



శ్రీ గూడవల్లి రామబ్రహ్మం

★



శ్రీ పురాణం సూరిశాస్త్రి



శ్రీ ఆర్. బి. రామకృష్ణరాజు

352G

# ప్రసిద్ధ కళా పోషకులు



శ్రీ బెజవాడ గోపాలరెడ్డి



శ్రీ దివాకర్ల వెంకటావధాని



శ్రీ పోలవరపు సూర్యప్రకాశరావు



శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి

3823 W

# ప్రసిద్ధ కళా పోషకులు



శ్రీ కాజ వెంకటరామయ్య



శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి



శ్రీ కడారు నాగభూషణం



శ్రీ ఎట్టోజు మాధవాచార్యులు



3521

# ప్రసిద్ధ కథా పోషకులు



శ్రీ పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రి
(నటప్రకాశిక గ్రంథకర్త)



శ్రీ మైలవరం రాజా



శ్రీ బుర్రా శేషగిరిరావు



శ్రీ సత్యవోలు గున్నేశ్వరరావు

# ప్రసిద్ధ కళా పోషకులు



శ్రీ దుక్కిపాటి మధుసూధనరావు



శ్రీ పసల
సూర్యచంద్రరావు
(ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక
అకాడమి అధ్యక్షులు)



శ్రీ సి. మోహన్‌దాసు
(ప్రజానాట్యమండలి సంగీత దర్శకులు)

352 k

# ప్రసిద్ధ కథా పోషకులు



శ్రీ ఆచంట వెంకటసాంఖ్యాయనశర్మ



శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ



శ్రీ మోతే నారాయణరావు

3581

# ప్రసిద్ధ కళా పోషకులు



శ్రీ పి. యస్. ఆర్. అప్పారావు
(తెలుగు నాటక వికాసము గ్రంథకర్త)



శ్రీ బి. టి. రాఘవాచార్యులు



శ్రీ విక్రమ దేవవర్మ (జైపూర్ రాజా)

352M

# ప్రసిద్ధ కథా పోషకులు



శ్రీ పి. వి. రాజమన్నారు



శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డి



శ్రీ సుంకర కనకారావు

352N

# ప్రసిద్ధ కళా పోషకులు



శ్రీ టి. చలపతిరావు
(ప్రజా నాట్యమండలి సంగీత దర్శకులు)



శ్రీ నందమూరి త్రివిక్రమరావు



శ్రీ ఇమ్మానేని హనుమంతరావు నాయుడు



శ్రీ కూర్మా వేణుగోపాలస్వామి

# ప్రసిద్ధ కళా పోషకులు



శ్రీ గిడుగు సీతాపతి



శ్రీ గద్దె రంగయ్యనాయుడు



శ్రీ పిఠాపురం రాజా

3529

పద్మరాజుగారు రచించారు. పి. నాగభూషణంగారు ఈ నాటకాన్ని కొన్నివందలసార్లు ప్రదర్శించారు. మల్లాది విశ్వనాధశర్మ (విశ్వనాథ కవిరాజు) మల్లాది వెంకటకృష్ణ శర్మ సోదరులు అనేక నాటకాలను రచించారు. వీరి నాటకాలు చాలవరకు సురభి నాటక సమాజాలవారు ప్రదర్శించారు.

ఎప్పుడు సంపదగలిగిన....కప్పలు పదివేలుచేరు అనే వృత్తాన్ననుసరించి ఆచార్య ఆత్రేయగారి 'కప్పలు', పినిసెట్టి 'ఆత్మీయులు' నాటకాలు వెలువడ్డాయి.

పల్లెటూరి జీవితాన్ని చిత్రిస్తూ వెలువడిన దాసం గోపాలకృష్ణగారి 'చిల్లర కొట్టు చిట్టెమ్మ' నాటకం పలుచోట్ల ప్రదర్శింపబడి ప్రశంస లందుకుంది.

కోర్టుల్లో నిజాన్ని అబద్ధంగానూ, అబద్ధాన్ని నిజంగానూ చిత్రించే నాటకంగా రాచకొండ విశ్వనాధశాస్త్రిగారి 'నిజం' నాటకం వెలువడింది.

ఒక వ్యక్తి మరణానికి నేను కారణమంటే నేను కారణమని భావించుకుని వాదించే ఇరువురు వ్యక్తుల మనస్తత్వాన్ని పోతుకూచి సాంబశివరావుగారు 'హంతకులు' అనే నాటకంలో వివరించారు.

ఈ విధంగా గత నూరు సంవత్సరాలలోనూ, ఆంధ్రనాటకరంగానికి అనేక మంది నాటక రచయితలు దాదాపు మూడువేల నాటకాలను వ్రాశారు. వీటిలో రంగ స్థలంమీద ప్రదర్శింపబడిన నాటకాలు చాలా తక్కువ.

ప్రదర్శన యోగ్యమైన

**నాటకాలు :**

ముఖ్యంగా ప్రదర్శన యోగ్యమైన నాటకాలను వ్రాసిన వారిలో కాశీనాథుని వీరమల్లయ్య, పామర్తి బుచ్చిరాజు, ఓలేటి పార్వతీశ్వరకవి, ద్రోణం రాజు సీతారామారావు, సోమరాజు రామానుజరావు, బద్ది రెడ్డి కోటేశ్వరరావు, గూడూరు కోటేశ్వరరావు, చక్రావధానుల మాణిక్యశర్మ, ముత్తనేని వేంకట చన్నకేశవులు, బేతపూడి లక్ష్మీకాంతం, అవసరాల శేషగిరిరావు, అయినాపురపు సోమేశ్వరరావు, ఆవటపల్లి హనుమంతరావు, మద్దులపల్లి గురుబ్రహ్మం, గూడ

కృష్ణయ్య, పామర్తి బుచ్చిరాజు, ఆకెళ్ళ సత్యనారాయణ, విష్ణుభొట్ల సుబ్రహ్మణ్యేశ్వరుడు, రామనారాయణకవులు, భోగరాజు నారాయణమూర్తి, త్యాడి వేంకట శాస్త్రి, అయినాపురపు సుందరరామయ్య, చందాల కేశవదాసు, శ్రీరాం వీరబ్రహ్మం, వెంపటి వేంకటనారాయణ, జానపాటి పట్టాభిరామశాస్త్రి, కొండపల్లి లక్ష్మణపెరుమాళ్ళు మొదలైనవారు అనేక నాటకాలను రచించారు. వీరిలో ఒక్కొక్కరు 20 నాటకాలను వ్రాసినవారు కూడా వున్నారని శ్రీ పి. యస్. ఆర్. అప్పారావు గారు తమ తెలుగు నాటకవికాసంలో తెలియజేశారు.

పైన వుదాహరించిన నాటక రచయితలలో శ్రీయుతులు సీతారామారావు, మాణిక్యశర్మ రామానుజరావు, రామనారాయణకవులు, సుందరరామయ్య మొదలైనవారు ప్రతి ఒక్కరూ ఇరవై నాటకాలకుపైగా వ్రాశారు. రాజమండ్రి వాస్తవ్యులైన సీతారామారావుగారు గున్నేశ్వరరావుగారి నాటక సమాజాలకు, బందరు నాటక సమాజాలకు 1913 ప్రాంతాల్లో దాదాపు ముప్పై నాటకాలను రచించారు. ప్రసిద్ధికెక్కిన వీరి నాటకాలు 'విజయబొబ్బిలి' 'పీష్వా నారాయణరావు' 'సారంగధర' 'చతుర చంద్రహాస' మొదలైనవి.

నర్సాపురానికి చెందిన మాణిక్యశర్మగారు దేశీయ నాటక గ్రంథమాలను స్థాపించి, 'సావిత్రి' 'బిల్వమంగళ' 'చంద్రకాంత' 'సంగీత సత్యవిజయం' మొదలైన నాటకాలను వ్రాశారు.

భద్రాచల వాస్తవ్యులైన సోమరాజు రామానుజరావుగారి నాటకాల్లో చెప్పదగినవి 'కాళిదాసు' 'దానవీర' 'సక్కుబాయి' 'ధరణికోట' 'కర్ణ' 'తాజ్‌మహల్' 'రంగూన్‌రౌడీ' మొదలైనవి.

కొమరిపాలెంకు చెందిన సుందరరామయ్యగారు పార్శీ నాటకాలను ఎక్కువగా అనువదించారు. అవి 'లాల్‌గోహర్' (జయచంద్రరేఖావిజయం) 'మువ్వజ్రి' 'గూల్బకావళి'. వీరు 'ప్రతిజ్ఞాపాండవం' 'ఊర్వశీ శాపవిమోచనం' 'ప్రతిజ్ఞాయాదవం' 'గర్వభంగము' మొదలైన పౌరాణిక నాటకాలను కూడ రచించారు.

బెజవాడ హిందూ థియేటరు స్థాపకుల్లో ఒకరైన కాశీనాథుని వీరమల్లయ్య అనేక పద్య నాటకాలను వ్రాశారు. వాటిలో 'సారంగధర' 'కుశలవ' 'స్త్రీసాహసం'

'సత్యహరిశ్చంద్ర' 'ఉషాపరిణయం' 'తారాచంద్రీయం' 'లంకాదహనం' 'జయ పాలీయం' మొదలైనవి.

కార్వేటినగరం హార్డింజి నాటక సభవారికొరకు గుండు చంద్రమౌళిగారు 'శమంతకవిజయం' 'దేశింగురాజు చరిత్ర' మొదలైన రంగస్థల నాటకాలను రచించారు.

ఆ రోజుల్లో రాజమండ్రి హిందూ నాటక సమాజంవారు చందాల కేశవదాసు గారి 'కనకతార'ను అద్భుతంగా ప్రదర్శించేవారు.

ముత్తనేని చన్నకేశవులుగారి 'చండిక' 'శశిరేఖాపరిణయం' ప్రసిద్ధిగన్న నాటకాలు.

భోగరాజు నారాయణమూర్తి 'లలితాంగి' 'ఉషాపరిణయం' తిరునారాయణ స్వామి 'దుర్గావతి' బుచ్చిరాజుగారి సంగీత నాటకాలైన 'జగన్మోహిని' 'పద్మిని' పట్టాభిరామశాస్త్రిగారి 'కంసవధ' లక్ష్మణపెరుమాళ్ళుగారి 'హోల్డీఘాటుయుద్ధము' దేవగుప్తాపు భరద్వాజంగారి 'శర్మిష్ఠావిజయం' గాడేపల్లి సూర్యనారాయణశర్మగారి 'సంగీత సైంధవార్జునము' బేతపూడివారి 'సుభద్రాపరిణయం' త్యాడి వెంకటశాస్త్రి గారి 'ససేమిరా' 'మదాలసీయము' 'మదనమోహిని' ఆకెళ్ళవారి 'జయంత జయ పాల' వీరబ్రహ్మంగారి 'రత్నమాల' గూడ కృష్ణయ్యగారి 'సంగీతశాకుంతలము' శేషగిరిరావుగారి 'సంయుక్త విభీషణ పట్టాభిషేకం' భువనగిరి బుచ్చి పరదేశి సోమ యాజిగారి 'సౌగంధిక పుష్పాపహరణము' విష్ణభొట్లవారి 'కుశలవ' 'సారంగధర' గురుబ్రహ్మంగారి 'శృంగార చంద్రహాస' సోమేశ్వరరావుగారి 'సతీ అనసూయ' బసవరాజు సీతారామారావుగారి 'సాత్రాజితీపరిణయం' బద్దిరెడ్డివారి 'బాలచంద్ర ప్రతాపం' గూడూరు రామనారాయణకవుల 'పాండవ నాటకాలు' అహల్యాశాప విమోచనం మొదలైనవి పేర్కొనదగిన నాటకాలు.

అంతేకాక, బందరు వాస్తవ్యులైన పింగళి నర్సయ్యగారి 'మార్కండేయ' ప్రజామన్ననలు అందుకున్న నాటకం.

ఆనాడు మద్రాసునగరంలో సుగుణవిలాస సభ ప్రఖ్యాతిగన్న నాటక

సమాజం. ఆ సమాజంలో నాటక ప్రయోక్తగా పేరెన్నికగన్న వేదం వేంకటాచల అయ్యగారు ప్రథమంగా అనువదించిన మోలియర్ నాటకాల్లో ప్రసిద్ధి గాంచిన నాటకం 'విధిలేక వైద్యుడు'. ఆ తరువాత 'నందుని చరిత్రం' అనే నాటకాన్ని కూడా రచించారు.

కిర్లంపూడి సంస్థాన పండితులైన సత్యవోలు కామేశ్వరరావుగారి 'రతి మన్మథ నాటకం' 'కాదంబరి' చెప్పదగిన నాటకాలు.

జనమంచి శేషాద్రిశర్మగారి 'సీతాస్వయవరం' చిల్లరిగె శ్రీనివాసరావుగారి 'పుళిందాసుశీలము' ముదిగొండ నాగవీరయ్యశాస్త్రిగారి 'సుభద్రాకల్యాణము' రెంటాల వేంకట సుబ్బారావుగారి 'అఖిలబింబం' కస్తూరి సుబ్బారావు 'శకుంతలాదుష్యంతం' దంటు సుబ్బావధానిగారి 'చిత్రమాధవము', గ్రంథి సుబ్బరాయగుప్తగారి 'సుజ్ఞాన పరిణయము' 'ఆంధ్రమాతలు' మొదలైన నాటకాలు కూడ రచనలో పేర్కొన దగినవి.

తణికెళ్ల పూర్ణయ్యపంతులుగారి 'ప్రసన్న పాంచాలీయము' 'రాణీసంయుక్త' ఆర్. మదనగోపాల్‌నాయుడిగారి 'లంకాదహనము' భమిడిపాటి చినయజ్ఞ నారాయణ శర్మగారి 'దుర్యోధన పరాజయం''నందవధము' వల్లూరి బాపిరాజుగారి 'సుగుణమణి' మొదలైన నాటకాలు రచనలోనూ, మరికొన్ని ప్రయోగంలోనూ ప్రఖ్యాతి వహించాయి.

ఆంధ్రనాటక రంగంలో పురుషులతోపాటు స్త్రీలు కూడా నాటకాలను వ్రాశారు. వారిలో గూడపాటి లక్ష్మినరసమ్మ 'స్వయంవరం' కందాళ చూడమ్మ 'కమలా పరిణయం' విస్సంరాజు సీతాంబ 'సావిత్రి నాటకము 'పేకుమళ్ళ లక్ష్మి బాయమ్మ 'వామన నాటకము' మొదలైన నాటకాలను రచించారు.

## నాటికలు

ఈనాడు తెలుగు దేశంలో నాటకాలతోపాటు నాటికలుకూడ పుంఖానుపుంఖాలుగా వెలువడుతున్నాయి. పెద్ద నవలనుండి కథానిక ఉద్భవించినట్లు నాటకంనుండి

నాటిక జన్మించింది. ముఖ్యంగా పాశ్చాత్య నాటకరంగంలో నాటకంతోపాటు నాటిక ప్రక్రియకూడ ఎంతో అభివృద్ధి చెందింది. తెలుగుదేశంలో ముఖ్యంగా అమెచూర్ నాటక సమాజాలు ఈనాడు సాంఘిక నాటకలను ఎక్కువగా ప్రదర్శిస్తున్నాయి. అనేకమంది ముఖ్య రచయితలు నాటికా రచనకు ప్రాముఖ్యమిచ్చి అనేక నాటికలను రచించారు.

డాక్టరు శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు 25 సంవత్సరాల క్రితం భారతి సంచికలలో నాటికల పరిణామాన్నిగూర్చి, వివిధ నాటికా రచయితల రచనాదర్శాలనూ కూలంకషంగా చర్చించారు.

ముఖ్యంగా తెలుగుదేశంలో కందుకూరి వీరేశలింగంగారు సాంఘిక సంస్కరణోద్యమంలో కొన్ని హాస్యప్రహసనాలను రచించారు. తెలుగులో ప్రథమ ఏకాంకికలుగా వీటిని పేర్కొనవచ్చు. కొక్కొండవారి నరకాసురవ్యాయోగం కూడా ఈ కోవకు చెందిందే.

విశ్వనాధ కవిరాజుగారు హాస్యనాటికా రచనలో అందెవేసినచేయి. కవిరాజు గారు దాదాపు 50 ఏకాంకనాటికలను రచించారు. వీటిలో 'డొంకలోషరాబు' 'సరాగం' 'రాజీ' దొంగాటకం 'కిరుగానుగు' 'వైవాహికం' 'నేపథ్యం' మొదలైన నాటికలు ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నాయి.

1930లో తెలుగు నాటకరంగంలో రాజమన్నారుగారి 'తప్పెవరిది' ఏకాంక నాటిక ఒక నూతన అధ్యాయాన్ని సృష్టించింది. రాజమన్నారు ఏకాంకికా రచనలో సిద్ధహస్తులు. ఇబ్సెన్, గాల్స్‌వర్దీవంటి పాశ్చాత్య రచయితల రచనలవల్ల ఉత్తేజం పొంది తెలుగులో అభ్యుదయకరమైన సాంఘిక నాటికలను రచించారు. వారి రచనల్లో ముఖ్యమైనవి ఏమి మగవాళ్ళు, దెయ్యాలలంక, నిష్ఠలం, నాగుబాము, విముక్తి మొదలైనవి.

సంఘసంస్కరణకోసం విప్లవాత్మకమైన రచనలు సాగించిన గుడిపాటి వెంకటచలం 'సత్యం శివం సుందరం' 'పద్మరాణి' 'కొండడు' మొదలైన నాటికల్లో సాంఘిక సమస్యల్ని చిత్రించారు.

ముద్దుకృష్ణగారి 'టీకప్పులో తుపాను' హాస్యనాటికగా తుపాను రేపింది. 'డాకిని' 'అపవాదు' 'అనార్క్-లీ' మొదలైనవి కూడ వీరి ఉత్తమరచనలు.

భారత నాటకాలలో వేనోళ్ళ ప్రస్తుతించబడిన తిరుపతి వెంకటకవులు వాటికారచనలో కూడ జొనసిపించుకుని 'రసాభాసము' 'అపూర్వ కవితా వివేచనము' 'పల్లెటూళ్ళ పట్టుదల 'అనే నాటికలను రసవత్తరంగా రచించారు.

సురభినాటక సమాజాలకు తమ నాటకాలద్వారా మహత్తర సేవచేసిన మల్లాది వేంకట కృష్ణశర్మ నాటికా రచనలో మేటి అనిపించుకున్నారు. వీరి 'వార సత్వం' నాటిక అనేకచోట్ల ప్రదర్శింపబడి వేనోళ్ళ పొగడబడింది. వీరి హాస్య నాటికల్లో ముఖ్యమైనవి. 'సుబ్బమ్మ విరహం' 'నామకరణం' 'ప్రత్యక్షదైవం' మొదలైనవి. వీరు విశ్వనాధకవి రాజుగారి సోదరులు.

ఆంధ్రసాహిత్య జగత్తులో నవల, చిన్న కథ, నాటకం, నాటిక మొదలైన అన్ని ప్రక్రియల్లోనూ సిద్ధహస్తు లనిపించుకున్న శివరాజు వేంకట సుబ్బారావు (బుచ్చిబాబు) ప్రయోగాత్మక రంగస్థల నాటకాలను, నాటికలను, రేడియో నాటికలను రచించి అసమానమైన పేరు గడించుకున్నారు. 'ఆత్మవంచన' 'దారినపోయే దానయ్య' 'తిష్యరక్షిత' 'ఉమర్ ఖయ్యాం' 'నాలుగో పరిణామం' మొదలైనవి వీరి సుప్రసిద్ధ రచనలు.

ప్రపంచ కథానికల పోటీలో ద్వితీయస్థానం సంపాదించుకున్న పాలగుమ్మి పద్మరాజుగారు కథా రచయితగా, నాటక రచయితగా, సినీ రచయితగా, దర్శకుడుగా పేరుపొందిన మేధావి. నాటకాల్లో వీరికి కీర్తితెచ్చిన కన్నీరు తమిళ నాటకానువాడం. ఆంధ్ర హృదయాల్లో హత్తుకుపోయింది. నాటికల్లో 'ఖూనీ' మద్రాసు రేడియో నాటికల్లో ప్రథమ బహుమతి పొందింది.

గేయ నాటికా రచనలో, ప్రయోగంలో సిద్ధహస్తు లనిపించుకున్న బాలాంత్రపు రజనీ కాంతరావు గాయకుడు. వీరి ప్రథమ గేయ నాటిక 'చండీదాసు' 1941 లో రేడియోలో ప్రసారమైంది. వీరి రచనల్లో 'లకుమాదేవి' 'రాసలీల' 'విశ్వవీణ' 'మేనక' మొదలైనవి గణనకెక్కినవి.

ప్రపంచ రచయితైన మోలియర్ రచనంతో ప్రభావితుడైన హాస్య బ్రహ్మ భమిడిపాటి కామేశ్వరరావు ప్రప్రథమంగా స్వతంత్రంగా రచించిన ప్రహసనం 'బాగు బాగు'. దీనిని అనేకనాటక సంస్థలు ప్రదర్శించాయి. 'కచటతపలు', 'ఎప్పుడూ ఇంతే' అనే ప్రహసనాలు కూడ పేర్కొన దగినవి. దాదాపు 12 మోలియర్ రచనలను అనుసరించారు. అనేక భాస నాటకాలను అనుకరించి కూడ నాటకాలను వ్రాశారు.

1932 లో అబ్బూరి రామకృష్ణారావుగారు 'నదీసుందరి' అనే ఉత్తమ నాటికను రచించారు. రామకృష్ణారావుగారు తెలుగు సాహిత్యోద్యమంతో, నాటక రంగంతో బహుముఖాల పరిచయమున్న కళాశీలి. ఆయన ప్రసిద్ధ కవి, నటుడు, దర్శకుడు.

1933 లో తలావఝుల శివశంకరశాస్త్రిగారు 'పద్మావతీ చరణచారణ చక్రవర్తి' అనే ప్రథమ పద్యనాటికను, 1936 లో 'వరపరీక్ష' అనే గేయ నాటికను రచించి గేయ నాటికలకు ఆద్యులైనారు.

ఉత్తమంగా శబరి నాటకాన్ని వెలువరించిన చింతాదీక్షితులుగారు 'శర్మిష్ఠ' 'జటాయు' 'శ్రీకృష్ణుడు' 'చక్రవాకమిథునము' రచించి నాటికారచనలో సమర్థులనిపించుకున్నారు.

విజయవంతంగా ప్రదర్శింపబడిన నాటికల్లో చిలుకూరి నారాయణరావుగారి అశ్వత్థామ, అచ్చి చెప్పదగినవి.

ప్రప్రథమంగా 1939 లో సంగీత రూపకంగా వెలువడ్డ రూపకం మల్లవరపు విశ్వేశ్వరరావుగారి 'బిల్హణీయం'. ఇది రేడియోలో ప్రసారితమైంది. 'వరూధిని' 'కలభాషిణి' అనే నాటికలను కూడా వీరు రచించారు.

చిన్నకథా రచనలో సిద్ధహస్తు లనిపించుకున్న శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఉత్తమమైన నాటికలను కూడ రచించారు. వారి రచనలో 'పునాదిరాయి' 'కలంపోటు' 'లక్ష్యసిద్ధి' ముఖ్యమైనవి.

నోరి నరసింహశాస్త్రిగారి 'శబ్దవేధి' 'పతంగయాత్ర' 'భాగవతావరణము' 'స్వయంవరము' 'తేనెతెట్టె' మొదలైన నాటికలను రచనా విశిష్టతలో ఉత్తమంగా పేర్కొనవచ్చు.

సుప్రసిద్ధ రచయితలైన జి. వి. కృష్ణారావుగారి 'భిక్షాపాత్ర' 'డమడమాల బండి' 'యాదవప్రళయం' మొదలైనవి రచనలో ఉత్తమమైనవి.

హాస్య రచయితలైన మొక్కపాటి నరసింహశాస్త్రిగారు సాంఘిక జీవితానికి సంబంధించిన నాటికారచనలో సిద్ధహస్తులై 'మొక్కబడి' సంపుటాన్ని వెలువరించారు.

పత్రికా రచయితగా, సంపాదకులుగా రూపొందిన గోరాశాస్త్రిగారు రూపక రచనలో కూడా ఆరితేరినవారు. వీరి దూరతీరాలు, సెలవుల్లో, ఆనందనిలయం మొదలైన నాటికలు పేర్కొనదగినవి.

ప్రసిద్ధ భావకవిగా పేరుపొందిన దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు అనేక ఉత్తమ రేడియో నాటికలను రచించారు. వారి రచనల్లో ఉత్తమమైనవి విద్యావతి, ధనుర్దాసు, కృష్ణాష్టమి, ఊర్వశి మొదలైనవి.

నాటకరచనలో, సంగీత దర్శకత్వంలో, పర్యవేక్షణలో, నాటకశిల్పంలో ప్రతిభావంతులైన కొప్పరపు సుబ్బారావుగారి గద్య, పద్యాత్మకమైన గేయనాటిక అల్లీముతా అగ్రశ్రేణికి చెందింది.

సుప్రసిద్ధ పాత్రికేయులైన నార్ల వెంకటేశ్వరరావుగారు పల్లెటూరు వాతావరణాన్ని, గ్రామీణ జీవితాన్ని వాస్తవికతనూ చిత్రించడంలో వారి నాటికలు ఆంధ్ర నాటకరంగంలో అగ్రశ్రేణిలో నిలబడుతున్నాయి. ఒక్కొక్క సమస్యతో ఒక్కొక్క నాటికను అద్భుతంగా చిత్రించారు. వారి కొత్తగడ్డ నాటికల సంపుటి 1947 లో వెలువడింది. వారి నాటికల్లో కొత్తగడ్డ, భంగపాటు, ద్రోహం, దొంగా దొరా, ప్రారబ్ధం, పైపంట, ఆకాపాళం మొదలైనవి ఉత్తమశ్రేణికి చెందినవి.

ఇంకా కొట్టపాటి గంగాధరరావు తనలోతాను, విధివశం, పినిసెట్టి ఆడది-

రిక్షావాడు, ఎవరినీ నమ్మకు, సుంకర సత్యనారాయణ కనువిప్పు, వీరకుంకుమ-రాబందులు, భూదేవి, హితశ్రీ విముక్తుడు, అనిసెట్టి చెప్పుక్రిందిపూలు, శాంతి, మూకాభినయం, కారెపు అప్పలస్వామి ఈరోజు, బ్రాకెట్, కట్‌జోకర్, కావ్యశ్రీ మానవుడు, ఎన్. ఆర్. నంది వానవెలిగింది, రమాకాంత్ కాలచక్రం, మగదల రామచంద్రరావు ప్రత్యూష, కొండముది శ్రీరామచంద్రమూర్తి కళావరుజాకీ, చరిత్రగతులు, బాలగంగాధర్‌తిలక్ సుచిత్రాప్రణయం, నాగభూషణ్ అన్వేషణ, దివ్యప్రభాకర్ నిగవధి, వడ్లమూడి సీతారామారావు తారాబలం, భట్టిప్రోలు కృష్ణ మూర్తి ఉత్తచేతులు, వెంపో ప్రజలకోసం, మల్యాద్రి, ఢిల్లీచలో, కొర్లపాటి శ్రీరామమూర్తి నటన, వట్టికోట ఆళ్వారుస్వామి కనువిప్పు, మారేమండరామారావు విప్లవం, పోతుకూచి ఇదీతంతూ, రెంటాల ఆకలి, శిక్ష, రావికొండలరావు కుక్కపిల్ల దొరికింది, గొల్లపూడి మారుతీరావు పతిత, అనంతం, రాగరాగిణి, ఎ. ఆర్. కృష్ణ అరగంటలో అదృష్టం, కొడాలి సుబ్బారావు ఆహుతి, శ్రీమతి కల్యాణి పెళ్ళికొడుకు, శ్రీనివాసచక్రవర్తి లోభి, సోంపల్లి బాపయ్య అప్పాజీ, పురుషోత్తముడు, కంచిభట్ల కృష్ణమూర్తి దేవుడు ప్రత్యక్షమైతే, అంబటిపూడి వెంకటరత్నం కౌమోదకి, రావూరి భరద్వాజ భానుమతి, ఇష్టసిద్ధి, పెమ్మరాజు వేణుగోపాలమూర్తి కర్ణ, అశ్వత్థామ, చాణక్య, వేణు దిష్టిబొమ్మలు, ముప్పన విశ్వప్రసాద్ తాజమహల్, అసమర్థులు, దగాకోరు. పైన వివరించినవారే కాక పోకల నరసింహారావు,మహీధర రామమోహనరావు, డాక్టరు రాంబాబు, బి. ఎన్. సూరి, పొట్లూరి వెంకటేశ్వరరావు, పోలవరపు శ్రీహరిరావు మొదలైన అనేక మంది యువరచయితలు నాటికా రచనలో అనేకమైన నూతన ప్రయోగాలను చేస్తున్నారు.

### పెద్దపేరు తెచ్చుకొన్న గేయ నాటికలు :

నాటకాలూ, నాటికలతోపాటు గేయ నాటికలు కూడ నాటకరంగంలో ప్రాముఖ్యం వహించాయి. గేయనాటికా రచనకు అద్యులుగా శివశంకర శాస్త్రిగారిని పేర్కొనవచ్చు. ముఖ్యంగా గేయ నాటికల్లో నటన, సంగీతం, నాట్యం సమపాళ్ళలో ప్రాముఖ్యం వహిస్తాయి. గేయనాటికా రచనలో దేవులపల్లి కృష్ణ శాస్త్రి, బాలాంత్రపురజనీ కాంతరావు మొదలైనవారుకూడ విశేషకృషి చేశారు.

ఈనాడు ముఖ్యంగా గేయనాటికా రచనలో సిద్ధహస్తులై, అనేక గేయ నాటికలను రచించినవారు పి. నారాయణ రెడ్డిగారు. వీరి గేయనాటికలు చదువుకునే వారికి, రంగస్థలంమీద నటించే వారికి, రేడియోలో శ్రవ్యనాటికలుగా వినేవారికి ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. వీరి గేయనాటికల్లో ప్రాముఖ్యం వహించినవి 'నవ్వనిపువ్వు''గోకుల విహారం''దివ్వెల సంగీతం' 'రామప్ప' 'ఊర్మిళ' సంక్రాంతి వెన్నెలవాడ, అజంతా సుందరి, 'ఋతువుల రాణి' 'సుగాత్రి' మొదలైన నాటికలు ప్రదర్శింపబడి, రేడియోలో ప్రసారం చేయబడి రసజ్ఞుల హృదయాలను చూర గొన్నాయి. వీరి రామప్ప అఖిలభారత ప్రఖ్యాతి వహించింది. గేయనాటికా రచనలో వింజమూరి శివరామారావు, బోయిభీమన్న, వి. వి. రామనాధం మొదలైనవారు కూడ పేరెన్నిక గన్నారు. ముఖ్యంగా ఈ గేయనాటికా రచనలో నూతన ప్రయోగంచేసినవారిలో ముఖ్యులు ఆరుద్ర, సోమసుందర్, కుందుర్తి మొదలైనవారు. ఆరుద్ర గారి సీతాకోక చిలుక రచనలో పలువురి ప్రశంసలందు కుంది. అలాగే, కుందుర్తివారి 'ఆశ' సోమసుందర్ 'మందీ-మనిషి' చెప్పుకో తగినవి.

శ్రవ్యనాటికాలు,
నాటికలు :

ఈనాడు శ్రవ్యనాటకాలు, నాటికలు రేడియోద్వారా చాలా ప్రాముఖ్యం వహిస్తున్నాయి. 1938 లో రేడియో నాటికగా ముద్దుకృష్ణగారి 'అనార్క-లి' ప్రథమంగా ప్రసారం చేయబడింది. ఆనాటినుండి ఈనాటివరకు ప్రతి రోజూ ఒకటో, రెండో శ్రవ్యనాటికలు ప్రసారం చేయబడుతూనే వున్నాయి. ఈనాడు కొన్నివందల మంది రేడియో నాటికలను వ్రాస్తున్నారు. ముఖ్యంగా గోరాశాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావుగార్లు ఒక్కొక్కరూ నూరు రేడియో నాటికలు వ్రాశారనడంలో ఏమీ అతిశయోక్తి ఉండదనుకుంటాను. గోరాశాస్త్రిగారి 'ఆశఖరీదు అణా' 'లోహ ఘంటలు', 'కొమ్మసంపెంగ' 'సెలవల్లో' 'ఆనందనిలయం''ఇల్లుకట్టి చూడు మొదలైనవి ముఖ్యమైనవి.

రేడియో నాటికారచనలో ఆరుద్రగారు కూడ సిద్ధహస్తులు. ఎన్నో శ్రవ్య నాటికలను నూతన పోకడలతో, విశిష్టమైన శైలితో వ్రాశారు. వీరి 'న్యాయాధికారి'

'అక్కయ్యకు ప్రమోషన్', 'సీతాకోకచిలుక' ముఖ్యమైనవి. వీరి 7 నాటికలను ఆరుద్ర నాటికలుగా 1958 లో సంపుటిగా ప్రచురించారు. వీటిలో 'న్యాయాధికారి' 'పార్కుబెంచి' 'నన్ను గురించే' 'దరఖాస్తుఫారం,' 'అక్కయ్యకు ప్రమోషన్' రేడియోలో ప్రసారం చేయబడ్డాయి.

కాటూరి వెంకటేశ్వరరావుగారి. ముప్పగోపాల,నాగభూషణ్ 'కల-కాపురం' 'సర్పదష్టులు' 'వడ్డించిన విస్తరి' మొదలైనవి పేర్కొనదగినవి.

శ్రీయుతులు జలసూత్రం రుక్మిణీ నాధశాస్త్రి, సి. నారాయణరెడ్డి, రజని, బుచ్చిబాబు, దాశరథి, చల్లా రాధాకృష్ణశర్మ, అమరేంద్ర, ప్రయాగ, శ్రీవాత్సవ, భరద్వాజ, నార్ల చిరంజీవి, ఏడిద కామేశ్వరరావు, శ్రీ శ్రీ, అనిసెట్టి మొదలైన అనేకమంది రేడియో నాటికలలో ప్రాముఖ్యం వహించారు.

బాలల నాటికలు :

ముఖ్యంగా బాలనాటికలు రేడియో బాలల కార్యక్రమాలద్వారా ఎక్కువ ప్రచారంలో కొచ్చాయి. ముఖ్యంగా న్యాపతి రాఘవరావు, రేడియో అక్కయ్యల ద్వారా. రేడియో బాలానంద కార్యక్రమాల్లో రేడియో నాటికలు ఎక్కువ ప్రసారం చేయబడ్డాయి. బాలల నాటికలను వ్రాసిన వారిలో న్యాపతి రాఘవరావు, ఏడిద కామేశ్వరరావు, నార్ల చిరంజీవి, బి. వి. నరసింహారావు, జంధ్యాల పాపయ్య శాస్త్రిగార్లు ముఖ్యులు.

శ్రీ నార్ల చిరంజీవిగారు ఎన్నో బాలల గీతాలను వ్రాశారు. ఎన్నో కథలను వ్రాశారు. బాలల ఉపయోగార్థం ఎన్నో నాటికలూ వ్రాశారు. ఎంతో బాల సాహిత్యాన్ని రచించి, ప్రచారం చేశారు.

నాట్యాచార్య బి. వి. నరసింహారావుగారు వస్తుతా ఉపాధ్యాయు డవడం వల్ల పిల్లల మనస్తత్వం బాగా ఎరిగినవారు. ఆయన ఎన్నో బాలగేయాలను వ్రాశారు. చక్కగా పాడగల నేర్పరి. ఆ నేర్పరితనంతో బాలలనిట్టే ఆకర్షించగల చతురుడు. ఆయన బాలసాహిత్యంమీద ఎన్నో గ్రంథాలను వెలువరించారు.

ఇంకా నాగభూషణ్, జమ్మలమడక పూర్ణచంద్రరావు, చెరుకుపల్లి భాస్కర రావు, జనమంచి రామకృష్ణ 'శ్రీవాత్సవ' ఇల్లిందల సరస్వతీదేవి, రేడియో తాతయ్య మొదలైనవారు కూడ పిల్లల నాటకాలను వ్రాశారు.

ముఖ్యంగా పిల్లల నాటకాల్లో''బూరెల మూకుడు''జబ్బు కుదిరింపు' 'శ్రావణ భాద్రపదాలు''పిల్లిమెడలో గంట''గ్రాంథికశాస్త్రి''సిండ్రిల్లా''నువ్వా నేనా' 'చిట్టిబావ, పొట్టిమరదలు' మొదలైన నాటికలు ఎక్కువ ప్రఖ్యాతి వహించాయి.

ఈ విధంగా గత నూరు సంవత్సరాల ఆంధ్రనాటకరంగంలో అనేక సంస్కృత రూపకానువాదాలు, భారతీయ భాషల్లో వెలువడిన నాటకాలకు తెలుగు అనువాదాలు, ఆంగ్ల నాటకానువాదాలు, తెలుగు నాటకాలపై ఆంగ్ల నాటకాల ప్రభావంతో వెలువడిన నాటకాలు, స్వతంత్ర నాటకాలు. పౌరాణిక, నాటకాలు, చరిత్ర నాటకాలు, సాంఘిక నాటకాలు, ప్రచార నాటకాలు, మనస్తత్వాలను నిరూపించే నాటకాలు, విషాద నాటకాలు, ప్రహసనాలు, నాటికలు, ఏకాంకికలు, పద్యనాటకాలు, గేయ నాటికలు, వచన నాటికలు, రేడియో నాటికలు, బాల నాటకాలు మొదలైన వెన్నో వెలువడినాయి. దాదాపు తెలుగులో మూడువేల నాటకాలవరకూ వెలువడ్డాయని శ్రీ శ్రీనివాస చక్రవర్తి, డా. పి. యస్ అర్. అప్పారావుగార్ల అంచనాలవల్ల తెలుస్తున్నాయి. అన్ని నాటకాలను గురించీ ఇక్కడ సమీక్షించ లేకపోతున్నందుకు విచారిస్తున్నాను. అలాగే అందరు నాటక రచయితల పేర్లు ఉదాహరించటం కూడా సాధ్యం కాలేదు.

నాటక సమీక్షలో వెలుగుచూచిన నాటకాలను, ప్రజలుమెచ్చిన నాటకాలను, అందుకు సంబంధించిన రచయితల పేర్లను మాత్రమే ఉదాహరించటం జరిగింది. అన్ని నాటకాలనూ, ఆయా నాటక రచయితలనూ ఉదాహరించాలనే నా కోరిక. కాని గ్రంథ విస్తరణ, అధిక వ్యయమూ ఇందుకు కారణం. రెండవ ముద్రణలో నాకోరిక సఫలీకృతం అవుతుందని విశ్వసిస్తున్నాను. కావాలని ఏ నాటకాన్నీ, ఏ రచయితనూ విస్మరించలేదు. ఇది నా ప్రథమ ప్రయత్నం.

ఈనాడు ఆంధ్రనాటక రంగంలో కొన్నివందల నాటకాలు రచింపబడివున్నాయి. వీటిలో కొన్ని ప్రదర్శింప బడ్డాయి. మరికొన్ని రంగస్థలంమీదికే

రాలేదు. మరికొన్ని శ్రవ్య నాటకాలుగానే వుండిపోయాయి. వున్న నాటకాల్లో కొన్ని మంచి నాటకాలు, ప్రదర్శనకు యోగ్యమైనవి వుండవచ్చు. అందువల్ల ఈ నాటకాలను గురించీ, వీటి మంచిచెడ్డలను గురించీ ఆంధ్రప్రేక్షకులకు చాలామందికి తెలియదు. నాటకాలు లేవో అనే గోల తప్ప ఏయే నాటకా లున్నాయో చూసే ఓపిక కూడా లేదు. ఎవరో ఒకరు నాటకం ప్రదర్శించిన తరువాతగాని నాటకం యొక్క మంచి చెడ్డలు బయటపడవు గదా? నాటకం ప్రదర్శింప బడకుండానే గుణగణాలు నిర్ణయించటం మంచిది కాదు. నాటకం ఒకమాదిరిగా వున్నప్పుడు దానిని ప్రదర్శనానికి సంబంధించిన హంగులతో రక్తి కట్టించవచ్చు. కనుక మన కున్న నాటకాలను ఒకసారి సమాజాల వా రందరూ తిరగవేయడం మంచిది.

ఈ నాటక సమీక్షలో నాకు అత్యంత ఆప్తమిత్రులైన శ్రీ శ్రీనివాస చక్రవర్తిగారి నాటక సమీక్షా, డాక్టర్ పి. యస్. ఆర్. అప్పారావుగారి 'తెలుగు నాటక వికాసమూ, ఇరువురి ప్రత్యక్ష సహకారమూ నా కెంతగానో తోడ్పడ్డాయి. వారికి నేను ఎంతైనా కృతజ్ఞుణి!

# 11

# ఆంధ్రప్రదేశ్ నాటకరంగం



నెల్లూరు- గుంటూరు-కృష్ణా - పశ్చిమ గోదావరి - తూర్పుగోదావరి - విశాఖ పట్టణం-శ్రీకాకుళం-బళ్ళారి-కర్నూలు -కడప - చిత్తూరు - అనంతపురం - హైదరాబాదు- సికిందరాబాదు-వరం గల్లు-ఖమ్మం-మహబూబ్‌నగర్. కరీం నగర్ - అదిలాబాద్ . నిజామాబాద్- మెదక్-నల్లగొండజిల్లాలనాటకరంగాలు

# నెల్లూరుజిల్లా నాటకరంగము

## నెల్లూరు :

ఆంధ్రదేశంలో అన్ని పట్టణాల్లోనూ నాటకాలను ప్రదర్శించిన ధార్వాడవారు నెల్లూరు కూడా వచ్చి నాటకాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనాలకు



ముగ్ధులైన నెల్లూరు ప్రముఖులు కొంతమందిచేరి, లక్ష్మీ నాటక సభ అనే పేరుతో తిప్పరాజు సుబ్బయ్యసత్రం దగ్గర పందిరివేయించి నాటకాలను ప్రదర్శించారు ఆ నాటకాలలో గడ్డం శేషయ్య, న్యాపతి కృష్ణారావు, ఆ. వాసుదేవరావు, మధ్వ పతి సత్య సంధరావు మొదలైనవారు పాత్రలు ధరించి, ముఖ్య కార్యకర్తలుగావుండి ఆ సమాజాన్ని పోషించారు.

అదేరోజుల్లో, నెల్లూరు సంతపేట వద్దనున్న రామానుజ పురవాసులైన శీనయ్య, పురుషోత్తం, అనే పేర్లుగల అన్న దమ్ములు, ఒక నాటక సమాజాన్ని స్థాపించి, గూడూరు కంపెనీ అనే పేరుతో బాణాసుర, ప్రహ్లాద మొదలైన నాటకాలను నెల్లూరుజిల్లా అంతా ప్రచారంచేసి నాటకాలను ప్రదర్శించారు. ఆ రోజుల్లో, కిరసనాయిలు లాంతరుబుట్టి నాటకాలాడేవారు. ముఖ్య పాత్రధారుల ప్రవేశంలో అరుపులు, కేకలతో వికటాట్టహాసం చేసేవారు. ఇది అనాటి పద్ధతి.

## నెల్లూరు అమెచ్యూర్ నాటక సభ :

ఆ తరువాత 1891 వ సంవత్సరంలో నెల్లూరు అమెచ్యూర్ నాటక సభ స్థాపించబడింది. ఈ సమాజంలోని వారందరూ వుత్సాహవంతులైన విద్యావంతులు, తీరిక సమయాల్లో వినోదార్థం నాటకాలు ప్రదర్శించేవారు, కొంతమంది కాలేజీ విద్యార్థులు కూడ షేక్స్పియర్ నాటకాలు మొదలైనవి కూడా ప్రదర్శిస్తూ ఉండేవారు. అమెచ్యూర్ నాటక సభను మహంకాళి సుబ్రహ్మణ్యం, కండాడై శత గోపరామానుజం మొదలైనవారు కార్యదర్శులుగావుండి జయప్రదంగా నడిపారు.

### అమెచ్యూర్ డ్రమాటిక్ సమాజము :

మద్రాసు క్రిష్టియన్ కాలేజి సంస్కృత పండితులైన వేదం వేంకటరాయ శాస్త్రులు గారి ప్రతాపరుద్రీయ నాటకాన్ని ప్రప్రథమంగా 20-1-1898 సంవత్సరంలో అమెచ్యూర్ డ్రమాటిక్ సమాజంవారు ప్రదర్శించారు. ఈ సమాజానికి కందాడై అనంతాచారి, ఒంగోలు వెంకటరంగయ్యగారు స్టేజి డైరెక్టర్సుగా పనిచేశారు.

### వేదం వేంకటరాయశాస్త్రి :

వేంకటరాయశాస్త్రులుగారు శకుంతల, నాగానందం మొదలైన సంస్కృత నాటకాలను అనువాదం చేశారు. వీరు స్థాపించిన సమాజానికి వారే అధ్యక్షులుగావుండి నెల్లూరులోనే నాటకాలను ప్రదర్శించేవారు. వీరి సమాజంలో పది పదిహేనుమాసాలు వరకూ నాటకాలకు వద్దికలు జరిపేవారు. శాస్త్రిగారి పద్యాలను, పాటలనే వుపయోగించేవారు. ఒక సంభాషణ చేర్చడంగాని తీసివేయడంగాని జరిగేదికాదు. ప్రతి పాత్రనూ దగ్గరుండి తీర్చిదిద్దేవారు. వారి నాటకంలో పాత్రలకు ఆయా స్వభావాల ననుసరించి పాత్రోచితభాషను ప్రవేశపెట్టారు. వీరి పర్యవేక్షణలో ఆనాడు అనేకమంది సుప్రసిద్ధనటులు ఉద్భవించారు. వేంకటరాయశాస్త్రిగారు ఈ సమాజాన్ని 1900 మొదలు, 1925 వరకు అజరామరంగా నడిపి, తరువాత ఆంధ్రసభలో ఈ సమాజాన్ని లీనం చేశారు.



వెల్లూరు నగరాజారావుగారు-సత్యకీర్తి

### ఆంధ్రభాషాభిమాని సమాజము :

ఈ రోజుల్లోనే నెల్లూరులో కాపువీధి నాటక సమాజమని, లిటరరీ క్లబ్ అనీ రెండు మూడు నాటక సమాజాలుండేవి.

వర్ధమాన సమాజంవారు బళ్ళారివారి నాటకాలను, లిటరరీ క్లబ్‌వారు బలిజేపల్లి బుద్ధిమతీ విలాసాన్ని, కాపువీధివారు చిలకమర్తివారి నాటకాలనూ ప్రదర్శించేవారు. సరస్వతీ అమెచ్యూర్స్ అనే వారు షేక్స్పియర్ ఇంగ్లీషు నాటకాలను ప్రదర్శించేవారు.

వేదంవారి శిష్యుడైన రాయప్రోలు సుబ్రహ్మణ్యం 1913 సంవత్సరంలో ఒక నాటక సమాజాన్ని ఏర్పాటుచేసి విమల, మదాలస అనే రెండు నాటకాలు ప్రదర్శింపజేసి, ఆ తరువాత బళ్ళారి ధర్మవరం వారి నాటకాల్లో పాత్రలు ధరించి, ప్రహ్లాద, లవ కుశ, కృష్ణలీలలు నాటకాలను తీసుకుని నెల్లూరులో జ్ఞానోదయ నాటక సమాజాన్ని స్థాపించి, పై నాటకాలమ ప్రదర్శించారు. నగరాజారావు, శ్రీనివాసాచారి, కాశీ చెంచు, నేలనూతల రామకృష్ణయ్య మొదలైనవారు ప్రసిద్ధ నటులుగా పేరు పొందారు. ఈ సమాజ స్థాపకుడైన రాయప్రోలు సుబ్రహ్మణ్యం బాహుకుడు, కృష్ణుడు, అర్జునుడు, కంసుడు, హిరణ్యకశిపుడు మొదలైన పాత్రలను ధరించడంలో అఖండమైన ఖ్యాతిని సంపాదించారు. ఇలా కొంతకాలం సమాజాన్ని నడిపి, చిత్తూరు రామవిలాస సభవారికి దర్శకుడుగా వెళ్ళిపోయారు.



కె. శ్రీనివాసాచారిగారు–విషయ

1917 సం॥ రంలో సుగుణవిలాస సభ స్థాపించబడి రామదాసు, హరిశ్చంద్ర, మానవతి, కృష్ణక్రీడ మొదలైన నాటకాలను ప్రదర్శించారు. ఈ సమాజంలో ఘంటసాల రాధాకృష్ణయ్య, కాశీచెంచు సుబ్రహ్మణ్యం పాత్రధరణలో ప్రసిద్ధిపొందారు.

ఈ రోజుల్లోనే దువ్వూరి రామిరెడ్డిగారి మీరాబాయి నాటకంలో యర గుడిపాటి అనుమంతరావు రాణా పాత్రను ధరించి పేరు తెచ్చుకున్నారు.

ఆంధ్ర సభ:

నెల్లూరు నాటక రంగంలో ఆంధ్ర సభ ఆనాటినుండి ఈనాటివరకూ నాటక కళా సేవ చేస్తూవుంది. వృద్ధులైన వేదం వేంకటరాయశాస్త్రిగారు వారి సమాజాన్ని ఆంధ్రసభలో లీనంచేసిన తరువాత సభవారు శాస్త్రిగారి నాటకాలనూ, ధర్మవరం కృష్ణమాచారిగారి నాటకాలనూ, కోలాచలంవారి నాటకాలనూ, చిలకమర్తివారి గయోపాఖ్యానాన్ని, ముత్తరాజువారి తులాభారాన్నీ ప్రదర్శించేవారు, శాస్త్రిగారి నాటకాల్లో

కందాడై శ్రీనివాసన్. (వీరికే మరొకపేరు దొరసామి) నాయక పాత్రధారణలో బహు ప్రసిద్ధిని పొందారు.

ఆ రోజుల్లోనే ఫ్రండ్సు యూనియన్ అనే నాటకసమాజం కన్యాశుల్కం, అనార్కలి నాటకాలను ప్రదర్శించింది.

పైన్‌అర్బ్సు సమాజంవారు వేపంవారి నాటకాలను, దువ్వూరి రామిరెడ్డివారి మీరాబాయి నాటకాన్ని, షేక్స్‌పియర్ ఇంగ్లీషు నాటకాలనూ ప్రదర్శించారు. ఈ నాటకాలన్నిటిలోనూ యరగుడిపాటి సుబ్రహ్మణ్యం, ముంగమూరు నరసింహారావు, గోవిందరాజులు నాయుడు, టి. సుదర్శనరావు మొదలైనవారు ప్రసిద్ధ నటులుగా గౌరవస్థానాన్ని అలంకరించారు.

ఆంధ్ర సభవారు మోవర్ల రామకృష్ణయ్య రచించిన ప్రచండభార్గవం, శాకుంతలము, నేలనూతల కృష్ణమూర్తి, వారి మిత్రులు రచించిన రుద్రమదేవి, త్యాగరాజు నాటకాలను, పులుగుండ్ల రామకృష్ణయ్య రచించిన తలవని తలంపు, తుఫాన్ మొదలైన సాంఘిక నాటకాలను ప్రదర్శించారు.

తూములూరు శివరామయ్య :

1918 లో స్థాపించబడిన సుజనవినోదినీ సమాజం కారణాంతరాలతో విడిపోయిన ఆంధ్ర సభ ఈనాటికీ కొనసాగుతూ వుంది. ఈ సభకు ప్రథమ అధ్యక్షులు కీ॥ శే॥ తూములూరు శివరామయ్యగారు, దాదాపు 18 సంవత్సరాలు అధ్యక్షులుగా వున్నారు. వీరు సుప్రసిద్ధ న్యాయవాదులు, కళాప్రియులు, లలిత కళల్లో బహుముఖాలుగా పరిచయమున్నవారు. శివరామయ్యగారి కళాభిమానాన్ని గుర్తించిన ధనవంతులైన దాతలు, ప్రసిద్ధ న్యాయవాదులు పోషకులుగా వుండి, నాటక కళాపోషణకు ఎంతగానో తోడ్పడ్డారు. 18 సంవత్సరాలనుండి, సంవత్సరానికి 6 ప్రదర్శనాల చొప్పున 1918 నుంచి 1936 వరకూ కళను ఉద్ధరించారు.

1942 లో రాజమన్నార్‌గారి అధ్యక్షతను సిల్వర్ జూబిలీ జరుపుకున్న ఆంధ్ర సభకు శివరామయ్యగారు, వారి తరువాత రేబాల పట్టాభిరామిరెడ్డిగారు, తరువాత వారి సోదరులు లక్ష్మీనరసారెడ్డిగారు వరుసగా అధ్యక్షులుగా పనిజేశారు. ఈనాడు నరసారెడ్డిగారు అధ్యక్షులుగను, ఏ. పి. సుబ్బారెడ్డిగారు ఉపాధ్యక్షులుగాను వుండి,

ఆంధ్ర సభకు అనుబంధంగా గ్రంథాలయాన్ని నడుపుతున్నారు. ఆంధ్ర సభ కార్య కలాపాల్లో పి. వి. కృష్ణయ్యగారు కూడ విశేషంగా కృషిచేశారు.

నటేశయ్యగారనే ప్రసిద్ధ సంగీత విద్వాంసుడు 1909 నుండి 1914 వరకు వేంకటరాయశాస్త్రిగారి నాటకాలకు, 1914 నుండి 1918 వరకూ అనేక పేర్లు మార్పుచెందిన ఇతర నాటకసమాజాలకు శాస్త్రీయదాక్షిణాత్య సంగీత సాంప్ర దాయాలను ప్రవేశపెట్టి, అపూర్వమైన సేవచేశారు.

ఆనాడు నెల్లూరు నాటక రంగంలో పనిచేసిన కళాకారు లందరూ గౌరవ కుటుంబాలనుండి వచ్చినవారు, విద్యావంతులు, ఉద్యోగాలు చేసుకొనేవారు, రచ యితలు, కళాభిమానం కల కళాకారులు, డబ్బుకాంచి ఒక్క కళాకారుడూ పని చేయలేదు. అందరూ నిస్వార్థంగా పనిచేశారు. అందువల్లనే నెల్లూరు నాటకరంగం ఆంధ్రనాటకరంగ చరిత్రలో ఒక ప్రముఖస్థానాన్ని ఆక్రమించింది.

నెల్లూరు నటులు :

గడ్డం శేషయ్య—న్యాపతి కృష్ణస్వామిరావు—మధ్వపతి సత్యసంధరావు—మహం కాళి సుబ్రహ్మణ్యం—ఆత్మకూరు కృష్ణమాచార్యులు—తూములూరు వేంకట రమణయ్య—వేదం వేంకటరాయశాస్త్రి—ఒంగోలు వెంకటరంగయ్య—కందాడై శ్రీనివాసన్—కందాడై కేశవాచార్యులు—కందాడై అనంతాచార్యులు—నందగిరి హనుమంతరావు—కె. కేశవాచార్యులు—కాశిచెంచుసుబ్రహ్మణ్యం—కె.వి .రంగా చార్యులు—పులిగండ్ల రంగయ్య—సి. జయరాజారావు—దుర్భా రామయ్య—ఆదూరు సీతారామయ్య-నేలటూరు శ్రీనివాసాచార్యులు-సి. ఆర్. కృష్ణమాచార్యులు-పులిగండ్ల వెంకటకృష్ణయ్య—దుర్భా చిదంబరయ్య—ఆమంచర్ల ఆదినారాయణ రావు—శ్రీనివాసరంగస్వామి అయ్యంగార్—కొమండూరు దొరస్వామి అయ్యం గార్—యరగుడిపాటి గోపాలకృష్ణారావు—యరగుడిపాటి హనుమంతరావు—వై.వి. రావు—కనుపర్తి రామకృష్ణయ్య—నేలటూరు సింగరాచార్యులు—రేబాల సుబ్బారాయుడు—కొమండూరు రంగాచార్యులు—పూండ్ల రామకృష్ణయ్య—మధుర శ్రీనివాసరావు—ఫండఫీసు బంగారయ్య—నేలటూరు వరదాచార్యులు—ముత్తరాజు శ్రీనివాసరావు—జంగా వెంకయ్య—రేబాల పట్టాభిరామరెడ్డి—గుజ్జం సుబ్బరామయ్య—రేబాల లక్ష్మీనరసారెడ్డి—టి. రాఘవాచార్యులు—పర్వతరెడ్డి రామచంద్రారెడ్డి—ఘంటసాల రాధాకృష్ణయ్య—తిక్కవరపు రామిరెడ్డి—కోట

శ్రీనివాసరావు—మోచర్ల రామకృష్ణయ్య—వేగూరు వెంకటప్ప—కామరాజుగడ్డ శ్రీనివాసరావు--సరస్వతిరంగస్వామిఅయ్యంగార్—వావిలకొలను రంగారావు—కొలపాక వెంకటవరదరావు—తూములూరు శివరామయ్య—నేలనూతల రామకృష్ణయ్య--పత్రి నరసింహారావు—నేలటూరు వరదాచార్యులు—యస్. వి. కృష్ణమాచార్యులు—పి. పుల్లయ్య—ఘంటసాల బలరామయ్య—సువ్వారి రామిరెడ్డి—బడి చెంగారెడ్డి—వైద్యుల చంద్రశేఖరం—గాడేపల్లి రామయ్య—మోచర్ల రామకృష్ణయ్య—కణ్వశ్రీ—కె. సుబ్రహ్మణ్యకుమారి—టి. వి. రమణారెడ్డి—రంగనాయకి—పులుగుండ్ల రామకృష్ణయ్య—యన్. వి. సుబ్బారావు మొదలైనవారు నటీనటులుగా వెలుగొందారు.

వెంకటగిరి నాటకరంగం:

వెంకటగిరిలో 60 సంవత్సరాలక్రితం వెంకటగిరి అమెచ్యూర్స్ అనే నాటక సమాజాన్ని వెంకటగిరి జమీందార్లు స్థాపించారు. పాదుకాపట్టాభిషేకం, శకుంతల మొదలైన నాటకాలను ప్రదర్శించేవారు. ఆనాటి వారి ప్రదర్శనాలకు వీధి రంగస్థలాన్నే వుపయోగించారు. నాలుగువీధులు కలిసినచోటలో వుండే వీధిమఁటపాన్ని మూడు ప్రక్కలా మూసి, ఒక ప్రక్క తెరలకు బదులు దుప్పట్లనే తెరలుగాపట్ట నాటకాలాడేవారు. వారికి పెట్రొమాక్సు లైట్లుకూడ లేనిరోజులవి. కేవలం దివిటీల వెలుతురులోనే ప్రదర్శించేవారు. వీరి సమాజంలో పళ్ళాల జగ్గయ్య పురుషపాత్రల్నీ, దుర్యోధనగారి వీరాస్వామి స్త్రీ పాత్రల్నీ ధరించేవారు. ముఖ్యంగా పళ్ళాల జగ్గయ్య బళ్లారి రాఘవాచార్యుల మెప్పును పొందిన మేటినటుడు.

తరువాత 1910 సంవత్సర ప్రాంతంలో పాత విద్యార్థులందరూ కలిసి విద్యార్థి సంఘం అనే నాటక సంఘాన్ని స్థాపించారు. వీరు స్వంతంగా నాటకాలాడి డబ్బు సంపాదించి స్వశక్తితో టిన్నురేకు హాలును నిర్మించుకున్నారు. ఆ హాలు శిధిలావస్థలో వుంది. ముఖ్యంగా నాటకసమాజంలో నిర్మాణం దర్శకబాధ్యతల నన్నిటినీ వహించినవారు రంతుమియా. ఈ సమాజంలో ప్రఖ్యాతివహించిన నటులు గుర్నాథంచెట్టి, సుబ్బయ్య, బాబూరావు, జయరామనాయుడు, అవధానం శంకరయ్య, గురువుగారి వెంకటకృష్ణయ్య, గురువుగారి వెంకటదాసు మొదలైనవారు విద్యార్థి సంఘంలోవుండి కట్టుదిట్టంగా నాటకాలు ప్రదర్శించారు.

తిరిగి 1930 ప్రాంతంలో వెంకటగిరి రాజాగార్ల పోషణలో వెంకటగిరి అమెచ్యూర్సు అనే నాటక సమాజాన్ని తిరిగి పునర్నిర్మించారు. స్వంతంగా ఒక నాటక హాలును కట్టించారు. అది ఈనాటికీ ప్రదర్శనయోగ్యంగా వుంది. ఈ థియేటరులో ప్రముఖనటుడు బళ్ళారి రాఘవకూడ కొన్ని నాటకాలను ప్రదర్శించారు. వీరు నాటకసంఘం స్థాపించే నాటికి వచ్చిన మార్పుల్లో గమనించతగింది స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించటం. వీరు ప్రమీలార్జునీయం, కృష్ణలీలలు, చిత్రనళీయం మొదలైన పౌరాణిక నాటకాలను ప్రదర్శించేవారు. ఈ సమాజంలో పాల్గొన్న నటులు కొంతవరకు బాగా చదువుకుని ఉద్యోగాలు చేసుకునేవారు. పురుషపాత్ర ధారుల్లో తిరుమలశెట్టి రంగనాయకులు, డాక్టరు తిరుమలశెట్టి సింహాచలం, మహేశ్వరం, డాక్టరు దామోదరం, జగధీశ్వరరావు, దుర్యోధన్‌గారి వెంకటసుబ్బయ్య మొదలైనవారు.

ఇక స్త్రీ పాత్రలు ధరించినవారు జేవదాసీలైన శేషసుందరి, రోశమ్మ, నవరత్నమ్మ, బేబి, నారాయణమ్మ మొదలైనవారు. ఈ విధంగా ఈ సమాజం కొంతకాలం నాటకాలు ప్రదర్శించిన తరువాత 1930 లో వెంకటగిరి అమెచ్యూర్ ఆర్టిస్ట్సు అసోసియేషన్ సమాజాన్ని పాత విద్యార్థులందరూ కలిసి స్థాపించారు. వీరు విప్రనారాయణ, ఖిల్జీరాజ్యపతనం, మీరాబాయి, ఉషాపరిణయం మొదలైన పౌరాణిక చారిత్రకాలనేకాక అనేకమైన సాంఘికనాటకాలను కట్టుదిట్టంగా ప్రాక్టీసు చేసి ఆంధ్రనాటక కళాపరిషత్తు మహాసభల పోటీల్లో ప్రదర్శించి అనేక ప్రథమ బహుమతుల్ని పొందారు. అలా బహుమతులు పొందిన పరిషత్తులు హిందూపూరు ఆంధ్రనాటక కళాపరిషత్తు వార్షికసభల్లో గాలి బాలసుందరరావుగారు రచించిన అపోహ నాటకాన్నీ, శరత్ పరీణీతను నాటకంగా మార్చి కాకినాడ పరిషత్తులోనూ, మల్లాది అవధాని రచించిన 'గాలివాన' నాటకాన్ని బందరు పరిషత్తులో ప్రదర్శించి, మెరిట్ సర్టిఫికేట్‌ను పొందారు. ఆనాటికి కళాపరిషత్తు పోటీ పద్ధతుల్ని ప్రవేశపెట్టలేదు.

తరువాత మద్రాసు నాటక కళాపరిషత్తుసభల్లో బాలసుందరరావుగారి అపోహను ప్రదర్శించి మొదటి బహుమానాన్ని పొందారు. గుడివాడ పరిషత్తులో కొండముది గోపాలరాయశర్మ రచించిన 'ఎదురీత' నాటకాన్ని ప్రదర్శించి ప్రథమ బహుమానాన్ని పొందారు. అలాగే ఏలూరు పరిషత్తులో ఆత్రేయ రచించిన

'యన్. జి. ఓ' నాటకానికి, విజయవాడ పరిషత్తులో ఆత్రేయ రచించిన 'ఈనాడు' నాటకానికి ప్రథమ బహుమానాలను పొందారు. ఈ విధంగా వెంకటగిరి అమెచ్యూర్సు ఆంధ్రనాటక రంగంలో ఔత్సాహిక నటీనటులకు, నాటక సమాజాలకు కొత్త వుత్సాహాన్నిచ్చారు. వీరు కొంతకాలం పరిషత్తుల్లో బహుమతులను మాత్రం పొందడానికే తయారుచేసేవారు. కాని తరువాత రాఘవపేట నాటక మండిరాన్ని స్థాపించాలని గూడవల్లి రామబ్రహ్మం అధ్వర్యంలో ఎదురీత నాటకాన్ని ఆంధ్రదేశపు ముఖ్యపట్టణాల్లో ప్రదర్శించి కొంతధనాన్ని సంపాదించారు. తరువాత ఎన్. జి. ఓ; ఈనాడు; డాక్టర్ కోట్నీసు నాటకాలను కొన్ని ఆంధ్ర నగరాలలో ప్రదర్శించారు. వీరు పరివర్తన, రషీదా అనే నాటకాలను కూడా ప్రదర్శించారు. ఈ నాటక సమాజంలో ప్రముఖులైన నటీనటులు వుద్భవించారు. వారిలో డాక్టరు దామోదరం, జయరాంనాయుడు, జగన్నాధ ప్రసాద్, ఈశ్వరదాస్, ఆత్రేయ, కబీరు, టి. వి. రమణారెడ్డి, దుర్యోధనగారి జగన్నాధం, కేశవయ్య, అవధానం శంకరశాస్త్రి, నరసింహులు, సుబ్రహ్మణ్యం మొదలైనవారు; స్త్రీ పాత్రల్లో కావూరి లక్ష్మీకాంతమ్మ, టి. జి. కమలాదేవి, పూర్ణిమ, సుబ్రహ్మణ్యకుమారి, మూలపిల్ల సుందరమ్మ, సురభి బాలసరస్వతి, నిర్మల, రామతిలకం, బాలామణి, లలిత మొదలైనవారు. ముఖ్యంగా ఈ నాటక సమాజాన్ని కట్టుదిట్టంగా నిర్వహించిన కార్యకర్తల్లో ముఖ్యులు సినీమ్యూజిక్ డైరెక్టరు పి. మోహన్‌దాసు, సాధనా ఫిలిమ్సు ప్రొడ్యూసరు డైరెక్టరు రంగనాధదాసు, రామేశ్వరదాసు, నర్సయ్య, డాకరు రాము దాసు మొదలైన కళాకారులు.

పై సమాజాలేకాక 1947 లో ప్రోగ్రసివ్ ఆర్టుథియేటరు, కల్చరల్ ఆర్టుధియేటర్, వెంకటగిరి ఆర్టుథియేటర్సు, జనతా ఆర్టుధియేటర్సు మొదలైన సమాజాలు కూడ ఏర్పడి పనిచేస్తున్నాయి.

ఈ సమాజాలలో పి. నగరాజారావు, వి. నారాయణబాబు, కె. రవీంద్రనాధ్, సి. హెచ్. గోవర్ధనమ్, కె. వెంకటశేషయ్య, పి. వెంకటసుబ్బయ్యనాయుడు, శ్రీవేణు, సుబ్బరామనాయుడు, వెంకట గోపాల్‌నాయుడు, గుర్నాథం, డాక్టర్ పి. వెంచయ్య, యస్. యల్. నరసింహం, శాస్త్రి, చంద్రశేఖరం మొదలైన నటీనటులు పనిచేశారు.

ఈ విధంగా వెంకటగిరి నాటకరంగం చరిత్రలో ఔత్సాహిక నాటకరంగంలో కొత్త ప్రమాణాలను ప్రవేశపెట్టి యువకుల్ని వుత్సాహపర్చింది.

అల్లూరు నాటక రంగం :

ఆనాడు నెల్లూరు నాటకరంగంతోపాటు నెల్లూరుకు సమీపంలోవున్న అల్లూరులో శ్రీ కృష్ణవిలాస సభ అనే నాటక సమాజాన్ని పర్వతరెడ్డి రామచంద్రారెడ్డిగారు స్థాపించారు. ఈ సమాజ కార్యదర్శిగా కె. వెంకటరమణారెడ్డిగారు బహుముఖసేవ చేశారు.

అల్లూరు కృష్ణవిలాస సభవారి రామదాసు నాటకం ఆంధ్రదేశంలో విశేష ఖ్యాతి నందుకొంది. రామదాసు నాటకంలో కబీరు పాత్రధారణలో పర్వతరెడ్డి రామచంద్రారెడ్డిగారు అఖండమైన పేరు ప్రతిష్ఠల్ని సంపాదించుకున్నారు. ముమ్మూర్తులా కబీరుపాత్రకు సరిపోయే అంగసౌష్టవం ఆయనది. స్వచ్ఛమైన వుచ్చారణ, గంభీరమైన గాత్రం, కబీరుపాత్రను తీర్చి దిద్దింది. వీరి నాటకసమాజం నాటకాలను ఎంతో కట్టుదిట్టంగా ప్రదర్శించారు. వీరి సమాజానికి రామదాసు నాటకం ఎక్కువ పేరును సంపాదించి పెట్టింది. అంతేగాక దువ్వూరి రామిరెడ్డిగారి సీతావనవాస నాటకాన్ని, ప్రహ్లాద మొదలైన ఇతర నాటకాలను కూడ ప్రదర్శించేవారు. వీరి నాటకాల్లో మరో పేరుపొందిన నటుడు లచ్చారెడ్డిగారు. వీరు హాస్యపాత్రలను నటించడంలో బహు ప్రసిద్ధుడు.

గూడూరు :

1954 లో సంస్కృతి సమ్మేళనం, నవోదయ నాట్యమండలి, ఆంధ్ర అభ్యుదయ నాట్యమండలి, విజ్ఞాన సంఘం, కాళిదాస కళానికేతన్, లలితకళా మండలి, ఆదర్శ నాట్యమండలి మొదలైన నాటకసమాజాలు పనిజేశాయి.

యరగుడిపాటి హనుమంతరావు, వై. వి. రావు, సిని డైరెక్టరు, ఎ. అజీజ్, శ్రీనివాసరావు, రామయ్య, డి. వి. శేషయ్య, పి. సిద్ధయ్యనాయుడు, రంగనాయకులు, కె. వి. రామచంద్రారెడ్డి, బి. పద్మనాభరెడ్డి, యస్. ప్రకాష్ మొదలైన నటులు పనిజేస్తున్నారు.

బిట్రగుంటలో 1928 లో రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఏర్పడి పనిజేస్తూ వుంది.

కావలి :

1952 లో కావలి కాలేజి డ్రమెటిక్ అసోసియేషన్, 1958 లో విశ్వోదయ లలితకళాసమితి, శారదా నాట్యమండలి ఏర్పడి పనిజేస్తున్నాయి. కేసరి కృష్ణమూర్తి, వేసుల రాజ్యలక్ష్మి, జె. వి. సుబ్బారాయుడు, జి. పరమేశ్వర రావు, కె. శంకరయ్య, పి. నర్సయ్య, కె. సుబ్బయ్య. యం. సి. కోటయ్య, పి. సత్యనారాయణ మొదలైన కళాకారులు పనిజేస్తున్నారు.

కందుకూరు :

1922 లో మార్కండేయ నాట్యమండలి. 1952 లో ధరణి నాటకమండలి. ఆర్య వైశ్యనాటకసంఘం పనిజేస్తున్నాయి. ఈ సమాజాల్లో నందా మార్కండేయ శర్మ. యం. సీతారామనాధశాస్త్రి. యం. రాధాకృష్ణయ్య యం. ఆంజనేయులు. పాచ్చా. నరసింహారావు. శ్రీనివాసరావు. పి. రాధాకృష్ణమూర్తి, శ్రీమతి యస్. సరోజినీదేవిగార్లు పనిజేస్తున్నారు.

పొదిలి :

1954 లో సత్యనారాయణ కళాసమితి, 1957 లో రాఘవ అమెచ్యూర్స్ పనిజేస్తున్నాయి. కె. యల్. సీతారామయ్య, టి. రాఘవులు, సూర్యప్రకాశరావు, మాధవయ్య, కె. సూర్యనారాయణ, వి. శేషాద్రి, యం. వి. రమణయ్య, పి. వి. సుబ్బారావు మొదలైనకళాకారులు పనిజేస్తున్నారు.



# గుంటూరుజిల్లా

# నాటకరంగం

గుంటూరు, తెనాలి, నరసరావు పేట, బాపట్ల, గురజాల, చీరాల, ఒంగోలు, రేపల్లె, వేటపాలెం మొదలైన నాటకరంగాలు.

# గుంటూరు నాటకరంగం

గుంటూరు హిందూ నాటక సమాజమనే ఫస్టుకంపెనీ 1882 సం॥ మొదలు 1912 వరకూ కొండుభొట్ల సుబ్బరాయశాస్త్రి, పాతూరి శ్రీరాములు, పోలూరు హనుమంతరావు, తోలేటి అప్పారావు మొదలైనవారు నిర్వహించిన ఈ సమాజంలో అద్వితీయమైన నాట్యకళావైదుష్యాన్ని ప్రదర్శించిన పితామహుడుగాను, నటకాగ్రేసరుడుగాను పేరు ప్రతిష్ఠలు గడించుకున్నవారు హరిప్రసాదరావుగారు. ఈ సమాజంవారు ఆనాడు మద్రాసులోనూ,ఆంధ్రదేశమంతటా పర్యటించిఅఖండమైన ఖ్యాతి నార్జించారు. వీరు ప్రదర్శించిన నాటకాల్లో రామదాసు, పద్మవ్యూహం, హరిశ్చంద్ర, చిత్రనళీయం, పిశాచసారంగధర, అభిజ్ఞాన శాకుంతలం మొదలైనవి ముఖ్యమైనవి.



శ్రీ హరిప్రసాదరావుగారు (హరిశ్చంద్రుడు)
శ్రీ కోపల్లె హనుమంతరావుగారు(చంద్రమతి)

ఫస్టుకంపెనీలో అనేకమంది ఉద్దండులైన నటులు వుద్భవించారు. కలపటపు వరసింహారావు, రాగం వీరాస్వామి, బాబు నౌషర్‌వాంజీ, కోపల్లె హనుమంతరావు, శ్రీ పార్వతీశ్వరశాస్త్రి, పత్రి గోపాలరావు, ఇవటూరి వియ్యన్న, బొడ్డుపల్లిశాస్త్రిలు, మల్లాది సోమయాజులు, నాళ్ళచెరువు రామారావు, బలిజేపల్లి లక్ష్మీకాంతం, పత్రి వెంకటరమణరావు, తిప్పావరుల లక్ష్మీనారాయణ, బలిజేపల్లి సీతారామయ్య, కోటంరాజు లక్ష్మీకాంతం, హరిసుబ్బారావు, పత్రి శ్రీనివాసరావు, తూములూరు పుల్లయ్య, నాళ్ళచెరువు నరసింహారావు, భువనగిరి లక్ష్మీనారాయణ, వారణాసి

బలరామయ్య. అధరాపురపు గోపాలాచార్యులు ప్రభృతులు ఈ కంపెనీలో పాల్గొన్నారు.

విబుధరంజనీ
శృంగార హిందూ
నాటక సమాజం :

1885 సంవత్సరంలో ప్రారంభమైన విబుధరంజనీ శృంగార హిందూ నాటక సమాజ మనే సెకండు కంపెనీ 1912 వరకూ దేదీప్యమానంగా నడిచింది. ఈ నాటక సమాజాన్ని కనకరత్నం శ్రేష్ఠిగారు స్థాపించి, స్వంత నాటకశాలను నిర్మించి పాండవజననం, వేణీసంహారం, ద్రౌపదీ స్వయంవరం, చిత్రనళీయం, సారంగధర, హరిశ్చంద్ర మొదలైన ప్రముఖ నాటకాలను స్థానికంగా ప్రదర్శించడమేగాక సర్కారాంధ్రదేశమంతటా పర్యటించి ఘనమైన కీర్తిని ఆర్జించారు.

ఈ నాటక సమాజంలో పత్రి గోపాల్‌సింగ్, క్షత్రి దివాకర్‌సింగ్, గుత్తా శేషయ్య, మందపాటి నరసింహారావు, మల్లాది గోవిందశాస్త్రి, పులుగుండ్ల వెంకట రమణయ్య, మల్లాది వేంకటరామయ్య, కొడవటిగంటి వెంకటప్పయ్య, పత్రి వేంకటరమణారావు, గుండవరపు వీరభద్రయ్య, వుమ్మెత్తల సీతాపతి, కోటంరాజు లక్ష్మీకాంతం, గుండిమెడ చలపతిరావు, మేడిసెట్టి సుబ్బారావు మొదలైనవారు బహుముఖ పాత్రలు ధరించి మేటి నటులుగా కీర్తింపబడ్డారు. వీరేగాక చల్ల యల్ల మంద, నేతి సుబ్బరాయశాస్త్రి, పొరల నర్సయ్య అనే ఈ ముగ్గురు మూర్తులూ ఈ సమాజ నిర్వహణలో ప్రముఖ బాధ్యతల్ని వహించారు.

సెకండ్ కంపెనీలో ఎంతమంది పనిచేసినా ఆ సమాజానికి బ్రహ్మాండమైన కీర్తిప్రతిష్ఠలు చేకూర్చి సుప్రసిద్ధ నటకాగ్రేసరులుగా కీర్తింపబడినవారు మల్లాది గోవిందశాస్త్రిగారు.

కన్యకాపరమేశ్వరి
నాటక సమాజం :

1889 సం॥ నుండి 1899 వరకు నడిచిన ఈ సమాజాన్ని గోపుకృష్ణమ్మ స్థాపించారు. మల్లెల చలపతి, కిడాంబి వేదాద్రి నరసింహాచార్యులు నిర్వాహకులుగా వున్నారు. ఈ సమాజంవారు-హరిశ్చంద్ర, రుక్మాంగద, బొబ్బిలి, చంద్రకాంత

మొదలైన నాటకాలను ప్రదర్శించారు. ఈ సమాజంలో చోడగం కృష్ణయ్య, అల పర్తి పాపయ్య, గుడివాడ వెంకటేశ్వర్లు, కనుమర్లపూడి వెంకటప్పయ్య మొద లైనవారు నటులుగా వెలుగొందారు. ఈ రోజుల్లోనే పొత్తూరు సుబ్బయ్య, సుధీపథ హితబోధినీ నాటక సమాజాన్ని 1890 లో స్థాపించి 1895 వరకూ నడిపారు.

1895 లో గుంటూరులో ప్రథమ హార్మోనిస్టుగా పేరుపొందిన మహమ్మద్. షర్‌పుద్దీన్ క్రిసెంట్‌స్టార్ వుర్దూ డ్రామెటిక్ సొసైటీని స్థాపించి 1926 వరకూ 'ఖూన్‌దానేహమాన్' 'గులేబకావళి' 'సహేర్‌సామరీ' మాత్‌మేజఫర్' 'ఇందర్‌సభ' మొదలైన వుర్దూ నాటకాలను ప్రదర్శించారు. ఈ నాటకాలలో మోసెన్‌షరీఫ్—మొహదీన్ బేగ్—అబ్దుల్‌కరీం—షేక్‌బిక్కు—రామ వులు—దరాజ్‌బేగ్ మొదలైనవారు నటులుగా వెలుగొందారు.



1906 లో యం. డి. గోపాలచారి ఇంగ్లీషు డ్రామెటిక్ క్లబ్‌ను స్థాపించి రోమి యో జ్యూలెట్, మర్చంట్ ఆఫ్ వెనీస్ మొద లైన ఇంగ్లీషు నాటకాలను ప్రదర్శించారు.

1910 వ సంవత్సరంలో కొంతమంది న్యాయవాదులు కృష్ణానంద హిందూ నాటక సమాజాన్ని స్థాపించారు. 1923 వరకు గిరి శ్రీ కడియాల రత్తయ్యగారు (రుక్మిణి) రాజు రామమూర్తి, చెరిమికంటి లక్ష్మీనారా యణగార్లు ఈ సమాజాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న నటులందరూ ప్లీడరు గుమాస్తాలు. వీరు ప్రదర్శించిన నాటకాలు 'ప్రసన్నయాదవం' 'పాండవ విజయం' 'గయోపాఖ్యానం' 'హరిశ్చంద్ర' 'బొబ్బిలి' మొదలైనవి. గిరిరాజు రామమూర్తి, చెరిమికంటి లక్ష్మీనారాయణ, యద్దనపూడి నరసింహం, ఉండవల్లి లక్ష్మీనారాయణ, ఆరణి సత్యనారాయణ, పెనుమాక నర సింహం మొదలైనవారు నటులుగా పేరుపొందారు.

సీనియర్
హిందూథియేటరు :

గుంటూరు పట్టుకంపెని నిలిచిపోయిన తరువాత హరిప్రసాదరావుగారు 1912 సంవత్సరంలో సీనియర్ హిందూథియేటర్‌ను స్థాపించి హరిశ్చంద్ర, సారంగధర,

శకుంతల మొదలైన నాటకాలను ప్రదర్శించారు. హరిప్రసాదరావు, కోప హనుమంతరావు, పర్వతనేని వీరయ్య చౌదరి, పిల్లలమఱ్ఱి సుందరరామయ్య, బెల్లంకొండ సుబ్బారావు, తూములూరు పుల్లయ్య మొదలైనవారు ప్రసిద్ధ నటులుగా పేరు తెచ్చుకున్నారు.

అమెచ్యూర్
డ్రమెటిక్ క్లబ్:

యడవల్లి సూర్యనారాయణ ఆధ్వర్యంలో అమెచ్యూర్ డ్రమెటిక్ క్లబ్ స్థాపించబడి 1912 నుండి 1915 వరకు నడిచింది. వీరు ప్రసన్నయాదవం, గయోపాఖ్యానం, బొబ్బిలి నాటకాలను ప్రదర్శించారు. యడవల్లి మైలవరం కంపెనీలో చేరడంతో ఈ కంపెనీ మూలబడింది. ఈ సమాజంలో యడవల్లి, వంగల ఆంజనేయులు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నటులుగా వర్ధిల్లారు.

సీతారామ
నాటక సమాజం:

బోళ్ళ వేంకటప్పయ్య, పురుషోత్తం స్థాపించిన ఈ సమాజం 1912 నుంచి 1919 వరకూ సాగింది. 1917 లో గుంటూరులోనూ, బెజవాడలోనూ జరిగిన హరిశ్చంద్రకాంపిటీషన్ డ్రామాల్లో ట్రూప్ కప్పును గెలుపొందారు.

మూన్‌థియేటరు:

పొత్తూరు హనుమంతరావు, బండారు రామస్వామినాయుడు, పాదర్తి సోమయ్య, ప్రత్తి సుబ్రహ్మణ్యం మొదలైనవారు 1912 లో మూన్‌థియేటరును స్థాపించి అనేక చారిత్రక నాటకాలనూ, పౌరాణిక నాటకాలనూ ప్రదర్శించారు. 1916 లో గుంటూరులో ప్రసన్నయాదవ నాటకానికి, రాజమండ్రిలో బొబ్బిలి కాంపిటీషన్ నాటకానికీ ట్రూపు కప్పును గెలుచుకున్నారు. ఈ సమాజంలో గోవింద రాజు వేంకటరామయ్య, ఆరణి సత్యనారాయణ, కడియాల రత్తయ్య మొదలైనవారు ప్రసిద్ధ నటులు.

హిందీ నాటక్‌సభ:

1913 లో పాదర్తి సోమయ్యగారు హిందీ నాటక్‌సభను స్థాపించి, హిందీ నాటకాలు ప్రవర్శించారు. తాళ్ళూరు నరసింగరావుగారు ఈ సమాజంలో పాల్గొని, పీష్వా నారాయణరావు హిందీ నాటకాన్ని ప్రదర్శించారు.

స్టార్ థియేటరు:

1913 లో అద్దంకి శ్రీరామమూర్తి స్థాపించారు. 1920 వరకూ ఈ సమాజం నడిచింది. వీరు పౌరాణిక చారిత్రక నాటకాలు ప్రదర్శించారు. రావిపాటి లక్ష్మీ నారాయణ-పొతకమూరి మల్లయ్య-జంధ్యాల కృష్ణారావు-బొగ్గవరం కృష్ణారావు-మద్దాలి సూర్యనారాయణ మొదలైన అనేకమంది నటులు పాల్గొన్నారు.

అఫిషియల్
డ్రమెటిక్ క్లబ్:

ఈ సమాజాన్ని పొత్తూరు లింగయ్య మొదలైనవారు 1913 లో స్థాపించి 1930 వరకు నాటకా లాడించారు. కొప్పరపు సుబ్బారావు కవిగానూ దర్శకుడుగానూ వెలుగొందిందిక్కడే. బళ్ళారి రాఘవ, స్థానం నరసింహారావు వీరి విజయనగర సామ్రాజ్య పతనం, రోషనార నాటకాల్లో పాల్గొన్నారు. వీరేగాక, బెల్లంకొండ సుబ్బారావు, బండారు రామస్వామి, వలివేటి శ్రీమన్నారాయణ, లక్కరాజు విజయగోపాలరావు మొదలైన వారు నటులుగా పేరు పొందారు.



రోషనారగా స్థానం నరసింహారావుగారు

విద్యాదాస
వినోదసీసభ:

పత్రి వేంకటరమణారావు 1913 లో స్థాపించి, గయోపాఖ్యానం, చిత్రనళీయం, ప్రసన్నయాదవం, చింతామణి మొదలైన నాటకాలను ప్రదర్శించి, 1927 సం॥ రంలో ఈ సభను పూర్తిగా నిలిపివేశారు. నటులుగా

పత్రి వేంకటరమణరావు. పత్రి శ్రీనివాసరావు. పర్వతనేని వీరయ్యచౌదరి. మల్లాది గోవిందశాస్త్రి. జాగర్లమూడి నరసింహారావు మొదలైనవారు ప్రముఖపాత్ర వహించారు.

సంఘసేవా
నాట్యమండలి :

ఈ సమాజాన్ని 1920 లో దామరాజు పుండరీకాక్షుడు స్థాపించి, స్వరాజ్య సోపానం, గాంధిమహోదయం, గాంధివిజయం, పాంచాల పరాభవం, సంస్కారిణీ మొదలైన దేశభక్తిని ప్రబోధించే నాటకాలతో 1926 వరకూ ఆంధ్రజాతిని వుత్తేజ పరిచారు. ఈ నాటకాల్లో పత్రి శ్రీనివాసరావు, బసవరాజు సుబ్బారావు, నిడు ముక్కల సుబ్బారావు, దైతా గోపాలం, పెద్దిభొట్ల చలపతిరావు, ముక్కామల ముకుందరామయ్య, కడియాల రత్తయ్య, పువ్వుల అసూయ మొదలైన నటీ నటులు పాల్గొన్నారు.

బాలమిత్ర
నాటక సమాజం :

ఈ సమాజాన్ని 1916 లో దంటు వెంకటకృష్ణయ్య స్థాపించారు. ఈ సమాజంలో కొప్పరపు సుబ్బారావు ప్రముఖపాత్ర వహించారు. 1928 వరకూ ఈ సమాజం నడిచింది. తరువాత దీని స్థానంలో నవలా నాటక సమాజం ఏర్పడి స్త్రీ పురుషపాత్రలు స్త్రీలే ధరించే పద్ధతిలో 1930 వరకూ నడిచింది.

బాలమిత్ర సమాజంలో టి. రామకృష్ణశాస్త్రి, కె. రఘురామయ్య, పైడి బాబు, రావుల లక్ష్మీకాంతం, మాస్టర్ కళ్యాణి, నాగలింగం, సూరిబాబు, ఆంజి మొదలైన సమర్థులైన నటులు వుద్భవించారు.

నవలా నాటక సమాజంలో శ్రీమతులు దాసరి కోటిరత్నం, పసుపులేటి కన్నాంబ, సిద్ధాబత్తుని శ్రీహరి, ఆదోని అమ్మణిబాయ్,దాసరి యామినీ పూర్ణతిలక్, దాసరి అంజనీబాయి మొదలైన నటీమణులు నాటకరంగంలోనూ, సినిమా రంగంలోనూ ప్రఖ్యాతి పొందారు.

అఖిల సాహిత్య కళాభివర్ధక ఆంధ్రసంసత్ తరపున 1952 లో వారణాసి

రామమూర్తి సాహిత్య గోష్ఠిని స్థాపించి పూర్వ నటులను స్మరించటం, వృద్ధ నటులను ఆదరించటం, ఔత్సాహిక నటులను ప్రోత్సహించటం మొదలైన ఆశయాలతో 1953 లో హరిప్రసాదరాయ వర్ధంతిని జరిపారు. కడియాల రత్తయ్య. పత్రి వేంకటరమణరావు. తూములూరు పుల్లయ్య. బండారు రామస్వామి, సింగరాజు నాగభూషణం. గోవిందరాజుల సుబ్బారావు. స్థానం నరసింహారావు. దాడి గోవిందరాజులనాయుడు, ముప్పవరపు భీమారావు మొదలైన సుప్రసిద్ధ నటకాగ్రేసరులను ఘనంగా సన్మానించారు.



డాక్టరు శివరామకృష్ణయ్యగారు
(కర్ణుడు)

ఆంధ్రవిజ్ఞాన లలితకళాపరిషత్:

మందపాటి రామలింగేశ్వరరావుగారు 1953 లో ఆంధ్రవిజ్ఞాన లలితకళా పరిషత్తునుస్థాపించి హరిప్రసాదరాయ నాటక కళాగోష్ఠులను జరిపారు. విక్రమదేవవర్మగారిచే నాట్యకళానిధి అనే బిరుదును పొందారు.

వుర్దూ నాటకసమాజ్:

మహమ్మదు జానిసాహెబ్ ఈ సమాజాన్ని 1927 లో స్థాపించి, 1932 వ సంవత్సరంవరకు పోషించారు. 'ఖుదాదోస్త్' 'ముస్తఫాకమాల్' 'లైలామజ్ను' మొదలైన వుర్దూ నాటకాలను ప్రదర్శించారు.

హిందూకాలేజి డ్రమెటిక్ అసోసియేషన్:

ఈ సమాజం పఱిన కలవగుంట నరసింగరావుగారు నాటక కళాభివృద్ధికొరకు అంతర్ కళాశాలా నాటక పోటీలకు బహూకరించిన షీల్డు నిమిత్తం నాటక పోటీలు జరుపబడుతూ వున్నాయి. ఈ ప్రదర్శనాలలో పిల్లలమఱ్ఱి హనుమంతరావు. ముక్కామల అమరేశ్వరరావు, వేమూరు రామయ్య, ముక్కామల కృష్ణమూర్తి,

ధూళిపాళ సీతారామశాస్త్రి స్టారుథియేటరు స్థాపించి ఉద్యోగవిజయాలు, గయోపాఖ్యానం, బొబ్బిలి మొదలైన నాటకాలు ప్రదర్శించి దుర్యోధన పాత్రకు ప్రత్యేక బహుమానాలను సంపాదించారు.

పైన వివరించిన సమాజాలేకాక ముక్కామల అమరేశ్వరరావు స్థాపించిన 'నవజ్యోతి', 1943 లో తోట రత్తయ్య, కూర్మా వేణుగోపాలస్వామిగార్లు స్థాపించిన నాట్యసమితి, నాట్యకళామందిర్, హిందూకాలేజి హైస్కూలు నాట్యమండలి, భారతీనాటకసమితి, సాహితీ ఆర్టు థియేటర్స్,సాహిణీ ఆర్టు థియేటర్సు, బాలానంద కేంద్రం,రవి ఆర్టు థియేటర్,లలితకళాసమితి,నటరాజసేవాసంఘం, మారుతీ నాట్యమండలి, సీతారామ నాట్యకళాసమితి, నటరాజకళామండలి,కల్చరల్ అసోసియేషన్, నటరాజ నాట్యమండలి, విజయవాణీ కళాసమితి మొదలైన సమాజాలు ఏర్పడి పని చేస్తున్నాయి.

ఈ సమాజాలలో—

ధూళిపాళ సీతారామశాస్త్రి, బండారు రామస్వామి, కడియాల రత్తయ్య, సవరం వీరాస్వామి, పెళ్ళారి శేషగిరిరావు, ముప్పవరపు భీమారావు, మందపాటి రామలింగేశ్వరరావు, కురిచేటి నాగేశ్వరరావు, బి. జగన్నాధం, బి. కె. విశ్వేశ్వరరావు, వేమారావు, జి. విద్యాసాగర్, డి. రామచంద్రరావు, టి. పుండరీకాక్షయ్య, జి. రామచంద్రరావు, జె. సీతారామశాస్త్రి, గుంటపల్లి వెంకటరత్నం, యం. ఆర్. ఆంజనేయులు, ఎ. యన్. ఆర్. ఆంజనేయులు, అరవపల్లి సుబ్బారావు, రవీంద్రనాధ్, పి. కాళిదాసు, డి. కుమార్, ఎ. లక్ష్మణరావు, పి. వి. స్వామినాయుడు, కె. కృష్ణమూర్తి, టి. యస్. వెంకటేశ్వరరావు, కె. చక్రపాణి, కె. యస్. ఆర్. ఆంజనేయులు, బొగ్గవరపు రామకృష్ణరావు, వై. మృత్యుం, జయశర్మ, ఆకుల సత్యనారాయణ, యం. వి. యస్. శాస్త్రి, అరిపిరాల రాధాకృష్ణ, చిలుకూరి సుబ్బారావు, షేక్ నాజర్, కాకుమాను నాగభూషణం, శ్రీమతి జి. కోమలి, ముక్కామల కృష్ణమూర్తి, వల్లభజోశ్యుల,శివరామ్, కె. శివరామకృష్ణయ్య, జి. వరలక్ష్మి, ఛాయాదేవి, కొంగర జగ్గయ్య, గుమ్మడి వెంకటేశ్వరరావు, వేపూరి రామకోటి, సినీనటుడు బాలయ్య, కె. రఘురామయ్య, వై. వి. రాజు, సీనియర్ శ్రీరంజిని, జూనియర్ శ్రీరంజిని. పి. శ్రీరామశాస్త్రి. డి. లక్ష్మీనరసింహారావు, తంగిరాల శ్రీరామమూర్తి, వలివేటి రామసుబ్రహ్మణం, బి. శ్రీనివాసమూర్తి, పొత్తూరి నర

సింహారావు, వై. కేశవరావు, పోలూరి లక్ష్మీకాంతరావు, యం. పార్వతీశం, యలమర్తి వెంకటసుబ్బారావు, టి. సత్యనారాయణ, శ్రీమతి పుష్పాంజలి, తారాబాయి, రాయప్రోలు సూర్యనారాయణశాస్త్రి, బి. జగన్నాధరావు, యం. వి. రాఘవరావు, శ్రీమతి మణి మొదలైన నటీనటులు పనిచేస్తున్నారు.

## తెనాలి నాటకరంగం

తెనాలిలో శ్రీ కృష్ణ హిందూ థియేటరుపేర చల్లా ఆంజనేయులుగారు ఒక సమాజాన్ని స్థాపించి ఒక హాలును నిర్మించారు. ఈ సమాజంలో గుంటూరు సెకండ్ పంపెసీనటులైన మల్లాది గోవిందశాస్త్రిగారు ముఖ్య పాత్రల్ని ధరిస్తూ వుండేవారు. పాది రంగయ్యగారు నాయిక పాత్రల్ని ధరిస్తూ వుండేవారు.



శ్రీ గోవిందరాజుల సుబ్బారావుగారు
(ప్రతాపరుద్రీయంలో పిచ్చివాడు)

1921 సంవత్సరంలో భాగవతుల రాజగోపాలంగారు—త్రిపురారిభట్ల వీర రాఘవస్వామిగారు కలిసి రామ విలాస సభ స్థాపించారు. ఈ సమాజంలో ప్రసిద్ధిపొందిన నటులు పెద్దిభొట్ల చలపతిరావు—డా. గోవింద రాజుల సుబ్బారావు — మాధవపెద్ది వెంకటరామయ్య—పిల్లలమట్టి సుందర రామయ్య—పుసపాటి వెంకటేశ్వర్లు—తంగిరాల ఆంజనేయులు—ఏలేశ్వరపు కుటుంబిశాస్త్రి — లక్కరాజు విజయ గోపాలరావు — పాతూరు సూర్యనారాయణ — దావులూరి బుచ్చి రాజేశ్వర రావు—రావూరి రంగారావు మొదలైన వారు పురుషపాత్రల్ని ధరిస్తూ వుండే వారు. పైవారేకాక స్త్రీ పాత్రధారణలో ప్రఖ్యాతి వహించిన స్థానం నరసింహారావులాంటి ప్రసిద్ధ నటులు రామవిలాస సభలోనే అభివృద్ధి పొందారు. వీరు ప్రదర్శించే నాటకాలు ప్రతాపరుద్రీయం—

కన్యాశుల్కం—బొబ్బిలి— రోషనార బాగా పేరు ప్రతిష్ఠలు సంపాదించాయి. వీరి నాటకాలకు చిత్రలేఖకుడుగా వజ్ఝు బాబురావుగారు పనిచేశారు.



మాధవపెద్ది వెంకటరామయ్య గారు (దుర్యోధనుడు)

దుగ్గిరాల కంపెనీ అనే సమాజం ఒకటి తెనాలిలో ఏర్పడి సౌందర్యభవనం అని ఒకదానిని నిర్మించుకుని యడవల్లి సూర్యనారాయణగారితోకలిసి కొన్ని నాటకాలు ప్రదర్శించారు.

1920 సంవత్సరంలో పులిపాటి వెంకటేశ్వర్లుగారు ఆంధ్రనట సభను స్థాపించారు. 1942 లో జనతా ఆర్టు థియేటరు స్థాపించబడి సాంఘిక నాటకాలను ప్రదర్శిస్తూ అనేక పరిషత్తు పోటీలలో పాల్గొంటూ వుంది.

1948 లో శ్రీ వెంకట గౌరీశంకర నాట్య మండలి స్థాపించబడి పౌరాణిక నాటకాలను ప్రదర్శిస్తూ వుంది. వీరి గౌతమబుద్ధ నాటకం ప్రఖ్యాతి వహించింది. దీనికి కార్యదర్శిగా పి. శ్రీరామమూర్తిగారు పని చేస్తున్నారు.

1957 లో మధుమతి కళాసమితిని వై. బల రామశాస్త్రిగారు స్థాపించి పౌరాణిక చారిత్రక నాటకాలను ప్రదర్శిస్తూ వున్నారు.

1957 లో అభ్యుదయ కళాసమితిని ఐ. వి. రాఘవరావుగారు స్థాపించి, "అంత్యఘట్టం" లాంటి సాంఘిక నాటకాలను ప్రసిద్ధంగా ప్రదర్శిస్తున్నారు.

పైన వుదాహరించిన సమాజాలేగాక, 1950 లో టాగూర్ కళాసమితిని డి. ఆర్. రాజగోపాల్‌గారు, 1948 లో ఆంధ్ర క్రాంతి థియేటర్‌ను పి. ఆంజనేయులుగారు, 1950 లో ఆంధ్ర ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌ను పీసపాటి నరసింహమూర్తిగారు, 1957లో దివ్యకళాకేంద్రాన్ని పి.రమణగారు స్థాపించి పనిచేస్తున్నారు.

వివిధ నాటక సమాజాలు :

ఇవేకాక విజయశ్రీ కళామందిర్—నవ్యకళాకేంద్రం— కళాసమితి —

కల్చరల్ ఆర్టు థియేటర్—రవీంద్ర నాట్యమండలి— వివేకవర్ధని నాట్యమండలి —యువజన నాట్యమండలి—ప్రజావినోద నాట్యమండలి—ఆచార్య ఆర్టుథియేటర్—నేషనల్ ఆర్టు థియేటర్ — హనుమాన్ థియేటర్—జ్యోతిర్మయి నాట్యమండలి—నవోదయ నాట్యమండలి—సాహిత్యవనం—భారతనారి నాట్యమండలి —లలితకళా పరిషత్తు—బాలకళా పరిషత్తు—శ్రీ లక్ష్మీగణపతి నాట్యమండలి —ఆంధ్ర డ్రమెటిక్ కంపెని— హరిప్రసాదరాయ నాట్యమండలి — మునిసిపల్



స్థానం నరసింహారావుగారు (స్త్రీ పాత్ర)

డ్రమెటిక్ ఎంప్లాయీస్ అసోసియేషన్—మాస్టర్ ఆర్టు థియేటర్సు—నవ్య కమల కళామండలి మొదలైన సమాజాలు చారిత్రక, పౌరాణిక, సాంఘిక నాటకాలను ప్రదర్శిస్తున్నాయి.

తెనాలి నాటకరంగంలో ఈ దిగువ వుదాహరించిన నటీనటులు అనేకమంది వెలుగొందారు.

పద్మశ్రీ స్థానం నరసింహారావు, పుట్టపాటి వేంకటేశ్వర్లు, అబ్బూరి వరప్రసాదరావు, వల్లూరు వేంకటరామయ్య, నెల్లూరి సత్యనారాయణ, టి. రామకృష్ణశాస్త్రి, చంద్రమౌళి సత్యనారాయణ, కాకుమాను నరసింహారావు, చిలుకూరి సుబ్బారావు, యు. వి. సుబ్రహ్మణ్యం, పి. రామమోహన్‌రావు, కె. నర్సయ్య, కె. రాజారావు, ఎ. శ్రీనివాసమూర్తి, వై. బలరామ

శాస్త్రి, కె. వి. అప్పయ్యశాస్త్రి, ఎ. యన్. ఆర్. మూర్తి, బి. రామకృష్ణయ్య, బి. వాలేశ్వరరావు, తంగిరాల శ్రీరామమూర్తి, మల్లాది దేవేంద్రుడు, కస్తూరి నరసింహారావు, అబ్బూరు ఆదినారాయణశర్మ, పాటూరి రామకృష్ణమూర్తి, పోతుకూచి లక్ష్మీ నరసింహమూర్తి, కె. సీతాకుమారి, సినీ ఆర్టిస్టు బారా సత్యవతి, కె. సావిత్రి, రత్నమాల, సుందరి, వి. కోటిరత్నం, జానకీదేవి, నాగు మణి, దాసరి కోటిరత్నం, వేమూరి గగ్గయ్య, సి. యస్. ఆర్. ఆంజనేయులు, వంగర వెంకట సుబ్బయ్య, లక్ష్మీరాజ్యం, ఏ. వి. సుబ్బారావు, వేమూరి రామయ్య, వేమూరి సీతారామశాస్త్రి, పెద్దిభొట్ల చలపతిరావు, శ్రీమతి రాజరత్నం మొదలైనవారు.



సి. యస్. ఆర్. ఆంజనేయులు గారు [రామదాసు]

## నరసరావుపేట

1900 సంవత్సరంలో నరసరావుపేటలో విక్టోరియా మెమోరియల్ థియేట్రికల్ కంపెనీ స్థాపించబడింది. ఈ సమాజంలో బందరు నేషనల్ థియేటర్‌కు సంబంధించిన వంగల ఆంజనేయులుగారు ప్రధాన పాత్రల్ని ధరిస్తూ వుండేవారు. వీరు బొబ్బిలి నాటకంలో వెంగళరావు పాత్రను అద్భుతంగా పోషించేవారు. సుప్రసిద్ధ నటులైన బెల్లంకొండ సుబ్బారావుగారు ఈ సమాజానికి చెందినవారే. సుబ్బారావుగారు శ్రీకృష్ణరాయబారం నాటకంలో శ్రీకృష్ణుని పాత్రను ధరించడంలో ప్రసిద్ధి పొందారు.

తరువాత 1936 సంవత్సరంలో అరవపల్లి సుబ్బారావుగారు, శ్రీరాయల్ థియేటర్సును స్థాపించి చింతామణి, కన్యకాపరమేశ్వరి మొదలైన నాటకాలను ప్రదర్శించారు. పైన వివరించిన సమాజాలే కాక, 1954 లో సంతగుడిపాడు హైస్కూలు నాటక సమాజం, 1955 లో విజయసారథి నాట్యమండలి, రాష్ట్రీయ సాహిత్య నాట్యమండలి, విజయ ఆర్టుథియేటరు, 1956 లో సర్వోదయ నాటక కళామండలి, కేసరి ఆర్టుథియేటరు, కనకదుర్గా నాట్యమండలి, యువజన నాట్యమండలి మొదలైన నాటక సమాజాలు ఏర్పడి పనిచేస్తున్నాయి.

ఈ సమాజాలలో చోరగుడి దాశరధిరావు, యం. గోపాలరావు, పోలూరి లక్ష్మీకాంతరావు, పి. శ్రీరామమూర్తి, నంద్యాల కోటిరెడ్డి, పిరాట్ల సూర్యనారాయణ, పసారాజు వెంకటరామారావు, దర్శి శేషగిరిరావు, కోట ఆంజనేయులు, అన్నవరపు సుబ్బారావు, జి. వెంచు రామారావు, పి. రామకృష్ణయ్య, రాణీపేట లక్ష్మీనారాయణ, కె. శేషగిరిరావు, ఆర్. హనుమయ్య, కె. పట్టాభిరామయ్య, మొలకలూరి కృష్ణమూర్తి, వట్టం రంగయ్య, పృథ్వీ వెంకటేశ్వర్లు, యం. నాగేశ్వరరావు, కె. పురుషోత్తమరావు, యస్.వి.చలపతిరావు, పి. వీరయ్య, పి. హెచ్.నరసింహారావు, యన్.గోవిందరావు, మదారురెడ్డి, కె.వెంకటేశ్వరనాయుడు, డి.రామకోటి, యల్ కాసి ప్రభృత నటవర్గం పనిచేస్తున్నారు.



వంగల ఆంజనేయులుగారు [నలుడు]

## చిప్పట్లు

1931 లో స్త్రీ హితైషిణి మండలి డ్రమెటిక్ సొసైటీ, 1935 లో భారత నాట్యమండలి, 1945 లో జాతీయ కళామండలి, ఇండియన్ నేషనల్ థియేటరు, 1946 లో ప్రజా నాట్యమండలి, 1954 లో కళావని, సరస్వతి నాట్యమండలి మొదలైనవి ఏర్పడి పనిచేస్తున్నాయి.

ఈ సమాజాలలో సింగరాజు నాగభూషణం, డాక్టర్ కె. గంగాధరరావు, పి. యల్. నారాయణ, వి. సీతారామారావు, భీమరాజు రామకృష్ణరావు, చెరువు శివరామశాస్త్రి, ఎ. యస్. ఆర్. ఆంజనేయులు, కె. వెంకటరామయ్య, కోన ప్రభాకరరావు, కె. నరసింహారావు, ఎ. రామనాథశాస్త్రి, కె. గోవిందరావు, యల. రామగోపాల్, కె. బాలధనంజయరావు, డాక్టరు యస్. వి. చలపతిరావు, పి. శచీంద్రనాథ్‌తిలక్ యన్. యల్. మురళీధరరావు, జె. జోషి, టి. ప్రకాశరావు, బ్రహ్మండం సుబ్బారావు, కె. బి. శరభి పి. విద్యాసాగర్, కె. శేషతల్పశాయి, వుదుక్కోట లక్ష్మీనారాయణశర్మ, పోగుల సాంబశివరావు, జి. రామశేషు, యన్. నారాయణప్రసాద్, ఛారా వెంకటకృష్ణమూర్తి, టి. నాగేశ్వరరావు, ఎ. నరసింహారావు, శ్రీమతి పాంచాలి, అంజయ్య, దాసరి చంద్రకాంతం, బి. రామకృష్ణరావు, పి. హెచ్. నరసింహ

మూర్తి, వై. సత్యనారాయణశాస్త్రి, కె. యన్. పిన్హా, ఎ. వెంకటేశ్వరరావు, శ్రీమతి సరోజని మొదలైన నటీనటులు పనిచేస్తున్నారు.

## గురజాల

1903 లో విక్టోరియా మెమోరియల్ ఆనంద సమాజం, 1956 లో విజ్ఞాన సమితి మొదలైన సమాజాలు పనిచేశాయి. ఈ సమాజాలలో జానపాటి ప్రకాశరావు, కె. కృష్ణమూర్తి, పిడుగు సూర్యనారాయణ, బి. రాధాకృష్ణమూర్తి, ఉమామహేశ్వరరావు, యన్.వి. ఆర్. సాంబశివరావు మొదలైన కళాకారులు పనిచేశారు.



## చీరాల

1945 లో సర్వమిత్ర కళాసమితి, ఆంధ్ర రత్నకళాసమితి, 1953 లో మార్కండేయ కళాసమితి, 1957 లో నటరాజ కళాసమితి, ఐ. యల్. టి. డి. డ్రమెటిక్ అసోసియేషన్, ప్రజా నాట్యమండలి, గౌతమ అమెచ్యూర్స్, నెహ్రూ నాట్యమండలి, వి. యస్. ఆర్. కాలేజి డ్రమెటిక్ అసోసియేషన్, వైకుంఠపుర కళారాధనసమితి, జాతీయ నాట్యమండలి, ఆదర్శ కళాసమితి, అజంతా ఆర్టిస్ట్స్ ఆదిగాగల అనేక సమాజాలు పనిచేస్తున్నాయి.

నోట్:- బి. రామకృష్ణరావుగారు, రుస్తుం- సింగరాజు నాగభూషణరావుగారు

ఈ సమాజాలలో చీరాల బాలకృష్ణమూర్తి, కార్యమపూడి కృష్ణమూర్తి, కార్యమపూడి వాసుదేవరావు, అవ్వారి సుబ్రహ్మణ్యం, పి. హెచ్. కామేశ్వరరావు, యం. గోపాలకృష్ణమూర్తి, షేక్ జానిసాహెబ్, డి. ప్రకాశరావు, ఆర్. సత్యనారాయణ, దామెర్ల చంచయ్య, అక్కల సుబ్బారావు, టి. కేశవరావు, పి. హెచ్. చంద్రశేఖరరావు, పి. వెంకటాద్రి, డి. బ్రహ్మానందం, దామెర్ల రామారావు, కె. పెరుమాళ్ళు, వంగర రామలింగేశ్వరరావు, మాచెర్ల వెంకయ్య, పిట్టి వెంక

టాద్రి, గంజి బాపనయ్య, నాయని లక్ష్మీనరసింహారెడ్డి, మానేపల్లి సుబ్బారావు, పి. శేషయ్యనాయుడు, ఆర్. సుబ్బారావు, మెహబూబ్, కె. రామమూర్తి, కె. శేషయ్య, కె. జె. పూర్ణానందం, పి. ప్రభుదాస్, లోకమాన్య, వై. వి. సత్యనారాయణమూర్తి, యన్. కోటేశ్వరరావు, జె. పరోజని మొదలైనవారు నటీనటులుగా పనిజేస్తున్నారు.

అబ్బరాజు రంగారావు రచయితగాను, భాగవతుల శ్రీరాములు రంగస్థల దర్శకుడుగాను, డి. వీరభద్రుడు పెయింటరుగాను పనిచేస్తున్నారు.

## ఒంగోలు

1952 లో హిమకార్ కళాసమితి, లలితకళాసమితి, 1954 లో మిత్ర కళాసమితి, సి. యస్. ఆర్. శర్మ కళాశాల నాట్యసమితి, జనతా నాట్యమండలి, అజంతా నాట్యమండలి, ఒంగోలు ఎలెక్ట్రికల్ ఎంప్లాయిస్ క్లబ్, యన్. జి. ఓస్ క్లబ్, వేలన్ ఆర్టు థియేటర్సు, నవ్యకళాసమితి, నాగార్జున ఆర్టు థియేటర్ మొదలైన నాటక సమాజాలు పనిజేస్తున్నాయి.

నీలంరాజు శ్రీనివాసరావు, టి. కృత్తివాసతీర్థులు, ధారా రామనాధశాస్త్రి, యం. యల్. నారాయణరావు, అద్దంకి శ్రీహరిరావు, మిరియాల వెంకటేశ్వరరావు, మైనంపాటి రామకోటేశ్వరరావు, మాచెర్ల వెంకటేశ్వర్లు, యం. డి. సాబ్జాన్, యన్. సుబ్బారెడ్డి, భాగవతుల వేణుగోపాలాచార్యులు, పి. అచ్యుత రామశర్మ, యం. వెంకట సుబ్రహ్మణ్యం, కె. మల్లికార్జునరావు, యన్. వి. యస్. శర్మ, యం. రాఘవరావు, డి. శ్రీరాములు, ఎ. శివరామకృష్ణారావు, అక్కరాజు రాధకృష్ణమూర్తి, యస్. దక్షిణామూర్తి, జి. వరలక్ష్మి, పి. భానుమతి మొదలైన కళాకారులు పనిచేశారు.

## రేపల్లె

1933 లో సీతారామ బాలభారతి నాటకసమాజం, 1942 లో సాయిబాబా నాట్యమండలి, 1950 లో విజయ ఆర్టు థియేటరు, సీతారామ నాట్యకళాసమితి, 1958 లో మహతి కళాసమితి, ఆదర్శ నాట్యమండలి పనిచేస్తున్నాయి.

పంచాంగం వెంకటాచార్యులు, కె. రామకృష్ణరావు, గుడిమెళ్ళ సీతారామాచార్యులు, శింతేటి సుబ్బారావు, సి. హెచ్. కృష్ణమూర్తి, ఎ. ఆంజనేయులు, యన్. పార్వతీశమ్, జి. కృష్ణమూర్తి, బి. హెచ్. వెంకటేశ్వర్లు, మండలి సుబ్రహ్మణ్యం, కుమారి రంగకుమారి, జి. వి. రమణారావు, వై. రాఘవయ్య, జంపని వెంకటప్పయ్య మొదలైన కళాకారులు వెలుగులోకి వచ్చారు.

## వేటపాలెం

1936 లో దుర్గావినోద నాట్యమండలి, 1945 లో నటరాజ నాట్యమండలి, 1950 లో అభ్యుదయ కళాకేంద్రం, 1952 లో లలితకళా సమితి, 1955 లో కళావని, 1957 లో నటరాజ ఆర్ట్థియేటరు ఏర్పడి పనిచేస్తున్నాయి.

బండా శ్రీరాములు, ఎ. గోవిందరావు, లొల్ల శ్రీరామమూర్తి, గుంటూరి వెంకటేశ్వర్లు, సి. హెచ్. వి. నర్సయ్య, యన్. మల్లికార్జునరావు, వి. గోపాలకృష్ణ, వి. టి. శేషాచారి, బండ్ల సుబ్రహ్మణ్యకవి, పలగాని వెంకటేశ్వరరెడ్డి, వి. కందస్వామి, డి. చంద్రశేఖరరావు, బి. భీమలింగం, టి. వి. శేషయ్య, పి. యల్. నరసింహారావు, వి. రామమూర్తి, పి. రేణుకయ్య, యు. రామమూర్తి, పి. హెచ్. పటేల్, ఐ. వెంకటేశ్వర్లు, బి. సోమశేఖరమ్, జి. మల్లేశ్వరరావు, బొక్కసం ఆదిశేషయ్య, సెట్టి నాగేశ్వరరావు, బండారు వెంకటేశ్వర్లు, కుమారి యన్. సుశీల, యం. ఇందిర, రాఘవమ్మ, సత్యవతి, లక్ష్మీభారతి మొదలైన వారు పనిచేస్తున్నారు.

# కృష్ణాజిల్లా నాటకరంగం



విజయవాడ-మైలవరం బాలభారతి
ఆంధ్ర ఆర్టు థియేటరు- నేషనల్
ఆర్టు థియేటరు బందరు: జాబిలి
థియేటరు-ముదినేపల్లి ఎక్సిలియర్
థియేటర్-గుడివాడ: రామవిలాస
సభ-చల్లపల్లి: ప్రజా నాట్యమండలి

# విజయవాడ

### అల్లా హిందూ థియేటరు:

ధార్వాడ కంపెనీ ప్రభావంతో ఆంధ్రదేశపు ముఖ్య నగరాల్లో నాటక తృష్ణ ఎలా బయలుదేరిందో అలాగే బెజవాడలో కూడా ప్రథమంలో కాశీనాథుని వీర



మల్లయ్య, సుబ్బయ్యనాయుడు, కారుపర్తి నాగలింగం మొదలైనవారు అల్లా హిందూ థియేటరును స్థాపించి సత్య హరిశ్చంద్ర, బొబ్బిలి, తారాశశాంక విజయం మొదలైన నాటకాలను ప్రదర్శిస్తూవుండేవారు. వీర మల్లయ్యగారు వ్రాసిన నాటకాలనుకూడా ప్రముఖంగా ప్రదర్శించేవారు. సుబ్బయ్యనాయుడు హరిశ్చంద్ర వేషాన్ని, నాగలింగం బొబ్బిలిలో రంగారావు పాత్రను ధరిస్తూ వుండేవారు.

### మైలవరం బాలభారతి:

ఆ రోజుల్లో బెజవాడ తాలూకా మైలవరం గ్రామంలో జమీందారైన శ్రీ రాజా సూరానేని వేంకటపాపయ్యారావు బహద్దరు జమీందారుగారు అప్పటికే బాలభారతీ నాటకసమాజమును స్థాపించి విజయవంతంగా నడుపుతున్నారు. కొద్దిరోజుల తరువాత ఆ సమాజాన్ని విజయవాడకు తరలించి నాటక ప్రదర్శనాలను ప్రదర్శించడం ప్రారంభించారు. ఈ సమాజానికి మైలవరం కంపెనీ అని పెద్ద పేరుండేది ఆ రోజుల్లో. మైలవరం కంపెనీ ముందు ఏ కంపెనీ కూడా నిలబడలేకపోయింది.

### రాజేకాదు
### నాటకాలకే రాజు:

రాజాగారు స్థాపించిన మైలవరం బాలభారతి పున్నమినాటి చంద్రుడులా ప్రకాశించింది. అప్పటికే రాజమండ్రిలో కృత్తివెంటి నాగేశ్వరరావు, గున్నేశ్వరరావు

గార్లు కట్టుదిట్టంగా నాటకసమాజాన్ని అన్నిహంగులతోనూ నడుపుతున్నారు. వారి పద్ధతు లన్నిటిని రాజాగారు ఆవశ్యంగా తీసుకుని వారి కంపెనీలో ప్రవేశపెట్టారు. తెలుగుదేశంలో వున్న అనేకమంది ప్రసిద్ధ నటులందర్నీ రప్పించి వారికి జీతాలు ఏర్పాటుచేశారు. నటులకు నెలజీతాల పద్ధతి ఏర్పాటుచేసిన తరువాత చుట్టుప్రక్కలనున్న సమాజాల్లో వున్న అనేకమంది ఆకర్షింపబడడంతో అనేక సమాజాలు దెబ్బతిన్నాయి.

రాజాగారు వారినాటకాలకొరకు బ్రహ్మాండమైన హాలు నొకదానిని ఏర్పాటు చేశారు. అందులో ధార్వాడవారి పద్ధతుల ననుసరించి రంగురంగుల తెరలు, శోకపింగులైట్లు, సెట్సు, వివిధ రకాలైన చెమ్కీ దుస్తులు మొదలైన ఆకర్షవంతమైన ఏర్పాటులు చేశారు.



ఉప్పలూరి సంజీవరావుగారు—సత్యభామ

పాపట్ల కాంతయ్య

పార్శీమట్లు :

రాజమండ్రి గున్నేశ్వరరావుగారి కంపెనీలో ప్రసిద్ధ సంగీతదర్శకుడుగా పనిచేస్తున్న పాపట్ల కాంతయ్యగారిని రప్పించి, పార్శీమట్లు ఏర్పాటు చేయించారు. ఈ సమాజంలో ఏ. టి. రామానుజులుగారు హార్మోనియం, బగ్గన్నగారు తబలాను నిర్వహించారు. ఈ సమాజంలో సుప్రసిద్ధ నటులైన యడవల్లి సూర్యనారాయణ దుర్యోధన, సత్యవంతాది నాయక పాత్రలను, బందరు సమాజంనుంచి వచ్చిన ఉప్పలూరి సంజీవరావు సావిత్రి, ద్రౌపది మొదలైన నాయిక పాత్రలను, గూడపాటి నరసింహారావు నాయకనే 'గుణజనాయుడు' భీముడు, యముడు మొదలైన పాత్రలు నిర్వహించేవారు. మైలవరం బాలభారతీ నాటక సమాజ ప్రవర్తనాలంటే ఆంధ్రదేశంలో అనేక ప్రాంతాలనుండి మూడు రోజులు ముందుగానే టిక్కట్లు రిజర్వు చేసుకునేవారు. ఆనాడు మైలవరంవారి నాటకాలు అంత ప్రసిద్ధి వహించాయి. ఈ సమాజం శకుంతల, పాండవ, ప్రహ్లాద, వేణీసంహారం మొదలైన నాటకాలను కూడ ప్రదర్శించేవారు. ఈ సమాజానికి శ్రీరాముల సచ్చిదానంద శాస్త్రి సావిత్రి నాటకాన్ని, మల్లాది అచ్యుతరామశాస్త్రి ద్రౌపది నాటకాన్ని వ్రాసి

యిచ్చారు. వీరు నాటకాలను వ్రాసి ఇవ్వడమేకాక, నాటకాలకు శిక్షణ కూడా యిచ్చేవారు. వీరితోపాటు వారణాసి సీతారామశాస్త్రి, పాపట్ల కాంతయ్యగారలు కూడ నటులకు నటశిక్షణ యిచ్చేవారు.

నటనలో రాటుతేలిన
ఆనాటి నటులు :

ఈ సమాజంలో యడవల్లి, గురజనాయుడు, ఉప్పలూరి సంజీవరావు, పారుపల్లి సుబ్బారావు, వైతా గోపాలం, జొన్నవిత్తుల శేషగిరిరావు, కుంపట్ల సుబ్బారావు, అద్దంకి శ్రీరామమూర్తి, కపిలవాయి రామనాధశాస్త్రి, నిడుముక్కల సుబ్బారావు మొదలుగా గల ఉద్దండులైన నటులందరూ పనిచేశారు. ఈ విధంగా రాజాగారి బాలభారతీసమాజం విరాజిల్లింది. కాని రానురాను సమిష్టికృషి తక్కువై ధనదాహం ఎక్కువై నాటక సమాజాన్ని వ్యాపార కేంద్రంగా మార్చారు. ఇలాగే కొన్నాళ్ళునడిచి క్రమేపీ క్షీణించి పోయింది. రాజాగారి ఆస్తిఅంతా పోయింది. ఇలా అంతరించిపోయింది బాల భారతీ సమాజం. ఆ తరువాత నటులందరూ చిన్నాభిన్నమై పోయి కంట్రాక్టు నాటకాల్లో పాత్రలు ధరించడం ప్రారంభించారు.



యడవల్లి సూర్యనారాయణరావుగారు—
దుష్యంతుడు

ఆదర్శ కళానిలయం
ఆంధ్ర ఆర్టుథియేటరు :

1948 సంవ రం, జూన్ 15వ తేదీన ప్రజా నాట్యమండలిని రద్దుచేసిన అనంతరం జులైలో హనుమంతరాయ గ్రంథాలయ కార్యకర్తలైన కృత్తివెంటి సుబ్బారావు, గెల్లి రాజగోపాలం, గరికిపాటి సుబ్బారావు మొదలైనవారు, గ్రంథాలయ వైజ్ఞానికశాఖనొక దానిని స్థాపించాలనే అభిప్రాయం కలిగి, రాఘవాపురపు అప్పారావు, మాచినేని, మిక్కిలినేని, వై.వి. రాజు, మల్లంపాటి సత్యనారాయణ, కారెపు అప్పలస్వామి మొదలైన కళాకారుల సహకారంతో,

కొప్పరపు సుబ్బారావు అధ్యక్షతను ఆంధ్ర ఆర్టుథియేటరును స్థాపించి నిర్విరామంగా ప్రజానాట్యమండలి ఆశయాలను ప్రచారం చేశారు. ఆనాటి ప్రభుత్వఒత్తిడి ఆర్టు థియేటరుమీద కూడా పడింది. ప్రతి ఆదివారం నాటక, నాటికా కార్యక్రమాలు జరుగుతూ వుండేవి. గురజాడ, వీరేశలింగం మొదలైన సాంఘిక సంస్కర్తల వర్ధంతులు జరుపబడుతూ వుండేవి. ఈ వర్ధంతుల్లో వీరేశలింగం జీవితం మొద లైన బుర్రకథలు చెప్పబడుతూ వుండేవి. జముకులకథ మొదలైన ఇతర ప్రజా నాట్యమండలి జానపద కళారూపాలు కూడ ప్రదర్శింపబడుతూ వుండేవి.

పఠనాలయం,
నటనాలయం:

ప్రతి ప్రదర్శనంరోజున గ్రంథాలయ ప్రదర్శనశాలలో ఆంధ్రదేశానికి సంబం ధించిన కవులు, కళాకారులు, చిత్రకారులు, సాంఘిక సంస్కర్తల ఫొటోలను ఎగ్జిబిషన్‌గా ప్రదర్శించేవారు. ప్రదర్శనానికివచ్చే ప్రేక్షకులందరూ ఈ ప్రదర్శనాన్ని ఎంతో వుత్సాహంతో తిలకించేవారు. ఆనాడు విజయవాడలోనున్న అనేక ఔత్సా హక నాటకదళాలకు వుత్సహాన్నిచ్చి మార్గదర్శకంగా నిలబడింది. ఆర్టుథియేటరు నాటకమంటే ప్రేక్షకులు ప్రజా నాట్యమండలి ప్రదర్శనంగానే భావించి అభిమానంతో ఆదరించేవారు.

ఆర్టుథియేటరులో
ఆభ్యుదయనటులు:

ఆర్టుథియేటరు ఆత్రేయ, అనిసెట్టి, నార్ల వేంకటేశ్వరరావు,సుంకర మొదలైనవారి నాటకాలను, నాటికలను ప్రముఖంగా ప్రదర్శిస్తూ వుండేది. ఈ నాట్యమండ లిలో మాచినేని, మిక్కిలినేని, వై. వి. రాజు, మల్లంపాటి సత్యనారాయణ, రాఘవాపురపు అప్పారావు, కారెపు అప్పలస్వామి, బి. గోపాలం, వి. మధుసూదన రావు, రక్తకన్నీరు నాగభూషణం, కర్నాటి లక్ష్మి,యన్. ఉదయలక్ష్మి, నర్సయ్య, రెంటాల, హరినారాయణ, డాక్టరు వీరయ్య, కొప్పరపు సరోజని, కె. వెంకటేశ్వర రావు, శేషగిరిరావు, వీరమాచనేని సరోజని, తులశమ్మ, మద్దాలి సుశీల, నాజరు, రామకోటి, తబలా లక్ష్మణరావు, కొడాలి ఆదిశేషయ్య, జగన్నాధం, జి. వి. యస్.

శాస్త్రి మొదలైన అనేకమంది కళాకారులు, కళాభిమానులు, ఆర్టుథియేటరు అభివృద్ధికి పాటుపడ్డారు.

ఆనాడు ఆర్టుథియేటరు నాటకాలమీద కూడ ఆంక్ష విధించబడింది. ప్రతి నాటక రచనా ముందుగా కలెక్టరు పర్మిషన్ లేనిదే ప్రదర్శించ కూడదనే ఒక బిల్లు మద్రాసు అసెంబ్లీలో ప్రవేశ పెట్టబడి ఆర్టుథియేటరు కార్యక్రమాలకు అంతరాయం కలిగించారు.

1948 లో స్థాపించబడిన ఆంధ్ర ఆర్టుథియేటరు. దినదిన ప్రవర్ధమాన మౌతూ, ఈనాటికీ వెలుగొందుతూ వుంది. ఆర్టుథియేటరునుండి చలన చిత్ర పరిశ్రమలో ప్రవేశించిన అనిసెట్టి ప్రసిద్ధ సినీ రచయితగా ధృవపడ్డాడు. వీర మాచనేని మధుసూదనరావు దర్శకుడుగా అంతర్జాతీయ ప్రఖ్యాతి కూడా వహించాడు. మిక్కిలినేని, నాగభూషణం ప్రసిద్ధ సినీ నటులుగా వెలుగొందుతున్నారు. తబలా లక్ష్మణరావు చిత్ర పరిశ్రమలో సంగీత దర్శకులవద్ద వుత్తమ తబలిస్టులుగా గణుతికెక్కాడు. వి. సరోజని రచయిత్రిగాను, ఉదయలక్ష్మి సినీ నటిగాను, రెంటాల ప్రసిద్ధ నాటక రచయితగానూ, అప్పలస్వామి అనేక నాటకాలనూ నాటికలనూ రచియించడమేకాక పీపుల్స్ అకాడమీని స్థాపించి ఆంధ్రదేశమంతటా అనేక పరిషత్తుల్లో ప్రదర్శనాలిచ్చి బహుమతుల నందుకున్నాడు. ఆదిశేషయ్య, లక్ష్మీనర్సయ్యలాంటి నటులు ఉత్తమనటులనిపించుకున్నారు.



కపిలవాయి రామనాధశాస్త్రిగారి
శ్రీకృష్ణపాత్ర

ఈ విధంగా ఆర్టుథియేటరు ఆనాటినుండి ఈనాటివరకూ ప్రజా నాట్యమండలి ఆశయాలను ముందు పెట్టుకుని హనుమంతరాయ గ్రంథాలయ వైజ్ఞానిక శాఖగా ఈనాటికీ వెలుగొందుతూ వుంది.

### తెలుగు లిటిల్ థియేటర్ :

తెలుగు లిటిల్ థియేటర్ స్థాపించి దాదాపు 25 సంవత్సరా లవుతుంది. దీని స్థాపకులు కొప్పరపు సుబ్బారావుగారు. ఈ సంస్థకు అనుబంధ సంస్థలేమీలేవు. లిటిల్ థియేటరు తరపున నాటకరంగానికి సంబంధించిన గొప్ప గ్రంథాలయం ఏర్పడింది. ఇతర దేశాల నాటకాలు, నాటక కళకు సంబంధించిన అనేక శాస్త్రీయ గ్రంథాలు, అనేక ప్రాచీన సంస్కృత నాటకాలు ఈ గ్రంథాలయంలో వుండేవి. నాటక ప్రయోగానికి కావలసిన లైటింగ్ మొదలైన పరికరాలను తెప్పించి, నాటకప్రయోగంలో ఉపయోగించారు. అందుకు రాఘవకళాకేంద్రం అనే నాటక సంస్థను స్థాపించి, ఇనపతెరలు, నాటకం మొదలైన నాటకాలను నూతన ప్రయోగాలతో ప్రదర్శించారు. రామచంద్రకాశ్యప, డి. వి. నరసరాజు, వి. రామన్నపంతులు, వెంపటి రాధాకృష్ణ, కొప్పరపు సరోజని, వి. సరోజని, బి. గోపాలం, మాచినేని, నిర్మల మొదలైన వుత్తమ నటీనటులు రాఘవకళాకేంద్రంలో పనిచేశారు. కొప్పరపు సుబ్బారావుగారు నాటకరంగంలో నూతన ప్రయోగాలకోసరం జీవితాంతం కృషి చేశారు.

### నేషనల్ ఆర్టు థియేటరు :

విజయవాడలో 1947 వ సంవత్సరంలో యన్. టి. రామారావు, యన్. త్రివిక్రమరావు, ఎ. పుండరీకాక్షయ్యగార్ల అధ్వర్యంలో రవిప్రభ అమెచ్యూర్స్ అనే నాటకసంస్థ ప్రారంభించబడి, నందిగామ తాలూకా జయంతిగ్రామంలో ప్రప్రథమంగా వేనరాజు నాటకం ప్రదర్శించారు. ఆ తరువాత కట్టుదిట్టమైన నిర్మాణ సంస్థగా నేషనల్ ఆర్టు థియేటరును రూపొందించారు. ఈ సంస్థకు గొట్టెపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షుడుగాను, యన్. త్రివిక్రమరావు కార్యదర్శిగాను నిర్ణయించబడి, యన్. టి. రామారావు, ఎ. పుండరీకాక్షయ్య, పి. యల్. నారాయణ, నాగేశ్వరరావు, సుంకర కనకారావు, కొంగర జగ్గయ్య, జి. మోహనరావు, కె. వి. యస్. శర్మ మొదలైన కార్యవర్గ సభ్యులతో నేషనల్ థియేటరు ఉత్తమ నాటక సంస్థగా వెలుగొందింది.

ఈ సంస్థ కట్టుదిట్టంగా క్రమశిక్షణతో అనేక నాటకాలను, నాటికలను ప్రదర్శించింది. ఆత్మవంచన - చేసినపాపం - శకునపక్షి - మాభావ - దారినపోయే దానయ్య - కరువురోజులు-విప్లవం లేక వేనరాజు - మొదలైనవి చెప్పుకోదగినవి. 1950 వరకూ ఈ సమాజం దేదీప్యమానంగా గడిచింది. తరువాత రామారావు గారు, త్రివిక్రమరావుగారు, ఎ. పుండరీకాక్షయ్యగార్లు సినీరంగ ప్రవేశంతో నేషనల్

థియేటరు కూడా మద్రాసు వెళ్ళిపోయింది. సిసీరంగంలోవుండి రాయలసీమ కరువునిధికి నెలరోజులు నాటక, నాటికాప్రదర్శనలు యిచ్చి లక్షరూపాయలు సేకరించింది. తరువాత నేషనల్ ఆర్టు థియేటరు చిత్రనిర్మాణ సంస్థగా రూపొంది, తోడుదొంగలు, పిచ్చిపుల్లయ్య, జయసింహా, పాండురంగమహాత్మ్యం, సీతారామ కల్యాణం, గులేబకావళి, శ్రీకృష్ణపాండవీయం, ఉమ్మడి కుటుంబం, వరకట్నం మొదలైన భారీ చిత్రాలను నిర్మించింది.

నేషనల్ ఆర్టు థియేటరు నాటకసంస్థలో ఎ. బలరాం - పోలేపెద్ది శర్మ - మల్లికాంబ - కమలకుమారి- సినినటి సావిత్రి మొదలైనవారు పని చేశారు.

అరుణోదయ
సంగీత నాట్యమండలి:

సుంకర కనకారావుగారి ఆధ్వర్యంలో అరుణోదయ సంగీత నాట్యమండలి దేదీప్యమానంగా వెలుగొందింది. ఈ నాట్యమండలి అనేకమంది అమెచ్యూర్ నటీనటులకు ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. సంగీత, నృత్య నాటకశాఖల్లో జయప్రదంగా కార్యక్రమాలునిర్వహించింది. అనేక పరిషత్తుల్లోనూ సభల్లోనూ పాల్గొని అనేక బహుమతులందిన నాటక సంస్థ. అనేకమంది కళాకారులు ఈ సంస్థద్వారా నన్మానించబడ్డారు. జగ్గయ్య-సావిత్రి-వహీదా రెహమాన్-కె. వి. యస్. శర్మ- డి. వేణుగోపాల స్వామి మొదలైన ప్రసిద్ధ సినీనటులు ఈ సమాజంలో పనిచేశారు. ఈ సంస్థ ఆధిపతియైన కనకారావుగారు కళాశీలి, ఉత్సాహవంతుడైన యువకుడు. సంగీత నాటక అకాడమీ సభ్యుడు. ఆంధ్ర నాటక కళాపరిషత్తు కార్య నిర్వాహక వర్గ సభ్యుడు.



అద్దంకి శ్రీరామమూర్తిగారు హరిశ్చంద్రలో—కాటికాపరి

నవ్యకళామండలి :

ఈ నాట్యమండలి స్థాపకులు ప్రఖ్య శ్రీరామమూర్తిగారు. 1948 లో స్థాపించబడిన ఈ నాట్యమండలి ఈనాటికీ నడుపబడుతూ వుంది. ఈనాటివరకూ 27 నాటకాలను ప్రదర్శించారు. దాదాపు రెండు వందల ప్రదర్శనాల నిచ్చారు. శ్రీరామమూర్తిగారు నాట్యమండలి స్థాపకులుగానేకాక అనేక నాటకాలను వ్రాశారు వారి రచనలైన 'జనవరి ముప్ఫయ్' 'కాళరాత్రి' 'దెయ్యం' 'ఫణి' 'మనిషిలో మనిషి' మొదలైన నాటకాలు నవ్యకళామండలి ప్రదర్శించింది.

తరువాత విజయవాడలో పి. సూరిబాబు రాజరాజేశ్వరి నాట్యమండలిని స్థాపించి అనేక పౌరాణిక నాటకాలను ఆంధ్రదేశంలోనేకాక రాష్ట్రేతర ప్రాంతాలైన బొంబాయి, బెంగుళూరు, మైసూరుల్లోనూ విరివిగా ప్రదర్శించారు.

బండా కనకలింగేశ్వరరావు, బి. వి. రంగారావు, వి. శ్రీధర్‌గార్లు నాట్యభారతిని స్థాపించి అనేక పౌరాణికాలను ప్రదర్శించారు.

1954 లో కె. వెంకటేశ్వరరావు అధ్వర్యంలో రసన సమాఖ్య స్థాపించబడి అనేకమంది ఔత్సాహికుల్ని నటుల్నిగా తీర్చిదిద్దింది. ఎన్నో పరిషత్తుల్లో బహుమానాల నందుకుంది. ఎన్నో నూతన సాంఘిక నాటకాలను ఉత్తమంగా ప్రదర్శించి ఆంధ్రదేశంలో పేరు ప్రతిష్ఠలు సంపాదించింది. దీని పర్యవేక్షకుడైన వెంకటేశ్వరరావు ఉత్తమ నటుడు.

పై సమాజాలేకాక, ఆంధ్ర పిమెంటు కల్చరల్ అసోసియేషన్ - రైల్వే ఇన్‌స్టిట్యూట్ డ్రమెటిక్ క్లబ్ - రాఘవ కళాకేంద్రం - పీపుల్స్ అకాడమి - నటరాజ కళామండలి - కల్పనాధియేటరు - తెలుగు లిటిల్ థియేటర్ - థియేటరు సెంటర్ - జైహింద్ కళాసమితి - బాలభారతి - రవీంద్ర నాట్యమండలి - కృష్ణ విలాస సభ - కళాకౌముది - జాతీయ నాట్యమండలి - విద్యార్థి థియేటరు - సూర్యారావుపేట యువజన నాట్యమండలి - ప్రజా నాట్యమండలి - హనుమాన్ ఆర్ట్ థియేటర్ - విజయవాడ డ్రమెటిక్ అసోసియేషన్ - ఫ్రండ్స్ అసోసియేషన్ - కృష్ణలంక యువజన నాట్యమండలి - ప్రజా నాట్యమండలి - న్యూ ఆంధ్ర మండలి - విద్యాధరపురం యువజన నాట్యమండలి - అరండల్‌పేట రాఘవ ఆర్ట్ థియేటరు -

కస్తూరిబా నాట్యమండలి - పావని ఆర్ట థియేటరు - రాజకమల్ కళా కేంద్రం - ప్రజా నాటక సమితి - నేతాజి నాట్యమండలి - కనకదుర్గా నాట్యమండలి - కళా సమితి - స్వతంత్ర నాట్యమండలి మొదలైన నాటక సమాజాలు పనిచేశాయి.

విజయవాడ

నటీనటులు :

కాశీనాధుని వీరమల్లయ్య, సుబ్బయ్యనాయుడు, కారుపర్తి నాగలింగం, పాపట్ల కాంతయ్య(హార్మోనీ),బగ్గన్న (తబలా),గురజనాయుడు,ఆద్దంకి శ్రీరామమూర్తి, బనవరాజు సుబ్బారావు, వుప్పలూరి సంజీవరావు, కుంపట్ల సుబ్బారావు,పి. సూరిబాబు బ్రదర్సు, కొప్పరపు సుబ్బారావు (రచయిత-దర్శకుడు), ముక్తేవి రామానుజాచార్యులు, బుచ్చిరాజు, భేరా జానకిరామయ్య, బొడ్డపాటి రంగారావు, వెంట్రప్రగడ నారాయణరావు, నిడుముక్కల సుబ్బారావు, మొలకలూరి గోపాలరావు, జె. యల్. నరసింహారావు, సూరవరపు వెంకటేశ్వర్లు, గుడిపాటి సాంబయ్య, ఈతపళ్ళ సూర్యనారాయణ, పివలంక బసవయ్యశాస్త్రి, మల్లాది సూర్యనారాయణ, ముద్దాల రామచంద్రరావు, కోట సూర్యనారాయణ, కె. శీతారామయ్య, బి. వి. రంగారావు, వాలిశెట్టి కోటేశ్వరరావు, వేమవరపు శ్రీధర్, నండూరిపాటి రామశాస్త్రి, యం. దుర్గాప్రసాద్, జంకి నారాయణ, ఓగిరాల రామచంద్రరావు, (మ్యూజిక్ డైరెక్టరు), ఓగిరాల జానకిరామయ్య, మట్టా అప్పారావు, కె. శేషయ్య, అద్దంకి వెంకటసుబ్బయ్య, సబ్జా రాధా, కాంచనపల్లి సుబ్బారావు, అబ్బూరి కమల,చేకు అనసూయ, సూర్యరత్నకుమారి. కాంచన లత, బెజవాడ రాజరత్నం, పి. వెంకటేశ్వరరావు (హాస్యనటుడు), పుచ్చా పూర్ణానందం - యం. సత్యనారాయణ - వి. రామన్నపంతులు - యం. యస్. మూర్తి - కర్నాటి లక్ష్మీనర్సయ్య- పి. వి. ఆచార్ - జి. యస్. ఆర్. మూర్తి - యం. రాఘవరావు - డాక్టరు వీరయ్య- నారాయణస్వామి - యం. వి. చలపతిరావు - అంకరాజు కృష్ణమూర్తి-సి. హెచ్. శ్రీరాములు-మాస్టర్ కె. హనుమంతరావు-యం. సత్యనారాయణ, బి. యి - యం. దుర్గాప్రసాదరావు-డి. శివరామరాజు - ప్రఖ్య శ్రీరామమూర్తి-కుండేలు కృష్ణశర్మ - కంతేటి కుటుంబరావు-పొండూరి వెంకటేశ్వర్లు-నల్లమంచి అప్పారావు - గోవింద రాజుల కోటేశ్వరరావు-పొన్నాడ కృష్ణమూర్తి - కొప్పరపు సరోజని-కుమారి వి. లక్ష్మి - ఉషాబాల - శ్రీమతి అన్నపూర్ణ - సరసీరుహం - సుశీల.

డి. వి. నరసరాజు - రామచంద్రకాశ్యప - మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి - మాచినేని వెంకటేశ్వరరావు - కొడాలి ఆదిశేషయ్య - శివలెంక బసవయ్యశాస్త్రి - ముక్తేవి రామానుజాచారి - నట్టా గోపాలకృష్ణయ్య - నిడుముక్కల సుబ్బారావు - మొలకలూరి గోపాలరావు - డాక్టరు మధుసూదనరావు - యన్. బుచ్చన్న శాస్త్రి - డాక్టరు వీరభద్రాచార్య - జి. సంజీవరావు - ఉప్పలూరి హనుమంతరావు - సూరపనేని లక్ష్మీపెరుమాళ్ళు - వీరమాచనేని మధుసూదనరావు - మిక్కిలినేని సీతారత్నం - వీరమాచనేని సరోజని - యన్. ఉదయలక్ష్మి - మల్లంపాటి సక్యనారాయణ - చదలవాడ కుటుంబరావు - బొడ్డపాటి రామకృష్ణారావు - బిట్టూరు రామకృష్ణారావు - దేశిరాజు రామారావు - కె. వి. యస్. శర్మ - ఆర్. కోటీశ్వరరావు - నిర్మల - కృష్ణారావు - రక్తకన్నీరు నాగభూషణం - బుచ్చేంద్రమణి - కనకం - తిలకం పి. రాజేశ్వరి - కాకుమాను లక్ష్మీనారాయణ - మిక్కిలినేని పరంధామయ్య - మిక్కిలినేని బలరామమూర్తి - అనంతనేని బ్రహ్మానందం - చిరుమామిళ్ళ వెంకటేశ్వర్లు మొదలైనవారు పనిచేశారు.

## బందరు

పవిత్ర సాగరతీరాన వెలసిన బందరు పట్టణం కళాకారులకు ఆటపట్టు. ఇక్కడ ప్రసిద్ధ కళాకారు లెందరో తమ కళావ్యాసంగం సాగించి బందరుకు అద్వితీయమైన ఖ్యాతిని చేకూర్చారు.

### జూబిలి థియేటరు :

1880-82 ప్రాంతాల్లో బందరులో జూబిలి థియేటరును దేవరసు వెంకటసుబ్బారావు - బాలకృష్ణయ్యగార్లు స్థాపించారు. 1884 లో మొగిలిగిద్దల రామానుజరావుగారి యాజమాన్యాన హిందీ నాటకాలాడారు. ఈ సమయంలో నాదెళ్ళ పురుషోత్తమ కవిగారు డైరెక్టరుగా వుండి వారి సమాజానికి ఎంతో చేయూతనిచ్చారు. హిందీ నాటకాల్లో మొగిలిగిద్దల రామానుజరావు, ఈమని లక్ష్మణస్వామి, జోళ్యుల వెంకటశేషయ్య మొదలైనవారు అసమాన నటులుగా ప్రఖ్యాతి వహించారు. లక్ష్మణస్వామిగారు శివాజి పాత్ర ధరించి బిపిన్ చంద్రపాల్ ప్రశంస లందుకున్నారు. ఆ తరువాత 1884 సంవత్సరంలో దేవరసు వెంకటసుబ్బారావు - తురగా

పురుషో త్తం - రామిని బ్రహ్మయ్య - చివుకుల కృష్ణయ్య మొదలై నవారు హిందూ థియేటరును స్థాపించారు. ఈ సమాజంలో ఇవటూరి నాగభూషణం, దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావుపంతులు, గండికోట సరసింగరావు మొదలై నవారు ప్రసిద్ధ నటులుగా వెలుగొందారు.

శ్రీమాన్ రంగాచార్యులు, చల్లా రామనాధశాస్త్రి, భేతపూడి ప్రకాశం, లక్ష్మీ కాంతం, మాదిరెడ్డి రంగారావు మొదలై నవారు నాటకాలను ప్రాపి దర్శకత్వ బాధ్యతలను వహించారు.

శారదావిలాస

నాటకసమాజం :

దాసు నారాయణరావు - దాసు మాధవరావు - ఈమని లక్ష్మణస్వామి - వెంపటి వెంకటేశ్వర్లు-జోళ్ళ శేషయ్య-వడ్డి రామయ్య-పసుమ ర్తి సుబ్బయ్య-పసుపు లేటి సుబ్బారావు - కృత్తివెంటి వెంకటసుబ్బారావు - భాష్యాలనాయుడు మొద లై నవారు ఈ సమాజాన్ని స్థాపించి, ఆంధ్రదేశమంతటా అనేక నాటకాలను ప్రదర్శించారు.

ఛత్రపూర్ జగన్మోహన థియేటరు :

1904 లో గొడుగుపేటలో వక్లమన్నాటి నాగభూషణం, భట్టిప్రోలు విజయ రామయ్య, కూనపు లక్ష్మీనారాయణ, దామరాజు సౌభాగ్యనాయుడు, దామరాజు పీరేశలింగంగార్లు ఛత్రపూర్ జగన్మోహన్ థియేటరును స్థాపించారు. ఈ సమాజంలో కారుపత్తి నాగలింగం, మల్లెల శేషయ్య, నేతి యజ్ఞనారాయణ, మురికిపూడి లక్ష్మీకాంతంగార్లు నటులుగా వెలుగొందారు. ఈ సమాజం ప్రథమంలో వచన నాటకాలను ప్రదర్శించారు. అభినయానికి, నటనకు ప్రాధాన్యం యిచ్చిన తొలినాటక సమాజం యిదే.

రామమోహన్ థియేటరు :

బందరు సర్కిల్‌పేటలో శ్రీయుతులు తురగా నరసింగరావు, కామరాజు గడ్డ రామచంద్రరావు, వెచ్చా భాష్యకార్లు ఈ సమాజాన్ని స్థాపించారు. ఈ సమా జంలో గురజనాయుడు, మాతంశెట్టి కృష్ణారావు, మట్టా సూర్యనారాయణ,

సింగంపెట్టి గోపాలరావు. పాలపర్తి నాగభూషణం. భట్లపెనుమర్తి కృష్ణయ్య. మద్దాలి శేషగిరిరావు. కపిలవాయి సుబ్బారావుగార్లు వివిధ పాత్రలు ధరించారు.

నేషనల్ థియేటరు :

**1880** లో స్థాపించబడిన నేషనల్ థియేటర్‌లో ముంజులూరు కృష్ణారావు. మునిషి చంద్రకళాధరరావు మొదలైనవారు నటులుగా పైకొచ్చారు.

జగన్మోహినీ
మోహన సమాజం :

**1904** లో బందరులో జగన్మోహినీ మోహన సమాజం స్థాపించబడింది. ఈ ఈ థియేటర్‌లో ఎక్కువమంది స్త్రీలే వుండేవారు. స్త్రీ పురుష పాత్రల రెంటినీ స్త్రీలే ధరించేవారు. వీరికి బి. టి. రాఘవాచార్యులుగారు శిక్షణ యిచ్చి నాటకాలు ఆడిస్తూ వుండేవారు. ఆంధ్రదేశంలో అనేకమంది పండితుల మన్ననలందుకున్న ఈ సమాజం 1910 లో అంతరించింది.



రాయల్ హిందూ థియేటరు:

రామానాయుడుపేటలో 1906 లో ముంజులూరు కృష్ణారావు, బుర్ర రాఘవాచారి, పింగళి లక్ష్మీకాంతం, పింగళి సరసయ్య, పింగళి వీరయ్యగార్లచే పైసమాజం స్థాపించబడి అనేక ప్రసిద్ధ నాటకాలను ప్రదర్శించింది.

భువనరంజని థియేటరు :

ఈ థియేటర్‌ను 1906 లో సర్కిల్ పేటలో బందరు నాయుడనే పిప్పళ్ళ రామకృష్ణరావు, పోతరాజు, శ్రీ ముంజులూరి కృష్ణారావుగారు-శర్వీలకుడు. వెంకటరత్నం, మాదిరెడ్డి వీరభద్రరావుగార్లు స్థాపించారు. అనేక, పౌరాణిక నాటకాలను ప్రదర్శించారు. డి. వి. సుబ్బారావు బాల్యంలో ఈ సమాజంలోనే అనేక స్త్రీ పాత్రలు ధరించారు.

రామానంద థియేటరు :

గొడుగుపేటలో 1908 లో మాదిరెడ్డి సుబ్బరామయ్య, క్రాపవరపు సూర్యనారాయణ, క్రాపవరపు నరసింహం, దినవహి కృష్ణమూర్తిగార్లు స్థాపించి నాటకాలాడారు.

బాలభారత సంఘం :

గొడుగుపేటలో 1908 లో చిట్టూరు నరసింహంపంతులు, తుర్లపాటి నరసింగరావు గార్లు దీనిని స్థాపించారు. ఈ సమాజంలో పారుపల్లి సుబ్బారావు, శ్రీపతి పట్టాభిరామయ్య, అద్దంకి శ్రీరామమూర్తి, భోగరాజు సుబ్బారావు, చిలకలపూడి వెంకటేశ్వరశర్మ, పంచాంగం రామానుజాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ, మారుతి సీతారామయ్యగార్లు వివిధ పాత్రలు ధరించి, విశేష ఖ్యాతిని సంపాదించి ప్రధాన నటులై నాటకరంగానికి నూతన అలంకారాన్ని సంతరించిపెట్టారు.

ఇండియన్ డ్రమెటిక్ కంపెని :

1909 సంవత్సరంలో నల్లారి బ్రహ్మానందం, డి. వి. సుబ్బారావు, పింగళి నాగేంద్రరావుగార్లు స్థాపించారు. మట్టిపల్లి సూర్యనారాయణ, గబ్బిట బాలసుందరశాస్త్రి, కండికొండ సత్యనారాయణ, బండారు వెంకటేశ్వరరావు, గుంగు వీరభద్రరావు, వి. వెంకటకృష్ణయ్య, వలివేటి శ్రీమన్నారాయణ, తోట నిరంజనరావు, పరిమిశేషగిరిరావు, కొండా శేషగిరిరావు, అనుమకొండ సుబ్బారావు, కొడాలి కేశవరాయుడు, మల్లాది సూర్యనారాయణ, తోట వెంకటేశ్వరరావు మొదలైన నటులు ప్రఖ్యాతి వహించారు.

జె. సీతారామశాస్త్రి, కురుమద్దాలి సత్యనారాయణ, నటశ్రీ మొదలైనవారు యిప్పటికీ పౌరాణిక నాటకాలను ప్రదర్శిస్తున్నారు.

డి. వి. సుబ్బారావు మృతిచెందిన అనంతరం కె. శివశ్రీ హరిశ్చంద్ర పాత్రను ధరిస్తూ ఆంధ్రదేశంలో వందలాది ప్రదర్శనాలను యిస్తున్నారు.

డి. వి. సుబ్బారావుగారి కుమారుడు డి. వి. సుబ్రహ్మణ్యం కూడా హరిశ్చంద్ర పాత్రను తండ్రి పోకడలో ప్రదర్శిస్తున్నారు.

ఔత్సాహిక నాటక సంఘాలు :

1947 లో ముట్నూరి కృష్ణారావుగారు 'వసంత వని' స్థాపించారు. ఈ సమాజంలో ప్రసిద్ధ రంగస్థల నటి నిర్మల, ఆమె భర్త జి. వి. కృష్ణారావు చాలాకాలం సభ్యులుగా వ్యవహరించారు.



శ్రీపారుపల్లి సుబ్బారావుగారు
రాధ.

తరువాత సనకా గోవిందరావు ఈ సమాజాన్ని చేబట్టి అనేక పరిషత్తులలో పాల్గొని ప్రథమ బహుమతుల్ని అందుకున్నారు. శ్రీమతి వాణీబాల, సి. వేణుబాబు, ఐ. వి. కోనేశ్వరరావు ఈ సమాజంలో ప్రధాన నటులు.

యల్. ఐ. సి. ఎంప్లాయిస్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ :

ఈ సమాజాన్ని ప్రసిద్ధ పాత్రికేయుడు విడియాల చంద్రశేఖరరావు స్థాపించారు.

ప్రతి నెలా రెండు ప్రదర్శనాల చొప్పున ఈ సమాజం ఇప్పటివరకు అసంఖ్యాకంగా ప్రదర్శనాల నిచ్చింది. అనేకమంది కవులను, నటులను, కళాకారులను ఈ సంఘం సన్మానించింది. పరిషత్తుల్లో అనేక బహుమతులను పొందింది. సి. యన్. నారాయణ, రంగారావు, మట్టా కోటేశ్వరరావు, ప్రభల లక్ష్మీనరసింహం, లంక సుందరరామయ్య గారు ప్రధాన నటులుగా వెలుగొందారు.



శ్రీ వేమూరి రామారావుగారు
భవాని శంకరుడు.

జనతా ఆర్ట్ థియేటరును విన్నకోట వెంకటేశ్వరరావు స్థాపించి స్థానికంగా ఎన్నో నాటకాలను ప్రదర్శిస్తున్నారు.

కళా ప్రగతి, కళానికేతన్ మొదలైన సమాజాలు పరిషత్తుల్లో నాటకాలను ప్రదర్శిస్తూ వున్నాయి.

పైన వుదహరించిన సమాజాలే గాక నేతాజీ నాట్యమండలి - రవి ఆర్ట్ అమెచ్యూర్స్ - రాఘవ కళాసమితి - ఆంధ్ర ఆర్ట్ థియేటర్ - గొడుగుపేట - రాజశ్రీ అమెచ్యూర్స్, నవ కళావని - బచ్చుపేట - కృష్ణరాయ నాట్యమండలి - రాజమహేంద్రవరం - నవీన ఆర్ట్ థియేటర్ - పెడన - సరస్వతి కళాసమితి - యునైటెడ్ ఆర్టిస్ట్స్, నవోదయ నాట్యమండలి - యువజన నాట్యమండలి - బాపూజీ నాట్యమండలి, కప్పలదొడ్డి - రాఘవ అమెచ్యూర్స్, ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ మొదలైన సమాజాలు పనిచేశాయి.

నటీనటులు :

గబ్బిట బాలసుందరశాస్త్రి,వి. ఉదయ భీమరాజు, ముదునూరి శేషగిరిరావు, భావరాజు నరసింహారావు, కందికొండ సత్యనారాయణశాస్త్రి, కుప్పా వెంకటరామశాస్త్రి, నటశ్రీ, విడియాల చంద్రశేఖరరావు, కె. యస్. వి. కోనేశ్వరరావు. సి. యస్. నారాయణ, సనకా గోవిందరావు, తోట నిరంజనరావు, తోట వెంకటేశ్వరరావు, ఇందుపల్లి గోవిందరావు, జొన్నలగడ్డ సీతారామశాస్త్రి, బిట్టా పురుషోత్తం, అనుమకొండ వెంకటరామయ్య, తిరువేంకటాచారి, యడవల్లి కనకసుందరరావు, శ్రీమతి వాణీబాల, నిర్మల, ఇందిరాచార్య, ఆర్. వి. కృష్ణారావు. పింగళి వీరయ్య, బుట్టా రాఘవాచార్యులు, సువర్ణ రామచంద్రరావు, కుండా పిచ్చయ్య, కురుమద్దాలి సత్యనారాయణ, దసిక నాగేశ్వరరావు, కట్టా అచ్చయ్య, శివశ్రీ, యం. కోటేశ్వరరావు, యం. ఆర్. కె. మూర్తి. సి. వాసుబాబు, యల్. సుందర రామయ్య, పి. యస్. నరసింహం, బి. యల్. నారాయణమూర్తి, శ్రీమతి సూర్యరత్నకుమారి, రత్నమాల, లలితకుమారి, కుసుమకుమారి, టి. హయగ్రీవరావు మొదలైన నటీనటులు పని చేశారు.

## గుడివాడ

ఆంధ్ర నాటక కళాపరిషత్తు 19.9 లో స్థాపించిన నాటినుండీ గుడివాడ ప్రధాన కార్యాలయంగా వుండి, పనిజేస్తూ వుంది. ముఖ్య కార్యకర్తలైన కాజ వెంకట రామయ్య, ఎట్లోజు మాధవాచార్యులు, దుక్కిపాటి మధుసూదనరావు, త్రిపురనేని వరప్రసాదరావు, పోలవరపు సూర్యప్రకాశరావు మొదలైనవారు గుడివాడ వాస్తవ్యులైనందువల్ల కళాపరిషత్తు దిగ్విజయంగా నడవడానికి అవకాశం కలిగింది.

1935 లో రామవిలాస సభ, నటరాజ నాగేశ్వర నాట్యమండల, 1942 లో ప్రభాకర నాట్యమండలి, కళాప్రభ, విశ్వ కళాసమితి, నటరాజ నాట్యమండలి, విజయభారతి నాట్యమండలి, జనతా నాట్యమండలి, కోడూరు ఆంధ్రా అమెచ్యూర్స్ మొదలైన నాటక సమాజాలు పనిజేశాయి.

జంధ్యాల గౌరినాధశాస్త్రి, పి. సూరిబాబు, ఘంటసాల వెంకటేశ్వరరావు, అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రిగణేశ్, పామర్తి సుబ్బారావు, కె. సరసీరుహం,

పి. హేమలత. అడ్డుమిల్లి శేషగిరిరావు, డి. వి. రామారావు, డి. వి. యల్ నరసింహం. పెండ్యాల నాగేశ్వరరావు. బి. నారాయణరావు. టి. సూర్యనారాయణ. జె. వెంకటేశ్వరరావు. కె. సుబ్బారావు. ఎ. వి. సుబ్బారావు (జూనియర్). కైకాల సత్యనారాయణ. యం. ఆర్. శర్మ. తిలకం, గిరిజ, పెద వెంకటగిరి, చిన వెంకటగిరి, బి. యన్. సూరి, కోడూరు అచ్చయ్య, నగరాజకుమారి, యన్. యస్. ఆర్. ఆంజనేయులు, కోమలి, పువ్వుల అనసూయ, టి. తులసి, దాసరి అంజనీబాయి, అరుంధతి, సీత, చింతపల్లి సుబ్బారావు, దుగ్గిరాల శేషగిరి రావు, అంగలూరు కేశవరాయుడు మొదలైన నటీనటులు పని చేశారు.

# పామర్రు

1951 లో ప్రగతి నాట్యమండలి, 1953 రామకృష్ణ థియేటరు. 1954 లలిత కళా సమితి, 1958 లో కర్షక నాట్యమండలి ఏర్పడి పని చేస్తున్నాయి. ఈ సమాజాలలో బి. వెంకటరెడ్డి, కఠారు రంగారావు, టి. వెంకటేశ్వరరావు, బండి వెంకటసుబ్బయ్య, కోగంటి దుర్గామల్లికార్జునరావు మొదలైన కళాకారులు పని చేశారు.

## ఎక్సలియర్ థియేటరు, ముదినపల్లి :

1939 లో ఎక్సలియర్ థియేటరు ముదినేపల్లిలో ఈనాటి ప్రసిద్ధ చిత్రనిర్మాత అన్నపూర్ణ పిక్చర్సు అధినేతయైన శ్రీ దుక్కిపాటి మధుసూదనరావు, కోడూరు అచ్చయ్య మొదలైన కళాభిమానుల ఆధ్వర్యంలో స్థాపించబడింది.

ఆనాడు క్రమశిక్షణతో కట్టుదిట్టంగా నాటకాలను ప్రదర్శించటంలో పేరు పొందిన సమాజమిది. ఈ సమాజంలోనే పద్మశ్రీ అక్కినేని నాగేశ్వరరావు, సుప్రసిద్ధ సంగీత దర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు, కోడూరు అచ్చయ్య, అడ్డుమిల్లి శేషగిరిరావు, సూరపనేని ప్రభాకరరావు, కోనేరు కుటుంబరావు మొదలైన నటులు వెలుగొందారు. వీరు ప్రదర్శించిన ఆశాజ్యోతి నాటకం వేనోళ్ళ పొగడబడింది.

# చల్లపల్లి

అంధ్ర ప్రజా నాట్యమండలి ఏర్పడి అనేక నాటకాలను ప్రదర్శించింది. సిరివిశెట్టం సుబ్బారావు, కోసూరి పున్నయ్య, పట్టంశెట్టి ఉమామహేశ్వరరావు మొదలైన నటులు పని చేశారు.

# రవి థియేటర్స్ రక్త కన్నీరు

ఆంధ్రనాటక రంగంలో రవి ఆర్ట్‌థియేటర్స్ రక్తకన్నీరు నాటకం ఒక నూతన శకాన్ని నిర్మించింది. 1956 లో రవి థియేటర్స్ స్థాపించబడింది. దీని ప్రధాన కార్యాలయం మద్రాసులోను, ఆయా ప్రాంతాల్లో కార్యక్రమాన్ని నిర్వహించే కార్యాలయం విజయవాడలోనూ వుంది.

రవి ఆర్ట్ థియేటరు స్థాపకుడు సి. నాగభూషణం. ఈయన ప్రదర్శించిన నాటకాలు రక్త కన్నీరు-పాపం పండింది-బికారి రాముడు-కోతలరాయుడు-కలికాలం మొదలైనవి.

ప్రేక్షకులను రంజింపచేసిన
రక్త కన్నీరు నాటకం:

వీటిలో ఒక్క రక్తకన్నీరు నాటకం చరిత్రాత్మకంగా ప్రసిద్ధి చెందింది. ఈనాటి వరకూ 12 వందలసార్లు ప్రదర్శింప బడింది. అంతేగాక రక్త కన్నీరు నాటకం ఆంధ్రనాటకరంగంలో మరో రికార్డును కూడా సంపాదించింది. ఒకే కేంద్రంలో ప్రతిరోజూ ఒక ప్రదర్శనం చొప్పున వరుసగా కాకినాడలో 15 ప్రదర్శనాలు ప్రదర్శింపబడ్డాయి.

ఆంధ్రనాటకరంగంలో ప్రజా నాట్యమండలి అనేక సుసాంప్రదాయాలను స్థాపించింది. వాటిలో ఒకే రాత్రి రెండు ప్రదర్శనాలివ్వడం ప్రవేశపెట్టింది. ఇదే సంప్రదాయాన్ని అనుసరించి రవి ఆర్ట్ థియేటరు రక్త కన్నీరు నాటకాన్ని ఒకే రాత్రి రెండు ప్రదర్శనాల చొప్పున నూరు కేంద్రాల్లో ప్రదర్శించింది.

రక్త కన్నీరు నాటకం తమిళ దేశంలో యం. ఆర్. రాధ పర్యవేక్షణలో అఖండవిజయం సంపాదించింది. అలాగే నాగభూషణం ఆధ్వర్యంలో రక్త కన్నీరు నాటకం ఆంధ్రదేశంలో విశేష ప్రశంస లందుకుంది. ఈ నాటకాన్ని పాలగుమ్మి పద్మరాజు తెలుగులోకి అనువదించారు. ఈ నాటకానికి బి. గోపాలం సంగీతాన్ని నిర్వహించారు. నృత్యాలను వెంపటి చినసత్యం నిర్వహించారు. ఈ నాటకంలో ప్రధాన పాత్రల్లో సి. నాగభూషణం.సీత.వెరుమాళ్ళు.రేపల్లె కృష్ణమూర్తి. మోహన్ దాస్. దుర్గారావు. సత్యనారాయణ. పెద్దన్న.సినీనటులు శారద సుజాత మీనాకుమారి రేవతి ఆదోనిలక్ష్మి వాణిశ్రీ మొదలైన వారంతా పేరుపొందారు. ఈ నాటకంలో 30 రంగా లున్నాయి. నాటకం ప్రారంభించి అంతమయ్యేవరకు జరజరా జరిగిపోతుంది. ఆంధ్రనాటకరంగంలో రక్త కన్నీరు నాటకం ఒక మైలు రాయిలాంటిది.

# ప్రసిద్ధనటులు



పద్మశ్రీ వి. నాగయ్య





పద్మశ్రీ యన్. టి. రామారావు

పద్మశ్రీ అక్కినేని నాగేశ్వరరావు

# ప్రసిద్ధనటులు



పద్మశ్రీ శ్రీమతి పి. భానుమతి



శ్రీ యస్. వి. రంగారావు



శ్రీ దాసరి కోటిరత్నం



శ్రీ కె. వెంకటేశ్వరరావు

416 B

# ప్రసిద్ధనటులు



శ్రీ బ్రహ్మాజోశ్యుల సుబ్బారావు



శ్రీ జె. యల్. నరసింహారావు



శ్రీ సి. యస్. ఆర్. ఆంజనేయులు

# ప్రసిద్ధనటులు



శ్రీ వడ్లమూడి సీతారామారావు



శ్రీ దాడి గోవిందరాజులు నాయుడు



శ్రీ ముదిగొండ లింగమూర్తి



శ్రీ దొమ్మేటి సూర్యనారాయణ

# ప్రసిద్ధనటులు



శ్రీ పారుపల్లి సత్యనారాయణ



శ్రీ ముప్పిడి జగ్గరాజు



శ్రీ మందపాటి రామలింగేశ్వరరావు



శ్రీ అమంచర్ల గోపాలరావు



శ్రీ రొద్దం హనుమంతరావు

ఆ1116

# ప్రసిద్ధనటులు



శ్రీ జొన్నవిత్తుల శేషగిరిరావు



శ్రీ నేరెళ్ళ వేణుమాధవ్



శ్రీ రామచంద్ర కాశ్యప



శ్రీ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి

# ప్రసిద్ధనటులు



శ్రీమతి రాజేశ్వరి



శ్రీ సి. యస్. నటేశం



శ్రీ పులిపాటి వెంకటేశ్వరు

# ప్రసిద్ధనటులు



శ్రీ బండా కనకలింగేశ్వరరావు



పద్మశ్రీ స్థానం నరసింహారావు



శ్రీ కిళాంబి కృష్ణమాచార్యులు



శ్రీ వైతా గోపాలం



# పశ్చిమగోదావరిజిల్లా నాటకరంగం



ఏలూరు : సీతారామాంజనేయ నాటక సమాజం - పూర్ణిమ నాట్యమండలి - కోరాడ నాట్యభారతి- నర్సాపురం: హిందూ నాటకసమాజం-పాలకొల్లు: ఆదర్శ నాట్యమండలి- తణుకు - తాడేపల్లిగూడెం- కొవ్వూరు మొదలైన నాటకరంగాలు

# ఏలూరు

మొత్తానికి మొత్తుబరితనం :

**1885-90** సంవత్సరాల ప్రాంతంలో వామనభట్ల జోషిగారు హిందీ నాటకాలను ఏలూరులో ప్రదర్శిస్తూవుండేవారు. ఆనాటికి సంస్కృత నాటకాలుగాని తెలుగు నాటకాలుగాని ఆంధ్రదేశంలో అంతగా అమలులోకి రాలేదు. ఆనాడు ఏలూరులో బుద్ధిరాజువారు ఒక హాలును నిర్మించిన తరువాత నాటకాలు ప్రదర్శించాలనే ఉత్సాహం కొంతమందిలో కలిగింది. ఏలూరులో జమీందారులైన మోతే నారాయణరావుగారు నాటక కళవల్ల దేశాన్ని, జాతిని ఎలా ముందుకు తీసుకువెళ్ళవచ్చునో చిన్ననాడే అవగాహన చేసుకున్నారు. ఆయన విదేశ యాత్రలుజేసి ఆ యా దేశాలలో వున్న నాటక కళారీతుల్ని గ్రహించారు. ఏలూరులో సీతారామాంజనేయ నాటక సమాజాన్ని స్థాపించి ఆంధ్రదేశంలో అప్పటికే పేరు ప్రతిష్ఠలు సంపాదించిన అనేకమంది నటీనటుల్ని సమకూర్చి, వారికి వారి వారి స్థాయిల ననుసరించి జీతాలు ఏర్పాటు చేసి, ఏలూరులోనూ, బెజవాడలోనూ నాటకరంగస్థలాలను నిర్మించి ఎంతో కట్టుబాట్లతో ఆదర్శప్రాయంగా నాటకాలను ప్రదర్శించారు. ఎంతోమంది కవుల్ని, చిత్రకారుల్ని, నృత్యకారుల్ని, సంగీత విద్వాంసుల్నీ పోషించారు.



ఆంధ్రదేశ ఆధివాసాన్ని
పొందిన ఆదర్శ నటులు :

నటుల్లో యడవల్లి సూర్యనారాయణ, ఉప్పులూరి సంజీవరావు, కడియాల రత్తయ్య, ఆరణి సత్యనారాయణ, ఆలమూరి పట్టాభిరామయ్య, కొచ్చెర్ల కోట రంగారావు, పంచాంగం వేంకటరామానుజాచార్యులు, కపిలవాయి రామనాథ శాస్త్రి, అద్దంకి శ్రీరామమూర్తి, బుద్ధిరాజు లక్ష్మణరావు, ముంజులూరు కృష్ణారావు, నాగర్లమూడి లక్ష్మీనరసింహారావు, జొన్నవిత్తుల శేషగిరిరావు మొదలైన సుప్ర



ఆరణి సత్యనారాయణగారు
వసంతసేన

సిద్ధ నటులందరూ ఏలూరు సీతారామాంజనేయ నాటక సమాజంలో వర్ధిల్లారు.

నిస్వార్థకళాజీవి
నారాయణరావు :

నారాయణరావుగారు నాటక సమాజాన్ని నిస్వార్థంగా నడిపారు. వచ్చే ఆదాయాన్ని బట్టి సమాజాన్ని నడిపేవారుకారు. కేవలం కళాభిమానంతో అనేక సహాయ కార్యక్రమాల ప్రదర్శనాలకు నటులందరినీ యథేచ్ఛగా పంపిస్తూ వుండేవారు. సమాజ సామగ్రిని కూడా యితర సమాజాలవారికిచ్చి ఆ సమాజాల అభివృద్ధికి తోడ్పడుతూ వుండేవారు. నారాయణరావుగారికి సంగీత మంటేనూ, కవిత్వమంటేనూ, చిత్రలేఖనమంటేనూ ఎంతో అభిమానం. దేశహిత కార్యక్రమాలన్నిటిలోనూ ఆయన పాల్గొన్నారు. అన్ని జాతులవారినీ, కులాల వారినీ సమానదృష్టితో చూసేవారు. లాభాల్నే ప్రధానంగా పెట్టుకుని ఆయన సమాజాన్ని నడపలేదు. డబ్బు వచ్చినా రాకపోయినా సమాజాన్ని నడిపి, తన కున్న యావదాస్థినీ కళాప్రగతికి వినియోగించారు. ఆ రోజుల్లో ఒక లక్ష రూపాయలవరకూ ఆ సమాజంకొరకు వినియోగించారు. ప్రతినెలా 12 వందల రూపాయలు నెల జీతాలనిస్తూ వుండేవారు. ఆనాడు విజయనగరంలో ఆనంద గజపతిగారు ఎంతటి ఉదాత్త భావాలతో నాటక సమాజాన్ని నడిపారో అంత ఉదాత్తంగానూ నారాయణరావుగారు సీతారామాంజనేయ నాటక సమాజాన్ని నడిపి, గోదావరి జిల్లాలోనూ, కృష్ణాజిల్లాలోనూ నాటక సమాజాలకు, నాటక కళకు ఆదర్శప్రాయులయ్యారు.

బందాప్రతిభతో నడిచిన
ప్రభాత్ థియేటర్ :

ఆ తరువాత కొంతకాలానికి బందా కనకలింగేశ్వరరావుగారు ప్రభాత్ థియేటర్సును స్థాపించి, ఉన్నత ప్రమాణాలతో పౌరాణిక నాటకాలను వ్యాపార సరళిలో

ప్రదర్శించారు. అనేక నాటక సమాజాలవారికి ప్రభాత్ థియేటరు కార్యక్రమాలు ఎంతో ఉత్తేజాన్ని నిలిగించాయి. వీరు ప్రదర్శించిన నాటకాలలో ముఖ్యమైనవి శ్రీ వెంకటేశ్వరమహాత్మ్యం, ద్రౌపది, అల్లూరు సీతారామరాజు మొదలైనవి.



పండిట్‌రావుగారు (అంధ్రదేశంలో హిందీ నాటకాలు ప్రదర్శించిన వారిలో) ప్రముఖ నటుడు.

తరువాత సుప్రసిద్ధ సురభి నాటక సమాజాల కళాకారిణి పూర్ణిమ, పూర్ణిమా నాట్య మండలి స్థాపించి అనేకమైన పౌరాణిక నాటకాలను ఆంధ్ర దేశమంతటా ప్రదర్శించారు.

పైనఉదహరించినసమాజాలే కాక ఏలూరులో మరెన్నో ఔత్సాహిక నాటక సమాజాలు వెలిసి పనిచేశాయి. వాటిలో ముఖ్యమైనవి - రామప్రసాద్ ఆర్ట్ థియేటర్స్, మహాత్మా ఆర్ట్ థియేటర్స్, కళాకేంద్రం, ప్రజానాట్యమండలి, కిరణ్ కళాసమితి, నేతాజినాట్యమండల, విజయకళాసమితి - మిత్రసమాఖ్య-జయ ఆర్ట్ థియేటర్స్ - పొట్టి శ్రీరామ ఆర్ట్ థియేటర్ - ప్రకాశం ఆర్ట్ థియేటర్ - శ్రీ రాంబాబు ఆర్ట్ థియేటర్ - కళాభాషిణి ఆర్ట్ థియేటరు - యువజన నాట్యమండలి - నటరాజ నాట్యసమితి మొదలైన నాటక సమాజాలు పనిచేశాయి.

కోరాడ నరసింహారావు నటకుడుగా అంతర్జాతీయ కీర్తిని సంపాదించారు. పసుమర్తి వేణుగోపాలస్వామి - టి. ఆర్. ఆచార్య - బి. వి. నరసింహారావు - జి. కనకారావు ప్రభృతులుకూడా పేరొందారు.

ఈ సమాజాలలో అనేకమంది ప్రసిద్ధ నటులూ, ఔత్సాహిక నటీనటులూ పాల్గొన్నారు. వారిలో ముఖ్యులు అంబికా వరప్రసాదరావు - శీర్ల బ్రహ్మయ్య-పాలగుమ్మి వీరభద్రేశ్వరరావు - రెంటచింతల సత్యనారాయణ - కందుకూరి చిరంజీవిరావు - మదాలి శేషగిరిరావు - తెర్లి అప్పారావు - గోబేరు సుబ్బారావు -

కొడాలి చంద్రమౌళీశ్వరరావు - దుగ్గిరాల సత్యనారాయణ - నేలగంటి కోటీశ్వర రావు - నంబూరి శ్రీనివాసరావు - మద్దాలి రామచంద్రరావు - ఎ. పూర్ణిమ-కొచ్చెర్లకోట సత్యనారాయణ - యన్. వి. రంగారావు (సిని) - ఆరణి సత్యనారాయణ (సిని)-, సి. హెచ్. నారాయణరావు (సిని) - వి. బాలకృష్ణ (సిని) మొదలైన నటీనటులు పనిచేశారు.

# నర్సాపురం

హిందూ నాటకసమాజం :

నర్సాపురం నాటకరంగ చరిత్ర ప్రసిద్ధమైంది. 1902 వ సంవత్సరంలో పూనానుండి సాంగ్లీ హిందూ నాటక సమాజం వచ్చి నర్సాపురం కళాకారుల్లో వుత్సాహాన్ని రేకెత్తించింది. ఆర్యానంద హిందూ నాటక సమాజాన్ని బుద్ధిరాజు బ్రహ్మానందం — బొమ్మకంటి కృష్ణమూర్తి — మామిళ్ళపల్లి కేశవాచార్యులు మొదలైనవారు స్థాపించి, పూనావారు నాటకాలు ప్రదర్శించిన పందిరిలోనే హిందీ నాటకాలను ప్రదర్శించారు.

ఈ సమాజ నటులకు బిందరు నేషనల్ థియేటరుకు చెందిన సుప్రసిద్ధ నటుడు మొగిలిగిద్దల రామానుజరావుగారు నాట్యశిక్షణ నిచ్చేవారు. వీరికి సహాయంగా జానకిరామయ్య పంతులుగారు పనిచేస్తూ వుండేవారు. ఈ సమాజంలో బొమ్మకంటి కృష్ణమూర్తిగారు నాయకపాత్రలు ధరిస్తూ వుండేవారు. వీరు ప్రదర్శించిన నాటకాలు కందుకూరివారి అభిజ్ఞానశాకుంతలం—హరిశ్చంద్ర—వడ్డాది సుబ్బారాయుడుగారి వేణీసంహారం-అనంతరావుగారి అజ్ఞాతవాసం చెప్పుకోదగినవి. 1905 వ సంవత్సరంలో బొమ్మకంటి కృష్ణమూర్తిగారు తణుకు సమాజంలోనూ — ఆ తరువాత పిఠాపురం సమాజంలోనూ — వెదురుమూడి శేషగిరిరావు గారితో కలిసి పనిచేశారు.

నర్సాపురం నాటకరంగంలో కొన్ని దశాబ్దాలు నాటకరంగం అంతగా అభివృద్ధి పొందలేదు. 1958 లో డాక్టరు పొన్నపల్లి సుబ్రహ్మణ్యంగారు నర్సాపురం నాటకకళా పరిషత్తును స్థాపించి, ప్రతి సంవత్సరమూ నాటక, నాటికల పోటీలను నిర్వహిస్తూ. వుత్తమ ప్రదర్శనానికి 1116 రూపాయలు బహుమతి నిస్తున్నారు.

తేజోమయ విజ్ఞానసమితి — సర్వోదయ నాట్యకళాసమితి — శాంతి శ్రీ నాట్యమండలి — రాజకమల్ కళామండలి — నాట్యప్రభావం మొదలైన నాటక సమాజాలు నడుపబడుతున్నాయి. ఈ సమాజాలలో వేపూరి నరసింహారావు — డాక్టరు పొన్నపల్లి సుబ్రహ్మణ్యం — పోపూరి తారక వెంకటరమణ — పొన్నపల్లి వెంకటేశ్వర్లు — దాసం గోపాలకృష్ణ మొదలైన కళాకారులు పనిచేశారు.

## భీమవరం

ఇక్కడ రామకృష్ణ నాట్యమండలి, శారదా ఆర్ట్ థియేటర్, భవ్యలలిత కళాసమితి, యువజన ప్రజా నాట్యమండలి, వాణీ లలిత కళాసమితి, నవ్యకళా పరిషత్తు, రావు ఆర్ట్‌థియేటర్, నవ్యకళా నికేతన్ మొదలైన అమెచ్యూర్ నాటక సమాజాలు పనిచేస్తున్నాయి.

పాలగుమ్మి పద్మరాజు, కోడూరి నరసింహం, మల్లాది సూర్యనారాయణ, కె. లక్ష్మీనారాయణ మొదలైనవారు నాటక రచయితలుగా వున్నారు. సినీ ఆర్టిస్టు రామకృష్ణ భీమవరానికి చెందిన నటుడే.

## పాలకొల్లు :

పాలకొల్లులో పినిశెట్టి శ్రీరామమూర్తి ఆదర్శ నాట్యమండలిని, మల్లాది సత్యనారాయణ సంస్కార కళాసమితిని స్థాపించి ఆంధ్రదేశమంతటా సాంఘిక నాటకాలైన పల్లెపడుచు, కులంలేనిపిల్ల, పేదపిల్ల, చెల్లాయి, అన్నా చెల్లెలు మొదలైన నాటకాలను విరివిగా ప్రదర్శించారు.

ఇంకా అజాద్ థియేటరు, సరస్వతి నాట్యమండలి, విజయశంకర నాట్యమండలి, సాహిణి, వాహినీథియేటర్సు, జైహింద్ నాట్యమండలి, స్వతంత్రభారతి అమెచ్యూర్సు, రాఘవకళా నిలయం, సాయి నాట్యమండలి, సమతా కళాకేంద్రం, ఆభ్యుదయ కళాసమితి, సారథి నాట్యమండలి, సర్వోదయ నాట్యమండలి, బాలానంద సంఘం మొదలైన నాటక సమాజాలు పనిచేశాయి.

ఈ సమాజాల్లో ద్రోణంరాజు నరసింహారావు, పినిశెట్టి శ్రీరామమూర్తి, మల్లాది సత్యనారాయణ, రమణాచలం, నల్లా రామమూర్తి, అల్లు రామలింగయ్య,

భమిడిపాటి శ్రీరామమూర్తి. మణ్యం, కోళ్ళసత్యం మొదలైన నటులు పని చేశారు.

తణుకు :

జనతా నాట్యమండలి, బృందావన కళాసమితి, శ్రీవత్సకళాసమితి, ఆంధ్రకేసరి కళాసమితి మొదలైన నాటక సమాజాలు పనిచేస్తున్నాయి. ఈ సమాజాలలో జీడిగుంట బుచ్చేశ్వరరావు, పామర్తి వెంకటేశ్వరరావు, ఎ. రాజగోపాలరావు మొదలైన నటులు పనిచేశారు.

దేవరకొండ బాంగంగాధరతిలక్, ఆంధ్ర శేషగిరిరావు, ఆమిజాల నరసింహమూర్తి, జవ్వాది లక్ష్మయ్యనాయుడు మొదలగు నాటక రచయితలు కూడ ఈ సమాజాలకు దోహదమిస్తున్నారు.

తాడేపల్లిగూడెం :

1957 లో లలితకళా సమితి ఏర్పడి పనిచేస్తూ వుంది. మారంపల్లికిజెందిన చిత్త జల్లు పెద వెంకటరత్నం, వైదేహి, ఇందువదన, చిన వెంకటరత్నం, మొదలైన కళాకారిణులు నృత్యవిద్యలో ఆరితేరినవారు.

ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ అధ్యక్షులు పసల సూర్యచంద్రరావు, సుప్రసిద్ధ స్త్రీ పాత్రధారి బండారు వెంకటేశ్వర్లు, ప్రసిద్ధ సినీనటి పుష్పవల్లి మొదలైన కళాకారులు తాడేపల్లిగూడెంవారే.

కొవ్వూరు :

ఐ. యల్. టి. డి. కంపెని డ్రమెటిక్ అసోసియేషన్, జైహింద్ క్లబ్ పని చేశాయి.

సి. హెచ్. వి. కామేశ్వరరావు, మహిపాల వెంకటరామన్న, యన్. వీరభద్రరావు, ఉప్పల నరసింహమూర్తి మొదలైన నటులు పనిచేశారు.

ప్రసిద్ధ నటి పసుపులేటి కన్నాంబ, ప్రసిద్ధ సినీనటి మాలతి కూడ ఇక్కడివారే.



# తూర్పుగోదావరిజిల్లా నాటకరంగం



రాజమహేంద్రవరం : మానేపల్లి కంపెని-
కాకినాడ: యంగ్‌మెన్స్‌హాపీక్లబ్-పెద్దాపురం:
విద్యావినోదినీ సభ - పిఠాపురం, తుని,
రాజోలు, రామచంద్రపురం, అమలాపురం
నాటకరంగాలు

# రాజమహేంద్రవరం

## నవాబు దేవిడీలో నాటకాల కోలాహలం:

**1887** లో రాజమండ్రి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ మాసుదొరగారు. ఆయన పర్యవేక్షణలో విద్యార్థులచేత "మర్చంట్ ఆఫ్ వెనిస్" నాటకాన్ని



ప్రదర్శింపచేశారు. పాత్రధారులుగా సత్యరాజు మృత్యుంజయ రావు—పారుపల్లి అచ్యుతరామయ్య—తల్లాప్రగడ సీతారామారావు—చిలకలపూడి సీతారామయ్య మొదలైనవారు పాల్గొన్నారు. ప్రదర్శనం నవాబు దేవిడీలో జరిగినట్లూ, రాజమండ్రిలో ప్రప్రథమంగా ఇంగ్లీషు నాటకాలు ప్రదర్శించటం అదే మొదలనీ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు వారి స్వీయ చరిత్రలో తెలియచేశారు.

1889 నాటికి అంటే టంగుటూరి ప్రకాశం పంతులు గారు రాజమండ్రి చేరేనాటికే—దాసు మాధవరావు—కందుకూరి వెంకటరత్నం మొదలైనవారు ఆంగ్లంలో షేక్స్పియరు నాటకాలు ఆడేవారని ప్రకాశం పంతులుగారు వారి స్వీయ చరిత్రలో వ్రాశారు.

## ఆంధ్ర నటకేసరి టంగుటూరి ప్రకాశం:

రాజమహేంద్రవరంలో ఇమ్మానేని హనుమంతరావు నాయుడు—ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులు—చిలకమర్తి లక్ష్మీనరసింహకవి-వడ్డాది సుబ్బారాయుడు మొదలైన మహామహులు 1885-90 సంవత్సరాల ప్రాంతంలో హిందూ నాటక సమాజాన్ని స్థాపించి క్రమశిక్షణతో నడిపారు. ప్రముఖులైన విద్యావేత్తలందరూ పాత్రలు ధరించారు. ఈ సమాజంవారు తెరలు, దుస్తులు మొదలైన అలంకారాలకంటే అభినయానికే ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇస్తూ వుండేవారు. వడ్డాది సుబ్బారాయుడుగారు—వేణీ సంహారనాటకంలో అశ్వత్థామపాత్రను

అద్భుతంగా పోషించేవారట. టంగుటూరి ప్రకాశం పంతులుగారు స్త్రీ పురుష పాత్రలు ధరించడంలో అసమానుడని పేరు తెచ్చుకున్నారు.

### నాటకకళకే అంకితమైన నాగేశ్వరరావు - గున్నేశ్వరరావు :

ఆ తరువాత యస్. గున్నేశ్వరరావు - కృత్తివెంటి నాగేశ్వరరావుగార్ల యాజమాన్యంలో ఒక పెద్ద సమాజం స్థాపించబడింది. కృష్ణా గోదావరిజిల్లాలో సమర్థులైన నటులందరూ ఈ సమాజంలోకి ఆకర్షింపబడ్డారు. ఈ సమాజం వారు నాటకాలను వుత్తమంగా ప్రదర్శించడమే గాక వారి సమాజాన్ని చక్కని శిక్షణాలయంగా తయారు చేశారు. గున్నేశ్వరరావుగారు నాటకాలను వ్యాపార పరిధిలోకి తెచ్చారు. నటులకు, సాంకేతిక నిపుణులకు జీతాల నిచ్చేవారు. గున్నేశ్వరరావు-నాగేశ్వరరావుగార్లు వారికున్న యావదాస్తినీ నాటక కళకే వినియోగించారు. వీరు ప్రదర్శించిన నాటకాలన్నీ జనరంజకాలు. మంచి మంచి పాశ్చిమట్లుతో పాటలూ, పద్యాలతో నాటకాన్ని చక్కగా తయారుచేసే వారు. వీరి నాటకానికి పాటలు వ్రాసే బాధ్యత పాపట్ల కాంతయ్యగారు నిర్వహించేవారు. కాంతయ్యగారు వస్తుతః సంగీత విద్వాంసులు. అవసరమైనప్పుడు హార్మోనియం వాయిస్తూండేవారు. వీరు ఎక్కువకాలం హైదరాబాదు సంస్థానంలో వున్నారు. వీరి స్వగ్రామం కృష్ణాజిల్లా జగ్గయ్యపేట. వీరు ఆనాడు ఏర్పాటుచేసిన కీర్తన మట్టులు ఈనాటికీ అమలులో వున్నాయి. వారి పాటలు ఆనాడు అశేష ప్రజాశేషకాన్ని ఆకర్షించాయి.



ముప్పిడి జగ్గరాజుగారు స్త్రీ పాత్ర

### ప్రతిభావంతుడు పాశ్చాత్యం :

అంతేగాక చిత్ర విచిత్రమైన మంచితెరలూ, చెమ్కీకోట్లతో కనులపండువుగా ప్రదర్శనాన్నిచ్చేవారు. ఈ బాధ్యత లన్నిటినీ నిర్వహించటానికి పాశ్చా



భీముడు-శ్రీ దొమ్మేటి సూర్యనారాయణ

యువకుడైన ఏ. యస్. రామును తీసుకు వచ్చారు. సమాజం ప్రదర్శించే ప్రతి నాటకానికీ కావలసిన తెరలను, దుస్తులనూ ఈయనతో తయారుచేయించేవారు. వీరి నాటకాల్లో నృత్య ప్రదర్శనాలుండేవి. ఏ దర్బారు సీనో అయితే 30 మంది పరివారం హాజరయ్యేవాళ్లు. కన్నుమూసి కన్నుతెరిచేలోగా సీన్లు మారిపోయేవి. సకాలానికి నాటకం ప్రారంభించబడి సాగిపోయేది. ఏ ఒక్క నటుడూ సంభాషణలు తడుముకోవడంగాని, పోర్షనురాక నిలబడడంగాని జరిగేది కాదు. మధ్య మధ్య విరామ సమయాల్లో ఏ. యస్. రాముగారు పార్సులుచేస్తూ, ప్రేక్షకులను ఆనందింప జేసేవారు. ప్రదర్శనాకాలంలో ఏ విధమైన అల్లరి బయలుదేరినా గున్నేశ్వరరావుగారు వచ్చేసరికి నిశ్శబ్దమైపోయేది. ఇలా గున్నేశ్వరరావు, నాగేశ్వరరావు గార్లు ఆదర్శంగా నాటక సమాజాన్ని గడిపారు.

కృత్తివెంటివారి
కొత్తనాటక సమాజం :

కొంతకాలానికి వీరిరువురికి భేదాభిప్రాయాలువచ్చి నాగేశ్వరరావుగారు స్వంత నాటక సమాజాన్ని ఏర్పాటుచేసి ఆంధ్రదేశమంతటా నాటకాలను ప్రదర్శించారు.

వీరి సమాజం ఎంతో కట్టుదిట్టంగానడిచేది. సమాజ సభ్యులందరూ సమాజం ఏర్పాటుచేసిన హాస్టల్‌లోనే వుండేవారు. నటులు ప్రతిరోజూ వుదయం 5 గంటలకు స్వరసాధన చేసేవారు. పాత్రధారులు వారివారి పోర్షన్ను చదువుతూ ఉచ్చారణనూ, హావభావాలనూ సాధకం చేసేవారు. నాగేశ్వరరావుగారు సమాజ సభ్యులందరినీ కన్నబిడ్డలుగా చూచుకొనేవారు. ఈ విధంగా వారి సమాజం 12 సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా నడిచింది. దాదాపు 150 మంది నటులు తయారయ్యారు. డజనుమంది హార్మోనిష్టులుగా తయారయ్యారు. ఆయన అనేక ఔత్సాహిక నాటక సమాజాలకు ఆదర్శప్రాయులయ్యారు. రంగూను, నైజాము మొదలైన

ప్రాంతాల్లో కూడా నాటకాలు ప్రదర్శించి అనేకమంది సంస్థానాధిపతులతో సత్కారాలు పొందారు.

మానేపల్లి కంపెనీ:

**1898** ప్రాంతాల్లో మానేపల్లి వాస్తవ్యులైన ధరణిప్రగడ సూరయ్యగారు, నేషనల్‌థియేటర్ నాటక సమాజాన్ని స్థాపించారు. వారి వూరుపేరునుబట్టి వారి కంపెనీగా స్థిరపడిపోయింది. నేషనల్‌థియేటరు పేరుమీద ఇస్నీసుపేటలో ఒక థియేటరును కట్టారు. ప్రథమంగా వ్యత్తినాటక సమాజంగా వర్ధిలిన నాటక సమాజం ఇదేనని ప్రతీతి. ఈ సమాజంలో అంబడిపూడి కోటయ్య, ముప్పిడి జగ్గరాజు ప్రసిద్ధనటులుగా వెలుగొందారు. నాయక పాత్రధారణలో అంబడిపూటి కోటయ్యగారు అందెవేసినచేయి.స్థూలద్రూపి. పంచు పద్యం పాటలో, నటనలోమెటి.

నాయకి పాత్రధారణలో ముప్పిడి జగ్గరాజుగారు ఆనాడు అనన్యమైన పేరు ప్రఖ్యాతుల్ని సంపాదించుకొన్నారు. ఆయన స్త్రీ పాత్రధారణలో ప్రేక్షకులను మగ్ధుల్ని చేసేవారట. అభినయంలో, నడకలో, వయ్యారంలో, ఒడుపులో, ఒద్దికలో, స్త్రీయే ఈ పాత్ర ధరిస్తున్నదా అనేటంతటి భ్రమలో ముంచేవారట. దాదాపు ఈ సమాజం వీరివురి అండదండలతో 1911-12 ప్రాంతంవరకూ జేగీయమానంగా నడిచింది.

శ్రీపాద కామేశ్వరరావుగారు 'ఏమెచ్యూర్స్' అనే నాటక సమాజాన్ని స్థాపించి నటులకు శిక్షణయిచ్చి నాటకాలను ప్రదర్శించేవారు. వీరి సమాజంలో ప్రముఖనటుడుగా పేరు సంపాదించినవారు అంకరాజు రామారావుగారు, వీరు నాయకపాత్రలను, ఏలూరుపాటి వెంకటరత్నంగారు నాయికపాత్రలను ధరించేవారు.

రాజమండ్రి నాటకరంగంలో బ్రహ్మజోస్యుల సుబ్బారావు, అంకరాజు శంకర్రావు, వెల్లంకి వెంకటేశ్వర్లు మొదలైనవారు ప్రసిద్ధనటులుగా వెలుగొందారు.

1950 సంవత్సరంలో లలితకళా నికేతన్ స్థాపించబడి ప్రతి సంవత్సరమూ నాటక, నాటికల పోటీలు జరిపి ఔత్సాహికనాటక సమాజాలకు వుత్సాహాన్నివ్వడమే కాక అనేకమంది కళాకారులను సన్మానిస్తూ వుంది.

1950 లో రాఘవ కళాసమితి స్థాపించబడి అనేక సాంఘిక నాటకాలను

ప్రదర్శించారు. ఈ సమాజం ఆంధ్ర నాటక కళా పరిషత్తు సభలలోనూ, అనేక పరిషత్తులలోనూ ఎన్నో బహుమానాలను సంపాదించింది. ఈ సమాజాన్ని డాక్టరు జి. రాజారావు, యాసంరెడ్డి వెంకటరావుగార్లు అమోఘంగా నడిపారు.



శ్రీ బ్రహ్మాజోస్యుల సుబ్బారావుగారు వీరనేమైన స్టేజి నాటకాలను ప్రదర్శించారు.

వి. యస్. రావుగారు 1955 లో వెంకటేశ్వర మెమోరియల్ క్లబ్ స్థాపించి సాంఘిక నాటకాలను ప్రదర్శించారు.

శ్రీ మేడూరి వెంకన్నగారు 1957 లో యం. వి. థియేటర్సును స్థాపించారు.

ఇండియన్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ నాటక సమాజంలో అందరూ రైల్వే ఉద్యోగులు.

1954 లో ఉపాధ్యాయ మిత్రబృందం అనే హరిశ్చంద్రలో - కాటికాపరి నాటకసమాజాన్ని మూలశెట్టి నాగేశ్వరరావు - కిలిండి నరసింహారావు మొదలైన వారు స్థాపించారు

1953 లో ఆంధ్ర థియేటర్సు ఫెడరేషన్‌ను కొప్పరపు సుబ్బారావు - డాక్టరు రాజారావు - వేమల జగన్నాధరావు మొదలైనవారు స్థాపించి విజయవాడలోనూ, రాజమండ్రిలోనూ నాటక పాఠశాలలను నడిపారు.

పైన వివరించినవే కాక రాజమండ్రిలో వీర వెంకన్న ఆర్ట్ థియేటరు—విశ్వకళాసమితి—ప్రజా నాట్యమండలి—రామలక్ష్మణ ఆర్ట్ థియేటర్—కె. బి. నాట్యమండలి—వీరేశలింగం ఆర్ట్ థియేటర్ — జయలలిత కళాసమితి — నవజీవన సమితి—పోస్టు అండ్ టెలిగ్రాఫ్ డ్రమెటిక్ అసోసియేషను—శ్రీ అభ్యుదయ నాట్యకళాసమితి—హరకుసుమ థియేటర్ మొదలైన ఔత్సాహిక నాటకసమాజాలు చురుకుగా పనిచేశాయి.

నటీనటులు :

అంకరాజు శంకరరావు—డాక్టరు జి. రాజారావు—నిడసనమెట్ల కొండల రావు-ఓలేటి నారాయణమూర్తి—ద్రోణంరాజు చినకామేశ్వరరావు-మోతిళ్ళమల్లి కార్జునరావు — వి. ఆర్. శ్రీపతి—కాపుగంటి రమణరావు — శ్రీపాద పట్టాభి

రామారావు—వేములూరు నాగేంద్రం—పడాల రామారావు—వై. శేషగిరిరావు-ఆర్. వెంకటరావు—యన్. వెంకటేశ్వరరావు — కె. వీర్రాజు — యం. డి. అబ్దుల్లా—సప్పా రామారావు — కొంపెల్ల పేరయ్యసోమయాజి — భమిడిపాటి భీమయ్య—కుమారి లక్ష్మి—శ్రీమతి శాంత — నెల్లూరు నాగమణి—పువ్వాడ నరసింహమూర్తి—యం.వి.యన్. చారి—శేషకుమారి—అమర్‌నాథ్—శంకర మంచి జానకి—బాబ్జీ — యన్. ఎ. కాంచన — చంద్రశేఖరం మొదలైన కళాకారులు రాజమండ్రి నాటకరంగంలో వెలుగొందారు.

ఆంధ్ర థియేటర్స్
ఫెడరేషన్ :

ఈ థియేటర్ ఫెడరేషన్‌కు పూర్వచరిత్ర ఏమీ లేదు. 1952 వ సంవత్సరంలో కొప్పరపు సుబ్బారావు, డాక్టరు రాజారావు, వేమల జగన్నాధరావు మొదలైన వారంతా కలిసి ఆంధ్రదేశంలోవున్న నాటక సమాజాల నన్నిటినీ ఒక సమాఖ్యగా ఏర్పాటుచేసి వాటి అభివృద్ధికి పాటుపడాలని స్థాపించారు. రాజమండ్రిలో దీని ప్రధమ మహాసభ జరిగింది. బలరాజ్ సహానీలాంటి ప్రసిద్ధ నటుడు ఈ సభకు హాజరై గంభీరోపన్యాసా న్నిచ్చారు. నూరు నాటక దళాలు ఈ సమాఖ్యకు అనుబంధ శాఖలుగా చేరాయి. థియేటర్స్ ఫెడరేషన్ తరపున విజయవాడలోనూ, రాజమండ్రిలోనూ నాటక పాఠశాలలు నడుపబడ్డాయి. నాట్యకళకు సంబంధించిన అనేక విషయాలమీద క్లాసులు నడుపబడ్డాయి. అనేకమంది కళాకారులు ఈ క్యాంపుల్లో ప్రాథమిక విషయాలమీద పరిజ్ఞానాన్ని సంపాదించారు.

# కాకినాడ

కాకలుతీరిన
కాకినాడ కళాకారులు :

కాకినాడ నాటకరంగాన్ని ప్రారంభించిన వారిలో ముఖ్యులు పింగిళి అబ్బాయి గారనే వెంకట్రావుగారు. అంతకుముందు జగన్నాధపురంలో పులవర్తి వెంకయ్య మొదలైనవారు ప్రయత్నాలు చేశారు గాని ముందుకు రాలేదు. ప్రజ్ఞావంతులైన పింగిళి అబ్బాయిగారికి, వెదురుమూడి శేషగిరిరావు—జయంతి భావనారాయణ

కవి—ఉప్పు చిదానందరావు—పంద్రవాడ కేశవరావు—తుర్లపాటి సుబ్బయ్య—దూబరాజు రెడ్డిపంతులు—దినవహి కృష్ణమూర్తి—పత్రి రామచంద్రరావు—ముష్టి నాగన్న—మంగిపూడి పేరయ్యశాస్త్రి—దేవరకొండ కృష్ణమూర్తి—బారు వెంకట రమణయ్య—పత్రి శేషగిరిరావు—మొసలికంటి బాయన్నపంతులు—జోడుగంటి కృష్ణారావు—కుందూరి మూర్తిరాజు-దోమలకొండ సోమేశ్వరరావు—కొటికలపూడి వెంకటరామయ్య—నండూరి మూర్తిరాజు—వల్లూరి జగన్నాధరావు—ముప్పిడి జగ్గరాజు మొదలైన ఉద్దండులైన నటులెంతోమంది వుండేవారు. పైన వుదాహరించిన వారందరూ విద్యావంతులు. రంగస్థలంమీద ప్రతి ఒక్కరూ ప్రేక్షకుల అదరాభిమానాలను చూరగొన్నవారే. వీరిలో ముఖ్యంగా అందరిచేతనూ ప్రశంపించబడ్డ నటుడు వెదురుమూడి శేషగిరి రావుగారు. శేషగిరిరావుగ్గారు నటులేగాక రచయిత కూడా. సుభద్రాపరిణం, కన్యకావిజయం, సుయోధన ఘోషయాత్ర మొఎలైన తెలుగు నాటకాలనూ-శివాజీ చరిత్ర, పీష్వా నారాయణరావు వధ మొదలైన హిందీ నాటకాలను కూడా రచియించారు.

ఎందరికో వెలుగునిచ్చిన

యంగ్‌మెన్స్ హాపీక్లబ్ :

1916 వ సంవత్సరంలో యంగ్‌మెన్స్ హాపీక్లబ్ ఏర్పడింది. ఈ సమాజంలో ఏలూరుపాటి వెంకటరత్నం—పామర్తి బుచ్చిరాజు—దేవినేని జగన్నాయకులు వుండేవారు. వీరు కాళ్ళకూరి నారాయణరావుగారి 'చింతామణి' నాటకాన్ని కడు సమర్థనీయంగా ప్రదర్శించేవారు. ఈ విధంగా కాకినాడ నాటకరంగం ఎంతో అభివృద్ధి చెందింది. ఈ అభివృద్ధికంతకూ కారకులైనవారు సింగితం సుబ్బారావు—పులవర్తి వెంకయ్య—జయంతి భావనారాయణ—మంగిపూడి పేరయ్యశాస్త్రి-మొసలికంటి బాయన్న—నండూరి మూర్తిరాజు—బారు వెంకటరమణయ్య మొదలైనవారు.

1916 లో స్థాపించబడిన యంగ్‌మెన్స్ హాపీక్లబ్ ఈనాటికీ పనిచేస్తూనే వుంది. ఈ సమాజంనుండి సుప్రసిద్ధ హాస్య సినీనటులు రేలంగి వెంకటరామయ్య, సినీ నటి శ్రీమతి అంజలీదేవి ఉద్భవించారు. ఈ సమాజ వికాసానికి తోడ్పడిన

వారిలో ముఖ్యులు డి. జగన్నాయకులుగారు. ఈనాడు ఈ క్లబ్‌కు దంటు భాస్కర రావుగారు ప్రెసిడెంటుగను, కార్యదర్శిగా ఎ. వి. సుబ్బారావుగార్లు పని చేస్తున్నారు.

1918 లో ఆంధ్రసేవా సంఘాన్ని పల్లా వెంకట హనుమంతరావు-చిత్త జల్లు రామారావు-నిష్టల నారాయణ మొదలైనవారు స్థాపించి, పౌరాణిక నాటకాలను, చారిత్రక నాటకాలను ప్రదర్శించారు. ఈ సమాజంలోనే కీ॥ శే॥ కిళాంబి కృష్ణమాచార్యులుగారు పనిజేశారు.

పై సమాజాలేగాక 1954 లో కళాప్రపూర్ణ రాఘవకళా సమితి - రసన సమాఖ్య-మార్కండేయ విలాస సభ-లలిత కళా పరిషత్-కళా భారతి - విజయశ్రీ ఆర్ట్ థియేటర్సు - సరస్వతి నాట్య నికేతన్ - యువజన నాట్యమండలి - నటరాజ నాట్యమండలి-కళా సమితి మొదలైన సమాజాలు నడుపబడుతున్నాయి.

నటీ నటులు :

కాకినాడ నాటకరంగంలో గండికోట జోగినాధం - డి. జగన్నాయకులు - కొవ్వాడ సూర్యనారాయణ - భద్రిరాజు భాస్కరరాజు - పసుమర్తి పార్వతీశం - సామిన రంగారావు - యం. నాగభూషణం - శ్రీమతి కొటారి శకుంతల-కొటారి అలివేణి-యన్. రాఘవకుమారి - రజనీకాంతం - కామేశ్వరి - పిళ్ళారిసెట్టి సూర్యారావు-శ్రీమతి తాయారు పంకజం-యం. వి. రమణమూర్తి-ఎ. వి. రమణ మూర్తి-యన్. పి. లక్ష్మణస్వామి-కె. వీరరాఘవస్వామి-వి. రామరాజు - శ్రీమతి డి. లక్ష్మి-తేతలి సూర్యకుమారి - పట్నాల సన్యాసిరావు - పెండ్యాల సుబ్బారావు-శ్రీమతి వి. సరోజని-కుమారి రాజ్యం-శ్రీమతి అంజమ్మ- శ్రీ సాంబు-ఎ. వి. సుబ్బారావు-పి. యస్. రావు, సినీ డైరెక్టరు-కస్తూరి శివరావు - లంకసత్యం - హార్‌నాధ్-అడ్డాల నారాయణరావు-బేబి మల్లిక-శ్రీమతి సూర్యకాంతం (సిని నటి) మొదలైన ప్రసిద్ధ నటీనటులు వెలుగొందారు.

## పిఠాపురం

కోటలో నాటకాలు :

1900-1906 సంవత్సరాలలో శ్రీ రాజా రావుసూర్యారావుగారు, కోలంక వీర

వరం ఎస్టేట్ల జమీందారిణి శ్రీ రావు చెల్లాయమ్మారావుగారు ఒక నాటక సమాజాన్ని స్థాపించి, వారి కోటలో ఒక నాటకశాలను కూడా నిర్మించారు. దీన్ని



ఆలమూరి పట్టాభిరామయ్యగారు—పైక్రోయుడు

సత్యనారాయణ కంపెని అని పిలిచేవారని శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు తమ అనుభవాలూ, జ్ఞాపకాలు అన్న గ్రంథంలో వివరించారు. ఈ సమాజానికి పానుగంటి వారు అనేక నాటకాలను వ్రాశారు. వెలుదుమూడి శేషగిరిరావు, దేవరకొండ కృష్ణమూర్తి నాయికా నాయక పాత్రలు ధరించేవారు. ఆలమూరి పట్టాభిరామయ్య, కలగాని రామయ్య ప్రసిద్ధ నటులుగా ఈ సమాజంలో పేరు తెచ్చుకున్నారు. చెలికాని వెంకట సూర్యారావు, ఆకుండి వెంకటరత్నం ఈ సమాజాభివృద్ధికి ఎంతగానో పాటుబడ్డారు. ఈ సమాజం వారు రాజమండ్రి, పిఠాపురం, కాకినాడ, సామర్లకోట మొదలైన ప్రాంతాల్లోనేగాక, నైజాం రాష్ట్రంలోనూ, ఇతర సర్కారు జిల్లాలలోనూ నాటక ప్రదర్శనాలు ఇచ్చారు.

ఈనాటికీ పిఠాపురంలో అనేక నాటక సమాజాలు పనిచేస్తూనే వున్నాయి. 1952 లో గణేశ నాట్యమండలి, 1948 లో పీఠికాపుర కళాసమితి, 1955 లో సాయి బాబా నాట్యమండలి, 1936 లో నవకళా సమితి, నవోదయ కళాసమితి, భారతీయ సంఘం, 1948 లో స్వతంత్ర నాట్యమండలి, ఆంధ్రప్రజా నాట్యమండలి, ఆంధ్ర సేవా నాట్యమండలి మొదలైన సమాజాలుఏ ర్పడి పనిచేశాయి.

## సామర్లకోట

1944 లో దక్కన్ సుగర్‌ఫ్యాక్టరీ ఎంప్లాయీస్ డ్రమెటిక్ అసోసియేషన్, 1945 లో జానకి కళాథియేటర్, 1955 లో ఆంధ్రనాటక కళాసమితి, 1955 లో

హిస్ట్రియానిక్సు. ఆంధ్ర అమెచ్యూర్స్. భారత నాటక కళాసమితి మొదలైన నాటక సమాజాలు పనిచేశాయి.

ఈ సమాజాలలో చాగంటి సన్యాసిరాజు, సమయం వీర్రాజు, జి. వెంకట రమణ, నల్లమాటి గోపాలకృష్ణ, కూర్మా వెంకటరావు, యన్. వీర్రాజు, కూనిసెట్టి అప్పారావు, కుందం వీర్రాజు, షేక్‌పకీర్‌షా, మోహన్‌బాబు, దర్భా రమేష్, జి. యస్. రావు, తాడి రత్నావళి మొదలైన నటీనటులు పనిచేశారు.

## పెద్దాపురం

విద్యావినోదినీ సభ:

ఆంధ్రనాటరంగ తొలిదశలో పెద్దాపురంలో విద్యావినోదినీ సభ స్థాపించబడి, ఎంతోమంది ప్రసిద్ధులైన విద్యావంతుల నాకర్షించి, ప్రతాపరుద్రీయంలాంటి వుత్తమ నాటకాలను ప్రదర్శించింది. ప్రతాపరుద్రీయ నాటకంలో కల్లూరు సుందర రామయ్య పంతులుగారు యుగంధర పాత్రను అద్భుతంగా పోషించి ప్రేక్షకుల వన్ననలనందుకున్నారు.

1938 లో పెద్దాపురంలో భారత అమెచ్యూర్సు స్థాపించబడి నాటక కళా పరిషత్తులలో నాటకాలను ప్రవర్శించింది. ఈ సమాజంలో ముప్ప నరాహూరావు, కోటి రామలింగస్వామి మొదలైనవారు పనిచేశారు. ఇంకా రాఘవ కళాసమితి-నాటక కళాసమితి—రాఘవ ఆర్టు థియేటర్సు—స్వతంత్ర ఆర్టు థియేటర్సు పని చేస్తున్నాయి. ఈ సమాజాలలో ముప్పన చిన్నఅంకయ్య—గోళ్ళ నాగేశ్వరరావు —బిందం సూర్యారావు—కోటి రామలింగస్వామి—పెద్దాపురం రాజు మొదలైన వారు నటీనటులుగా వున్నారు.

## తుని

1948 లో కన్యకాపరమేశ్వరి నాట్యమండలి, 1955 లో మాసం భాస్కర రావు ప్రజా నాట్యమండలి శాఖను స్థాపించారు, 1956 లో వాణీ నాట్యమండలి మొదలైన సమాజాలు పనిచేశాయి. ఈ సమాజాల్లో డి. టి. రాజు, సి. చిట్టి

బాబు, జట్ల అప్పారావు, యం. రాజారావు, జి. వెంకటస్వామి, వి. వి. రమణ మూర్తి, బి. ఆదినారాయణ, పి. అప్పారావు, గోపాలం, వై. భద్రాచలం, ఎ. రామారావు, యం. జి. ఆచార్య, కె. రామచంద్రరావు మొదలైనవారు నటులుగా వెలుగొందారు.

## రాజోలు

1955 లో కళాపరిషత్తు, 1958 లో కళావిహార్ మొదలైన నాటక సమాజాలు పనిచేశాయి. ఈ సమాజాల్లో యం. రమణమూర్తి, పి. వీరభద్రరావు, సి. హెచ్. సూర్యనారాయణమూర్తి మొదలైన కళాకారులు పనిచేశారు.

## రామచంద్రపురం

1938 లో ఆంధ్రవిజ్ఞాన పరిషత్తు, 1956 లో నాట్యశాల, 1958 లో కళా కేంద్రం ఏర్పడి పనిచేస్తున్నాయి. దువ్వూరి నరసరాజు, యన్. సూర్యనారాయణ మూర్తి, యస్. నరసింహాచార్య, బాబురావు, స్వామి, రామారావు మొదలైనవారు నటులుగా పనిచేశారు.

## గొల్లప్రోలు

1938 లో రామాంజనేయ బాలభక్తసమాజం, 1948 లో పాండురంగ భక్త నాట్యమండలి, 1957లో రిక్రియేషన్‌క్లబ్, కొప్పరపు సుబ్బారావు స్మారక నాటక కళా పరిషత్తు, ఆంధ్రకళా పరిషత్తు మొదలైన నాటక సమాజాలు, స్థాపించబడి నడుస్తున్నాయి. ఈ సమాజాల్లో మొగిలి రామచంద్రరావు, పొన్నాతాతారావు, వుప్పలూరి అప్పలస్వామి, సి. హెచ్. వీరాస్వామి, అల్లుమల్లు భాస్కరరావు, అడపా సూర్యనారాయణ మొదలగు కళాకారులు పనిచేశారు.

## అమలాపురం

1948 లో అభ్యుదయ కళాసమితి, 1943 లో అభ్యుదయ నాట్యమండలి, 1955 లో సాహితి కళాకేంద్రం మొదలైన నాటక సమాజాలు ఏర్పడి పనిచేసు

న్నాయి. ఈ సమాజాలను ఎ.ఎ. పేరిశాస్త్రి, పి. కామేశ్వరరావు, వి.వి. సుబ్బారావు, జి. ధర్మారావు, జి. లక్ష్మణరావు, మొదలైనవారు నడుపుతున్నారు. ఈ సమాజాలలో వై. వి. సుబ్బారావు, ద్రోణంరాజు నరసింహారావు, వై. రామమోహనరావు, యన్. వి. సుబ్బారావు, మొదలైనవారు నటులుగా వెలుగొందారు.

## కొత్తపేట

1956 లో కళామందిర్‌ను వి. రామారావు, మారి రామచంద్రుడు స్థాపించారు. రాజోలు నాటకరంగంలో ఎ. కృష్ణమూర్తి, నిట్టల రామమూర్తి, కేశవరావు, రామచంద్రమూర్తి, నల్ల సత్యనారాయణ, కె. వి. సుబ్బారావు, యన్. అచ్యుతరావు, బి. ఎ. శర్మ, జె. బి. సుబ్బారావు, అయ్యగారి శ్రీరామమూర్తి, మంగిపూడి దుండేశ్వరరావు, కె. సత్యం, ఏ. వీరభద్రం మొదలైనవారు పని చేశారు.

# విశాఖపట్టణం జిల్లా నాటకరంగం



విశాఖపట్టణం: జగన్మిత్ర నమాజం-
విశ్వవిద్యాలయ విశాలనాటకరంగం,
విజయనగరం: విజయరామ ద్రమె
టిక్ అకాడమి, భీమిలిపట్నం -
అనకాపల్లి-నర్సీపట్నం_యలమంచిలి
మొదలైన నాటక రంగాలు.

### జగన్మిత్ర సమాజం:

ఆంధ్రదేశమంతా పర్యటించిన ధార్వాడవారు విశాఖపట్టణంలో కూడా హిందీ నాటకాలను ప్రదర్శించారు. ఇవి ప్రజలను ఎంతో ఆకర్షించాయి. కొంతమంది యువకుల్లో నాటకాలాడాలనే ఉత్సాహం కలిగింది. పరవస్తు రంగాచార్యులుగారు శాకుంతలం నాటకాన్ని అనువదించారు.1885లో జగన్మిత్ర సమాజాన్ని శ్రీ రఘునాథనర్మగారు స్థాపించారు. అంతం జగ్గారావు, విక్రమదేవవర్మ, మొసలికంటి సూర్యనారాయణ, సెట్టి లక్ష్మీనరసింహం, కాదంబరి జగన్నాధరావు, బెండూరు చిదంబరరావు మొదలైనవారు సమాజసభ్యులుగా వుండి కాళిదాసు నాటకాలూ, షేక్స్పియర్ నాటకాలూ, వేణీసంహారం, చంద్రహాస, శ్రీనివాసకళ్యాణం, హరిశ్చంద్ర మొదలైన నాటకాలను ప్రదర్శించేవారు. తెరలూ, దుస్తులూ, ఆయా నాటకాలకు తగినట్లు వ్రాయించుకుని నాటకాలను ప్రదర్శించేవారు. వీరి నాటకాలు అనతికాలంలో ప్రజామోదాన్ని పొందాయి.



జగన్మిత్ర సమాజంలో గోచేటి కామేశ్వరరావు, కాదంబరి జగన్నాధరావు, తెన్నేటి జగన్నాధరావు, సెట్టి లక్ష్మీనరసింహం, చిదంబరరావు, నీలమణి పాణిగ్రాహి, తియ్యాళి భాస్కరరావు, బాకురపండా వెంకటరావు, ఎల్లాయి సోమశేఖరం, జయంతి సూర్యనారాయణ, ప్రయాగ నరసింహశాస్త్రి మొదలైనవారు ప్రముఖ నటులుగా పేరుపొందారు.

### విక్రమదేవవర్మ వితరణ:

ఈ సమాజంవారి నాటకాలన్నీ ప్రదర్శించటానికి విక్రమ దేవవర్మగారు కట్టించిన స్వంతహాలు వెలమపేటలో వుండేది. సెట్టి లక్ష్మీనరసింహంగారు చిత్ర

హరిశ్చంద్రీయం, రుక్మిణీ కళ్యాణం, మాలినీ విజయం, అహల్య నాటకాలనూ, వర్మగారు మానవతీ చరిత్ర, శ్రీనివాసకళ్యాణం నాటకాలనూ రచియించి సమాజ సభ్యులతో ప్రదర్శింపచేశారు.

1889-90 ప్రాంతాల్లో ఈ సమాజంలో విద్యాధికులూ, ఉద్యోగులూ చేరి సమాజాన్ని పెంపుచేశారు. మంతా సూర్యనారాయణగారు సమాజ కార్యదర్శిగా వున్నకాలంలో తాతా ఉమామహేశం, నండూరు కృష్ణమూర్తి మొదలైనవారు ఎంతో కట్టుదిట్టంగా ఈ సమాజాన్ని నడిపారు. వీరి నాటకాల్లో ఎప్పటికప్పుడు నూతన సాంప్రదాయాలను ప్రవేశ పెట్టేవారు. హాస్యంలోనూ, నృత్యంలోనూ, కత్తిసాములోనూ, ప్రత్యేకనిపుణు లుండేవారు. సమాజం క్రమశిక్షణతో నాటకాలను ప్రదర్శించేవారు.

కళాభిలాషక నాటకసమాజం:

మారేపల్లి రామచంద్రశాస్త్రి, సెట్టి లక్ష్మీనరసింహంగారు 1895 లో ఈ సమాజాన్ని స్థాపించారు. జగన్మిత్ర సమాజంతో పోటీగా నిలబడి నాటకాలు ప్రదర్శించిండి. ఈ సమాజానికి కావలసిన నాటకాలు శాస్త్రిగారే వ్రాసేవారు. అయనే దర్శకత్వం వహించేవారు. ప్రప్రథమంగా వేణీ సంహారం నాటకాన్ని ఒనరంజకంగా ప్రదర్శించారు. ఈ సమాజానికి ఆకెళ్ళ సత్యనారాయణగారు కూడ నాటకాలు వ్రాసియిచ్చారు. రామచంద్రశాస్త్రిగారు నల నాటకం, కీరాతార్జునీయం, పారిజాతాపహరణం, కంసవధ, ప్రహ్లాద విజయం, పాండవజననం, బిల్హణీయం, ద్రౌపదీ స్వయంవరం, సారంగధర మొదలైన 30 నాటకాలవరకూ వ్రాశారు.

ఈ సమాజంలో రామచంద్రశాస్త్రిగారు, సెట్టి లక్ష్మీనరసింహం, కవికొండల నరసింహం, జయంతి సూర్యనారాయణ, జిల్లేపల్లి వీరభద్రస్వామి, చిల్లా నారాయణస్వామి, అమంచి రామమూర్తి, ఆమంచి సీతారామయ్య, చావలి వెంకటరమణశర్మ, భాగవతుల కృష్ణారావు, కొండూరు రామమూర్తి, తడకలూరి కుప్పుస్వామి, శివకోటి అప్పలరాజు, కట్టె సూర్యనారాయణమూర్తి, చిల్లా నారాయణమూర్తి మొదలైన నటులు భిన్నవిభిన్నపాత్రలను సమర్థనీయంగా నటించేవారు.

కుప్పుస్వామి బాణీలు:

వీరి సమాజం నాటకాల్లో పాటలకు కుప్పుస్వామిగారు బాణీలు, మట్లు కట్టేవారు. సుప్రసిద్ధ చిత్రకారులైన రత్నం మాష్టరు కావలసిన తెరలు వ్రాసేవారు.

ఆనాడు చాలవరకు పాటల్లోనూ, సీనరీల్లోనూ పార్శీవారినే అనుకరించేవారు. ఈ సమాజం రాజమండ్రి, విజయనగరం, అనకాపల్లి మొదలైన పట్టణాల్లో కూడా నాటకాలు ప్రదర్శించి ప్రశంస లందుకుంది. 1912 తరువాత ఈ సమాజం నిలిచి పోయింది.

ఆ రోజుల్లో ప్రియసల్లాపక కంపెనీ ఒకటి వుండేది. ఈ సమాజం వారు కేవలం హిందీ నాటకాలనే ప్రదర్శించేవారు.

పార్శీ రామారావుగారు ఆంధ్రా ఎమెచూర్స్ అనే సమాజాన్ని స్థాపించి హరిశ్చంద్ర, చిత్రనళీయం నాటకాలు ప్రదర్శించి పేరుపొందారు. ఈ సమాజంలో రాజమండ్రి వాస్తవ్యులు ముప్పిడి జగ్గరాజుగారు స్త్రీ పాత్రల్నీ, రామారావుగారు పురుషపాత్రల్నీ, బి. వెంకటస్వామిగారు స్త్రీ పురుషపాత్రలు రెండింటినీ సమర్థవంతంగా నటించి ప్రశంసాదరణను పొందారు.

సంగీతమానినీ సమాజం :

వేశ్యావృత్తిని మాన్పించి, వారికి జీవనోపాధి కల్పించాలని కంకణం కట్టుకుని, మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు ఈ సమాజాన్ని స్థాపించారు. ఈ సమాజ సభ్యులందరూ వేశ్యలే. నటులను పంక్తిబాహ్యులుగా నిషేధించే ఆ రోజుల్లో స్త్రీలతో నాటక సమాజాన్ని ఏర్పాటుచేసిన శాస్త్రిగారు ఎంతటి అభ్యుదయ కాముకులో మనకు అర్థమౌతుంది. ఈ సమాజంవారు గుంటూరు, ఏలూరు, బందరు, రాజమండ్రి, కాకినాడ మొదలైన పట్టణాల్లో సంచారంచేసి అఖండంగా నాటకాలు ప్రదర్శించారు.

ఈ సమాజంలో శ్రీమతులు కొంకిపూడి చినబుల్లి, కొంకిపూడి చినచిట్టి, మద్దిల సూర్యనారాయణమ్మ, కొంకిపూడి పెదబుల్లి మొదలైనవారు వుత్తమ నటీమణులుగా గణన కెక్కారు. ఈ సమాజం పది సంవత్సరాలు దేదీప్యమానంగా నడిచింది.

రసపుత్రవిజయం నాటక రచయిత ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణగారు హితకారిణీ సమాజాన్ని స్థాపించి, దేశభక్తి ప్రబోధానికి రసపుత్రవిజయం నాటకాన్ని ప్రదర్శించారు.

తరువాత విశాఖపట్టణాంధ్ర నాటక పరిషత్తును 1916 లో విక్రమదేవవర్మ గారు స్థాపించి శ్రీనాధుని పీఠినాటకం విషయంలో కృషిచేశారు.

1900 ప్రాంతంలో రాగటి వెంకటరావుగారు సుజనరంజనీ నాట్యమండలిని స్థాపించి హిందీ నాటకాలు ప్రదర్శించారు.

కారనేషన్ హిందీ అమెచ్యూర్స్:

1911 లో కారనేషన్ హిందీ అమెచూర్స్ అనే సంస్థను పార్శీ రామారావు గారు స్థాపించారు. వీరు హరిశ్చంద్ర, రసపుత్రవిజయం, కనకతార, వేణీ సంహారం మొదలైన నాటకాలను ప్రవర్శించేవారు, ఈ సమాజంలో పొడుగు విశ్వనాధం, కామరాజు, పార్శీ శేషగిరిరావు, సెట్టి వెంకటస్వామి మొదలైనవారు ముఖ్య బాధ్యతలు వహించారు.

కొంతకాలానికి ఈ సమాజం ఆంధ్ర అమెచ్యూర్సుగా మారింది. విప్లవ వీరుడైన అల్లూరు సీతారామరాజు ఈ సమాజ నాటకాల్లో నటించారు.

1924 లో ఎం. నటేశ మొదలియారు ఈ సమాజాన్ని స్థాపించారు. రసపుత్ర విజయం, దుర్గాదాసు, సావిత్రి మొదలైన నాటకాలను ఈ సమాజంవారు ప్రదర్శించారు. మంథా సుబ్బారావు, టి. రామశర్మ, బాకురుపండా వెంకటరావు మొదలైన నటులు ముఖ్యులు.

నాట్యకలాభిలాషుల సభ:

మారేపల్లి రామచంద్రశాస్త్రిగారి అధ్యక్షతను 1931 లో నాట్యకలాభిలాషులసభ ఏర్పడింది. పురిపండా అప్పలస్వామి, భమిడిపాటి చినయజ్ఞనారాయణశర్మగార్లు కార్యదర్శులుగా పనిజేశారు. 1935 వరకూ ఈ సమాజం నడిచింది. నాలుగు దశాబ్దాలపాటు విశాఖపట్టణంలో నాటకరంగం మూడు పువ్వులూ, ఆరుకాయలూ కాచింది. ఈ స్వర్ణ చరిత్రను పురిపండా అప్పలస్వామిగారు కళావని సంచికలో వివరించారు.

విశ్వవిద్యాలయం
విశాల నాటకరంగస్థలం:

ఆంధ్రనాటకరంగంలో, ఆంధ్ర విశ్వవిద్యాలయం నాటక కళలో ప్రముఖ పాత్ర వహించింది. దీనికి కారకులు కూర్మా వేణుగోపాలస్వామిగారు, 1938 లో

ఆంధ్ర విశ్వవిద్యాలయ డ్రమెటిక్ అసోసియేషన్ ప్రారంభమైంది. గోపాలస్వామి గారి అధ్వర్యంలో ఆంధ్ర విశ్వకళా పరిషత్తు అనుబంధ కళాశాల నాటకోత్సవాలు కూడ ప్రారంభమైనాయి.

1913 లో ఎక్స్పెరిమెంటల్ థియేటరు స్థాపించబడింది. యుద్ధసమయంలో యూనివర్సిటీ గుంటూరుకు మార్చిన సమయంలో గుంటూరులోనూ, వాల్తేరులోనూ బహిరంగ నాటకశాలలు స్థాపించబడ్డాయి.

గుంటూరులో వున్నప్పుడు కన్యాశుల్కం, అశ్వత్థామ, అనార్కలీ, ఎప్పుడూ ఇంతే, ప్రతిమాసుందరి, ఖూనీ మొదలైన నాటకాలు విజయవంతంగా క్రమశిక్షణతో ప్రదర్శించబడ్డాయి.

విశాలరంగస్థలానికి
వేణుగోపాలస్వామిగారు వెన్నెముక:

1943 నుండి వాల్తేరులో నాటకోత్సవాలు జరుగుతూ వున్నాయి. ఈ వుత్సవాల్లో ఇతరు లెవరైనా పాల్గొనడానికి అవకాశం కల్పించారు. విశ్వవిద్యాలయంలో జరిగే ప్రతి వైజ్ఞానిక విశేషానికి వేణుగోపాలస్వామివారే కారకులు. ఆయన నాటక కళాభిమాని. కళాకారులకు అత్యంత ఆప్తుడు. నాటక విజ్ఞానాన్ని కూలంకషంగా ఆకళింపు చేసుకున్న పిజ్ఞులు. ఆంధ్రదేశంలో ఏమూల పరిషత్తు జరుగుతున్నా ఆయన హృదయం అక్కడ వుంటుంది. ఆయన విశ్వవిద్యాలయ రిజిస్ట్రారుగా వున్నకాలంలో - 17 సంవత్సరాల్లో దాదాపు నూరు నాటకాలకు పైగా నూతన ప్రయోగాలతో ప్రదర్శించి ఆంధ్రనాటక రంగానికే ఆదర్శప్రాయులైనారు. ఈనాడు యూనివర్శిటీ నాటక ప్రయోగంలో వినియోగపడే సాంకేతిక పరికరాలు రెండు మూడు లక్షల రూపాయల విలువైనవి వున్నాయి ఈనాడు ఆంధ్రదేశంలోవున్న అనేక అనుబంధ కళాశాలల్లో ఒక్కొక్క ఓపెన్ ఎయిర్ థియేటర్ స్థాపించ బడింది. ఈ మహత్కార్యానికి ఆద్యులు గోపాలస్వామిగారే. పై సమాజాలే కాక 1910లో లిల్లైట్ క్లబ్, విశాఖపట్టణం నాటక కళామండలి.1948 లో విశాఖపట్టణం పోర్టు అమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్, 1950 లో రత్నం మెమోరియల్ అమెచ్యూర్స్, 1958 లో కల్చరల్ అసోసియేషన్, విశ్వనాధ కళాసమితి ఆంధ్ర యూనివర్శిటి థియేటర్, లోకో బాల భరత సంఘం, అంకితం నాట్యకళాసమితి,

మెడికల్ కాలేజి డ్రమెటిక్ అసోసియేషన్, యన్. జి. వోస్ డ్రమెటిక్ అసోసియేషన్, యూత్ రిక్రియేషన్‌క్లబ్, ఆంధ్రకేసరి లలితకళా పరిషత్తు మొదలైన నాటక సమాజాలు పనిచేశాయి.

## విజయనగరం

1900 సంవత్సరం నాటికి తెలుగు నాటకరచన, తెలుగునాటకరంగం సంపూర్ణ వికాసం పొందుతూ వున్నాయి. నాటకాలన్నీ గ్రాంధిక భాషలో వుండేవి. ఈ స్థితిలో వ్యవహారిక భాషలో కూడ నాటకాన్ని వుత్తమంగా వ్రాయవచ్చని శ్రీ గురజాడ అప్పారావుగారు కన్యాశుల్కాన్ని రచించి ఆంధ్రనాటక రంగంలో ఒక నూతనోత్తేజాన్ని కలిగించారు. ఆనాటికి పది సంవత్సరాల ముందునుంచే నగరంలో నాటకాలు ప్రదర్శింపబడుతూ వుండేవి.

### ఆంధ్ర భోజుడు ఆనంద గజపతి:

1890 సంవత్సరంలో సకల కళా పోషకులైన శ్రీ ఆనంద గజపతిగారి నాయకత్వాన సంస్కృత భాషా, సంస్కృత నాటకాలూ, వాటి ప్రయోగాలూ, పున రుద్ధరణ చేయాలనే సంకల్పంతో ఒక నాటకసంస్థ ఏర్పడింది. రాజాగారే స్వయంగా ఆ సమాజాన్ని నిర్వహించేవారు. చతుర్విధ అభినయాలనూ వారే నేర్పేవారు. నాటకానికి కావలసిన ఆయా పాత్రధారులందరినీ ఆయనే ఎన్నిక చేసేవారు. నాటక ఇతివృత్తాన్ననుసరించి తెరలు వ్రాయించి వారి కోటలో ప్రదర్శింప చేసేవారు.

### విజయనగరపు విఖ్యాత నటవర్గం:

విజయనగరం నాటకరంగంలో రాజాగారి అధ్వర్యంలో ఆనాడు ఎందరో ప్రసిద్ధనటులు వుద్ధరించారు. అటువంటి వారిలో కట్టా వేరయ్యశాస్త్రిగా రొకరు. వీరు దుష్యంతుడు, పురూరవుడు మొదలైన నాయకపాత్రలను ధరించేవారు. చొప్పల్లి నరసింహంగారు శకుంతల పాత్రధారణలో అందెవేసినచెయ్యి. పప్పు వెంకన్నగారు అద్భుతంగా పాడేవారు. కట్టా వేరయ్యశాస్త్రిలు సంస్కృత నాటకాల్లో విదూషకుని పాత్రనూ, శాకుంతలంలో కణ్వునిపాత్రనూ సమర్థనీయంగా

అభినయించేవారు: సంస్కృత నాటకాల్లో సూత్రధారులుగావుండి సమా బాధ్యతల నన్నిటినీ వహిస్తూ వుండేవారు.

విజయరామ డ్రమెటిక్ అకాడమి:

రాజాగారి మరణంతో ఆ సమాజం అంతరించిపోగా విజయరామ డ్రమెటిక్ అకాడమీ స్థాపించబడింది. దీని నిర్వాహకులు తాతా వుమామహేశంగారు, రామాయణం సర్వేశ్వరశాస్త్రిగార్లు. దీని తరువాత వాణీవిలాస సభను అనాదసపు గోపాలరావు-ఒట్టి సత్యనారాయణ.నంద గిరి శ్రీనివాసరావుగారూ కలసి అచ్చు తంగా విజయనగర కళాకేంద్రాన్ని ఆభివృద్ధిలోకి తెచ్చారు.



1949 వ సంవత్సరంలో, వేమల జగన్నాధరావు—పీసపాటి నరసింహ మూర్తిగార్ల ఆధ్వర్యంలో బళ్లారి రాఘవ స్మారక నాటక సేవాసమితి స్థాపించబడి, పరుసగా ఏడి సంవత్సరాలు నాటక నాటకాల మోటీ వుత్సవాలను నిర్వహించింది.

1953 లో రాఘవ కళాసమితిని యస్. ఎ. రామారావుగారు స్థాపించి నాటకాలు ప్రదర్శించారు.

1953 లో వరదా బ్రహ్మానందం, కొచ్చెర్లకోట రంగారావుగారు—హిరణ్యాక్షుడు అమ్యుతరావు. అంబిళ్ళ సూర్యారావు మొదలైనవారు అమ్యుదయ నాటకాలను ప్రజా నాట్యమండలి ద్వారా ప్రదర్శించారు.

పైన పేర్కొన్న సంస్థలతో పాటు ఆంధ్రసేవా కళామండలి, యం. ఆర్. కాలేజి సిల్వరు డ్రమెటిక్ అసోసియేషను, యూనైటెడ్ ఫ్రండ్స్ ఆర్టిస్ట్సు, విజయ రాఘవ నాట్యమండలి, గౌరి సోషల్ ఆర్ట్సు అసోసియేషను, కవిరాజు మెమోరియల్ క్లబ్, ఏ. ఎ. పి. అసోసియేషన్, మురళికృష్ణ నాట్యమండలి మొదలైన ఔత్సాహిక సమాజాలు పనిచేశాయి.

విజయనగరం నాటకరంగంలో వర్ధిల్లిన నటీనటులు అనేకమంది వున్నారు.

వారిలో ముఖ్యులు చొప్పల్లి సూర్యనారాయణ, ఇమిటేషన్ ఆచారి, కె. గురుమూర్తి, భోగరాజు కృష్ణమూర్తి, సాలూరు రాజేశ్వరరావు, సరిదె లక్ష్మీనర్సయమ్మ (కళావర్ రింగ్), యం. బుచ్చిరాజు, ఎ. గోపాలరావు, సుభద్రరాజు, దొడ్డమ్మ, పి. హెచ్.బి. వెంకటచలం, మద్దెల రాముడు, వుల్లి వెంకటరావు, ఎ. సూర్యారావు, యన్. కృష్ణారావు, బి. అప్పారావు, యన్. వి. రామారావు, కె. రామారావు, లోకేంద్రరావు, కె. భాస్కరరావు, కె. వి. సుబ్బారావు, కె. సాంబశివరావు, శ్రీమతి సాలూరు సూరమ్మ, ఐ. సత్యరాజు, కుమారి రాధాకుమారి, కుమారి కామేశ్వరి, వేదుల జగన్నాధరావు మొదలైనవారు పనిచేశారు.

## భీమిలి పట్నం

1948 లో సాహితి నాట్యమండలి, దుర్గా కళా నాట్యమండలి, ఏర్పడి పని జేస్తున్నాయి. ఈ సమాజాలలో బి. లక్ష్మీనరసింహం, యం. సీతారామస్వామి, బి. నారాయణమూర్తి, ఎ. నరసింహమూర్తి, ఆర్. కృష్ణమాచారి, హుస్సేన్ షహసుద్దీన్, కె. యల్లయ్య, పి. నాగేశ్వరరావు, పి. నరసింగరావు, అజాద్ యం. నారాయణరావు మొదలైన నటులు పనిచేశారు.

## అనకాపల్లి

1943 లో శ్యామలా కళా సమితి, విజయలక్ష్మి నాట్యమండలి, 1946 లో గౌరి నాట్యమండలి, పాండురంగ నాట్యమండలి, హైస్కూళ్లు, కాలేజి నాటక సమాజాలు పనిచేశాయి.

## చిట్టివలస

జ్యూట్‌మిల్లు ఎంప్లాయీస్ రిక్రియేషన్‌క్లబ్, డ్రమెటిక్ సెక్షన్ 1955 లో ఏర్పడింది. రామాయణం సుందరరావు, యస్. బంగారయ్య, పి. హనుమంతరావు, పేరినాయుడు మొదలైన కళాకారులు పనిచేశారు.

## మాడుగుల

1943 లో సరస్వతి నాట్యమండలి పనిజేస్తూ వుంది. మాడుగులకు రెండు

మైళ్ళదూరంలోవున్న గుట్టాలపేట, హుకుంపేట గ్రామాల్లో అడవిజాతులవారు 'ప్రజ' అనే నృత్యాన్ని చేస్తూవుంటారు.

మాడుగులలోవున్న కళాకారులు జి. వి. యన్. శర్మ, మురారి రామారావు, కట్టా అప్పారావు, అల్లాడ హనుమంతరావు, పత్తి వేణుగోపాలశర్మ, యన్. వి. నరసింహాచారి, యం. సి. కొండలరావు, పుట్ల సింహాచలం, జి. వి. వి. రామయ్య, వి. జగన్నాధాచారి, గరిమెళ్ళ కృష్ణమూర్తి.

## నర్సీపట్నం

1936 లో గంధర్వ నాట్యమండలి, 1955 లో దుర్గా నాట్యమండలి, హైస్కూల్సు విద్యార్థి నాటక సమాజమూ పనిజేస్తున్నాయి. దువ్వూరి సుందరరావు, నిష్ఠల కిన్నబాబు, బొంతా రామమూర్తి, జవ్వాది రామనాధ్, పి. అప్పారావు, జె. అప్పారావు మొదలైన కళాకారులు పనిచేశారు.

## చోడవరం

1896 కు పూర్వమే చోడవరంలో శ్రీనివాస విలాస నాటక సమాజం వుండేది. ఈ సమాజం అనేక చారిత్రక నాటకాలను ప్రదర్శించింది. ఆనాడు ఈ సమాజంవారు కట్టుకున్న భవనమే ఈనాటి ప్రేమసమాజ భవనం. 1943 లో పాండురంగ నాట్యమండలి, 1953 లో త్యాగరాజ నాట్యమండలి, 1949 లో ప్రేమ నాట్యమండలి, 1948 లో విజయగోపాల్ నాట్యమండలి పనిచేస్తున్నాయి. తంగెళ్ళ వెంకటప్పడు చిరుతల భజనకు ఉపాధ్యాయుడుగా వుండి రామాయణగాథను ప్రచారం చేస్తూ, ఆ బృందాన్ని నిర్వహిస్తున్నారు. మంగిపూడి కామేశ్వరరావు, జె. చిన సత్యనారాయణ, భమిడిపాటి రామసోమయాజులు, బి. కె. శాస్త్రి మొదలైన కళాకారులు పనిచేశారు.

## యలమంచిలి

1890 లో కళావివర్ధనీ నాట్యమండలి, 1948 లో విజయ ఆర్ట్‌థియేటరు, రామకృష్ణ నాట్యమండలి, హైస్కూల్సు డ్రమెటిక్ అసోసియేషన్ మొదలైనవి పని చేశాయి.

---



# శ్రీకాకుళంజిల్లా నాటకరంగం



శ్రీకాకుళం: రసజ్ఞుల రమా
విలాసినీసమాజం- బొబ్బిలి:
లలితకళాసమితి-సాలూరు:
శారదా నాట్య మండలి-
పార్వతీపురం:విజయనాట్య
మండలి - బరంపురం: జగ
న్నాధ విలాసినీ సమాజం-
ఛత్రపురం: హిందూ థియే
ట్రికల్ క్లబ్

# శ్రీకాకుళం

రసజ్ఞుల రమావిలాసినీ సమాజం:

1906-1907 సంవత్సర ప్రాంతాల్లో రమావిలాసినీ సమాజం స్థాపించబడి కొంతకాలం నడిచి, తిరిగి 1921 వ సంవత్సర ప్రాంతంలో రమావిలాస అమెచ్యూర్స్ పేర పునరుద్ధరించబడింది. ఇందుకు కారకులు చట్టి చినపూర్ణయ్య పంతులుగారు. పూర్ణయ్యపంతులుగారు చదువుకునే రోజుల్లో ఇంగ్లీషు నాటకాల్లో పాల్గొన్నారు. ఆ అనుభవంతో పై సంస్థను స్థాపించి, సమాజ సభ్యులకు తరిఫీదు నిచ్చారు. పంతులుగారు బహుముఖ పాత్రలను ధరించారు. వీరి అభిమానపాత్ర శివాజీ. ఆంధ్రనాటక కళాపరిషత్తు స్థాపకుల్లో ముఖ్యులు. పరిషత్తు రెండవనాటి సభకు అధ్యక్షులు. అనేక సంవత్సరాలు శ్రీకాకుళం పుర పాలక సంఘానికి అధ్యక్షులు. 1928 లో ఒక ప్రెంచి విశ్వవిద్యాలయం వీరిని ఆనరరి ప్రొఫెసర్ ఆఫ్ ఇండియన్ డ్రామటర్జిగా ఎన్నుకున్నారు.



ఇంకా శ్రీకాకుళంలో 1955 నటరాజ కళాసమితి, 1954 లో లలితకళా సమితి, 1955 లో గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజి డ్రమెటిక్ అసోసియేషన్, మునిసిపల్ డ్రమెటిక్ అసోసియేషన్ మొదలైన నాటక సమాజాలు ఏర్పడి పనిచేశాయి.

చట్టి పూర్ణయ్యపంతులు, రాజకొండలరావు, జె. వి. రమణమూర్తి, జె. వి. సోమయాజులు, యల్. నరసింహమూర్తి, టి. హరిరావు, వి. శివరావు, యన్. ప్రభాకరరావు, యం. జోగారావు, జగన్నాధరావు, కె. లక్ష్మణరావు, బి. రామదాస్, వి. సుబ్బారావు, డి. హనుమంతరావు, జె. వి. శ్రీరామమూర్తి మొదలైన నటులు పనిచేశారు.

# బొబ్బిలి

1958 లో లలిత కళాసమితి, 1951 లో నూతన ఆంధ్ర నాట్యమండలి,

1955 లో టాగూరు నాటకళా సమితి, 1955 లో పొట్టిశ్రీరాములు నాట్యమండలి, పనిచేస్తున్నాయి.



చట్టిపూర్ణయ్యపంతులుగారు-శివాజి

ఈ సమాజాల్లో పీసపాటినరసింహమూర్తి, అయ్యగారి నారాయణమూర్తి, కామేశ్వరరావు, వి. సత్యనారాయణరెడ్డి మొదలైనవారు నటులుగా వెలుగొందుతున్నారు.

## సాలూరు

1935 లో శ్రీ శారదా నాట్యమండలి, మరికొన్ని నాటక సమాజాలు పనిచేశాయి. ఈ సమాజాలలో హుస్సేన్, యం. సత్యనారాయణ, భవానీ రామారావు, చెరుకూరి వెంకటరెడ్డి, కె. వి. నాయుడు, డి. నరసింహారెడ్డి, వై. సూర్యనారాయణ, డి. ఎ. రెడ్డి, యస్. ఇస్మాయిల్, యన్, సోమేశ్వరశర్మ, యన్. కబీర్‌షా, సి, హెచ్. రాజు, డి. సూర్యనారాయణ, సత్యరాజు సంజీవరావు, యస్. రాఘవ కుమారి, కుమారి సరోజని మొదలైనవారు పనిచేశారు.

## చీపురుపల్లి

1950 లో హైస్కూలు డ్రమెటిక్ అసోసియేషన్, 1954 లో నవీన యువజన నాటక సమాజం, 1958 లో వాణీ నాట్యనిలయం మొదలైన సమాజాలు ఏర్పడి నడుస్తున్నాయి.

ఈ సమాజాలలో డి. నరసరాజు, ముళ్ళపూడి నరసింహరాజు, ఆర్. వేణుగోపాలరావు మొదలైన కళాకారులు పనిచేశారు.

## నరసన్నపేట

1954 లో హైస్కూలు డ్రమెటిక్ కంపెనీ, 1955 లో శ్రీకాకుళం

అభ్యుదయ నాట్యమండలి, 1957 లో నరసన్నపేట నాటక కళాసమితి మొదలైన సమాజాలు పనిచేస్తున్నారు.

ఈ సమాజాలలో టి. వి. కుమార్ గుప్త, పెండ్యాల నుబ్రహ్మణ్యకవి, బి. రాజారావునాయుడు, కె. బాలకృష్ణారెడ్డి, బి. వి. కృష్ణారావు, వి. నరసింగరావు, యన్. వి. రమణ మొదలైన నటులు పనిచేశారు.

## పార్వతీపురం

1942 లో విజయ నాట్యమండలి, 1951 లో హైస్కూల్ డ్రమెటిక్ అసోసియేషను, 1955 లో సీతారామ డ్రమెటిక్ సొసైటీ మొదలైన సమాజాలు పనిజేస్తున్నాయి.

ఈ సమాజాలలో అయ్యసోమయాజుల ఉమామహేశ్వరరావు, గౌరి చంద్ర, యం. యస్. యన్. రాజు, సింగమహంతి రామారావు మొదలైన కళాకారులు పనిచేశారు.

## పొందూరు

1946 లో రామానాట్యమండలి, 1954 లో ఆంధ్రనాటక కళాసమితి మొదలైన సమాజాలు నడుస్తున్నాయి.

పై సమాజాలలో బి. సన్యాసినాయుడు, ఏ. చిదానందరావు, కె. మల్లికార్జునరావు, టి. బైరాగిరాజు, యల్. వీరాచారి, సి. హెచ్. వాసుదేవరావు, అల్లంసెట్టి సీతారామస్వామి, విశ్వప్రగడ కామేశ్వరరావు, టి. కృష్ణమూర్తి మొదలైన నటులు పనిచేశారు.

## బారువ

1956 లో నయనేంద్ర నాటక కళా సమితిని శ్రీ కె. జగన్నాధరావుగారు స్థాపించారు.

## ఇచ్ఛాపురం

1953 లో ఆంధ్ర ఆర్టు ఆసోసియేషన్‌ను పుల్లెల ధర్మారావుగారు స్థాపిం

చారు. ఈ సమాజంలో కె. బలరామస్వామి, పి. ధర్మారావు, యస్. శ్రీనివాసాచారి, వి. వి. నరసింహం, వి. భాస్కరరావు, యన్. నరసింహాచార్య, కృష్ణ పట్నాయక్, ఆర్. విఠల్‌రావు, వి. యోగేశ్వరరావు, డి. వి. సుబ్బారావు మొదలైన నటులు నటించారు.

## కాశీబుగ

1955 లో అభ్యుదయ కళాసమితి, 1957 లో లలిత కళాసమితి ఏర్పడి పని చేస్తున్నాయి. వీటిలో కుమారి శ్యామల, వి. మాణిక్యం, వి. శ్రీధరరావు, కె. గురుమూర్తి, త్రిపాఠి, జి. భీమారావు, టి. యన్. స్వామి, మకబుల్ ఖాన్, నరసింగరావు, దామోదరరావు, ప్రకాశరావు, లింగమూర్తి మొదలైన నటీనటులు నటించారు.

## పెదతామరపల్లి

1948 లో శ్రీ వెంకటేశ్వర నాట్యమండలి, స్వతంత్ర నాట్యమండలి పని చేస్తున్నాయి. తామరపల్లి చుట్టుప్రక్కల గ్రామాలైన దేవల్, భద్రా, నంది గామ, హరిదాసపురం, పట్ట, పెక్కరి, వజ్రపుకొత్తూరు మొదలైన చోట్లకూడ నాటక సమాజాలు నడుస్తున్నాయి.

ఈ సమాజాల్లో టి. కృష్ణారావునాయుడు, వై. నరసింహమూర్తి, డి. అప్పారావు, బక్కాపీరేజు, వి. వీరయ్య, బత్తుల లింగరాజు, చిన్నబాబు మొదలైన నటులు పనిచేశారు.

## ఆముదాలవలస

1932 లో సీతారం నాట్యమండలి, 1944 లో నేతాజి నాట్యమండలి, 1953 లో సీతారామ నాట్యమండలి, 1954 లో సూర్యసమాఖ్య మొదలైనవి నడుస్తున్నాయి. వీటలో బి. కృష్ణారావు, వై. రామారావు, రాములు, విశ్వనాధం, రాంబాబు పనిచేశారు.

పలాసా—నౌపడా—అర్సవిల్లి మొదలైనచోట్ల సంగీత సమాజాలు పని చేశాయి.

# అంపోలు, అడ్డవరం

ఈ రెండు గ్రామాలు శ్రీకాకుళానికి 4 మైళ్ళ దూరంలో వున్నాయి. ఇక్కడ రంజకవరు ఆనే రుంజ వాయిద్యబృందం వుంది. ఈ వాయిద్యాన్ని శివ పార్వతుల కళ్యాణ సమయంలో ఉపయోగిస్తారు. వీటి ధ్వని బ్రహ్మాండమైనది. దీనిని ముఖ్యంగా విశ్వ బ్రాహ్మణజాతికి జెందినవారు వాయించుతూ వుంటారు. వీరు పుష్యమాసంలో ఆయా గ్రామాలు వెళ్ళి వాయిస్తూవుంటారు.

రుంజ వాయిద్యకారులు వి. ఆంజనేయులు. జంగం సత్యనారాయణ. మిరియాల కోటిలింగం, యస్. యన్. అప్పయ్య మొదలైనవారు.

1913 లో అగస్తేశ్వరస్వామి నాటక సమాజం ఏర్పడింది. ముద్దా నీలం అప్పయ్య. కె. ఎట్టయ్య. వడపల్లి సుబ్బారావు మొదలైనవారు పనిచేశారు.

# పర్లాకిమిడి

పార్శీ నాటకాలతో ఆంధ్ర నాటకరంగంలో వచ్చిన సంచలనంతో పర్లాకిమిడిలో విద్యార్థుల ఆధ్వర్యాన 1897 లో అమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్ స్థాపించబడి దాదాపు 1929 వరకూ నడిచింది. పర్లాకిమిడి నాటకరంగానికి గిడుగు సీతాపతిగారు పట్టుగొమ్మ. ఈ సమాజంలో ఇతర ప్రముఖులు పంతుల రామమూర్తి, చిలుకూరి బుచ్చన్నపంతులు మొదలైనవారు. 1901 లో పర్లాకిమిడి రాజాగారు నాటక ప్రదర్శనాలకొరకు పద్మనాభ థియేటరును కట్టించారు. ఒరియా నాటక సమాజంతోపాటు, తెలుగు నాటక సమాజాన్నికూడ రాజాగారు పోషించారు. 1927 లో ఈ సమాజంవారు మద్రాసు గవర్నర్ సమక్షంలో నాటకాలను ప్రదర్శించి, గవర్నర్ ప్రశంస లందుకున్నారు. 1929 లో మద్రాసు వచ్చిన సీతాపతిగారు వారి సాహిత్య సేవతోపాటు నాటక కళాసేవకూడా చేశారు. చలనచిత్ర పరిశ్రమలో ప్రవేశించి, పాత్రలనుకూడా ధరించారు.

# బరంపురం

పూర్వం ఆంధ్రదేశంలోనూ ప్రస్తుతం ఒరిస్సా రాష్ట్రంలోనూ వున్న బరం

పురంలో జగన్నాధ విలాసినీ నాటకసమాజాన్ని బూర్ల సోదరులు స్థాపించారు. ఈ సమాజంలో నాయిక పాత్రధారణలో మద్దూరి అప్పారావు పంతులుగారు ప్రముఖులు. ఈ సమాజం ఎక్కువగా పానుగంటివారి నాటకాలనే ప్రదర్శించేది.

1920 సంగర ప్రాంతంలో మిత్రమండలి అనే నాటక సమాజాన్ని న్యాపతి నారాయణమూర్తిగారు స్థాపించారు. ఈ సమాజంలో వెలివెల వీరరాఘవస్వామి మొదలైనవారు ప్రసిద్ధ నటులుగా వెలుగొందారు.

## టెక్కలి

ఇక్కడ ఆంధ్ర ప్రచారక సంఘం స్థాపించబడి పనిచేసింది. ఈ సమాజంలో జయంతి వేంకట జగన్నాధరావుగారు నాయక పాత్రల్ని, వినుకొండ జోగారావుగారు నాయిక పాత్రల్ని ధరించేవారు.

ఇక్కడ కళింగ వైశ్య కుటుంబానికి చెందిన టంకాల సాంబయ్యగారు స్త్రీ పురుష పాత్రలు ధరించేవారు. వీరి సోదరుడు హార్మోనీ వాయించేవారు. సాంబయ్యగారి కుమారులిద్దరూ బాల పాత్రల నభినయించేవారు. వీరి స్వచ్ఛమైన ఉచ్చారణ, సంగీత సామర్థ్యం, ప్రేక్షకుల్ని ముగ్ధుల్నిచేసేవి. సాంబయ్యగారి పెద్దకుమారుడు శశిభూషణరావు అపూర్వ నటనా చాతుర్యాన్ని కనపర్చేవాడని, నాట్యాలోకం 238 వ పుటలో సూరిశాస్త్రిగారు వివరించారు.

## ఛత్రపురం

దాదాపు 1885 ప్రాంతంలోనే హిందూ థియేట్రికల్ క్లబ్ పనిచేసింది. మేధావులు, ఉన్నతోద్యోగులు మొదలైన ప్రముఖులు ఈ సమాజాన్ని కట్టుదిట్టంగా నిర్వహించారు. 1936 లో ఒరిస్సారాష్ట్రం ఏర్పడేవరకు ఈ సమాజం జయప్రదంగా నడిచింది. ఈ సమాజంలో గోవిందు సూర్యనారాయణగారు నాయికా పాత్రల్ని ధరించారు. ప్రసిద్ధ నాటక కర్తలైన గుండిమెడ వేంకట సుబ్బారావుగారు ఈ సమాజ కార్యదర్శియై, దర్శకులై అఖండమైన ప్రఖ్యాతిని చేకూర్చారు. గుండిమెడవారి చారిత్రక నాటకమైన ఖిల్జీ రాజ్యపతనం ఆంధ్రదేశంలో అనేక ప్రముఖ సమాజాలు ప్రదర్శించాయి. ఆయన స్ఫురద్రూపి, కవి, దర్శకుడు, నటుడు, చిత్రకారుడు.

# రాయలసీమ నాటకరంగం



పాతకమూరి భాగవతులు - ఆటలు, బయలాటలు_బళ్ళారి రాఘవ ప్రతిభ-అన్నంకోనం ఆటపాటలు : సురభి నాటకరంగం-బళ్ళారి-కర్నూలు-కడప -చిత్తూరు-అనంతపురంజిల్లాల నాటక రంగాలు

# రాయలసీమ నాటకరంగం

ఆంధ్రదేశ మంతటా పూర్వ రంగస్థలంలో ఏ జానపద కళారూపాలు ప్రదర్శించబడ్డాయో అలాగే రాయలసీమలో కూడా ప్రాచీన కళారూపాలైన కుర వంజి యక్షగాన ప్రదర్శనాలే ప్రదర్శింపబడినట్లు చరిత్రాధారాలున్నాయి.

తాయికొండ నాటకసమాజం :

రాయలవారి కుమార్తె "మరీచీ పరిణయం" అనే యక్షగానాన్ని రచించినట్లూ,

రాయల నాట్యశాలలో తాయికొండ నాటకసమాజంవారు నాటకాలను ప్రదర్శించినట్లూ శాసనాధారాలు వున్నాయి. 1506-1509 ప్రాంతంలో పరిపాలించిన వీర నరసింహరాయలవారి సమక్షంలో కూచిపూడి భాగవతులు వీధినాటకాలను ప్రదర్శించినట్లు చరిత్రాధారాలు వున్నాయి.

పొతకమూరి భాగవతులు :

భాగవత నాట్య సాంప్రదాయ ప్రవర్తకుల్లో కూచిపూడి భాగవతులకంటే ముందు వారు పొతకమూరి భాగవతులు. వీరు అహోబిల నరసింహస్వామి సన్నిధిలో నాట్యాచార్యులై - ప్రతినిత్యమూ నాట్యసేవ చేసేవారట. "శ్రీ వెలయ పాలవారధి పవ్వళించి జో-జో" అనే జోలపాట పొతకమూరు భాగవతులు రచించిందేనని, వీరు క్రీ॥శ॥ 1280 ప్రాంతంవారని తాళ్ళపాక అన్నమాచార్యులు పేర్కొన్నారు.

ఆటలు - బయలాటలు :

రాయలసీమలో యక్షగానాల తరువాత వీధినాటకాలు, బుర్రకథలు, విచిత్రవేషాలు, తోలుబొమ్మలాటలు, హరికథలు విరివిగా ప్రదర్శిస్తూవుండేవారు. వీటినే బయలు నాటకాలనీ, బయలాటలనీ పిలవడం వాడుక. ఈ నాటకాలను ఎక్కువగా మాల పల్లెలలో వుండే దాసరులు ప్రదర్శిస్తూ వుండేవారు. వీరే దాసుళ్ళనీ, దాసరులనీ, కొమ్మాయి దాసుళ్ళని, మాలదాసరులని పిలవబడుతూ వుండేవారు. హరిజనుల్లో ఒక తెగగాను, వారిలో అతీతులుగాను వుండేవారు. శూద్రజాతులు బ్రాహ్మణులను ఎలా గౌరవిస్తారో అలాగే యీ దాసరులను కూడా గూడెపు ప్రజలు గౌరవిస్తారు.

ఒకనాడు ఈ ప్రదర్శనాలన్నిటినీ దాసరులే ప్రదర్శించినా. ఈనాడు అనేకమంది వాటిని ప్రదర్శిస్తున్నారు.

కంఠస్థంగావున్న కళారూపాలు :

వీరు ప్రదర్శించే నాటకాలు అన్నీ వ్రాతప్రతులుగానో. లేక తాటియాకుల గ్రంథాల్లోనో. లేక ప్రత్యేకవ్యక్తుల కంఠస్థంగానో నిలిచివున్నాయి. ఒక్కొక్క దేశంలో వున్న ముఖ్యనాయకునికి అనేక నాటకాలు కంఠస్థం అయివుంటాయి. అతను మరణిస్తే, అతనితోపాటే ఆ నాటకాలు కూడ అంతరిస్తాయి. ఈ విధంగా మన ప్రాచీన యక్షగాన సాహిత్యం, బయలు నాటకాల సాహిత్యం అంతా శిధిలమైంది. అయినా, ఇప్పటికీ రాయలసీమ పల్లెప్రాంతాల్లో అనేక బయలు నాటకాలు ప్రచారంలో వున్నాయి. ఆవికూడ అచ్చులో కొన్ని లేవనే చెప్పవచ్చు. వాటిలో కొన్ని మచ్చుకు ఈ క్రింద వుదహరిస్తాను.

నాటిమేటి

నాటక రచయితలు :

దొడ్డకవి వ్రాసిన సుగ్రీవవిజయం. సుమ్మర బొలయ్య వ్రాసిన "సారంగధర" నాటకం, రుద్రకవి వ్రాసిన "శశిరేఖా పరిణయం", బెడుదూరు రంగాచార్యులు, రామాచార్యులు వ్రాసిన హరిశ్చంద్ర, వేములపల్లి కృష్ణమాచార్యుల విరాటపర్వం, నరసింహారెడ్డి వ్రాసిన "చుక్కలూరు రామనాటకం", యాదవదాసు రచించిన "గరుడాచల యక్షగానం" మొదలైన పైన వివరించిన నాటకాలన్నీ నేటి రాయలసీమలో ప్రచారంలో వున్నాయి. ఇవి అన్నీ కూడ పురాణ కథావస్తువులతో కూడినవే. అయినా పల్లెప్రజలకు అర్థమయ్యే శైలిలో వ్రాయబడ్డాయి. ఆంతేగాక ప్రదర్శనాక్రమంలో ప్రతిమాటా అర్థమయ్యేటట్లు విడమర్చి చెప్పేవారు. అందువల్ల చదువురాని ప్రేక్షకునికి కూడ అర్థమయ్యేది. ఇందుకు వుదాహరణ-యాదవదాసు రచించిన గరుడాచల యక్షగానంలో—

బాణమెయ్యగలవా మృగముల
బట్టి త్రుంచగలవా
వాడెముతోడుత జారుడు బండల
మీది కెక్కగలవా

మృగముల బట్టెదవే నేని
నగముల తిరిగెదవే....

నలుగురూకూడే
నడిబజారులో నాటకప్రదర్శనం :

ఈ విధంగా సంవాదం జరుగుతుంది. ప్రదర్శనాల పద్ధతి.ఊరుమధ్య పెద్ద బజారులో నలుగురూ సమకూడే ప్రదేశంలో పెద్ద గడలతో పందిరివేసి చుట్టూ మామిడి తోరణాలు గట్టి, పందిరిలో ఎత్తుగా దిబ్బపోసి ప్రదర్శానికి ముందు మద్దెల తాళాలతో కొంచెం సందడి చేసేనాళ్ళు. అంతకుముందు ప్రదర్శనకారులు ఇంటింటికీ వెళ్ళి రాత్రి ప్రదర్శనానికి రమ్మనమని ఆహ్వానించేవారు. ప్రదర్శనానికి లైట్లు వుండేవికావు. తెరలు వుండేవికావు. తెరలకు బదులు దుప్పట్లు ఉపయోగించేవారు. లైట్లకుబదులు దివిటీలు వెలిగించేవారు. కొన్నాళ్ళు కీరసనాయిలు ఇలాటి కట్టలు వెలిగించారు. గ్యాసులైట్లు వచ్చిన తరువాత పై విధానాలు పోయాయి.

హంగామాతో
రంగస్థల హంగులు :

ఈ యక్షగానాల్లో స్త్రీ పాత్రలు పురుషులే ధరించేవారు. భుజకీర్తులు ధరించేవారు. కిరీటాలు పక్షులరెక్కలతో సొంపుగా తయారు చేసేవారు. వేష ధారణలో అయా రసాలకు తగిన ఎరుపు, పసుపు, పచ్చ రంగులను ఉపయోగించేవారు. ప్రతిపాత్ర ప్రవేశానికి ఒక హంగామా చేసేవారు. ఈ విధంగా ప్రేక్షకుల్లో కొత్త వుత్సాహాన్ని రేకెత్తించేవారు. ముఖ్యంగా ప్రధాన పాత్రలు యముడు, కంసుడు, రావణుడు మొదలైన పాత్రప్రవేశాల్లో నిప్పులు గ్రక్కుతూ పాత్రలు వచ్చేవి. రంగస్థలంపైకి పాత్ర రాగానే తెరపట్టి, తెరవెనుక పాత్రధారుల నుంచి, తెరముందు విదూషకుడు ఆ వచ్చిన పాత్రధారిని ప్రేక్షకులకు ఎరుక పర్చడానికి "అహా! ఈ సభారంగమునకు విచ్చేసిన ఆమాత్యవర్య లెవరండీ?" అని ప్రశ్నిస్తే, వెంటనే లోపలవున్న పాత్రధారి ఏ వుద్దేశ్యంతో ప్రవేశించనున్నాడో అంతా పూసగ్రుచ్చినట్లుగా పాత్ర పరిచయం చేసేవారు. ఆ తరువాత నాటక ప్రారంభం. నటుడు వల్లించిన ప్రతిపాటకూ హంగుదార్లు వంత పాడుతూ నానా హంగామా చేస్తారు. ఈ విధంగా నాటకాన్ని రక్తికి తీసుకువస్తారు. ఈ విధమైన బయలు నాటకాలు రాయలసీమలో అన్ని పల్లెప్రాంతాల్లోనూ ప్రదర్శింపబడుతూ వుండేవి.

వెదురు చాపల
వీధినాటక రంగస్థలం :

ఆనాడు రాయలసీమలో నాటకాలు ప్రదర్శించడానికి తగిన ప్రదర్శనశాలలు లేవు. వెదురుచాపలూ, తడికెలూ, గోనెసంచుల కప్పులతో నాటకశాలలు నిర్మించే వారు. ప్రతి నాటక సమాజమూ మంచి క్రమ శిక్షణతో రంగస్థలాన్ని పవిత్రంగా ఎంచేవారు. నాటకాలలో వాద్యంగా హార్మోనియం, తబలా, మృదంగం, ఫిడేలు ఉపయోగించేవారు. వేషధారణలో సఫేదు, ఆర్డళం ఉపయోగించేవారు. ఉత్తమ పాత్ర లన్నిటికీ విలువైన చెమ్కీ కోటులను, మంచి తలపాగాలను, తురాయిలనూ వుపయోగించేవారు. విగ్గులకు బదులుగా వారివారి శిరోజాలనే విగ్గు లుగా పెంచుకునేవారు.

## బళ్ళారి

బళ్ళారికి పేరుతెచ్చిన
బయలాటలు :

పూర్వం నుంచీ బళ్ళారి ప్రాంతంలో బయలాట ఆనే జానపద కళారూపం బహుళ ప్రచారంలో వుండేది. ఆంధ్రదేశపు వీధి నాటక ప్రదర్శనానికి ఈ బయలాట ప్రదర్శనానికి ఎంతో సన్నిహిత సంబంధముంది. ఈనాటికీ ఈ కళారూపం బళ్ళారి చుట్టుప్రక్కల గ్రామాల్లో ప్రదర్శింప బడుతూ వుంది.



శ్రీ తాడిపత్రి రాఘవాచార్యులుగారు
హిరణ్యకశిపుడు
శ్రీ బెంగుళూరు వాసుదేవరావుగారు
లీలావతి

ఒకప్పుడు బళ్ళారిలో "జనల్ ఘాట్", "మేఘాట్" అనే రెండు పెద్ద బయలాట కంపెనీలను గరుడ చేడు హనువంతప్ప - రామసాగరం వెంకణ్ణ - కురుగోడు దొడ్డకవి మొద లైనవారు నడుపుతూ వుండేవారు. వీరు కన్నడిగులు.

### నాటకధర్మాలను నిర్వచించిన ధర్మవరంవారు :

బయలాటల తరువాత బళ్ళారిలో కన్నడంలో నాటకరచన బయలు దేరింది. ఈ కన్నడనాటకాలను చూచిన ధర్మవరం కృష్ణమాచార్యులుగారు కన్నడంలో "బాణాసుర, వామనచరిత్ర, ఉషాపరిణయం" నాటకాలను రచించి, ఆ నాటకాలకు దర్శకత్వం వహించారు. 1879 లో ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారు ఇంగ్లీషు నాటకాలాడారు. కన్నడ నాటకరచనతో వుత్తేజితులైన ఆచార్యులుగారు 20 సంవత్సరాల వయస్సులో స్వతంత్రంగా తెలుగులో తొలిసారిగా 1886 లో చిత్రనళీయం నాటకాన్ని రచియించి, ఆయన స్థాపించిన సరసవినోదినీ నాటక సమాజంద్వారా ప్రదర్శింపజేశారు. ఆయన చిత్రనళీయం, పాదుకాపట్టాభిషేకం, ప్రహ్లాద, విషాద సారంగధర, మోహినీ రుక్మాంగద, బృహన్నల, ముక్తావళి మొదలైన 28 నాటకాలను రచించారు. ఆయన రచించిన నాటకాలన్నిటినీ బళ్ళారిలోనూ, మద్రాసు సుగుణవిలాస సభలోనూ ప్రదర్శించారు. దశరథుడు, బాహుకుడు, రాజరాజనరేంద్రుడు మొదలైన పాత్రలు ధరించి నటుడుగా కూడా రాణించారు.

కొంతకాలం నాటకరంగ సామ్రాజ్యాన్ని అమోఘంగా పరిపాలించాయి ఆచార్యులుగారి నాటకాలు. పద్యాలూ, గేయాలూ, అంకాలూ, రంగాలూ మొదలైనవన్నీ వీరి కావ్యాల్లో అమితంగా కనిసిస్తాయి.

1910 వ సంవత్సరంలో కృష్ణమాచార్యులుగారికి గద్వాల మహారాజుగారు ఆంధ్రనాటక పితామహ అని బిరుదు నిచ్చారు. ఆనాటి గద్వాల పౌరులు రత్నఖచితనిర్మాణంతో కూడిన ఒక కిరీటాన్ని బహూకరించారు.

### ధర్మవరం గోపాలాచార్యులు :

కృష్ణమాచార్యులుగారి జీవితం వ్రాసేటప్పుడు, వారి సోదరులైన ధర్మవరం గోపాలాచార్యులుగారి జీవితాన్ని విస్మరించడానికి వీలులేదు. సరసవినోదినీసభ స్థాపకుల్లో ఆచార్యులుగారు కూడా ఒకరు. వీరు కొన్ని పాత్రలను కూడా నటించారు. వీరి పాత్రల్లో అగ్రస్థానం వహించింది భక్తరామదాసు పాత్ర. వీరు కొంతకాలం హైదరాబాదులోనూ, కొంతకాలం న్యాయవాదవృత్తిలోనూ పనిచేశారు. వీరి నాటకాలు రామకవీరు, ప్రేమచంద్రయోగి, అస్పృశ్యవిజయం.

### కోలాచలంవారి గొప్పతనం:

ఆంధ్రనాటక పితామహుడైన ధర్మవరం కృష్ణమాచార్యులుగారి స్వస్థలమైన బళ్ళారిలోనే కోలాచలం శ్రీనివాసరావుగారు సుమనోరమ నాటకసంఘాన్ని స్థాపించారు. వీరు హరిశ్చంద్ర, కీచకవధ, లంకాదహనం, పాదుకాపట్టాభిషేకం, రామరాజుచరిత్ర, మైసూరురాజ్యం, చాంబీబీ, కుశలవ మొదలైన 30 నాటకాలను రచించి వారి సమాజంద్వారా ప్రవర్శించి పండితపామరుల మన్ననలందుకున్నారు. వీరి నాటకాలను ఆనాడు ఆంధ్రదేశంలో విద్యావంతుల నాటకసమాజాలన్నీ ప్రదర్శించాయి. వీరి నాటకాలలో రామరాజుచరిత్ర బహుముఖ కీర్తి గడించుకుంది. ఆ నాటకాల్లో పాత్రలనుకూడా శ్రీనివాసరావుగారు ధరించారు. అంకవిభజనలాంటి కొత్త విధానాలను వీరూ ప్రవేశపెట్టారు.

కోలాచలం వారి సునందనీపరిణయం ఆరోజుల్లో గుంటూరు హిందూ థియేటరువారు, బందరు నేషనల్ థియేటరువారు ప్రదర్శిస్తూ వుండేవారు.

వీరి రామరాజుచరిత్ర కొంతకాలం ప్రదర్శింపబడిన తరువాత ఆనాటి ప్రభుత్వం నిషేధించింది. వీరి నాటకాల్లో పాటలనూ, పద్యాలనూ ఆనాటి విద్యావంతులైన నటకులు తప్ప ఎవరూ ఉచ్చరించడానికి వీలులేనంత కఠినంగా వ్రాయబడ్డాయి. ఏమైనా నాటకరచనకూ, నాటకాల ప్రదర్శనకూ అవి తొలిరోజులు. ఆంధ్రనాటకరంగానికి రచయితగానూ, సమాజస్థాపకుడుగానూ, నటుడుగానూ అపూర్వసేవ చేశారు. అంతేకాక ఇంగ్లీషులో ప్రపంచనాటక చరిత్రను రచియించి ఆదర్శప్రాయులైనారు.

### కె. సుబ్రహ్మణ్యశాస్త్రిగారు:

ధర్మవరం కృష్ణమాచార్యులుగారినీ, కోలాచలం శ్రీనివాసరావుగారినీ గురించి చెప్పినతరువాత మరో బళ్ళారికి చెందిన కళాకారుణ్ణి గురించి కూడ చెప్పుకోవాలి. వారు పండిత కె. సుబ్రహ్మణ్యశాస్త్రిగారు. వీరు ఆంధ్రనాటకరంగానికి శ్రీకృష్ణలీలలు, లవకుశ, భక్తకుచేల, ద్రౌపదీ వస్త్రాపహరణం, లంకాదహనం, రామరావణయుద్ధం, మేవాడ శౌర్యాగ్ని, ప్రౌఢకృష్ణలీల మొదలైన ఎన్నో నాటకాలను రచియించారు. ముఖ్యంగా శ్రీకృష్ణలీలలు, లవకుశ నాటకాలు ఆంధ్రనాటకరంగంలో మణివూసల్లాంటిని. ప్రతి పట్టణంలోనూ ప్రదర్శించిన

నాటకాలు. ఇవి రంగస్థలంమీదేకాక వెండితెరమీద టాకీయుగంలో ఒకసారి చిత్రీకరించారు. అశేషప్రజామన్ననలను పొంది, ఆర్థికంగా విజయవంతమయ్యాయి.

పైన వివరించిన రచయితలే గాక, రావ్‌బహద్దర్ హనుమంతగౌడ, సుబ్బాశాస్త్రి, తోరణగల్లు రాజారావు, పద్మనాభ వెంకోబాచారి మొదలైనవారందరూ బళ్ళారి నాటకరంగంలో నాటక రచయితలుగా వెలుగొందారు.

బళ్ళారి నాటకరంగంలోనూ, ఆంధ్ర నాటకరంగంలోనూ నూతన విప్లవాన్ని తీసుకువచ్చినవారు తాడిపత్రి రాఘవాచార్యులుగారు.

## నాట్యకళాప్రపూర్ణ
## తాడిపత్రి రాఘవాచార్యులు

బళ్ళారి రాఘవ ఆంధ్ర నాటకరంగంలో నూతన విప్లవం తీసుకువచ్చిన ప్రతిభాశాలి. ఆంధ్ర నాటకరంగం మహోజ్వలంగా ప్రకాశించిన రోజులలో ఆయన సర్కారు ప్రాంతాలు పర్యటించి ఎంతోకాలం రంగస్థలిమీద పాతుకుపోయిన పాతపద్ధతులకు స్వస్తిచెప్పి రచయితలకు, నటులకు కొత్తమార్గాలు ప్రసాదించారు. స్త్రీలతో స్త్రీపాత్రలు ధరింపజేయాలని ఎలుగెత్తిచాటిన ప్రముఖనాటకారులలో ఆయన ఒకరు. ఆయన అనేక పాత్రలకు కొత్త మన్నెత్తారు. కొత్త అభినయం ప్రవేశపెట్టారు. ప్రతి పట్టణంలో విశాల నాటక రంగస్థలం నాటక సమాజాలకు లభించేటట్లు ఆయన కృషిజేశారు. ఆయన ప్రోత్సాహం అందుకున్న అమెచ్యూర్ నాటక సమాజాలు ఎన్నో ఉన్నాయి. నాటక ప్రదర్శనం ధనార్జనకు కాకుండా ప్రజల మానసిక విజ్ఞానచైతన్యాలకు తోడ్పడాలని ఆయన ఉద్బోధిస్తూ వచ్చారు.



తాడిపత్రి రాఘవాచార్యులుగారు
(దుర్యోధనుడు)

### అందాల సుందరుడు :

శ్రీ రాఘవాచార్యులు స్వతహాగా అందమైన వ్యక్తి. ఆయన రంగ స్థలంలో అడుగుపెట్టిన క్షణంలో ప్రేక్షకులను ఆకట్టుకునేది ఆయన విగ్రహం. అదే ఆయన నిర్వహించిన పాత్రలకు పేరుప్రతిష్టలు ఆర్జించిందని రూఢిగా చెప్పవచ్చు. ఆయనలో వున్న మరొక ప్రత్యేకత ఆయన వాక్సంపత్తి. ఖంగుమనే గొంతు, లలితస్వభావంగల స్వరం, అన్నివిధాలా కృతిపక్వమైన కంఠం, స్వచ్ఛమైన ఉచ్చారణ ఆయనలోని విశిష్టలక్షణాలు. భావానికి అనుగుణంగా పలుకు, మాటలకు జతగా గంభీరమైన నటన ఆయనకు వెన్నతోపెట్టిన విద్యలు.

### నటనలో తెచ్చిన నవచైతన్యం :

ఆయన నాటకంలో పద్యాలు పాడడంలో ఒక కొత్తపద్ధతి ప్రవేశపెట్టారు. సంగీతానికి ప్రాధాన్యం తగ్గించి, కేవలం భావానికి, భావానికి తగిన అభినయానికి ప్రాముఖ్యం ఇచ్చి, రాగాలరూపం ద్యోతకమయ్యేవిధంగా పద్యాలు చదివేవారు. ఈ పద్ధతి కొంతమంది నటుల్ని, ప్రేక్షకుల్ని సంతృప్తిపరచగలిగేది. నాటక ప్రదర్శనంలో సంగీతంకంటె, ఉచ్చారణకంటె పాత్రోచితమైన భావాలు పోషించ గలిగేవారే నటులని, తక్కినవారంతా వేషధారులుగా దిగజారిపోతుంటారని ఆయన అంటూవుండేవారు.

### భారతదేశ అగ్రనటుడు :

తెలుగు, ఆంగ్లం, కన్నడం, సంస్కృతం, హిందీ, తమిళభాషల పరిచయం ఆయనకుంది. ఈ భాషలలో నాటకాలు పరిశోధించిన విజ్ఞాని ఆయన. ఆ నాటకప్రదర్శనల్లో ఆయన వివిధపాత్రలు ఎంతో సామర్థ్యంతో పోషించి భారత దేశ అగ్రనటుడుగా పేరు సంపాదించారు. బెంగాలీ నాటకరంగపితామహులు శ్రీ శిశిర్‌కుమార్ బాధురీ, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాకూర్, శ్రీ బాలగంధర్వ, గుబ్బి వీరన్న, తమిళనాటక పితామహుడు సంబంధ మొదలియార్ మొదలైన అగ్రనటులు శ్రీ రాఘవను ఉత్తమనటుడుగా ప్రశంసించారు. సునిశితమైన పాత్రల మనస్తత్వాలను సున్నితంగా, సరళంగా, సమగ్రంగా ప్రదర్శించడంలో ఆయన సిద్ధహస్తుడు అనే కీర్తి గడించారు.

### దుర్యోధనపాత్రకు తెచ్చిన చొడ్డమార్పు :

నాటి నాటకరంగ నటులు దుర్యోధనపాత్రను అతిపేలవంగా పోషించే

వారు. ఆ పాత్రధారి ఏమాత్రం నిలకడలేకుండా, ఓర్పు విస్మరించి, ఆరుపులతో కోపంతో చిందులుతొక్కి, పాత్రౌచిత్యం భంగపరిచేవాడు. భారతకర్తలు దుర్యోధన పాత్రను అద్వితీయంగా సృష్టించారు. శ్రీ రాఘవ దుర్యోధనపాత్ర నిర్వహణంలో ఏ హంగామా లేకుండా హావభావాలలో తేలికతనం కనబరిచి, రాజకీవి, రాజకీయచాతుర్యం స్పష్టీకరిస్తూ, దుర్యోధనపాత్రకు న్యాయం చేకూర్చేవారు. పాండవుల్ని ఏవిధంగా లొంగదీయాలి? పాండవపక్షపాతం చూపించే కృష్ణుడిమీద కక్ష ఏవిధంగా సాధించాలి? అనే కార్యసాధనాల్లో కౌరవసోదరుల ఆవేశం అదుపులో పెట్టుకుంటూ, ఎదురైన అవమానాలు దిగమింగుతూ, పట్టువదలక కార్యదీక్షతో ముందుకు అడుగులు వేసే రారాజు సహజరూపం ప్రతిబింబించే విధంగా శ్రీరాఘవ నటించేవారు.

పాత సంప్రదాయానికి
స్వస్తిచెప్పిన ప్రతిభావంతుడు :

నాటక రంగస్థలిపై అనూచానంగా పోషిస్తూ వస్తున్న హిరణ్యకశిప, రామదాసు పాత్రల నిర్వహణ సంప్రదాయాలు మార్చి, వాటికి ఒక ఆకృతి కల్పించి, పండితుల ప్రశంసలు పొందుకున్నారు. హిరణ్యకశిప రాక్షస మనస్తత్వం రాఘవ హస్తాలలో సత్వగుణ ప్రాధాన్యం సంతరించుకుంది. పుత్ర ప్రేమ వీడలేక ఆ తండ్రి అంతర్గతంగా కుమిలిపోతూ, కొడుకును మొరటు పద్ధతుల్లో లొంగదీయకుండా, సాత్వికంగా బుజ్జగిస్తూ, మరొక పక్క లీలావతిని ఓదారుస్తూ, విష్ణుద్వేషం ప్రకటించి ప్రహ్లాదుని బెదిరిస్తూ, ఒక కంటిలో వాత్సల్యం, మరొక నేత్రంలో ఆగ్రహం ప్రదర్శిస్తూ, ఎంతటి రాక్షసుడికైనా పుత్రప్రేమ ఒకపక్క వుండి తీరుతుందనే సహజ స్వభావాన్ని ప్రేక్షకులకు అందించేవారు శ్రీ రాఘవ హిరణ్యకశిపుడుగా.



కాడివత్రి శ్రీరాఘవాచార్యులుగారు
బెంగుళూరు వాసుదేవరావుగారు,
వకాన్ – రుస్తుం

రామనాసుగా
రాణించిన రాఘవ:

అదేవిధంగా రామదాసు రూపంకూడా ఆయన కల్పనతో మార్పుచెందింది. కథారంభంలో గోపన్న చొక్కా, తలపాగా ధరించేవాడు. గోపన్నలో శ్రీరామ భక్తి బీజాలు నాటుకున్న తరువాత భక్తి పారవశ్యంతో నిమగ్నుడైన రామదాసు ఆహార్యం కూడా మారుతూండేది. సాత్వికచలనాలు, వేషభాషల మార్పు, భక్తికి మించిన ఇతర స్వార్థాలపట్ల చిన్నచూపు - ఈ భావాలు ప్రస్ఫుటంగా ప్రదర్శించిన నాడే ఆ పాత్ర భక్త రామదాసుగా కళ్ళయెదుట అవతరిస్తుందని శ్రీ రాఘవ అభిమతం. రామదాసు పాత్ర ఆ విధంగా ప్రదర్శించిన ఫలితంగా ప్రేక్షకులు ఆయన పట్ల గౌరవభావాలు పెంపొందించుకున్నారు.

పాత్రల తత్వాన్నే మార్చిన
ప్రతిభాశాలి:

దుష్టబుద్ధి, పఠాన్, కీచకుడు, యముడు, యుగంధరుడు, చాణక్యుడు మొదలైన పాత్రలు అన్నిటిలోను శ్రీ రాఘవ మార్పులు తీసుకువచ్చారు. ఆంధ్ర నటలోకం ఆయన చేసిన ఈ మార్పులతో ఆ పాత్రల నిర్వహణ కొనసాగించడానికి ఆదిలో కొంత తటపటాయించింది. కాని క్రమేపీ పాత పాత్రల కొత్త ఆకృతిపట్ల మోజు పెంచుకోకపోలేదు. శ్రీ రాఘవ ప్రదర్శించే నాటకాలకు చాల మంది నటులు హాజరై, ఆయన పాత్ర నిర్వహణ పద్ధతులు సునిశితంగా పరిశీలించి వాటిని ఆచరించేవారు. శ్రీ రాఘవ నాటకాల ప్రభావం అంతటిది.

బంగారు కలలుకన్న
బళ్ళారిరాఘవ:

ఆంధ్ర నాటకరంగం ఇంకా అభివృద్ధి చెందాలని ఆయన బంగారుకలలు కన్నారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలూ ఆచరణలో పెట్టగల వ్యక్తులు కొద్ది మంది మాత్రమే ఉండేవారు. వృత్తి నాటకసంఘాలు, కంట్రాక్టు నాటకాలు నాటకరంగాన్ని కలుషితం చేస్తున్నాయని ఆయన ఎంతో బాధపడేవారు. ఆయన ఏకాకి. నేడున్న చైతన్యం ఆనాడు ఉండివుంటే శ్రీ రాఘవ ఉద్యమం కొంత విజయవంతం అయేది. ఇంతమంది యువ నటీనటులు, యువ నాటక కర్తలు

అనాడు తక్కువ కావడంవల్ల ఆ రోజులలో రాఘవ కలలు కలలుగానే ఉండి పోయాయి.

ఈ తరం నటీనటులకు సమాజాలకు రాఘవ ఆశయాలు ఆదర్శ ప్రాయాలుగా ఉంటున్నందుకు ఒక విధంగా సంతోషించాలి, ఆయన ఆదర్శాల ప్రభావం, నాటక కళ వికాసానికి దారితీస్తుంది. ఒక యుగంలో ఒక ఉద్యమంలో కొద్దిమంది కారణ జన్ములుగా ఉదయిస్తారు. ఆ కోవకు చెందినవారే శ్రీ రాఘవ. ముందు తరాల నటలోకానికి, సమాజాలకు అభ్యుదయకరమైన పంథాలు నిర్దేశించిన ఉత్తమ కళాకారుడు శ్రీ రాఘవ. అదే రాఘవ యుగం. నటన అనేది ఒక యోగం, ఒక తపస్సు. అందరికీ సిద్ధించని ఒక విద్య అని ఆయన తరుచుగా ఉద్బోధిస్తూండేవారు.

ఆయన అక్షరాలా కళాప్రపూర్ణుడు. ఎన్నో ఆవేదనలు భరిస్తూ ఆయన 1946 ఏప్రిల్ 16 వ తేదీన అస్తమించారు.

## కర్నూలు జిల్లా

1949 లో కర్నూలుమండల కళాపరిషత్తు, కర్నూలుపట్టణంలో 1954 సంవత్సరంలో అభ్యుదయకళాసమితి, కర్నూలు డ్రమెటిక్ అసోసియేషన్, లలితకళాసంఘం మొదలైన సంస్థలు పనిచేస్తున్నాయి. ఈ సమాజాల్లో జి. సత్యనారాయణరావు, ఎ. కోదండరామయ్య, యం. యస్. శకుంతలాదేవి, హనుమయ్య, పట్టంశెట్టి ఉమామహేశ్వరరావు, బి. వి. సుబ్బారావు, సీతారామయ్య, స్వామిరావు, జి. సుబ్బారావు. కె. లీలావతమ్మ, ఇందిరాదేవి, సరస్వతి, బి. నారాయణమూర్తి, అన్సారి, కె. సుబ్బారావు, వెంకటస్వామిగౌడ్, రామలింగప్ప, కమలకుమారి, లింగరాజు, అల్లూరి సుశీల మొదలైన నటీనటులు పని చేశారు.

## ఆదోని

1951 లో ఇక్కడ కళాసేవాసమితి, 1956 మల్లికార్జునస్వామి కృపపోషిత నాటకమండలి ఏర్పడి పనిజేస్తున్నాయి.

ఈ సమాజాల్లో జె. కృష్ణమూర్తి, బి. రంగనాథం, యన్. విరూపియ్య,

అయ్యన్నగౌడ్. వెంకోబారావు. పంపన్నగౌడ. యస్. యం. రాజశేఖరయ్య. వి. తిమ్మప్ప మొదలైన కళాకారులు పనిచేశారు.

## కంబం

1957 లో భారతనాటక కళాసమితి ఏర్పడి, సాంఘిక నాటకాలను ప్రదర్శిస్తూ వుంది. ఈ సమాజంలో బి. వి. రాజయ్య, యన్. కామేశ్వరమ్ మొదలైనవారు పనిచేశారు.

## మార్కాపురం

1943 లో ఆంధ్ర అమెచ్యూర్ అసోసియేషన్ స్థాపింపబడి పనిచేస్తూ వుంది. యం. యన్. శాస్త్రి, యస్. వి. నరసింహం, అద్దంకి రాఘవరావు మొదలైన నటులు పనిజేశారు.

## నంద్యాల

1890 ప్రాంతంలో కళావంతుల కులానికి చెందిన జ్యోతి సుబ్బయ్య కంపెనీ అనే ఒక ప్రఖ్యాత సంచార నాటకసమాజం వుండేది. ఆ సమాజంలో సురభి గోవిందప్ప మొదలైనవారు నటించారు. ఈ కంపెనీలో స్త్రీ పాత్రలను స్త్రీలే ధరించేవారట. 1800 ప్రాంతాల్లో ప్రప్రథమంగా స్త్రీలను స్త్రీ పాత్రలకు నిర్ణయించిన గౌరవం జ్యోతి సుబ్బయ్య కంపెనీకి దక్కింది.

1947 లో మిత్రకళాసమితిని వి. శేషయ్యగారు స్థాపించారు. ఈ సంస్థలో ఆర్. రామారావు, కె. వీరయ్యాచారి, యన్. వి. శేషయ్య, ఎ. కృష్ణమూర్తి, జి. పుల్లయ్య, మగదల రామచంద్రరావు, జె. శ్రీనివాసమూర్తి, యం. యన్. మూర్తి మొదలైన నటులు పనిచేశారు.

## పత్తికొండ

1955 సం॥ రంలో పత్తికొండ తాలూకాలో రాఘవ కళాసమితి స్థాపించబడింది. ఎ. వెంకటేశ్వరరావు, యన్. షరీఫ్, వసం శంకరశర్మ పనిచేశారు.

# గిద్దలూరు

రాఘవ నాటక కళాసమితిని జి కామేశ్వరరావుగారు స్థాపించారు. ఇందులో సుసర్ల గోపాలశర్మ, కన్నయ్య, వెంగయ్య నటులుగా వర్ధిల్లారు.

# కడప జిల్లా

కడప :

కడప జిల్లాలో ప్రప్రథమంగా నాటక బీజాలను నాటినవారు సురభివారు. వలభై సంవత్సరాల క్రితం కడప జిల్లాలో ఏచూరు వెంకటరంగం, దేవరాజుల మొదలియారు అనేవారు రామవిలాస సభ ఏర్పాటు చేశారు.

రామవిలాస సభ ఏర్పడి అనేక సమాజాలకు మార్గదర్శకంగా నిలబడి పని చేసింది. "విజ్ఞాన కళాసమితి", కోడూరు ఆంధ్ర అమెచ్యూర్ అసోసియేషన్, "లలితకళామండలి" మొదలైన సంస్థలు ఉత్సాహంగా పనిచేశాయి.

ఈ సమాజాలలో యస్. యస్. రామస్వామి, యం. సుబ్బరాజు, గుండా చారి, విశ్వనాధరావు, యం. వి. సుబ్బయ్య, ఆర్. వి. శ్రీరాములు, వి. ఉమా మహేశ్వరరావు, జె. వి. సుబ్బారావు మొదలైన నటులు ప్రసిద్ధికెక్కారు.

# ప్రొద్దుటూరు

1945 లో భారతమాతా నాట్యమండలి, 1955 లో వాణీకళాసమితి, 1956 లో సర్వోదయనాట్యమండలి; రామలింగేశ్వర నాట్యమండలి, నటరాజ నాటకసమాజం, కృష్ణదేవరాయ నాట్యకళాసమితి, రాయల నాటక కళాపరిషత్తు, సత్యనారాయణ నాట్యమండలి మొదలైన అనేక నాటక సమాజాలు పనిచేస్తున్నాయి.

రతనాలసీమలో

రాయల నాటక కళాపరిషత్తు :

1958 వ సం॥ రంలో రాయలసీమలో సాంస్కృతిక కార్యకలాపాలకు పేరుమోసిన ప్రొద్దుటూరు పట్టణంలో కళాభిమానులూ కళాకారులూ,

ఔత్సాహిక కళాకారులలో నిగూఢమైయున్న ప్రతిభావిశేషాలను వెలుగులోకి తేవాలనే సంకల్పంతో ఈ పరిషత్తు ఏర్పర్చి రిజిస్టరు చేయించారు. 1961 లో ఆంధ్రప్రదేశ సంగీతనాటక అకాడమీకి అనుబంధ సంస్థగా రూపొందింది.

ప్రతిసంవత్సరం ఏప్రిల్, మే మాసాలలో నాటక, నాటికల పోటీలు ఏర్పాటు చేస్తున్నారు. ఆంధ్రదేశం నలుమూలల నుండేగాక ప్రవాసాంధ్రులు కూడ ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. రచనకు, ప్రదర్శనకు, నటనకు కలిపి దాదాపు 2 వేల రూపాయల బహుమతు లిస్తున్నారు. ప్రతి సంవత్సరమూ నాటకరంగంలో విశేషానుభవం గడించిన పెద్దలను సన్మానిస్తున్నారు. అనేకమంది అనుభవజ్ఞులు నాటకనిర్దేశకులుగా నిర్ణయించబడుతున్నారు. కళాకారులతో నాట్యగోష్ఠిని ఏర్పాటు చేసి నాటక రంగ సమస్యలను చర్చిస్తున్నారు. ఈ పరిషత్తు పోటీలకు సంగీత నాటక అకాడమీ స్వల్ప ధనసహాయం చేస్తూవుండి.

పైన వివరించిన నాటక సంస్థల్లో కొప్పరపు సుబ్బారావు, బి. యస్. రాజు, పి. వెంకటసుబ్బారావు, పి. శాంతకుమారి, కొండపేట కమాల్, పి. కృష్ణారెడ్డి, టి. నారాయణ, శ్రీమతి యశోదాదేవి, సుశీలారాణి. బలిరెడ్డి నరసింహారెడ్డి మొదలైన కళాకారులు పని చేస్తున్నారు.



# సురభి నాటకరంగం



శివాజిపేరు నిలబెట్టిన సురభివారు - జంఖండి నాటకాలు - ఈతమట్టల బొమ్మలాటలు-తోలుబొమ్మలాటలు-రంగుల్లో ఫోకసింగులు - ప్రదర్శించిన పండితుల నాటికాలు-ఆకర్షించబడ్డ ఆంధ్రనటులు-ఎన్నో నమూనాలు - ఎందరో మహానుభావులు -

వనారస గోవిందరావు

# సురభి నాటకరంగం

ఆంధ్ర నాటకరంగ చరిత్రలో అత్యంత ప్రాముఖ్యం వహించేది సురభి నాటకాల చరిత్ర. ఆంధ్రదేశంలో నాట్యకళనే వృత్తిగా పెట్టుకుని కుటుంబాలతో సహా నాటక ప్రదర్శనాలనిస్తూ, ఊరూరా పర్యటించే సురభి నాటకాలవారు ఆంధ్రులకు చిరకాల పరిచితులే. ఆంధ్ర నాటకరంగ చరిత్రలో వారి నాటకాలకు స్థానం వుంది. సురభి నాటకసమాజ సంస్థాపకులు వనారస గోవిందరావుగారు.

శివాజిపేరు నిలబెట్టిన
సురభివారు :

సురభి కళాకారుల నివాసం పూనా సమీపంలో వున్న ఒక కుగ్రామం. శివాజీ ఆస్థానంలో ఉద్యోగులుగానూ, సేనానాయకులుగాను, ఉపనాయకులుగానూ వుండేవారు. వీరందరూ క్షత్రియ కులానికి చెందినవారు. సింధే, అవేళ్, అణ్ణావు, ఆటోక్, రేకందార్, సాతే, దారాపవార్ మొదలైనవి వీరి ఇంటిపేర్లు. వీరందరూ బహు విద్యావంతులుగాను, సంగీత సాహిత్యాలలో ఆరితేరినవారై వుండేవారట. శివాజీ, శంభాజీ గతించిన తరువాత మహమ్మదీయ దండయాత్రల్ని తట్టుకోలేక భార్యా బిడ్డలతో వలసలు పోయారు. అలా వలసలు పోయినవారిలో కొంతమంది బళ్ళారి రాయదుర్గం, ఆదోని ప్రాంతాలకు చేరుకున్నారు. వారినే ఆరెకాపు లనేవారు. ఆరె మరాటీలుగా 1850 కి పూర్వమే ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వంద్వారా కడపమండలంలో ఈనాములు సంపాదించి జీవనాన్ని సాగించారు.

అన్నంకోసం ఆటుపాటలు :

ఇలా ఈనాములు సంపాదించినవారిలో ఒకరే వనారస సంజీవరావుగారు. వారికి పదిమంది పిల్లలు. ఆయన పెద్దకుమారుడు రామయ్య. సంజీవరావుగారి మరణానంతరం పిల్లల బాధ్యత రామయ్యగారు వహించారు. ఆనాడు ధాత కరువుతో ఆంధ్రదేశమంతా అలమటిస్తోంది. వారితో తెచ్చుకున్న ఆభరణాలన్నీ అమ్ముకుని జీవించారు. తరువాత జీవనోపాధి కష్టమైంది. వారిలో అనేకమంది

శ్రావ్యమైన గాత్రాలు కలవారున్నారు. పాడటం ప్రారంభించారు. పాటతోపాటు ఆట ప్రారంభించారు. తరువాత కొన్ని వినోద కార్యక్రమాలను ప్రదర్శించారు. ఆ విధంగా జీవనోపాధి ప్రారంభించారు. తరువాత ఈతమట్టల బొమ్మలాటలను ప్రదర్శించారు. ఆ తరువాత తోలుబొమ్మల ఆటలను రామయ్యగారి సోదరుడైన వెంకప్ప ఆనే వెంకోజీ రావుగారితో కలిసి బాహాటంగా ప్రదర్శనాలనిచ్చారు. తెలుగు నేర్చుకుని రామాయణాన్ని. భారతాన్ని పూసగ్రుచ్చినట్లు చెప్పేవారు. పైన వుదహరించిన వెంకోజీరావుగారి దత్తపుత్రులే వనారస గోవిందరావుగారు. వీరి పూర్వులు కడపజిల్లా రాయచోటి తాలూకా సురభిగ్రామంలో స్థిరపడి నాటకా లాడడంవల్ల వీరికి సురభి అనే పేరు సార్థకమైంది.

తోలుబొమ్మలాటల తరువాత, జంఖండి నాటకాలను ప్రర్శించారు. ఖండీ గారు ఈ నాటకాలను ప్రదర్శించడంవల్ల వీటికి జంఖండీ.నాటకాలని పేరువచ్చింది.

ప్రారంభించిన
ప్రథమనాటకం:

గోవిందరావుగారు 1895 లో ప్రథమంగా "కీచక వధ" నాటక ప్రదర్శ నాన్ని జయప్రదంగా ప్రదర్శించి మెప్పుపొందారు. ప్రజాదరణ లభించింది. సురభి గ్రామవాస్తవ్యు లైన రామిరెడ్డి, చెన్నారెడ్డిగార్లు వీరిని వుత్సాహ పర్చి. నాటక సమాజాన్ని స్థాపించమన్నారు. ఆ నాడే సురభి నాటకరంగానికి మహోదయమైంది. ధర్మవరం వాస్తవ్యులూ, హరికథా పితామహులూ అయిన రాప్తాటి సుబ్బదాసుగారిని రప్పించి కొన్ని నాటకాలను వ్రాయించి, "శ్రీశారదా మనో వినోదినీ సంగీత నాటక సభ" అనే నాటక సమా జాన్ని స్థాపించారు. వరుసగా సుబ్బదాసుగారు సారంగధర—జగన్మోహిని—చంద్రకాంత—



రాప్తాటి సుబ్బదాసుగారు
సురభి నాటక రచయిత

స్త్రీ సాహసం—మొదలైన నాటకాలను వ్రాశారు.

ఈ నాటకప్రదర్శనాల్లో స్త్రీలు స్త్రీపాత్రలూ, పురుషులు పురుషపాత్రలూ ధరించేవారు. ఆనాడు వారు ప్రదర్శించిన సుబ్బదాసుగారి నాటకాలన్నీ పాటల నాటకాలే. సుబ్బదాసుగారు దర్శకుడుగా వుండి, అనేక పాత్రలను ధరించి, సురభి వారి నాటకాలకు జీవంపోశారు.

1901 - 1903 నాటికి సురభినాటక సమాజం ఉన్నతస్థాయి నందుకుని, విస్తృతంగా ప్రదర్శనాల నిచ్చింది.కొందరు బందరు చేరుకుని, గరికిపర్తి కోటయ్య దేవరగారి ఋష్యశృంగచేపి శాస్త్రీయసంగీతాన్ని నేర్చుకుని, తమ నాటకాలలో ఆ సంగీతాన్ని ప్రవేశపెట్టారు.

విభేదాలతో విడిపోయిన ఉన్నతమ్మలు :

1910 ప్రాంతంలో సురభి నాటక సమాజంలో విచ్ఛిత్తి ప్రారంభమైంది. అన్నతమ్ములు విడిపోయారు. విడివిడిగా సమాజాలను స్థాపించారు. ఈ విధంగా విడివడిపోయిన సమాజాలు ఈనాటికి దాదాపు నలభై సమాజాలుగా వర్ధిల్లాయి. వీటిలో కొన్ని సమాజాలు ఆధునిక రంగస్థలపరికరాలతో ఉత్తమసంచార సమాజాలుగా ఎదిగిల్లుతున్నాయి. ఈనాడు సురభి సమాజాలవారందరూ, "సురభినాటక కళాసంఘాన్ని" స్థాపించుకున్నారు. వీనికి ప్రథమ కార్యదర్శిగా కీ॥ శే॥ అవేటి నాగేశ్వరరావు బాధ్యతలు వహించారు.

రంగుల్లో ఛాయాసింగుల సింగారం :



ఈ నాడు వారి ప్రదర్శనాలు సాంకేతికంగా వుత్తమంగా ప్రదర్శింపబడుతున్నాయి. దాదాపు వారి నాటక ప్రదర్శనం ఒక సినిమాలాగా ఉంటుంది. రంగురంగుల ఛాయా సింగ్ లైట్లు, స్ప్రింగ్‌వర్క్‌తో భూమిలోనుంచి లక్ష్మీదేవి ప్రసన్నం కావడం, పైనుంచి నారదుడు వెన్నెల వర్క్ ద్వారా ప్రత్యక్షమవడం, హనుమంతుడు సముద్రం దాటి లంకకు వెళ్ళడం. దేవుళ్ళ ప్రత్యక్షాలూ, అదృశ్యాలూ మొదలైన ట్రిక్కు లన్నింటినీ ప్రవేశపెట్టి ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ పద్ధతుల్లో ఈనాడు వారి సమాజాలన్నీ ఆంధ్రదేశమంతటా సంచారం చేస్తూవున్నాయి. కొంతమంది డేరాలనూ, మరి

శ్రీమతి సురభి కమలాబాయిగారు - ద్రౌపది

కొందరు జింకురేకుల హాల్సునూ. కలిగివున్నారు. ప్రతి పెద్దకంపెనీకి పదిహేను వందలమంది ప్రేక్షకులు కూర్చొనటానికి వసతిగల టిన్నురేకుహాలూ, ఎలెక్ట్రిసిటీ జనరేటరూ, మైక్‌లు మొదలైన దూరశ్రవణ యంత్రాలూ, దుస్తులూ, తెరలూ, సీనరీసెట్టింగులూ, ప్రేక్షకాగారానికి కావలసిన బల్లలూ, బెంచీలూ, ఇతర రంగస్థల పరికరాలూ, వున్నాయి. వారి స్వంత సామగ్రితో అనేకమంది స్త్రీ పురుష బాల బాలికలతో కొన్ని లారీల సామగ్రితో సంచారంచేసే నాటకసంస్థలు సురభివారివి.

పావలా వచ్చినా
ప్రదర్శనం తప్పదు:

సురభి నాటక ప్రదర్శన కారులు ఒక గ్రామంలో ప్రదర్శనలు ప్రారంభిస్తే వారి నాటకాలన్నీ ప్రదర్శిస్తేకాని అక్కడనుంచి కదలరు. అందరూ హెచ్చుతగ్గులు లేకుండా కష్టపడతారు. నాటకానికి ఆదాయం పావలా వచ్చినా, పదిరూపాయలు వచ్చినా ప్రదర్శిస్తారు. ఏ పరిస్థితుల్లోనూ ప్రదర్శనం ఆగదు. ఎవరికి వారే పాత్రోచితంగా అలంకరించుకోగలరు. చిన్న వేషధారులనీ, పెద్ద వేషధారులనీ తారతమ్యాలు లేవు. అవసరాన్ని బట్టి ఏ వేషమైనా వేయడానికి ప్రతివారూ సిద్ధంగా వుంటారు. స్త్రీలూ, పురుషులూ కలసివున్నప్పటికీ ఎటువంటి పొరపాట్లు జరుగవు. వారిలో వారే వివాహాలు చేసుకుంటారు. ఒకరికి జబ్బుచేస్తే ఆ పాత్రను మరొకరు ధరిస్తారు. ప్రదర్శనం అయిన మరునాడు క్రితం రాత్రి జరిగిన ప్రదర్శన లోపాలన్నిటినీ చర్చిస్తారు. నటీనటులకు నేపథ్యంలో అనేకమంది సహకరిస్తారు. నాటకానంతరం ఎవరి దుస్తులు వారు భద్రంగా సర్దుతారు. వారి నాటక మందిరం రాత్రిపూట ప్రదర్శనశాలగాను—పగటిపూట గురుకులంగానూ ఉపయోగపడేది. ఒకప్రక్క బాలబాలికలకు విద్యాభ్యాసమూ, ఒకప్రక్క ఆనాటి ప్రదర్శనకు కావలసిన పరికరాలను కూర్చడమూ, రాబోయే కొత్త నాటకానికి రిహార్సల్సు—డ్రస్సులు కుట్టడం — సీనరీలు వ్రాయడం — సంగీతాన్ని కూర్చడం—పోయిన సామగ్రిని తిరిగి తయారు చేయడం జరుగుతూ వుంటుంది.



వవారప చినరామయ్యగారు
(క్రూరసేనుడు)

కృషిలో సమిష్టికృషి:

ఒకరి పనిలో మరొకరు జోక్యం కలుగజేసుకోరు. కాని సమిష్టిగా నాటక ప్రదర్శనానికి కావలసిన అన్ని హంగులనూ సమకూరుస్తారు. రంగానికి రంగానికి మధ్య వ్యవధిలేకుండా తెరలు ఎత్తుతూ వుంటారు. అది సురభివారి ప్రత్యేకత. కొన్ని పెద్ద సమాజాలలో ట్రాలీ స్టేజీ ఏర్పాటులుకూడా చేశారు. రంగస్థలంమీద ఒక సన్నివేశ ప్రదర్శనం జరుగుతూ వుండగా మరో సన్నివేశానికి కావలసిన సెట్టు—రంగస్థల పరికరాలను కూర్చుకుని—లైట్లు ఆర్పి మరల వెలిగించేలోగా ట్రాలీద్వారా మరో సన్నివేశాన్ని ప్రారంభిస్తారు.

కడుపులో కోత,
కళ్ళల్లో ఆనందం:

సురభి నాటకాల్లో మనం నమ్మలేనటువంటి విచిత్రాలు జరిగేవి. కన్నబిడ్డ చనిపోయినా, తల్లి తండ్రీ ఆ శవాన్ని స్టేజివెనుక పెట్టి, ఇరువురూ చిరునవ్వులతో ప్రేయసీ ప్రియులుగా ఆ సన్నివేశం పూర్తిచేసి ప్రేక్షకుల నానందింపచేసి నాటకం ముగించి మంగళంపాడి ఆ తరువాత శవం దగ్గరచేరి భోరుమని దుఃఖించేవారు. ఇది వారి వృత్తిధర్మానికి నిదర్శనం.

ఇలాగా సురభి కళాకారులు ఆంధ్ర నాటక రంగానికి అపారమైన సేవ చేశారు. కేవలం భుక్తికొరకే గాక, కళావృష్టితో నాటకాలను ప్రదర్శించారనే దానికి నిదర్శనం పై విచిత్రాలే చాలు.

ప్రప్రథముగా నాటక రంగస్థలంమీద కుల స్త్రీలను ప్రవేశపెట్టిన ఖ్యాతి సురభివారిదే. తరతరాలుగా సురభివారు తెలుగు ప్రేక్షకుల ఆదరాభిమానాలను సంపాదించారు. ధనం—బంగారు పతకాలూ—కత్తులూ—గదలూ—అమృత కలశాలూ—శాలువలూ—తెరలూ బహుమతులు పొందారు. దాదాపు 80 సంవత్సరాలనుండీ నాటకాలు ప్రదర్శిస్తూ ప్రశస్తిపొందారు.

వాసిగాంచిన
వనారస గోవిందరావు:

సురభి నాటక పితామహ వనారస గోవిందరావుగారి కంపెనీ అనేక సంవత్సరాలు నడిచింది. ఆయనకు ఇద్దరు భార్యలు. ఆంధ్ర నాటక రంగంలో



శ్రీవారన గోవింద రావుగారు–దొంగవేషం లకు, నటులకు, నాటక రచయితలకు చాల సహాయంచేశారు.

అత్యంత పేరు ప్రఖ్యాతులు గడించినవారు. గోవిందరావు గారి కుటుంబం అందరూ కలిసి నూరుమంది వరకూ వుంటారు. అందరూ నటీ నటులే. సురభి కంపెనీలన్నీ గోవింద రావుగారి కుటుంబానివే. గోవిందరావుగారు 1915 వరకూ సురభి గ్రామంలోనే వుండి, తరువాత పశ్చిమ గోదావరిజిల్లా ఏలూరు దగ్గర పోల్చానిపల్లెలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఆ గ్రామంలో విద్యావ్యాప్తికి ఒక స్కూలును స్థాపించారు. నాటక రంగంలో స్త్రీ పాత్రలకు స్త్రీలనే ప్రవేశపెట్టడం ముఖ్యమైన విషయం. సంగీత సాహిత్యాలలో ప్రావీణ్యం సంపాదించి, సురభి నాటక కంపెనీలలో నాయక పాత్రలను ధరిస్తూ వచ్చారు. సురభి నాటక మండలికి అధిపతిగా వుండి, సమర్థతతో తమ సమాజాలను నడిపారు.

గోవిందరావుగారు దానధర్మనిరతులు. అనేకమంది కవు

1929 లో వీరూ, కాశీనాధుని నాగేశ్వరరావుగారు కలిసి ఆచంట సాంఖ్యాయన శర్మగారి అధ్యక్షతను ఆంధ్ర నాటక కళా పరిషత్తు స్థాపించి, ఆంధ్ర నాటక కళోద్ధారకు లనిపించుకున్నారు. ఆంధ్రదేశంలోని సాహితీపరులు, నాటక రచయితలు, కళాభిమానులు, నటులు కలిసి, 1937 లో ఏలూరులో గోవిందరావుగారి జన్మదినోత్సవం మహావైభవంగా జరిపి కృతి సమర్పణాది బహుమాన పురస్సరంగా వీరిని సన్మానించారు. ఏలూరులో వీరి శిలా విగ్రహ ప్రతిష్టాపన జరిగింది. ఆంధ్ర నాటక రంగానికి అపూర్వసేవ చేసిన వీరు తమ 86 వ యేట 1953 లో కీర్తిశేషులైనారు.

ప్రదర్శించిన పండితుల నాటకాలు:

సురభివారు ఎన్నో నాటకాలను ప్రదర్శించారు. ముఖ్యంగా వారికొరకే కొన్ని నాటకాలను వ్రాయించుకుని ప్రదర్శించారు.

వారి ప్రథమనాటకం కీచక వధ. తరువాత రాప్తాటి సుబ్బదాసుగారి హరిశ్చంద్ర, శాకుంతలం, సారంగధర: మారేపల్లి రామచంద్రశాస్త్రిగారి పారిజాతాపహరణం, బిల్హణీయం: వఝుల చింతామణిశాస్త్రి చంద్రకాంత: శ్రీరాముల సచ్చిదానందశాస్త్రి

శూర్పణఖ గర్వభంగం, కాంతామతి; తడకలూరి కుప్పుస్వామి మైరావణ, కాంతామతి, భల్లాణ చరిత్ర; మల్లాది అచ్యుతరామశాస్త్రి జగన్మోహన; పండిత కె. సుబ్రహ్మణ్యశాస్త్రి సంపూర్ణమహాభారతం; చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి సీతాకల్యాణం; చర్ల వేంకటసుబ్బాశర్మ కుమారవిజయము, రావణచర్యలు, భక్త కబీరు; విశ్వనాథ కవిరాజుగారి "సతీసావిత్రి" "సత్యహరిశ్చంద్ర" "మహానంద" "కృష్ణావతారం" "లవకుశ" "వసంతసేన" "జమీందార్"; కొప్పరపు సుబ్బారావుగారి "స్త్రీసామ్రాజ్యం"; హరి పురుషోత్తంగారి "బొబ్బిలియుద్ధం" "సంపూర్ణ మహాభారతం" "సంపూర్ణరామాయణం" "బాలనాగమ్మ" "పలనాటి యుద్ధం" "ఫస్ట్‌క్లాసు బి. ఏ." కాంతామతి; మల్లాది వెంకటకృష్ణశర్మగారి "ప్రతిజ్ఞ" "అలెగ్జాండర్" "బాలనాగమ్మ" "దేవదాసు" "భూకైలాస్" "మాయాబజార్" "వక్షయజ్ఞం" "మాయలమరాఠి" "కురుక్షేత్రం" మొదలైనవి ప్రదర్శించారు.

### ఆకర్షించబడ్డ ఆంధ్రనటులు :

చేదీప్యమానంగా వెలుగొందుతున్న ఆనాటి సురభి నాటక సమాజాలలోకి వుత్సాహంగా వున్న అనేకమంది తెలుగు యువకులు ఆకర్షింపబడ్డారు. వారిలో గుంటూరుజిల్లా మునిపల్లె వాస్తవ్యులు వి. సుబ్బారావుగారు, ప్రహ్లాద నాటకంలో హిరణ్యకశిపుని పాత్ర ధరించేవారు. ఈయనే తొలి తెలుగుచిత్రం. హెచ్. యం. రెడ్డిగారు తీసిన ప్రహ్లాదలో హిరణ్యకశిపుడుగా నటించారు. తరువాత సురభి కమలాబాయితోపాటు, పి. యస్. ఆర్. ఆంజనేయులు, జొన్నవిత్తుల శేషగిరిరావు, కపిలవాయి రామనాథశాస్త్రి, ధేనువుకొండ సుబ్బారావు మొదలైన వారందరూ సురభి నాటకాల్లో పాత్రలు ధరించారు.

### నిష్ణాతులూ, నిర్వాహకులూ :

గోవిందరాయ సురభి నాట్యమండలి : ఈ సమాజనిర్వాహకులు శ్రీ వనారస సుబ్బారావు, కోటీశ్వరరావుగార్లు. ఆంధ్రనాటక కళోద్ధారకులు, ఆంధ్రనాటక కళాపరిషత్తు సంస్థాపకులు అయిన వనారస గోవిందరావుగారి స్వంత సమాజమిది. సుబ్బారావు, కోటీశ్వరరావుగార్లు గోవిందరావుగారి పుత్రులు. ఈ సమాజం దాదాపు 80 సంవత్సరాల క్రితం స్థాపించబడింది.

శారదా విజయ నాట్యమండలి : ఈ సమాజ నిర్వాహకులు యస్. ఎ.

బాబారావుగారు. సుప్రసిద్ధ నటీమణి స్వర్గీయ పాపాబాయిగారి కోవకు చెందిన నాటకసమాజం.

శ్రీ వెంకటేశ్వర నాట్యమండలి: ఈ సమాజనిర్వాహకులు ఆర్. చిన్న వెంకట్రావుగారు. రమారమి ముప్పై ఏళ్ళుగా నడుస్తున్న నాటకసమాజ మిది.

శ్రీ గజపతి నాట్యమండలి: దీని నిర్వాహకుడు అవేటి రమణకుమార్.

శ్రీ శారదా మనోవినోదినీసభ: ప్రఖ్యాతనటులు, చిత్రకారులు, నాట్యకళా విశారద వనారస చిన్నరామయ్యగారి పుత్రులు శ్రీ అబ్బారావుగారు ఈ సమాజానికి అధిపతి.

శ్రీ వసుంధరా నాట్యమండలి: ఈ సమాజాధిపతి ఎ. రామచంద్రరావు గారు. వీరి సతీమణి ప్రఖ్యాత రంగస్థల నటీమణి శ్రీమతి వసుంధర, గోవిందరావు గారి పుత్రిక.

శ్రీ రమా సత్యనారాయణ నాట్యమండలి: సురభి నాటక సమాజాలలో ప్రత్యేకత గల సమాజమిది. దీని నిర్వాహకులు వనారస రామయ్యగారు. జనగాం రామయ్యగారంటే చాలామందికి తెలుస్తుంది.

గోవర్ధన నాట్యమండలి; స్వర్గీయ అవేటి వెంకటస్వామిగారి పుత్రులు శ్రీ చలపతిగారు ఈ నాట్యమండలి నిర్వాహకులు.

న్యాపూర్ణానంద డ్రమెటిక్ థియేటర్స్: 1934 లో ఈ సమాజం స్థాపించబడింది. స్వర్గీయ అవేటి వెంకటస్వామిగారు వ్యవస్థాపకులు. శ్రీ రామయ్య, ప్రసాదరావు, నాగేశ్వరరావు, చలపతిరావుగార్లు వెంకటస్వామిగారి పుత్రులు. ఈ నలుగురూ గోవిందరావుగారి అల్లుళ్ళు. 1943 లో విడిపోయారు. అవేటి నాగేశ్వరరావుగారు పై నాటకసమాజాన్ని స్థాపించి వృద్ధిచేశారు. నాగేశ్వరరావు గారు విద్యాధికులు, ఉత్తమనటులు. ప్రధాన పాత్రలు ధరించేవారు. ఆయన భార్య చెల్లాయమ్మ. నాగేశ్వరరావుగారు సురభి నాటక సమాజాల అభివృద్ధికి పాటుపడిన వ్యక్తి. అభ్యుదయ భావాలు గలవారు. ఆంధ్రులతో గుర్తింప బడినవారు. అనేక సన్మానాల నందుకున్నారు. సంగీత నాటక అకాడమీలోనూ, ఆంధ్ర నాటక కళాపరిషత్తులోనూ సభ్యులుగా వున్నారు.

ఎన్నో సమాజాలూ
ఎందరో మహానుభావులు:

పైన పేర్కొన్న సమాజాలేగాక సురభి నాటక కళాసంస్థకు చెందిన

26 చిన్న సమాజాలు విశాలాంధ్ర వివిధప్రాంతాల్లో సంచారం చేస్తున్నాయి. ఈ క్రింద పుదహరించిన వారందరూ ఆ సమాజాలను నిర్వహిస్తున్నారు.

శ్రీమతి పూర్ణిమ రామయ్య, ఆర్. పుల్లయ్య, శంభులింగం, ఆర్. వెంకోబా రావు, నారాయణశాస్త్రి, వి. వెంకోబారావు, ఆర్. కామాక్షీబాయి, వి. మోహనరావు, వి. చక్రపాణి, వి. చిన్న వీరాంజనేయులు, ఆర్. సత్యనారాయణరావు, పి. తిరుపతిరావు, వి. రామచంద్రరావు, ఆర్. వెంకటసుబ్బారావు, శ్రీమతి వి. పద్మావతీ బాయి, శ్రీమతి వి. గౌరీబాయి, ఆర్. మణేశ్వరరావు, ఆర్. లక్ష్మణరావు, ఎ. వెంకటరావు, వి. నీలవేణీబాయి, ఆర్. జయరామారావు, ఆర్. మనోరమ, వి. సత్యనారాయణ, యస్. రెడ్డప్ప, యస్. రెడ్డన్న, వి. వితోబారావు, ఆర్. తులసీ రావు మొదలైనవారు.

రెండు తరాల నటులు:

మొదటి రెండు తరాల్లోనూ సుప్రసిద్ధులైన సురభి నటీనటులు వెంకోజీ రావు, వారి భార్య చిన్నసుబ్బమ్మ; పెద్దరామయ్య, ఆయన భార్య రామాబాయి; సురభి పాపాబాయి, జంధ్యాటి వెంకూబాయి, సురభి కమలాబాయి, చిన్నరామయ్య, గోవిందరావు, వారి భార్య పెద్దసుబ్బమ్మ; లక్ష్మీబాయి, అవేటి వెంటస్వామి మొదలైనవారు.

ప్రసిద్ధులైన
సురభి నటులు:

అవేటి నాగేశ్వరరావు, కృష్ణాజీరావు, సుబ్బారావు, అబ్బాజీరావు, పుల్లయ్య, వి. వి. సుబ్బారావు, బాబురావు, ఉత్తమరావు, వి. ఆంజనేయులు, ఎ. బాబారావు, యస్. యల్, పాపారావు, యస్. రామచంద్రరావు, శ్రీమతి ఎ. ధనలక్ష్మీదేవి, శ్రీమతి అవేటి పూర్ణిమ, శ్రీ సుబ్బయ్య, నటనాప్రవీణ యస్. ఎ. ప్రకాశ్, శ్రీమతి శకుంతలాదేవి, శ్రీమతి కోటేశ్వరిదేవి, శ్రీమతి చంద్రకుమారి, బి. సత్యవతి, సుబ్బయ్యనాయుడు, శ్రీమతి వసుంధరాదేవి, నవరత్నం, శ్రీమతి నాగలక్ష్మి, ఆర్. సుభద్ర, సురభి బాలసరస్వతి, విజయాంబ, లక్ష్మి, శ్రీమతి లక్ష్మమ్మ, కోటేశ్వరరావు, యం. నారాయణరెడ్డి, భువనలక్ష్మీదేవి, శ్రీమతి వి. కృష్ణవేణి, శ్రీమతి అనసూయ, ఆర్. భోజరాజు, ఆర్. వెంకట్రావు, వి. వెంకట్రావు మొదలైనవారు.

# చిత్తూరుజిల్లా

## చిత్తూరు :

చిత్తూరులో 1920 వ సంవత్సరంలో శ్రీరామవిలాస సభను బ్రహ్మాండం నరసింహారావుగారు స్థాపించారు. ఈ సమాజానికి కార్యదర్శి బాధ్యతల్ని కూడా ఆయనే నిర్వహించేవారు. ఈ సమాజ సభ్యులందరూ మధ్య తరగతికి చెందిన మేధావులు, ప్లీడర్లు, ఇతర వుద్యోగులు. నరసింహారావుగారి తరువాత టి. వి. రంగాచార్యులుగారు అధ్యక్షులుగాను, కె. వరదాచారి, టి. వి. శేషాద్రి కార్యదర్శులుగాను పనిచేశారు. ఈ సంస్థలో పనిచేసి దీని అభివృద్ధికి పాటుపడినవారు మాడభూషి అవంతశయనం అయ్యంగారు, ఆర్. బి. రామకృష్ణంరాజు, బొల్లిని మునిస్వామి నాయుడు, గొల్లపూడి శ్రీరామశాస్త్రి, పి. దొరస్వామి అయ్యంగార్, సుప్రసిద్ధ చలనచిత్రనటులు పద్మశ్రీ వి. నాగయ్య, కె. రాఘవేంద్రరావు, పి. నరసింహయ్య మొదలైనవారు. వి. నాగయ్యగారు ఈ సమాజంలో నటుడుగా, గాయకుడుగా, హార్మోనిస్టుగా బహుముఖాల సేవ చేశారు. వీరు ప్రదర్శించిన నాటి కాలలో ముఖ్యమైనవి రామదాసు, బృహన్నల. బళ్ళారి రాఘవాచార్యులు, పర్వతరెడ్డి, రామచంద్రారెడ్డి, స్థానం మొదలైనవారు రామవిలాస సభ నాటకాలలో పాల్గొన్నారు. ఈ సమాజ నాటకాలకు రాయప్రోలు సుబ్రహ్మణ్యంగారు నాట్యశిక్షణ ఇస్తూ వుండేవారు. ఈయన సభ నాటకాలలో నాయక పాత్రలను ధరిస్తూ వుండేవారు. వీరేకాక కె. రాఘవేంద్రరావు, వి. నాగేశ్వరయ్య, పి. నరసింహయ్య మొదలైనవారుకూడ ఉత్తమనటులుగా పేరుపొందారు.

1920 నుండీ చిత్తూరు నాటకరంగంలో రామవిలాస సభ దేదీప్యమానంగా వెలుగొందింది. 1949 లో యన్. జి. ఓస్ డ్రమెటిక్ అసోసియేషన్ స్థాపించబడింది. 1945 లో ఆర్టులవర్స్ అసోసియేషన్, 1952 లో వాణీ కల్చరల్ అసోసియేషన్ మొదలైన సమాజాలుకూడా నడపబడుతూ వున్నాయి.

ఈ సమాజాలలో డి. శ్రీనివాసాచారి, యస్. రాఘవేంద్రరావు, కె. రామస్వామి అయ్యంగార్, పి. నరసింహయ్య, కె. వీరభద్రాచార్య, పరసు వెంకట మునుస్వామిశెట్టి మొదలైనవారు నటులుగా పనిచేశారు.

# తిరుపతి

1930 లో తిరుపతి అమెచ్యూర్స్ అసోసియేషన్, 1948 లో లలితకళా సమితి, 1954 లో వెంకటేశ్వర నాట్యమండలి, 1950 లో ఆర్టు క్రియేటర్ అసోసియేషన్ మొదలైన సంస్థలే గాక, దేవస్థానం నాటక సంఘం, సరస్వతి విలాస సభ, టి. టి. డి. ఎంప్లాయీస్ కల్చరల్ అసోసియేషన్, బాపూజీ నాట్యకళాసమితి, రాఘవ కళామండలి మొదలైన నాటక సంస్థలు పనిచేశాయి.

ఈ సంస్థల్లో శ్రీరాములు నాయుడు, సుందరం, పి. నాగేశం, ఆర్. వి. నరసింహం, ఎ. కృష్ణారావు, రామచంద్రారెడ్డి, దామోదరం, రాజారెడ్డి, కుమారి లీలావతి, సుశీల, రేవతి, శ్యామంతకుమారి మొదలైన నటీ నటులు పనిచేశారు.

# కాళహస్తి

1946 నవ్యకళామండలి ఏర్పడి పనిచేస్తూవుంది. ఎ. సుబ్రహ్మణ్యం, ధర్మయ్య మొదలైన నటులు పనిచేస్తున్నారు.

# కుప్పం

1936 లో కంగుండి లలితకళా సమితి ఏర్పడి, తెలుగు నాటకాలను, తమిళ నాటకాలనూ ప్రదర్శిస్తూ వచ్చింది. ఈ సంస్థలో సంపంగి రామయ్య, యస్. నారాయణయ్య, కృష్ణమయ్య, వికటకవి సుబ్బయ్య మొదలైనవారు పనిచేశారు.

# మదనపల్లి

1915 లో బిసెంట్ థియొసాఫికల్ కాలేజి అసోసియేషన్, 1959 లో విజయ కళాసమితి, రిషివాలీ స్కూల్ నాట్యమండలి మొదలైన సంస్థలు పని చేస్తున్నాయి. నాటకాల్లో ఎ. రామాచారి మంచి నటుడుగా పేరు తెచ్చుకున్నారు.

# అనంతపురంజిల్లా

అనంతపురం :

అనంతపురంలో 1922 లో 12 వందలమంది సభ్యులతో జిల్లా నాన్ గెజిటెడ్ గవర్నమెంటు ఆఫీసర్సు నాటక సమాజం ఏర్పడింది. 1950 లో ఆదర్శ విజ్ఞాన సమితి, 1955 లో లలితకళా పరిషత్తు, చన్నకేశవ నాట్యమండలి, రాఘవ నాటక సమితి మొదలైన సమాజాలు ఏర్పడి పనిచేశాయి.

ఈ సమాజాలలో కె. సత్యరంగారావు, నాటక పాఠశాల ప్రిన్సిపాల్ రొద్దం హనుమంతరావు, వై. రామాంజనేయులు, జగన్నాధాచారి, కుమారి సావిత్రి, జి. వెంకటరెడ్డి, అడ్వొకేట్ చౌడన్నగౌడు, లక్ష్మీదేవి మొదలైన నటీ నటులు పని చేశారు.

# పెనుగొండ

1954 లో బోర్డు హైస్కూలు కల్చరల్ అసోసియేషనూ, ఫ్రెండ్సు డ్రమెటిక్ అసోసియేషనూ, అనే రెండు నాటక సమాజాలు పనిచేస్తున్నాయి. ఈ సమాజాల్లో జి. జానకిరామ్, టి. సుబ్రహ్మణ్యశాస్త్రి మొదలైన కళాకారులు పనిచేశారు.

# హిందూపురం

1958 లో లలితకళా సమితి, 1957 కర్ణాటక సంఘం అనే సంగీతశాఖ స్థాపించబడి పనిచేస్తున్నాయి. ఈ సంస్థల్లో పక్కా నరసింహారావు, గోపీనాథ రావు, మసూద్ ఆలీ, పాణ్యం చంద్రమౌళి మొదలైనవారు నటులుగా పనిచేశారు.

# గుంతకల్లు

1945 లో రైల్వే ఇన్‌స్టిట్యూట్ కళాసమితి ఏర్పడి ఆదర్శమైన కృషి చేస్తూవుంది. పైన్ ఆర్ట్సు అసోసియేషన్, నటరాజ నాట్యమండలి, వై. ఎన్.

యమ్. మండలి, రామానాట్యమండలి, తెలుగు భారత సమితి, శ్యామలా నాట్య మండలి, ప్రభ నాట్యమండలి మొదలైన కళాసంస్థలు కూడా పనిచేశాయి.

ఈ సంస్థల్లో కె.వి. గోవిందరాజులు, రామమూర్తి, అట్లూరి బలరామ్, జనార్దన, హొన్నూర్ సాహెబ్, మీనాక్షినాయుడు, శ్రీమతి నాగరత్నమ్మ మొదలైన కళాకారులు పనిచేశారు.

## కల్యాణదుర్గం

కల్యాణదుర్గం తాలూకా తూముకుంట గ్రామంలో 1890-1910 ప్రాంతాల్లో ఆ వూరి కరణం గుండూరావుగారు 'శ్రీ హరి హరేశ్వర సహాయ నాటక కంపెనీ' సాపించి అనంతపురం జిల్లా అంతటా నాటక ప్రదర్శనాల నిచ్చారు. ఆనాడు అనంతపురం జిల్లాలో ఈ కంపెనీకి గుండూరావు కంపెనీ అనే పేరు సార్థకమైంది. ఆయన కళాశీలి, మంచి నటుడు, శాస్త్రీయ సంగీతం తెలిసినవారు. ఆ సమాజ నాటకాలకు ఆయనే ప్రయోక్త.





# తెలంగాణా నాటకరంగం



తెలంగాణా నాటక కళ: భజన కోలాటాలు, చిరతల రామాయణం, చక్క భజనలు, సంగీత నాటక అకాడమి, నాట్యసంఘం, రవీంద్ర భారతి; హైదరాబాదు, సికిందరాబాదు, ఖమ్మం, వరంగల్, మెదక్, కరీంనగర్, అదిలాబాద్ మొదలైన జిల్లాల నాటక రంగాలు

# తెలంగాణా నాటకాలు

వనపర్తి :

త్రెలంగాణాలో రెండు మూడు శతాబ్దాలలో కొంతమంది సంస్కృతనాటక కవులు వెలిశారు. వీరిలో వనపర్తి సంస్థానాధీశుల్లో ఒకరైన శ్రీ అష్టభాషా బహిరీ గోపాలరావుగారు 17 వ శతాబ్దంలో 'రామ చంద్రోదయం' అనే సంస్కృత నాటకాన్ని తొలిగా రచించారు. సంస్కృతంలో ప్రౌఢ శైలిలో రచించడమే గాక సుబోధకంగా వ్యాఖ్యను కూడా రచించారు. అంతేగాక 'శృంగారమంజరీ భాణము' అనే ఒక దృశ్య ప్రబంధాన్ని కూడ రచించారు. ఈ రెండు గ్రంథాలూ ముద్రింపబడి నేటికీ వనపర్తి సంస్థాన గ్రంథాలయంలో భద్రపరచబడి వున్నాయి. ఈయనకు ఎనిమిది ప్రాకృత భాషలువచ్చు. అందువల్లనే అష్టభాషా బహిరీ గోపాలరావు గారనే పేరు వచ్చింది.



గత శతాబ్దంలోనూ, ఈ శతాబ్దంలోనూ ఆత్మకూరు, గద్వాల, వనపర్తి, సురపురము, గోపాలపేట మొదలైన సంస్థానాల్లో విద్వాంసులు, కవులు వెలిశారు. మహబూబ్ నగర్ జిల్లాలో అనేకమంది సంస్కృత విద్వాంసు లుండేవారు. వారిలో ప్రౌఢసరస్వతి అనబడే బుక్కపట్టణం శ్రీనివాసాచార్యులు, వనపర్తిలో శ్రీ హస దుర్గం కృష్ణమాచార్యులు మొదలైనవారు అనేక గ్రంథాలను, నాటకాలను రచించారు.

19 వ శతాబ్దంలో కీర్తిశేషులు మాదిరాజు విశ్వనాథరావుగారు కాళిదాసుని శాకుంతలాన్ని తెనిగించారు. విశ్వనాథ రావుగారు, కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు కలిసి, బిల్హణుని 'కర్ణసుందరి' అను నాటికను తెనిగించారు.

ఏమైనా ఆంధ్రదేశంలో నాటక కళాభివృద్ధి జరిగినంత తెలంగాణాలో జరుగ లేదు. ఈ శతాబ్దంలో మాత్రం కొన్ని ఉత్తమ నాటకాలు వెలువడ్డాయి. వాటిలో

కీ॥ శే॥ మాదిరాజు విశ్వనాధరావుగారి ఉచ్చల నాటకము. కీ॥ శే॥ సురవరం ప్రతాప రెడ్డిగారి 'భక్త తుకారాం' ఉత్తమశ్రేణికి చెందిన నాటకాలు. వీరిరువురి తరువాత భాగి నారాయణ మూర్తిగారు పరీక్ష చదువు. డాక్టరు యజ్ఞం అనే రెండు ఉత్తమ నాటకాలను రచించారు.

చిల్లర భావనారాయణగారు 'కళాభిమాని' 'దేశద్రోహం' 'ఉప్పెన''కామందు' 'పరిణామం' 'కొత్తమనిషి' 'పదవులు - పెదవులు' అనే నాటకాలను వ్రాశారు.

ఇంకా ఎ. ఆర్. కృష్ణగారు అరగంటలో అదృష్టం, ఎక్కడికి, కల్లోలం, దేశంకోసం చేసిననేరం, మొదలైన నాటకాలను వ్రాశారు.

తరువాత పేర్కొనదగినవారు సి. నారాయణరెడ్డిగారు, యువకవి. ఈయన గేయాలనేకాక 'ఋతువులరాణి' 'నవ్వనిపువ్వు' 'వలపురేడు' 'రామప్ప' 'అజంతా సుందరి' 'ఊర్మిళ' 'సుగాత్రి' మొదలైన నాటికలు రచించారు. వీరి నాటికలు ఎక్కువగా రేడియోలో ప్రసారం చేయబడి, విశేష ప్రజాభిమానాన్ని చూరగొన్నాయి.

గిడుతూరి సూర్యంగారు ఆహుతి, మానవుడు నాటికలను రచించారు.

పోతుకూచి సాంబశివరావుగారు ఇదీతంతు, ప్రతిధ్వనులు, వీడుసున్నలు, రెండు నాటికలు మొదలైన నాటికలను రచించారు. ఇంకా భట్టిప్రోలు జయరామారావు త్యాగయ్య, అవసానం, అప్పాజీ నాటికలనూ; వట్టికోట ఆళ్వారుస్వామి మేధావి నాటికనూ, కె. యల్. నరసింహారావు గెలుపునీదే, ఆదర్శలోకాలు అనే నాటికలనూ చక్కని నైపుణ్యంతో వ్రాశారు.

ఈనాడు అనేకమంది యువ రచయితలు బయలుదేరారు. వీరికి ఆంధ్ర సాహిత్య పరిషత్తు, సాధన సమితి, తెలంగాణా రచయితల సంఘం దోహదమిస్తూ వున్నాయి.

# హైదరాబాదు జిల్లా

హైదరాబాదు :

1906 ప్రాంతంలో హైదరాబాదులో ధర్మవరం గోపాలాచార్యులుగారు "కృష్ణవిలాసినీ' సభను స్థాపించి జయప్రదంగా కొంతకాలం నడిపారు.

# 11. ఆంధ్రప్రదేశ్ నాటకరంగం



1910 ప్రాంతంలో శ్రీమతి సరోజినీనాయుడు మేనల్లుడు ఇనుగంటి 'హైదరాబాదు అమెచ్యూర్స్' అనే నాటక సమాజాన్ని స్థాపించి కొన్ని నాటకాలను ప్రదర్శించారు. ఇనుగంటి ఆ రోజుల్లో ప్రసిద్ధ నటుడు.

పై సమాజంలోనుంచి చీలిపోయిన కొందరు నటులు 1915 లో ఫ్రెండ్స్ యూనియన్ స్థాపించి ఆంగ్లనాటకాలను ప్రదర్శించారు. ఈ సమాజ నటులలో ఎస్. నారాయణదాస్ మంచి నటుడు.

హైదరాబాదులో కళామండల్ అనే మహారాష్ట్ర సమాజమూ, దానితోపాటు మరికొన్ని సమాజాలూ పనిచేశాయి.

## ఆంధ్రప్రదేశ్ సంగీతనాటక అకాడమి:

దాదాపు 12 సంవత్సరాల క్రిందట ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ నాటి విద్యామంత్రి యస్. బి. పి. పట్టాభిరామారావుగారి పర్యవేక్షణలో ఆర్. బి. రామకృష్ణంరాజు అధ్యక్షతను హైదరాబాదులో ప్రభుత్వ స్థాయిలో స్థాపించబడింది. ఈ సంస్థలో ఆంధ్రదేశంలోనున్న సంగీత, నృత్య, నాటక రంగాలలో ప్రసిద్ధులైన అనేకమంది ప్రముఖులు దాదాపు 75 మంది కౌన్సిల్ సభ్యులుగా వున్నారు.

అకాడమీ స్థాపించిన తరువాత కూచిపూడి నాట్య సదస్సు, నాటక సదస్సు, సంగీత సదస్సు, హరి కథా గాన సదస్సు మొదలైన వుత్సవాలు జరిగాయి.



ప్రతి సంవత్సరమూ ఆంధ్రప్రదేశ్ సంగీత సభల సమాఖ్య నిర్వహణలో సంగీతోత్సవాలు.

ఆంధ్రనాటక కళాపరిషత్తు అధ్వర్యంలో నాటకోత్సవాలు.

ఆంధ్రప్రదేశ్ నృత్యకళా పరిషత్ నిర్వహణలో నృత్యోత్సవాలు.

కథా గాన కళా పరిషత్ నిర్వహణలో హరికథోత్సవాలు జరుపబడుతూ వున్నాయి.

అకాడమీ ఆధ్వర్యాన ప్రతి నెలా 'నాట్యకళ' పత్రిక వెలువడుతూ వుంది. సంగీత, నృత్య, నాటక సమస్యలమీద వ్యాసాలు ప్రచురించబడుతూ వున్నాయి. ఈ పత్రికకు ప్రధాన

సంపాదకులు పసల సూర్యచంద్రరావు. రాళ్ళపల్లి ఆనంతకృష్ణశర్మ, పోతుకూచి సాంబశివరావు, డా. పి. యస్. ఆర్. అప్పారావు, ఎ. ఆర్. కృష్ణ, శ్రీనివాస చక్రవర్తి మొదలైనవారు సంపాదకవర్గ సభ్యులుగా వ్యవహరిస్తున్నారు.

ఈ అకాడమీ వృద్ధాప్యంలోవున్న కళాకారులకు ప్రతి నెలా వృద్ధాప్యపు వేతనాన్ని 40 మందికి ఇస్తూ వుంది.

సంగీత, నృత్య, నాటక విషయాలకు సంబంధించిన కొన్ని గ్రంథాలను ప్రచురించింది.

ఆంధ్రదేశంలో అనేక అనుబంధ నాటక సంస్థలకు గ్రాంటులనిచ్చి పోషిస్తూ వుంది.

విజయవాడ, అనంతపురం పట్టణాల్లో అకాడమీ తరఫున నాట్య విద్యాలయాలు నడపబడుతున్నాయి.

రాష్ట్రేతర ప్రాంతాలకు ఆంధ్రదేశంనుంచి సాంస్కృతిక బృందాలను పంపిస్తూ వుంది.

ఈనాడు అకాడమీ కార్యక్రమాలకు రథసారథిగా పసల సూర్యచంద్రరావు గారు వ్యవహరిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్
నాట్యసంఘం :

ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘం 1954 లో యం. చెన్నారెడ్డి, యం. ఆనందం, ఏ. ఆర్. కృష్ణ మొదలైన కళాకారుల అధ్వర్యంలో ఏర్పడి పనిచేస్తూ వుంది.

యునెస్కో ఇంటర్‌నేషనల్ థియేటరు ఇన్‌స్టిట్యూటుకు అనుబంధ సంస్థగా భారతీయ నాట్య సంఘం పనిచేస్తూ వుంది. భారతీయ నాట్యసంఘానికి అనుబంధ సంస్థగా ఆంధ్రప్రదేశ్ నాట్యసంఘం పనిచేస్తూ వుంది.

ఆంధ్రప్రదేశ్ నాట్యసంఘం రాష్ట్రంలోని 70 నాటక సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తూ వుంది.

హైదరాబాదు రవీంద్ర భారతిలో ఒక నాట్య విద్యాలయాన్ని నడుపుతూ వుంది.

ప్రతి సంవత్సరమూ నాటకోత్సవాలను జరిపి ఔత్సాహిక నటులకు ఉత్సాహాన్నిస్తోంది.

నెలవారీ కార్యక్రమాలను, రిపర్టరీథియేటర్, నాట్యమిత్ర, స్పీచ్ సర్కిల్, నటీనటుల రౌండుటేబిల్, నాటక రచయితల రౌండు టేబిల్, థియేటర్ సర్వీసు మొదలైన నూతన పథకాలతో నాట్యసంఘం పనిచేస్తూ వుంది. జంటనగరాల్లో జరిగే అనేక సాంస్కృతిక కార్యక్రమాల్లో నాట్యసంఘం కార్యకర్తలు ప్రముఖ బాధ్యతల్ని వహిస్తున్నారు.

రాష్ట్రేతరప్రాంతాలనుండి వచ్చే సాంస్కృతిక బృందాలను ఆహ్వానించి ప్రదర్శనాల నిప్పించటంలో కూడా నాట్యసంఘం బాధ్యత వహిస్తూ వుంది.



నాట్యసంఘంలో శ్రీ సీలం సిద్ధారెడ్డి, డా. పి. యస్.ఆర్. అప్పారావు, జి. కృష్ణంరాజు, ఎ.ఆర్. కృష్ణ, పోతుకూచి. గోవిందుచౌదరి, వి. వి. మాణిక్యాలరావు, వాసిరెడ్డి సీతాదేవి మొదలైన ప్రముఖులు నాట్యసంఘ కార్యకర్తలుగా కృషిచేస్తున్నారు.

రవీంద్రభారతి :

ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాదులో రవీంద్రభారతి ఒక అలంకారం. జంటనగరాల కళాకారులకు అది ఒక కళా కేంద్రం. అఖిలాంధ్ర ప్రజలకు గర్వకారణం రవీంద్ర భారతి. ఈనాడు రవీంద్ర భారతిలో ప్రతిరోజూ ఏదో ఒక సాంస్కృతిక కార్యక్రమం జరుగుతూ వుంది. విదేశాలనుండి, ఇతర రాష్ట్రాలనుండి, ఏ కళాకారుల బృందం వచ్చినా వారి ప్రదర్శనాలన్నీ రవీంద్ర భారతిలోనే జరుగుతున్నాయి.

నగరం కూడలిలో ఎత్తయిన ప్రదేశంలో సుందరభవనంగా రవీంద్రభారతి వెలుగొందుతూ వుంది. ఇది జంటనగరాల కళాకారుల నెందరినో వుత్సాహపర్చి వుత్తేజపర్చింది.

కేవలం నాటక ప్రదర్శనాలేకాక, అనేక సభలు, సన్మానాలు, గోష్టులు జరుగుతూ వున్నాయి. రవీంద్రభారతి ఆవరణలోనే ఆంధ్రప్రదేశ్ నాట్యసంఘ కార్యాలయమూ, నాట్య విద్యాలయమూ పనిచేస్తున్నాయి. సంగీతనాటక అకాడమి, సాహిత్య అకాడమి, లలితకళా అకాడమి కార్యాలయాలు కూడ కళాభవన్ పేరుతో పనిచేస్తున్నాయి. రవీంద్రభారతి మేనేజరుగా ప్రసిద్ధనటుడు పాతూరి శ్రీరామశాస్త్రి పనిచేస్తున్నారు.

ఇతర నాటక సమాజాలు :

1932లో కళామండలి, 1949లో దుర్గాకళా నాట్యమండలి, ఆదర్శ నాట్యకళా పరిషత్తు, 1953లో సన్మిత్ర నాట్యమండలి, లలితకళానికేతన్, 1957లో ఇండియన్ నేషనల్ థియేటరు, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమి, ఫైన్ ఆర్ట్సు అకాడమి, విద్యానగర్ కల్చరల్ అసోసియేషన్, సెక్రటేరియట్ కల్చరల్ అసోసియేషన్, శ్రీ కళానికేతన్, అంజమాన్ ఉరుదు థియేటర్, సాధనసంస్థ, లలితకళా సమితి, రోట్రాన్స్‌పోర్టు రిక్రియేషన్‌క్లబ్, బెంగాలిసమితి, ఇండియన్ ఆర్ట్సు సొసైటీ, ఇన్‌కంటాక్సు రిక్రియేషన్‌క్లబ్, కాళికల్చరల్ అసోసియేషన్, కళాసమితి, కళానికేతన్, అజంతా ఆర్ట్సుథియేటర్, ఆనంద లలితకళాసంస్థ, నాట్యకళా నికేతన్, హైదరాబాద్ హిందీ ప్రచారసంస్థ, హైదరాబాద్ కల్చరల్ సొసైటీ, విద్యార్థి కళాసమితి, హిందుస్తానీ కల్చరల్ సొసైటీ, వై. యం. సి. ఎ. క్లబ్, హైదరాబాదు టీచర్స్ అసోసియేషన్, కైలాసమిత్రమేళా, నాటకమండలి, సి. పి. యస్. టీచర్సు అసోసియేషన్ మొదలైన నాటక సమాజాలు ఏర్పడి పనిచేశాయి.

నటీ నటులు :

ఈ సమాజాలలో టి. టి. నరసింహాచార్య, ఎ. ఆర్. కృష్ణ, యస్. ఆర్. మంత్రి, పన్నూరి రామారావు, టి. కృష్ణమోహన్‌రావు, యం. వెంకటరావు, రామచంద్రమూర్తి, వి. వి. రాఘవాచార్య, రామబ్రహ్మమ్, డాక్టర్ రామయ్య, వి. పూర్ణచంద్రరావు, టి. యస్. శేషాచారి, బి. ఆనందమోహన్, జె. డి. నరసింహారావు, శ్రీనివాసనాయుడు, యస్. గోపాలమూర్తి, వి. ఆనందమోహన్, రవీంద్రనాథ టాగూరు, వక్కలంక కామరాజు, కె. వీర్రాజు, కాంతాపతక్, యన్. జి. మల్వాకర్, వసంతగాడ్సే, శ్రీమతి లీలాసుందరయ్య, కుమారి వాణి, శ్రీమతి తారాబాయి, యం. విజయలక్ష్మి, యం. జి. మిరాల్, శ్రీమతి రత్నప్రసాద్, వి. యస్. రమాదేవి, శ్రీమతి చిన్నమ్మ, శ్రీ ప్రభావతిదేవి, పి. యస్. రామారావు, సి. ఆర్. కె. చారి, యం. లక్ష్మీనారాయణ, సురేందర్, పి. పి. నాయుడు, కుమారి వనజ, యస్. శ్రీనివాసరావు, యం. అప్పారావు, యం. శేషగిరిరావు, పి. కొండరాజ్, కోకా రాఘవరావు, సీతారామస్వామి, భాగి నారాయణమూర్తి, ఎ.కృష్ణారావు, కె. వి. సుబ్బారావు, కాంతకుమార్, పి. యన్. వెంకటేశ్వరరావు, కుమారి కె. లక్ష్మి, కుమారి విజయలక్ష్మి, కుమారి పద్మ, శ్రీ రూప్‌లాల్, రుక్మిణి, లతా

సతీ, ఎ. జె. సోమసుందరం, యన్. నారాయణదాస్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర రావు, పి. కనకమ్మ, పి. లక్ష్మీపతి, న్యాపతి రాఘవరావు, న్యాపతి కామేశ్వరమ్మ, గిడుగు సీతాపతి, గిడుగు వెంకటరామమూర్తి మొదలైన నటీ నటులు పనిచేశారు.

ఆర్. యస్. కోతేకార్, బాబురావు, రాజారామ్, ఫాపట్కర్ మొదలైన వారు మేకప్ బాధ్యలోనూ.

జి. హెచ్. ఖాఫ్రి, ములాజ్‌కర్, యస్. యస్. రామమూర్తి, జె. యల్. విలియమ్స్, ఏలా సుందరయ్య, యస్. గోపాలమూర్తి మొదలైనవారు స్టేజి క్రాఫ్ట్‌లోనూ పనిచేస్తున్నారు.

యుషగాన వగాయి, చిరతల రామాయణం సమూజాలు, కోలాట బృందాలు, బుర్రగొల్లల వగాయి పనిచేశాయి.

# సికింద్రాబాదు

సికింద్రాబాదులో సి. టి. మోహనరంగంపిళ్ళెగారు 1913 లో వాణీ విలాస సభను స్థాపించారు. రాజా నాగన్న దేవిడీలో నాటకాలను ప్రదర్శించే వారు. మోహనరంగంపిళ్ళె నాయక పాత్రలు ధరిస్తే, కె. శేషయ్యగారు నాయక పాత్రలు ధరించేవారు. విజయవాడ మైలవరం కంపెనీలో ప్రఖ్యాత హార్మోనిస్టుగా పేరుపొందిన ఎ. టి. రామానుజులుగారు ప్రధమంలో ఈ సమాజంలో పనిచేశారు. ఈ సమాజం సర్కారు ప్రాంత ముఖ్య పట్టణాలలో ప్రదర్శనాల నిచ్చింది. సరస్వతీ సభ అనే ఒక సమాజమూ, 1919 లో 'శ్రీకృష్ణ మనోల్లాసినీ సభ' అనే నాటక సమాజము కూడా ఏర్పడి కొంతకాలం పనిచేశాయి. పై నాటక సమాజాల్లో అనేకమంది కళాకారులు పాల్గొన్నారు. ఈ సమాజంలో పి. ఎమ్. వేణుగోపాలస్వామిగారు ప్రసిద్ధ నటుడుగాను,



దర్శకుడుగాను పేరు పొందారు. ఈ సమాజాలకు శ్రీ విశ్వనాధశాస్త్రిగారు నాట కాలను వ్రాసి ఇచ్చారు.

1932 ప్రాంతంలో సురవరం ప్రతాపరెడ్డిగారి భక్త తుకారాం నాటకాన్ని సికిందరాబాదు రైల్వే ఉద్యోగులైన బుచ్చయ్యగారు, పలువురితోకలిసి 'జగదీశ నాట్యమండలిని' స్థాపించి ఒక్క తెలంగాణాలోనే కాక విజయవాడ, గుంటూరు, మద్రాసు మొదలైన సర్కారు ప్రాంతంలో ప్రదర్శించి మంచి పేరు సంపాదించారు. తుకారాం పాత్రధారణలో బుచ్చయ్యగారు గణనీయమైన పేరు తెచ్చుకున్నారు.

1930 ప్రాంతంలో 'ఆంధ్రమిత్రమండలి' నాటక సమాజం అడిగ్‌మెట్‌లో స్థాపించబడి కొంతకాలం పనిచేసింది.

1949 లో నాట్యకళాసమితి, 1951 లో నవకళాకేంద్రం, 1952లో విస్తృతి నాట్యమండలి, 1953 లో విజయకళాసమితి, 1956 లో రవీంద్ర కళామందిర్, 1957 లో కాళిదాస కళానిలయం, నాటక సమితి, సౌత్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్, అరుణోదయ నాట్యమండలి, చంద్రకళామందిర్, కళోదయ సమితి, సౌత్ సెంట్రల్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ కల్చరల్ అసోసియేషన్, సోషల్ వెల్‌ఫేర్ సెంటర్, హిందు యువజన సంఘం, అభ్యుదయ ఆర్ట్స్, విస్తృత కళాసమితి, జయహింద్ నాట్యమండలి మొదలైన అనేక సమాజాలు ఏర్పడి పనిచేశాయి.

### నటీ నటులు :

ఈ సమాజాలలో డి. రాజేశ్వరరావు, యం. వి. చలపతిరావు, సి. చలపతి రావు, శ్రీరామమూర్తి, కందా మోహన్, వి. ఆనందమోహన్, కుంచు, రమేష్, కళా సుబ్బారావు, సి. అంజనేయులు, వై.పి. విఠల్‌రావు, పోతుకూచి సాంబశివరావు, యం. రంగారావు, ఐ. సత్యనారాయణ, ఎ.కె. ఛాయాదేవి, యం.యల్. పతి, బి. భానూప్రకాష్, యన్. యస్. కృష్ణ, జి. వెంకటరావు, వి. బి. నారాయణ, మాస్టర్ రాము, శ్రీమతి కస్తూరి, సీతాకుమారి, జె. ఎస్ కృష్ణశాస్త్రి, ఎన్. రాధాకృష్ణ, మహా దేవ్, వై. పి. విఠల్‌రావు, మురళీధర్. టి. నరసింహారావు, ఆనందరావు, ఆర్. హనుమంతరావు, వి. నాగేశ్వరరావు, మురళీకృష్ణ, కె. సూర్యనారాయణ, సులోచనా రాణి, సి. హెచ్. నరసింహం, హరిమూర్తి, డి. కోటయ్య, జి.వి.ఆర్. ప్రసాద్, ఆంజనేయశర్మ, యన్. పాండురంగ విఠల్, పి. శేషుబాబు, కె. సాంబశివరావు, యం. మదనమోహన్, యం. రామమోహన్ టి. నాగరాజు, శ్రీమతి పార్వతి,

యస్. కె. ఆంజనేయులు, కోట సత్యనారాయణమూర్తి, జి. సత్యనారాయణ, బాబురావు, యన్.సి.యస్. వేణుగోపాల్, బి. కృష్ణరాజు మొదలైన కళాకారులు పని చేస్తున్నారు.

బక్షీ శ్రీరాం. టి. శివరామకృష్ణ మొదలైనవారు స్టేజి క్రాఫ్ట్‌లో కృషి చేస్తున్నారు.

## హయత్ నగర్

1948 లో సరస్వతి నాటక కళామండలి, 1951 లో హనుమాన్ భజన సమాజం ఏర్పడి పని జేస్తున్నాయి. చిరతల రామాయణం, జడకోపు కోలాట సమాజాలు కూడ పని చేస్తున్నాయి. ఈ సమాజంలో పుట్టా సత్తెయ్య, యస్. వెంకటాద్రి, హనుమంతయ్య, రత్నమాచారి, వెంకోబారావు, ఎ. రాజయ్య, ఆకుల వీరయ్య, జనగామ శంకరప్ప, సి. తిరుపతి మొదలైన



కళాకారులు పనిచేశారు.

## ఇబ్రహీం పట్నం

1923 లో కాపువ్రష్ణ నాట్యమండలి, 1954 లో సీతారామాంజనేయ సమాజం, 1954 లో శంకరనారాయణ భజనమండలి, 1957 లో ఓంకార భజన సమాజం. నాటక సమితి ఏర్పడి పనిచేశాయి.

చుట్టుప్రక్కల గ్రామాలైన మహాసుకం, నెత్నూరు గ్రామాల్లో కూడా నాటక సమాజాలున్నాయి.

నెత్నూర్ రాచలూరు లింగాపూరు మొదలైన గ్రామాల్లో యక్షగాన భజన సమాజాలు పనిచేశాయి.

ఈ సమాజాల్లో బి. పంగారెడ్డి, ఘటం సత్యనారాయణ, మల్లారెడ్డి, బుగ్గా రామదాసు, చంద్రశేఖరశర్మ, మురళీ మొదలైన కళాకారులు పనిచేశారు.

## మేడిచల్

1952 లో బాలశంకర భజన సమాజం, 1955 లో యతిరాజ నాట్యమండలి పనిచేశాయి.

రాంపల్లి అలియాబాద్ తురకపల్లి మరపల్లి దుండిగాల్ మొదలైన గ్రామాల్లో బుట్టకథ దళాలు పనిచేశాయి.

రాంపల్లి మేడిచల్ పుమూర్ యంజాల్ అలియాబాద్ యాదరమ్ యద్గర పల్లె కీసర కొత్తైగూడ వడ్డిమట్టి దుండిగాల్ మొదలైన గ్రామాల్లో భజన సమాజాలు విరివిరిగా పనిచేశాయి.

ఈ సమాజాలలో హకీం నారాయణ, వై. యస్. గంగాధర్, ప్రభాకరరెడ్డి, వీరారెడ్డి ఆదిగాగల కళాకారులు పనిచేశారు.

## షాబాద్

1957 లో యువజన నాట్యకళామండలి ఏర్పడి పనిచేయడమేకాక బుట్టి కథ దళాలు భజన సమాజాలు కూడ విరివిగా పనిచేశాయి,

## వికారాబాద్

1952 లో వెంకటేశ్వర నాట్యమండలి ఏర్పడి పనిచేస్తూ వుంది. చుట్టు ప్రక్కల గ్రామాలైన మొర్మగపల్లి పట్లూరు రాంపూర్ పెక్కులపల్లి కోటపల్లి మారపల్లి గ్రామాల్లో కూడా నాటక సమాజాలు నాటక ప్రదర్శనాల నిచ్చాయి.

బూరుగపల్లి దుర్గనచెరువు బన్వారమ్ అమరాది కొట్లపూర్ కోమశెట్టిపల్లి బిలీకాల్ బుద్రా రాంపల్లి గ్రామాల్లో భజన కోలాట దళాలు విరివిగా పనిచేశాయి.



సిరిపూర్‌లో హరికథలు చెప్పేవారున్నారు. మొయిన్ పేట పుట్లూరు గ్రామాల్లో బుర్రకథ దళాలు పనిచేశాయి.

## తాండూరు

1956 లో కల్చరల్ అసోసియేషన్ ఏర్పడి పనిచేస్తూంది. పరిసర గ్రామాలైన చెంగోల్ కొట్లిస్‌పల్లి మిట్టబాసపల్లి బషీరాబాద్ మంతమొగొండ యల్లాల పెద్దిమల గోవిందరావు పేటల్లో కూడా నాటక సమాజాలు నడిచాయి.

చెంగోల్ గోనెల్లి మిట్టబాసపల్లి కోటబాసపల్లి ఆలంపూర్ అగ్నూర్ గోవిందరావుపేట మంబాపూర్ పెద్దిమాల్ కందనెల్లి బొప్పారమ్ మొదలైన గ్రామాల్లో చిరతల భజన, కోలాట దళాలు పనిచేశాయి.

పెడమాల్, గోవిందరావుపేట గ్రామాల్లో బుర్రకథ దళాలూ.

చెంగోల్, అల్లిపూరు, అగ్నూర్, కొత్త బాసపల్లి, కందనెర్లి, పెడమాల్, బొప్పారమ్ గ్రామాల్లో భాగవత దళాలూ.

శంకరరెడ్డిపల్లి, మంతనగౌడ, తట్టిపల్లి మొదలైన గ్రామాల్లో లంబాడి నృత్య దళాలూ పనిచేశాయి.

# వరంగల్లు జిల్లా

వరంగల్లులో దాదాపు 20 నాటకసమాజాలవరకూ పనిచేశాయి. వాటిలో కాకతీయ కళాసమితి, కళింగ కళాసమితి మొదలైన సంస్థలు ప్రాముఖ్యం వహించాయి.



సంగీత నృత్య నాటక సమాజాలలో ఈ క్రిందివారు పనిచేస్తూ వున్నారు: మాడభూషి నరసింహాచార్య, పాలెం రఘుపతి, త్యాగరాజు, రంగనాథం, జయరామచౌదరి, నేరెళ్ళ వేణు మాధవ్ (మోనో యాక్టరు), వి. నరసింహమూర్తి, వీరభద్రయ్య మొదలైనవారు.

# జనగాం

ఇక్కడ 1953 లో లలితకళాసభ ఏర్పడింది. సంగీత, నృత్య, నాటక సమాజాలు అనేకం పనిచేస్తున్నాయి. ఈ నాటక సమాజాలలో యన్. జయసింగు, లక్ష్మీనరసింహశర్మ, పరమేశ్వరసింగు, సంజీవసింగు, యల్. యన్. శర్మ, పి. లక్ష్మయ్య, రామమూర్తి, యం. యస్. మన్యం, డి. యన్. రావు, యం. పుల్లయ్య మొదలైన కళాకారులు పనిచేశారు.

# కాజీపేట

సంగీత, నృత్య, నాటక కళలకు ప్రాతినిధ్యం ఇస్తూ, 1958 లో ఫైన్‌ఆర్ట్స్ అసోసియేషన్ ఏర్పడింది. డాక్టర్ శ్రీనివాస్, యం. యన్. రావు, కె. యస్. ర్. మూర్తి, కొండరాజు, ఎ. ఆర్. మోహన్ మొదలైన నటులు పనిచేశారు.

# ఖమ్మం జిల్లా

ఖమ్మం పట్టణంలో ఆంధ్రబాలికా నాట్యమండలి పనిచేస్తూవుంది. కె. వి. యల్. నరసింహారావు, యం. బి. వి. ఐ. ఆర్. శర్మ మొదలైన కళాకారులు పని చేస్తున్నారు.

## దోర్నకల్లు

జితేంద్ర మెమోరియల్ క్లబ్ కే. కృష్ణమూర్తి, పి. జార్జిగార్ల ఆధ్వర్యంలో నడుస్తూ వుంది. ఇల్లెందులో 1926 నుండి త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవ సభ నడుస్తూ వుంది. ఈ సంస్థలో పర్చా రంగారావు, టి. సుబ్బారావు మొదలైనవారు పని చేశారు.



## కొత్తగూడెం

కొత్తగూడెంలో 1944 నుండి పి. యి. ఆర్. క్లబ్ ఏర్పడి పని చేస్తూవుంది. ఈక్లబ్‌కి సింగరేణి కాలరీస్ జనరల్ మేనేజర్ అధ్యక్షులుగాను, వి. కె. ఆనందరావు కార్యవర్శిగాను వుండి నడుపుతూ వున్నారు.

ఇంకా ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్, ఫ్రెండ్స్ అసోసియేషన్, సెయింట్ మేరీస్ డ్రమెటిక్ అసోసియేషన్, రామకృష్ణస్కూలు డ్రమెటిక్ అసోసియేషన్ మొదలైన సంస్థలు కూడా నడిచాయి.

# మహబూబ్ నగర్ జిల్లా

మహబూబ్ నగర్‌లో సంగీతకళాకులు తప్ప, నాటక సమాజాలు లున్నట్లు లేదు. అలంపురంలో హైస్కూల్లు డ్రమెటిక్ అసోసియేషన్ మాత్రం ఒకటి పని చేస్తూంది. చిత్రపు వెంకటచలం, మల్లికార్జునశర్మ, రామసుబ్బయ్య, పి. గోపాల రావు, జగన్నాథం, ఇబ్రహీం, గడియారం రామకృష్ణశర్మ మొదలైనవారలు పని చేశారు.

# గద్వాల

ఇక్కడ సంగీత, నృత్య, నాటక సమాజాలు అనేకం పనిచేశాయి. యువ జన నాట్యమండలి పేర ఒక నాటక సమాజం నడుస్తూవుంది. ఏలాకుమారి, అన సూయాదేవి, జి నాగప్ప, కె. శ్రీనివాసరావు, డి. రంగనాధరావు, యం. వి. గోపాలాచార్యులు, వై. మురళీధర్, కె. యస్. రావు, జి. రామదాసు, కె. యన్. శర్మ, బి. కృష్ణమూర్తి, జి. ప్రహ్లాదరావు, పట్ల నారాయణ మొదలైనవారు కళా కారులుగా పని చేశారు.

# వుప్పేరు

ఇది ఒక చిన్న గ్రామం. గద్వాలకు దగ్గరలో వుంది. ఇక్కడ బయలు నాటకాలకు ప్రసిద్ధి. కోలాటం సమాజాలు కూడా వున్నాయి. పురాణగాథలకు



సంబంధించిన లవకుశ, సత్యకీర్తి కథ, రామాంజనేయ యుద్ధం, ప్రహ్లాద మొదలైనవి ప్రదర్శించారు.

బయలు నాటకాలు నెక్కటపల్లి, గట్టూరు మొదలైన గ్రామాల్లో కూడా ప్రసిద్ధంగా ప్రదర్శిస్తున్నారు. ఇంకా ఇక్కడ కట్టెలకోలాటం, చక్కభజన సమాజాలుకూడా వున్నాయి. పెద బసవయ్య, ఆయన శిష్యుడు వడ్ల వెంకట రామయ్య పేరుపొందిన కళాకారులు.

## వనపర్తి

వనపర్తిలో నాటక సమాజాలు లేకపోయినా, సంగీతశాఖ పనిచేస్తూవుంది. దగ్గరలోవున్న గోపాలపేటలో తోలుబొమ్మలాటలవారు రున్నారు. వీనం శేషాచార్యులు, పాపయ్య. టి. గోపాల్, శ్రీమతి రాధమ్మ, వెంకటరామారావు మొదలైన కళాకారులు పనిచేశారు.

## జడచర్ల

జడచర్లలో బాలభరత సంగీత పాఠశాల నడుస్తూవుంది. కలవకుర్తిలో భజన సమాజాలు పనిచేస్తున్నాయి. అచ్చంపేటలోనూ, అమరబాద్‌లోనూ చెంచు నృత్యదళాలు పనిచేశాయి.

## కరీంనగర్ జిల్లా

కరీంనగర్‌లో 1938 లో వెంకటేశ్వర నాట్యకళాసమితి, 1956 లో శారదా ఆర్ట్సుక్లబ్ మొదలైన నాటకసమాజాలేగాక సుందరగిరి, దుడినపల్లి, మొగిలిపాలెం, గంగిపల్లి, రాంమడుగు, గుండి, కొటాల, రేకొండ, గోపాలరావుపల్లి, వెదురుగట్ల, చొప్పచండి మొదలైన చుట్టుప్రక్కల గ్రామాల్లో కూడా నాటక సమాజాలు నడుస్తూ వున్నాయి. నాటకసమాజాలేగాక, ముస్తురాపూరు, జంగిర్ల, మొగిలిపాలెం, గంగిపల్లి, మానకొండూరు, గోపాలరావుపల్లి, వెదురుగట్ల మొదలైనచోట్ల యక్షగాన దళాలు, తోలు బొమ్మలాటలు విరివిగా జరుగుతున్నాయి.



పైన వివరించిన ఆయా సంస్థల్లో వెంకటాచారి, యల్లయ్య, భద్రయ్య, లక్ష్మయ్య, వెంకటి, సీతారామ్, శ్రీనివాసాచారి, రాజశేఖర్, నారాయణశర్మ, మురళీధరాచార్య, సత్యనారాయణాచార్య, వెంకోబారావు మొదలైన కళాకారులు పనిచేశారు.

## హుజూరాబాద్

హుజూరాబాద్‌కు దగ్గరలో నున్న తాటికంటి మొదలైనచోట్ల వీధినాటక

దళాలు పనిచేస్తున్నాయి. హుజూరాబాద్‌కు ఆరుమైళ్ళదూరంలో వున్న మాణిక్యపూర్‌లో విప్రవినోదులు ముప్పది కుటుంబాలవారున్నారు. పదహేనుమైళ్ళ దూరంలో వున్న వల్లభాపురంలో సాధనాశూరులు, పద్మసాలి కులానికి చెందినవారున్నారు. ఈ తాలూకాలో ప్రతిగ్రామంలోనూ చిరతలరామాయణం కళారూపం బహుళ ప్రచారంలో వుంది.

వల్లభాపురం. తాటికంటి, గట్లపల్లి, కమలాపూర్ మొదలైనచోట్ల నాటక సమాజాలు నడుస్తున్నాయి. పైన వివరించిన ఆయా సంస్థల్లో బాలలింగం, సత్యనారాయణ, లక్ష్మణస్వామి, వెంకటశాస్త్రి, విఠల్ మొదలైన కళాకారులు పనిచేశారు.

# జగిత్యాల్

1928 లో లక్ష్మీనరసింహ నాట్యమండలి, 1956 లలితకళాసమితి మొదలైనవి ఏర్పడి పనిచేస్తున్నాయి. భీమారం, చిల్లకోడూరు, కొండలపల్లి, రాయికాల్, బాల్‌గడ, మల్యాల్, కోడూరుపల్లి మొదలైన గ్రామాల్లో యక్షగానదళాలు పనిచేస్తున్నాయి. బుగ్గారం గ్రామంలో వీధి భాగవతం దళం వుంది. ఇక్కడకూడా ప్రతిగ్రామంలోనూ చిరతలరామాయణం, కోలాటదళాలు విరివిగా వున్నాయి.



పైన సుదహరించిన సంస్థల్లో వెంకటరెడ్డి, దావూరి వెంకటాచారి, శంకరయ్య, మనోహరాచార్య, లక్ష్మీకాంతశాస్త్రి, పేట కాంతయ్య, చంద్రమౌళి శాస్త్రి, అనంతయ్య మొదలైన కళాకారులు పనిచేశాయి.

# మంతెన

ఇక్కడకూడా చిరతలరామాయణం భజన సమాజాలు విరివిగా వున్నాయి. మంతెనకు దగ్గరలోనున్న మహాదేవపూర్‌లో బంజారాదళాలు పనిచేశాయి. ఇవేగాక 1955 లో సంగీత కళాసమితి, 1958 లో యూత్‌క్లబ్, 1958 లో బాలవిశ్వనాథ నాట్యమండలి మొదలైన నాటక సమాజాలు పనిచేశాయి.

రామానందం, లక్ష్మీనారాయణ, డి. రంగారావు, పి. జి. వి. నాయుడు, ఏ. బాలరాజు, అయ్యవారు రామయ్య, సింహాద్రి, యన్. లక్ష్మీనారాయణ, డి. ఆర్. రంగారావు మొదలైన కళాకారులు పనిచేశారు.

## మెటపల్లి

ఈ తాలూకాలో అనేక గ్రామాల్లో భాగవత దళాలు పనిచేస్తున్నాయి. 1948 లో మార్కండేయ నాట్యమండలి, బాలానందసంఘం మొదలైన నాటక



దళాలేగాక, ఇటికాల్, సత్తారం, తక్కెడపల్లి, శ్రీకొండ, శ్రీపురం, మానపల్లె, వెల్లుళ్ళ, మన్నెగూడెం మొదలైన గ్రామాల్లో భాగవత దళాలు పనిచేశాయి. కోరట్ల, గూడూరు, లింగపూర్, దంపేట మొదలైన గ్రామాల్లో నాటక సమాజాలు నడిచాయి. సుందరాచారి, లింబగిరి, వాసుదేవ మొదలైన కళాకారులు పై నాటక సమాజాలలో పనిచేశారు.

## శిరిశిల్ల

1955 లో వెంకటేశ్వర నాట్యమండలి స్థాపించబడింది. మల్లారం గ్రామంలో భాగవతదళం, వేములవాడ, మల్లారం, నూకలమట్టి మొదలైనచోట్ల నాటక సమాజాలు నడుస్తున్నాయి. బూరుగుపల్లి, హనుమాజిపేట, నూకలమట్టి గ్రామాల్లో యక్షగానదళాలు పనిచేస్తున్నాయి. సంగీత నృత్య నాటకశాఖల్లో యన్. వెంకటాచారి, లక్ష్మయ్య, వెంకట నర్సయ్య మొదలైన కళాకారులు పనిచేశారు.

## సుల్తానాబాదు

సుల్తానాబాదుకు దగ్గరలో కూచిపూడి అనే గ్రామముంది. ఇక్కడ కూడ కూచిపూడి నృత్యం మాదిరి నృత్యముంది. ఇక్కడ 1944 లో నాటక కళాసమితి,

1950 లో భారత నాట్యమండలి ఏర్పడి పనిచేశాయి. ఈ సంస్థల్లో వి. బుచ్చయ్య, శివరాగం, మల్లయ్య, పి. యల్. రామారావు మొదలైన కళాకారులు పనిచేశారు.

కరీంనగర్ జిల్లా ధర్మపురిలో శ్రీ కాసర్ల వేంకటరామయ్యగారు లక్ష్మీ నరసింహ నాట్యమండలిని 1920 ప్రాంతంలో స్థాపించి వివిధపరికరాలతో కూడిన చక్కని హంగులతో అనేక నాటకాలను ప్రదర్శించారు. లక్ష్మీనరసింహశాస్త్రిగారు 1955 లో హైదరాబాదులో జరిగిన ఆంధ్రనాటక కళాపరిషత్తులో సన్మానింప బడ్డారు. శ్రీ శాస్త్రిగారు నారదపాత్రధారణలో ప్రసిద్ధులు.

## అదిలాబాద్ జిల్లా



అదిలాబాద్‌లో 1957 లో కళావాజ్మయ వికాసమండలి, 1950 లో ఆదర్శవికాస మండలి, 1948లో సరస్వతి నాట్యమండలి మొదలైన సమాజాలు సంగీత, నృత్య, నాటకాఖల్లో పని చేస్తున్నాయి. ఇవిగాక యప్పలగూడ, చాందా, కప్పరాళ్ళ మొదలైన ప్రదేశాల్లో యక్ష గానాలను ప్రదర్శించే సమాజాలు పనిచేస్తున్నాయి. అదిలాబాద్ తాలూకా సంకిడి గ్రామంలో ఒక డప్పుల నృత్యబృందం పని చేస్తూవుంది. వెంకటరెడ్డి, గంగారామ్, గణపతిరెడ్డి, రాములు, లంకా నారాయణ, నారాయణ పంతులు మొదలైనవారు ఆయా శాఖల్లో కళాకారులుగా పనిచేశారు.

## మధోల్

ఇక్కడ ముఖ్యంగా భాయ్‌నాసి, కొత్తగని, మీర్జాపూర్, తిమ్మాపూర్, దిగమ, సుంకలి, మహాజమ్, చుండి, కోమ్, మంజరి, బాసార్ మొదలైన గ్రామాలలో యక్షగాన బృందాలు పనిచేశాయి.

కాకన్న. హనుమంతాచార్య. ముత్తన్న మొదలైన కళాకారులు పని చేశారు.

## ఘనపూర్

కన్నపూర్, వస్తురాబాద్, కాసిమడుగు, ఇందనపల్లి, రామోజిపేట మొదలైన ప్రాంతాల్లో యక్షగానసభలు పనిచేస్తున్నాయి. వడ్ల నరసింహులు, నర



సింహయ్య, గోవిందరావు, వెంకటరెడ్డి మొదలైన కళాకారులు ఈ దళాల్లో పని చేశారు.

## లక్సెట్టిపేట

ఇక్కడ 1951 లో లలితకళాసమితి, 1954 లో మరో లలితకళాసమితి ఏర్పడి పనిచేస్తున్నాయి. కొత్తూరు, కిష్టపురి, రాపల్లి, పార్థనపల్లి మొదలైన గ్రామాల్లోకూడ నాటక సమాజాలున్నాయి. ఇవిగాక నుమ్నూర్, పొట్టాయిపల్లి, రాయంపేట, దౌడపల్లి మొదలైన చోట్ల వీథినాటకసమాజాలు పనిచేస్తున్నాయి. రాయంపేటలో ఒక బుట్టకథ దళం కూడా పని చేస్తూ వుంది.

రామకృష్ణ, వెంకటరెడ్డి, బుచ్చయ్య, కాంతయ్య, తిరుమలరావు మొదలైన కళాకారులు ఈ సంస్థల్లో పనిచేశారు.

## చిన్నూర్

ఇక్కడ 1949 లో జగన్నాధ కళాసమితి ఏర్పడి పనిచేసింది.



కొత్తపల్లి, నీలవాయి గ్రామాలలో వీధి భాగవత దళాలు. వేమనపల్లి, సీనాల్, భీమవరం, మిట్టపల్లి, ఆదిల్‌పేట, సిర్యా, లమద్ మొదలైన గ్రామాల్లో యక్షగాన దళాలు పనిచేశాయి.

ఈ దళాల్లో జక్కిపల్లి కృష్ణయ్య, సాంబయ్య, ఐస్ రెడ్డి మొదలైన కళాకారులు పనిచేశారు.

## నిర్మల్

నిర్మల్ హస్తకళలకు ప్రసిద్ధి చెందిన గ్రామం. ఇండ్ల చరిత్ర రామాయణం ప్రదర్శించే జానపద కోలాట సమాజం పనిచేస్తూవుంది. ఇది తెలంగాణాలో ఒక ప్రత్యేకమైన కళారూపం.

## నిజామాబాద్ జిల్లా

నిజామాబాద్‌లో 1948 వ సంవత్సరంలో మహారాష్ట్ర మహిళామండలి, 1958 లో లలితకళా సమితి ఏర్పడి, సంగీత నృత్య నాటకకళల్లో కృషి చేశాయి. నిజామాబాద్‌కు 16 మైళ్ళలోనున్న ఆర్మోర్‌లోకూడ సంగీతంలోనూ, నృత్యంలోనూ, నాటకంలోనూ కొన్ని సమాజాలు పనిచేశాయి.

నిజామాబాద్‌కు 40 మైళ్ళదూరంలో వున్న బన్స్‌వాడలోకూడ కొన్ని సమాజాలు పనిచేస్తూ వున్నాయి. బన్స్‌వాడలో భీమశాస్త్రి హరికథ చెప్పడంలో ప్రసిద్ధి వహించారు. అచ్చంపేటలో శ్రీనివాసరావు కోలాటం సమాజాన్ని, రైతు నగర్‌లో పొట్లూరి వీరభద్రం, రంగనాయకులు ఒక భాగవత సమాజాన్ని నడుపుతున్నారు.

బిర్‌కూర్, మొహద్ నగరుల్లో భజనపార్టీలు పనిచేశాయి.

బిర్‌కూర్, పిట్లాం గ్రామాల్లో బుర్రకథ దళాలు పనిచేస్తున్నాయి. దుకి, తడికేల్, తిరుమలపూరుల్లోకూడ వీధిభాగవత సమాజాలు పనిచేశాయి. ఈ ప్రాంతాల్లో నాటక సమాజాల అభివృద్ధి అంతగా కనబడడంలేదు.

## బోధన్

ఇక్కడ మజ్‌దూర్ సంఘం క్లబ్ పనిచేస్తూవుంది. దగ్గరలోనున్న రుద్రూరు, జహదిగ్మలపూర్‌లోనూ భజనపార్టీలు, భాగవత సమాజాలూ పనిచేస్తూ వున్నాయి. ఈ సంస్థల్లో కాశీనాథ్, వెంకటేశ్వర్లు, జైపాల్, కోటయ్య, వీరేశమ్, శ్రీమతి వీరేశ్వరమ్ మొదలైన నటీ నటులు పనిచేశారు.

## మెదక్ జిల్లా

మెదక్‌లో సంగీతశాఖలు మాత్రం పనిచేస్తూ వున్నాయి. నాటక సమాజాలు వున్నా అవి కట్టుదిట్టంగా లేవు. భాగవతదళాలూ, చిరతల రామాయణం ప్రదర్శించే సమాజాలు, కోలాటం మొదలైన జానపద కళారూపాలను ప్రదర్శించే బృందాలు విరివిగా వున్నాయి.



## సంగారెడ్డి

చెప్పుకోదగిన నాటకసమాజాలు ఏమీ లేవు. సంగీత శాఖలోమాత్రం కొద్దిమంది సంగీత ప్రియులున్నారు. జడకోపు కోలాట సమాజాలు, వీధి భాగవతదళాలు విరివిగా వున్నాయి. 1958 లో సంగీత కళామందిర్ అనే సంస్థ స్థాపించబడి పనిచేస్తూ వుంది. అనేక బుర్రకథ దళాలుకూడా పనిజేస్తున్నాయి. జడకోపు కోలాటంలో కృష్ణలీల కథను అన్ని ఆభరణాలను ధరించి ప్రదర్శిస్తూ వుంటారు. అనేక దళాలు మాజీ యం. యల్. ఎ. లక్ష్మణకుమార్ అధ్వర్యంలో పనిచేస్తూ వున్నాయి. ఈశ్వరయ్య గంధయ్య విష్ణయ్య మొదలైనవారు కళాకారులుగా ప్రసిద్ధిచెందారు.

## సదాశివపేట

ఇక్కడ సంగీతశాఖలుమాత్రం పనిచేస్తూ వున్నాయి. భాగవతదళాలను పడిగి నారాయణ, మారేపల్లి యజ్ఞనారాయణ మొదలైన కళాకారులు నిర్మాణయుతంగా

నడుపుతున్నారు. శ్రీ గోవిందదాసు ఆధ్వర్యంలో మూడు చిరుతల భజన సమాజాలు నడుస్తున్నాయి. మారేపల్లి, సూరారం, నందికుండి, నిజాంపూర్, వెంకటపూర్, తంగందపల్లి మొదలైన గ్రామాల్లోకూడా చిరుతల భజన సమాజాలు నడుస్తున్నాయి. రామకృష్ణ, శంకరరావు, నరసింహారెడ్డి మొదలైన కళాకారులు పైసంస్థల్లో పని చేశారు.

## జహీరాబాద్

జహీరాబాద్ చుట్టుప్రక్కల గ్రామాలైన బిలాల్‌పూర్, కొహిర్, ముగుడం పల్లి, అజాద్‌గంజ్ మొదలైన చోట్ల నాటక దళాలు పనిచేస్తున్నాయి. బిలాల్‌పూర్ గ్రామంలో బుర్రకథ దళంకూడా పనిచేస్తూవుంది. కొహిర్, ముగుదంపల్లి, అజాద్‌గంజ్, దిగ్వాల్, రంజోల్, చీరిక పల్ల మొదలైన గ్రామాల్లో వీథిభాగవతం దళాలు, తోలు బొమ్మలదళాలు సమర్థవంతంగా పనిచేశాయి.



బిలాల్‌పూర్, కొహిర్, రంజోల్ మొదలైన గ్రామాల్లో చిరుతల భజన సమాజాలుకూడా నడుస్తున్నాయి. ముగుదంపల్లి, రంజోల్ గ్రామాల్లో కోలాట సమాజాలు పనిచేశాయి.

## మీర్జాపూర్

మీర్జాపూర్‌కు దగ్గరలోనున్న జర్సగం గ్రామంలో తెలుగు, కన్నడ నాటకాలు ఆడుతున్నారు. శ్రీగుత్తం, మందగి గ్రామాల్లో కన్నడ నాటకాలనుమాత్రం ఆడుతున్నారు. నల్లకాల్, బిరుగుపల్లి గ్రామాల్లో ఉరుదు నాటకాలు ఆడుతున్నారు.

రామగుండం, బిటికుర్తి గ్రామాల్లో భజన సమాజాలు నడుస్తున్నాయి. వామనపల్లి సిద్దపూర్ దోసపల్లి మొదలైన గ్రామాల్లో లంబాడి డాన్సు దళాలు పని చేస్తున్నాయి.

## జోగిపేట

ఇక్కడ సంగీతంలో ప్రవీణులైనవారున్నారు. కనసంపల్లి పెదపూర్ తిక మల్ రామన్నపేట గ్రామాల్లో భాగవతం దళాలు నడుసున్నాయి. కనసంపల్లి పెద

పూర్ గ్రామాల్లో చిరతల కోలాటం సమాజాలున్నాయి. వాసుదేవ ఆదెప్ప మొదలైన కళాకారులు పనిచేశారు.

## నల్లగొండజిల్లా

నల్లగొండ జిల్లాలో భువనగిరి హుజూర్ నగర్ సూర్యాపేట మొదలైన ప్రాంతాల్లో మాత్రమే కొద్ది వైజ్ఞానికశాఖలు పనిచేశాయి.



నల్లగొండలో శ్రీ టి. పూర్ణచంద్ర రావుగారు కళాసమితిని స్థాపించి నడిపారు. 1958 లో విజ్ఞానసమితిని పి. రాజరత్నంగారు స్థాపించారు, ధరణికోట శ్రీనివాసులు (నాటక రచయిత) ఇక్కడివారే.

1958 హుజూర్ నగర్‌లో గ్రామ వెలుగు నాట్యమండలిని నాటక రచయిత కె. యల్. నరసింహారావుగారు స్థాపించి ప్రతి సంవత్సరం 4 రోజులు నాటకోత్సవాలను నడుపుతూ వచ్చారు. ఈ ప్రాంతం నుంచి వచ్చినవారే టి. యల్. కాంతారావు (సిని నటుడు).

సూర్యాపేటలో 1946 లో జనతా కళామండలిని స్థాపించారు, ఇక్కడ సంగీత సంస్థలు ఎక్కువగా పనిచేస్తున్నాయి. టి. సూర్యనారాయణశర్మ, డాక్టర్ జి.వి. శర్మ. బి. సీతారామాచార్య, సముద్రాల నరసింహారావు, వెంపో మొదలైన కళాకారులు పనిచేశారు.



# 12

# ప్రజా నాట్యమండలి



ప్రజా నాట్యమండలి ఉజ్వలచరిత్ర
-ప్రాచీన కళారూపాల పునరుద్ధ
రణ-చేపట్టినకళారూపాలు: ము
దడుగు నాటకం - చారిత్రకమైన
మాభూమి నాటకం - ఒకేరాత్రి
రెండు ప్రదర్శనాలు-స్త్రీల బుర్ర
కథ దళం

# ప్రజా నాట్యమండలి ఉజ్వల చరిత్ర

## నాటకరంగంలో నవచైతన్యం:

నాటకరంగ స్థలంలో నవశకాన్ని ఏర్పరచి ప్రజలను జాగృతమొనర్చి దేశభక్తిని రగుల్కొల్పిన నాటకసంస్థ ప్రజానాట్యమండలి.

కంట్రాక్టు నాటకాల దుస్థితితో శిధిలమైపోతున్న ఆంధ్రనాటక చరిత్రలో 1943 వ సంవత్సరంలో ఒక నూతన చైతన్యం కలిగింది. ప్రపంచమంతా ఫాసిస్టుల ప్రళయ ఆర్భాటాలతో మారుమ్రోగిపోతోంది. అటు యూరపులో హిట్లరు చిన్నరాజ్యాలన్నిటినీ కబళించుతున్నాడు. ఇటు ఇటలీనియంత ముస్సోలినీ ఆఫ్రికా నంతా మ్రింగజూచాడు. తూర్పు ప్రాంతాలలో జపాన్ చే దురాక్రమణకు ప్లానులు వేయబడ్డాయి. ఫాసిస్టులకూ ప్రజాస్వామిక శక్తులకూ మధ్య తీవ్రమైన సంఘర్షణ చెలరేగింది. ధర్మానికి-అధర్మానికి, శాంతికి-అశాంతికి సంఘర్షణ దినాలవి. దేశ దేశాల ప్రజాసామాన్యమంతా అట్టుడికిపోతోంది. మానవసమాజం యొక్క-యుగయుగాల విజ్ఞానం, సంస్కృతీ పశుబలానికి బలైపోతూవున్నాయి. ఈరోజు నున్న పట్టణాలు రేపటికి భస్మీపటలమై పోతున్నాయి. అనేక దేశాలలో ప్రజలు-స్త్రీలు, పురుషులు, పిల్లలు ఫాసిస్టుల బలానికి, వారి చిత్రహింసలకు బలైపోతు న్నారు. ఆ దేశాలన్నీ పీనుగుపెంటలతో నిండిపోయాయి. పాడిపంటలు శూన్యమై నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే యుద్ధం జరిగే ప్రాంతాలన్నీ శ్మశానాలైనాయి. మనదేశంలో కరువు పిశాచి కరాళనృత్యంతో రాయలసీమ, బెంగాల్ నలిగి పోయాయి. రేపో మాపో అటు కలకత్తామీదో, ఇటు కాకినాడమీదో, మద్రాసు మీదో, విశాఖమీదో బాంబులు పడేటట్టున్నాయి. ఇండియా తూర్పుకోస్తా అంతా అతిప్రమాదమైన స్థితిలో పడిపోయింది. ఆ ఛాయలే ఆంధ్రదేశంమీద పడ్డాయి. ఆనాడు ఆంధ్రప్రజలు అరచేతిలో ప్రాణాలు బిగబట్టుకుని బ్రతకాల్సి వచ్చింది. చివరకు అనుకున్నంత పనీ జరిగింది. కాకినాడ, విశాఖపట్టణాలపై బాంబులు పడనేపడ్డాయి. ఈ స్థితిలో ఆంధ్రప్రజల స్థితి ఏమిటి? ఒక్క ఆంధ్రప్రజల స్థితే

కాదు.ఏ దేశమైనా, ఏ ప్రజలైనా ఈ భయంకరమారణహోమంనుంచి, ఈ అగ్ని జ్వాలలనుండి బయటపడాలని తహతహలాడే భయంకర దినాలవి.

కంఠాలెత్తి కవులూ, కళాకారులూ
కదిలారు :

ఈ స్థితిలో కళాకారులూ, కవులూ, కథా రచయితలూ, గేయకవులూ, గాయకులూ, వాద్యకులూ - మొత్తం కళాకారులంతా ఈ హోమగుండంనుంచి ప్రజలను విముక్తి చేయాలనుకున్నారు. మన కుండాల్సిన రాజకీయాలూ, రాజకీయపార్టీలూ అన్నీ వున్నాయి. అయినా కళాకారులు వారివారి బాధ్యతలతో నవచైతన్యంతో ప్రజానీకాన్ని కళాయుధం ద్వారా మేల్కొల్పచూచారు.



యువచైతన్యం,
నవచైతన్యం :

ఆనాటి యువకులందరూ వేయికంఠాలెత్తి పిడికిళ్ళను బిగించారు. ఆంధ్రదేశపు నాలుగు చెరగులనుంచీ యువకులందరూ సమీకరించ బడ్డారు. ఆంధ్రరాజకీయ జీవితంలో ఒక నవ చైతన్యం, ఒక అభ్యుదయ యుగం ప్రారంభ మైంది. ఊరూరా యువకులందరూ వయోజన పాఠశాలలను నెలకొల్పారు. రాబోయే యుద్ధ ప్రమాదాన్నిగూర్చి దళాలు దళాలుగా బయలుదేరి ప్రచారం చేయ సాగారు. ఈ స్థితిలో స్త్రీలుమాత్రం వూరుకున్నారా? వారూ మహిళా శిబిరాలను నెలకొల్పారు. బాలురంతా బాలసంఘాలను, రైతులు, కూలీలు వారివారి సంఘాల ద్వారా ఒక్కమ్మడిగా ఫాసిస్టు వ్యతిరేకప్రచారం జరిపారు.

ఉరకలు వేస్తూ
ముందుకు నడిచిన యువజనోద్యమం :

ఈ తీవ్ర సంచలనంలో ప్రతి కళాకారుడూ దేశభక్తిప్రపూరితుడైపోయాడు. కవులు గేయాలు వ్రాశారు. గాయకులు కంఠాలెత్తారు. ఆంధ్రప్రజాసామాన్యమంతా గాఢనిద్రలోంచి మేల్కొల్పారు.

ఈ పరిస్థితుల్లో ఆంధ్రదేశంలో ఆయా జిల్లాలలో వయోజనోద్యమం పురకలు వేస్తూ ముందుకు పోతూంది. అనేకమంది యువకులు వైజ్ఞానికకార్యక్రమాలు కూడా ప్రారంభించారు. కృష్ణాజిల్లా దివితాలూకాలో కీ॥ శే॥ పెండ్యాల వెంకటేశ్వరరావు, పరచూరి రామకోటయ్యగార్లు దేశభక్తిని పురికొల్పుతూ యువజనసభలలో వైజ్ఞానిక కార్యక్రమంగా బుర్రకథ కార్యక్రమాలు చెప్పడం ప్రారంభించారు. వీరి కార్యక్రమాన్ని చూచి వుత్తేజితులైన కోసూరు పున్నయ్య, సిరివిశెట్టి సుబ్బారావు, గోవర్ధన మొదలైన కొత్తపాలెంకు



సంబంధించిన యువకులు దేశభక్తిని పురికొల్పుతూ బుర్రకథలు ప్రారంభించారు. సిరివిశెట్టి సుబ్బారావు కథకుడుగానూ, కోసూరి పున్నయ్య హాస్యపాత్రనూ, గోవర్ధన రాజకీయాలనూ నిర్వహిస్తూ వుండేవారు. వంతగా కోసూరి పున్నయ్య సున్నితమైన హాస్యంతో గ్రామీణ సామెతలతో రాజకీయవిషయాలను ప్రజలకు అర్థమయ్యే శైలిలో చెపుతూ వుండేవారు. ముఖ్యంగా యువజనసభల్లో ఈ కార్యక్రమాలు జరుగుతూ వుండేవి.

గుంటూరు యువకుల

గొప్ప బుర్రకథ :

అదేసమయంలో అటు గుంటూరుజిల్లాలో దావులూరు వాస్తవ్యులు చింతల సూర్యనారాయణ, కాకుమాను సుబ్బారావు మొదలైన వారు రష్యన్ వీరనారి టాన్యా, ఝాన్సీ లక్ష్మీబాయి మొదలైన వీరవనితల కథలను చెప్పుతూ వుండేవారు,

1943 జనవరి ప్రాంతంలో బొంబాయిలో అఖిల భారత కమ్యూనిస్టుపార్టీ మహాసభ జరిగింది. ఆ మహాసభకు వివిధ రాష్ట్రాలనుండి వైజ్ఞానిక దళాలనుకూడా ఆహ్వానించారు. అన్ని రాష్ట్రదళాలు ప్రదర్శన లిచ్చాయి. ఆంధ్రవైజ్ఞానికదళం అంత కట్టుదిట్టంగా లేకపోయినా ఆంధ్రజాతీయ జానపద కళారూపాలను ప్రదర్శించి, అందరి ప్రశంస లందుకుని ప్రథమ బహుమతిని ఆనాడే సంపాదించింది.

### ప్రజానాట్యమండలికి ప్రథమ బహుమతి :

ఆ సమయంలోనే బొంబాయిలో ప్రోగ్రసివ్ రైటర్సు అసోసియేషన్ కాన్ఫరెన్సు జరిగింది. అప్పుడే అఖిల భారత ప్రజానాట్యమండలికి అంకురార్పణ జరిగింది.

బొంబాయి వైజ్ఞానిక ప్రదర్శనాల్లో ప్రథమ బహుమతిని సంపాదించిన ఆంధ్రవైజ్ఞానిక దళాన్ని బొంబాయి ఆంధ్రులు ఘనంగా సన్మానించి రజతపాత్ర లను బహూకరించారు. ఆనాడు బొంబాయి వెళ్ళిన కళాకారుల్లో కోగంటి గోపాల కృష్ణయ్య. కోసూరి పున్నయ్య. డాక్టరు రాజారావు. సిరివెన్నెట్టి సుబ్బారావు. మానికొండ సూర్యావతి. కాట్రగడ్డ హనుమాయమ్మ. ముక్కామల నాగభూషణం. టి. సావిత్రి మొదలైనవారు పాల్గొన్నారు.

### కోగంటి కోయవేషపు ప్రతిభ :

ఆనాడు అన్ని దళాలను. కళాకారులను ఆకర్షించిన వ్యక్తి కోగంటి గోపాలకృష్ణయ్య. కోయవేషంతో అందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేశాడు. కోయ వేషంలో కోయభాషను వుపయోగించాడు. కోయభాషలో రాజకీయాలు చెప్పారు. కోయభాషలో రచన చేశాడు. కోయవాని వేషధారణను ముచ్చటగా చిత్రించుకున్నాడు. బక్క వ్యక్తులను చూచి "ఓ సామి ఏం ఈతపిక్కలాగ ఇంత బిక్కంగ వుండావు. ఒక్క ఏరుముక్క గట్టినా నంటే ఇంత లావైపోతావు ఏరుముక్కంటే ఏటను కున్నావు. జాపనోడు గీపనోడు తుస్సున పోవాల. కొండవాళ్ళం మేం" అంటూ హాస్యంతో ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తూ వ్యాఖ్యానికి వుపయోగించే కోయవేష కళారూపానికి దేశహితమైన రాజకీయ ఇతివృత్తాలను జోడించి. నూతన విధానాలను సృష్టించాడు. ఆనాడు బొంబాయి క్రానికల్, పీపుల్సు వార్ లాంటి ప్రముఖ పత్రిక లన్నీ కోగంటి కోయవేష చిత్రాలను ప్రముఖంగా చిత్రిం చాయి.



### యువకులు నిర్మించిన వైజ్ఞానికోద్యమం :

ఈ పరిస్థితుల్లో 1943 మార్చిలో కృష్ణాజిల్లా యువజన సంఘం ఆధ్వర్యాన తాతినేని ప్రకాశరావు, వేములపల్లి దాసు, కొండపల్లి దశరథరామయ్య, తమ్మారెడ్డి సత్యనారాయణ, బి. వి. రావు మొదలైన ఆనాటి యువనాయకుల పర్యవేక్షణలో దివితాలూకా కొడాలి గ్రామంలో ఫాసిస్టు వ్యతిరేక శిక్షణా శిబిరం ప్రారంభించబడింది. అన్ని తాలూకాలనుండి ప్రతినిధులు ఆ శిబిరానికి శిక్షణ నిమిత్తమై వచ్చారు. ఆ శిబిరంలోనే మిక్కిలినేని, మాచినేని, చదలవాడ కుటుంబరావు, తుమ్మల కేశవరావు, యస్. యల్. పెరుమాళ్ళు, కోసూరు పున్నయ్య, పిరివిశెట్టి సుబ్బారావు, అమృతయ్య మొదలైన కళాకారులంతా వైజ్ఞానిక శిక్షణ పొందారు. ఈ శిక్షణా శిబిరంలో బొంబాయి మహాసభల నుండి వచ్చిన కోగంటి, కోసూరి పున్నయ్య ప్రముఖ బాధ్యతలను నిర్వహించారు. నాలుగు బుర్రకథ దళాలను, మరికొన్ని వివిధ చిత్ర విచిత్ర జానపద కళారూపాలను ప్రదర్శించే కళాకారులను తయారుచేశారు.

### ఉత్తేజపర్చిన కోగంటి గేయాలు :

ఆ శిబిరంలో కోగంటి కొన్ని కళారూపాలకు సంబంధించిన కొన్ని గేయాలను రచించాడు. ఐదు నిమిషాల్లో ఏదో ఒక ప్రజా సమస్యను తీసుకుని పాటలు వ్రాసేవాడు. ఆయనకు మంచి లయజ్ఞానం వుండేది. ప్రతి పాటకూ ఏదో ఒక ప్రాచీన జానపద గేయానికి సంబంధించిన విధానంతో చిటికెలువేస్తూ కొత్త పాటను వినిపించి ముగ్ధుల్ని చేసేవాడు. ప్రేక్షకుల్ని ఆకర్షించి వుత్తేజపర్చేవాడు.

### ప్రజా నాట్యమండలి నిర్మాతలు :

ఈ శిబిరంలో ప్రప్రథమంగా కోగంటి గోపాలకృష్ణయ్య, పున్నయ్య, పిరివిశెట్టి సుబ్బారావు ఒక బుర్రకథ దళంగాను-

మిక్కిలినేని, మాచినేని, దావులూరు నారాయణ ఒక బుర్రకథ

పెరుమాళ్ళు, కీ॥శే॥ చదలవాడ కుటుంబరావు, తుమ్మల కేశవరావు మరో బుర్రకథ దళంగాను.

పురుషోత్తం, వెంకటేశ్వరరావు మొదలైన దివితాలూకాకు చెందిన బాలురు ఒక బాల బుర్రకథ దళంగానూ ఏర్పడ్డారు.

అటు గుంటూరుజిల్లాలో మోటూరు ఉదయం, చింతల కోటేశ్వరమ్మ, మహంకాళి లక్ష్మి మొదలైనవారితో మహిళా బుర్రకథ దళం ఏర్పడి రష్యన్ వీరనారి నాట్యా కథను హృదయాలు ద్రవించేటట్లు చెప్పేవారు.

వీరోచితంగా బుర్రకథ చెప్పిన
ఏలూరు దళం:

పశ్చిమ గోదావరిజిల్లా ఏలూరులో మాణిక్యాలరావు, చుంద్రు సూర్య నారాయణ, చిన్నబ్బాయి మొదలైనవారితో బుర్రకథ దళం ఏర్పడింది. మాణిక్యాల రావు పకీరువేషాలు ప్రదర్శించడంలో ప్రముఖపాత్ర వహించారు. చుంద్రు సూర్య నారాయణ గంభీరమైన గొంతుతో శ్రావ్యంగా పాటలు పాడేవారు. బుర్రకథలో రాజకీయాలు చెప్పేవారు.

కర్నూలుజిల్లా గిద్దలూరు ప్రాంతంలో తుపాకుల బసవయ్య దళం పని చేస్తూ వుండేది.

నెల్లూరుజిల్లాలో రాజగోపాల్ బుర్రకథ దళం బుర్రకథలు చెపుతూవుండేది.

కడపజిల్లా, జమ్మలమడుగు తాలూకాలో హుస్సేన్ బాబా వైజ్ఞానిక దళం పని చేస్తూవుండేది.

గుంటూరుజిల్లా వైజ్ఞానికదళంలో బి. గోపాలం ఫిడేలు వాయిద్యంతో గా పాటలుపాడి ప్రజల ను త్తేజపరుస్తూ వుండేవారు.

ంగా ఆంధ్రదేశం అన్ని మూలలకూ వైజ్ఞానికవుద్యమం వ్యాపిస్తూ నికదళాల్లో వున్న కోగంటి, సుంకర, కోసూరి, మిక్కిలినేని, మాచి నైనవారంతా కళారూపాలకు సంబంధించిన గేయాలను వ్రాయడం ట్టారు.

### విజయవాడ వైజ్ఞానిక శిక్షణాశిబిరం :

1943 జూన్‌లో విజయవాడలో ఒకపెద్ద వైజ్ఞానిక శిక్షణా శిబిరం ఏర్పడి కొంతమంది కళాకారులను తయారుచేసింది. 1943 లో విజయవాడలో ఆంధ్ర కమ్యూనిస్టుపార్టీ మహాసభ జరిగింది. ఆ మహాసభకు కృష్ణా, గుంటూరు జిల్లాల నుండి వైజ్ఞానిక దళాలు వచ్చాయి.



ఆ సభలో ప్రప్రథమంగా కృష్ణాజిల్లా వైజ్ఞానికదళం కొన్ని ప్రదర్శనల నిచ్చింది. ప్రజా నాట్యమండలి ఏర్పడేముందు తొలి దళలో ఏర్పడిన ప్రజానాట్యమండలి ఇదే. ఈ దళంలో కోగంటి గోపాలకృష్ణయ్య, కీ॥శే॥ చదలవాడ కుటుంబ రావు, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, తుమ్మల కేశవ రావు, మృతవీరుడు చింతపల్లి పాపారావు, సుంకర వీర భద్రరావు, రాఘవాపురపు అప్పారావు, వెంకటేశ్వరరావు, ఖమ్మం వాస్తవ్యుడు బుర్రపంతులు, కొండపల్లి కోటేశ్వ రమ్మ, పరచూరు సూర్యాంబ, తాపీ రాజమ్మ మొదలైన వారు ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఈ దళం ప్రదర్శించిన ప్రదర్శనలు పున్నయ్య దళం బుర్రకథ, కోగంటి కోయ వేషం, బుర్రకథ, చెంచువేషాలు, ఫకీరువేషాలు, దేవరపెట్టె, సై. సై. భారత వీర, ఓయ్ హోయ్‌హోయ్ జపాన్ హోయ్ అనే గెరిల్లా కళారూపం, సమిష్టి గానాలూ ప్రదర్శించబడ్డాయి.

ఈ ప్రదర్శనం విజయవాడ గాంధీనగరం జింఖానా గ్రౌండ్సులో కొన్నివేల మంది ప్రజల సమక్షంలో ప్రదర్శింపబడి వేనోళ్ళ పొగడబడ్డాయి.

### నాజరు ఆవతరణ :

ఈ మహా ప్రదర్శనంలో గుంటూరు జిల్లా నుండి నాజరు ఒక కోలాట దళాన్ని తీసుకుని వచ్చాడు. 'మాస్కో పొలిమేరలోనా, మారణ యంత్రాలు నిలిపి' అనే గేయాన్ని, "జాయింగే కయ్యూరు జాయింగే" అనే కయ్యూరు కొమ్రేడ్సు మీద గేయాన్ని పినిపించి, సభాసదుల నందరినీ ద్రవింపజేయడమే గాక ఉత్తేజపర్చాడు. అయన గాత్రం ప్రేక్షకులను ముగ్ధులను గావించింది. ఈ దళంలోనే నాజరు,



గుంటూరుజిల్లా ప్రజానాట్యమండలి బుర్రకథ దళం
పురుషోత్తం - నాజరు - రామకోటి.

రామకోటి, పురుషోత్తం చెంచు వేషాలు ధరించారు. దుగ్గిరాలకు చెందిన డాక్టరు చలమయ్యకూడ కళారూపాన్ని ప్రదర్శించాడు.

ఆ ప్రదర్శనంలో నాజరు కోలాటం, కోగంటి కోయవేషమూ, మిక్కిలినేని హిట్లరు వేషమూ ప్రత్యేక ప్రశంస లందుకున్నాయి.

ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం :

ఈ మహాసభ తరువాత అన్ని జిల్లాలలో వైజ్ఞానికదళాలు విరివిగా ఏర్పడ్డాయి. ఇతర రాష్ట్రాల్లోకూడా వైజ్ఞానిక దళాలు ఏర్పడి పని చేస్తున్నాయి. ఈ దళలో ఆనాటి అఖిల భారత కమ్యూనిస్టుపార్టీ ఈ వైజ్ఞానిక వుద్యమానికి అండగా నిలబడింది. ఆంధ్రదేశంలో ఆనాటి కమ్యూనిస్టు పార్టీలో ముఖ్యులైన మద్దుకూరి చంద్రశేఖరరావు, పొట్లూరు సుందరం మొదలైనవారు వైజ్ఞానిక దళాలపట్ల శ్రద్ధతీసుకుని అడుగడుగునా సలహాలనిస్తూ వైజ్ఞానిక వుద్యమానికి అండగా నిలబడ్డారు. వైజ్ఞానికోద్యమం వురకలు వేస్తూ ముందుకు నడిచింది. ఈ తరుణంలో ఓ మిట్టిపడే హిట్లరయ్యా ఏటికి ఎదురీదుచుంటివా అనే సుంకరగేయం, హోయ్ జపాన్ హోయ్, మలయ బర్మా ప్రమింగిన రాక్షసి భారతభువిపై గవిసెనురా అన్న కోగంటి గేయం వెలువడి బహుళ ప్రసంస లందుకున్నాయి. ఊరూరా వైజ్ఞా

నిక దళాలు ఏర్పడ్డాయి, దేశభక్తి గేయాలు కొల్లలుగా వచ్చి పడుతున్నాయి. ఏదో ఒకమూల, ఏదో ఒకచోట, ఏదో ఒక గేయం వినబడుతూ వుండేది. ఒక ప్రక్క ఫకీరువేషాలతో దేశంలో హిందూ ముస్లిం ఐక్యతను నెలకొల్పడం, రెండవ ప్రక్క కోయ వేషాలతో వెనుకబడిన అడవుల్లో నివసించే ఆదివాసుల్ని కూడా మీలో చేర్చుకోండని, "జాపనోడు గేపనోడు తుస్సున పోవాల. ఒక్క ఏరుమక్క కట్టినానంటే హిట్లరూ, గిట్లరూ ఎగిరిసావాల, ఏటనుకున్నారో" అంటూ వీధులవెంట బయలుదేరారు.

పునరుద్ధరించిన

ప్రాచీన కళారూపాలు :

మరోప్రక్క క్వారీ కూలీపాటలతో—

ఓ సాయిబన్నయ్యా, ఓ సాయిబన్నయ్యా
నీవూ నే కలుసుండి నిలిచిపోరాలన్నా.

అనీ, ఫకీరువేషాల్లో—



పాడిపంటల్, సల్గుండాలి "అల్లాకే నాం"

తల్లిపిల్లల్ వల్గుండాలి "అ"

హిందు ముస్లింలంత "అ"

వారి హేకం కావాలండి "అ"

అంటూ అన్ని మతములవారు, అన్ని జాతులవారు ఐక్యముగా వుండాలని అల్లాకే నాం ద్వారా ఆశీర్వదించారు.

ఇక పల్లెల్లో కూలీ స్త్రీలు వూరుకున్నారా? పంటచేల రొదలో తుమ్మెదల్లా మెరుస్తూ తుమ్మెదపాటలు పాడారు.

పాడవే పాడవే తుమ్మెదా మంచి
పాటలెన్నో పాడు తుమ్మెదా॥

జర్మనీ జపాను తుమ్మెదా గొప్ప
జనహంతకులు వారు ॥తు॥
స్త్రీల హింసించారె తుమ్మెదా, పంట
చేలు తగలెట్టారె తుమ్మెదా॥

అని కోకిల కంఠాలతో పౌలాలన్నిటా మారుమ్రోగించారు. ఆ పౌలాల ప్రక్క-నుంచి ప్రవహించే కాలువల్లో నడిచే పడవ సరంగుల పాటల్నికూడ చిని పించారు.

పడవెళ్ళిపోవుచున్నది
ఐక్యతా పడవెళ్ళిపోవుచున్నది
అన్ని జాతులవారి కంచుతుం దీ పడవ
స్వయంనిర్ణయసూత్రం
చాటుతుందీ వడవ ॥పడవెళ్లి॥

అని దేశ ఐక్యతనూ, స్వయంనిర్ణయం సూత్రాన్ని గూర్చి ప్రబోధాలు విని పించేవారు.

అనేకమంది యువకులు రాత్రిళ్ళు జేగంట స్థంభాలను పట్టుకుని.

ఎందుకయ్యా జాగుసేయ భరతవీరుడా
ఇండియాను మ్రింగివేయ హీనులౌ జపానువాళ్ళు
వరుస వరుస నొస్తున్నారు
పట్టి తన్నరారా నీవు ॥ఎందు॥

ఈ విధంగా యాచక వేషధారణతో ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం చేశారు. పగలంతా కష్టించి రాత్రిపూట సంద వెన్నెట్లో ఆంధ్రదేశపు కూలి బాబులు—

శివ శివ మూర్తివి గణనాధా నీవు
శివుని కుమారుడవు స్వామినాధా

అనే పాతపాటకు ప్రత్యామ్నాయంగా—

ఖండ ఖండాంతరాల భరతమాతా నీవు
భ్యాతిగన్న తల్లివమ్మ భరతమాతా
కూలిరైతు బిడ్డలమమ్మ భరతమాతా
మేము కూలదోస్తాం ఫాసిజాన్ని ॥భరతమాత॥

ఈ విధంగా నవ్య భావాలను మిళితంచేసి పల్లె ప్రజలందర్నీ ప్రబోధించారు.

అదేవిధంగా రైళ్ళలో అడుక్కునే బిచ్చగాళ్ళ పదాలరీతిలో—

అమ్మగారీ యిళ్ళ భాగ్యలోగిళ్ళూ
భాగ్యాన మీయిళ్ళు పరముగోదేదా
పంటలతో మీయిళ్ళు బాగైనయిళ్ళు
కరువుతోడా నేడు కళతప్పినాయీ
కరువుదీర్చా మీరు కలసిరారమ్మా
కలసి మీరందరూ కరువుదీర్చండి ॥అమ్మ॥

ఈ విధంగా ఆనేక జిల్లాలలో వైజ్ఞానిక దళాలు ప్రచారం చేశాయి.

ఎంత దిరిగిన ఏమి దొరకదు
ఖర్మమేమిర అవ్వయా

—అనే అన్నా చెల్లెలు పాత్రలు ధరించి గుంటూరుజిల్లా ప్రజా నాట్యమండలి విశేషంగా గ్రామాల్లో ప్రచారం చేసింది.

ఇలాగే కోయవేషాలు, హిట్లరు భాగవతం, సిమ్లా భాగవతం, తెలంగాణా భాగవతం, పేరిగాడి రాజ్యం మొదలైన వీధి భాగవతాలు, రేషనింగ్ రోజుల్లో ప్రజలస్థితిని తెలియజేసే రాములమ్మ దీనచరిత్ర, ఆకలి మంటల పేరుతో పిచ్చి గుంటల కథగా ప్రచారమైంది.

ప్రజా నాట్యమండలి
ప్రసిద్ధ బుర్రకథలు:

రాక్షసకృత్యాలు గావించే నైజాము నవాబుకు చిహ్నంగా కన్యకా చరితాన్ని జముకుల కథగాను, కష్టజీవి, స్టాలిన్ గ్రాడ్ యుద్ధం, నాట్యా, ఝాన్సీ లక్ష్మీబాయి, రైతు విజయం, అల్లూరి సీతారామరాజు, వీరేశలింగం, బెంగాల్ కరువు మొదలైనవాటిని చిత్రించే బుర్రకథలూ, సమిష్టిగానాలూ, సై. సై. భారతవీరా అనే వీర గేయాలు, డప్పుల వాయిద్యాలు, జంతరు పెట్టెద్వారా విషయబోధనా- ఇలా అనేక కళారూపాలను రచయితలూ, కళాకారులూ సృష్టించారు. పైన వివరించిన ఒక్కొక్క-

సందేశాన్ని తీసుకుపోయారు. ఈ మహత్తర కృషినీ, ఇంతటి కార్యభారాన్నీ నెత్తినేసుకుని ఒక అపూర్వమైన ప్రబోధంతో ఆంధ్రజాతిని నిస్తబ్ధత నుంచి మేల్కొల్పడమే గాక, ఆసేతు హిమాచల పర్యంతం ఆంధ్ర ప్రజా నాట్యమండలి ప్రదర్శనలు గొప్ప సంచలనాన్ని తీసుకువచ్చాయి. కళా రూపాలద్వారా ఎలా ప్రజా సమీకరణనూ, ప్రజా ప్రబోధాన్నీ చేయవచ్చో కళ్ళు తెరిపించింది ప్రజా నాట్యమండలి. ప్రజా నాట్యమండలి కవులందరూ అతి బీద ప్రజా సామాన్యపు బిడ్డలు. ప్రదర్శన లిచ్చిన కళాకారులందరూ అతి సామాన్య కుటుంబాలనుంచి వచ్చిన రైతు కూలీ బిడ్డలు.

### నాలుగు చెరగులా వ్యాపించిన నాటకోద్యమం :

ఇలా ప్రజా నాట్యమండలి ప్రవేశపెట్టిన సుసాంప్రదాయాలు, ఆ వుద్యమ శాఖలు ఆంధ్రదేశమంతటా, ఆంధ్ర నాటకరంగంలో మొలకలెత్తాయి. కళా రూపాల స్థాయినుంచి, నాటక ప్రదర్శనాల స్థాయికి చేరుకున్నాయి. జమీందారీ యుగాన్ని చిత్రించే "ముందడుగు" నాటకం సుంకర వాసిరెడ్డి కలాన్ని నుంచి బయటపడింది. సుశిక్షితమైన నాటకదళాలు రెండు మూడు తయారైనాయి.

### నాట్యమండలి శిక్షణాశిబిరాలు :

ఆనాడు ప్రజానాట్యమండలి రాష్ట్రీదళం ఆంధ్రదేశంలో అనేక జిల్లాలలో క్యాంపులు పెట్టి బుర్రకథలనూ, వీధినాటకాలనూ, చిత్రవిచిత్రమైన జానపదకళా రూపాలనూ తరిఫీదు ఇచ్చేది. ప్రతి క్యాంపు 15 రోజులు నిర్వహించబడేది. క్యాంపుకు వచ్చిన కళాకారులందరికీ ప్రప్రథమంలో డాక్టరు రాజారావు వైద్యపరీక్షను జరిపేవారు. క్యాంపు జరిగినంతకాలమూ ఎవరెవరికి ఏయే మందులుకావాలో, టానిక్కులు కావాలో వాడబడేవి. ప్రతి కళాకారుడూ ఉదయం నాలుగు గంటలకే కాలకృత్యాలు ముగించుకుని సాధన ప్రారంభించేవాడు. క్యాంపు పూర్తి ఆయ్యే లోగా దళాలు కట్టుదిట్టంగా తయారయ్యేవి. క్యాంపు జరిగినంతకాలమూ క్రమ శిక్షణ ఖచ్చితంగా అమలు జరుపబడేది. ఈ శిక్షణాశిబిరాలను డాక్టరు రాజారావు, కోగంటి, కోసూరు పున్నయ్య, మిక్కిలినేని, మాచినేని, పట్టంశెట్టి ఉమామహే

శ్వరరావు మొదలైన కళాకారులు నిర్వహించేవారు. శిబిరంలో పొందుతున్న కళా కారులందరూ అన్నదమ్ముల్లా మెలిగేవారు. ఈ క్యాంపుల్లో స్త్రీల దళాలుకూడా తయారయ్యేవి. క్యాంపులో వున్న స్త్రీ పురుషులందరూ అన్నాచెల్లెళ్ళవలె ఆదర్శ ప్రాయంగా మెలిగేవారు. ఏమాత్రం అశ్లీలత రానిచ్చేవారు కాదు. క్యాంపులో ఆత్మవిమర్శ ఎక్కువగా వుండేది. ఎవరికివారే వారి తప్పులను సరిచేసుకుని ఇతరు లకు ఆదర్శప్రాయులుగా వుండేవారు. ఈ క్యాంపులకు అయ్యే ఖర్చు ఆయా దళాలే భరించేవి. ఈ విధంగా రాష్ట్ర ప్రజా నాట్యమండలి అనేక క్యాంపులు నిర్వ హించి రాష్ట్రవ్యాపితంగా ప్రజానాట్యమండలి వుద్యమాన్ని వ్యాపింపజేసింది. పైవిధంగా నడిపిన శిక్షణాశిబిరాలు 15 వరకూ వున్నాయి. పై శిబిరాల్లో శిక్షణ పొందిన కళాకారులందరూ అనేక గ్రామాల్లో మరికొన్ని దళాలను తయారు చేయడంద్వారా ప్రతి గ్రామంలో ప్రజానాట్యమండలి శాఖలు ఏర్పడ్డాయి.

### కృష్ణాజిల్లా ప్రజానాట్యమండలి :

ప్రజానాట్యమండలి రాష్ట్రవ్యాపిత వుద్యమంలో కృష్ణాజిల్లా ప్రజానాట్య



కృష్ణాజిల్లా ప్రజానాట్యమండలి - బుర్రకథదళం
మిక్కిలినేని - ఉమామహేశ్వరరావు–మాచినేని.

మండలి ఆదర్శప్రాయమైన కృషిచేసింది. ఈ దళంలో యస్. యల్. పెరుమాళ్లు, కీ॥ శే॥ చదలవాడ కుటుంబిరావు, తుమ్మల కేశవరావు, వల్లం నరసింహారావు, వీరమాచనేని మధుసూదనరావు, పొట్లూరు వెంకట సుబ్బారావు, మిక్కిలినేని, మాచినేని, పట్టంశెట్టి ఉమామహేశ్వరరావు, కోడూరు అచ్చయ్య, కర్నాటి లక్ష్మినర్సయ్య, కీ॥ శే॥ సుంకర గోపాలకృష్ణ, సాలార్, కోటిరెడ్డి, కృష్ణారెడ్డి, ప్రసాద్, శ్రీమతి టి. అన్నపూర్ణ, కొండేపూడి రాధ, వీరమాచనేని సరోజని, బసవపున్నయ్య, కీ॥శే॥ ప్రేమానందం, టి. చలపతిరావు. (మ్యూజిక్ డైరెక్టర్), సజ్జల హనుమంతరావు (తబలిస్టు) మొదలైన కళాకారులు పనిచేస్తూవుండేవారు.

పెరుమాళ్ళు, చదలవాడ, కేశవరావు బుర్రకథ కార్యక్రమాలను జిల్లా వ్యాపితంగా విరివిగా ప్రదర్శిస్తూ వుండేవారు.

# ముందడుగు వేసిన 'ముందడుగు' నాటకం

ప్రప్రథమంగా కృష్ణాజిల్లా ప్రజానాట్యమండలి ముందడుగు నాటకాన్ని తీసుకుని కోడూరు అచ్చయ్య దర్శకత్వంలో అత్యద్భుతంగా ప్రవర్శించారు. అనతికాలంలోనే ఆంధ్రదేశంలో ప్రజాభిమానాలను చూరగొంది. ఈ నాటకంలో పెరుమాళ్ళు ఒక వృద్ధ స్త్రీ పాత్రను అత్యద్భుతంగా నటించేవాడు. వల్లం నరసింహారావు కథానాయకి విమలపాత్రను కడు సమర్థనీయంగా నటించి ప్రేక్షకుల హృదయాలను చూరగొన్నాడు. ఇతర నటీనటులందరూ సమిష్టికృషితో ఆదర్శ ప్రాయంగా ముందడుగు నాటకాన్ని ప్రదర్శించి అనేక అమెచ్యూర్ నాటకదళాలకు నూతనమార్గం చూపించారు. ఇదేదళం అపనింద నాటకాన్ని కూడా కట్టుదిట్టంగా ప్రదర్శించారు. కాని ఈ నాటకానికి ప్రజాచరణ అంతగా లభించలేదు.

# ముందడుగు నాటకం గురించి

శ్రీ ఖాసా సుబ్బారావు :

"ప్రజానాట్యమండలి ముందడుగు నాటకం అత్యద్భుతప్రదర్శనం. కొన్ని సన్నివేశాల్లో నాకళ్ళవెంట కన్నీటిధారలు జల జలా రాలాయి. నేను పేదవాణి

అయినా 116 రూపాయలు ఇస్తున్నాను. ప్రజానాట్యమండలిని అభినందిస్తున్నాను."

శ్రీ ఉప్పల లక్ష్మణరావు:

"నేను అనేకమైన ప్రసిద్ధ నాటక ప్రదర్శనాలను ఐరోపా మొదలైన దేశాలలో చూశాను. కాని ఈ ముందడుగునాటకంమాత్రం నేను చూచిన అన్ని ప్రదర్శనాలకంటే ఎక్కువగా కదిలించివేసింది.

నిజంగా ప్రజానాట్యమండలిలో ఇంతటి సమర్థులైన నటులున్నారని నేనెప్పుడూ వూహించలేదు."

శ్రీమతి కొమ్మూరి పద్మావతీదేవి:

"ప్రజానాట్యమండలివారు ముందడుగు ప్రదర్శించి మా అందరికీ దారి చూపించారు. నేను ఎన్నో నాటకాలు చూశాను. ప్రసిద్ధనటులతో నటించాను. కళను గురించి ప్రముఖుల ఉపన్యాసాలు విన్నాను. నటులున్నారుకాని నాటకాలు లేవన్నారు. ఈ ప్రజానాట్యమండలివారు మాత్రం క్రియారూపంగా ముందడుగు వేసి మకీ చూపించారు."

స్త్రీల బుర్రకథ దళం:

పురుషుల బుర్రకథ దళాలతోపాటు స్త్రీల బుర్రకథ దళాలుకూడ అత్యంత ప్రాముఖ్యాన్ని వహించాయి. ప్రథమంలో మోటూరు ఉదయం, చింతల కోదేశ్వరమ్మ, మహంకాళి పార్వతి మొదలైనవారితో ఒక దళం ఏర్పడి గుంటూరు జిల్లాలో ప్రజాప్రబోధాన్ని గావించింది. తరువాత కృష్ణాజిల్లా ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో కొండేపూడి రాధ, తాపీ రాజమ్మ, వీరమాచనేని సరోజని మొదలైనవారు బుర్రకథ దళంగా ఏర్పడి, అల్లూరు సీతారామరాజు జీవితచరిత్రను సుందర బుర్రకథగా వ్రాయగా, ఆ కథను ఎంతో రసవత్తరంగా ప్రదర్శించి ఆంధ్రప్రజానీకాన్ని పులకింత లూగించారు. ఆంధ్రదేశంలో అనేక ప్రాంతాల్లో ఈ కథను చెప్పడమే గాక, మద్రాసు నగరంలో మంత్రుల సమక్షంలో ప్రదర్శించి ఆనాటి కాంగ్రెసు మంత్రుల మన్ననలు పొందడమేకాక వారినుండి పారితోషికాలు కూడా పొందారు. కాని అనతికాలంలో ఈ కథను కాంగ్రెసు ప్రభుత్వం నిషేధించింది. ఆ తరువాత భీమవరం బాలికల బుర్రకథ దళం కూడా ప్రజామన్ననలు పొందింది.

# బుర్రకథ ప్రశంస

శ్రీ నిడదవోలు వెంకటరావు:

"ఇదివరలో బుర్రకథ అనుకోవడమేగాని దాని సంగతి నాకు తెలియదు. బుర్రకథ అని మామూలుగా వ్యవహరించేదానికి ఎంత లోతైన అర్థముందో! చెన్న పురిలో జరిగిన పీరేశలింగంగారి చరిత్ర, వంగదేశంలో కరువు బుర్రకథలుగా విన్నాను. మొదలుపెట్టిన దగ్గరనుండి తదేక ధ్యానముతో విన్నాను. తెనుగు మాట, తెనుగుపాట, తెనుగువేషము-ఈ మూడు మూర్తీభవించినవి. అచ్చు గ్రుద్దినట్లు మాటలు, పాటలు, గుండెలలో సూటిగా నాటుకొని పోయినవి. కన్ను లార చూడడము, చెవులార వినడముచేత మనసార తెలుగుదనము హత్తుకొని పోయినది. హృదయము నాలుగు మూలలా కదిలించింది. జడత్వమును వదిలించి నది. తెనుగురక్తము నాడులలో పూర్తిగా ప్రవహించడము మొదలుపెట్టినది. హృదయ కుహరములనుండి జలజల వచ్చే ప్రవాహరూపకమైన కరుణ రసము ఆపుటకు వీలులేని స్థితి వచ్చినది."

# చరిత్రాత్మకమైన 'మాభూమి' నాటకం

సుంకర,
వాసిరెడ్డి ప్రతిభ:

ముందడుగు, అపనింద నాటక రచయితలైన సుంకర సత్యనారాయణ, కీ॥ శే॥ వాసిరెడ్డి భాస్కరరావుగార్లే చరిత్రాత్మకమైన మాభూమి నాటకాన్ని కూడా రచించారు. నైజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా తెలంగాణా ప్రజలు జరిపిన పోరాట ఫలితమే మాభూమి నాటక ఇతివృత్తం. నైజాం కిరాతక పోలీసులూ, రజాకార్లూ, తెలంగాణా గ్రామాలను భస్మీపటలం చేశారు. ఈ పోరాటంలో 240 గ్రామాలపైన విపరీతమైన పోలీసుదాడులు జరిగాయి. 8500 మంది జైళ్ళలో త్రోయబడ్డారు. 12 లక్షల 25 వేల విలువగలిగిన ఆస్తులు లూటీ చేయబడ్డాయి. 52 మంది వీరులు ప్రాణాలను కోల్పోయారు. 64 గురు తెలుగు ఆడపడుచుల్ని

కిరాతకులు మానభంగం చేశారు. వీరిలో ఇద్దరు మరణించారు. నల్లగొండ జిల్లాలో జరిగిన ఈ మహోజ్వల పోరాటమే మమ్మల్ని నాటకం రాయడానికి ప్రోత్సహించిందని మాభూమి రచయితలు పీఠికలో వ్రాసుకున్నారు. పైన వుదహరించిన వారే గాక, తెలంగాణా విముక్తి పోరాటంలో కొన్నివేలమంది వీరులు అమరులై నేలకొరిగారు.

తెలంగాణా ప్రజలు వీరోచిత పోరాటాలు భారతదేశాన్ని ఉర్రూత లూగించాయి. ప్రపంచమంతటా ఆనాటి తెలంగాణా పోరాటాన్ని గూర్చి కథలుగా చెప్పుకున్నారు. ఈ ఉజ్వల చరిత్ర ప్రతిబింబమైన మాభూమి నాటకం ముక్కోటి ఆంధ్ర ప్రజలకు కనువిప్పు కలిగించింది. ఆంధ్రదేశంలోనే గాక, రాష్ట్రేతర ప్రాంతాలైన మద్రాసు, షోలాపూరు, పూనా, బొంబాయి, అహమ్మదాబాద్ మొదలైన చోట్ల ప్రదర్శించి, తెలంగాణా వీరోచిత పోరాట గాథను ఇతర రాష్ట్ర వాసులకూ తెలియజేశారు. ఈ ప్రచారంలో ఆంధ్ర ప్రజా నాట్యమండలి రాష్ట్రదళం, కృష్ణాజిల్లా దళం ప్రముఖపాత్ర వహించాయి. 1947 లో 125 ప్రజానాట్యమండలి శాఖలు సంవత్సరం తిరగకమునుపే వెయ్యి నాటకాలను ప్రదర్శించాయి. ఒక్క-నాటకాన్ని 125 దళాలు సంవత్సరం తిరగకమునుపే వెయ్యి నాటక ప్రదర్శనాలివ్వడం వరల్డు రికార్డన్నాడు-క్వాజా అహమ్మద్ అబ్బాస్, బొంబాయిలో మాభూమి నాటకం చూచి.

మాభూమి నాటక ప్రదర్శనాలను ఆనాడు 20 లక్షలమంది ప్రజలు చూశారు. ఆంధ్రదేశంలో ఇంత తక్కువ కాలంలో ఇంతమంది ప్రజలు ఏ నాటకాన్నీ దర్శించలేదు.

మంత్రులు, రాజకీయ నాయకులు, కవులు, పండితులు, గాయకులు, పత్రికా సంపాదకులు, రచయితలు, ఎం. ఎల్. ఏలు మొదలైన అన్ని తరగతి ప్రజలూ, అన్ని వర్గాలవారూ మాభూమి నాటకాన్ని చూచి ఉత్తేజం పొందారు. సోదర తెలంగాణా ప్రజల కష్టాలను ఈ నాటకంద్వారా కళ్ళారా తిలకించారు.

మాభూమి నాటకంలోని ప్రతిపాత్రా - ఆ గడ్డలో పుట్టి పెరిగిన జీవితాలు. వాస్తవికమైన పాత్ర చిత్రణ - వారిలోవున్న అవినాభావ సంబంధం - తెలంగాణా యాస - మృదు మధురమైన మాండలిక సొగసులతో మాభూమి నాటకం ఒక మహా కావ్యంగా నిలబడింది.

మాభూమి నాటకం,
పెద్దల ప్రశంసలు:
శ్రీ విశ్వనాథ సత్యనారాయణ:

"ఈ నాటక రచన కొద్దిలో మిక్కిలి అందంగా వుంది. ఇందులో అచ్చమైన తెలుగు జాతీయము కుప్పలు కుప్పలుగా వుంది. మాభూమిలో వున్న భాష తెలుగు గడ్డలో పుట్టిన భాష. ఈ నాటకం బిందగీ సమాధితో మొదలు పెట్టుతుంది. చివర సమాధులతో పూర్తి అవుతుంది. ఒక కావ్యానికి ఆద్యంతాలు ఇంత చక్కగా బిగించడం ఒక శిల్పపు నేర్పు."

తిక్కన తరువాత మళ్ళీ ఈ నాడు జాతీయమైన భాష విన్నాం. ఆనాటి తెలుగు ఔన్నత్యం పునరుద్ధరించ బడుతూ వుందని ఈ కవులు రుజువు చేశారు.... అని పింగళి లక్ష్మీకాంతంగారు కొనియాడారు.

మాభూమి తెలంగాణా ప్రజల్లో అసమర్థతను పారద్రోలి, తెలంగాణాలో ఒక విప్లవ జ్యోతిని వెలిగించుతోంది. ఆంధ్ర నాటకరంగంలో ఒక కొత్తశకం ప్రారంభమైంది అన్నారు కొప్పరపు సుబ్బారావుగారు.

....శ్రీ గురజాడ అప్పారావుగారే ఈ నాటకాన్ని చూచి వున్నట్లయితే తాముపడ్డ కష్టాలన్నీ ఫలించినాయి అని అనివుండేవారని నా భావం. ఇక్కడ కూర్చున్నంతసేపూ, నాటకం చూస్తున్నంతసేపూ నాటకం చూస్తున్నట్లు లేదు. ఈ దృశ్యాలన్నీ మన కళ్ళ ఎదుట జరుగుతున్నట్లే వుంది....అని గిడుగు సీతాపతిగారు అభినందించారు.

ఆంధ్ర ప్రజా నాట్యమండలివారు ప్రదర్శించిన "పరివర్తన" "మాభూమి" నాటకాలను చూశాను. ఈ నాటకాలు రెండూ, రెండే....ఈ ప్రదర్శనలు నేను మరవలేనివి అన్నారు మల్లంపల్లి సోమశేఖరశర్మగారు.

శ్రీ శ్రీనివాస చక్రవర్తి ప్రశంస:

1920 లో బళ్ళారి రాఘవ వెలిగించిన విప్లవజ్యోతిని ఆనాటి నటు లందుకోలేక పోయారు. కాని, 1940 తరువాత సాంస్కృతికంగా - రాజకీయంగా దేశంలో వచ్చిన చైతన్యం ఫలితంగా రాఘవ వెలిగించిన విప్లవజ్యోతిని అందుకుని ప్రజానాట్యమండలి 1945 లో ఆవిర్భవించింది. ఇందులోని వారిది సాంస్కృతికంగా-

రాజకీయంగా ఒకటే ఆశయం. సుసంఘటిత శక్తితో నాటకరంగాన్ని సజీవం చేయడానికి ఒక పెద్ద వుద్యమం లేవదీశారు. దీనికి కమ్యూనిస్టుపార్టీ అండగా నిలిచింది. పల్లెపల్లెనా పట్టణ పట్టణానా దీనికి అనుబంధశాఖ లేర్పడ్డాయి. డా॥ రాజారావు - కోడూరు అచ్చయ్య దీనికి సన్నాహకర్తలు. వాసిరెడ్డి - సుంకర ప్రజా సమస్యలను నాటకరూపంలో చిత్రించి ఇచ్చారు. నటులు కష్టించి సాధన చేసి ఉత్తమ ప్రదర్శనాలిచ్చి, అటు కళావేత్తల - ఇటు ప్రజానీకం మన్ననల నందు కున్నారు.

ముఖ్యంగా మాభూమి నాటకం చేతాన్ని ఉద్రూత లూగించింది. అభినయంలో, రంగాలంకరణలో వాస్తవికతకు ప్రాధాన్యత చేకూర్చింది. ప్లాష్‌లైట్లు మొదలగు ఆధునిక పరికరాలను ప్రచారంలోకి తెచ్చారు. స్టేజి నాటకాలే కాక చెంచీతపాటలు - బుర్రకథలు - జముకులకథలు- వీధినాటకాలు మొదలైన తెలుగు జాతీయ గ్రామీణకళలను పునరుద్ధరించి. ఆంధ్ర నాటకరంగ చరిత్రలో ప్రజా నాట్య మండలి నవ్యయుగం స్థాపించి. ఆంధ్ర జాతి ముందడుగు వేయడంలో ఎంతగానో తోడ్పడింది.

శ్రీ పి. యస్. ఆర్. అప్పారావు :

ప్రజా నాట్యమండలివారి ప్రదర్శనాలన్నీ చక్కని శిక్షణతో జరిగి విరోధులను కూడ ఆకర్షించాయనడంలో అతిశయోక్తిలేదు. ప్రజా నాట్యమండలి పల్లె ప్రజలలో కలిగించిన సాంఘిక రాజకీయ చైతన్యం అపూర్వమైంది. అందుకు వారు చేపట్టని జానపద కళారీతియే లేదని చెప్పవచ్చు. నాటక కళను-కళా దృష్టి తొలిగి పోకీకయే ప్రచార సాధనంగా చేశారు. ప్రజా నాట్యమండలికి ముందు నాటక ప్రదర్శనాలను చూడవలెనంటే పల్లె ప్రజలు పనికట్టుకుని పట్టణాలకు రావలసి వచ్చేది. కాని ప్రజా నాట్యమండలివారు పల్లెలకేపోయి అక్కడనే నాటకాలను ప్రదర్శించటం విశిష్ట విషయం.

ప్రజానాట్యమండలి
నాటక ప్రదర్శనం :

ప్రజానాట్యమండలి రాష్ట్రిదళం, కృష్ణాజిల్లాదళం, ముందడుగు, అపనింద, పరివర్తన, మాభూమి మొదలైన నాటకాలనూ అనేక నాటికలనూ ప్రదర్శించాయి.

రాష్ట్రీయశిబిరానికి డా. రాజారావు, జిల్లాశిబిరానికి కోడూరు అచ్చయ్య దర్శకత్వబాధ్యతలను నిర్వహించారు. శిక్షణాశిబిరాల్లో ఈ నాటకాలు తయారయ్యేవి. రచయితలూ, దర్శకులూ, నటీనటులూ అందరూ సమిష్టిగా కథనుగురించి సావకాశంగా చర్చలు జరిపేవారు. ఒక నిర్ణయానికి వచ్చినతరువాత నాటకం వ్రాయబడేది. అందరి సమక్షంలో నటీ, నటులకు అర్థమయ్యేవిధంగా రెండుమూడుసార్లు నాటకాన్ని పఠించేవారు. చేయవలసిన మార్పులు చేసినతరువాత పాత్రవిభజన జరిగేది. పాత్ర విభజనానంతరం పాత్రల మనస్తత్వాన్ని తెలియజేసి, ఆయా పాత్రధారుల చేత సంభాషణలు చదివించేవారు. ఈ దశలో వాచికాభినయంలో కావలసిన మార్పులు చేసేవారు. పాత్రధారికి ఋణంగా సంభాషణలు వచ్చినతరువాత నిలబెట్టి రిహార్సల్స్ చేయించేవారు. ఆంగికాభినయం, రంగస్థల కిదలికలన్నీ సరిచూడబడేవి. ముందు ఒక్కొక్క సీనులోనూ, ఒక్కొక్క సన్నివేశాన్ని కట్టుదిట్టంగా బిట్ రిహార్సల్స్ జరిపి, ఆ రంగానికి కావలసిన పరిపుష్టిని కలిగించేవారు. తరువాత నాటకానికి పూర్తి వద్దికలు జరిపేవారు. ఈ వద్దికల సమయంలో నటీనటులందరూ వారివారి పాత్రలను ఋణంగా మననం చేసుకుని, వారి పాత్ర ప్రవేశానికి సిద్ధంగా వుండేవారు. ఇలా ప్రతిరోజూ నాటకాన్ని ఒకటి రెండుసార్లు రిహార్సల్స్ జరిపేవారు. ఒక రిహార్సల్స్‌లోకంటే, రెండవ రిహార్సల్స్‌లో కావలసిన మెరుగులు దిద్దుతూ వుండేవారు. ఇలా అనేక రిహార్సల్స్ జరిపి ఒకరోజున స్థానికంగావున్న విమర్శకుల ముందు ప్రదర్శించేవారు. ఈ ప్రదర్శనంలో వేషధారణ ఏమాత్రమూ వుండేదికాదు. ఆ ప్రదర్శనానంతరం విమర్శకుల సూచనలు తీసుకునేవారు. అందరూ సమిష్టిగా మంచిచెడులను పరిశీలించి చర్చలు జరిపేవారు. ఈ చర్చలు ఎంతో హుందాగా జరిగేవి. నటీనటులందరూ హృదయపూర్వకంగా విమర్శకుల సూచనలను స్వీకరించేవారు. తరువాత పూర్తి రిహార్సల్స్ జరపడం ద్వారా విమర్శలో వచ్చిన లోపాలను సరిదిద్దుకుని డ్రస్సు రిహార్సల్స్ జరిపేవారు. తద్వారా అలంకరణలో కావాల్సిన స్వల్ప మార్పులను అప్పుడే సరిచూచుకునేవారు. ప్రదర్శనానికి ముందే ఎవరి పాత్ర ఎలావుండాలో ప్రతి పాత్రధారికి ఒక అభిప్రాయాన్ని కలిగించేవారు.

పక్కా రంగస్థలంలో ప్రదర్శన:

ఆ తరువాత పక్కా రంగస్థలంలో తెరలూ, లైటింగ్ ఎఫెక్ట్సు చూచుకో

వడానికి పూర్తి రిహార్సల్సు జరిపేవారు. ఈ సందర్భంలో మళ్ళీ కొంతమంది విమర్శకులనూ, ప్రేక్షకులనూ కూడ ఆహ్వానించి నాటకాన్ని పూర్తి హంగులతో ప్రదర్శించేవారు. ప్రదర్శనానంతరం తెరలు, రంగప్రదీపనంలో కావలసిన మంచి చెడులను విమర్శకులనుండీ, ప్రేక్షకులనుండీ సేకరించేవారు. ఇలా నాటకాన్ని ఒక ఉత్తమ ప్రదర్శనంగా తీర్చిదిద్దేవారు.

ప్రదర్శనం రోజు :

ప్రదర్శనంరోజున అందరూ అన్ని పనులూ విభజించుకునేవారు. ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అనే భేదాభిప్రాయాలకు తావుండేదికాదు. అందరూ ప్రదర్శనానికి రెండు గంటలముందు గ్రీన్‌రూమ్‌కు చేరుకుని ఎవరి అలంకరణను వారే సరిదిద్దుకునేవారు. ప్రదర్శనానికి ముందే అన్నిపాత్రలూ వేషధారణను ముగించుకుని ఆహ్లాదంగా వారి వారి పాత్రలను మరొకసారి వల్లెవేసుకుని ఎవరి సీనులో ఎవరెవరికి ఏయే సామానులు కావాలో, ఎవరు ఎటునుంచి ప్రవేశించాలో, ఎటు నిష్క్రమించాలో, వా రుపయోగించే చిన్నచిన్న పరికరాలను సైతం సరి చూచుకుని సిద్ధంగా వుంచుకునేవారు. ప్రదర్శనం రాత్రి 10 గంటలకు. ప్రేక్షకులు వచ్చినా రాకపోయినా 9-45 నిమిషాలకు మొదటిగంట మ్రోగేది. సరిగా పది గంటలకు నాటకం ప్రారంభమయ్యేది. ప్రదర్శనం పూర్తి అయ్యేవరకూ నాట్య మండలి సభ్యులందరూ ఒక్క తాటిమీద నడిచేవారు. రంగాలమధ్య విరామాలు, లేకుండా ఒక్క ప్రక్కనుండి సామాన్లు తీసివేస్తూంటే మరో ప్రక్కనుంచి ఆ రంగానికి కావలసిన పరికరాలు సర్దబడేవి. ఇలా సమిష్టికృషితో నాటకప్రదర్శనం జయప్రదమై ప్రేక్షకుల కరతాళధ్వనులను అందుకునేది. ఇలా ప్రజానాట్యమండలి నాటకప్రదర్శనం ముగిసేది.

ఈ ప్రదర్శనాన్ని చూడడానికి అనేక పట్టణాలనుండీ గ్రామాలనుండీ అనేక దళాలకు సంబంధించిన నటీ నటులు వచ్చేవారు. ఈ ప్రదర్శనాన్ని చూచిన తరు వాత అదే నాటకాన్ని ఆవలగా అన్ని దళాలు ప్రదర్శించేవి.

ప్రజా నాట్యమండలి ప్రదర్శించే ప్రదర్శనాలు ఏ పట్టణంలో ప్రదర్శించినా స్థానికంగా వున్న కళాకారులను, విమర్శకులను ఉచితంగా ప్రదర్శనానికి ఆహ్వానించేవారు. ప్రదర్శనానంతరం వారి విమర్శలు తీసుకునేవారు. మంచి చెడులను

తిరిగి చర్చించి మరో ప్రదర్శనంలో వారిచ్చిన సూచనలు అమలుపర్చడంద్వారా ప్రతి ప్రదర్శనానికీ కొత్త మెరుగులు దిద్దుతూ వుండేవారు. ఈ విధంగా ప్రదర్శనం రోజు రోజుకూ కొత్తరూపును సంతరించుకునేది.

### ఒకే రాత్రి రెండు ప్రదర్శనాలు :

ఆనాడు ప్రజా నాట్యమండలి నాటక ప్రదర్శనమంటే మూడు రోజులు ముందుగానే టికెట్లన్నీ ఐపోయేవి. చుట్టుప్రక్కల గ్రామాలనుండీ, దూరప్రాంతాల నుండీ తండోపతండాలుగా ప్రజలు వచ్చేవారు. ప్రతి ప్రదర్శనానికీ హాలు నిండి పోయి రెండవ ప్రదర్శనానికి సరిపడినంతమంది ప్రేక్షకులు మిగిలిపోయేవారు. అందువల్ల ప్రతి పట్టణంలోనూ ఒకేరాత్రి రెండు ప్రదర్శనలను ప్రదర్శించవలసి వచ్చేది. ఇలా ఒకే రాత్రి రెండు ప్రదర్శనలను ప్రదర్శించే సాంప్రదాయం ప్రప్రథమంగా ఆంధ్రదేశంలో ప్రజా నాట్యమండలే ప్రవేశ పెట్టింది. ఈ విధంగా ప్రజా నాట్యమండలి నాటక ప్రదర్శనలు ప్రజాదరణను పొందాయి.

### రాష్ట్రేతర ప్రదర్శనాలు :

ప్రజా నాట్యమండలి రాష్ట్ర దళం ఆంధ్రదేశంలోనేకాక ఇతర రాష్ట్రాల్లో కూడా పర్యటించి ప్రదర్శనలనిచ్చి రాష్ట్రేతరుల ప్రశంస లందుకుంది.

రాష్ట్రదళ సభ్యులైన, మిక్కిలినేని- మాచినేని - ఉమామహేశ్వరరావు బుర్రకథదళంద్వారాఖరగ్‌పూర్-కలకత్తా-ఖూన్‌నగర్-జగదల్-మహేష్-టిటాఘర్-హుగ్లీ మొదలైన చోట్ల బుర్రకథ ప్రదర్శనాలనిచ్చి అధిక ప్రశంసల నందుకుంది.

### రాష్ట్రదళ సభ్యులు :

1948 జనవరిలో అహమ్మదాబాదులో జరిగిన అఖిల భారత ప్రజా నాట్య మండలి మహాసభకు రాష్ట్రదళ సభ్యులైన డా. రాజారావు-కోసూరు పున్నయ్య-మిక్కిలినేని-సి. మోహన్‌దాసు-నాజరు-సుంకర సత్యనారాయణ-మాచినేని పూర్ణ చంద్రరావు-సిరివిశెట్టి సుబ్బారావు - మిక్కిలినేని సీతారత్నం - చిరంజీవి సూర్య కాంతం-కోగంటి గోపాలకృష్ణయ్య-పట్టుశెట్టి ఉమామహేశ్వరరావు-వెంపటి రాధా కృష్ణ - ఏపూరు రామకోటి - పురుషోత్తం - బి. గోపాలం - జయరాం - సుబ్రహ్మణ్య - శ్రీహరి - అమృతయ్య - ఏసుదాసు - డాక్టరు చంద్రశేఖరం మొద

లైన కళాకారులందరూ హాజరైనారు. ఈ దళం అహమ్మదాబాదు, బొంబాయి, పూనా, షోలాపూర్ మొదలైన ప్రాంతాల్లో 15 కళారూపాలను ప్రదర్శించడమేకాక మాభూమి నాటకాన్ని ప్రదర్శించడంద్వారా రాష్ట్రేతరుల్ని వుత్తేజపర్చింది. ఆనాటి నిజాం నిరంకుశ పరిపాలనను కళ్ళకు కట్టినట్లు చూపింది.

అహమ్మదాబాదు మహాసభలో ఆంధ్రదళం ప్రదర్శనలు అగ్రశ్రేణిలో నిలిచాయి. అన్ని రాష్ట్రాల ప్రదర్శనలకంటే మిన్న అనిపించుకున్నాయి. క్వాజా మహమ్మద్ అబ్బాస్, బెంగాలీ నటుడు మనోరంజన్ భట్టాచార్య, బల్‌రాజ్ సహానీ, ప్రేమధావన్ మొదలైన కళాకారులు బొంబాయి ఖాల్సాకాలేజీలో రాష్ట్రదళ సభ్యులను ఘనంగా సన్మానించారు. మాభూమి నాటకం బొంబాయి, పూనా, అహమ్మదాబాదు, షోలాపూర్ నగరాలలో వరుసగా ప్రదర్శింపబడి అన్యభాషేతరుల ప్రశంసలు కూడా పొందింది. ఒక్క షోలాపూర్‌లో మాభూమి నాటక ప్రదర్శనం చూడడానికి 0-4-0 టిక్కట్టుకొని 10 వేలమంది హాజరై ప్రదర్శనాన్ని తిలకించారు.

# ప్రజా నాట్యమండలి చేపట్టిన కళారూపాలు

జానపద కళారూపాలు :

బుర్రకథ - జముకుల కథ - హరికథ - పిచ్చుగుంటుల కథ - వీధి భాగవతం - కోయవేషం - డప్పులకోలాటం - దేవరపెట్టె - పంటసిరి నృత్యం - సై సై నృత్యం - క్వారీపాటలు - పడవపాటలు - చిరతలకోలాటం - చెంచువేషాలు - ఫకీరువేషాలు - గొల్లసుద్దులు - హరిహరి పదాలు - సమిష్టిగానాలు - శాంతి మూకాభినయనం - చక్కభజన - జంతరుపెట్టె - షాదోప్లే - కనక తప్పెట్లు - పిట్టలదొర - సోదె మొదలైనవి.

నాటకాలు :

ముందడుగు - అపనింద - మాభూమి - పరివర్తన - కన్యాశుల్కము - వరవిక్రయం - ఆసామి - వీరేశలింగం ప్రహసనాలు - ఇంగా - అల్లూరి సీతారామరాజు - జైభవాని - ఈనాడు.

నాటికలు :

పశ్చాత్తాపం - ప్రతిమ - మబ్బుతెర - పరిష్కారం - ఇల్వా - దేశ

భక్తులు - ద్రోహి - ప్రెస్‌వర్క్‌ర్ - ప్రసూతి - ప్రగతి - జీతగాడు-వీరకుంకుమ.

### ఉత్సాహం కొద్దీ నిర్మించింది కాదు
### ప్రజా నాట్యమండలి :

ఉత్సాహం కొద్దీ నిర్మించింది కాదు ప్రజా నాట్యమండలి. అది ఒక ఉధృతమైన వాతావరణంలో జన్మించింది.

కేవలం ఆర్థికలాభాలకొరకు నిర్మించింది కాదు. ఒక ఉన్నతాశయ ప్రబోధంతో దేశానికి ప్రజలకు సేవచేయడానికి పుట్టింది.

కళ కళకోసం కాదని, అది ప్రజలకోసమని నిరూపించింది.

కళ వ్యక్తులసొత్తు కాదనీ, అది ప్రజలకు చెందిన ఆస్తి అనీ చాటింది.

దేశంలో వచ్చిన రాజకీయ కల్లోల వాతావరణంలో రూపొందింది ప్రజా నాట్యమండలి. అదివరకు ఏనాడూ ఆంధ్ర నాటకరంగంలో కనీ వినీ ఎరుగనంతటి మహత్తర పరిణామాలను సృష్టించింది. గత చరిత్రకంటే ఈ యుగంలోనే నాట్యకళ సంపూర్ణంగా ప్రజాసామాన్యం మధ్యకు పోయిందని చెప్పవచ్చు. ప్రజలయొక్క స్థితిగతులకు అనుకూలంగా వారి కష్టాల్లో పాలు పంచుకుని పరిష్కారమార్గాలను కళారూపాలద్వారా పరిష్కరించింది. ప్రజలు నాటకరంగాన్ని తమ కన్నబిడ్డను ఆదరించినట్లు ఆదరించింది ఈ రోజుల్లోనే.

### ఎన్నో క్యాంపులు - ఎన్నో దళాలు-
### ఎందరో నటులు :

ఈ మహత్తర కృషిలో నాట్యమండలి సభ్యులందరూ కలిసికట్టుగా పనిజేశారు. ప్రతి వ్యక్తి దేశభక్తితో నడుంకట్టి నిలబడ్డాడు. అనతికాలంలో ఆంధ్ర దేశమంతటా కొన్నివేలమంది యువకుల్నీ, యువతుల్నీ, బాలబాలికల్నీ ప్రజా నాట్యమండలి ఆకర్షించింది. కొన్నివందలమంది కళాకారులను క్యాంపులు పెట్టి తరిఫీదు నిచ్చింది. అనతికాలంలో ఆంధ్రదేశంలో ప్రతి వ్యక్తికీ ప్రజా నాట్యమండలి మహత్తర ప్రబోధం తెలిసిపోయింది. ఊరూరా దళాలు ఏర్పడ్డాయి. ప్రతిరాత్రి ఏదో ఒక గ్రామంలో ఎక్కడో ఒక మహాసభలో ప్రదర్శనలు ఇవ్వబడుతూ వుండేవి. ఆనాడు జరిగిన ప్రతి సభలోనూ వైజ్ఞానిక ప్రదర్శన లివ్వబడాయి. ప్రతి వూరేగింపులోనూ నాట్యమండలి కళాకారులు గేయాలు

పాడారు. ప్రతి సాహిత్యసభలోనూ గురజాడ దేశమును ప్రేమించుమన్నా గేయం, వీరేశలింగం బుర్రకథ తప్పకుండా చెప్పబడేవి.

### ప్రజాశక్తిగా నిలబడిన ప్రజానాట్యమండలి :

ఆనాడు ప్రజావుద్యమాల్లో ప్రజానాట్యమండలి కూడా ఒక శక్తిగా నిలబడింది. నాట్యమండలి ప్రదర్శనలంటే ఎవ్వరికీ ఏవిధమైన భేదాభిప్రాయాలుండేవి కావు. ఉన్నత, మధ్యమ, పేదప్రజల వరకూ అందరూ ఏక దృష్టితో చూచి ఆనందించేవారు.

ఒక్కొక్క బుర్రకథకు 20 వేలమంది ప్రేక్షకులవరకూ హాజరయ్యారంటే నాట్యమండలి ప్రదర్శనలకు ప్రజాదరణ ఎంత వుందో బోధపడుతుంది.

### కళాకారుల కోలాహలం :

ఏదో ఒక గ్రామంలో ప్రజా నాట్యమండలి ప్రదర్శనం ఇస్తూ వుందంటే చుట్టుప్రక్కల గ్రామాలనుంచి తండోపతండాలుగా బళ్ళుకట్టుకుని బారుబు తీర్చి వూరేగింపులద్వారా ఆటలతో పాటలతో ఆబాలగోపాలం కదలివచ్చేవారు. ప్రదర్శనం ప్రారంభమై మరల పూర్తి అయ్యేలోగా ఒక వ్యక్తి కూడా మధ్యలో లేచేవాడు కాదు. ప్రతి ప్రదర్శనం అంత బాగా ప్రదర్శింపబడేది. ఏ ప్రదర్శనం చూచినా, ఏ పాటవిన్నా ప్రజలకు అర్థంకానిది ఒక్కటీ వుండేది కాదు. ప్రజల మనస్తత్వాల ననుసరించీ, వారి అభిరుచుల ననుసరించీ పాటలు ప్రదర్శనలు ఇవ్వబడుతూ వుండేవి.

ప్రజా నాట్యమండలి ప్రదర్శనలు కొన్ని లక్షలమంది ప్రజలు చూశారు. ఆనాటి తెలుగు జాతీయ జీవితంలో ప్రజా నాట్యమండలి ఒక ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది. అట్టడుగున పడిపోయిన ప్రాచీన కళారూపాల నన్నిటినీ సంస్కరించి ఆంధ్ర నాటకరంగ చరిత్రలో ఒక మహోపప్లవాన్ని తీసుకు వచ్చింది. ప్రజా నాట్యమండలి దోపిడీవర్గాన్ని, సంఘ విద్రోహుల్ని, సంఘంలో వున్న కుళ్ళునూ కళారూపాలద్వారా కడిగివేసింది.

### విశాలాంధ్రలో వెల్లువగా సాగిన ప్రజా నాట్యమండలి :

ఈ విధంగా అనతికాలంలో ఆంధ్ర ప్రజలలో నూతన చైతన్యం కలిగించింది ప్రజా నాట్యమండలి. ఇంత త్వరితంగా ఏదేశంలో వుదమ్యంకూడా-అందులో

నాటక వుద్యమం ఇంతగా అభివృద్ధి పొందలేదు. ప్రజా నాట్యమండలి కృషీ, దాని వుద్భవం ప్రభుత్వానికీ కంటక ప్రాయమైంది. వెంటనే దీనిని కూడ రాజకీయ ఉద్యమంగా చిత్రించింది. సమూలంగా ప్రజా నాట్యమండల్ని నాశనం చేయడానికి పూనుకొంది.

### మహత్తర ఉద్యమం :

కాని ప్రజా నాట్యమండలి ఉద్యమం మహత్తరమైంది. దాని ఆశయాలు గొప్పవి. దాని పోషకులు ప్రజలు. నాట్యమండలి సుసాంప్రదాయాలను దేశంలో అనేక నాటక సంస్థలు అనుసరించాయి. ఆంధ్ర నాటక రంగంలో వున్న ప్రతి నాటక సంస్థపైనా ప్రజా నాట్యమండలి ప్రభావం పడిందానాడు. ఆ ఛాయల్లోనే అనేక నాటక సమాజాలు వేరువేరు అభ్యుదయ నాటక సమాజాలపేర్లతో నడిచాయి. ప్రజా నాట్యమండలి ఉద్యమం కొత్తరూపురేఖలను దిద్దుకుంది. దీనికి అనేకమంది అభ్యుదయ రచయితలు కళాకారులు దోహదమిచ్చారు. ప్రభుత్వం పైశాచికంగా తాండవిస్తున్న రోజుల్లో అనేక ఇతర నాటక సమాజాలద్వారా ప్రజా నాట్యమండలి సాంప్రదాయాలను ప్రజల ముందుకు తీసుకుపోయారు. ఆనాటికి ఈనాటికి ప్రజా నాట్యమండలి ఆజేయమైంది. అది స్థాపించిన బాటల్లో ఆనేకమంది కళాకారులు పెరిగి పెద్దవారై వున్నతస్థాయికి చేరుకున్నారు. ఆంధ్ర నాటకరంగ చరిత్రలో మరపురాని ఘట్టాలను సృష్టించింది నాట్యమండలి. ఆంధ్ర నాటకరంగంలో ఒక మహత్తర చైతన్యాన్ని తీసుకువచ్చింది. ముందు తరాలకు మార్గదర్శి నాట్యమండలి. నాటకరంగ చరిత్రలోనూ, ప్రజా ఉద్యమ చరిత్రలోనూ నాట్యమండలి కొరకు కొన్ని పుటలు ప్రత్యేకించాల్సి వుంటుంది.

# 13

# ఆంధ్రనాటక కళాపరిషత్తు



విశాఖ నాటక కళాపరిషత్తు-ఆంధ్ర నాటక కళాపరిషత్తు - నాట్యకళ పత్రిక-అనేక నాటక కళాపరిషత్తులు -నాట్య విద్యాలయాలు

# ప్రసిద్ధనటులు



శ్రీ ఈవెన లక్ష్మణస్వామి



శ్రీ పి. సూరిబాబు



శ్రీ పెండ్యాల నాగేశ్వరరావు



శ్రీ నెల్లూరి నగరాజారావు



544A

# ప్రసిద్ధనటులు



* *

శ్రీమతి పి. అనసూయ



శ్రీ తుంగల చలపతిరావు



శ్రీ బింతా కృష్ణమూర్తి

544 B

# ప్రసిద్ధనటులు



శ్రీ రౌద్దం రాజారావు



శ్రీమతి కొప్పరపు సరోజని



శ్రీ పామర్తి సుబ్బారావు



శ్రీ మంగిపూడి రామలింగశాస్త్రి

5441

# ప్రసిద్ధనటులు



శ్రీ గోవిందరాజుల సుబ్బారావు



శ్రీ గిరిరాజు రామారావు



శ్రీ డి. వి. సుబ్బారావు

# ప్రసిద్ధనటులు



శ్రీ కపిలవాయి రామనాధశాస్త్రి



శ్రీ కృత్తివెంటి సుబ్బారావు



శ్రీ అనుమకొండ వేంకటరామయ్య



శ్రీ నిడుముక్కల సుబ్బారావు

కుమార్

# ప్రసిద్ధనటులు



శ్రీ ధూళిపాళ సీతారామశాస్త్రి



శ్రీ యడవల్లి సూర్యనారాయణ



శ్రీ వేమూరు గగ్గయ్య

5414f

# ప్రసిద్ధనటులు



శ్రీ హరిప్రసాదరావు



శ్రీ మాధవపెద్ది వెంకటరామయ్య



శ్రీ యన్. వి. యల్. నరసింహాచారి



శ్రీ సూరపనేని లక్ష్మీపెరుమాళ్ళు

# ప్రసిద్ధనటులు



శ్రీ వె. సంపత్‌కుమార్



శ్రీ బెల్లంకొండ సుబ్బారావు



శ్రీ పిల్లలమర్రి సుందరరామయ్య

5444

# ఆంధ్ర నాటక కళాపరిషత్తు

విక్రమ దేవవర్మ;

విశాఖ నాటక కళాపరిషత్తు:

విశాఖపట్టణంలో జయపూర్ మహారాజా విక్రమదేవవర్మగారి ఆధ్వర్యంలో, 1919 లో విశాఖపట్టణాంధ్ర నాటక కళాపరిషత్తు ఏర్పడింది. విశాఖపట్టణంలోని నాటక సమాజాలనన్నీ, ఒక్క త్రాటిమీద నడపాలన్న కోరికే ఈ పరిషత్తు స్థాపనకు దారితీసింది. ఈ పరిషత్తుకు మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు కార్యదర్శిగా పనిచేశారు

1923 జనవరిలో మల్లాది విశ్వనాథ కవిరాజుగారి నాయకత్వంలో మిత్రులందరూ కలిసి "గజాంమండల ఆంధ్ర నాటక కళాపరిషత్తు" వుత్సవాలను "పోలాకి" అనే గ్రామంలో జరిపారు. పరిషత్తు ఆధ్వర్యంలో "నాటక కళ" అనే మాసపత్రికను ఒక సంవత్సరంపాటు నడిపారు.

బందరులో 1924 లో, నాటకరంగ సమస్యలను చర్చించడానికి 4 రోజుల పాటు వియవంతంగా సభలు జరిపి నాటకరంగాని కొక వుత్సాహాన్నిచ్చారు.

దక్షిణాంధ్ర దేశంలో, నెల్లూరులో 1927 లో నెల్లూరు నగరాజారావుగారి పర్యవేక్షణలో నాటకరంగం గురించి ఒక సభ జరిగింది.

ఒకే ఆశయం - ఒకే ఆదర్శం:

ఆనాడు ప్రతి పట్టణంలోనూ నాటక సంస్థలు రాజులు, మహారాజులు, నాటక కళాపోషకుల ఆధ్వర్యంలో సుశిక్షితంగా నడుస్తున్నాయి. ప్రతివారూ నాటక రంగాన్ని ఎంతో పవిత్రంగా ఎంచేవారు. సమాజానికి నాటక రచయితలు అంటి పెట్టుకునుండేవారు. ప్రతి నాటకమూ, సర్వాంగసుందరంగా వస్తికలు తీర్చుకుని ప్రదర్శనానికి సిద్ధమయ్యేది. ప్రతి ప్రదర్శనమూ జయప్రదమయ్యేది. విద్యావంతులైన నటీనటులు లవడంవల్ల సమిష్టి కృషి ద్యోతక మయ్యేది. నాటక రంగస్థలం ఒక పవిత్రదేవాలయంగా ఎంచబడేది. అందరూ నిస్వార్థంగా ఒక ఆశయంకోసం పని

చేసేవారు. ప్రేక్షకులు ప్రదర్శనాలను గౌరవించి, సుశిక్షితులై చూచేవారు. నాటకాలకు ఆదాయం కూడా బాగా వుండేవి. ఆర్థిక ఇబ్బందులున్న వారందరికీ నెలసరి జీతాలు ఇవ్వబడేవి. అందువల్ల, నాటక సమాజాలు ఒక హద్దులో క్రమశిక్షణతో నడిచేయి. కాని దేశంలో ఆర్థికమాంద్యం రావడంవల్ల, నాటకాలకు ఆదాయం తగ్గడం, జమీందారుల ఆస్తులు తగ్గడం, జీతాలకు అలవాటు పడ్డ నటులు, ఎవరు దబ్బిస్తే అక్కడకు పరుగులెత్తడంతో, నాటక సమాజాలు చిన్నాభిన్నామైనాయి.

### నాటక ధర్మాలన్నీ నాశనమయ్యాయి:

కంట్రాక్టు నాటకాలు బయలుదేరాయి. నటులందరూ తలొకదారీ అయ్యారు. కంట్రాక్టర్ల చేతుల్లో నటులు పడిపోయారు. నాటక ధర్మాలన్నీ నాశనమయ్యాయి. ప్రదర్శనాల రక్తి తగ్గిపోయింది. నటుల్లో ఈర్ష్యలు, క్రోధాలూ, పోటీ ఏర్పడ్డాయి. ఒక్క మాటలో చెప్పాలంటే - కాంపిటీషన్ ఎక్కువై, ఒకరినొకరు దూషించుకునే స్థితికి వచ్చారు. రంగస్థలంపై ఒకరికొకరు పోటీపడి పాటలుపాడి నాటకరక్తిని నాశనం చేసేవారు. ప్రేక్షకులు కూడ ఈసడించారు. ఈ పరిస్థితుల్లో నాటకాలకు పోటీగా సినిమాప్రదర్శనాలు వచ్చాయి. నాటక మందిరాలన్నీ సినిమా హాల్సుగా మారిపోతున్నాయి. సినిమాలకు ప్రజాచరణ ఎక్కువైంది. నాటక రంగ నటులు సినిమాలకు ఎగబ్రాకారు. దీనితో సుశిక్షితంగా నడుస్తున్న నాటకరంగం వెన్నెముక విరిగింది. పోషకులూ, రాజపోషకులూ కూలిపోయారు. కళాకారులందరూ చెల్లాచెదరై పోయారు. ఈ పరిస్థితుల్లో కొంతమంది కళాకారులు కలవరం చెందారు. నాటక రంగాన్ని పునరుద్ధరించాలనే దీక్ష బయలుదేరింది.

### అఖిలాంధ్ర నాటక కళాపరిషత్తుకు అంకురార్పణ:

అఖిలాంధ్ర నాటక కళాపరిషత్తు స్థాపించాలని విశ్వనాథ కవిరాజుగారు అహోరాత్రాలు కృషిచేశారు. వారి కృషి ఫలించి, కవిరాజుగారు ఆహ్వానసంఘాధ్యక్షులుగా వుండి, ఆంధ్రనాటక రంగోద్ధారకులూ, సురభినాటక సమాజ స్థాపకులూ అయిన వనారస గోవిందరావు, కొత్తపల్లి లక్ష్మయ్యగార్ల సహకారంతో 1929 జూన్ నెలలో తెనాలిలో మూడురోజులపాటు ఆంధ్ర నాటక కళాపరిషత్తు మహా

సభలు బ్రహ్మాండంగా జరిగాయి. ఈ సభలకు ఆంధ్రదేశం నాలుగు చెరగులనుండి ప్రసిద్ధనటులు, నాటక రచయితలు, కళాభిమానులు అందరూ విచ్చేశారు. ఈ సభలకు ఆచంట వేంకటరాయ సాంఖ్యాయన శర్మగారు, చట్టి చినపూర్ణయ్యపంతులు గారు, దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు వరుసగా రోజుకొకరు చొప్పున అధ్యక్షస్థానాన్ని అలంకరించారు. నాటకరచనను గూర్చి, నటననుగూర్చి, నాటకప్రయోగం గూర్చి చర్చలు జరిగాయి. ఆనాటినుండి, ఆంధ్రదేశపు ముఖ్య పట్టణాలలో, స్థానిక కళాకారుల ఆహ్వానాల ననుసరించి అనేక పరిషత్తులు జరిగాయి. ఈ సభల్లో పగటిపూట నాటకరంగానికి సంబంధించిన అనేక సమస్యల మీద చర్చలు జరిపేవారు. రాత్రిపూట ఉత్తమ నాటక, నాటికల పోటీలను నిర్వహించేవారు. ఉత్తమ నాటక రచయితలకు, నటీనటులకు ఉత్తమ బహుమతుల నందచేసేవారు.

నాట్యకళ పత్రిక :

1933 లో మద్రాసు నాటక కళాపరిషత్తులో, పరిషత్తు అధ్వర్యాన, నాటక కళమీద ఒక పత్రికను స్థాపించాలనే నిర్ణయం తీసుకుని "నాట్యకళ" అనే పత్రికను ప్రారంభించి, దానికి ప్రధాన సంపాదకులుగా నీలంరాజు వేంకట శేషయ్యగారిని నిర్ణయించారు. ప్రథమ సంచిక 1934 డిసెంబరులో వెలువడింది. శేషయ్యగారి ఆధ్వర్యంలో పత్రిక, కళలకు సంబంధించిన వివిధ వ్యాసాలతో సర్వాంగ సుందరంగా నడిచింది. కొంతకాలం మాత్రమే జయప్రదంగా నడిచిన నాట్యకళ పత్రిక నిలిచిపోయింది. తరువాత శ్రీనివాస చక్రవర్తిగారి ఆధ్వర్యంలో నాలుగైదు సంవత్సరాలు జయప్రదంగా నడిచింది. ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీకి ఇవ్వబడింది. పసల సూర్యచంద్రరావుగారి ఆధ్వర్యంలో పది సంవత్సరాలుగా నడుపబడుతూ వచ్చింది. ప్రస్తుతం నాట్యకళ సంపాదక బాధ్యతను శ్రీనివాస చక్రవర్తిగారు నిర్వహిస్తున్నారు.

ఆంధ్ర నాటక కళాపరిషత్తు ఏర్పడిన తరువాత ఔత్సాహిక నటుల్లో మంచి ఉత్సాహం ఏర్పడింది. కొత్త కొత్త రచయితలు బయలుదేరారు. పాత నాటకాలైన పౌరాణిక నాటకాలకూ, చారిత్రక నాటకాలకూ పరిషత్తు నిబంధనల ప్రకారం స్థానం లేకపోయింది. ఈ పరిస్థితుల్లో రచయితలు అధ్యయనశీలమైన అనేక సాంఘిక నాటకాలను రచించారు.

### స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించాలి :

అప్పటివరకూ నాటకాల్లో స్త్రీ పాత్రల్ని ఉద్దండులైన స్థానం, బండారు వెంకటేశ్వరరావు, ఉప్పులూరు సంజీవరావు, కడియాల రత్తయ్య, ముప్పిడి జగ్గరాజు, తోట వెంకటేశ్వరరావు, తోట నారాయణ, ఇందుపల్లి గోవిందరావు, చీరాల బాలకృష్ణశాస్త్రి మొదలైన మహామహాలు ధరించేవారు, కాని పరిషత్తు నిబంధనల ప్రకారం స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించా లనడంతో అనేకమంది స్త్రీలు ముందుకువచ్చి పాత్రలు ధరించారు. ఈ విధంగా స్త్రీల ప్రవేశంతో నాటక ప్రదర్శనాలకు సజీవత చేకూరింది. కాని అనతికాలంలోనే ఇటువంటివారిని సినిమా ఆకర్షించటంతో నాటక రంగానికి కొంత దెబ్బ తగిలింది.

అలాగే మంచి రచయితల నాటకాలు పరిషత్తులో ప్రదర్శింపబడి ప్రథమ బహుమతి పొందినవెంటనే సినిమా పరిశ్రమ అటువంటి రచయితల్ని కూడా లాగేసింది.

### నాటకరంగంలో నవచైతన్యం :

ఏది ఏమైనా పరిషత్తు నాటకరంగంలో ఒక నూతన సంచలనాన్ని కలిగించింది. నూతన సమాజాలకు, రచయితలకు, స్త్రీలకు, ప్రోత్సాహకులకు ఉత్సాహాన్నిచ్చింది. ఎంతోకాలంగా సమాజాలను పీడిస్తున్న వినోదపు పన్నును రద్దు చేయించింది. బళ్ళారి రాఘవ పేర హాలు నిర్మించటానికి విజయవాడలో స్థలం సంపాదించి, దేశంలో వెంకటగిరి అమెచ్యూర్స్‌వారి నాటకాలద్వారా గూడవల్లి రామబ్రహ్మంగారు కొంతధనం సేకరించి, శాంతారాంతో శంకుస్థాపన చేయించారు. కాని ఆ ప్రయత్నం అలానే వుండిపోయింది.

పరిషత్తుకి విజయవాడ గుడివాడ బందరు మొదలైన శాఖల్ని స్థాపించి నాటకాలను ప్రదర్శించారు. ప్రతి పరిషత్తులోనూ, ఆంధ్ర నాటకరంగంలో ప్రముఖులైన వారందరినీ ఘనంగా సన్మానించారు. ప్రథమ బహుమతిని పొందిన వారికి రానుపోను ఖర్చులుకూడ పరిషత్తు భరించింది. ప్రథమ బహుమతిపొందిన నాటకాలను పరిషత్తే ప్రచురించాలనే పథకాన్ని చేపట్టి గోపాలరాయ శర్మగారి

ఎదురీత ప్రచురణతో ఆ ప్రయత్నం ఆగిపోయింది. నాటకరచనలో అంకాలు తగ్గిపోయాయి. 3 న్నర గంటలకాలం ప్రదర్శింపబడే నాటకాలు 2 గంటలకు కుదించబడ్డాయి. పరిషత్తు నాటకాలద్వారా పాటల ప్రాముఖ్యం తగ్గి, వచనానికి ప్రాముఖ్యం హెచ్చడంతో అనేకమంది నూతన నటులకు పరిషత్తు మార్గదర్శకమైంది. నటుల్లో క్రమశిక్షణ కలిగింది. సమిష్టి కృషితో నాటకాలను ప్రదర్శించారు. నాటక కళా పరిషత్తు ఇచ్చిన ఉత్సాహంతో ఈనాడు ఆంధ్రదేశంలో అనేక చిన్నచిన్న పరిషత్తు లేర్పడి, నాటక పోటీలు జరుపుతున్నాయి.

నూతన రచయితలూ,
నూతన నటులూ :

. *ఆనాటి ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం ఆంధ్ర నాటకరంగ పునరుద్ధరణకు యం. ఆర్. అప్పారావుగారి అధ్యక్షతన ఒక సంఘాన్ని నియమించింది. ఆ సంఘం ఆంధ్రదేశం అంతటా పర్యటించి ఒక రిపోర్టు ప్రకటించింది. ఆ రిపోర్టును ఇటీవల ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ప్రచురించింది. ఈ విధంగా ఆంధ్ర నాటక కళాపరిషత్తు బహుముఖాల నాటక రంగానికి సేవచేసింది

ఈనాడు సినిమారంగంలో ఉన్న రచయితలలో పింగళి, పినిసెట్టి, కొండముది గోపాలరాయశర్మ, ఆచార్య ఆత్రేయ, సుంకర, వాసిరెడ్డి, డి.వి. నరసరాజు, యన్. ఆర్. నంది, భమిడిపాటి రాధాకృష్ణ, దాసం గోపాలకృష్ణ, వీటూరి, అనిసెట్టి, రావూరు, ముద్దుకృష్ణ, కొడాలి గోపాలరావు, మల్లాది మొదలైనవారంతా పరిషత్తు నాటకాలవల్ల వచ్చినవారే.

అలాగే నటీనటులుగా ఎన్.టి. రామారావు, రామశర్మ, రామచంద్ర కాశ్యప, రమణమూర్తి, చలం, మిక్కిలినేని, పెరుమాళ్ళు, చదలవాడ, మల్లాది, రావి కొండలరావు, సదయలక్ష్మి, తిలకం, వల్లం నరసింహారావు, జగ్గయ్య, కె. వి. యస్. శర్మ మొదలైన అనేకమంది నటులు సినిమా రంగంలో ప్రవేశించారు.

పరిషత్తుకోసం పాటుపడిన
పెద్దలు :

ఆంధ్ర నాటక కళాపరిషత్తు స్థాపించిన నాటినుండీ మహామహులైన

రచయితలు, నటులు, కళాకారులు మొదలైన అనేకమంది పరిషత్తు అభివృద్ధి కొరకు అహోరాత్రాలు కృషిచేశారు.

ముఖ్యంగా ఈనాటి ఆంధ్ర నాటక కళాపరిషత్తులో ప్రముఖ బాధ్యతలు వహిస్తున్న యం. ఆర్. అప్పారావు, పసల సూర్యచంద్రరావు, కాజ వెంకట రామయ్య, యజ్ఞోజు మాధవాచార్యులు, త్రిపురనేని శివప్రసాదరావు, దుక్కిపాటి మధుసూదనరావు, పోలవరపు సూర్యప్రకాశరావు, రావూరు వెంకట సత్యనారాయణ మొదలైనవారు దాదాపు 25 సంవత్సరాలుగా కృషి చేస్తున్నారు.

# ఆంధ్రదేశంలో అనేక నాటక పరిషత్తులు

ఆంధ్ర నాటక కళాపరిషత్తు నిర్మించిన బాటలో ఈనాడు ఆంధ్రదేశంతో వెల్లువగా నాటకాల పోటీలు జరుగుతున్నాయి. సంవత్సరాల తరబడిగా ప్రతి సంవత్సరము ఒక నిర్ణీత సమయంలో పరిషత్తులు జరుగుతూ వున్నాయి.

ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘం-రాజమండ్రి లలిత కళానికేతన్. గూడూరు సంస్కృతీ సమ్మేళనం - విజయనగరం రాఘవ నాటకోత్సవాలు - రాయల నాటక కళాపరిషత్తు, ప్రొద్దుటూరు-రైల్వేఇన్‌స్టిట్యూట్ నాటకోత్సవాలు. గుంతకల్లు - కొప్పరపు సుబ్బారావు స్మారక నాటక కళాపరిషత్తు, గొల్లప్రోలు - శ్రీ వెంకటేశ్వర నాట్య కళాపరిషత్తు, తిరుపతి-నరసాపురం నాటక కళాపరిషత్తు - కాళిదాసు కళారాధన సమితి, కావలి - నెహ్రూ నాటక కళాపరిషత్తు, నెల్లూరు - నెప్కా-నాటక కళాపరిషత్తు, నెల్లూరు - పాలకొల్లు కళాపరిషత్తు - మద్రాసు చెన్నపురి ఆంధ్రమహాసభ నాటకోత్సవాలు - విజయనగరం విజయరామ డ్రమెటిక్ అకాడమి మొదలైన అనేక సంస్థలు కట్టుదిట్టంగా కళాపరిషత్తులు జరుపుతూ వున్నాయి.

# నాటక కళాభివృద్ధికి నాట్యవిద్యాలయాలు

ఆంధ్ర నాటకరంగం ఆప్రతిహతంగా పురోగమించి మూడు పువ్వులు, నాలుగు కాయలు కాసే రోజుల్లో, సుశిక్షణతో కూడిన నాటకవిద్యాలయాలు ఎంతైనా

అవసరమని ఆనాటి నిస్వార్థ కళాకారులు భావించి అందుకు అంకురార్పణ చేశారు.

నిజంగా సంగీత, నృత్య, శిల్ప, చిత్రలేఖనాలకు గురుకులవిద్య, నిత్య సాధనా వుంటేనేగాని రాణించలేవు.

భరతముని సంఘం:

1924 సంవత్సరంలో ప్రప్రథమంగా బి. టి. రాఘవాచార్యులుగారు భరత ముని సంఘం అనే పేరున నాట్యవిద్యాలయాన్ని స్థాపించారు. ఇందుకు ప్రసిద్ధ కళాశీ గూడవల్లి రామబ్రహ్మంగారు దోహదం చేశారు. ఈ విద్యాలయంలో ప్రసిద్ధ నటులుగా వెలుగొందిన పారుపల్లి సుబ్బారావు, డి. వి. సుబ్బారావు, పంచాంగం రామానుజాచార్యులు, అద్దంకి శ్రీరామమూర్తి మొదలైనవారందరూ శిక్షణ పొందారు.

1938 లో ఏలూరులో బండా కనకలింగేశ్వరరావు ఆంధ్ర నాటక కళా శాలను ఏర్పాటుచేసి, అనుభవజ్ఞులైన నటులద్వారా ఉపన్యాసాలు ఇప్పించారు. ఈ విద్యాలయంలో అఖిల భారత నాటక రంగచరిత్ర, అభినయాలు, వివిధ స్థాయీ భావాలు - ప్రయోగాత్మకంగా నేర్పించారు. రెండు మాసాలపాటు నడిపి, ఉత్తము లైనవారికి పట్టాలను ఇప్పించారు. సంవత్సరంపాటు నడిచిన కళాశాల అంతలోనే ఆగిపోయింది.

1956 ఆంధ్ర నాటకసంఘ సమాఖ్యవారి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు విజయవాడ రామమోహన గ్రంథాలయంలో నిర్వహించారు.

స్థానం నరసింహారావు - కూర్మా వేణుగోపాలస్వామి - ఆదిశేషయ్య - శ్రీనివాస చక్రవర్తి - కొప్పరపు సుబ్బారావు - జమ్మలమడక మాధవరామశర్మ - మేకప్ వి. కుమార్ - ఆచార్య ఆత్రేయ మొదలైన అనుభవజ్ఞులు తరగతులు నిర్వహించారు. మూడురోజులపాటు జరిగిన ఈ పాఠశాలకు నూరుమంది విద్యా ర్థులు హాజరైనారు.

రాజమండ్రిలో 1958 జనవరిలో డాక్టరు గరికిపాటి రాజారావు పర్య వేక్షణలో వారం రోజులపాటు వీరేశలింగం హైస్కూల్లో నాటక విద్యాలయం ప్రారంభించబడి శిక్షణాతరగతుల్ని నడిపారు. శ్రీ కూర్మా వేణుగోపాలస్వామి,

శ్రీనివాస చక్రవర్తి, దివాకర్ల వెంకటావధాని, డాక్టర్ పి. యస్. ఆర్. అప్పారావు, గిడుగు సీతాపతి, రోహిణి, కొర్రపాటి గంగాధరరావు, నండూరు కృష్ణమాచార్యులు, చాగంటి సన్యాసిరాజు మొదలైనవారు అధ్యాపకులుగా వుండి తరగతులను నిర్వహించారు.

### నాట్యసంఘ విద్యాలయం:

1959 వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ నాట్య సంఘం ఆనాటి విద్యామంత్రి పట్టాభిరామారావుగారి ప్రారంభోత్సవంతో, స్థానం నరసింహారావుగారి అధ్యక్షతను హైదరాబాదు న్యూసైన్స్ కాలేజీలో సాయంకాలంపూట నాట్యవిద్యాలయ తరగతులు ప్రారంభించారు. ఎ. ఆర్. కృష్ణ, పి. యస్. ఆర్. అప్పారావు, ఆర్. ఎం. జోషి, ఆర్. ఎన్. కోనెకార్, పి. ఎస్. ఆర్, శాస్త్రి, జాఫ్రి మొదలైన అధ్యాపకవర్గం పనిచేసింది. నటన, నాటకప్రయోగం, నాట్యశాస్త్రం, స్టేజిక్రాఫ్ట్, ఆహార్యం మొదలైన విషయాలు బోధింపబడినాయి. 45 మంది విద్యార్థులు శిక్షణ పొందారు. విద్యార్థులందరూ కలిపి చిత్రాంగి నాటకం ప్రదర్శించారు.

### నాలుగుపక్కలా

### నాటక విద్యాలయాలు:

ఆ తరువాత అబ్బూరి రామకృష్ణారావుగారి ఆధ్వర్యంలో ఆంధ్ర సారస్వత పరిషత్తు భవనంలో నాట్య విద్యాలయం నడిచింది. మంత్రి శ్రీనివాసరావు, సముద్రాల గోపాలమూర్తి మొదలైనవారు అధ్యాపకులుగా పనిచేశారు.

ఈనాడు రవీంద్ర భారతిలో నడుస్తున్న నాట్యవిద్యాలయాన్ని ఎ. ఆర్. కృష్ణ, వసంతగాడ్గే మొదలైనవారు అధ్యాపకులుగా వుండి నడుపుతున్నారు. రెండు సంవత్సరాలకాలం నడిచే ఈ విద్యాలయంలో కోర్సు ముగిసినవెంటనే డిప్లొమాలను ఇస్తున్నారు.

1960 లో హైదరాబాదు వై. ఎం. సి. ఏ. హాల్లో నాటక పాఠశాల నొకదానిని పి. ఎస్. రామారావు, ఆర్. ఎం. జోషి, శ్రీమతి లీలాసుందరయ్య మొదలైనవారు 8 మాసాలపాటు నడిపారు.

1968 ఏప్రిల్ 15 నుండి జూన్ 15 వరకు ఆల్వాల్‌లో (సికిందరాబా దు

నవ్య కళాకేంద్రం బక్షీ శ్రీరాం ఆధ్వర్యంలో నడిచింది. లీలాసుందరయ్య, హెచ్. వి. శర్మ, బక్షీ శ్రీరామ్ పనిచేశారు.

ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ సహాయంతో, ఆంధ్ర నాటక కళా పరిషత్తు ఆధ్వర్యాన విజయవాడలో ఒక నాట్య విద్యాలయం 1960 ఆగస్టు 1 వ తేదీన శ్రీ పసల సూర్యచంద్రరావు అధ్యక్షతను, యం. ఆర్. అప్పారావు గారితో ప్రారంభించబడింది. శ్రీనివాస చక్రవర్తిగారు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు.

ఈ విద్యాలయంలో విన్నకోట రామన్నపంతులు, కొడాలి ఆదిశేషయ్య, రామచంద్ర కాశ్యప, బసవరాజు సుబ్బారావు మొదలైనవారు ఆధ్యాపకులుగా పనిచేశారు. నటన, నాటక లక్షణాలు, నాటక ప్రయోగం, నాటకరంగ చరిత్ర మొదలైన విషయాలను ప్రబోధించారు. ఈ విద్యాలయం సాయంకాలంపూట నడుస్తూవుండేది. 25 మంది విద్యార్థులు శిక్షణ పొందేవారు. ఇటీవల మూసివేయబడింది.

ఈనాడు అనంతపురంలో శ్రీ రొద్దం హనుమంతరావుగారి ఆధ్వర్యంలో ఒక నాటక విద్యాలయం అకాడమీ సహాయంతో నడుస్తూవుంది.

కూచిపూడి, విజయవాడలలో నృత్య కళాశాలలూ-హైదరాబాదు, విజయవాడ, విజయనగరం, తిరుపతి మొదలైన పట్టణాలలో సంగీత పాఠశాలలూ-

చిలకలూరుపేట, నెల్లూరులో నాగస్వరం మొదలైన గురుకులాలు-ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమి సహాయంతో నడుపబడుతున్నాయి.

# స్త్రీల నాటక సమాజాలు

ఆంధ్రదేశంలో అనేక పురుషసమాజాలతోపాటు స్త్రీల నాటకసమాజాలు కూడా అభివృద్ధి పొందాయి.

### గుంటూరు గోనెపట్టాల కంపెనీ:

1907 వ సంవత్సరంలో గుంటూరు గోనెపట్టాల కంపెనీ ఒకటుండేది. ఈ సమాజంలో పురుషులతోపాటు స్త్రీలుకూడా నటిస్తూ వుండేవారు. వీరి సమాజం పేరు "సుధీజన సమాజం" ఈ నాటక సమాజస్థాపకుడైన హనుమంత

రావుగారు నాయక పాత్రధారణలో మేటి. ప్రముఖ నాయకీపాత్రలు నాగరత్నం. నాగమణి ధరించేవారు. వీరి నాటకశాల ఆరుబయలు రంగస్థలం. చుట్టూ గోనె పట్టాలు కట్టడంవలన దీనికి గోనెపట్టాల కంపెనీ అని పేరు వచ్చింది.

సంగీత మానినీ సమాజం :

విశాఖ పట్టణ నాటకరంగంలో ఈ సమాజం ఉదహరించబడింది. ఈ సమాజం 1902 లో స్థాపించబడి దేదీప్యమానంగా వెలిగింది. ఈ సమాజ స్థాపకులు మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు. వ్యభిచారవృత్తిని మాన్పించి జీవిత పోషణకు నాటక సమాజం ద్వారా ఆధారం కల్పించటానికి 1902 లో ఈ సమాజం స్థాపించ బడింది. ఈ సమాజం ఆంధ్రదేశమంతటా నాటకాలు ప్రదర్శించింది. ప్రముఖ పురుష పాత్రలను మద్దెల సూర్యనారాయణ ధరిస్తే, శ్రీమతి కొంకిపూడి చినచిట్టి, శ్రీమతి కొంకిపూడి పెదబుల్లి, శ్రీమతి కొంకిపూడి చినబుల్లి స్త్రీ పాత్రలు ధరించే వారు.

నవలా నాటక సమాజం :

1928 లో నవలా నాటక సమాజాన్ని దంటు వెంకటకృష్ణయ్యగారు స్థాపించారు. ఈ సమాజంలో నాయకీ నాయకుల పాత్రల నన్నిటినీ స్త్రీలే ధరించేవారు. స్త్రీ నటీమణుల్లో ప్రఖ్యాతి వహించిన వారు శ్రీమతి దాసరి కోటిరత్నం, పసుపులేటి కన్నాంబ, యామినీపూర్ణతిలక.

బందరు జగన్నాధపురంలో "ధీరామోదిని" అనే స్త్రీ నాటక సమాజం వున్నట్లూ, ఆ సమాజంలో రామాబాయి అనే ఆమె ప్రముఖ పాత్రలు ధరించేదనీ తెలుస్తోంది.

గుడివాడ తాలూకా సుబ్బచెరువు కళావంతుల కుటుంబానికి చెందిన రాముడు అనే ఆమె హరిశ్చంద్ర మొదలైన పురుషపాత్రల్ని అద్భుతంగా నటించేదట.

బందరు జగన్మోహినీ సమాజంలో అంకాలు, కోయిల అనే స్త్రీలు స్త్రీ పాత్రలు ధరించటమే గాక, అద్భుతమైన వారి అమరగానంతో ప్రేక్షకులను మైమరపించేవారట.

ఇక సురభి వారి నాటకాల్లో స్త్రీలే పురుష పాత్రలు, పురుషులే స్త్రీ పాత్రలు ధరించటం మనకు తెలిసిన విషయమే.

గౌరవ కుటుంబానికి చెందిన రాజమ్మ, వెంకమ్మ అనే ఇరువురు స్త్రీలు 1916 ప్రాంతంలో నెల్లూరుజిల్లా గూడూరులో ఒక నాటక సమాజాన్ని స్థాపించి అద్భుతంగా నాటకాలాడినట్లు వినికిడి.

# 14

# రాష్ట్రేతర ఆంధ్ర నాటకరంగం



ఢిల్లీశ్రీఆంధ్ర నాటకరంగం, బొంబాయి ఆంధ్ర అసోసియేషన్, షోలాపూర్ ప్రజా నాట్యమండలి,కలకత్తా ఆంధ్ర నాటక సంఘం, మదరాసు సుగుణ విలాస సభ, బెంగుళూరు, జంషెడ్పూర్, ఖర్గపూర్, భిలాయ్, పూనా, నైవేలి నాటక రంగాలు



# ది ఓరియంటల్ డ్రమాటిక్ కంపెనీ (మద్రాసు)

మద్రాసులో 1879, 80 ప్రాంతాల్లో శ్రీమాన్ గోమఠం సి. వి. శ్రీనివాసాచార్యులుగారు ఓరియంటల్ డ్రమాటిక్ కంపెనీ అనే నాటక సమాజాన్ని స్థాపించారు. ఆ సమాజానికి ఆయన అధ్యక్షులు. ప్రధాన పాత్రలు ధరించేవారు. సంస్కృత నాటకాలను అనువదించి దృశ్య నాటకాలుగా ప్రదర్శించేవారు. 1880 సంవత్సరంలో, విజయనగరం మహారాజా ఆనంద గజపతి, ఆనాటి మద్రాసు గవర్నర్‌గార్ల సమక్షంలో ఆచార్యులవారు దుష్యంత పాత్రను అద్భుతంగా అభినయించి "ది ఇండియన్ గారిక్" అనే బిరుదును పొందారు. శ్రీనివాసాచార్యులుగారు "కమలాపహరణం" మొదలైన నాటకాలను వ్రాశారు.



ఆంగ్లనాటక ప్రదర్శనాలు :

ఆనాడు ఆంగ్లదేశం నుండి వచ్చిన అనేకమంది ఆంగ్ల ఉద్యోగుల వినోదం కొరకు ఇంగ్లండునుంచి అనేక నాటక సమాజాలు నాటకాలు ప్రదర్శిస్తూ వుండేవి. ఈ నాటకాలను చూచిన మన దేశీయులు నాటక సమాజాలను స్థాపించి నాటకాలాడారు. అలా ఏర్పడిన సమాజాలు పార్శీ నాటకసమాజాలు, వంగ నాటకసమాజాలు. ఈ సమాజాలు, భారతీయ నాటకాలతో పాటు, ఇంగ్లీషు నాటకాలను కూడా ప్రదర్శించేవారు. పై సమాజాల కోవకు చెందిందే ది మద్రాసు డ్రమాటిక్ సొసైటీ. ఈ సమాజం మద్రాసులో ఇంగ్లీషు నాటకాలను ప్రదర్శించేది. ఈ సమాజం 1875 లో స్థాపించబడింది. తరువాత దీనికి ప్రతిగా స్థాపించబడిందే ఓరియంటల్ డ్రమాటిక్ కంపెనీ.

ది మద్రాస్ డ్రమెటిక్ సొసైటీ ప్రదర్శనాల్లో ఆనాడు - అంటే 1885 ప్రాంతాల్లో యూరోపియన్‌ల హార్మోనియం, హిందుస్తానీ గజల్స్, ఇంగ్లీషు గేయాలు ప్రవేశపెట్టబడ్డాయి. ఆర్. కె. యాజ్ఞిక్ ఇండియన్ థియేటర్‌లో పేర్కొనదగినవారు.

# సుగుణ విలాస సభ

బళ్ళారిలో ధర్మవరం కృష్ణమాచార్యులుగారు సరసవినోదినీసభను స్థాపించి విజయవంతంగా నడుపుతున్న రోజుల్లో వారి ప్రదర్శనలు చూచిన మద్రాసు కళాకారులు వుత్తేజితులై సరస వినోదినీసభ (ఎస్. వి. ఎస్.)- ఈ మూడు అక్షరాలు కలిపి వచ్చేటట్లు సుగుణ విలాస సభను పి. సంబంధ మొదలియార్ ఆధ్వర్యంలో 1-7-1891 న స్థాపించారు. ఈ సభలో ఇంగ్లీషు - అరవం- తెలుగు - సంస్కృతంలో కూడా నాటకాలను ప్రదర్శించేవారు. వీరి ప్రదర్శనాలు ఉత్తమోత్తమంగా, మంచి క్రమ శిక్షణతో ప్రదర్శింపబడేవి. ఆనాడు మద్రాసులో ఖుద్ద సంగీత కచ్చేరీలలాగా, పచ్చి శృంగార నాటకాలను బాలామణి, కల్యాణ రామయ్యరు మొదలైనవారు ప్రదర్శిస్తూ వుండేవారు. కాని సుగుణవిలాససభ ప్రదర్శనాలు పూర్వపు నాటక ధర్మాల ననుసరించి, అభ్యుదయకరంగా ప్రదర్శించేవారు. ఆనాటి సుగుణ విలాస సభ ఈనాటివరకూ పని చేస్తూనే వుంది. ఈ సభలో ఒక్క నాటకాలే కాక వివిధ వ్యాయామ క్రీడలు కూడా ప్రాముఖ్యం వహించేవి. ధర్మవరంవారి నాటకాలు, రాఘవాచార్యులుగారి నాటకాలు ఈ సభలో అనేక పర్యాయాలు ప్రదర్శింపబడ్డాయి. తెలుగు నాటకాలలో వేదం వేంకటాచలయ్య, డి. వెంకటరమణయ్య, వి. సి. గోపాలరత్నం, పి. వి. రామానుజంశెట్టి మొదలైన నటులుండేవారు. ఈ సభద్వారా "ఇండియన్ స్టేజి" అనే పత్రికను కొంతకాలం నడిపారు. ఒక పెద్ద గ్రంథాలయాన్ని నిర్వహించారు. సంబంధమొదలియారు ఈ సభద్వారా ఎన్నో ఉత్తమ నాటకాలను రచించారు. నిజంగా సుగుణ విలాస సభకు వుత్తేజాన్ని కలిగించింది ఆనాటి బళ్ళారి సరస వినోదినీసభే.



రా॥ సా॥ డి. వెంకటరమణయ్యగారు (మదరాసీ) సుగుణవిలాససభ మద్రాసు.

# చెన్నపురి ఆంధ్రమహాసభ

చెన్నపురి ఆంధ్రమహాసభ 1916 వ సంవత్సరంలో స్థాపించబడి, 1939 వరకూ, మదరాసు గిడ్డంగి వీధిలో నిర్వహింపబడి, ఆ సంవత్సరంలోనే ఓక్టోరియా పబ్లిక్ హాలుకు మార్చబడింది.



శ్రీ కామాక్షి సుందరరామ శాస్త్రిగారు (కీచకుడు) ఆంధ్రమహాసభ

### సంస్థార్థ కళాజీవులు :

ఆనాటినుండి ఈనాటి వరకు ఆంధ్రదేశంలోవున్న ప్రసిద్ధ నాయకులు, జమీందారులు, ధనవంతులు, న్యాయమూర్తులు, మంత్రులు, సుప్రసిద్ధ కళాకారులు ఎందరో దీని అభివృద్ధికి పాటుపడ్డారు. వారిలో పేర్కొనదగినవారు దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, బులుసు సాంబమూర్తి, గుమ్మడిపల దుర్గాబాయమ్మ మొదలైనవారు.

ఆంధ్రమహాసభ కార్యకలాపాల్లో గ్రంథాలయ నిర్వహణ, విద్యాశాఖ, నాటకశాఖ మొదలైనవి ముఖ్యమైనవి.

ముఖ్యంగా ఆంధ్రదేశం నుండి అనేకమంది ప్రసిద్ధ నటీనటులు వచ్చి, ఆంధ్రమహాసభలో నాటక ప్రదర్శనా లిచ్చి కీర్తింపబడ్డారు.

వారిలో బళ్ళారి రాఘవాచారి 1921 వ సంవత్సరానికి పూర్వమే ఆంధ్ర మహాసభలో నాటకాలను ప్రదర్శించారు.

### రాఘవ నటనలో రాణించిన పాత్రలు :

ఆ నాటకాలలో, "ప్రహ్లాద"లో హిరణ్యకశిపుడు, "చిత్రనళీయం"లో బాహుకుడు, "రామరాజు పతనం"లో పరశురాముడు, "చంద్రహాస"లో దుష్టబుద్ధి, "రామదాసు"లో రామదాసు, "పాదుక"లో, దశరథుడు, చంద్రగుప్తలో చాణక్యుడు మొదలైన పాత్రలు ధరించి పాత్రాభినయంలో నూతన

మార్గాల నవలంబించి, ఆనాటి నటులకు నాటక సమాజాలకు కనువిప్పు కలిగించారు.

రాఘవాచారితోపాటు, నెల్లూరు నగరాజారావు, సరస్వతి రంగస్వామి అయ్యంగారు, స్థానం నరసింహారావు, బెంగుళూరు శ్రీనివాసరావు, కొమ్మూరి పద్మావతి, గుళ్ళపల్లి విశ్వేశ్వరమ్మ, కందాడై శ్రీనివాసన్, నేలనూతల రామ కృష్ణయ్య ఆదిగాగల నటులందరూ ఆంధ్రమహాసభలో నాటకాలను ప్రదర్శించారు.

ఆనాడు ఆంధ్రదేశంలో ప్రఖ్యాతి వహించిన నాటక సమాజాలు అన్నీ ఆంధ్రమహాసభలో ప్రదర్శనా లిచ్చాయి.

ఆంధ్ర మహాసభ అభివృద్ధికొరకు పాటుపడినవారిలో ముఖ్యులు శ్రీ సీలం రాజు వెంకటశేషయ్యగారు. ఆయన నాటక శాఖను నిర్వహించడమే కాక ప్రసిద్ధ నటుడుగా పేరుపొందారు. ఆంధ్రమహాసభకు ధనం సేకరించటానికి స్థానం నరసింహారావు, పులిపాటి వెంకటేశ్వర్లు, పిల్లలమర్రి సుందరరామయ్య మొదలైన ప్రసిద్ధ నటులను రప్పించి, వి. పి. హాలు మిద్దెపైన నాటక ప్రదర్శనాలను ప్రదర్శించారు. ఈ విధంగా సీలంరాజు వెంకట శేషయ్యగారు ఆంధ్రమహాసభ కార్యకర్తగా, నాటకశాఖ నిర్వాహకుడుగా, పటుడుగా బహుముఖ సేవచేశారు.

చంద్రబాబు, కమలాదేవి :

అటర్వాత సభా నాటకాల్లో ప్రముఖపాత్ర వహించిన వ్యక్తుల్లో చివుల



మంగిపూడి రామలింగ శాస్త్రిగారు
శ్రీకృష్ణుడు

చంద్రబాబునాయుడు, ఆయనభార్య కమలాదేవి ముఖ్యులు. చంద్రబాబు స్ఫురద్రూపి, ఉత్సాహవంతుడు. నాటకశాఖ అంటే పంచప్రాణాలు. ఉత్తమ నటుడు. ఆయన సభకు కార్యదర్శిగా వున్నకాలంలో నాటకశాఖ ఎంతో అభివృద్ధి పొందింది. చంద్రబాబు, కమలాదేవి అహర్నిశలూ ఆంధ్రమహాసభ నాటకశాఖను తీర్చిదిద్దారు. వీరిరువురి పర్యవేక్షణలో ఎన్నో పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలు ప్రదర్శించబడ్డాయి. దంపతులిరువురూ పాత్రలు ధరించటమేకాక, దర్శకత్వ బాధ్యతలను నిర్వహించి ప్రదర్శన విజయానికి తోడ్పడేవారు. కమలాదేవి, చంద్రబాబు ఆంధ్రమహాసభ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు.

ఆంధ్రమహాసభ అభివృద్ధికి తోడ్పడినవారిలో మరోవ్యక్తి జె. వి. సోమయాజులుగారు. ఆయన మదరాసు ఆంధ్రుల సంస్కృతికి, అభివృద్ధికి కృషిచేసిన ప్రముఖవ్యక్తి. ఇలా ఆంధ్రమహాసభకు ఎందరో మహానుభావులు కృషిచేశారు.

సభకు పేరుతెచ్చిన
సహచర నటులు :

ఆంధ్రమహాసభ నాటకరంగంలో పనిచేసినవారిలో శ్రీ గోపాలాచార్యులు, కె. జ్ఞానానందులు, వేమూరు వెంకటశేషయ్య, బి. వి. రమణారావు, హరిహరనాథ్, అన్నపూర్ణయ్య, బి. ఎస్. గోవిందరాజులు నాయుడు, ఎ. వి. కృష్ణ, రావి పాటి సుబ్బారావు, స్వర్గీయ మోహనరంగయ్య, బాలకృష్ణ, సంజీవినాయుడు, రామానుజదాసు, రంగప్రసాద్, గాడేపల్లి శంకరం, డాక్టరు గిరి, వేదం వేంకట రాయశాస్త్రి, వి. ఎల్. రెడ్డి మొదలైనవారు ముఖ్యులు. మురళీ రాజాగారు నాటకరంగానికి ఎంతో దోహదం చేశారు. ఈ విధంగా ఆంధ్రమహాసభ నాటక రంగం నిత్యనూతనంగా వెలుగొందింది.

# మద్రాసు ప్రజా నాట్యమండలి

ఆంధ్రదేశంలో 1948 లో ప్రభుత్వదమననీతి ఫలితంగా ఆంధ్రప్రజా నాట్యమండలి అణచివేయబడడంతో ప్రజా నాట్యమండలి కళాకారులు 1949 - 50 ప్రాంతాల్లో మద్రాసు సినీరంగంలో ప్రవేశించారు. ఇంతకుముందే యువజనోద్యమంలో కాకలు తీరిన తాతినేని ప్రకాశరావు సినిమారంగంలో వున్నారు.

చదలవాడ, మిక్కిలినేని, పెరుమాళ్ళు, వల్లం నరసింహారావు, వీరమాచనేని మధుసూదనరావు, వి. సరోజని, మిక్కిలినేని సీత, సాలార్, ఆచార్య ఆత్రేయ, సుందర, వాసిరెడ్డి, సి. మోహన్‌దాస్ (మ్యూజిక్ డైరెక్టరు), టి. చలపతిరావు (మ్యూజిక్ డైరెక్టరు), ప్రత్యగాత్మ, కొండేపూడి లక్ష్మీనారాయణ, రాజారావు, వెంపటి, రామకోటి, అల్లా రామలింగయ్య, పొట్లూరు వెంకటసుబ్బారావు, బి. గోపాలం, వేణుగోపాల్ మొదలైన కళాకారులందరూ మద్రాసు సినీరంగంలో ప్రవేశించారు.

ప్రజానాట్యమండలి మీదనున్న ప్రభుత్వవత్తిడి ఫలితంగా ఆ సాంప్రదాయాలతో అభ్యుదయ కళాసమితిని స్థాపించి ప్రపథమంగా ఆంధ్రదేశంలో 1953 ఎన్నికలలో వైజ్ఞానికప్రదర్శనల నిచ్చి ప్రచారం చేశారు.

చరిత్ర ప్రసిద్ధికెక్కిన
శాంతి మూకాభినయం:

సోవియట్ ఫిల్మ్ డెలిగేషన్ మద్రాసు వచ్చినప్పుడు వారి సమక్షంలో హిట్లరు వీధి భాగవతం. అనిసెట్టి రచించిన శాంతి మూకాభినయ నృత్యం వాణీ మహల్లో ప్రదర్శింపబడి రష్యన్ కళాకారుల ప్రశంస లందుకోవడమేగాక రూసో కలర్‌లో చలనచిత్రంగా తీయబడి, తూర్పు యూరపు రాజ్యాలలో ప్రదర్శింపబడింది.

తరువాత మద్రాసుకు చైనీస్ డెలిగేషన్ వచ్చిన సందర్భంలోనూ, సోవియట్ అగ్రికల్చర్ డెలిగేషన్ వచ్చిన సందర్భంలోనూ, బుల్గానిన్, కృశ్చేవ్ మద్రాసు సందర్శించినప్పుడు రాజభవన్‌లో పంటసిరి నృత్యాన్ని ప్రదర్శించి ప్రశంస లందుకుంది. తరువాత అఖిల భారత శాంతిమహాసభ సందర్భంలో మైలాపూర్ రసిక రంజని సభ హాలులో శాంతి మూకాభినయ నృత్యం ప్రదర్శింపబడి ప్రథమస్థానాన్ని ఆక్రమించింది.

ఆంధ్రదేశంలో ఏలూరులో జరిగిన శాంతిమహాసభలోనూ, హైదరాబాదులో జరిగిన ఏషియన్‌పీస్ సొలిడారిటీ కాన్ఫరెన్సు సందర్భంలోనూ వివిధ కళారూపాలను ప్రదర్శించింది.

కీ॥ శే॥ వాపిరెడ్డి భాస్కరరావు రచించిన పోతుగడ్డ నాటకాన్ని ఆంధ్రదేశపు ముఖ్యపట్టణాల్లో ప్రదర్శించి తిరిగి అనేక ప్రజా నాట్యమండలి దళాలకు వుత్సాహాన్నిచ్చింది.

మద్రాసు త్యాగరాయనగరులో ప్రతివారం వైజ్ఞానిక సమస్యలమీద సంగీత, నృత్య, నాటక, చిత్రలేఖన, శిల్పకళలమీద వుపన్యాసాలు జరుగుతూ వుండేవి.

1957 లో జరిగిన ఎన్నికలలో పెద్దపెట్టున రెండు దళాలుగా ఏర్పడి అనేక ముఖ్యకేంద్రాలలో ప్రదర్శనలిచ్చి గొప్ప సంచలనాన్ని కలిగించింది.

## బెంగుళూరు అమెచ్యూరు సభ

ఆంధ్ర నాటకరంగం బహుముఖాల విజృంభిస్తున్న రోజుల్లో బెంగుళూరు ఆంధ్రుల అమెచ్యూర్ నాటక సమాజాలలో తెలుగు నాటకాలు ఎంతో అద్భుతంగా ప్రదర్శింపబడుతూ వుండేవి. బెంగుళూరు అమెచ్యూర్ కంపెనీలో పేరెన్నికగన్న నాటకాలు రోషనార, రామదాసు మొదలైనవి. ఈ సభలో బళ్ళారి తాడిపత్రి రాఘవాచార్యులుగారు నటిస్తూ వుండేవారు. వీరిప్రక్కన రోషనార, ఆషాబీ మొదలైన స్త్రీ పాత్రలను కె. యస్. వాసుదేవరావుగారు సమర్థనీయంగా నటించేవారు. బళ్ళారి రాఘవాచారిగారు, మద్రాసు సుగుణవిలాస సభలోనూ, బెంగుళూరు అమెచ్యూర్ సభలోనూ నాటకాలను ప్రదర్శించి పేరుప్రతిష్ఠలు సంపాదించిన తరువాతే ఆంధ్రదేశంలో నాటకాలను ప్రదర్శించారు. బెంగుళూరు అమెచ్యూర్ సభలో ఆనాడు బి. యే. రాఘవాచారి అనే పేరుగల నటుడు కబీరు పాత్రధారణలో పేరు తెచ్చుకున్న నటుడు.

ఖర్గపూర్ :

ఖర్గపూర్‌లో దాదాపు 10 వేల మందికి పైగా ఆంధ్రులు నివసిస్తున్నారు. అనేకమంది ఉన్నత వుద్యోగాల్లో పని చేస్తున్నారు. ఇక్కడ ఆంధ్ర విజ్ఞాన సమితి పనిచేస్తూ వుంది. ప్రతి సంవత్సరం ఉగాదికో, శ్రీరామనవమికో వార్షికోత్సవాలు జరుపుతూ వుంటారు. ఈ సందర్భంలో నాటక, నాటికల పోటీలు, లలిత సంగీత పోటీలు జరుపుతూ వుంటారు. అనేక ప్రాంతాలనుండి నాటక సమాజాలు వచ్చి ఈ పోటీల్లో పాల్గొంటాయి

ఓలాయ్ :

ఓలాయ్ స్టీల్ ఫ్యాక్టరీలో ఆంధ్రులు దాదాపు 5 వేలమందివరకూ వున్నారు. ఇక్కడ వెంకటేశ్వర బృందం ఏర్పడి పనిచేస్తూంది. ఇక్కడ ఉత్సాహవంతులైన యువకులు అనేకమంది పనిచేస్తూ, ప్రతి సంవత్సరం ఉగాది వేడుకలు జరుపుతూ వుంటారు. నాటకాలు, నాటికలు, బుర్రకథలు చెపుతూ వుంటారు.

ఇక్కడ జాలాది జగన్మోహనరావు, సింగ్, టి. ప్రకాశరావు, కె. ముఖ లింగేశ్వరరావు, కె. ప్రభాకరరావు, ఎమ్. రాజు, సింహాద్రి మొదలైన కళాకారులు పని చేస్తున్నారు. వీరు ఉగాది వుత్సవాలతోపాటు, శ్రీరామనవమి వుత్సవాలు కూడా జరుపుతూ వుంటారు.

పూనా :

పూనాలో చిరకాలంగా ఆంధ్ర అసోసియేషన్ ఏర్పడి పని చేస్తూ వుంది. ఇక్కడ ఉగాది, శ్రీరామనవమి మొదలైన పండుగలకు ఆంధ్రు లందరూ సమావేశమై వేడుకలతో వినోదాలతో కాలక్షేపం చేస్తూ వుంటారు. ఉన్నత ఉద్యోగాల్లో వున్న ఆంధ్రులు అనేకమంది వున్నారు. అసోసియేషన్ తరపున నాటక ప్రదర్శనాలు జరుగుతూ వుంటాయి. ఇక్కడ రోహిణి కళామండలి అనే మహిళామండలి కూడా ఏర్పడి పని చేస్తూవుంది. కల్నల్ బి. డి. పి, రావు, యం. వి. యోగి, కె. సాంబశివరావు, యస్. మహేశ్వరరావు మొదలైన కళాభిమాను లందరూ ఆంధ్ర అసోసియేషన్ పురోభివృద్ధికి పని చేస్తున్నారు.

నైవేలి :

నైవేలిలో కూడా వుద్యోగాల్లో వున్న ఆంధ్రులు ఉగాది, శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరుపుతున్నారు. ఆంధ్ర కుటుంబాలన్నీ ఆ వుత్సవాల్లో పాల్గొనడమేకాక, వైజ్ఞానిక ప్రదర్శనాలలో పాల్గొని కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇతర చోట్లనుండి ప్రసిద్ధాంధ్రులను రప్పించి, వారితో నాటకాలను ప్రదర్శింపచేయడమే గాక వారిని సన్మానించి గౌరవించి పంపుతూ వుంటారు.

# ఢిల్లీ ఆంధ్ర నాటక రంగం

తొలి నాటక ప్రదర్శనం :

1941 - 42 ప్రాంతాల్లో కొంతమంది వుత్సాహవంతులైన తెలుగుసోదరులు చింతామణి నాటకం ప్రదర్శించారట. ఆ చింతామణి నాటకంలో ఆనాడు ఢిల్లీలో తెలుగువార్తలు చెప్పేవారిలో ఒకరైన కీ॥ శే॥ యండమూరి సత్యనారాయణ (శ్రీవాత్సవ) శ్రీహరిపాత్రను ధరించి పలువురి ప్రశంస లందుకున్నారు. అదే

నాటకాన్ని తిరిగి 1944 లో ప్రవర్శించగా ఢిల్లీ ఆంధ్రులతో హాలంతా కళకళ లాడింది.

కీ॥ శే॥ ఉప్పలదట్ల సీతారామయ్య :

ఢిల్లీ నాటకరంగానికి తన జీవితాన్ని ధారపోసిన కళాజీవి కీ॥ శే॥ ఉపద్రష్ట సీతారామయ్యగారు. 1940 కి ముందునించి పెద్ద పదవుల నలంకరించిన ఆంధ్రుడు. ప్రప్రథమంగా తెలుగు అమెచ్యూర్ డ్రమెటిక్ అకాడమీ అనే సంస్థను స్థాపించారు. నాటక కళకోసం స్వార్జితాన్ని మంచినీళ్ళప్రాయంగా ఖర్చుపెట్టిన నిస్వార్థ కళాకారుడు. ఆయన చాదాపు 30 నాటకాలను రచించాడు. వ్రాసిన నాటకాలలో 10 నాటకాలను అతి ఇష్టంమీద ప్రదర్శించారు. కాని ఏ ప్రదర్శనానికీ దమ్మిడీ ఆదాయం లేదు. అన్నీ ఉచిత ప్రదర్శనాలే. వారి నాటకాలలో చెప్పుకోతగిన నాటకం "అసూయ". ఢిల్లీలో వారి నాటకాలను ప్రదర్శించడమేకాక ఆంధ్రదేశం నుంచి అనేక నాటక సమూహాలను రప్పించి కూడ ప్రదర్శనాలను ఇప్పించారు.

వారితోపాటు రేడియోవార్తలు చెప్పే కలపటపు గోపాలరావుగారు "సాధన" అనే నాటకాన్ని వ్రాయగా అమెచ్యూర్ డ్రమెటిక్ అకాడమీ ప్రదర్శించింది. ఢిల్లీ నాటకాలకు స్త్రీ పాత్రధారులు దొరకపోతే ఆంధ్రదేశంనుంచి స్త్రీ పాత్రధారుల్ని స్వంత ఖర్చులమీద రప్పించి నాటకాలను ప్రదర్శించారు.

ఆ తరువాత వారు ప్రదర్శించిన నాటకాల్లో ముఖ్యమైంది సత్య హరిశ్చంద్ర. ఈవిధంగా సీతారామయ్యగారు ప్రతి నాటకాన్ని కట్టుదిట్టంగా తరిఫీదు చేయించి ప్రదర్శించి, ఢిల్లీ ఆంధ్రుల ఆదరాభిమానాలను చూరగొన్నారు.

ఢిల్లీ ఆంధ్రసంఘం :

ఢిల్లీ ఆంధ్రసంఘం ఎంతో కాలంనుంచి పనిచేస్తున్నప్పటికీ నాటకాల విషయం అంతగా పట్టించుకోలేదు. కాని, జగత్ప్రతిగారని ఐ.ఎ.ఎస్.కు చెందినవారు కొన్నాళ్ళు ఆంధ్ర సంఘానికి అధ్యక్షులుగా వుండి ఆచార్య ఆత్రేయ గుమాస్తా నాటకాన్ని జయప్రదంగా ప్రదర్శింపచేశారు. ఈ కార్యక్రమంలో క్రొవ్విడి లక్ష్మన్న, భాగవతుల నారాయణమూర్తిగార్లు ఎంతగానో సహకరించారు. క్రమేపీ ఆంధ్ర సంఘం ఆధ్వర్యంలో నాటకాలు వేయించటానికి కృషి బాగా జరిగింది. ఆంధ్ర దేశంలో వరదలు వచ్చి బాధపడుతున్న వరద బాధితుల సహాయార్థం "వర

విక్రయ'' నాటకాన్ని రెండుసార్లు ఆంధ్రసంఘం ప్రదర్శించి నిధి వసూలు చేసింది.

ఢిల్లీలో తెలుగు నాటక ప్రదర్శనాలను ఆంధ్రులతోపాటు అన్యభాషల వారంతకూడ చూసి ముగ్ధులైపోయేవారట. వారిలో ముఖ్యులు తమిళ సోదరులు.

ముఖ్యంగా ఆంధ్రసంఘంచే డా॥ కే. యల్. రావు, పింగళి వీరరాఘవరావు గార్ల ఆధ్వర్యంలో అనేక తెలుగు నాటకాలు జయప్రదంగా ప్రదర్శించబడ్డాయి.

రానురాను స్త్రీ పాత్రలను కూడా ఢిల్లీలో వున్న ఆంధ్ర స్త్రీలే ధరిస్తూ ఆ కొరతనుకూడా తీర్చుకున్నారు.

*దక్షిణ భారత నటీ*
*నట సమాఖ్య :*

ఢిల్లీలో దక్షిణ భారత నటీ నట సమాఖ్యను గురించి తెలియని ఆంధ్రుడు లేడు. ఈ సమాఖ్యలో ప్రసిద్ధ నటుడు కె. వెంకటేశ్వరరావు అనేక నాటకాలు కట్టుదిట్టంగా ప్రదర్శింపచేశాడు. ఈ సమాఖ్యను కేవలం ఆంధ్రులేకాక దక్షిణాది నాలుగు భాషలకు చెందినవారితో, కె. వెంకటేశ్వరరావు, టి. రామచంద్రరావు మరి కొంతమంది వుత్సాహవంతులు స్థాపించారు.

ఈ సమాఖ్యలో కె. వెంకటేశ్వరరావు శిక్షణలో ప్రదర్శించిన తెలుగు నాటకాలు ఇతర భాషలవారు ఆశ్చర్యచకితు లయ్యేటంతగా మెప్పుపొందాయి. అటువంటి వాటిలో ముఖ్యమైనవి ''కప్పలు'', ''రాగరాగిణి'', ''ఫణి'' మొదలైనవి. వెంకటేశ్వరరావు ఢిల్లీలో వున్నంతకాలమూ నాటకాలు జనరంజకంగా ప్రదర్శింపబడి ఆంధ్రులందర్నీ ఆకర్షించాయి.

వెంకటేశ్వరరావు ఢిల్లీ వదలి వెళ్ళినతరువాత అయ్యగారి వీరభద్రరావు, కలపటపు రామగోపాలరావు మొదలైనవారు ప్రదర్శించిన ''కీర్తిశేషులు'' నాటకం గొప్ప పేరు తెచ్చుకుంది.

ముఖ్యంగా ఢిల్లీలో తెలుగు నాటకాలకు ప్రాణం పోసినవారు టి. రామచంద్రరావు, న్యాయపతి రాఘవేంద్రరావు. తెలుగువారికి నాటక కళలో ఒక ప్రత్యేక విశిష్టత వున్నదని సమాఖ్య నాటకాలు ఋజువుచేశాయి. ఈనాటికీ ద॥ భా॥ నటీ నట సమాఖ్య వర్ధిల్లుతూనే వుంది.

# బొంబాయి తెలుగు నాటకరంగం

కాచూటిపురం :

బొంబాయి నగరంలో ఆంధ్రుల నివాసం నూరు సంవత్సరాల క్రితమే ప్రారంభమైంది. బొంబాయి వచ్చిన తెలుగు వారందరూ తెలంగాణా ప్రాంతం నుంచీ వచ్చినవారే. ఇలా వచ్చినవారికి స్థిరనివాసం కల్పించే నిమిత్తం విశాలమైన ఒక పేట నిర్మించడానికి ప్రభుత్వం అవకాశాలు కల్పించింది. ఆనాటికి లభ్యమైన సౌకర్యాలతో తెలుగు ప్రజలకోసం, తెలుగు ప్రజలచే నిర్మితమైన పేట కాచూటిపురం.

ఆంధ్ర అసోసియేషన్ స్థాపన :

1926 వ సంవత్సరంలో బొంబాయి ఆంధ్ర అసోసియేషన్ స్థాపించబడింది. ఇదికాక కొన్ని గ్రంథాలయాలు, స్థానిక తెలుగు సమాజాలు కూడా తయారయ్యాయి. ఆంధ్రు లందరికీ ప్రాతినిధ్యం వహించగల సంస్థ నిర్మించే పథకంలో 1943 వ సంవత్సరంలో బొంబాయి ఆంధ్రమహాసభ స్థాపించబడింది. అది శకునాడు పెరిగి మహావృక్షమై ఆంధ్రుల సాంస్కృతిక కార్యక్రమాలకు అండగా నిలుస్తూంది.

నాటక ప్రదర్శనాలు :

బొంబాయి ఆంధ్రమహాసభ యాజమాన్యం క్రింద సమాజ సభ్యులు అప్పుడప్పుడు నాటకాలు ప్రదర్శిస్తూ వుండేవారు. మహాసభ ఆధ్వర్యంలో పెద్ద పెట్టున శ్రీరామనవమి ఉత్సవాలు జరుపబడేవి. ఆ ఉత్సవాల్లో నాటకాలు ప్రదర్శిస్తూ వుండేవారు. రామదాసులాంటి పౌరాణిక నాటకాలే కాక, కన్యాశుల్కం, కంతా భరణంవంటి హాస్య సాంఘిక నాటకాలు కూడా బొంబాయిలో ప్రదర్శింపబడ్డాయి.

రెండవ యుద్ధం తర్వాత :

రెండవ ప్రపంచయుద్ధం తరువాత విరివిగా మధ్య తరగతి ఆంధ్రులు, విద్యావంతులు, ఉద్యోగస్తులు బొంబాయికి రావడం ప్రారంభించారు. దానితో

నాటక ప్రదర్శనాలు ఎక్కువయాయి. సాంప్రదాయ నాటకాలే కాక, ఆధునిక నాటకాల ప్రదర్శన ప్రారంభమైంది. ఇదేసమయంలో ఇండియన్ పీపుల్స్ థియేటరు బొంబాయి శాఖ ఏర్పడినప్పుడు, దానికి అనుబంధంగా ఆంధ్ర ప్రజా నాట్యమండలి స్థాపించబడి కొన్ని సంవత్సరాలు ఎంతో ఉత్సాహంగా నాటకాలు ప్రదర్శించింది. గుమాస్తా—పరివర్తన వంటి సాంఘిక నాటకాలు బొంబాయి ప్రజా నాట్యమండలి ప్రదర్శించింది.

ఆంధ్ర ప్రజా నాట్యమండలి :

1943 వ సంవత్సరంలో బొంబాయిలో అఖిల భారత ప్రజా నాట్యమండలి మహాసభ సందర్భంలో అన్ని రాష్ట్రాల నాటక బృందాలమధ్య జరిగిన పోటీలో ఆంధ్ర ప్రజా నాట్యమండలి ప్రథమ బహుమతి సంపాదించుకున్న సమయంలో బొంబాయి ఆంధ్రమహాసభవారిని గౌరవించి రజత పాత్రను బహూకరించింది.

తరువాత 1948 జనవరిలో ఆంధ్ర ప్రజా నాట్యమండలి ఆంధ్రశాఖ తరపున డాక్టరు రాజారావు, మిక్కిలినేని, కోగంటి గోపాలకృష్ణయ్య, కోసూరి పున్నయ్య మొదలైనవారు వచ్చి, మాభూమి మొదలైన నాటకాలను, ఉత్తేజాన్ని కలిగించే అనేక జానపద కళారూపాలను ప్రదర్శించి, బొంబాయి ప్రజా నాట్యమండలిని ఉత్తేజపర్చారు. ఆ తరువాత 1949-50 లో వచ్చిన రాజకీయ పరిణామాలవల్ల ప్రజానాట్యమండలి కార్యకలాపాలు కొంతవరకు క్షీణించాయి.

ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటీ :

బొంబాయిలో ఆంధ్ర విద్యార్థులకు విద్యావసతులు కలిపించే నిమిత్తం ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటీ ఏర్పాటైంది. ఈ సొసైటీకి సొమ్ము సమకూర్చే నిమిత్తం ఆంధ్రదేశం నుంచి శ్రీమతి లక్ష్మీరాజ్యం, పులిపాటి వెంకటేశ్వర్లు మొదలైనవారి ఆధ్వర్యంలో నాటకాలు ఏర్పాటుచేశారు. ప్రతిసంవత్సరం పండుగ దినాల్లో నాటినుండి నేటివరకూ నాటకాలు ప్రదర్శిస్తూనే వున్నారు.

కళాక్షేత్రం :

1950 వ సంవత్సరంలో ఆంధ్రమహాసభ స్వంత భవనాన్ని నిర్మించుకుని, ఆ భవనంలో కళాక్షేత్రమన్న పేరుతో చక్కని బహిరంగ నాటకశాలను ఏర్పాటు చేసింది. ప్రతిసంవత్సరం ఆంధ్రదేశంనుంచి సూరిబాబు బృందం, శ్రీ రాజ

రాజేశ్వరీ నాటకసమాజం వారిచేత సాంప్రదాయక నాటకాలూ, 'పాండవ ఉద్యోగ విజయాలు' 'చింతామణి' 'బొబ్బిలియుద్ధం' 'పాదుకా పట్టాభిషేకం' 'తారాశశాంకం' మొదలైన నాటకాలు ప్రదర్శింపచేశారు. తరువాత విజయవాడ నవ్యకళా సమితి వారు ప్రఖ్య శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో ఆధునిక నాటకాలు ప్రదర్శింపచేశారు.

'దొంగవీరడు' 'ఫణి' 'ఆడవి' 'ఆకాశరామన్న' మొదలైన నాటకాలుకూడ కళాక్షేత్రంలో ప్రదర్శింపబడ్డాయి.

స్థానిక రచయితలైన అవసరాల వెంకటనర్సుగారి 'కీలుబొమ్మ', సోమంచి యజ్ఞన్న శాస్త్రిగారి 'పెద్దమనుషులు' ప్రప్రథమంగా బొంబాయిలోనే ప్రదర్శిత మయ్యాయి. ఇవికాక స్థానిక సభ్యులు నార్ల వెంకటేశ్వరరావు, భమిడిపాటి కామేశ్వరరావు, భమిడిపాటి రాధాకృష్ణ మొదలైన రచయితల నాటికలు, ఆధునిక నాటకాలూ చాలాసార్లు ప్రదర్శించాడు. పి. డి. నాగేశ్వరరావు దర్శకత్వంతో సంగీత నృత్య నాటకాలు ప్రదర్శింపబడ్డాయి.

ఈమధ్య 'రూపక' అన్న పేరుతో ఉత్సాహంతులైన ఆంధ్ర యువకులు మరో అసోసియేషన్ ప్రారంభించి, నాటకాలను ప్రదర్శిస్తున్నారు.

ఎడ్యుకేషన్ సొసైటీ నిర్మిస్తున్న స్కూలు భవనంలో విశాలమైన నాటక ప్రదర్శనా మందిరాన్నికూడా నిర్మించారు.

# షోలాపూర్ ప్రజానాట్యమండలి

రాష్ట్రేతర ప్రాంతాలకు ఆంధ్రులందరూ ఎలా వెళ్ళారో అలాగే షోలాపూర్ కూడా ఆంధ్రులు చేరుకున్నారు. ఇలా చేరుకున్నవారిలో ఎక్కువ మంది తెలంగాణాకు సంబంధించినవారు. నూటికి 90 మంది మిల్లుల్లో పనిచేసే కార్మికులు. తాత్కాలిక వినోదంకోసం కాకతాళీయంగా అప్పుడప్పుడు వారు ప్రదర్శించే జానపద కళారూపాలు, పౌరాణిక నాటకాలు తప్ప, నాటకరంగం అంతగా అభివృద్ధి చెంద లేదని చెప్పవచ్చు. తెలుగు దేశంనుండి కొంతమంది వృత్తినాటక సమాజాలవారు అప్పుడప్పుడు వచ్చి నాటకాలు ప్రదర్శించి వెళుతూ వుండేవారు.

1948 వ సంవత్సరంలో ఆంధ్ర ప్రజానాట్యమండలి రాష్ట్రదళం వచ్చి,

మాభూమి నాటకాన్ని, జానపద కళారూపాలను ప్రదర్శించి వెళ్ళింది. ఆ తరువాత యువకుల్లో నవ చైతన్యం కలిగి షోలాపూర్ ప్రజానాట్యమండలిని స్థాపించారు.

ప్రజా నాట్యమండలి :

ప్రప్రథమంగా షోలాపూర్ మునిసిపాలిటి సభ్యులు, ప్రముఖ కళాకారులు అయిన శ్రీ విఠల్‌రావు ఫల్‌మారిగారు ప్రజా నాట్యమండలికి ప్రారంభోత్సవం చేశారు. అధ్యక్షులుగా శీదుంపేట నారాయణ, కార్యదర్శిగా పోతుల లక్ష్మణగార్లు ఎన్నుకోబడ్డారు. 12 మంది సభ్యులతో కార్యవర్గం ఎన్నుకోబడింది.

ప్రథమంగా 'తెలంగాణా వీరయోధులు' బుర్రకథను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనం షోలాపూర్‌లోని తెలుగు ప్రజానీకాన్ని విశేషంగా ఆకర్షించింది. ఆ రోజుల్లో ఇతర నాటక సమాజాలున్నప్పటికీ బుర్రకథకే ప్రజలు ఎక్కువ ప్రాముఖ్యమిచ్చారు. ప్రభుత్వానికి సంబంధించిన 'కాంగార్ కళ్యాణకేంద్రం', కార్మిక వికాస కేంద్రం మొదలైన ఇతర సంస్థలు కూడా ప్రజా నాట్యమండలిని ఆహ్వానించి ప్రదర్శనాలు చూచి ఆనందించారు.

తరువాత ప్రథమంగా బాలనాగమ్మ నాటకం ప్రదర్శించి తద్వారా నాటక ప్రదర్శనానికి కావలసిన డ్రస్సులు, తెరలు మొదలైనవి సంపాదించి, వరుసగా 'కనకతార' 'ద్రౌపదీ స్వయంవరం' 'సుగుణావతి' 'భద్రసేన' 'సారంగధర' 'శశిరేఖా పరిణయం' 'భక్తమార్కండేయ' 'అభినవ కిరాతార్జున' మొదలైన పౌరాణిక నాటకాలను అనేకం ప్రదర్శించారు.

బుర్రకథ దళం :

ప్రజా నాట్యమండలి ఆధ్వర్యాన 'కుమారి ముత్య' 'రాము' 'రవి' మొదలైన బాలికలతో ఒక బుర్రకథ దళం ఏర్పాటుచేసి, 'అమరజీవి' 'వీరేశలింగం' 'అల్లూరి సీతారామరాజు' 'రుద్రమదేవి' 'చైతువిజయం' 'ఝాన్సీ లక్ష్మీబాయి' 'గొల్లకథలు' 'నేటి రాయలసీమ' మొనలైన ప్రబోధాత్మక బుర్రకథలద్వారా ప్రజల నుద్రూత్ లూగించి కర్తవ్యబోధ చేశారు.

సాంఘిక నాటకాలు :

'నేతబిడ్డ' 'కష్టజీవి' 'నేటిన్యాయం' 'తిరుగుబాటు' 'అల్లూరి సీతారామరాజు' మొదలైన నాటకాలను ప్రజా నాట్యమండలిద్వారా ప్రదర్శించారు.

ప్రజా నాట్యమండలి కార్యకర్తలుగాను, నటులుగాను వుండి ఈ క్రిందివారు అపారమైన సేవ చేశారు: వీరన్న గోరంట్ల, దోపు రాజయ్య, ఎ. సుదర్శన్, గుండేటి మొగిలి, మేర్గు రాజయ్య, డి. రమణయ్య, ఆంచ్ సూర్యం, పి. వీరయ్య, నల్ల మల్లయ్య, వి. లింగయ్య, మామిండ్ల వెంకటేశ్, గోలి దుర్గయ్య, వి. శంకర్, దోర్న విఠల్, ఎలిగేటి కొమరయ్య, గుడ్డెళి కొండయ్య, ఎ. నారాయణ, జి. వీరయ్య, బి. వెంకటయ్య, యం. నారాయణ, వీరప్ప కాముక్తి, దత్తు కోమల్, వెంకటయ్య, మాణిక్, సామల్ గౌరయ్య, సి. హెచ్. బాలాజి, దుర్గయ్య మొదలైనవారు.

మండలిలో ముఖ్యంగా, విలన్‌గా శ్రీహరి, మాణిక్‌గార్లు మంచిపేరు తెచ్చుకున్నారు. గాయకులుగా శ్రీ మొగిలి రమణయ్య, మామిండ్లగార్లు, నాటకాల్లో కథానాయకుడుగా ఎ. సుదర్శనగార్లు ప్రజాదరణ పొందారు.

# కలకత్తా ఆంధ్ర నాటకరంగం

ఉద్యోగరీత్యా బ్రతుకుతెరువుకోసం రాష్ట్రం వదలిపోయిన ఆంధ్రులు ఇతర రాష్ట్రాల్లో కొన్ని లక్షలమంది నివసిస్తున్నారు. అలా నివసిస్తున్నవారిలో కలకత్తా నగరం, దాని పరిసరాల్లో కలిసి దాదాపు రెండు లక్షలమంది వున్నారు.

ఆంధ్ర నాటకరంగాభివృద్ధితోపాటు ఆంధ్రులు నివసించే ప్రతిచోటా ఔత్సాహిక నాటక సంఘాలు పనిచేస్తున్నాయి. పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల బృందాలు పండుగదినాల్లో జాతీయమైన తెలుగు జానపద కళారూపాలను ప్రదర్శిస్తున్నారు. ఇలా ప్రదర్శించే నాటక బృందాలు దాదాపు కలకత్తా చుట్టుప్రక్కల 60 సంఘాల వరకూ పనిచేస్తున్నాయి.

ముఖ్యంగా కలకత్తా నగరంలో ఆంధ్రా అమెచ్యూర్స్, ఆంధ్రసంఘం, నారాయణ నాట్యమండలి, సంస్కృతీ సమాఖ్య మొదలైనవి చురుకుగా పనిచేసే నాటక సంఘాలుగా పేర్కొనవచ్చు.

కాళిదాసుని శాకుంతల నాటకం:

1931-32 సంవత్సరాలలో ప్రప్రథమంగా 'మధుసేవ' నాటకం ప్రదర్శించటం

జరిగింది. ఆ తరువాత 1938 ఫిబ్రవరి 13 న వుత్తమస్థాయిలో శకుంతల నాటకం మదన్ థియేటరులో పార్శీథియేట్రికల్ కంపెనీవారి దుస్తులతో ప్రదర్శింపబడింది. ఈ ప్రదర్శనం కళకళలాడింది. ఈ ప్రదర్శనంలో చిరకాలంగా కలకత్తా నివాసులైన వేదాంతం సుబ్రహ్మణ్యంగారు దుష్యంతపాత్ర ధరించినందుకు సువర్ణ పతకాన్ని బహూమతిగా పొందారు. ఈ ప్రదర్శనానికి కీ॥శే॥ కొప్పరపు సుబ్బారావు, మాసి సూర్యనారాయణ మొదలైనవారు హాజరైనారు.

ఈ నాటక ప్రదర్శనం కలకత్తా ఆంధ్రుల్ని ఉత్సాహపర్చింది. వరుసగా నాటకాలు వేయడం ప్రారంభించారు. భమిడిపాటివారి ప్రహసనాలు, 'ఆంధ్రజ్యోతి' 'విడాకులా' 'రామదాసు' 'కృష్ణరాయబారం' 'నందనార్' మొదలైన నాటకాలను ప్రదర్శించారు.

ఉత్సాహవంతులైన ఆంధ్రులకు ఆంధ్రసంఘ భవనాన్ని నిర్మించాలనే కోరిక కలిగి నాటకాలను ప్రదర్శించి, రెండువేలరూపాయల నిధిని సేకరించారు.

ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంలో 'కన్యాశుల్కం'నాటకాన్ని, సుభద్రాపరిణయం నృత్యనాటకాన్ని ప్రదర్శించారు.

### ఖిల్జీ రాజ్యపతనం :

కలకత్తా థియేటరు సెంటరువారు ఏర్పాటుచేసే ప్రదర్శనాల్లో పాల్గొని 1956 వ సంవత్సరంలో ప్రప్రథమంగా గుండిమెడ వెంకటసుబ్బారావుగారి ఖిల్జీ రాజ్యపతనం ఎంపైర్ థియేటరులో ప్రదర్శించి పలువురి మన్ననలందుకున్నారు. ఈ ప్రదర్శనానికి డా. రాధాకృష్ణన్‌గారు హాజరైనారు. ఈ ప్రదర్శనం వుత్తమ స్థాయి ప్రదర్శనంగా ఎంచబడి బెంగాల్ ప్రముఖులచేత అల్లావుద్దీన్ పాత్రధారియైన వేదాంతం సుబ్రహ్మణ్యం, కమల పాత్రధారి పార్నంది రుక్మిణీదేవి పతకాలను పొందారు.

### ప్రదర్శించిన నాటకాలు :

గడచిన దశాబ్దంలో ప్రతి పండుగకూ, తెలుగు నాటకాలను కొల్లలుగా ప్రదర్శించారని చెప్పవచ్చును. వీరు ప్రదర్శించిన నాటకాలు 'చింతామణి' 'బొబ్బిలి' 'గయోపాఖ్యానం' 'పంజరం' 'సినిమాగరల్' 'నాటకం' 'గుమాస్తా' 'ఈ సంసారం' 'ఖడ్గతిక్కన' 'మాష్టర్జీ' 'కమల' 'కప్పలు' 'స్వర్గసోపానం' 'తెలుగుకోపం'

'ఆనంతం' 'పెళ్ళిచూపులు' 'బంగారుసంకెళ్ళు' 'గాలివాన' మొదలైనవి... ఈ విధంగా కలకత్తా ఆంధ్ర కళాకారులు బహుముఖాల ఆంధ్ర నాటక రంగానికి సేవచేశారు.

వేదం వెంకటరాయశాస్త్రిలవారి ప్రతాపరుద్రీయం నాటకమూ, ఖిల్జీరాజ్య పతనమూ ఉన్నతస్థాయిలో ప్రదర్శింపబడి, రాష్ట్రేతరులైన బెంగాలీ ప్రముఖుల ప్రశంస లందుకున్నాయి.

తుఫాన్ :

వేదాంతం సుబ్రహ్మణ్యం వివిధ జాతుల సమైక్యతను దృష్టిలో వుంచుకుని తూర్పు బెంగాల్ కాందిశీకుల దుస్థితిని వివరిస్తూ తుపాను నాటికను వ్రాసి ప్రదర్శించారు. ఈ నాటిక కలకత్తాలో నున్న అన్ని భాషల ప్రజల మన్ననలందుకుంది. నటీ నటులు వారివారి పాత్రలను ఉత్తమస్థాయిలో నటించారు. ఈ నాటకానికి సాంకేతిక నిపుణులు ఎంతగానో సహాయం చేశారు. ఈ నాటకంలో తెలుగు, బెంగాలీ, హిందీ, ఇంగ్లీషు, అరవం మొదలైన భాషలు వాడబడ్డాయి. ఒక బెంగాలీ యువతి నటించింది. ఈ ప్రదర్శనంతో ఆంధ్రుల గౌరవ ప్రతిష్ఠలు బాగా పెరిగాయి. తుపాన్ నాటిక తరువాత హంహింహూస్తాన్, కదంకదం బడాతే జాప్ మొదలైన నాటకాలు వెలువడి ఉత్తమంగా ప్రదర్శించబడ్డాయి.

ధనంజయ బైరాగి విరచిత రజనీగంధ అనే బెంగాలీ నాటకాన్ని వేదాంతం సుబ్రహ్మణ్యం అనువాదంచేసి ఆశాదేవి అనే పేరుమీద ప్రదర్శించారు. ఈ నాటకాన్ని బెంగాలీ నాటకాలకు ఏమాత్రం తీసిపోని రీతిలో ప్రదర్శించారు.

స్త్రీ పాత్రల సమస్య :

ప్రదర్శించే నాటకాల్లో స్త్రీ పాత్రలు ధరించేవారు లేకపోవడంవల్ల స్త్రీ పాత్రలను పురుషులే కొంతకాలం ప్రదర్శిస్తూ వచ్చారు. మరికొన్ని స్త్రీ పాత్రలు లేని నాటకాలను ప్రదర్శించటం ప్రారంభించారు. కాని 15 సంవత్సరాలనుండీ విశాల దృక్పథమూ, సంస్కారమూ గల సభ్యుల భార్యలు స్త్రీ పాత్రల్నీ, పిల్లలు బాలవేషాలనూ వేయడంవల్ల ప్రదర్శనాలను కనులపండువుగా ప్రదర్శిస్తున్నారు. ఇంవల్ల స్త్రీ పాత్రలకొరత చాలవరకు తగ్గింది. ఇంకు ఆ పాత్రలు ధరించే సోదరీమణులు ఎంతో అభినందించతగివున్నారు.

### రంగస్థలం దొరకలేదు :

ఇంతటి వుత్సాహంతో నాటకాలు ప్రదర్శించేవారికి నాటకాలు ప్రదర్శించు కోవడం ఆనాటికానాడు కష్టమైపోయింది. అనుకున్న రోజుకు హాలు దొరకడమే కష్టమైపోయింది. ఇందుకు వుత్సాహవంతులైన కలకత్తా ఆంధ్ర కళాకారులు నడుం బిగించారు. కార్యాన్ని సాధించారు. 25 సంవత్సరాల వారి కృషి ఫలితంగా ఈనాడు స్వంత రంగస్థలాన్ని సంపాదించుకోగలిగారు. ఆనాడు ప్రారంభించిన నిధి దినదిన ప్రవర్ధమానమైంది. రెండున్నర లక్షరూపాయలు వెచ్చించి సుందరమైన రంగస్థలాన్ని నిర్మించుకున్నారు. ఈనాడు ప్రదర్శనాలన్నీ ఆ హాలులో ప్రదర్శింప బడుతూ వున్నాయి.

### బాల నాటక సమాజాలు :

కలకత్తా ఆంధ్రనాటకోద్యమంలో పురుషులూ, స్త్రీలూ, ఎంతటి సమాన బాధ్యతల్ని నిర్వహించారో బాలబాలికలు కూడ అంతటి స్థానాన్ని సంపాదించారు. వారి ప్రత్యేకతను చాటుకున్నారు. పెద్దల ప్రోత్సాహంతో పాత్రలు ధరించడమేకాక అనేక పిల్లల నాటకాలు ప్రదర్శించబడ్డాయి. కేవలం మహిళలు 'అసంపూర్ణ రామా యణం' 'అమ్మలక్కలు' మొదలైన నాటకాలను కూడ ప్రదర్శించారు. పిల్లలూ, పెద్దలూ కలిసి ప్రదర్శించిన చెప్పుకోదగ్గ నాటకం రవీంద్రుని పోస్టాఫీసు.

ఈవిధంగా ఈనాడు వంగదేశంలో రాష్ట్రేతరులైన ప్రవాసాంధ్రుల నాట కోద్యమం మూడు పువ్వులు-ఆరుకాయలు కాస్తూ, పరవళ్ళుత్రొక్కుతూ ముందుకు పోతోంది. ఇందుకు మూలకారకులు ఆనాటినుంచీ ఈనాటివరకూ కృషిచేస్తున్న కళాజీవి వేదాంతం సుబ్రహ్మణ్యం.

# జంషెడ్‌పూర్ ఆంధ్రనాటక రంగం

### ఆంధ్రనాటక సాహిత్య సంఘం :

రాష్ట్రేతర ప్రాంతమైన జమ్‌షెడ్‌పూర్‌లో బహు పురాతనంగా అంటే దాదాపు 40 సంవత్సరాలక్రితం ఆంధ్ర నాటక సాహిత్య సంఘం ఏర్పడింది. ముఖ్యంగా బాలబాలికల విద్యకు అపారమైన సేవచేస్తూ వుంది. పెద్ద భవనం,

చక్కని నాటకరంగం, పెద్ద గ్రంథాలయం, లేబరేటరీని ఏర్పాటుచేసుకుని ఎంతో ఆదర్శవంతంగా పనిచేస్తూ వుంది.

స్థానికంగా అనేక పౌరాణిక చారిత్రక సాంఘిక నాటకాలు ప్రదర్శించడమే కాక విజయనగరం రాఘవ నాటకోత్సవాల్లో ఆర్. వి. చలం దర్శకత్వాన అనేక పర్యాయాలు అనేక నాటకాలు ప్రదర్శించి పేరుగడించుకుంది ఆంధ్ర నాటకసాహిత్య సంఘం.

జంషెడ్‌పూర్‌లోనే మాధ్యమిక పాఠశాల, గ్రంథాలయం, మరొక నాటక సమాజమూ ఏర్పాటుచేసుకున్న 'ఆంధ్ర అసోసియేషన్' కూడ ఆదర్శవంతంగా నాటకాలు ప్రదర్శిస్తూ వుంది. స్వంత భవనాలుగల ఈ రెండు సంస్థలేగాక నాటక కళలో అత్యంత శ్రద్ధాభక్తులుచూపే సమూహాలు కూడా వున్నాయి. వాటిలో కేవలం నాటక కళకే అంకితమైన సమాజం 'చలనసమితి' స్థానిక పోటీల్లోనూ, విజయనగరం నాటకపోటీల్లోనూ, నర్సాపురం నాటక కళాపరిషత్తులోనూ, రాజమహేంద్రవరం లలితకళా నికేతన్ నాటకపోటీల్లోనూ పాల్గొని అనేక బహుమతులూ అంతకుమించి కీర్తినీ గడించుకున్నది.

జంషెడ్‌పూర్ నాటకరంగంలో ప్రఖ్యాతి వహించిన నటులు ఆర్. వి. చలం, వి. వి. చలపతిరావు, ఎ. సత్యనారాయణ, మూర్నారి సత్యనారాయణ, జి. యస్. మూర్తి, త్రిపాద జగన్నాధరావు, మంగుపూడి వెంకటరావు, రామ నరసు మొదలైనవారు.

ఆర్. వి. చలం :

ఆర్. వి. వెంకటచలం, జంషెడ్‌పూర్‌లో 1938 నుండి నేటివరకూ చాలా పౌరాణిక నాటకాలు ప్రదర్శించాడు. పౌరాణిక నాటకాల్లో 'భక్తప్రహ్లాద', చారిత్రకాల్లో 'చాణక్య', సాంఘికాల్లో 'ధనం' మొదలైన పాత్రలు అతనికి పేరుతెచ్చాయి.

నాలుగుసార్లు విజయనగరం రాఘవ నాటకోత్సవాల్లో ఉత్తమ నటుడుగా ఎన్నికైనారు. మూడుసార్లు అతని స్వంతనాటకాలు ఉత్తమ ప్రదర్శనాలుగా ఎన్నికైనాయి.

ఇటీవల 1964 లో రాజమహేంద్రవరం లలిత కళా నికేతన్ పోటీల్లో

మరొకసారి ఉత్తమనటుడుగా ఎన్నిక అవడమేగాక, అతను రచించిన'మాటతప్పకు' నాటకం ఉత్తమ రచన బహుమతి సంపాదించుకున్నది.

ఆయన రచించిన నాటకాలు 'డెబ్భైఏళ్ళ జీవిత ఫలితం' 'ఉసురు' 'నియంత పతనం' 'స్వర్గసోపానం' 'మాటతప్పకు' 'రాంగ్‌నెంబరు.'

మాటతప్పకు నాటకం విజయనగరంలోను, రాజమహేంద్రవరంలోను ఉత్తమ రచనగా, నర్సాపురం నాటక కళాపరిషత్తులో ద్వితీయ ఉత్తమ రచనగా ఎన్నికైనది.

రావి సీత :

రావి వెంకటచలంగారి అమ్మాయి రావి సీత 7 సంవత్సరాల ప్రాయంలో భక్తకుచేలలో రాఘవుని పాత్ర ధరించింది.

పది సంవత్సరాల ప్రాయంలో బాలికల 'కృష్ణతులాభారం'లో సత్యభామ పాత్ర అత్యంత జయప్రదంగా నిర్వహించి సువర్ణపతకం బహుమతిగా పొందింది. రాజమండ్రి లలిత కళా నికేతన్ నాటక పోటీల్లో 'మాటతప్పకు' నాటకంలో కథా నాయకి పాత్రధరించి, ఉత్తమనటిగా ఎన్నికై అనేకమంది కళాభిమానుల ప్రశంస లను అందుకుంది. జంషెడ్‌పూర్ నాటక రంగంలో రావి సీత ఒక మణిపూస.

బిందాన నారాయణరావు :

జంషెడ్‌పూర్ నాటక రంగంలో నాటక విమర్శకులుగా పేరుపొందినవారు బిందాన నారాయణరావుగారు. ఆయన కళాప్రియుడు జంషెడ్‌పూర్ ఆంధ్ర విజ్ఞాన సమితి నడిపిన 'ప్రవాసి' పత్రికలో నాటక రంగమీద అనేక వ్యాసాలను రాశారు. స్థానిక నాటక సమాజ కార్యకలాపాల సందర్భంలో అనేక ఉపన్యాసాల నిచ్చారు. వాటినన్నిటినీ గుదిగుచ్చి ఇటీవలనే 'మన శ్రీరంగం' అనేక గ్రంథంగా వెలువరించారు. ఈ గ్రంథానికి వేలూరు శివరామశాస్త్రిగారు పీఠిక వ్రాశారు. ఈ గ్రంథం నటీ నటులకు అత్యంత ఉపయోగకరమైనది.

# ప్రసిద్ధ నటులు



శ్రీ బేతా వెంకటరావు



శ్రీ డి. వి. యల్. నరసింహం



శ్రీ వి. కుమార్
(మేకప్ ఆర్టిస్టు)



576A

# ప్రసిద్ధ నటులు



శ్రీమతి బుచ్చేంద్రమణి



శ్రీమతి అంజలీదేవి



శ్రీ వెంపటి చినసత్యనారాయణ
(కూచిపూడి ఆర్టు అకాడమి)



శ్రీమతి సావిత్రి

516 B

# ప్రసిద్ధ నటులు



శ్రీ వనారస చినరామయ్య



శ్రీ చదలవాడ కుటుంబరావు



శ్రీమతి పి. రామతిలకం

576 C

# ప్రసిద్ధ నటులు



శ్రీ టి. వి. రమణారెడ్డి



శ్రీ డి. వేణుగోపాల్
(ఇండియన్ బ్యాలెట్ సెంటరు)

5760

# ప్రసిద్ధ నటులు



శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు



శ్రీ జి. యస్. ఆర్. మూర్తి



శ్రీ వంగర వెంకటసుబ్బయ్య

576 E

# ప్రసిద్ధ నటులు



శ్రీ వుప్పలూరి సంజీవరావు



శ్రీ టి. యల్. కాంతారావు



శ్రీమతి రాజసులోచన

576 F



"ఆంధ్రుడా లేవరా" — మా భూమి నాటకంలో ఒక నన్నివేశం
ఉమామహేశ్వరరావు — కోగంటి — కోసూరి పున్నయ్య — మిక్కిలినేని



ఆంధ్ర ప్రజా నాట్యమండలి (రాష్ట్రదళం సభ్యులు)

# 15

# హిందీనాటకరంగం



ఆంధ్రులు ప్రదర్శించిన హిందీ నాటకాలు, హిందీ వ్యాప్తికి హిందీ నాటకాలు, రాష్ట్ర వ్యాపిత హిందీ నాటకరంగం, హిందీ నాటకాల్లో ఆంధ్ర నటుల ప్రతిభ, ఘాత్ర రాహుల ప్రశంసలు, తెలుగునుంచి హిందీలోకి

# ఆంధ్రులు ప్రదర్శించిన హిందీ నాటకాలు

భారతీయ జాతీయోద్యమాన్ని గురించి వ్రాయాలంటే మొట్ట మొదట మహాత్మాగాంధీ పేరు ఉదహరించవలసి వుంటుంది. నిర్మాణ కార్య క్రమంలో హిందీప్రచారం ఒక భాగంగా ప్రకటించారాయన. ఆ ప్రాతిపదికమీద దక్షిణ హిందీప్రచారసభ మద్రాసులో ఏర్పడింది. ఏ వుద్యమమైనా ప్రజల్లో చొచ్చుకుపోవడానికి, వారి హృదయాలను ఆకర్షించడానికి నాటకరంగం ఎంతో వుపయోగపడుతుంది. దీన్ని పురస్కరించుకుని ఆంధ్ర దేశంలో హిందీ ప్రచారం విరివిగా జరగడానికి హిందీ నాటక ప్రదర్శనాలు చాలవరకు ఉపయోగపడ్డాయి.



జాతీయ ఉద్యమం-హిందీ:

ఆ రోజుల్లో జాతీయోద్యమంలో జైలుకు వెళ్ళడం ఎంత గౌరవమో, హిందీ నేర్వడం కూడా అంత గౌరవం గానూ వుండేది. హిందీప్రచారకుల భాషాప్రచారంతో పాటు ప్రజల్లో హిందీ అంటే ఆసక్తి అభిరుచి కలుగచేయడానికి హిందీనాటక ప్రదర్శనాలు ముఖ్యమైన సాధనాలుగా వుపయోగపడ్డాయి.

హిందీ వ్యాప్తికి
హిందీనాటకాలు:

గాంధీజీ ప్రబోధం - జాతీయ భాషాభిమానం, ఇవి రెండూ హిందీ ప్రచార కులను ఉత్తేజపరచాయి. తత్ఫలితంగా ఆంధ్రదేశంలో అనేక హిందీ నాట్య సంఘాలు ఏర్పడ్డాయి. ఈనాడు వేరువేరు రంగాల్లో ప్రసిద్ధికెక్కిన గొప్ప గొప్ప వ్యక్తులెందరో ఆ నాట్యసంఘాలలో చేసి హిందీ నాటక ప్రదర్శనలద్వారా హిందీ ప్రచారోద్యమానికి ఎనలేని సేవజేశారు. ఇది మనకు గర్వకారణం. అటు వంటివారిలో శ్రీ దాడి గోవిందరాజులు, శ్రీ శిష్ల బ్రహ్మయ్య, శ్రీ పసల సూర్యచంద్ర

రావు, శ్రీ నండూరి రామకృష్ణారావు, శ్రీ గాడేపల్లి సూర్యనారాయణ, శ్రీ ఎస్. యల్. పెరుమాళ్ళు, శ్రీ ఆట్లూరు రామారావు, శ్రీ తోట వెంకటేశ్వరరావు మొదలైన వారు ముఖ్యులు.

మూడు సంవత్సరాలూ
మొదటి బహుమతి :

దక్షిణ భారత హిందీ ప్రచారసభ మద్రాసులో 1938 - 39 - 40 సంవత్సరాలలో నాలుగు ప్రాంతాల మధ్య హిందీ నాటక ప్రదర్శపోటీలు జరిపింది. అందులో వరుసగా మూడు సంవత్సరాలు ప్రథమ బహుమతి సంపాదించిన ఆంధ్ర రాష్ట్ర హిందీప్రచార నాట్యమండలికే షీల్డు దక్కింది. ఈ మండలి చంద్రగుప్త, భాగ్యచక్ర, షాజహాన్ నాటకాలు ప్రదర్శించింది. వీటిలో దాడి గోవిందరాజులు, ఉన్నవ రాజగోపాలకృష్ణయ్య, చిట్టూరు లక్ష్మీనారాయణశర్మ, బాలచంద్ర ఆప్టే, నండూరు రామకృష్ణారావు మొదలైన ప్రముఖులు అద్భుతంగా నటించి ప్రశంసా పాత్రులయ్యారు. చాణక్య పాత్రధారి వున్నవజీకి, కాకాకలేల్కర్, ప్రేమచంద్‌ల ప్రశంసా పత్రాలు లభించాయి.

రాష్ట్రవ్యాపిత హిందీ
నాటకరంగం :

అ తరువాత నూతనోత్సాహంతో అనేక జిల్లా, పట్టణ, తాలూకా హిందీ ప్రేమీమండలుల తరపున నాట్యసంఘాలు ఏర్పడ్డాయి. వేమూరి అంజనేయశర్త గారి ఆధ్వర్యంలో ఏక్‌హి కబీమే, ప్రాయశ్చిత్, ఏక్ ఘూంట్ నాటికలు చక్కగా ప్రదర్శించబడ్డాయి.

ఏలూరు హిందీనాటకాలు :

ఏలూరులో శీర్ల బ్రహ్మయ్యగారి నాయకత్వంలో ఒక నాట్యమండలి ఏర్పడి, చంద్రగుప్త, షాజహాన్ నాటకాలను ప్రజారంజకంగా ప్రదర్శించింది. శ్రీ మున్షీ సయ్యద్ అబ్దుల్‌గనీ, తూము వెంకటేశ్వరరావు, పచ్చిగొళ్ళ ఆదిరామారావు, ప్రకాశరావుగార్లు, ఈ నాటకాల్లో ప్రముఖపాత్రలు నిర్వహించేవారు. శీర్ల బ్రహ్మయ్యగారి షాజహాన్ పాత్రాభినయం అద్వితీయంగా వుండేది. భీమవరం ప్రేమీమండలి పూజారిణి (శరత్ రచన) నాటకంగా రచించి సుమారు పది

కేంద్రాల్లో ప్రదర్శించింది. ఇదేవిధంగా కృష్ణాజిల్లా హిందీ నాట్యమండలి మేవాడ పతన్, రాజముకుట్, మహాత్మా ఈసా (ఏసు) నాటకాలు ప్రదర్శించి ప్రజల మన్ననలు పొందింది. కీ॥ శే॥ గుత్తా నరసింహం, గుత్తా సుబ్బారావు, పి. హనుమంతరావు, పొట్లూరు నాగభూషణం, యస్. యల్. పెరుమాళ్ళు, యలమంచిలి లక్ష్మయ్య, చదువుమిల్ల కృష్ణయ్య, మూర్తి, వల్లభ్, అప్పనరావు, కొల్లి పర రామచంద్రయ్యగార్లు విశేషంగా కృషిచేసి నాటకాలు రక్తి కట్టించేవారు.

ఆంధ్రరాష్ట్ర హిందీ నాట్యమండలి విజయవాడవారి హిందీ నాటక ప్రదర్శనాలు విశేషమైన ప్రజాదరణను పొందాయి. దేవదాసు నాటకం కథావస్తువుతో పాటు ప్రదర్శనరీత్యా ఒక కళాఖండంగా వుండేది.

హిందీ నాటకాల్లో
ఆంధ్రుల పాత్ర:

వేమూరు ఆంజనేయశర్మ, వున్నవ రాజగోపాల కృష్ణయ్య, చిట్టూరి లక్ష్మీనారాయణశర్మ, వేమూరు రాధాకృష్ణమూర్తి, అట్లూరి రామారావు, యలమంచిలి లక్ష్మయ్య, ఆర్. రామచంద్ర, మిక్కిలినేని సుబ్బారావు, గుత్తా నరసింహం మొదలైనవారు దేవదాసు నాటకంలో ముఖ్య భూమికలు ధరించారు. దేవదాసు నాటకం సుమారు 20 కేంద్రాల్లో ప్రదర్శింపబడింది.



ఈ విధంగా అటు శ్రీకాకుళం మొదలుకొని ఇటు గూడూరు వరకు, బందరు మొదలుకొని చిత్తూరు వరకు అనేకచోట్ల హిందీ నాటక సంఘాలు ఏర్పడ్డాయి. నాటకాలు, నాటికలు, చిత్ర విచిత్ర వేషాలు ప్రదర్శింపబడ్డాయి. హైదరాబాదులో దక్షిణ భారత హిందీప్రచారసభ తరపున నాట్యకళాసంఘం హిందీ నాటక, నాటికల పోటీలను జరిపింది. ఈ విష

యంలో వేమూరు ఆంజనేయశర్మగారు విశేషమైన కృషి చేశారు. నాట్యకళా సంఘం తరపున తెలుగులో ఆత్రేయ గుమాస్తా నాటకానికి హిందీ అనువాదమైన 'బాబూ' నాటకాన్ని రజత జయంతి సభల సందర్భంలో ప్రదర్శించారు.

ఔత్తరాహుల ప్రశంసలు:

పరాయిభాషలో నాటకాలు ప్రదర్శించి మెప్పించడం చాలాకష్టం. ముఖ్యంగా భాషా, ఉచ్చారణ స్వచ్ఛంగానూ, భావప్రకటన ఉదాత్తంగానూ వుండాలి. ఇందుకు ఎంతో కృషి, సాధన, అవసరం, చంద్రగుప్త, షాజహాన్, దేవదాసు, పూజారిణి, మేవాడపతన్ నాటకప్రదర్శనాలు చూసి హిందీలో దిగ్దంతులైన పండితులు, రచయితలు, ప్రేమచంద్, కాకాకిలేల్కర్, రాహూనందశర్మ, ప్రజనందనశర్మ, అవధనందన్, రఘువీరదయాళుమిత్ర మొదలైనవారు హృదయపూర్వకంగా అభినందించారు. కొందరు తన్మయులై యోగ్యతాపత్రాల నిచ్చారు, ఈ నాటక ప్రదర్శనాల్లో పాల్గొన్న ప్రముఖ నటులందరు ఎన్నో కష్టనష్టాలకోర్చి భాషాభిమానంకొద్దీ నిస్వార్థంగా సేవజేసినవారే. ఇది ఆ నాటికి, ఈ నాటికి, ఏనాటికి కూడా జాతీయాభిమానం నేర్పే గుణపాఠం.

హిందీ నాటక ప్రదర్శనాలద్వారా ప్రజల్లో హిందీభాష యెడల ఆసక్తి అభిరుచి కలిగించడం సులభంగా వుండేది ఆ రోజుల్లో. హిందీలో సంస్కృత శబ్దాలు అధికంగా వుండడంవల్ల తెలుగువారికి దృశ్యకావ్యంలో స్వచ్ఛమైన హిందీ వుచ్చారణ, సంభాషణల అభినయంద్వారా తేలిగ్గా అర్థమౌతాయి. ఈ విధంగా నాటక ప్రదర్శనాల్లో హిందీ భాషా మాధుర్యాన్ని స్వయంగా చూసిన ఆంధ్రులు, తమంతట తామే హిందీ నేర్చుకోవడానికి, తమ బిడ్డలకు నేర్పించడానికి ముందుకు వచ్చారు. అంతేకాక నాటక ప్రదర్శనాల ద్వారా అనేక పట్టణాల్లో పల్లెల్లో దాతలు ఆంధ్ర రాష్ట్ర హిందీ ప్రచార సంఘానికి విరాళాలు వసూలుచేసి ఇచ్చారు. ఈ విధంగా విరాళాలతో నిర్మింపబడిందే విజయవాడలోని నాగేశ్వరరాయ భవనం.

తెలుగు నుంచి హిందీలోకి:

హిందీకంటే తెలుగు నాటకరంగం బాగా అభివృద్ధి చెందింది. అందువల్ల తెలుగులో ప్రసిద్ధిజెందిన ఆచార్య ఆత్రేయ నాటకాలు ఈనాడు, యన్. జి. ఓ హిందీలోకి అనువదించి ఉత్తమంగా ప్రదర్శించడమే కాకుండా వాటిని హిందీ

వారికి అందించి సాహిత్య సేవకూడా చేసిన ఆంధ్రరాష్ట్ర హిందీ నాట్యమండలి పేర్కొన్నతగినది. ఈనాడు నాటకాన్ని వేమూరు ఆంజనేయశర్మ. యన్. జి. ఓ. నాటకాన్ని ముగసీ అమరోహి హిందీలోకి అనువదించారు.

ఈ హిందీ నాటక ప్రదర్శనాలను చూసిన తెలుగు రచయితలు. స్వయంగా హిందీలో నాటకాలు వ్రాసి గొప్ప కృషిచేశారు. చోడవరపు రామశేషయ్యగారు మంత్రి రామయ్య. రాణి మల్లమ్మ. గృహిణి. బొబ్బిలి అనే నాటకాలను వ్రాశారు. అరిగెపూడి రమేష్ చౌదరి ఉత్తమ నవలలతోపాటు ఎన్నో ఏకాంకికలు హిందీలో వ్రాసి ఐహుమతులు పొందారు. ఈ విధంగా తెలుగు రచయిత లెందరో స్వయంగా హిందీలో వ్రాయడమో లేక తమ రచనను హిందీలోకి అనువదింపచేయడమో జరిగింది. దీనికి హిందీ నాటక ప్రదర్శనాలు ఒక ప్రేరణగా పనిచేశాయనడంలో అతిశయోక్తిలేదు.

# రేడియో నాటకాలు

ఆంధ్ర నాటకరంగంలో రేడియో నాటకాలు కూడ ప్రాముఖ్యమైన పాత్రనే నిర్వహిస్తున్నాయి. నాటక ప్రదర్శనాలకు రేడియో నాటకాలకు చాల వ్యత్యాస ముంది. నాటక ప్రదర్శనానికి తెర వుంటుంది. రేడియో ప్రదర్శనానికి తెర అవసరం లేదు. ఒకటి దృశ్యమైతే, రెండవది శ్రవ్యం.

నాటక ప్రదర్శనంలో సమక్షానే ప్రేక్షకులుంటారు. రేడియోకి అలాంటి అవకాశంలేదు. నాటక ప్రదర్శనానికి రంగస్థలం కావాలి. రేడియో ప్రదర్శనానికి ఒక్క రేడియో సెట్ వుంటేచాలు. ఇలాగే చిత్రకళ, శిల్పకళ, రంగాలంకరణ, వేషధారణ మొదలైనవేవీ రేడియో నాటకానికి అవసరంలేదు. ఒక నాటక ప్రదర్శనాన్ని ఒకే దళం దేశవ్యాపితంగా ప్రదర్శించాలంటే ఎంతోకాలం పడుతుంది. కాని రేడియో ద్వారా ఒక నాటకాన్నిగాని. ఒక పాటనుగాని ప్రసారం చేస్తే మన దేశంలోగాని విదేశాల్లోగాని రేడియో సెట్టు వున్న ప్రతివ్యక్తి వాటిని విని సంతృప్తి పడగలడు. అంటే రేడియోద్వారా ఎంతటి ప్రబోధాన్నైనా కొన్ని క్షణాలో వేలాది శ్రోతలకు వినిపించవచ్చు.

దృశ్యానికి. శ్రవ్యానికి వున్న తారతమ్యాన్ని పైనే చర్చించాం. ప్రేక్షకుల సాన్నిధ్యంలో నాటకం ప్రదర్శించి వారిని మెప్పించటం ఎంతకష్టమో మనకు

తెలుసు. కాని ప్రేక్షకులు లేకుండా కేవలం రేడియో లౌడ్ స్పీకరుద్వారా ప్రత్యక్షంగా నాటకాన్ని చూచినంత రసానుభూతిని రేడియో ప్రదర్శనంద్వారా పొందాలి.

నాటక ప్రదర్శనంలో వేషధారణా ఆంగికచలనాదులూ, రంగాలంకరణ, ప్రత్యక్షంగా ప్రేక్షకులూ మొదలైన హంగు లుండడంవల్ల చూచేవారికి ఇందులో ఏదో ఒకటి సంతృప్తి నిస్తుంది. కాని రేడియోలో మాత్రం, సంభాషణల పటుత్వం వెలితిలేనివేగం, విషయస్పష్టత, హృదయరంజకంగా అన్ని రసాలను, వాచికం ద్వారానూ, గొంతుమార్పులద్వారానూ, మాధుర్యం ద్వారాను మెప్పించాల్సి వుంటుంది.

సినిమాకు, రేడియోకు లేని ప్రేక్షకులతో సంబంధం ఒక్క స్టేజి డ్రామాకు మాత్రమే వుంది. రేడియో నాటికల ద్వారా ప్రజలను మెప్పించాలంటే అనేక రసాను స్పన్నంచేసే మృదుమధురమైన సంగీతవాయిద్యాలనూ (స్పెషల్ సౌండ్ ఎఫెక్ట్సునూ) ఇచ్చి శ్రోతకులను మెప్పించవచ్చు. కాని, నటీనటులకు రేడియో నాటకం రక్తి కట్టించడమే కష్టం. అంతేగాక రేడియోకి అందరూ నటులుగా పనికి వస్తారనికూడ చెప్పలేం. కొన్ని గొంతులు మైక్‌కు అద్భుతంగా సరిపోతాయి.

ఈనాడు రేడియో నాటక ప్రదర్శనాలు అంత రసవంతంగా జరగడంలేదు. ఒక స్టేజి నాటకాన్ని ప్రదర్శించాలంటే ఎంతోకాలం తీసుకుంటుంది. కాని రేడియో నాటకాలు ఒకటి రెండు రిహార్సల్సుతో ప్రసారం చేస్తున్నారు. రేడియో నాటకాల రిహార్సల్సు సరిగా జరుగవు. ఒకరువస్తే మరొకరు రారు. నటీ నటులమధ్య సన్నిహిత తత్వంకూడ శూన్యమే. రేడియోవారు ఎవరికి కంట్రాక్టులు పంపిస్తే వారే వస్తారు. వచ్చిన నటులకు కనీస పరిచయాలుకూడా కొంతమందికి వుండవు. ఎవరి సంభాషణలను వారు చూచే చదువుతారు. ఎదుటి పాత్రను చూచి చదివినంత స్వాభావికత ఇలా కాగితాలు చూచి చదవడంలో రాదు. సంభాషణలు క్షుణ్ణంగా కంఠస్థం చేసినప్పుడే సరళంగా వుంటాయి. ఇలా చూచి చదవడంవల్ల సరియైన హావభావాలు, సరళ సంభాషణ వుండదు.

రేడియో నాటకాలు వినగలమే కాని ఏ పరిస్థితుల్లోనూ చూడలేం. కాని రేడియో ద్వారా, తక్కువ ఖర్చుతో అఖిల ప్రపంచానికి ఎలాంటి సందేశాన్నిగాని, పాటలద్వారా ప్రబోధంకాని సులభంగా చేయగలం. ఏ పత్రికా, ఏ వుపన్యాసకుడూ, మరే కళారూపమూ జేయలేనంతటి గొప్ప ప్రచారసాధనం రేడియో.

---

# 16

# ప్రసిద్ధ నాటక రచయితలు



కోరాడ, వావిలాల, వేదం, తిరుపతి వెంకట కవులు, శ్రీపాద, కందుకూరి, పాముగంటి, గురజాడ, బలిజేపల్లి, రాజ మన్నారు, నార్ల, సుంకర, వాసిరెడ్డి, ఆత్రేయ, గోపాలరాయశర్మ, పింగళి, కొప్పరపు, ముత్తరాజు మొదలైనవారు

# ప్రసిద్ధ నాటక రచయితలు

## కోరాడ రామచంద్రశాస్త్రి :



శ్రీకోరాడ రామచంద్రశాస్త్రి అమలాపురంతటా తాలూకాకేశనకుర్రులో మాతామహులఇంట కీ॥ శ॥ 1816 లో జన్మించారు. బాల్యమంతా అక్కడనే గడిపారు. బందరు నోబుల్ పాఠశాలలోనూ, నోబుల్ కళాశాలలోనూ దాదాపు 43 సంవత్సరాలు తెలుగు పండితులుగా పనిచేసి 1900 సంవత్సరంలో మరణించారు. శాస్త్రిగారు 31 గ్రంథాలు రచించారు. వీటిలో సంస్కృత గ్రంథాలు 22, తెనిగించినవి 7, స్వతంత్ర తెలుగు రచనలు 2. వీటిలో గీర్వాణరూపకాలు 4. అవి శృంగార సుధార్ణవం (భాణం), కమనానందం (భాణం), రామచంద్రవిజయం (వ్యాయోగం), త్రిపురాసుర విజయం. ఉన్మత్తరాఘవం - ముద్రారాక్షసం. శాకుంతలం వేణీసంహారం - ఉత్తరరామచరిత్ర మొదలైన 5 నాటకాలను తెనిగించారు.

ఆయన స్వతంత్రించి మంజరీ మధుకరీయము అనే నాలుగు అంకాల తెలుగు నాటకాన్ని కీ॥ శ॥ 1860 లో రచించారు. ప్రథమ ముద్రణ 1908 లో జరిగింది. ఈ నాటక ఇతివృత్తం కల్పిత కథ. సంస్కృతరూపకాలను తెలుగులోవ్రాయడంగాని, యథాతథంగా అనువదించడం గాని శాస్త్రిగారికంటే పూర్వులెవ్వరూ ప్రయత్నించలేదు. ఆంధ్ర నాటకరంగాల్లో సాహసించి తెలుగు నాటకానికి తొలిపూజ చేసినవారు శాస్త్రిగారే.

## వావిలాల వాసుదేవశాస్త్రి :

1851 జూన్ 1 వ తేదీన, గుంటూరుజిల్లా రేపల్లెతాలూకా, కారుమూరు గ్రామంలో జన్మించారు. చిన్నతనంలోనే సంస్కృతాంధ్ర భాషల్ని ఆకళింపు చేసుకున్నారు. నోబుల్ కళాశాలలో చేరి, కోరాడ రామచంద్ర శాస్త్రిగారి వద్ద నాటకాలంకారశాస్త్రాన్ని అభ్యసించారు. శాస్త్రిగారు నాలుగు నాటకాలను రచించారు.



వీటిలో 3 అనువాద నాటకాలు. ఒకటిమాత్రం స్వతంత్ర రచన. ప్రథమంగా అనువదించిన ఆంగ్లనాటకం జూలియస్ సీజర్ 1876 లో ముద్రణ పొందింది. తరువాత 1881 లో భవభూతి ఉత్తరరామ చరిత్ర, 1892 లో శూద్రకుని మృచ్ఛకటికను అనువదించారు. సంస్కృత నాటకాన్ని అనువదించిన వారిలో ప్రథములు కూడ శాస్త్రిగారే.

1880 లో తెలుగులో నందకరాజ్యం అనే నాటకాన్ని స్వతంత్రంగా రచించారు. ఈ నాటకంలో అధికారుల దౌర్జన్యాలను గురించీ, స్త్రీల అవస్థలను గురించీ వర్ణించారు. ఈ నాటకం ఎవరూ ప్రదర్శించలేదు. అంటే ఆనాటికి ప్రదర్శించే నాటకసమాజాలే ఉద్భవించలేదన్నమాట. ఇది పూర్తిగా పద్య నాటకం. శాస్త్రిగారి ఇతర రచనలు - బ్రాహ్మణీయం, పితరారాధన, ముముక్ష తారకం, రుక్మిణీ స్మరణము, మాత్రారాధన, రఘువంశం మొదలైనవి జీవిత మంతా సాహిత్యసేవకే అంకితం చేసిన శాస్త్రిగారు 1897 జూన్ 13 వ తేదీన అస్తమించారు.

కొండుభొట్ల సుబ్రహ్మణ్యకవి :

ప్రథమ నాటక రచయితలలో ముఖ్యులైనవారిలో కొండుభొట్ల సుబ్రహ్మణ్యకవి ఒకరు. గుంటూరుకు చెందిన ఈ రచయిత 32 నాటకాలను రచించారు. కాని ముద్రించబడిన నాటకాలు 13 కన్నా ఎక్కువ లేవని ప్రతీతి. వీరి నాటకాల్లో దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులుగారు స్త్రీ పాత్రలను ఎక్కువగా ధరిస్తూ వుండేవారు. సుబ్రహ్మణ్యకవి నాటకాల్లో గణనకెక్కినవి ద్రౌపదీ వస్త్రాపహరణం, కీచకవధ, గయోపాఖ్యానం, హరిశ్చంద్రోపాఖ్యానం మొదలైనవి.

కొక్కొండ వేంకటరత్నం :

కొక్కొండ వేంకటరత్నంగారు 1842 లో వినుకొండలో జన్మించారు. తరువాత చెన్నపట్నంలోనూ, రాజమహేంద్రవరంలోనూ నివసించారు. 1881 లో

నరకాసుర వ్యాయోగమనే నాటకాన్ని సంస్కృతం నుంచి అనువాదం చేశారు. ఆంధ్రభాషా సంజీవని అనే తెలుగు పత్రికను నడిపారు తమిళ, సంస్కృత భాషలు తెలిసినవారు వీరికి కవిబ్రహ్మ అనే పేరుండేది. వాక్చాతుర్యం ఎంతవారు. పూర్వాచార పరాయణులు. సరసమైన హాస్య రచయిత. అనర్ఘళంగా ఉపన్యాసాలీయగల ప్రతిభాశాలి. శుద్ధగ్రాంధికవాది, వ్యావహారిక భాషకూ, సంఘ సంస్కరణకూ వ్యతిరేకి. ఇంటిలోనూ, వీధిలోనూ కూడ గ్రాంధికభాషనే వాడేవారు. ఈ విషయంలో అనాడు వ్యావహారిక భాషావాదులతో నిరంతరం తగాదా పడుతూ వుండేవారు. 1915 వ సంవత్సరంలో చనిపోయారు. ప్రప్రథమంగా తెలుగులో ముద్రణపొందిన నాటకం వీరి నరకాసుర వ్యాయోగమే.

### యూరేపల్లి రామచంద్రశాస్త్రి :

కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా కనుమల్లిలో 1874 లో జన్మించారు. కాకినాడ, విశాఖపట్టణాల్లో విద్యాభ్యాసం చేశారు. 1898 లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించి తెలుగు పండితులుగా పనిచేశారు. గ్రంథాలయ ఉద్యమంలోనూ, అస్పృశ్యతా నివారణోద్యమంలోను, సహాయ నిరాకరణోద్యమంలోనూ పనిచేశారు. 1930 లో ఉప్పు సత్యాగ్రహంలో 6 మాసాలు జైలుకు వెళ్ళారు.

వీరు నాటక ప్రదర్శనాలద్వారా ప్రజల విజ్ఞానాభివృద్ధికొరకు 1895 లో విశాఖపట్టణంలో కళాభిలాషక సమాజాన్ని స్థాపించారు. తమ సమాజ సభ్యులు రచించిన నాటకాలనే ప్రదర్శించేవారు. నాటకాలలో ముఖ్యపాత్రలు ధరించేవారు. వీరు కత్తిసాములో ప్రజ్ఞావంతులు. రంగస్థలంలో నిషిద్ధాలైన శయ్యాగారం, దూరప్రయాణం, యుద్ధం మొదలైనవాటిని స్వతంత్రించి ప్రదర్శించేవారు.

వేశ్యల పడుపు వృత్తి మాన్పించాలని 1912 లో సంగీతపూనినీ సమాజం స్థాపించి, వారికి సంగీతశిక్షణ నిచ్చారు. వీరు వుత్తమనటులే గాక నాట్యాచార్యులు. నాటకకర్తగా అనేక నాటకాలను - హరికథలను - చాటువులను - పద్యకావ్యాలను-అనేక వచన గ్రంథాలనూ రచించారు. 1951 వ సంవత్సరంలో పరమపదించారు.

### వేదం వేంకటరాయశాస్త్రి :

ఆంధ్ర నాటకరంగానికి శిరోభూషణమూ, ఆంధ్ర భాషాభిమాని సమాజానికి

హృదయంలాంటివారూ శ్రీ వేదం వేంకటరాయశాస్త్రిగారు. జననం 1853 లో.



శాస్త్రిగారు దాదాపు 30 సంవత్సరాలు నాటక కళాసేవ చేశారు. స్వంత సమాజంకొరకు నాటకాలను వ్రాసి స్వయంగా దర్శకత్వం వహించారు. వీరి నాటకాలు ప్రతాపరుద్రీయం, బొబ్బిలియుద్ధ నాటకం, ఉషానాటకం, ఆంధ్రాభిజ్ఞాన శాకుంతలం, మాళవికాగ్నిమిత్రం, విక్రమోర్వశీయం, శ్రీకృష్ణరాయ విజయ నాటకం, ప్రియదర్శిక, ఉత్తరరామచరిత్రం, రత్నావళి, ప్రతిమా నాటకం మొదలైనవి. వీరి ప్రతాపరుద్రీయం ఆంధ్రప్రజల మన్ననలందుకుంది. ప్రతాపరుద్రీయంలో పాత్రోచిత భాషను ప్రవేశపెట్టారు. శాస్త్రిగారు మహామహోపాధ్యాయులు. ఆయన అనేక గ్రంథాలను రచించారు. నెల్లూరుజిల్లా నాటకరంగానికి, నెల్లూరు ఆంధ్ర భాషాభిమాని సమాజానికి ఎనలేని సేవచేసి ఘటికులైన నటకుల్ని తయారుచేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ బిరుదును ప్రసాదించింది. 76 సంవత్సరాలు జీవించి 1929 లో కీర్తిశేషులయ్యారు.

తిరుపతి వేంకటేశ్వరకవులు :

వేంకటశాస్త్రిగారు, తిరుపతి శాస్త్రిగారు జంటకవులుగా, పండితులుగా వర్ధిల్లారు. వేంకటశాస్త్రిగారి జననం 1870—తిరుపతి శాస్త్రిగారి జననం 1871. ఇరువురూ కవితాధార కలవారు. వీరు రచించిన నాటకాలు పాండవోద్యోగం, పాండవవిజయం, పాండవ అశ్వమేధం, పాండవ ప్రవాసం, పాండవ జననం, పాండవ రాజసూయం, మృచ్ఛకటికం, ముద్రారాక్షసం, బాలరామాయణం, ప్రభావతి ప్రద్యుమ్నం, పండితరాజం, సుకన్య మొదలైనవి. ఈ నాటకాలన్నిటిలోనూ శిఖరాగ్రాన్నందుకున్న నాటకాలు పాండవోద్యోగం, పాండవవిజయం. ఈ రెండూ ఆంధ్ర ప్రజల హృదయాలను చూరగొన్నాయి. ఈ ఇరువురు కవులూ అందరిచేతా పారితోషికాల నందుకొన్నారు. ఆశువుగా కవిత్వం చెప్పారు. ఏనుగులమీద వూరేగారు. ఆంధ్రదేశ కవితా సామ్రాజ్యాన్ని ఏలుకున్నారు. వేంకటకవిగారికి కళాప్రపూర్ణ బిరుదునిచ్చి ఆంధ్ర విశ్వవిద్యాలయం

గౌరవించింది. ఆంధ్రదేశం షష్టిపూర్తి జరిపింది. 18-1-1948 వ తేదీన ఆంధ్ర నాటక కళాపరిషత్తు విజయవాడ మహాసభలలో వేంకటశాస్త్రిగారికి మహా వైభవంగా పాదపూజ జరిపింది.

### శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి :

కీ॥శే॥ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు ఎర్నగూడెంవద్ద నున్న దేవరపల్లిలో 1866 లో జన్మించారు. అవసానదశవరకూ రాజమండ్రిలోనే స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. వీరు ఎన్నో కావ్యాలను వ్రాశారు. చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారు ఈయన శిష్యులు. మహాభారతాన్ని యావత్తు ఒక్కరే రచించారు. వాల్మీకి రామాయణాన్ని తెలుగులో రచించారు. అనేక ప్రహసనాలనూ, నాటకాలనూ రచించారు. శతాధిక గ్రంథకర్తలు. ఆంధ్రప్రభుత్వ ఆస్థానకవులు. ఆంధ్ర విశ్వవిద్యాలయంవారిచేత కళాప్రపూర్ణ బిరుదు నందుకున్నారు. ఆంధ్ర ప్రభుత్వం మహామహోపాధ్యాయ బిరుదునిచ్చి సత్కరించింది. వీరు రచించిన నాటకాలు బొబ్బిలియుద్ధం, వీరసేనవిజయం, యాజ్ఞవల్క్య నాటకం. వీరి నాటకాల్లో ఉత్తమ నాటకం బొబ్బిలియుద్ధం. ఆంధ్రదేశమంతటా ప్రదర్శింపబడి వేనోళ్ళ పొగడబడింది. ఈనాటికీ ప్రదర్శింపబడుతూ వుంది.

### వడ్డాది సుబ్బరాయకవి :

కవులకూ, కళలకూ, పండితులకూ, సంఘ సంస్కర్తలకూ పుట్టినిల్లయిన రాజమహేంద్రవరమే వడ్డాది సుబ్బరాయకవిగారిది కూడాను. రాజమండ్రి కళాశాలలో ఎన్నో సంవత్సరాలు సంస్కృతాంధ్ర పండితులుగా వున్నారు. వేణీ సంహారం, మేఘసందేశం, అభిజ్ఞానశాకుంతలం, విక్రమోర్వశీయం, ప్రబోధ చంద్రోయం, సూర్యశతకం, భామినీవిలాసం మొదలైన సంస్కృత గ్రంథాలను సరసంగా అనువదించారు. ఇవిగాక మల్లికామారుతం, చండకౌశిక నాటకం, ప్రబోధ చంద్రోదయం, వేణీసంహారం మొదలైన నాటకాలను రచించారు. వేణీ సంహార నాటకం ఈయన రచనలలోకెల్లా వుత్తమమైంది. భట్టనారాయణుని వేణీ సంహారాన్ని అనుకరించినా అనుసరణ చక్కగా చేయబడింది. సుబ్బరాయకవి కవిగానే గాక నటుడుగా కూడ పేరుపొందారు. వీరు రచించిన గ్రంథాలు ఇరువదికి పైగా వున్నా, కీర్తిప్రతిష్టలు చేకూర్చిపెట్టినవి వేణీసంహారం, భక్త చింతామణీ మాత్రమే.

## కందుకూరి వీరేశలింగం:

సంఘసంస్కర్తగా యుగపురుషుడుగా వర్థిల్లిన కందుకూరు వీరేశలింగం పంతులుగారి సాహిత్యసేవ ఎన్నదగినది. ఆయన శతాధిక గ్రంథకర్త. సంఘ సంస్కర్తగా ఆయన చేసిన సేవ ఎటువంటిదో ఆంధ్ర ప్రజానీకానికి తెలిసిన విషయమే. నాటకకర్తగా ఆయన కొన్ని నాటకాలను రచించారు. వాటిలో ముఖ్య మైనవి అభిజ్ఞానశాకుంతలం - రత్నావళి - మాళవికాగ్నిమిత్రం - కళ్యాణ కల్ప వల్లి-ప్రహ్లాద నాటకం - భక్త చొకామీళ - హరిశ్చంద్ర మొదలైనవి అయి నప్పటికీ అన్నింటిలోకీ ముఖ్యమైనవీ. ప్రజామన్ననలు పొందినవీ - అభిజ్ఞానశాకుంతలం - హరిశ్చంద్ర. బలిజేపల్లివారి హరిశ్చంద్ర వచ్చిన తరువాత వీరి హరిశ్చంద్రను ప్రదర్శించటం తగ్గిపోయింది. శకుంతలనాటకం మాత్రం వీరిదే ఎక్కువగా ప్రదర్శింపబడింది. కాళిదాసు శాకుంతలాన్ని తెలుగులోకి పంతులుగారు ప్రజారంజకంగా అనువదించారు. ఆంధ్ర సాహిత్యానికి బహు ముఖాల సేవజేసిన వీరేశలింగం పంతులుగారు ఆంధ్రనాటక వాఙ్మయానికి కూడ అభిజ్ఞాన శాకుంతలం లాంటి వుత్తమనాటకాన్ని అందించి ధన్యులయ్యారు.

## పానుగంటి లక్ష్మీనరసింహారావు:

జననం 1865 సంవత్సరం. ఆంధ్రనాటక రచయితలలో ముఖ్యులు. హాస్య రసాన్ని పోషించటంలో మేటి. పలుభాషల్లో ప్రజ్ఞానిధి. పిఠాపురసంస్థాన ఆస్థాన కవిగా వుండి. రాధాకృష్ణ - సారంగధర - సరోజని - నర్మదాపురుకుత్సీయం - విప్రనారాయణ - కళ్యాణరాఘవం - పట్టభంగరాఘవం. వనవాసరాఘవం-విజయ రాఘవం - ప్రచండచాణక్యం - చూడామణి - కంఠాభరణం - రాతిస్తంభం - కోకిల-సరస్వతి-వృద్ధవివాహం మొదలైనవి వ్రాశారు. వీరి నాటకాల్లో రాధాకృష్ణ నాటకం మంచినాటకంగా పేరుపొందింది. రెండవది కంఠాభరణంగా పేర్కొన్నారు. కంఠాభరణం - హాస్యవల్లరి - వృద్ధవివాహం - ఈ మూడు నాటకాలూ ప్రహస నాలుగా ప్రకటించారు. ఉపన్యాసాల ధోరణిలో సాక్షిగ్రంథాలను భాగాలుగా ప్రక టించారు. సంఘటనల్ని సృష్టించడంలోనూ, సంభాషణలను నడిపించడంలోనూ, కథాగమనాన్ని సాగించడంలోనూ సహజమైన పద్ధతిని అవలంబించి నాటకరంగా నికి సేవచేశారు.

### బలిజేపల్లి లక్ష్మీకాంతకవి :

జననం 1881 వ సంవత్సరం. కవిగా, నటుడుగా, సమాజసంస్థాపకుడుగా సినిమా రచయితగా అశేషమైన కీర్తి ఆర్జించారు. వీరి నాటకాల్లో బుద్ధిమతీ విలాసం - సౌత్రాజితీయం - హరిశ్చంద్ర ముఖ్యమైనవి. వీటిలో హరిశ్చంద్ర ఆంధ్రదేశం ఆ అంచునుండి ఈ అంచువరకూ అందరూ ప్రదర్శించారు. ప్రజలు ఆదరించారు. పుస్తకాలను కొని చదువుకున్నారు. దాపాపు లక్ష ప్రతులు ఆమ్ముడుపోయాయి. హరిశ్చంద్ర పాత్రకు జీవం పోసినవారు బందరు డి. వి. సుబ్బారావుగారు. గుంటూరు హిందూ నాటక సమాజంలో ప్రథమంగా బాల వేషాలు వేశారు. ఆయన సచిత్రపాత్ర వేనోళ్ళ పొగబడింది. వారి హరిశ్చంద్ర తెలుగు నాటకరంగంలో ఒక మైలురాయి. 1930 లో రంగూన్‌లో కృతాకృతాధి బిరుదు ప్రసాదించబడింది. తరువాత చలనచిత్రరంగంలో ప్రవేశించి, అనేక చిత్రాలకు మాటలు పాటలు వ్రాశారు. కొన్ని చిత్రాలలో పాత్రలు ధరించి మెప్పించారు. 1942 సంవత్సరంలో చలనచిత్రసీమలో పుంభావసరస్వతి అనే బిరుదును పొందారు. కాకహస్తిలో 1953 లో స్వర్గస్థులైనారు.

### చిలకమర్తి లక్ష్మీనరసింహం :

జననం 1867. అనేక గ్రంథాలను రచించి, ఆంధ్రభాషామతల్లికి ఇతోధిక సేవచేసినా, ఇక్కడ మనం వారిని నాటక రచయితగా పరిశీలించడమే మంచిది.



వీరు రచించిన నాటకాలు గయోపాఖ్యానం, ప్రసన్నయాదవం, పారిజాతాపహరణం, చతుర చంద్రహాసం, తిలోత్తమ, ప్రచండయాదవం మొదలైనవి.

వీరి నాటకాలన్నిటిలోకీ గయోపాఖ్యానం బహుళ ప్రచారంపొందింది. పేరుపడిన ఆంధ్ర నాటక సమాజాలన్నీ ఈ నాటకాన్ని ప్రదర్శించాయి. లక్షన్నరకాపీలు గయోపాఖ్యానం అమ్ముడు పోయిందంటే, అది ఎటువంటి ప్రజాదరణను పొందిందో మనం అర్థం చేసుకో

వచ్చు. చమత్కారమైన కథావస్తువు. సులభమైన శైలి. ప్రసంగాలూ, పద్యాలూ అందరికీ అర్థమయ్యేలా వుంటాయి. కృష్ణార్జునుల సంవాదానికి చెందిన పద్యాలన్నీ ఇట్టే ప్రేక్షకులను పట్టేస్తాయి. అన్ని రంగాలలోనూ అమూల్య సేవచేసిన పంతులుగారు 1946 వ సంవత్సరంలో మనల్ని వదలి వెళ్ళిపోయారు.

ముత్తరాజు సుబ్బారావు :

ముత్తరాజు సుబ్బారావుగారు కృష్ణతులాభారం, భక్త మార్కండేయ, కచ దేవయాని, రణతిక్కన మొదలైన నాటకాలను రచియించారు. వీరు యం. ఏ. పట్టభద్రులు. వీరి నాటకాలు నాలుగైదు అముద్రితంగానే వుండిపోయాయి. వీరి నాటకాలలో బహుళప్రచారం పొందిన నాటకం శ్రీకృష్ణ తులాభారం. ఆనాటి నుంచి, ఈనాటివరకూ ప్రదర్శింపబడుతూనే వుంది. ఈ కథను మూడుసార్లు చలన చిత్రంగా చిత్రీకరించారు. కృష్ణతులాభారం నాటకాన్ని తెనాలి రామవిలాస సభవారు విశేషంగా ప్రదర్శించారు. స్థానం సత్యభామగా ప్రసిద్ధిపొందింది ఈ నాటకంలోనే. తరువాత సూరిబాబు, మాష్టర్ కళ్యాణి, యస్. పి. లక్ష్మణస్వామి, నాగలింగం, రామలింగం, కె. రఘురామయ్య మొదలైనవారు ఎన్నో ప్రదర్శనలిచ్చారు. వీరి అముద్రిత నాటకం రాజ్యశ్రీ మార్గాభ్యుదయం. చిత్రకళాభివర్ధనీ సంఘంద్వారా ఆంధ్రదేశంలో చెదురు మదురుగా ప్రదర్శించారు. ఆయన కీర్తిశేషులైనా వారి కృష్ణతులాభారం నాటకం సజీవంగానే వుంది.

కొప్పరపు సుబ్బారావు :

జననం 29-4-1896. నాటకరంగానికి సంబంధించిన రచన, సంగీతం, రంగాలంకరణ, నటన, ఆహార్యం, రంగప్రదీపనం మొదలైన శాఖల్లో సిద్ధ హస్తులు. తారాశశాంకం, రోషనార, నూర్జహాన్, వసంతసేన, ఇనపతెరలు మొదలైన నాటకాలనూ, నేటి నటుడు, చేసినపాపం, ఆల్లీముతా మొదలైన నాటికలనూ వ్రాశారు.

ఆయన ఆంధ్రదేశంలో పెద్ద హార్మోనిస్టు. మరాఠీ, హిందూస్తాన్ సంగీతంతో పరిచయమున్నవారు. నాటక కళను గురించి అనేక వ్యాసాలను వ్రాశారు. తెనుగు లిటిల్ థియేటర్‌ను స్థాపించి, దానిపేర 2500 గ్రంథాలను సేకరించారు. ఆయన అనేక రేడియో నాటికలను వ్రాశారు. జీవితాంతంవరకూ ఉత్తమ నాటక

సమాజాలకొరకు ఉత్తమ రంగస్థలంకొరకు అహర్నిశలు పనిచేశారు. నాటక రంగం కొరకు విశేష మెరుగని కళాసేవకుడుగా పిఠాపురంలో రంగస్థలంపైనే ప్రాణాల్ని కోల్పోయారు.

పద్మశ్రీ వి. వి. యల్. నరసింహారావు :

కవి, సంస్కర్త, సుప్రసిద్ధపండితుడు, నాటక కర్త, నటుడు. ఆంధ్ర ఉపాధ్యాయుడు అయిన విజయమూరు వెంకటలక్ష్మీనరసింహారావుగారు, కాకినాడ మెట్రిక్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడుగా 36 సంవత్సరాలు పనిచేశారు. వివిధ సాహిత్య ప్రక్రియలలో చాలగ్రంథాలు రచియించారు. వీరి అనార్కలీ నాటకం ఆంధ్రదేశంలో అనేకసార్లు ప్రదర్శింపబడి ప్రేక్షకుల హర్షధ్వానాల నందుకుంది. వీరి అనార్కలీ, నరసన్నభట్టు నాటకాలను కళాశాల తరగతులకు ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్ణయించింది.



నరసింహారావుగారు బాల్యంనుండి చారిత్రక పౌరాణిక నాటకాలలో ప్రముఖపాత్రలు ధరించారు. 1913 లో బెజవాడలో జరిగిన గయోపాఖ్యాన నాటక ప్రదర్శనపోటీలలో గయునిపాత్రకు సువర్ణపతకం లభించింది. వీరు పత్రికాసంపాదకత్వంలో ఆరితేరినవారు. వీరు, వీరి భార్య వెంకటరత్నమ్మగారు కలిసి, 1916 లో అనసూయ పత్రికను స్థాపించి, చాలా సంవత్సరాలు నడిపారు. వీరి గృహం కళాకేంద్రం. వీరి కుమార్తెలే సుప్రసిద్ధగాయనీమణులు విజయమూరు సీత, అనసూయలు. వీరి బావమరిది శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు. నరసింహారావుగారి బహుముఖసేవలు భారతప్రభుత్వం 1967 లో పద్మశ్రీ బిరుదునిచ్చి సత్కరించింది. 82 సంవత్సరాలు జీవించిన నరసింహారావుగారు 1969 జనవరి 12 వ తేదీన పరమపదించారు.

సోమరాజు రామానుజరావు:

కీర్తిశేషులు సోమరాజు రామానుజరావుగారు భద్రాచల నివాసి. దేశముఖ, దేశపాండ్యా మొదలైన బిరుదులు కలవారు. వీరు అనేకమైన తెలుగు నాటకాలను రచించారు. రంగూన్‌రౌడి - ధ ర ణి కో ట - గంగావతరణం - దాన వీర కర్ణ - కాలకేతనం - సతీ అనసూయ - మహాభక్తవిజయం - ప్రతాపరుద్రీయం - సంగీతసావిత్రి - పద్మవ్యూహం - స్వరాజ్యరథం - భీష్మబ్రహ్మచారి - తాజ్ మహల్ మొదలైన నాటకాలను రచియించారు. ఆంధ్ర నాటకరంగంలో వీరి నాటకాలుకూడ బహుళ ప్రచారాన్ని పొందాయి. వీరి 'రంగూన్‌రౌడి' ఆంధ్రదేశం అన్ని మారుమూలల్లోనూ ప్రదర్శింపబడింది. రంగూన్‌లో కూడ ప్రదర్శించారు. వీరి నాటకాల్లో ప్రదర్శింపబడినవి ధరణికోట - గంగావతరణం - కాలకేతనం మొదలైనవి.

పింగళి నాగేంద్రరావు:

ఆంధ్ర నాటకరంగంలో ప్రముఖపాత్ర వహించిన నాటక సమాజాల్లో బందరు ఇండియన్ డ్రమెటిక్ కంపెనీ అతిముఖ్యమైంది. ఆ కంపెనీ నాటకరచయితగా వుండి, నాటకాలను వ్రాసిఇచ్చి, ఆ సమాజంద్వారా ప్రదర్శింపచేసి, అఖిలాంధ్రదేశంలోనూ ప్రముఖ నాటకరచయితగా వెలుగొందిన పింగళి నాగేంద్రరావు గారు 1901 సంవత్సరంలో బొబ్బిలి దగ్గరున్న రాజాంలో జన్మించారు. 6 వ సంవత్సరంలో బందరు ఆంధ్రజాతీయ పాఠశాలలో చేరారు. 16 వ ఏట బడిపంతులయ్యారు. 1922 లో డి. యల్. రాయ్ మేవాడ రాజ్యపతనాన్ని వచన నాటకంగా ఆంధ్రీకరించారు. ఈ నాటకాన్ని 1924 లో బందరులో డి. వి. సుబ్బారావుగారు ప్రదర్శించారు. 1923 లో డి. యల్. రాయ్ మరొక నాటకాన్ని పాషాణి అనే పేరుతో అనువాదం చేసి, కృష్ణాపత్రికలో ప్రచురించారు.

నాటక రచనలో అనుభవం సంపాదించిన నాగేంద్రరావుగారు 1928 లో వింధ్యరాణి రచియించారు. ఈ నాటకం డి. వి. సుబ్బారావు వింధ్యరాజుగా, కోట వెంకటేశ్వరరావు అవంతిగా, పది సంవత్సరాలు అజరామంగా ప్రదర్శించారు.

వింధ్యరాణి తరువాత నారాజు నాటకాన్ని రచించారు. ఇది కృష్ణదేవరాయలకు సంబంధించిన గాథ. నారాజు రచనాకాలం 1929. ఆ తరువాత

1955 లో ఒకే కుటుంబం సాంఘిక నాటకాన్ని రచియించారు. నాగేంద్రరావుగారు నాటక రచయితలేకాక మంచి ప్రయోక్త. ఆయన సినిమారంగంలో ప్రవేశించి ఎన్నో చిత్రాలకు, కథలను, సంభాషణలను, పాటలను వ్రాసి రచయితగా ఒక ప్రముఖస్థానాన్ని సంపాదించుకున్నారు.

కాళ్ళకూరి నారాయణరావు :

ప్రముఖాంధ్ర నాటక కర్తలలో కీ॥ శే॥ కాళ్ళకూరి నారాయణరావు గారొకరు. చింతామణి, మధుసేవ, పద్మవ్యూహం, వరవిక్రయం, చిత్రాభ్యుదయం (లేక సారంగధర) మొదలైనవి వీరి నాటకాలలో అత్యున్నత స్థానాన్ని పొందినవి. చింతామణి, మధుసేవ, వరవిక్రయం ఈ మూడు నాటకాలూ, రంగస్థలంమీద అనేక సమాజాలు, అనేక ప్రాంతాల్లో ప్రదర్శించాయి. వీరి మూడు నాటకాలూ సాంఘికాలే. సమాజానికి నీతినినేర్పే నాటకాలు, చింతామణిలో వేశ్యసమస్య, మధుసేవలో మధ్యపానసమస్య, వరవిక్రయంలో వరకట్నాలు, అభ్యుదయకరమైన సమస్యలు తీసుకునే నాటకాలను రచించారు. ఆన్నింటిలోకి ఈ నాటికీ సజీవంగా ఆడబడుతూ ప్రాచీనాంధ్ర నాటకాల్లో మణిగా చింతామణి నాటకం వెలుగొందుతూ వుంది. చింతామణి రెండుసార్లు చలన చిత్రంగా చిత్రీకరించబడింది.

మల్లాది విశ్వనాధకవిరాజు :

1894లో శ్రీకాకుళంలో కవిరాజుగారు జన్మించారు. మెట్రిక్యులేషన్ ప్యాసై నారు. భళ్ళమూడి దక్షిణామూర్తిశాస్త్రిల వారివద్ద సంస్కృత కావ్య నాటకాలను అభ్యసించారు. ఆనాడు శ్రీకాకుళంలో సురభి రామయ్య ప్రదర్శించిన నాటకాలను చూశారు. నాటకరంగమీద ఆభిరుచి ఏర్పడి, 15 ఏట "లాక్షాగృహం" అనే ఏకాంకికను రచియించారు. 23 వ ఏట తెలుగు పండితుడుగా పనిచేశారు. సురభి పాపాబాయి నాటక కంపెనీకి కొన్ని పౌరాణిక నాటకాలను వ్రాసి ఇచ్చారు. చట్టి పూర్ణయ్య పంతులుగారితో కలిసి "పోలాకి" అనే గ్రామంలో నాటక కళా పరిషత్తును చిన్న స్థాయిలో స్థాపించారు. విజయనగరంలో బుర్రా శేషగిరిరావు, అడిదం నారాయణమూర్తిగార్లతో



కలిసి "నాటక కళ "పత్రికను స్థాపించారు. ఆంధ్ర నాటక కళ పరిషత్ స్థాపకుల్లో ఒకరు. వ్యవహారికభాషలో 50 వరకూ వినోద నాటికలను రచించారు. వాటిలో దొంగాటకం, నేపథ్యం, పిల్ల జమీందారు, నాటికినేడు, కీర్రుగానుగ మొదలైనవి పుస్తకాలుగా వెలువడ్డాయి. 1936 లో సినిమారంగంలో ప్రవేశించారు. భక్త మార్కండేయకు సంభాషణలు, పంతులమ్మ, సౌదామిని చిత్రాలకు కథలూ వ్రాశారు. వీరి ఆముద్రిత గ్రంథాలు శివమహాపురాణం, వివిధ వ్యాసాలు 100, నాటికలు 50, వసంతసేన, హంస, మహాత్మాకబీరు, జమీందారు, పాలఘాటు పెళ్ళి, మహానంద, కృష్ణమాయ, నూర్జహాన్ మొదలైనవి. 1946 లో మద్రాసులో మరణించారు.

## చల్లాది అచ్యుతరామశాస్త్రి :

అచ్యుతరామశాస్త్రిగారి జననం 1872 లో. 1903 లో బందరు గొడుగుపేట జగన్మోహిని థియేటర్‌లో పనిచేశారు. నాటక రచయితగా, నటుడుగా నాటక రంగానికి బహుముఖాల సేవచేశారు. శాస్త్రిగారు దాదాపు ముప్పై నాటకాలను వ్రాశారు. ఆంధ్రదేశంలో ఆనాటి అనేక సమాజాలు వీరి నాటకాలను ప్రదర్శించాయి. వీరి నాటకాల్లో పేరుప్రతిష్ఠల్ని సంపాదించుకున్న నాటకాలు ద్రౌపదీ వస్త్రాపహరణం, సతీ సక్కుబాయి. సక్కుబాయి నాటకం వైతా గోపాలంగారి దర్శకత్వంలో తుంగల చలపతిరావు సక్కుబాయిగా ఆంధ్రదేశమంతటా ప్రదర్శింపబడింది. కొంతకాలం బెజవాడ హిందూ థియేటర్లో పనిచేశారు. 1922 లో విజయనగరంలో ఘనంగా సన్మానించి, నాటకచక్రవర్తి అనే బిరుదు నిచ్చారు. తదుపరి కొంతకాలం సినిమాలలో పనిచేశారు. 1943 లో పరమపదించారు.

## శ్రీరాముల సచ్చిదానందశాస్త్రి :

సచ్చిదానంద శాస్త్రిగారు 1883 వ సంవత్సరంలో జన్మించారు. వీరు సంస్కృతాంధ్రభాషల్లో ఉత్తమ పండితులు. 1915 వ సంవత్సరంలో సావిత్రి నాటకాన్ని వ్రాశారు. వీరి రచనల్లో సావిత్రినాటకం ప్రసిద్ధమైంది. సావిత్రి నాటకాన్ని ఆనాడు బెజవాడ మైలవరం థియేటరువారు అత్యద్భుతంగా ప్రదర్శించారు. గురజనాయుడు, నిడుముక్కల, ఉప్పలూరు సంజీవరావు మొదలైనవారు ఈనాటకం ద్వారా ఆంధ్ర ప్రజాహృదయాలలో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నారు.

శాస్త్రిగారు 1939 లో లలిత, 1941లో బృంద, 1851లో దివోదాసు మొదలైన నాటకా లను కూడా రచించారు. వీరు 1954 లో మరణించారు.

సోమంచి యజ్ఞన్నశాస్త్రి :

బొంబాయి కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. వీరికి నాటక కళ అంటే అపారమైన అభిమానం. వీరు విశ్వంపెళ్ళి- కళ్యాణి-, న్యాయం- మహానుభావులు మొదలైన అనువాద నాటకాలను రచించారు. స్వంత రచనలు పెద్దమనుషులు - ఈ సంసారం - లోకులు కాకులు - నాలుగు నాటికలు - కట్నం కోరని కళ్యాణం - రంగభూమి మొదలైనవి. వీరి నాటికలూ, నాటకాలూ ఎప్పుడో ఒకప్పుడు అన్నీ ప్రదర్శింపబడి పేరు పొందాయి. రేడియోలో ప్రసారమైన నాటి కలు సత్యానికి సరిహద్దులు - ముతకచీర - జరీచీర - నిత్యానందం మొదలైనవి. వీరు బొంబాయిలో వుంటూ ఆంధ్రుల పురోభివృద్ధికి పాటుపడుతున్నారు.

కో॥ శే॥ పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రి :

యజ్ఞనారాయణశాస్త్రిగారి జన్మస్థలం దివితాలూకా మోపిదేవి. చాలాకాలం బందరులో నివాసం. ఆంధ్ర నటప్రకాశిక అని నాట్య నాటక రంగాలను గురించి ఒక వుద్గ్రంథాన్ని రచించి 1930 లో ప్రచురించారు. ఈ యువ పండితుడు నాటక కర్త, గాయకుడు, నాట్యాచార్యుడు నట. ప్రకాశికగ్రంథంలో సంగీతం, నాయకీ, నాయక విధులను గురించీ, సంచారీ, పరకీయ మొదలైన భావాలను గురించీ, నాటక రచనను గూర్చీ, నాటకప్రయోగం, రంగస్థలం నటుల బాధ్యతలను గురించీ విపులంగా చర్చించారు. ఆంధ్ర నాటకరంగానికి సంబంధించిన 130 మంది నటుల రచయితల చిత్రపటాలను ఆ గ్రంథంలో ముద్రించారు. ఈ గ్రంథం ఈనాడు మనకు మార్కెట్‌లో లభ్యంకాదు. శాస్త్రిగారు ఒక వుత్తమగ్రంథాన్ని ఆంధ్ర నాటక లోకానికి ప్రసాదించారు.

గుండిమెడ వెంకటసుబ్బారావు :

సుబ్బారావుగారు 25-7-1901 వ తేదీన గుంజాంజిల్లా ఛత్రపురంలో జన్మిం చారు. మంచిస్ఫురద్రూపి. అనేక నాటకాలను రచించి ప్రదర్శింపచేశారు. అనేక నవలలను వ్రాశారు. వీరు మంచినటులేకాక, వుత్తమ చిత్రలేఖకులు. వీరి నాటకా

లన్నీ విశ్వవిద్యాయాల్లో పఠనీయగ్రంథాలుగా వెలుగొందాయి. వీరి కలంనుండి 1917 లో రాణాప్రతాప్, 1938 లో మేవాడుపతనం, 1933 లో ఖిల్జీరాజ్య పతనం, 1946 లో పృధ్వీపుత్రి, 1949 లో దుర్గాదాసు మొదలైన చారిత్రక నాటకాలు వెలువడ్డాయి.

మల్లాది అవధాని :



అవధానిగారు 1915 వ సంవత్సరం సెప్టెంబరు 15 వ తేదీన శ్రీకాకుళం జిల్లా పెక్కలిలో జన్మించారు. ప్రసిద్ధ ఏకాంకికా రచయిత. అనేక నాటకాలు నాటికలు రచించారు. వీరు హైస్కూలు హెడ్‌మాస్టరు. గాలివాన - ఆనందో బ్రహ్మ - నాదిర్షా-నాటికలు : యవ్వనం-దిగంబరి-ఆంధ్రరాష్ట్రం అసంపూర్ణ రామాయణం మొదలైనవి రచించారు. ఖడ్గతిక్కన - పీష్వా - సుల్తానారజియా మొదలైన నాటికలు హిందీలోకి అనువదించబడ్డాయి.

చల్లా లక్ష్మీనారాయణశాస్త్రి :

ఈ మధ్యనే కీర్తిశేషులైన చల్లా లక్ష్మీనారాయణశాస్త్రిగారు పెక్కు కావ్యాలనేకాక, పౌరాణిక నాటకాలనుకూడా వెలయించారు. చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారి శిష్యులైన వీరు ప్రబంధ కవిశిరోమణి బిరుదాంకితులు. అష్టావధానాలు చేశారు. కృష్ణాజిల్లాకు చెందినవారైనా వీరు చాలాకాలం చెంగల్పట్టు జిల్లాలోని పొన్నేరి బోర్డు హైస్కూలులో తెలుగుపండితులుగా పనిచేశారు. శ్రీ శాస్త్రిగారి కళ్యాణ రాఘవీయం - భక్త కన్నప్ప - విశ్వజ్యోతి (బుద్ధుడు) - ప్రచండభార్గవము మొదలైనవి ముద్రింపబడినాయి. ప్రభావతి - విశ్వమోహిని - గోరాకుంభార్ - జనాబాయి - గిరికుమారి మొదలైనవి అముద్రితాలు.

పైన పువహరించినవాటిలో భక్త కన్నప్ప, జనాబాయి, గోరాకుంభార్ మొదలైనవి చాలాసార్లు రంగస్థలంమీద ప్రదర్శింపబడి, ప్రేక్షకుల ఆదరాభిమానాలు చూరగొన్నాయి.

### వేదాంతకవి :

ఈయన చెళ్ళపిళ్ళవారి శిష్యుడు. అనేక నాటకాలనూ, కావ్యాలనూ వ్రాశారు. ఈయన రచనలన్నీ యువకుల్ని ఎక్కువగా వుత్సాహపరుస్తాయి. మంచి భాషాజ్ఞానమున్నవారు. కవిత్వంలో మంచి పట్టున్నవారు. ఈయన వ్రాసిన నాటకాలు తెలుగుతల్లి, యుద్ధభూమి, కష్టకాలం, ఆకలిమంట, విశ్వస్వారాజ్యం, మహారథికర్ణ, భలే హైదరాబాదు, సర్వోదయం, తంతులు, గండపెండేరం మొదలైన నాటకాలను రచించారు. వీటిలో ప్రజామోదాన్ని పొందిన నాటకం తెలుగుతల్లి. ఆంధ్రజాతిని వుత్తేజపర్చగల్గిన ఈ నాటకాన్ని ముదినేపల్లి సమాజంవారు వెలుగులోకి తెచ్చారు. ఈ సమాజానికి వెన్నెముక దుక్కిపాటి మధుసూదనరావు ఈ నాటకంలో సుప్రసిద్ధ సినీనటులు ఎ. నాగేశ్వరరావు నటించారు. ఈ నాటకం ద్వారానే ఆయన ఆంధ్రదేశానికి పరిచయమయ్యారు. వేదాంత కవిగారి ఇతర రచనలు అంతగా రాణించలేదు. ఈయనకు మహాకవి, ఆంధ్ర బెర్నార్డుషా, జగజ్జనని అనే బిరుదులుకూడా వున్నాయి. 1957 సంవత్సరం ఏప్రిల్ నెలలో మద్రాసు వాణీమహాల్లో వీరికి సన్మానం జరిగింది.

### మల్లాది వేంకటకృష్ణశర్మ :

విశ్వనాధ కవిరాజుగారి తమ్ముడు వేంకట కృష్ణశర్మగారు. ప్రసిద్ధ నాటక రచయిత. ముఖ్యంగా సురభివారికి ఎన్నో నాటకాలను వ్రాసి ఇచ్చారు. ఈనాడు సురభి నాటక సమాజ శాఖలన్నీ వారి నాటకాలనే ఎక్కువగా ప్రదర్శిస్తున్నారు. శర్మగారి నాటకాలన్నీ ప్రదర్శనయోగ్యంగా విలబడ్డాయి. వీరి 'వారసత్వం' ఏకాంకిక బహుళప్రచారం పొందింది. ప్రత్యక్షదైవము, సుబ్బమ్మవిరహం, నామకరణం, గతిలేనిదేశంలో మతిలేని మనుష్యులు మొదలైన హాస్య నాటికలుకూడ ప్రేక్షకుల ఆదరాభిమానాలను పొందాయి.

### భమిడిపాటి కామేశ్వరరావు :

కామేశ్వరరావుగారు ప్రసిద్ధాంధ్ర హాస్య నాటక రచయితలు. 1897 వ సంవత్సరం ఏప్రిల్ 28 వ తేదీన ఆకివీడులో జన్మించారు. పట్టభద్రులు. రాజమండ్రి

వీరేశలింగంగారి స్కూలులో ఉపాధ్యాయులుగా పనిచేశారు. వీరి రచనలు అప్పుడు-ఇప్పుడు, కాలక్షేపం, పెళ్ళిపైర్రినింగు, గుసగుసపెళ్ళి, త్యాగరాజు ఆత్మవిచారం, నిజం, అన్నీ తగాదాలే. వీరి నాటకాలన్నీ హాస్యప్రధానమైనవి. వీరి ప్రసంగంకూడా హాస్యప్రధానమైనది. వీరు ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీలోనూ, కళా పరిషత్తులోనూ పనిచేశారు.

గురజాడ అప్పారావు :

గురజాడ అప్పారావుగారు 1865 వ సంవత్సరంలో విశాఖజిల్లా ఎల మంచిలి తాలూకా రాయవరంలో జన్మించారు. చిన్నతనంలోనే సంస్కృత, ఆంధ్ర, ఆంగ్లభాషలు నేర్చారు. 1872 లో విజయనగరం మహారాజా కళాశాల విద్యార్థిగా చేరారు. గిడుగు రామమూర్తిగారికి సహాధ్యాయిగా చదివారు. 1886 లో బి. ఏ. పట్టం పొందారు. ఎన్నెన్నో ఉద్యోగాలు చేశారు. 1892 లో కన్యాశుల్కం నాటకం రచించి, 1897 జనవరి 1 వ తేదీన పీఠిక వ్రాశారు. 1906 లో కొండు భట్టీయం అనే సాంఘిక నాటకం రచించాడు. ఆ సంవత్సరంలోనే ముత్యాల సరాలు గేయాలను రచించి, గురజాడ వాగ్గేయకారుడు అనే పేరుపొందారు. తెలుగు దేశంలో ప్రజాహృదయాలను చూరగొన్న దేశభక్తి గేయం 1910 లో వ్రాశారు. లవణరాజు కల, పూర్ణిమ, కన్యక, దేశభక్తి, నీలగిరి పాటలు-సుభద్ర మొదలైన ఖండకావ్యాలను రచించారు.

నాటకరచనలో వ్యావహారిక భాషను ప్రయోగించి, సంఘ సంస్కరణ దృష్టితో కన్యాశుల్కాన్ని రచించి, నాటక రంగంలో ఒక నూతన విప్లవాన్ని తీసుకువచ్చారు. కన్యాశుల్కం ఆనాటి నుండి ఈనాటి వరకు రచనలో ఉత్తమ నాటకంగా వెలుగొందుతూ వుంది.

కన్యాశుల్కం 1892 లో విజయనగరం జగన్నాధవిలాసినీ నాటక సమాజం వారు ప్రదర్శించారు. ఈనాటివరకు ఇంగ్లీషు, కన్నడ, రష్యన్ భాషల్లో కన్యాశుల్కం నాటకం వెలువడింది.

కన్యాశుల్కం నాటకంలో అప్పారావుగారు ఆంధ్ర ప్రజాజీవితాన్ని, సాంఘిక సమస్యల్ని, సమాజంలోని వైరుధ్యాలను కళ్ళకు కట్టినట్లు చిత్రించారు. ముఖ్యంగా స్త్రీ పునర్వివాహాలను ప్రోత్సహించారు. వృద్ధ వివాహాలను ఖండిం

చారు. ఛాందస పండితుల్ని, దొంగబైరాగుల్ని, త్రాగుబోతుల్ని, న్యాయవాదుల్ని, పోలీసుల్ని, పండితుల్ని సహజ సుందరంగా చిత్రించి, కన్యాశుల్కం నాటకాన్ని ఉత్తమనాటకంగా తీర్చిదిద్దాడు. బహుముఖాల ఆంధ్రజాతికి, భాషకు, నాటక రంగానికి సేవచేసిన గురజాడ వాస్మికి 1915 నవంబరు 30 వ తేదీన విజయనగరంలో కన్నుమూశారు.

పాకాల వెంకటరాజమన్నారు :

1901 సంవత్సరం మే 10 వ తేదీన పాకాల వెంకటరాజమన్నారుగారు రాజమహేంద్రవరంలో జన్మించారు. బి. యల్. డిగ్రీని పొందారు. మద్రాసు హైకోర్టు ఛీఫ్ జస్టిస్‌గా పనిచేశారు. ఆయన న్యాయవాదవృత్తిలో వుంటూనే నాటక కళకు మహత్తరమైన సేవచేశారు. కళ అనే సాంస్కృతిక పత్రికను నడిపారు. అనేక అభ్యుదయ సాహిత్య సంస్థలలో సంబంధం కలిగివున్నారు.

1930 లో ఆయన వ్రాసిన తప్పెవరిది నాటిక తెలుగు నాటక రంగంలో ఒక నూతన అధ్యాయాన్ని స్థాపించింది. వీరి రచనలన్నీ సాంఘిక సమస్యల్ని ప్రతిబింబిస్తాయి. సంఘంలోవున్న మాలిన్యాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించటం వీరి ఆశయం. వీరిమీద గాల్స్‌వర్దీ, ఇబ్సన్ లాంటి పాశ్చాత్యనాటక రచయితల ప్రభావం వున్నప్పటికీ, వీరి రచనల్లో ఏమాత్రం పాశ్చాత్యవాసనలు కానరావు. ఏనాటికకు ఆ నాటికే ఒకప్రత్యేకతను సంతరించుకుంది. వీరి నాటికల్ని ఆంధ్రదేశంలో అనేక ఔత్సాహిక సమాజాలు ప్రదర్శించాయి.

రామన్నారుగారు ప్రప్రథమంగా అఖిల భారత సంగీత నాటక అకాడమీకి అధ్యక్షులుగా పనిచేశారు లలితకళలపట్ల అపారమైన ప్రేమాభిమానంగల కళాభిమాని. ఆయన వుత్తమనాటక రచయితగా ఆంధ్ర నాటక రంగంలో గణనీయమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. వారి నాటికలు తప్పెవరిది, మనోరమ, ఏమి మగవాళ్ళు, మాతృప్రేమ, దయ్యాల లంక, వృథాయాసం మొదలైనవి. వీటిలో తప్పెవరిది నాటిక నాటకరంగంలో గొప్ప సంచలనాన్ని కలిగించింది. ఆ ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన గొప్ప కళావేత్త.

నార్ల వెంకటేశ్వరరావు :

ఆంధ్రప్రభ సంపాదకులుగా ఆంధ్రదేశానికి పరిచితులైన నార్ల వెంక

ేశ్వరరావుగారు 1908 సంవత్సరం డిసెంబరు 1 వ తేదీన జన్మించారు. బి. ఏ. పట్టభద్రులు. అనేక పత్రికల్లో సంపాదకులుగా పనిచేశారు. నేటి రష్యాలాంటి రాజకీయ గ్రంథాన్ని రచించి, ఆంధ్రదేశంలో అనేకమంది యువకుల్లో సోషలిస్టు భావాల్ని కలిగించారు. అనేక గేయాలను, వ్యాసాలను రచియించారు. వీరి సంపాదకీయం ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. దేశీయ, అంతర్జాతీయ నాటక కళను ఆకళింపు చేసుకున్నవారు, ప్రపంచ నాటకరంగానికి సంబంధించిన అనేక నాటకాలను, సాంకేతిక గ్రంథాలను సేకరించిన మహనీయుడు. ఆంధ్ర నాటక రంగం నిత్యనూతనంగా వెలుగొందాలని తహతహలాడే మహావ్యక్తి. ఎక్కడ, ఏ పరిషత్తు జరిగినా అక్కడికి ఆయన కళాహృదయ ముంటుంది. ఆంధ్ర నాటికా రచయితల్లో నార్లవారు ముఖ్యులు. ఆయన గ్రామీణ వాస్తవికతను, సమాజవాస్తవికతను కళ్ళకు కట్టినట్లు కొత్తగడ్డ అనే పేరుమీద ఒక సంపుటిగా ఈ క్రింది నాటికలన్నిటినీ వెలువరించారు: "పైపంట" "ప్రారబ్ధం" "దాంపత్యం" "శకున పక్షి" "కొత్తగడ్డ" "వెలుగునీడలు" "ద్రోహం" "ఏకాభిప్రాయం" "భంగపాటు" "ఇంటిగుట్టు" "నవకవి" "అర్ధాంగి" "జీవజ్వాల" "అడబ్రతుకు" "దొంగ-దొర" "వంతెన". నార్లవారి ప్రతి నాటికా ఒక నూతన పంథా సూచిస్తుంది. ఆయన అనేక సంవత్సరాలు ఆంధ్ర నాటక కళాపరిషత్తుకు కార్య నిర్వాహకసభ్యులుగాను, సలహా సంఘసభ్యులుగాను ఎనలేని కృషిచేశారు.

దామరాజు పుండరీకాక్షుడు :

దామరాజు పుండరీకాక్షుడుగారు గుంటూరుజిల్లా, సత్తెనపల్లి తాలూకా పాటిబండ గ్రామంలో 1898 జూన్ 5 వ తేదీన జన్మించారు. 1920 వ సంవత్సరంలో మద్రాసు పచ్చయప్ప కళాశాలలో బి. ఏ, ప్యాసైనారు. తరువాత న్యాయశాస్త్రంలో పట్టభద్రులైనారు. కాశీ కృష్ణాచార్యులు, శిష్టా హనుమచ్ఛాస్త్రుల వారిద్వారా కవితాశక్తి పెంపొందించుకున్నారు.

పుండరీకాక్షుడుగారు ఆంధ్రదేశంలో నాటకంద్వారా జాతీయోద్యమాన్ని, స్వాతంత్ర్యకాంక్షను పెంపొందించి ప్రజలలో విప్లవభావాలను వెదజల్లిన ప్రప్రథమ జాతీయకవి; దేశభక్తుడు. వీరి "రణభేరి" నాటకం ప్రజాభిమానాన్ని పొందింది. ఆనాటి తెల్లప్రభుత్వం రణభేరి నాటకంలో గాంధి పాత్రను తొలగిస్తే గొప్ప

పారితోషికం ఇస్తామని ఆశ చూపించింది. కాని దానిని తిరస్కరించా డాయన. గాంధీ విజయం - పాంచాలీ పరాభవం - స్వరాజ్యమహానభ - ఓట్లు ప్రహసనం - క్విట్ ఇండియా - నిలువీత - కమల్‌పాషా జీవితం - సంస్కారిణీ మొదలైన అనేక అభ్యుదయ నాటకాలను రచించారు.

కొండముది గోపాలరాయశర్మ :

గుంటూరుజిల్లా. రేపల్లె తాలూకా భట్టిప్రోలు గ్రామంలో 17-10-1920 వ తేదీన జన్మించాడు. 1935 లో తురిమెళ్ళ గ్రామంలో ఎస్. ఎస్. ఎల్. సి. చదువుతూ వివిధ వేషధారణతో ప్రదర్శనం ఇచ్చారు. 1936 లో మద్రాసు లయోలా కాలేజీలో ప్రవేశించారు. యుగంధరుడు (పిచ్చివాడుగా) - శకుంతలలో విదూషకుడు. బెస్తవాడుగా-చంద్రగుప్తలో చాణక్యుడుగా - రంగూన్ రౌడీగా నటించి పేరుప్రతిష్టలు సంపాదించుకున్నారు. 1940 లో సంస్కృత ఏకపాత్రాభినయ పోటీలలో మృచ్ఛకటికలో మైత్రేయుడుగా బహుమతుల నందుకున్నారు. 1941లో అంతర్విశ్వ విద్యాలయ ఆంధ్రభాషా వక్తృత్వ పోటీలలో ప్రథమ బహుమానాన్ని అందుకున్నారు. 1942 లో రాణీ రుద్రమ నాటకాన్ని రచించారు. 1943 నుండి 1946 వరకు ఆంధ్రప్రభ సంపాదకీయ వర్గంలో వుండి. నాటక రంగంమీద పరంపరగా వ్యాసాలను వ్రాశారు. 1944 నుండి 1954 వరకు ఆంధ్ర నాటక కళాపరిషత్ కార్యవర్గ సభ్యులుగా పనిజేశారు. 1945 డిసెంబరులో గుడివాడ పరిషత్తులో ఎదురీత నాటకానికి ప్రథమ బహుమానం అందుకున్నారు. 1952 లో గౌతమబుద్ధ నాటకానికి ఆంధ్ర సారస్వత పరిషత్తు బహుమానాన్ని అందుకున్నారు. ఇదీలోకం మొదలైన నాటకాలను, మరికొన్ని నాటికలనూ రచించారు. 194. నుంచి సినిమా రంగంలో ప్రవేశించి అనేక చిత్రాలకు మాటలు - పాటలు వ్రాశారు.

ఆచార్య ఆత్రేయ :

ఆత్రేయ వంటి ఆంధ్ర నాటక రచయితలలో ముఖ్యులు. వీరి నాటకాలు ఆంధ్రదేశంలో నాటక సమాజాలకు నటులకు ఒక కొత్త ఉత్సాహాన్నిచ్చాయి. వీరి నాటకాలు ప్రజాసమస్యలకు సంబంధించిన సాంఘికాలు. ఆయన రచయితే కాక మంచి నటుడు. నటుడే రచయిత కావడంవల్ల నాటకానికి కావలసిన అంద చందాల నన్నిటినీ కూర్చిపెట్టారు. ఆత్రేయ నాటకాల్లో సంభాషణలకు ఒక ప్రత్యే

కత వుంది. వివిధ నాటక కళాపరిషత్తుల్లో వీరి నాటకాలు అనేక ఉత్తమ బహుమానాలను అందుకున్నాయి. ఈనాడు - యన్. జి. ఓ - పరివర్తన - విశ్వశాంతి - కప్పలు - భయం - వాస్తవం - తిరపతి - గౌతమబుద్ధ - ప్రగతి - ఎవరుదొంగ - వరప్రసాదం - త్రిశూలమ్ - మాయ - కళకోసం - చస్తే యేం - చావకూడదు - అంతర్యుద్ధం - ఓటు నీకే - ఆత్మార్పణ మొదలైన నాటకా నాటికలను రచియించి ఉత్తమ నాటక రచయితగానూ, ఉత్తమ నటుడుగానూ, చలనచిత్ర రచయితగాను ప్రఖ్యాతి వహించారు. ఆత్రేయ వెంకటగిరి అమెచ్యూర్స్ ఆసోసియేషన్ సభ్యులుగా వుండి, ఆ సమాజం ద్వారానే పరిషత్తులలో ప్రవర్శించి బహుమానాల నందుకున్నారు. తరువాత ప్రజా నాట్య మంచలిలో చేరి వెలుగులోకొచ్చారు.

వాసిరెడ్డి భాస్కరరావు:

సుంకర, వాసిరెడ్డి అనే పేర్లతో ప్రచారంలో కొచ్చినవారిలో వాసిరెడ్డి భాస్కరరావుగా రొఫరు. మాభూమి - ముందడుగు - అపనిందలాంటి నాటకాలు సుంకర సత్యనారాయణతో కలిసి రచించారు. తెలుగువిద్వాన్. ఆంగ్ల, హిందీ సాహిత్యాలతో విశేషంగా సంబంధమున్నవారు. పత్రికా సంపాదకత్వంలో అనుభవం వుంది. స్వయంగా పోతుగడ్డ నాటకాన్ని రచించారు. అభ్యుదయ రచయితలతోను సంబంధమున్నవారు. తని యావచ్ఛ్వాసనీ కమ్యూనిస్టు పార్టీకి విరాళంగా ఇచ్చిన రాజకీయవాది. పుట్టిల్లు, పల్లెటూరు, కన్నతల్లి మొదలైన చిత్రాలకు పాటలు, మాటలు వ్రాశారు. జన్మస్థానం కృష్ణాజిల్లా, వీరులపాడు. జననం 1914 సెప్టెంబరు 2 వ తేదీ. వీరి మాభూమి నాటకాన్ని కొన్నివందల ప్రజానాట్యమండలి నాటక సమాజాలు కొన్నివేల ప్రదర్శనాలను ప్రదర్శించాయి. చివరికి ప్రభుత్వ నిషేధానికి గురైంది.

సుంకర సత్యనారాయణ :

1909 వ సంవత్సరం కృష్ణాజిల్లా ఈడుపుగల్లులో జన్మించారు. జాతీయ వుద్యమంలో కాంగ్రెసులో ప్రవేశించి,తీవ్రమైన లాఠీచార్జీకి గురై, కారాగారవాసాన్ని అనుభవించారు. అలహాబాదులో హిందీ విద్యాభ్యాసం చేశారు. ప్రపంచ ప్రఖ్యాతి వహించిన మాభూమి నాటక రచయితల్లో ఒకరు. మాభూమి-ముందడుగు - అప

నింద మొదలైన నాటకాలను వాసిరెడ్డితో కలిసి రచించారు. వీరు స్వయంగా భూమికోసం నాటకం. జీతగాడు - వీరకుంకుమ - ప్రతిఫలం మొదలైన అభ్యుదయ నాటికలను రచియించారు. వీరి నాటకాలను ఆంధ్ర ప్రజానాట్యమండలి అన్ని చోట్లా కొన్నివేల ప్రదర్శనాలను ప్రదర్శించాయి. ఇంటేగాక కిష్టజీని - రైతు విజయం - వీరేశలింగం - అల్లూరు సీతారామరాజు - ఎమర్జీని మొదలైన ప్రసిద్ధ బుర్రకథలను రచియించారు. వీరి కథలు ఆంధ్రదేశమంతటా ప్రజా నాట్యమండలి దళాలు ప్రచారం గావించాయి. ఈయన అనేకమైన అభ్యుదయగేయాలనూ రచించారు. అనేకసార్లు జైలుజీవితాన్ని అనుభవించారు. రష్యా పర్యటన చేసి వచ్చారు. అభ్యుదయ ప్రజావాది ఈయన.

పినిశెట్టి శ్రీరామమూర్తి:

పినిశెట్టి శ్రీరామమూర్తిగారిది పాలకొల్లు. వీరు ప్రముఖ సాంఘిక నాటక రచయిత, నటుడుకూడాను. వీరు రచించిన నాటకాలు పల్లెపడుచు - అన్నా చెల్లెలు - కులంలేని పిల్ల - కన్నకొడుకు - ఆత్మీయులు - పంజరంలో పక్షులు. నాటికలు ఆడది - రిక్షావాడు మొదలైనవి. వీరు పాలకొల్లులో ఆదర్శ నాట్యమండలి అనే స్వంతసమాజాన్ని స్థాపించి, వారి నాటకాలనూ, నాటికలనూ ఆంధ్ర దేశపు ముఖ్య ప్రాంతాలన్నిటిలోనూ ప్రదర్శించారు. వీరి రచనలు నాటక కళా పరిషత్తు వారి బహుమానాల నందుకున్నాయి. పాత్రల మధ్యసంభాషణలు నడిపించడంలో ప్రత్యేకిత వీరిది. వీరి నాటికా. నాటకాలను ఆంధ్రదేశంలో అనేక నాటక సమాజాలు ప్రదర్శించాయి. వీరు చిత్రపరిశ్రమలో అనేక చిత్రాలకూ కథలూ సంభాషణలనూ వ్రాశారు. నిత్యకళ్యాణం - పచ్చతోరణం చిత్రానికి దర్శకత్వం వహించారు.

అనిసెట్టి సుబ్బారావు:

అనిసెట్టి సుబ్బారావుగారు నవ్యసాహిత్య పరిషత్తు ఏర్పడిన నాటినుంచి సభ్యులు. ఆ సంస్థ పత్రిక ప్రతిభ సంపాదకవర్గంలో ఒకరు. గేయ రచయిత. అనేక కథలనుకూడా రచించారు. అభ్యుదయ రచయితగా అభ్యుదయ రచయితల సంఘంలో పనిచేశారు. గాలిమేడలు - మావూరు - జీవనయాత్ర - చెప్పుకింద

పూలు - శాంతి మూకాభినయం మొదలైనవి వీరి రచనలు. గాలిమేడలు-మావూరు నాటకాలను విజయవాడ ఆంధ్ర ఆర్ట్స్ థియేటరువారు అనేక ప్రదర్శనాలను ప్రదర్శించారు. వివిధ కాలేజి విద్యార్థులు ప్రదర్శించారు. వీరి శాంతి మూకాభినయ నాటిక ఆంధ్రదేశమంతటా ప్రదర్శింపబడి, కొన్ని లక్షలమంది చూశారు. సోవియట్ ఫిల్మ్ డెలిగేషన్‌వారు 1200 అడుగులు ఈ మూకాభినయ నాటికను కలరు చిత్రంగా రూపొందించారు. అనిసెట్టి నేడు చిత్రపరిశ్రమలో వుండి అనేక చిత్రాలకు మాటలు, పాటలు, కథలూ వ్రాస్తున్నారు. వర్థమాన ఆంధ్ర నాటక రచయితలలో అనిసెట్టి ఒకరు.

డాక్టరు కొల్లిపాటి గంగాధరరావు :

ఆధునిక ఆంధ్రనాటక యువ రచయితల్లో గంగాధరరావుగారు ముఖ్యులు. ఆయన నాటకాలనూ, నాటికలనూ దాదాపు 20 వరకూ రచించారు. వారి నాటకాలూ, నాటికలూ పరిషత్తులోనూ, ఆంధ్రదేశంలో జరుపబడిన అనేక కళా పరిషత్తుల పోటీల్లోనూ, అనేక కాలేజీ పోటీల్లోనూ బహుమతులను పొందాయి. వీరి నాటికా నాటకాలు అన్నీ సాంఘికాలే. వీరి రచనలు : విషకుంభాలు - గుడ్డిలోకం - లోకంపోకడ - నిజరూపాలు - తెరలోతెర - కమల - భవబంధాలు - అందరి ఆనందం - నాబాబు. నాటికలు: డిటెక్టివ్ - ప్రార్థన - పెళ్ళిచూపులు - గులాబీముళ్ళు - భయం - విగతి - తోడుదొంగలు - విధివశం - తెలుగుకోపం - బంగారుసంకెళ్ళు - పవిత్రసంకల్పం - కొత్త వుత్తరం - తనలోతాను - మేజోళ్ళు- మొదలైనవి. వీరు ప్రసిద్ధ నాటక రచయితే గాక, ప్రసిద్ధ నటుడు, దర్శకుడు కూడా.

శ్రీనివాస చక్రవర్తి :

జననం 13-3-1911 కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా హనుమంతపురంలో. బి. ఎ. పట్టభద్రుడు, కవీ, నటుడూ, కళాపిపాసీ, నాటకకర్తా - స్నేహపాత్రుడూ అయిన చక్రవర్తిగారు నాట్య నాటక లక్షణాలన్నిటినీ జీర్ణించుకున్న ప్రతిభాశాలి. బాల్యంనుంచీ నాటకాలంటే అభిమానం. విద్యార్థి దశలో గిరీశం-యుగంధరుడు - చాణక్యుడు మొదలైన పాత్రలను అభినయించారు. మీజాన్ తెలుగు దినపత్రిక లోనూ - తెలుగుదేశం వారపత్రికలోనూ సహాయసంపాదకులుగా పనిజేశారు.

అభినయం అభిమాన కళ. 'యాన్ యాక్టర్ ప్రిపేర్స్' అనే స్టానిస్లావిస్కీ గ్రంథాన్ని అభినయం అనే పేరుమీదా ఒక అమూల్య గ్రంథాన్ని ఆంధ్ర నాటక రంగానికి అర్పించారు. 1946 లో నాట్యశాల గ్రంథాన్ని రచియించారు. నటన-నాటక పోటీలు-ఆంధ్రనాటక సమీక్ష - ఆంధ్ర నాటకచర్మని - నటశిక్షణ మొదలైన నాటక కళకు సంబంధించిన గ్రంథాలను రచించారు. వీరు నాటకాలను నాటికలను కూడ రచించారు. గోర్కీ- పతితజీవులు - చెకోవ్ నీటికాకి - మావో జైత్ర యాత్ర - పుష్కిన్ లోభి - అతిథి - కిలాడి - తాగూరు నందిని - పోస్టాఫీసు ముక్తధార - మహాకవి పుష్కిన్ మొదలైనవి. చక్రవర్తిగారు నాటక కళమీద 50 వ్యాసాలు వ్రాశారు. నాట్యకళ పత్రికకు ప్రధాన సంపాదకులుగా పనిజేశారు. అనేక నాటక కళాపరిషత్తుల నాటకపోటీలలో న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ప్రస్తుతం విజయవాడ నాటకపాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. నిరాడంబరుడూ. నిస్వార్థకళాకారుడూ.

డి. వి. నరసరాజు :

సాంఘిక నాటక రచయితల్లో నరసరాజుగా రొకరు. వీరు పట్టభద్రులు. కాలేజీ నాటకాలతో పరిచయముంది. కొన్నేళ్ళుగా ఆంధ్ర నాటకకళా పరిషత్తుకు సహాయ కార్యదర్శిగాను, కార్యవర్గ సభ్యులుగాను పనిచేశారు. వీరి నాటికా, నాటకాలు, పరిషత్తుల నాటక పోటీలలో ప్రదర్శింపబడి బహుమానా లందుకున్నాయి. స్వంత రచనలకంటే, అనుసరణ రచనలు ఎక్కువ. వీరి అనుసరణలో జాతీయత వుట్టిపడుతూ వుంటుంది. నాటక రచయితయేగాక నటుడు. ఈనాడు చలనచిత్ర పరిశ్రమలో ప్రముఖ రచయితగా పేరుపొందారు. వీరి రచనలు నాటకం - వీలునామా - స్వర్గసీమ - అంతర్వాణి - ఆత్మహత్య - ఇల్లు అమ్మకం మొదలైనవి.

బెల్లంకొండ రామదాసు :

1923 వ సంవత్సరం, ఆగష్టు 23 వ తేదీ నరసరావుపేట తాలూకాలో పమిడిపాడులో జన్మించారు. పట్టభద్రులు. పత్రికావ్యాసంగంలోనూ, సంపాదకత్వంలోనూ అనుభవమున్నవారు. అభ్యుదయవాది. ఈయన పటుత్వంగా అనేక గీతాలను రచించారు. పునర్జన్మ - ఆకాశరామన్న - అతిథి అనే నాటకాలను రచియించారు. పునర్జన్మ హైదరాబాదు నాటక కళాపరిషత్తులోనూ, ఆకాశ

రామన్న విజయనగరం రాఘవ నాటకోత్సవాలలోనూ ప్రదర్శింపబడి, ప్రశంసలందుకుని బహుమానాలను పొందాయి.

ఆమంచర్ల గోపాలరావు:

జననం 1907. భారతజాతీయోద్యమంలో పనిచేశారు. సత్యాగ్రహ వుద్యమంలో పాల్గొనడంవల్ల విద్యాభ్యాసంగాలకు అంతరాయం కలిగింది. కారాగృహవాసం అనుభవించారు. భారతీయుల-ఆంధ్ర కీర్తిదర్పణం అనే పరిశోధక వ్యాసాలు వ్రాశారు. విశ్వంతర నాటకం - మూటపల్లెపు - ముల్లమిడేపి చిరుగు - మొదలైన నాటకానాటికలను రచించారు. ముల్లపుడేపి చిరుగు 1937 లో కూర్మా వేణుగోపాలస్వామిగారు ప్రసిద్ధ నాటికల్లో ప్రచురించారు. 1941 లో గుంటూరులో హరీంద్రనాథ చటోపాధ్యాయ సమక్షంలో పఠించారు. తరువాత ఆంధ్రా ఎల్లోరాలపై పరిశోధనచేసి విశ్వంతర నాటకాన్ని రచించారు. రేడియోలో ప్రొడ్యూసరుగా వున్నారు.

చలపతిరావు:

జననం 1899 ఫిబ్రవరి 27. బి. ఎ. బి. యల్ పట్టభద్రులు, నాటికా నాటక రచయిత జ్వాల పత్రికకు సంపాదకులుగా పనిచేశారు. ప్రసిద్ధ వైతాళిక చరితాసంపుటికి సంపాదకులు. వీరినాటకాలు. నాటికలు ఎక్కువగా విద్యార్థిదశల నాటకసంఘాలూ, కాలేజీ విద్యార్థి నాటక సమాజాలూ ప్రదర్శించాయి. వీరి నాటికాలు: అనార్కలి-టీకప్పులో తుఫాను - ఆకవాళ్ళ తెలివి - ఆశోకం - లడయిక్కప్పపిళ్లై. నాటికలు భీమావిలాపంలో భామాకలాపం - అపవాదు - ఎత్తుపై ఎత్తు మొదలైనవి. నాటకరంగానుభవం. పత్రికా సంపాదకత్వంలో అనుభవం సంపాదించినవారు. వీరి అనార్కలి ప్రసిద్ధ నాటికలలో చేర్చబడింది.

బోయి భీమన్న:

భీమన్నగారు తూర్పు గోదావరిజిల్లా రాజోలు తాలూకా, మామిడి కుదురులో జన్మించారు. బి.ఎ., బి. యిడి పట్టాన్ని పొందారు. పత్రికాసంపాదకత్వంలో అనుభవ మున్నవారు. మధుబాల - రాగోదయం లాంటి కావ్యాలేగాక - పాలేరు - కూలిరాజు - అమరబాల - రాగవాశిష్టం - అసూయ మొదలైన నాటకాలను రచించారు. పాలేరు - కూలిరాజు నాటకాలు ఆంధ్రదేశంలో పలుచోట్ల

ప్రదర్శింపబడి పలువురి ప్రశంస లందుకున్నాయి. ప్రస్తుతం హైదరాబాదులో ప్రముఖోద్యోగులుగా వున్నారు.

బుచ్చిబాబు :

అసలుపేరు శివరాజు వెంకటసుబ్బారావు. 1916 జూన్ 14 వ తేదీన ఏలూరులో జన్మించారు. మద్రాసు, విజయవాడ, హైదరాబాదు రేడియోలలో పని చేశారు. నవల, కథ, నాటకరచనలో సిద్ధహస్తులు. వీరు వ్రాసిన నాటకాలు ఆత్మ వంచన - ఉత్తమ ఇల్లాలు - ఆవ్యంతాలు - దారినపోయే దానయ్య - ఉమర్ ఖయామ్ మొదలైనవి, దారినపోయే దానయ్య - ఆత్మవంచన బాగా ప్రచారం పొందాయి. చిత్రలేఖనం, సాహిత్యం, నాటక కళ వీరికి అభిమాన పాత్రమైన విషయాలు.

[illegible] పాలకృష్ణ :

1922 సంవత్సరం సెప్టెంబరు 5 వ తేదీన గుంటూరుజిల్లా పలనాడు తాలూకా రెంటాలగ్రామంలో పుట్టారు. సాహిత్యపు అన్నిశాఖలలోనూ పనిచేశారు. శిక్ష అనే నాటికను - ఇన్‌స్పెక్టర్ జనరల్ అనే గొగోల్ నాటకాన్ని అనుసరించి చక్కగా రచియించారు. అభ్యుదయకవి, కవేగాక నటుడు. విజయవాడ ఆంధ్ర ఆర్ట్ థియేటరులో కొన్ని సంవత్సరాలుగా సభ్యులు.

సీతంరాజు వెంకటేశ్వరరావు :

విజయవాడ వాస్తవ్యులైన సీతంరాజు వెంకటేశ్వరరావు అనేక నాటకాలనూ, నాటికలనూ రచించారు. వీరి నాటకాలను నాటికలను ఆంధ్రదేశంలో అనేక అమెచ్యూరు నాటక సమాజాలు ప్రదర్శించాయి. 35 నాటకాలను రచించారు. వీటిలో పెళ్ళి అయ్యాకచూడు-పెళ్ళిచూపులు-సంసారి - నిరపరాధి - ఈరోజు - పేదపడుచు మొదలైన నాటకాలు పేరు సంపాదించాయి. వీరు ఇంకా 24 నాటికలనూ, 5 సాంఘిక నవలలనూ, 60 జానపద నవలలనూ, పిల్లల నవలలు 10, మొత్తం 134 గ్రంథాలను రచించారు. సినీప్రభ - తెలుగుతెర పత్రికల్లో సంపాదకుడుగాను, సినీరమకు సహకార సంపాదకులుగాను పనిచేశారు. వీరి జననం 1924.

కొడాలి గోపాలరావు:

గుంటూరుజిల్లా తెనాలి తాలూకా పెదరావూరు వాస్తవ్యులు. ఆంధ్ర నాటక రంగంలో అనేక అమెచ్యూర్ నాటక దళాలు వీరి నాటకాలను విస్తృతంగా ప్రదర్శిస్తున్నాయి. ముఖ్యంగా వీరు గ్రామీణ సమస్యలను చిత్రిస్తూ, రైతు కూలీ ఇతివృత్తాలను తీసుకుని, భూస్వాముల, అధికారుల పెత్తనానికి వ్యతిరేకంగా నాటకాలూ, నాటికలూ వ్రాశారు. వీరి నాటకాల్లో పేదరైతు - తిరుగుబాటు- కూలి - లంకెల బిందెలు - దొంగవీరుడు - నిరుద్యోగి-ఛైర్‌మెన్ మొదలైన వాటిని రసవత్తరంగా, ప్రయోగాత్మకంగా రచించారు. వీరు వస్తుతః రైతుబిడ్డ అవడంవల్ల వీరి నాటకాలు సజీవంగా వుంటాయి.





# 17

# కళాకారుల జీవితాలు



స్థానం- యడవల్లి - పులిపాటి - అద్దకి-హరి ప్రసాదరావు-ఉప్పలూరి-పంచాంగం- రాజా రావు-గోవిందరాజుల-గురజనాయుడు-మాధవ పెద్ది-గగ్గయ్య ముంజులూరి - నగరాజారావు మొదలైనవారు

# కళాకారుల జీవితాలు

పద్మశ్రీ స్థానం నరసింహారావు :

గుంటూరుజిల్లా బాపట్లలో 1902 లో జన్మించారు. గత 38 వ సంవత్స రాలుగా తెలుగు నాటకరంగంమీద దేదీప్యమానంగా వెలుగొందారు. ఇప్పటికి వీరు 1500 నాటక ప్రదర్శనాలలో పాల్గొన్నారు. స్త్రీ పాత్రలో సహజత్వాన్ని ప్రదర్శించి. అచ్చంపు ఆడదని భ్రమింపజేసి అనేకమైన పతకాలను పొందారు. చి తాంగి, మధురవాణి, రోషనార పాత్రలు వీరిసొమ్ము. ఒక్క ఆంధ్రలోనే కాక, రాష్ట్రేతరాంధ్ర ప్రాంతాల్లోనూ నాటకాలు ప్రదర్శించి కేనోళ్ళ పొగడబడ్డారు. బర్మాలో కూడా నాటకాలను ప్రదర్శించి మెప్పును పొందారు. నటకావతంస - ఆంధ్ర బాల గంధర్వ - నటశేఖర మొదలైన బిరుదులు పొందారు. వీరు అనేక పౌరాణిక,



స్త్రీ పాత్ర

చారిత్రక, సాంఘిక నాటకాల్లో పాత్రలు ధరించారు. 1949 లో ఆంధ్ర నాటకళా పరిషత్తు మహాసభలకు అధ్యక్షత వహించారు. వీరి నటనా కౌశల్యానికి భారత ప్రభుత్వం పద్మశ్రీ బిరుదునిచ్చింది. పద్మశ్రీ బిరుదుపొందిన నటులలో వీరే ప్రథములు. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ నిర్వహించిన నాటక సద

స్నుకు శ్రీ స్థానం అధ్యక్షత వహించారు. అకాడమీ వీరికి ఫెలోషిప్, నాటక కళా ప్రపూర్ణ బిరుదు ఇచ్చి గౌరవించింది. కేంద్ర సంగీత నాటక అకాడమీవారు వీరికి రాష్ట్రపతి పతకం ఇచ్చారు. ప్రస్తుతం హైదరాబాబు రేడియోలో నాటక ప్రయోక్తగా పనిచేస్తున్నారు.

బండా కనకలింగేశ్వరరావు :

జననం 1907. బి. ఏ. బి. యల్. ప్లీడరై కొన్నాళ్ళు న్యాయవాద వృత్తిని అవలంబించారు. 1939 లో మొదటిసారి 'కాలేజీ ఆఫ్ డ్రమెటిక్స్' స్థాపించారు. ముప్పది సంవత్సరాలకుపైగా ప్రభాత్ థియేటరు అనే పేర జీవిక నాటక సమాజం నడిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నాటక కళలో వీరికి గౌరవపట్టం బహూకరించింది. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ పొందారు. యూరప్ రాజ్యాలు, సోవియట్ రష్యా పర్యటించి నాట్యకళపైన వుపన్యాసాలిచ్చారు. కొంతకాలం భారతీయ నాట్యసంఘం ప్రాంతీయ కార్యదర్శి. వీరు నాటకాల్లో కృష్ణ, సారంగధరుడు, రాముడు, బిల్వమంగళుడు, కాళిదాసు మొదలైన పాత్రలను అద్వితీయంగా నటించి, పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. చలన చిత్ర రంగపు ప్రారంభదినాలలో 5 చిత్రాల్లో నటించారు. అనేక సంస్థలతో వీరికి సంబంధముంది. విజయవాడ రేడియోలో నాటకశాఖ ప్రొడ్యూసరుగా పని చేశారు. ఉత్తమ నటనకు 1963-64 లో రాష్ట్రపతి బహుమతి పొందారు. ఆంధ్ర నాటక కళాపరిషత్తు కార్యవర్గ సభ్యులుగాను, సంగీత నాటక అకాడమీ సభ్యులుగాను పనిచేశారు. ముఖ్యంగా కూచిపూటి నాట్యకళోద్ధరణకు విశేషంగా కృషి చేశారు.

సి. యస్. నటేశంగారు :

సి. యస్. నటేశంగారి కంపెనీ ఆంధ్రదేశంలోనే కాక, రాష్ట్రేతర ప్రాంతాలలోనూ, రంగూను మొదలైన దూరదేశ ప్రాంతాల్లోనూ సంచారం చేసింది. నటేశంగారు అభినవ ఆంజనేయుడుగా బిరుదు పొందారు. వీరు వీరాంజనేయోపాసకులు. వీరు ప్రదర్శించిన నాటకాలన్నీ భక్తిరస ప్రధానమైనవి. ముఖ్యంగా రామాయణ నాటకాలనే ప్రదర్శించేవారు. వీరి అభిమాన నాటకం లంకాదహనం. అందులో వీరిపాత్ర ఆంజనేయపాత్ర. రామాయణ నాటకాలలో ఆంజ

నేయ పాత్ర ఎక్కడ వచ్చినా ఆ పాత్ర వీరిదే ఆంజనేయ పాత్రను అతిభక్తి శ్రద్ధలతో పోషించాడాయన. ఈ పాత్రను చూచిన ప్రేక్షకులు ముగ్ధులైపోయేవారు. ఒకసారి మైసూరు మహారాజువారి సమక్షంలో లంకాదహనం నాటకం ప్రదర్శిస్తూ వుండగా నటేశంగారు ఆంజనేయ పాత్రలో రామ రామ రామసీతా అనే కీర్తన పాడుతూ రంగంలో ప్రవేశించినప్పుడు, భక్తిభావంలో తన్మయత్వాన్ని పొందిన ఒక పెద్ద కోతిగుంపులు పెట్టుపుటూ, రంగస్థలంమీద గంతులువేసి ప్రేక్షక స్థానాల మీదుగా పోయి అదృశ్యమైనవట. ఈ విచిత్రాన్నిచూచి మహారాజావారు పరమానందంతో నటేశంగారిని ఘనంగా సన్మానించారట. నటేశంగారు 80 దీర్ఘ సంవత్సరాలు జీవించి, ఆంజనేయోపాసన జేస్తూనే 1950 వ సంవత్సరంలో కీర్తిశేషులైనారు.

యడవల్లి సూర్యనారాయణ :

యడవల్లి శ్రీమంతుల కుటుంబంలో 1888 వ సంవత్సరంలో గుంటూరులో జన్మించారు. విద్యాభ్యాసం అక్కడే సాగింది. హరిప్రసాదరావు, బలిజేపల్లి



దుష్యంతుడు

గార్ల నటనా వైదుష్యంతో ఆకర్షింపబడి రంగస్థలిపై నటననుగురించి ఎన్నో విషయాలు నేర్చుకున్నారు. గుంటూరు నాటక రంగస్థలంలో యడవల్లి ఎప్పుడు ప్రవేశిస్తారా అని ప్రేక్షకులు ఎదురుచూచేవారు. ఆయన ఆంధ్రదేశంలోనే కాకుండా తమిళ, కన్నడ ప్రాంతాల్లో దిగ్విజయంగా నాటకాలు ప్రదర్శించారు. అఖండమైన కీర్తి గడించి సువర్ణపతకాలు, కంకణాలు బహూమతులుగా పొందారు.

విజయవాడ మైలవరం బాలభారతీ నాటక సమాజంలో 15 సంవత్సరాలు ప్రధాన పాత్రలు ధరించారు. గుంటూరులో హరిప్రసాదరావు తరువాత అంతటి ఉన్నతస్థానం అధిరోహించ గలిగిన వ్యక్తి శ్రీ యడవల్లి ఒక్కరే. కొంతకాలం ఏలూరు మోతేవారి సీతారామాంజ

నేయ నాటక సమాజంలో పనిచేశారు. సావిత్రిలో "సత్యవంతుడు". శకుంతలలో "దుష్యంతుడు", గయోపాఖ్యానంలో "అర్జునుడు", చిత్రనళీయంలో "నలుడు", "బాహుకుడు", వేణీసంహారం, ద్రౌపదీ వస్త్రాపహరణం, పాండవోద్యోగవిజయాలలో "దుర్యోధనుడు", పాదుకలో "శ్రీరాముడు", సారంగధరలో "సారంగధరుడు" మొదలైన పాత్రలు ధరించడంలో శ్రీ యడవల్లి చూపిన ప్రజ్ఞా ప్రాభవాలు అద్వితీయాలు. చలన చిత్రసీమలో ప్రవేశించి, పాదుకలో "రాముడు", శకుంతలలో "దుష్యంతుడు"గా పాత్రలు నిర్వహించారు. జీవించిన 52 సంవత్సరాలలో 35 సంవత్సరాలు నాటకరంగంలో పనిచేశారు.

పులిపాటి వెంకటేశ్వర్లు :

15-9-1900 సంవత్సరంలో తెనాలిలో జన్మించారు. 12 వ సంవత్సరంలోనే నాటకాలలో పాత్రలు ధరించడం ప్రారంభించారు. ఇప్పటికి దాదాపు 4 వేల నాటక ప్రదర్శనాలలో పాల్గొన్నారు. 50 సంవత్సరాలకు పైగా నాటకానుభవం సంపాదించారు. ఆయన అభిమానపాత్రలు రాయబారంలో "అర్జునుడు", హరిశ్చంద్రలో "నక్షత్రకుడు". చింతామణిలో "భవాని శంకరుడు", సారంగధరలో "సుబుద్ధి" ఇంకా సుదేవుడు, చెకుముకీశాస్త్రి, వెంగళరాయుడు, భరతుడు మొదలైనవి.

చలన చిత్రరంగంలో ప్రవేశించి "చింతామణి" "హరిశ్చంద్ర" "సారంగధర" "మోహినీ రుక్మాంగద" "తులసి" "చంద్రహాస" "చూడామణి" "తల్లిప్రేమ" "విష్ణుమాయ" మొదలైన చిత్రాలలో నటించారు. రాష్ట్రేతర ప్రాంతాలలో నాటకాలు ప్రదర్శించి సన్మానాలందుకున్నారు. "నటకిరీటి" "నటశేఖర" అని బిరుదులు పొందారు. ఆంధ్ర నాటక పరిషత్తులోనూ, సంగీత నాటక అకాడమీలోనూ సభ్యులుగా పనిచేశారు 1970 లో సంగీత నాటక అకాడమీ "ఫెలోషిప్"ను బిరుదుగా ఇచ్చి సన్మానించింది. ఆంధ్రదేశంలో అనేకచోట్ల సన్మానాలు జరిగాయి. పత్రికలలో వ్యాసాలువ్రాసి నాటక కళకు ఇతోధికంగా సేవ చేశారు.

దైతా గోపాలం :

కృష్ణాజిల్లా శ్రీకాకుళం వాస్తవ్యులు గోపాలంగారు. మైలవరం కంపెనీలో ఎన్నో రసవత్తరమైన పాత్రలను ధరించారు. భావయుక్తంగా పాడగల నేర్పు వీరిది. భక్తిరస ప్రధానమైన పాత్రలను అద్భుతంగా పోషించేవారు. ద్రౌపదీ

వస్త్రాపహరణ నాటకంలో విదురపాత్రను ధరించి ఆ పాత్రను జీవంపోశారు. వీరు తుంగల చలపతిరావుతో కలిసి సతీ సక్కుబాయి నాటకాన్ని రసవత్తరంగా తయారుచేసి, దానికి దర్శకత్వం వహించి, పాటలు వ్రాసి, ఆ పాటలకు బాణీలను కూర్చి, ఆంధ్రదేశమంతటా పర్యటించి, అఖండమైన పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. సక్కుబాయిలో ఆయన ధరించిన శివయోగి పాత్ర ఎనాటికి మరువ తగిందికాదు. అనేకమందికి తర్ఫీదునివ్వడంలో దిట్ట. అలా తయారుచేసినవారిలో ఈనాటి చలనచిత్ర సంగీతదర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావుగారు ముఖ్యులు. గోపాలంగారు చలనచిత్రరంగంలో కూడా చాలారోజులు పనిచేశారు.

## అద్దంకి శ్రీరామమూర్తి:

అభిజ్ఞానశాకుంతలంలో కణ్వమహర్షిగా, హరిశ్చంద్రలో హరిశ్చంద్రుడుగా, వీరబాహుడుగా, పాములిలో దశరథుడుగా, కురుక్షేత్రంలో ధర్మరాజుగా నటించి అఖండమైన పేరుప్రఖ్యాతులు సంపాదించుకున్న సుప్రసిద్ధ రంగస్థల చలనచిత్రనటుడు. సంగీత విద్వాన్ అద్దంకి శ్రీరామమూర్తిగారు. 1911 వ సంవత్సరంలో గయోపాఖ్యాన నాటకంలో సహదేవుని పాత్ర ధరించి, ఆనాడే తమ నటజీవితానికి బీజాలు వేసుకున్నారు ఆయన. కొంతకాలం బుద్ధ బాలభారత సంఘం, ప్లేటోస్ బాలభారతి, ఏలూరు సీతారామాంజనేయ నాటకసమాజాల్లో ఉద్దండులైన నటులతో నటించారు. ఆయన అనేక గ్రామఫోనురికార్డుల నిచ్చారు. ఆయన సంగీత విద్వత్తు అద్వితీయమైంది. నాటకరంగంనుంచి సినిమారంగంలో ప్రవేశించి 25 చిత్రాల్లో నటించారు. ఆయన అనేకసభల్లో సువర్ణఘంటాకంకణా



లను అందుకున్నారు. ఆయన అభిమానపాత్రలు పాదుకలో దశరథుడు-శకుంతలలో కణ్వమహర్షి - పాండవోద్యోగ విజయాలలో ధర్మరాజు మొదలైనవి ఆయన ప్రజ్ఞావంతుడిని నిరూపించాయి. ప్రజ్ఞావంతుడు కావడంవల్లనే 50 సంవత్సరాలు నాటకరంగంలో స్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నారు.

పంచాంగం రామానుజాచార్యులు :

బుదరు బాలభారతసంఘంలో చేరి శిక్షణపొంది, పేరెన్నికగన్న పంచాంగం రామానుజాచారి స్ఫురద్రూపి, సుందరమైన తన విగ్రహంతో ఏపాత్ర ధరించినా ప్రేక్షకులను ఇట్టే ఆకర్షించేవారు. నాటకాలలో నాయకీ నాయక పాత్రలు రెంటినీ అభినయించారు. శాస్త్రీయసంగీతాన్ని కట్టుబిట్టంగా నేర్చుకుని రంగస్థల నాటకాల సంగీత మెళుకువలు తెలుసుకుని పద్యభావాన్ని రసాన్వితంగా వెలువరించేవారు. పతివ్రతలైన సీత, సావిత్రి, దమయంతి, రుక్మిణి పాత్ర లనేకాక, సత్యభామ, చింతామణి, చిత్రాంగి, కైక, కమల మొదలైన వగలమారి పాత్రలను కూడా నటించేవారు. రాముడు, కృష్ణుడు, నలుడు మొదలైన ఉదాత్త కథానాయకపాత్రల్ని ధరించేవారు. కొంతకాలం ఏలూరు మోతేనారాయణరావుగారి సీతారామాంజనేయ నాటక సమాజంలోనూ, అనేక వృత్తినాటకసమాజలలోనూ, పాత్రలు ధరించి ప్రజామన్ననల నందుకున్నారు.

డి. వి. సుబ్బారావు :

ఆంధ్రదేశంలో ఇండియన్ డ్రమెటిక్ కంపెనీ అనేక నాటక సమా జాలకూ, నటులకూ, క్రమశిక్షణలో మార్గదర్శకంగా వుంటూ తెలుగు నాటక రంగ స్థలికి గౌరవప్రతిష్ఠలు సంపాదించింది. ఆ సంస్థను నిర్వహించిన మహనీయులు దేవరకొండ వెంకట సుబ్బారావుగారు. సామాన్య కుటుంబంలో జన్మించారు. కొంతకాలం ప్లీడరు గుమస్తా వుద్యోగం చేశారు. బందరు భువనరంజనీ థియే టరులో వివిధ పాత్రల్ని ధరించారు. ప్రథమంగా ఆయన సంస్థ నిర్వహించిన నాటకం గులేబకావళి, కృష్ణలీల నాటకంలో ఒక్కొక్కసారి యశోదగా, కంసు డుగా, వసుదేవుడుగా చిన్న పాత్రలు నిర్వహిస్తూ వుండేవారు. అదేవిధంగా లవకుశలలో రాముడు, లక్ష్మణుడు, సారంగధరలో సారంగధరుడు, నారాజు నాట కంలో విశ్వపతి, తిమ్మరుసు పాత్రల్ని ప్రతిభావంతంగా పోషించారు. అయితే ఆయనకు అసమానకీర్తిగడించిపెట్టిన పాత్ర హరిశ్చంద్ర. 1917 లో గుంటూరు హరిశ్చంద్ర నాటక పోటీల్లో ప్రథమ బహుమతి అందుకున్నారు. 36 సంవత్సరాలు ఆయన కంపెనీని క్రమశిక్షణతో నడిపారు. నెల జీతాలమీద నటుల్ని పోషించారు. అనుకున్న సమయానికి నాటకం ప్రారంభించేవారు.

ప్రాంప్టర్ ఆయన నాటకంలో వుండేవాడు కాదు. హిందీ నాటకాలను కూడ ప్రదర్శించారు. నాటక కళనూ, జీవితాన్నీ సయన్వయించి, 40 సంవత్సరాల కాలం ఆయన నాటక రంగ సేవ చేశారు. ఆయన 54 పాత్రలు ధరించి నటుడుగా అఖండమైన కీర్తి గడించారు.

### ఉప్పులూరి సంజీవరావు :

సంజీవరావుగారు మైలవరం బాలభారతీ నాటక సమాజంద్వారా అఖిలాంధ్ర దేశంలో పేరు సంపాదించారు. ప్రధమంగా బంచరులో డి. వి. సుబ్బారావుగారి నాటకాల్లో పాత్రలు ధరిచేవారు. సంజీవరావు గారి కంఠం మృదుమధురమైన కోకిలకంఠం. చిత్రాంగి మోహిని మొదలైన శృంగార పాత్రల నభినయించడంలో అందెవేసిన చెయ్యి. మైలవరం వారి సావిత్రి నాటకంలో సావిత్రి పాత్ర సంజీవరావుగారికి ఎక్కువ పేరు తెచ్చిపెట్టింది. ఈ మైలవరం కంపెనీవారి సావిత్రి నాటకమంటే మూడురోజులు ముందుగానే టిక్కట్లన్నీ అయిపోయేవి. యడవల్లి సూర్యనారాయణ దుష్యంతుడైతే, సంజీవరావు గారు శకుంతల పాత్రను ధరించేవారు.



సత్యభామ

సావిత్రి, దమయంతి, చంద్రమతి మొదలైన సాత్విక ప్రధానమైన పాత్రలనుకూడా అద్భుతంగా నటించేవారు. కట్టులో, బొట్టులో, నడకలో, వద్దికలో స్త్రీలను మరపించేవారు సంజీవరావుగారు.

### రంగమార్తాండ, కపిలవాయి రామనాధశాస్త్రి :

ఆంధ్రనాటకరంగంలో ఒక దశాబ్దంపాటు ఉజ్వలతారగా ప్రకాశించిన రామనాధశాస్త్రిగారి గాత్రం అతిగంభీరమైంది. మధురమైనది. శ్రావ్యమైనది. పద్యాన్ని భావయుక్తంగా విరిచి పాడగలిగిన ఒక ప్రత్యేక విధానాన్ని ప్రవేశపెట్టిన ప్రజ్ఞాశాలి ఆయన. రామనాధశాస్త్రిగారు ప్రసిద్ధ నటుడుగా పేరు తెచ్చుకున్న సమాజం మైలవరం

బాలభారతి. ఆ సమాజంలోనే ఆయన గయోపాఖ్యానంలో అర్జునుడు. పాము కలో రాముడు, భరతుడు. సావిత్రిలో సత్యవంతుడు. తులాభారంలో నారదుడు. విప్రనారాయణలో విప్రనారాయణుడు మొదలైన పాత్రలను అద్భుతంగా నటించి ప్రసిద్ధినటు డనిపించుకున్నారు. ఆనాడు ఆయ నిచ్చినన్ని గ్రామఫోను రికార్డులు మరేనటుడూ ఇవ్వలేదు. ప్రఖ్యాతి వహించిన ఆయన రికార్డుల్లో, "స్థిరమైన నడ వడీ జనులకందరకు" "సర్వేశ్వరుండగు శౌరి కింకరుజేయు" "సీతాపరాజాత" మొద లైన పద్యాలు, కోరీభజింతున్ గోవిందున్ మది. ఏదీగతీ నాకు. నమస్తే నా ప్రాణనాథా మొదలైన పాటలు బహుజనాదరణను పొందాయి. పైలవరం బాల భారతిలో యడవల్లివారి తరువాత అంతటి స్థానాన్ని సంపాదించగలిగినవారు శాస్త్రి గారే. ఆయన పాటపాడేకాక వాచికాభినయంలో ప్రత్యేకపద్ధతిని అనుసరించారు. అనతికాలంలోనే ఆంధ్రదేశమంతటా పేరు ప్రఖ్యాతుల్ని సంపాదించుకున్న శాస్త్రి గారు 1935 సంవత్సరం మే నెలలో కీర్తిశేషులయ్యారు.

### డాక్టరు గరికిపాటి రాజారావు:

ఆంధ్ర నాటకరంగంలో ఆంధ్ర ప్రజా నాట్యమండలి ద్వారా వెలుగులో వచ్చిన కళాకారుడు గరికిపాటి రాజారావు. వైద్యవృత్తినీ, కళాప్రావీణ్యాన్ని ప్రజలసేవకే అంకితంచేసిన పుత్రమిత్రుడు. ఆయన వైద్యవృత్తిలో క్వాలిఫైడ్గాలో స్థిరపడి ఆంధ్ర ప్రజా నాట్యమండలి ఆర్గనైజింగ్ సెక్రటరీగా నిర్వహించి రాష్ట్ర ప్రజా నాట్యమండలిని ఏర్పాటు చేశారు. ఆ పనికానీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా, కార్యదర్శిగా, డైరెక్టరుగా పనిచేశారు. ప్రజానాట్యమండలి కార్యకలాపాల ద్వారా చైతన్యవంతులుగా చేయడానికి ఒక నూతన వుత్సాహాన్నిచ్చారు. ప్రజా నాట్యమండలిలో 1948 వరకూ విరామంలేకుండా పనిచేశారు. ప్రజా నాట్యమండలి సందేశాన్ని రాష్ట్రేతర ప్రాంతాలకూ తీసుకుపోయి, తెలంగాణుల ఔన్నత్యాన్ని చాటారు. రచయితగా నాటకాలు వ్రాశారు. ప్రజా నాట్యమండలి నాటకాలలో పాత్రలు ధరించారు. ఆయన మంచి నర్తకుడు. ప్రజల నుత్తేజపర్చే అద్భుత నృత్యాలను చేసేవారు. డాక్టరుగా ప్రజలకు ఉచితవైద్యం చేశారు. ఆయన కొంతకాలం రాజమండ్రిలో వైద్యవృత్తిలో వుంటూ రాఘవ కళానిలయం స్థాపించి, ఆదర్శంగా నాటకాలాడారు. భయం నాటకాన్ని ఢిల్లీలో ప్రదర్శించి, అంతర్జాతీయ ప్రసంశలను అందుకున్నారు. నటనలోనూ దర్శకత్వంలోనూ నాటకప్రయోగంలో, రంగప్రక్రియల ద్వారా, నాటక రంగస్థలాన్ని ప్రజల కత్యంత సన్నిహితంగా తీసుకుపోయారు. ఆయన అఖిల భారత ప్రజా నాట్యమండలి కార్యవర్గ సభ్యులుగా పనిచేశారు, సినిమారంగంలో ప్రవేశించి, పుట్టిల్లు చిత్రం నిర్మించి, తద్వారా అభ్యుదయ భావాలను ప్రవేశపెట్టారు.

ఆ చిత్రం అపజయం పొందడంతో, తిరిగి రాజమండ్రి వెళ్ళిపోయి, తిరిగి నాటక ప్రదర్శనాలను సాగించారు. బలరాజ్ సహానీని ఆహ్వానించి రాజమండ్రిలో, ఆంధ్ర థియేటర్స్ ప్రెజెంటేషన్ మహాసభ జరిపారు. తరువాత తిరిగి మద్రాసు వచ్చి చిత్ర నిర్మాణం సాగించారు. కాని అది కొనసాగలేదు. ఆ సమయంలో అల్లూరి సీతారామ రాజు-జైభవాని నాటకాలను ఆంధ్రదేశంలో ప్రదర్శించారు. వీరి చలనచిత్ర రంగంలో ప్రవేశాన్ని ప్రముఖ, టి. చలపతిరావు, పి. మోహన్‌రాజు, మేకప్ కుమార్, [illegible] వేణుగోపాల్, పసూరి దేవక, పల్లిపాటి బుచ్చిబాబు కేతా, అల్లు రామలింగయ్య, సావిత్రి, రాజబాబు, కృష్ణ, రాజశ్రీ, కె. ఎ. చలం, రాజబాబు మినహా ఇతరులంతా రాజారావుగారి ప్రవేశపెట్టినవారే, జీవితాంతం నాగేశ్వరరావు వీరి ప్రతిభను గుర్తించి వీరి నాటక రంగానికి సేవలకే, 40 సంవత్సరాల వయసులో మద్రాసులో మరణించారు.

గోపీ [illegible] చిరంజీవి పాత్రలు:

ప్రముఖ పాత్రలు పోషించినా, గంభీరమైన విగ్రహం, సుందర రూపం, మంచి వక్త, [illegible] తో, మధురమైన కంఠస్వరంతో పద్యాలను రంజింపజేసేవారు. తండ్రి వారసత్వంగా, యాదృచ్ఛికంగా, వాటిగా, దర్జాగా మిసాలు వచ్చినంతవరకూ, 61 సంవత్సరాలు జీవించారు. ఆయన ఎక్కడ ఎన్నడు చిరంజీవి అయ్యారో, ఆయన నాటకాలు తప్పకుండా ఆయా తెలుగు రాష్ట్రాలలో [illegible] లో, పౌరాణిక నాటకంలో, పౌరాణిక పాత్రలు ఎక్కువగా ధరించేవారు. అదే విధంగా ఒక్క సాంఘికాలలో నాటకంలో గిరీశం, సూత్రధారుడు, పుచ్చా గ్రామ పంతులు, బుచ్చిబాబు, వీరబ్రహ్మశాస్త్రి, పోలేకేసి, లసిరిగాడు ఇట్టి పాత్రల్ని, అద్భుతంగా నిర్వహించేవారు. కాని ఎక్కువ పేరు తెచ్చుకున్న పాత్ర గిరీశం. తరువాత రాణించిన పాత్ర ప్రతాపరుద్రీయంలో యుగంధరుడు. ఆయన ఆంధ్రనాటకరంగంలో ప్రముఖ నటుడనిపించుకున్నారు. తెనాలిలో వైద్య



పిచ్చివాడు

వృత్తి జోరుగా సాగుతూవుండేరోజుల్లో సినిమారంగంలో ప్రవేశించి, మాయాపిల్లలో సుందరరామశాస్త్రి పాత్రను అద్భుతంగా నటించి పేరు తెచ్చుకున్నారు. ఆతరువాత షావుకారులో చంగయ్య, బాలనాగమ్మలో మాయాలమరాఠి పాత్రలకు కొత్తరూపం సంతరించారు. గుణసుందరి కథ - ధర్మాంగద-ముగ్గురు మనాటీలు-మాయలోకం - పల్నాటియుద్ధం - శాంతి-కన్యాశుల్కం చిత్రాలు ఆయనకు వన్నె తెచ్చాయి. ఆయన 1959 అక్టోబరు 29 న మద్రాసులో నిర్యాణం చెందారు.

గురజనాయుడు :

ఆంధ్ర నాటకరంగంలో మైలవరం బాలభారతి నాటక సమాజం అసమానమైన పేరు ప్రతిష్టల్ని గడించుకున్నది. ఉప్పలూరి సంజీవరావు సావిత్రిగాను, యడవల్లి సూర్యనారాయణ సత్యవంతుడుగాను నటించే సావిత్రి నాటకంలో గూడపాటి నరసింహారావు నాయుడనే ఆనాటి గురజనాయుడు యమధర్మరాజు పాత్రను ధరించేవారు. ఈనాటికీ యమునిపాత్రలో గురజనాయుడుకు సాటి మరొకరు లేరనడంలో అతియోక్తి లేదు. కృష్ణాజిల్లా గుడివాడ తాలూకా గురజలో జన్మించడం వల్ల ఆయనకు గురజనాయుడనే పేరు వచ్చింది. ఆయన బందరు రామమోహన థియేటరులో వివిధ పాత్రలు ధరించి, 1917 లో మైలవరం బాలభారతిలో ప్రవేశించి, 1928 వరకూ అఖండమైన పేరు ప్రఖ్యాతులు సంపాదించి, అదే నాటకాలలో నటిస్తూ పరమపదించారు. ఆజానబాహువైన విగ్రహం, ఆరు అడుగులఎత్తు, నిండైన అంగసౌష్ఠవంతో, బుగ్గమీసాలతో, అతి గంభీరంగా కనిపించేవారు. ఆయన గొంతు నిండైనది. పాటలు, పద్యాలు మందరస్థాయిలో గంభీరంగా పాడేవారు. సావిత్రిలో యముడు, ప్రహ్లాదలో హిరణ్యకశిపుడు, కృష్ణలీలలో కంసుడు, కనకతారలో క్రూరసేనుడు మొదలైన భీకరపాత్రలతోపాటు, దశరథుడు, ధర్మరాజు మొదలైన సాత్వికపాత్రలనుకూడ ప్రశంసనీయంగా నటించేవారు.

మాధవపెద్ది వెంకటరామయ్య :

తెనాలి రామవిలాస సభకు చెందిన మాధవపెద్ది వెంకటరామయ్య, గుంటూరు జిల్లా బ్రాహ్మణకోడూరులో జన్మించారు. రామవిలాస సభలో చేరి చిన్నాపెద్దా



దుర్యోధనుడు

అనుకోకుండా అన్నిపాత్రలూ ధరించారు. ఏపాత్ర తీసుకున్నా భావయుక్తంగా నటించేవాడు. పాటకు ప్రాముఖ్యమివ్వకి పదాలను విడగొట్టి, ఒకిసారికి రెండుసార్లు తరచి తరచి ప్రేక్షకులకు అర్థమయ్యే రీతిలో పద్యాన్ని పాడి ప్రేక్షకుల మన్ననలు పొందేవారు. ప్రతిపాత్రకూ ఏదో ఒక ప్రత్యేక వ్యక్తిత్వాన్ని, సహజత్వాన్ని సృష్టించేవారు. వీరు ప్రతాపరుద్రీయం, పాండవోద్యోగం, పాండవ విజయం, కురుక్షేత్రం, బొబ్బిర్యుద్ధం, రోషనార, ఖాజి, షోరాబు రుస్తుం మొదలైన నాటకాల్లో బొబ్బిలిలో రంగారాయుడుగా, ప్రతాపరుద్రీయంలో ప్రతాపరుద్రుడు, విక్టోరియాగా, షోరాబురుస్తుంలో షోరాబుగా ప్రజాహృదయాలను చూరగొన్నారు, ముఖ్యంగా వీరపాత్రల్లో ప్రఖ్యాతి పొందిన పాత్ర దుర్యోధనుడు.

కేవలం ఆర్థికదృష్టికాక, కళాదృష్టితో నాటక కళకు సేవచేశారు. కళాపరిషత్తు సభలకు అనేకపర్యాయాలు హాజరయ్యారు. 60 సంవత్సరాల వరకూ వ్యాయామం చేస్తూవుండేవారు. కళాశీలి, పరోపకారిపరాయణుడు. అమృతహృదయుడైన వెంకటరామయ్యగారు 1957 మార్చి 19 వ తేదీన మనలను వదలి వెళ్ళిపోయారు.

### వేమూరు గగ్గయ్య :

గుంటూరుజిల్లా తెనాలి తాలూకా వేమూరు గ్రామంలో 1895 సంవత్సరం మే 15 వ తేదీని జన్మించారు. చిన్నతనంలోనే సురభి నాట్యమండలిలో చేరి నాటకాల్లో వేషాలు వేశారు. కొంతకాలం రంగూన్‌లో వుండి నాటకాల్లో వేషాలువేశారు. తరువాత తెనాలి ఫస్టు కంపెనీలో చేరారు. ఆతరువాత మైలవరం థియేటరులోనూ, మహానందరెడ్డి కంపెనీలోనూ వుండి ముఖ్యపాత్రలు ధరించారు. ఆరోజుల్లోనే గ్రామఫోను రికార్డులద్వారా ఆయన కంచుకంఠం ఆంధ్రదేశమంతటా ప్రచారమైంది. తరువాత చలనచిత్రరంగంలో ప్రవేశించారు. మొదటిచిత్రం సతీసావిత్రిలో యమధర్మరాజు పాత్రను ధరించారు. తరువాత కృష్ణలీలలో "కంసుడు", సతీతులసిలో

"జలంధరుడు", జరాసంధలో, "జరాసంధుడు", మార్కండేయలో "యముడు", ద్రౌపదీ వస్త్రాపహరణంలో "శిశుపాలుడు", దక్షయజ్ఞంలోదక్షుడు, మైరావణలో "మైరావణుడు", ప్రహ్లాదలో హిరణ్యకశివుడు, సీతారామ జననంలో"రావణుడు" మొదలైన పాత్రల్ని అద్భుతంగా నటించి ఆంధ్రప్రజల హృదయాల్లో శాశ్వత స్థానాన్ని ఏర్పరచుకున్నారు. గగ్గయ్య పేరు వినగానే ధిక్కారమును సైతునా అన్నపాట జ్ఞాపకానికి వస్తుంది. గగ్గయ్యగారి గంభీర, రౌద్రగీతాలు ఆంధ్రదేశ మంతా మారుమ్రోగాయి. రసానుభూతిని అనుభవిస్తూ, పద్యాలు, పాటలు పాడే వారు. రౌద్రపాత్రల్లో ఆనాడు ఆయనను మించినవారు మరొకరు లేరు. రంగస్థల నటుడుగా, సినీనటుగా ప్రఖ్యాతి నార్జించిన గగ్గయ్యగారు కాన్సర్‌వ్యాధితో 1955 డిసెంబరు 30 వ తేదీన కన్ను మూశారు.

### వెంపటి వెంకటేశ్వర్లు :

బందరు వాస్తవ్యులైన వెంపటి వెంకటేశ్వర్లుగారు నేషనల్ థియేటరనే బుట్టయ్యపేట కంపెనీలో నటుడుగా పైకొచ్చారు. వీరు ఈవెన లక్ష్మణస్వామిగారి శిష్యులు. రాజవేషధారణలో పేరు సంపాదించు కున్నారు. స్వశక్తితో నటు డనిపించుకున్న వ్యక్తి. చిత్రనళీయం నాటక పోటీలలో నలుని పాత్రను అద్వితీయంగా నటించి బంగారు పత కాన్ని పారితోషికంగా పొందారు. రసపుత్ర విజయ నాటకంలో దుర్గాదాసు పాత్రను సమర్థ వంతంగా అభినయించేవారు. ముంజులూరి, డి. వి. సుబ్బారావుగార్లతో సమకాలిక నటుడుగా వర్ధిల్లారు. లక్ష్మణస్వామిగారు చనిపోయిన తరు వాత పీష్వా నారాయణరావు వధ నాటకంలో సుమేరుసింగ్ పాత్రను ధరించి, లక్ష్మణస్వామి గారి పేరును నిలబెట్టారు. ప్రతాపరుద్రీయ నాట కంలో విద్యానాథపాత్రను అత్యద్భుత చాక చక్యంతో స్వభావసిద్ధంగా అభినయించి ప్రజల నీరాజనాలను అందుకున్నారు. వీరు పెద్దవిద్యావంతులు కాదు. ప్లీడరుగుమాస్తా ఉద్యోగం చేసుకుంటూ, నాటకాలపై



నలుడు

చేశారు. అనాడు బందరు నాటకరంగ ప్రముఖనటులలో వెంకటేశ్వర్లుగారుకూడా ఒకరు.

ఘంటసాల రాధాకృష్ణయ్య :

ఘంటసాల రాధాకృష్ణయ్యగారు నెల్లూరు సుగుణవిలాస సభకు చెందిన నటులు. కబీరు పాత్రధారణలో పర్వతరెడ్డి రామచంద్రారెడ్డి తరువాత అంతటి పేరును గడించినవారు. ముఖ్యంగా వీరి కబీరుపాత్ర ప్రేక్షకుల్ని భక్తి పార వశ్యంలో ముంచేది. కబీరు పాత్రలో వీరి అంగసౌష్టవం, వేషధారణ ప్రేక్షకులను ఆకర్షించేది. కబీరు పాటల్లో అద్భుతమైన రాగాలాపన చేసి ప్రేక్షకులను రసానంద డోలికల్లో ముంచేవారు. వీరు ఎన్ని పాత్రలు ధరించినా అన్ని పాత్రల్లోకీ మకుటాయమానమైనది కబీరు పాత్ర మాత్రమే.

వెదురుమూతి శేషగిరిరావు :

కాకినాడ నాటకరంగంలో వెదురుమూతి శేషగిరిరావుగారు నటుడుగా, రచయితగా వెలుగొందారు. కాకినాడలో సంగీత కళాభ్యాయి స్థాపించిన నాటక సమాజంలో పాత్రలు ధరించడమే గాక, హిందీ, తెలుగు భాషల్లో నాటకాలు వ్రాసి ప్రధాన పాత్రలు ధరించేవారు. 1900-1906 ప్రాంతంలో ఆంధ్రదేశ మంతటా సంచారంచేసి, అభినయ చాతుర్యంతో ప్రసిద్ధ నటుడుగా వెలుగొందారు. వీరి అభినయస్థాయి విద్వాంసులను, విమర్శకులను ముగ్ధులను చేసేటంత గొప్పగా, గంభీరంగా వుండేది.

నేలనూతుల రామకృష్ణయ్య :

నెల్లూరు ఆంధ్రసభకు చెందిన నేలనూతుల రామకృష్ణయ్య నెల్లూరు నాటకరంగంలో ప్రముఖ నటుడుగా వెలుగొందారు. శ్రీకృష్ణ తులాభారంలో కృష్ణుడు, నారదుడు, భరతుడు మొదలైన పాత్రలను సమర్థనీయంగా నటించేవారు. వీరికి ఎక్కువపేరు గడించిపెట్టిన పాత్ర నారద పాత్ర. ఆ పాత్రకు కాలసిన ఆట, పాటలో మేటి రామకృష్ణయ్యగారు.

అంకరాజు రామారావు :

రాజమహేంద్రవర నాటకరంగంలో ప్రముఖ నటుడుగా వెలుగొందిన అంకరాజు రామారావు ఎమెచ్యూర్ కంపెనీలో శ్రీపాద కామేశ్వర రావుగారి పర్య

వేషణలో అభినయ కళను ఆకళింపు చేసుకుని వుత్తమ నటుడుగా పేరు తెచ్చుకున్నారు. వీరు నటించిన పాత్రల్లో చిత్రనళీయంలోని నలుని పాత్ర ప్రత్యేకతను సంతరించుకున్నది. దమయంతి పమిటెకొంగు చించుకొని పోవునప్పుడు వీరి అభినయము, భావగంభీరత ప్రేక్షకులను ముగ్ధుల్ని చేసేదట.

పర్వతరెడ్డి రామచంద్రారెడ్డి :

కొందరు నటులు అనేక పాత్రలను ధరించి తద్వారా గొప్ప నటులనిపించుకుంటారు. మరి కొందరు నటులు ఒకే పాత్రతో తారాపథాన్నందుకుంటారు. అటువంటి వారిలో పర్వత రెడ్డి రామచంద్రా రెడ్డిగారొకరు. నెల్లూరు జిల్లా అల్లూరు వాస్తవ్యులైన రామచంద్రా రెడ్డిగారు శ్రీ కృష్ణవిలాస సభను స్థాపించి, నెల్లూరు నాటక రంగంతో సరిసమానంగా నాటకాలను ప్రదర్శించడమే కాక, రామదాసు నాటకాన్ని ఆంధ్ర దేశమంతటా ప్రదర్శించి, కబీరు పాత్రలో జీవించి, అభినవ కబీరని కీర్తించబడ్డారు. బళ్ళారి రాఘవాచార్యులుగారు రామదాసు పాత్రను, రెడ్డిగారు



కబీరు

కబీరు పాత్రను ధరించి పలుతావుల్లో రామదాసు నాటకాన్ని సమర్థనీయంగా నటించారు. కబీరు పాత్రకు కావలసిన అంగసౌష్ఠవం, సాత్విక ప్రధానమైన నమ్రత, స్వచ్ఛమైన ఉరుము ఉచ్చారణ, తన్మయత్వాన్ని కలిగించే సంగీత మాధుర్యం ఆయనకు పెట్టిన సొమ్ములు. కొంతమంచి నటులు ఎన్నో పాత్రలు ధరించినప్పటికీ నటులుగా ప్రఖ్యాతి వహించలేక పోయారు. కాని రామచంద్రా రెడ్డిగారు ఒక్క-కబీరు పాత్రతోనే ఆంధ్ర నాటకరంగంలో ప్రసిద్ధ నటుడుగా ప్రఖ్యాతి వహించారు.

### ఈవెన లక్ష్మణస్వామి:

లక్ష్మణస్వామిగారు కృష్ణాజిల్లా బందరు వాస్తవ్యులు. వీరు 1884 సంవత్సరంలో బందరులో నేషనల్ థియేటరును స్థాపించి హిందీలో స్వయంగా నాటకాలను రచించి ప్రదర్శిస్తూ వుండేవారు. పీష్వా నారాయణరావు వధ హిందీ నాటకంలో షుమేరు సింగుపాత్రను, బొబ్బిలిలో "హైదరుజంగ్", శివాజి నాటకంలో శివాజి, రామరాజు నాటకంలో పఠాను మొదలైన పాత్రల్ని అద్భుతంగా పోషించేవారు. ఒకసారి శివాజి పాత్రాభినయంలో బిపిన్ చంద్రపాల్‌గారి ప్రశంసలనుకూడా అందుకున్నారు. భావ ప్రకటన చేయడంలో అందెవేసిన చెయ్యి. గంభీరమైన విగ్రహం, వివిధభావాలను వివరించగల సుందరమైన ముఖారవిందం, క్రోధాన్ని, శాంతాన్ని సమపాళ్ళతో నటించగల ప్రతిభాశాలి. స్ఫుటమైన ఉచ్చారణ గలవారు. పాటలో ప్రతిభావంతుడు కాకపోయినప్పటికీ, వాచికాభినయనంతోనూ, సాత్వికాభినయంతోనూ, తీపిగా భావప్రకటన చేయగలిగిన ఉత్తమ నటుడు. వీరు హిందీ నాటక పాత్రాభినయంలో పూనా సమాజ నటుల స్థాయిని మించిపోయారు. ఆంధ్రదేశంలోనేకాక, అఖిల భారతదేశంలోకూడ ప్రముఖనటుడుగా పేరుతెచ్చుకున్న లక్ష్మణస్వామిగారు ఆంధ్ర నాటకరంగానికి బహుముఖాల సేవచేశారు.

### హరిప్రసాదరావు:

కూచిపూడి భాగవతుల వంశమునకు చెందినవారు హరిప్రసాదరావుగారు. వీరు వెలనాటి బ్రాహ్మణులు. వీరి నివాసస్థానం గుంటూరు, మెట్రిక్యులేషన్ వరకు చదువుకున్నారు. కొంతకాలం టెలిగ్రాఫ్ పిగ్మలర్ ఉద్యోగాన్ని, మరికొంతకాలం గుంటూరుజిల్లా కోర్టులో కాపియిస్టు ఉద్యోగాన్ని చేశారు. 1882 - 84 సంవత్సరాలలో గుంటూరులో స్థాపించబడిన ఫస్టు కంపెనీ నాటకాలలో ప్రధానపాత్రలు ధరిస్తూ వుండేవారు.

ప్రసాదరావుగారు వేణీసంహారం నాటకంలో దుర్యోధనుడు, చిత్రనళీయంలో నల, బాహుక పాత్రలు, హరిశ్చంద్రలో హరిశ్చంద్ర పాత్రను, సారంగధరలో సారంగధరుని పాత్రను, చంద్రహాసలో చంద్రహాసుని పాత్రను, శకుంతల నాటకంలో దుష్యంతుడు మొదలైన పాత్రలను అద్వితీయంగా పోషిస్తూ వుండేవారు. నట పితామహ అనే బిరుదును పొందారు. హరిశ్చంద్ర, దుష్యంత మొద

లైన ధీరోదాత్త పాత్రలను అఖండంగా అభినయించేవారు. పద్యపఠనంలో, నటనా వైదుష్యంలో సాటిలేని మేటినటుడు హరిప్రసాదరావు. ఆయన నిగర్వి. సాటి నటుల గొప్పదనాన్ని మెచ్చుకుని వారి నుత్సాహపర్చేవారు. 60 సంవత్సరాల వయస్సులో కూడా ఎంతో ఉత్తేజంగా పాత్రల నభినయిస్తూ వుండేవారు. ఆంధ్ర నాటక రంగంలో అఖండమైన పేరుప్రతిష్ఠ లార్జించిన హరిప్రసాదరావు 1936 అక్టోబరు 7 వ తేదీన స్వర్గస్థులయారు.

ముప్పిడి జగ్గరాజు :

రాజమండ్రి నాటక రంగంలో, స్త్రీ పాత్రధారణలో నిరుపమానమైన పేరు ప్రతిష్టలను గడించుకున్నారు. రాజమహేంద్రవరంలో మానేపల్లి కంపెనీ అని పిలువబడే నేషనల్ థియేటరు నాటకాలలో అంబడిపూడి కోటయ్యగారి ప్రక్కన చంద్రమతి, దమయంతి మొదలైన స్త్రీపాత్రలు ధరించి అభిలాంధ్రదేశంలో పేరు గడించుకున్నారు. కొంతకాలం విశాఖపట్టణం ఆంధ్ర అమెచ్యూర్ నాటక సంస్థలో పార్థీ నారాయణరావుగారి ప్రక్కన కూడ స్త్రీపాత్రలను ధరించారు. వీరు స్త్రీ పాత్రధారణలో చక్కని వద్దికలనూ, లావణ్యాన్నీ, పాతివ్రత్య లక్షణాలను ముచ్చటగా ఒప్పించేవారు. రంగస్థలంలో వున్నంతసేపూ ప్రేక్షకులకు స్త్రీయా, పురుషుడా అనేటంత ఆశ్చర్యాన్ని కలిగించేవారు. ముఖ్యంగా తీవిగా, మృదుమధురమైన గాత్రంతో, చతుర్విధ అభినయాలనూ అత్యద్భుతంగా ప్రదర్శించేవారు. స్త్రీ పాత్రధారణలో ఆనాడు ఆయనకు ఆయనే సాటి.



స్త్రీ పాత్ర

ముంజులూరి కృష్ణారావు :

కృష్ణారావుగారి జన్మస్థలం కృష్ణాజిల్లా బందరు. ఈయనకు నాటక కళంటే

పంచప్రాణాలు. కాలాన్నంతా నాటకమందిరంలోనే గడిపేవారట. ప్రారంభంలో బందరు రాయల్ థియేటర్‌లో చిలకమర్తివారి గయోపాఖ్యానంలోనూ, ప్రసన్న యాదవ నాటకంలోనూ పాత్రలు ధరించేవారు. తిరుపతి కవుల పాండవోద్యోగ నాటకంలో కృష్ణ పాత్రను కడు సమర్థనీయంగా నటించేవారట. వేదంవారి ప్రతాపరుద్రీయంలో యుగంధరుడు పిచ్చివాని పాత్రను అద్భుతంగా నటించి, శాస్త్రిగారి ప్రశంస లందుకున్నారు. రసపుత్ర విజయం నాటకంలో ఠాకూర్ దుర్గాదాసు పాత్రకు సువర్ణ పతకాన్ని పారితోషికంగా పొందారు. ఏలూరు మోతే నారాయణ రావుగారి నాటకసమాజంలో మృచ్ఛకటిక నాటక ప్రదర్శనంలో శర్విలకుని పాత్రను కడు సమర్థవంతంగా పోషించారు. ప్రత్యేకించి వీరు రంగస్థలంలో పద్యాన్ని భావ ప్రకటనతో రసవంతంగా చదివేవారట.

కంచాడై శ్రీనివాసన్ :



శ్రీనివాసన్‌గారు చిన్నతనంలోనే నటుడుగా ప్రఖ్యాతి వహించారు. 1890 సంవత్సరంలో మర్చంట్ ఆఫ్ వెనీస్‌లో "పోర్షియా"గా మొదట నెల్లూరు నాటక రంగంలో ప్రవేశించారు. 1893 లో "శాకుంతల"లో దుష్యంతుడు భూమికను ధరించి ప్రశంసనీయంగా నిర్వహించారు 1894 నుండి 1898 వరకు మద్రాసు సుగుణవిలాస సభ తెలుగు నాటకాలలో పాత్రలు ధరించారు. భావ ప్రకటనలో శ్రీనివాసన్ గారు అతీతుడని ప్రఖ్యాతి వహించారు.

1900 మొదలు 1915 వరకూ నెల్లూరు ఆంధ్ర భాషాభిమాని సమాజంలో వేదంవారి పర్యవేక్షణలో ఉత్తమ పాత్రలను ధరించారు. ఆయన ధరించిన పాత్రల్లో ఉషలో అనిరుద్ధుడు, ప్రతాపరుద్రీయంలో 'ప్రతాపరుద్రుడు', నాగానందంలో 'బోధిసత్వుడు', శకుంతలలో 'దుష్యంతుడు', శకుంతల మొదలైన పాత్రలు పేరుపొందాయి. 1910 లో మద్రాసు పచ్చయప్ప కళాశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేశారు. సుమనోరంజనీ సమాజంలో చేరి అరవ నాటకాల్లో

పాత్రలు ధరించారు. 30 సంవత్సరాలు నెల్లూరు నాటక రంగంలో కృషిచేసినందుకు ఘంటాయుత కాంచన కంకణాన్ని బహూమతిగా పొందారు.

ఆ కాలంలో శ్రీనివాసకల్యాణంలో 'శ్రీనివాసుడు', మానవతిలో 'గోపాల వర్మ', సావిత్రిలో 'యముడు', చిత్రనళీయంలో 'నల' బాహుక పాత్రలు ధరించడంలో వారికి మరియొకరు సాటి లేరనిపించుకున్నారు. జాతీయ ఉద్యమంలో పనిచేశారు.

రంగోద్ధారక
నెల్లూరు నగరాజారావు :

రంగోద్ధారక నెల్లూరు నగరాజారావుగారు 1915 వ సంవత్సరంలో ప్రథమంగా జ్ఞానోదయ సమాజంవారి ప్రహ్లాద నాటకంలో ఇంద్రుని పాత్ర ధరించారు. ఆయన డ్రాయింగ్ టీచరు. చిత్రకళలో అభినివేశముండేది. తమ పాత్రలకు స్వయంగా రూపకల్పన చేసుకునేవారు. ఆయన దశరథుడు, రాజరాజు, నందుడు, వీరనాయకుడు, కీచకుడు మొదలైన పాత్రల్ని కళాఖండాలుగా తీర్చిదిద్దారు. మద్రాసు రాఘవాచారిగారి నాటకాలను చూసి, ఆయన పాత్రల నుండి అనుభవాలను సంపాదించారు. ఆనాడు బందరులో జరిగిన చిత్రనళీయం నాటక పోటీలలో నల-బాహుక పాత్రలు ధరించి బంగారు మెడలు బహూమతిగా అందుకున్నారు.



ఆంధ్ర పాపారాయుడు

బుచ్చిరెడ్డిపాలెంలో ఉపాధ్యాయులుగా వుంటూ దొడ్లవారి సహాయంతో 'లవకుశ' 'కృష్ణలీలలు' 'సారంగధర' 'పాదుక' 'విజయనగర పతనం' మొదలైన నాటకాలను ప్రదర్శించి ప్రేక్షకుల

ప్రేమాదరాభిమానాలను పొందారు. రావుగారికి మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించి పెట్టిన మరికొన్ని పాత్రల్లో ముఖ్యమైనవి- యుగంధరుడు, పాపారాయుడు, అక్బరు, దుష్టబుద్ధి, నక్షత్రకుడు. రావుగారిని బందరు రప్పించి డి. వి. సుబ్బారావు గారు రంగోద్ధారక బిరుదునిచ్చి గౌరవించారు. ఆయన సినిమారంగంలో ప్రవేశించి రామదాసులో 'తానీషా', వస్త్రాపహరణంలో 'శకుని', జలంధరలో 'ఇంద్రుడు' పాత్రలను ధరించారు. ఆయన నెల్లూరు నాటకరంగానికి అపారమైన సేవచేశారు. అసమాన నటుడని పేరు తెచ్చుకున్నారు.

### జమ్మలమడక మాధవరామశర్మ:

మాధవరామశర్మగారు తెనాలి తాలూకా కోరుతాడిపర్రు అగ్రహారంలో జన్మించారు. విజయనగరంలో సంస్కృతాభ్యాసం. శ్రీ తాతారాయుడుగారి వద్ద అభ్యసించారు. సర్వ విద్యాగురువుల్ని సేవించారు. పీఠాధిపతుల ఆశీస్సుల నందుకున్నారు. మంత్ర, తంత్ర, వేదాంత శిక్షణను పొందారు. సాహిత్యభాషాలంకారులు కూడా, తెనాలి, నెల్లూరు, గుంటూరు కళాశాలల్లో అధ్యాపకులుగా పనిచేశారు. శతాధిక గ్రంథాలకు పీఠికలు వ్రాశారు. పత్రికల్లో వ్యాసాలను వ్రాశారు. రేడియో ప్రసంగాలు చేశారు. ఆంధ్ర ప్రతాపరుద్రీయం, ధ్వనిసారం, రసగంగాధరం, అలంకార సూత్రము, నాట్యవేదము మొదటిభాగము, నాట్యవేదము రెండవ భాగము, రసభారతి, నాటక మీమాంస, లక్షణాలంకారం మొదలైన నాట్యశాస్త్రానికి ఉపయుక్తమైన గ్రంథాలను రచించారు. ఆంధ్ర నాటక కళాపరిషత్తులో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఆంధ్ర నాటక రంగానికి బహుముఖాల సేవ చేశారు. గుంటూరు ఎ. సి. కాలేజీలో అధ్యాపకులుగా పనిచేస్తున్నారు.

### యస్వీ జోగారావుగారు :

ఆంధ్ర యక్షగాన వాఙ్మయచరిత్ర వ్రాసి, ఆంధ్ర నాటక రంగానికి ఎనలేని సేవచేసిన యస్వీ జోగారావుగారు 1949 సంవత్సరం నుండి 1966 వరకూ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయవృత్తిలో వుంటూ, కళాపరిషత్తు నాటక కర్తగా, కార్యదర్శిగా, నాటక దర్శకుడుగా, నాటక శాఖలో అధ్యాపకుడుగా పనిచేశారు. నాటక విమర్శకుడుగా అనేక పత్రికలలో వ్యాసాలు వ్రాశారు. యక్షగానా

లను గురించీ, కళలను గురించి అనేక ఉపన్యాసాల నిచ్చారు. తెలుగు భాషాబోధకుడుగా కొంతకాలం రష్యాలో వున్నారు.

పసల సూర్యచంద్రరావు :

జననం 1909. చదువు మెకానికల్ ఇంజనీరింగు. సంగీతం, సాహిత్యం, నృత్యం, నాటకం వీరి అభిమాన కళలు. విద్యార్థిదశలో ప్రేమవిలాసినీ నాట్యమండలిని స్థాపించి కొంతకాలం జయప్రదంగా నిర్వహించారు. హిందీలో, తెలుగులో చారిత్రక నాటకాలతో ఆంధ్రదేశమంతటా ప్రదర్శించారు. చంద్రగుప్త, తానీషా, ఔరంగజేబు, అక్బరు మొదలైనవి వీరి అభిమానపాత్రలు. క్విట్ ఇండియా సమయంలో రాజకీయాలలో ప్రవేశించారు. ఆంధ్ర కాంగ్రెసు వ్యవస్థలో వివిధ పదవులు నిర్వహించారు. ఆంధ్ర శాసన సభకు డిప్యూటి స్పీకరుగా ఎన్నికై ఆపదవిని చక్కగా నిర్వహించారు. హిందీ రచనలను కొన్నిటిని తెలుగులోకి అనువదించారు. తప్తహృది వారి ముద్రిత తెలుగు గ్రంథం. అనేక సాహిత్యవ్యాసాలు వ్రాశారు. అనేక సభలకు అధ్యక్షస్థానాన్ని అలంకరించారు. అనేక వుపన్యాసా లిచ్చారు. అనేక సంవత్సరాలనుండీ ఆంధ్ర నాటక కళాపరిషత్తు కార్యదర్శిగా వుండి నాటక రంగానికి సేవచేస్తున్నారు. నాటక అభివృద్ధికి మద్రాసు ప్రభుత్వం ఏర్పాటుచేసిన (1948) పునరుజ్జీవన సంఘంలో సభ్యులు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీకి కార్యదర్శిగా పనిచేశారు. 1964 సంవత్సరంలో సంగీత నాటక అకాడమీ అధ్యక్షులుగా ఎన్నికైనారు.

కూర్మా వేణుగోపాలస్వామి :

జననం 1910 లో. మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో పట్టభద్రులై, ఆక్సఫర్డులో ఎం. ఏ. పట్టం పొందారు. బార్ఎట్ లా. మద్రాసులో కొన్నాళ్ళు చరిత్రోపన్యాసకులుగా పనిజేశారు. మద్రాసు హైకోర్టులో వకీలుగా పనిచేశారు. 1937 లో స్వతంత్ర సభ్యుడుగా మద్రాసు శాసన సభకు ఎన్నికయ్యాడు. 1942 నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రారుగా పనిచేస్తున్నారు. 1961 లో ప్రప్రథమంగా థియేటరు ఆర్టును గురించి విశ్వవిద్యాలయం గౌరవ వుపన్యాసకులుగా నియమింపబడ్డారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ ఎఫైర్సులో సభ్యులు. 1954 నుండి 1957

వరకు కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులుగా వున్నారు. 1960 నుంచి సాహిత్య అకాడమీ సభ్యులు. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ సభ్యులు.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రయోగాత్మక నాటకశాలకు నిర్మాతగాను, విజయవాడ తెలుగు లిటిల్ థియేటరు అధ్యక్షులుగాను, 1951లో ఆంధ్రనాటక కళా పరిషత్తు అధ్యక్షుడుగాను పనిచేశారు. కేంద్రప్రభుత్వం ప్రచురించిన ఇండియన్ డ్రామా అనే గ్రంథంలో వీరు తెలుగు నాటక రంగం గురించి వ్రాశారు. 1957లో వీరి సంపాదకత్వాన ప్రసిద్ధ తెలుగు నాటికల సంపుటి వెలువడింది. వీరు అనేక నాటికలు వ్రాశారు. 1963 లో న్యూయార్క్‌లోని ఏషియా పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన జెనరల్ ఎడ్యుకేషన్ రీకన్సిడర్డ్ అనే గ్రంథంలో లలిత కళలు - సంగీతం . నాటకం విభాగం రచించారు. ఆంధ్ర నాటకరంగాభివృద్ధికి ఇతోధికంగా కృషిచేస్తున్నారు.

బెజవాడ గోపాలరెడ్డి :

ఆంధ్రదేశంలోని రాజకీయ సాహిత్య రంగాలలో శ్రీ గోపాలరెడ్డిగారికి విశిష్టస్థానం వుంది. రవీంద్రుని ప్రియశిష్యులు, శాంతినికేతనంలో విద్యాభ్యాసం చేశారు. టాగూరు రచనలు తెలుగులోకి అనువాదం చేశారు. తెలుగు భాషా సమితి, సంగ్రహ ఆంధ్ర విజ్ఞానకోశ సమితి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సంస్థలకు అధ్యక్షులు. ఆంధ్ర రచయితల పురోభివృద్ధికి శ్రీ గోపాలరెడ్డి కల్పవృక్షం వంటివారు. కేంద్ర సాహిత్య అకాడమీ ఆర్థిక సంఘ అధ్యక్షులు. విజ్ఞానం, వివేకం, విచక్షణ సమ్మేళనమైన శ్రీ గోపాలరెడ్డి, ఆంధ్రసాహితీ సరస్వతికి పెన్నిధి. రాజకీయాలలో చిన్నతనంలోనేచేరి, రాజాజీ ఆశీర్వచనంతో మద్రాసు రాష్ట్ర మంత్రివర్గంలో అనేక పదవులు అలంకరించి, రాష్ట్ర కాంగ్రెసు కార్యక్రమాలలో, నిరంతర ప్రజాసేవలో నిమగ్నులై, తరువాత ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి నలంకరించారు. తరువాత కేంద్ర నాటక రంగాభివృద్ధికి ఎనలేని కృషిచేశారు. సాహిత్యాది లలిత కళలకు అండగా నిలబడి వారి సానుభూతి సహకారాలను అందజేస్తున్నారు. రాజకీయాలలో సహృదయతకు, త్యాగానికి శ్రీ రెడ్డిగారు ఒక ప్రత్యేక నిదర్శనం.

ఆర్. బి. రామకృష్ణంరాజు :

రాజా బొప్పరాజు రామకృష్ణం రాజుగారు. కార్వేటి నగర సంస్థానాధీశుల పౌత్రులు. జననం 10-2-1891. బి. ఏ., బి. ఎల్. పట్టభద్రులు. 1936లో కాంగ్రెసు అభ్యర్థులుగా మద్రాసు శాసన మండలికి సభ్యులుగా ఎన్నికైనారు. 1940 లో 1942 లో స్వాతంత్ర్య సమర సైనికుడుగా జైలుశిక్ష పొందారు. 1949 సంవత్సరంలో ద్వారం వెంకటస్వామి నాయుడుగారికి అఖండమైన సన్మానం జరిపించారు. 6 సంవత్సరాలు ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ అధ్యక్షులుగా పనిచేశారు. వీరి ఆధ్వర్యంలో అకాడమీ సంగీత నృత్య నాటకరంగాలలో విశిష్టమైన కృషి చేసింది. వీరు స్వయంగా నటులు, గాయకులు. వాయులీన వాద్యంలో ప్రత్యేక నిపుణులు. చిత్తూరు రామవిలాస సభ జీవితాధ్యక్షులు. కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యులు. కళాభిమానులుగా, కళాపోషకులుగా ఆనేక సంస్థల నాదరించి పోషించారు.

డాక్టరు పోణంగి
శ్రీరామ అప్పారావు :

పశ్చిమ గోదావరిజిల్లా కొవ్వూరు తాలూకాలోని బండాపురం వీరి జన్మస్థలం. కొవ్వూరు బోరు హైస్కూలులోను, విజయవాడ యస్. ఆర్. ఆర్. కాలేజీలోను, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్సు కాలేజీలోను విద్యాభ్యాసం జరిగింది. యం. ఏ. పూర్తిచేసి, తెలుగు నాటకరంగం ప్రథమదశ నుంచి క్రమవికాస పరిణామాలన్నీ సమీక్షించే పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పి. హెచ్. డి. పొందారు. వివిధ ప్రభుత్వ కళాశాలల్లో 7 సంవత్సరాలు అధ్యాపకులుగా పని చేశారు. పరిశోధన సాహిత్యంలో వీరికి ఎక్కువ ఆసక్తి. వీరి ప్రచురణలు తాజ్ మహల్ (నాటకం), విశ్వభారతి (నవల), వేణువు (వచన కవిత). నాట్యశాస్త్రం వివిధ పత్రికల్లో వ్యాసాలుగా ప్రచురించారు. నాట్యశాస్త్ర గ్రంథానికి 1961 లో వీరికి జాతీయ బహుమతి లభించింది. తెలుగు నాటక రంగంలో ప్రప్రథమంగా పరిశోధన చేసిన గౌరవం వీరికే దక్కింది. సంగీత నాటక అకాడమీ సభ్యులుగా పనిచేశారు.

అచంట వెంకటసాంఖ్యాయన శర్మ :

శర్మగారి జననం 1864 లో. వీరిపూర్వులు గోదావరిజిల్లా ఆచంట గ్రామవాస్త

వ్యులు. తరువాత వీరు తండ్రిగారితో విశాఖమండలంలో నాగావళి ప్రాంతంలోవున్న కిచ్చాడగ్రామంలో నివసించారు. శర్మగారు మంచి సుందరమూర్తి, బహుముఖ ప్రజ్ఞావంతులు. సంస్కృతాంధ్రభాషల్లో ఉద్దండపండితులు. కవిత్వం. చిత్రలేఖనం. సంగీతం. నాట్యశాస్త్రం - ఈయనకు అభిమాన విద్యలు. 1929 లో ప్రథమంగా ఆంధ్రనాటక కళాపరిషత్తు సంస్థాపకులలో ఒకరుగా వుండి, ప్రథమ పరిషత్తు మహాసభకు అధ్యక్షత వహించారు. వీరు కొన్ని పత్రికలను నడిపారు. అనేక విషయాలపై వ్యాసాలను రచించారు. పార్థపరాజయం - అవదాతరీలభకం నాటకాలను స్వతంత్రంగా రచించారు. ఉత్తరరామచరితం నాటకాన్ని అనువాదం చేశారు. వీరు 1933 లో కాలధర్మం చెందారు.

## కృష్ణవేణి నాగేశ్వరరావు :

నాటకరంగ బహు ప్రాణమైన కృష్ణవేణి నాగేశ్వరరావుగారు 1886 సంవత్సరంలో బందరులో జనించారు. పుట్టింది బందరైనా, పెరిగింది రాజమండ్రిలో.



అక్కడే పారీనాటకాలు చూశారు. వుల్లేజి తల్లై. హిందూనాటక సమాజంలో స్త్రీ పాత్రలు ధరించారు. సీత, శకుంతల, ద్రౌపది, చిత్రరేఖ, దమయంతి మొదలైన పాత్రలు ధరించారు. మహమ్మదీయులతో కలసి ఉర్దూ నాటకాలాడారు. 1908 లో సత్యవోలు గున్నేశ్వరరావుగారి కంపెనీలో చేరి, సమాజనిర్వహణ బాధ్యతలు నిర్వహించారు. కలకత్తా వెళ్ళి ఆంగ్ల నాటకాలను చూశారు. తరువాత స్వంత నాటక సమాజాన్ని స్థాపించి నాటకాలు ప్రదర్శించారు. ఆయన సమాజాన్ని ఎంతో కట్టుదిట్టంగా నడిపారు. 12 సంవత్సరాలు 150 మంది నటులను పోషించారు. కాలేజి గరల్ నాటకాన్ని ఆంధ్రదేశమంతటా ప్రదర్శించారు. రంగూన్ వెళ్ళి నాటకాలు ప్రదర్శించారు. నైజాం ప్రాంతమంతా పర్యటించారు. నాటక కళకోసం ఆయన ఆస్థినంతా వ్యయపర్చారు. ఏ కార్యం తలపెట్టినా పట్టుదల, సాహసం, క్రమశిక్షణ ప్రదర్శించేవారు. నిష్కళంక దేశభక్తుడు. కళకు తన జీవితాన్ని

అంకితంచేసిన నిస్వార్థ కళాప్రపూర్ణుడు, కళాతపస్వి. ఆంధ్ర నాటక కళాచరిత్రలో; సమాజాల నిర్మాణంలో ఆయన కళోద్ధారక నిర్మాత.

ఏకపాత్రాభినయం :

నేరెళ్ళ వేణుమాధవ్ :

ధ్వన్యనుకరణం, ఏకపాత్రాభినయం, బహుపాత్రాభినయం, వెంటిలాక్విజం, మిమిక్రీ మొదలైన భిన్న కళారూపాలద్వారా అఖిలాంధ్ర దేశాన్ని ఉర్రూతలూగించి రంజింపచేసిన యువకళాకారుడు, వరంగల్లు వాస్తవ్యులు శ్రీ నేరెళ్ళ వేణుమాధవ్.

వేణుమాధవ్ బాల్యంలో స్కూలు నాటక ప్రదర్శనాలలో వివిధ పాత్రలు ధరించారు. ఆనాటి నుంచి అయన జీవితాన్ని నాట్యకళకు అంకితం చేశారు. ఈ నాడు ఆయన వయస్సు 33 సంవత్సరాలు. ఉస్మానియా యూనివర్శిటీ పట్టభద్రులు. తెలుగు, ఉర్దు, ఆంగ్ల, హిందీ భాషల్లో ఆయనకు బాగా పరిచయంవుంది.

బహుపాత్రాభినయం :

బహుపాత్రాభినయంలో సిద్ధహస్తులు శ్రీ వేణుమాధవ్. స్త్రీ పురుష పాత్రలకు పాత్రోచితమైన కంఠాలు, వాటి సహజమైన స్వరాలతో వినిపించడం ఒక గొప్ప సాధన. వేషధారణ, ముఖాలంకారాలు లేకుండా కేవలం కంఠస్వర మార్పులతో, సాత్విక, వాచిక, ఆంగికాభినయాలలో నవరసాలు తొణికిస లాడించడం ఒక అసామాన్యమైన ప్రజ్ఞ. ఈ సాధన ఆయన స్వయంకృషి.

బహుపాత్రభినయంలో హేమ్లెట్, హేమ్లెట్ తల్లి, పోలనిస్‌లు, ఆలివర్ ట్విస్ట్‌లో జిల్‌సైక్స్‌నాన్సీ, జూలియస్‌సీజర్, కల్‌పర్నియా, బ్రూటస్, కాషియస్ మొదలైన ఆంగ్ల నాటకాలలోని పాత్రలనూ- తెలుగు నాటకాల్లో ప్రహ్లాదుడు, హిరణ్యకశిపుడు, సారంగధరుడు, చిత్రాంగి, గిరీశం, మధురవాణి, శివాజి, రోషనార మొదలైన వివిధ పాత్రల సంభాషణలు అతిసహజంగా ఆయన ఏకకాలంలో అభినయం చేస్తారు.

మిమిక్రి :

మిమిక్రీ అంటే అనుకరించి నవ్వించటం అని నిఘంటువు నిర్వచనం. ఆయన ఊహించి ప్రత్యేక రూపకల్పన చేసిన ప్రజల విభిన్న మనస్తత్వాలను

చూపరులయెదుట యథాతథంగా ప్రదర్శిస్తారు. ఉదాహరణకు ఇంగ్లీషు లెక్చరర్ ధోరణి, ఫోటోలో కూర్చున్న వివిధ వ్యక్తుల రూపురేఖా విలాసాలు, వివిధ భంగిమలు, వీధుల్లో వివిధవ్యక్తుల నడకల సరళి, పాఠశాలల్లో ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు అనుకరించడంలో ఆయనకు ఆయనే సాటి.

ధ్వన్యనుకరణ :

ఈ ధ్వన్యనుకరణలో వేణుమాధవ్ విశేషమైన కృషిచేశారు. ప్రఖ్యాతి చెందిన నాయకులను, నటులను, రచయితలను అనుకరిస్తారు. మహాత్మాగాంధి, జవహర్‌లాల్ నెహ్రూ, రాధాకృష్ణన్, సుభాస్ చంద్రబోస్, కెనడీ ప్రభృతుల ఉపన్యాసాలు యథాతథంగా వారి కంఠస్వరాలతో, ఉచ్చారణలశైలి-తీరులతో ఆయన వినిపిస్తారు.

హిందీ నటీనటులు పృథ్వీరాజ్, దిలీప్, రాజకపూర్, బలరాజ్‌సహానీ, సొహారాబ్ మోడీ, రాధాకిషన్, జాసీవాకర్, చంద్రమోహన్, అశోక్‌కుమార్, వీనారాయ్, సంధ్యలను. ఆంగ్లనటులు సర్‌లారెన్స్ ఆలివర్, చార్లటన్‌హెస్టన్, పాల్‌ముని, పీటర్‌వూటోల్, జెర్రీలూయిస్, యూల్‌బ్రెన్నర్, చార్లెస్‌బోయర్, గ్రెగరిపెక్, ఇంగ్రిడ్ బెర్గ్‌మన్, గ్రేటాగార్బో, హెడీలామర్‌ల సంభాషణా విధానాలను, తెలుగు నటీనటులు ఎన్. టి. రామారావు, ఏ. నాగేశ్వరరావు, ఎస్. వి. రంగారావు, గుమ్మడి, నాగయ్య, రంగారావు, భానుమతి, ఇంకా-సి. నారాయణరెడ్డి, దేవులపల్లి, అవధాని, దుర్గయ్య, రామరాజు మొదలైన రచయితల వాగ్ధోరణినీ సహజ కంఠస్వరాలతో, ముఖభంగిమలతో చక్కగా వినిపిస్తారు.

వెంటిలాక్వీజం :

వెంటిలాక్వీజం ఒక ప్రత్యేకమైన కళ. విదేశాల్లో దీనికి తగిన ప్రాబల్యం వుంది. మనదేశంలో ఇది అంతగా వ్యాపించలేదు. వేణుమాధవ్ తొలిసారిగా దీనిని ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టారు. దూరం నుంచి వినిపిస్తున్న గుట్టపు డెక్కల చప్పుడు-క్లారినెట్ - బిగుల్ -ట్రంపెట్ - ఫిడేలు మొదలైన వాయిద్యాల ధ్వనులను నేపథ్య సంగీతంగా మిళితంచేస్తూ ఘట్టాలు అభినయిస్తారు. కళ్ళు మూసుకుని ప్రేక్షకులువింటే-వారు ఒక చిత్రం చూస్తున్న అనుభూతి పొందుతారు.

ఇతర కళాకారులు :

ఆంధ్రదేశంలో రాళ్ళబండి కామేశ్వరరావుగారు షేక్స్పియర్ నాటకాలలోని పాత్రలను అద్భుతంగా చిత్రిస్తూ, అనేక కాలేజీలలో ప్రదర్శనలిస్తున్నారు.

20 సంవత్సరాలక్రితం విజయనగరంలో ఇమిటేషన్ ఆచార్యులు - వింతల వీరారెడ్డిగారు బహుపాత్రాభినయంలో కృషిచేశారు.

గరిమెళ్ళ కృష్ణమూర్తి, మూడా వెంకటేశ్వరరావుగార్లు కూడ ఇమిటేషన్ చేయడంలో సమర్థతను నిరూపించుకున్నారు,

విచిత్ర వేషధారణ :
వైద్యుల చంద్రశేఖరం :

వైద్యుల చంద్రశేఖరంగారి విచిత్ర వేషధారణను గురించి చాలమంది వినే వుంటారు. వీరిది నెల్లూరు. ప్రసిద్ధ నటకుడు. స్ఫురద్రూపం. ఈయన సాంస్కృతిక రాయబార వర్గంలో మనదేశం తరపున చైనా వెళ్ళి వచ్చారు. విచిత్ర వేషధారణలో ఆంధ్రదేశంలో వీరికి సాటి మరొకరు లేరని చెప్పవచ్చు. ముఖ్యంగా వేషధారణలో ప్రజ్ఞాపంతుడు. పది నిమిషాల్లో ఎలాంటి వేషాన్నయినా ఇట్టే ధరించగలరు.

ఆయనకు కావలసిన సామగ్రి కొంచెం రొజ్‌కలర్ గ్రీజు, ఒక బ్లాకు పెన్సిల్, అద్దమూ వుంటే చాలు-ముఖాన్ని కొద్దినిముషాల్లో మార్చేస్తారు. కాశీనాధుని నాగేశ్వరరావుగారు- జవహర్‌లాల్ - మదన మోహన మాలవ్యా - మహాత్మాగాంధి-వీరేశలింగం పంతులు - వినోబాభావే - అరవిందఘోష్ - రవీంద్రనాధ ఠాగూర్ మొదలైన జాతీయ నాయకుల ఆకారాల నన్నిటినీ మనల్ని నమ్మించేటంత బాగా మేకప్ చేసుకుని వచ్చి స్టేజిమీద నిలబడతారు. ఈయన ముఖంలో మార్పు చాల తేలికగా కలుగుతుంది. అదే ఆయన ఆస్తి. చంద్రశేఖరంగారు చైనా-రష్యాదేశాల్లో పర్యటించి, వారి ప్రతిభావిశేషాలను చూపించి, ఆ దేశీయుల్ని ఆశ్చర్యచకితుల్ని చేశారు. ఆంధ్రదేశంలో చంద్రశేఖరంగారిది ఒక ప్రత్యేక కళ.

# ప్రసిద్ధనటులు



శ్రీ పీసపాటి నరసింహమూర్తి
కృష్ణపాత్ర



డాక్టర్ శ్రీ జి. రాజారావు



640 A

# ప్రసిద్ధనటులు



శ్రీ పుచ్చా పూర్ణానందం



శ్రీ యస్. వి. కృష్ణమాచార్యులు



శ్రీ బసవరాజు సుబ్బారావు

640B

# ప్రసిద్ధనటులు



శ్రీమతి సూర్య రత్నకుమారి



శ్రీ యాసంరెడ్డి వెంకటరావు



శ్రీ అట్లూరి రామారావు

640C

# ప్రసిద్ధనటులు



మా భూమి నాటకంలో నాయికా నాయకులు

శ్రీ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి-శ్రీమతి మిక్కిలినేని సీతారత్నం

640 D

# ప్రసిద్ధనటులు



శ్రీ ఘంటసాల రాధాకృష్ణయ్య
(కబీరు)



శ్రీ లక్కరాజు విజయగోపాలరావు



శ్రీ కోరాడ నరసింహారావు

# ప్రసిద్ధనటులు



నాట్యకళాప్రపూర్ణ
తాడిపత్రి రాఘవాచార్యులు



శ్రీమతి ఎ. పూర్ణిమాదేవి

640 F

# ప్రసిద్ధనటులు



శ్రీ పాతూరి శ్రీరామశాస్త్రి

*



శ్రీ భాగవతుల రామకోటయ్య

640G

# ప్రసిద్ధనటులు



శ్రీ వి. రామన్నపంతులు



శ్రీ కోడాలి ఆదిశేషయ్య



శ్రీ మద్దాలి శేషగిరిరావు

640 ఆ



# 18

# కళా సాహిత్యం



41

కళాసాహిత్యం - నాట్యకళ పత్రిక - చక్రవర్తి
చరిత్రాత్మక కృషి - నటరాజ రామకృష్ణ నాట్య
కళాసేవ - కళోపాసకులూ, కళాపోషకులూ

# కళాసాహిత్యం

ప్రతి దేశంలోనూ నాటక కళకు సంబంధించిన కళా సాహిత్యం ఎంతో వుంది. కాని మన తెలుగు నాటకరంగానికి అలాంటి కళా సాహిత్యం అరుదుగానే వుందని చెప్పాలి. పూర్వ సాహిత్యమైన సంస్కృత వాఙ్మయంలో నాట్యశాస్త్ర ప్రముఖులు, లాక్షణికులు వ్రాసిన భరత నాట్యశాస్త్రం, కావ్యానుశాసనం, భరతార్ణవం, సాహిత్య దర్పణం, రసగంగాధరం, కావ్యాదర్శం, భరతరస ప్రకరణం, నందికేశ్వర అభినయ దర్పణం, గాన భాస్కరం, దశరూపకం మొదలైన గ్రంథాలు ప్రచారంలో వున్నాయి. కాని ఇవి ఈనాడు



క్రమాభివృద్ధి పొందుతూ వున్న నాటక రంగానికి తగినంతగా వుపయోగపడలేక పోతున్నాయి.

ఇంగ్లీషులో నాటకరంగానికి సంబంధించిన అన్ని శాఖల్లోనూ, అనేక గ్రంథాలు వెలువడ్డాయి. ఈనాడు అక్కడక్కడ అనుభవజ్ఞులైనవారు వ్రాసే వ్యాసాలు తప్ప మనకు కళాసాహిత్యం చాల తక్కువగా వుంది.

ఆంధ్ర నాటకరంగ ప్రథమదశలో బందరు వాస్తవ్యులు పురాణం సూరి శాస్త్రిగారు, నాట్యోత్పలం, నాట్యాంబుజం, నాట్యానుశాసనం, నాట్యపారిజాతం అనే నాలుగు పుస్తకాల ద్వారా, నాటక రంగానికి సంబంధించిన అనేక విషయాలను తెలియజేశారు.

1924 లో ఆంధ్ర నాటక రంగము అనే గ్రంథంద్వారా, చిత్తూరు రాజకీయోన్నత పాఠశాల ప్రధానాంధ్రోపాధ్యాయులు గొల్లపూడి శ్రీరామశాస్త్రిగారు నాటకరంగ విజ్ఞానాన్ని కొంతవరకు అందించారు.

1930 లో బందరు వాస్తవ్యులు పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రిగారు ఆంధ్ర నట ప్రకాశిక అనే మహత్తర గ్రంథంద్వారా పది ప్రకరణాలలో ఆనాటి నాటక రంగాభివృద్ధిని గురించి వివరించారు.

### నాట్యకళ పత్రిక :

నాట్యకళ పత్రిక మద్రాసు నుంచి శ్రీ నీలంరాజు వేంకటశేషయ్య, కీ॥శే॥ కొత్తపల్లి లక్ష్మయ్యగార్ల సంపాదకత్వాన త్రైమాస పత్రికగా వెలువడేది. కీ॥ శే॥ దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావుగారు నాట్యకళకు ప్రధాన పోషకులుగా వుండే వారు.ఆ పత్రిక రెండు సంవత్సరాలు నడిచి ఆగిపోయింది. తిరిగి 1940వ సంవత్స రంలో శ్రీమతి కొమ్మూరు పద్మావతి, బండా కనకలింగేశ్వరరావుగార్ల సంపాద కత్వాన కొంతకాలం నడిచి ఆగిపోయింది. తరువాత 1957 లో శ్రీ శ్రీనివాస చక్రవర్తిగారు నాట్యకళను త్రైమాస పత్రికగా ప్రారంభించి నాటక ప్రయోగానికి సంబంధించిన అనేక విషయాలతో 1961 వరకూ నడిపారు. తరువాత 1963 అక్టో బరులో సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యాన ద్వైమాస పత్రికగానూ, తరువాత మాస పత్రికగానూ సంగీత, నృత్య నాటక రంగాలకు అపూర్వమైన కళాసేవ చేస్తూవుంది.

బళ్ళారి వాస్తవ్యులు కీ॥శే॥ కోలాచలం శ్రీనివాసరావుగారు ఇంగ్లీషులో ప్రపంచ నాటక చరిత్రను రచియించారు.

ఈ కృషిలో ఆంధ్ర పత్రిక, భారతి, ఆంధ్ర పత్రిక సంవత్సరాది సంచికలూ ఎన్నో వ్యాసాలను కళలకు సంబంధించిన వాటిని ప్రకటించాయి.

ఇరువది సంపత్సరాల క్రితం ఆంధ్రప్రభ దినపత్రికలో కొండముది గోపాల రాయశర్మగారు కొన్ని వ్యాసాలద్వారా నటీ నటుల వికాసానికి తోడ్పడ్డారు.

### చక్రవర్తి చారిత్రాత్మక కృషి :

శ్రీ శ్రీనివాస చక్రవర్తిగారు నాట్యశాల, ఆంధ్రనాటక సమీక్ష, ఆంధ్ర నాటక దర్శిని, నట శిక్షణ, నాటక పోటీలు, తెలుగు నాటక కర్తలు మొదలైన గ్రంధాలను రచించడమేగాక, నటన, అభినయం అనే రెండు స్టాన్సిలోవస్కీ గ్రంధాలను అనువదించారు. బి. టి. రాఘవాచార్యులుగారి నాటకానుభవాలను నాటక దీపికగా ప్రచురించారు.

### నటరాజ రామకృష్ణ

### నాట్యకళాసేవ :

నటరాజ రామకృష్ణగారు నృత్యరేఖ, నృత్యమంజరి, నర్తన మురళి, దేవ

నర్తకి, ఆలయ నృత్యములు, ఆంధ్రులు-నాట్యకళ, ఆంధ్రులు-భరతనాట్యము, నర్తనశాల మొదలైన నృత్యశాస్త్రానికి సంబంధించిన గ్రంధాలను వెలువరించారు.

పి. యస్. ఆర్. అప్పారావుగారు| భరతనాట్య శాస్త్రాన్ని సంస్కృతం నుండి తెలుగులోకి అనువదించి కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతిని పొందారు.

జమ్మలమడక మాధవరామశర్మగారు సంస్కృత భరత నాట్యశాస్త్రానికి అనువాదంగా నాట్యవేదమని రెండు భాగాలను వెలువరించారు.

ఆంధ్రదశరూపకాన్ని మల్లాది సూర్యనారాయణశాస్త్రి, ధనికుని దశరూపకం కొమండూరు అనంతాచార్యులు, భరతరస ప్రకరణం నీడామంగళం తిరువేంకటాచార్యులు, చంద్రశేఖరకృతి భరతసారాన్ని లంకా సూర్యనారాయణశాస్త్రి మొదలైన వారు తెలుగులోకి అనువదించారు.

బాలాంత్రపు రజనీకాంతరావుగారు ఆంధ్ర వాగ్గేయకారుల చరిత్రను వ్రాసి తెలుగుభాషాసమితి వారి బహుమానాన్ని, కేంద్ర సాహిత్య ఆకాడమీ బహుమానాన్ని అందుకున్నారు.

కళోపాసకులూ,
కళాపోషకులూ :

కందుకూరి రుద్రయ్య వ్రాసిన సుగ్రీవ విజయాన్ని, శ్రీనాథుని క్రీడాభిరామాన్ని కీ॥ శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు వ్యాఖ్యానించారు.

మన యక్షగాన వాఙ్మయాన్ని పరిశోధించి యస్వీ జోగారావుగారు ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్రను రచియించి ఆంధ్ర విశ్వవిద్యాలయం వారిచే పి. హెచ్. డి. డిగ్రీని పొందారు.

బి. రామరాజుగారు మన జానపద వాఙ్మయాన్ని, జానపద కళలను పరిశోధించి, జానపదగేయ సాహిత్యమనే గ్రంధాన్ని రచియించి ఉస్మానియా విశ్వవిద్యాలయం వారిచేత పి. హెచ్. డి. డిగ్రీని పొందారు.

శ్రీవాత్సవగారు ఆంధ్రనాటక సాహిత్య ప్రగతిని గురించి పరిశోధించి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఆకాడమీవారి బహుమానాన్ని అందుకున్నారు.

భారతా, భారత రూపక మర్యాదలు అనే గ్రంధాన్ని వేదం వెంకటరాయశాస్త్రి గారు రచించారు.

చింతా దీక్షితులు ప్రజావాజ్మయం, తుమ్మలపల్లి సీతారామారావు దక్షిణ దేశములు-నాట్యములు, చాగంటి సన్యాసిరాజు కళ స్వరూప నిర్ణయము. ఎల్లోరా మన ప్రాచీనకళలు-పుట్టుపూర్వోత్తరాలు, బిందాన నారాయణరావు మన శ్రీరంగం, పాలెం రఘుపతి నటశిల్పం, రోహిణీ నాటక శిల్పం, పులిపాటి వెంకటేశ్వర్లు నటీనటలోకం, అదర్శ సాహిత్యమాల వారి ఆంధ్రనాటక కర్తలు, కొమండూరి పార్థసారధి అయ్యంగారి నెల్లూరు నాటక కళ, జి. రాజారావు నాటక ప్రయోగము, డి. వి. ఎ. ఆచార్య ఆంధ్రలో నాటకము-నాటకరంగము, శ్రీమతి బాల సరస్వతి- డాక్టర్ రాఘవన్‌గారల భరతనాట్యము, పైడిపాటి సుబ్బరామశాస్త్రి నృత్య భారతి వెలువడ్డాయి.

ఈ విధంగా ఆంధ్రనాటకరంగంలో అనేకమంది మహామహులు నాటక రచనమీదా, నాటక ప్రయోగంమీదా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యానాలు ఆంధ్ర నాటక రంగ పురోగమనానికి ఎంతగానో తోడ్పడ్డాయి.

పానుగంటి వారు సాక్షిలో నాటక రంగ విమర్శకు సంబంధించిన వ్యాసాలను వ్రాశారు.

శ్రీపాద కామేశ్వరరావుగారు ఆంధ్ర పత్రికలో నాటక రంగంలో రావలసిన మార్పులను గురించి అనేక విమర్శనా వ్యాసాలను వ్రాశారు.

కొండిపర్తి సూర్యనారాయణగారు 1910 ప్రాంతంలో నాటక సంఘ మార్గ ప్రదర్శిని అనే గ్రంధాన్ని వెలువరించారు.

తణికెళ్ళ వీరభద్రుడుగారు చిత్రాంగి పాత్రపోషణను గూర్చి 1915 ఆంధ్ర పత్రిక ఉగాది సంచికలో ఒక వ్యాసాన్ని వ్రాశారు.

తల్లాప్రగడ సూర్యనారాయణరావుగారు 1913 లో ఆంధ్ర నాటకములు అనే వ్యాసాన్ని సాహిత్య పరిషత్తు పత్రికలో ప్రకటించారు.

భమిడిపాటి కామేశ్వరరావుగారు నాటకాల్లో పద్య పఠనంవల్ల పద్యాలు నాశనమౌతున్నాయనీ, నాటకాలు వచనంలోనే వుండాలనీ చర్చిస్తూ, ఆంధ్రనాటక పద్య పఠనాన్ని ప్రచురించారు.

శ్రీపాద కామేశ్వరరావుగారు నాటకమీమాంస గ్రంథాన్ని ప్రచురించారు.

పేకుమళ్ళ అచ్యుతరావు ఆంధ్ర నాటకాలు అనే ఒక గ్రంథాన్ని వ్రాశారు.

కిన్నెర పత్రికలో భూపతి లక్ష్మీనారాయణశాస్త్రిగారు నాటక లక్షణాలను గురించి పరంపరగా వ్యాసాలను వ్రాశారు.

1935 ప్రాంతంలో రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారు నాటకోపన్యాసములు అనే శీర్షికమీద భారతిలో వ్యాసాలు వ్రాశారు.

ఏకాంకికా నాటిక ప్రదర్శనాన్ని గూర్చి రచనను గూర్చి శ్రీపాద గోపాల కృష్ణమూర్తిగారు భారతిలో ఉత్తమమైన వ్యాసాలను వ్రాశారు.

1954-55 ల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు భాషాసమితి ద్వారా నడిపిన నాటక కళ గ్రంథాల పోటీలో మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి రచించిన నాటక కళ అనబడే ఈ ఆంధ్ర నాటకరంగ చరిత్ర ఉత్తమ బహుమానాన్ని అందుకుంది.

మేకప్ కళలో ప్రసిద్ధులైన శ్రీ వి. కుమార్ ఆహార్యం- మేకప్ కళను గురించి 1958 లో ఒక గ్రంథాన్ని ప్రచురించారు.

తిరుమల రామచంద్రగారు తమ పరిశోధన పత్రిక ఆంధ్రనాటక పితామహ ధర్మవరం కృష్ణమాచార్యులుగారి సంస్మరణ సంచికలో అమూల్యమైన వివరాలను ప్రచురించారు.

యం. ఆర్. అప్పారావు :

1944 లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో శ్రీ యం. ఆర్. అప్పారావుగారి అధ్యక్షతను ఆంధ్రదేశమంతటా పర్యటించి ఒక రిపోర్టును తయారుచేశారు. ఆ రిపోర్టును 1959 లో సంగీత నాటక అకాడమీ ప్రచురించింది.

శ్రీనివాస చక్రవర్తిగారు సమగ్రమైన నాటక దర్శినిని ప్రచురించారు. దీనిలో ప్రయోగాత్మకమైన ప్రచార నాటకాలను పేర్కొన్నారు.

సురభి నాటకరంగ స్వర్ణోత్సవ సంచికలో సురభి వారి పుట్టుపూర్వోత్తరాలూ, సమాజాల చరిత్ర మొదలైన వివరాలన్నీ ప్రచురించబడ్డాయి.

ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ కూచిపూడి నాట్య సదస్సు జరిపి ఆ సదస్సుకు సంబంధించి వివరాలన్నీ ఒక సంచికగా ప్రచురించారు.

ఆంధ్ర నాటక కళా పరిషత్తు రజతోత్సవ సందర్భంలో సుందరంగా రజతోత్సవ సంచికను ప్రచురించారు.

శ్రీనివాస చక్రవర్తిగారు నాటక సమీక్ష, నాటక పోటీలు, నాటక శిక్షణ, నాటక కవులు మొదలైన గ్రంథాలను రచించారు.

తెలుగు నాటక వికాసమను గ్రంథాన్ని రచించి పి. యస్. ఆర్. అప్పారావుగారు పి. హెచ్. డి. డిగ్రీని సంపాదించారు.

జమ్మలమడక మాధవరామశర్మగారు నాట్యవేదాన్ని రెండు భాగాలుగా ప్రచురించారు.



# 19

# తెలుగు సినిమా రంగ పరిణామం



మూకీచిత్రాలూ - మొదటి ప్రదర్శకులూ,
మూగయుగం మంచి శబ్దయుగం వరకు,
సి. పుల్లయ్య, నిడమర్తి సోదరులు, గూడ
వల్లి రామబ్రహ్మం, వాహిని అవతరణ,
సారథి, నదరన్ స్టూడియోలు

# తెలుగు సినిమారంగ పరిణామం

తెలుగు సినిమా పరిశ్రమ 1931 లో ప్రారంభమైంది. 1969 వ సంవత్సరాంతానికి 38 ఏళ్ళు నిండాయి. ఆనాటినుండి ఈనాటి వరకు తెలుగు సినిమా పరిశ్రమ ఏ యే దశలలో ఎలా పరిణామం చెందిందీ, దాని అభివృద్ధికి పాటుపడిన సంస్థల్నీ - వ్యక్తుల్నీ - సంస్మరించడం ఎంతైనా అవసరం.



యూకీ చిత్రాలూ-

మొదటి ప్రదర్శకులూ :

మూకీ చిత్రాలను నిర్మించి వాటి ప్రదర్శనకు కృషి చేసిన కీ॥ శే॥ రఘుపతి వెంకయ్యను, ఆయన కుమారుడు కీ॥ శే॥ ఆర్. యస్. ప్రకాష్‌ను ముందుగా మనం సంస్మరించాలి.

తెలుగు సినిమా పరిశ్రమ మూకీ చిత్రాల ప్రదర్శనతో ప్రారంభమైందని చెప్పవచ్చును. 1901 లో రఘుపతి వెంకయ్యగారు ఒక టూరింగు సినిమాను స్థాపించి దేశమంతటా మూకీ చిత్రాలను ప్రదర్శించారు. ఆనాటి ప్రజలు ఆ చిత్రాలను ఎంతగానో ఆదరించారు. రాబడికూడా రాసాగింది. టూరింగ్ సినిమాను ఒక వ్యాపార సాధనంగా చేపట్టి విజయవాడలో పోతని శ్రీనివాసరావు - బందరులో పి. వి. దాసు - ఏలూరులో మోతే కృష్ణారావు - విశాఖపట్టణంలో జి. కె. మంగరాజు - కాకినాడలో సి. పుల్లయ్య - బళ్ళారిలో శ్రీ గోపాలరావు - రాజమహేంద్రవరంలో నిడమర్తి సూరయ్యపంతులు, 1921-1925 సంవత్సరాలమధ్య వీరందరు వివిధ కేంద్రాలలో పర్మనెంటు థియేటర్లను నెలకొల్పి - సినిమా వ్యాపారానికి ప్రజాదృష్టిలో చక్కని స్థాయిని - పేరు ప్రతిష్ఠలను ఆర్జించి పెట్టారు. బియ్యపు గోడవున్నన్ని చిత్ర ప్రదర్శనశాలలుగా రూపొందాయి. 1929 ఆసాంతానికి తెలుగు దేశంలో సుమారు 70 పర్మనెంటు థియేటర్లు వెలిశాయి. వీటిల్లో మూగ చిత్రాలు ప్రదర్శింప బడుతుండేవి.

మూగ యుగంనుంచి
శబ్దయుగం వరకు :

సినిమా పరిశ్రమ మూగయుగం నుంచి శబ్ద యుగంలోకి ప్రవేశించడంతో ఒకవిధమైన విప్లవ సంచలనం బయలుదేరింది. ఈ సంచలనానికి అనుకూలంగా ప్రథమ తెలుగు శబ్ద చిత్రం 'ప్రహ్లాద' బొంబాయిలో రూపు తీసుకుంది. అంత వరకు మూగ చిత్రాలలో పనిచేస్తూ వచ్చిన హెచ్. యం. రెడ్డి ప్రహ్లాదకు దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో స్వర్గీయ శ్రీ మునిపల్లె సుబ్బయ్య హిరణ్య కశిపుడు పాత్రను ధరించాడు. శ్రీమతి సురభి కమలాబాయి లీలావతి భూమికను నిర్వహించింది. ఈనాడు హిందీ చిత్ర ప్రపంచంలో నిర్మాతగా - దర్శకుడుగా ఒక వెలుగు వెలుగుతున్న శ్రీ ఎల్. వి. ప్రసాద్ ఈ చిత్రంలో చండామార్కుల వద్ద మొద్దబ్బాయి వేషం వేశారు.

ఆనాటి నుండి ఈనాటి వరకు :

తెలుగులో మొట్టమొదటి చిత్రం వెలుగు చూచాక ఇప్పటికి 38 ఏళ్ళు కాలవాహినిలో దొర్లిపోయాయి. ఈ ముప్పయి ఎనిమిదేళ్ళ కాలంలో తెలుగు సినిమా పరిశ్రమ ఏ యే పరిణామదశలకు గురైందో తెలుసుకోవడం అవసరం. ఈ కాలాన్ని అయిదు దశలుగా విభజించి చూదాం.

1931-1937 ప్రథమదశ, 1938-1942 ద్వితీయదశ, 1943-1950 తృతీయ దశ, 1951-1956 చతుర్థదశ, 1957-1965 పంచమదశ.

ప్రథమదశలో కలకత్తాలోని ఈస్టు ఇండియా ఫిల్మ్ కంపెనీ, బొంబాయిలోని ఇంపీరియల్ ఫిల్మ్ కంపెనీ తెలుగులో పౌరాణిక చిత్రాలను నిర్మించడానికి పరుగులు తీశాయి. తెలుగు దేశంలో పేరుపొందిన నాటకరంగ నటీనటులను బొంబాయి - కలకత్తా నగరాలకు తీసుకుపోయి ఈ రెండు కంపెనీలు తెలుగు పౌరాణిక చిత్రాలను తీశాయి. నిజానికి వీటిల్లో కనపడిన నటీనటులకు అంత పెద్ద మొత్తాలు లభింపకపోయినా వీటిని తీసిన పై కంపెనీలకు లాభాలు పుష్కలంగా ముట్టాయి.

చరితార్థులైన సి. పుల్లయ్య :

సి. పుల్లయ్య 1932 లో లవకుశ చిత్రానికి దర్శకత్వం వహించి చరితారు

లయ్యారు. థియేటర్లవద్ద డబ్బు బాగా వసూలుచేసిన మొట్టమొదటి చిత్రం ఇదేనని మనం చెప్పవచ్చును.

బందరు వాస్తవ్యులు స్వర్గీయ శ్రీ పి. వి. దాను 1933 లో మద్రాసులోని కొందరు వ్యాపారస్తుల సహకారంతో వేల్ పిక్చర్సును స్థాపించి ఔత్తరాహుల ఆధిక్యతను సవాల్ చేశారు. వేల్ పిక్చర్సు స్టూడియోలో నిర్మించబడ్డ మొదటి తెలుగు చిత్రంపేరు "సీతాకల్యాణం". దీనికి చిత్రపు నరసింహారావు దర్శకులు.

1935 లో స్టార్ కంబైన్స్ పక్షాన శ్రీ వి. రామయ్య కొల్హాపూరులో తెలుగులో 'హరిశ్చంద్ర' తీశారు. స్వర్గీయ శ్రీ పారుపల్లి వెంకటశేషయ్య ఆధ్వర్యాన 1936 లో నిర్మాణంతో పాటు పంపిణీకూడా నిర్వహించడానికి ముందడుగు వేసిన 'సరస్వతీ టాకీస్' రూపు తీసుకుంది. తెలుగువారి వ్యాపార దక్షతకు ఈ సంస్థ ప్రత్యక్ష నిదర్శనం. దీని బావుటాక్రింద 'ద్రౌపదీ వస్త్రాపహరణం' తయారయి వసూళ్ళ విషయంలో గొప్ప విజయాన్ని సాధించింది. అంతవరకు ప్రముఖ చిత్ర ప్రదర్శనశాలాధికారిగా పంపిణీదారుగా వ్యవహరించిన శ్రీ జి. కె. మంగరాజు 1937 లో బ్రహ్మాండమైన చిత్రం 'దశావతారాలు' తీశారు.

నాటకరంగం నుంచి
సినిమా రంగానికి :

స్వర్గీయ యడవల్లి సూర్యనారాయణ - వేమూరు గగ్గయ్య - తుంగల చలపతిరావు - కపిలవాయి రామనాథశాస్త్రి - శ్రీమతి కన్నాంబ - రామతిలకం - శ్రీరంజని మొదలైన నటీమణులు ప్రథమదశలో గొప్ప ప్రాముఖ్యతలోకి వచ్చారు. స్వర్గీయ పి. ఎస్. ఆర్. ఆంజనేయులు - శ్రీమతులు కాంచనమాల - పుష్పవల్లి - భానుమతి మొదలైనవారు ఈ దశలో తారామండలానికి ఎగబాకారు.

నిడమర్తి సోదరులు :

నిడమర్తి సోదరులు రాజమహేంద్రవరంలో 'దుర్గాసినిటోన్' నెలకొల్పారు. పి. పుల్లయ్య దర్శకత్వాన ఈ స్టూడియోలో 'సంపూర్ణ రామాయణం' చిత్రం తయారయింది. దురదృష్టవశాత్తు ఈ చిత్రం విజయం సాధించలేక పోయినందువల్ల ఈ స్టూడియో మూతపడింది. 1937 లో విశాఖపట్టణంలో 'ఆంధ్రా

పినిటోన్' నెలకొల్పబడ్డది. 'భక్త జయదేవ్' 'పాశుపతాస్త్రం' మొదలైన కొన్ని చిత్రాలు ఈ స్టూడియోలో నుంచి బయటికొచ్చాయి. ఇవి దెబ్బతినడంతో ఈ స్టూడియో అచిరకాలంలోనే కాలగర్భంలో కలిసిపోయింది.

ప్రథమదశలో చిత్రనిర్మాణవ్యయం సగటున ఇరువది అయిదువేల రూపాయల నుంచి డెబ్బది అయిదువేల రూపాయలవరకూ వుండేది. 'ప్లేబాక్ పద్ధతి', తారల 'ఫ్రీలాన్సింగు' విధానం ఆ రోజుల్లో లేవు. ప్రథమదశలో తయారయిన చిత్రాల సంఖ్య 42.

గొప్పపేరు తెచ్చిన
గూడవల్లి రామబ్రహ్మం:

ద్వితీయదశలో స్వర్గీయ గూడవల్లి రామబ్రహ్మం సారథీ ఫిలిమ్సును స్థాపించి దాని పతాకంక్రింద విప్లవభావ ప్రపూరితమైన 'మాలపిల్ల' 'రైతుబిడ్డ' చిత్రాలను సృష్టించారు. తెలుగుసినిమా చరిత్రలో ఈ రెండు చిత్రాలూ సువర్ణాక్షరాలతో లిఖింపబడ్డాయి.

వాహిని ఆవతరణ:

ఈ దశలోనే కళావిలసితమైన చిత్రాలను తీయడానికి కంకణం కట్టుకున్న వాహినీ పిక్చర్సు శ్రీ బి. ఎన్. రెడ్డి ఆధ్వర్యాన రంగంలోకి అడుగుపెట్టింది. ఛాయాగ్రాహకుడు శ్రీ రామనాథ్, శిల్పదర్శకుడు శ్రీ ఎ. కె. శేఖర్ వాహిని శిబిరానికి కళాకాంతులను చేకూర్చారు. సాహితీవేత్త శ్రీ సముద్రాల వెంకట రాఘవాచార్య, మహానటుడు శ్రీ నాగయ్య, దర్శకులు శ్రీ కె. వి. రెడ్డి వాహిని వారి పతాకం గగనవీధుల్లో ఎగరడానికి బాధ్యులని చెప్పుకోవాలి. 'వందే మాతరం' వాహినీవారి శిబిరం నుంచి వెలువడ్డ మొదటి చిత్రం.

ద్వితీయదశలో తెలుగు చిత్రనిర్మాణ సంస్థలు చాలా వెలిశాయి. బొంబాయి కలకత్తా నగరాలకు చిత్ర నిర్మాణార్థం వెళ్ళే తెలుగువాళ్ళ సంఖ్య పూర్తిగా తగ్గింది. మీర్జాపురం రాజాగారు శోభనాచల స్టుడియోస్‌ను మద్రాసులో నిర్మించి తెలుగు బావుటాను పైకి ఎగురవేశారు. శ్రీయుతులు వై. వి. రావు - పి. పుల్లయ్య - ఆర్. ఎస్. ప్రకాష్ - గూడవల్లి రామబ్రహ్మం - బి. ఎన్. రెడ్డి -

చిత్రపు నారాయణమూర్తి - చిత్రపు నరసింహారావు - ఘంటసాల బలరామయ్య - కె. బి. నాగభూషణం మొదలైనవారు దర్శకత్వం నిర్వహించిన చిత్రాలు ఆంధ్ర సినిమా ప్రేక్షక మహాశయుల ప్రశంసల నందుకున్నాయి. శ్రీరాజరాజ్వేరీ ఫిలిం కంపెనీ, రోహిణీ, వాహిని మొదలైన సంస్థలు తెలుగు దేశంలోనేకాక తమిళ నాడులో కూడా విశేషప్రఖ్యాతి నార్జించాయి. తెలుగు చిత్రసీమ ద్వితీయదశలో తయారయిన చిత్రాలు 66.

పరిశ్రమకొచ్చిన ప్రతిబంధకాలు:

తృతీయదశలో ప్రపంచయుద్ధం వచ్చింది. తెలుగు సినిమాపరిశ్రమ 1943 లో దాదాపు స్థంభించిందనే చెప్పాలి. చిత్రప్రదర్శనశాలకు కావలసిన యంత్ర సామగ్రి పరాయి దేశాలనుంచి కావలసింత దిగుమతి చేసుకోవడానికి అవకాశం లేకపోయింది. విదేశాలనుంచి దిగుమతి అవుతున్న ముడిపిల్మ్‌కు కూడ ముప్పొచ్చింది. చిత్రం పొడవు 11000 వేల అడుగులకు పరిమితిచేస్తూ, ప్రభుత్వం ఒక ఆజ్ఞను జారీచేసింది. దీనితో తెలుగు చిత్రనిర్మాణం కుంటుపడింది.

1944 లో అనుకోకుండా యుద్ధం ఆగిపోవడం జరిగింది. దీనితో మళ్ళీ తెలుగు సినిమా పారిశ్రామికులు వుత్సాహంతో ముందడుగువేశారు. మూలా నారాయణస్వామి మూలధనంతో వాహినీస్టూడియో రూపు దాల్చి తెలుగువారి కళాభిజ్ఞతకు దివిటీ పట్టింది.

వెలుగులో వికసించిన తారలు:

శ్రీయుతులు అక్కినేని నాగేశ్వరరావు, ఎన్. టి. రామారావు, శ్రీమతి అంజలిదేవి, శ్రీమతి భానుమతి మొదలైనవారు ఈ దశలో వెలుగును చూశారు, చిత్రనిర్మాణవ్యయం ఈ దశలో బాగా హెచ్చిపోయింది. మంచి చిత్రానికి సగటున ఒకటిన్నరలక్షల రూపాయలనుంచి మూడులక్షల రూపాయలదాకా పెరిగింది. తృతీయదశలో నిర్మింపబడ్డ చిత్రాలలో చాలాభాగం విజయవంతంగా పోయాయి.

తెలుగుచిత్రాలు సాంకేతిక శాస్త్రరీత్యా గొప్ప ప్రమాణాలను అగపరచి తెలుగువారి ఆదరాభిమానాలనేకాక తమిళుల దృష్టిని కూడా ఆకర్షించాయి. డబల్ వర్షన్స్ చిత్రాలకి ఈ దశలో ప్రాముఖ్యం వచ్చింది. శ్రీమతులు కన్నాంబ,

సావిత్రి, భానుమతి, శాంతకుమారి మొదలైన తెలుగుతారలు తమిళదేశంలో కూడా పేరుప్రఖ్యాతులను ఆర్జించడం గొప్పవిశేషం.

తెలుగుదేశంలో చిత్రప్రదర్శనశాఖ కూడా ప్రపంచమహాయుద్ధానంతరం బలాన్ని పుంజుకుంది. వివిధపట్టణాలలో చక్కని థియేటర్లు వెలిశాయి. ఎన్నో పంపిణీ సంస్థలుకూడా రంగప్రవేశం సలిపాయి. వీటిల్లో పూర్ణా, నవయుగ, చమిరియా చెప్పుకోదగినవి.

పంపిణీదారులు-

ఫిల్మ్‌ఛేంబరు :

చతుర్థదశలో 1953 లో ఆంధ్రరాష్ట్రం పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ ఫలితంగా ఏర్పడడంతో తెలుగు చిత్రసీమకు ప్రత్యేకత చేకూరింది. విజయవాడలో ఆంధ్రా ఫిల్మ్‌ఛేంబరు రూపు తీసుకుని, తెలుగు చిత్రనిర్మాణం పంపిణీ ప్రదర్శనశాఖలకు గణనీయమైన ఊపును, ఊతను యిచ్చింది. పన్నుల విషయంలో ఆంధ్రా ఫిల్మ్‌ఛేంబరు ప్రభుత్వంతో సందర్భానుసారంగా పోరాటం సాగించింది. 1956 లో తెలంగాణా కూడా చేతులు కలపడంతో ఆంధ్రప్రదేశ్ రూపు తీసుకున్నది. తెలుగు సినిమా వ్యాపార రంగం దీనితో విస్తరించింది.

హీరోయిన్లు వెలిశారు :

శ్రీమతి శంకరమంచి జానకి, అభినేత్రి కృష్ణకుమారి, జమున మొదలైన నటీమణులు ఈ దశలో వెలుగులోకి వచ్చారు. 1952 లో ఇరవై అయిదు చిత్రాలు నిర్మించబడితే, 1958 లో 29 చిత్రాలు తయారయ్యాయి. రాష్ట్రాభిమానంతో శ్రీరామకృష్ణప్రసాద్ హైదరాబాదులో సారధీస్టూడియో నిర్మించడంలో తెలుగు చలనచిత్ర చరిత్రలో మరో అధ్యాయానికి నాందీప్రస్తావన జరిగింది.

తమిళ భాషనుంచి తెలుగుకి డబ్ కాబడ్డ చిత్రాలు ఈ దశలోనే విశేషంగా రావడం మొదలెట్టాయి. ఈ విధానంతో ఒరిజనల్ చిత్రాలు వసూళ్ళవిషయంలో కొంతవరకు దెబ్బకు గురి అయ్యాయి.

ఇక అయిదవదశలో 1957 లో ముడిఫిల్మ్ కంట్రోల్ ఆర్డరు అమలులోకి రావడంతో చిత్రనిర్మాణం ఒక నిర్ణీతపంథాను అనుసరించవలసిన అగత్యం ఏర్ప

డ్డది. 1959 లో 44 తెలుగు చిత్రాలు వెలువడ్డాయి. థియేటర్ల సంఖ్య తక్కువ అవడంతో చిత్రాలు విడుదల ఒక జటిలమైన సమస్యగా రూపొంది చిత్ర పారిశ్రామికులను వేధించడం సాగించింది.

సారథి, సదరన్ స్టూడియో :

హైదరాబాదును ఒక చిత్రనిర్మాణ కేంద్రంగా రూపొందించాలని దీక్ష వహించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు యాభై వేల రూపాయిల సబ్సిడీకి ఆశించి కొందరు ఈనాడు హైదరాబాదులో మకాం పెట్టడంతో ఈ వుద్యమానికి బలం చేకూరింది. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ధనసహాయంలో సదరన్ మూవిటోన్, ప్రసాద్ స్టూడియోస్ మొదలయిన సంస్థలు భారీ ఎత్తున తమ చిత్రనిర్మాణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఈనాడు సాంఘికచిత్రానికి కనీసం నాలుగు లక్షల రూపాయలు, పౌరాణికానికి కనీసం 6 లక్షల రూపాయలు వ్యయం అవుతున్నాయి. వర్ణచిత్రం పది లక్షలకు తక్కువ లేకుండా మింగేస్తోంది. 1931 నుంచి 1965 ఆఖరు వరకు మనం తీసిన తెలుగు చిత్రాలు 704. ఈ సంఖ్యలో డబ్బింకాబడ్డ చిత్రాలు200 దాకా వుంటాయి. అంటే స్ట్రెయిట్ పిక్ చిత్రాలు 504. వీటిలో 150 సాంఘికాలు, 150 పౌరాణికాలు, 50 చారిత్రకాలు, తక్కినవి జానపదాలు. ఈ మధ్య ఈస్టమన్ గేవారంగులలో తెలుగు చిత్రాలు వస్తున్నాయి. నలుపు తెలుపు చిత్రాలకంటే రంగుచిత్రాలు ప్రజాసామాన్యాన్ని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఇటీవల రంగుల్లో నిర్మింపబడ్డ పౌరాణికచిత్రం లవకుశ దీనికి ప్రత్యక్ష నిదర్శనం.

ప్రశంసార్హమైన ప్రమాణాలు :

సాంకేతిక శాస్త్రరీత్యా తెలుగుచిత్రాలు ప్రశంసార్హమైన ప్రమాణాలను అగపడుస్తున్నాయనీ చెప్పక తప్పదు. మల్లీశ్వరి, రోజులు మారాయి, నమ్మినబంటు, నర్తనశాల, కీలుబొమ్మలు మొదలైన చిత్రాలు అంతర్జాతీయప్రశస్తిని కూడ ఆరించాయి.

ప్రతిసంవత్సరమూ రాష్ట్రపతి బహుమతులే కాకుండా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బహుమతులు కూడా మనచిత్రాలకు లభ్యమవుతుండడం గొప్పవిశేషం. బంగారు, వెండి, కంచు, నందివిగ్రహాలు. కొంత నగదు ప్రతియేటా ఉత్తమమైన

విగా ప్రకటింపబడ్డ ప్రథమ, ద్వితీయ, తృతీయ చిత్రాలకు గత రెండేళ్ళనుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇస్తోంది. న్యాయాధీశులను నిర్ణయించడంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం మరికొంత శ్రద్ధ తీసుకోవలసివుంటుందని ఫిల్మ్ పారిశ్రామిక రంగంలోని ప్రముఖుల అభిప్రాయం.

తెలుగు చిత్రనిర్మాతలలో, దర్శకులలో, కొందరు హిందీ, తమిళ చిత్ర రంగాలలో ప్రఖ్యాతి సంపాదిస్తుండడం మనందరికీ గర్వకారణం. శ్రీయుతులు ఎల్. వి. ప్రసాద్, తాతినేని ప్రకాశరావు, ప్రత్యగాత్మ మొదలైనవారికి ఈనాడు హిందీ చిత్ర ప్రపంచంలో పెద్దపేరు వుంది.

ఆసియాకే గొప్ప స్టూడియో :

ఆసియాఖండంలో గొప్ప స్టూడియోగా పేర్కొనబడే వాహిని తెలుగు వారిది. సాహసోపేతుడైన బి. నాగిరెడ్డి దీనికి అధినాధుడు. విజయాపతాకంక్రింద శ్రీయుతులు నాగిరెడ్డి, చక్రపాణి భారీ చిత్రాలను నిర్మించారు.

ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన శ్రీయుతులు ఆర్. యస్. ప్రకాష్, హెచ్. యం. రెడ్డి, చిత్రపు నరసింహారావు మొదలైనవారు అస్తమించారు. తమిళ, ఆంధ్ర చిత్రప్రపంచంలో హారతులందుకున్న వై. వి. రావుగారు అజ్ఞాతంగా జీవయాత్ర చేస్తున్నారు. కొన్న సంవత్సరాలు కథానాయకుడుగా పేరు పొందిన శ్రీ పి. హెచ్. నారాయణరావు ఈనాడు తెరవెనుకకు వెళ్ళిపోయారు. విఖ్యాత సంగీతదర్శకుడు శ్రీ గాలిపెంచల నరసింహారావు కీర్తిశేషు లయ్యారు. మాల పిల్లలో కమ్మని సంగీతాన్ని అందించిన భీమవరపు నరసింహారావుగారు విశ్రాంతి తీసుకుంటున్నారు. మహానటులుగా కీర్తించబడిన శ్రీయుతులు బళ్ళారి రాఘవాచారి, డాక్టరు గోవిందరాజుల వెంకటసుబ్బారావు, వేమూరి గగ్గయ్య, సి. యస్. ఆర్. ఆంజనేయులు, శ్రీమతి కన్నాంబ కాలగర్భంలో కలిసిపోయారు.

ఆనాటి ప్రసిద్ధకవులైన వారణాసి సీతారామశాస్త్రి, పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రి మొదలైనవారు స్వర్గస్థులైనారు.

ఒకప్పుడు వెలుతురులో వున్న శ్రీయుతులు అద్దంకి శ్రీరామమూర్తి, పులిపాటి వెంకటేశ్వర్లు, ఆరణి సత్యనారాయణ మొదలైనవారు విశ్రాంతి తీసుకుంటున్నారు.

## 19. తెలుగు సినిమారంగ పరిణామం

అంతర్జాతీయ ఖ్యాతి నార్జించిన ఛాయాగ్రాహకుడు డాక్టరు పి. వి. పతి శాశ్వతంగా కన్ను మూశారు.

హిందీ చిత్రరంగంలో వస్తున్న మార్పుల ననుసరించి తెలుగు చలన చిత్ర రంగంలో కూడా గొప్ప విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయి.

ఈనాడు నూతన తారలు చాలామంది వచ్చారు. పరిశ్రమ దినదినాభివృద్ధి పొందుతూ వుంది. నిర్మాతలు ఎంతోమంది కొత్తవారు వస్తున్నారు. సంవత్సరానికి 60 చిత్రాలు దాదాపు తయారవుతున్నాయి. ప్రజల ఆదరణ నానాటికీ పెరిగిపోతూ వుంది. చిత్రాలకు రాబడి హెచ్చింది. పద్మశ్రీ యన్. టి. రామారావు, పద్మశ్రీ అక్కినేని నాగేశ్వరరావు నటించిన చిత్రాలు విడుదలైన మొదటివారంలో ఏడు న్నర లక్షలవరకూ కలెక్షన్ వస్తూంది. దినదినప్రవర్థమానమౌతున్న తెలుగు చలన చిత్రరంగం ఆశాజనకంగా వుంది.



# 20

# చతుర్విధ అభినయాలు



అభినయం - ప్రత్యభినయం - భావాల కదలికలు - సాత్వికాభినయం-
నేత్రాభినయం - వాచికాభినయం - సంభాషణలు-త్వరిత ఉచ్చారణ -
కంఠధ్వని - గాత్రసాధన - పాటలు - పద్యాలు - ఆంగికాభినయం-
ఆహార్యాభినయం - అలంకరణ

# అభినయం

ప్రతి నటునియొక్క భావాలు మాటలద్వారానే కాక, ముఖంలో కూడ ప్రతిబింబిస్తాయి. ప్రతి సంభాషణలోవున్న భావాన్ని గొంతులో చూపించవచ్చు. కాని కావలసినంత రసపుష్టి కనబడదు. మాటలతోపాటు ముఖకదలికలు మార్తూ వుంటే నటుడు తాను ధరించిన పాత్ర ఔచిత్యాన్ని గ్రహించాడని చెప్పవచ్చు. ఒక భావాన్ని భాషలో పెడతాం. దానిని ఇతరులకు వినిపించి హృద్యమంగా చిత్రించటానికి మాటల ద్వారా వెల్లడిస్తాం. దానితోపాటు అందులోవున్న రస, భావాలను కండ్లతోను, ముఖ కదలికలలోను చూపించడమే అభినయం.



భావాల కదలికలు :

ఒక భావానికి ముఖం కందిపోతుంది. ఒక భావానికి ఈర్ష్య కనబడుతుంది. మరో భావానికి శృంగారం తొణికిసలాడుతుంది. ఇంకొకదానిలో పెదవులు వణికి విచారభావాన్ని చూపిస్తూ కండ్లవెంట నీళ్లు కారతాయి. మాటలద్వారా ఏ విధంగా లోపలనున్న మహా భావాలను వెలిబుచ్చగలమో ఆ విధంగానే ముఖం, ఇతర అంగాలు, భంగిమలద్వారా వెల్లడిస్తాయి. ప్రతి మానవునికీ ప్రకృతిలో ఒక ఆనందం వుంది. ఆ ఆనందంతోపాటు కష్టాలు కూడా వున్నాయి. ఒక దృశ్యాన్ని చూచినప్పుడు ముగ్ధుడైపోతాడు. ఆనంద పడతాడు, వుల్లాసంతో ఎగిరి గంతులు వేస్తాడు. మరొక దృశ్యాన్ని చూచినప్పుడు ఏడుస్తాడు. తాను చూచిన దృశ్యాలను ఇతరులకు తెలియజేయకుండా వుండలేడు. తను చూచిన యదార్థ దృశ్యాన్ని కళ్ళకు కట్టినట్లు మన బుర్రలో ఎక్కించడానికి ప్రయత్నించడంలో వున్న గొప్పతనమే అభినయం.

దృశ్యభాష, శ్రవ్యభాష :

మాటలను చెవులద్వారా వింటాం. ఆటలను, వివిధ ప్రకృతి దృశ్యాలను కండ్లతో చూస్తాం. ఈ విధంగా చూచినప్పుడు, మన మనసెంతో వికాసంజెంది

ముఖం విప్పారుతుంది. పాటలను వినడం, ఆటలను చూడటం కూడ ఒక భాషే. ఈ రెంటినీ దృశ్యభాష అనీ, శ్రవ్యభాష అనీ అంటారు. అందుకే మన అలంకారికులు ప్రబంధాలకు శ్రవ్యకావ్యాలనీ, నాటకాలకు దృశ్యకావ్యాలనీ పేర్లు పెట్టారు. మన అభిప్రాయాలను ఇతరులకు చెప్పాలనుకున్నప్పుడు, వారిని నమ్మించాలన్నప్పుడు మనం చెప్పబోయే సన్నివేశాలనుబట్టి, అనేక రసాలు వుద్భవిస్తాయి. అవి రసాలని, అభినయమని మనకు తెలియదు. అది ప్రతిమానవునిలో కనబడుతుంది. ఆ విధంగానే అభినయమనేది పుట్టింది. ఇక్కడ ఒక సందేహం లేకపోలేదు. ప్రతి వ్యక్తిలోనూ ఆయాభావాలు వున్నప్పుడు అభినయానికున్న ప్రత్యేకతేముందని. కాని ప్రతిమనిషీ తాను అనుకున్నప్పుడల్లా ఆ భావాలను చూపించలేడు. తాను ఆయా దృశ్యాలను చూచి వుద్రేకాన్ని పొందినప్పుడే చూపించగలడు. కాని నటుడనేవాడు అటువంటి భావాలను, ఆమూలాగ్రంగా ఎప్పుడు అవసరమైతే అప్పుడు అన్నిరసాలతో ఒప్పించగలుగుతాడు. ఇదే నటకునిలోవున్న విశిష్టత, గొప్పతనము.

# సాత్వికాభినయం

నాటక ప్రదర్శనానికి అన్ని అభినయాలు ఎంతో ప్రాముఖ్యం వహించినా చతుర్విధాభినయాలలో సాత్వకాభినయం ఉత్తమోత్తమమైనది. మనసులోవున్న భావాలను ముఖంలో అచ్చు గుద్దినట్లు ప్రతిబింబింప జేయడమే సాత్వికాభినయానికి ముఖ్య ధర్మం.



నాటక ప్రదర్శనకు ప్రధానమైన ఈ సాత్వికాభినయం విషయంలో నటీ నటులు తగిన శ్రద్ధవహిస్తున్నారని చెప్పలేం. నేటి ఆంధ్రనాటక రంగంలో అనేక సమాజాలు కేవలం పద్య నాటకాలమీద ఆధారపడి కంట్రాక్టులతో జీవితాన్ని వెళ్ళబుచ్చుతున్నారు. కేవలం నాలుగు పద్యాలు పాడి సంతృప్తిపడుతున్నారు. చాలమంది ప్రేక్షకులు కూడ అదే తృప్తితో వున్నారు. పద్య నాటకాలలో సంగీతంవల్ల వివిధ అభినయాలు లోపించినా నటీ నటులుగా మనగలుగుతున్నారు. ధనార్జనకు పద్యాలు పాడితే చాలని అభినయంపట్ల నిర్లక్ష్యమును చూపుతున్నారు. పోతే అనేక అమెచ్యూర్ నాటక సంఘాల నటులు

పద్యాలూ, పాటలూ లేని వచన నాటకాలనే ప్రదర్శిస్తున్నారు. పద్యాలు పాడి కొందరు నటులు కేవలం అభినయంద్వారానే ఆధారపడవలసి వస్తూంది.

కొంతమంది నటులు శ్రావ్యమైన గొంతు లేకపోయినా పద్యాలను భావ యుక్తంగాపాడి, సాత్వికాభినయంతో వివిధ అభినయాలను జోడించి ఉత్తమ నటు లనిపించుకుంటున్నారు.

అభినయానికి
అద్దంలాంటిది ముఖం:

సాత్వికాభినయానికి ప్రధాన స్థానం ముఖం. సమస్త భావాలను సమిష్టిగా వెలువరించటానికి అద్దంలాంటిది ముఖం. అనేక ముఖాలు అభినయానికంత అను కూలంగా ఉండవు. కండ తక్కువ ముఖాలద్వారా సాత్వికభావాలను వెలువరించడం కష్టం. కండగలిగిన ముఖాలను బాగా ఉపయోగించుకోవచ్చును గాని కొన్ని కండ గలిగిన ముఖాల్లో కూడ సరియైన చలనం కనబడదు. అందుకు కారణం కృషిలేక పోవడమే. ప్రతి ప్రేక్షకుడూ ప్రదర్శన సమయంలో నటకునియొక్క ముఖాన్నే పరీక్షిస్తాడు. అది సహజంకూడ. ఒక్కొక్క పాత్రధారి ఒకే సమయంలో గుండెల్లో దుఃఖాన్ని, ముఖంలో చిరునవ్వునీ ద్వంద్వంగా నటించాల్సి వస్తుంది. ఇలాంటి నటనలో సాత్వికాభినయానికి ఎక్కువగా ఉపయోగపడేది ముఖం.

సరసమైన భావాలకు స్థానం మనస్సు. అది ఎంత సూక్ష్మంగా వుంటుందో అంత స్థూలంగా కూడ వుంటుంది. మనస్సుయొక్క రూపం సముద్రంవంటిది, దాని పనులు తరంగాల్లాంటివి. మనసు మన కంటికి కనబడేదికాదు. మనస్సు నవ్వితే మనకు సుఖం, నవ్వకుండా వుండే దుఃఖం.

సత్వగుణం సానుభూతికి
ఆటపట్టు:

సత్వగుణం సానుభూతికి ఆటపట్టులాంటిది. సత్వగుణం ఇతరుల కష్టాలకు ఎలాంటి సానుభూతి చూపిస్తుందో సుఖాలకు కూడా అంతే. ఇతరులయొక్క సుఖ దుఃఖాలను సానుభూతితో చూడగలిగిందే సత్వం. దానికి పంబంధించిన భావాలన్నీ సాత్వికభావాలు.

### సత్వగుణం కలవాడే సహృదయుడు :

నాటక ప్రదర్శనంలో నటుడు మాట్లాడే ప్రతి సంభాషణయందూ వున్న భావాన్నీ అర్థాన్నీ తెలుసుకొని సాత్వికభావాలను జోడించినప్పుడు అక్షరాలా సాత్విక భావాలు వాటంతటవి ప్రస్ఫుటమౌతాయి. అద్దం ప్రతిబింబంద్వారా రెండవ ముఖాన్ని ఎలా చూపిస్తుందో అలాగే మానవులకు తటస్థించే సుఖదుఃఖాల అనుభూతుల్ని ముఖాన్నిబట్టే తెలుసుకో గలుగుతున్నాం.

### సాత్వికాభినయం గొప్పతనం :

ఒక్కొక్కరి మనోగతభావాలూ, దుఃఖాలూ, సుఖాలూ ముఖంలో అప్రయత్నంగా వెలువడతాయి.

మరి కొంతమంది ఎంత దుఃఖాన్నైనా దిగమ్రింగి అ భావాన్ని ఏ మాత్రం పైకి పొక్కనీయక దుఃఖంలేనట్లే నటిస్తారు. సాత్వికాభినయంలో ఇదీ ఒక పద్ధతే.

మానవునియొక్క మానసిక దౌర్బల్యాల ననుసరించే ముఖభావాలు వెల్లడౌతాయి.

మరికొంతమంది ఏ అభిప్రాయాన్నీ ఆపుకోలేరు. ఆపుకోవాలని ప్రయత్నించినా అది ముఖంలో స్ఫురిస్తూనే వుంటుంది.

ఒక్కొక్కరు ఇతరులపై ఎంతటి ద్వేషమున్నా లేనట్లే నటిస్తారు. వున్న భావాన్నీ అనుభూతినీ లేనట్లు నటించడమే కష్టం.

### సాత్వికచలనం లేని నటులకు ఆంగికమే శరణ్యం :

కొంతమంది నటీ నటులు సాత్వికాభినయం లోపించినపుడూ అలాంటి నటనాసామర్థ్యం లేనప్పుడూ ఆంగిక చలనాన్ని వుపయోగిస్తారు. సంభాషణలు స్ఫుటంగానే వుంటాయి. కాని భావం కనపడదు. ఏమాత్రం రసం వుత్పన్నంకాదు. ముఖంలో ఏ మాత్రం కదలికలూలేక మొద్దులాగ కనబడుతుంది. మరికొంతమంది పద్యాలుపాడే బరువుతో చేతులూ తలా ఆడిస్తూ అటూ ఇటూ రంగస్థలమంతా

కలియదిరుగుతూ సాత్వికాభినయాన్ని చూపించలేని బలహీనతను కప్పివేసు కుంటారు.



మరికొంతమంది కేవలం సంభాషణలను అరుపులతోనూ, చమత్కారంగా కంఠస్థంచేసి గడబిడ చదివేయడం ద్వారాను మెప్పును పొందుతున్నారు. కాని నటనకు ప్రాణతుల్యమైన సాత్వికభావాలను, అభినయాన్ని గంగపాలు చేస్తున్నారు.

పాత్రలను అర్థం చేసుకోవాలి :

నటుడు తాను ఏ పాత్రను ధరించబోతున్నాడో, నాటకంయొక్క ఇతివృత్తమేమిటో, నాటక రచనలోనున్న గొప్పదనమూ, విశిష్టతా, కవి ఏ రూపంలో చిత్రించాడో, ముఖ్యంగా తాను తీసుకున్న పాత్రయొక్క పూర్వాపర సందర్భాలు ఏమిటో తెలుసుకోవాలి. మొత్తం నాటకధర్మాన్ని తెలుసుకుని తన పాత్రపోషణనుగూర్చి ఒక నిర్దుష్టమైన అభిప్రాయానికి రావాలి. నాటకంలో నిర్వహించే తన పాత్రకు ఇతర ముఖ్య పాత్రలకు గల సంబంధాలను గుర్తించాలి. తన పాత్ర యొక్క తదితరుల పాత్రలయొక్కా నైసర్గిక గుణాలనూ, చిత్త ప్రవృత్తులనూ, నాటకాంతంలో వాటికి కలిగే మార్పులనూ అర్థంచేసుకోవాలి. ఇది నటీ నటులనుకునే ప్రతివారియొక్క కర్తవ్యం. ఈ విషయంలో దర్శకునిమీద ఆధారపడడం కంటే ఎవరికివారే వ్యక్తిగతంగా ఒక అభిప్రాయానికివచ్చి, ఆ అభిప్రాయాలను సమిష్టికి వదలి సలహాలను పొందడం మంచిది. ముఖ్యంగా నాటకంలో వచ్చే పాత్రలన్నీ మానవసమాజానికి అనుగుణంగానే వుంటాయి.

అభినయం, ప్రత్యభినయం :

అభినయంలో రెండు రకాలున్నాయి. అందులో ఒకటి తాను జేసేది, రెండోది ఇతరుల సంభాషణలకు ప్రతిగా అభినయించేది. అంటే ప్రక్క నటుడు సంభాషణలు మాట్లాడే సమయంలో కలిగే ప్రతిచలనం.

మొదటి విధానంకంటే ఈ విధానం చాలా కష్టమైంది. మొదటి విధానం వాచికాభినయంతో పాత్రోచితమైన వివిధ రసాలను ఒప్పించ గలుగుతారు. కాని



వాచికం లేకుండా ఎదుటి నటుడు మాట్లాడే సంభాషణల యొక్క ప్రతిబింబాన్ని సాత్వికాభినయంద్వారా చూపించటం చాలా కష్టం. ఈ విధానం మన రోజువారీ జీవితంలో చూస్తూనే వున్నాం. ఉదాహరణకు మనలను ఎవరైనా దూషించినప్పుడు, మనలో కలిగే వుద్రేకం ఎలా ఉంటుందో మనం చెప్పుకునే నటనలో కూడా ఆ భావం కనపడాలి.

చలనం-ప్రతిచలనం :

మాటా, పలుకూ లేకుండా ఉద్రేకాన్ని ఉత్సాహాన్ని తెచ్చుకోవాలి. ఇవి నటకునియొక్క సామర్థ్యాన్ని సూచిస్తాయి. ఎప్పుడూ రంగస్థలంమీద రెండు పాత్రలు మాట్లాడే సందర్భాలలో ప్రతిచలనం విధిగా వుండాలి.

ప్రతిచలనం లేకపోవడమంటే రెండు పాత్రలమధ్యా వరస్పర సహకారం లేదన్న మాట. ఒక నటుడు ఎంతో అద్భుతంగా నటించినా దానికి తగిన ప్రతి చలనం ప్రక్క నటుడు ఇవ్వకపోతే మొదటి నటుని సామర్థ్యం ఖూనీ అవడం. రెండవ నటుని అసమర్థత బయటపడటం జరుగుతుంది. నాటక ప్రదర్శనంలో ప్రతి పాత్రా ఇంచుమించు పైన సూచించిన స్థాయి కలిగి యుండాలి. నాటక విజయానికి ఈ సమర్థతలే మూలకారణం. నాటకంయొక్క జీవితాన్ని తీర్చిదిద్దే ముఖ్య సాధనాల్లో సాత్వికాభినయం ప్రధాన స్థానం వహిస్తుంది.

పాత్రకు ప్రాణం :

సాత్వికాభినయమనేది పాత్రకు ప్రాణంలాంటిది. పాటను మాటను సాత్వికంతో జోడించి నడపాలి. సంభాషణలోవున్న ప్రతి చిన్నభావాన్నీ ముఖంలో చూపించగలగాలి. ఇది ఒక పట్టాన సాధ్యంకాదు. కాని సాధన, అకుంఠిత దీక్ష ద్వారా అవలీలగా సాధించవచ్చు. ఏదైనా ప్రథమంలో కొంచెం కష్టంగానే వుంటుంది. కాని అనేక రిహార్సల్స్ చేయడంవల్ల దీనిని సాధించవచ్చును.

ఒక సంభాషణద్వారా ప్రేక్షకులకి ఎలాంటి అభినయాన్ని అందించ గల్గుతున్నామో ప్రతినటుని సంభాషణలకు కూడ అదే ముఖచలనాన్నివ్వాలి. అలా రియాక్షన్స్ ఇవ్వలేనప్పుడు, ప్రతినటుని చేతగానితనం బయట

పడుతుంది. సాత్వికాభినయంలో నేర్పులేనటువంటి ప్రతిచలనం నటన, తోలు బొమ్మ అభినయంలా వుంటుంది.

నటకుఁడొక్కఁ డనోభావాలు ఎంత గొప్పగా చిత్రించుకున్నా. అవి సాత్వికాభినయంలో వెలువడాలి. తన పాత్రకు, తన నటనకు, తను నిలబడే రంగస్థలానికీ, తనతో ప్రతిగా నటించే సోదరపాత్రకు అవినాభావసంబంధ ముంటుంది. ఇందులో ఏది చెడినా మొత్తం పాత్ర దెబ్బతింటుంది.

ఆద్దం, అభినయం :

నిత్యజీవితంలో అద్దందాద్వారా మనం అందాన్ని చూచుకోవడానికీ ప్రయత్నిస్తూ వుంటాం. కొంతమంది అద్దంముందు నిలబడి కట్టుకున్న కోకను చూచి, పెట్టుకున్న బొట్టును చూచుకుని, చుట్టుకున్న జడచుట్టను చూచి, ఆ చుట్టలో పొదిగిన పూలచెండును చూచి, ముక్కుపుడకను చూచి వారిలో వారే మురిసిపోతూ వుంటారు.

వారి వారి అందచందాలూ, వేషభాషలూ ఎలా వున్నాయో ఎవర్నీ అడగకుండా అద్దంముందుకువచ్చి నిలబడితే తేలిపోతుంది.

అద్దం సాత్వికాభినయానికి ఎంతగానో వుపయోగపడుతూ వుంది. ప్రతి



నటుడూ సంభాషణలు నోటికి వచ్చిన తరువాత, నాలుగు ప్రక్కలా అద్దములు అమర్చబడిన గదిలో నిలబడి నటించినట్లయితే వాని నటనలోని లోపాలన్నీ ఇట్టే బయట పడిపోతాయి. అద్దం ప్రేక్షకుడులాంటిది.నిర్మొహమాటంగా మంచికీ మంచినీ, చెడుకు చెడునూ ఎత్తి చూపిస్తుంది. అద్దంముందు ఎంతగానో సాత్వికాభినయాన్నీ, ఆంగికాభినయాన్నీ సాధనజేసిన తరువాత నటీ నటులు ధైర్యంగా రంగస్థలమెక్కి వారి పాత్రలో వారు రాణించగలరు. అద్దంలేకుండా అభినయించడం ద్వారా మనం ఏం జేస్తున్నామో మనకే తెలియదు. అప్పుడు ఇతరులమీద ఆధారపడి ఈ భావం ఎలా వుంది, ఈ నడక ఎలా వుంది, ఈ భంగిమ ఎలా వుంది, అని అడుగుతాం. ఇలా అడగడంలో రెండవవ్యక్తి బాగుందని చెపుతాడనే ఆశిస్తాం. అలాగే చాలమంది మోమోటపడి బాగానే వుందంటారు, ఆ మాటమీద

ఆధారవడి రంగస్థలమెక్కితే నటీ నటులు నష్టపడతారు. కనుక ఎవరినీ అడగకుండానే అద్దంముందు నిలబడి కొంతవరకు సాధనచేసి తరువాత సహృదయుల అభిప్రాయాలను తీసుకోవచ్చును.

ఆత్మీయుడులాంటిది అద్దం :

సంభాషణలు పలుకుతూ అద్దంలోకి చూస్తే, సంభాషణల భావానికి అనుగుణంగా తగిన భావం ముఖంలో వెలువడుతూ వుందో లేదో స్పష్టంగా తెలిసిపోతుంది. ఈ సాత్వికాభినయాన్ని అద్దం ద్వారా సాధించవచ్చును. ఒకసారి సంభాషణకు తగిన చలనం కలుగకపోయినా అనేకసార్లు అద్దంముందు కూర్చుని సాధనచేస్తే సుసాధ్యమౌతుంది. ఇలా అద్దంముందు రిహార్సల్సు చేసే సమయంలో ఇతరూ లెవరూ లేకుండా వుండడం మంచిది. సాత్వికచలనాన్ని అద్దంముందు సాధించిన తరువాత, ఆ పాత్రకు తగిన వేషధారణను సంపూర్ణంగా ధరింపజేసి రంగస్థలంలో నటించినట్లే నటిస్తే వున్న లోపాల నన్నిటినీ సర్దుకోవచ్చును. ఇలాగ నటీ నటులకు అద్దం స్నేహితునిలాంటిది. గురువులాంటిది. ఇలా అద్దం ద్వారా సాధనచేసిన వ్యక్తి రంగస్థలంపైన ఏ మాత్రం సంకోచం లేకుండా నటించగలుగుతాడు. అందుకు కారణం తాను ఏమి చేస్తున్నాడో తనకు తెలుసు కాబట్టి.

అద్దాలసేకరణ ఖర్చుతో కూడుకున్న పనైనా నటీ నటుల భవిష్యత్తుకూ, జీవనాధారమైన నాటక కళకోసం కొంత ధనవ్యయం చేయక తప్పదు. నటీ నటుల అభినయానికి అద్దం గ్రంథాలయంలాంటిది.

# వాచికాభినయం

నటుడు తాను తీసుకున్న పాత్రను రసవత్తరంగా చిత్రించాలంటే రంగానికి సంబంధించిన అన్ని అవకాశాలను వినియోగించుకోవాలి.ముఖ్యంగా ఆ పాత్ర మాట్లాడే ప్రతి మాటగాని, పద్యంగాని, ఘుణ్ణంగా, స్వచ్ఛంగా, భావగాంభీర్యంతో స్పష్టంగా వుండాలి. దీనినే వాచికాభినయం అంటారు.



ఇందులో వచనానికి పద్యానికి తేడా వుంది. పద్యం సంగీతంతో కలిసిన రసాత్మకమైన విధానం. దీనికి ఒక తీరు, ఒక నడక ఏర్పడేవుంది. కొంతమంది పద్యాలను రాగానికి ప్రాముఖ్యమివ్వక,

భావయుక్తంగా పాడడమే ప్రధానంగా చూస్తారు. నేటి మన నాటకాలలో పద్యాల తీరు చూస్తే రాగానికి ప్రాముఖ్యతమినహా, భావానికి ప్రాముఖ్యమే వుండదు. వారి రాగానికి అనుకూలంగా పద్యభావాన్ని త్రిప్పుకు పాడతారు. అందులో వున్న సాహిత్యవిశిష్టత కూడా గమనించరు. ఒక్కొక్కప్పుడు పదవిభాగాలులేక కలిపి పాడడంతో రాగం, భావం రెండూ ధ్వంసమై కూర్చుంటాయి. ప్రేక్షకులుకూడా భావంకంటే రాగానికే ప్రాధాన్యమిచ్చి అ రాగాల ఆనందంతో పద్యాలు బాగా వూపేశాడంటూ, మరొక్కసారి వన్సుమోరంటూ కేకలుపెట్టి రసాభాసం చేస్తారు.

వచనం :

ఇక వచనం భావాత్మకమైనది. వచనంలో వున్న ప్రతిమాట ఏదో ఒక భావాన్ని స్ఫురింపచేస్తూ వుంటుంది. భావాన్ని బట్టి ప్రతిమాట మాట్లాడగలిగితేనే అది సరియైన నాటక మనిపించుకుంటుంది. భావయుక్తంగా మాట్లాడినా అది అందరికి వినబడేటట్లు స్వచ్ఛంగా వుండాలి. ఒకవేళ దూరానవున్న ప్రేక్షకులకు వినబడాలని బిగ్గరగా మాట్లాడినట్లయితే భావం పోతుంది. ఏమాట ఎంత తూకంలో అంటే దానిలోని భావం నిగూఢం కాకుండా వినబడుతుందో ఆ విధానాన్ని నడకను ప్రతినటుడూ సాధన చేయాలి.

నేడు పద్య నాటకాలకంటే వచన నాటకాలకే ప్రాధాన్య మిస్తున్నారు. పద్యనాటకాలకంటే గద్యనాటకాలు రక్తి కట్టించడం కష్టం. పౌరాణికంగా వున్న వాచికం ఒక ఫక్కీలో నడుస్తుంది. కాని నేటి సాంఘిక నాటకాలు సంఘానికి సంబంధించినవి. అందులో అనేక వాస్తవిక ఘట్టాలను చూస్తూవుంటాము. అందువల్ల చూచే ప్రేక్షకులు కూడ వాచికాన్ని శ్రద్ధగా పరిశీలిస్తారు. వాచికం సరిలేకపోతే సాంఘిక నాటకాలు ప్రజాదరణను పొందలేవని చెప్పవచ్చును. ముఖ్యంగా సాంఘిక నాటకాలలో ఎక్కువ పద్యాలున్నట్లు మనం చూడడంలేదు. పాటలుమాత్రం వుంటున్నాయి.

సాంఘికంగాని, చారిత్రకంగాని అది ఏదైనా వచన నాటకమైనప్పుడు, నాటకం రక్తికి రావాలంటే వచనాన్ని గూర్చి ఇతోధికమైన శ్రద్ధ వహించాలి. నాటకాలలో ఇటువంటి శ్రద్ధ లేకపోవడంవల్లనే నటులు, ప్రేక్షకులు కూడా

పద్యాలు లేని నాటకాలు రక్తి కట్టవనే మరో పంథాకు మారుతున్నారు. ఈ అనుమానం ప్రేక్షకులకు రావడం సహజమే. కాని నటులే ఇందుకు బాధ్యులు. తాను ఈ బాధ్యత తీసుకునే ముందు ఈ సమస్యపై తనకొక స్పష్టమైన అభిప్రాయ ముండాలి. ఎందువల్ల నంటే జీవితంలో సంగీతం పాడుకునేదానికి కొన్ని సమయా లున్నాయి, ఏ సమయంలో ఎక్కడ సంగీతం పెట్టాలో అక్కడే దానిని వినియోగించాలి. అటువంటి సందర్భాలు నాటకంలో చాలా వుంటాయి. నాటకం రక్తికట్టాలనే వుత్సాహంకొద్దీ అన్ని రంగాలలోనూ ఆ విధానాన్ని అవలంబిస్తే ఫలితం శూన్యం. కొన్ని నాటకాలలో లేకుండా పోవచ్చును. ఈ సమస్యపై ఒక నిర్దుష్టమైన అభిప్రాయముండాలి.

మనం పాడే పాటకు, పద్యాలకు ఒక శృతి, తాళం, లయ వున్నాయి. అందులో ఏది చెడినా రసభంగం తప్పదు. అలాగే వచనానికి కూడా శ్రుతి, లయ, ఆరోహణ, అవరోహణ మొదలైన విధానా లున్నాయి. ఒకే మాటను ధ్వని భేదాలతో అర్థభేదాన్ని తీసుకురావచ్చును. ఉదాహరణకు-

'కమలా ! నువ్వేం మాట్లాడుతున్నావో తెలుసా ?'

(హెచ్చరించడం)

'కమలా ! ఎందుకలా బాధపడతావు? నామాట వినవూ ?'

(అర్థించడం)

'కమలా ! ఎక్కడికి వెళుతున్నావ్ ? ఇలా రా !'

(పిలుపు)

'కమలా ! ఈ బాధను భరించలేను.'

(బాధను వ్యక్తంచేయడం)

'కమలా ! నువ్విక్కడనుండి కదలడానికి వీల్లేదు.'

(ఆజ్ఞ)

ఈవిధంగా కమలను సంబోధించేటప్పుడు, 'కమలా !' అనే మూడక్షరాలు మామూలుగా కనబడినా, బ్రాకెట్లలో వున్న పదాల అర్థాన్నిబట్టి భావం మారుతూ వుంటుంది. మనం నాటకంలో చూసేదికూడా ఇటువంటి సన్నివేశాలే. పిడుక్కీ బియ్యానికీ ఒకే మంత్రమన్నట్లు అన్నిటినీ ఒకేవిధంగా ఉచ్చరించితే ఏమీ ప్రయోజనముండదు. బాధ్యత లన్నిటినీ నెరవేర్చాలంటే ప్రతి నటీ నటుడూ,

అనేక ఇతివృత్తాలు గల నాటకాలను చదవాలి. సాహిత్య సంబంధ ముండాలి. ఒక పాత్రకు మరోపాత్రకు వున్న సంబంధాలను తెలుసుకొని వాచికాన్ని సాధన చేయాలి. ఒంటరిగా తనకు తానే సంభాషణల్లో భావయుక్తంగా తరఫీదు కావాలి. ప్రతి మాటకు ఒక అర్థముంటుంది. ఆ అర్థానికి వాచికం ద్వారా వెల్లడించే భావ ముంటుంది. ఆ భావాన్ని వెలిబుచ్చే లయ, కృతి, ఆరోహణ, అవరోహణా వుంటాయి. వీటన్నిటినీ గమనించినప్పుడే నాటకం రసాత్మకంగా వుంటుంది.

అపశ్రుతిలో పాడే పాటను ప్రేక్షకులు ఎలా ఆనందించలేరో, అలాగే వాచికాన్నికూడా అపశ్రుతిగా రంగస్థలంమీద వినలేరు. నటుడు తాను మాట్లాడే ప్రతిమాటా అందరికీ వినబడేలా ప్రయత్నించాలి. అలా అని గొంతు చించుకో రాదు.

పద్యాలు, పాటలు :

వచనానికంటే పద్యంలో ఒక విలక్షణమైన శక్తి వుంది. పద్యం రస ప్రధానమైంది. పద్యం పాడేటప్పుడు నటనకు కొంత ప్రత్యేక ప్రయత్నం ఆవశ్యక మౌతుంది. ఎక్కువ మంది భావాన్ని లక్ష్యం చేయకుండా సంగీతానికే ఎక్కువ ప్రాధాన్యమివ్వడం చూస్తున్నాం. ఒక వేళ భావ పోషణకు ప్రయత్నించినా, సంగీతం చెవి సోక గానే మనస్సును రంజింపచేసేది కనుకనూ, భావం ఆలో చిస్తేనే గాని మనస్సుకు తట్టేదికాదు గనుకను భావాన్నీ, సంగీతాన్నీ రెంటినీ సమన్వయించి వ్యక్తపరిచే శక్తి నటున కున్నప్పటికీ ప్రేక్షకుని హృదయంలో సంగీతం వెంటనే ఆక్రమించి భావానికి ఆ చోటు లేకుండా చేస్తుంది. కనుక



సంగీతాన్ని తప్పనిసరిగా పెట్టవలసి వచ్చినప్పుడు కొంత జాగ్రత్త అవసరం. ప్రతి పాదాంతంలోను, పాదం మధ్యలోను రాగం ఎక్కువ పెట్టకూడదు. ఇక కీర్తనలలో తాళానికి మాత్రం ప్రాధాన్యం ఇస్తారు. ఈ ప్రాధాన్యంవల్ల భావం యొక్క బలం తగ్గిపోతుంది. తాళం చెడకుండా భావాన్ని వ్యక్తీకరించడమే సుఖ మైన మార్గం. కర్ణాటక సంగీతంలో మనకు అనేక ఉదాహరణలు కనిపిస్తాయి. ఒక్కొక్క చరణం పాడడం మొదలుపెడితే అకారాలతోనూ, రాగంతోను పట్టింది వదలరు. ఈ పరిస్థితుల్లో భావంకంటే రాగానికే ఎక్కువ ప్రాధాన్యతను చూస్తాం. అలాగే రంగస్థలం మీదకూడా ఆకారాలతో సంగీతాన్ని సాగదీసేవారు అనేకమంది

వున్నారు. ఇందువల్ల ప్రయోజనం శూన్యం. ఇంత సంగీతం పాడిన తరువాత ప్రేక్షకుల మెప్పును పొందుతాడా అంటే అదీ శూన్యం. అది సమయానుకూలం గానూ, హృదయరంజకంగానూ వున్నప్పుడే శ్రోతలను ఆనందింపజేయ గలుగుతాడు.

వాచికాభినయంలేని పద్యం గాని, గద్యంగాని అనవసరం. సంగీత ప్రాముఖ్యాన్ని వదలివేయమని నా భావంగాదు. ఆయా సన్నివేశాలలో రసప్రాధాన్యతను బట్టి ప్రవేశపెట్టడం మంచిది. ఇంకా నాటకాలలో రంగస్థల ఘట్టానికి దోహదం చేసే తెరవెనుక సంగీతముంది. ఇదికూడా భావప్రాధాన్యతను ద్యోతకం చేసేదిగా వుండాలి. చతుర్విధాభినయాలవల్ల ప్రేక్షకునిలో కలిగే రసానుభూతి ప్రేక్షకుడు చాటుగా వుండి వాచికం విన్నంత మాత్రంచేత కొంచెం ఇంచుమించు ఆ స్థాయికి వచ్చినట్లయితే వాచికానికి పరిపూర్ణత ఏర్పడినట్లు తలచవచ్చును.

సంభాషణలు :

చాలమంది నటీనటులు సంభాషణల విషయంలో చాల అశ్రద్ధ చేస్తున్నారు. ముఖ్యంగా అనేకమంది ప్రాంప్టరు మీద ఆధారపడుతున్నారు. సంభాషణలను బట్టీ పట్టలేని నటుడు సరియైన నటుడనిపించుకోలేడు.

సంభాషణలు నోటికి రానప్పుడు సంభాషణలో ఇమిడియున్న భావం మనకెలా తెలుస్తుంది ?

అసలు భావమే తెలియనప్పుడు భావాన్ని వ్యక్తం చేసేటట్లు ఆ సంభాషణను ఎలా పలుకగలం ?

అంతేకాదు. సంభాషణలో నున్న భావం తెలియనప్పుడు ఆ భావానికి తగిన అభినయాన్ని ఎలా అభినయించగలం ?

సంభాషణలు రాక, ఆ సంభాషణలకు తగిన అభినయం లేక, నటించే దేమిటి ? అలాంటి పాత్రలకు నటీనటులు తయారవడంకంటే మానుకోవడమే మంచిది.

ఒకవేళ సంభాషణలు వచ్చి వాటికి తగిన అభినయం లేకపోయినా ప్రయోజనం లేదు. సంభాషణలు కేవలం బట్టీ పట్టడంకంటే దానిని వుచ్చరించటం

నేర్చుకోవాలి. కొందరు వుచ్చరించడంలో శ్రద్ధ చూపక బట్టీపట్టడంలోనే కుతూహలం చూపుతారు.

ఇలా సంభాషణలను బట్టీ పట్టేటప్పుడు సంభాషణయొక్క భావమేమిటో తెలుసుకుంటే వుచ్చారణవిషయంలో బాధ పడాల్సిన అవసరం లేదు. దానంతట అదే వస్తుంది. నటీ నటులు ప్రదర్శనంలో సంభాషణలు వుచ్చరించలేకపోతే అభినయం కుంటుపడుతుంది. అలాగే పదిపంక్తులు కలిగిన దీర్ఘ సంభాషణ యొక్క గమనం కుంటుపడితే అభినయం వెలితిపడి వెలవెలపోతుంది. సన్నివేశం నాశనమై వూరుకుంటుంది. సంభాషణలు ఎప్పుడూ అనర్గళంగా వచ్చియుండాలి. ఇందులో ఒక నటుడు బట్టీ పట్టి, ప్రతినటునకు సంభాషణలు రానట్లయితే ఇద్దరి యొక్క అభినయం నటనా నాశనమై, ఇరువురూ రంగంమీద ఆభాసు పాలౌతారు. కనుక ఒక నాటకం ప్రదర్శించాలనుకున్న తరువాత, ముఖ్యంగా సంభాషణలను చక్కగా మననం చేసుకుని భావానికి తగినట్లు వుచ్చారణ, వుచ్చారణకు తగిన అభినయం, అభినయానికి తగిన రంగస్థల కదలికలూ ఎన్నోసార్లు సాధన చేయాలి.

సంభాషణల మధ్య

విరామం:

కేవలం సంభాషణలు బట్టీపట్టటమే చాలదు. ఆ సంభాషణలకు సరియైన విరామాలను కూడా ఇవ్వాలి. లేనట్లయితే, సంభాషణలు ఎత్తునుండి దూకే జల పాతపు ప్రోతలాగా వుంటాయి. ఒకే శ్రుతిలో సంభాషణలను ఎప్పుడూ పలక కూడదు. భావాన్నిబట్టే వాచిక విరామం వుండాలి.

తాను చెప్పదలచుకున్న మాటగాని, పాటగాని, ఎక్కడెక్కడ ఆపాలో, ఎంతసేపు ఆపాలో అర్థం చేసుకుని సంభాషణల మధ్య వుండే సంధులను విడగొట్టడం, విరామాన్ని పాటించడం ద్వారా సరిచూచుకోవాలి.

ఇలాగే ప్రశ్నించేవీ ఆజ్ఞాపించేవీ, ఆశ్చర్యాన్ని, సూచించేవీ, ముగిసిన విషయాన్ని గూర్చి, ముగియబోయే కార్యాన్ని గూర్చి, చేయబోయే ఘన కార్యాలను గూర్చి సంభాషణలను మాట్లాడేటప్పుడు, ఆయా వాక్యాల మధ్య కావాల్సిన విరామాన్ని ఎలా పాటించామో, అలాగే సంధులను విడగొట్టి సంభాషణలు పలకాలి.

నాటకంలో తాము ధరించే పాత్రను క్షుణ్ణంగా అర్థం చేసుకున్న నటీనటులకు వాక్యాల మధ్య ఇవ్వాల్సిన విరామాలను చక్కగా పాటించగలుగుతారు. ఒకో



సంభాషణ మధ్య కొద్దిపాటి విరామమిస్తే ఎంతో భావ గాంభీర్యత వస్తుంది. అలాగే సంభాషణల మధ్య వుండే సంధిని విడగొట్టటం, కలపడం కూడ సన్నివేశానికి ఎక్కువ వుపయోగ పడతాయి.

అపస్వరాలు :

ప్రతి సంభాషణా చక్కగా వర్ణించి అపస్వరాలు, అపశబ్దాలు లేకుండా నోటికి పట్టించాలి. ఇలా సంభాషణలు పలకగలిగినప్పుడు దాని అర్థ మేమిటో ఇట్టే తేలిపోతుంది. సంభాషణ అర్థాన్ని మనం సంపూర్ణంగా తెలుసుకో గలిగినప్పుడు స్పష్టంగా అన్ని సంభాషణలను పలుకగలుగుతాం.

ఇలా అర్థం చేసుకొన్న సంభాషణలను నటుడు సరిగా పలుకగలిగినా, కొన్ని సందర్భాలలో రంగస్థలంలో కంగారు వల్లా, భయంవల్లా గజగజ వణికి పోయి తొట్రుపాటుపడి సంభాషణలను నాశనంచేయడం జరుగుతూ వుంటుంది.

ఇందువల్ల సంభాషణయొక్క ఆర్థం అస్పష్టంగా వుండి మనం ఆశించిన సంభాషణయొక్క భావం శూన్యమౌతుంది. ప్రతిమాట తొట్రుపాటు లేక భావాన్ని విశదంచేస్తూ స్పష్టంగా అచ్చు గుద్దినట్లు మాట్లాడాలి.

భావగాంభీర్యం :

ఆలాగే సంభాషణలో ఉన్నటువంటి భావానికి తగినట్లు గాంభీర్యాన్ని కూడా ఇవ్వగలుగుతాడు. భావమేమిటో తెలియందే గాంభీర్యం కూడా తెలియదు.

సంభాషణలు చాలమంది ఒక పత్రికాపఠనం మాదిరి చదువుతారు. ఇందు వల్ల సంభాషణల ఆరోహణ, అవరోహణ చచ్చి, అన్నీ ఒకేరకం స్థాయిలో నడుస్తాయి. ఇందువల్ల భావాలయొక్క గాంభీర్యం స్పష్టంగా మనకు కనబడదు. సంభాషణలు ఎక్కడ తేల్చి మాట్లాడాలి ? ఎక్కడ నొక్కి మాట్లాడాలి ? ఎక్కడ తగ్గు స్థాయిలో పలకాలి ? ఎక్కడ హెచ్చు స్థాయిలో పలకాలో తెలుసుకోవాలి.

ఇలా హెచ్చు తగ్గులు గల ఉచ్చారణలో కొన్నిచోట్ల అక్షరాల క్రింద

ఒత్తులు ఎగిరిపోతూ వుంటాయి. గంభీరము అనడానికి బదులు గంబీరము అనడం, భావము అనడానికి బావము అనీ, శిక్ష అనడానికి శిచ్ఛ అనీ, ఖుంత అనడానికి ఖుంట అనీ పలుకుతారు. ఇందువల్ల భావగాంభీర్యం పూర్తిగా మృగ్యమై పోతుంది. కనుక సంభాషణలు వల్లించేటప్పుడే దానియొక్క భావాన్నీ, ఒత్తుల్నీ తెలుసుకోవాలి. ఇలా భావాన్నీ, ఒత్తుల్నీ సరిజేసుకున్నప్పుడే భావం గంభీరంగా వ్యంటుంది.

దీర్ఘ సంభాషణలు :

ఒక్క వుపన్యాసాల్లోనూ పురాణ కాలక్షేపాల్లోనూ తప్ప, దీర్ఘ ప్రసంగాలు జీవితంలో చాలా తక్కువ. ప్రసంగాలు దీర్ఘంగా వుండవచ్చు గాని, సంభాషణలు దీర్ఘంగా వుండవు.

నాటకంలో రెండు పాత్రలు దీర్ఘంగా సంభాషించడం అస్వాభావికమే. పూర్వ నాటకాలలో ఒక్కో పాత్రకు మూడు పేజీల వర్ణన వుంటూవుండేది. ఇలా ఒకేపాత్ర ఇంత దీర్ఘంగా మాట్లాడే సమయంలో మిగతా పాత్రలన్నీ స్తబ్దంగా నిలబడాలా ? లేక ఆసాంతంవరకూ ప్రతిచలనాన్నివ్వాలా ? ఈ పద్ధతి ఏమాత్రం మంచిదికాదు. కాని ఇలా సంభాషణలు దీర్ఘంగా మాట్లాడడంవల్ల ప్రేక్షకులను సంతృప్తి పర్చడం కూడా జరుగుతూ వుంది. రచయిత వ్రాయడంలోనే సాధ్యమైనంత కుదుచ సంభాషణలు వ్రాయడం మంచిది. అంతేగాక ఒకే ఒక నటుడు రంగం మీద తనలో తాను స్వగతాలు మాట్లాడడంలో కూడా చాలా దీర్ఘ సంభాషణ లుంటున్నాయి. ఇదికూడా స్వభావానికి విరుద్ధమైనదే. వున్మాదులు మినహా అంత దీర్ఘంగా స్వగతాలు మాట్లాడేవారు జీవితంలో చాల తక్కువ మంది వున్నారు.

స్వగతాలు :

ఈనాడు వెలువడే సాంఘిక నాటకాలలో స్వగతాలు తక్కువ. పౌరాణిక నాటకాల్లోనూ, చారిత్రక నాటకాల్లోనూ కావలసినన్ని స్వగతాలున్నాయి. అసలు స్వగతాలు నాటకంలో వుండాలా, అక్కరలేదా ? అనే మీమాంస కొంతమందిలో వుండనే వుంది. నటుడు ఈ స్వగతాలను ఎలా పలకాలి ? జీవితంలో ఎవ్వరూ

రెండోవాడికి తెలిసేటట్లు స్వగతాలు మాట్లాడరు. అలా ఎవరైనా మాట్లాడితే ఏదో ఒకరకమైన మానసిక దౌర్బల్యం వుండి తీరాలి. ఏ వ్యక్తి అయినా మాట్లాడే స్వగతాలు మనస్సులో అవస్థ పొందుతాయి. కవి వ్రాసేటప్పుడు ఆ యా పాత్రల మానసికావస్థలను తెలియజేయడానికే వ్రాయడం జరుగుతుంది. కాని ఈ స్వగతాలు రంగస్థలంమీద మాత్రం కంటకప్రాయంగా తయారయ్యాయి. ప్రేక్షకులకు వినబడేటంతటి బిగ్గరగా నటుడు స్వగతాలు పలికేటప్పుడు తన ప్రక్కనే వున్న పాత్రధారికి ఎలా తెలియకుండా వుంటాయి?

సహజంగా నేటి నాటకాలలో స్వగతాలు వలికేటప్పుడు ప్రక్కనున్న పాత్రను వదలి ప్రేక్షకుల ముందుకు వచ్చి అతని స్వగతాన్ని వల్లిస్తున్నాడు. కాని రానురాను మైక్ సహాయంతో ఆడే నాటకాలలో నటునియొక్క స్వగతాలను మైక్ ద్వారా లోపలనుండి ఒకరు మాట్లాడుతూ వుంటే రంగస్థలంమీద నున్న పాత్రధారి దానికి తగిన హావభావాలను చూపించడం ద్వారా ఎంతో రసవత్తరంగా సన్నివేశం ముగుస్తుంది. ఈ స్వగతాలనే సినిమాలలో ఎంతో స్వాభావికంగా అంతరాత్మ మాట్లాడినట్లూ చూపిస్తున్నారు. ఈనాడు వ్రాయబడే అనేక సాంఘిక నాటకాల్లో స్వగతాలకు ఎక్కువ ప్రాముఖ్య మివ్వడంలేదు. ఒకవేళ అలాంటి స్వగతాలుంటే మైక్‌ల ద్వారా వెల్లడిస్తున్నారు. ఈ విధానాన్ని చాలమంది ఆచరిస్తున్నారు కూడా.

త్వరిత ఉచ్చారణ :

నటీనటులు వాచికాభినయంలో వారు మాట్లాడే సంభాషణలు త్వరత్వగా మాట్లాడుతూవుంటారు. ఈ త్వరిత వుచ్చారణలో మాటలను మ్రింగివేస్తూ వుంటారు. ఉదాహరణకు పౌరోహితులు మంత్రాలు వల్లించినట్లూ, సంధ్యావందనం జరిపించినట్లూ వుంటుంది. త్వరితంగా సంభాషణలు మాట్లాడడంవల్ల ప్రతిధ్వనులు వచ్చే హాలులో గజిబిజిగా వుండి శ్రోతలకు ఏమాత్రం ఇంపుగా లేక విసుగుపడడం జరుగుతుంది. ఇందువల్ల ప్రదర్శనాన్ని చూచి ఆనందించలేరు.

పాటలు - పద్యాలు :

నాటకంలో పాటలు పాడే నటుడుగాని గాని, సభల్లో కచేరీలు చేసే నటీనటులు గాని కొన్ని ముఖ్యవిధుల్ని గుర్తించాలి. ముఖ్యంగా గమనించాల్సిన

విషయం ఏమంటే- పాట పాడేటప్పుడు, రాగధోరణిలో తన్మయావస్థను బొంది రెండవ చరణాన్ని మరిచిపోయి మొదటి చరణాన్నే తిరిగి తిరిగి అనేకసార్లు పాడడం మంచిదికాదు. తాను పాటను, పద్యాన్ని ఎలా రిహార్సల్ చేశాడో అలానే ఆ పాట పాడడం మంచిది.

అలాగే ప్రతిఒక్క- రచనలోని పాటల్నీ, వాటియొక్క- పదాల్నీ, అర్థాల్నీ రచనయొక్క- పూర్తిభావాన్ని వెల్లడించాలి. పాడే సమయంలోనూ, మాట్లాడే సమయంలోనూ ఇతర ఆలోచనలు రానీయకూడదు. ఎంతో నిర్మలంగానూ, నిశ్చింతగానూ వుండి తదేకదృష్టితో అనుకున్న కార్యక్రమాన్ని జయప్రదంచేసి ప్రేక్షకులను రంజింపజేయాలి. ఎవరి పాట, మాట వినడానికి ప్రేక్షకులు హాజరయ్యారో వారికిఆ నటుడూ గాయకుడూ ఆశాభంగాన్ని కలిగించకూడదు.

గాయకుడు ఎప్పుడూ వుద్రేకంలోనో ఉత్సాహంలోనో పడిపోయి శృతులు, స్థాయిలా తప్పడం కద్దు. ప్రతిక్షణం తనయొక్క- గొంతు శ్రుతిలోవుండి సరియైన స్థాయిలో వుందో లేదో తరచు గమనిస్తూ వుండాలి. ఎప్పటికప్పుడు ప్రేక్షకుల మనస్తత్వాన్ని గమనించాలి. సున పాటకూ, మాటకూ ప్రేక్షకులు ఎలాంటి అనుభూతిని పొందుతున్నదో గమనించి ఎంతో సమర్థనీయంగా కార్యక్రమాన్ని రక్తి గట్టించాలి.

గొంతులో అనవసరమైన కీచుతనాన్ని వణుకునూ రానీయకుండా ప్రయత్నించాలి. కీచుగొంతులు ఏమాత్రం సభారంగానికి పనికిరావు. గొంతులచ్చాతా గజిబిజి ఎక్కువగా వుండకూడదు. కొంతమంది పాట పాడేటప్పుడు పళ్ళు బిగించి పాడుతూ శబ్దాన్ని నొక్కివేస్తారు. ఇది మంచిపద్ధతి కాదు. ముక్కుతో పాడటం గాని, సాహిత్యాన్ని తప్పులతో చదవడంగాని చేయకూడదు. సాధ్యమైనంతవరకు శ్రోతలకు మనోహరాన్ని కలిగించాలి.

# ఆంగికాభినయం

తలలేని మొండెం, అంగాల సహకారంలేని అభినయం- రెండూ ఒకటే. అంగ, ప్రత్యంగ, ఉపాంగా లనేవి మనకు వాడుకలోలేని పదాలు. వీటిని తొలిగా



వినడంవల్ల క్రొత్తగా కనుపించినా. విషయ పరిశీలనవల్ల అనుకున్నంత కష్టం కనబడదు.

మహానదుల్లో ఉపనదులు కలిసినట్లూ, ఉప నదులలో వాగులూ, వాగులలో సెలయేర్లూ కలిసినట్లు మన అభినయాల్లో కూడ వివిధ అంగాలయొక్క సమ్మేళనం ద్వారా, మనకు సరియైన అభినయం వెలువడుతుంది.

అవయవాల సమ్మేళనమే అభినయానికి మూలం :

మనలోవున్న ఒక భావాన్ని ఇతరులకు తెలియజేయా లనుకున్నప్పుడు భాషద్వారా ఆ భావాన్ని వెల్లడించడంతోపాటు మనయొక్క అంగచలనాన్ని కూడా వుపయోగిస్తున్నాం, ప్రతి మాటకూ, ప్రతి అవయవం కదలక పోయినా, ఏదో ఒక మాటకు ఏదో ఒక అవయవం కదులుతూనే వుంటుంది. కాని ఏ అంగముయొక్క చలనమూ లేకుండానే సంభాషణద్వారానే ఒక భావాన్ని ప్రక టించగలం. ఇందువల్ల మనకు కావలసినంత భావప్రకటనా, రసపుష్టి కనబడదు.

నోరులేని ప్రతి మూగవాడూ సంజ్ఞలద్వారా తన భావాలను వెల్లడిస్తున్నాడు. ఇదే విధానంతో మనం మూకాభినయం చేసే సమయంలో అత్యంత నిపుణతతో, అనేక భావాలను వెల్లడిస్తున్నాం. భావాలను భాషద్వారా ఎలా వెల్లడించగలమో అలాగే వివిధ అవయవాల చలనం ద్వారా కూడా వెల్లడించగలం.

మాటలవేగమూ, చేతులవేగమూ :

ఉదాహరణకు, "ఒరేయ్! ముందు నీవు బయటికెళ్ళు" అని కేకవేశాడు. వాడు కదల్లేదు. మరల "ఊఁకదలవే" అని హుంకరించాడు. మొదటి దఫాకంటే రెండవ దఫా వేగం ఎక్కువైంది. 'ఊఁకదలవే' అనే తూకంతో రెండవ వ్యక్తి బయటికి వెళ్ళిపోయాడు. అంటే వేగంవల్ల ఒకే సంభాషణద్వారా రెండు భావాలను కలిగించాం. సంభాషణయొక్క వేగాన్ని మార్చినందువల్ల ఎంత వ్యత్యాసం వచ్చిందో మనకు బోధ పడింది. అంటే కేవలం సంభాషణ ద్వారా ఒక భావాన్ని అభినయించా మన్నమాట.

కాని, మాటతోపాటు మన అవయవాలు కూడా కదుల్తూ వుంటాయి. 'ఒరేయ్ ముందు బయటికెళ్ళు' అని మాటనేవాడాం. ఇదే సందర్భంలో 'ఊఁ-కదలవేం'అని చేతిని వేగంగా గుమ్మంకేసి చూపించాం. అంటే ఇక్కడ చేతిని వుపయోగించా మన్నమాట, నోటిమాట. చేతి అభినయం. రెంటియొక్క సమ్మేళనం ద్వారా మన అభినయం ఎంతో బలపడింది. ఒక భావాన్ని భాషతో వెల్లడించ గలిగినా, వేగంకోసం, సన్నివేశానికి మరింత పుష్టి నిచ్చేందుకు అనేక అంగాలను వుపయోగించవచ్చును.

నాటక ప్రదర్శనంలో ఒక పాత్రనుతీసుకుని నటించా లనుకున్నప్పుడు ఆ పాత్రయొక్క ప్రాముఖ్యాన్ని గమనించి నటించాలి. అందుకు ఏయే అవయవాలు ఎందుకు వుపయోగపడతాయో తెలుసుకోవాలి.

అంగములతో విభిన్న సన్నివేశాలలో వుత్పన్నమయ్యే భావాలను చూపించటమే ఆంగికాభినయంయొక్క ప్రాముఖ్యం. ఆంగికాభినయమనగా హస్త విన్యాసాములద్వారా భావాన్ని విశదీకరించడం. నాటకంలో సాత్విక, వాచిక, ఆహార్యాభినయాలు ఎంత ముఖ్యమో ఇది కూడా అంతే. అంటే పద్యంగాని, పాటగాని, వచనంగాని, గొంతుతో వెల్లడించినా, ఆంగిక చలనాన్ని చూపించటంవల్ల-ఒక వేళ నోటిమాట వినబడకపోయినా, ఆంగికాభినయం ద్వారా భావాన్ని ప్రేక్షకులు తెలుసుకోవడానికి అవకాశ ముంటుంది. ఆంగికచలనం ద్వారా నటుడు తన పాత్రయొక్క ధీమాను, హుందాతనాన్ని, తీవిని ప్రదర్శించ గలుగుతాడు.

అవసరమైన ఆంగికచలనం:

ఇక్కడ ఒక సందేహం రావచ్చు. వాచికం ద్వారా, సాత్వికం ద్వారా భావాన్ని వెల్లడిస్తున్నప్పుడు ఆంగిక చలనంయొక్క అవసరమేముందని? వాచిక విధానంతో వెల్లడించే భావంతోపాటు ముఖభావాలు, దానికి తగినట్లే ఆంగికాభినయం కూడ చూపినప్పుడు ఆ అభినయం ఎంతో రసవత్తరంగా వుంటుంది. మానవుని దినచర్యలో చేసే ప్రతి పనికి, చెప్పే ప్రతి మాటకు అంగాలను వుపయోగించుతున్నాడు. ఒకరి మీద మనకు కోపంవస్తే, నీ దొక్క పగలదీస్తానంటూ చేతులు జోడించి వేలుతో హెచ్చరిక చేస్తున్నాం, అలాగే తప్పుచేసిన మనిషిని ముక్కుమీద వ్రేలు వేసుకుని 'ఔరా, ఎంత తప్పుచేశావూ' అనడం మనకు తెలుసు. ఒక

చోట అగ్నిప్రమాదం జరుగుతూవుందని చెప్పటానికి ఎంతో ఆంగికచలనాన్ని ప్రదర్శిస్తున్నాం. మిత్రుల్ని ఆలింగనం చేయడంలో, నమస్కారం చేయడంలో అంగాలను వుపయోగించుతున్నాం. మన మనస్సులోవున్న అభిప్రాయాన్ని మరింత స్ఫుటంగా చెప్పడమే ఆంగికాభినయంయొక్క ప్రత్యేకత.

ఆంగికాభినయం
హద్దుల్లో వుండాలి :

ఆంగికాభినయంలో ఇష్టమొచ్చినట్లు అవయవాలను వినియోగించ కూడదు. నేటి మన పద్య నాటకాల్లో ఈ కడుపుకోసం కావడి మోయుచుంటినని కడుపు చూపించటానికి బదులు నెత్తి కొట్టుకోవడం చేస్తున్నారు. ఆంగికాభినయానికి కూడ కొన్ని హద్దులున్నాయి. ఆ హద్దుల్ని మనం అధిగమించకూడదు. సందర్భాన్ని బట్టి, పాత్రౌచిత్యాన్నిబట్టి సందర్భానుసారంగా తూచినట్లు అంగాలను ఉపయోగిస్తేనే సరియైన ఆంగికాభినయం అనిపించుతుంటుంది. అంగాలచలనంలో ఇక్కడ ఇలా చేయవలసి వచ్చింది గనుక చేస్తున్నాననన్నట్లుండకూడదు. అతిస్వభావికంగానూ, సహజంగానూ వుండాలి. ప్రయత్నపూర్వంగా అవయవాలను వుపయోగించినట్లు వీసమెత్తుకూడా కనబడకూడదు. నోటినుండి వెలువడే ప్రతిమాటకు, చేసే ఆంగికాభినయానికి ఎంతో సన్నిహిత సంబంధముండాలి. ఈ రెంటినీ వేరుగా విడదీయడం మంచిది కాదు. ఈ సమన్వయంలో ఏ మార్పు కలిగినా, అసహజంగానూ వెగటుగానూ వుంటుంది. లేదా చేతగానితనాన్ని వెల్లడించాల్సి వుంటుంది. ఆంగికాభినయానికీ తార్కాణం భరతనాట్యంలోగాని జానపద నృత్యాలలోగాని భావానికి తగినట్లు అందరూ ఒకే సారి పదం పాడడం, అడుగు త్రొక్కడం. చేతులు ఎత్తడం త్రిప్పడంలో, ఏ ఒక్క చేతినిగాని, కాలినిగాని భిన్నంగా త్రిప్పినట్లయితే అందరియొక్క సమిష్టికృషి నాశనమౌతుంది. నాటకంలో నటుడు చేతులతోనే ఎక్కువ అభినయించాల్సి వుంటుంది. ఆ చేతులను అతి నాజూకుగా ఉపయోగించాలి. ఆంగికాభినయంలో ప్రతి నటుడు ఎంతో ఓర్పుతో కృషిచేయాల్సిన అవసరముంది. కూర్చున్నా, నిలుచున్నా, ప్రక్క నటునితో మాట్లాడినా ఒక ప్రత్యేక విశిష్టత ఆంగిక విన్యాసంలో కనబడాలి. అది పాత్రోచితంగానే వుండాలి. ఇందుకు అంగాలూ, ఉపాంగాలూ, ప్రత్యంగాలూ నటీ నటుల విజ్ఞానానికి ఎలా వుపయోగపడతాయో తెలుసుకోవడం ఎంతైనా అవసరం.

# సినిమా, నాటకాలలో నటన

నాటకం సినిమాను గురించి మనం చర్చించేటప్పుడు ఒక ప్రధానమైన విషయం గుర్తించాలి. సినిమాలో నటుడు నటించడంవరకే గాని ప్రేక్షకులతో ఆ నటునికి ఎలాంటి సంబంధ ముండదు. కాని నాటకంలో ప్రదర్శించే నటునికీ, ప్రేక్షకులకీ ప్రత్యక్ష సంబంధ ముంటుంది.

అంతే కాక సినిమాలో నటన సినిమా అంతా పూర్తిగా తయారై బయట పడితేగాని తెలియదు. ఈ లోగా మపం తప్పుచేశామో ఒప్పుచేశామో నిర్ణయించే వారు సెట్‌లో వుండే డైరెక్టరు మినహా మనకు సూచన లిచ్చేవారు ఇతరులు ఎవరూ వుండరు.

మనం ఒకసారి సినిమాలో నటించిన తరువాత ఆ నటననుమార్చి ఇంకా వున్నతంగా నటించడానికి ఏ మాత్రం వీలుండదు. కాని నాటకంలో అలా వుండదు. ఒక నాటకంలో మనం ఒక పాత్రను ధరించా మనుకుందాం. ఆ నాటకాన్ని ఎక్కువ మంది ప్రేక్షకుల్లో ప్రదర్శించాం. ప్రదర్శనానంతరం ప్రేక్షకులు మనం ధరించిన పాత్ర మీద రకరకాలైన సూచన లిస్తారు. ఆ అమూల్యమైన సలహాలను పాటించిన నటుడు రెండవసారి ప్రదర్శించబోయే నాటక ప్రదర్శనంలో ఇంకా బాగా నటిస్తాడు. అంటే మొదటిసారి తన నటనాభినయంలో వచ్చిన అనేక లోపాలను ఈ ప్రదర్శనలో రాకుండా నటిస్తా డన్నమాట. ప్రేక్షకులు ఎంతో అభినందించి ఇంకా మరికొన్ని సలహాలు ఇస్తారు. ఆ సూచనలు కూడ పాటించి మూడవ ప్రదర్శనంలో ఎంతో ఉన్నతంగా నటిస్తాడు. ఇలా ప్రతి ప్రదర్శనానికి ప్రతి పాత్ర ఎంతగానో రాణించి కవి సృష్టించిన పాత్రయొక్క పరిపక్వమైన స్థాయికి అందుకో గలుగుతారు.

తప్పుచేశామూ
అంటే-తప్పు తప్పే:

ఇందువల్ల ఆ నటీ నటులు అభినయంలో ఎంతో గొప్పతనాన్ని, అనుభవాన్ని సంపాదించ గలుగుతారు. ఇలాంటి పరిణామానికి సినిమాలో అవకాశ ముండదు. నాటక రంగంమీద ఒక తప్పుచేసి దిద్దుకున్నట్టు సినిమాలో

దిద్దుకోలేం. ఒక తప్పుచేశామూ అంటే ఆ సినిమా ఉన్నంతకాలమూ ఆ తప్పు తప్పు గానే వుండిపోతుంది. అంతేగాక రంగస్థలంలో మనం నటిస్తున్నప్పుడు ప్రేక్షక స్థానాల్లో కూర్చున్న సహృదయులైన ప్రేక్షకులు మన నటనతోపాటు ప్రయాణం చేస్తారు. నాటకంలోవున్న అన్నిరసాలలోనూ వారూ కదులుతారు. అలా కదల గలిగినప్పుడే మన నాటక ప్రదర్శనం జయప్రదం అయిందన్నమాట.

ప్రేక్షకులులేని
ప్రత్యక్ష నటన:

ఉదాహరణకు సినిమాలో ఒక హాస్య పాత్రధారి నటిస్తున్నప్పుడు ఎవరూ అక్కడ ఆ రసాన్ని ఆస్వాదించడానికి అవకాశం వుండదు. ఎవరు ఎలాంటి శబ్దం చేసినా నవ్వినా అంతా రికార్డు అవుతుంది. కనుక ఎవ్వరూ ఆ సమయంలో ఆ హాస్యానికి ప్రోత్సాహం ఇవ్వలేరు. కాని నాటకరంగ స్థలంమీద అదే హాస్య పాత్ర నటిస్తూన్నప్పుడు ఆ పాత్ర మాట్లాడే ప్రతి మాటకూ, ప్రతి అభినయానికి ప్రేక్షకులు కడుపు చెక్కలయ్యేటట్లు నవ్వుతారు. ఇలా ప్రేక్షకులిచ్చే ప్రోత్సాహాన్ని చూచిన నటుడు తన పాత్రను ఇంకా ఎంతో బాగా నటించ గలుగుతాడు. ఇందులో ఒక ప్రమాదం కూడ లేకపోలేదు. ప్రేక్షకులు నవ్వుతున్నారు గదా అని ఆ నటీ నటులు అతిగా అభినయంచేసి పాత్రయొక్క విశిష్టతను నాశనం చేయకూడదు. ఇలాటి సమయంలో నటీ నటులకు ఎంతో నిగ్రహం అవసరం. కొంతమంది నటీ నటులు ఇలాంటి నిగ్రహాన్ని కోల్పోవడం కూడ కద్దు. అందువల్లనే అలాంటి నటులను అతిగా అభినయించ రాదంటారు. ఇంకా కొంచెం అసంతృప్తి చెందితే కోతి గంతులు వేశాడంటారు.

నాటకంకంటే
సినిమానటనే కష్టం:

నటుడు నటనలో ఎంత సమర్థుడైనా అతను నటించే పాత్రలో వచ్చే ఆయా రసానుభూతులలో తగిన నిగ్రహాన్ని చూపించినప్పుడే నటన హద్దులలో వుండి ప్రేక్షకుల హృదయాలలో హత్తుకొంటుంది.

ప్రేక్షకులిచ్చే ప్రోత్సాహాన్ని తగుమోతాదులోనే మనం స్వీకరించాలి. వారు కలిగించే ఉత్సాహానికి ఉబ్బితబ్బిబ్బుకావడం మంచిది కాదు. సినిమాలో ఇలా ఉబ్బి

తబ్బిబ్బు లవ్వడానికి అవకాశం వుండదు. కారణం ప్రేక్షకులుండరు గనుక. నటనా సామర్థ్యమున్న సినిమా నటుడు కెమేరాముందు అద్భుతంగా నటించగలడు. ఎదుట ప్రేక్షకులుండరు గనుక వారిచ్చే ప్రోత్సాహానికి వుబ్బితబ్బిబ్బు లవ్వాల్సిన అవసరంలేదు. కనుక చక్కగా నటించ గలుగుతారు.

నటనా సామర్థ్యం ఎక్కువ వున్న నటుడు సినిమాలలో ఎక్కువ రాణించ గలడు. ఎంతసేపూ మన ముక్కూ ముఖం మన అందచందాలతో ఎక్కువసేపు సినీ ప్రేక్షకుల్ని ఆనందింప చేయడానికి తగిన నటనాభినయం వుండాలి.

నాటక రంగంమీద నటకులకు ప్రోత్సాహాన్నిచ్చే ప్రేక్షకులు సినిమా తీసే టప్పుడు వుండరు గనుక సినిమా నటుని నటన చాల కష్టమైంది. అంతేకాదు, రంగస్థలంమీద కొంతమంది నటీ నటులు హాలుకు నిండుగా ప్రేక్షకులుండే గాని ఉత్సాహంగా నటించలేరు. మరి కొంతమంది ఎంతో బాగా నటిస్తూ ప్రేక్షకుల చప్పట్లు విన్నకొద్దీ శృతిమించి నటిస్తారు.

ఏ ఒక్క అవకాశమూలేని
సినిమా నటన :

ఈ మూడింటిలో సినిమా నటకునికి ఏ ఒక్క అవకాశమూ లేదు. ఎలాంటి ప్రేక్షకుల సహకారమూ వుండదు. కేవలం తన శక్తి సామర్థ్యాలమీదే ఆధారపడి వుండాలి. ఈ విషయంలో నాటకంలో నటనకంటే సినిమా నటనే చాల కష్టమైనది. నాటకంలో నటుడు ఏడిస్తే ప్రేక్షకుడు కూడా ఏడుస్తాడు. ఇది ప్రత్యక్షంగా అప్పటికప్పుడు జరిగే విషయం. ఇందువల్ల ఆ విచారంతో నటించే నటుడు ఏదో ఒక సందర్భంలో ప్రేక్షకులలో ఎవరినో ఒకరిని చూడడంవల్ల తాను ఇంకా వుత్తేజాన్నిపొంది తన పాత్రలో ఎక్కువ లీనమై నటిస్తాడు. లీనమవడం అంటే తాదాత్మ్యం పొందడంమాత్రం కాదు.

తప్పచేయనూవచ్చు
దిద్దుకోనూవచ్చు :

అంటే నాటక ప్రదర్శనాక్రమంలో అనేక విషయాలను మనం సవరించుకోవచ్చు. మనం ప్రదర్శించే నాటకాన్ని ప్రజలు ఎలా గౌరవిస్తున్నారో, మన అభినయాన్నిచూచి ఎలా ఆనందిస్తున్నారో, దేనిని అసహ్యించుకుంటున్నారో, వారు

ఇంకా మనలనుంచి ఎలాంటి నాటకాలు, ఎలాంటి అభినయం, ఎలాంటి హాస్యం, పాటలు కావాలని కోరుతున్నారో మనం తెలుసుకోవడానికి అవకాశ ముంటుంది. ఈ విధంగా ఎంతకాలం ప్రదర్శనాలు ఇవ్వగలుగుతామో అంతకాలం ప్రేక్షకుల నుండి ఎన్నో అమూల్యమైన సలహాలను పొందగలుగుతాము.

ఇందువల్ల ప్రేక్షకులు ఎలా మారుతున్నారో, ప్రేక్షకులనుబట్టి మనం ఎన్ని విధాలుగా మారుతున్నామో, ఇంకా ఎన్నివిధాల మారాలో తెలుసుకో గలుగుతాం. సినిమాలో మనం చేసిన తప్పులను రెండవ సినిమాలోనే సరిదిద్దుకో గలుగుతాం లేక అనేక రీటేక్స్‌ద్వారా ఆ తప్పులను సవరించుకోవచ్చు. అందువల్ల మనం నేర్చు కున్న గుణపాఠ మేమిటంటే- నాటకంలో తప్పుచేస్తే సర్దుకోగలం కాని, సినిమాలో తప్పుచేస్తే సర్దుకోలేం. ఇందువల్ల సినిమా నటునిమీన ఎక్కువ బాధ్యత లున్నా యనేది తేటతెల మ్లౌతూంది.

కెమేరాయే ప్రేక్షకుడు:

సాధ్యమైనంతవరకు తప్పులు దొర్లకుండా చూడడానికి ప్రయత్నించాలి. అంటే సినిమా నటునికి ఎటువంటి నటనా సమర్థత వుండాలో మనకు బోధపడుతూ వుంది. ఈ కారణంవల్ల సినిమా నటుడు ఎక్కువ కృషిచేసి తన సమర్థతను ఋజువు చేసుకోవాలి. సినిమా నటునికి కెమేరాయే ప్రేక్షకుడు. కెమేరాముంను నిలబడబోయేముందే తను నటించబోయే నటనకు ప్రేక్షకుడు ఎలా ఆనందించ గలడో ఆలోచించుకుంటే చక్కగా నటించగలడు. ఈ అనుభవం నాటకరంగం నుంచి వచ్చిన నటీ నటులకు ఎక్కువగా వుంటుంది. అదివరకు ప్రేక్షకుల ముఖం చూడని నటీ నటులకు ఈ విధానం కొంత కష్టంగానే వుంటుంది; కనుక సినిమా నటునికి కెమేరా ఒక రంగస్థలం లాంటిది. లెన్సు ప్రేక్షకుని కన్నులాంటిది. కెమేరాముంను నిలబడ్డ నటుడు తెరమీద సినిమాను ప్రేక్షకుడుచూచి ఎలా ఆనం దాన్ని పొందుతాడో అనేది గుర్తుంచుకుంటే బాగా నటించవచ్చు. ఇందుకు వుదా హరణ-నటుడు కూడా మరొక సినిమానుచూచి పొందే ఆనందంలాంటిది. ఈ అను భవం సినిమా నటునికి చాల వుపయోగపడుతుంది. సినిమాల్లో నటించే నటుడు. ఎక్కువ సినిమాలను చూడడంద్వారా ప్రేక్షకుల మనస్తత్వాలను గమనించి ఎంతో బాగా నటించ గలుగుతాడు.

నాటక రంగంతో సంబంధంలేని నటీ నటులకు ఇదే సరియైన అనుభవం. ఇందువల్ల ప్రేక్షకులయొక్క మనస్తత్వం, వారి ఆదరాభిమానాల్నుంచే కాక ఆయా సినిమాల్లో నటించే నటుల అభినయాలనుంచి కూడా ఎంతో విజ్ఞానాన్ని పొంద గలుగుతాడు.

# ఆహార్యం, వేషధారణ

కవిదృష్టి :

రచయిత నాటకం ప్రాసేటప్పుడు తాను సృష్టించాలనుకున్న పాత్రలకు



వేషధారణ ఎలా వుండాలి అనే విషయాన్నికూడ దృష్టిలో పెట్టుకునే నాటకాన్ని ప్రాయటం జరుగు తుంది. కవి సృష్టించిన పాత్రకు తగిన వేషధార ణతో నాటక ప్రదర్శనం జయప్రదం చేయగలిగితే పాత్రలు సంపూర్ణతను పొందాయని చెప్ప వచ్చును. కవి సమాజం సంస్కృతీ నాగరిక తలను బట్టే పాత్రలను సృష్టించుతాడు గనుక వాటిని ఆర్థం చేసుకుని తగిన వేషధారణను ధరించాలి.

దేశం, కాలం :

దేశకాల పరిస్థితులనుబట్టి భాషలు ఏర్పడినట్లే మనదేశంలో ఆ యా ప్రదేశాలలో కట్టు బొట్టులు మొదలైన వేషధారణకు సంబంధించిన విషయాలలో అనేక విధాలున్నాయి. ఉదాహరణకు తమిళుడు అడ్డకట్టు - ఆంధ్రులు పంచకట్టు - బెంగాలీలు లాల్చీలూ - మహమ్మదీయులు గడ్డాలూ ధరిస్తారు. ఆ విధంగా ఎన్నో వుదాహరణలు తీసుకో వచ్చును.

కాలం :

పురాణయుగంలో వున్న దశరథునికీ, చరిత్రయుగంలో వున్న అక్బరుకీ ఒక రకమైన దుస్తులు ఎలా వేయగలం ? ఆనాడున్న చెమ్కీ కోట్లు ఇవాళ

సామాన్య పౌరులు ధరిస్తున్నారా ? ఆనాటి పురాణ పురుషులూ, రాజాధి రాజులూ ఇవాళ వున్నారా ? లేరు. కాని ఆనాటి చరిత్రలనూ, పురాణాలనూ నాటకరూపంలో ప్రదర్శించా లనుకున్నప్పుడు, ఆనాటి నాగరికతా, వేషభాషల ననుసరించే దుస్తులూ, ఆభరణాలు ధరించాలి. అర్జునుని పాత్ర ధరించి కోటూ - బూటూ వేస్తే ఎంత అసహ్యంగా వుంటుంది? కనుక పాత్రోచితంగానే వేషధారణ కూడా వుండాలి.

జీవితంలో :

మనిషిని చూచి ఈ మనిషి ఫలానా అని గుర్తుపడుతున్నాం. నామాలు ధరించినవారిని వైష్ణవులని, విభూతి పెట్టినవారిని శైవులని, బొట్టు లేనివారిని క్రైస్తవులని వేషధారణనుబట్టి గుర్తించ గలుగుతున్నాం. పైన వివరించినవన్నీ కులాలవారీగానూ, మతాలవారీగానూ వచ్చాయి గనుక ఫలానా బొట్టుపెడితే ఫలానా కులానికి చెందినవాడు అని మనకు నిత్యజీవితంలో తెలిసిపోతూ వుంది.

శీలాన్నిబట్టి వేషధారణ :

వేషధారణను బట్టి, వారి చిత్త ప్రవృత్తులబట్టీ వారి శీలాన్ని కూడ తెలుసుకో వచ్చుమ. వేశ్యగా వున్న చింతామణికి పతివ్రతగా వున్న సావిత్రి పాత్రకు వ్యత్యాసం వుంది. అలాగే గర్వంతో వున్న సత్యభామ పాత్రకు సాత్వికభావంతో వున్న రుక్మిణి పాత్రకు కట్టులోనూ, బొట్టులోనూ వ్యత్యాసం చూస్తున్నాం. ఇలాంటి వేషధారణనుబట్టే ఈమె పతివ్రత లాగుందనీ, ఆమె పద్మిని జాతి స్త్రీ యనీ, మరొక ఆమె శంకినీజాతి స్త్రీ యని తెలుసుకో గలుగుతున్నాం.

స్త్రీలు, కట్టుబొట్టులు :

స్త్రీలలో అనేకరకాల వేషధారణలు చూస్తున్నాం. బ్రాహ్మణ స్త్రీల కట్టుకు, ఇతర కుల స్త్రీల కట్టుకు ఎంతో వ్యత్యాసముంది. ఇంటిలో వుండే స్త్రీల కట్టుకు, పొలంలో పనిచేసే స్త్రీల కట్టుకు ఎంతో భేదముంటుంది. ముఖ్యంగా జీవిత చిత్రాలను సృష్టించే నాటకాలను ప్రదర్శించేటప్పుడు దేశకాల పరిస్థితులనుబట్టి వేషధారణను మార్చుకోవాలి.

వయస్సునుబట్టి :

దశరధుని పాత్ర ధరించే పాత్రధారి యువకుడైనా వేషధారణలో మార్పు చెంది దశరధుని వయస్సులో కనబడినప్పుడే ఆ పాత్రకు తగిన వేషధారణను

ధరించాడని చెప్పవచ్చు. అలాగే భీముడు బహా బలాఢ్యుడు. ఆ స్థానంలో ఒక సన్నని మనిషి చేతికి పెద్ద గదాదండం ఇచ్చి ఈయనే భీము డనుకోమంటే ఎలా అనుకోగలం? కనుక వయస్సునుబట్టి దుస్తుల్లోనూ, ముఖాది ఆకారాల్లోనూ మార్పును తీసుకురావాలి.

నేటి ప్రదర్శనాలు :

నేటి మన నాటక ప్రదర్శనాలలో పురాణ యుగపు నాటకాలకు, చరిత్రాత్మకపు నాటకాలకు ఒకేరకమైన దుస్తులు వాడుతున్నారు. నాటకం చరిత్రాత్మకమైనా, పౌరాణికమైనా స్త్రీ పాత్రలు కాళ్ళకు మేజోళ్ళు తొడగడం, బర్మా చుట్టలు ముడి వేయడం, జడ వెంట్రుకలు కత్తిరించడం, ఆనాటి ఆభరణాలను తీసివేసి రకరకాల గాజులు, నెక్లెస్లు, ఎత్తు చెప్పులు, కళ్లజోళ్లు మొదలైన వాటిని ధరిస్తున్నారు. ఈ విధమైన వేషాధారణ పాత్రలయొక్క గొంతు నులమడమే ఔతుంది.

ఒక ఉదాహరణ :

ఒక చింతామణి నాటకప్రదర్శనంలో చింతామణి పాత్రకంటే, చిత్ర పాత్ర అందంగా వుంది. కారణం చిత్ర పాత్రధారి తొలిగా రంగస్థలం ఎక్కడం అదే మొదటిసారి. అందువల్ల వూళ్ళో నగలూ, మంచి పట్టుచీరా ధరించాడు. వేషం వెయ్యాలవే వుబలాటంలో పాత్ర ఔచిత్యాన్ని ఖూనీ చేశాడు. ఇలా ఎన్ని ఉదాహరణలైనా ఇవ్వవచ్చును.

అనౌచిత్యం :

సీత పాత్రధారి బూట్లు తొడగడం, కృష్ణుడు మీసాలు పెంచడం, గయుడు క్రాపింగ్ జుట్టుతో రావడం, అర్జునుడు ప్రెంచికట్ మీసాలు ధరించడం లాంటివి ఎన్నో అనౌచిత్యాలను చూస్తున్నాం. ఇంకా నేటి మన పాత్రల్లో 20 సంవత్సరాల పాత్రలను 45 సంవత్సరాలవారు ధరిస్తున్నారు. ముడుతలు పడిన ముఖంలో యువకునకు కావలసిన సుకుమారం ఎక్కడనుంచి వస్తుంది? లవకుశ నాటకంలో లవకుశ పాత్రలు 18 సంవత్సరాల అబ్బాయిలు ధరిస్తున్నారు. అలాగే పద్మవ్యూహపు అభిమన్యుడు, పలనాటి బాలచంద్రుని పాత్రలకు 30 సంవత్సరాల వ్యక్తులు తయారవుతున్నారు. ఈవిధంగా పాత్ర ఔచిత్యాన్ని వదిలి అనౌచిత్యాలకు పాల్పడుతున్నారు.

### వృద్ధ పాత్రలు :

ఏ పాత్రకు తగిన వయస్సులో వున్నవారు ఆ పాత్రలకుంటే మంచిది. అలా లేనప్పుడు వేషధారణలో ఎంతో జాగ్రత్త వహించాలి. వృద్ధ పాత్రలను యువకులే ధరించాల్సివస్తే, వృద్ధుని కుండాల్సిన ముఖంలో ముడుతలు, పీక్కు పోయిన కళ్ళు, బిక్క చిక్కినదేహం మొదలైన వాటిని సరిచూచుకోవాలి.

### దైనందిన జీవితంలో :

మానవుడు నేటి సాంఘిక దైనందినజీవితంలో ఎన్నో వేషధారణలను అవలంబిస్తున్నాడు. తలంబరాల పెళ్లికొడుకు, పల్లకీలో పెళ్ళికొడుకు, కోర్టులో జడ్జి, ప్లీడరుగా, డాక్టరుగా, బంట్రోతుగా, ముద్దాయిగా, ఆఫీసు గుమాస్తాగా ఇలా ఎన్నెన్నో వేషధారణలు. వీటి నన్నిటినీ పాత్రధారులు అవగాహన చేసుకోవాలి.

# మేకప్

నాటకప్రదర్శనంలో నటీ నటుల ప్రవేశంతో మనలను ముందుగా ఆకర్షించేది వారి ముఖం. ముందు ముఖం చూసి, తరువాత దుస్తుల అలంకరణ, రంగాలంకరణమీదికి దృష్టిని పోనిస్తాం. కాబట్టి ముఖాలంకరణ సరిలేకుండా, ఇతర అలంకరణలు ఎన్ని చేసుకున్నా ఏమీ ప్రయోజనం లేదు,

అందుకే మేకప్‌ద్వారా ముఖాలంకరణను సర్వాంగసుందరంగా తయారు చేసుకోవాలి. ఒక పాత్ర ప్రవేశంలోనే ఆ పాత్ర పాత్రోచితంగా అలంకరించ బడిందా, లేదా అని తెలియజేయగలిగిందే మేకప్. అదే దానియొక్క విశిష్టత,

ఈనాడు మేకప్ కళ ఎంతో అభివృద్ధి పొందింది. పాశ్చాత్యదేశాలు ముఖ్యంగా అమెరికా, ఇంగ్లండు, రష్యాలలో మేకప్‌లో అద్భుతమైన మార్పులు తీసుకువస్తున్నారు. ప్లాస్టిక్‌ద్వారా మాస్కులు తయారుచేసి మొత్తం ముఖాన్నే మార్చి పాత్రోచితమైన వేషధారణను సృష్టించుకుంటున్నారు.

మన పూర్వ నాటకాల్లోనూ, యక్షగానాల్లోనూ, వీధి భాగవతాల్లోనూ ముఖాలంకరణకు ఆర్దళం, మసిబొగ్గు, గంగసింధూరం మొదలైనవి వాడుతూ వుండేవారు. ఈనాటికీ మన పల్లెల్లో అప్పుడప్పుడు ప్రదర్శించే వీధి నాటకాలవారూ, పగటివేషధారులూ, ఈ పూర్వపు విధానాన్నే అనుసరిస్తున్నారు.

మేకప్ కళ సాంకేతికంగా మొట్టమొదటగా అభివృద్ధి పొందింది ఇతర దేశాల్లోనే. ప్రథమంలో మేకప్ కళ, అందు కుపయోగించే రంగులు మొదలైన పరికరాలు కేవలం నాటకాలకొరకే అభివృద్ధి చెందాయి. వాటి అభివృద్ధి కొంత పరిమితి వరకూ వచ్చి ఆగిపోయింది. కారణం వాటి ఉపయోగం పరిమితం కాబట్టి.

కాని ఈనాడు ఈ మేకప్ కళా, రంగులూ, పరికరాలూ అద్భుతంగా పరిణామం చెందాయి. ఎంతోమంది సాంకేతిక నిపుణులద్వారా, రసాయనికశాస్త్రాన్ని అనుసరించి, పెద్ద ఫ్యాక్టరీలను స్థాపించి, అలంకరణకు కావలసిన సర్వసంపదలనూ చేకూరుస్తున్నారు.

ఈ అభివృద్ధికి కారణం ఇది సినిమాయుగం కాబట్టి. సినిమాకళ ప్రపంచంలో రెండవ వ్యాపారంగా అభివృద్ధి చెందడంవల్ల పెట్టుబడిదారులు దానిని అన్ని విధాలా, అన్ని శాఖలతోపాటు అభివృద్ధి పరిచారు. అలా అభివృద్ధి చెందిందే మేకప్ కళ.

మేకప్ అవసరం:

మన నాటకప్రదర్శనాలు రాత్రిపూటే జరుగుతాయి. పూర్వం ఒకప్పుడు కాగడాల వెలుతురులోనూ, తరువాత గ్యాసులైట్ల వెలుతురులోనూ నాటకప్రదర్శనాలు జరుగుతూ వుండేవి. ఆనాడు కథావస్తువుకున్న ప్రాముఖ్యం, వెలుతురుకూ ముఖాలంకరణకూ వుండేదికాదు. అంతేగాక కాగడాల వెలుతురులో ఏ ముఖాలంకరణైనా ఏమాత్రం బాగుంటుంది? అవి ఆనాటి పరిస్థితులు కాని ఈనాడు విద్యుచ్ఛక్తి అభివృద్ధి పొందిన తరువాత దానికి తగినట్లే ముఖాలంకరణ కూడ అభివృద్ధి పొందింది.

మనం వుపయోగించే లైటింగ్ ననుసరించే మన ముఖాలంకరణ వుండాలి. లైటింగ్ ఫ్లడ్-టాప్ - సైడ్ - స్పాట్ లైట్లను కలిగి వుంటుంది. వెలుతురులో అన్ని వస్తువులూ కనబడినట్లు చీకట్లో కనబడవు. లైట్ అంటే వెలుతురు. ఒక వస్తువును కంటికింపుగా కనబడేటట్లు చేసే లక్షణం లైటుకుంది. వీటిలో కృత్రిమ కాంతి మన ప్రదర్శనాల్లో ఉపయోగించేది. ప్రకృతికాంతి సూర్యునితో వచ్చేది. ప్రదర్శనంలో వుపయోగించే కాంతి మనం సృష్టించుకున్నది. మన చెప్పు

చేతల్లో వుంటుంది. కాని సూర్యుని కాంతి మన చెప్పుచేతల్లో వుండదు. పగటి వెలుతురు సూర్యునిది. సూర్యకిరణాల వెలుతురు సహజమైంది. తీక్షణమైంది.

కల్పిత వెలుతురు పై వెలుతు రంతటి శక్తివంతమైంది కాదు. వెలుగు కూడ సహజానికి విరుద్ధంగానే వుంటుంది. ఐనా మన ప్రదర్శనాలకు ఇదే అను వైన లైటింగ్. దీని కాంతినంతా ఒకేచోట రంగస్థలంమీద కేంద్రీకరించాలి. ఇలాంటి కేంద్రీకరణ ద్వారా ఎక్కువ వెలుగును సమకూర్చుకున్నా మన్నమాట. ఈ సమయంలో ప్రేక్షకస్థానాల్లో వున్న లైట్లన్నిటినీ తీసివేయాలి. ఆ సమ యంలో ప్రేక్షకుల దృష్టి రంగస్థలం వైపుకు వస్తుంది. కిరణాల కాంతి ఎక్కువ అవడంవల్ల పాత్రల రంగు వెలవెలా పోతుంది.

ఏడు రంగులున్న
ఇంద్రధనుస్సు వెలుగు :

కాస్త్రరీత్యా సూర్యకిరణాలలో ఏడు రంగు లున్నాయి. ఏడు రంగు లున్నట్లు ఇంద్రధనుస్సు వచ్చినప్పుడు, ఒక పద్ధతిలో అద్దంలో నుంచి చూసి నప్పుడు, ఇంటి పైకప్పుకున్న రంధ్రాలలోనుండి కిరణాలు లోనికి చొచ్చుకు వచ్చినప్పుడు గమనించగలం. ఈ వుదాహరణ ఎందుకంటే సూర్యుని కిరణాలలో 7 విధి రంగు లున్నాయని తెలుసుకోవడానికి. అలాగే మనం వుపయోగించే లైటింగులో — తెల్లని కాంతి కిరణాలలో ఎరుపు, పసుపు రంగులు హెచ్చుగా వున్నాయి. దీనినిబట్టి సూర్యమండలం నుంచి వచ్చే తెల్లని కిరణాలకు, లైటువల్ల వచ్చే తెల్లని కిరణాలకు భేదముంది. ఈ రెండు తెల్ల కిరణాలూ రంగు వస్తువుమీద ప్రసరింప బడినప్పుడు కొన్ని రంగులు కాంతి గానూ, మరికొన్ని కాంతి విహీనంగానూ వుంటాయి. ఉదాహరణకు మూడు రంగులు అంటే 1. తెలుపు, 2. రోజా, 3. ఎరుపు - ఈ మూడు రంగు కాగి తాలనూ ఒక అట్టమీద ఒకదాని తరువాత మరొకటి వరుస క్రమంలో అంటిం చుదాం. అలా చేసిన తరువాత ఆ అట్టను ఎర్రకాంతిలో పెడందా. ఎట్టటి కిరణాల ముందు తెల్లరంగూ, రోజా రంగూ గల కాగితాలు ఎరుపురంగుగా మారుతాయి. ఎరుపు రంగు కాగితంలో మాత్రం ఎలాంటి మార్పూ రాదు. అలాంటప్పుడు ఈ మూడు రంగులమీదా ఊదారంగు కిరణాలను ప్రసరిస్తే తెల్లకాగితం ఊదారంగుగా

మారుతుంది. రోజా కాగితమూ, ఎట్టి కాగితమూ గ్రేరంగులోకీ, నల్లరంగులోకీ మారుతాయి. ఇందువల్ల మనం తెలుసుకునేదేమంటే రంగుదీపాలు వాడడం అంత మంచిదికాదని, ఇందువల్ల ముఖంలో చిత్రించబడ్డ ఇతర రంగులన్నీ మారి పోతాయి. ముఖాలంకరణలో వికృతి ఏర్పడుతుంది.

కల్పించుకున్న వెలుతురుద్వారా వచ్చే తెలుపుకిరణాలు ముఖంలో వుపయోగించిన రంగుల నన్నిటినీ సమపాళంలో రక్షిస్తాయి. అంటే ముఖవర్చస్సులోని రంగును కల్పితవెలుతురు మ్రింగివేస్తుందని తెలుస్తూవుంది.

పై అనుభవాన్నిబట్టి దీపాల కాంతికిరణాల ప్రభావాన్ని తగ్గించడానికి మేకప్ చాలా అవసరం. అంటే మేకప్‌ద్వారా లైటింగ్ మూలంగా ఏర్పడే లోటులను సరిచేసుకోవచ్చును. మేకప్ విషయంలో చాలా మంది అభిప్రాయం మనకున్న ముఖాన్ని పౌడర్లతోనూ, గ్రీజుతోనూ, స్నోతోనూ అందం చేసుకోవడమని. వేషం ఎటువంటిదైనా ముఖాన్ని ఆకర్షణీయంగా తయారుచేసుకుంటే సరిపోతుందనుకునేవారు కొంతమంది లేకపోలేదు.

పాత్రనుబట్టి
పాత్రోచిత అలంకరణ:

అసలు విషయమేమంటే మనకు మనంగా రంగస్థలంలో ఎప్పుడూ కనబడకూడదు. కేవలం మనలాంటి పాత్రనే రచయిత సృష్టించానని చెప్పినప్పుడు తప్పితే మనం ధరించే ప్రతిపాత్రా మేకప్ విధానంలో మార్పు తప్పకుండా వుంటుంది. మనకు మనంగా అలంకరించుకున్నందువల్ల ఎంత ప్రయత్నించినా పాత్రకు న్యాయం కలుగజేయలేం. ఎలాంటి మార్పునూ ప్రేక్షకునికి చూపించలే..

మనం ధరించే పాత్రలోకి పూర్తిగా మారిపోవాలి. దుస్తుల మార్పుల్లోనూ, ముఖానికి వేసే రంగులద్వారాను, ఇతర అలంకరణా, దుస్తులద్వారాను రచయిత సృష్టించిన పాత్ర ఔచిత్యానికి అనుకూలంగానే వేషధారణను మార్పు చేసుకోవాలి. అప్పుడు మన నటనతోపాటు వేషధారణ కూడా అచ్చుగుద్దినట్లు సరిపోతుంది.

రంగుల్లో
రకరకాలుగా మారే ముఖం :

ముఖంలో వున్న లోపాలను మేకప్ విధానంద్వారా చాలవరకు సరిజేసుకో వచ్చు. కళ్ళు చిన్నవిగా వుండాలంటే కనుబొమ్మల్ని కొంచెం క్రిందికి దించుతారు నల్లపెన్సిల్ సహాయంతో. కండ్లు కొంచెం పెద్దవిగా వుండాలంటే కనురెప్పల వెంట్రుకల మందాన్ని కత్తెరద్వారా తీసివేస్తారు. ఇందువల్ల కన్ను పెద్దదిగా కనిపిస్తుంది.

కొంతమందికి గడ్డం బారుగా వుండి నొసలు కొంచెం తక్కువుంటాయి. అందుకు మేకప్ విధానంలో నుదురుమీద వెంట్రుకల్ని కొంచెం కత్తిరించి ముఖాని కుండవలసిన కొలతలను సరిచూచి గడ్డం పొడవును కొంచెం తగ్గించ గలుగుతారు.

కోలముఖాలూ:
గుండ్రని ముఖాలూ :

అంతేకాదు-కోలముఖాలను కొంచెం గుండ్రంగాను, గుండ్రని ముఖాలను కొంచెం కోలగాను, నున్నటిబుగ్గల్ని కొంచెం చప్పి దవడలుగానూ చేయ వచ్చును.

కొంతమంది ముఖాలు గుండ్రంగా వున్నట్లుంటాయి. కాని వారి వెంట్రు కలను రకరకాలుగా హెయిర్ డ్రస్ చేయిస్తే ముఖం ఆసాంతం మారిపోతుంది. ఒక క్రొత్త అందం, క్రొత్త ఆకారం తేలుతుంది. ఇలా మన ముఖానికి తగిన మీసాలద్వారానో, గడాలద్వారానో అనేక రకరకాలుగా మార్చగలం.

ఆకర్షవంతంగా లేనిముఖాన్ని ఏఒక్క ప్రేక్షకుడూ సహించలేడు. ఒక్కొక్క ముఖం చూడడానికి అందంగా లేకపోయినా వేషధారణలో ఎంతో అందంగా కనబడుతుంది. అలాగే కొన్ని ముఖాలు ఎర్రగాను, నున్నగాను వున్న ట్లుండి మనల్ని ఆకర్షిస్తాయి. కాని ముఖానికి రంగువేసేసరికి వెలవెలాపోయి అందవికారంగా వుంటాయి.

ముఖాలంకరణ :

మనిషియొక్క ముఖం మూడు సమాన భాగాలు కలది. పూర్వం నుంచీ

శిల్పాలూ, చిత్రకారులూ వారివారి విద్యలలో ముఖలక్షణాలను కొలతల రూపంలో అనుసరిస్తారు. అలాగే మన ముఖాలంకరణలో కూడ ముఖానికి సంబంధించిన కొలతలను అనుసరించే ముఖాలంకరణకు దిగాలి.

ముఖాన్ని మూడు భాగాలుగా జేసుకోవాలి. నుదుటి నుంచి నొసటివరకూ ఒక భాగం. నొసటి నుంచి ముక్కు చివరివరకూ ఒక భాగం. ఇలా కొలతల ననుసరించి మూడు భాగాలు సరిగానున్నవారి ఆకృతి చక్కగా వుంటుంది.

ముఖంయొక్క ఆకృతి అంతా పుర్రెననుసరించి వుంటుంది. యవ్వనంలో కండరాలు, చర్మం బిలంగాను, పటుత్వంగాను వుంటాయి. వయస్సు ముదిరినకొద్దీ కండరాలు కరిగిపోయి, చర్మం ముడుతలు పడుతుంది. ఇందువల్ల చర్మం కళావిహీనమై పేలవంగా వుంటుంది.

ముఖలక్షణాలను గమనించినప్పుడే ముఖంలో నున్న ఆయా కండరాల చలనాన్ని ముందుగా తెలుసుకోవాలి. అంటే నవ్వినప్పుడూ, ఏడ్చినప్పుడూ కండరాలు ఎలా కదులుతున్నాయో గమనించాలి. ఈ కండర చలనాన్ని అద్దం ద్వారా గమనించవచ్చు.

అలంకారికుడు (మేకప్‌మేన్) ఒక చిత్రకారుడి లాంటివాడు. ఒక పెయింటరు మాదిరి మన ముఖాన్ని మార్చగలిగినవాడు. చిత్రకారుని ప్రయోగానికి కాగితం అవసరమౌతుంది కాని, మన అలంకారికునకు ముఖమే అవసరమౌతుంది. చిత్రకారునికి, అలంకారికునికీ మూలశాస్త్రం వెలుగునీడలకు సంబంధించింది. వస్తువుల్ని కనబడేటట్లు చేసేది వెలుతురు. కనబడకుండా చేసేది చీకటి.

మేకప్‌మేన్ :

మేకప్ పాత్రోచితంగా వుండి స్వాభావికంగా వుండాలి. అంటే పాత్రోచిత రూపాన్ని స్పష్టంగానూ, సహజంగాను, అందంగాను, ప్రేక్షకుడు ఏ కోణం నుంచి చూచినా అందంగా వుండేటట్లు మేకప్‌మేన్ తయారుచేయాలి.

ముఖ్యంగా మేకప్‌మేన్ మేకప్ కళయొక్క మూలసూత్రాలన్నిటినీ తెలుసుకోవాలి. నాటకాలలో నిర్ణయించిన పాత్రలకు వాటిని ఎలా అనుసరింప చేయాలనేది గ్రహించాలి.

కేవలం సూత్రాలను బట్టీపట్టినంత మాత్రాన మేకప్ కళ అవగాహన

కాదు. అభ్యాసం కూసువిద్య అన్నట్లు ఆయా సూత్రాల నన్నిటినీ, కొన్ని మంచి ముఖాలను ఎంచుకుని ఆ ముఖాల మీద అమలు చేసి చూసుకోవాలి. ఒకసారికి నాలుగుసార్లు అలా చేసి చూసుకోవడంద్వారా మెళుకువలన్నీ సులువుగా తెలిసిపోతాయి. అలాగే ఆయా పాత్రల అలంకరణలో కూడా పాత్రోచితంగా వచ్చేవరకూ కృషిచేయాలి. ప్రత్యక్షకృషి లేకుండా ముఖాలంకరణలో ఏమాత్రం నిపుణతను సంపాదించలేరు.

పౌరాణిక, చారిత్రక, జానపద, సాంఘిక నాటకాలలో ఒక పాత్ర అలంకరణకూ, మరోపాత్ర అలంకరణకూ ఏమాత్రం సంబంధముండదు. ఆయా చారిత్రక స్థితిగతులూ, పురాణయుగపు సంస్కృతీ సంబంధాలూ, వేషభాషలూ, నమూనాలు మేకప్‌మేన్ గ్రహించాలి. అందుకొరకు చరిత్రలను పరిశీలించాలి. పౌరాణిక చారిత్రక చిత్రపటాలను తిలకించాలి, పురాతన శిల్పాలను దర్శించి తగిన సమాచారాన్ని సేకరించాలి.

ప్రతి నాటకంలోనూ అనేక సంఘటనలు జరుగుతూ వుంటాయి. ఒక రంగంలోని యువకుడు మరో రంగంలో వృద్ధుడుగానో, రోగిష్టిగానో, త్రాగుబోతుగానో, పిచ్చివాడుగానో మారవచ్చు. అలా మార్పులు వచ్చినప్పుడు పై పాత్రల ననుసరించి మేకప్‌లో మార్పులు తీసుకురావాలి.

ఒక పాత్రధారికి నొసటిమీద కత్తిగాయ మైంది. అబ్బా అని చేతిని అదిమి పెడితే చాలదు. కొంత రక్తాన్ని స్పాంజిద్వారా చేతినుండి కార్చడం చేయాల్సి వస్తుంది. అలాంటప్పుడు మేకప్‌మేన్ స్పాంజిని తయారుచేసి అందించాలి. అలాగే కంటివెంట నీరు కావాలి. గ్లిసరిన్ రడీగా పట్టుకుని పిల్లర్‌తో చుక్కలు వేయాలి.

ఒకవేళ సంఘటన వెలుపల జరిగితే గుడ్డకట్టు కట్టించడమో, కత్తిగాయ మైతే రక్తం చిమిర్చినట్లో మేకప్‌లో చిత్రించాలి. ప్రతి సీనుకూ, ప్రతి పాత్రకూ ఆయా సంఘటనల ననుసరించి అంతో ఇంతో వేషధారణలో మార్పు వస్తూనే వుంటుంది. ఈ మార్పులు తీసుకురావడానికి మేకప్‌మేన్ సిద్ధంగా వుండాలి. ప్రదర్శనకాలంలో పాత్రలు, రంగస్థలంమీదికి వస్తూ పోతూ వున్నప్పుడు ముఖా

లంకరణ తగ్గుతూ వుంటుంది. అలంకరణను ఏమాత్రం తగ్గిపోకుండా చూచుకోవాలి.

ప్రదర్శన ప్రారంభం రాత్రి 10 గంటల కనుకుంటే 9 న్నర గంటలకే పాత్రధారు లందర్నీ అలంకరించి సిద్ధంగా వుంచాలి. ఇందుకు పాత్రధారులు రెండు గంటల ముందే చేరుకోవాలి. ఆహార్యాధిపతితో పాత్రధారులందరూ సహకరిస్తేనే ఇది సాధ్యమౌతుంది. కేవలం వేషధారణవల్ల నాటక ప్రదర్శనం ఆలస్యంగా ప్రారంభించాల్సి వచ్చిందనే చెడ్డపేరు మేకప్‌మేన్ తెచ్చుకోకూడదు.

గ్రీన్ రూమ్ (మేకప్‌గది):

వేషధారణలో ప్రాముఖ్యం వహించేది మేకప్ రూమ్. ఈ గది నేటి నాటక మందిరాలలో అనేకచోట్ల తెరవెనుకనే. ప్రదర్శనంతో పాటు వేషధారణ కూడా కనుపిస్తూ వుంటుంది. రెండు లక్షలు ఖర్చుచేసి రంగస్థలం నిర్మించినా మేకప్ గదుల విషయంలో అశ్రద్ధ చేస్తున్నారు. గ్రీన్‌రూమ్ ప్రత్యేకించి వుండాలి. అది విశాలంగానూ, పరిశుభ్రంగానూ. ఆరోగ్యకరంగానూ వుండాలి. కాంతి గలిగిన ఎలెక్ట్రిక్ లైట్లూ, గాలికి మంచి ఫాన్లూ. కూర్చోవడానికి మంచి స్ప్రింగ్ కుర్చీలూ, ముందు ఒక టేబిలూ. టేబిలుపైన మేకప్ సామగ్రీ. వాటివెనుక మంచి అద్దమూ. ఆ అద్దానికి నాలుగుప్రక్కలా ఒకేరకమైన కాంతినిచ్చే బల్బులూ వుండాలి. అలంకారికుడు నిలబడి అద్దంలో మన ప్రతిబింబాలను చూస్తూ మన ముఖానికి కావలసిన మెరుగులన్నిటినీ తీర్చిదిద్దుతాడు. అన్నిటికంటే సదుపాయం గల మేకప్‌గది ఇదే.

నటుడు వేషం వేసుకునే సమయంలో ఎంతో ఓర్పుతో శాంతంగా వుండాలి. వేషధారణే ముందుగా ప్రేక్షకులను ఆకర్షించేది. వేషధారణ సరిగా వున్నప్పుడే నటీ నటులు సంతృప్తిగా నటించగలరు కూడా. గ్రీన్ రూమ్‌లో నీటి సౌకర్యం, గాలి సౌకర్యం బాగుండాలి.

అలంకరణకు ముందుగానే ఎవరి దుస్తులు వారు, ఎవరి ఆభరణాలు వారు, ఎవరి పరికరాలు వారు విడివిడిగా వుంచుకుని, ఎప్పుడు ఏయే వస్తువుల్ని ధరించుకోవాలో అలా ధరించుకోవాలి.

ఇతర వ్యక్తుల తాకిడి మేకప్‌గదికి ఏమాత్రం వుండకూడదు. ఇతరు

లాండడంవల్ల మేకప్ సరిగా జరుగనివ్వరు. ఇందువల్ల మేకప్‌గదిలో నున్నవారు సంతృప్తిగా మేకప్ చేసుకోలేరు. మేకప్‌గది ఆదర్శప్రాయంగా వుండాలి.

దుస్తుల బాధ్యత:

పాత్రకు సరియైన దుస్తులధారణ వున్నప్పుడే సరియైన వేషధారణా, పాత్ర పోషణా అనిపించుకుంటుంది. పాత్రకు తగిన దుస్తులధారణ లేకుండా నటుడు ఎంత నటించినా పాత్రలో జీవం వుండదు.

నాటకాన్ని నిర్ణయించుకున్న తరువాత అన్ని బాధ్యతలతోపాటే దుస్తుల బాధ్యత ఒకరు స్వీకరించాలి. ఏయే పాత్రకు ఎన్ని దుస్తులు కావాలి? ఎలాటిరంగులలో కావాలి? చొక్కాలెన్ని? కోటులెన్ని? పంచలెన్ని? ఈవిధంగా పాత్రధారులందరికీ సరిపోయేటట్లు లెక్క తీసుకొని ఆప్రకారం ఒక దర్జీని పెట్టుకుని అన్నీ చక్కగా కుట్టించి పాత్రలవారీగా పెట్టెలో భద్రపరచి (నెఫ్తిలిన్ బాల్స్) కలరా వుండలు వేయాలి.

తరువాత ఏయే పాత్రకు ఏమేమి అలంకరణవస్తువులు కావాలో వరుసగా వ్రాసుకోవాలి. ముక్కులకు, చెవులకు, మెడలకు, చేతులకు, వ్రేళ్ళకు, జడకు వివిధ అలంకరణ వస్తువుల్నీ లిస్టు వ్రాసుకుని ఒక్కొక్కటీ సేకరించి చిన్నచిన్న డబ్బాలను ఏర్పాటుచేసి దానిపై ఫలానా పాత్రధారి వస్తువులు అని చీటి అంటించాలి. ఇలా అన్ని పాత్రలకు ఒక్కొక్క డబ్బానుగాని, అట్టపెట్టెలను గాని వుపయోగిస్తే అలంకరణవస్తువులు ఒకరివి మరొకరికి ఏమాత్రం మారవు. అలంకరణ సులువుగా జరిగిపోతుంది. ప్రదర్శనానంతరం పాత్రధారులే వారివారి వస్తువులు ఆయా డబ్బాలలో వేయాలి. ఈమాత్రం సహకారం నటీనటులు దుస్తుల బాధ్యునికి ఇవ్వాలి.

ప్రతి పాత్రకు సంబంధించిన దుస్తులూ, అలంకరణ వస్తువులూ, అన్నీ ద్రస్సరు అధీనంలోనే వుండాలి. ఎవరినీ ముట్టుకోనివ్వకూడదు. ముఖాలంకరణ అవడంతోటే నటీ నటులకు దుస్తులనూ, అలంకరణవస్తువులనూ ధరింపజేయాలి. అంతేగాని, నటీ నటుల్ని ఒకరివి మరొకర్ని తీయనీయకూడదు. దుస్తులధారణకు ఇద్దరు వ్యక్తులుండడం చాలా అవసరం. రంగాలవారీగా ఆయా పాత్రలు దుస్తులు మార్చవలసి వుంటుంది. ఇలా నటులు మార్చుకోవడం కష్టం

కనుక దుస్తులబాధ్యుడు దుస్తుల మార్పు కావలసిన పాత్రధారి నిష్క్రమించిన వెంటనే దుస్తుల్ని మార్చివేయాలి. ఇలా రంగానికీ రంగానికీ మధ్య దుస్తులు అందివ్వడంలో ఏమాత్రం ఆలస్యం జరిగినా నాటక గమనం తగ్గిపోతుంది. ఇందుకు బాధ్యత ద్రవ్వరే తీసుకోవాలి. ఏదో ప్రారంభంలో అన్ని పాత్రలవి దుస్తుల్ని ధరింపజేశాంగదా అని ఏదో ఒకమూల ఆహార్యాధిపతి కూర్చోగూడదు. ప్రదర్శనారంభంనుంచి అంతంవరకూ కంటిమీద రెప్ప వేయకుండా బాధ్యతలో నిమగ్నుడై యుండాలి.

ప్రతి పాత్రకూ అన్ని దుస్తులూ, వస్తువులూ అమరాయోలేదో, వేషధారణ పూర్తి అయిన తరువాత ఆ పాత్రకు సంబంధించిన పట్టికను పరిశీలించి మరీ రంగస్థలానికి పంపాలి. ఒక్కొక్కసారి హడావిడిలో దుస్తులబాధ్యుడు ఏ వస్తువైనా మరచినట్లయితే నటీ నటులు అడిగి ధరించుకోవాలి.

దుస్తుల బాధ్యత చాలా పెద్దది. ఎప్పటికప్పుడు నాటక ప్రదర్శనం అయిన వెంటనే ఆ మరునాడు దుస్తులన్నిటినీ శుభ్రపరచాలి. చెమటకంపును పోగొట్టి, సువాసనగల వుడుకులాం నీటిని చల్లాలి. చెమటతో తడిసిపోయిన దుస్తుల్ని సకాలంలో శుభ్రపరచకపోయినట్లయితే అనతికాలంలోనే చెడిపోతాయి. సమాజాలు దుస్తులు ఏర్పరచుకోవడమే కష్టం. అలా సంపాదించుకున్న ఇలాంటి విలువైన సామగ్రిని జాగ్రత్తగా వాడుకోవాలి. ఇందుకు నటీనటులు, దుస్తులబాధ్యుడూ శ్రద్ధ తీసుకోవాలి.



# 21

# నటుడు



నటుడు కళాపిపాసి - నటునికి విజ్ఞానం సంస్కారం ఉండాలి- నటుడు, సాహిత్యం - నటుని నైతిక ప్రవర్తన - నటుని భావో ద్రేకనటన - నటుని ఏకాగ్రత, నటుని తన్మయత్వం- నటుని భంగిమ- నటుని జ్ఞాపకశక్తి.

# నటీనటులు

### విజ్ఞానం, సంస్కారం వుండాలి :

నటీ నటులకు ఎంతో విజ్ఞానం, సంస్కారం వుంటేగాని, వారు సరియైన నటకుడుగా అభివృద్ధి పొందజాలరు. నటులు జీవిత రహస్యాన్ని తెలుసుకోవాలి.



జీవితానుభవాన్ని, జీవితంలో వుండే అన్ని అనుభూతుల్ని గ్రహించాలి. లేనట్లయితే తాము గొప్ప నటులుగా రాణించలేరు. మానవునిలో వున్న వివిధ మనస్తత్వాలను ఆకళింపు చేసుకుని అన్ని పాత్రలను ప్రదర్శించటానికి సిద్ధంగా వుండాలి.

నటులు జీవితంయొక్క లోతుల్ని పరిశీలించాలి. అన్ని రసాలను, అన్ని అభినయాలను, సమస్త అనుభూతుల్ని పొందగలిగినప్పుడే ప్రేక్షకులయొక్క సానుభూతిని నటకులు పొంద గలుగుతారు. నటులు ఒకే రకమైన పాత్రలను కాక విభిన్న మనస్తత్వాలను కలిగిన వివిధ పాత్రలను సాధన చేయాలి. అన్ని రసాలను ఒప్పించేటట్లుండాలి.

### నటుడు, సాహిత్యం :

నటునకు విజ్ఞానం వుండాలి. అందుకు సంబంధించిన సాహిత్యం చదవాలి. విద్యావిహీన పశుః అన్నట్లు నటునికి ముఖ్యంగా విద్య అవసరం. నటునియొక్క వుచ్చారణలోనే బయట పడతాడు అతను విద్యావంతుడవునా కాదా అని. నటుడు ఒక పాత్రను పోషించా లనుకున్నప్పుడు ఆ పాత్రను అర్థం చేసుకోవాలి. పాత్ర అర్థం కావాలంటే తగిన విజ్ఞానముండాలి.

ఒక కవి విద్యా విజ్ఞానంలేకుండా ఒక నాటకాన్ని ఎలా వ్రాయలేడో, అలాగే ఒక నటుడు కూడా విద్యా విజ్ఞానం లేకుండా తీసుకున్న పాత్రకు జీవం

పోయలేడు. కవి వ్రాసిన సంభాషణను ఏ విధంగానూ అనలేడు. ఎక్కడ, ఎందుకు ఫలానా సంభాషణ కవి వ్రాశాడో, అందుకే ఆ నటుడు ఆ సంభాషణలను అక్షరాలా అనాలి. లేకపోతే వికృతంగావుండి విపరీతార్థం వస్తుంది. ఇందుకు వుదాహరణ గయోపాఖ్యానం నాటకంలో శాపగ్రస్తుడైన గయుడు బ్రహ్మను ఆర్థించటానికివస్తే బ్రహ్మ 'గయుడా, నీ ఆర్తి నేనెరుంగుదును'అనే దానికి బదులు. 'గయుడా, నీ ఆస్తి నేనెరుగుదును' అన్నాడు. ఇంతలో ఒక కొంటె ప్రేక్షకుడు 'ఆ-ఎంత? మూడు ఎకరాలేగా!' అన్నాడు. పైన వుదహరించిన బ్రహ్మపాత్రధారికి చదువులేకపోవడంవల్ల కలిగిన అనర్థకమిది. ఆస్తికీ, ఆర్తికీవున్న భేదం ప్రేక్షకులు నవ్విన తరువాత గాని బ్రహ్మపాత్రధారి తెలుసుకోలేకపోయాడు.

### నటుడు కళా పిపాసి :

ఒక వ్యక్తి తాను అనుభవించిన ఆనందాన్నిగాని, అనుభవాన్నిగాని ఇంకొకరిలో కలిగించటానికి చేసే ప్రయత్నమే కళ అన్నాడు టాల్‌స్టాయి. అందువల్లనే నటుడు కళాపిపాసి. ప్రజాసేవకుడు. సమాజంలోవున్న మంచిని గాని, చెడునుగాని, ఒక కవి ముందుగానే ఎలా గ్రహించి రచనకు పూనుకుంటాడో నటుడు కూడా అంతే.

నటుని హృదయం అతి సున్నితం, సమాజ జీవితంలో ఏ వింత జరిగినా రియాక్టు అవుతాడు. వెంటనే కార్యాచరణకు పూనుకుంటాడు. దానిని కళాదృష్టితో చూచి ఆనందించి తనయొక్క కళానైపుణ్యం ద్వారా ఇతరులను రంజింపజేస్తాడు. తాను చూచిన వింతవింత అనుభవాలను ఏ అభినయంతో ఎటువంటి భాషలో ప్రజా హృదయంలో చొప్పించాలో యోచిస్తాడు. గురువు దగ్గర విద్యార్థి లెలాగో అలాగే నటుడు ప్రజలపట్ల ఉపదేశికుడు.

### ప్రజాశ్రేయస్సు నటునికుండాలి :

నటుడు ప్రజాశ్రేయస్సును దృష్టిలో పెట్టుకోవాలి. ప్రజల నంటిపెట్టుకుని జీవించాలి. ప్రజల నిత్యజీవిత వేషభాషలను సాధ్యమైనంతవరకు నటుడు గమనించడం మంచిది. ఏ నాటకం ప్రదర్శించినా చాలవరకు ప్రజాశ్రేయస్సునే గీటురాయిగా పెట్టుకోవాలి. మనం అనేక గ్రంథాలను చదువుతున్నాం. అందులో ఎన్నో

జీవిత విధానాలను, అనేక మనస్తత్వాలు గల పాత్రలను చూస్తున్నాం. వాటిని వాస్తవికదృష్టితో చూచి ఆచరణలో పెట్టగలిగినప్పుడే నటనలో పరిపక్వతను పొంద గలుగుతాం.

పైన చర్చించిన విషయాలన్నిటినీ అర్థం చేసుకునే శక్తి, సంస్కారము, మన నటీ నటులకుండాలి. నటుడంటే రంగు పూసుకోవడం కాదనే విషయాన్ని మనం గుర్తింపగలిగితే పై విషయాలను నిర్లక్ష్యం చెయ్యలేం.

నటుడు సంఘానికి ప్రతినిధి. ఉపాధ్యాయుడు. సంఘానికి హృదయంలాంటి వాడు. అందుకే నటునికి సంఘంలో అంత ప్రముఖస్థానం.

ఎన్నో మహత్తరమైన బాధ్యతలు మన నటీ నటుల మీదున్నాయి. దీనిని చాల మంది గుర్తించడంలేదు. ఏదో ఒక మహా వేషంవేసి బాగుందనిపించుకుంటే చాలు, తను ఒక మహా నటుడుగా దర్పం చూపిస్తున్నాడు. నటీ నటులు కనీసం నాటక చరిత్ర, అభినయ సాహిత్యం దదివి, తగిన సంస్కారాన్నీ, విజ్ఞానాన్నీ సంపాదించాలి.

### నటుని నైతిక ప్రవర్తన :

నటుడు మంచి ఆరోగ్యం, ఓర్పు, శాంతం, నిరాడంబరత, సరియైన నైతిక ప్రవర్తన, త్యాగబుద్ధితోపాటు దేశభక్తి కలవాడై యుండాలి. ఎంతో నిగ్రహం, నైతిక ప్రవర్తన లేకపోతే నిజమైన నటుడుగా రాణించలేడు. తన శ్రేయస్సుకంటే ప్రజాశ్రేయస్సును దృష్టిలో పెట్టుకోవాలి. అవసరమైతే శారీరక సౌఖ్యాలను కొంత హద్దుల్లో వుంచుకోవాలి. శారీరకంగా బలహీనమైననాడు తాను తీసుకున్న పాత్రలో రాణించలేడు. సమర్థతతో నటించలేడు. వాంఛల్లో తగులుకున్న నటుడు ముఖవర్చస్సును అంగసౌష్టవాన్ని సుకుమారాన్ని కోల్పోతాడు. అతను ఎంత నటించినా జీవం వుండదు. మరొకరిని మెప్పించలేడు,

### దురభ్యాసాలకు దాసుడు కాకూడదు :

అనేకమంది నటీ నటులు త్రాగుడుకు, వ్యభిచారానికి దాసులైనారు. నీతి సూత్రాలహద్దుల్ని పూర్తిగా దాటారనే చెప్పవచ్చు. ఇది అందరి నటులనూ వుద్దేశించి కాదు. కొద్దిమంది బుద్ధిమంతులూ, కళాశీలురూ లేకపోలేదు.

సమాజంలో త్రాగుడు, వ్యభిచారం, దొంగతనం వున్నాయి. కళద్వారా నటుడు వాటిలోవున్న చెడును పారదోలాలి కాని, తనే వాటికి దాసుడు కాకూడదు.

వ్యభిచారం తప్పని తెలిసి తనే జేస్తూ ఇతరులకు వ్యభిచారం, త్రాగుడు తప్పని చెప్పడం మహా ఘోరం. ఇందువల్ల చెప్పేవి శ్రీరంగనీతులూ, చూరేవి దొమ్మరిగుడిసెలూ అనే సామెతకు అవకాశం ఇచ్చిన వాళ్ళమౌతాం. నటుడు ఎప్పుడూ ఒకరిని ఆనందపర్చడంతోపాటు విజ్ఞాన పర్చాలికాని, తాను మాత్రం ఆ వూబిలో దిగబడిపోరాదు.

నలుగురు పొగిడినంతమాత్రాన నటీ నటులు వుబ్బితబ్బిబ్బై ఛాలెంజీలకు దిగరాదు. ఆనేకమంది అనేక విధాల పొగిడినా వుబ్బితబ్బిబ్బు కాకూడదు. నేర్చుకోవాల్సిందింకా ఎంతో వుందనే గాఢ విశ్వాసాన్ని ముందు పెట్టుకోవాలి. ఆ విశాల దృక్పథంలేక అంతా తనకే తెలుసు ననుకుంటే దుష్పలితాలు తప్పవు.

నటుడు ఈ గుణపాఠాలను తెలుసుకోకపోతే తన వునికి తనకే తెలియదను కోవాల్సి వుంటుంది. నటనకు అంతేముంది? జీవితాంతం కృషిచేసినా పరిపూర్ణత్వం కలుగుతుందా? పోనీ, పరిపూర్ణులే అనుకుందాం. అప్పుడు మరింత వినయం, సత్ప్రవర్తన అలవరచుకోవాలి. కొంతమంది అభిప్రాయమేమంటే కళారాధకులది ఒక ప్రత్యేక జాతనీ, వారికి కొంత స్వేచ్ఛ అవసరమనీ, లేకుంటే కళలో ప్రవీణత సంపాదించడం కష్టం అంటున్నారు. ఇది ఎంతవరకు సబబు? అందుకోసం ప్రజలయొక్క విశ్వాసాన్ని కోల్పోయేటంతగా చెడిపోవాలా? కనుక నటీ నటులు వారి జీవితాలను హద్దుల్లో పెట్టుకోవాలి.

# నటుని భావోద్రేక నటన

హృదయంలో అణగివున్న సహజ ప్రకృతి ప్రేరణవల్ల భావోద్రేకం కలుగుతుంది. సకల కళాసృష్టికీ కారణం ఈ భావోద్రేకమే. భావోద్రేకంలోనే హృదయభావం వ్యక్తం చెయ్యబడుతుంది.

నటనకు భావప్రకటన పరమప్రయోజనం. రసభావ వ్యక్తీకరణ నటునికి సామాన్యధర్మం. నటన మనోభావాన్ని ప్రతిబింబిస్తుంది. భావోద్రేకం పొందిన

నటుని హృదయంలో నుంచి కళ ఆవిర్భవించి, వాచికాంగికాభినయాలద్వారా అభివృద్ధి చెందుతుంది.

భావోద్రేకానికీ, భావ ప్రకటనకు కారణ కార్యసంబంధం వుంది. భావోద్రేకం మాతృస్థానాన్ని అందుకుంటే భావప్రకటన జన్మస్థానాన్ని అలంకరిస్తుంది. భావోద్రేకం ఒక శక్తి. కళాసృష్టి రహస్యమంతా ఇందులోనే ఇమిడి వుంది. ఈ శక్తిని సరియైన మార్గంలో నడిపించినపుడు సౌందర్య రసానుభావాలు కలుగుతాయి. తప్పుదారి తొక్కిస్తే కృతి మించి రాగాన పడుతుంది. రసాభాస జరుగుతుంది.

భావోద్రేకానికి బానిస కాకూడదు :

భావోద్రేకం జ్ఞానచింతనాశక్తులను అతిక్రమిస్తే ఉన్మాదంలోకి దిగజారుతుంది. కేవలం భావోద్రేకానికి బానిసలయినవారు పశువులకు దగ్గరగా వుంటారు. కాని భావోద్రేకంలోనే సుందర గంభీర కళాసృష్టి జరుగుతుండి. ఉదాత్తరమణీయ భావప్రకటన వెలువడుతుంది.

అందుకనే భావోద్రేకం నటుడికి కత్తిమీద సాములాంటిది. ఈ విషయంలో నటుడు ఒళ్ళు దగ్గర పెట్టుకుని సంచరించాలి. అసిధారావ్రతం చెయ్యాలి.

భావోద్రేకంతో అనుభూతిని పొందలేకపోతే పాత్రపోషణ అసాధ్యమౌతుంది. భావోద్రేకాన్ని అదుపులో పెట్టుకోలేకపోతే కళ్ళెంలేని గుఱ్ఱం మాదిరి కదను తొక్కాల్సివస్తుంది. అనుక్షణమూ నటుడు ఈ విషమ సమస్యను ఎదుర్కుంటూనే వుంటాడు. ఈ సమస్యను పరిష్కరించుకోటానికి నటుడు తన నటనకు ఒక నిర్దుష్ట విధానాన్ని ఏర్పరుచుకొని ముందుకు దూసుకుపోవాలి.

భావోద్రేకం హద్దుల్లో వుండాలి :

పాత్రను కవి రూపొందించిన విధం, నాటకంలో ఆ పాత్రకు గల స్థానం, ప్రయోజనం, నటుడు తాను ఆశ్రయమిచ్చిన పాత్రయొక్క స్వరూప స్వభావాలు, తన కార్య ప్రవృత్తికి హేతువయిన భావము - వీటన్నిటినీ కూలంకషంగా తెలుసుకోవాలి. పాత్రను ఆర్థం చేసుకోవటంలో అవలంబించిన పద్ధతులను మననం చేసుకోవాలి. పాత్రోచితమయిన నటనావిధానాన్ని పరిశీలించాలి. తన భావోద్రేకం

తాను ధరించే పాత్రయొక్క భావోద్రేకంతో సారూప్యం పొందాలి. ఒక క్రమబద్ధమయిన నటనావిధానాన్ని ఎప్పుడూ స్మృతిపథంలో వుంచుకోవాలి. ఒక కార్యాన్ని ఏ విధంగా చేస్తే కోరిన ఫలితాన్ని ప్రాప్తింపజేస్తుందో తెలుసుకోవాలి. ఈ తార తమ్య గ్రహణశక్తి జ్ఞానానికి ముఖ్యమయిన లక్షణం. జ్ఞానంయొక్క పూర్ణోచ్ఛ స్థితి కల్పనాశక్తి. కల్పనాశక్తి నటునికి ప్రాణంవంటిది. జ్ఞానాన్నీ, విచక్షణా శక్తినీ కోల్పోతే నటుడు జీవచ్ఛవంలాగా తయారవుతాడు.

అందుకనే భావోద్రేకం మాత్రమే నటునికి మార్గదర్శకం కాగూడదు. భావోద్రేకంలో మునిగిపోయి జ్ఞానానికి, చింతనాశక్తికి దూరమైననాడు నటునికీ, శివమెత్తి తందనాలుతొక్కే గణాచారికీ అట్టే తేడా వుండదు.

*భావోద్రేకాన్ని భద్రంగా వాడుకోవాలి :*

కాబట్టి భావోద్రేకాన్ని ఎప్పుడూ నటుడు తన చెప్పు చేతల్లో ఉంచుకోవాలి. భావోద్వేగానికి ఆ వుద్వేగ స్వభావాన్ని పరిశీలించే ఆంతరంగిక ప్రవృత్తికి వ్యతిరేక స్వభావం వుంది. పరిశీలించినకొద్దీ ఉద్రిక్తత అణగిపోతూ వుంటుంది. అంటే ఆత్మావలోకనంతో భావోద్రేకాన్ని పొందిన నటుడు, అంతరంగ పరిశోధనతో ఆ వుద్రేకాన్ని అమలులోకి తెచ్చుకోవాలి. భావోద్రేకంతో బయలుదేరి తన ప్రజ్ఞచేత ఆశించిన ఫలితాన్ని అందుకోవాలి.

నటుడు తాను ధరించే పాత్రను ఎంత చక్కగా విమర్శించి విపులీకరించగలడో అంత చక్కగా నటించగలడు. నటుడు తన పాత్రను అర్థం చేసుకుంటాడు. అనుభవిస్తాడు. భావావేశంలో మునిగిపోయి, పాత్రలో లీనమైపోతే నటునిలో చైతన్యం చచ్చిపోతుంది. నటుడు తాను నటిస్తున్నాను అనే భావాన్ని వదలి అదంతా యదార్థమనే భ్రమలో కొట్టు మిట్టాడుతూ వుంటాడు, అవ్యక్తంగా అనాలోచితంగా ప్రేక్షకునిలో కూడా ఈ భ్రమ ప్రమాదాలను రేకెత్తిస్తాడు. భ్రమింపచెయ్యడం కళకు లక్ష్యంకాదు. ప్రయోజనమూ కాదు. నటుడు తన పాత్రను సూచించాలి. కాని అందులో ఐక్యమై పోకూడదు. ప్రేక్షకుణ్ణి మోసం చెయ్యటానికి ప్రయత్నించకూడదు. నమ్మోటట్లు చెయ్యడమూ కాదు. నమ్మకపోవటమూ అనే సంధిగ్ధావస్థలో ప్రేక్షకుణ్ణి పెట్టాలి. అప్పుడే సామాజికుల హృదయాలలో రసానుభూతి కలుగుతుంది. నటుడు ప్రేక్ష

కుల మనస్సులను ఆకర్షించి రంజింపచెయ్యగలుగుతాడు. నటుడు తన నటన ద్వారా దేన్ని వుద్దేశిస్తున్నాడో ప్రేక్షకులు గ్రహించగలగాలి. కాబట్టి నటుడు గ్రహించింది, భావించింది సువ్యక్తం కావాలి. అంతేకాని, తాను చైతన్యాన్ని కోల్పోయి ప్రేక్షకుడు కూడా చైతన్యాన్ని పోగొట్టుకునేటట్లు చెయ్యకూడదు. నటుడు తన భావోద్రేకాలను తాను అదుపులో పెట్టుకుంటూ, ప్రేక్షకుల ఉద్రేకాలను కూడా తన చెప్పుచేతల్లో ఉంచుకోవాలి. ప్రేక్షకుల హృదయవీణాతంత్రుల్ని తన యిచ్ఛ వచ్చినట్టు మీటాలి. ఇదంతా భావోద్రేకానికి ప్రజ్ఞ జోడించినప్పుడే సాధ్యమవుతుంది.

భావోద్రేకం హృదయానికి,
ప్రజ్ఞ మేధస్సుకు :

భావోద్రేకం హృదయానికి సంబంధించింది. ప్రజ్ఞ మేధస్సుకు సంబంధించింది. హృదయాన్ని మేధస్సును ఒక తాటిమీద నడిపించినపుడే సత్ఫలితాలను పొందగలుగుతాం. భావోద్రేకంతో బయలుదేరి కార్యసాఫల్యతకు మేధస్సుతో మార్గాలను అన్వేషించాలి. ఆలోచనతో కూడుకున్న ఆవేశం కావాలి. అప్పుడే ఉత్తమ కళాఖండం ఆవిర్భవిస్తుంది. అప్పుడే నటుడు ఒక విశిష్టస్థానాన్ని ఆక్రమిస్తాడు.

# నటుని ఏకాగ్రత

నటీనటులయొక్క పాత్రపోషణలో ఏకాగ్రత చాలా ముఖ్యమైంది. ఏకాగ్రత లేని నటుడు తనకిచ్చిన పాత్రను పోషించలేడు. ఏకాగ్ర లక్ష్యం లేకుండా ఒక పని చేయగలిగినా దానికి కళాపూర్ణత్వం సిద్ధించదు. మనంచేసే ప్రతిపనికీ ఒక లక్ష్యమనేది వుండాలి. అందుకు వుదాహరణగా ఒక నర్తకి నీటితో నిండుగావున్న నీళ్ళకుండను నెత్తిన పెట్టుకుని కుండలోని నీరు తొణకకుండా నృత్యం చేయాలనుకోండి. కాళ్ళతో నృత్యాన్ని, ముఖంలో సాత్విక భావాలనూ, అంగికచలనాన్నీ, ఏకకాలంలో అతిస్వాభావికంగా కేంద్రీకరించి చిత్రించాలి. ఇన్ని పనులూ సక్రమంగా చేస్తూ లక్ష్యంమాత్రం కుండమీదే వుంచాలి. అయితే ఆ లక్ష్యం కుండ మీద వున్నట్లు ఏ ఒక్క ప్రేక్షకునికీ తెలియకూడదు. లక్ష్యమంటే కుండ పడిపో

కుండా చూడడమేకాదు. అందులోని నీరుకూడ తొణకకూడదు. నృత్యవిధానంలో ఇది అష్టావధానం లాంటిది. కనుక చేసే ప్రతిపనికీ ఒక పవిత్రమైన లక్ష్యం వుండాలి. లక్ష్యంలేని పని చిత్తం చెప్పులమీదా, భక్తి దేవునిమీదా అన్నట్లుంటుంది.

నటుడు ఏకాగ్రలక్ష్యంతో పాత్రను పోషించినప్పుడు, ఆ పాత్ర సజీవంగా నిలబడుతుంది. ఇలాగే ప్రదర్శించే నాటకంలోని ప్రతిపాత్రా సజీవంగా నిలబడినప్పుడు ఆ ప్రదర్శనం విజయవంత మౌతుంది. ఈ ఏకాగ్రతలో ఒక నటుడు లక్ష్యంలో వుండి, రెండవ నటుడు ఆ లక్ష్యాన్ని వదలినట్లయితే, ప్రతిపాత్ర యొక్క ఏకాగ్ర లక్ష్యం రాణించదు. అందువల్ల ఒక ప్రదర్శన విజయానికి ప్రతి పాత్రా ఏకాగ్రతను పొందాలి.

నిత్యసాధనే ఏకాగ్రలక్ష్యం :

నటీనటులు ఈ విధంగా తమతమ పాత్రపోషణలో ఏకాగ్రతను సాధించ గలిగినప్పుడు, ప్రతి నటీనటుడూ పాత్రకు అతిసన్నిహితు డౌతారు. పాత్రకు జీవం పోసి రససిద్ధిని కలిగించి, ఆ పాత్రలో జీవించగలుగుతారు. ఎప్పుడైతే నటుడు పాత్రలో జీవించగలుగుతాడో అతనిలో ఒక ఆవేశం కలుగుతుంది. ఆ ఆవేశంలో రససిద్ధి పొందుతాడు. ఆ పాత్రకు అంకితమౌతాడు. ఇలాంటి ఏకాగ్ర లక్ష్యం సాధించగలిగినప్పుడు నటుడు తాదాత్మ్యంలో కొట్టుకుపోడు. పాత్రను హద్దుల్లోనే పోషించగలడు. అందుకు కారణం ఏకాగ్రతే.

ఏకాగ్రత అనేది కేవలం సాధన ద్వారానే సాధించాలి. ఆ సాధన ఎన్నో పాత్రలను పోషించటం ద్వారానూ, ఎన్నో వుత్తమ ప్రదర్శనాలు ఇవ్వడం ద్వారానూ సాధించగలం. ఇలాంటి సాధనతో లక్ష్యాన్ని సాధించగలిగినప్పుడు అప్రయత్నంగా మన పనుల్లో మనం నిమగ్నులమౌతాం.

ఇలాంటి ఏకాగ్రతను దర్శకుడు నాటకాన్ని చదివినప్పుడూ, పాత్రల విభజన చేసి మన కోపాత్ర ఇచ్చినప్పుడూ, ఆయా పాత్రల మన స్తత్వాన్ని వివరించేటప్పుడూ, ఆ పాత్రలయొక్క సంభాషణలు చదువునప్పుడూ, సంభాషణలకు అనుకూలంగా అభినయించి చూపునప్పుడూ, అప్పటికప్పుడు అనుకరించి చూపగలగాలి. ఈ అనుకరణ విధానం ద్వారా ఏకాగ్రతను సాధించడానికి సన్నిహితులౌతారు.

ఏకాగ్రత విశిష్టత :

ముడిరాతిని తీసుకున్న శిల్పి తన ఏకాగ్రతాలక్ష్యంతో తాను వూహించుకున్న చిత్రాన్ని సజీవమైన కళతో ఒక సుందర శిల్పాన్ని తయారుచేయగలిగినట్లు—

ఒక చిత్రకారుడు ఎక్కడో దూరతీరాల నున్న పర్వతపంక్తుల్నీ, ఆ పర్వతాల వెనుకగా అస్తమిస్తున్న సూర్యుణ్నీ, ప్రకృతి సౌందర్యాన్ని ఏకాగ్ర లక్ష్యంతో చిత్రీకరించినట్లూ — వైమానికుడు ఏకాగ్రలక్ష్యంతో విమానాన్ని నడిపినట్లూ - డాక్టరు ఏకాగ్రలక్ష్యంతో అపరేషన్ చేసినట్లూ. నటీనటులు కూడా ఆయా పాత్రలను ఏకాగ్రలక్ష్యంతో పోషించి, సజీవమైన పాత్రలుగా వాటిని రూపొందించాలి.

ఏకాగ్రలక్ష్యంలో నిమగ్నమైన వ్యక్తికి, తన లక్ష్యంతప్ప తనప్రక్కన ఏమి జరిగేదీ తెలియదు. అది సమాధిలాంటిది. అది ఒక తపస్సు. ఏకాగ్రతను నటీనటులు ప్రారంభంనుండే అలవర్చుకోవాలి. ఏకాగ్రతకు యోగాభ్యాసం ఎంతగానో వుపయోగపడుతుంది.

## నటుడు, తన్మయత్వం

తనను తాను మరచిపోయిన నటుడుగాని, జీవితంలోని ఏవ్యక్తిగాని వారి వారి విద్యుక్తధర్మాలన్ని ఏవిధంగానూ నిర్వహించలేరు. ఉదాహరణకు భగవద్భక్తిలో మునిగిపోయి కుమ్మరి గోరాకుంభార్ కుండల నిర్మాణంకోసం త్రొక్కుడు మట్టిలో భక్తిగీతాల తన్మయత్వంలో తనయొక్క చంటిబిడ్డ పడిన సంగతి కూడ జ్ఞప్తిలేక, ఆ బిడ్డను మట్టితో కలిపి త్రొక్కివేశాడు. ఇదే తన్మయత్వం అంటే. తను ఏం చేస్తున్నాడో గమనించలేనప్పుడు ఇలాంటి పనులు జరుగుతూ వుంటాయి.

ప్రభుచైతన్యస్వామి :

అలాగే ప్రభుచైతన్యస్వామి తనయొక్క వ్యక్తిత్వాన్ని పూర్తిగా కోల్పోయి శ్రీకృష్ణునిపై వుండే భక్తిలో సంపూర్ణంగా మునిగిపోయి, సముద్రంలో తాను కృష్ణుని చూచినట్లూ, తానే రాధ ననుకుని కృష్ణునికొరకు సముద్రంలో

దూకేశాడంటారు. అందుకే ఆయనకు శ్రీకృష్ణ చైతన్యుడనీ, ఆయన సముద్రంలో కలిసిపోయిన ప్రాంతానికి చైతన్య ప్రభుతీర్థమనీ పేరు వచ్చింది.

పట్టాలు తప్పిన
బండి కాగూడదు :

ఇంతకూ ఇన్ని ఉదాహరణ లెందుకంటే నటుడు ఎప్పుడైతే తనయొక్క వ్యక్తిత్వాన్ని మరచి, తనయొక్క పాత్ర అవస్థను వదలిపెట్టి మరో పాత్రావస్థను అనుభవిస్తాడో అప్పుడు నటుడు పట్టాలుతప్పిన రైలుబండి మాదిరి-నటించడం కష్టమౌతుంది. ఒక్కో-పాత్రలో వచ్చే అనేక సంఘటనలను నటులు నిగ్రహంతో నటించాలి. లేనట్లయితే ఏడ్వడం మొదలెడితే అదేపనిగా ఏడ్వడం జరుగుతుంది.

అభినయాన్ని గూర్చి రకరకాల అభిప్రాయాలున్నాయి. నటుడు వేషం ధరించుకుని రంగంమీద వున్నప్పుడు ఇతివృత్తంలో కల్పింపబడ్డ పాత్రను వున్నది వున్నట్లు అభినయించటమా ? లేక తాను ధరించబోయే పాత్రలో లీనమైపోవాలా ? అనే అనుమానాలున్నాయి. మొదటివిధంగా నటించటం నటనకాదు. అది పాఠం వల్లించటంగా తయారౌతుంది. అది ఇతరులను కదిలించలేదు.

రెండవది ఆ పాత్రను అర్థంచేసుకుని పాత్ర ఔచిత్యానికి భంగం లేనంత వరకు అభినయించితే ప్రమాదం లేదు. ఇదే సరియైన పంథా.

తన్మయత్వంలో
తననుతాను మరువకూడదు :

మూడవది పాత్రల్లో లీనమవడం. లీనమవడమనేది పాత్రయొక్క హద్దుల్ని మించి తప్పు మార్గాల్లో పడడం. ఇది రసహీనమైన అభినయం. తన్మయత్వంలో అతిగా అభినయించిన ఆభినయం దానియొక్క వ్యక్తిత్వాన్ని నాశనం చేస్తుంది. నటనలో రసానుభూతి వుంటేనే అతను పాత్రోచిత అభినయాన్ని చేయగలుగుతాడు. తను ఏ భావాన్ని చూపించవలె ననుకుంటాడో ఆ రసాన్ని ఒప్పించి వెంటనే మరో భావంలోకి రాగలిగిందే సరియైన అభినయం. తన్నుతాను మరచిపోయి పాత్రలో లీనమైతే తనయొక్క విద్యుక్తధర్మాన్ని ఏ విధంగానూ నిర్వహించలేడు. ఎప్పుడైతే నటుడు తన వ్యక్తిత్వంతో కూడిన నటనను వదలి, తన్మయత్వాన్ని పొంది ఇతర అవస్థల ననుభవిస్తాడో ఆ నటుడు నటించడం కష్టం.

అప్పుడు పాత్రోచితంగా నటించలేక అతిగా నటించి రంగంమీద రసభంగాన్ని కలుగజేస్తాడు. ఉదా. చిత్తూరుజిల్లాలోని ఒక గ్రామంలో వీధినాటక ప్రదర్శనం సందర్భంలో(ప్రహ్లాదలో)నృసింహమూర్తి వేషధారి హిరణ్యకశిపవేషధారి పొట్టనునిజంగా బ్రద్దలు చేశాడని ప్రతీతి. తన్మయత్వం పొందటంవల్ల వచ్చే నష్టాలు ఇలాంటివే. నేటి మన నాటకరంగం మీదకూడా ఈ విధంగానే ఒళ్ళు పెంచుకొని శివాలు వేయటం కళ్ళారా చూస్తూనేవున్నాం, ఎప్పుడూ కూడ నటుడు తన్మయత్వం పొందితే తగిన అభినయాన్ని చేయలేడు. ఇది పెద్ద నటులనేవారికి విదితమే.

### పాత్రయొక్క అవస్థను పండించాలి :

ఒక రసాన్ని ఒప్పించాలనుకున్నప్పుడు తన మనస్సులో ఆ రసాన్ని సృష్టించుకోకుండా నటిస్తే అది నటనెలా అవుతుంది? ఇదీ ఒక విధంగా ఆలోచించవలసిందే. నటుడు పాత్రయొక్క అవస్థను ఎప్పుడైతే తన హృదయంలో చిత్రించుకుంటాడో అప్పుడు రసోత్పత్తి కలగకుండా వుండదు. అటువంటి రసం వుత్పన్నంకానిదే సభికుల్ని మెప్పించలేడు, నిజమే కాని దీనిని ఒక హద్దులో వుంచుకోవాలి. అదే కళ-అదే అభినయం. వీటి హద్దులు దాటితే అది ఏమాత్రం అభినయంగాగాని, కళగా కాని చెలామణి కాదు. కనుక నటుడు పాత్రను అర్థం చేసుకుని పాత్రోచితంగా హద్దుల్లో నటించడమే మంచిది. తన్మయత్వాన్ని ఏ పరిస్థితుల్లోనూ నటీనటులు పొందగూడదు.

### నిగ్రహాన్ని కోల్పోతే నిష్ప్రయోజకులే :

అనేకమంది నటీనటులు నటనలో చాల సమర్థులైనప్పటికీ రంగస్థలంమీద నటించేటప్పుడు నిగ్రహాన్ని కోల్పోతూ వుంటారు, నటించటం ఎంత తెలిసినా ఆ అభినయం హద్దుల్లో వుండాలి. అభినయం హద్దులు తప్పినప్పుడు చాల పేలవంగా వుంటుంది. నటకునికి ఎంత నిగ్రహం వుంటే అంత మంచిది. ఒక్కొక్క నాటకంలో దాదాపు మూడు గంటకాలం ఏకధాటీగా నటించాల్సి వస్తూవుంటుంది. ఒకేపాత్ర అనేక అవస్థల్ని అనుభవించి అనేక స్థాయిల్లో నటించాల్సి వుంటుంది. అంతలోనే ఏడ్వడం, వెంటనే నవ్వడం, మరో సన్నివేశంలో ఆనందంతో తుల

తూగడం, ఇలా ఒక భావంనుంచి మరొక భావంలోకి మారేసమయంలో మంచి కట్టుదిట్టాలతో తన నటనను అదుపులో పెట్టుకోవాలి. అవసరమైనప్పుడు కళ్ళ వెంట జలజలా నీరు కార్చాడనుకోండి, ప్రేక్షకులను కూడ ఏడ్పించాడన్నమాట. నటుడు నటించాడే కాని నిజంగా అనుభవించినవారు ప్రేక్షకులే. ఇలాగే ఒక భావం నుండి మరోభావంలోకి వెంటనే మారే నిగ్రహాన్ని నటుడు సంపాదించాలి. ఇలా మారనట్లయితే అది నటన అనిపించుకోదు. కొంతమంది నటసోదరులు ఇలాంటి నిగ్రహాన్ని కోల్పోయి. ఏడ్వడం మొదలుపెడితే అడేపనిగా ఏడ్వడం, కొట్టడం మొదలుపెడితే అడేపనిగా కొట్టడం చేస్తున్నారు. నటుడు ఎంతో నిగ్రహంతో వున్నప్పుడుగాని సరిగా నటించలేదు. గారడీపనుల్లాగ ఎప్పుడు ఏ అభినయం కావాలనుకుంటే అప్పుడు దానిని వెంటనే ప్రదర్శించగలిగిన శక్తిసామర్థ్యాలు- నిగ్రహం ప్రతి నటీ నటునకుండాలి. ఇలాంటి నిగ్రహం నాటకంయొక్క స్థాయిని ఎన్నోరెట్లు ఎక్కువచేస్తుంది. నిగ్రహంతో నటించగలిగిన నటుడు రసపిద్ది పొందాడని చెప్పవచ్చును.

నటుడు, భంగిమ :

రంగస్థలంలో నటుడు నిలబడడంలోగాని, నడవడంలోగాని, భలే పోజులో నిలబడ్డాడని, చక్కని పోజులో నడిచాడనీ ప్రేక్షకులు అంటూవుంటారు. వీటినే భరతనాట్య శాస్త్రకారులు భంగిమలుగా చిత్రించారు.

నాట్యాచార్య యడవల్లి సూర్యనారాయణ దుష్యంతపాత్రలో అలా రంగస్థలంపైకి నడిచివస్తే ప్రేక్షకులు ముగ్ధులైపోయేవారు.

అలాగే మాధవపెద్ది వెంకటరామయ్య దుర్యోధన పాత్రలో, ఒక పోజులో నిలబడితే, కేవలం మాధవపెద్ది అనికాక దుర్యోధనుని యొక్క హుందాతనాన్ని, దర్పాన్ని కళ్ళకు కట్టేటట్లు చిత్రించేవారు.

స్థానం నరసింహారావు చింతామణి పాత్ర ధరించి, ఒక పుష్పాన్ని పుచ్చుకుని వయ్యారంగా రంగస్థలంలో ప్రవేశిస్తే ముగ్ధులైపోయేవాళ్ళు ప్రేక్షకులు. ఇలా ఎన్ని ఉదాహరణలనైనా ఇవ్వవచ్చును. ముఖ్యంగా రంగస్థలంలో నిలబడినప్పుడు, కూర్చునేటప్పుడు ఏదో వారికి అనువైన భంగిమను అనుసరించాలి.

పాత్రకుతగిన తీవిని పాటించాలి :

హస్తాలూ, కాళ్ళూ, ఇతర అవయవాల్నీ స్వాధీనంలో వుంచుకున్నప్పుడు ఎలాంటి భంగిమనైనా చూపించవచ్చును.

నటుడు మామూలుగా నిలబడడంలోనూ, దుస్తులూ, ఆభరణాలు ధరించి నిలబడడంలోనూ, పరికరాలను పట్టుకుని నిలబడడంలోనూ ఎంతో వ్యత్యాస ముంది. ఉదాహరణకు భీముడు గదాదండం భుజాన వేసుకుని ఎలా నిలబడాలి? అలాగే యముడు దున్నపోతు నెక్కి కూర్చుని ఎలా రంగంలోకి ప్రవేశించి ఏ పోజులో ఎక్కడ నిలబడితే ప్రేక్షకులకు ఆనందంగా వుంటుంది ? ఇలాంటి భంగిమ లన్నిటినీ నటీనటులు సాధనతో సాధించాలి. వింధ్యరాణి నాటకంలో తోట వెంకటేశ్వరరావు స్త్రీ పాత్రలో రంగస్థలంలో ప్రవేశించి, అలా నిలబడితే ప్రేక్షకులు భ్రమలో మునిగిపోయేవారు.

నటీనటుల్లో కొందరు ఒక్కొక్క భంగిమలో అద్భుతంగా కనుపిస్తారు. కొంతమంది ప్రేక్షకులకు ఎదురుగా నిలబడితే ఎంతో బాగుంటారు. మరి కొంత మంది ఒకప్రక్కకు తిరిగి నిలబడితే ఎంతో అందంగా కనబడతారు.

ఏమైనా రంగస్థలంలో నిలబడే ప్రతి నటీనటుడూ ప్రదర్శనాంతం వరకూ, ఏదో ఒక భంగిమలో నడవడంగాని, కూర్చోవడంగాని, నిలబడి చూడడంగాని ఒక పద్ధతిలో వుండాలి. ప్రతి నటీనటుడు ఈ భంగిమల విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకోవాలి. ఇది వారివారి పాత్రలకు ప్రాణంతో సమానమైనది.

## నటుని జ్ఞాపక శక్తి

నటునికి నటనలో ఎంత నిగ్రహం వుండాలో అంత జ్ఞాపక శక్తి కూడా వుండాలి. ముఖ్యమైన ఘట్టాల్లో నటించే సమయంలో నటుడు తన సంభాషణలను మరచిపోవడం జరుగుతూ వుంటుంది. నిజమైన నటుడు తన పాత్రావస్థను ఎంతగా అనుకరిస్తూన్నప్పటికీ తన పాఠాన్ని మాత్రం మరచిపోడు. నటుడు స్మృతితో కూడిన ఒక విస్మృతిని అనుభవించాలి. ఇందుకు ఎంతో జ్ఞాపక శక్తి అవసరం.

జ్ఞాపక శక్తి వున్న నటీ నటులు కూడ తన్మయత్వం పొందినప్పుడు పాత్రను వదలి వారి సంభాషణలు గుర్తుకురాక స్వంత సంభాషణలు మాట్లాడడం జరుగుతూ వుంటుంది. అంతేగాక ప్రదర్శనరోజున అలవిగాని బాధ్యతలను నెత్తి నేసుకున్న నటునికి ఒక వరుస క్రమంలో సంభాషణలు నడువవు. ఏమీ విశ్రాంతిలేనందువల్ల తొట్రుపడి సంభాషణలు మరచిపోవడం జరుగుతుంది. రిహార్సల్సులో సంభాషణలు బాగా చెప్పగలిగినా, ప్రేక్షకుల్ని చూడడంతో సంభాషణలు మరచిపోతారు. నటీనటులు ఎన్ని పనుల్లో నిమగ్నమైనా వారి పాత్రకు సంబంధించిన అభినయాన్ని, సంభాషణలను ఏమాత్రం మరచిపోకూడదు. సంభాషణలు మరచిపోయిన వ్యక్తి నటుడుగా రాణించడం కష్టం. ఎవరి పాత్రమీద వారు దృష్టిని కేంద్రీకరించినప్పుడు ఇలాంటి లోపాలు రావు.





# 22

# దర్శకుడు



దర్శకుడు, ఎటువంటి దర్శకుడు కావాలి? దర్శకుని ఆదర్శం, దర్శకుని వ్రాతప్రతి, పాత్రల విభజన, నటీనటుల ఎన్నిక, చిన్న పాత్రలు, సన్నివేశాలు నిర్వహణ, బిట్‌రిహార్సల్సు, డ్రస్సు రిహార్సల్స్, స్టేజి రిహార్సల్స్, రిహార్సల్స్, ప్రేక్షకులు

# దర్శకుడు

ప్రతి నాటక సమాజానికి ఒక దర్శకుడుండాలి. కాని నేటి నాటక సమాజాలు దర్శకుని ప్రాముఖ్యం ఎంత అవసరమో గుర్తించ లేకుండా వున్నాయి. ఒక వేళ దర్శకుడు కావాలనుకునే సమాజాలకు ఎవరు దర్శకుడుగా వుండాలనేది ఒక సమస్య. ఒక వేళ ఈ సమస్య పరిష్కరించ బడినా, అనేక సమాజాలలో అనేక రకాలయిన దర్శకులను చూస్తున్నాం. నాటకానికి పెట్టుబడిపెట్టినవారూ, లేక సమాజాన్నిస్థాపించినవారూదర్శకులుగాతయారౌతున్నారు. ఈ పై విధానాలవల్ల నిజమైన దర్శకుడు కనబడకుండా పోతున్నాడు. వుత్సాహంవున్న ప్రతివారూ



దర్శకులు కాలేరు. కాకూడదు కూడాను. నాటక రచనలో ప్రతిభవుండి, నటీ నటుల్లో నటించ గలిగిన సామర్థ్యం వున్నప్పుడు, దర్శకుని అవసరమేముందీ అనే వారున్నారు. కాని రచనలో, నటకులలో వున్న ప్రతిభనంతా దర్శకుడు తన ప్రతిభ వల్ల సమన్వయించ గలుగుతాడు. ఇందువల్ల నాటక ప్రదర్శనాలు రాణిస్తాయి. రచయిత నాటకం వ్రాయడంలో ఎంత బాధ్యత వహిస్తాడో, దానిని వుత్తమంగా ప్రదర్శించటానికి దర్శకుడు అంత బాధ్యుడౌతాడు. రచనకు, దర్శకుని ప్రతిభవల్ల అన్ని అందాలూ చేకూరతాయి.

రచయిత తాను వ్రాయగలిగినంత వ్రాసి ప్రేక్షకుల ఊహకు కొంత వదులుతాడు. దానిని పూర్తిచేయవలసినవారు దర్శకుడూ, నటీనటులే. నాటక సమాజం ఎన్నుకునే దర్శకుడు ప్రతిభావంతుడై వుండాలి. అన్ని విషయాలను ఆకళింపు చేసుకున్నవాడై యుండాలి. అప్పుడే అతడు దర్శకస్థానానికి అర్హుడు.

## ఎలాంటి నాటకాన్ని ఎన్నుకోవాలి :

క్రొత్తగా ఏర్పడిన నాటక సమాజానికి ఎలాంటి నాటకాన్ని ఎన్నుకోవాలి అనే సమస్య వుదయిస్తుంది. ఇదివరలో కొందరు ప్రదర్శించిన నాటకాన్ని తీసు

కోవడం మంచిదా? లేక క్రొత్త నాటకాన్నే తీసుకుని ప్రాక్టీసు పెట్టడం మంచిదా? ఒకసారి ప్రదర్శించిన నాటకం ప్రదర్శించడం ఎప్పుడూ తేలికే కాని ఆ నాటకాన్ని మక్కీకి మక్కీ ప్రదర్శించడం జరిగితే ఆది కేవలం అనుకరణగా మాత్రమే వుండిపోతుంది. నటీ నటుల ప్రతిభ అంతగా బయట పడదు. ఒక క్రొత్త నాటకాన్ని తీసుకుని ప్రదర్శించడం ద్వారా, ఆ నాటకానికి తొలి రూపురేఖలు దిద్దిన వారౌతారు.

ఉదాహరణకు డి. వి. సుబ్బారావుగారి హరిశ్చంద్ర నాటకం చూచిన తరువాత ప్రతి హరిశ్చంద్ర పాత్రధారీ, ఆ పద్ధతినే ప్రవేశపెట్టి ఆయన పద్ధతిలోనే పద్యాలు చదవడం, ఆయన ఎలా నడిస్తే అలా నడవడం చేస్తున్నారు. ఇందువల్ల ఏ నటునియొక్క స్వయంప్రతిభైనా ఎలా బయట పడుతుంది? ఒక్కొక్క నటునికి ఒక్కొక్క దృక్పథం వుంటుంది. దుర్యోధనపాత్రకి యడవల్లి ఒక పద్ధతిని అనుసరిస్తే, బళ్ళారి రాఘవ ఆ పాత్ర మనస్తత్వాన్నే మార్చివేశాడు. కనుక క్రొత్త నటుడుగాని, పాత నటుడుగాని అనుకరణ పద్ధతిలో పడిపోయి స్వయంప్రతిభను నాశనం చేసుకోకూడదు.

### అనుకరణ పద్ధతి:

వుత్సాహం కొద్దీ నాటకాలా డాలనుకునేవారు. ఈ అనుకరణ పద్ధతిలో నాటకాలు ప్రదర్శించవచ్చు. ఇందువల్ల ఏ పాత్రను ఎలా అర్థం చేసుకోవాలో, ఏ పాత్రను ఎలా అభినయించాలో, ఏ పాత్రకు ఎలాంటి దుస్తులను ధరింపజేయాలో, రంగస్థలంలో ఎలాంటి పరికరాలను వాడాలో, రంగస్థల కదలిక లెలా వుండాలో మొదలగు అన్ని విషయాలూ ఒక నాటకాన్ని అనుకరించడంవ్వారా తెలుస్తాయి. ఈ పద్ధతి ఔత్సాహిక నాటక సమాజాలవారికి చాల సహాయ పడుతుంది.

క్రొత్తగా ఒక నాటకాన్ని ప్రదర్శనంలోకి తీసుకురావడం ఎవరికైనా కష్టమైన విషయమే. ప్రతి పాత్రకూ ఒక రూపాన్నివ్వాలి. ఒక వేషధారణను నిర్ణయించాలి. అభినయం కదలికలూ అన్నీ మార్పు చెందుతాయి. అంటే ప్రతి విషయమూ క్రొత్తగానే వుంటుంది. కాబట్టి దీనికి కొంత ప్రతిభ అవసరం. సమర్థులైన నట నటీవర్గం వున్నప్పుడు ఒక క్రొత్త నాటకాన్ని ప్రదర్శించడమే మంచిది. ఇందువల్ల అనేక క్రొత్త నాటకాలు ప్రదర్శనానికి యోగ్యంగా తయారవుతాయి.

కాని, కనబడిన ప్రతి నాటకాన్ని ప్రదర్శనానికి తీసుకోవడం మంచిది కాదు. నాటకాన్ని ప్రదర్శింప దలచుకున్నవారు నాటకం ప్రదర్శనానికి పనికి వస్తుందో లేదో నిర్ణయించుకోవాలి. అలాగే నటకుల్లో ప్రతిభలేనప్పుడు ఎంత మంచి నాటకాన్నైనా పాడు చేస్తారు.

కనుక క్రొత్త సమాజాలవారు జీవం కలిగిన కథా, సహజమైన పాత్రలూ, సంభాషణలూ కలిగిన నాటకాన్ని తీసుకోవాలి. తలకు మించిన బరువులాగా వారి తాహత్తుకు మించిన నాటకాన్ని తీసుకుని నాశనం చేయడం మంచిది కాదు. ఇలాంటి వారు ఇదివరకు ప్రదర్శించిన నాటకాల్లో ఏది అనుకూలంగా వుండే దానిని తీసుకోవడం మంచిది.

ఎటువంటి దర్శకుడు కావాలి?:

దర్శకుని ఎన్నుకునేటప్పుడు అనేక జాగ్రత్తలు వహించాలి. దర్శకునకు నాటక రచననుగూర్చి, నటననుగూర్చి, నాటక ప్రయోగాన్నిగూర్చి క్షుణ్ణంగా తెలిసుండాలి. దళాన్ని కట్టుబాటులతో సన్నిహిత సహకారాలతో నడిపే సమర్థతా, చాకచక్యం వుండాలి. ఎంతో ఓర్పు, సహనం వుండాలి. నటకులలోవచ్చే సందేహాలకు సరియైన సమాధానాలిస్తూ, వారి సూచనలు తీసుకుంటూ, సవిమర్శకంగా వారికి నచ్చజెపుతూ, తెలియని నటీ నటులకు తెలియజెపుతూ, తలలో నాలుకలా, నటీ నటవర్గానికి తండ్రిలాగా వుండాలి.

నాటక ప్రదర్శనాన్ని చాల వరకు దర్శకుడు జయప్రదం చేయగలుగుతాడు. నాటక విజయానికి కావాల్సిన వాతావరణాన్ని సృష్టిస్తాడు. నాటకంలో వచ్చే లోటు పాట్లను ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటాడు. సరియైన దర్శకుడైతే నాటక రచనలో గొప్పతనం కొంచెం తగ్గినా తన ప్రతిభతో నటీ నటులద్వారా నాటకాన్ని రాణింపుకు తీసుకు రాగలడు. రచన మంచిదైనా- దర్శకుడు అసమర్థుడైతే అటువంటి నాటక ప్రదర్శనాన్ని చూడలేం.

దర్శకుడు డిక్టేటరు కాకూడదు:

డిక్టేటరన్నందుకు ఏ దర్శకుడూ ఏమీ అనుకోకూడదు. దర్శకుని స్థానం ఎంత గొప్పదైనా నటీ నటులపట్ల అతని ప్రవర్తన సున్నితంగా వుండాలి. దర్శకుని స్థానం చాలా వున్నతమైనది. కొంతమంది దర్శకులు నటకులమీద పెత్తనం

చలాయిస్తూ వుంటారు. కారణం తాను దర్శకుడనీ, దర్శకుడంటే నటీ నటులపై పెత్తనంచేసే వ్యక్తి అని అతని అభిప్రాయం. అలాంటి దర్శకులు ఏ సమాజానికీ అక్కరలేదు. నటకులు చెప్పింది అర్థంచేసుకునే ఓపికవున్న దర్శకునికి స్వతంత్రం ఇచ్చినా ఫరవాలేదు. నటీ నటులకు కూడ అనేక స్వతంత్ర భావాలుంటాయి. అలాంటి భావాలను అరికట్టడం మంచిది కాదు. అలా అరికట్టినందువల్ల నటకులయొక్క ప్రతిభ మరుగున పడుతుంది.

దర్శకుని ఆదర్శం :

దర్శకుడు ఎంతో ఆదర్శప్రాయుడై వుండాలి. నాటక సమాజం నిర్వహణలో ఎన్నో చిక్కు సమస్యలు వస్తూ వుంటాయి. రచయితలు తాము వ్రాసిన సంభాషణల్లో ఒక్క ముక్కకూడ మార్చగూడదనే వాదనలు తెస్తారు. అలాగే నటీ నటుల్లో ఫలానా సంభాషణ నువ్వు చెప్పినట్లే ఎందుకు చెప్పాలి? ఇలా ఎందుకు చెప్పకూడదని వాదించే వారుంటారు. ఒక్కొక్కరు వుద్రేకంతో వ్యవహరించి విషయసాధనకు దూరమౌతారు. సమాజమన్న తరువాత వివిధ మనస్తత్వాలు కలిగిన వారుంటారు. ప్రతినిమిషం అనేక సమస్యలు వస్తూవుంటాయి. వీటన్నిటినీ పరిష్కరించవలసిన బాధ్యత దర్శకుని మీదేవుంది. బిడ్డలపై అజమాయిషీ తండ్రికి ఎంత వుంటుందో, నటీ నటులపై దర్శకుని బాధ్యతకూడ అంత వుంటుంది. ఎన్నో సంఘటనలువచ్చి అనేక చిక్కుల్ని కలిగిస్తాయి. ఈ అగ్నిపరీక్షలనుంచి దర్శకుడు బయటపడాలి. ముఖ్యంగా దర్శకుడు నీతీ నియమాల విషయంలో తోటి నటీ నటులకు ఆదర్శప్రాయంగా వుండాలి. అప్పుడే ఆదర్శప్రాయమైన దర్శకుడుగా వెలుగొందుతాడు. ఇలా వున్ననాడు దర్శకునిమీద నటీ నటుల ఆదరాభిమానాలు ఎక్కువౌతాయి.

నాటకాన్ని అర్థం చేసుకోవాలి :

గ్రంథకర్త నాటకంలో పొందుపర్చిన అభిప్రాయాలను, భావాలను, సంఘటనలను, ఆదర్శాలను చక్కగా ప్రేక్షకులముందు ప్రదర్శించడమే దర్శకుని బాధ్యత. రచయిత ఒక నాటకాన్ని దర్శకునిచేతిలో పెట్టినప్పుడు ఆ నాటకానికి కావలసిన వాతావరణాన్నంతా దర్శకుడు సృష్టించాలి. పూర్వ నాటకాలలో రచయితే నాటకాన్ని నిర్వహించి ఆడించేవాడు. అలా ప్రదర్శించిన నాటకాలు చాల

వరకు రచయిత అభిరుచుల ననుసరించే వుండేవి. అంతేకాక ఆనాడు ఒక సమాజం ప్రదర్శించిన నాటకాన్నే అనేకమంది అనుకరించడంవల్ల ఇతరులకు కొంత కష్టం తగ్గేది.

కాని ఈనాటి నాటకాలలో దర్శకుని అవసరం ఎంతో వుంది. నాటకానికి కావలసిన అన్ని విషయాలను దర్శకుడు అవగాహన చేసుకోవాలి. ఆ తరువాతే నటీ నటులకు తెలియచెప్పాలి. నాటకంపట్ల దర్శకుని సందేహాలన్నీ తీరిన తరువాతే సమాజ సభ్యులముందు ఆ నాటకాన్ని చదవడం మంచిది.

పాత్రల విభజన :

నాటకానికి నటీ నటులను ఎన్నుకునేటప్పుడు దర్శకుడు ఎంతో జాగ్రత్త వహించాలి. లేనట్లయితే అనేక భేదాభిప్రాయాలు రావడానికి అవకాశముంది. ప్రతి నటకునికీ ఏదో ఒక మంచిపాత్ర వెయ్యాలనే వుత్సాహం, వుబలాటం వుంటాయి. ఉత్సాహం వుండవచ్చుగాని నటించడం కష్టం. ఉత్సాహాన్నిబట్టి ఏ దర్శకుడూ పాత్రలను విభజించకూడదు. తన పాత్రలకు తగిన, తన చేతిలోవున్న నటకులను దృష్టిలో పెట్టుకునే పాత్ర విభజన చేయాలి. ఈ విభజనలో నటకులకు తన అభిప్రాయాలుచెప్పి, అసలునికే ఈ పాత్ర ఎందుకు ఇయవలసి వచ్చిందో తగిన కారణాలను నిరూపిస్తూ. అతను ధరించబోయేపాత్ర ఔచిత్యాన్ని దృష్టికితెచ్చి, పాత్రకు అతను ఎలా న్యాయం కలుగజేయాలో విపులంగా వివరించి మరీ పాత్ర ఇవ్వాలి.

దర్శకునికి పాత్రలను నిర్ణయించడంలో ఏ మాత్రం మొగమోటమి వుండకూడదు. ఖచితమైన నిర్ణయంతో వుండాలి. అయితే నటకులను ఎన్నుకునే స్వాతంత్ర్యం దర్శకునికున్నా నటకుల అమూల్య అభిప్రాయాలను కూడా పాటించడం మంచిది.

దర్శకుని గొప్పతనం పాత్ర విభజనలోనే చాలవరకు వ్యక్తమౌతుంది. నటకుల్ని ఏరుకోవడంలో ఎంతో శ్రద్ధ వహించాలి. ప్రతి నటకునికి కొన్నిగుణాలు అవసరం. రంగస్థలం మీదకువచ్చే ప్రతి పాత్రా హృద్యమంగా వుండాలి. అభినయం సరీగా వుండాలంటే అంగసౌష్టవం సరిగా చూడాలి. వికృత హాస్యవేషాలకు ఆయా వ్యక్తులను ఏరుకోవాలి. నాటకానికి నటకుడు ఎంత ప్రాణమో, నటకునికి వుచ్చారణకూడ అంత ప్రాణం. సరియైన గాత్రం, స్వచ్ఛమైన వుచ్చారణలేని నటకులు

నాటకానికి పనికిరారు. అటువంటివారిని ఎన్నిక చేయకూడదు. ఇలా ఆయా నటకుల్ని వీరుకున్న తరువాత పాత్ర ఔచిత్యం చూడడం ముఖ్యం. ఎవరు ఏ పాత్ర నటిస్తే బాగుంటుందో సరిగా చూడాలి. దర్శకుడు నిర్ణయించిన పాత్ర రంగస్థలం మీదికి వచ్చినప్పుడు ప్రజల మన్ననల పొందేదిగా వుండాలి.

పొడుగు, పొట్టి
పాత్రధారులు :

దర్శకుడు ఎన్నుకున్న పాత్రధారుల్లో కొంచెం పొడుగూ, పొట్టీ పాత్రధారు లుంటారు. ఒక పొట్టివారు, ఒక పొడుగువారు దగ్గర దగ్గర నిలబడితే పేలవంగా వుంటుంది. అలాంటి నటులే మనకు లభించినప్పుడు వారిని కొంచెందూరంగా నిలబెట్టి సంభాషణలు చెప్పించడం మంచిది. అవసరమైన సన్నివేశం అనుకుంటే తప్పితే, రంగస్థలంలో రెండు పాత్రలు దగ్గరకు రాకూడదు. పొడుగూ పొట్టి దంపతులకు ఒక శృంగార సన్నివేశం వుందనుకుందాం, ఇరువురూ దగ్గరకు రావాలి. ఇలా దగ్గరకు వచ్చినప్పుడు భర్త 6 అడుగులుండి, భార్య 4 అడుగులుంటే ఆ సన్నివేశం తేలిపోతుంది. అలాంటి వారిని కొంచెం దూరంగా నిలబెట్టడంద్వారా భార్య పాత్ర పొట్టిగా కనబడదు. కనుక ఇలా పొడుగూ, పొట్టి పాత్రధారు లున్నప్పుడు కొంచెం దూరదూరంగా నిలబడడం మంచిది. అలా కానప్పుడు పొట్టివారిని కుర్చీమీదో, బెంచీమీదో, మంచంమీదో కూర్చోబెట్టి ఎవరు పొడుగువారో వారు కొంచెం వంగడంగాని, మంచంమీద కాలుబెట్టి నిలబడడంగాని చేసినట్లయితే పొడుగూ, పొట్టిపాత్రల లోపాలను కాపాడవచ్చు.

అంతేగాక విశాలమైన రంగస్థలంలో పొట్టిగానున్న పాత్రధారులు సాధ్యమైనంతవరకు రంగస్థలం ముందు భాగంలో నిలబడడం మంచిది. ఇలాకాక ఈడూ జోడూ కలిగిన దంపతులుకాని, ఇతర పాత్రధారులుగావి వున్నప్పుడు ఎలా నిలబడినా నిండుగా వుంటుంది.

నటీనటుల ఎన్నిక తరువాత :

నటీ నటులను ఎన్నుకున్న తరువాత దర్శకుడు తాను ప్రారంభించ దలుచుకున్న నాటకాన్ని నటీ నటులందర్నీ సమావేశపర్చి విపులంగా చదివి వినిపించాలి. తరువాత అందరి సమక్షంలో ఒద్దికలు ప్రారంభించాలి. ముందుగా దర్శకుడు నాటక

ఇతివృత్తాన్నంతా అర్థమయ్యేటట్లు ఎన్నిసార్లు చదివితే అంత మంచిది. ఎవరికి ఏ పాత్ర నివ్వాలో నటీ నటులకు చెప్పకుండా దర్శకుడే ముందుగా నిర్ణయించుకుని, నాటకం చదివే సమయంలో ఎవరు ఏ పాత్రమీద ఎక్కువ కుతూహలం చూపుతున్నారో తెలుసుకోవచ్చు.

కాని దీనివల్ల ఒక నష్టం కూడా లేకపోలేదు. ఒకే పాత్రమీద ఇరువురు వుత్సాహం చూపించడం, శక్తి సామర్థ్యాలు లేకపోయినా తనకే ముఖ్య పాత్ర కావాలని తయారవడం సంభవిస్తుంది. అయినా ఒకే పాత్రకు ఇరువురు పోటీ పడినప్పుడు అందులో ఎవరు మిన్నగావుంటే వారినే నిర్ణయించాలి.

పాత్రల నిర్ణయం అయిన తరువాత పాత్రధారులకు వారి వారి పోర్షన్ను ఇచ్చి చదివించేముందు వారి పాత్రల మనస్తత్వాన్నిగూర్చి, దర్శకుడు వివరించి నట్లయితే, సంభాషణలను అతి స్వాభావికంగా చదువ గలుగుతారు. ఇలా కాక ఎవరి పోర్షన్ను వారికిచ్చి చదువుకురమ్మంటే ఏమీ ప్రయోజనంలేదు.

నటకులకు అర్థమైన ఆ నాటకాన్ని ఆయా పాత్రల వాచికాభినయం వచ్చే వరకూ వారి చేత సాధన చేయించాలి. అంతవరకు ఆంగిక సాత్వికాభినయాల జోలికి పోకూడదు. సంభాషణలు స్పష్టంగా పలక గలిగినప్పుడు ఇతర అభినయాలు వాటంతటవే ఉద్భవిస్తాయి.

దర్శకుడు నటీ నటులందరి సమక్షాన సక్రమమైన సూచనలిస్తూ, వారి సూచనలు తీసుకుంటూ వారిచేత సంభాషణలు కంఠోపాఠం చేయించాలి. సంభాషణలు స్పష్టంగా వచ్చేటంతవరకూ కృషిచేయాలి. తడువుకోవడమనేది ఏ పరిస్థితుల్లోనూ వుండకూడదు. ఇలా సమిష్టిగా పోర్షన్ను చదువుకోవడంవల్ల ఒక పాత్రను మరో పాత్ర అర్థంచేసుకోవడం జరుగుతుంది. ఒకరి తరువాత మరొకరు సంభాషణలు అందుకోవడం ద్వారా ఇతర అభినయాలు వాటంతటవే వస్తాయి. సంభాషణలు ఎలా పలకాలో కూడ తేలిపోతుంది. సమిష్టి కృషిలో అనేక లోపాలను సవరించుకోవచ్చును, ఇలా రిహార్సల్ను జరిగే సమయంలోనే రచనలో కావాల్సిన మార్పులు చేసుకోవాలి.

దర్శకుడు కూర్చుని రిహార్సల్ను చేయించడం ద్వారా నాటక స్వరూపాన్నీ, సందేశాన్నీ నటీ నటులు సంపూర్ణంగా గ్రహించ గలుగుతారు.

దర్శకుని ప్రాతపతి :

ప్రతిదర్శకుడు రిహార్సలు జరిగే సమయంలోనే చక్కని ప్రాతప్రతిని తయారుచేసుకోవాలి. ఒకసారి ప్రాతప్రతిని తయారుచేసుకోగలిగితే ఆది ఎన్ని వాట కాలకైనా పనికివస్తుంది. ప్రాతప్రతిలో ప్రదర్శన విధానాన్నంతా చూడవచ్చును. నాటకప్రతిలో ప్రతిపేజీకి ప్రక్కన ఒక తెల్లకాగితం చొప్పున ఏర్పాటుచేసుకుని, ప్రతి చిన్నవిషయాన్ని ఆ కాగితాలమీద నోట్ చేసుకోవాలి.

ఏ పాత్ర ఎప్పుడు ప్రవేశిస్తుంది? ఎప్పుడు నిష్క్రమిస్తుంది? కర్టెను ఎప్పుడు దించాలి? ఎప్పుడు ఎత్తాలి? ఏయే రంగంలో ఏయే సామగ్రి కావాలి? ఆ సామగ్రి ఏయే స్థలంలో అమర్చాలి? ప్లాను ప్రకారం బొమ్మల్లో వ్రాసుకోవాలి. ఇలా వ్రాసుకున్నట్లయితే ప్రతిరంగంలోనూ కావలసిన అన్ని వస్తువుల్నీ చక్కగా అలంకరించుకోగలుగుతాం. ఎప్పుడు యే పనిచేయాలో వివరంగా వ్రాసుకుంటే ఏవిధమైన ఇబ్బంది కలుగదు. ప్రాతప్రతి దగ్గరుంచుకుని అన్నివస్తువులూ సక్రమంగా వచ్చాయోలేదో ఒకసారి సరిచూచుకుంటే నిర్భయంగా తెర ఎత్తించవచ్చు. ఇలా ప్రాతప్రతి లేనప్పుడు అన్నివస్తువులూ అమర్చామోలేదో తెలియక సర్దిందేసర్దుతూ, తికమకపడుతూ రంగానికి రంగానికీ మధ్య ఎక్కువ ఆలస్యం చేస్తూవుంటాం. ఇందువల్ల నాటకం రక్తి తగ్గుతుంది.

ఎలా వ్రాసుకోవాలి? :

ఒక పాత్రధారి గుఱ్ఱపుబండిమీద గాని, ఎద్దుబండిమీదగాని, సైకిల్‌మీదగాని దిగివచ్చినని వ్రాసుకుంటాం. కాని మన రంగస్థలాల్లో బండ్లువచ్చే అవకాశం లేదు. అందువల్ల బండి దిగివచ్చినభావాన్ని మనం కలుగజేయాలి. బండి వచ్చినట్లు గంటల మ్రోతలు మ్రోగించవచ్చు. సైకిల్ దిగితే సైకిల్‌బెల్ కొట్టవచ్చు. అలాగే కథానాయకుడో, మరొకరో కారు దిగివచ్చారనుకోండి. కారుహారన్ కొడితే సరిపోతుంది. కారుహారనూ, మువ్వలపట్టెళ్ళూ, సైకిల్‌గంటా, రిక్షామువ్వలూ అని వ్రాసుకుంటూ, వాటిని ఉపయోగించే హంగుదార్ల పేర్లుకూడ వ్రాసుకోవాలి.

ఇంకా రంగంలో ప్రవేశించబోయే వ్యక్తి ఏయే వస్తువులు ధరించాలి: ఆయనకు కావల్సిన కట్టి, చెప్పులు, కళ్ళజోడు, జేబుగడియారం—ఇలా ఆయా పాత్రలకు కావల్సిన ప్రతి చిన్నవస్తువూ వివరంగా వ్రాసుకోవాలి. ఇలాంటి ప్రాత ప్రతిని ఎవరు దగ్గరుంచుకున్నా పై పనులన్నీ జరిగిపోతాయి.

కనుక ప్రదర్శనకు కావలసిన అన్ని వివరాలనూ, కావలసిన వస్తువులనూ వ్రాసుకోగలిగితే ఎలాంటి లోట్లూ జరుగవు. ప్రతి నాటక ప్రదర్శనమూ రక్తి కడుతుంది. ఈనాటి మన ఆంధ్రనాటకాల్లో ఇలాంటి వ్రాతప్రతిని ఎక్కడా చూడడం లేదు. అందువల్లనే మన ప్రదర్శనాలు అంత నిర్మాణాత్మకంగా లేవు.

చిన్నపాత్రలు :

నాటకంలో వచ్చే చిన్న పాత్రల విషయంలో దర్శకుడు అత్యంత శ్రద్ధ తీసుకోవాలి. ఈనాడు అనేక నాటక ప్రదర్శనాలలో చిన్న పాత్రలు చాల అలక్ష్యంగా చూడపడుతున్నాయి. గొలుసుకు లింకులు లేకపోతే అది ఒక గొలుసుగా ఎలా చెలామణి కాదో-అలాగే ఈ చిన్న పాత్రలూ, ఆ పాత్రలను ధరించే చిన్న పాత్రధారులూ, నాటక విజయానికి ఎంతగానో తోడ్పడుతారు.

నేటి నటుల్లో అనేకమంది చిన్న పాత్రలను ధరించడం నీచంగా భావిస్తున్నారు. కొంచెం నటనాసామర్థ్యం వుంటే చాలు—అమాంతం పెద్ద పాత్రల మీదే దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. నేడు పెద్ద నటులనుకునే వారంతా ప్రారంభంలో చిన్న పాత్రలు ధరించే పైకివచ్చారని మనం తెలుసుకోగలిగితే ఈ చిన్న వేషాల విషయంలో ఏ సోదర నటుడూ వెనుకాడడు.

ఒకే నాటకంలో ఒక ప్రధాన పాత్రధారి బాగా నటించినా అతనిప్రక్కనే కుంటి వేషమో, గ్రుడ్డి వేషమో, కుష్టురోగి వేషమో చేసి ప్రధాన పాత్రకంటే మిన్నగా పోషించి, సెబాష్ అనిపించుకునేవారు అనేకమంది వున్నారు. నటునిలో సామర్థ్యముంటే చిన్న పాత్రైనా, పెద్ద పాత్రైనా రాణిస్తుంది.

ముఖ్యంగా రిహార్సల్సులో పెద్ద పాత్రలమీద వున్నంత కేంద్రీకరణ ఈ చిన్న వేషాలపట్ల వుండదు. నాటకప్రదర్శనం నాలుగురోజు లుందనగా ఆ వేషాలకు తరిఫీదు ఇచ్చి స్టేజిమీదకు పంపిస్తే ప్రదర్శనం చెడిపోవడమే కాక, ప్రక్కనున్న పెద్ద పాత్రలుకూడ నాశనమౌతాయి. అది చిన్న పాత్రగాని, పెద్ద పాత్రగాని, పాత్ర పాత్రే. ఉదాహరణకు ఒక సన్నివేశంలో ఒక డాక్టరు వచ్చి ఇన్‌జెక్షన్ ఇచ్చి, ఫర్వాలేదు ఈ మందు వాడండని వెళ్ళిపోయాడు. డాక్టరు సంభాషణ చిన్నదే గాని, డాక్టరు కుండాల్సిన లక్షణాలన్నిటినీ పోషించాలి గదా? అలాగే కోర్టు సీనులో ఒకే ఒక మాటతో జడ్జీ తీర్పు చెబుతాడు. జడ్జీ పాత్ర

చిన్నదే కాని జడ్జీ అంతస్తు ఎంతటిది ? కనుక పాత్ర చిన్నా పెద్దా అనిలేదు. ఏ పాత్రనైనా న్యాయంగా నటించి, నాటకప్రదర్శనానికి పుష్టిని కలిగించటమే ప్రతి నటుని బాధ్యత. తనకున్న సన్నివేశంలోనే తను తగిన మార్కులు తెచ్చుకుని సమర్థనీయుడైన నటుడని పేరు తెచ్చుకోవాలి. ఈ విషయాన్ని చిన్న పాత్రలు ధరించేవారు ఎంత త్వరగా తెలుసుకుంటే నాటక ప్రదర్శనాలు అంత త్వరగా బాగుపడతాయి.

సన్నివేశాలు, వాటినిర్వహణ :

అనేక సన్నివేశాలయొక్క కలయికే నాటకం. అన్ని సన్నివేశాలూ రక్తిగా నడిచినప్పుడే నాటకం నవరసభరితంగా తయారవుతుంది. నాటకంలో అంకవిభజన, రంగవిభజన, పాత్రవిభజన లాంటిదే ఈ సన్నివేశ విభజన కూడా. నాటకప్రదర్శన విజయానికి ఈ సన్నివేశాల రక్తి ఒక గొలుసులాగా అనేక స్థాయిలను దాటి గమ్యస్థానం చేరుకుంటుంది. ఈ సన్నివేశాలలో ఏ సన్నివేశం రక్తి కట్టకపోయినా మొత్తం నాటక ప్రదర్శనంలో ఆ లోపం కనబడుతూ వుంటుంది. రిహార్సల్సు జరిగే సమయంలోనే దర్శకుడు ఈ సన్నివేశాలను విభజించుకోవాలి. ప్రతి సన్నివేశాన్ని దర్శకుడు క్షుణ్ణంగా మననం చేసుకోవాలి. ఆ సన్నివేశాలలో వచ్చే పెద్దపాత్ర మొదలు, చిన్న పాత్రలవరకూ - పాత్రల ప్రవేశం మొదలు, నిష్క్రమణవరకూ - సన్నివేశ ప్రారంభం నుండి మరో సన్నివేశానికి పురోగమించే వరకూ ఆ కథాభాగాన్ని అనేకసార్లు మననం చేసుకోవాలి, ఆ తరువాత ఆ సన్నివేశంలో వచ్చే పాత్రలు ఎన్ని ? అందులో స్త్రీ పాత్రలు ఎన్ని ? పురుష పాత్రలు ఎన్ని ? సన్నివేశంలో వచ్చే అన్ని పాత్రల్లోనూ ప్రాముఖ్యం వహించే పాత్ర ఎవరో నిర్ణయించుకున్నప్పుడు, ఆ సన్నివేశానికి ఆ పాత్రధారే నాయకుడౌతాడు. ఈతడు కథానాయకుడే కానవసరంలేదు. ఆ సన్నివేశంలో వహించే పాత్ర ప్రాముఖ్యతనుబట్టే నాయకుడౌతాడు. ఈ విధమైన పరిశీలన జరిపిన తరువాత ఈ పాత్రలన్నిటినీ ఎలా సమీకరించాలో యోచించాలి. ముఖ్యంగా పాత్రల సంఖ్యనుబట్టి, దుస్తులూ, కదలికలూ, వాచికవిధానమూ, రంగోద్దీపనమూ, రంగస్థల పరికరాలనూ ఏర్పాటు చేసుకోవాలి. ఎక్కువమంది పాత్రధారులున్నప్పుడు వారి దుస్తుల్లో రంగు భేదమూ, పాత్రోచితమైన అలంకరణను గురించి కూడ ఆలోచించాలి. ప్రతిపాత్రకు ఏదో ఒక భిన్నమైన రంగు దుస్తుల్ని వుపయో

గించుకోవాలి. సన్నివేశంలో వచ్చే పాత్రలన్నీ ప్రేక్షకులు ఇంపును కలుగ జేయాలి. ఇలా ఇంపును కలుగజేయాలంటే ఆ యా పాత్రలను పాత్రోచితంగా అలంకరించుకోవాలి. ఇలా అలంకరించుకుని సన్నివేశంలో పాత్రలన్నీ సమావేశ మైనప్పుడు ఎవరు ఏ పాత్రో ప్రేక్షకులకు తెలిసిపోతుంది. కనుక ప్రతి పాత్రకూ ప్రారంభంలో దుస్తులు నిర్ణయించు కునేటప్పుడే ఈ సన్నివేశాలను కూడ దృష్టిలో వుంచుకుని ఆయా దుస్తులను ఎన్నుకోవాలి.

కదలికలతో
సన్నివేశం రక్తి కట్టాలి:

అలాగే కదలికల్లో కూడ సన్నివేశాన్ని రక్తిగా నడపాలి. సన్నివేశంలో ఒకపాత్ర మొదలు ఎన్ని పాత్రలైనా వుండవచు. రంగస్థలంలో పదిమంది పాత్ర ధారు లున్నప్పుడు వాటిని ఎలా సర్దుకోవాలి? ఏ పాత్రను ఎక్కడ నిలబెట్టాలి? ఒక పాత్ర కదలినప్పుడు మరో పాత్రధారి ఏ ప్రక్కకు వెళ్ళాలి? ఇలా రెండు పాత్రలు కదిలిప్పుడు, మిగతా పాత్రధారులు ఏమిచేయాలి! ఏపాత్ర కదలినా అది రెండవ పాత్రకు అడ్డుగా వుండకూడదు. అన్ని పాత్రలూ, అందరి ప్రేక్షకులకూ కనబడాలి. అలా అని అందరూ కట్టకట్టుకుని నిలబడకూడదు. రంగస్థలంలో ఆమర్చిన సెట్టును బట్టి ఆయా పాత్రలను, ఆయా ప్రదేశాల్లో అందరికీ కనబడే లాగున నిర్ణయించుకోవాలి. ఇలా నిర్ణయించుకున్నప్పుడు రంగస్థలాన్ని ఒక పేపరు మీద భాగాలుగా విభజించుకోవాలి. ఆ విభజించుకున్న భాగాలలో ఏ పాత్రను ఎక్కడ నిలబెట్టాలో గుర్తులు పెట్టుకోవాలి. గుర్తులద్వారా, పాత్రల కదలికలు నిర్ణయించు కోవాలి. ఇలా ప్రతి సన్నివేశాన్ని నిర్ణయించుకున్నప్పుడు, సన్నివేశం గంభీరంగా నడుస్తుంది. ప్రదర్శనం అడుగడుగునా రక్తికట్టి శిఖరాగ్రాన్ని చేరుకుంటుంది. అలాగే వాచిక విధానంలో కూడా, సన్నివేశ ప్రాముఖ్యాన్నిబట్టి, ఆరోహణా, అవ రోహణల్ని నిర్ణయించుకుని ప్రేక్షకులకు ప్రతిసంభాషణా వినబడేలా సన్నివేశానికి పుష్టి కలిగించాలి. అలాగే రంగస్థల పరికరాలనూ, లైటింగ్ విధానాలనూ పైపద్ధతి లోనే నిర్ణయించుకోవాలి. ఇలా ప్రతి ప్రయోక్త, ప్రతి సన్నివేశాన్ని రసవత్త రంగా తయారుచేసుకోగలిగిననాడు నాటకాన్ని రసభరితంగా ప్రేక్షకుల ముందుంచ గలుగుతాడు.

బిట్ రిహార్సల్స్:

పూర్తి రిహార్సల్స్ జరిపేముందు బిట్ రిహార్సల్స్ చేయడం ఎంతో మంచిది. నాటకంలో కొన్ని అంకాలుంటాయి. ఆ అంకాలలో కొన్ని రంగాలుంటాయి. ఆ రంగాలలో, రెండే పాత్రలు నటించవలసిన వన్నివేశాలుంటాయి. అలాంటి సన్నివేశాలను విడివిడిగా తప్పులులేకుండా క్షుణ్ణంగా రిహార్సల్స్చేయడం ద్వారా పూర్తి రిహార్సల్స్లో ఏ లోపమూ లేకుండా చూసుకోవచ్చును. (వీటినే బిట్ రిహార్సల్స్ అంటారు). పూర్తి రిహార్సల్స్ రోజుకొకసారి జరుపుకున్నా బిట్ రిహార్సల్స్ మాత్రం ఎన్నిసార్లు జరుపుకుంటే అంత మంచిది. ఈ విధానం చాల తేలిక కూడాను.

. రిహార్సల్స్కు ఇద్దరు ముగ్గురు నటులు హాజరుకాకపోయినా ఈ విధానం వల్ల పని భంగం లేకుండా సాగించుకోవచ్చును. నటీనటు లెప్పుడూ అందరినటుల కొరకు ఎదురుచూడకుండా తన ప్రతినటుడుంటే ఆతనితోనే రిహార్సల్స్ జరుపు కోవాలి. ఒకవేళ ఆరోజున ఎవ్వరూ రిహార్సల్స్కు హాజరుకాలేదనుకుంటే-ఒక్క నటుడున్నా అతనితో సంభాషణల వుచ్చారణ సరిజేయించటం, సంభాషణల ఆద్యం తాలు సరిచూచుకోవడం మొదలైనవి చర్యకుడు చూచుకోవాలి.

ఇలా బిట్ రిహార్సల్స్ జేయించడం వల్ల ఏసీనుకాసీను, ఏరంగానికా రంగం పరిపూర్ణతను పొందుతుంది. ఇలా బిట్ రిహార్సల్స్ చేసి చివరికి పూర్తి రిహార్సల్స్ ప్రారంభిస్తే ఎక్కడా ఏ అడ్డంకులు లేకుండా నాటకం పూర్తి అయ్యే వరకూ సులభంగా సాగిపోతుంది. ప్రథమంలోనే పూర్తి రిహార్సల్స్ ప్రారంభిస్తే అడుగడుగునా సందేహాలూ, వాటిని సరిజేసుకోవడంతోనే కాలం అయిపోతుంది. అంతేకాక అందరు నటులూ, అన్ని రోజులూ హాజరవుతారనే నమ్మకమూ వుండదు. అందువల్ల ఏవిధంగా చూచినా బిట్ రిహార్సల్స్ నాటకం జయప్రదం కావడానికి చాల వుపయోగం.

డ్రస్సు రిహార్సల్స్:

పూర్తి రిహార్సల్స్ అయిన తరువాత డ్రస్సు రిహార్సల్స్ వేయాలి. నాటకము వ్రాయబడినప్పుడే ఏపాత్రకు ఎలాంటి వేషధారణ వుండాలో నిర్ణయమై పోతుంది. పాత్రల చిత్రణనుబట్టే వేషధారణ వుంటుంది. రిహార్సల్స్ ప్రారంభ

మైన నాటినుంచే, ఏపాత్రను రచయిత ఎలా చిత్రించాడో ఆలోచించి అన్ని పాత్రలకు తగిన దుస్తులను, ఆభరణాలను వారివారి కొలతలప్రకారం తయారు చేయించి డ్రస్ రిహార్సల్స్ నాటికి సిద్ధంగా వుంచుకోవాలి.

ఎవరి పాత్రకు కావలసిన దుస్తుల్ని వారు చక్కగా అలంకరించుకుని, వేష ధారణలో తన పాత్ర ఏమిటో ఒక్కసారి అద్దంలో చూచుకుని తాను ధరించటోయే పాత్రకు, ధరించిన వేషధారణకు సరియైన సమన్వయం కుదిరిందో లేదో చూడాలి.

ఇంత చక్కగా అలంకరించుకుని రంగం మీదకు వచ్చినప్పుడు నటీ నటులు ఎంతో ఆహ్లాదాన్ని పొందగలుగుతారు. ముందు ఈ విధానాన్ని అవలం భించి వద్దికలు జరిపినట్లయితే నాటకం ప్రదర్శనం రోజున వేషధారణ ఏవిధంగా చేసుకోవాలో అని తికమక పడాల్సిన అవసరముండదు. వేషధారణ సరిగా లేనట్ల యితే నటుడు సంతృప్తిగా నటించలేడు. రంగంమీదకూడ ఈ అసంతృప్తితో ఏమాత్రం వికాసాన్ని పొందలేడు. డ్రస్ రిహార్సల్స్‌లో ముఖాలంకరణ, వస్తు వుల అలంకరణ, దుస్తుల అలంకరణా చేసుకుని ఉన్నలోపాలను సర్దుకుని రంగ స్థల ప్రదర్శనానికి వెళితే ఏమాత్రం కొత్తదనం లేకుండా, ఎవరికివారు చక్కగా అలంకరించుకో గలుగుతారు.

స్టేజి రిహార్సల్స్:

అనేక విషయాలను సమీకరించగలిగినప్పుడే నాటకం సరియైన నాటకం అనిపించుకుంటుంది. నాటకం పూర్తి రిహార్సల్స్ జరిగిన తరువాత ప్రదర్శనం ఇవ్వబోయేముం ను ఒకసారి రంగస్థలంమీద పూర్తిగా డ్రస్సు రిహార్సల్స్ జర పాలి. ఇలా జరుపుకున్నప్పుడు అనేక లోపాలను సరిచేసుకో గలుగుతారు.

మామూలు రిహార్సల్స్‌లో తెరలుండవు. విశాలమైన రంగస్థల ముండదు. ప్రవేశ నిష్క్రమణాలకు సరియైన స్థలముండదు. నటులయొక్క కదలికలుకూడ ఒక క్రమంలో వుండవు. అందువల్ల ఒకసారి రంగస్థలంమీద రిహార్సల్స్ జరిపితే ఏతెర ఎప్పుడు ఎత్తాలో, ఎప్పుడు దించాలో తెలుసుకోవచ్చు. అలాగే రంగస్థలంలో పరికరాలన్నిటినీ ఏర్పాటు చేసుకుని వాటిని వుపయోగించడం నేర్చుకోవచ్చును.

రంగస్థలంమీద నటీ నటులు ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని ఎటు నిలబడ గలిగితే ప్రేక్షకులు ఆనందించ గలుగుతారో? ఎదురుగా నిలబడాలా? లేక వాలుగా

నిలబడాలా? స్టేజిలో ముందుభాగంలో నిలబడాలా? లేక వెనుకభాగంలో నిల బడాలా? రంగస్థలంలో ఇంటిమార్గం ఎటు? వీధిమార్గం ఎటు? ఒక ప్రక్కనుండి ప్రవేశించిన వ్యక్తి నిష్క్రమించేటప్పుడు ఏ ప్రక్కకు వెళ్ళాలి? మొదలైన విష యాలను సరిచూచుకోవాలి.

గదిలోనో, ఇంకా ఇరుకు స్థలాల్లోనో రిహార్సల్సు జరిపిన మనం రంగ స్థలంమీదకొంచెం గందరగోళం పడతాం, ఆ వైశాల్యంకంటే రంగస్థల వైశాల్యం ఎక్కువ, ప్రేక్షకస్థానంకంటే, రంగస్థలం ఎత్తు ఎక్కువ. సంభాషణలు నిలబడి మాట్లాడితే ముందు కూర్చున్న ప్రేక్షకులకు సరిగా వినబడాలి. రంగస్థలంమీద నటీ నటులు అటూ ఇటూ తిరుగుతున్నప్పుడు ఏ నటుడు అడ్డంరాకుండా చూచు కోవాలి. సంభాషణలు ఆఖరుతరగతివరకు వినబడేటట్లు ఈ స్టేజి రిహార్సల్సులో చూచుకోవాలి. గొంతులు చివరివరకు వినబడుతున్నాయో లేదో ఒకరుకూర్చుని చూడాలి. అలాగే ఆడిటోరియం అన్ని ప్రక్కలకు వినబడుతున్నాయో లేదో జాగ్ర త్తగా గమనించాలి.

పీలగొంతులు, పన్నగొంతులూ అయితే రంగస్థలానికి కొంచెం ముందు వరుసలో నిలబెట్టాలి. ఒకే పాత్రధారి ఒక సన్నివేశంలో ఒక్కడే నిలబడాల్సివస్తే ఒకేచోట మొద్దులాగా కూర్చోకుండా ఏవో పనులు కల్పించుకునే కదలికలివ్వాలి. ఆలాగే నలుగురు పాత్రధారులుంటే వారంతా ఒకేచోట కుప్పబడిపోకుండా, విడి విడిగా వారిస్థానాల్లో నిలబడాలి. రంగస్థలంలో అవసరమనుకుంటే తప్ప ఎదురు గాను, వెనుదిరిగి నిలబడకూడదు, ఎప్పుడూ ఒక వారలో నిలబడడం, నడవడం జరిగితే, మాట్లాడే మాటగాని, చేసే అభినయంకాని, చక్కగా వుంటుంది, ఇలాంటి వాటి నన్నిటినీ స్టేజి రిహార్సల్సులోనే సరిచేసుకోవాలి. తీరా నాటకంరోజున వస్తే రంగస్థలమంతా క్రొత్తగా వుండి నరిగా నటించలేక బిగుసుకుపోతారు. ఈ రిహా ర్సల్సులో తెరలు, లైట్లు, పరికరాలు, ఆర్కెస్ట్రా, వేషధారణా మొదలైన అన్ని హంగులూ ప్రదర్శనం రోజున జరిపే మాదిరి నిర్వహించాలి. ప్రదర్శనానికి ముందు తప్పొప్పు లన్నిటినీ ఈ రంగస్థల వర్ధికలలోనే నవరించుకోవాలి. ఏ లోపాలూ లేకుండా ఇంత బాగా రిహార్సరల్సు జరిపితే నూటికినూరుపాళ్ళు నాటకం జయప్రదమైనట్లే.

కళాకారులను ఆహ్వానించాలి :

పూర్తి రిహార్సల్సు చేసి నాటకంలో సర్దుకోవాల్సిన లోపాలన్నిటినీ సరి చేసుకుని నాటకం ఒక రూపం పొందిందనుకున్నప్పుడు నాటకానుభవంగల నటీ నటులను, ప్రతిభావంతులైన విమర్శకులను ఆహ్వానించి వారి సమక్షాన పూర్తి రిహార్సల్సు వేయాలి. ఇలా చేయడంద్వారా అనేకలోపాలను సర్దుకోగలుగుతాం, వారి అమూల్యసలహాలను తీసుకుని చేయవలసిన సర్దుబాటులన్నీ చేసుకుని బహిరంగ ప్రదర్శనం ఇస్తే ఎంతో జనరంజకంగానూ, శోభాయమానంగానూ తయారవుతుంది. ఆ ప్రదర్శనానంతరం వచ్చిన విమర్శలను, అచరణయోగ్యమైన ప్రదర్శనయోగ్యమైన సలహాలను తీసుకుని ఆయా పాత్రలన్నిటినీ సమావేశపర్చి, సమిష్టిగా విమర్శలను చర్చించి ప్రదర్శనానికి తయారైతే ఆ ప్రదర్శనం ఏలోపాలూలేక ప్రజామోదాన్ని పొంది ఒక మంచి నాటక మనిపించుకుంటుంది.

రిహార్సల్సు - ప్రేక్షకులు :

రిహార్సల్సు జరిగే సమయంలో, దర్శకుడు నిర్ణయించుకున్న నటీ నట వర్గం, కార్యదర్శి, స్టేజి డైరెక్టరు, ప్రాంప్టరు, ఇతర సహాయులూ మినహా ఎవ్వరూ వుండడం మంచిది కాదు. ఇందువల్ల అనేక నష్టాలున్నాయి.

క్రొత్తగా నాటకం తీసుకున్నప్పుడు, అ నాటకం నటీ నటులకు చాల క్రొత్తగా వుంటుంది. పట్టుమని సంభాషణలు పలకడంగాని, నిలబడి ఆంగికాభినయం చేయడంగాని, ఇతర కదలికలనుగాని సరిగా ఇవ్వలేరు. ఇందుకు కారణం తీసుకున్నపాత్ర జీర్ణం కాకపోవడమే. ఈ స్థితిలో క్రొత్తవారిముందు రిహార్సల్సు చేయడం కష్టమౌతుంది.

రిహార్సల్సులో ప్రేక్షకులు వూరికినే కూర్చోరు. మధ్య మధ్య అడ్డుపడి వారికితోచిన సలహాల నిస్తూవుంటారు. ఏమాత్రం పని సాగనీయరు. క్రొత్తనటులైన వారు ఇలా రిహార్సల్సులో ప్రేక్షకులుండడంవల్ల వారు చూపగలిగిన సామాన్యమైన నటనాకౌశల్యాన్నికూడ చూపలేరు. వారిలో వచ్చే అనేక సందేహాలనుకూడ ఈ ప్రేక్షకుల ముందు చర్చించలేరు.

అంతేకాక దర్శకుడూ, నటీ నటులూ చర్చించాల్సిన అనేక విషయాలకు కూడా వీరు పెద్ద ఆటంకమౌతారు. అనేక సమాజాలకు రిహార్సల్సుకు విశాలమైన

స్థలమే దొరుకదు. ఒకవేళ దొరికినా అది రిహార్సల్సుకు అంత అనువుగాకూడ వుండదు. ఆలాంటి స్థానంలో ఇక ప్రేక్షకులకుమాత్రం ఎక్కడ స్థానముంటుంది? వున్నస్థానం కాస్తా ప్రేక్షకులే ఆక్రమించితే రిహార్సల్సు జరపడమే కష్టమౌతుంది. కనుక ఎంతటి సన్నిహితులైనా రిహార్సల్సులో ప్రేక్షకుల్ని రానీయడం అంత మంచిదికాదు.



# 23

# నాటక సమాజము

## ప్రదర్శనం బాధ్యతలు



స్టేజి డైరెక్టరు-తెరలు-సెట్టింగులు-రంగ ప్రదీపనం-ప్రాంప్టర్-రంగస్థలంమీద కదలికలు-ప్రవేశ నిష్క్రమణాలు-ప్రేక్షకులు -ప్రదర్శనం - నాటక సమాజం - సమిష్టి కృషి-సమాజ కార్యదర్శి

# స్టేజి డైరెక్టర్

నాటకం అన్ని దశలను దాటి ప్రదర్శనానికి సిద్ధంగా వున్నప్పుడు మనకో స్టేజి డైరెక్టరు అవసరమౌతాడు. సూత్రధారుణ్ణి మనం స్టేజి డైరెక్టరనుకుంటే సరిపోతుంది. నాటక ప్రదర్శనంయొక్క విజయమంతా ఈ స్టేజి డైరెక్టరు చేతుల్లోనే వుంది.



కవి నాటకం వ్రాశాడు. దర్శకుని శిక్షణతో, నటకుల సహకారంతో, నాటకం చక్కని రిహార్సల్సుతో అన్ని అందాలూ చేకూర్చుకుని ప్రదర్శనానికి సిద్ధంగా వున్నా ప్రదర్శనం రోజున అందరి సంపూర్ణ సహకార మున్నప్పుడే ఆ ప్రదర్శనం విజయవంత మౌతుంది.

ప్రదర్శనానికి ప్రాణం :

తెరలు లాగడం, వెలుగు నివ్వడం, సంగీత మివ్వడంతోపాటు వీటన్నిటినీ సకాలంలో సమ్మేళనం గావించేందుకు సమర్థుడైన ఒక వ్యక్తి వుండాలి. ఆయనే మనం నిర్ణయించబోయే స్టేజి డైరెక్టర్. అంగట్లో అన్నీవున్నాయి-ఎల్లుడు నోట్లో శని అన్నట్లు కొన్ని ప్రదర్శనాలు రంగస్థలానికి కావల్సిన అన్ని పరికరాలూ వుండి దెబ్బతింటూ వుంటాయి.

రంగస్థల పరికరాలు సేకరించడంలోనే నాటక ప్రదర్శనం యొక్క నిండు తనం కనబడుతుంది. ఏ రంగంలో ఏ వస్తు సామగ్రి కావాలో, ప్రదర్శనానికి కావలసిన ఏయే దుస్తులు నిర్ణయించుకున్నారో, వాటి నన్నిటిని ఏర్చి కూర్చి, సిద్ధంగా వుంచుకోవాలి.

అంతేకాక ప్రదర్శనానికి కావలసిన లైట్లు మొదలైన బాధ్యతలు తీసుకున్న వ్యక్తులు ఎక్కడి వక్కడ సరిగా అమర్చారో లేదో చూసుకోవాల్సిన పూర్తి బాధ్యత స్టేజి డైరెక్టరుమీదే వుంది.

### అన్ని పనులూ ఆయనే సరిచూడాలి :

అలాగే తెరలు ఎత్తే మనిషికి కూడ ఏ రంగంలో ఏ ఘట్టంలో, ఎప్పుడు తెర దించాలో, ఎప్పుడు ఎత్తాలో తెలియాలి. తెరలు ఎత్తే సమయంలోనే లైట్లు వెలిగించాలి. తెర లేవడానికి లైట్లు వెలగడానికి సరైన కలయిక, సమన్వయం వుండాలి. ఈ సమన్వయ బాధ్యత కూడ సూత్రధారునిదే. ఇలా కాకుంటే, ఎవరికి వారే పెత్తందార్లు తయారై ప్రదర్శనంలో ఒకరు తెర ఎత్తవమనడం. రెండవవారు కొంచెం ఆగమనడం జరుగుతూ వుంటుంది. ఇలా తెర వద్దనేవారికి, వేయమనే వారికి, ప్రదర్శనం మంచి చెడులు ఏమీ అవసరం లేదు. అందువల్ల ఈ బాధ్యత స్టేజి డైరెక్టరు చేతిలోనే వుండాలి.

ఒక్కొక్కసారి తెర లేచే సమయానికి రంగస్థలంలో వుండాల్సిన పాత్ర ధారులు సిద్ధంగా వుండరు. వా రున్నారో లేరో చూచి మాత్రమే తెర లాగించా ల్సిన బాధ్యత కూడా సూత్రధారునిమీదుంది.

### తక్కువ వ్యవధిలో ఎక్కువ పని జరగాలి :

ఒక రంగానికి మరో రంగానికి మధ్య ఎంత తక్కువ వ్యవధిలో తెర లెత్తగలిగితే నాటకంయొక్క రక్తి అంతగా వుంటుంది. రంగాలమధ్య ఆలస్యం ఎక్కువైన కొద్దీ మంచి పట్టుగా నడుస్తూ వచ్చిన నాటకం నాశనమౌతుంది. వెనుక సీనులో జరిగిపోయిన సంఘటనలకు, రెండవ సీనులో జరుగబోయే సంఘ టనలకు ఎంత తక్కువ కాలంలో తెరలు ఎత్తించగలిగితే రెండు సంఘటనలకు, నాటక ప్రదర్శన మొత్తానికి అంత ఎక్కువ సమన్వయం వుంటుంది. ఆలస్యం లేకుండా ఇలా రంగాలు పరుగెత్తాలంటే ఆ బాధ్యతలన్నీ అందరిమీద వున్నా అన్నిటిని సంఘటితపర్చి ఒకే ఋణాన శ్రద్ధపుచ్చుకోవాల్సిన బాధ్యత స్టేజి డైరెక్టరుదే.

ప్రతి రంగంలోనూ సామగ్రులన్నీ అమరాయో లేదో, ఎక్కడెక్కడ ఏయే పరికరాలు ఎలా, అమర్చారో, తాను అనుకున్న రీతిగా రంగాలంకరణ జరిగిందో లేదో డైరెక్టరు చూచిన తరువాతే, స్టేజి డైరెక్టరు తన పనిని వుపక్రమించాలి.

సంతృప్తితో
సకాలానికి ప్రవేశించాలి :

నటీనటులు ఒక రంగానికి మరో రంగానికి మధ్య దుస్తులు మార్చిడి, అదే పనిగా సంతృప్తిలేని అలంకారాన్ని చేస్తూ వుండడంవల్ల కూడ రంగాలమధ్య ఆలస్యం జరిగి రంగాల వేగం పూర్తిగా తగ్గుతుంది. ఒకవేళ నటకులందరూ హాజరుగా వున్నా, ఏ ఒక్క నటిగాని నటకుడుగాని ఆలస్యం చేసినా మొత్తం రంగమంతా ఆలస్యానికి ఆహుతౌతుంది. అలా అలంకరించుకునే నటీనటకులందర్నీ సకాలంలో తయారుచేయించడానికి స్టేజి డైరెక్టరూ, ప్రాంప్టరూ శ్రద్ధ తీసుకోవాలి.

ఇలా రంగాలమధ్య ఆలస్యం జరగడంవల్ల ప్రేక్షకుల్లో ఓర్పు తగ్గి ఈలలు చప్పట్లు కొట్టి, గలభా చేస్తారు. ఇందువల్ల సక్రమంగా నడిచే నాటకంపట్ల వున్న సదభిప్రాయం పోతుంది. ఎంతోకాలం రిహార్సల్సు జరిపించినా ప్రదర్శనరూపంలో జయప్రదం పొందకపోతే ఇన్నాళ్ళ అందరి సమిష్టి కృషి బూడిద పాలౌతుంది.

ఏ పాత్రలు రంగంలో ప్రవేశించాలో, ఆ పాత్రధారులు వుపయోగించుకునే సామగ్రి సరిగా అమర్చారో లేదో చూచుకున్న తరువాత స్టేజి డైరెక్టరు తెర ఎత్తించాలి.

డ్రాయరులో పిస్టల్ :

ఉదాహరణకు ఒక నాటకంలో డ్రాయరులో వున్న పిస్టలు తీసి రంగాంతంలో మరో పాత్రను కాల్చాల్సి వచ్చింది. రంగం మంచి రసవత్తరంగా నడుస్తూ వుంది. రెండు పాత్రలమధ్యా ఘర్షణ ఎక్కువైపోయింది. చూడు నీ బ్రతుకేమౌతుందో అని డ్రాయరు లాగి పిస్టలు తీయబోయాడు. తీరా చూస్తే పిస్టలు లేదు. తీసిన డ్రాయరు అలాగే వేగంగా త్రోపి స్తంభంలా నిస్సహాయుడై పోయాడు. కాని ప్రయోజనం?

డ్రాయరులో పిస్టలు పెట్టించాల్సిన బాధ్యత స్టేజి డైరెక్టరుదైనా ప్రవేశానికి ముందు రంగాంతంలో తాను వుపయోగించబోయే పిస్టలు వుందో లేదో చూచుకుని తెర ఎత్తించితే స్తంభంలా నిలబడాల్సిన అవసరం ఆ నటున కుండేదికాదు.

ఎవరు తప్పుచేసినా ఆ పాపం
అందరికీ చుట్టుకుంటుంది :

ఎవరు ఏ లోపం చేసినా ఆ పాపమంతా నటీ నటులకే చుట్టుకుంటుంది. కనుక అన్ని సామగ్రులు అమర్చే బాధ్యత స్టేజి డైరెక్టరుకున్నా ఆ ఫలితాన్ని అనుభవించేది నటులే గనుక ప్రతీ క్షణం నటులూ జాగ్రత్తతో మెలగాలి. అంతే గాకుండా ఒకొక్క సన్నివేశంలో నేపధ్యంనుండి అనేకమైన కేకలు, కారు మోతలు, గంటల మ్రోతలు, ఏడ్పులు, హాహాకారాలు, తుపాకుల మ్రోతలు, మనుషుల మూల్గులు, రైలు కూతలు-మొదలైనవెన్నో ప్రదర్శనానికి పుట్టినిచ్చేవాటిని వుపయోగించాల్సి వుంటుంది. వాటి నన్నిటినీ-సకాలంలో అందుకుపయోగించే మనుషుల్నీ, సామగ్రినీ స్టేజి డైరెక్టరు సమకూర్చాలి.

ఆయన అనుమతితో అన్ని
వస్తువులూ అడిగి తీసుకోవాలి :

స్టేజి డైరెక్టరు సేకరించుకున్న సామాన్లన్నీ ఆయన ఆధీనంలోనే వుండాలి. ఆయన నిర్ణయించిన స్థలంనుంచి ఏ వ్యక్తి వాటిని తీయకుండాగాని మార్చడంగాని చేయకూడదు. కొన్ని పరికరాలు రంగంలో అమర్చేవి, మరికొన్ని స్టేజి డైరెక్టరు నుండి అడిగి తీసుకోవాల్సిన వస్తువులూ వుంటాయి.

సూత్రధారుడు ప్రత్యేకంగా తన వుపయోగాన్ననుసరించి ఒక నాటక కాపీని తయారుచేసుకోవాలి. ఏ రంగంలో ఎలాంటి పరికరా లుండాలో, మొత్తం నాటకానికి ఎన్ని పరికరాలు కావాలో అన్నీ ఒక లిస్టుగాను, రంగాలవారీగాను వ్రాసుకోవాలి. ఇలా వరుస క్రమంలో మనం తయారుచేసుకున్నప్పుడు ఏ ఒక్క వస్తువూ మర్చిపోవడానికి వీలుండదు.

## తెరలు, సెట్టింగులు

చీరల తెరలు :

ఒకనాడు కళారూపాలు వీధుల్లోనే ప్రదర్శించేవారు. వీధి నాటక ప్రదర్శనాల్లో తెరలకు ఎక్కువ ప్రాముఖ్య ముండేది కాదు. తోలుబొమ్మలాటలు తెల్ల

చీరల మీద ఆముదపు దీపాల వెలుతురులో ప్రదర్శించేవారు. కూచిపూడి భాగవతులు మొదలైనవారు ప్రదర్శించే వీధినాటకాల్లో ప్రతి పాత్ర ప్రవేశంలోనూ విదూషకుడూ, సూత్రధారుడూ ఒక దుప్పటిని ప్రవేశించబోయే పాత్రకు అడ్డుగా పట్టుకుని పాత్రను గురించి వాగ్వర్ణన చేసి తరువాత తాత్కాలికంగా ఆ పట్టిన తెరను తొలగించేవారు. ఇతర కళారూపాలైన బుర్ర కథ, పిచ్చుగుంటుల కథ మొదలైన అనేక జానపద కళారూపాలకు తెరలంటూ లేనే లేవు. ఆనాటి వీధి ప్రదర్శనాలకు తెరల ప్రాముఖ్యం వుండేది కాదు. ప్రదర్శనాలన్నీ ఆరుబయట బహిరంగ ప్రదర్శనాలుగానే జరిగేవి.

ధార్వాడవారి ధర్మం :

తెలుగులో నాటకప్రదర్శనాలు ప్రారంభమైన తరువాత తెరల ప్రాముఖ్యం ఎక్కువైంది. ఇందుకు కారణం ధార్వాడవారు, పార్శికంపెనీవారూ ఆంధ్ర దేశంలో విరివిగా నాటకాలు ప్రదర్శించడం. వారి ప్రదర్శనాలలో రంగుల తెరలూ, సెట్లూ, వైరు వర్క్‌లూ, ఫోకసింగులూ ప్రవేశపెట్టారు. ఇవి తెలుగు వారిని ఎంతగానో ఆకర్షించాయి. ఆంధ్రదేశపు ముఖ్యపట్టణాలన్నిటా ఆనాటి ప్రదర్శనాల్లో తెరలను బాగా వుపయోగించారు. ప్రతి నాటక దళానికీ సీనరీలు వ్రాయడానికి సుశిక్షితుడైన మంచి పెయింటరు వుండేవాడు. ఆయా నాటకాల ఇతివృత్తాల ననుసరించి ఎప్పటి కప్పుడు తెరలను తయారుచేసుకునేవారు. ఆనాడు ప్రతి ప్రదర్శనశాలలోనూ యవనికలు (తెరలు), వుపరివల్లములు(జూల్పా)పార్శ్వం చలములు (సైడ్ కర్టెన్లు) అలంకరించి వుండేవి.

వివిధ దృశ్యాలు -
వింతవింత రంగులు :

తెరలలో రాజవీధి - రాజ దర్బారు - అంతఃపురం - ప్రాసాదాంతం - దుర్గం - జైలు - కొండ - నదులు - ప్రమదావనం - అరణ్యం మొదలైనవి 15 తెరలవరకూ వుండేవి. ఇవి ఆనాడు ప్రదర్శించే పౌరాణిక, చారిత్రక నాటకాలన్నిటికీ వుపయోగపడేవి. ఎవరికి అవసరమైనవి వారు వుపయోగించుకునేవారు.

పౌరాణిక చారిత్రక నాటకాల ప్రభావం తగ్గి సాంఘిక నాటకాల ప్రాబల్యం ఎక్కువైన తరువాత పైన వివరించిన తెరలయొక్క ప్రాముఖ్యం తగ్గిపోయి.

సాదారంగులైన తెలుపు - నలుపు - నీలం - ఆకుపచ్చ - గులాబి - వైలట్ మొదలైన ఆయా రసాలకు సంబంధించిన రంగు తెరలను మాత్రమే వుపయోగిస్తున్నారు. సన్నివేశంయొక్క ప్రాముఖ్యాన్ని అనుసరించి పరికరాలను వాడుకుంటూ, నాటకవాతావరణాన్ని ప్రేక్షకులయొక్క ఊహకే వదలివేస్తున్నారు. ఈ రంగు తెరలకు తగినట్లే జూల్సా - సైడ్ కర్టన్సు ఏర్పాటు చేయడంవల్ల ఈ సాదారంగుల తెరలుకూడ ప్రథమంలో ప్రేక్షకుల్ని ఆకర్షించాయి. కాని రానురాను సినిమా ప్రభావం ఎక్కువ అవడంవల్ల ప్రేక్షకుల అభిరుచులు మారి, నాటకాలను సెట్సుతో చూడాలనే కుతూహలం ఎక్కువైంది. అందువల్ల ఈనాడు కొంతమంది ఔత్సాహిక నాటక సమాజాలవారు సెట్సును ప్రవేశపెడుతున్నారు.

### సెట్సును ప్రవేశపెట్టిన సురభివారు :

ఈ సెట్సును ఆంధ్రదేశంలో దాదాపు 80 సంవత్సరాలుగా నాటకాలు ప్రదర్శించే సురభివారు విరివిగా వుపయోగిస్తున్నారు. వారు ప్రదర్శించే ప్రతి నాటకానికి సెట్సును తయారుచేసుకొంటున్నారు. నాటకాన్ని సినిమా మాదిరి ఈ సెట్సు సహాయంతో వేగంగా నడుపుతున్నారు. ఈమాదిరిగా ప్రదర్శించే సురభి నాటక సమాజాలు దాదాపు 20 వరకూ ఆంధ్రదేశంలో సంచారం చేస్తున్నాయి.

### పాశ్చాత్య నాటక రంగంలో పరాకాష్ట నందుకున్న సెట్టింగ్ విధానం :

నాటక ప్రయోగంలో ఈనాడు సెట్టింగు ప్రాముఖ్యం ఎక్కువగా వుంది. పాశ్చాత్య నాటక రంగంలో ఈ విధానం పరాకాష్ట నందుకుంది. మన దేశంలో తమిళ - కన్నడ - మహారాష్ట్ర - బెంగాల్ మొదలైన రాష్ట్రాలలో ఈ సెట్టింగు విధానంలో బాగా కృషి జరుగుతూ వుంది.

నాటకానికి సరియైన వాతావరణం కలుగజేయడానికి, ప్రేక్షకులను రంజింపజేయడానికి సెట్టింగు ఎంతో దోహదం చేస్తుంది. నాటకంలో రచయిత సృష్టించిన వాతావరణాన్ని ఈ సెట్టింగు విధానం ద్వారా నాటక ప్రదర్శనాన్ని సజీవంగా ప్రదర్శించ వచ్చును. సన్నివేశాలకు తగిన సెట్టును నిర్మించి తగిన రంగస్థల

పరికరాలతో ప్రదర్శనం జరిగినప్పుడు వాస్తవిక చిత్రాన్ని ప్రేక్షకులకు చూపించ వచ్చును.

ఈ సెట్టింగు విధానంలో భవనాలను - ద్వారాలను-కిటికీలను - అంతస్తులను - గదులను - బజారులను-రైల్వే ప్లాట్‌ఫారం - దర్బారు - అంతఃపురం - వుద్యానవనం మొదలైన వాటిని ప్రేక్షకులకు దిగ్భ్రమ చెందేలాగున చూపించవచ్చును.

మేడమెట్లెక్కినట్లూ, దిగినట్లూ, గదిలోనుండి హాలులోకి వచ్చినట్లూ, మంచాలమీద పరుండడం, సోఫాసెట్టులో కూర్చుండి విశ్రాంతి తీసుకోవడం, రేడియో పెట్టడం, ఫాన్ వేయడం, విద్యుద్దీపాలను వెలిగించడం, గాలికోసం కిటికీలు తెరవడం, బయటనుండి పిలిచిన వారిని తలుపు తీసి లోనికి ఆహ్వానించడం, పోస్టుమన్ కేక విని కిటికీలోంచి వుత్తరాలను అందుకోవడం మొదలైన విధానాలకు సెట్టింగు దోహదం కలగజేస్తుంది. ఈ సెట్టునూ, అందులో అమర్చిన వస్తువులనూ నటుడు తన నటనా సామర్థ్యంతో వుపయోగించుకో గలిగినప్పుడు ప్రదర్శనం సజీవంగా నిలబడుతుంది.

అలాగే ఉదయం, సాయింత్రం, పగలు, వెన్నెల రాత్రి, చీకటి రాత్రి మొదలైన సన్నివేశాలలో వివిధ విద్యుద్దీపాలద్వారా సెట్టింగును తీర్చి దిద్దవచ్చును. ఈ విధానంవల్ల ఎంతో సహజత్వాన్ని సాధించవచ్చును.

ధనవంతులూ, నిరుపేదల మధ్యనున్న తారతమ్యాన్ని మేడలద్వారాను, పూరి గుడిసెల ద్వారాను, సెట్టింగు విధానంతో సాధించవచ్చును.

సెట్టింగు విధానంతో నాటకాన్ని కళాత్మకంగా ప్రదర్శించవచ్చును. ప్రేక్షకులకు మంచి తృప్తిని కలిగించవచ్చు. ప్రదర్శనాన్ని కళాఖండంగా తయారు చేసుకోవచ్చు. ఈనాడు సెట్టింగు విధానమే ప్రదర్శనాలకు యోగ్యమైంది.

## అనువైన రంగస్థలం వుండాలి :

ఈ సెట్టింగు నిర్మాణానికి తగిన రంగస్థలం వుండాలి. అది విశాలమైనగా వుండాలి, ప్రతి సమాజము వారి వారి ఆర్థిక పరిస్థితుల ననుసరించి సెట్టు

నిర్మాణానికి పూనుకోవాలి. అన్ని సమాజాలు ఈ సెట్టును నిర్మించుకోలేనప్పుడు హాలు యజమానులే ముఖ్యమైన సెట్లు తయారుచేయించి వాటికి స్వల్ప అద్దె వసూలుచేయవచ్చును.

సెట్సును స్టేజి క్రాఫ్టు అనుభవమున్నవారితో తయారుచేయించాలి. రంగ స్థలాలయొక్క కొలతలకు లోబడి సెట్సును తయారుచేసుకోవాలి.

ప్రదర్శించబోయే నాటకం ఏ కాలానికి సంబంధించిందో ఆ కాలానికి తగిన వాస్తు శిల్పం, ఆనాటి వస్తు పరికరాలను ప్రయోగించటం ద్వారా సెట్టింగు అధిక ప్రయోజనాన్ని పొందుతుంది.

# రంగ ప్రదీపనం

నాటకాన్ని ఎంత కట్టుదిట్టంగా సాధనచేసినా ప్రదర్శనం రోజున లైటింగు విధానం సరిగా లేకపోతే ప్రదర్శనం దెబ్బతింటుంది. ప్రదర్శన విజయానికి లైటింగ్ ఎంతగానో తోడ్పడుతుంది. ఆధునిక నాటక రంగం, పాశ్చాత్యదేశాలలో ఈ లైటింగ్ విధానంలో ఒక వున్నతస్థాయి నందుకుని, ఒక విశిష్టస్థానాన్ని ఏర్పరుచుకున్నది. కాని మన ఆంధ్రనాటకరంగం, ఈ లైటింగ్ విధానంలో ఏ మాత్రం శ్రద్ధతీసుకోవడం లేదు. ఇందువల్ల అనేక ప్రదర్శనాలు దెబ్బతింటున్నాయి.

ముఖ్యంగా నాటక ప్రదర్శనంలో ఏమూల కూర్చున్న ప్రేక్షకులకైనా ప్రతి పాత్రా అతిస్పష్టంగా కనబడాలి. అందుకు తగిన లైటింగ్‌ను వుపయోగించాలి. కాంతిప్రసరణ సరిగాలేని నాటకం జయప్రదంకాదు. సమాజ సభ్యుల శ్రమ వృథా అవుతుంది. నేటి మన ప్రదర్శన ప్రమాణాలు పెరగాలంటే ఈ లైటింగ్ విషయంలో ఎక్కువ శ్రద్ధతీసుకోవాలి.

లైట్స్ ఆపరేటర్‌కు అన్నీ తెలిసుండాలి :

లైటింగును వాడుకోవడంలో సాంకేతికమైన పరిజ్ఞానం గల మంచి ఎలెక్ట్రీషియన్ వుండాలి. ఈ లైటింగు ప్లాంటు మొత్తం అతని ఆధీనంలో వుండాలి. ఇతను సమాజానికి అనుబంధంగా వుండాలి. నాటక ఇతివృత్తం పూర్తిగా తెలిసుం

డాలి. ఆయా సన్నివేశాల ననుసరించి కాంతి ప్రసరణను వుపయోగించాలి. నాటకం రిహార్సల్సు ప్రారంభించిన నాటినుండీ నాటకం ప్రదర్శనస్థాయి కొచ్చేవరకూ, ఎక్కడెక్కడ ఏయే సన్నివేశాలలో ఏయే లైట్లు వుపయోగించాలో నోట్సు వ్రాసుకుని లైటింగు విధానంలో పూర్తిబాధ్యత వహించాలి.

స్విచ్‌బోర్డు చేతికి
దగ్గరగా వుండాలి:

ప్రదర్శనశాలకు సంబంధించిన వోల్టేజి, లైట్లు, స్విచ్‌బోర్డు మొత్తం ఇతని ఆధీనంలో వుండాలి. లైటింగు విధానమంతా ఇతని కంట్రోల్లో వున్నప్పుడు ప్రదర్శనానికి సంబంధించిన విధంగా కాంతిప్రసరణ సక్రమంగా వినియోగించుకోవడం జరుగుతుంది. నాటక ప్రదర్శనం ప్రారంభించేముందు ఆన్నిలైట్లు సక్రమంగా అన్నికోణాలనుంచీ సరిగా వెలుగుతున్నాయో లేదో సరిచూచుకోవాలి. ఫ్యూజులు, బిల్బులు, వైరు అవసరంగా ఆపరేటర్ వుంచుకోవాలి. నాటక ప్రదర్శనం ప్రారంభించేవరకూ ఆడిటోరియంలో లైట్లు వుండాలి. దృశ్యం ప్రారంభించబడిన వెంటనే ఆడిటోరియం లైట్లన్నీ ఆర్పివేసే స్విచ్‌ని స్విచ్‌బోర్డులోనే ఆపరేటరు వుంచుకోవాలి. రంగస్థలంలో ఎప్పుడూ లైటింగ్ నటీ నటులమీద ఎక్కువగాను రంగాలంకరణ సామగ్రిమీద తక్కువగాను వుండాలి. ప్రాముఖ్యం ఎప్పుడూ పాత్రధారులకే ఇవ్వాలి.

అందరికీ అన్నిముఖాలూ
కనిపించాలి:

అంతేకాకుండా రంగస్థలంలో వున్న నటులందరూ సరిగా కనబడుతున్నారో లేదో, ముఖాలు స్పష్టంగా కనబడేటంత వెలుగుందో లేదో చూచుకోవాలి. అలా ఆఖరు తరగతి నుంచి చూడడం మంచిది. ఎందుకంటే అల్లరి అక్కడినుంచే బయలుదేరుతుంది కనుక.

లైటింగును సక్రమంగా ఉపయోగించుకోవాలి. లైట్లున్నవి కదా అని అన్ని లైట్లనూ ఎటుబడితే అటు ఉపయోగించకూడదు.

స్టేజిమీద నున్న వ్యక్తికి ఒక ప్రక్కనుంచి లైటువేస్తే ముఖం మధ్య భాగం చీకటిలో ఉండిపోతుంది.

అలాగే పైభాగంనుండి లైటువేస్తే ముఖంపైన నీడలు పడతాయి. అంటే పైభాగం వెలుతురులో వుండి క్రింది భాగం చీకటిలో ఉంటుందన్నమాట.

ఎదుటినుండి ముఖానికి లైటువేస్తే ముక్కూ ముఖమూ వెలుతురులో వుండి చెంపలు చీకటిలో వుంటాయి.

కనుక ఎప్పుడూ క్రిందలైట్లకూ, పై లైట్లకూ, ఫ్లడ్ లైట్లకూ సరియైన సమన్వయం వున్నప్పుడే నటీ నటులు స్పష్టంగా కనబడడం, అభినయం వెల్లడవడం జరుగుతుంది.

## మైక్‌ముందు గొంతులు :

మైక్‌ముందు నటించబోయే నటీ నటులు మైక్‌కు మరీ దగ్గరగా కూర్చోవడంగాని, నిలబడడంగాని కూడదు. మైక్ ముందు అవసరమనుకుంటే తప్ప బిగ్గరగా మాట్లాడకూడదు. అలా మాట్లాడడం మైక్‌లో మాత్రం బాగుండదు. మాట్లాడే ప్రతిమాటా మైక్ ద్వారా పోయి లౌడ్‌స్పీకర్‌లో ప్రేక్షకునికి స్పష్టంగా వినబడేటంతటి వ్యవధి తీసుకుని సంభాషణలు పలకాలి. ఎలా బడితే అలా త్వరత్వరగా సంభాషణలు మాట్లాడినట్లయితే అలుక్కుపోయి గజిబిజిగా వుండి ఏ ఒక్క సంభాషణా స్పష్టంగా వుండదు. సంభాషణలయొక్క హెచ్చు తగ్గుల ననుసరించి మైక్ ముందు, ముందుకూ వెనుకకూ జరుగుతూ ఉండాలి.

## ఎంత నెమ్మదిగా మాట్లాడితే
## అంత మంచిది :

మరీ రహస్యాలు మాట్లాడే సమయంలో గాని, గాలితో కూడిన మాటలు మాట్లాడేటప్పుడుగాని మైక్‌కు సాధ్యమైనంత సన్నిహితంగా వుండాలి. మైక్ ముందు వుద్రేకాలను ఎంత నిగ్రహంతో కాపాడుకుంటే నటన అంత రాణిస్తుంది. మైక్ ముందు ఎంత నెమ్మదిగా మాట్లాడితే అంత బాగా వినబడుతుంది. శబ్దం ఎక్కువైతే, మైక్ ఆ శబ్దాన్ని భరించలేదు. మైక్ లోపలిభాగంలో వున్న సున్నితమైన భాగాలు అదిరి, అస్వాభావికమైన శబ్దం వస్తూవుంటుంది. మైక్‌ముందు సంభాషణలు గాని, వికారపు నవ్వులుగాని, ధ్వనులుగాని, విపరీత శబ్దాలుగాని వచ్చినప్పుడు సాధ్యమైనంత దూరంలో వాటి ప్రయోగం జరగాలి.

మనం మాట్లాడే ప్రతి సంభాషణనీ ఎన్నో రెట్లు శబ్దంతో వినిపించ జేయ డమే మైక్‌యొక్క స్వభావం. ఇలాంటి అవకాశంద్వారా లక్షలమందికి ఒక సందే శాన్ని తేలికగా అందించడానికి అవకాశముంది.

మైక్ ముందు ఎంత బేస్‌గొంతుతో మాట్లాడితే అంత మంచిది. బేస్ గొంతులు మైక్‌లో ఎక్కువగా రాణిస్తాయి కూడా. మైక్ ముందు మాట్లాడే సంభా షణల తీరును ప్రతి నటీ నటుడు అలవాటు చేసుకోవడం మంచిది. అంతేగాక గొంతులో వున్న లోపాలను కూడ సరిజేసుకోవాలి. గొంతులో వుండే జీర, బొంగురు, దగ్గును మైక్ ఇట్టే పట్టేస్తుంది. రంగస్థలంమీద దగ్గువచ్చినా ఫర్వా లేదు గాని మైక్‌లో మాత్రం వినడానికి ఏమాత్రం బాగుండదు.

రణగొణ ధ్వనులు
రానివ్వకూడదు :

రంగస్థలంమీద మైక్‌లున్నప్పుడు ప్రాంప్టింగ్ శబ్దాలుగాని, ఒక పాత్రధారికి మరో పాత్రధారి పోర్షను అందించడంగాని, నేపథ్యంలో రణగొణధ్వనులుగాని చేయకూడదు. ఎలాంటి చిన్న శబ్దాన్నైనా గ్రహించేశక్తి మైక్‌కు వుంది. తద్వారా ప్రేక్షకులకు మనంచేసే ప్రతి చిన్నలోపం తెలిసిపోతుంది.

ఇలాంటి జాగ్రత్తలన్నీ మైక్ ఆపరేటర్ తీసుకోవాలి. సీను ఎప్పుడు ప్రారంభమౌతుందో, సంభాషణలు ఎప్పుడు ఎప్పుడు మాట్లాడుతారో ఆపరేటరు తెలుసుకుని వుండాలి. ముఖ్యంగా మైక్‌ద్వారా ఒక్క నాటక సంభాషణలు, పాటలు మినహా, అనవసరమైన ఏ ఒక్కమాటా ప్రేక్షకులకు వినబడకుండా ఆపరేటరు జాగ్రత్త తీసుకోవాలి.

మైక్‌ద్వారా ప్రదర్శించిన నాటకాన్ని అత్యద్భుతంగా రక్తి కట్టించవచ్చును. కాని మైక్‌తో ప్రదర్శించాలనుకున్న నాటకానికి మైక్‌లను, లౌడ్‌స్పీకర్లను మంచి వాటిని తెచ్చుకోవాలి. ప్రతి నాటక సమాజమూ ఒక మంచి మైక్‌సెట్‌ను కొనగలి గితే, రిహార్సల్సులో కూడా దానిని వుపయోగించుకుని, నూటికి నూరుపాళ్ళు ప్రదర్శనాన్ని జయప్రదం చేసుకోవచ్చు.

# ప్రాంప్టర్

మతి మరుపుకు మందు:

ప్రదర్శన సమయంలో నటీ నటులు సంభాషణలు మరచిపోయి ముందుకు సాగలేని పరిస్థితిలో మరచిపోయిన సంభాషణను అందించి, ముందుకు పోవడానికి మార్గాన్ని సూచించే వ్యక్తి ప్రాంప్టరు.

తెరవెనుక అజ్ఞాతంగా వుండే పాత్రధారుల్లో అత్యంతప్రధానమైన వ్యక్తి ఈ ప్రాంప్టరు.

అసలు నాటకానికి ప్రాంప్టరు వుండాలా? అక్కరలేదా? అనే వాద ప్రతి వాదాలు అనేకమందిలో వున్నాయి.

సంపూర్ణంగా వర్ధిలు జరిపిన సమాజానికి ప్రాంప్టరు అవసరం ఎందుకు? అనేవారూ లేకపోలేదు.

ఎవరి సంభాషణలు వారు క్షుణ్ణంగా కంఠస్థం చేసినప్పుడు ప్రాంప్టరు మీద ఆధారపడవలసిన అవసరమేముందీ?

నిజంగా అలాంటి కృషి జరిగినప్పుడు ప్రాంప్టరు లేకపోయినా ప్రమాదం లేదు. కాని అలాంటి ఉత్తమ సమాజాలు ఎన్ని వున్నాయి?

ఎందుకైనా మంచిది:

ఎటువంటి సమాజానికైనా ప్రాంప్టరు వుండడం అవసరం. అలా అని ఎలాగో ప్రాంప్టరు వున్నాడు గనుక, సంభాషణలు ఒకమాదిరిగా కంఠస్థంచేసినా ఫరవాలేదని తృప్తిపడగూడదు.

అసలు సంభాషణలు రానప్పుడు ఎదుటిపాత్ర వంక చూచి ఎలా మాట్లాడ గలడు? తన దృష్టిని ప్రాంప్టరుమీదే లగ్నంచేసినప్పుడు సాత్వికమైన చలనం ముఖ భావాల్లో ఎలా కలుగుంది!

ఎదుటిపాత్ర సంభాషణలు తీవ్రస్థాయిలో వున్నప్పుడు, అంత తీవ్రంగానూ

సమాధానం ఇవ్వాల్సిన సంభాషణ కంఠస్తం కాకపోతే తాత్కాలికమైన ఆ సన్ని వేశం ఎలా ఒప్పుతుంది?

నటీ నటులకు ఎవరి పోర్షన్సు వారికి వచ్చినా ప్రేక్షకులమధ్యకు వచ్చేసరికి సంభాషణలు మరచిపోతున్నారు. కేవలం భయంవల్లా, కంగారువల్లా ఇలా జరు గుతూ వుంది. ఒక్కొక్క సమయంలో మనస్సు కేంద్రీకరణ మరోచోట లగ్నమై వుండడంవల్ల కూడ సంభాషణలు మరచిపోవడం జరుగుతూవుంది. ఇటు పంటి వారికి ప్రాంప్టరు అవసరం ఎంతైనా వుంది.

అందరి సంభాషణలూ
అర్థమై వుండాలి:

దర్శకుడు రిహార్సల్సు ప్రారంభించిన నాటినుంచి, నాటకం ప్రదర్శించే టంతవరకూ నటీ నటులతోపాటు అందరి సంభాషణలూ చదవడంవల్ల ప్రాంప్టరుకు దాదాపు అందరి సంభాషణలూ కంఠస్థమై వుంటాయి. అందువల్ల ఎవరి సంభా షణావిధానం ఎలా వుంటుందో తెలిసిపోయి, ఎవరికి ఎలా ప్రాంప్ట్‌చేయాలో విదిత మౌతుంది.

ప్రతి పాత్రధారీ తన పాత్రను అర్థం చేసుకున్నట్లే నాటకంలో వచ్చే పాత్రలన్నింటినీ ప్రాంప్టరు అర్థం చేసుకునుండాలి. సంభాషణలయొక్క వేగాన్ని, వ్యవధిని, సంధులను ముఖ్యంగా దృష్టిలో వుంచుకోవాలి. ఏ సంభాషణ ఎంత వేగంలో ఎక్కడ నిలుపుతారో గుర్తించాలి. సంభాషణలయొక్క స్థాయి ననుస రించీ, ఆ స్థాయికి తగిన భావాన్ననుసరించీ ప్రాప్టింగ్ చేయగలిగితే నటుడు తేలి కగా తన తప్పు తెలుసుకుని ముందుకు దూసుకుపోతాడు.

ఎంత అవసరమో
అంతే అందించాలి:

నటునియొక్క సంభాషణ వేగాన్నిబట్టే సంభాషణను అందించాలి. నటుని అవసరంకంటే ఎక్కువ ప్రాప్టింగ్ చేయడం మంచిదికాదు. అటువంటి నటునికి ఎక్కడ అవసరమొస్తుందో అంతవరకే ప్రాంప్టరు వేయికళ్ళతో వేచి వుండాలి. ఎప్పుడూ ప్రాంప్టరు నట్టుణ్ణి తరుమకూడదు.

ఒక్కొక్కసారి నటులు కేవలం సంభాషణలు మరచిపోవడం కాక, కొన్ని సంభాషణలనే ఎగరగొట్టి మరోచోటినుండి ప్రారంభిస్తారు. ఇలాంటి సమయంలో ప్రాంప్టరు నటుని అనుసరించిపోవాలే తప్ప ఆ నటుని వెనుకకు రప్పించటానికి ప్రయత్నించ కూడదు. ఇందువల్ల ఆ నటుడు మరీ కగాంరుపడి సన్నివేశాన్ని చెడగొట్టటం జరుగుతుంది. నటుని యొక్క కదలిక ననుసరించి ప్రాంప్టరు కూడా కదులుతూ నటకునికి ప్రాంప్టింగ్ అందివ్వాలి. ఏ ఒక ప్రక్కనూ ప్రాంప్టరు అంటిపెట్టుకుని వుండకూడదు. ఎప్పుడూ పాత్రధారికీ, ప్రాంప్టరుకూ సన్నిహిత సంబంధ ముండాలి. ఒకరి కొకరు దూరమైతే సంభాషణలు వినపడవు.

తనలక్ష్యంలోనే తను ప్రవర్తించాలి :

రంగస్థలంలో జరిగే ప్రతి రసవత్తర సన్నివేశంలోనూ, ప్రేక్షకులు ముగ్ధులైనట్లు ప్రాంప్టరు ముగ్ధుడు కాకూడదు. అలా ముగ్ధుడైనప్పుడు ప్రాంప్టింగ్ అవసరమైన నటుడు తెల్ల మొగమేసి నిలబడాల్సి వస్తుంది. ప్రేక్షకులు గొల్లున నవ్వడంతో సన్నివేశం రసభంగం చెందుతుంది. కనుక ప్రాంప్టరు ఏ దృశ్యానికీ కదిలి పోకూడదు. తన దృష్టినంతా ప్రాంప్టింగ్‌మీదే కేంద్రీకరించాలి.

ఎప్పుడూ ప్రాంప్టింగ్ నటీ నటులకు మాత్రమే వినబడేటంత నెమ్మదిగా నిర్దుష్టంగా వుండాలి. నటునియొక్క స్థాయినిమించి ఏ మాత్రం ప్రాంప్ట్ చేయ కూడదు. అలా కానట్లయితే దూరశ్రవణ యంత్రాలద్వారా ప్రేక్షకులకు వినబడుతుంది.

# రంగస్థలంమీద కదలికలు

రిహార్సల్సు ప్రారంభించి నాటకం ప్రదర్శించేవరకు ఏ గదిలోనో, లేక చిన్న హాలులోనో రిహార్సల్సు జరిపి, చివరికి రంగస్థలంలో నాటకం ప్రదర్శించే సరికి అనేక లోపాలకు గురికావలసి వస్తోంది. ఇందుకు కారణం చిన్నగదిలో జరిగే రిహార్సల్సుకు, రంగస్థల రిహార్సల్సుకు గల వ్యత్యాసమే, గదిస్థలంకొద్ది. రంగస్థలం పెద్దది. ఇక్కడ ప్రేక్షకులుండరు, అక్కడ ప్రేక్షకులుంటారు. ప్రవేశ నిష్క్రమణాలకు సరియైన జాగా గదిలో వుండదు. రంగస్థలంలో ఇరుప్రక్కల చక్కని మార్గాలుంటాయి. అందువల్ల పాత్రల కదలికల్లో కూడ మార్పు

వస్తుంది. రంగస్థలమంత విశాలమైన ప్రదేశంలో రిహార్సల్సు జరుపుకుంటే గజిబిజి లేకుండా ప్రదర్శనం ప్రశాంతంగా నడుపవచ్చును.

ఎవరు ఎలా కదలాలి?:

ఎవరు ఎక్కడ నిలబడాలో, ఎంత దూరంలో వుండాలో, ఎవరు ఎటు కదిలితే రెండవవారి స్థానమేమిటో మొదలైన కదలికలకు ఇరుసుగమ్మల్లో ఎక్కువ అవకాశముండదు. ఆ కదలికలు కూడ స్వాభావికంగా వుండవు. నటీ నటులు బిగుసుకుని కేవలం నాటకంకొరకు నడచి నట్లుంటారు. స్వాభావికంగా నడువరు. కొంతమంది ఎక్కడ నిలబడితే అక్కడేవుండి సంభాషణలు వల్లిస్తారు. కొంత మంది రంగస్థలం ఖాళీగావుంది గదా అని విచ్చలవిడిగా తిరుగుతూ వుంటారు. ఇలా తిరగటంలో ప్రక్క నటులు కూడ కదలాలి. అలా కదిలేందుకు కారణం వుండాలి. అప్పటి సంఘటనకూడ ఆ కదలికకు కారణం కావాలి. అనవసరంగా కదలడంవల్ల ప్రక్కనటునియొక్క నటనకు చాల అంతరాయం కలుగుతుంది.

ప్రతి కదలికా కథ
నానుసరించి వుండాలి:

రంగస్థలంమీద కదిలే ప్రతి కదలిక సంఘటన ననుసరించి వుండాలి. అలా అని ఒకే చోట అలా నిలబడి పోగూడదు. ఒక పాత్ర కూర్చుని సంభాషణ ప్రారంభించి ఒకసారి లేచి, అటూ ఇటూ తిరిగి సంభాషణ ముగించేలోగా మరల కూర్చుండవచ్చు. ఒకే పాత్ర రంగంలో వున్నప్పుడూ, స్వగతాలు పలికేటప్పుడూ, లేదా ఆలోచనానిమగ్నంగా వున్నప్పుడూ, రంగస్థలమంతా కలియ దిరుగుతూ ప్రక్కపాత్రను దూషిస్తున్నప్పుడూ, మరో వ్యక్తికి ఉపదేశమిస్తు నప్పుడూ ఇలాంటి కదలిక లుండవచ్చును.

తత్వానికి తగిన సదుకలు:

నాటకంలో జీవిత ప్రతిబింబాన్ని చూపిస్తున్నాం గనుక, జీవితంలో వుండే కదలికలన్నీ నాటకంలో వుంటాయి. అలా అని విచ్చలవిడిగా కదలిక లుండ కూడదు. రంగస్థల హద్దుల ననుసరించే ఆ కదలిక లుండాలి. ఉదాహరణకు ప్రజానాట్యమండలి మా భూమి నాటక ప్రదర్శనంలో, దేశముఖువద్ద బానిసయైన

మంగలి రాముని నడక, అలాగే భయకంపితుడై, సీటాన్చిని, సీకాలు మొక్కు-తాననే యల్లమంద పాత్రనడక, నక్క-వినయాలతో కొంపలార్పే పట్వారీ నడక, పై పాత్ర లన్నిటికీ పరస్పర వ్యత్యాసాలైన నడకలున్నాయి. ఆ నడకలవల్లే, ఆయా పాత్రలు, తద్వారా ఆ రంగాలు ర క్తి కడతాయి. పాత్ర ననుసరించి తగు కదలిక లున్నప్పుడే ఒక రంగంగాని, ఒక ఘట్టంగాని, ఒక నాటకంగాని ర క్తి కడుతుంది.

సహజంగా వుండాలేగాని
బిగుసుకు పోకూడదు :

కొంతమంది నటసోదరులు రంగస్థలంమీదకు ప్రవేశించిన తరువాత, భయం వల్లనో, సిగ్గువల్లనో ఎటు కదిలితే ఏమౌతుందోనని బిట్టబిగిసి వారి స్థానాల్లోవుండి ఏమాత్రం చలనం లేకుండా బొమ్మల్లాగ నిలబడి మాట్లాడుతారు. ఇందువల్ల ఒక పాత్రకు మరోపాత్రకు ఏలాంటి సమన్వయం కుదరదు. దుఃఖంలోవున్న తల్లిని ఓదార్చడానికి దూరంగా వుండి ఊరుకో అమ్మా అని బుజ్జగిస్తే ఎలా వుంటుంది? అలాగే ఇద్దరు అన్నదమ్ములు రంగస్థలంలో ఈ ప్రక్క ఒకరు ఆ ప్రక్క మరొ కరు వున్నారనుకొండి. ఇరువురికీ భేదాభిప్రాయా లొచ్చాయి. మాటలు ముదిరాయి. నువ్వెంతంటే, నువ్వెంతని దూరంనుంచే అనుకున్నారు. అంతతో ఆగక ఇంకా దగ్గరకొచ్చారు. ఒకరి నొకరు చొక్కా-మడిచి కొట్టుకొట్టుకుంటారా అన్నంత భావాన్ని కలిగించారు. ఈ సంఘటనను చూస్తున్న మధ్యవ్య క్తి వూరుకుంటాడా? వెంటనేవచ్చి వా రిద్దర్ని విడదీస్తాడు. ఇందువల్ల ఎంత కదలిక వచ్చిందో బోధ పడుతూవుంది. అలా కాక ఆ మూలకొకరూ, ఈ మూలకొకరూ, నువ్వెంతంటే నువ్వెంతని నిలబడినట్లయితే సన్నివేశానికి వేగంగాని, కదలికల్లో వేగంగాని కన బడక సన్నివేశం నీరసంగా తయారవుతుంది. కనుక రంగస్థలంలోవున్న ప్రతి పాత్రధారీ సహజంగా వుండాలి. నటించాలేగాని బిగుసుకు పోగూడదు.

అనవసర కదలికలు :

నటీనటుల్లో కొంతమంది తమ పాత్రల స్వభావాలను వదలి అనవసర కదలికలను ఇస్తూ వుంటారు. కారణం, వారి పాత్రనుగూర్చి వారికే సరియైన అభిప్రాయం లేకపోవడం. అంతేగాక ఈ అనవసర చలనంవల్ల ఏదో నటిస్తున్నా మనుకోవడానికి కూడా కొంతమంది ఇలా చేస్తూ వుంటారు. ఎవరు ఎంతవరకు

కదలాలో అంతవరకే కదిలితే బాగుంటుంది. ఉదాహరణకు రాజుగారివద్దకు వర్తమానం తెచ్చిన సేవకుడు సరాసరి ముందుగానే సింహాసనం దగ్గరకు వెళ్ళడు. అయ్యా, వర్తమానం వచ్చిందంటాడు. ఏమది? తెమ్ము అని రాజుగారు అన్నప్పుడు దగ్గరకెళ్ళి భక్తిశ్రద్ధలతో ఆ వర్తమానాన్ని అతి జాగ్రత్తగా అందిస్తాడు. ఇలా కాక ఒకేమారు అయ్యా మీకు ఉత్తరం వచ్చిందని సింహాసనం దగ్గరకే వెళితే రాజమర్యాదలకు భంగం కలిగించాడన్నమాట. ప్రతి పాత్రా ఎంతవరకు కదలాలో అంతవరకే కదలాలి.

### నడకలమీదే నాటక వేదం :

మనం ధరించే పాత్రనుబట్టి రంగస్థలంలో నడకల గమనం ఎలా వుండాలో ముఖ్యంగా తెలుసుకోవాలి. ఈ నడకలమీద నాటకం యొక్క వేగం, రక్తి ఆధారపడి వుంటుంది. సన్నివేశాన్నిబట్టి నడకలు నేర్చుకుని వుండాలి. వుదాహరణకు సారంగధరపాత్ర ధరించిన మనిషి రాజరాజనరేంద్రుని పాత్ర ధరిస్తే విభిన్న మనస్తత్వాలు గల ఆ రెండు పాత్రల్లోనూ, అభినయంలోనూ, నడకలోనూ అనుభవం సంపాదించవచ్చు. ఒకే నాటకంలో యువకుని పాత్ర ధరించి వృద్ధాప్యం వరకు ఆ పాత్ర అభివృద్ధి పొందినప్పుడు మొదటి యువకుని నడకలే ముసలితనంలో నడిస్తే ఏమీ ప్రయోజనముండదు. యువకునికి వృద్ధునికి తేడా చూపాలి. ప్రతీ పాత్రకు ఒక ప్రత్యేక నడక వుంటుంది. రాజు నడిచే నడక వేరు, రాజు సమక్షంలో ప్రధానమంత్రి నడక వేరు. రాజూ మంత్రి సమక్షాన సైన్యాధికారి నడక వేరు. కనుక పాత్ర నైజాన్నిబట్టి నడకలుండాలి.

### నమ్మించే నడకలు నడవాలి :

ఒకనిమీదికి దుమికి చంపబోయేటంతటి భావాన్ని రంగస్థలంలోనే కలిగించాలి. రంగస్థలం చాల చిన్నదైనప్పుడు ఆ వైశాల్యంలో నడిచే ఆ నాలుగడుగులు ఆ పాత్రకు తగినట్లు నడవాలి. అంతేగాక రంగంలో నలుగురు పాత్రధారులున్నప్పుడు నడకల గమనం కొంచెం తగ్గినా ఫరవాలేదు. కాని ఒకే పాత్ర రంగస్థలంలో వున్నప్పుడు ఆ పాత్ర ఒకేచోట నిలబడితే ఏమాత్రం రంగం రాణించదు.

రంగస్థలంలో ఇతివృత్తాన్ననుసరించి మేడమిద్దె లుంటాయి. పై మేడమీది నుండి ఒక పాత్ర. క్రిందినుండి ఒక పాత్ర మాట్లాడుతూ వుంటాయి. వారే ప్రేయసీప్రియులైతే రెండంతస్తులూ రంగస్థలంనుండే ప్రేక్షకులు చూస్తూ వుంటారు. మేశమీదనున్న ప్రియుడు, క్రిందనున్న ప్రేయసికొరకు త్వరత్వరగా మెట్లమీద నుండి టకటక క్రిందికి రావాలి. ఇలా రావడంలో చాలా స్వాభావికతను చూపించాలి. ఆ నడకలు అంతకుముందు సాధన చేయకపోతే మెట్లమీద పడిపోవడం జరుగుతుంది.

వివిధ సన్నివేశాలూ
వివిధ నడకలూ :

నడకల్లో యుద్ధరంగానికి వెళ్ళే వీరుడు ఎలా సాహసవంతమైన నడక నడుస్తాడు ?

ఆ రోజున ఉరిశిక్ష పడే ఖైదీ కోర్టుకు ఎలా నడుస్తాడు ?

శిక్షింపబడి జైలుకు తీసుకుపోయే ఖైదీ ఎలా నడుస్తాడు?

రంగంలో కాలు విరగగొట్టబడి నిష్క్రమించాల్సి వచ్చినప్పుడు ఆ నడక ఎలా వుండాలి?

ఈ మొదలైన నడకల్నీ, ఆ నడకల్లో గమనించవలసిన గమనాన్నీ, ఆయా పాత్రలనైజాన్ననుసరించి సాధనచేయాలి.

# ప్రవేశ నిష్క్రమణాలు

నాటకంలో పాత్ర వహించిన నటీ నటులు రంగస్థలమీద రావడం పోవడాలను ప్రవేశనిష్క్రమణాలని అంటాదు. ఇవి సాత్వికాభినయంలో ఒక భాగమే. అలాగే ఆంగికాభినయం కూడా.

ఎక్కడ ఎలా ప్రవేశించాలి ?
ఎలా నిష్క్రమించాలి ?

నటుడు రంగంమీదకు ప్రవేశించేముందు, తన ప్రవేశం దేనికి సంబంధించింది? రంగస్థలంలో జరుగుబోయే సన్నివేశమేమిటి? ఎలాంటి పరికరాలు రంగ

స్థలంలో వున్నాయి? కుర్చీలా? బెంచీలా? ఎవరితో మాట్లాడాలి? స్త్రీయా? పురుషుడా? లేక రాజా? ఒకవేళ అది న్యాయస్థానమా? లేక రంగస్థలంలో హత్య చేయబడి మరణించిన శవమా? ఎవ్వరూ లేక తన ప్రవేశంతోనే ప్రారంభమయ్యే సన్నివేశమా? ఆలోచించుకోవాలి. ఏది ఏమైనా ఆయా అవస్థల ననుసరించి పాత్రలు రావడం, పోవడం జరగాలి.

ప్రవేశించేది దేవాలయమైతే భక్తిశ్రద్ధలతో ప్రశాంతమైన సాత్వికంతో ప్రవేశించాలి. అది న్యాయస్థానమైతే జడ్జీముందు, అపరాధం చేయబడిన ముద్దాయి ఎలా ప్రవేశించాలి? న్యాయస్థానంలో ఉరిశిక్ష పడిన ముద్దాయి ఎలా నిష్క్రమిస్తాడు? తప్పత్రాగిన రంగూన్ రౌడి పాత్రధారి ఎలా ప్రవేశిస్తాడు? హత్యజేసి పారిపోయే హంతకుడు గంతేసి ఎలా నిష్క్రమిస్తాడు? అని యోచించుకోవాలి.

ప్రాతనుబట్టి
ప్రవేశ నిష్క్రమణాలు వుండాలి :

యజమాని గుమాస్తాను పిలిచినప్పుడు అయ్యా వస్తున్నా నంటూ భక్తి శ్రద్ధలతో ప్రవేశం వుండాలి.

అలాగే యజమాని దగ్గరకు వచ్చే కూలీగానీ, ఆసామివద్దకు వచ్చే పాలేరు గానీ, కూలీ, పాలేరు ప్రవేశంగానే వుండాలి గాని, మరోమాదిరి వుండకూడదు. తను చూడబోయే వ్యక్తియందుండే భక్తి ప్రపత్తులు తన ప్రవేశంద్వారా నిరూపించు కోవాలి.

అలాగే ప్రమాదవార్తను విన్న పాత్రధారి రంగస్థలం నుండి హఠాత్తుగా నిష్క్రమించాలి గాని ఎక్కడా ఏమిటి అంటూ శ్రీరంగనీతులు వల్లిస్తూ నిష్క్రమించరాదు. సన్నివేశ ప్రాముఖ్యానికి తగిన వేగాన్ని ప్రదర్శించినప్పుడు, ఆ సన్నివేశం రక్తి కడుతుంది.

మరో సన్నివేశంలో బయట వురుములు మెరుపులతో బ్రహ్మాండంగా తుపాను వీస్తూ వుంటుంది. కథానాయకుడో మరొకరో ఆ తుపానులో చిక్కుకుని ప్రమాదాన్ని తప్పించుకుని రంగంమీదకు ప్రవేశిస్తాడు. ఆ ప్రవేశం తుపానుకు దెబ్బతిన్న వ్యక్తి తడిసి ఎంతగా డస్సిపోతాడో ఆ స్థితిలోని నడకనూ వైఖరినీ ప్రదర్శించాలి.

రావటం, పోవటం
రాణింపుగా వుండాలి:

కొందరు నటీ నటులు ఈ రావటం పోవటాలను చాల నిర్లక్ష్యంతో చూస్తారు. ఏదో ఇంత రంగు పూసుకొని, రంగంమీదకు వచ్చే ప్రవేశంలో తన దర్జాను కొంత ప్రదర్శిస్తూ ప్రేక్షకులవంక చూస్తూ నిష్క్రమిస్తారు.

కొంతమంది రంగస్థలంలో వున్నంతసేపూ మంచి భావప్రకటనను ప్రదర్శించి, తీరా నిష్క్రమణలో వూరికినే వెళ్ళిపోతారు.

కొన్ని పాత్రలు రంగస్థలంలో వచ్చినదారిని వెళ్ళక, మరో త్రోవను వెళతారు. స్టేజిని ఎప్పుడూ ఒకప్రక్క ఇల్లుగాను, మరోప్రక్క బజారుగానూ అందరూ వచ్చి పోవటానికి అనుకూలంగా వుంచుకోవాలి.

రంగస్థలంమీద ఈ ప్రవేశ నిష్క్రమణాలే నాటకానికి ఒక లింకులా వుంటాయి. ప్రతి నటుడూ పై విషయాలను గమనించగలిగితే ప్రవేశ నిష్క్రమణాలను గూర్చి ఇంకా ఎక్కువ ఆలోచించ గలుగుతాడు.

# ప్రేక్షకులు, ప్రదర్శనం

ఈనాడు అనేక నాటక ప్రదర్శనాలు అల్లరిమూకలకు ఆలవాలమైనాయి. ఇలా ప్రదర్శనాలు ఈస్థితికి రావడానికి కారకులు ప్రదర్శనకారులైన నటీ నటులు, హాలు యజమానులు, ప్రేక్షకులు మొదలైన వారంతాను.

నాటకప్రదర్శనం చూచే ప్రేక్షకులు సహృదయులైతే తప్ప, నాటక ప్రదర్శనాలు ఏ విధంగానూ విజయవంతం కావు. ప్రేక్షకులు ఎంత ప్రశాంతంగా వుంటే, ప్రదర్శనం అంత ప్రశాంతంగా నడుస్తుంది.

ప్రేక్షకుల చేతుల్లో
ప్రదర్శన విజయం:

కేవలం నాటకం చూడడమే ప్రేక్షకుల బాధ్యత కాదు. ఆ ప్రదర్శనాన్ని జయప్రదం చేయడంలోకూడ వారిపై గురుతరమైన బాధ్యతలున్నాయని గుర్తించినప్పుడు నాటక ప్రదర్శనాలు విజయవంత మౌతాయనడంలో సందేహంలేదు.

ప్రదర్శన సమయాల్లో జరిగే అల్లరికి బాధ్యులు ప్రేక్షకులే అనడానికి నేను సాహసించడంలేదు. అన్ని అభాండాలు వారి నెత్తినే రుద్దడానికి ప్రయత్నించను. ప్రదర్శన విజయానికి వారుకూడ చేయూత నివ్వాలనీ, వారి విధులు వారుకూడా నిర్వహించాలనే నా అభిప్రాయం.

ఏ కారణంచేతనైనా ప్రదర్శనం ప్రారంభించడంలో ఆలస్యం జరిగితే, ఏమాత్రం ఓపికలేకుండా గందరగోళాన్ని లేవదీస్తున్నారు. నాటకం అనుకున్న సమయానికి ప్రారంభించగలిగితే ఇలాంటి గందరగోళాలకు అవకాశముండదు.

ఎవరిసీటు వారికుండాలి :

టిక్కెట్లు ఎక్కువ అమ్మడంవల్ల జనసమ్మర్థం ఎక్కువై ఒకరిమీద మరొకరు పడే తొక్కిసలాటవల్ల కూడ ప్రదర్శనాలు దెబ్బతింటున్నాయి. దీనికి బాధ్యులెవరు ? ప్రేక్షకులా ? కాదు. యజమానులు. ఆనాటి నాటకం కంట్రాక్టరు, ఇలాంటివాటిని నివారించాలంటే హాలు కెపాసిటీ సీటింగును మించి హాలు యజమానులు, ఏ ఒక్క టిక్కెట్టు అదనంగా అమ్మకుండా అరికట్టాలి. లేనట్లయితే, పై దుష్పలితాన్ని చేతులార ఆహ్వానించినవాళ్ళమౌతాం.

అంతేకాదు. ప్రేక్షకులు టిక్కట్లు కొనుక్కోవడంలో క్యూ పద్ధతి అనుసరించాలి. లేనట్లయితే ముందు వచ్చినవారు వెనుకా, వెనుక వచ్చినవారు ముందూ టిక్కెట్లు కొనుక్కోవడంలో గందరగోళం ప్రారంభమౌతూంది. ఈ క్యూ పద్ధతిని హాలు యజమానులే ప్రవేశపెట్టాలి. ముఖ్యంగా ప్రేక్షకుల్లో సహృదయులే వుంటారు. ఎవరో కొందరు తమ రౌడీతనాన్ని ప్రదర్శించి తమ ప్రతాపాలను చూపడానికి ప్రయత్నిస్తే అలాంటివారికి ప్రేక్షకులే బుద్ధిచెప్పాలి.

ప్రదర్శనాన్ని చూడడానికి వచ్చిన స్త్రీ ప్రేక్షకులపట్ల కూడ చాల అసభ్యంగా ప్రవర్తించే ప్రేక్షకులున్నారు. ఇలాంటి వారినికూడ ప్రేక్షకులు అరికట్టాలి. వెనుకబడ్డ ప్రాంతాలైతే స్త్రీ ప్రేక్షక స్థానాలను సాధ్యమైనంత వరకు విడిగా వుంచడం మంచిది.

ప్రేక్షకులే ప్రేక్షకుల్ని
వారించాలి :

ప్రేక్షకుల్లో ఎవరైనా వన్సుమోరన్నప్పుడు ప్రక్కనున్న ప్రేక్షకుడు అటు

వంటివారిని నివారించగలిగితే ఏ అల్లరీ వుండదు. ఒక్కొక్క నటుడు వన్సుమోరన్నప్పుడు పాడడు. పెంకెతనంగా పాడించడానికి ప్రేక్షకుల్లో కొందరు పూనుకుంటారు. అటువంటి వారిని ప్రేక్షకులు సమర్థించకూడదు.

మరికొంతమంది నాటక ప్రదర్శనానికి టిక్కట్లు కొనకుండా స్థానికంగా వారికున్న రౌడీ బలాల ఆసరాతో బలవంతంగా తోసుకుని లోనికి రావడానికి ప్రయత్నించటంద్వారా ప్రదర్శనాన్ని అల్లరిపాలు చేస్తున్నారు. ఇలాంటి రౌడీ మూకల్ని పోలీసులుగాని, ప్రేక్షకులుగాని తప్పకుండా అణచివేయాలి.

నాటకప్రదర్శనం ఈ రోజు రాత్రి 10 గంటలకే అని ప్రకటించి 12 గంటలకు నాటకప్రదర్శనం ప్రారంభిస్తే, అలాంటి ప్రదర్శనాలలో తప్పకుండా అల్లరి జరగడానికి అవకాశముంది.

ప్రదర్శనం విజయవంతంగా సాగిపోవాలంటే పైవాటిని ఏమాత్రం చిన్న చూపు చూడకూడదు. ఎంత చిన్నకారణమైనా అల్లరికి దారితీయవచ్చు. అలాంటివి రాకుండా సాధ్యమైనంతవరకు చూచుకోవాలి. అందరూ క్రమశిక్షణతో ప్రశాంతంగా ప్రదర్శనాన్ని చూడడం అలవాటు చేసుకోవాలి.

కవి ఒక నాటకం వ్రాయడంతో సరిపోదు. నటీనటులు దానిని అతిపవిత్రంగా ప్రదర్శించాలి. ప్రేక్షకులు ఆ ప్రదర్శనాన్ని ఆహ్లాదంగా చూచి ఆనందించాలి. అప్పుడుగాని నాటకపరమావధి నెరవేరిందని చెప్పలేము.

ప్రేక్షకులు కేవలం ప్రదర్శన విజయాన్నే దృష్టిలో పెట్టుకోవాలిగాని, సీట్ల కొరకూ, వన్సుమోర్లకొరకూ తగాదాలు పెట్టుకోకూడదు.

ఒక ప్రేక్షకుడు అధిక ప్రసంగంద్వారా అల్లరి ప్రారంభిస్తే ప్రక్కన కూర్చున్న ప్రేక్షకుడు వానిని నివారించడంద్వారా మొత్తం ప్రేక్షకులందర్నీ హద్దుల్లో వుంచగలుగుతాడు. లేనట్లయితే అల్లరి చేసేవాడు చేస్తూనే వుంటాడు. ప్రదర్శనానికి ప్రదర్శనం జరుగుతూనే వుంటుంది.

### ప్రేక్షకులిచ్చే వుత్సాహమే నటులకు పెన్నిధి:

ప్రేక్షకులు ఎంత వుత్సాహమిస్తే నటీనటులు అంత వుత్సాహంగా

నటించగలుగుతారు. ఎంతబాగా నటించగలవారైనా ప్రేక్షకుల సహకారం లేకపోతే ప్రదర్శనం నాశనమై ఊరుకుంటుంది.

నటీ నటులు ప్రదర్శనాన్ని బాగా ప్రదర్శించగలినప్పుడే ప్రేక్షకులయొక్క సంపూర్ణ సహకార ముంటుంది. ప్రేక్షకులూ, నటీ నటులూ, నాటకమందిర యజమానులూ, ఆదర్శప్రాయమైన దృక్పథంతో వున్నప్పుడు ప్రదర్శనాలు విజయవంతమౌతాయి.

# వన్సమోరు దుష్పలితాలు

వన్సమోర్ పద్ధతివల్ల లాభాలులేకపోగా, నష్టాలుమాత్రం చాలావున్నాయి. నాటకప్రదర్శనంపట్ల మహమ్మారి వన్సమోర్ విధానం. ఈ పద్ధతి ఈనాడు ఆంధ్రదేశంలో ప్రదర్శించబడుతున్నది. అనేక కంట్రాక్టు నాటకాలలో, ముఖ్యంగా పద్యాలు గలిగిన నాటకాలలో విపరీతంగా వుంది. ఈ పద్ధతి ప్రేక్షకులకు సంబంధించిన విషయం.

ఎందుకీ వన్సమోర్?:

వన్సమోర్ విధానంవల్ల నాటక ప్రదర్శనాలు గందరగోళంలో పడిపోతున్నాయి. మన పద్యనాటకాల్లో నటీ నటులు పద్యాలు పాడడంలో సిద్ధహస్తులు. పద్యాన్ని పదవిభాగంచేసి, పద్యం యొక్క అర్థాన్ని ప్రేక్షకులకు వినిపించడంలో అద్భుతమైన ప్రతిభ గలిగినవారు మన ఆంధ్రనటులు.

ఇలా పద్యాలుపాడే సమయంలో కొంతమంది వుత్సాహవంతులు, సహృదయులు అంత చక్కగా పాడిన ఆ పద్యాన్ని మరిల వినాలనే కుతూహలం కొద్దీ వన్సమోర్ పద్ధతి ఆచరణలోనికి వచ్చింది. ప్రథమంలో సదుద్దేశ్యంతో ప్రారంభమైన ఈ విధానం రాను రాను అపహాస్యం క్రిందకు దిగింది.

మోవన్సర్ తో
బిడబ్బిత్తబ్బు అయ్యే నటులు:

వన్సమోర్‌ను అందుకున్న నటుడు తన ప్రతిభను మరోసారి చూపించటానికి వుబ్బితబ్బిబ్బు అవుతూవుంటాడు. ప్రేక్షకుని అభిమతం ప్రకారం పద్యం పాడతాడు. ప్రేక్షకులనుండి చప్పట్లు తెప్పించుకుంటాడు.

ఈ వన్సుమోర్ విధానంలో ఒక పద్ధతంటూ ఏమాత్రం లేదు. ఒక ప్రేక్షకుడు వన్సుమోర్ అంటే, మరో ప్రేక్షకుడు నోమోర్ అంటాడు. ప్రేక్షకుల్లోనే ఏకాభిప్రాయం వుండదు. ఇలా ఒకరు వన్సుమోర్ అనడం, రెండవవాడు కాదనడం. చివరికి తన్నులాటక్రిందికి దిగటం జరుగుతూవుంది.

### వన్సుమోర్, నో మోర్ తికమకలు :

నిజంగా ఒక నటుడు పద్యాన్ని ఎంతో రమ్యంగా పాడినప్పుడు మరల వినాలనే కుతూహలంతోనూ, సహృదయంతోనూ ఒక మంచి ప్రేక్షకుడు వన్సుమోర్ అన్నాడనుకోండి. అందుకోసం రెండవ ప్రేక్షకుడు నోమోర్ అని అనాల్సిన అవసర మేముంది? కేవలం ప్రదర్శనాన్ని అల్లరిచేయాలనే దృక్పథం తప్పితే మరొకటి కాదు. పద్యాన్ని ఒక నటుడు సరిగా పాడలేకపోయినా, ఆ నటుణ్ణి అవహేళనచేసి ఏడ్పించడానికి కూడ వన్సుమోర్ వుపయోగిస్తున్నారు. ఇందువల్ల రంగంలో వున్న నటుడు తన అసమర్థతతో క్రుంగిపోవడం, ఆ స్థితిలో ప్రేక్షకులు పట్టుబట్టి పాడించడం, కనీసం ప్రథమంగా పాడిన మాదిరి కూడా ఆ నటుడు పాడలేక ప్రేక్షకుల అల్లరికి గురికావడం జరుగుతుంది.

అంతేకాదు. ఒకే నాటకంలో ఏపాత్ర వన్సుమోర్ అనిపించుకుంటే అంత ఘనతగా ఎంచుకునే నట సోదరు లనేకమంది వున్నారు. ఇలా వన్సుమోరుతో తృప్తిపడ్డ నటసోదరులు ఇతర నటులను హీనంగా చూడడం, రంగంలోనే వారిని అవమానపరచడం జరుగుతూ వుంది.

### హాస్యాస్పదంగా మారిన వన్సుమోర్ విధానం :

ఇంకా మన నటుల్లో కొంతమంది వన్సుమోర్ కేక వినడంతోటే వారివంకే చూచి, ఆ పద్యాన్ని వికృతరూపంతో చిత్రవధచేసి ప్రథమపర్యాయం పాడినట్లు పాడక, వన్సుమోరన్న ప్రేక్షకునిపట్ల కక్ష దీర్చుకుంటున్నారు.

నటీ నటుల్లో సరైన క్రమశిక్షణ లేక సమాజంయొక్క గుట్టుమట్టులన్నీ గంగలో కలిసి ప్రదర్శనాలన్నీ హాస్యాస్పదంగా మారిపోయాయి.

ఒకవేళ ఏదో సహృదయులైన ప్రేక్షకులు అడిగినందుకు నాలుగు పద్యాలు శ్రావ్యంగా వినుపించుదా మనుకుందాం. అందువల్ల ఆ నా టకంమీద నుండి దృష్టి సంగీతంమీదకు మరలినట్లే గదా!

అంతేగాక ఒకసారి ఒక పద్యం పాడి, ఒక రసాన్ని ఒప్పించి, మరల వన్సుమోరంటే ఆ రసం ఒప్పించడం ఎలా? రెండుసార్లు ఒకే రసాన్ని ఒప్పించడం నాటక ఆదర్శానికి మంచిదేనా?

## వన్సుమోర్‌తో వక్రమార్గంలో నడుస్తున్న ప్రదర్శనాలు:

ఒక పాత్రధారుడు పద్యం పాడుతూ మూర్ఛపోయినట్లు పడిపోయా డను కుందాం. ఇంతలో వన్సుమోరంటే మరల లేచి పాడడం సమంజసమేనా? పాడి మూర్ఛపోవాల్సిందేనా?

ఈ విధానంవల్ల మాటలు మాట్లాడుతూ చనిపోయిన మనిషి వన్సుమోరంటే బ్రతికి పాటపాడి మరలా చావాలన్నమాట!

వన్సుమోర్ విధానం, నాటక ప్రదర్శనంయొక్క విశిష్టతనూ, ఆదర్శాన్ని నాశనంచేస్తుంది.

వన్సుమోర్‌వల్ల నటీ నటుల్లో చీలికలు రావడానికి అవకాశముంది.

వన్సుమోర్ ప్రేక్షకుల్లో ప్రేక్షకులకు అనవసర తగాదాలకు దారితీసేటట్లు చేస్తుంది.

ఈ వన్సుమోర్ క్షణికమైన ఆనందాన్ని మినహా ఇంకేమీ ప్రయోజనం ఇవ్వలేదు.

# నాటక సమాజం, సమిష్టి కృషి

నాటక సమాజ పరిపాలనలో సమిష్టి కృషిలేని సమాజం ఎక్కువకాలం నిలవక కూలిపోతుంది. మనం ఒక నాటక సమాజాన్ని నడపాలనుకున్నా, ఒక నాటక ప్రదర్శనం జయప్రదం కావాలన్నా, అదే సమాజం దీర్ఘకాలం నిలవాలన్నా, సమాజ సభ్యుల్లో ఐకమత్యం, కలుపుగోరుతనం, ఒక ఆదర్శంకోసం పాటు పడుతున్నామనే కార్యదీక్ష వుండాలి.

నలుగురూ నాలుగుపనులందుకోవాలి :

కవి ఒక మంచి నాటకం వ్రాసిస్తే, ఆ నాటకాన్ని ప్రదర్శించటానికి యోగ్యమైన నటీ నటవర్గం కావాలి.

అలాగే ఒక గాయకుడు ఒక పాటను ఎంతో మధురంగా పాడగలిగినా, ఆ సంగీతానికి ఇతర వాయిద్యాల సహకార ముండాలి.

అలాగే చిత్రలేఖకుడు వివిధ దృశ్యాలనూ రమణీయంగా చిత్రించినా, వాటిని ప్రదర్శనానికి అనుగుణ్యంగా తెరలబాధ్యుడు వుపయోగించాలి.

ఎవరి విషయం వారికి తెలియాలి :

అలా రంగస్థల పరికరాలైన కుర్చీలు, బెంచీలు, సోఫాలు, చిత్రాలు, వీరు వాలు, గాజుసామగ్రి, టేబిల్సు, మంచాలు మొదలైన అన్ని పరికరాలూ సేకరించినా, వాటిని ఏ ప్రదేశంలో ఏ అంకంలో, ఏ రంగంలో, ఎలా అమర్చాలో, ఎప్పుడు తీసివేయాలో తెలియాలి. నలుగురు నటకులే ఈ పూర్తి బాధ్యతల్ని సాధించలేరు. ఇన్ని బాధ్యతలు పూర్తిచేయడానికి ఆయా వ్యక్తులు కావాలి. అన్నిటి యొక్క సంపూర్ణ కలయికలేనిదే ప్రదర్శనం ఒక రూపానికి రాదు.

ఉమ్మడి కుటుంబంగా
హుందాగా వుండాలి :

ఇంత కార్యభారం సమాజ సభ్యులమీదుంది. ఇందుకు సమాజ పరిపాలన ఐకమత్యం నూటికి నూరుపాళ్ళున్నప్పుడు పై ప్రయోజనాల నన్నిటినీ పొందగలం.

పైన చర్చించిన అనేక విషయాలు ఏ ఒక వ్యక్తీ నిర్వహించలేడని మనం తెలుసుకున్నప్పుడు, అందుకు అనువైన మార్గం వెతకాలి. ప్రతి సమాజంలోనూ, ఈ బాధ్యత లన్నిటినీ ఇద్దరో ముగ్గురో వ్యక్తులు నెత్తినేసుకుని, మోయలేని బరువులాగా నానా అవస్థలూ పడుతూ వుంటారు. ఇందువల్ల ఏదో ఒక పనిలో ఒక లోపం వస్తూనే వుంటుంది. ఈ లోపంవల్లే ప్రదర్శనానికి గట్టిదెబ్బ తగులుతూ వుంటుంది.

సమిష్టి కృషలేని నాటక సమాజం
నాశనమౌతుంది :

లోపాలనేవి అందరి నటులకు ఇతర సహాయకులకు సంబంధించి

వుంటాయి. ఒక పాత్రధారికి చేతికర్ర కావాలి. ప్రదర్శన సమయానికి ఆ చేతికర్ర రాదు. అంటే ఒక నటుడు దెబ్బతిన్నాడన్నమాట. పరికరాలను సేకరించే వ్యక్తి ఆ బాధ్యతను పూర్తిచేయలేదు.

నలుగురు నటులున్న ఒక సన్నివేశంలో ఒక వ్యక్తి సంభాషణ మరిస్తే ఇతర నటులందరూ ఎలా దెబ్బతింటారో అలాగే ఒక వ్యక్తి కర్ర మరచినంత మాత్రాన ఒక నటుడు దెబ్బతిన్నాడు.

మరో క్లయిమాక్సుసీనులో రంగాంతంలో వెంటనే పడాల్సిన తెర మధ్యలో ఆగిపోయింది. సీనులోవున్న నటులందరూ దెబ్బతిన్నారు. ఇలా నాటకంలో ఎవరి బాధ్యతలను వారు పూర్తిచేయక పోయినట్లయితే మొత్తం నాటకం దెబ్బ తింటుంది.

ఇందుకు కారణం ఏ కొద్దిమంది వ్యక్తులో ఈ బాధ్యతలన్నీ తీసుకోవడం చేతనూ, వాటిని వారు సరిగా నిర్వహించలేకపోవడం వల్లనూ, వారి లోపాలు మొత్తం సమాజాన్ని దెబ్బ తీస్తున్నాయి.

పైన చర్చించిన విషయాలనుబట్టి ఏ ఒక్క వ్యక్తీ నాటక ప్రదర్శనాన్ని నిర్వహించలేడని తేలిపోయింది. ఒక కుటుంబంలా, అన్నదమ్ముల్లా వుండి సమాజం నడుపుకోవాలి. అలా నడపడానికి ఒక బాధ్యత గల వ్యక్తి పైనుండి చూచుకోవాలి. ఏ బాధ్యత లోపించినా దానిని పూర్తిచేయించే బాధ్యత ఈయనే తీసుకోవాలి. అప్పుడే సమాజ పరిపాలన చక్కగా నడుస్తుంది.

# సమాజ కార్యదర్శి

ప్రదర్శనానికి రంగాధిపతి, ఆహార్యాధిపతి (మేకప్‌మేన్), కోశాధికారి, కవి, చిత్రలేఖకుడు, దర్శకుడు, సంగీత దర్శకుడు మొదలైన వారంతా ఎంత అవసరమో వీటన్నిటినీ సమన్వయ పర్చగలిగినవాడూ, సమర్థుడూ, వుత్సాహవంతుడూ అయిన ఒక కార్యదర్శి కూడా అవసరం.

సమాజానికి వెన్నెముక :

నటీ నటులు, ఎవరి పాత్రలను వారు సమర్థనీయంగా నటించినా, వివిధ బాధ్యతలను ఎవరికి వారు నిపుణతతో నిర్వహించినా, వీటన్నిటినీ సమన్వయించి

ఒక గొలుసులాగా ఒక్క- త్రాటిమీద లాగగలిగిన కార్యదర్శి సమాజానికి ఎంతైనా అవసరం.

నాటకాన్ని విజయవంతంగా ప్రదర్శించటం ప్రారంభించిన తరువాత, ఆ నాటకాన్ని ఇతర ప్రాంతాల్లో కూడ ప్రదర్శించాల్సి వుంటుంది. ఇలాంటి ప్రదర్శనాలకు అనేక బాధ్యతలున్నాయి. ఈ బాధ్యత లన్నింటినీ వివిధ వ్యక్తులద్వారా నిర్వహించగలిగినవాడు కార్యదర్శి మాత్రమే. వున్న వూళ్లో నాటకం ప్రదర్శించిన దానికి ఇతర ప్రదేశంలో ప్రదర్శించే నాటకానికి ఎంతో వ్యత్యాసముంటుంది. క్రొత్త ప్రదేశంలో మనకు పరిచయస్తులెవ్వరూ వుండరు. అంతా క్రొత్తే. మన ప్రదర్శనానికి అనేక పరికరాలు కావాలి. నటీ నటులకు మంచివసతి సౌకర్యాల్ని, భోజన ఏర్పాట్లను చూడాలి. అంతేకాదు-ప్రదర్శనంలోకి కావలసిన అనేకమైన వస్తువులూ, కుర్చీలూ, బెంచీలూ, మంచాలూ మొదలైన చిల్లరమల్లర సామాన్లు కావాల్సి వుంటాయి. వీటన్నిటినీ సరిదిద్దగలిగినవాడు మన కార్యదర్శే.

### అందరికీ అమ్మలాంటివాడు:

మనం ఏ ప్రాంతంలో నాటకాన్ని ప్రదర్శించ దలచుకున్నామో ఆ ప్రాంతానికి ముందుగానేవెళ్ళి ప్రదర్శనం రోజుకు అన్నివసతులనూ సమకూర్చి సిద్ధంగా వుంచాలి. నటీ నటులొచ్చి హాయిగా ప్రదర్శనం ఇచ్చిపోయేటంత సౌకర్యాలను కలిగించాలి. ఇలా సౌకర్యా లున్నప్పుడే ప్రదర్శనం ఎంతో బాగుంటుంది. కార్యదర్శి అసమర్థుడైనప్పుడు కార్యక్రమం కుంటుపడి సమాజ సభ్యులందరూ నానా యాతన అనుభవించాల్సి వస్తుంది. అసౌకర్యాలతో కూడుకున్న నాటక ప్రదర్శనం తప్పకుండా దెబ్బ తింటుంది. ఇలాంటి ముఖ్యమైన బాధ్యతలను నిర్వహించగలిగిన వ్యక్తి చాల సమర్థుడై యుండాలి.

### అన్నివిధాలా సమర్థుడై యుండాలి:

ఒక పట్టణంలో మనం ప్రదర్శన ఇవ్వాలనుకున్నప్పుడు ఆ పట్టణ పరిసరాలు ఏమిటో పరిశీలించి, ఆయా గ్రామాలకు కరపత్రాలూ, వాల్‌పోస్టర్లూ పంపించి ప్రచారాన్ని విరివిగా చేయించాలి. ఒక గ్రామానికి ప్రచారం అందలేదూ అంటే ఆ గ్రామంనుంచి మనకు రావలసిన ప్రేక్షకులూ, తద్వారా డబ్బూ రాలేదన్నమాట.

ప్రదర్శన రోజున గేట్లుదగ్గర ఎలాంటి అల్లరులూ లేకుండా సరైన కట్టు బాటులు చేయించాలి. గేటు బాధ్యులను సరైన వారిని నిర్ణయించాలి.

అంతేకాదు- మనం ప్రదర్శించబోయే ప్రదేశంలో కళాకారులనూ, కళా పోషకులనూ, ప్రదర్శనానికీ రమ్మనమని ఆహ్వానించడం మంచిది. ఇదొక మంచి సాంప్రదాయం. ఇందువల్ల కళాకారులమధ్య సత్సబంధాలు గలగటం, ఒకరి కొకరు పరిచయులవ్వడం జరిగి తద్వారా వారి అమూల్య అభిప్రాయాలనూ, సలహాలనూ పొందడానికి అవకాశముంటుంది. ఇలాంటి కార్యక్రమాన్ని కార్యదర్శి ఏర్పాటు చేయాలి.

సమాజం సంచారానికి బయలుదేరిన తరువాత బాధ్యలన్నీ కార్యదర్శిమీదే ఆధారపడి వుంటాయి. అవసరమైతే ఇతరులను సహకారులుగా నియమించుకోవాలి.

సహనం, ఓర్పు

అవసరమైన సౌమ్యోపండాలి:

సహనం, ఓర్పు, శాంతం మొదలైన సద్గుణాలు మన కార్యదర్శికి వుండాలి. కార్యదర్శి పనులు ఎంతోమంది మీద ఆధారపడి యుంటాయి. అనేక తత్వాలు గల వ్యక్తులుంటారు. వా రందరినీ సంతృప్తిపరచాలి. వారితో చక్కగా విషయాలను చర్చించాలి. ఎవరిచెప్పే విషయం వారికి నచ్చచెప్పగల శక్తి సామర్థ్యాలు కార్యదర్శికి వుండాలి సమాజ సభ్యులంచరికీ కార్యదర్శి అంటే ఎంతో గౌరవం వుండాలి. ఇలాంటి గౌరవం పొందాలంటే కార్యదర్శి నటీ నటుల ఆదరాభిమానాన్ని చూరగొనాలి. సభ్యులకు విశ్వాసంలేని కార్యదర్శి ఏ పనీ చేయలేడు. నాటక సమాజంయొక్క ఆదరాభిమానాలను పొందగలిగినవాడే సరియైన కార్యదర్శి. సమాజం సంచారం చేస్తున్నప్పుడంతా ముఖ్యంగా సమాజం సభ్యులందరూ, కార్యదర్శి చెప్పినప్రకారం ప్రయాణం చేయడం మంచిది. ఎవరు ఎక్కడికి కదిలినా ఒక టీమ్‌లాగా వుండాలి. ఏటికొకరూ, కోటికొకరూ పోగూడదు. ఇలా ఎవరికి వారు ప్రయాణం చేయడంవల్ల క్రమశిక్షణ నాశనమై. ఎవరెక్కడికి వెళ్ళిందీ, ఎవరెప్పుడు వచ్చేదీ తెలియను. అందరూ అన్ని ప్రక్కలనుంచీ కంట్రాక్టు నటకుల్లా దిగటం చాల శోచనీయం. పైన వివరించిన సూత్రాలూ, సలహాలూ ఏ నాటక సమాజమైనా పాటించవచ్చు. కిరాయి నటకులకు మాత్రం ఈ పద్ధతి నచ్చకపోవచ్చు.

కార్యదర్శి మాటే వినాలనేది ఒక శాసనంగా నేను చెప్పడంలేదు. మనం పదిమందీ ఒక పద్ధతిప్రకారం పోవాలనుకున్నప్పుడు ఆ పద్ధతులకు సంబంధించిన క్రమశిక్షణలో అందరూ నడుచుకోవాలి. శఃవిధానాలనూ, ఈ పద్ధతులనూ ఎంతో ఆదర్శప్రాయంగా తీసుకుని సంచరించినప్పుడే సమాజ గౌరవం నిలబడుతుంది.

———

# 24

# ప్రదర్శనం

## నాటక మందిరాలు



నాటకమందిరాలు, నాటక ప్రదర్శన పరిమాణం, నాటక మందిరాల్లో న్యాయపద్ధతులు, ధ్వని, ప్రతిధ్వని, ధ్వనితీవ్రత, ప్రదర్శన సమయాలు, ప్రదర్శనం, గేటుల బాధ్యత, ప్రదర్శనం, అల్లరి వ్యాపారం

# నాటక మందిరాలు

మొత్తం ఆంధ్రదేశంలో ఈ నాడు నాటక ప్రదర్శనాలకు పనికి వచ్చే నాటక మందిరాలు ప్రేళ్ళమీద లెక్కించవచ్చు. నాటకం ఎంత బాగా ప్రదర్శించగలిగినా అందుకు అనువుగా రంగస్థలంగాని, ప్రేక్షక గృహ నిర్మాణంగాని సరిగా వుండాలి. అలా వున్నప్పుడే ప్రేక్షకులు ప్రదర్శనాన్ని చూచి ఆనందించగలుగుతారు.



నటీనటులు సంభాషణలు మాట్లాడుతూ వుంటే ప్రతిధ్వనులు వచ్చి, మాట్లాడే సంభాషణలన్నీ గజిబిజిగా వుండి ఏ సంభాషణా అర్థంకాక పదిమంది కలిసి ఒకేసారి మాట్లాడినట్లుంది. ఇంపువల్ల ప్రదర్శనం ఏ మాత్రం రక్తికట్టకపోగా చెడిపోతుంది.

అలాగే కొన్ని నాటక మందిరాలలో నటీనటులు ఎంత బిగ్గరగా మాట్లాడినా ప్రేక్షకులందరికీ నాలుగు మూలలకూ సరిగా వినిపించకుండా హీనస్వరంతో మాట్లాడినట్లూ, ఎక్కడో నూతిలో మాట్లాడినట్లూ మూగ మాటల్లాగా వినిపిస్తూ వుంటాయి. ఇంపువల్ల కూడ ప్రదర్శనాలు దెబ్బ తింటున్నాయి.

నాటక మందిరంలో ఎప్పుడూ ప్రతిధ్వనులూ, హీనధ్వనులూ మొదలైన అసౌకర్యపరిచే లక్షణాలు లేకుండా నటీనటుల సంభాషణలుగాని, పాడేపాటలుగాని, సంగీత వాయిద్యాలుగాని, సులభంగానూ, శ్రావ్యంగానూ, శ్రోతలందరికీ అన్ని మూలలకూ వినిపించే నాటకమందిరం సరైన మందిరమని చెప్పవచ్చును.

## నిర్మాణంలోనే నివారించవలసిన
## విపత్తులు :

ఇంపుకు నాటక మందిర నిర్మాణంలోనే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పొడవూ, వెడల్పూ, ఎత్తూ, గోడల నిర్మాణం-వీటన్నిటినీ నిపుణులైన ఇంజనీర్లు ద్వారా పట్టించేటట్లయితే పైన చర్చించిన దుష్ఫలితాలు ఏ మాత్రం కలుగవు.

నాటక మందిరం నిర్మాణానంతరం ఎటువంటి ప్రతిశబ్దాలు వస్తున్నాయో జాగ్రత్తగా పరిశీలించి ప్రతిశబ్దం రాకుండా గోడలకు దళసరి అట్టలను అమర్చి గాని లేక చుట్టూ మందపు గుడ్డను అమర్చిగాని ప్రతిశబ్దాలను అరికట్టవచ్చు. అలాగే హాలులోపలి పై భాగంలో కూడ, అట్టల బాల్కనీని నిర్మించాలి. అలా కానట్లయితే, మాట్లాడే సంభాషణలన్నీ పైకిపోతాయి. అందుకే మన స్టేజీల పైభాగంలో కొందరు కుండలు బోర్లిస్తూ వుంటారు. శబ్దం పైకిపోకుండా ప్రతిశబ్దం క్రిందికి వచ్చేలాగున కూడ ఈ ఏర్పాటు వుపయోగపడుతుంది.

ఏ ప్రక్క కూర్చున్నా పక్కాగా
ప్రదర్శనం చూడాలి :

అంతేకాక ప్రేక్షకులు కూర్చున్న స్థానంకంటే రంగస్థలం సరియైన ఎత్తులో నిర్మించాలి. ఏ మూల కూర్చున్న ప్రేక్షకుడైనా, దూరాన కూర్చున్న ప్రేక్షకుడైనా ప్రదర్శనాన్ని తేలిగ్గా చూడగలిగేటట్లుండాలి.

నేటి కొన్ని రంగస్థలాల్లో ప్రదర్శనం జరుగుతూవుంటే ఆ ప్రక్క- ఈ ప్రక్క- కూర్చున్నవారు సరిగా ప్రదర్శనాన్ని చూడలేరు. అంటే ప్రవేశాలూ, నిష్క్రమణలూ సరిగా కనబడవు. ముందు ప్రక్క సైడ్ కర్టన్ను నిర్మించేటప్పుడు ప్రదేశ నిష్క్రమణాలూ మొత్తం ప్రదర్శనం అందరికీ అందుబాటులో వుండేటట్లుగా నిర్మించాలి.

కొన్ని రంగస్థలాల్లో ఎక్కువ ఖరీదుగల టిక్కెట్లు కొన్నవారు మెడలు బాగా ఎత్తుకుని నాటక ప్రదర్శనాన్ని చూడాల్సివస్తుంది. ఇది ప్రేక్షకులకు చాలా బాధాకరంగా వుంటుంది. స్టేజి ఎత్తుకు తగిన సీట్లను అమర్చగలిగితే ప్రేక్షకులకు ఈ బాధ తప్పుతుంది.

ముఖ్యంగా నాటక మందిరానికి పెద్ద పెద్ద కిటికీలు వుండడం అంత మంచిది గాదు. కారణం వెలుపలినుండి వచ్చే ప్రతిధ్వనులన్నీ తేలికగా వినబడుతాయి. తలుపులన్నీ మూసి నాటకం ప్రారంభిస్తే లోపలి శబ్దాలు బయటకుగాని, బయటకు శబ్దాలు లోపలికిగాని వినపడవు.

తగినంత దూరంలో
గ్రీన్‌రూమ్ ఏర్పాటు :

అనేక నాటక మందిరాల్లో గ్రీన్ రూములంటూ వుండవు. కేవలం వింగ్సు

ప్రక్క, పాత్రలు ప్రవేశించే ప్రదేశానికి అడ్డంగా కూర్చుని మేకప్ చేసుకోవాల్సి వస్తుంది. ఇందువల్ల ఒక ప్రక్క ప్రదర్శనం జరుగుతూవుంటే, ఇంకో ప్రక్కన రంగులు వేసుకునే వారి రణగొణ ధ్వనులు వినబడుతూ వుంటాయి. ప్రవేశ నిష్క్రమణాలకు అడ్డుగా కూర్చోవడంవల్ల ఆయా సందర్భాల్లో వేగంగా ప్రవేశించాల్సిన నిష్క్రమించాల్సిన సంఘటనలు చాల నీరసంగా వుంటాయి.

రెండు మూడు లక్షలు ఖర్చుపెట్టి నాటక ప్రదర్శనశాల నిర్మించినా, చివరికి గ్రీన్‌రూమ్ విషయంలో లోభించి హాలు వెనుక భాగంలో ఏదో రేకులతో ఒక వసారా లాగుతారు. అది కూడ ఎంతో ఇరుకుగా వుండి నటకులకు చాల ఇబ్బంది కరంగా వుంటుంది. మరికొన్ని నాటక మందిరాల్లో గ్రీన్‌రూమ్ను హాలుకు సంబంధం లేకుండా వుంటాయి. ఇందువల్ల కూడ చాల ఇబ్బందిగా వుంటుంది. పాత్రలు వెంట వెంటనే ప్రవేశిస్తూవుండాలి కాబట్టి గ్రీన్‌రూమ్ స్టేజికి ఒక భాగంగానే వుండాలి.

ఆనందంగా చూడడానికి
అనువైన ఆసనాలు:

అలాగే నాటక మందిరాల్లో ప్రేక్షక స్థానాలను గూర్చి ఎక్కువ శ్రద్ధను తీసుకోవాలి. వారు ప్రదర్శనం ఆహ్లాదంగా ఆసాంతం చూచే అవకాశముండాలి, హాలు నిర్మాణంలో ఎక్కువ డబ్బును ఆర్జించే కాంక్షకొద్దీ సీటింగును ఎక్కువ చేయగూడదు. ఇలా చేయడంవల్ల ప్రేక్షకులు ఎన్నో ఇబ్బందులకు గురి అవుతారు. క్రిక్కిరిసిన ప్రేక్షకులు ఎంతో బాధతో ప్రదర్శనాన్ని చూడాల్సి వస్తుంది. ఇలా బాధ పడి చూచిన ఏ ప్రేక్షకుడూ ప్రదర్శనం బాగా వుందని చెప్పలేడు.

సీటింగ్ నిర్మాణంలో కనీసం కాలు మడుచుకునేటంత స్థలం కూడ లేకుండా వరుసమీద వరుసలను ఏర్పాటు చేస్తారు. ఇందువల్ల ప్రేక్షకులు కాలకృత్యాలకు, ఇతర అవసరాలకు ఒకసారి బయటకు వెళ్ళి రావాలంటే కష్టమైపోతుంది. ఒకరి నెత్తిమీద ఒకరు కాళ్ళు పెట్టాల్సివస్తుంది. అందువల్ల ప్రేక్షకులు కూర్చునే సీటింగ్ వరుసల్లో ఒక వరుసకూ మరో వరుసకూ కొంత ఖాళీ వుండడం అవసరం. కూర్చోవడానికి నాటకమందిరంలో సరియైన స్థానాలు లేనప్పుడు నాటక ప్రదర్శనానికి సరియైన వాతావరణాన్ని ప్రేక్షకులు కలిగించలేరు. ప్రతి ప్రదర్శన

శాలలోనూ మంచి ఫర్నిచర్ వుండాలి. ఏదో లాభాలకోసం ఆశించి అసౌకర్యాలతో సీటింగ్ ఏర్పాటుచేస్తే ప్రదర్శనం చూచినంతసేపూ ప్రేక్షకులు బాధపడవలసి వస్తుంది.

### ఉల్లాస వాతావరణంలో మందిర నిర్మాణం :

నాటక మందిరం చుట్టుప్రక్కల మంచి వాతావరణం వుండాలి. ఈ నాడు కొన్ని మందిరాలు క్రిక్కిరిసిన జనసమ్మర్దం వున్న ప్రాంతాల్లోనూ, ఇరుకుసందుల్లోనూ, ఫ్యాక్టరీలకు, రైల్వేలైనుకు ప్రక్కగానూ వుంటున్నాయి ఇందువల్ల ప్రదర్శనం జరిగినంతసేపూ ఫ్యాక్టరీ కూతలూ, ఇంజన్ల మ్రోతలూ వినబడడంవల్ల ప్రేక్షకులదృష్టి మరో ప్రక్కకు మరలడానికి అవకాశముంది. అందువల్ల హాలును నిర్మించేముందే ఇలాంటి ఇబ్బందుల నన్నిటినీ సరిచూచి నాటక మందిరాలను నిర్మించాలి.

### బయలు ప్రదేశంలో హాలు నిర్మాణం :

ప్రదర్శనకాలంలో కేవలం ఫాన్స్‌మీదే ఆధారపడకుండా మందిరంలోకి ధారాళంగా గాలివచ్చే ఏర్పాటులను కూడ దృష్టిలో పెట్టుకోవాలి. పంకాల ద్వారా వచ్చే కృత్రిమమైన గాలిని చాలమంది ప్రేక్షకులు భరించలేరు. అంతేగాక సమ్మర్దం ఎక్కువగా వున్నప్పుడు గాలి బయటకు తేలికగాపోయే మార్గంలేక, గాలి వేడెక్కిపోయి ప్రేక్షకులకు హాయిని కూర్చకపోగా వుక్కబెట్టి బాధిస్తుంది. బయలు ప్రదేశంనుంచి స్వేచ్ఛగా గాలివచ్చే ప్రదేశంలో హాలును నిర్మించాలి. హాలు పరిసరాల్లో మంచి చెట్లనుగాని, పూలమొక్కలనుగాని నాటడం మంచిది. ఇందువల్ల ప్రేక్షకులు హాయినిచ్చే గాలిని పొందగలుగుతారు.

ఇంత జనసమ్మర్దం కలిగిన నాటక మందిరాలలో బీడీలు, సిగరెట్లు కాలుస్తూ పొగ వదులుతారు. ఇందువల్ల ప్రేక్షకులు ఎంత బాధపడతారో చెప్పలేం. హాలులో దయచేసి పొగ త్రాగవద్దు అని బోర్డులు కనబడుతున్నా నిర్లక్ష్యం చేస్తూనే వున్నారు.

నాటక మందిరంలో ఈ పొగను బయటికి లాగగలిగిన పంకాలను గోడల్లో

అమరిస్తే చాలవరకు ఈ పొగ బాధ తగ్గుతుంది. ఏమైనా పొగ త్రాగరాదనే నియమాన్ని ప్రేక్షకులు పాటించడం చాలా మంచిది.

పరిశుభ్రతను పాటించాలి :

అంతేగాక ఇలా పొగ త్రాగినవారు ఎక్కడబడితే అక్కడ మందిరమంతా వుమ్మితో నింపేస్తారు. ఇందుకు సరియైన ఏర్పాట్లు హాలు యజమానులు కల్పించాలి. వీలైనన్ని వుమ్మితొట్లను ఎక్కువ తావుల్లో నిర్మించాలి. ప్రేక్షకుడు హాలులో ప్రవేశించింది మొదలూ, ఇక్కడ వుమ్మివేయకూడదనే వాతావరణాన్ని కల్పించాలి.

అలాగే మరుగుదొడ్ల నిర్మాణం సరిగా వుండాలి. అవి ప్రేక్షక స్థానాలకు తగినంత దూరంగా వున్నప్పుడు ఎలాంటి దుర్వాసనా ప్రేక్షకుల రాకుండా చేయాలి. నాటక మందిరం ఎంత బాగుంటే ప్రదర్శనం అంత బాగుంటుంది.

నాటక మందిరాలను నిర్మించే ఆర్థిక స్తోమతులేని ప్రదేశాల్లో స్టేజిని మాత్రం చక్కగా నిర్మించి, ప్రేక్షక స్థానాలను బహిరంగ ప్రదేశంలో వేయడం మంచిది. ఇలాంటి రంగస్థలాలు వేసవిలో నిర్మించడం బాగుంటుంది.

మూడు గంటల ప్రదర్శనం
ముచ్చటగా చూడాలి :

ఏ థియేటరైనా ప్రేక్షకునియొక్క మానసిక స్థాయికి, శరీర సౌభాగ్యానికీ ఎక్కువ అవకాశాలను థియేటరు యజమానులు కల్పించాలి. మూడు నాలుగు గంటలకాలం ప్రేక్షకులను ముగ్ధులనుచేసే వాతావరణం కల్పించడం థియేటరు యజమానులమీద ఆధారపడి వుంటుంది. ప్రదర్శనం ఎంత మంచిదైనా మందిరం సరిగా లేకపోతే చాలమంది ఆ ప్రదర్శనానికి రాకపోవడం జరుగుతుంది.

ప్రదర్శనాని ముందుగా వచ్చిన ప్రేక్షకులు కూర్చోవడానికీ, క్యూలో నిలబడడానికీ తగినంత స్థలాన్ని ప్రేక్షకులకు వసతిగా కల్పించాలి. మందిరం చుట్టూ సిమెంటు బెంచీలనూ, చిన్నరోడ్లనూ, పూలమొక్కలనూ నాటటంద్వారా అదో స్వర్గంలోవున్నట్లు ప్రేక్షకులను మరపించేటట్లుగా వున్ననాడు ప్రదర్శనాలు కూడ ఎంతో బాగుంటాయి.

### వ్యాపారదృష్టితో పాటు కళాదృష్టి కావాలి:

హాలు యజమానికి కేవలం వ్యాపారదృష్టే కాకుండా, కళాదృష్టి, ప్రదర్శనాన్ని జయప్రదం చేయాలనే విశాలదృష్టి వుండాలి. ప్రేక్షకులకు తగిన సౌకర్యాలను కలిగించి వారి మెప్పును పొందేటట్లుగా వుండాలి. అందువల్ల వ్యాపారం కూడా బాగుంటుంది. అలాంటి నాటక మందిరాలకు మంచి పేరు ప్రతిష్టలుంటాయి. అప్పుడే నాటక మందిరాలు కళానిలయాలై వెలుగొందుతాయి.

## నాటకప్రదర్శన పరిమాణం

### అనాటి ప్రదర్శనలు:

ఒకనాడు ఆంధ్ర ప్రేక్షకులు నాటకప్రదర్శనాలు తెల్లవార్లూ ప్రదర్శిస్తే గాని తృప్తిపడేవారు కాదు. అందుకు వుదాహరణగా మనవీధి భాగవతాలనూ, బొమ్మలాటలనూ, బుఱ్ఱకథలనూ తీసుకుంటే సరిపోతుంది. రాత్రి 9 గంటలకు ఆట ప్రారంభిస్తే భళ్ళున తెల్లవారేవరకూ ప్రదర్శనం జరిగి తీరాల్సిందే. అప్పటికిగాని ప్రేక్షకులు తృప్తిపడేవారు కారు. అనాటి నాటకాలు కూడా రాత్రి 10 గంటలకు ప్రారంభించి తెల్లవారుఝామున 3 లేక 4 గంటల వరకూ కూడ ప్రదర్శించేవారు. నాటకాలుకూడ అంత దీర్ఘంగా వుండేవి. చిత్రనళీయం, కన్యాశుల్కం, ప్రతాపరుద్రీయం లాంటి నాటకాలు రెండు రాత్రులకు సరిపోయేటంత పెద్ద నాటకాలు. అందువల్ల వాటిని ప్రదర్శించాలంటే ఏ సమాజమూ ధైర్యంతో ముందుకు వచ్చేది కాదు. అలాంటి నాటకాలు ప్రదర్శనయోగ్యం కూడా కావు. ఈనాడు 8 అణాలతో మూడు గంటల కాలంలో ఎన్నో చిత్రవిచిత్రాలతో సినిమాచూసే ప్రేక్షకులకు దీర్ఘకాల ప్రదర్శనా పరిమాణం ఏమీ ప్రయోజనంలేదు.

### పద్యనాటకాల పరిమాణం తగ్గాలి:

అంతేగాక ఈనాటి మన పద్య నాటకాలలో కూడా ప్రదర్శనా పరిమాణం ఎక్కువగానే వుంది. పద్య నాటకాలలో పద్యాలు పాడడం ప్రారంభిస్తే వరుసగా

నాలుగు పద్యాలు పాడటం విసుగుగా కూడా వుంటుంది. అందువల్ల కొన్ని పద్యాలను తగ్గించుకుని ప్రదర్శించాలి. ఏ నాటకమైనా విరామ సమయాలతో కలుపుకుని మూడున్నర గంటలకు ప్రదర్శనాకాలం మించకుండావుంటే అది ప్రేక్షకులకూ, నటీనటులకూ కూడా ఎంతో వుపయోగం. అందువల్ల నటీనటుల ఆరోగ్యం చెడదు. నిద్రాభంగం కలుగదు. అలాగే ప్రేక్షకులు కూడ ప్రదర్శనానంతరం ఇంటికిపోయి హాయిగా నిద్రపోయి మరునాడు వారివారి పనులు చూచుకోవడానికి అవకాశం కలుగుతుంది.

పద్య నాటకాలలోనూ, పెద్ద నాటకాలలోనూ ఒక లోపం కూడా జరుగుతూ వుంది. ఒక్కొక్కప్పుడు సమయానుకూలంగా నటులు కొన్ని పద్యాలను తగ్గించడంవల్లా, కొన్ని పేజీలను లాగివేయడంవల్లా, కొన్ని రంగాలను ఎగరగొట్టి నాటకాన్ని ప్రదర్శించడంవల్లా, నాటకంయొక్క వరుస క్రమం పోయి, నాటకరక్తి తగ్గిపోతూంది. ఇందువల్ల ఎంత మంచి నాటకమైనా రసహీనమౌతుంది.

ప్రేక్షకులతత్వాన్ని అనుసరించి
పరిమాణం వ్రాయాలి:

కనుక ఈనాటి ప్రేక్షకుల మనస్తత్వాల ననుసరించి వారి అభిమతాల కనుగుణంగా తగిన అభిరుచులతో, నాటక రచనలో మార్పు తీసుకువచ్చి రచనలు సాగించాలి. ఎంతవరకు ప్రదర్శనానికి యోగ్యమో అంతవరకే నాటకాన్ని వ్రాసుకోవాలి. ఇందుకు రచయితలు ఎక్కువ బాధ్యత వహించాలి.

ఒకపెద్ద నాటకాన్ని వ్రాసుకుని దానిని కుదించి ప్రదర్శించాలంటే, నాటక రచయితకు గాని ప్రదర్శకులకు గాని ఎటువంటి ప్రయోజనమూ కలుగదు. కనుక మన ప్రదర్శనకు కావలసిన పరిమాణప్రకారం నాటకం వ్రాయించుకోవాలి.

అంతేకాక నేటి సాంఘిక నాటకాల్లో రెండు గంటలకు మించని నాటకాలు కూడ అనేకం వస్తూవున్నాయి. ఇదికూడా అంత మంచిదికాదు. సాంఘిక నాటకాలలో పాటలూ, పద్యాలూ అసలే తక్కువ. దానికి తగినట్లు ప్రదర్శనకాలం రెండు గంటలే అయితే ప్రేక్షకులను ఏ విధంగానూ తృప్తిపరచలేము.

నాటకం కనీసం మూడు గంటలకాలం ప్రదర్శించేదిగా వ్రాయించుకోవడం మంచిది. అందుకు తగిన కథను ఎన్నుకుని, వేగంగా సీన్లు పరుగెత్తే పద్ధతిలో

వ్రాయించుకోవాలి. అవసరమనుకుంటే కొద్ది మార్పులతో పిసిమూలో సీన్సులాగా చిన్నచిన్న రంగాలుగా విభజించుకోవడం మంచిది. సన్నివేశాల అవసరాన్నిబట్టి సంగీతాన్ని ప్రవేశపెట్టాలి. ఈ విధానాన్ని తమిళనటులు అక్షరాలా పాటిస్తున్నారు. వారి నాటకాలలో 60 లేక 70 సీన్లు వరకూ వుంటాయి. ఇందువల్ల మధ్యవిరామం ఎక్కువ వుండదు. నాటకం పరుగెత్తుంది.

# ప్రదర్శన, సమయాలు

నాటక ప్రదర్శనం ప్రదర్శించే కాలాన్నిబట్టే విజయవంత మౌతుంది. నేటి నాటక ప్రదర్శనాలలో రాత్రి 10 గంటలకు ప్రదర్శించే ప్రదర్శనాలే ఎక్కువగా వుంటున్నాయి. అవి అయినా సకాలానికి ప్రదర్శిస్తున్నారా అంటే అదీ లేదు. నాటకం 10 గంటలకని ప్రకటించడం, తీరా ప్రదర్శించేసరికి 12 గంటలు కావడం, 9 గంటలకే వచ్చి కూర్చున్న ప్రేక్షకులు విసుగుజెందడం, నిద్రపోవడం జరుగుతూంది.

## పదిగంటలకు ప్రదర్శనం ప్రారంభం కావాలి:

నాటకం 10 గంటల కనుకుంటే సరిగా అదే సమయానికి తెరలేచిపోవాలి. అందుకు ముందుగానే నటీ, నటులు అన్నిపనులూ ముగించుకుని సిద్ధంగా వుండాలి.

పగలల్లా ఆఫీసుల్లో పనిచేసిన వుద్యోగులూ, షాపుగుమాస్తాలూ, ఫ్యాక్టరీ కూలీలూ, ఇతర వృత్తులవారూ, పల్లెలైతే రైతులూ, కూలీలూ, పగలంతా వారి వారి వృత్తుల్లో మునిగి రాత్రిళ్ళు ప్రదర్శనానికి తాపీగావచ్చి ఒంటి గంటవరకూ వుండి, మూడు గంటల నాటక ప్రదర్శనాన్ని చూచి నిద్రాభంగం లేకుండా మరునాడు కార్యకలాపాలకు హాజరవుతారు. అలా కాకుండా ఏ 12 గంటలకో ప్రదర్శనం ప్రారంభిస్తే నిద్రాభంగమై మరునాడు పనులు చేసుకోవడంలో బద్ధకస్థులై పనులు మానుకోవడం జరుగుతుంది.

ప్రేక్షకుల వసతినిబట్టి
ప్రదర్శన సమయాలు :

ఏ ప్రాంతాల్లో నైనా ఆయా ప్రజల వృత్తుల ననుసరించి వారి విశ్రాంతి సమయాలను వృష్టిలో పెట్టుకుని ప్రదర్శన సమయాలను నిర్ణయించుకోవాలి.

ఇందువల్ల ప్రదర్శనాన్ని చూడడానికి ఎక్కువమంది ప్రేక్షకులు రావడానికీ, ప్రదర్శనకారులకు ఆర్థిక విజయం కలగటానికి అవకాశముంటుంది. ఒకసారి సకాలానికి జయప్రదంగా ప్రదర్శనాన్ని ప్రారంభిస్తే, మరలా ఆ ప్రదర్శనానికి కనక వర్షం కురుస్తుంది. తద్వారా ప్రదర్శకులపట్ల సానుభూతి కలిగి సమాజ ప్రతిష పెరుగుతుంది.

సరియైన సమయం :

ఇప్పుడిప్పుడే కొన్ని పట్టణాల్లో సాయంత్రం 6 గంటలకే సినిమాలాగా నాటకాన్ని ప్రారంభిస్తున్నారు. ఇందువల్ల కూడ ఏ మాత్రం నిద్రాభంగం కలుగ కుండా, ఆరోగ్యాలు చెడకుండా ప్రదర్శించవచ్చు. కాని ఏ పరిస్థితుల్లోనూ మ్యాటినీ ప్రదర్శనాలు ఇవ్వకూడదు. నాటక ప్రదర్శనం పగటి సమయంలో ప్రదర్శించడం ఏ మాత్రం మంచిది కాదు. ముఖ్యంగా రంగోద్దీపనం దెబ్బ తింటుంది. వచ్చే పోయేవారు తలుపులు తెరవడంవల్ల బయట కాంతి లోపలికొచ్చి ప్రదర్శనం పేలవ మౌతుంది. ఏ ప్రదర్శనానికైనా రాత్రి సమయమే మంచిది. సాధ్యమైనంతవరకు ఎక్కువమంది ప్రదర్శనానికి వచ్చే అవకాశాన్నే కలిగించాలి. అనుకున్న సమయానికి ఖచ్చితంగా ప్రదర్శనాన్ని ప్రారంభించాలి. అందుకు కావాల్సిన హంగులన్నిటినీ ముందుగానే సమకూర్చుకోవాలి.

# నాటక మందిరాల్లో న్యాయపద్ధతులు

నాటకమందిరాల్లో న్యాయపద్ధతుల్ని తప్పకుండా అమలు జరిపినప్పుడే అది సరియైన నాటకప్రదర్శనా మందిరంగా వెలుగొందుతుంది. ముఖ్యంగా బహిరంగ ప్రదర్శనాల్లో చాలా అన్యాయాలు జరుగుతూ వున్నాయి. మన వర్ణవ్యవస్థల ననుస రించీ, జాతిమతవిభేదాల ననుసరించీ, ముఖ్యంగా హరిజనులేకాక, తక్కువజాతుల

వారందరు కొంచెం దూరంగానే కూర్చోవాలి. ఈ పద్ధతి ఈనాటికీ బహిరంగ ప్రదర్శనాల్లో చూస్తూనేవున్నాం.

అందరికీ
మందిరాల్లో ప్రవేశం :

వ్యాపార సరళిలో టిక్కెట్లు పెట్టి ప్రదర్శించే ప్రదర్శనశాలల్లో కూడ ఇలాంటి అన్యాయాలు ఎన్నో జరుగుతున్నాయి. భోజనహోటళ్ళు, కాఫీహోటళ్ళు, బస్‌లు, రైళ్ళు, పఠనాలయాలు అందరికీ ఎలా అందుబాటులో వుంటాయో అలాగే నాటకమందిరాల్లో కూడ ఎలాంటి అభ్యంతరాలు లేకుండా సర్వప్రజలకూ అవకాశాన్ని కల్పించాలి. ఇలా కల్పించని ఏ యజమానిపైనైనా అభియోగం తేవచ్చును.

ముఖ్యంగా నాటకశాలల్లో ప్రేక్షకస్థానాలు కాళీగా వున్నప్పటికీ ఖాళీలేదంటూ కొందరు రేట్లను పెంచేస్తున్నారు. అకదేకాక తక్కువరేటు టిక్కట్లన్నీ ఐపోయిన వని చెప్పి తాత్కాలికంగా ఆ టిక్కెట్ల అమ్మకం ఆపుచేస్తున్నారు. ఇందువల్ల ఆ టిక్కెట్లు కొనడానికి వచ్చిన ప్రేక్షకుడు గత్యంతరం లేక, అంతకంటే హెచ్చురేటుపెట్టి టిక్కట్టు కొని ప్రదర్శన చూచిపోతున్నాడు.

కంట్రాక్టర్ల కక్కుర్తి :

ఇలా హెచ్చురేటు టిక్కెట్లన్నిటినీ ముందుగా అమ్మేసి త్వరగా డబ్బు చేసుకోవాలనే కాంక్షతో తక్కువరేట్లు గల స్థానాలున్నప్పటికీ వాటిని అమ్మడం లేదు. అందువల్ల ప్రేక్షకులు ఎంతో బాధపడిపోతున్నారు. ఈ పద్ధతివల్ల డబ్బున్న వ్యక్తిమాత్రం పైరేటు టిక్కెట్టుకొని ప్రదర్శనం చూడగలుగుతున్నాడు. తక్కువరేటు టిక్కెట్టుతో ప్రదర్శనం చూడాలనుకున్న ప్రేక్షకుడు ఆశాభంగాన్ని పొందుతున్నాడు.

ఈ పద్ధతిని చాలామంది కంట్రాక్టు నాటకాలవారు చేస్తున్నారు. ఈ విధానాన్ని హాలు యజమానులుగాని ప్రభుత్వంవారుగాని ఆమోదించగూడదు, హద్దు మీరి ప్రవర్తించేవారిపై ఆశాభంగాన్ని పొందిన ఏ ప్రేక్షకుడైనా అభియోగం తేవడానికి చట్టంలో హక్కులు కలిపించాలి. ఒక ప్రదర్శనానికి టిక్కెట్లన్నీ ఐపోతే,

ఐపోయినవని బోర్డు కట్టవచ్చు, లేదా వెంటనే మరో ప్రదర్శనం ప్రదర్శించి ప్రేక్షకులకు అలాంటి అవకాశాన్ని కలిగించాలిగాని ఇలా డబ్బుదాహంతో దోపిడిచేసే వారి చర్యలను అరికట్టాలి.

మరికొన్ని చోట్ల నాటకాన్ని ఎవరు ప్రదర్శిస్తున్నారో వారి తాలూకు మనుషులు ముందుగానే ఎక్కువగా టిక్కెట్లుకొని హెచ్చు ధరలకు బ్లాకు మార్కెట్ చేస్తున్నారు. ఇలా చేసేవారిని చట్టప్రకారం శిక్షించాలి.

సమయానుకూలంగా
సగం రేట్లు హెచ్చింపు :

అంతేకాక సమయానుకూలంగా రేట్లు హెచ్చిస్తున్నారు. నాటక ప్రదర్శనానికి ఎక్కువమంది ప్రేక్షకులు రావడం గమనించి అన్ని తరగతుల టిక్కెట్ల ఛార్జీని పెంచేస్తున్నారు. ఇలా రేటు పెంచడంవల్ల ప్రేక్షకులు అనేక ఇబ్బందులకు లోనైపోతున్నారు. ఎప్పుడూ నాటక ప్రదర్శనకారులు ప్రేక్షకుల్ని ఉత్సాహపర్చాలేగాని, సీట్లు వుంచుకుని సీట్లు లేవనడం, తక్కువ రేటు టిక్కెట్లు లేవని హెచ్చు రేట్లు కొనిపించడం, సమయానుకూలంగా రేట్లు పెంచడం ఏ మాత్రం మంచిది కాదు. ఇది పచ్చి వ్యాపారదృష్టి. ప్రేక్షకులయొక్క సానుభూతిని త్వరగా కోల్పోవడం తప్ప మరోమార్గం కాదిది. ఇలా సంచరించే నాటక మందిర యజమానిని కాని, సమాజ బాధ్యునికాని నేరస్థుడుగా పరిగణించాల్సి వస్తుంది. ఇందుకు ప్రభుత్వం కూడ చట్టం చేయాలి.

అందరికీ అవకాశం
కల్పించాలి :

కొన్ని థియేటర్లలో అయిష్టులైన వారికి టిక్కెట్లు అమ్మకపోవడం: లేవని చెప్పడం జరుగుతూంది. ఇది చట్టవ్యతిరేకం. ఒక ప్రదర్శనం అది బహిరంగంగాని, డబ్బుకు సంబంధించిందిగాని, ధారాళంగా ప్రతివారికీ చూచే అవకాశం కల్పించాలి.

అంతేకాక ప్రదర్శనానికి వచ్చిన ప్రేక్షకుడు టిక్కెట్టు కొన్న తరువాత కారణాంతరాలవల్ల ఆ ప్రేక్షకుడు బయటికి వెళ్ళిపోవాలనుకున్నప్పుడు. అంటే

ప్రదర్శనానికి ముందు-అటువంటి వారికి టిక్కెట్టు వాపస్ తీసుకుని డబ్బివ్వాలి. అది న్యాయం కూడాను. కాని నేటి నాటక మందిరాలలో అలా వాపస్ ఇవ్వడం జరగడం లేదు.

హాలు నిండినా అదనపు తొక్కిడి :

నాటక మందిర యజమానులూ, సహూజబాధ్యులూ, సీట్లు నిండిపోయిన తరువాత కూడా అదనపు ఛార్జీలకు టిక్కెట్లు అమ్మి సీట్లలో కూర్చున్న ప్రేక్షకులకు అసౌకర్యాన్ని కలిగిస్తున్నారు. ప్రదర్శనాన్ని ఒక సంతలాగా తయారుచేస్తున్నారు. ఎవరైనా కానివ్వండి, హాలులోవున్న ప్రేక్షకస్థానాలు నిండిన తరువాత, అదనంగా ఒక్క టిక్కెట్టు కూడ అమ్మకూడదు. అవసరమైతే మరుసటి రోజున మరో ప్రదర్శనం ఇవ్వడంగాని, వెంటనే రెండవ ప్రదర్శనం ప్రదర్శించడంగాని చేయడం మంచిది.

రౌడీతనం కూడదు :

ఇక ప్రేక్షకులకు సంబంధించిన న్యాయపద్ధతుల్ని కూడ మనం విచారించాలి. ప్రదర్శనం చూడడానికివచ్చిన ప్రతి ప్రేక్షకుడూ ప్రదర్శనాన్ని జయప్రదం చేయాలే గాని, దానిని ఏ విధంగానూ అల్లరిపాలు చేయడానికి ప్రయత్నించకూడదు.

నాటకంలో అనేక రసాలు ఉత్పన్నం అవుతూవుంటాయి. వాటి నన్నిటినీ ప్రేక్షకుడు అనుభవించవచ్చును. విచారదృశ్యాల్లో ఏడ్వడంగాని, హాస్యదృశ్యాల్లో నవ్వడంగాని చేయవచ్చును. కాని, నటీ నటుల్ని హేళన చేయడం, అతిగా కేకలు వేయడం, ఈలలు కొట్టడం, మారు పేరులతో పిల్చి అవమానించడం, వస్తుమోర్లు కొట్టడం అదేపనిగా చేస్తూవుంటారు. ఇటువంటి వారిని చట్ట సమ్మతంగా వారించడంగాని, బయటికి పంపించడంగాని చేయాలి.

అల్లరి మూకల ఆట కట్టించాలి :

అంతేకాకుండా సమాజాల్లోనూ, నటీ నటుల్లోనూ ఒకరిని చూస్తే, రెండవ వారికి మంట. అలాంటివారు పనిగట్టుకుని వచ్చి ఒక గుంపుగా ఒకే చోటచేరి వారి ఇష్టం వచ్చినట్లు మంచికీ, చెడుకీ అల్లరిచేస్తూ, వారి కక్షినంతా అక్కడే వెలి

గ్రక్క్ ప్రదర్శనాన్ని నానా బీభత్సంచేసి ఇతర ప్రేక్షకులకు అసౌకర్యాలనూ, ఆశా భంగాన్ని కలిగించి, ప్రదర్శనంపట్ల వేరు పురుగులుగా ప్రవర్తిస్తున్నారు. ఈ విధంగా మొత్తం ప్రదర్శనాన్నే దెబ్బ కొడుతున్నారు. ఇలాంటి సంఘద్రోహుల్ని చట్టరూపంలో శిక్షించాలి. లేదా పోలీసుల సహాయంతో మెడపట్టి బయటికి గెంటించాలి. ఇటువంటి వారి విషయంలో దయా, కరుణా ఏ మాత్రం పనికిరాదు. అంతే గాక టిక్కెట్లు కొనకుండా నేను ఆ వూరికి రాడీనని, ఈ పేటకు రాడీనని, పెత్తందారునని గ్రూపుల్ని కూడగట్టుకుని, గేట్లు క్రోసుకుని కొంతమంది హాజరవుతారు. అటువంటి వారిని కూడ అరికట్టాలి.

[illegible]

[illegible] :

ఇలా నాటక మందిరాల్లో న్యాయపద్ధతుల్ని అవలంబించేటప్పుడు ప్రభుత్వ సహాయం-పోలీసు సహాయం పొందవచ్చును. కాని అది పోలీసు జులుంగా మారకూడదు. కొన్ని ప్రదర్శనాల్లో రక్షకభటులుగాగాక భక్షకులుగా వుంటున్నారు. మరి కొంతమంది ఉద్యోగులు, టిక్కెట్లు కొనకుండా ప్యాసులు పంపమని వారి జవాన్లను పంపుతూ వుంటారు. ఇలా పెద్ద తరగతి టిక్కెట్లన్నీ వీరే హరిస్తారు. ఇలా ఏ వుద్యోగీ ప్రవర్తించ కూడదు.

ఇక ప్రదర్శించే నాటకాలు నిషిద్ధాలనుకుంటే వాటిని ప్రదర్శనకాలమందు కాక, ముందుగానే అటువంటి వాటిని నిషేధించడం చేయాలే కాని లేదా ప్రదర్శనానికి తయారైన తరువాత, ప్రభుత్వం తలపనికి పూనుకో కూడదు. ఇలా న్యాయ పద్ధతుల్ని గురించి ఎంతో వ్రాసుకుపోవచ్చు. కాని ఎవరి బాధ్యతలు వారు నిర్వహించినప్పుడు ఎవరూ అనవసర జోక్యాలు కలిగించుకోవలసిన అవసరం వుండదు. ఈ విషయాన్ని అందరూ ఎంత త్వరగా గమనిస్తే అంత మంచిది

## ప్రదర్శనం గేటుల బాధ్యత

నాటకప్రదర్శనం జరుగుతూ ఉండగా కొంతమంది ప్రేక్షకులు ఏవో పనులు ముగించుకుని, కొంచెం ఆలస్యంగా నాటకప్రదర్శనాలకు హాజరవుతూవుంటారు.

మరికొందరు నాటకం ఇంకా పది నిమిషాల్లో ప్రారంభిస్తారనగా హాజరవుతూ వుంటారు. ఇంకా కొందరు నాటకం 10 గంటల కనుకుంటే 9 గంటలకే హాలు బయట హాజరవుతారు.

ఇలా ప్రదర్శనాలకు హాజరయ్యే ప్రేక్షకులకు తగిన సౌకర్యాలను కలుగజేసే బాధ్యత గేట్లదగ్గర నిలబడేవారిమీద ఆధారపడివుంది.

అందరినీ ఆప్యాయంగా
ఆహ్వానించాలి :

అనేక ప్రదర్శనాలు కేవలం గేట్లవద్ద గలాటాలవల్లకూడా అల్లరుల పాలై పోతున్నాయి. గేట్లవద్ద టిక్కెట్లు వసూలుచేయడమే అతని బాధ్యత కాదు. ఎంతో ఓర్పుతోనూ, శాంతంతోనూ ప్రవర్తించాలి.

హాలులోకి ప్రవేశించేవారిని జాగ్రత్తగా వారివారి సీట్లకు పంపాలి. వారడిగే ప్రశ్నలకు చక్కగా సమాధానాలు చెప్పాలి. కొంతమంది గేట్లవద్ద టిక్కెట్లు లేకుండా గేటువారిని మోసంచేసి దౌర్జన్యం ఉపయోగించి లోనికి రావడానికి ప్రయత్నిస్తూ వుంటారు. అలాంటి వారిద్వారా ప్రదర్శనానికి ఏవిధమైన భంగం వాటిల్లకుండా వారిని పంపివేయడంగాని, పోలీసులకు అప్పగించడంగాని చేయాలి.

కొంతమంది ప్రేక్షకులు వారి వారి స్థానాలవద్ద దెబ్బలాడుకుంటూవుంటారు. ఇటువంటివారిని కూడా శాంతంగా కూర్చోబెట్టి ప్రదర్శన విజయానికి గేట్లనిర్వాహకులు తోడ్పడాలి.

ప్రదర్శనానికి వచ్చే ప్రేక్షకుల్లో అనేక వర్గాలవారూ, అనేక మనస్తత్వాలు గలవారూ ఉంటారు. వీరందర్నీ ఎంతో జాగ్రత్తగా, వారి వారి స్థానాలకు పంపించాలి.

మరుగు దొడ్లకు ప్రేక్షకులు ఏ ప్రక్కకు పోవాలో, గేటు నిర్వాహకులు వారికి సూచనలిచ్చి మార్గాలు చూపాలి. హాలుయొక్క పరిశుభ్రతను ప్రదర్శన కాలంలో వీరే చూడాలి. గేటు బాధ్యులు ఎంత క్రమశిక్షణతోవుంటే ప్రేక్షకులుకూడ అంత క్రమశిక్షణతో ఉంటారు.

ఇటువంటివారిని విసర్జించాలి :

ప్రదర్శనాలకు అనేకమంది స్త్రీలు వస్తూఉంటారు. వారిపట్ల అసభ్యంగా ప్రవర్తించే గేటుబాధ్యులు అనేకమంది ఉన్నారు. కొంతమంది స్త్రీలతో కావాలని అనవసర ప్రసంగాలకు దిగటం, వారిని ఆకర్షించటానికి ప్రయత్నించటం, ఆకర్షించిన వారిని కొన్ని టిక్కట్టుకంటే పైతరగతికి పంపించటం, ఒకవేళ వారు తిరగబడితే వారితో కయ్యానికి దిగటం-ఈ విధమైన అనేక అసహ్యకరమైన సంఘటనలు వీరి వల్ల జరుగుతూ ఉన్నాయి.

అనేకమంది స్త్రీలు పిల్లలతో వ్యయప్రయాసల కోర్చి ప్రదర్శనశాల కొస్తే హాల్లో వుండే ఇటువంటివారి బాధలకు కూడా గురికావాల్సివస్తోంది.

ముఖ్యంగా స్త్రీల గేటుల్లో స్త్రీలనే నియమించడం మంచిది. అక్కడ పురుషుల్ని ఏవిధంగానూ సంచరించకుండా చూడాలి. లేదా కనీసం వయస్సుమళ్ళినవారిని, శాంతస్వభావులని నియమించాలి. స్త్రీల గేటుల్లో ఏ పరిస్థితుల్లోనూ యువకుల్ని నియమించడం మంచిది కాదు.

జేబుదొంగల్ని జాగ్రత్తగా చూడాలి :

స్త్రీల గేట్లవద్ద అనేక దొంగతనాలు జరుగుతూవుంటాయి. తల్లులు పిల్లల్ని ఎత్తుకుని హాల్లో ప్రవేశించేసమయంలో కొంతమంది స్త్రీలే. జడకుప్పెలూ, నాగరాలు, మెడలో గొలుసులు కత్తిరించడం, పిల్లల చేతిగాజులు జారదీయడం చేస్తూవుంటారు. ఇలాంటివారిని గేటుబాధ్యులు జాగ్రత్తగా పట్టివేయాలి. పురుషుల గేట్లవద్దకంటే స్త్రీల గేటుల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ రద్దీలో పిల్లలు మారిపోతూవుంటారు. అలాంటివారిని జాగ్రత్తగా ఓదార్చి వారి తల్లిదండ్రులవద్దకు వెతికి పంపించాలి.

గేటుల్లో నుంచి ప్రేక్షకులు ఆటూ, ఇటూ పోయే వత్తిడిలో అనేకమంది జేబుదొంగలు పర్సులు కొట్టేస్తూవుంటారు, అలాంటివారిని సయితం పట్టుకుని పోలీసులకు అప్పగించేటంత సమర్థులు గేటుల్లో వుండాలి.

ప్రదర్శనసమయంలో ముందుగానే గేట్లు తెరచి ప్రేక్షకుల్ని లోనికి పంపించ కూడదు. నాటకం 30 నిమిషాల్లో ప్రారంభ మౌతుందనగా పంపడం మంచిది.

లేనట్లయితే ప్రదర్శనం ఏ 10 గంటలకో అనుకుంటే వీరు 9 గంటలకే ప్రవేశించి ప్రదర్శనం త్వరగా ప్రారంభించమని కేకలు ప్రారంభిస్తారు. అందుకే ప్రదర్శనం అనుకున్న సమయానికి ప్రారంభించాలి. అలా జరిగిననాడు ప్రదర్శనాలు ఏమాత్రం దెబ్బతినవు.

## ప్రదర్శన, అల్లరివ్యాపారం

నాటక ప్రదర్శనం చూడడానికి వచ్చే ప్రేక్షకులలో చాలామంది నాటక ప్రదర్శనాన్ని శాంతియుతమైన వాతావరణంలో చూసి ఆనందించడానికే వస్తారు. ఒక్కొక్క ప్రదర్శనం కనీసం 3 గంటల కాలమైనా తీసుకుంటుంది. ఈ కాలంలో ప్రతి ప్రేక్షకుడూ ఎంతో ఓపికగా వారి వారి స్థానాల్లో కూర్చోవాల్సి ఉంటుంది.

ప్రశాంతంగా
ప్రదర్శనం చూడాలని వస్తారు:

ప్రదర్శనానికి వచ్చేవారిలో అనేక వర్గాలకు సంబంధించిన ప్రేక్షకులుంటారు. కేవలం కళాదృష్టితో ప్రదర్శనాన్ని చూడాలనుకునేవారు, పట్టణమైతే దినమంతా ఆఫీస్లోనూ, షాపుల్లోనూ, ఫ్యాక్టరీల్లోనూ పనిజేసేవారు, ఏదో కొంత ఆనందం కోసం వినోదించడానికి వస్తారు. అదే పల్లె అయితే దినమంతా పొలంలో కష్టపడి రెక్కలు ముక్కలుచేసుకున్న రైతు కూలీలు, వినోదకాలక్షేపం కొరకూ, విశ్రాంతికొరకూ, మరి కొంతమంది వారి మానసిక ఆవేదనలు మరచిపోవడం కొరకూ-ఈ విధంగా అనేక తరగతులకు చెందినవారూ, అనేక మనస్తత్వాలు కల వారూ ప్రదర్శనాన్ని శాంతియుతంగా చూడాలనుకుంటారు.

చిల్లర వ్యాపారంతో
హాలంతా అల్లరి:

కాని, నాటకప్రదర్శనం ప్రారంభించకపూర్వమే హాలంతా పెద్ద రణగొణ ధ్వనులతో నిండిపోతుంది. ముఖ్యంగా కిళ్లీ, సోడా, బీడీ, సిగరెట్, కాఫీ మొదలైన వాటితో కుర్రవాళ్ళు హాలంతా గందరగోళంలో ముంచేసి, ఓ పెద్ద సంతగా మార్చివేస్తున్నారు.

అంతేగాదు, ప్రదర్శన మధ్యలో ఒక అంకానికి మరో అంకానికి మధ్య నున్న విరామసమయం ఎక్కువ అవడం, ఆ సమయంలో ఈ చిల్లరవ్యాపారుల విజృంభణతో, మంచి రక్తిలో నడిచే నాటకప్రదర్శనం కుంటుపడిపోవడం జరుగు తుంది.

ఏది ఏమైనా కేకలతో కూడిన చిల్లరవ్యాపారంద్వారా థియేటరును యమ లోకంగా తయారుచేస్తున్నారు. అంతేకాదు, ఇలా అమ్మే అమ్మకాల్లో కుట్టివాళ్ళు పోటీయి పడి మరీ కేకలు వేస్తూవుంటారు. కూర్చున్న ప్రేక్షకుల కాళ్ళు త్రొక్కు కుంటూ అందమైన చెప్పులూ, బూట్లూ కొట్టేస్తూవుంటారు. ప్రదర్శనసమయంలో ప్రేక్షకులు ఏదో ఒక సంఘటనలో మునిగిపోయి ఒడలు మరచివున్నప్పుడు జేబుల్లో పర్సులు కాజేయడం, జేబులు కత్తిరించడం చేస్తూవుంటారు.

### ఆవరణలో ఆంగడి పెట్టాలి :

నిజంగా ప్రేక్షకులకు పైన వివరించిన సదుపాయాలు అవసరమే, కాని వాటిని ప్రేక్షకుల మధ్య కేకలు వేయించేకంటే హాలుబయట కాఫీ, సోడా కాంటీ న్లను ఏర్పరచడం, కిళ్లీ, సిగరెట్ షాపులను ఏర్పరచడంద్వారా ఎవరికి కావల సిన అవసరాలకు వారు బయటికి లేచివెళ్ళి తెచ్చుకుంటారు. ఇలాంటి సదుపాయం వున్నప్పుడు కావలసిన వాటిననన్నిటినీ ముందే తెచ్చుకుంటారు. ఒంటికీ, రెంటికీ బయటికి వెళ్ళి కాలక్షేత్యాలు తీర్చుకున్నట్లే పైన అవసరాలను ఈ విధానంద్వారా తీర్చవచ్చును.

ఇక్కడ మరో ఇబ్బందికూడ లేకపోలేదు. ప్రతి థియేటరు యజమాని తన స్వలాభం కొరకు సీట్లు పెంచాలనే చూస్తాడు. అంతేకాక ప్రేక్షకులు అధికమైతే గేట్లల్లో నిలబెడతాడు. ఇలాంటి పరిస్థితుల్లో బయటికి వెళ్ళిరావడం ఒక ప్రమాదమై పోతుంది. సాధ్యమైనంతవరకు థియేటరు యజమానులు సీట్లు ఒక లైనుకూ మరోలైనుకు సాధ్యమైనంత దూరంలో వుంచినట్లయితే స్వేచ్ఛగా ప్రేక్షకులు అటూ ఇటూ తిరగడానికి అవకాశముంటుంది. అలాంటప్పుడు ఎవరికి కావలసిన వస్తు వులకొరకు వారే యథేచ్ఛగా వెళ్ళి తెచ్చుకోవచ్చును.

ఈనాడు పట్టణాల్లో కొన్ని థియేటర్లు పైన సూత్రాలను అమలుపరుస్తు

న్నారు. కొన్నిచోట్ల హాలు ఆవరణలోనే కాంటీన్లు నిర్మించారు. ఎవరికి ఏమి కావాలో వారే అక్కడికి ప్రశాంతంగా పోయివస్తారు.

ఎవరికి కావలసినవి
వారే తెచ్చుకుంటారు:

మరికొన్ని థియేటర్లలో ఈ కిల్లీ, బీడీ, సిగరెట్లు అమ్మే కుట్టివాళ్ళు ఏ విధమైన కేకలూలేకుండా ప్రశాంతంగా క్రమశిక్షణతో ప్రతివరుసకూ, ఆ ప్రక్కనుంచి ఈ ప్రక్కకు ఏ ఒక్క ప్రేక్షకునికీ బాధ కలుగనీయకుండా నడుస్తూ వుంటారు. ఎవరికి కావాల్సినవి వారు తీసుకుని డబ్బులు ఇచ్చివేస్తూవుంటారు. ఇందువల్ల ప్రదర్శనానికి ఏ మాత్రం భంగం కలుగదు. ఒకవేళ సీను మధ్యలో మనకే సోడా గాని, కాఫీగాని అవసరమనుకుంటే మెల్లగా తెచ్చిఇచ్చి ఆ అంకం అయ్యేవరకూ కూర్చుని తరువాత ఆ గ్లాసులు తీసుకుపోతారు. ఇలాంటి వ్యాపారంవల్ల ఏ విధమైన అభ్యంతరాలు లేకపోగా ప్రేక్షకులకు ఎంతో సదుపాయంగా కూడా వుంటుంది. ఈ విధానాన్ని అన్ని ప్రదర్శన మందిరాలు అనుసరించిననాడు ప్రదర్శన మందిరాలు శాంతిమందిరాలై వెలుగొందుతాయి. ఆనాడు నాటకం గాని, సినిమాగాని వర్ధిల్లుతుంది. ఆనాడు ప్రేక్షకులు కూడా మంచి క్రమశిక్షణతో నడువ గలుగుతారు. ప్రదర్శనాలకు చేయూతనిచ్చి కళామతల్లిని పోషిస్తారు. ఇందుకు థియేటర్ యజమానులు ఆత్యంత శ్రద్ధ తీసుకోవాలి. అల్లరిమూకలకు నిలయాలన్న పేరును పోగొట్టి శాంతి ప్రదర్శనమందిరాలుగా తయారైనాడు థియేటరు పాలకులు మనకు ఆవశ్యకులు.

## బహిరంగ నాటక ప్రదర్శనశాల

ప్రభుత్వ సంస్థలు పూనుకోవాలి:

నాటకప్రదర్శనాలకు కట్టుదిట్టమైన నాటకమందిరా లున్నప్పటికీ ప్రతి ముఖ్య పట్టణంలోనూ ఇరువదివేలమంది ప్రేక్షకులు చూడగలిగిన ఓపెన్ ఎయిర్ థియేటరు నిర్మాణం అవసరము. ఆయా మున్సిపాలిటీలుగాని, కార్పొషరేషన్లుగాని, పంచాయితీబోర్డులుగాని, లేదా ప్రభుత్వంగాని పూనుకున్నట్లయితే ఇలాంటి థియేటర్లు తేలిగ్గా పూర్తిచేయ గలుగుతారు.

ఒక నాటకమందిరం నిర్మాణంకంటే ఈ ఓపెన్ ఎయిర్ థియేటరు చాల తక్కువ వ్యయంతో నిర్మించవచ్చును. కట్టుదిట్టమైన ఒక నాటక మందిరంలో రెండువేలమంది ప్రేక్షకులకన్నా ఎక్కువమంది ప్రదర్శనాన్ని చూడలేరుకాని, బహిరంగనాటక ప్రదర్శనాలలో దాదాపు ఒకే ప్రదర్శనాన్ని కొన్నివేలమంది చూడగలుగుతారు. ఇలాంటి బహిరంగ నాటక ప్రదర్శనాలు పల్లెల్లో ఎక్కువ జరుగుతూవుంటాయి. పల్లెల్లో పెద్దఖర్చు లేకుండా ప్రదర్శనాన్ని పూర్తిచేయడం మనకు తెలిసిందేకాని, పట్టణాల్లో బహిరంగ ప్రదర్శనశాల కొంచెం కట్టుదిట్టంగా నిర్మించాలి. మామూలు నాటక మందిరాల్లో నాటకప్రదర్శనాలు చూడలేని అనేకమంది ప్రేక్షకులకు అందుబాటులో ప్రదర్శనా లీయవచ్చు.

తక్కువ రేట్లతో
ఎక్కువమందికి అవకాశం:

బహిరంగ ప్రదర్శనశాలంటే ఉచిత నాటక ప్రదరన్శాలని కాదు. తక్కువ రేట్లతో ఎక్కువ మంది ఉత్తమ ప్రదర్శనాన్ని చూడగలుగుతారు. అందుకు అనువైంది ఓపెన్ ఎయిర్ థియేటరే.

వర్షం వచ్చే సమయాలను తప్పిస్తే బహిరంగ స్థలాల్లో ఎప్పుడూ నాటకాలను ప్రదర్శించవచ్చును. అదే రంగస్థలంలో పెద్ద పెద్ద బహిరంగ సభలు జరుపుకోవచ్చు. నాయకుల ఉపన్యాసాలు వినవచ్చు. తక్కువ ఖర్చుతో ఎక్కువ మంది ప్రజాసామాన్యానికి వుచిత ప్రదర్శనాలీయవచ్చు. ఇందుకు అనువైంది ఓపెన్ ఎయిర్ థియేటరు ఒక్కటే.

ఈ థియేటరు నిర్మాణానికి స్థానిక సంస్థలు పూనుకోవాలి. పట్టణాల్లో థియేటరుకు కావలసిన అనువైన స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేయాలి. ఆ రంగస్థలం మామూలు రంగస్థలంకన్నా విశాలమైనదిగా వుండాలి.

———



# 25

# అనుబంధం



ముప్పది నంవత్సరాలనాడు -యువజనోద్యమంపై రష్యా ప్రభావం, రష్యన్ నాటకాలు, తెలుగు అనువాదాలు, రష్యానాటకరంగం,గోపాలరాయశర్మ వ్యాసాలు-స్టానిస్లవిస్కీ రచనలు, శ్రీనివాస చక్రవర్తి అనువాదాలు, పాశ్చాత్య నాటకరంగం

# తెలుగు నాటకరంగంపై రష్యా నాటకాల ప్రభావం

ఆంధ్రనాటక రంగంమీద ఆంగ్ల నాటకరంగ ప్రభావంతోపాటు సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్ ఏర్పడిన తరువాత అప్రతిహతంగా పురోగమించిన రష్యన్ నాటకరంగ ప్రభావం కూడా పడింది.



నూతన శకం :

మానవజాతి జీవితంలో అర్ధ శతాబ్దం నిజంగా అత్యల్ప కాలం. కాని సోవియట్ విప్లవం 50 ఏళ్ళలో ప్రపంచ చరిత్రలో బ్రహ్మాండమైన మార్పు తీసుకు వచ్చింది. నూతన సమాజాన్ని నెలకొల్పింది. నూతన మానవుని సృష్టించింది. నూతన సంస్కృతిని ఏర్పరచింది. ప్రపంచ మంతటిలోనూ విప్లవాత్మకమైన మార్పు తీసుకువచ్చే శకాన్ని ప్రవేశపెట్టింది.

భవిష్యత్తుకు బాటలువేసిన ఉజ్వల నటులు :

వెనుకటితరానికి చెందిన కళాకారులు సోవియట్ నాటక రంగాన్ని ఉత్సాహంతో నిర్మించారు. ప్రపంచ కళాకారుల నాకర్షించిన స్టానిస్లవిస్కీ మాస్కో ఆర్టు థియేటరు రంగ స్థలం మీదికి సైనిక శకటాన్ని నడిపించాడు. మేయర్ హోల్డు అక్టోబరు విప్లవ అరుణ పతాకాలను రంగస్థలంమీద ఎగురవేశాడు. ఇతర కామ్రేడ్స్ అయిన "సుచిఖిన్" ఖమెలేవ్—అలెగ్జియేవా—బతలోవ్—పావెన్నయా—పోవ్‌నదో వస్కీ సైపన్ కుజ్నెత్సోవ్—వాగిన్—కొవొరోవ్ మొదలైన ప్రసిద్ధ నటులు విప్లవంలో పోరాడిన సోవియట్ ప్రజల పాత్రలను రంగస్థలంమీద నటించి ధన్యులయ్యారు.

నెమిరోవిచ్—దంచెంకో—వఖ్తాంగోవ్—మర్జానిష్విలి—తయిరోవ్—సొచినోవ్—గొలువనోవ్—రైజోవా—గ్నాతీయురా—చెర్కసోవ్—ల్యూబి

మోవ్ మొదలైన ప్రముఖ కళాకారులు ఉత్సాహంతోనూ, పట్టుదలతోనూ, సోవియట్ నాటకరంగాన్ని నిర్మించారు. సోవియట్ నాటక కళకు ప్రపంచఖ్యాతిని గడించి పెట్టిన వీరంతా కాలగర్భంలో కలిసిపోయ్యారు.

సోవియట్ నాటకరంగం అందరి సమిష్టి కృషి. ప్రజల జీవితాన్నీ, వారి సాంఘిక ఆశయాలనూ ప్రతిబింబించే సోవియట్ నాటకరంగం ప్రజలందరికి చెంది నదై వుండడమేకాక అనేక విధాలుగా వారి చేతనే నెలకొల్పబడింది.

ముప్పది సంవత్సరాల క్రితం :

30 సంవత్సరాలక్రితం వరకూ సోవియట్ రష్యా నాటక సాహిత్యంయొక్క ఇంగ్లీషు అనువాదాలు అందరికీ అందుబాటులో వుండేవికావు. కాని సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్‌యొక్క విప్లవ పోరాటాలు, వీరోచితమైన విప్లవగాధలు, విప్లవానంతరం రష్యన్ ప్రజలు సాధించిన ఘనవిజయాలు, సాంఘిక ఆర్థిక రంగాల పురోగమనం ప్రపంచ ప్రజలందర్నీ ఆకర్షించాయి. ఆయా దేశాల యువకుల్నీ, విద్యార్థుల్నీ ఉత్తేజపరచినట్లే ఆంధ్రయువకుల్ని కూడా వుత్తేజపర్చాయి.

ఆకర్షించిన సోషలిస్టు
మూలసూత్రాలు :

ఆనాడు జాతీయ కాంగ్రెసులోవున్న అనేకమంది యువకుల్ని రష్యా సోషలిస్టు మూలసూత్రాలు వుత్తేజపర్చాయి. రష్యన్ విప్లవాన్నిగురించీ. సోషలిజాన్ని గురించీ, కమ్యూనిస్టు విధానాలనుగురించీ, నాటకరంగాన్ని గూర్చి తెలుసుకోసాగారు. అందుకోసం అన్వేషణ సాగించారు. అందుకు అవసరమైన గ్రంథాలకొరకు తహ తహ లాడారు. టాల్‌స్టాయి, మాక్సింగోర్కీ, చెకోవ్, పుష్కిన్ మొదలైన ప్రసిద్ధ రచయితల రచనలు.కొద్దికొద్దిగా అందుబాటులోవుండి, అవి చదివిన వారం దరూ రష్యన్ సాహిత్యంపైన ఆసక్తి చూపించి చదవడం మొదలుపెట్టారు. ఆ విధానాలను అనుసరించారు. తెలుగులోకి అనువదించారు.

ది ఫస్ట్ డిస్టిలర్ :

ఉధృతంగా సాగుతున్న భారతజాతీయ వుద్యమంలో, గాంధీజీ ఆదర్శాల

ప్రబోధం ప్రజలను ఎక్కువగా ఆకర్షించింది. గాంధీ బోధనల్లో మద్యపాన నిషేధం ముఖ్యమైంది.

ఈ ప్రబోధంకోసం టాల్‌స్టాయి "ది ఫస్ట్ డిస్టిలర్" నాటికను శతావధాని వేలూరి శివరామ శాస్త్రిగారు "ప్రథమ పాంధికుడు" అనే పేరుతో అనువదించారు. ఈ నాటిక 1921 జనవరి భారతిలో ప్రచురించబడింది. తరువాత అది పుస్తక రూపంలో వెలువడింది.

కరకుని కాలగతి:

అదే నాటికను 1933 సంII రంలో జాతీయోద్యమంలో జైలుకి వెళ్ళివచ్చిన గద్దె లింగయ్యగారు "కర్షకుని కాలగతి" అనే పేరుతో అనువదించి ప్రచురించారు. తిరిగి అదే నాటికను 1941 లో "కలిమాయ" అనే పేరుతో ప్రకటించారు. దీనిని బట్టి టాల్‌స్టాయి "ది ఫస్ట్ డిస్టిలర్" మూడు పేర్లుతో మూడుసార్లు ముద్రణ పొందిందన్నమాట.

హరీంద్రనాథ ఛటోపాధ్యాయ
అనుభవాలు :

1938 ప్రాంతంలో హరీంద్రనాథ ఛటోపాధ్యాయ ఆంధ్రదేశంలో పర్యటిస్తూ సోవియట్ రష్యాలో తమ పర్యటన వివరాలను, మాస్కో ఆర్ట్ థియేటరు గొప్పతనాన్ని గురించి, రష్యన్ నాటక ప్రదర్శనాలను గురించీ అనేకచోట్ల ఉపన్యసించారు. అదే సమయంలో కమలాదేవి ఛటోపాధ్యాయ త్రివేణి మొదలైన పత్రికల్లో సోవియట్ నాటకరంగ విశిష్టతను గురించి పరంపరగా వ్యాసాలు వ్రాశారు.

యువజనోద్యమం -
రష్యా ప్రభావం:

అవి ఆంధ్రదేశంలో యువజననోద్యమం ఉరకలువేస్తూ ముందుకు నడుస్తున్న రోజులు. సోషలిస్టు భావాలు వ్యాపిస్తున్న రోజులు. రష్యన్ సాహిత్యం చదవాలని ఉవ్విళ్ళూరుతున్న రోజులు. ద్వితీయ ప్రపంచయుద్ధం ప్రారంభం అవడం

వల్లను ఇంగ్లండు, రష్యాలకు మైత్రి కుదరడంవల్లనూ, రష్యన్ సాహిత్యం క్రొల్లలుగా రావడం ప్రారంభమైంది. ఆంధ్రదేశంలో ముంగండలో మహీధర సోదరులు "విశ్వసాహిత్యమాల"ను స్థాపించి, రష్యన్ సాహిత్యాన్ని తెలుగులోకి అనువదించి ప్రచురించడం ప్రారంభించారు.

రష్యన్ నాటకాలూ,
తెలుగురచయితల అనువాదాలు:

ఈ దశలో 1940 లో, షొలకోవ్ "బ్రెడ్" అనే నాటకాన్ని మహీధర రామమోహన్ "పల్లెటూళ్ళలో" అనే పేరున అనువదించి ప్రకటించారు.

అదే సంవత్సరంలో "ట్రిషియనోవ్" నాటకం "చీనా రోదనం" అనే పేరుతో శ్రీ తల్లావఝుల కృత్తివాస తీర్థులు అనువదించారు. నవశక్తి ప్రచురణాలయం ప్రచురించింది.

1943వ సంవత్సరంలో అలెగ్జాండర్ అఫినజినేవ్ "ఫియర్" నాటకాన్ని మహీధర రామమోహన్‌గారు "భయం" అనే పేరుతో వెలువరించారు.

ప్రజా నాట్యమండలి
ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం:

ద్వితీయ ప్రపంచయుద్ధం ప్రారంభమై ఫాసిస్టుశక్తులు ప్రళయ తాండవం సాగిస్తున్న రోజుల్లో ఫాసిస్టులకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక శక్తుల్ని బలపరుస్తూ ఆంధ్రదేశంలో యుపజనోజ్యమం ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం సాగించింది. తద్వారా ప్రజానాట్యమండలి స్థాపించబడింది. "వీరటాన్యా" "జోయా" "నటాషా" మొదలైన వీరవనితలగాధల్ని బుర్రకథలుగాచెప్పి రష్యన్ వీరనారుల త్యాగాన్ని ఆంధ్రదేశమంతటా ప్రచారంచేసి ఫాసిస్టులకు వ్యతిరేకంగా ప్రజల నుత్తేజపర్చారు.. అనేకమంది అభ్యుదయ కొమ్ముకులైన యువకవులు ఎట్టిసైనికుల త్యాగాలను, రష్యన్ ప్రజల విజయాలను కీర్తిస్తూ అనేక గేయాలను నాటికలను, వీధిభాగవతాలను వ్రాసి ప్రచారం చేశారు.

1943 లో తుమ్మల వెంకటరామయ్యగారు "అనటాల్ గ్లెబోవ్" వ్రాసిన

"ఇంగా" నాటకాన్ని అనువదించి, 1943 ఫిబ్రవరిలో తెనాలిలో జరిగిన అభ్యుదయ రచయితల మహాసభలో ప్రదర్శించారు. కాని ఈ నాటకం అచ్చు కాలేదు. కాని అదే నాటకాన్ని మహీధర రామమోహన్ "స్త్రీ" అనే పేరుతో అనువదించి ప్రకటించారు.

1946లో మహీధర జగన్‌మోహనరావుగారు "అయోనిడ్ అమొనివ్" రచించిన "ఇన్వేజన్" నాటకాన్ని "బలిదానం" అను పేరుతో అనువదించి ప్రకటించారు.

## రష్యా నాటకరంగంపై గోపాలరాయశర్మ వ్యాసాలు:

1944 లో కొండముది గోపాలరాయశర్మగారు ఆంధ్రప్రభ దినపత్రికలో రష్యన్ నాటకరంగాన్ని గురించీ, రష్యా నటనా పద్ధతులను గురించీ, మాస్కో అర్టథియేటరును గురించీ వక్తాంగోవ్, ఒక్లోవ్ సిద్ధాంతాలను గురించీ, మాస్కో ఆర్టథియేటరుకు భిన్నమైన మేయర్ హోల్డును గురించీ కామెర్నీథియేటరును గురించీ, రష్యా నాటక మందిరాలను గురించీ, స్టానిస్లవిస్కీ సిద్ధాంతాలనుగురించీ, విపులంగా ఎన్నో వ్యాసాలను వ్రాశారు. ఆ వ్యాసాలు అనాడు అంధ్ర దేశంలో అనేకమంది ప్రసిద్ధ నటులనూ, కళాకారులనూ, ముఖ్యంగా అమెచ్యూర్ నటీనటులను ఆకర్షించాయి. ఆ విధానాలను చాలమంది నటులు ఆచరణలో పెట్టారు. రష్యా నాటకరంగాన్నిగురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఎక్కువైంది.



ప్రపంచ ప్రఖ్యాతివహించిన ప్రసిద్ధ రష్యన్ నటుడు చెర్కాసోవ్

## స్వతంత్ర భారతం :

1947 లో భారత దేశానికి స్వాతంత్ర్యం లభించడంతో రష్యా భారత దేశాలమధ్య రాజకీయ సంబంధాలు ఏర్పడ్డాయి. ఆనాటినుంచీ ఆంధ్రదేశంలో రష్యన్ రాజకీయాలమీదా, సాహిత్యంమీదా విశేషంగా ఆదరాభిమానాలు ఏర్పడ్డాయి.

ఆనాడు ఆంధ్రదేశంలో అమెచ్యూర్ నాటక సమాజాలు విరివిగా స్థాపించ బడటంతో రష్యన్ నాటకరంగాన్ని గురించి తెలుసుకోవాలనే ఆసక్తి యువ రచ యితలలో, నటులలో ఎక్కువైంది. వరుసగా రష్యన్ నాటకాలను అనువదించడం ప్రారంభించారు.

## అనువాదకులైన ఆంధ్రరచయితలు :

సుప్రసిద్ధ రష్యన్ నాటక రచయితలైన మాక్సిమ్‌గోర్కీ—గొగోల్—చెకోవ్—పుష్కిన్—సిమొనోవ్—ఇల్యా ఎహ్రెన్‌బర్గు నాటకాలను శ్రీనివాస చక్రవర్తి, విద్వాన్ విశ్వం, శ్రీ శ్రీ, ఉన్నవ లక్ష్మీనారాయణ, నిడదమర్తి అశ్వినీ కుమారదత్తు, రెంటాల గోపాలకృష్ణ, మానేపల్లి తాతాచార్య, బెల్లంకొండ రామ దాసు, సోమంచి యజ్ఞన్నశాస్త్రి, గిడుతూరి సూర్యం మొదలైనవారు అనువ దించారు.

3 చెకోవ్ నాటకాలు—మూడు గోర్కీ నాటకాలు—ఒకటి గొగోల్ నాట కం—ఒకటి టాల్‌స్టాయి నాటిక—పుష్కిన్ నాటిక ఒకటి—తదితర రచయితలవి 10—మొత్తం 19 నాటకాలు తెలుగు అనువాదాలుగా వెలువడ్డాయి.

టాల్‌స్టాయ్ "లివింగ్ కార్ప్స్"ను బెల్లంకొండ రామదాసు "జీవచ్ఛవం" అనే పేరుతో అనువదించారు. కాని అచ్చు కాలేదు.

గొగోల్ ఇన్‌స్పెక్టర్ జనరల్ నాటకాన్ని నలుగురు అనువదించారు. 1 రెంటాల, 2 బెల్లంకొండ రామదాసు, 3 గిడుతూరి సూర్యం, 4 సోమంచి యజ్ఞన్న శాస్త్రి. మొదటి మూడు అనువాదాలు ఆంధ్రనాటక రంగంమీద విజయవంతంగా ప్రదర్శింపబడి ప్రేక్షకుల మన్ననలను పొందాయి.



పుష్కిన్ నాటకం "హౌవటస్నైట్"కు శ్రీనివాస చక్రవర్తిగారి అనువాదం విజయవాడ రేడియోకేంద్రం శ్రవ్యనాటకంగా ప్రసారం చేసింది.

చక్రవర్తిగారు గోర్కీ "పతితజీవులు", చెకోవ్ "సీటికాకి", పుష్కిన్ "లోభి" "అతిధి" "కిలాడి" మొదలైన రష్యన్ నాటకాలను అనువాదం చేశారు.

రష్యన్ కథలను, నవలల్లోని చిన్న చిన్న సంఘటనలను, ఇతివృత్తాలను ఆధారంగా తీసుకుని అనేకమంది నాటకాలను, నాటికలను వ్రాశారు.

ఉదాహరణకు పి. వి. రాజమన్నార్‌గారి నిష్ఫలం అనే నాటికకు, చెకోవ్‌కథ కోరస్‌గరల్ ఆధారం.

ఆచార్య ఆత్రేయ భయంలోనూ, బెల్లంకొండ రామదాసు పునర్జన్మలోనూ టాల్‌స్టాయ్ "రిసరెక్షన్", "ఫియర్"ల ప్రభావం గోచరిస్తుంది.

స్టానిస్లవిస్కీ రచనలు-
శ్రీనివాస చక్రవర్తి శ్రద్ధ :

అమెచ్యూర్ నాటకరంగం అభివృద్ధిచెందటం మూలంగా రష్యన్ నాటక అభినయలక్షణాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస యువకులలో ప్రబలింది. స్టానిస్లవస్కీ రచనలు అధ్యయనం చేయసాగారు.

నటులందరికీ అందుబాటులో వుండేలా "బొలెస్లవస్కీ" రచించిన యాక్టింగ్ ది ఫస్ట్ సిక్స్ లెసన్స్ అనే గ్రంథం ఆధారంచేసుకుని 1951 లో 'నటన' అనే గ్రంథాన్ని, 1956లో స్టానిస్లవిస్కీ రచించిన 'యాన్ యాక్టర్ ప్రిపేర్స్' అనే బృహద్గ్రంథాన్ని ఆధారంచేసుకుని "అభినయం" అనే గ్రంథాన్ని శ్రీనివాస చక్రవర్తిగారు రచించారు.

బొలెస్లవిస్కీ, స్టానిస్లవిస్కీ, రచనలను తొలిసారిగా భారతీయ భాషలలో (తెలుగులో) అనువదించిన ఘనత శ్రీనివాస చక్రవర్తిగారికే దక్కింది.

చక్రవర్తిగారి "నటన" "అభినయం" గ్రంథాలను అనేకమంది నటీ

నటులు అధ్యయనం చేశారు. తద్వారా వారి శక్తిసామర్థ్యాలను పెంపొందించుకున్నారు.

ఆంధ్ర థియేటర్స్ ఫెడరేషన్‌వారు రెండుసార్లు నడిపిన ప్రయోగాత్మక నాటక పాఠశాలల్లో పాఠాలు బోధించడానికి చక్రవర్తిగారి గ్రంథాలు ఎంతగానో ఉపకరించాయి.

అంతేకాదు-తెలుగు నాటక సాహిత్యంమీద రష్యన్ సాహిత్య ప్రభావం ఎంతగానో పడింది. 1930 వరకు తెలుగులో వచ్చిన నాటకాలు ఎక్కువగా పౌరాణికాలు, చారిత్రాత్మకాలు. సాంఘిక నాటకాలు తక్కువ. వాటిల్లోను ధనికవర్గానికి ప్రాముఖ్యం హెచ్చుగా వుండేది.

సోవియట్ నాటక సాహిత్యంతో తెలుగు నాటక రచయితలకు పరిచయం ఏర్పడిన తరువాత తెలుగు నాటక రచనలలో పెద్ద మార్పు వచ్చింది. నాటకాల్లో దేవతలకు, రాజులకు, ధనికవర్గానికి ప్రాముఖ్యం తగ్గింది. రైతులు, కూలీలు, కార్మికులు, మధ్య తరగతివారు మొదలైన పాత్రలకు ప్రాధాన్యం హెచ్చింది. వారి జీవితాలలోని వెలుగునీడలను, సుఖదుఃఖాలను, వారి నిత్యజీవిత సమస్యలను, ధనికవర్గం బీదలను, బలవంతులు బలహీనులను దోచుకోవడం చిత్రించడంలో రష్యన్ సాహిత్యం ఆంధ్ర రచయితలకు దారిచూపింది.

## ఆంధ్రనటుల నాకర్షించిన స్టానిస్లవిస్కీ నటనా పద్ధతులు :

నటీనటులకు శరీర పరిశ్రమా, సాధనా అవసరం. ఈ పద్ధతిని సోవియట్ రష్యాలో అగ్రస్థానం వహించిన మాస్కో ఆర్టుథియేటర్ నటులు అక్షరాలా అనుసరిస్తున్నారు. ప్రతి నటీనటునకూ ఎవరి శరీరంమీద వారికి స్వాధీనత వుండాలి. అంటే నటునియొక్క హావభావాలకూ అభినయానికీ అనువుగా శరీరాన్ని హద్దుల్లో వుంచుకోవాలి. మాస్కో ఆర్టుథియేటర్ నటీ నటులు నిత్యం శరీరసాధన చేస్తూ వుంటారు. ప్రతిరోజూ విధిగా వ్యాయామం చేస్తారు. అలా చేయని, చేయలేని నటీనటులకు ఆర్టుథియేటరులో ప్రవేశం లేదంటాడు స్టానిస్లవిస్కీ.

## స్టానిస్లవిస్కీ :

స్టానిస్లవిస్కీ సుప్రసిద్ధ రష్యన్ కళాకారుడు. విశ్వవిఖ్యాతిచెందిన మాస్కో ఆర్టుథియేటరును స్థాపించిన ముఖ్యులలో ఒకడు. 40 సంవత్సరాలు ఆర్టు థియేటరును అరామరంగా నడిపిన కళాశీలి. నటుడుగా, ప్రయోక్తగా, నూతన విధానాలను ప్రసాదించిన మేధావి. రంగస్థలంమీద నిత్యం నూతన ప్రయోగాలను ప్రవేశపెట్టి, ప్రపంచ నాటకరంగంలో ప్రయోక్తగా అగ్రస్థానాన్ని సంపాదించుకున్న ప్రసిద్ధ కళాకారుడు. తన అనుభవాల నన్నిటినీ క్రోడీకరించి. "నా కళాజీవితం" "నటశిక్షణ" అనే రెండు ఉత్తమ గ్రంధాలను నటలోకానికి ప్రసాదించిన కళా తపస్వి, ఆయన జీవితాంతంవరకూ అంటే 82 సంవత్సరాల వయస్సువరకూ వ్యాయామంచేసిన నటుడు. ప్రపంచంలో ఇంతకాలం నటీ నటులుగా జీవించిన వారు చాల తక్కువమంది వున్నారు. దేహపరిశ్రమలేని నటీ నటులు నటులుగా అభివృద్ధి పొందలేరని కూడా స్టానిస్లవిస్కీ దృఢాభిప్రాయం.

ఇలా చూచుకున్నప్పుడు భారతీయ నటుల్లోకాని, ఆంధ్ర నటుల్లోకాని ఎంత మంది దేహపరిశ్రమా, శరీర సాధనా చేయగలుగుతున్నారో ఆలోచిస్తే దాదాపు మృగ్యమనే తేలుతుంది.

ఈ విధమైన శరీర సాధనతో శరీరాన్ని హద్దుల్లో పెట్టుకోగలిగిన స్థితి నటీ నటులకు లేని నాడు మనస్తత్వాన్ని నిగ్రహంగా వుంచడం కష్టమని కూడా స్టానిస్లవిస్కీ అభిప్రాయం.

నటించాలన్నా, అభినయించాలన్నా ఏ చిన్న కదలికలోనైనా శరీరం చెప్పినట్లు వినాలనేది ఆయన అభిప్రాయం.

## నటనలో నిగ్రహం :

ఒక హృదయ విదారకమైన ఘట్టంలో నటుడు ఏడుస్తూ ఆ ఘట్టంలో నుంచి మరో ఘట్టంలోకి మారడమే నిగ్రహం అంటా డాయన.

లేక ఏడ్వడం ప్రారంభించి ఆ వూబిలోనుంచి బయటికి రాలేని నటీ



ఆన్‌టన్ చెకోవ్—మాక్సిమ్‌గోర్కి 1900.

నటులు శరీరాన్ని, మానసిక నిగ్రహాన్ని అదుపులో పెట్టుకోలేని నటులుగా లెక్కస్తారు.

కాని పై మాదిరి నిగ్రహం కావాలంటే తప్పకుండా ప్రతి నటుడూ విధిగా అన్ని అవయవాలనూ అదుపులో వుంచుకుని తద్వారా మానసిక ఉద్రేకాలను నిగ్రహంలో వుంచుకున్నప్పుడే ఆ కార్యంలో కృతకృత్యు డౌతాడు.

ప్రతి నటుడూ నటుడుగా కాక, తాను ధరించేపాత్ర ఏదో, అదే తానుగా ఆ కొంచెంసేపూ అలా ఐపోవాలంటాడు. అదే ఆయన ముఖ్యమైన పద్ధతి కూడా.

ఈ అభిప్రాయంతో ఏకీభవించనివారు కూడా అనేకమంది వున్నారు. ఈ పద్ధతిని తన్మయత్వంపొందే పద్ధతిగా చిత్రిస్తున్నారు కొందరు. కాని తన్మయత్వం అంటే వళ్ళుమరచి నటించడం కాదని మనం భావించినప్పుడు స్టానిస్లవిస్కీ అభిప్రాయంతో మనం ఏకీభవించవచ్చును. ఆయన అభిప్రాయంలో పాత్రలో లీనం కావాలనీ, తానే ఆ పాత్ర అనే అభిప్రాయాన్ని కలిగి వుండాలన్నాడే కాని ఏడ్వడం మొదలెడితే అదేపనిగా ఏడ్వడంగాని, నవ్వడం మొదలెడితే అదేపనిగా నవ్వడం గాని ఆయన సమర్థించలేదు.

అందుకే నటనలో నిగ్రహం కావాలన్నాడు. అలాటి నిగ్రహానికి దేహ పరిశ్రమ, అవయవ స్వాధీనతా, మానసిక నిగ్రహమూ వుండాలన్నాడు.

కృత్రిమనటన :

యుద్ధంలో కెళ్ళిన ప్రియుడు మరణించాడన్న వార్త విని ప్రియురాలు ఎలా భోరుమని ఏడుస్తుందో, అలాగే నటనను కూడా చిత్రించాలి. కాని యుద్ధంలో చని పోయాడు గనుక, ఇక్కడ కొంచెం ఏడవాలనుకుని కృత్రిమంగా ఏడ్పును ప్రారంభించి గ్లిజరినుతో కన్నీళ్ళను తెప్పించడం, కృత్రిమ నటనలాంటిది. అది నటన అనిపించుకోదనీ, ప్రేక్షకుల ఆదరాభిమానాలను ఏమాత్రం సంపాదించలేదనీ,

అలాంటి నటన చేయడంకంటే మానుకోవడం మంచిదనీ స్టానిస్లవస్కీ అభిప్రాయం.

ఉద్రేకం సహజంగా వుండాలేకాని కృత్రిమంగా వుండకూడదు. నటుడు తాను ధరించబోయే పాత్రకు ఎలాంటి వుత్సాహ వుద్రేకాలు కావాలో అలాంటి వాతావరణాన్ని సృష్టించి ఆ కార్యంలో కృతకృత్యుడవడమే ముఖ్యమైన పద్ధతి అని ఆయన వుద్దేశం.

ప్రదర్శనంలో వున్నంతకాలమూ నటీ నటులు బాహ్యప్రపంచంతోకాని, బాహ్య పరిస్థితులతోకాని సంబంధాన్ని వదులుకుని తాము, తమ పాత్ర, రంగ స్థలం ప్రేక్షకుల్ని గుర్తు పెట్టుకోవాలి.

ఇంకా స్లానిస్లవిస్కీ సిద్ధాంతాలలో ముఖ్యమైనవి—భావనాశక్తి, కల్పనా శక్తి. ఈ రెంటినీ నటీ నటులు అభివృద్ధి పర్చుకోవాలి.

భావనాశక్తి:

ఉదాహరణకు- చూస్తూ ఉండగా ఒక బాలుడు మంటలలోపడి కాలిపోయే సమయంలో మనం ఎలాంటి బాధనూ, సానుభూతినీ అనుభవిస్తామో—అలాగే అలాంటి సంఘటనను వూహించుకుని అలాంటి బాధనూ, సానుభూతినీ అనుభవించ గల భావనాశక్తి నటీ నటులకున్నాడు, నటనలో బాగా తరిఫీదు పొందారని చెప్ప వచ్చు.

నిత్యం కళ్ళముందు జరిగే సంఘటనలకు ప్రతి వ్యక్తి అనుభూతి పొందు తాడు. నటుడు అలాంటి వాటిని వూహించుకుని నటిస్తాడు. ఏనాడూ తాను చూడని తాజ్‌మహల్ గురించి ఊహించడంవల్ల గాని, ఇతరులద్వారా తెలుసుకొనడం ద్వారా తనుకూడా ఆ దృశ్యాన్ని చూచినట్లు మనస్సులో వూహించుకునీ, భావాలు కల్పించు కునీ ప్రదర్శించడం ద్వారా ఆ సన్నివేశానికి న్యాయం కలుగజేయవచ్చు. ఇలాంటి కల్పనాశక్తి నటీ నటులకు ముఖ్యం.

కల్పనాశక్తి :

ప్రతి నటుడూ ప్రపంచంలో అన్ని దృశ్యాలనూ తన కళ్ళతో చూడలేడు. అన్ని అనుభవాలనూ పొందడం సాధ్యంకాదు. కనుక పరిస్థితులను కల్పించుకునీ ఊహించుకునీ బహుముఖాల ప్రతిభావంతమైన నటనను చూపించగలుగుతారు.

ఇలా భావనాశక్తి, కల్పనాశక్తీ లేక కేవలం తాము చూచినవీ, తాము అనుభవించగలిగిన భావాలనే నటించగల నటీనటులు గొప్పరైకు బెత్తెడు తోకలాగా అభివృద్ధి పొందలేరు.

ఊహించుకునీ, కల్పించుకునీ నటించే శక్తిగలిగిన నటీనటులు ఏ పాత్రనైనా సమర్థనీయంగా నటించగలరని స్టానిస్లవిస్కీ అభిప్రాయం.

ఇలా ఊహించడానికీ, కల్పించుకుని నటించడానికీ నటీనటులకు తగినంత లోకానుభవం, విజ్ఞానం, సంస్కారం వున్నప్పుడే సాధ్యపడుతుంది.

నేడు ఆంధ్రదేశపు నాటకాలలో ఒకరు ఏ నాటకం ప్రదర్శిస్తే, మిగతావారు కూడా అదే నాటకాన్ని అనుసరిస్తారు. అంతటితో వూరుకుంటేపోను. డి. వి. సుబ్బారావు హరిశ్చంద్రుడుగా పద్యాలు ఎలా పాడారో అదే ఫక్కీని అనుసరించడం జరుగుతూ వుంది. అంటే స్వతంత్రంగా ఆలోచించే శక్తీ, భావనాశక్తీ లేని అనుకరణవిధానం ఆ హద్దుల్నిమించి వికసించదు. నటీనటులు కూడా ఏమాత్రం అభివృద్ధిపొందలేరు.

ప్రేక్షకులను నమ్మించాలి :

రచయిత నాటకంలో పాత్రకు సమకూర్చిన పరిస్థితుల్ని బాగా అవగతం చేసుకుని తన నటనద్వారా ప్రేక్షకులను నమ్మించాలి. అంటే ఒక నాటకంలో ఒక భటుడు ఒక వర్తమానాన్ని తీసుకువచ్చి రాజుకిచ్చాడనుకోండి. ఆ లేఖను రాజు

గారు చదవడం ప్రారంభించాడు. కాని ఆ లేఖ ఎక్కడనుంచి వచ్చిందో? అది ప్రియురాలి లేఖా? లేక ఏదైనా ఉపద్రవం సంభవించిందా? లేక శత్రురాజులవద్ద నుంచి వచ్చిన సవాలా? ఈ మూడింటిలో ఏదో ప్రేక్షకునికి తెలియాలి. తెలియాలంటే ప్రియురాలి లేఖ అయితే ఆ అభినయ విన్యాసం ఎలా వుంటుందో, ఒక ప్రమాద ఘటనలో ముఖభావాలు ఎలా మారుతాయో, అలాగే శత్రురాజు నుండైతే అతని వృత్తరానికి ప్రతీకారమైన భావాల కదలికలనే చూపించాలి.

చదివే వృత్తరం ఎలాంటిదో ఆయా పదభావాల ననుసరించే ఆహా, ఇది ప్రియురాలి లేఖే ఆనేది ప్రేక్షకులు తెలుసుకున్నప్పుడే, అలా నమ్మించగలిగినటుడే ఉన్నత స్థానాన్ని పొందగలుగుతాడు.

నేటి మన నాటకాలలో ఏ వృత్తరమైనా ఒకేరకంగా చదివి, చివరకు ఏదో ఒక కేక వేయడమో, లేక ఆ వృత్తరానికి జవాబుగా సంభాషణలతోనో మనకు వెల్లడి చేస్తారు. అలాంటిది చాల చవుకబారు నటనని చెప్పవచ్చు. అలాంటి అభినయాన్ని స్టానిస్లవిస్కీ దూరంగా పారద్రోలేవాడు.



సుప్రసిద్ధ రష్యన్ కళాకారుడు
స్టానిస్లవిస్కీ

నాటకాన్ని కేవలం నాటకంగా గాకుండా వాస్తవంగా చిత్రించాలంటాడు. ఒకవేళ నాటక రంగంలోనే కృత్రిమంవుంటే దాన్ని నాటకరంగంనుంచి పారద్రోలా లంటాడు. అలాగే నటీనటులు కూడా తమ తమ నటనల్ని కృత్రిమంగా గాకుండా యథాతథంగా అతివాస్తవికంగా నటించ

మంటాడు. కృత్రిమ నటనను దూరం చేయాలంటాడు. తన అభిప్రాయాలను స్టానిస్లవిస్కీ జీవితాంతం వరకూ ప్రచారం చేశాడు. మాస్కో ఆర్టు థియేటరు లోని నటీనటు లందరూ ఇదే విధానాన్ని అవలంబిస్తున్నారు.

ఆంధ్రదేశంలో ఈ నాడు అనేకమంది స్టానిస్లవిస్కీ అభిప్రాయాలతో ఏకీభవించి ఆయన విధానాలను అనుసరిస్తున్నారు. నటనా పద్ధతుల్ని అవగాహన చేసుకుంటున్నారు.

పాశ్చాత్య
నాటకరంగం :

భారత దేశంలో బ్రిటిష్ వారి పరిపాలనా ఫలితంగా పాశ్చాత్య నాటక రంగానికి సంబంధించిన ఇస్కిలీస్—సోఫోక్లీజు—యురిపిడీస్—అరిస్టాఫనీస్—మినాండర్ మొదలైన గ్రీకు నాటక రచయితల నాటకాలూ—

ప్లాటసు—టెరెన్స్—సెనికా మొదలైన రోమన్ నాటక రచయితల నాటకాలూ—

నార్వేకుచెందిన హెన్రి ఇబ్సెనూ—బెల్జియంకు చెందిన మారిస్ మేటర్ లింకు—జర్మనీకి చెందిన హాట్‌మన్—ఐర్లెండ్‌కు చెందిన బెర్నార్డుషా—సింగ—ఈట్సు మొదలైన ప్రసిద్ధ నాటక రచయితల నాటకాలూ—

నికోలస్ యుడల్—నార్టను బల్‌హార్టు క్రిష్టఫరుమార్లో—డెక్కరు—బెన్‌జాన్సన్—జాన్‌వెబ్సర్—షేక్స్పియర్—షెరిడన్—థామన్‌హార్డీ—జె. బి. ప్రీస్ట్లీ మొదలైన ఆంగ్ల నాటక రచయితల నాటకాలూ—అమెరికన్ నాటకాల ప్రభావం భారత నాటకరంగంపైనా, ఆంధ్ర నాటకరంగంపైనా పడింది. ముఖ్యంగా ఆంగ్ల నాటకాలు భారతదేశంలో వున్న ముఖ్య భాషలన్నిటిలోనూ అనువదింపబడి ప్రదర్శించబడ్డాయి. మరి కొంతమంది రచయితలు ఇంగ్లీషు నాటకాల ఇతివృత్తాలను తీసుకుని భారతదేశ పరిస్థితుల కన్వయించి నాటకాలను వ్రాశారు. ముఖ్యంగా షేక్స్పియర్ నాటకాలు యూనివర్శిటీలలోనూ యూనివర్శిటీ అనుబంధ కళాశాల

ల్లోనూ పాఠ్య గ్రంథాలుగా నిర్ణయించబడ్డాయి. కాలేజి విద్యార్థులు ఆంగ్ల నాటకాలను ప్రదర్శించారు కూడా. ఆ నాడు అనేక ఇంగ్లీషు నాటక దళాలు భారత దేశమంతా పర్యటించి ముఖ్య పట్టణా లన్నిటిలోనూ ఆధునిక పరికరాలతో కట్టుదిట్టంగా నాటకాలను ప్రదర్శించారు. ఆ నాటకాలను దర్శించిన కళాకారులు వారి నాటక ప్రయోగాలను, దుస్తులను, అలంకరణను అనుకరించారు.

ఆంధ్రదేశంలో నాటకరచన ప్రారంభ దినాలలో చాల మంది రచయితలు ఇంగ్లీషు నాటకాలను అనువదించారు. ఎవరు ఏయే నాటకాలను అనుకరించిందీ ఆంధ్రనాటక సాహిత్య సమీక్షలో ఉపహరించబడింది.



# 26

## భారతీయ నాటకరంగ క్రమ పరిణామం



భారతదేశం నాటకకళ-హిందీ నాటకరంగం-
తమిళ నాటకరంగం - కన్నడ నాటకరంగం-
కేరళ నాటకరంగం - బెంగాలీ-మహారాష్ట్ర-
గుజరాతీ - పంజాబు - అస్సాం - ఒరిస్సా
నాటకరంగాలు.

# భారతీయ నాటకరంగ క్రమ పరిణామం

భారత దేశానికి నాటక కళలో ప్రోత్సాహమిచ్చింది గ్రీకు దేశమని కొంతమంది పాశ్చాత్య పండితుల అభిప్రాయం. కాని అంతకుముందే భారత దేశంలో



నాటక కళ వుద్భవించిందని, దానికి యితర దేశాల ప్రోత్సాహ మేమీలేదనే వాద ప్రతివాదాలు పాశ్చాత్య పండితులకు, భారతీయ పండితులకూ జరిగాయి. ఏవి ఏమైనా ఇరువురి వాదాలను మనం క్లుప్తంగా తెలుసుకోవడం మంచిది.

తర్క వితర్కాలు :

అసలు నాటక కళ గ్రీసుదేశంలోనే ప్రారంభమైందనీ, ఆ నాటికి యూరపు రాజ్యాలలోను, ఆసియా మొదలైన దేశాల లోనూ ప్రాచీనంనుంచీ వున్న నాటక బీజాలకు గ్రీకు నాటక రంగం ప్రోత్సాహమిచ్చిందనీ అనేకమంది యూరపియన్ విద్వాంసుల అభిప్రాయం. కాని బోన్స్ జోన్స్ హిందూదేశ నాటకరంగ ప్రోత్సాహానికి గ్రీకు నాటకాలే ప్రోత్సాహమిచ్చాయా అనే విషయంపై చర్చించి, తగిన ఆధారాలు తనకి కన బడడం లేదని తప్పుకున్నాడు. ఈ అభిప్రాయాన్నే జర్మను పండితులు కూడా సమర్థించారు. కాని ఒక చరిత్రకారుడు భారతదేశ నాటకరంగానికి వుత్సాహమిచ్చింది చైనా దేశమని వ్రాశాడు. కాని చైనా దేశంలో పురాతన నాటకాలేవీ లభ్యం కాలేదు. అంతేకాక క్రీస్తుకు పూర్వం నాటకరచన చైనా దేశంలో వున్నట్లు కూడా ఏ విధమైన చరిత్రాధారాలు లేవు.

మన దేశం :

ఇకపోతే మన దేశపు నాటకాలకు గాని, నాటకరంగానికి గాని ఇతర

ఏ దేశములయొక్క ప్రోత్సాహమూ లేదనీ, భారత దేశములో నాటకోత్సాహమూ, నాటకరంగము ఏర్పడిన రోజుల్లో గ్రీకు, దేశం చాలా అనాగరికంగా వున్నదనీ, అందుకు వుదాహరణలు చూపిస్తూ పాలకోడేటి వెంకటరామశర్మగారు 1922మేలో ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలో వుదహరించారు.

భారత నాటక కళ:

భారత దేశంలో భరతునిచే వ్రాయబడిన భరతనాట్య శాస్త్రం క్రీస్తుకు పూర్వం 600 సంవత్సరాలకు ముందే రచింపబడిందని భారతదేశ చరిత్రకారులు వ్రాశారు.

భారతీయులయొక్క నాట్యకళ వేదాలనుంచి ఏర్పడినట్లు మనకు అనేక ఆధారాలున్నాయి. అందుకు ఉదాహరణ:

ఋగ్వేదంనుండి--సంభాషణ ఏర్పడిందనీ,

యజుర్వేదమునుండి—నాట్యమూ,

సామవేదంనుండి—గానమూ,

అధర్వణ వేదమునుండి—రసమూ,

ఈ విధంగా నాట్యవేదం ఉద్భవించి, 'మనువు' కాలం నాటికే ప్రత్యేక ప్రాముఖ్యం పొందిందనీ, 'పాణిని', 'పతంజలి' కాలానికే నాట్యశాస్త్రాలు రచింప బడి ఉన్నాయనీ, 'వాణినీ', 'శిలాలినీ', 'కృశాశ్వలను' నాట్యశాస్త్రకారుల్నిగా పేర్కొన్నాడు. ఆ వాటికే నటనకు కావలసిన చతుర్విధాభినయాలు మొదలైన అభినయ రీతులన్నీ వికసించి వున్నాయనీ వ్రాశాడు.

క్రీస్తుకు పూర్వం 400-300 సంవత్సరాలలో ఆ నాటికే పతంజలి 'కంస వధ', 'బలిబంధనము' మొదలైన నాటకాలు—బహుళ వ్యాప్తిలోకొచ్చి పేరు పొంది ఆడబడ్డాయి. ఆ నాటికే 'వజ్రనాభుని పురంలో'—కావేరంభాభిసార మనే నాటకం ప్రదర్శించినట్లు, ఆ నాటకంలోని కైలాస దృశ్యాలు అత్యంత మనోహరంగా ఉన్నట్లు హరివంశంలో పేర్కొనబడింది.

ధనంజయుడు :

దశరూపకంలో భరతనాట్య శాస్త్రంలోని సూత్రాలన్నిటిని తాను గ్రహించినట్లు వ్రాసుకున్నాడు.

అంతేగాక అలెగ్జాండరు హిందూదేశంమీద దండయాత్రచేసేనాటికే భారత దేశంలో భరతనాట్యకళా విశిష్టతల్ని కొందరు చూచి ఆనందించినట్లు కొంతమంది చెప్పారు. వీటన్నిటిని బట్టి, భరతనాట్యంయొక్క ప్రాచీన చరిత్రను మవం త్రోసిపుచ్చలేం.

ఆ రోజుల్లో వ్రాయబడిన నాటకా లన్నింటికీ ఇతివృత్తం, రామాయణం, మహాభారతం మొదలైన పురాణ గ్రంథాలనుండి సేకరించి నాటకాలు వ్రాశారు.

దీనినిబట్టి క్రీస్తుపుట్టక పూర్వం అనేక శతాబ్దాల క్రిందటే హిందూదేశంలో నాట్యశాల ఏర్పడినట్లు, నాటకాలు వీధుల్లో ఆడబడినట్లు నిదర్శనాలున్నాయి.

ఇప్పటికి మూడువేల సంవత్సరాల క్రితమే భారతదేశంలో సర్వాంగసుందరంగా ప్రదర్శింపబడిన ప్రదర్శన నిదర్శనాలున్నాయి.

"సర్గోజా" రాజ్యంలో రాయ్‌ఘడ్‌లో, రెండు గిరికందకాలు కనబడినాయనీ, అందులో ఒకటి భరతనాట్య శాస్త్రంలో చెప్పబడిన రీతిలోనుంచి మలచబడిన నాటక ప్రదర్శనా ప్రేక్షకా గృహమని చెప్పబడుతూ వుంది.

'సుతను' అనే దేవదాసి మొదలైన కొంతమంది నర్తకుడాంధ్ర కొరకు ఈ నాట్యశాల నిర్మింపబడినట్లు చెప్పబడుతూ వుంది.

ఈ ప్రేక్షకా గృహంలోని గోడలన్నీ విచిత్ర వర్ణాలంకార శోభితంగా కళకళలాడుతూ వున్నాయట.

తక్షశిల-ఉజ్జయిని :

ఆ నాడు తక్షశిల, వుజ్జయిని మొదలైనచోట్ల విశ్వవిద్యాలయాలుండేవి. ఈ విద్యాలయాలలో సమస్త కళలనూ గూర్చి విద్యాభ్యానం జరుగుతూవుండేది.

నానాదేశాల యువకులందరూ విద్యాభ్యాసం కోసం ఈ విశ్వవిద్యాలయాలను సందర్శించారు. ఉజ్జయిని సర్వవిధముల ప్రఖ్యాతిపొందిన పట్టణం. ఈ పట్టణంలో నాటక కళ మహోత్కృష్టతను పొందింది.

### బౌద్ధమతంలో నాశనమైన నాటక కళ:

భారత దేశంలో బౌద్ధమతం వ్యాపించిన తరువాత నాటక కళ కొంతవరకు హీనస్థితికి వచ్చింది. అక్కడక్కడ హిందూరాజులు మాత్రం నాటక కళను పోషించుతూ వచ్చారు. నాటకరంగంలో ఒక రకంగా నూతన పోకడలు కనబడుతున్న సమయంలో ప్రప్రథమంగా బౌద్ధమతస్తులు నాటకాల ఆదరించలేక పోయారు. అశోకుడు మొదలైన రాజులకు నాటకాలపట్ల వుత్సాహమున్నట్లు ఏ విధమైన చరిత్రాధారాలు లేవుగాని బుద్ధుని శిష్యులైన 'మందగుల్యాన' మొదలగువారు నాటక ప్రదర్శనాలమ చూచి ఆనందించినట్లు బౌద్ధగ్రంథాలతో వుదహరింపబడి వుంది.

క్రైస్తవులు క్రైస్తవుల నాటకాలను మత బోధకై ఎలా వుపయోగించారో, అలాగే బౌద్ధులు కూడా బౌద్ధమత ప్రచారంకోసం క్రమేపీ నాటకాలను ప్రదర్శిస్తూ వచ్చారు.

### సోమిల్లుని నాటకాలు:

ఈ కాలంలో వింధ్యపర్వత ప్రాంతాలలో నాటకాలు రచించడమే కాక ప్రదర్శనాలు కూడా జరుగుతూ వుండేవి. 'సోమిల్లుడు' కాళిదాసునకు పూర్వమే కొన్ని శృంగార, విషాద నాటకాలను వ్రాశాడు. సోమిల్లుని నాటకాలు 19వ శతాబ్దపు మొదటి పాదంలో అమెరికా నగరాలలో కూడ ప్రదర్శించారు. ఈ నాటక ప్రదర్శనాన్ని అమెరికా ప్రజలు ఎంతగానో కొనియాడారు. పత్రికలలో రివ్యూలను కూడా వ్రాశారట.

అంతేగాక సోమిల్లుని నాటకాలను బంగళా పండితు డొకాయన అచ్చు వేయించాడట. ఇక మన ఆంధ్రదేశంలో సోమిల్లుని నాటకాలలో కొన్నిటిని

శ్రీచిలకమర్తి లక్ష్మీనరసింహంగారు వారి ఆధ్వర్యంలో నడుపబడుతున్న 'మనోరమ' పత్రికలో ప్రకటించారు.

సౌమిల్లుని నాటకాలు చాల ప్రతిభావంతంగా రచింపబడ్డాయి. సంభాషణ శైలిలో ఏమీ లోటులేదు. నాటకాన్ని అంకాలుగా విభజించాడు. రంగానికి బదులుగా విష్కంభాలున్నాయి. ఈ నాటకాలు ఆ నాటి ఐరోపాఖండ నాటకాలకు ఏవిధంగానూ తీసిపోవు. కాని కాళిదాసుని నాటకాల చమత్కృతి వేరు. కొన్ని విషయాలలో షేక్స్‌పియర్ కూడా కాళిదాసుకు సాటిరాడు. ఇరువురికీ తూర్పు పడమరలకున్నంత వ్యత్యాసం వుంది. ఇరువురూ ప్రతిభావంతులే కాని విధానాలు వేరు. ఎవరియొక్క కళాసంపన్నతలో వారు పరిపూర్ణులే.

కాళిదాసుని కాలం :

కాళిదాసుని యొక్క కాలాన్ని గూర్చి ఈ నాటికి ఇతమిత్థంగా ఎవరూ చెప్పలేకుండా వున్నారు. పాశ్చాత్య పండితులు మాత్రం గుప్త సామ్రాజ్య కాలమని చెబుతున్నారు. కొందరు క్రీస్తు పూర్వం 300 సంవత్సరాలని, మరికొందరు క్రీస్తు శకారంభమనీ, ఇంకా కొందరు క్రీ. శ. 300 మొదలు 1000 వరకు అని అంటున్నారు. కాని మన భారతదేశ పండితుల అభిప్రాయం ప్రకారం క్రీస్తుశకం 500 ప్రాంతమువాడని తలుస్తున్నారు. క్రీస్తు శకారంభంనుంచీ కుషన్ దండయాత్రల వృత్తం ఎక్కువగా ఉండడంవల్ల ఉజ్జయినీ నగరం కుషనుల వశం అయింది. దానితో ఉజ్జయినీ కళాప్రతిభలు క్రమేపీ అంతరిస్తూ వచ్చాయి. కుషను చక్రవర్తులు బౌద్ధులు. అందువల్ల బౌద్ధమతం తీవ్రంగా విజృంభించింది.

అశ్వఘోషుడు మొదలైన పండితులు నాటకాలను రచియించి, ప్రదర్శించీ బౌద్ధమతాన్ని దేశదేశాలకు వ్యాపింపజేశారు. అశ్వఘోషుడు బి. పి. 4-వ శతాబ్దానికి చెందినవాడు.

ఈకాలంలో బౌద్ధమత సూత్రాలు ఆసియా దేశా లన్నిటికీ వ్యాపిస్తూ వున్నాయి. చైనాదేశం బౌద్ధమతాన్ని స్వీకరించింది. బౌద్ధ నాటకాలను చైనాదేశస్థులు బాగా పోషించారు.

కుషనుల, హూణ దండయాత్రలవల్ల హిందూదేశంలో నాటక కళ క్రీ. శ.

100 మొదలు 300 వరకు ప్రోత్సహింపబడలేదు. తరువాత 500 మొదలు 1000 సం. ల వరకు నాటకరంగం వెలుగొందింది. పండితులు నాటకాలను వ్రాయడం మొదలుపెట్టారు. కాని, గుప్తరాజులు మాత్రం నాటక కళపట్ల ఎట్టి కుతూహలాన్నీ కనపర్చలేదు. కాశి, కనోజు, కాశ్మీరము—మొదలైన ప్రాంతాలందే నాటక కళ పోషింపబడింది ఆ రోజుల్లో.

ఈ కాలంలో హిందూదేశంలో అనేకమంది సంస్కృత పండితులు నాటకాలను వ్రాయడం మొదలుపెట్టారు. వారిలో శ్రీహర్షుడు, భవభూతి ముఖ్యులు. భవభూతి 6 వ శతాబ్దానికి చెందినవాడు. ఈయన ఉత్తరరామ చరితము, మాలతీ మాధవీయము, మహావీర చరితమూ రచించాడు.

ప్రాచీన నాటక రచయితలు :

శ్రీహర్షుడు : 7 వ శతాబ్దానికి చెందినవాడు, ఈయన ప్రియదర్శిక, నాగానందము, రత్నావళి మొదలైన నాటకాలను రచించారు.

వీరుగాక ఇంకా ఈ క్రింద ఉదహరింపబడిన అనేకమంది భారత నాటక కళను పోషించారు :

భాసుడు : బి. సి. నాలుగవ శతాబ్దానికి చెందినవాడు.

శూద్రకుడు : భాసమహాకవి రచించిన దరిద్ర చారుదత్త నాటకాన్ని అనుసరించి మృచ్ఛకటికమను నాటకాన్ని రచించాడు.

భట్టనారాయణ : 9 వ శతాబ్దానికి చెందినవాడు. ఈయన వేణీసంహార నాటనాన్ని రచించాడు.

విశాఖదత్తుడు : ఈయన కూడా 9 వ శతాబ్దానికి చెందినవాడే. ఈయన రచించిన నాటకం ముద్రారాక్షసము.

రాజశేఖరుడు : బాలరామాయణం, బాలభారతం రచించాడు.

కృష్ణమిశ్రుడు : 11 వ శతాబ్దానికి చెందినవాడు. ఈయన రచించిన నాటకం ప్రబోధ చంద్రోదయం.

జయదేవుడు : ఈయన 13 వ శతాబ్దమునకు సంబంధించినవాడు. రచించిన నాటకం ప్రసన్న రాఘవం.

ఈ రోజుల్లో మహాకవి కాళిదాసు నాటకాలు పామరుల్ని కూడా ఆకర్షించాయంటే కాళిదాసు యొక్క ప్రతిభావిశేషాలు మనకు వెల్లడి అవుతూనే వున్నాయి. కాళిదాసును గురించి, ప్రత్యేకముగా ఆయన రచనల్ని గురించి వేరొకచోట విపులంగా తెలుసుకుందాం.

ధనంజయుడు దశరూపకం రచించిన నాటినుండి నాటకములు పతన మార్గంలో పడ్డాయి. ఇందుకు కారణం ఆ నాటి మహమ్మదీయ దండయాత్రలే.

పైన పేర్కొన్న కవులయొక్క సంస్కృత నాటకాలే మనకు ప్రస్తుతం నాటకాల రూపంలో లభ్యమవుతూ వున్నాయి.

కీలుబొమ్మల నాటకాలు :

భారతీయులు ప్రారంభదశలో కీలుబొమ్మల ద్వారా నాటకాలు ఆడుతూ వుండేవారు. ఈ కీలుబొమ్మలను పాంచాలికా—పుస్తలిక—పుత్తల అనే పేరులతో పిలుస్తూ వుండేవారు. ఈ కీలుబొమ్మల్ని గురించి ఈ క్రింద వుదహరించబడిన కథన మొకటి తెలుస్తూ వుంది.

పార్వతీదేవి మలయ పర్వతాని కెళ్ళి, అచ్చట దొరికే చందన కాష్టాలతో ఒక కీలుబొమ్మను తయారు చేసిందనీ, శివుడు ఆ బొమ్మయొక్క నేర్పు సొంపుల కానందించి, ఆ బొమ్మకు జీవసంచలనం కలిగించాడనీ కథాసరిత్సాగరంలో వుదహరింపబడి వుంది.

మహాశిల్పి మయునియొక్క కుమార్తె సోమప్రభ మయ నిర్మితమైన కొన్ని కీలుబొమ్మల్ని కళింగసేన యనే రాకుమార్తెకు ఇచ్చిందని మరో కథవల్ల తెలుస్తూ వుంది.

ఈ బొమ్మలు దూరానవున్న వస్తువులు తేవడం, చెట్లకు నీళ్ళు పోయడం చేస్తూవుండేవనీ, ఆంగికాభినయంతో ఆడుతూ వుండేవనీ ప్రతీతి.

రాజశేఖరుని బాలరామాయణంలో రావణుడు కీలుబొమ్మల్ని చూచి, నిజమయిన సీత అని భ్రమించినట్లు చెప్పబడింది.

### తోలుబొమ్మలు :

కీలుబొమ్మల ఆటల ననుసరించి, సూత్రధారుడు—స్థాపకుడు అనే వుద్యోగాలు ఏర్పడ్డాయి. ఈ బొమ్మల నాటకాలు ప్రదర్శిస్తున్న కాలంలోనే తోలు బొమ్మలు కూడా విరివిగా ప్రదర్శింపబడుతూ వుండేవట.

సుభటుడు రచించిన దూతాంగదము—భవభూతి రచించిన మహావీర చరితము—జయదేవుని ప్రసన్నరాఘవం—రాజశేఖరుని బాలరామాయణం మొదలైన నాటకాలన్నీ ఛాయామూర్తులతోనే ప్రదర్శింపబడ్డాయట.

12 వ శతాబ్దం తరువాత హిందూదేశములో స్వతంత్రంగా నాటకాలు వ్రాయడం తగ్గిపోయింది. ఇందుకు కారణం మహమ్మదీయుల యొక్క రాజ్య ప్రాబల్యమే.

ఈ కాలంలో భక్తికి సంబంధించిన భజనలూ, భరతనాట్యమూ, భాగవతములూ, తోలుబొమ్మలు మొదలైనవి వ్యాప్తిలో కొచ్చాయి.

ఆంధ్రదేశంలో కూచిపూడి భాగవతాలూ, మహారాష్ట్రములో పువ్వాడా అని కీర్తనలని, బెంగాల్‌లో యాత్రలూ, ఝూచర్ అనే కళారూపాలు ప్రదర్శింపబడుతూ వుండేవి.

### ఆంగ్లేయుల ఆధిపత్యం :

ఆ తరువాత ఆంగ్లేయులు భారతదేశంలో ఆధిపత్యాన్ని సంపాదించిన తరువాత ఆంగ్ల విద్యా సంపర్కం మనమీద పడటం, అక్కడ నుండి ఆంగ్లేయ సాహిత్యమూ, ఆంగ్లేయ నాటకాలూ భారతదేశానికి దిగుమతి అవడం జరిగింది. 1800 సంవత్సరం నుంచి పాఠశాలల్లో షేక్స్‌పియరు నాటకాలు ప్రతి కళాశాలలోనూ పఠనీయ గ్రంథాలుగా వుండటంవల్లనూ, వాటిని ప్రదర్శించటం వల్లనూ వీటి ప్రభావం భారతీయ కవులను కూడా ఆకర్షించి నాటక రచనకు పురికొల్పాయి.

చాలమంది కవులు అయా ప్రాంతీయ భాషల్లో నాటకాలు వ్రాయడానికి సంస్కృత నాటకాలనూ, కాళిదాసుని రచనలనూ అనువదించటం ప్రారంభించి, ఆంగ్లేయ నాటక సాంప్రదాయం ప్రకారం వ్రాయడం మొదలుపెట్టారు. ఆ కాలంలో రచనలకు ఉపయోగపడ్డవి హిందూ పురాణాలూ, ఇతిహాస గ్రంథాలు.

హిందీలో నాటక రచన :

ఈ కాలంలో హిందీలో నేవాజ్ అనే రచయిత శకుంతల నాటకాన్ని, హృదయరాం హనుమన్నా నాటకాన్ని, వ్రజవాసిదాస్ ప్రబోధ చంద్రోదయం మొదలైనవాటిని సంస్కృతం నుంచి అనువాదం చేశారు.

ఇంతకుముందే హిందీలో హిందీ కవులు రచించినవి, ప్రభావతీ—ఆనంద రఘునందనం అనే నాటకా లున్నాయి. భారతేందు తాతగారైన గిరిధర దాసుగారు ఘమారు నూరు సంవత్సరాల క్రిందటే వ్రజభాషలో నహుషుడు అనే నాటకాన్ని రచించారు. ఇదే హిందీలో ప్రథమ నాటకం.

వీరి తరువాత, రాజా లక్ష్మణసింగు శాకుంతలని ప్రయోగార్థంగా అనువదించి ప్రదర్శించారు. ఇంకా—

లాలా శ్రీనివాసదాసు—
రణధీర ప్రేమమోహిని
బదరీనారాయణ చౌదరి—
భారత సౌభాగ్య నాటకం
పండిత కేశవ రాంభట్లు—
సంజ్ఞాత సంబుల్ శాంషద్
బాబూ తోతారాంకేట్—
కృతాంతము
బాబూ రాధాకృష్ణదాసు—
మహారాణా ప్రతాపసింగు.

మొదలైన నాటకాలను రచించారు. మహారాణా ప్రతాపసింగు నాటకం హిందీలో బహు ప్రసిద్ధిచెందిన నాటకం.

ఆ రోజుల్లో బెంగాలీభాషలో ద్విజేంద్రలాల్‌రాయ్, గిరిఘోష్, జయశంకర

ప్రసాద్, రవీంద్రనాథ టాగూర్ మొదలైన కవులు బయలుదేరి నాటకాలు వ్రాయడం మొదలుపెట్టారు.

---

# హిందీ నాటకరంగం

భారతదేశంలో ఆయా ప్రాంతాల్లో ఆయా భాషల్లో నాటక కళ అడవిజాతుల నృత్యాల నుండీ, తోలుబొమ్మలాటల నుండీ, జానపద నృత్యాలనుండీ వుద్భవించిందని చెప్పవచ్చును. నాటకాలకు పూర్వం ప్రతి భాషలోనూ ఏదో ఒక ప్రాంతీయ కళారూపం ప్రజలకు వినోదాన్నీ, ఆనందాన్నీ కలిగించేవి.



అలాగే హిందీలో నాటక సాహిత్యం రాకముందు నుండీ ప్రచారంలో వున్న కళారూపాలు, రామలీలలు, రాసలీలలు, వీటిద్వారా రామాయణంలోని ముఖ్య ఘట్టాలన్నిటినీ అభినయ పూర్వకంగా ప్రదర్శించేవారు.

### రామలీల :

ఈ రామలీలలు నేటికి కూడా ఉత్తర హిందూస్థానంలో బహుళ ప్రచారంలో వున్నాయి. మనకు వీధి భాగవతాలూ, తమిళులకు మేలటూరు భాగవతాలు, మహారాష్ట్రులకు పువాడా, తమాషా, బెంగాలీలకు ఝూమర్, యాత్రా ఎలాంటివో ఉత్తర హిందూస్థానీ ప్రజలకు రామలీలలు అలాంటివి. రామలీల ప్రదర్శనమంటే ప్రజలు చెవులు కోసుకు వింటారు. రామలీల అంటే తెలియని పౌరుడు వుండడంటే ఏ మాత్రం అతిశయోక్తి లేదు. రామలీలల్లో గీతాలు పాడుతూ తద్వారా నాట్యంచేస్తూ చక్కగా అభినయిస్తారు. బహిరంగ ప్రదేశాల్లోనే రామలీల ప్రదర్శనాలు జరుగుతూ వుంటాయి. చుట్టూ ప్రజలు గుమిగూడి తెల్లవార్లూ ప్రదర్శనం చూచి ఆనందిస్తారు. రామలీల సాహిత్యం హిందీభాషలోనే ఎక్కువగా వ్రాయబడింది.

ఈ నాటికి రామలీల కళారూపాన్ని సుప్రసిద్ధ భరత నాట్యాచార్యుడు ఉదయ

శంకర్, అఖిల భారత ప్రజా నాట్యమండలి నృత్యకారులూ ఇతర రాష్ట్రీవాసులకు పరిచయం చేశారు. పల్లెప్రజలు ప్రదర్శించే ఈ ప్రదర్శనానికి ఎన్నో మెరుగులు దిద్ది ఒక చక్కని కళాఖండంగా తయారుచేశారు. అందువల్ల హిందీ సాహిత్యంలోనూ, కళారూపాల్లోనూ అన్ని అందాలూ తీర్చుకున్న కళారూపంలాగ రామలీల నృత్యరూపకం కళాఖండంగా నిలబడి ఒక స్థానాన్ని సంపాదించుకుని సజీవంగా నిలబడింది.

హిందీ నాటకాలు :

హిందీ నాటక సాహిత్యంలో మొట్టమొదటగా వ్రాయబడిన నాటకం "ప్రబోధ చంద్రోదయం". అంతకు ముందు నాటకాలు కావ్యపద్ధతిలో వ్రాయబడ్డాయి. వాటిలో ముఖ్యమైనవి "సమయసార" "హనుమన్నాటకం". "ప్రబోధ చంద్రోదయ" నాటకం 1643 వ సంవత్సరంలో వ్రాయబడింది, హిందీ సాహిత్యంలో మొట్టమొదటగా వ్రాసిన నాటకంగా దీనినే పేర్కొంటారు. దీని తర్వాత (1700) సంవత్సరంలో రీవామహారాజు విశ్వనాథుడు వ్రజభాషలో "ఆనంద రఘునందనాన్ని" స్వతంత్రంగా రచించాడు. దీని తరువాత ఆయనే "నేతారఘు నందనం" రచించాడు. 1841 వ సంవత్సరంలో భారతేందు తండ్రి గోపాల చంద్రుడు "నహూష" అనే స్వతంత్ర రచన చేశాడు. దీని తరువాత 1861 లో ఒక అనువాద నాటకం వెలువడించి. అది కాళిదాసు రచించిన శాకుంతల., అనువాదకుడు రాజా లక్ష్మణసింహుడు. ఈ విధంగా హిందీలో ప్రప్రథమంగా నాటక సాహిత్యం వెలువడింది.

భారతేందు యుగం :

పై నాటకాల తరువాత 1867-85 భారతేందు యుగం ప్రారంభమైంది. భారతేందు అభిప్రాయం ప్రకారం హిందీలో మొట్టమొదటిదిగా అభినయ యోగ్యమైంది, ప్రదర్శన యోగ్యమైంది, "జానకీమంగళం"గా పేర్కొన్నాడు. కాని ఆ నాటకం ఎక్కడా దొరకదు. ఇక అభినయించబడి లభ్యమయ్యే నాటకం "ఇంద్ర ప్రభ."

ఈ నాటకంలో ఉర్దూ మాటల ప్రభావం ఎక్కువగా వున్నట్లు తెలుస్తూ వుంది. ఇది గేయనాటకం. ఆనాడు ప్రదర్శించే అనేక నాటకాలు అన్నీ గేయ నాటకాలే. ఈ విధంగా హిందీ నాటకరంగం గేయనాటకాలతో ప్రారంభమైనదని చెప్పవచ్చు.

భారతేందు రచనలు సాగించేనాటికి, భారతదేశంలో ఇంగ్లీషు వారు బాగా స్థిరపడిపోయారు. రాజారామమోహనరాయలు బ్రహ్మసమాజ స్థాపనజేసి సాంఘిక ఉద్యమాన్ని ప్రారంభించాడు. ఈ సమయంలోనే భారతేందు రచనకు పూను కున్నాడు. ఆయన అనువాదాలనూ, కొన్ని నాటకాలను రూపాంతారాలుగాను, మరి కొన్ని ప్రహసనాలుగానూ రచించాడు.

భారతేందు అనువాదాలు :

రత్నావళి శ్రీహర్షుని సంస్కృత నాటకానికి అనువాదం "షాషండ విడంబనం."

ప్రబోధ చంద్రోదయంలో మూడవ అంకానికి అనువాదం.

కర్పూరమంజరి—ప్రాకృత నాటకానికి అనువాదం.

ముద్రారాక్షసం—విశాఖదత్తుని సంస్కృత నాటకానికి అనువాదం.

దుర్లభబందు—మర్చెంట్ ఆఫ్ వెనీస్‌కు స్వతంత్రానువాదం.

ధనంజయవిజయం—కాంచన విక్రృత సంస్కృతనాటకానికి అనువాదం.

రూపాంతరాలు :

విద్యాసుందర్—ఒక బెంగాలీ నాటకానికి రూపాంతరం.

సత్యహరిశ్చంద్ర—ఇది సంస్కృత హరిశ్చంద్ర ననుసరించి వ్రాయ బడింది.

స్వీయరచనలు :

సతీప్రతాప్—సావిత్రీ సత్యవంతుల గాథ—ప్రేమయోగిని, చంద్రావళి

భారతజనని (ఇది గీతనాటిక), భారతదుర్దశ సీలదేవి, మొదలైనవి. ఇవిగాక ప్రహసనాలు - "వైదిక హింసానభవతి" "విషన్య విషమాషదయ్" "అంధేరీనగర్" రచించాడు. భారతేందు సమయంలో నాటక సాహిత్యం విరివిగా పెరిగింది. ఈ కాలంలో అనేక పౌరాణిక నాటకాలూ, చారిత్రక నాటకాలూ, సామాజిక సమస్యా నాటకాలూ, ప్రహసనాలూ వ్రాయబడ్డాయి.

భారతేందు అనేక అనువాదాలు చేసినప్పటికీ ఆయన స్వతంత్రించి చాల రచనలు చేశాడు.

కొన్ని ఉత్తమ నాటకాలు :

చారిత్రక నాటకాలలో రాధాకృష్ణదాసు రచించిన పద్మావతి—మహారాణా ప్రతాప్—పౌరాణిక నాటకాలలో అయోధ్యసింహ ఉపాధ్యాయ వ్రాసిన "ప్రద్యుమ్న విజయం" "రుక్మిణి పరిణయం" చెప్పదగినవి.

ఇక ఏకాంకికలలో రాధాచరణ్ గోస్వామి రచించిన "అమరసింహరాకార్" చాలమంచి కృతి అని చెపుతారు.

సమస్యా నాటకాలలో
ఉత్తమమైనవి :

సమస్యా నాటకాలు హిందీలో అనేకం వ్రాయబడినా వుత్తమ నాటకాలుగా నిలబడినవి మాత్రం చాల తక్కువ. వాటిలో వుత్తమమైనవి—

ప్రతాప నారాయణమిశ్రా వ్రాసిన—కలికేతుకం. కమలాప్రసాద్ వ్రాసిన—కాకికన్యాసంబోధిని, రామగరీబచే వ్రాసిన—నాగరీ విలాపం, బదరీనారాయణ ప్రేమఘన్ వ్రాసిన—భారత సౌభాగ్య, ప్రతాపనారాయణమిశ్రా—భారత దుర్దశ, రుద్రద త్తుశర్మ వ్రాసిన—అబలావిలాప్ మొదలైనవి.

విషాదాంతాలు :

ఇంకా ఎన్నో హిందీ నాటకాలు వ్రాయబడినా అవి అన్ని వాద ప్రతివాదా

లతో నిండివున్నాయి. హిందీ విషాదాంతాలలో పేర్కొనదగినవి. ఈ క్రింద వుదహరించినవి యోగ్యమైనవి.

రణధీర్ ప్రాసిన ప్రేమమోహిని. లావణ్యవతీ సుదర్శన్.

ఇవిగాక మాయాంకమంజరి. చంద్రకళా భానుకుమార్ రచించిన మరికొన్ని నాటకాలు వుత్తమమైనవి—

### సాంఘిక హిందీ నాటకాలు :

రామమోహన్‌రాయ్ సాంఘిక దురాచారాన్ని ఖండించే రోజుల్లో అనేక మైన సాంఘిక నాటకాలు వెలువడ్డాయి. అనేకమైన ప్రహసనాలు వెలువడ్డాయి. ఆనాటి ప్రజల మనస్తత్వాలన్నీ చక్కగా ఈ నాటకాలు చిత్రించాయి. వీటిలో వుత్తమశ్రేణికి చెందిన నాటకాలు చాలా తక్కువగా వున్నా పేర్కొనదగినవి కూడా వున్నాయి.

ఈ విధంగా 18వ శతాబ్దం అంతలో హిందీ నాటక సారస్వతం ఎంతో అభివృద్ధి పొందింది. పాల పొంగులాగ అంతరించింది. జయశంకర ప్రసాద్ రచనలు చేసే నాటికి హిందీ నాటకరచన తగ్గిపోయింది. ఈ కాలంలో ఇంగ్లీషు నుంచీ, బెంగాలీనుంచీ అనేక అనువాద నాటకాలు వెలువడ్డాయి. ఆ నాడు బెంగాల్లో ద్విజేంద్రలాల్‌రాయ్ నాటకాలు విపరీతమైన ప్రచారంలో వున్నాయి. అనేకమైన డి. యల్. రాయ్ నాటకాలు హిందీలోకి అనువదించారు.

కాని క్రమబద్ధమైన ప్రదర్శనార్హతగల నాటక సమాజాలు లేనందువల్ల ఎక్కువ నాటకాలు ప్రదర్శన యోగ్యాలుగా నిలబడలేక పోయాయి.

పార్శీ సమాజాలు హిందీ రచయితల వుత్సాహాన్ని నిలబెట్టగలిగాయి. ఈ వుత్తేజంతో రచన సాగించిన వారిలో ముఖ్యులు, రాజాశ్యామ్ కథావాచక్—తులశీ దత్తు శ్రీవా—ఆఘాహషయద్ కాశ్మీర్ మొదలైనవారు.

### జయశంకర్ ప్రసాద్ నాటకాలు :

హిందీ నాటక సాహిత్యంలో జయశంకర్‌ప్రసాద్ ఆగమనంతో ఒక కొత్త

యుగం ప్రారంభమైంది. జయశంకర్ అనేకమైన స్వతంత్ర రచనలు చేశాడు. ఆయన వ్రాసిన నాటకాలన్నీ పౌరాణికాలు, చారిత్రకాలు. జాగ్రత్తగా రచనలు చేశాడు. ఆ నాడు చారిత్రక వాతావరణాన్ని చక్కగా చిత్రించాడు.

ఆయన వ్రాసిన నాటకాలు కరణాలయ్—అజాతశత్రు—విశాఖ్—స్కంధగుప్త—కామన—ఏక్‌హంట్ — జనమేజయకా నాగ యజ్ఞ—ధ్రువ స్వామిని మొదలైనవి.

జయశంకర్ నాటకాల్లో భాష కష్టమైనది. సంభాషణలు పలకడం కష్టం. అభినయానికి కష్టమైనవి. కాని పాత్రలను చిత్రించడంలో ప్రతిభాశాలి. ఈయన నాటకాల్లో చక్కని గీతాలు వ్రాశాడు. సాహిత్య ప్రపంచంలో అవి గొప్ప పేరు ప్రతిష్టల్ని సంపాదించాయి.

ఈ కాలంలోనే అనేకమైన పౌరాణిక నాటకాలు రచించబడ్డాయి. చెప్పుకోదగినవి గోవిందవల్లభవంతు వ్రాసిన "వరమాల", పండిట్ సుదర్శన వ్రాసిన "అంజన" అంటే హనుమంతుని జీవిత చరిత్ర.

చారిత్రక నాటకాల్లో
చెప్పదగినవి :

ఇవిగాక ఇంకా ఎంతోమంది హిందీ కవులు అనేకమైన నాటకాలను వ్రాశారు. అందులో చారిత్రక నాటకాలుగా అభివృద్ధి చెందినవి—

పండిట్ సుదర్శన్ వ్రాసిన—దయానంద.

మివింద్ర వ్రాసిన—ప్రతాప్ ప్రతిజ్ఞ.

గోవిందదాస్ వ్రాసిన—హర్ష.

లక్ష్మీనారాయణమిశ్రా—సన్యాసి. రాక్షస్ కా మందిర్. ముక్తికారహస్య.

నరేంద్ర వ్రాసిన—నీచ్.

బేచనశర్మవుగ్ర వ్రాసిన—మహాత్మా ఈసా

—మొదలె నవి.

### హిందీ ప్రహసనాలు :

పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలతో పాటు, వుత్తమమైన ప్రహసనాలు కూడా అనేకం వెలువడ్డాయి. వాటిలో—

బద్రీనాథ్‌భట్టి—లబిన్ ధోంధోం. వివాహు విజ్ఞాపన్.

సుదర్శన—ఆనరరీ మేజస్ట్రేటు.

మొదలైన ప్రహసనాలు చెప్పుకోతగ్గవి. వీటితోపాటు అనేక ప్రహసనాలు అన్యభాషల నుండి అనువాదాలు జరిగాయి.

మోలియర్—టాల్‌స్టాయ్—గాల్స్‌వర్దీ—మేటర్లింక్—శిల్లక్—డి.ఎల్. రాయ్—రవీంద్రనాథటాకూర్ మొదలైన వుత్తమ రచయితల నాటకాలు విరివిగా అనువదించబడ్డాయి.

### పౌరాణిక హిందీ నాటకాలు :

జయశంకరప్రసాద్ రచనల తరువాత ఈ క్రింది పౌరాణిక నాటకాలు వెలువడ్డాయి. అవి ఉదయశంకర్‌భట్టు వ్రాసిన ఆంధినగరవిజయం, చతుర సేన్ వ్రాసిన "మేఘనాథ్", సేట్ గోవిందదాస్‌గారి "కర్తవ్యం" రెండు భాగాలు.

### మరికొన్ని రచనలు :

ఇవిగాక ఉదయశంకరభట్టు వ్రాసిన చారిత్రక నాటకాలు. "సింధువతన్", చంద్రగుప్త విద్యాలంకార్ వ్రాసిన "అశోక్", గోవిందవల్లభపంత్ వ్రాసిన "కురీనత", శశిగుప్త—ఉపేంద్రనాధ అస్క్ వ్రాసిన జయ్‌పరాజయ్, హరికృష్ణ ప్రేమీ వ్రాసిన "రక్షాబంధన్", "శివసాధనా ప్రతిశోధ్", "ఆహుతి మందిర్", లక్ష్మీనారాయణ మిశ్రా వ్రాసిన "అశోక్"—ఇంకా "ప్రవాసి" "జోత్స్న రాజయోగ్" "సింధూర్‌కీహోలీ" "ఆదీరాత్" "డిక్టేటర్" "చుంబన్" "ఆవారా" మొదలైన హిందీ నాటకాలను అనేకమంది రచించారు.

ఈ యుగపు హిందీ రచయితలు :

ఈ యుగానికిచెందిన ముఖ్య నాటక రచయితలు లక్ష్మీనారాయణమిశ్రా — ఉపేంద్రనాథ్ అస్క్—భువనేశ్వరప్రసాద్—రాముకుమారవర్మ—గోవిందదాసు —హరికృష్ణప్రేమ — గణేశ్ ప్రసాద్ద్వివేదీ — ఉదయశంకర్ భట్టు—భగవతీ చరణ్‌వర్మ మొదలైనవారు—అనేకమైన నాటకాలనూ, నాటికల్నీ, గీత నాట్యాల్నీ వ్రాశారు.

---

# తమిళ నాటకరంగం

లలితకళలలంటే ప్రాణం :



ఆంధ్ర ప్రాంతంలో సగభాగమే అయినా, జనాభాలో యాభై లక్షలు కొరవే అయినా కళారంగంలో మాత్రం యావద్భారతంలోనూ ఒక ప్రత్యేక విశిష్టతను తమిళరంగం సాధించుకుంది. నిన్నటివరకు తమిళులు, ఆంధ్రులు కలసి ఒకే రాష్ట్రంలో వుండడంచేత ఇరువురి సంస్కృతి అభిన్నమైంది. నేడు తమిళరంగంలో అత్యుచ్చ స్థితిలో కనిపించే ఏ కళారంగాన్ని చూచినా దానిమూలం తెలుగువారి ప్రసాదం. సంగీతంలో - నృత్యంలో - నాటక రంగంలో ఇప్పటికీ తెలుగుదనం కనిపిస్తుంది. విభజితమైన తమిళ ప్రాంతంలో తెలుగు ప్రజలు అధిక సంఖ్యలోనే వున్నారు. అయితే తమిళప్రాంతానికి సహజంగానే ఏర్పడ్డ ఘనువులు, వసరులు వారి అనితరాభివృద్ధికి మూలకారణమైనాయి.

దక్షిణ భారతానికే తమిళప్రాంతం తలమానికంగా అభివృద్ధి చెందుతోంది. ఒకనాటి చెన్నపట్టణం నేటి మద్రాసు మహానగరమై లలిత కళలకు నిత్యకళ్యాణం-పచ్చతోరణంగా భాసిస్తోంది.

### ఇసైతమిళం :

తమిళభాషలో రాగతాళ లయబద్ధమైన "ఇసైతమిళం" అనే శాఖ వుంది. "ఇసై తమిళ"లోనే "తేవారము" "రామాయణ కీర్తనలు" మున్నగునవి వున్నాయి. సంగం కాలంలోనే ఎన్నో సంగీత గ్రంథాలు, రాగ తాళ నిర్ణయాది గ్రంథాలు వుండేవని విజ్ఞులు చెబుతున్నారు. ఇది రెండువేల సంవత్సరాల నాటి విషయం. ఇలాగే అలభ్యమైన గ్రంథాలలో నాటక రంగానికి సంబంధించిన "భరతం" "అగత్తియం" "మురువళ్" "మదివాణర్" "నాటక త్తమిళ్ నూర్" "కూర్తనూర్" మున్నగు ప్రాచీన తమిళ నాటక గ్రంథాలు కూడా వున్నాయని పన్నెండో శతాబ్దంలో వున్న "శిలప్పదికారం"ను వ్యాఖ్యానించిన "అడియార్కు నల్లార్" రచనలద్వారా స్పష్టమౌతున్నది. నాటక రంగం సంస్కృత పరిచయం వల్ల ఏర్పడిందనే వాదాన్ని తమిళ పండితు లంగీకరించరు. దక్షిణాదిని అత్యంత ప్రాచీనమైన తమ భాషలో "కూత్తు" అన్న మాటను ఉదాహరణగా చూపి తమిళ పండితులు నాటకరంగానికి తమకుగల ప్రాచీన సంబంధాన్ని బుజువు చేస్తున్నారు.

### తెరికూత్తు :

కూత్తు అంటే నాటకమని, దశవిధ రూపకాలలో నాటక మొక లక్షణ మైనట్లుగ అనేక ప్రకారాలైన "కూతు"లలో నాటక మొకటి అని వారు చెబు తున్నారు. దీనికొక ఉపపత్తికూడ కలదు. ప్రాచీన తమిళ కావ్యాలలో ప్రాచీన కవులు నాలుగు వర్ణాలుగా వున్నట్లు సూచింపబడింది. అవి 'పాణర్' 'కూతాల్' 'పొరునర్' 'విరలియర్' అనే వర్ణాలు. తమిళ చక్రవర్తుల కాలంలో ఆస్థాన నాయకులుగా 'పాణర్' వర్ణం విశేష గౌరవాన్ని పొందారు. ఆర్యుల ప్రభావం వలన చక్రవర్తుల ప్రాబల్యం తగ్గడంతో ఈ వర్ణం అస్పృశ్యులై పోయారు. 'కూతార్' వర్ణం నటకులు, గాయకులూను. వీరు రంగులు పులుముకొని ఆట పాట లతో వినోదింప చేసేవారు.

### శిలప్పదికారం, మంజీరగాధ :

బౌద్ధయుగంలో ఈ కళలన్ని సన్నగిలి పోయాయని. తిరిగి జైనమత

ప్రాబల్యంతో కళాభిమానం పెరిగిందని అంటున్నారు. దీనికి ఉదాహరణగ ఆ కాలంలో వెలువడిన తమిళ పంచకావ్యాలలో ప్రసిద్ధిచెందిన 'శిలప్పదికారం' (మంజీరగాధ)కు 'నాటక పొరుళ్' అని 'నాటక కాప్పియం' అని నామాంతరాలు వున్నాయి. సంవాద ప్రధానంగాను—నాటక కథనంగాను ఉండడమే ఈ కావ్యప్రసిద్ధి. ఇటీవల పరిశోధకులు 'శిలప్పదికారం'లో ఒక అధ్యాయం నాటక రంగాన్ని వర్ణిస్తూ వుందన్నారు. 'మాధవి' అనే చోళరాజాస్థాన నర్తకి నట గాయక సమూహంతో వివిధ వాద్యబృందంతో నృత్యం సల్పినట్లు వివరింపబడి వుంది. ఇంతకు మినహాయిస్తే పద్దెనిమిదవ శతాబ్దాంతం వరకు తమిళ వాఙ్మయంలో నాటక ప్రస్తి లేదు.

### ఎరుకల కురవంజి :

ఈ మధ్యమ యుగంలో యక్షగానం వున్నది. అందులో 'కురవంజి' పాత్ర ఒకటి. తెలుగుదేశంలో కూడ 'తంబళులు' 'ఎరుకలు' మాట్లాడే భాషలో ప్రాచీన తమిళ పదాలు గోచరిస్తాయి. దీన్నిబట్టి వాళ్ళకు తమిళులకు గల సంబంధం గోచరిస్తుంది. 'కురవంజి' అనగా ఎరుకది. తెలుగు దేశంలో ఎరుక చెప్పేవాళ్లు గ్రామ గ్రామాన వున్నారు. ఆ పాత్ర రూపధారణ మాత్రం తమిళ ప్రాంతానికి చెందివున్నది. కురవంజిలోనే నాటకరూపం కూడ కలదు. ఇది మన 'చెంచు నాటకాని'కి దగ్గరగా వుంటుంది. సింగి-సింగని సంవాదమే ఈ రూపకం—వేదాంతం మొదలు హాస్యం వరకు సంవాదం సాగేది. సవతుల కయ్యమే ఆధారంగా తీసుకొని ఏర్పడ్డ 'పళ్లు' అనే రూపకం కూడా ఈ కాలంలోదే. అది మన 'గంగా గౌరీ సంవాదం' వంటిది.

### యుగకర్త సంబంధమొదలియార్ :

ఆధునిక నాటకరంగం సంస్కృత నాటకానువాదాలతో ప్రారంభమైంది. నేటికీ జీవించివున్న శ్రీ సి. సంబంధం మొదలియారు ఈ యుగానికి కర్త అనవచ్చు. ఆయన తెలుగు నాటకాన్ని చూసి ఉత్తేజితులయ్యారు. తర్వాత ఎన్నో నాటకాలను రచించారు. నాలు గైదేళ్లకు క్రితమే మద్రాసులో కళాభిమానులందరు కలసి ఆయనకు ఘన సన్మానం చేశారు. ఆయన స్థాపించిన సుగుణవిలాస సభ

నేటికి సంస్థగానే వుంది. ఆయన రచించిన వ్యాసాన్ని పరిశోధన సంపాదకుల సౌజన్యంతో ఇక్కడ ఉదహరిస్తున్నాను. నాటక కళ నిమిత్తం హైకోర్టు వకీలు వృత్తిని వదలుకొన్న కళాశీలి....

మధుర బాలానందసంఘం :

1925 నాటికి తమిళ నాటకరంగంలో క్రొత్త మార్పు వచ్చింది. మధుర బాలావినోద సంఘం క్రొత్త చరిత్రను సృష్టించింది. రాజా మాణిక్యంపిళ్లై అనునతను ఈ సంఘంలో వాడే. అతను వందలకొలది నటీనటుల్ని చేర్చి పెద్ద ఎత్తున పురాణకథలను ప్రదర్శించేవాడు, రంగస్థలంపై ఎన్నో అద్భుతాలను ప్రదర్శించేవాడు. నవాబు రాజా మాణిక్యంపిళ్ళై ఆధ్వర్యాన ఒక్కొక్క నాటక శాలలో ఒక్కొక్క నాటకం వందలకొలది ప్రదర్శనల నిచ్చేవారు. రోజులు తరబడి ప్రదర్శిస్తూ పట్టణాలన్నీ పర్యటించేవారు. నేటికీ రాజా మాణిక్యం ఖ్యాతి ఇనుమడిస్తూనే వుంది. ఇతని సమాజంలో ఏలాంటి దుర్వ్యసనానికి దుర్వ్యాపారానికి తావులేదు. చక్కని క్రమశిక్షణతో సమాజాన్ని నడిపించటం రాజమాణిక్యం ఘనత. ద్వితీయ ప్రపంచయుద్ధంతో తమిళ నాటకరంగం మరో క్రొత్త రూపం దాల్చింది. చలన చిత్రాలలో ఊరుపేరు సంపాదించినవారు చిత్ర పరిశ్రమ మూల బడడంతో తిరిగి నాటకసమాజాలను స్థాపించి నాటకరంగాన్ని పునరుజ్జీవింపచేశారు. టి. కె. షణ్ముగం బ్రదర్స్—సహస్రనామం నిర్మించిన సేవా స్టేజి ప్రధానమైనవి. ఈ సమాజాలు యువరచయితలను - అనేకమంది నటీనటులను సృష్టించినవి. ఈ సమాజాలలో వున్నవారే తరువాత చలన చిత్రాలలో రాణించారు. అంతేకాక ఈ సమాజాలు ప్రదర్శించిన అనేక కథలు చలన చిత్రాలుగా రూపొందాయి. 'నందనార్' 'కణ్ణగి' వంటి ప్రాచీనగాధలే కాక 'పరాశక్తి' 'రక్తకన్నీరు' వంటి సాంఘికాలు కూడా చలనచిత్రా లయినవి. చలనచిత్రాలలో నాయకులై లబ్ధ ప్రతిష్టులైన శివాజీ గణేశన్—ఎం. జి. రామచంద్రన్—రాజేంద్రన్ వంటి వారు స్వంత సమాజాలను స్థాపించారు.

# కన్నడ నాటకరంగం

ఆంధ్ర, కర్నాటక రంగాలు కవలపిల్లల వంటివి. ఉచ్చారణ వేరై లిపిమాత్రం చాలా సన్నిహితంగా వుంటుంది. లిపిలో వున్న సామ్యమే చరిత్రలోకూడా వుంది. ఒక్క సంగీత సాహిత్యాల్లోనే కాక నాటక రంగంలో మరింత సన్నిహిత సంబంధం వుంది. చరిత్ర పుటలు త్రిప్పిచూస్తే ఒక్కోదశలో ఆంధ్ర, కర్ణాటక రంగాలు ఒక ఇంట కాపరంజేసే తోడికోడళ్ళ వంటివనిపిస్తుంది. ఈ అన్యోన్యత రాజ్యపాలనలో, మతప్రచారంలో, సాహిత్య వ్యాసంగంలో విస్తృతమైంది. తెలుగువారు కన్నడంలో, కన్నడిగులు తెలుగులో ఒక్కొక్కరు ఉభయ భాషలలోను అపార పాండిత్యాన్ని ప్రవర్శించి కావ్యాలు, గ్రంథాలు రచించారు. రాజ్యాలు ఏలారు. మతైక బోధలు చేశారు. ఏ గాలి ఎటునుంచి వచ్చినా ఉభయప్రాంతాల్లోనూ దాని ప్రభావం స్పష్టంగా వుంది. శైవం వీరశైవమై సాగినా, వైష్ణవం వీరవైష్ణవమై రేగినా ఆంధ్ర కర్నాటక రంగాలు కలిసే అందుకున్నాయి. అందుకు తార్కాణం విజయనగరం చరిత్ర, యక్షగాన చరిత్ర.



బయలాట :

కన్నడులకు యక్షగానం, బయలాట మొదలైన ప్రాచీన జానపద కళారూపాలు ఆ నాటినుండి ఈ నాటివరకు ప్రదర్శించబడుతూనే వున్నాయి. రామాయణ భారత గాథలకు సంబంధించిన చరిత్రాత్మక నాటకాలు ప్రదర్శిస్తూ వచ్చారు.

ఆ నాడు ఉన్నతమైన వేదిక వారి రంగస్థలం. తెరలుండేవి కావు. కాగడాల వెలుగులో నాటకాలు ప్రదర్శించే వారు.

వేదిక ఎక్కడం, దిగడం ప్రవేశ నిష్క్రమణలుగా వుండేవి. దుష్టపాత్రలు ఆరుపులతో కేకలతో రంగస్థలంలో ప్రవేశించేవారు. కేవలం వినోదంకొరకు ప్రద

ర్శింపబడే ఈ నాటకాలు తెల్లవారే వరకూ ప్రదర్శింపబడేవి. వీరి నాటకాలన్నీ సంగీత రూపకాలు. నాటకంలో సంగీతాన్ని నటీనటులు పాడేవారు కారు, రంగ స్థలం వెనుకనుండి సమ్మేళ గాయకులనే వంతదార్లు పాడేవారు.

అంకపరిదె :

గత శతాబ్దంనుంచి కన్నడ నాటకరంగ చరిత్రలో గొప్ప మార్పులు జరి గాయి. నాటక కళను రాజులు, మహారాజుల, శ్రీమంతులు పోషించారు. ఈ పోషణలో మంచి రంగస్థలం వుద్భవించింది. తెరలు, దుస్తులు సంగీత వాద్య పరికరాలు—మొదలైన హంగులతో పక్కా రంగస్థలం ఏర్పడింది. వీరి తెరలులో ఫ్రంటు డ్రాఫ్ కర్టెనుకు అంకపరిదె అని పేరు. ఇతివృత్తాన్ననుసరించి రంగాల వారిగా తెరలను ఏర్పాటు చేసుకుని ఒక రంగం జరుగుతూవుండగా మరోరంగాన్ని వెనుక తయారు చేసుకుని వ్యవధి లేకుండా ప్రదర్శనాన్ని సాగించేవారు. వీరి రంగ స్థలం చాలా పెద్దది.

తొలి నాటక రచయితలు :

కన్నడంలో మొట్టమొదటి నాటకం "మిత్రగోవింద". దీనిని 1680 లో నరసింగరాయలనే ఆయన రచించారు. 1869లో టి. శేషగిరిరావు 'శకుంతల' నాటకాన్ని రచించారు. తెలుగు నాటక కర్త ధర్మవరం కృష్ణమాచార్యులు "స్వప్న విరుద్ధ" అనే నాటకాన్ని వ్రాశారు.

కన్నడ నాటక గురు అనే బిరుదు పొందిన "సక్కర బాలాచార్య" కన్నడ భాషలో 15 నాటకాలను రచించారు. "కడి బసప్పశాస్త్రి" 'అయ్యశాస్త్రిముళ్ బాగళ్' "గురురాయాచార్" మొదలైనవారు భాస కాళిదాస విశాఖదత్త భవభూతి భట్టనారాయణ—మొదలైన సంస్కృత నాటక కర్తలు వ్రాసిన నాటకాలను కన్న డంలో వ్రాశారు. "శ్రీకంఠశాస్త్రి" అనే ఆయన కొన్ని నాటకాలను కన్నడంలో వ్రాశాడు. "శ్రీ కంఠగౌడ" "ఆనందరావ్" "వానుదేవాచార్య", "సుబ్బారావు" "చరమూరి"—మొదలైనవారు ఇంగ్లీషు నాటకాలను కన్నడంలో రచించారు.

సి. కె. వెంకటరామయ్య, యం. యన్. కామత్, బి. పుట్టుస్వామయ్య బెంగాలీ నాటకాలను కన్నడంలో వ్రాశారు.

అనేకమంది కన్నడంలో స్వతంత్ర నాటకాలను రచించారు. వారిలో శ్రీనివాసకవి, వీరప్పశాస్త్రి, శాంతకవి, శ్రీనివాసయ్యంగార్, రాజకవి, మైసూర్ ఆసాన పిద్వాన్ బెళ్ళావె నరసింహశాస్త్రి మొదలైనవారు ముఖ్యులు.

ఎ. వి. వరదాచార్

కన్నడ నాటరంగానికి కీర్తిప్రతిష్ఠలు తెచ్చిన మహాపురుషులలో ప్రముఖుడు నాటక శిరోమణి కీ. శే. వరదచార్. వీరిని కన్నడ నాటకరంగ పితామహులుగా పేర్కొనవచ్చును. కన్నడ నాటకాలను క్రమపద్ధతిలో ప్రదర్శించిన వారు వీరే, అంగసౌష్టవం, సుందరరూపంగల వ్యక్తి వరదాచార్. ఎలాంటి క్లిష్టమైన పాత్రనైనా తన అభినయ కౌశలంతో అభినయించి, పండితులు మొదలు, పామరుల వరకూ అందర్ని ఆనందింపజేసేవారు. శకుంతల నాటకంలో దుష్యంతుడుగాను, ప్రహ్లాద నాటకంలో హిరణ్యకశిపుడుగాను, షేక్స్‌పియర్ ఒథెల్లో నాటకంలో ఒథెల్లోగానూ అద్భుతంగా నటించేవారు. ఈయన తన నాటక సమాజంతో అనేక చోట్ల ప్రదర్శనాలు ఇచ్చారు. ఈ నాటి అనేక నాటక సమాజాలు, నటీనటులు ఆయన ఆదర్శాలను ముందుకు తీసుకు పోతున్నారు.

మైసూర్ ప్యాలెస్ కంపెనీ :

కన్నడ నాటక రంగానికి అపారమైన సేవజేసిన సమాజం మైసూర్ ప్యాలెస్ కంపెనీ. ఈ సమాజం మహారాజా పోషణలో నడిచింది. గులేబకావళి, వీరసింహ, చంద్రహాస, మోహిని రుక్మాంగద, విరాటపర్వం, రాజసూయ అనే నాటకాలను కన్నడదేశ మంతటా ప్రదర్శించారు. బి. రాచప్ప, లక్ష్మీపతిశాస్త్రి, కుటూరప్ప, సుబ్బణ్ణ మొదలైన ప్రసిద్ధ నటులు ఈ ప్యాలెస్ కంపెనీలో వుద్భవించారు. రాచప్పగారు నాయకపాత్రను ధరిస్తే, సుబ్బణ్ణ కథానాయకి పాత్ర ధరించేవారు. ఆనాటి వీరి సమిష్టి నాటక ప్రదర్శనాలను గురించి ఈ నాటికి కథలు కథలుగా చెప్పుకుంటారు. మద్రాసు వచ్చి ప్రప్రథమంగా నాటకాలాడిన కన్నడ సమాజం ప్యాలెస్ ఒక్కటే.

గుబ్బి వీరన్న :

కన్నడ నాటకరంగాన్ని మకుటాయమానంగా ప్రకాశింపజేసిన నాటక

సంస్థల్లో మూడవసంస్థ గుబ్బి వీరన్నగారిది. వీరు పౌరాణిక చారిత్రక సాంఘిక నాటకాలను ప్రజారంజకంగా ప్రదర్శించారు. వీరు కన్నడ దేశంలోనే కాక దక్షిణ దేశంలో అనేక ముఖ్య పట్టణాలలో నాటకాలను విజయవంతంగా ప్రదర్శించి కన్నడ నాటక రంగానికి ఒక విశిష్టత చేకూర్చారు. వీరు ఆంధ్రదేశంలో తమ బృందంతో వచ్చి విజయవాడ, రాజమండ్రి మొదలైన ముఖ్య పట్టణాల్లో స్వంత హాలు నిర్మించి రోజులతరబడి కురుక్షేత్ర నాటకం అద్భుతమైన సెట్సుతోనూ, ఫోకసింగ్‌లు, వైరు వర్క్‌లతోనూ ప్రదర్శించి ఆంధ్రప్రజల మన్ననలను పొందారు. ఆనాడు ఆంధ్రదేశంలో గుబ్బి వీరన్న నాటకం అంటే ప్రజలు తండోప తండాలుగా విరగబడేవారు. వీరి నాటకాల్లో స్త్రీ పాత్రల్ని స్త్రీలే ప్రదర్శించేవారు. వీరన్నగారు ముఖ్యంగా హాస్యరస పాత్రలను పోషించడంలో కడు సమర్థులు. సదారామ నాటకంలో దోపిడీదొంగ, భక్త కబీరులో వైశ్యపాత్ర, రాజభక్తిలో దుర్మయుడి పాత్ర, కృష్ణలీలలో మకరందుని పాత్రను అద్భుతంగా పోషించేవారు. వీరు పద్మశ్రీ బిరుదును పొందారు. అనేకమైన చలనచిత్రాలలో నటించారు.

సుబ్బయ్యనాయుడు,
నాగేంద్రరావు :

అటు నాటకరంగంలోనూ, ఇటు సినిమా రంగంలోనూ, కన్నడ దేశానికే కాక, దక్షిణదేశ నాటక రంగానికి కూడా పేరుదెచ్చినవారు ఎం. సి. సుబ్బయ్య నాయుడు, ఆర్. నాగేంద్రరావులు. వీరు సాహిత్య సామ్రాజ్య నాటక మండలిని స్థాపించి, భూకైలాస్ అనేక నాటకాన్ని, ఆధునికమైన రంగస్థల పరికరాలతో, విద్యుద్దీపాలతోనూ, ఒకేచోట రోజుల తరబడి ప్రదర్శించే వారు. అద్భుతమైన సెట్సుతోనూ, అందుకు తగిన రంగోద్దీపనంతోనూ క్షణకాలంలో రంగాలను మార్చడం మొదలుపెట్టిన సంస్థ వీరిదే. వీరి భూకైలాస్ చలనచిత్రంగా రూపొందించబడి, తమిళంలోనూ, తెలుగులోనూ కూడ అఖండ జయాన్ని సంపాదించింది.

కే. శే. హిరణ్ణయ్య :

కన్నడ నాటక రంగాభివృద్ధికి అపారమైన సేవచేసిన మరో శిరోమణి

హిరణ్ణయ్యగారు. ఈయన గొప్ప హాస్య నటుడేగాక చేయి తిరిగిన మంచి రచయిత. ఈయన రచించిన నాటకాలు ఈనాటికి ప్రదర్శింపబడుతూ వున్నాయి. వీరి రచనలు కామాన్, మక్‌మల్‌టోపి, దేవదాసి, పంగనామనందాదీప, కుంకుమ, ఎచ్చమ్మనాయక, దేవిమండోదరీ మొదలైన నాటకాలన్నీ జనామోదాన్నిపొందాయి. ముఖ్యంగా వీరి నాటకాల్లో చెప్పుకోదగిన నాటకం "దేవదాసి". ఈ నాటకం బెంగుళూరు థియేటర్లో 1945 వ సంవత్సరంలో నవంబరు నెలనుండి వరుసగా 387 రోజులు హిరణ్ణయ్యగారు ప్రదర్శించారు. ఇది ఒక్క కన్నడ నాటక రంగానికేగాక, భారతదేశ నాటకరంగానికే గర్వకారణం. వీరి నాటక సమాజంలో సభ్యులందర్నీ హెచ్చుతగ్గులు లేకుండా సమదృష్టితో చూసేవారు. వీరు 1953 లో అకాలమరణం చెందడంవల్ల ఒక ఉత్తమ నటుణ్ణీ, ఉత్తమ రచయితనూ కన్నడ నాటకరంగం కోల్పోయింది.

ప్రసిద్ధ కన్నడ నటులు :

పైన ఉదహరించిన కళాకారులేగాక కన్నడ నాటకరంగానికి బహుముఖాల సేవచేసిన నటీనటులు అనేకమంది వున్నారు. వారిలో ముఖ్యులు వామనరావు మాస్టర్, హెచ్. ఎల్. సింహా, గరుడ్ సదాశివరావు, బి. ఆర్. పంతులు, భక్త శిఖామణి, మల్లప్ప, నారాయణరావునాయుడు, నారాయణరావు, నంజుండయ్య, రంగనాథభట్, నటభయంకర గుగాధరరావు, జయమ్మ, ఎం. వి. రోజమ్మ, అశ్వత్థమ్మ, సుందరమ్మ మొదలైనవారు.

గరుడ్ సదాశివరావుగారు పశ్చాత్తాప, సత్సంకల్ప మొదలైన నాటకాలను రచించి ప్రదర్శించి పేరుప్రఖ్యాతులు గడించారు.

హెచ్. ఎల్. సింహాగారు రచించిన "సంసారినౌక" అనే నాటకాన్ని మహమ్మద్‌పీర్, బి. ఆర్. పంతులు మొదలైనవారు అనేకచోట్ల ప్రదర్శించి పేరు పొందారు. ఈ కాలంలో బళ్ళారి రాఘవాచారిగారు కన్నడ నాటకాల్లో నటించేవారు.

ఈనాడు :

కన్నడ నాటకరంగశకం మూడవ శతాబ్దం నుంచి అనేక మార్పులు

పొందింది. అంతవరకూ ఆడుతున్న నాటకాలు ప్రజావిజ్ఞానానికి పట్టుకొమ్మలు కావని భావించి నూతన పోకడలలో కొత్త పద్ధతిలో నాటకాలను రచించడంలో కన్నడ నాటకరంగంలో ఒక నూతన శకం ప్రారంభమైంది. అనేకమంది అభ్యుదయ కాముకులైన రచయితలు ముందుకు వచ్చారు. వారిలో ముఖ్యులు టి. పి. కైలాసం, నారాయణరావు, హుయిల్‌గల్, శ్రీరంగ, కారంత్, పర్వతవాణి, క్షీరసాగర, డి. ఆర్. చేంద్రె, వి. కె. గోపాల్, ఎ.ఎన్. కృష్ణరావ్, కైవారమ్ రాజారామ్, దాశరధిదీక్షిత్, జి. పి. రాజరత్నం మొదలైనవారు అనేక నాటకాలను వ్రాశారు.

వీరిలో కైలాసం, శ్రీరంగ, కారంత్ స్వతంత్ర నాటకాలను వ్రాశారు. కైలాసంగారు మధ్యతరగతి కుటుంబ జీవితాన్ని వ్యంగ్యంగా చిత్రించారు. వీరు సంఘాన్నెంత విమర్శించినా వారి పద్ధతిని ప్రేక్షకులు మెచ్చుకున్నారు. వారి పాత్రలు సజీవంగా వుండేవి. వారి నాటకాలన్నీ వచనంలో వ్రాయబడ్డాయి. వారి ఏకాంకికలు వున్నతమైన ఆదర్శాలతో నిండివుండేవి.

కె. ఎన్. కారంత్‌గారు కన్నడంలో సంగీత రూపకాలను, ఛాయా రూపకాలను, నృత్య నాటకాలను రచించారు.

పిల్లల నాటకాలను, రేడియో నాటకాలను రచించినవారిలో "పుట్టప్ప" "చదురంగం" ముఖ్యులు.

ఈనాడు అనేక మార్పులతో కన్నడ నాటక రంగం, అమెచ్యూర్ నాటక రంగం పురోగమిస్తూ వుంది. కన్నడ నాటక రంగానికి అనేక నాటకశాలలున్నాయి. అనేకమంది రచయిత లున్నారు. ఎంతోమంది నాటక రంగ నటులున్నారు. ముఖ్యంగా యీనాడు సినిమాలో రాణిస్తున్న అనేకమంది ప్రసిద్ధ కన్నడ నటులు నాటక రంగం నుంచి వచ్చినవారే. వారిలో ముఖ్యులు జి. వి. అయ్యరు, రాజకుమార్, ఉదయకుమార్, అశ్వత్థ, బాలకృష్ణ, నరసింహరాజు, రామచంద్రశాస్త్రి, డిక్కీ మాధవరావు, పండరీబాయి, మైసూరు లక్ష్మి, హరిణి—మొదలైనవారే గాక ఆదోని లక్ష్మి, రమాదేవి, సూర్యకళ మొదలైన తెలుగు నటీనటులు కూడ కన్నడ నాటకాలలో పాత్రలు ధరిస్తున్నారు.

ఆంధ్రదేశంలో కన్నడిగులు అనేక నగరాల్లో వుంటున్నా విజయవాడలో

కే. శే. డాక్టర్ పి. వి. ఆచార్‌గారి ఆధ్వర్యంలో కన్నడ సేవాసంఘమనే సంస్థ ద్వారా ఉత్తమంగా నాటకాలను ప్రదర్శించారు.

---

# కేరళ నాటకరంగం

కేరళదేశంలో అతిప్రాచీనం నుండీ సంస్కృత నాటక పద్ధతుల్ని అనుసరించి వ్రాయబడిన "కూటియాట్టమ్" నాటక సంప్రదాయం ప్రచారంలో వుంటూ వచ్చింది. ఆ పద్ధతే క్రమానుగతంగా మారి "కథాకళి" నృత్య నాటకంగా వెలుగొందింది. ప్రముఖస్థానం వహించిన భారతదేశ నృత్య కళారూపాల్లో కథాకళి ఒకటి. కథాకళి అనే శబ్దం సంస్కృతం నుంచి పుట్టింది. కథాకేళి శబ్ద వికృతే కథాకళి. అనగా కథను అభినయ పూర్వకంగా ప్రదర్శించడమే. నోటినుండి పాటగాని, పాటగాని లేకుండా అభినయంద్వారా భావాన్ని వెల్లడించడం ఈ కళారూప విశేషం.



## కూటియాట్టం నాటకాలు :

అసలు కూటియాట్టం అనేది దేవాలయ నృత్యం. 'నాగానందం' 'సుభద్రా ధనంజయం' మొదలైన పౌరాణిక గాథలే ఈ నృత్యానికి ఆటవస్తువులు. పవిత్రమైన ఈ కళలో ఎంతటి కళా వైభవ మున్నప్పటికీ తరతరాలుగా ప్రదర్శింపబడుతూ ప్రదర్శనా పద్ధతుల్లో ఏ విధమైన మార్పులూ పొందక పోవడంవల్ల, ప్రేక్షకులకు ఈ ప్రదర్శనలు విసుగు పుట్టించాయి.

కూటియాట్టం నాటక సంప్రదాయం మహత్తరమైన మనదేశ సంస్కృతిని ప్రతిబింబించే సాధనమైనప్పటికీ అది ఈనాడు కేరళదేశంలో అతి క్షీణదశలోవుంది.

## చక్కియార్ తెగ :

కేరళదేశంలో సంగీత సాహిత్యాది లలిత కళలను అనాదిగా పోషించి

పెంపుచేసిన కళావంతుల కుటుంబాలకు చెందినవారే ఈ చక్కియార్ తెగవారు. ప్రబంధాది శ్రవ్యకావ్యాలలోని భావాలకు రూపకల్పన చేసిన మహనీయులైన కళాకారులు వీరు.

క్రీస్తుశకం రెండు మూడు శతాబ్దాల మధ్యకాలంలో రచింపబడిన శిలప్పదికారం అనే తమిళ కావ్యంలో ఈ చక్కియార్ తెగ ప్రశంస అక్కడక్కడ వుంది.

కథాకళి,

నృత్యనాటకం :

కథాకళి కట్టుబిట్టమైన శాస్త్రంతో కూడినది. దీనిపై అనేక గ్రంథాలు నంబూద్రీలవద్ద దొరికాయి. నాయర్లూ, నంబూద్రీలూ ఈ కళను ప్రచారంలోకి తీసుకువచ్చారు. కథకళిలో నేత్రాభినయం ఎక్కువ. అలాగే కాళ్ళతో నృత్యం కూడా ఎక్కువే. కథాకళి నృత్యం గీత అభినయాత్మకమైన కథాకేళి. కథాకళిలో పాత్రధారులు నిశ్శబ్దంగా అభినయిస్తూ కేవలం ముఖ కవళికలతోనూ, హస్త ముద్రలతోను, ఎంతటి కష్టమైన హావభావాలనైనా ఎంతో సుబోధకంగా వెల్లడిస్తారు. ఇట్టి అపూర్వమైన కళాకేళి నృత్యాన్ని సృష్టించిన మహాగౌరవం కేరళులకే దక్కింది.

మహాకవి వల్లతోల్ :

కేరళదేశంలో అనేక పెద్ద కుటుంబాలవారు ఈనాటి వరకూ కథాకళి రూపాన్ని పోషిస్తూ వచ్చారు, కాని ఈ మధ్యకాలంలో పాశ్చాత్య నృత్యాల, ఇతర నృత్యాల వ్యామోహం హెచ్చినకొద్దీ కథాకళిమీద మోజు కొంత తగ్గింది. కొంతమంది దీన్ని మొరటు నృత్యంగా భావించారు, కాని ఆ హేయభావాన్ని కూకటివ్రేళ్ళతో పెల్లగించడానికి కేరళ మహాకవి వల్లతోల్ నారాయణమీనన్ నడుంకట్టాడు. అనేకమంది తన మిత్రుల సహాయంతో 1930 నవంబరులో కేరళ కళామండలం అనే నాట్య కళాశాలను స్థాపించాడు.

కేరళ కళామండలం :

కేరళ కళామండలం స్థాపించిన ఆనాటి నుండీ ఈనాటివరకూ ఆ కళాశాల

జయప్రదంగా నడుస్తూ వుంది. అనేకమంది కథాకళి నేర్చుకున్న విద్యార్థులు ఉచ్ఛస్థితికి వచ్చారు. వల్లతోల్ మహాకవి కళామండలం స్థాపించిన తరువాత, కేరళ ప్రజలలో ఒక నవ చైతన్యం కలిగింది. తమ ప్రాచీన కథాకళి నృత్య నాటకంపట్ల ఆసక్తి ఎక్కువైంది. దానిని ఒక మహానాట్యంగా ఆరాధించడం మొదలుపెట్టారు. ఈనాడు కథాకళి నాట్యప్రశస్తి భారతదేశమంతటా ప్రచారమైంది.

ఎనభై ఏళ్లక్రితం :

మళయాళ నాటకరంగంలో నాటకాల పాత్రకంటే కథాకళికి సంబంధించిన నృత్య నాటకాల ప్రభావమే ఎక్కువ. ప్రత్యేక సాహిత్యంగా మళయాళభాషలో నాటకరచన దాదాపు ఒక శతాబ్దం క్రితమే ప్రారంభమైంది.

తొలిదశలో మళయాళ నాటకం సంస్కృత, తమిళ నాటకాల ప్రభావాలకు లోనైంది. కాళిదాసు రచించిన శకుంతల నాటకానికి ఎనభై సంవత్సరాల క్రితమే కేరళవర్మ చేసిన అనువాదం ఎంతో ప్రసిద్ధికెక్కింది. ఆ తరువాత ఇంకా అనేక సంస్కృత నాటకానువాదాలూ, మళయాళభాషలో మౌలిక నాటకాలూ వెలువడ్డాయి. మళయాళీ నాటకరంగంలో తమిళ నాటకాల ప్రభావం వున్నప్పటికీ అంతకంటే వాస్తవికమైన, ప్రయోజనాత్మకమైన మళయాళ నాటకాలకోసం ప్రజలు తహతహ లాడి పోయారు.

ఆధునిక నాటకాలు :

మళయాళ భాషలో ఆధునిక నాటకాలు వెలువడుతున్న కాలంలోనే షేక్సిపియర్ మొదలైన పాశ్చాత్య నాటక కర్తల నాటకాలు కూడా అనువదింపబడ్డాయి. సుప్రసిద్ధ నవలా కారుడైన సి. వి. రామన్ పిళ్ళై అనేక వ్యంగ్య నాటికలను రచించారు. మలయాళ భాషలో గద్య నాటకాలకు అవే నాందీ వచనం పలికాయి. ఈ సమయంలోనే చరిత్రాత్మక మలయాళ నాటకాలు కూడా వెలువడ్డాయి.

సాంఘిక నాటకాలు :

సాంఘిక దురాచారాలను విమర్శిస్తూ ఇ. వి. వి. కృష్ణపిళ్ళై అనేక ప్రహ

సనాలనూ, వ్యంగ్య నాటకాలనూ రచించాయి. ఆ తరువాత వచ్చిన రచయితలు ప్రముఖ వ్యక్తులను గురించీ కేరళ చరిత్రలోని కొన్ని ఘట్టాలను గురించీ. నాటకాలు రచించారు. పౌరాణిక పాత్రలద్వారా నైతిక విలువలను చిత్రించడానికి కూడా కృషి సాగించి. సంఘ దుర్నీతుల్ని ఖండించడానికి అప్పుడు ఒక నాటకం ముఖ్యసాధనంగా పరిణమించింది. అదే నేటి పరిస్థితి. సమకాలీన నాటకాలపై ఇబ్సెన్ ప్రభావం ఎంతో వుంది. ప్రజాసమస్యలు నాటకాలకు ఇతివృత్తాలయ్యాయి.

మలయాళ నాటకాలలో రాజకీయాలకు ప్రాధాన్యం ఇచ్చి నాటకాలు వ్రాశారు. ఆ నాటకాలకు ప్రశంసలు కూడా విశేషంగా లభించింది.

మలయాళ భాషలో ఏకాంక నాటికలూ, రేడియో నాటికలూ కూడా ఎంతో అభివృద్ధి చెందాయి. ఈనాడు కేరళ రాష్ట్రంలో నాటకరంగంలో విశేషమైన కృషి సాగుతోంది. ఈ రంగంలో సాధించిన విజయాలు ఇతర భాషాప్రాంతాలు సాధించిన విజయాల కెంతమాత్రమూ తీసిపోవు. కాని జీవిత సత్యాలను సమగ్రంగా చిత్రించేందుకు నాటక రచనలో ఇంకా సాహసోపేతమైన ప్రయోగాలు జరగవలసి యున్నవి. ఇతర రాష్ట్రాల నాటక రంగ చరిత్రతో పోల్చినప్పుడు మలయాళీ నాటక రంగంలో మనకు కొంత కొరత కనబడుతుంది. కాని నాటక రంగం కంటే నృత్య నాటకమే దేశవిదేశాల్లో పలువురి ప్రశంస లందుకుంది. ముఖ్యంగా నృత్య నాటకంలో గోపీనాథ్, తంగమణి ఎక్కువ ప్రఖ్యాతి పొందారు.

---

# బెంగాలీ నాటక రంగం

ఉత్తర హిందూస్థానంలో రామలీలలు, రాసలీలలు మొదలైన జానపద కళారూపాలు ఎలా అభివృద్ధిపొందాయో అలాగే బెంగాల్లో "యాత్రాభూమర్" మొదలైన కళారూపాలు బహుజనాదరణాన్ని పొందాయి.

బెంగాల్ నాటక రంగం భారత నాటక రంగ చరిత్రలో వున్నతమైన

స్థానాన్ని సంపాదించింది. ఐనా బెంగాలీ నాటక రచన హిందీ నాటకాలకన్నా కొంచెం ఆలస్యంగానే ప్రారంభమైంది. అందుకు కారణంకూడా లేకపోలేదు.

పైన వివరించిన యాత్రా నాటకాల ఇతివృత్తంకూడ సంస్కృత నాటకాల కథావృత్తాలే అవడంవల్లనూ, యాత్రా నాటకాలు ఎక్కువ ప్రచారంలో వుండడంవల్లనూ, వాటికి పోటీగా నాటకాలు వ్రాయడానికి వెనుకాడారు.



బెంగాలీ భాషలో ప్రప్రథమంగా రచింపబడిన నాటకం షేక్స్పియర్ వ్రాసిన జూలియస్ సీజర్ అనువాదం. ఇది 1831 లో అభినయించబడింది. ఈ విధంగా కొన్ని సంవత్సరాల వరకూ షేక్స్పియర్ అనువాద నాటకాలే ప్రదర్శింప బడ్డాయి.

ఇదిగాక నందకుమార్ రాయ్ అనుకృతి "అభిజ్ఞాన శాకుంతలం", నీలమణిపాలుని "రత్నావళి", రామచంద్ర తర్కాలంకారుని "కౌతుకసర్వస్వం" మొదలైనవి చెప్పదగిన అనువాదాలు.

పండిట్ రామ్నారాయణ తారకరత్న 1857 "కులీనకులసర్వస్వ" అనే తొలి మౌలిక రచనను రచించారు. ఆనాడు బెంగాల్లో ప్రబలంగా వున్న బహు భార్యాత్వం అనే సాంఘిక దురాచారాన్ని రూపుమాపడానికి ఆయన ఆ నాటకాన్ని వ్రాశారు.

సంస్కార నాటకాలు :

ఎప్పుడైతే రచయితల దృష్టి సాంఘిక విషయాలమీదికి మరలించో వెంబనే అనేక నాటకాలు వెలువడ్డాయి. వాటిలో ఎక్కువగా విధవా వివాహాలను గురించి వ్రాయబడ్డాయి. అవి రాధామాధవ మిత్రుని "విధవామనోరంజనం", ఉమేశచంద్ర మిత్రుని "విధవావివాహం", ఉమాచరణ్ చట్జీ "విధవోద్వాహం", శామ్యూల్ వీర్బల్ "విధవావిరహం" మొదలైనవి వెలువడ్డాయి. కాని వీటిలో నాటకశిల్పం చాల తక్కువని పలువురి అభిప్రాయం.

మరికొన్ని నాటకాలు :

ఇలా సంస్కార నాటకాలు వ్రాయబడిన కాలంలోనే మధుసూదనదత్తు "శర్మిష్ఠ", "పద్మావతి", "కృష్ణకుమారి", "మాయాకానన్" మొదలైనవి వ్రాశాడు. అంతేకాక ఈయన అనేక ప్రహసనాలు కూడా వ్రాశాడు. వాటిలో ముఖ్యమైనవి "బూడోసాలిక్కీ", "రఘోడ్‌రో" "ఎకీఎకీ", "బలేసభ్యతా" మొదలైనవి.

దీనబంధుమిత్ర రచనలు :

మధుసూదనదత్తు ప్రహసనాలను చూచి అనేకమంది ప్రహసనాల రచనకు పూనుకున్నారు. కాని దీన బంధుమిత్ర రచనలు ఎన్నదగినవి. ఈయన అనేక నాటకాలు వ్రాశాడు. వీటిలో చెప్పదగ్గవి: "నవీనతపస్వినీ", "బయేపాగలాబుడో", "నీలదర్పణ్", "సధవార్ ఏకాదశీ". వీటిలో నీలదర్పణ్ మినహా మిగిలినవన్నీ ప్రహసనాలే. నీలదర్పణ్‌లో నీలిమందు పండించే తెల్లవాళ్ళు కర్షకులను పెట్టిన బాధలు చిత్రించబడ్డాయి. ఇవి విప్లవ నాటకం. ఇది ప్రజలలో చాల సంచలనాన్ని కలిగించింది.

మరికొందరు రచయితలు :

బెంగాలీ నాటకరంగంలో నాటక రచయితలుగా రెండవతరంలో కూడా చాలమంది బయటకు వచ్చారు. వీరిలో ప్రఖ్యాతి చెందినవారు ద్విజేంద్రలాల్‌రాయ్, మన్‌మోహన్‌బసు, జ్యోతీంద్రనాథ్‌ఠాకూర్, గిరీష్ చంద్రఘోష్, అమృతలాల్ వసు, క్షీరోదరప్రసాద్ మొదలైనవారు.

1873 నేషనల్ థియేటర్ :

అనేకమంది నవ రచయితలు వుద్భవించి నాటకాలు వ్రాయడంతో ప్రదర్శించాలనే అకాంక్షకొద్దీ అనేక సమాజాలు ఏర్పడి, నాటక శాలలను స్థాపించారు. వాటిలో మొట్టమొదటగా స్థాపించబడింది బెంగాల్ నేషనల్ థియేటరు. తరువాత

బెంగాల్ థియేటరనీ, ఓరియంటల్ థియేటరనీ మరో రెండు నాటకశాలలు కూడా స్థాపించి విరివిగా నాటకాలు ఆడడం ప్రారంభించారు. ఈ కాలంలో రాజారామ మోహరాయ్ బ్రహ్మసమాజ వుద్యమం, కాంగ్రెస్ వుద్యమంతో, బెంగాల్ రచయి తలలోనూ, నటీనటుల్లోనూ ఎక్కువ చైతన్యం రాసాగింది. రవీంద్రనాథ ఠాగూర్ కుటుంబం నూతన వుద్యమాలకు దోహదమిచ్చి ఎంతో వుత్సాహపరిచింది.

ఈ సమయంలో జ్యోతీంద్రనాథఠాకూర్ ప్రేంచి నుంచి అనేక అను వాదాలు చేశాడు, అనేకమైన ప్రహసనాలనూ, స్వతంత్ర నాటకాలనూ రచించాడు.

హరలాల్ అనే ఆయన "శత్రుసంహార్", "హేమలత" మొదలైన నాటకాలను రచించాడు. ఆనాటి నాటక కర్తలలో ముఖ్యంగా పేర్కొన దగినవారు ముగ్గురు. వారు ద్విజేంద్రలాల్‌రాయ్, గిరీశచంద్రఘోష్. అమృతలాల్ వసు. వీరిలో అమృతలాల్‌వసు, గిరీశచంద్రఘోష్ నాటకాలు వ్రాయడమే కాక నటులుగా కూడా ప్రఖ్యాతి వహించారు. గిరీశ చంద్రుడు దాదాపు 80 నాటకాలు వ్రాశాడు. వాటిలో పేరుప్రతిష్టలు సంపాదించిన నాటకాలు "ప్రపుల్ల", "చైతన్యలీల". "బుద్ధుని చరితం", "పాండవాజ్ఞాతవాసం" మొదలైనవి. ఈ తరంలోనే అమృత లాల్‌దాస్ "వివాహవిభ్రాంతి", "బాబు", "అవతార్" మొదలైన నాటకాలు సాంఘిక దౌర్బల్యం మీద సున్నితమైన హాస్యంతో రచించాడు.

### ద్విజేంద్రలాల్ రాయ్ :

బెంగాలీ నాటక రచయితల్లో ప్రఖ్యాతిచెందిన నాటక కర్త ద్విజేంద్రలాల్ రాయ్. ఈయన వ్రాసిన నాటకాలు భారతదేశంలో వున్న అనేక భాషల్లో అనువ దించబడి ప్రదర్శించబడ్డాయి. వీరు వ్రాసిన ప్రసిద్ధ నాటకాలు "మేవాడ పతన్", "దుర్గాదాస్", "చంద్రగుప్త", "ప్రతాప్‌సింగ్" మొదలైనవి. కళాదృష్టితో చూచి నట్లయితే కొన్ని లోపాలున్నప్పటికీ చారిత్రికంగా వ్రాయడంవల్ల బానిసత్వంలో వున్న భారత ప్రజలను వుత్తేజపర్చాయి, ప్రజాభిమానాన్ని పొందాయి.

### రవీంద్రనాథ ఠాకూర్ :

రవీంద్రుడు బెంగాలీ సాహిత్యాన్ని ప్రపంచ వ్యాపితంగా సృష్టించాడు.

ఇతర సాహిత్య శాఖల్ని అభివృద్ధిపర్చినట్లే నాటక సాహిత్యాన్ని కూడ అభివృద్ధి పర్చాడు. ఈయన నాటకాలు జగత్ప్రసిద్ధి పొందాయి. డి. యల్. రాయ్ నాటకాల లాగే రవీంద్ర కవి చంద్రుని రచనలు కూడ అనేక ప్రాంతీయ భాషల్లో అనువ దించి ప్రదర్శించబడ్డాయి. రవీంద్రుడు అనేక నాటకాలు వ్రాశాడు. వాటిలో ముఖ్య మైనవి "బలిదానం", "రక్తకరవరం", "ముక్తధార", "సన్యాసి", "డాక్ ఘర్" మొదలైనవి. ఇవిగాక అనేక గేయ నాటికలు, వ్యంగ నాటికలు రచిం చాడు. నాటిలో ముఖ్యమైనవి "చండాలిక", "చిత్రాంగద", "రనటీరపూజ", "విసర్జన్" మొదలైనవి.

రవీంద్రుని కాలంలో ప్రతి రచనా ప్రదర్శింపబడేది. ఇందుకు దోహదంగా బెంగాలీ నాటక రంగస్థలం నిలబడింది. ఇందుకొరకు రెండు ప్రత్యేక నాటకశాలలు కృషిచేశాయి. ఇందు అతిసమర్థులైన రచయితలూ, నటులూ తోడ్పడ్డారు.

రవీంద్రుని తరువాత :

రవీంద్రకవిచంద్రుని నాటకాల తరువాత అనేకమంది నాటక రచయితలు ఖ్యాతిలోకి వచ్చారు. వారిలో "మనిక్‌లాల్ బెనర్జీ", "శచీన్‌సేన్", "మన్మథ రాయ మహేంద్రగుప్త", "నిశకాంతబోస్", "జలధర్ చటర్జీ" మొదలైనవారు ముఖ్యులు.

వీరి రచనలు "కంకావతీర్ ఘాట్", "స్వయంసిద్ధ", "సిరాజ్‌వుద్దౌలా", "పి. డబ్ల్యుడి", "మంత్రశక్తి", "సత్నేరసంఛాన్", "శకీర్ సింధూర్", "పదేవ్ శేష్" మొదలైనవి.

ఇవిగాక తారాశంకర్ బెనర్జీ నవలలు కూడ నాటకాలుగా వ్రాయబడి ప్రద ర్శించబడ్డాయి. వీరుగాక "వనఫూల్" "రవీంద్రనాధమైత్రా", "విధాయక భట్టా చార్య", "విద్యాసాగర్", "మధుసూదనదత్" మొదలైనవారి నాటకాలు కూడ ప్రజామోదాన్ని పొందాయి.

ఈ విధంగా బెంగాలీలు నాటకాలు వ్రాయటమే కాక వ్రాసినవాటిని వెంటనే

ప్రదర్శించి నాటకరంగానికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు సంపాదించారు. భారతదేశంలో ఏ ప్రాంతీయ భాషల్లోనూ ఇంతటి పురోగమనం కానరాదు.

---

# మహారాష్ట్ర నాటక రంగము

త్రరతరాలుగా ఎందరో రాజులు పరిపాలించి కీర్తిప్రతిష్ఠలు గడించుకున్న మహారాష్ట్ర దేశాన్ని 15 వ శతాబ్దంలో పీష్వాలు పరిపాలించారు. ఆ కాలంలో పర్వదినాలలోనూ, రాజోత్సవాలలోనూ కాగడాలు వెలిగించి ఆ వెలుగులో వీధి నాటకాలు ప్రదర్శించేవారు.



బొంబాయి నగరానికి దిగువ ప్రాంతంలోన్న కొంకణ ప్రజలు లలిత నాటకాలను ప్రదర్శించేవారు. లలిత నాటకాల తరువాత, మరాఠీలో తమాషా అనే వినోద నాటకాలు ప్రచారంలోకి వచ్చి ప్రజల్ని ఎంతగానో ఆనందింపజేశాయి.

గోంధళీన్యత్యాలు :

పీష్వాల పరిపాలనలో 1827-42 సంవత్సరాల మధ్యకాలంలో విదేశాల నుంచి వ్యాపారం నిమిత్తం వచ్చి తిష్ఠ వేసుకున్న వర్తకుల ఎదుట రాత్రి సమయాల్లో అత్తరు దీపాలు వెలిగించి చేఘుడా వాయిద్యాల సమ్మేళనంతో, వేశ్యలు అద్భుతంగానృత్యం చేసేవారట.

— నీతిబోధకమైన రాంజోషి కథలను సంస్కరించి గోంధళీలు తమాషా కళారూపాన్ని ప్రచారంలోకి తీసుకువచ్చారు. 1842 ప్రాంతంలో సాంగ్లీ మహారాజా శ్రీమంత్ పట్వర్ధన్ సమక్షంలో గోంధళీలు శ్రీకృష్ణ పారిజాత నాటకాన్ని ప్రదర్శించారు.

విష్ణుదాస్ భావే :

సాంగ్లీ మహారాజా తొలిగా మరాఠీలో ప్రాయించిన తొలి నాటకం సీతా స్వయంవర్. ఈ తొలి నాటకాన్ని రచించినవారే విష్ణుదాస్ భావే. 1852 నాటికి కొల్హాపూర్‌లో స్థిరపడిపోయిన భావే కొంతకాలం అక్కడే వుండి నాటకాలు ప్రదర్శించారు. తరువాత బొంబాయిలో చాలా నాటకాలు ప్రదర్శించాడు. ఈయన ప్రతిభా విశేషాలు గమనించిన ఆనాటి గవర్నరు నాట్యకళాభ్యాసానికి ఇంగ్లండు వెళ్లవలసిందిగా వుత్సాహపర్చాడు.

ఈయన "సీతాస్వయంవర్", "కాదంబరి", "సంశయకల్లోల్", "శారద", "మృచ్ఛకటిక", "శకుంతల" మొదలైన నాటకాలను రచించి, మరాఠీ నాటక రంగ రచయితలకు, నటీనటులకు మార్గాన్ని చూపించాడు.

అన్నాసాహెబ్ కిర్లస్కర్ :

రచయితగా, నటుడుగా, దర్శకుడుగా, మహారాష్ట్ర నాటకరంగ పితామహుడుగా వర్ధిల్లిన కిర్లస్కర్ 1880లో నాటక సమాజాన్ని స్థాపించి, అనేక సంవత్సరాలపాటు నడిపాడు. 1897 వరకూ నిర్వహించబడిన ఈ సమాజాన్ని ఆయన అనంతరం భావూరావు కొల్హాట్కర్ నిర్వహించాడు.

గణపత్‌రావ్ జోషీ :

నటనలో ఈయన సమకాలికులైన జోగళేకర్—దాతే—భోసలే—కేశవరావు మొదలైన నటులనధిగమించి, కళాప్రపూర్ణతను సాధించి సహజ నటుడుగా పేరుపొందాడు. ఈ మహానటుడు 1922 లో కీర్తిశేషుడయ్యాడు.

మరాఠీ నాటకరంగ చరిత్రలో కవిగా కొల్హాట్కర్ ప్రముఖపాత్ర వహించాడు. 1896 నాటికి 15 నాటకాలను రచించాడు.

స్వరాజం నా జన్మహక్కని చాటిన బాలగంగాధర్ తిలక్ శిష్యుడైన ఖడిల్కర్ 1897 లో తిలక్‌ను తెల్లవాళ్ళు నిర్బంధించడంతో ఉత్తేజితుడై చారిత్రక వీరరస ప్రధానమైన నాటకాలను ప్రాశాడు.

ఈ కాలంలో కేశవరావు దాతే -ఔద్దంకర్-గణపత్‌రావు భాగవత్-జోషి-టికసీస్ సోదరులు-బాలగంధర్వ మొదలైనవారు నాటకరంగంలో మహానటులుగా అవతరించారు.

బాలగంధర్వ :

ఒక్క మరాఠీ నాటక రంగంలోనే కాక భారతదేశమంతటా ఆయన గంధర్వగానంతో ఆబాల గోపాలాన్ని ఆనందపరవశుల్ని చేసిన బాలగంధర్వ, అద్భుతంగా పాడడమే గాక, స్త్రీ పాత్రధారణలో కీర్తి గడించుకున్నాడు. ఆయన గంధర్వ నాట్యమండలిని స్థాపించి, 1952 వరకూ నిర్వహించి పక్షవాతం రావ డంతో సమాజాన్ని ఆపివేశాడు.

మరాఠీ నాటక రంగంలో ఎంతోమంది నాటక రచయితలు వెలిశారు. మామావలేర్కర్ జాతీయోద్యమాన్ని గురించీ, సంఘ సంస్కారాన్ని గురించి అనేక నాటకాలను వ్రాశాడు.

ఆధునిక నాటకరంగంలో కే. బి. కాలే, ప్రహ్లాద కేశవ అత్రే మొదలైన వారు ముందంజ వేశారు.

బాలకొల్హాట్కర్-డాండీకర్-ఎం. ఎన్. జోషి-వామనజోషి-వీరసావర్కర్-విజయ టెండూల్కర్ - కాదిల్కర్ - శ్రీమతి మాలతీ - బేడీకర్ - బాబూరావ్ గోఖలే - భట్టు - దీక్షిత్ - బాలచంద్రకేల్కర్ - నఖారాంజోషి - శ్రీరాంలాగూ మొదలైన రచయితలు అనేక సమాజాలకు, అనేక సమస్యల మీద నాటకాలు వ్రాశారు.

ఈ విధంగా మహారాష్ట్ర నాటకరంగం బహుముఖాల విజృంభించింది. తొలిదశలో ఆంధ్ర నాటకరంగానికి పునాదులు వేసింది. వారి బాటల్లో ఆంధ్ర రచయితలు, నటులు నడిచారు.

# గుజరాతీ నాటక రంగం

1200 వ సంవత్సరంలో శ్రీరామచంద్ర అనే గుజరాతీ విద్వాంసుడు "నాట్య దర్పణం" అనే ఉద్గ్రింధాన్ని నాట్యకళను గురించి వ్రాశాడు. ఆయన సంస్కృత భాషలో నాటకాలను కూడా రచించాడు. కాని శాస్త్రీయంగా నాటక సాంప్రదాయం ఎన్నాళ్లో నిలవలేదు. శ్రీకృష్ణుని జీవితాన్ని చిత్రించే రసాలు. భవాయ్‌ల అవతరణంతో ఒక క్రొత్త వాతావరణం. నాటక సాంప్రదాయం అమల్లోకి వచ్చింది. భవాయ్ నాటక సాంప్రదాయం సంగీత ప్రాధాన్యంతో సంఘంలో వున్న కుళ్ళును బయటపెట్టటం. వీటితోపాటే భవాయ్ నృత్య నాటకాలు కూడా అభివృద్ధి పొందాయి.



శ్రీ ప్రేమానంద అనే ఆయన 17 వ శతాబ్దంలో నాటక రంగాన్ని అభివృద్ధికి తీసుకురావడానికి అనేక వ్యాసాలనూ వ్యాఖ్యానాలనూ రచించారు.

ఏమైనా 1865 వరకూ ఒక్క మంచి నాటకం కూడా వెలువడలేదు. 1838 లో రణ్‌చోడ్ భాయి ఉదయరాయ్ వ్రాసిన "లలితా దుఖ్ దర్శక్" అనే నాటకం 1865 లో ప్రదర్శించారు. దీని ఇతివృత్తం బాల్యవివాహాలను గురించి. దీనిని నరోత్తమ్ మెహతాజీ అనే ఆయన ఒక నాటక సమాజం ద్వారా బహుళ ప్రచారంలోకి తెచ్చాడు.

1867 నుండి 1906 వరకూ నానాలాల్ దహ్యాభాయ్, దోల్షాజీ అనే వారిద్దరూ గుజరాతీ నాటకాలను ఒక మెట్టు పైకి ఎక్కించటానికి ప్రయత్నించారు. కాని వీరి నాటకాలు కవిత్వ ప్రధానమైనవి అవటంవల్ల ఎక్కువ ప్రజాభిమానాన్ని పొందలేక పోయాయి.

ఈనాడు గుజరాతీ నాటక రంగంలోనూ, సాహిత్యంలోనూ చరిత్రాత్మక నాటకాల సాంప్రదాయం అభివృద్ధి పొందుతూ వుంది. ముఖ్యంగా కె. యమ్. మున్షీ అదర్శప్రాయమైన కృషి చేస్తున్నారు.

బి. కె. ఠాకూర్ సాంఘిక సమస్యలు తీసుకుని సాంఘిక నాటకాలు వ్రాస్తున్నారు.

శ్రీ చంద్రవదన్ మెహతా వాస్తవిక జీవితాలను సృష్టించే నాటకాలను వ్రాస్తున్నారు. ఇదే సాంప్రదాయాన్ని శ్రీ ప్రభులాల్ ద్వివేదీ, శ్రీ ప్రఫుల్ల దేశాయ్‌లు అనుసరిస్తున్నారు. శ్రీ చంద్రవదన్ మెహతా వ్రాసిన "మజూమ్‌దార్" అనే నాటకం 1954 డిసెంబరులో ఢిల్లీ నాటక అకాడమీ వుత్సవాలలో ప్రదర్శింప పడింది. ఈ నాటక ఇతివృత్తం ఒక మధ్యతరగతి కుటుంబంలో వచ్చిన ఒడు దుడుకులూ, జరగవలసిన సంస్కరణలను గురించి.

---

# పంజాబు రూపకాలు

పంజాబు నాటకరంగం జానపదమైంది. సంస్కృత నాటకాల అనువాదాలు కూడా ప్రచారంలో వున్నాయి. భాయీ వీరసింగ్ అనే ఆయన శిఖ్కు మత ధర్మాలను వివరిస్తూ అనేక నాటకాలను వ్రాశాడు.



మొదటినుంచీ కూడా పంజాబీ నాటకాల్లో జానపద సాంప్రదాయం బీజప్రాయంగా వుంటూనే వచ్చింది. దహదీ లనబడే వీణాగాయకులు శిఖ్ పురాణాలను, వీర గాధలను, కథానాయకుల సాహస పరాక్రమాలను కీర్తించే చారణ గీతాలను ఆలపిస్తూ వుండేవారు.

తొలి పంజాబీ నాటకాన్ని 1914 లో ఐ. సి. నందా అనే ఆయన (సాంఘికం) రచించాడు. ఆయన ఇంకా అనేక నాటకాలను వ్రాశాడు. ఆచార్య నందా పంజాబీ నాటక రంగానికి అమోఘ సేవ చేశాడు.

ఆచార్య నందా అడుగుజాడల్లో శ్రీయుతులు హరిచరణ్ సింగ్—మోహన్

సింగ్—రోషన్‌లాల్ అహూజా—అమృతసింగ్ గురుదయాళ్—సింగ్ పూల్ బల్‌బీర్ సింగ్—జి. యస్. ఖోస్లా—బలవంతగార్గే ప్రభృతి ప్రముఖులు పంజాబు నాటకరంగానికి క్రొత్త మెరుగులు దిద్దారు.

ఈ నాటి పంజాబీ నాటక రచయితలలో శ్రీ గార్గే నిస్సందేహంగా అగ్ర గణ్యుడు. ఆయన అనేక ఏకాంకికలు, అరడజనుకు పైగా పెద్ద నాటకాలను రచించాడు. ఒక వంక నాటక కళ ఈ విధంగా అభివృద్ధిపొందుతూ వుంటే వేరొక ప్రక్క యక్షగానాలూ, ప్రహసనాల రచన కూడా అభివృద్ధి పొందింది. ఈ కోవకు చెందిన రచయితలలో శ్రీమతి షీలాభాటియా, శిరోమణీ మొదలైన వారు ప్రముఖ స్థానాన్ని వహిస్తున్నారు. ఈ విధంగా పంజాబు నాటక రంగం ముందుకు నడుస్తూ వుంది.

---

# అస్సాం నాటక రంగం

భారత దేశానికి తూర్పు సరిహద్దున వుంది ఈ అస్సాం రాష్ట్రం. అస్సాం ప్రజలయొక్క వినోద ప్రదర్శనాలు అద్భుత గానంతోటీ, నృత్యంతోటీ నిండి వుంటాయి.



ఈ నాటికీ అస్సాం పల్లె ప్రాంతాలలో "ఓజాపాలిస్" అనే బృందగానాన్ని హస్తాభినయంతో శ్రవణానందంగానూ, కర్ణానందంగాను పల్లె ప్రజలకు వినిపిస్తూ వుంటారు. ఇలాంటి నృత్య ప్రదర్శనాల పరిణామమే నేటి అస్సాం నాటకం.

17వ శతాబ్దంలో శంకరదేవ అనే ఆయన అస్సామీ భాషలో తొలి నాటక ప్రదర్శనానికి పూనుకున్నాడు. అస్సాం నాటక పితామహుడీయనే. ఈయన చిత్రకారుడు. నేత్ర పర్వమైన మనోహర దృశ్యాలను రంగస్థలంపై సృష్టించ గలిగాడు. ఈయనా ఈయన శిష్యుడైన మాధవ్‌దేవ్ ప్రాపిన

"అంకీయనట్" అనే ఏకాంక నాటికలు ఎంతో ప్రతిభావంతంగా వుండేవి. "సాత్రాస్" అనే వైష్ణవ మత కేంద్రాల్లోనూ, నామ్ ఘర్ అనే గ్రామీణ రంగ స్థలాల్లోనూ ఈ నాటికీ ప్రదర్శింపబడుతున్నాయి.

19వ శతాబ్దంలోనూ, 20వ శతాబ్దంలోనూ వెలువడిన అస్సాం నాటకాలన్నీ యూరోపియన్ భాషల్లోని ప్రణయం, పరాక్రమం ప్రధాన కథావస్తువులుగా గల్గిన నాటకాల పంథాలో వున్నాయి.

దుర్గేశ్వరశర్మ వ్రాసిన "పార్థ పరాజయం" అనే నాటకంలో శాస్త్రీయమైన స్థల కాల పాత్రౌచిత్యం అతి నైపుణ్యంతో పాటించబడింది.

ప్రథమ ద్వితీయ నిరాకరణోద్యమ రోజుల్లో రాణా ప్రతాప్, శివాజీలాంటి జాతీయ నాయకుల జీవితాలను సృష్టించే నాటకాలు అస్సాం ప్రజలను వుత్తేజ పర్చాయి, అస్సాం చరిత్ర బురాజీలకు సంబంధించిన నాటకాలు ఈ కాలంలోనే వెలువడ్డాయి.

ఈ శతాబ్దంలో వచ్చిన ఆర్థిక సంక్షోభాన్ని, సాంఘిక సమస్యల్ని పొందు పర్చి, అనేక నాటకాలను లక్ష్మీధర్‌శర్మ వ్రాశాడు. ఈయన జాతీయోద్యమంలో జైలు కెళ్ళాడు. జైలులోనే క్షయవ్యాధితో మరణించాడు.

ఇక జ్యోతీప్రసాద్ అగర్వాలా అస్సాం దేశపు జానపద నృత్యాలను ఆధునిక పద్ధతులలో నిర్వహించాడు. తన నాటకాల్లో కూడా వీటిని ప్రవేశపెట్టాడు. ఈయన ఐరోపాలో సంగీత విద్య నభ్యసించారు.

పుకన్, లక్ష్యాధర్ చౌదరి, ప్రభాతేశర్మ నేటి నాటక రచయితలలో ప్రముఖులు. వీరిలో పుకన్ షణీరాయ్, "దివాన్" కాలపరిణామ్, అస్సాం హాీవుడ్ అనే వుత్తమ నాటకాలను రచించాడు.

---

# ఒరిస్సా నాటక రంగం

ఒరియా నాటక రంగంలో అతి ప్రాచీన సాంప్రదాయానికి చెందిన వీధి నాటకాలు పురాణేతిహాసాలలోని పాత్రలను గ్రామప్రజలు అర్థం చేసుకుని, వాటిని ఆకళింపు చేసుకోడానికి విశేషంగా తోడ్పడ్డాయి.



మోహన గోస్వామి రచించిన భక్తిరస ప్రధానమైన నాటకాలు గ్రామ ప్రజలను ఎక్కువగా ఆకర్షించాయి. కాని అదే సమయంలో సాంఘిక నాటకోద్యమం తొలిసారిగా ప్రారంభమైంది. "బాలకృష్ణ మహంతి" "బైస్‌నాజ్ పాణి" లలిత మైన సుఖాంత నాటక రచనలు చేశారు.

తరువాత ఒరియా నాటకరంగంలో రెండవ దశ ప్రారంభమైంది. వీధి నాటకాల శకంపోయి నాటక శాలలలో నాటకాలు ప్రదర్శించడం, పురాణేతిహాసాలను వదలి, చారిత్రక నాటకాలను ప్రదర్శించడం జరిగింది. "కాళిందీ చరణ్ పాణిగ్రాహి" రచించిన "ధమ్మపధ" అనే నాటకంలో అశోకుడు కళింగయాత్రను పూర్తి చేసిన తరువాత ఆయనలో కలిగిన మానసిక పరిణామం వ్యక్తం చేయ బడింది. అశ్వినీ కుమార్ ఘోష్ రచించిన "కోణార్క్" అనే నాటకంలో ప్రఖ్యాత సూర్యదేవాలయం గోపురం నిలబెట్టడంలో 1200 మంది శిల్పులు విఫలమవగా ఆ పనిని అతి సునాయాసంగా నెరవేర్చిన "ధర్మ" అనే పన్నెండ్లా బాలుని చరిత్ర ఇతి వృత్తంగా తీసుకోబడింది.

ఒరియా నాటకరంగంలో ఇటీవల ఆధునిక విధానాలు ప్రవేశపెట్టబడ్డాయి. రంగాలంకరణ, సంగీతం, విద్యుద్దీపాలు ప్రవేశపెట్టబడ్డాయి. నేటి నాటక రంగ రచయితలలో అగ్రగణ్యుడు కాళీచరణ్ పట్నాయిక్ ఆయన. రచనలలో పాత కొత్తల మేలు కలయిక స్పష్టంగా కనిపిస్తుంది. "బికాట్", భట్ట నాటకాలు కూడ ఎన్నదగినవి.

పట్నాయిక్ తరువాత చెప్పుకోదగిన రచయితలలో మనోరంజన్ దాసు ఒకరు. ఆయన రచించిన "భక్షి బగబంధు" ఆగస్టు 9 అనే నాటకాలు దేశభక్తిని ప్రబోధిస్తాయి. భంజాచరణ్ పట్నాయిక్—గోపాల్ భట్ రాయ్—రామచంద్ర మిశ్రాలు రచించిన నాటకాలలో మధ్యతరగతి ప్రజల జీవితాలకు ఎక్కువ ప్రాధాన్యముంటుంది.

ఒరియా నాటకరంగంలో ఏకాంకికలకు కూడ ప్రాధాన్యం వుంది. బ్రితుకు తెరువు సంఘర్షణను చిత్రిస్తూ "హరికృష్ణ మెహతాబ్" ఒక వుత్తమ నాటికను

రచించాడు. సురేన్ మహంతి, గోపీనాథ్ మహంతి ఏకాంకికలను రచించిన వారిలో ముఖ్యులు.

రేడియో నాటికలు కూడా ఈ నాడు ప్రచారంలో వున్నాయి. సురేన్ మహంతి, నాగేంద్రరాయ్ ప్రభృతులు రేడియో నాటక రచయితల్లో ముఖ్యులు.

మారణాయుధాల వినాశక శక్తిని వివరిస్తూ జితిన్‌దాస్ అబిస్కార్ అనే నాటికను రచించారు. ఆయన "మీమాంస" అనే నాటికలో సాంఘిక అవరోధాలను సించారు. నరసింహ మహాపాత్ర రచించిన "సింఘార్" అనే నాటిక ప్రేమ ప్రధానమైంది. సంఘంలో స్త్రీకిగల వున్నత పాత్రను వివరిస్తూ నాగేంద్రరాయ్ "నార్" అనే నాటికను రచించారు. ఈ విధంగా ఒరిస్సా నాటక రంగం క్రొత్త పుంతలు త్రొక్కుతూ వుంది.



# నా రచనకు తోడ్పడిన గ్రంథాలు



బసవపురాణము
పండితారాధ్య చరిత్ర } పాల్కురికిసోమనాధుడు

ఆంధ్రుల సాంఘికచరిత్ర :- సురవరం
ప్రతాపరెడ్డి

తెలుగు సంస్కృతి :- తెలుగు విజ్ఞానసర్వం :-
సంపాదకులు-మల్లంపల్లి సోమశేఖరశర్మ

ఆంధ్ర మహాభారతం :- తిక్కన

కుకవి పతికథలు :- కదిరీపతి.

ఆంధ్ర నాటకరంగం :- గొల్లపూడి
శ్రీరామశాస్త్రి

భరత నాట్యశాస్త్రం :- అనువాదకులు: డా॥ పి. యస్. ఆర్. అప్పారావు

తెలుగు నాటకవికాసం :- ,,

నాట్యశాల :- శ్రీనివాస చక్రవర్తి

నట శిక్షణ :- ,,

నాటక సమీక్ష :- ,,

యక్షగాన వాఙ్మయం : డా॥ యస్వీ జోగారావు

భరతసారం :-

భరతరస ప్రకరణం :-

అభినయ దర్పణం :- లింగంగుంట మాతృభూతయ్య

ఆంధ్రదర్శిని :- విశాలాంధ్ర ప్రచురణాలయం

చంద్రశేఖర శతకం :- చంద్రశేఖరుడు

క్రీడాభిరామం :-

శృంగార శ్రీనాథం :- వేటూరి ప్రభాకరశాస్త్రి

దశావతార చరిత్ర :- శ్రీనాథుడు

కాశీఖండం :- ,,

భీమఖండం :- ,,

పల్నాటివీర చరిత్ర :- ,,

నవ్యాంధ్ర సాహిత్యపీఠములు :- కురుగంటి సీతారామయ్య, పిల్లలమఱ్ఱి వేంకట
హనుమంతరావు

## నా రచనకు తోడ్పడిన గ్రంథాలు

నా చిన్ననాటి ముచ్చట్లు :- కే. యన్. కేసరి
కొండవీటి చరిత్రం :
ఆంధ్ర నట ప్రకాశిక :- పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రి
చిలకమర్తి స్వీయచరిత్రం :- చిలకమర్తి లక్ష్మీనరసింహం
చారిత్రక వ్యాసములు : మల్లంపల్లి సోమశేఖరశర్మ
ఆంధ్రుల చరిత్ర :- ఏటుకూరి బలరామమూర్తి
ఇండియన్ డ్రామా :- భారత ప్రభుత్వ ప్రచురణ
నాటక దీపిక :- బి. టి. రాఘవాచార్యులు
కథలు-గాథలు :- దిగవల్లి వేంకట శివరావు
జానపద వాఙ్మయ చరిత్ర :- డా॥ బి. రామరాజు
భాస్కర శతకము :-
మన ప్రాచీన కళలు-పుట్టుపూర్వోత్తరాలు :- ఎల్లోరా
తంజాపురాంధ్ర నాయక చరిత్రము :- కురుగంటి సీతారామయ్య
ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి :- ఖండవల్లి లక్ష్మీరంజనం, బాలేందు శేఖరం
గురజాడ రచనలు-మహాకవి డైరీలు :- అవసరాల సూర్యారావు
నటరాజ రామకృష్ణ :- గ్రంథాలు-వ్యాసాలు
రెడ్డి సంచిక :- వడ్డాది అప్పారావు.

తెలుగు పత్రికలు :—ఆంధ్ర పత్రిక—ఆంధ్ర పత్రిక సంవత్సరాది సంచికలు—భారతి—ఆంధ్ర ప్రభ—కృష్ణా పత్రిక—నాటక కళ—ప్రజానాట్య మండలి సదస్సు సంచిక—సూత్రధారి—జయంతి—కిన్నెర—నాట్యకళ—పరిశోధన—అభ్యుదయ ఆంధ్ర నాటకరంగంలో అనేక నాటక సమాజాలు వెలువరించిన వార్షికోత్సవ సంచికలు—సన్మాన సంచికలు—నాజరు సన్మాన సంచిక—ఆంధ్ర మహిళ—సంధ్య—క్షేత్రయ్య వర్ధంతి సంచిక-కళావని.

PRJSA101B155



రాబోవు గ్రంథాలు

నటరత్నాలు

తెలుగు సినిమారంగ చరిత్ర

BC

## మవసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | PJSA101B155 |
| పుస్తకం పేరు | ఆంధ్రనాటకరంగచరిత్ర |
| తారీఖు | 04 January 2025 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 953 |
| పెద్ద సైజు పేజీలు | No |
| ఖాళీ పేజీలు | లే 2,4,122, 132, 134, 188, |
| లేని పేజీలు | No |
| తయారు చేసినది | Nandini |
| పేజీలు విడదీసినది | Vedavathi thasin |
| స్కాన్ చేసినది | |
| పరీక్ష చేసినది | DAVEED |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకేంగు చేసినది | |
| పరిస్థితి | good |

Blanks:- 204, 222, 240, 326
366, 368, 380, 398, 418, 426, 440
450, 452, 460, 476, 490, 492,
516, 544, 556, 578, 586, 614,
642, 650, 660, 662, 700, 702, 718,
736, 766, 768, 788, 790, 808, 810,
856, BC